
# నార్ల వెంకటేశ్వరరావు సమగ్ర సాహిత్యం

(డిసెంబర్ 1, 1908 – 16 ఫిబ్రవరి )

## భాగం – 7



సంపాదకీయాలు, గ్రంథసమీక్షలు, వ్యాసాలు

ఆంధ్రప్రముఖులు - 76 వ్యాసాలు

భారత ప్రముఖులు- 112 వ్యాసాలు

విదేశీ ప్రముఖులు – 54 వ్యాసాలు

నార్లవారి కొన్ని ప్రసిద్ధ సంపాదకీయాలు – 7 వ్యాసాలు

విషయ సూచి

## 3 విదేశీ ప్రముఖులు

## సంపాదకీయాలు, గ్రంథ సమీక్షలు, వ్యాసాలు

## ఆంధ్ర ప్రముఖులు -1

# యుగపురుషుడు : శ్రీ కందుకూరి వీరేశలింగం

పుట్టింది పేద కుటుంబంలో పెరిగిందీ పేదరికం మధ్యనే.పెద్ద చదువులు చదివి, పెద్ద డిగ్రీలు సంపాదించలేదు; పెద్ద ఉద్యోగాలైనా చేయలేదు.



చివరికి ఆరోగ్య భాగ్యమైనా లేదు. ఆది నుంచి అంతం వరకు అర్భక జీవితమే.

నలుగుర్ని మెప్పించే నైజం కలదా అంటే, అదీ లేదు. కోపం ముక్కున ఉండేది. పోనీ, లోకం పోయినదారిని పోయినాడా అంటే, అదీ లేదు. మొదటి నుంచి చివరి వరకు సంఘానికి ఎదురీతే.

దేన్ని చూడబోయినా, ప్రతికూల పరిస్థితే. ఐనా, శ్రీ వీరేశలింగం పంతులుగారిని మించి సార్థక జీవులెందరున్నారు?

ప్రతి ప్రతికూల పరిస్థితిని అనుకూలంగా మార్చుకొనడం - ఇదే పంతులుగారిలో పేర్కొనదగిన ప్రత్యేకత; ఇదే ఆయనలో ప్రత్యేకంగా ప్రస్తుతించదగిన విశిష్టత.

సత్యనిరతి, ఋజువర్తన, లక్ష్యశుద్ధి, చిత్తస్థైర్యం, కార్యదీక్ష - ఏ ఇతర సంపత్తి లేకపోయినా, ఈ సుగుణ సంపత్తి ఆయనకుండేది. దీనితోనే ఆయన ప్రతి ప్రతికూల పరిస్థితిని అధిగమించి, సర్వతోముఖ జీవితంలోని సర్వ రంగాలలో రాణించి, తాను ధన్యుడైనాడు; తనను కడుపునకన్న దేశాన్ని ధన్యం చేశాడు.

పేదరికంలోనే పుట్టి, పేదరికంలోనే ఆయన పెరిగివుండవచ్చు. కాని, ఆయనను మించి ఆంధ్రదేశంలో ప్రజాహిత సంస్థలను స్థాపించిన వారెందరున్నారు?

విశ్వవిద్యాలయాలలో విద్య నభ్యసించి, పెద్ద పెద్ద డిగ్రీలను పొందగల అవకాశం ఆయనకు లభించి ఉండకపోవచ్చు. కాని, ఆయనను మించిన పండితు లెందరున్నారు?

ఆరోగ్య భాగ్యమైనా ఆయనకు అబ్బి ఉండకపోవచ్చు. కాని, ఆయనను మించి ప్రజాసేవను చేయగలిగిన వారెందరున్నారు?

ఆయన ముక్కోపి కావచ్చు; సంఘానికి ఎదురీది ఉండవచ్చు. కాని, ఆయనకంటే సర్వజన వంద్యులైన వారెందరున్నారు?

ఆయన ఒక మహాపురుషుడు; కాదు, యుగపురుషుడు.

అంచేత ఆయన చేసిన సేవకు శతవార్షిక జయంత్యుత్సవాల సందర్భంలో ఆయనకు కృతజ్ఞత తెలపడం చాలదు; ఆయన ఆత్మశాంతికి ప్రార్థనలు జరపడం చాలదు. ఆయన జీవిత లక్ష్యాల పరిపూర్తికై దీక్షాకంకణ బద్ధులం కావాలి.

నిస్సందేహంగా ఆధునికాంధ్ర మహాపురుషులలో అగ్రస్థానం కందుకూరి వీరేశలింగంగారిదే. ఆయన యుగసంధ్యలో జన్మించాడు, యుగధర్మాన్ని పాలించాడు, యుగపురుషుడై విభాసించాడు. మెదడుకు పని కల్పించక, వివేకానికి తిలోదకాలు వదలి, హృదయాన్ని కఠిన శిలగా మార్చుకుని, అంధప్రాయంగా అజ్ఞానకూపంలో బ్రతుకుతూ, అదే స్వర్గమని మనం భ్రమసిన ఆ సమయంలో వీరేశలింగం కార్యరంగంలో ప్రవేశించాడు. సంఘ పరిస్థితులను శ్రద్ధగా పరీక్షచేశాడు. ఏ దిక్కుకు చూచినా ఆయనకు అవిద్యే కనిపించింది, అజ్ఞానమే గోచరించింది. అక్రమాలే ఎదురైనాయి.

ఈ అజ్ఞాన తిమిరాన్ని నే నొక్కడినే తరిమివెయ్యగలనా? ఈ పాప పంకిలాన్ని నేనొక్కడినే కడిగివెయ్యగలనా? ఈ సాంఘిక దురాచార కీకారణ్యాన్ని నే నొక్కడినే దహించివెయ్యగలనా? ఇట్టి సందేహాలు ఒక్క క్షణమైనా ఆయనను బాధించలేదు. చరిత్ర నా పక్షాన ఉంది. అయినప్పుడు నే నొక్కడిని కాదుగదా? ధర్మం నా పక్షాన ఉంది. అయినప్పుడు నే నొక్కడిని కాదుగదా? భగవంతుడే నా పక్షాన ఉన్నాడు. అయినప్పుడు నే నొక్కడిని కాదుగదా? ఈ ధైర్యంతోనే తను ఏకాకినన్న సంకోచం లేశమైనా లేకుండా ఆయన కార్యరంగంలో ప్రవేశించాడు.

ఆనాటి నుంచి, భౌతికదేహాన్ని చాలించినంత వరకు ఆయన జీవితం ఒక అనుక్షణ సమరం; ఒక అవిరళ కష్టగాథ, ఒక మహత్తర త్యాగగీతం, ఒక అపూర్వ ప్రేమపుష్పాంజలి, ఒక కరుణార్ద్ర కావ్యం.

"ఈ ప్రపంచ మహాసంగ్రామంలో నేను మీకు వాగ్దానం చెయ్యగలిగింది స్వేదం, రక్తం, అశ్రువులు మాత్రమే" - ఇది సర్వవినాశం తప్పదేమో అని తోచిన గాఢాంధకార సమయంలో బ్రిటీష్ ప్రధాని చర్చిల్ బ్రిటీష్ ప్రజలకు చెప్పిన మాట. ఏకాకిగా తాను నడిపిన మహాసంగ్రామంలో ఇంతకుమించి తనకు తాను వీరేశలింగం ఏమీ వాగ్దానం చేసుకోలేదు. ఐతే, విషాదాశ్రువులతో పాటు ఆనందబాష్పాలకు కూడా ఆయన నోచుకోగలిగాడు. ఆశాభంగాల మధ్య విజయశిఖరాలను కూడా ఆయన అప్పుడప్పుడు అందుకోగలిగాడు. తన కృషి, తన త్యాగం, తన కష్టాలు కేవలం వృథా కావడం లేదని తోచిన మధుర క్షణాలు ఆయనకు కొన్ని తన జీవితంలోనే లభించాయి. యుగప్రవక్తలు కొందరికంటే అంతవరకు ఆయన ధన్యుడే!

మానవ స్వభావం అతి చిత్రమైనట్టిది. తన దైనందిన పరిసరాలు, తన సాంప్రదాయిక మతవిశ్వాసాలు, తన వర్తమాన ఆచార వ్యవహారాలు మొదలైనవి అవిచ్ఛిన్నంగా వస్తున్నవనే మానవుడు భ్రమపడుతూ ఉంటాడు. చీకటి పడగానే స్విచ్ వేసే గృహస్థుకు ఎలక్ట్రిక్ దీపం దాదాపు అర్ధశతాబ్ది కిందనే కనిపెట్టబడిందన్న సంగతి స్ఫురణకు రాదు. రైలులో, ట్రామ్, మోటార్లో, విమానంలో సుఖంగా ఎక్కి కూర్చునే వ్యక్తులకు ఆ ప్రయాణ సౌకర్యాలన్నీ ఆధునిక వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్ర ఫలితాలనే విషయం తోచదు.

ఇదే విధంగా మన వర్తమాన సాంఘిక వ్యవస్థ ఎందరి కృషి ఫలితమో, ఎన్ని సంఘర్షణల పరిణామమో, మరెన్ని త్యాగాల ముక్తాఫలమో మనం సామాన్యంగా గుర్తించము. వీరేశలింగం విషయంలో చాలావరకు ఇంతే జరుగుతుంది.

నేడు బాల్య వివాహాలను నిరోధించడానికి ఒక ప్రత్యేక శాసనం ఉంది. కాని, బాల్యవివాహాలను ఆదిలో ఖండించింది ఆయనే అని ఎందరికి తెలుసు. నేడు వితంతు వివాహాలను సంఘం ఆమోదిస్తుంది, లేదా కనీసం సహిస్తుంది. కాని ప్రతి ఒక్క వితంతు వివాహాన్ని జరపడానికి ఆయన తన ప్రాణాన్ని పణంగా పెట్టవలసివచ్చిందని ఎందరు గుర్తిస్తున్నారు? సభ్యమానవుడనని యెంచుకునే ప్రతి తండ్రి కూడా తన కుమారులతోపాటు కుమార్తెలకు కూడా ఈనాడు చదువు చెప్పిస్తున్నాడు. కాని, స్త్రీ విద్యావశ్యకతను గురించి ఆయన చెవి నిల్లుకట్టుకొని చెప్పవలసి వచ్చినట్టు ఎందరెరుగుదురు? నేడు పద్యం కంటే గద్యానికే ఎక్కువ ప్రచారం. కాని, గద్యరచనకు ప్రప్రథమంగా రూపురేఖల్ని దిద్ది, వ్యాప్తిలోకి తెచ్చింది ఆయనే అని ఎందరు సంస్మరిస్తున్నారు?

ఇట్టి పెద్ద విషయాలలో కాకుండా చిన్న చిన్న విషయాలు ఎన్నింటిలోనో కూడా వీరేశలింగం ఆంధ్రజాతికి మార్గదర్శకుడైనాడు. హిస్టీరియాను చూచి, దయ్యాలు, భూతాలనుకొనవలదని తొలుదొల్త ప్రచారం చేసింది ఆయనే. ప్రభుత్వాధికారులలో లంచగొండితనాన్ని మొట్టమొదటిగా ఎదుర్కొన్నది ఆయనే. సభలలోను, నాటక ప్రదర్శనాల లోను పాల్గొనడం దోషంకాదని ముమ్మొందుగా ఉదోషించింది ఆయనే. మత విభేదాలేమి, కులతత్వాలేమి భారత సంఘానికి వేరుపురుగులుగా పరిణమించినవని గ్రహించి, సహపంక్తి భోజనాలను ఓంప్రథమంగా ఏర్పాటు చేసింది ఆయనే. అస్పృశ్యతా నివారణకు, వ్యభిచారవృత్తి నిరోధానికి ఆదిలో కృషి చేసింది ఆయనే. పత్రికలు సారస్వత సేవతోనే సరిపుచ్చక, ప్రజాసేవకు సైతం పూనుకోవాలని చెప్పి మార్గదర్శకుడైంది ఆయనే.

ఈ విధంగా ఆంధ్రజాతికి ఆయన సర్వతోముఖమైన సేవ చేశాడు. అయినా, ఆయన సేవ సారస్వత, సాంఘిక రంగాలను మించిపోలేదని ఒక దురభిప్రాయం పెక్కుమందిలో ఉంది. ఆయన జీవితచరిత్ర సమగ్రంగా తెలియకపోవడమే ఇందుకు కారణం. పారిశ్రామికాభివృద్ధి లేనిదే మన దేశానికి ఆర్థికంగా అభ్యున్నతి లేదని ఆయన 1880 లోనే ఉద్బోధించాడు. మన దేశానికి ఆహార పదార్థాలు సమృద్ధిగా లేవనీ, విద్యాధికులైనవారు వ్యవసాయంలో శ్రద్ధ వహించి, కొత్త పద్ధతులపై సేద్యం చెయ్యాలనీ ఆయన అప్పుడే హెచ్చరించాడు కూడా!

పోతే, రాజకీయాల విషయంలో కూడా ఆయన శ్రద్ధ చూపకపోలేదు. సంఘ సంస్కరణ విదేశ పరిపాలనకింద కష్టసాధ్యమని ఆయన గుర్తించాడు. అందువల్లనే ఆయన కాంగ్రెసులో సభ్యుడుగా చేరి, పూనాలో జరిగిన మూడవ కాంగ్రెసు మహాసభలో పాల్గొన్నాడు. కేవలం ఆ మహాసభలో పాల్గొనడమే కాదు; పూనా నుంచి తిరిగివచ్చినంతనే కాంగ్రెసు జాతీయ స్వాతంత్ర్య లక్ష్యాలను గురించి ప్రచారం కూడా చేశాడు. ఆంధ్రజాతికి ఇన్ని విధాల, ఇంతగా సేవ చేసిన వీరేశలింగం, మేము ఆదిలోనే పేర్కొన్నట్లు, యుగసంధ్యలో జన్మించి, యుగధర్మాన్ని పాలించి, యుగకర్తగా విభాసించిన మహాపురుషుడు.

*(ఆంధ్రప్రభ 27-5-1944)*

*వివరణ : హిస్టీరియ,మూర్ఛ వ్యాధి.*

## నవ్యాంధ్ర నిర్మాత : శ్రీ కందుకూరి వీరేశలింగం

ఆయన అక్షరాలా నవ్యాంధ్ర నిర్మాత. శ్రీ కందుకూరి వీరేశలింగం లేనిదే నేటి ఆంధ్రావని లేదు. నేటి ఆంధ్రావళి సయితం లేదు.

తెలుగు వారిని తరతరాల సుషుప్తి నుంచి మేల్కొలిపిన తొలి వైతాళికుడు శ్రీ వీరేశలింగం.




పాశ్చాత్య విద్యా, సంస్కృతీ సంపర్కంతో ఇండియాలో మొదటగా మేల్కాంచిన ప్రాంతం బెంగాల్. రాజా రామమోహన్ రాయ్ ప్రారంభించిన పునరుజ్జీవనోద్యమం బెంగాల్ నుంచే తక్కిన ప్రాంతాలకు ప్రాకింది. తెలుగునాట ఆ ఉద్యమాన్ని మొదట అందిపుచ్చుకుని, నిర్వహించిన ఘనత శ్రీ వీరేశలింగానిది.

ఆయనకు సంఘ సంస్కర్తగా పేరు వచ్చినా, నిజానికి ఆయన సాంఘిక విప్లవకారుడు. పాత సమాజాన్ని కూకటి వ్రేళ్ళతో పెళ్ళగించి, కొత్త సమాజాన్ని పాదుకొల్పడానికి ప్రయత్నించాడు. మతం పేరుతో, సంప్రదాయం పేరుతో చెల్లుతున్న అనేక దురాచారాలను, అనాచారాలను, మూఢ విశ్వాసాలను తన వాదపటిమతోనే కాదు, ఒక రాజకీయ విప్లవకారునికి ఉండవలసిన ఉద్వేగంతో, దీక్షతో, దక్షతతో ఆయన ప్రతిఘటించాడు.

వితంతు పునరుద్వాహాలు చేయించిన సంస్కర్తగానే శ్రీ వీరేశలింగం సుప్రసిద్ధుడు కాని, పెక్కు రంగాలలో పెక్కు మంది తీసుకు రావలసిన విప్లవాలను ఆయన దాదాపు ఒంటరిగా తీసుకువచ్చాడు. స్త్రీలకు విద్య హక్కును సంపాదించి పెట్టడానికి ఆయన చేసిన కృషి సామాన్యమైంది కాదు. పడుపు వృత్తి నిర్మూలనకు

ఆయన తలపెట్టిన ఉద్యమం తక్కువది కాదు. అధికారులలో లంచగొండితనాన్ని బయట పెట్టడానికి ఆయన చేసిన సాహసాలు జగద్విదితం.

ఆయన కవి, పండితుడు. తెలుగులో నవలా రచనకు శ్రీకారం చుట్టింది ఆయన. తెలుగులో మొదటి నాటకం ఆయనదే. జీవిత చరిత్ర రచనను, స్వీయచరిత్ర రచనను, వ్యంగ్య రచనలను ఆయనే ప్రారంభించాడు. ఆంగ్ల, సంస్కృతాలనుంచి నాటకాలను అనువదించాడు. పత్రికా రచనకు ఆయన గట్టి పునాదులు వేశాడు. కాని, ఆయన సాహిత్య సృష్టి మొత్తం ఆయన ఉద్యమాలకే అంకితమైంది. ఆయన చేతిలో కలం ఒక ఆయుధమైంది. దానితో ఆయన తుదిశ్వాస వరకు రాజీ లేని పోరాటం సాగించాడు.

స్వాతంత్ర్యసిద్ధి తర్వాత ఎందరెందరి పేర్లతోనో ప్రత్యేకంగా తపాలా బిళ్ళలు వెలువడ్డాయి. 1948లో ఆయన శతజయంతి శ్రీ వీరేశలింగం గౌరవార్థం తపాలా బిళ్ళ ఏనాడో సందర్భంలోనే రావలసింది. ఇరవై ఆరేళ్ళ ఆలస్యంగా రేపు సోమవారంనాడు అది వెలువడనున్నది. ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు హైదరాబాదులో దాన్ని విడుదల చేయనున్నారు. తన పేరుపై తపాలా బిళ్ళ రాకపోవడం ఆయన ఘనతకు లోపమని కాదు. తెలుగువారి జీవితంలోనే ఆయన ఒక భాగమైనాడు. వారి ఆలోచనలలో అంతర్లీనంగా ఆయన కొనసాగుతున్నాడు. తెలుగువారికి ఇంతగా ప్రేమాస్పదుడైన ఆ మహనీయుని ఈ విధంగా గౌరవించాలన్న ఆలోచనైనా కేంద్ర ప్రభుత్వానికి ఇంతకాలం రానందుకే బాధ. నిజానికి, తపాలాబిళ్ళ అవిష్కరణతోనే శ్రీ వీరేశలింగంపట్ల మన కర్తవ్యం తీరిపోదు. ఆయన ప్రారంభించిన పెక్కు పోరాటాలు ఇంకా పూర్తి కాలేదు. ఆయన తన కాలంలో ఎదుర్కొన్న అనేక సాంఘిక దురాచారాలు ఇంకా తాండవిస్తున్నాయి. ఎన్నో కొత్తవి సయితం తలయెత్తాయి. వాటిని ఎదుర్కొనడంలో, నిర్మూలించడంలో మన వైఫల్యానికి మనలను కనీసం సిగ్గిలచేయగలిగితే ఈ సందర్భంలో ఆయన సంస్మరణ సార్థక మౌతుంది.

*(ఆంధ్రజ్యోతి 14-7-1974)*

## పంతులుగారు, నాయుడుగారు

### (శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు, శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడు)

తరతరాల పారతంత్ర్యం పేరుకు పోవడంచేతనేమి, నిజధర్మ పరాయణత్వం వమ్ముగావడం చేతనేమి, అజ్ఞానాంధకారం అలముకొనడంవల్లనేమి, యావద్భారతంతోబాటు ఆంధ్రదేశంకూడ అగాధంలో పడివున్న రోజులవి.



మతం పేరుతో అజ్ఞానం, కులంపేరుతో అహంకారం, ఆచారం పేరుతో అహంకార దుర్వినియోగం, వ్యవహారం పేరుతో కపటవర్తనం మితిమీరిపోయి విచ్చలవిడిగా విహరించిన కాలమది.

పూర్వ వ్యవస్థలు నశించినవి. ప్రాచీన సంప్రదాయాలు విస్మరింపబడినవి. సనాతన సంఘధర్మాలు సడలినవి. వాటి స్థానాన్ని నూతన వ్యవస్థలు, నవీన సంప్రదాయాలు, ఆధునిక సాంఘిక నిబంధనలు అప్పటికింకా ఆక్రమించలేదు. శిధిలమైన గతానికీ, సృష్టికావలసిన భావికీ, వర్తమానంద్వారా ముడిపెట్టవలసిన అవసరం ఏర్పడింది. దేశ కాల పాత్రలనుబట్టి, కొత్తవేదం, కొత్తశాస్త్రం, కొత్తస్మృతి, కొత్తనీతి పునః సృష్టించవలసి వచ్చింది.

కాని, అంతటి త్రికాలజ్ఞులు, అంతటి ధర్మవేత్తలు, అంతటి కారణజన్ములెవరు? వారు మానవులా? దేవతలా? వారు మనతోబాటే పుట్టి, మనతోబాటు మని, మనతోబాటు గిట్టెడివారా? లేక మనకంటికి అగుపడని, మన వూహకు అందని అనిమేషులా?

కారు, వారుకూడా మానవులేనని, కాని మానవులలో మహిమోపేతులు, ఋషితుల్యులు అని నిరూపించిన పురుషపుంగవులు ఇరువురు ఆనాడు ఆంధ్రదేశంలో జన్మించారు.

ఒకరు పంతులుగారు, ఒకరు నాయుడుగారు. శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు తనువు చాలించి, నేటికి సరిగ్గా 31 సంవత్సరాలు. శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడు ఇహలోకయాత్ర ముగించి నిన్నటికి 11 ఏండ్లు. నిన్న నేడు ఈ రెండు నాళ్ళు ఆంధ్రులకేగాక, యావద్భారత ప్రజలకు చిరస్మరణీయమైన పవిత్రదినాలు.

వీరిలో "పంతులు"గారు కర్మవీరులు. ధర్మసంస్థాపనకు, అధర్మ సంహారమునకు అవిరళంగా యావజ్జీవం పోరాడినవారు.

“నాయుడు”గారు సజ్జనులు, సాధుసత్తములు, కరుణాసముద్రులు, ధర్మతత్పరులు. పంతులు, నాయుడుగార్లను సూర్యచంద్రులతో పోలిక పెట్టుటలో ఔచిత్యం లేకపోలేదు; ఒకరు తన వెలుగుచేత, తీక్షతచేత, అంధకారాన్ని, అధర్మాన్ని హరింపచేసిన మహా తేజస్కులు. మరొకరు తమ కమనీయత వల్లా, కారుణ్యంవల్లా కర్కశాలైన హృదయాలను కరిగించి, పాప పంకిలాన్ని కడిగివేసినవారు.
“పంతులు”గారి జీవితం అసిధారావ్రతంలాంటిది. వారేది తలపోసినా, ఏ పంక్తి వ్రాసినా, ఏ పని చేసినా దానికొక ప్రయోజనం, ఒక పురుషార్థం వుండి తీరాలి.

సాంఘికంగాని, ఆర్థికంగా, నైతికంగాని, లౌకికంగాని, ఐహికంగాని, ఆధ్యాత్మికంగాని ఆయన చొరబడని ఉద్యమం, ఆయన సాధించని సంస్కరణ వుండదు; వుండకూడదు. అంతటి సంపూర్ణమైన, సమగ్రమైన సర్వార్థసాధకమైన జీవితం ఆయనది.


ఇక, వారి సాహిత్య సేవా? వారికి వారే సాటి. అధునాతనాంధ్ర వాఙ్మయానికి శ్రీ వీరేశలింగమే సృష్టికర్త అని వేరే చెప్పనక్కరలేదు. అందులోనూ, అమృతమయమైనవారి చేతికి లొంగని వాఙ్మయశాఖ లేదు. నవలలా,నాటకములా, కథలా, ప్రహసనములా, చరిత్రలా, జీవిత విశేషములా, ఆయన వ్రాయనిదేది? వ్రాసి శోభించనిదేది? ఆంధ్ర సారస్వతం ఈనాడు తలయెత్తుకొని తిరగనేర్చిందంటే, ఆ భిక్షపెట్టినవాడు శ్రీ వీరేశలింగ కవే.

శ్రీ నాయుడు జీవితం ధవళమైన గంగా ఝురివంటిది. అది వినిర్మలం, సుమనోహరం, అనుభవయోగ్యం, పరమపవిత్రం.వారి బిరుదావళులుగాని, వారి విద్యా ప్రాభవాలుగాని, వారి ఉన్నతోద్యోగాలుగాని, వారి కీర్తి ప్రతిష్ఠలుగాని, ఇవేవీ అకళంకమైన, సరళమైన, అమృతప్రాయమైన వారి శీలానికి సరికావు.

ఆంధ్రచరిత్ర మనినంతవరకు, ఆంధ్రసాహిత్యం జీవించినంతవరకు, ఆంధ్రశీలం ప్రకాశించినంత వరకు ఈ యిరువురు వ్యక్తులను ఆంధ్రదేశం విస్మరించజాలదు. వీరి చరిత్రలను నెమరువేయడం మనకు, మన జాతికి శ్రేయోదాయకం. *(ఆంధ్రప్రభ 28-5-1950)*

## శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడు

ఆ కొత్త తరం వారికి తెలియకపోవచ్చుగాని మూడు, నాలుగు దశాబ్దాల క్రితం తెలుగుదేశం మొత్తానికి ఒకే "పంతులుగారు" ఉండేవారు; ఒకే "నాయుడుగారు" వుండేవారు. "పంతులుగారు" శ్రీ కందుకూరి వీరేశలింగం; ఆ "నాయుడుగారు" శ్రీ రఘుపతి వెంకటరత్నం.



వయస్సుకు నాయుడుగారు పంతులుగారి కంటే చిన్నవారైనా, అంతస్తులో మాత్రం కాదు. ఉభయులు బ్రహ్మమతావలంబకులే; ఉభయులు ఏకేశ్వరోపాసకులే; ఉభయులు విగ్రహారాధనకు వ్యతిరేకులే; ఉభయులు సంఘ సంస్కర్తలే; ఉభయులు విద్యా గురువులే; ఉభయులు కారుణ్యమూర్తులే!

ఇన్ని సామ్యాలతోపాటు వారిమధ్య కొన్ని వైరుధ్యాలు కూడా గోచరించేవి.

పంతులుగారికి ఇట్టే కోపం వచ్చేది. తనను తాను తిట్టుకునేవారు; ఇతరులను తిట్టేవారు. తాను ముక్కోపినని ఆయన స్వీయచరిత్రలో స్వయంగా వ్రాసుకున్నారు. తన అనారోగ్యమే, శరీర దౌర్బల్యమే తనలో ఈ లోపానికి కారణం కావచ్చునని ఆయన సూచించారు కూడా. ఆయన ఈ విషయాన్ని స్వయంగా పేర్కొన్నారో, లేదో, మా కిప్పుడు జ్ఞాపకం లేదుగాని, పగపడితే, విరోధి అంతు కనుక్కునే వరకు ఆయనకు నిద్ర పట్టేది కాదు. అవసరమైతే "అటునుంచి నరుక్కురావడానికి" ఆయన సంకోచించేవారు కాదు.

ఇందుకు పూర్తిగా విభిన్నమైనది నాయుడుగారి ప్రవృత్తి. ఆయనది అమృత హృదయం. ప్రేమించడమే తప్ప ద్వేషించడం దానికి చేతకాదు. ఆయనది అమృత వాక్కు. దీవించడమే తప్ప, దూషించడం దానికి తెలియదు. కోపగించవలసిన సన్నివేశాలలో ఆయన కన్నీరు కురిపించేవారు; ద్వేషించవలసిన సందర్భాలలో ఆయన గాఢాలింగనం చేసుకునేవారు.

వీరిద్దరి ప్రవృత్తులలోని ఈ వైరుధ్యాల కారణంగానే పంతులుగారిపట్ల ఆయన శిష్యవర్గానికి భయభక్తులుండగా, నాయుడుగారిపట్ల ఆయన అంతేవాసులకు భక్తి ప్రేమలుండేవి. ఉభయులు తమ అనుయాయులను ప్రభావితం చేసినా, పంతులుగారివలె నాయుడుగారు ఆంధ్ర ప్రజా జీవితంపై తమ వ్యక్తిత్వపు ముద్రను అంత గట్టిగా వేయలేకపోవడానికి ఆయన స్వభావంలోని ఈ మెతకతనమే ఒక కారణమైతే కావచ్చునేమో!

ఐతే, తమ అంతేవాసుల జీవితాలను నాయుడుగారు ప్రభావితం చేసినంతగా పంతులుగారు చేయలేదేమో! పంతులుగారు దగ్గరికి తీసిన వారిలో ఆయనతో ఏదో ఒక ఘట్టంలో తగవులాడి, దూరానికి పోనివారు బహు స్వల్పం. నాయుడుగారి విషయంలో ఇది మచ్చుకైనా జరగలేదు.

ఆయన మూర్తిలోనే ఏదో ఒక ఆకర్షణ ఉండేది. కృష్ణశాస్త్రిగారి పలుకులలో ఆయన "ఏలకో తోచు షరాయితో, పగడితో నెవరో యొక పాదుశాహిగా" అన్నట్టుగా ఉండేవారు. చూడగానే ఆయనకి చేయెత్తి నమస్కరించాలని బుద్ధిపుడుతూ ఉండేది. ఇక, ఆయనతో సంభాషించడం ఒక మహద్భాగ్యమే! వయస్సుతో నిమిత్తం లేకుండా, సాంఘిక ప్రతిపత్తితో నిమిత్తం లేకుండా తన చెంతకు వచ్చినవారందరినీ ఆయన "అమ్మా! తల్లీ!" అనో, "బాబూ! నాయనా!" అనో పలకరిస్తూ ఉండేవారు. యోగక్షేమాలను గుచ్చి గుచ్చి అడిగేవారు. అపరిచితుని కష్టసుఖాలనైనా పంచుకొనడానికి ఆతురత చూపేవారు. అభ్యర్థులకు చేతనైన సహాయాన్ని చేసి, వారి దీనావస్థకు తమకేదో బాధ్యత కలదన్నట్టు ఆవేదన పడేవారు!

నాయుడుగారిలో మరొక విశేషం - నవ్వడం, నవ్వించడం! గంభీర విషయాలను గంభీరంగా వివరించినా, సాధారణ సంభాషణలలో ఆయన హాస్యోక్తులను, చతురోక్తులను కోకొల్లలుగా విసురుతూ ఉండేవారు. బందరు నోబుల్ కాలేజీలో ఆయన వద్ద చదువుకొన్న డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు తర్వాత పెక్కేండ్లకు పూర్వ విద్యార్థుల సంఘ సమావేశంలో ప్రసంగిస్తూ, "నాయుడుగారు క్లాసుకు పావుగంట ఆలస్యంగా వచ్చేవారు; అరగంట పిచ్చాపాటీ మాట్లాడేవారు; తర్వాత ఒక పావుగంటసేపు మాత్రం పాఠం చెప్పేవా"రని ఒక విసురు విసరగా, ఆ సభలోవున్న నాయుడుగారు "నేను పావుగంట పాఠం చెబితేనే పట్టాభి ఇంతవాడైనాడు; గంట పాఠం చెబితే మరి పట్టపగ్గాలుండేవా?" ని చమత్కరించారు.

నాటి సభలోనే నాయుడుగారు నోబుల్ కాలేజీకి సంబంధించిన మరొక సంఘటనను స్వయంగా పేర్కొన్నారు. తాము నలభైమంది విద్యార్థుల కాంపోజిషన్ పుస్తకాలను ఇంటి వద్ద దిద్ది, క్లాసులోకి వాటిని తీసుకువెడుతుండగా, ఆ క్లాస్కు చెందిన ఒక విద్యార్థి "మాష్టరుగారిపై ఒక గాడిద బరువు పడింది" అని అల్లరిమాట అనగా, తాము "ఒక గాడిద బరువు కాదురా! నలభై గాడిదల బరువు" అని బదులు చెప్పినారట!

"నాలో వున్న ఆవేదన అగ్నిపర్వతంవలె బ్రద్దలై నన్ను నశింపచేయకుండా కాపాడుతున్నది నా నవ్వే కావచ్చు" అని (సరిగా ఈ మాటలలో కాకపోయినా, ఈ ధోరణిలో) గాంధీజీ ఒకానొక సందర్భంలో పేర్కొన్నారు. సంఘంలోని మౌఢ్యాన్ని, దురాచారాలను, దురన్యాయాలను చూడగా నాయుడుగారికి కలుగుతూ వచ్చిన దుర్భరావేదనాభారం నుంచి ఆత్మ రక్షణకై ఆయన సయితం నవ్వును "ఒక సాధనంగా వినియోగించుకొనేవారు!"'

ఏ దృష్టినుంచి చూచినా విశిష్టమైనది నాయుడుగారి వ్యక్తిత్వం. దాన్ని కృష్ణశాస్త్రిగారు ఈ కింది పద్యంలో ప్రతిభావంతంగా అభివర్ణించారు.



ప్రతిఫల మ్మిసుమంత వలవక కర్మముల్
సేయు నీ మెయి కురుక్షేత్రమగును,
ఆతాంతములకుఁ జరాచరమ్ములకును
దరలు నీ యెడఁద బృందావన మగు,.
వివిధ ధర్మజ్ఞాన వేణీ సమాశ్లేష
మైన నీ మనసు ప్రయోగ యగును
పాతాళమును స్వర్గపద మొక్క ముడిలోన
నతుకు నీవే వారణాశి వవుదు,
నీవు కన్పడ నెదురుగా నిలిచినట్లే
మ్రోలను బురాణ భారత పుణ్యభూమి
మాకు దినదిన దివ్య యాత్రాకృతోత్స
వానుభూతి నొసంగు బ్రహ్మర్షి నీవు. (మహతి.. 1949)

నాయుడు గారి శతజయంతి సమావేశం రాష్ట్రపతి రాధాకృష్ణన్ అధ్యక్షతన హైదరాబాదులో రేపు జరుగనున్న సందర్భములో ఆయనకు మేము మా భక్త్యంజలి ఘటిస్తున్నాము. *(ఆంధ్రజ్యోతి, 15-10-1964)*

*వివరణ: బ్రహ్మ సమాజం ఏకేశ్వరోపాసన కలిగి విగ్రహారాధన లేని మతం.*
*పట్టాభి: డా.భోగరాజు పట్టాభి సీతారామయ్య, భారతజాతీయ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు.*
*కృష్ణశాస్త్రి: శ్రీదేవులపల్లి కృష్ణశాస్త్రి, మహాకవి*

## శ్రీ ఈడ్పుగంటి రాఘవేంద్రరావు అస్తమయం

శ్రీ ఈడ్పుగంటి రాఘవేంద్రరావు నిర్యాణంతో ఒక ప్రముఖ రాజకీయవేత్త అస్తమించాడు.
శ్రీ రావు జన్మస్థానం కృష్ణాజిల్లా పెదమద్దాలి గ్రామం. ఆయన తండ్రి, తాతలు మధ్య పరగణాలకు వలసవెళ్ళి, బిలాస్పూర్లో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు.

శ్రీ రావు తండ్రి జాతీయాభిమాని. కుమారునిలో ఆయనే జాతీయాభిమానాన్ని ఉత్తేజింపజేశాడు. ఆయన ఎన్నో కాంగ్రెసు మహాసభలకు కుమారుని వెంటపెట్టుకు వెళ్లాడు.

బిలాస్పూర్లో విద్యాభ్యాసాన్ని పూర్తి చేసిన తర్వాత శ్రీ రావు ఉన్నత విద్యనిమిత్తం ఇంగ్లండుకు వెళ్లారు. అక్కడ వుండగా ఆయనకు లోకమాన్య బాలగంగాధర తిలక్తో పరిచయ భాగ్యం కలిగింది. తదాదిగా శ్రీ రావు లోకమాన్యుని శిష్యులైపోయారని చెప్పవచ్చు.

తిలక్ శకం గడిచి, గాంధి యుగం ప్రవేశించిన తర్వాత గాంధీజం వెల్లువలో శ్రీ రాఘవేంద్ర రావు మిళితమై పోయారు. రాష్ట్రీయ కాంగ్రెసు సంఘానికి అధ్యక్షులై, రాష్ట్రీయ స్వరాజ్యపక్షానికి నాయకులై చిత్తరంజన దాసు బెంగాలీ రాష్ట్రంలో సాధించలేకపోయిన ద్వంద్వ ప్రభుత్వ ప్రతిష్టంభనను ఆయన తన రాష్ట్రంలో సాధించ గలిగారు.
కాని, ఫలశూన్యమైన సహాయ నిరాకరణ విధానంపై అటుతర్వాత ఆయనకు విసుగు పుట్టింది. తిలక్ ప్రతిపాదించిన "రెస్పాన్సివ్ కోవవేషన్" విధానమే ఉత్తమమైనదిగా తోచింది.
అంచేత, ఆయన కాంగ్రెసు వీడి, సి.పి.లో మంత్రివర్గాన్ని  పించారు.



శ్రీ రాఘవేంద్రరావు జీవితంలో ఈ మార్పు జరిగిన తర్వాత, ఆయన పొందని ఉన్నత పదవి లేదు సి.పి.కి ఆయన యాక్టింగ్ గవర్నర్ అయ్యాడు. భారత మంత్రికి సలహాదారుడు అయ్యాడు. వైస్రాయి కార్యవర్గంలో సభ్యుడైనాడు.
విధి చిన్నచూపు చూడ్డంవల్ల 52 వ ఏటనే ఆయన కాలధర్మం చెందాడుగాని, లేనిపక్షంలో ఆయన మరెన్ని ఉన్నత పదవులనైనా పొందగలిగి వుండేవాడు.

శ్రీ రాఘవేంద్రరావు రాజకీయాశయాలతో ఏకీభవించలేని వారు సయితం ఆయన ప్రతిభావంతుడని, పరిపాలనాదక్షుడని అంగీకరించక తప్పదు. ఆయనకు నిశితమైన మేధస్సు, అద్భుతమైన జ్ఞాపకశక్తి వుండేవి. ఇందుకుతోడు నిరంతర గ్రంథపఠన వల్ల ఆయన ప్రతి ముఖ్యసమస్యను గురించి కూలంకష పరిజ్ఞానాన్ని సాధిస్తూ వుండేవాడు. శ్రీ రాఘవేంద్రరావు గ్రంథసంచయాన్ని మించింది మరి ఏ భారత రాజకీయవేత్త దగ్గరలేదని

ప్రతీతి. ఇక, ఆయన పరిపాలనాదక్షతకు మాంటేగ్యూ - చెమ్స్ఫర్డు రాజ్యాంగ విధానానికి లోబడి కూడా ప్రధానమంత్రిగా సి.పి.లో ఆయన చేయించిన ప్రజోపయోగకర శాసనాలే నిదర్శనం. వాణిజ్యమాంద్యంవల్ల పంటల ధరలు తగ్గి పోయి, కర్షకలోకం కష్టాలు వచ్చినప్పుడు మున్ముందుగా ఋణపరిష్కార చట్టాన్ని చేయించింది ఆయనే!

ఇందుకుతోడు శ్రీ రావును అత్యంత స్వాతంత్ర్యానురక్తితో కీర్తించారు. గవర్నర్ గద్దె నెక్కిన దినాలలో ఆయన గాంధీటోపీని విడవాలేదు. ప్రధానమంత్రిగా ఒకటి, రెండు కాంగ్రెసు మహాసభలకు హాజరైనారు.

శ్రీ రాఘవేంద్రరావు నిర్యాణం మన దేశానికి, ముఖ్యంగా సి.పి., ఆంధ్రరాష్ట్రాలకు పెద్ద లోటు ఈ సంతాప సమయంలో ఆయన బంధు మిత్రులకు మా సానుభూతి అందజేస్తున్నాము. ***(ఆంధ్రప్రభ 16-6-1942)***

## డాక్టర్ రావు చిత్రపటావిష్కరణ

ఆగర్భ శ్రీమంతుడు. కాని, అతి నిరాడంబరి.
అపార విద్యాపారంగతుడు. కాని, ఎంతో నిగర్వి.
అసమాన ప్రతిభాసంపన్నుడు. కాని, పటాటోపంపట్ల, ఏహ్యభావం కలవాడు.
ఉన్నత పదవీ పరంపరను అలంకరించినవాడు. కాని, తన స్థానం ప్రజాబాహుళ్యంలోనే అని ఒక్క త్రుటిపాటైనా విస్మరించనివాడు.

అందువల్లనే డాక్టర్ ఈడ్పుగంటి రాఘవేంద్రరావుగారు జనవంద్యులైనారు.

మితవాద ప్రముఖులైన డాక్టర్ జయకరు, రైట్ ఆనరబుల్ శ్రీనివాసశాస్త్రి, కాంగ్రెస్ పెద్దలైన శ్రీ సి.రాజగోపాలాచారి, శ్రీ బులుసు సాంబమూర్తి, జస్టిస్ పార్టీ సభ్యులైన సర్ ముత్తయ్య చెట్టియార్, సర్ ఆర్.కె. షణ్ముఖం, శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డి, అధికారులైన సర్ రామస్వామి మొదలియార్, శ్రీ వి. రామకృష్ణ చౌదరి, ముస్లింలీగ్కు చెందిన మిస్టర్ అబ్దుల్ హమీద్ ఖాన్ ప్రభృతులు జాతి, మత, పక్ష విభేదాలు లేకుండా నిన్న సాయంత్రం విక్టోరియా పబ్లిక్ హాలులో జరిగిన డాక్టర్ రాఘవేంద్రరావు చిత్రపట ఆవిష్కరణ మహోత్సవ సందర్భంలో వేదికను అలంకరించారంటే, అది ఆయనపట్ల భారతజాతికంతటికీ సమానంగా గల భక్తిగౌరవాలకు అత్యుత్తమ తార్కాణం కాదా?

డాక్టర్ రాఘవేంద్రరావు తమ రాజకీయాభిప్రాయాలను మార్చుకొనివుండవచ్చు. కాని, ఆయన శుద్ధాంతఃకరణను ఎవ్వరూ శంకించలేదు : శంకించలేరు. పలుకుబడి కోసం ఆయన ఎన్నడూ దేవులాడలేదు.

ఏ పార్టీలో ఉన్నప్పటికీ, ఏ పదవిని స్వీకరించినప్పటికీ ప్రజాసేవకు కేవలం ఒక ఉపకరణగానే దాన్ని ఆయన భావించాడు. అదే ఆయనలోని విశేషం; ఆయనలోని విశిష్టత.

ఇట్టి ప్రతిభావంతుని, రాజకీయ దురంధరుని, ఇట్టి దేశసేవా తత్పరుని కోల్పోవడం, డాక్టర్ జయకరు నిన్న స్పష్టపరిచినట్టు, దేశానికి గొప్ప నష్టం.

"ఈ ప్రతిష్టంభన ఎల్లకాలం ఈ విధంగా వుండటానికి వీలులేదు. నేటి పరిస్థితులు ప్రస్తుత మొక దుస్సహ పరిణితికి వచ్చాయి. అందువల్ల త్వరలో రాజకీయ సమస్యా పరిష్కారం జరిగి తీరుతుంది. ఇది ఎప్పుడు జరుగుతుందో, ఏవిధంగా జరుగుతుందో నేను జోస్యం చెప్పలేను. కాని, త్వరలోనే ఏదో విధంగా జరిగితీరాలి. ఇది జరిగినప్పుడు డాక్టర్ రావువంటి ధీమంతుడు లేకపోవడం ఎంత కొరత! ఎంత సంతాపకరం" అని డాక్టర్ జయకరు అన్నారు.

ప్రతిష్టంభన త్వరలో తొలగిపోగలదన్న ఆశాజ్యోతి మాకు కానరావడంలేదు. కాని, ఏ పరిస్థితిలోనైనా డాక్టర్ ఈడ్పుగంటి రాఘవేంద్రరావు అకాల మరణం ఆంధ్రజాతికేకాక, మధ్యపరగణాలకేకాక, నిఖిల భారతావనికే అపార నష్టమనడంలో అణుమాత్రమైనా సందేహం లేదు.
అయితే, ఈ నష్టానికి వాపోవడంకాదు ఇప్పుడు కావలిసింది.

ఏ దేశ స్వాతంత్ర్యానికి డాక్టర్ రావు పరితపించారో, దేనికోసం ఆయన అహర్నిశలు కృషి చేశారో, దాన్ని సాధించడం ద్వారానే ఆయన ఆత్మకు సంతృప్తినివ్వడం జరుగుతుంది. ఆయన స్మృతి ఫలప్రదమౌతుంది కూడా. డాక్టర్ జయకరు కూడా నిన్న ఈ గంభీర సందేశాన్నే యిచ్చారు. *(ఆంధ్రప్రభ 7-12-1943)*

*మద్రాసు (చెన్నయ్), ఆంధ్ర మహాసభలో డాక్టర్ రావు చిత్రపటావిష్కరణ సందర్భంలో రాసింది.

## శుభోదయం



ఆంధ్రజాతిలో నేడు ఒక నవచైతన్యం కనబడుతున్నది.
ఆత్మగౌరవం, ఆత్మాభిమానం ఆంధ్రులలో పెంపొందడమే ఇందుకొక నిదర్శనం.
అన్యరాష్ట్రాల వారికి ఆంధ్రులు ఇదివరలో బ్రహ్మరధాన్ని పడుతూవుండేవారు.

మహాపురుషులను వారు ఏ రాష్ట్రవాసులైనా, ఏ దేశస్థులైనా - సముచితంగా గౌరవించవలసిందే! కాని,

అన్యులైనంతమాత్రాన నెత్తిని పెట్టుకోవడం, ఆత్మీయులైనంత మాత్రాన తెగనాడ్డం పురోభివృద్ధి సూచకం కాదు.

అయితే, నిన్న మొన్నటివరకు ఆంధ్రులు "దూరపుకొండలను" చూచి, వాటి "నునుపుదనానికి" మురిసిపోతూ వుండేవారు.
"దగ్గరకొండల"ను కానగలిగేవారే కాదు.

ఇటీవల ఈ ప్రవృత్తి పరివర్తనం చెందడం ముదావహమైన విషయం.
రెండు, మూడు సంవత్సరాలనాడైతే, డాక్టర్ ఈడ్పుగంటి రాఘవేంద్రరావు స్మారకచిహ్న సంస్థాపన సంకల్పం కేవలం సంకల్పంగానే వుండిపోయేదేమో!

ఇది ఆంధ్రప్రవృత్తిలో ఒక విప్లవకరమైన మార్పు అని అన్నప్పటికీ, అది అతిశయోక్తి కానేరదు. ఆంధ్రులలో ప్రతిభావంతులైన రాజనీతివేత్తలు లేకపోలేదు; సామ్రాజ్య చక్రాన్ని తిప్పగల పరిపాలనాధురీణులు లేకపోలేదు; షట్ శాస్త్రాలను మధించిన పండిత ప్రకాండులు లేకపోలేదు; రసన్మయజగత్తును సృష్టించగల కవిపుంగవులు లేకపోలేదు; సౌందర్యరాసిని కళ్లకు కట్టగల చిత్రకళాకోవిదులు లేకపోలేదు; ప్రకృతి గర్భాన్ని చీల్చి దాని రహస్యాలను తెలుసుకోగల వైజ్ఞానిక శాస్త్రపుంగవులు లేకపోలేదు; ప్రతికూలపరిస్థితులను ధిక్కరించి, పరిశ్రమగారాలను నెలకొల్పి, జయప్రదంగా కొనసాగించగల పారిశ్రామిక వేత్తలు లేకపోలేదు. అయితే, స్వరాష్ట్రం, స్వజాతి తగురీతిగా ఆదరించని కారణాన, తగురీతిగా, గౌరవించని కారణాన వీరు తమ ధీశక్తికి అనుగుణ్యమైన పేరు ప్రతిష్టలను పొందలేక పోతున్నారు.


ఆంధ్రజాతిలో మానసిక ప్రవృత్తిలో నేడు కన్పిస్తున్న నూతన పరివర్తన ఫలితంగా మున్ముందు ఆంధ్రుల ప్రతిభావిశేషాలు, తద్వారా, ఆంధ్రరాష్ట్రానికి దీప్తి ఖండఖండాంతరాలు వ్యాపించగలవనే ఆశ పొడముతున్నది.

*(ఆంధ్రప్రభ 6-12-1948)*

## పల్లెటూరి రైతు : శ్రీ ఓమందూరి రామస్వామి రెడ్డియార్

సుమతీ శతకకారుని దృష్టిలో శ్రీ ఓమందూరి పెదరామస్వామి రెడ్డియార్ "ధన్యుడు" కాడు. "ఎప్పటికెయ్యది ప్రస్తుత మప్పటికామాట"లాడే విద్య ఆయనకు తెలియదు. "అన్యుల మనముల్ నొప్పింపక తానొవ్వక తప్పించుక" తిరిగే కళలో ఆయనకు చాతుర్యం లేదు.

ఆయన నిర్మొహమాటి. నిక్కచ్చిగా మాట్లాడవలసివస్తే, అందుకు ఇసుమంతైనా జంకడు, గొంకడు. ఇంతేకాదు. నోటితో మాట్లాడుతూ నొసలతో వెక్కిరించలేడు. లోపల భగభగమంటున్నా చల్లని చూపు చూడలేడు. చికాకును చిరునవ్వులో దాచలేడు. కడుపులో మాటను పైకి కక్కవలసిందే. మనస్సులోని భావాన్ని ముఖంపై కనబరచవలసిందే. అయినప్పుడు ఆయనను ధన్యునిగా సుమతీ శతకకారుడు అంగీకరిస్తాడా? లేక, సుమతీ శతకకారుని భక్తకోటి అంగీకరిస్తుందా?




సుమతీ శతకకారుని భక్తకోటి అశేషమైనదే కావచ్చు. రాజకీయరంగంలో పాదం పెట్టిన పిదప ఆ భక్తకోటిలో చేరకపోవడం "లౌక్యం" కాదనడం కూడా నిజమే కావచ్చు. కాని, లోకం పోయే దారిని పోవడమే ధన్యతి కానవసరం లేదని భావించేవారు కొందరుంటారు గదా? కపటానికి పర్యాయపదమని విశ్వసించే వారు కొందరుంటారు కదా? ఇట్టివారి దృష్టిలో రామస్వామి రెడ్డియార్ ధన్యుడే.

ప్రధానిగా రెడ్డియార్ ఏమి సాధించాడు? లేదా, ఏమి సాధించలేక పోయాడు? - ఈ ప్రశ్నలను మేమిక్కడ తరచబోవడం లేదు. ఆయన ఏమేమో సాధించాడన్నా, లేక, ఏమీ సాధించలేదన్నా, అది వివాదాంశమే కావచ్చు. కాని, ప్రధాని పదవి ఆయన ప్రవృత్తిలో మార్పు తేలేదనడం వివాదాంశం కానక్కరలేదు.

ఆయన పల్లెటూరి రైతు కడుపున పుట్టాడు; పల్లెటూరి రైతుగా పెరిగాడు; పల్లెటూరి రైతుగానే ప్రధాని పదవిని నిర్వర్తించాడు. "మా ఊరున్నది; నా వ్యవసాయమున్నది" అంటూ ఆ పదవి నుంచి నిష్క్రమించాడు.

ప్రవృత్తి ఒకటికాగా, మరొక విధంగా ప్రవర్తించకపోవడం ఘనతకాగల పక్షంలో అందుకు రెడ్డియార్ అర్హుడని ఆయనను ఎంతగా నిరసించేవారైనా అంగీకరించక తప్పదు.

రెడ్డియార్ ప్రవృత్తిలో మొరటుతనం హెచ్చుగా కలదనేవారు లేకపోలేదు!




కాని, అచ్చమైన ప్రతి పల్లెటూరి రైతు ఎంతో కొంత మొరటువాడే కాదా? గాడిదను చూపి, గుర్రం అనమంటే అతడనడు. పందిని నందిని చెయ్యమంటే అతడు చెయ్యడు. మనస్సులోని తలంపు, పెదవిపై మాట అతనికొక్కటే. బస్తీ "సంస్కృతి" గల వారికిది మొరటుతనమే కాదా? బస్తీ "సంస్కృతి"కి నటన పునాది. ఏ రోజు ఎంత దుస్సహంగా ప్రారంభమైనా, అది "గుడ్ మార్నింగే", "వీడు ఛస్తే, భూభారం తగ్గుతుందని లోపల అనుకొంటున్నా, పైకి మాత్రం "హౌ డు యు డు" దూడూ బసవన్న నాటకమే.

ఈ నటన తెలియనివాడైనందున అచ్చమైన ప్రతి పల్లెటూరి రైతువలె రెడ్డియార్ కూడా మొరటువాడే. కాని, చూడగలవారికి అది ఎంతటి ధక్కామొక్కీలకైనా ఆగగల నల్ల కొండరాతి మొరటుతనం; ఎకరానికి రెండుపుట్ల గింజలు రాలే నల్లరేగడి నేల వేసే బీటల మొరటుతనం.

సిసలైన ఏ పల్లెటూరి రైతు తనకు తానై ఊరుపై పెత్తనాన్ని కట్టబెట్టమని అడగడు. అడగకుండా అది తనకు సంక్రమించినప్పుడు, ఏ రోటి దగ్గర ఆ పాట పాడడు; అయినవారిని అందల మెక్కించడు; దేవుని ముఖం చూచి, తనకు న్యాయమని తోచినదాన్నే, చేస్తాడు. తన పెత్తనం అక్కడలేదని ఊరువారనుకుంటే, పుట్టి మునిగిపోయినట్టు వాపోవడు కూడా.

రెడ్డియార్ చేసిందికూడా అక్షరాలా ఇంతే.

రెండేళ్ళనాడు ప్రధాని పదవికై ఆయన ప్రాకులాడలేదు. అది సిద్ధించినందుకు ఉబ్బి తబ్బిబ్బులు కాలేదు. ప్రస్తుతం అది పోయినందుకు ఖిన్నుడు కావడం లేదు.

ప్రధాని పదవి నిర్వహించినా, రెడ్డియార్ ప్రవృత్తిలో మార్పు రాలేదన్నాము. కాని, ఆయన అంతస్తు మాత్రం నిస్సందేహంగా పెరిగింది.

"పదవులు వస్తాయి, పోతాయి. నిలిచేది నిజాయితే" అని మాటలలో చెప్పడమేకాక, చేతలద్వారా నిరూపించు కొన్నాడు.

తిరిగి పల్లెకు చేరినా, ఆయన సేవారంగం విస్తీర్ణం తగ్గిందేకాని, సేవా ధర్మం తగ్గలేదు. పల్లెటూరి రైతు నిజంగా ధన్యుడు. *(ఆంధ్రప్రభ 8-4-1949)*

వివరణ :శ్రీ ఓమందూరి రామస్వామి రెడ్డియార్, 1947 లో అవిభక్త మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి.

## మన ప్రకాశం



స్వరాజ్యం కోసం ఆయన పరితపించాడు; దేశం స్వరాజ్యభాగ్యాన్ని పొందడాన్ని చూడగలిగాడు. స్వరాష్ట్రంకోసం ఆయన కలలు గన్నాడు; స్వరాష్ట్రావతరణను చూడ్డమే కాక, మొట్టమొదటి ముఖ్యమంత్రిగా కొంత కాలంపాటు ఆయనే దానికి సారధ్యం వహించాడు. విశాలాంధ్రకోసం ఆయన తహతహలాడాడు; దాని నిర్మాణాన్ని చూచిన అదృష్టం కూడా ఆయనకు పట్టింది. ఏయే మహోన్నత లక్ష్యాలకోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశాడో అవన్నీ ఆయన జీవితకాలంలోనే ఫలించినవని నిస్సందేహంగానే చెప్పవచ్చు. అందువల్ల ఆయనది వెలితిలేని జీవితం; కోర్కెలు తీరిన జీవితం; పండిన పండు వలె తేనెలూరుతూ రెమ్మనుంచి చల్లగా జారిపోయిన జీవితం. కనుక ఆయన నిర్యాణానికి నిజానికి చింతించ నక్కరలేదు.అయినా, సోమవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ రాజధానిలో శ్రీ ప్రకాశం పంతులు కన్ను మూసినట్టు వినగానే ముక్కోటి ఆంధ్రులు నిశ్చేష్టులు కావడం దేనికి? నిర్విణ్ణులు కావడం దేనికి? వారి గుండెలు ఒక్కసారిగా అంతగా బరువెక్కడం దేనికి? వారి కళ్ళ వెంట ఒక్కటే ధారగా అంతగా కన్నీరు కాల్వలు కట్టడం దేనికి?

ఈ ప్రశ్నలకు సమాధానం "ప్రకాశం ఆంధ్రుడు" అని మాత్రమే! తెలుగు మాతృభాషగా గల ముక్కోటి ప్రజలు ఆంధ్రులవడం నిజమే కావచ్చు. కాని, ముక్కోటి ఆంధ్రుల గుణదోషాలను తనలో మూర్తీభవింప జేసుకొన్న ఆంధ్రుడు శ్రీ ప్రకాశం పంతులు.

ఆంధ్రునికి మేధాసంపత్తి తక్కువేమీ కాదు. కాని, అతనిపై రాజ్యం మేధది కాదు; హృదయానిదే. అందువల్లనే ఆలోచన చేయగలిగే అతడు ఆవేశానికి లోనౌతాడు. ఆవేశపరవశుడైనంతనే వెనుక ముందులను పారజూచుకొనడం మరి లేదు. అప్పుడు ఎంతటి అసాధ్య విషయాలకైనా అతడు ఉద్యుక్తుడౌతాడు. ఎట్టి అగ్నిగుండంలోనైనా దూకుతాడు; ఆహుతి కావడానికి అణుమాత్రమైనా వెనుదీయడు. "ఆరంభ శూరత్వం" చూపుతాడని అతడికున్న నింద కష్ట నష్టాల వల్ల, వెరపువల్ల వచ్చింది కాదు; పాలవలె ఎంత త్వరగా పొంగుతుందో, అంత త్వరగా చల్లారి పోవడం ఆవేశం లక్షణం. నిత్యావేశం మానవ స్వభావానికే విరుద్ధం. ఆవేశపరుడైనవాడు విజయాన్ని సాధించడం రంగంలోకి దూకిన వెనువెంటనే; అప్పుడు అతడు ఫలసిద్ధి నందలేక పోతే, అది మరి అతనికి సిద్ధించడం దాదాపు జరగదనే చెప్పవచ్చు.

ఆవేశపరుడైన వ్యక్తికి - మేధను కాక, హృదయాన్ని తనపై రాజ్యం చేయనిచ్చే వ్యక్తికి - ఆగ్రహం వచ్చినా, అనుగ్రహం కలిగినా, దానికి పరిమితులుండబోవు. ఆలోచించి తప్ప అడుగు తీసి పెట్టని వ్యక్తి వలె ఆగ్రహం కలిగినప్పుడు అతడు దాన్ని మనసులోనే దాచిపెట్టుకుని, దెబ్బతియ్యడానికి తగు సమయం కోసం వేచివుండలేడు. అప్పటికప్పుడు ఏదో ఒక విధంగా ఆ కోపాన్నికక్కి వెయ్య వలసిందే! నాలుగు తిట్టడం,

నాలుగు తిట్టించుకొనడం, జబ్బ చరచడం, దెబ్బ తియ్యడం - ఏదో ఒకటి వెంటనే జరిగిపోవాలి. బుసబుస పొంగుతూ పైకి వచ్చే అతడి ఈ కోపం అంచులను దాటి ఒకసారి పొర్లగానే చప్పగా అణగారి పోతుంది. చివరికి దాని నురుగైనా మిగలదు సరిగదా, కొన్ని కొన్ని సందర్భాలలో అదే ఇంతటి విపరీతపు అను గ్రహంగానో, అనురాగంగానో మారిపోవచ్చు కూడా.

ఆంధ్రజాతిలోని ఈ గుణదోషాలన్నీ ప్రకాశం పంతులుగారిలో తొణికిసలాడుతూవుండేవి కాబట్టే, ఆయనను ప్రేమించినంతగా వారు మరెవ్వరినీ ప్రేమించలేదనడం అత్యుక్తి కాదు. గాంధీజీ పట్ల వారికి భక్తి వుండేది; నెహ్రూపట్ల గౌరవం వున్నది; కాని, వారి ప్రేమమాత్రం ప్రకాశం పంతులుకే. అంతులేనిది ఆ ప్రేమ! వింతైనది ఆ ప్రేమ !!

ఔను ! స్వచ్ఛమైన ప్రేమ ఎప్పుడైనా - ఎవరి విషయంలోనైనా - వింతైనదే. అది పొరపాట్లను పాటించదు; లోపాలను పరిగణించదు; తప్పులను సయితం ఒప్పులు గానే స్వీకరిస్తుంది; వైఫల్యాలను సయితం విజయాలుగానే అంగీకరిస్తుంది. బిడ్డపైన తల్లికి వుండే ప్రేమ స్వచ్ఛమైంది. ఆ ప్రేమ బిడ్డలోని లోపాలన్నింటినీ తల్లికి కనబడకుండా చేయదా? తల్లిపై బిడ్డకు వుండే ప్రేమకూడా స్వచ్ఛమైనదే. అట్టి ప్రేమ వుండే బిడ్డ తల్లిలో నెపాలెన్నగలదా?

శ్రీ ప్రకాశం పట్ల ఆంధ్రజాతికి ఈ స్వచ్ఛమైన ప్రేమ వుండేది కనుకనే ఆయన పొరపాట్లు చేసినా, వాటిని పాటించకుండానే ఆంధ్రులు ఆయనను ప్రేమించేవారు. తన జీవితంలో వ్యక్తిగత జీవితంలోనేమి, ప్రజాహిత జీవితంలోనేమి - ఆయన చేసిన పొరపాట్లు తక్కువేమీ కావు. అయినా, ప్రతి పొరపాటు తర్వాత ఆయనపట్ల ప్రజల ప్రేమ మరింత పెరిగేదే తప్ప, తరిగేది కాదు. అన్యరాష్ట్రాల వారికి ఇది విడ్డూరంగానే తోచేది. "ప్రజా నాయకుడైన వాడు ప్రకాశంగారు చేసిన పొరపాట్లలో ఒక నూరవవంతు చేసినప్పటికీ అతడికి మా రాష్ట్రాలలో నీళ్ళైనా పుట్టకుండా పోయేవి! మరి మీ ప్రకాశంగారు ఇప్పటికీ ఎలా అగ్రనాయకులుగా నిలవగలుగుతున్నారో?" అని వారు ఎంతో ఆశ్చర్యంగా ప్రశ్నిస్తుండే వారు. ఈ ప్రశ్నలకు సంగతి తెలియక పోవడమే!

మూలం, - ప్రకాశంగారిపట్ల ఆంధ్రులకున్న అపారమైన ప్రేమ సోదరాంధ్రులు తనను ప్రేమించినంత ప్రగాఢంగానూ ప్రకాశం పంతులుగారు సోదరాంధ్రులను ప్రేమించే వారు. ఆయనది నిష్కల్మషమైన హృదయమైనట్టే, ఆయన ప్రేమ కూడా నిష్కల్మషమైంది. ఎంతటివానినైనా "అరే! ఒరే!" అనడం ఆయనకు చెల్లు! ఈనాడు తెగనాడిన వ్యక్తినే రేపు మన సారా కౌగిలించుకొనడం ఆయనకే చెల్లు. తనకింత పైకం కావాలని, అంత కావాలని ఎవరికైనా కబురు చేయడం ఆయనకే చెల్లు. రేపటికి దారేదీ లేక పోయినా, నేడు చేతిలో పైకం వుంటే, "పట్టుకుపో!" అంటూ ఎదటనున్న వానిపై పారవెయ్యడం కూడా ఆయనకే చెల్లు. ఏ దృష్టినుంచి చూచినా, ఆయన ఒక విలక్షణ వ్యక్తి; ఇందుకు తగినట్టుగానే ఆంధ్ర ప్రజా హృదయంలో

ఆయనది విశిష్టమైన స్థానం. ఆయనను గురించి వ్రాయాలంటే, గడచిన అర్ధ శతాబ్దపు ఆంధ్రజాతి చరిత్రను గురించే వ్రాయవలసి వుంటుంది.

*(ఆంధ్రజ్యోతి 16-10-1964)*

## ప్రేమాంజలి: శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు

నవ్యాంధ్ర నాయకులలో ప్రకాశంగారిని మించి ప్రజా ప్రేమను చూరగొన్నవారు మరిలేరు; బహుశా మరి ఉండబోరుకూడా.




కుల మత విభేదాలు లేకుండా అందరు ఆయనను ప్రేమించారు. పాక్షిక వర్గాది విభేదాలు లేకుండా ఎల్లరు ఆయనను ప్రేమించారు. అవధులెరుగనిది ఆ ప్రేమ, అశేషమైనది ఆ ప్రేమ.

ఆయన గుణాలను చూచి ప్రేమిస్తే, బలాలను చూచి ప్రేమిస్తే, నిజానికి అందులో పెద్ద విశేషం లేదు. వాటి కారణంగా అనేకులు ప్రజాప్రేమను పొందడం కద్దు. కాని, చిత్రం ఏమంటే, ప్రకాశంగారి దౌర్బల్యాలను చూచి కూడా ఆంధ్ర ప్రజాకోటి ఆయనను ప్రేమించింది.

తమ పేరుకు, ప్రతిష్టకు (లేదా, ఇంగ్లీషు నుడికారం ప్రకారం తమ “ఇమేజి”కి) ఎక్కడ భంగం వాటిల్లుతుందో అని పెక్కుమంది తమ దౌర్బల్యాలను కప్పిపుచ్చుకొనడానికి ప్రయత్నించడం కద్దు. కాని, చెదురుగా తప్ప అది వృథా శ్రమ. ఎప్పటికో ఒకప్పటికి, ఏదో ఒక విధంగా,వారి దౌర్బల్యాలు బయటపడతాయి. అప్పుడు “ఏమో అనుకున్నాము గాని, ఇంతేనా!” అనే నిరసనభావం సహజంగానే కలుగుతుంది. అదివరకున్న ప్రేమ, గౌరవాలు పలచబడతాయి.

ప్రకాశంగారు ఎన్నడు తన దౌర్బల్యాలను దాచుకొనడానికి ప్రయత్నించలేదు. పడుచుతనంలో ఆయన పచ్చి పోకిరి. ఏయే పనులను పచ్చి పోకిరీలు సాధారణంగా చేస్తూ ఉంటారో వాటిని ఆయన చేశారు. పోకిరీలకు సైతం అసాధారణమైన కొన్ని పనులను కూడా ఆయన చేశారు. మభ్యపెట్టకుండా ఈ విషయాలన్నిటిని ఆయన తన ఆత్మకథలో స్వయంగా బయటపెట్టారు.

అందువల్లనే, ఆయన ఆత్మకథ ఒక అద్భుత రచన. అందువల్లనే ఆయన ఒక అమృతమూర్తి. ప్రఖ్యాతిలోకి వచ్చిన తర్వాత కూడా, ప్రజానాయకుడైన పిదప కూడా చిన్ననాటి పోకిరితనం అప్పుడప్పుడు ఆయనలో నుంచి తొంగిచూస్తూ ఉండేది. కోపం వస్తే ఆయన పడదిట్టేవారు, విచారం కలిగితే బొటబొట కన్నీరు కార్చేవారు, అవసరమనుకుంటే బెదిరించేవారు, బూకరించేవారు, బుసలు కొట్టేవారు. తిరిగి తీర్చలేనని తెలిసి కూడా చేబదుళ్ళు చేసేవారు. చేసిన చేబదుళ్ళను అర్థులకు అందించేవారు. కాసు చేతిలో లేకపోయినా, కాశీకి ప్రయాణం కట్టేవాడు. ఇట్టి పనులలో తనకు తానే సాటిగా వ్యవహరిస్తూ ఉండేవారు.



ఆయన బలాలవలె ఆయన దౌర్బల్యాలు కూడా ప్రజలకు తెలుసు కనుకనే వేరొక ప్రజానాయకుని ప్రేమించనంతగా వారు ఆయనను ప్రేమించేవారు. తమలోగల బలాలు ఆయనలో శతాధికంగా వారు చూచేవారు. తమలో గల దౌర్బల్యాలను దశగుణంగా ఆయనలో చూచేవారు. అందువల్లనే, ఆయన ఒప్పులు చేసినా, తప్పులు చేసినా ఆయనను సమర్థించేవారు. ఆయన వెనుక నడిచేవారు. ఆయనను తమ పెద్దన్నగానో, పెదతండ్రిగానో ప్రేమించేవారు.

విషమ ఘట్టాలలో ఆయనవలె ఎంతకైనా సాహసించినవారుండవచ్చు. త్యాగాల విషయంలో ఆయనకు ఈడురగలవా రుండవచ్చు. కష్టసహిష్ణుతలో ఆయనతో పోల్చతగువారుండవచ్చు. కాని, ప్రజాప్రేమను చూరగొనడంలో ఆయనకు సాటిరాగలవారు ఆంధ్రప్రదేశ్లోనే కాదు, భారతవర్షంలోనే మరిలేరేమో!

గాంధీ, నెహ్రూ, లజపత్య్, సి.ఆర్.దాస్ మున్నగువారిని కూడా మనదేశ ప్రజలు ప్రేమించక పోలేదు. కాని, వారి పట్ల ప్రేమలో భయభక్తులు మిళితమై ఉండేవి. స్వచ్ఛమైన ప్రేమలో భయభక్తులకు తావులేదు. భయానికి మారుగా ఆ ప్రేమలో మైత్రి ఉంటుంది. భక్తికి మారుగా దానిలో చనువు ఉంటుంది. అట్టి స్వచ్ఛమైన ప్రేమనే అన్ని సందర్భాలలో అందరి నుంచి ప్రకాశంగారు పొందగలిగారు.

అదే ప్రేమ ఈనాడు ఆయన శతజయంతి సందర్భంలో వెల్లివిరుస్తుంది. కోట్లకొలది ప్రజలతోపాటు ఈనాడు ఆయనకు మా ప్రేమాంజలి ఘటిస్తున్నాం. *(ఆంధ్రజ్యోతి 28-8-1972)*

వివరణ : లజపత్ రాయ్, చిత్తరంజన్ దాస్ తొలి తరం భారత జాతీయ కాంగ్రెస్ నాయకులు.

## దీపకళిక : శ్రీ ముట్నూరి కృష్ణారావు

దీపకాంతి గృహాంగణాన్ని జ్యోతిర్మయం చేస్తున్నంతవరకు, దాన్ని వినియోగించుకొంటామేగాని, దీపాన్ని గురించి మనం సర్వసాధారణంగా యోచించము.



నదీజలాలు మన క్షేత్రాలను సస్యశ్యామలం చేస్తున్నంతవరకు, వాటి నుంచి సత్ఫలితాలను పొందుతామేగాని, నదికి మన స్మృతిపథంలో అంతగా స్థానం ఉండదు.

కాని ఇల్లు చీకటిలో మునిగినంతనే మన తలపులన్నీ దీపాన్ని గురించే; పొలం ఎండినంతనే మన చూపు పూర్తిగా నదిపైనే!

అది క్లిష్ట జాతీయ సమస్య కావచ్చు లేదా నిగూఢ అంతర్జాతీయ ప్రశ్న కావచ్చు. అది అగాధ తత్త్వ రహస్యం కావచ్చు. కాక సునిశిత సాహిత్య విషయం కావచ్చు. అది చిత్రంలో కూర్పు, శిల్పంలో పొంకం, కవిత్వంలో జిగి, సంగీతంలో విరుపు - ఏదైనా కావచ్చు. దానిపై ఉచిత వ్యాఖ్యానమేమి, దాన్ని గురించి విశిష్ట విశదీకరణమేమి, లభ్యమవుతున్నంత వరకు శ్రీ ముట్నూరి కృష్ణారావుగారిని మనం అంతగా తలచి ఉండకపోవచ్చు.



కాని వ్యాఖ్యాతగా, భాష్యకారుడుగా, ద్రష్టగా, ఉపదేష్టగా ఇక ఆయనకు మనం నోచుకోలేదు. గనుక, మన తలంపులన్నీ నేడు పూర్తిగా ఆయనపై లగ్నం కావటం సహజం.

పండువంటి చాయ, గుండ్రని గండుమొఖం, పెద్ద కళ్ళు, సన్నని పెదవులు, బలమైన క్రింది దవడ, కుచ్చు తలపాగా, పొడుగుపాటి అంగీ, పారాడే పంచెకట్టు, నల్లటి ఆకు చెప్పులు, చేతికఱ్ఱ. ఎంతటి నిండైనది ఆయన విగ్రహం : రాజును తలపింపజేస్తూ వుండేవాడు.

వైవిధ్యమైనది ఆయన ప్రవృత్తి. కొత్త ఆటవస్తువు దొరికిన బాలకుని వలె ఒక క్షణంలో కేరింతలు, ప్రకృతి రహస్యాలను గ్రహించగోరుతున్నట్లు, మరొక క్షణంలో గంభీరముద్ర. కొత్త పెళ్ళికొడుకువలె ఒక్కొక్కప్పుడు ముసిముసి నవ్వులు; ప్రపంచ పరిస్థితులకు పరితాపపడుతున్నట్లు మరి ఒక్కొక్కప్పుడు చింతాక్రాంత వదనం, చిగురునో, ఆకునో, మొగ్గనో, పువ్వునో, పిందెనో, కాయనో చూచినంతనే మానవ ప్రపంచంతో తన కెట్టి సంబంధం లేనట్టుగా కొన్ని సందర్భాలలో తన్మయత్వం. ఏ బిచ్చగాని పాటనో, ఏ దొమ్మరివారి మొగ్గలనో, ఏ గారడీవాని తమాషాలనో, ఏ వేలంపాటదారుని మాట కొంటితనాన్నో, ఏ ముచ్చపనివాని అద్దకాలనో, ఏ నటుని చాతుర్యాన్నో, చిత్రకారుని రంగుల మేళవింపునో, మెచ్చుకుంటూ, మరికొన్ని సందర్భాలలో

అదేలోకమన్నట్లుగా దానిలో లీనమయ్యేవారు. రాతివిగ్రహంకంటే స్తబ్దుగా కొన్నిసార్లు; లేడి కంటె తృళ్ళింతలు మరికొన్ని సార్లు.

పెక్కువాగులు చేరితేనే ఒక జీవనది; పెక్కు జీవనదులు ప్రవహిస్తేనే ఒక మహాసముద్రం. ఈ సత్యాన్ని ఆయన గ్రహించాడు. వైవిధ్యానుభవాలతో కూడినప్పుడే, మానవుని జీవితానికి మహాసముద్రానికివలె, గంభీరత్వమని, సంపూర్ణత్వమని ఆయన గుర్తించాడు. ఉపనిషత్తులు ఉదోషణలపట్లవలె, పల్లెపదాలపట్ల కూడ ఆయన శ్రద్ధ చూపటానికి ఇదే కారణం. ప్రపంచ రాజకీయాలలోవలె, పంచాయతీబోర్డు ఎన్నికలలో కూడా ఆయన శ్రద్ధాళువై వుండటానికి ఇదే కారణం. జితేంద్రియుని పట్ల భక్తిని ప్రదర్శించటంతో పాటు... విషయంలో ఆయన ఉత్సాహాన్ని చూపటానికి సయితం ఇదే కారణం.

రవీంద్రుడు తత్త్వవేత్త; రవీంద్రుడు రసపిపాసి; మహాత్ముడు కర్మయోగి, ఇతరులకు వీరి ముగ్గురిమధ్య సామ్యం గోచరించకపోవచ్చు కాని వీరి ముగ్గురూ కూడ శ్రీ కృష్ణారావుగారికి గురుపాదులే. అదే ఆయన ప్రత్యేకత; అదే ఆయన విశిష్టత.

“ఏకం సత్ విప్రాఃబహుధా వదన్తి” అని విశ్వైక్యతను చాటుతున్న మహావాక్యాన్ని ఆయన జీవితానికి ధ్యేయంగా చేసుకొన్నాడు. పవిత్ర భారత వర్షమున తత్త్వజ్ఞులు, యోగులు, శిల్పులు, కవులు, కళాభిజ్ఞులు, ఏకశ్రేణికి చెందిన ద్రష్టలు - స్రష్టలు, వారి ఉపకరణములు భిన్నములు. కాని లక్ష్యము నందు ఒక్కటే సిద్ధి “అద్వైతసిద్ధి”, అని ఉద్ఘాటించాడు.

జాతి, మత, కుల, పక్ష, వర్గ, విభేదాలతో సంక్షుభితమైపోతున్న మన సంఘానికి ఈ సందేశాన్ని చాటడానికే శ్రీ ముట్నూరి కృష్ణారావు దాదాపు నలభై సంవత్సరాలపాటు "కృష్ణాపత్రిక"ను ఒక సాధనంగా వినియోగించారు. ఈ విభేదాలు సమసిపోవటానికి బదులుగా మరింత అధికమయి పోవటం ఆయనకు వృద్ధాప్యంలో ఎంతైనా మనోవైకల్యాన్ని కలిగించి వుండాలి. కాని నిరాశ చెందటం ఆయన ప్రవృత్తికే భిన్నం.

“ఏ వినీలాకాశగర్భమునుండి ఏ యుగారంభ సంరంభమున భారత పరిజ్ఞానామృతము అవనికి దిగివచ్చెనో, ఎవరు చెప్పగలరు? ఇయ్యది కాలమువలెనే అనంతము! ఆకసమువలెనే సర్వవ్యాప్తము”; “అని ఆయన ఒక సందర్భంలో వ్రాసివున్నాడు”. భారత విజ్ఞానము, సంస్కృతి అనంతమైనవని, సర్వవ్యాప్తమైనవని ఇంత ప్రగాఢంగా విశ్వసించినవ్యక్తి, తాత్కాలిక పరిస్థితులను చూచి, నిరుత్సాహం చెందటం అసంభవం కాదా?

పండిన పండువలే కృష్ణారావుగారు రాలిపోయి వుండవచ్చు. కాని ఇట్టి విశాల భావాలను, ఇంతటి సమగ్రదృష్టిని, ఇంతగా సమన్వయ పటిమను కలిగియున్న మహనీయుని కోల్పోవటం అఖిలాంధ్రదేశానికి యెంతైనా సంతాపకర విషయం. *(ఆంధ్రప్రభ 26-6-1945)*

## శ్రీ సురవరం ప్రతాపరెడ్డి

ఆయన ఉద్దండ పండితుడేకాదు; ఉద్గ్రంథకర్త. సాహిత్య పరిశీలకుడే కాదు; చక్కని విమర్శకుడు. విద్యా, విస్తృతి కోసం వేయివిధాల పనిచేసిన వాడేకాదు; విద్యుద్వేగంతో ప్రజలలో జాతీయతాభినివేశాన్ని ఊరించినవాడు.

తెలుగు చదువే కరువైన దినాలలో, తెలుగుబడులే ప్రభుత్వ దురాగ్రహానికి పాత్రమైన రోజులలో, నేను తెలుగువాడిని, నా సోదరులకు తెలుగు చదువుకొనే హక్కున్నదని జబ్బ చరచి గొప్పదనం-నిజాం నవాబు ఫర్మానాను నిలబడి యిదేమిటని తొలిసారి అడగగలిగిన గుండెదిటవు ఆయనకే దక్కినవి.

ఆయన ఆరంభించిన విద్యాప్రాచుర్య మహోద్యమం విరగబండి, నేటి జాతీయ ప్రగతి పథాలలో అనేక ప్రసూనాలకు మూలకారణమైనది.



ఆయన రచించిన ఆంధ్రుల సాంఘిక చరిత్ర, అడుగునబడిపోతున్న తెనుగుదనపు మేలిఛాయల నెన్నింటినో మీదికెత్తి చూపినది.

మెరుగు మాసిబోయిన తెలుగు మిసిమింత లెన్నిటి నాయన వెలికి దీయలేదు?

ఆయన తెలుగు నుడుల పుట్టుపూర్వోత్తరాలను, వంశవృక్షాలను, గోత్ర ప్రవరలను కూలంకషంగా గుర్తించి చెప్పిన పట్టులు మనలను చకితులను చేసి వేయగలవు.

తెలుగు పండుగల తీరు తియ్యములు, తెలుగునాటి ఆటపాటల అందచందాలు ఆయన అనితర గమ్యధోరణులలో వివరించినాడు.

ఆనాడేనాడో, అనుటకేకాదు - మనసులో నేడో - అనుకొనుటకు కూడా గుండెబలం దండిగా కావలసిన రోజులలో నిరంకుశ ప్రభుత్వ చర్యలను నిశితంగా విమర్శిస్తూ "గోల్కొండ పత్రిక"ను నిర్వహించిన సాహసి ఆయన.

నిన్న మొన్ననే ఆయన ఆంధ్రుల సాంఘిక చరిత్రను సంస్కరించి పునర్ముద్రించారు. మొన్నమొన్ననే శాసన సభకు నిలిచి, గెలిచి జన యోగక్షేమ చింతపరాయణతతో పనిచేయసాగినారు.
ఆయన రామాయణ విమర్శ వ్యాసాదులవంటి నెన్నిటినో గుదిగుచ్చి అచ్చువేయ సంకల్పించు కొన్నదికూడా మొన్నమొన్నగానే ఉన్నది.

ఇంతలో ఆంధ్రరాష్ట్ర ప్రాదుర్భావ భూమికను చూచి, విశాలాంధ్ర వ్యవస్థాపనకు నడుంకట్టి పనిచేయవలసిన మహాంధ్రనాయకుడు శ్రీ ప్రతాపరెడ్డి కన్నుమూశారు.
ఎంతలో ఎంత తీవ్రాఘాతం తెనుగు గుండెను దూసుకొని పోయినది.
ఆయన చరితార్థుడు. ఆయన ఆత్మజ్యోతికివే మా కైమోడ్పులు. *(ఆంధ్రప్రభ 28-8-1953)*

## శ్రీ దామోదరం సంజీవయ్య

ఆ పెద్ద కళ్ళు మరి వెలుగులను జిమ్మవా? ఆ నిండు పెదవులపై చిరునవ్వు మరి చిందులాడదా? ఆ తేనెసొనల కంఠం మాధుర్యాలను మరి కురిపించదా? ఆ గుండ్రని ముఖం జీవకళలతో మరి శోభించదా? ఆ మెత్తని మనసు అన్యుల కష్టాలను చూచి, కడగండ్లను చూచి, మరి కరగదా? ఆ ప్రేమార్ద్ర హృదయం మరి స్పందించదా?



ఇవి నమ్మరాని - నమ్మలేని - విషయాలు. అయినా, నమ్మక తప్పదు. రెండు దశాబ్దాలనుంచి ప్రజా నాయకుడుగా అందరి ప్రేమ గౌరవాలను పుష్కలంగా పొందుతున్న శ్రీ దామోదరం సంజీవయ్య మరి లేరు. నిన్న (ఆదివారం) రాత్రి మన మధ్య నుంచి ఆయన వెళ్ళిపోయారు. కొంతకాలంగా ఆయన ఆరోగ్యం సరిగా లేదని మనకు తెలుసు. ఆయన దుర్బలంగా వుంటున్నారని మనకు తెలుసు. కాని, ఇంతలో - ఇంత హఠాత్తుగా - ఆయన వెళ్ళిపోతారని మనం అనుకోలేదు.

ఆధునిక యుగం వయఃప్రమాణాల ప్రకారం ఆయన వయస్సు పెద్దది కాదు. ఈ మధ్యనే యాభై వెళ్ళగా, యాభైఒకటిలో ఆయన ప్రవేశించారు. మరి నాలుగు కాలాలపాటు ప్రజాసేవ చేయగలరనే, దేశాభ్యున్నతికి పాటుపడగలరనే మనం విశ్వసించాము. కాని, తలవని తలంపుగా మృత్యువు ఆయనను కబళించింది. ఆయనతోపాటుగా ఆయనపై మనం పెట్టుకున్న మన ఆశలను అది కబళించింది; ప్రజలకు, దేశానికి ఆయన చేయవలసివున్న మంచిని అది కబళించింది.
సగంలో ముగిసినా, ఆయన దృష్టి నుంచి ఆయనది నిండు బ్రతుకే. మద్రాసులో, కర్నూలులో, హైదరాబాదులో, న్యూఢిల్లీలో ఎన్నోసార్లు ఆయన మంత్రి; ఒకసారి ఆయన ముఖ్యమంత్రి; రెండుసార్లు కాంగ్రెస్ ప్రెసిడెంట్. మొదటిసారి ముఖ్యమంత్రి పదవికి ఎన్నికైనప్పుడు ముఖ్యమంత్రులందరిలో ఆయనే చిన్న; మొదటిసారి కాంగ్రెసు ప్రెసిడెంట్ పదవిని స్వీకరించినప్పుడు కాంగ్రెసు ప్రెసిడెంట్ లందరిలో ఆయనే తిరిగి చిన్న. అయినా, ప్రతి పదవిలో ఆయన రాణించారు; ప్రతి పదవిని ఆయన రాణింపుకు తెచ్చారు.

పదవికి, వినమ్రతకు పొత్తు తక్కువైన కాలంలో పదవితో ఆయన వినమ్రతను మిళితం చేశారు. పదవికి, నైతికపు విలువలకు సన్నిహితత్వం చెదురుగా తప్ప కానరాని కాలంలో పదవులకు నైతికపు సౌరభాన్ని ఆయన సమకూర్చారు.

పెద్ద పదవులలో వున్నప్పుడు ప్రల్లదించనట్టే ఆ పదవి లేనప్పుడు ఆయన క్రుంగిపోలేదుకూడా. పదవి పోతే బ్రతుకే పోయినట్టు ఆయన బాధపడలేదు; పార్టీని, దేశాన్ని, ప్రపంచాన్ని దుయ్యబట్టలేదు. పదవిలో వున్నప్పుడువలె లేనప్పుడు సయితం ఒకే విధమైన సంతోషం, సౌజన్యం, సహృదయత ఆయనలో కానవచ్చేవి.

ఎన్ని పదవులలో ఎంతకాలంపాటువున్నా, ఆయన నిర్ధనుడే. ముఖ్యమంత్రి పదవినుంచి తప్పుకొన్న తర్వాత ఆయనకు ఒక కారు కూడా లేదు. ఇళ్ళు, వాకిళ్ళు, తక్కిన ఆస్తిపాస్తులు మొదలే లేవు. ఆయన సంపాదించుకున్న ఆస్తిపాస్తులు ప్రజా ప్రేమ, ప్రజా గౌరవం మాత్రమే. అవి ఎన్నటికి తరగని ఆస్తిపాస్తులు; శాశ్వతంగా నిలిచే ఆస్తి పాస్తులు.



పుట్టింది, పెరిగింది విద్యాసంస్కృతులకు అవకాశం దాదాపు పూజ్యమైన సంఘంలో. అయినా విద్యా సంస్కృతులకు మారుపేరుగా ఆయన చెల్లారు. పుట్టింది, పెరిగింది యుగయుగాలుగా అవమానించబడుతున్న అణగద్రొక్క బడుతున్న సంఘంలో. అయినా, క్రోధవిద్వేషాలతో కాక, ప్రతీకారేచ్ఛతో కాక, క్షమతో, ప్రేమతో, అమృతంతో ఆయన తన హృదయాన్ని నింపుకున్నారు. ఏ దృష్టి నుంచి చూచినా ఆయన విశిష్ట వ్యక్తి. ఏ కోణంనుంచి పరిశీలించినా ఆయనది సార్థక జీవితం. ఏ వెలితి లేకుండానే ఆయన వెళ్లిపోయారు; వెలితి - పెద్ద వెలితి - పూడని వెలితి మిగిలింది మన రాష్ట్రానికే, మన దేశానికే, మనకే!

*(ఆంధ్రజ్యోతి 9-5-1972)*

## శ్రీ చెరుకువాడ నరసింహం పంతులు

“నిలబడితే ముందు నిలబడాలి" అనేవారు కొందరైతే, “ఎవరైనా ముందు నిలిస్తే, వారి వెన్ను కాయగల భారం మాది" అనేవారు మరికొందరు.

మొదటి వర్గంవారే ప్రజాదృష్టిని అధికంగా ఆకర్షిస్తారు; వారే ప్రజల మన్ననలను అధికంగా పొందుతారు. కాని, వెన్నుకాచే రెండవ వర్గంవారు లేకపోయిననాడు మొదటి వర్గంవారు అంత పొడగరులుగా కానరారు; అంతగా కంటదూరలేరుకూడా.

నాయకుడు కావడంగాని, నాయకునికి కుడిభుజం కావడంగాని వారి వారి ప్రవృత్తిని బట్టి; వారి వారి ప్రతిభను బట్టి నాయకత్వానికి తగు ప్రవృత్తి గాని, ప్రతిభ గాని లేనప్పుడు దానిని ఆశిస్తే, ఆశాభంగం తప్పదు; గౌరవభంగం తప్పదు. ఇట్టి విషాదానుభవాలు కొన్ని తటస్థించినపిదప, లోకాన్ని నిందించడమే పనిగా పెట్టుకునే “వెంగళప్ప”గా తయారు కావడం కూడా తప్పదు.

ఆంధ్ర ప్రముఖులలో పెక్కుమంది రాణించవలసినంతగా రాణించక పోవడానికి కారణం నాయకుని కుడిభుజం కావలసినవారు నాయకత్వాన్నే ఆశించడమేమో!

నాయకత్వానికి సమస్తార్హతలు గలవారు తమకు కుడిభుజాలుగా ఉపకరించగలవారిని తగురీతిని ప్రోత్సహించక పోవడం ఇందుకు మరొక కారణమేమో!

అయితే, ఈ వర్గద్వయంలో రెండవదానికే తాము సహజంగా చెందిన వారమని గుర్తించి, తదనుగుణంగా వర్తించిన వారొక్కరు లేకపోలేదు. వారు - శ్రీ చెరుకువాడ వేంకట నరసింహం పంతులు.

ముందుకు తోసుకు రాగోరితే, ముందే నిలవగల తాహతు ఆయనకు లేకపోలేదు. కాని, ముందునిలవడం తమ ప్రవృత్తికి విరుద్ధమని ఆయన విశ్వసించాడు. అందువల్ల శ్రీ కోపల్లె హనుమంతరావు, డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య, శ్రీ ముట్నూరి కృష్ణారావు ప్రభృతులకు కుడిభుజంగా నిలవడంతోనే శ్రీ నరసింహంగారు సంతృప్తి చెందారుగాని, తమపైనే లోకం దృష్టిని కేంద్రీకరింప జేసుకోవాలని ఎన్నడు కోరలేదు.

శ్రీ నరసింహంగారి ఈ సౌజన్యమే - ఈ వినమ్రతే - ఈ ఉదాత్తతే - ఆయన ఆంధ్రదేశానికి సర్వతోముఖంగా చేసిన అపారసేవకు పొందదగినంతటి మన్నన పొందక పోవడానికి కారణమైతే, ఆంధ్రజాతి హ్రస్వదృష్టికి విచారించక తప్పదు.

ప్రతి నూతనభావాన్ని సులభంగా స్వీకరించడం, ప్రతి పురోగామి శక్తికి హృదయపూర్వకంగా స్వాగతమివ్వడం - ఇది శ్రీ నరసింహం విశిష్టత.
బ్రహ్మసమాజం పురోగామిశక్తిగానున్నపుడు ఆయన బ్రాహ్మసమాజికుడు.

గాంధీయిజం పురోగామిశక్తిగా పరిణమించినంతనే ఆయన గాంధీ భక్తుడు. ఆయన ప్రతి పురోగామి శక్తికి "బరామిటర్"ను పోలిన వారని చెప్పడం అత్యుక్తికాదు.

ఒక కొత్త శక్తి తమను కదిలించినప్పుడు, ఒక కొత్త సందేశం తాము విన్నప్పుడు, దాన్ని గురించి లోకానికి తెలియజెప్పకపోతే, ఆయనకు నిద్రపట్టదు. స్వభావసిద్ధంగా ఆయన ఉపాధ్యాయుడు. ఆయన కొంత కాలం ఉపాధ్యాయవృత్తిని అవలంబించాడుకూడా.

ఈ ఉపాధ్యాయ ప్రవృత్తే శ్రీ నరసింహం పంతులుగారిని జాతీయ ప్రచారకునిగా చేసింది. ఆంధ్ర ప్రజా సామాన్యానికి రాజకీయ పరిజ్ఞానభిక్ష పెట్టినవారు ఆయనే.

వక్తగా ఆంధ్రదేశంలో ఆయనకు ఆయనే సాటి. ఆయన చేసినన్ని ఉపన్యాసాలను మరెవ్వరు చేయలేదేమో! ఆయన తిరిగినన్ని గ్రామాలను మరెవ్వరు తిరగలేదేమో! ఒకవేళ ఆయనను మించి పర్యటన చేసినవారున్నా, ప్రజాసామాన్యాన్ని అనుపమ వక్తృత్వ ప్రౌఢిమతో ఆయనకంటె మిన్నగా ఆకర్షించినవారు లేరు.

*(ఆంధ్రప్రభ 17-10-1948)*

వివరణ :
శ్రీ కోపల్లె హనుమంతరావు, బందరు జాతీయ కళాశాల స్థాపకులలో ఒకరు. జాతీయవాది.
శ్రీ ముట్నూరి కృష్ణరావు. కృష్ణా పత్రిక సంపాదకులు. జాతీయవాది.

## శ్రీ త్యాగరాజు



మతం మానవులను విడదీస్తుంది. మరణానంతరం వివిధమతస్థులు వెళ్లేది విభిన్న స్వర్గాలకో, నరకాలకో.

ఇదే విధంగా రాజకీయాలు సయితం మానవులమధ్య కృత్రిమ విభేదాలను కల్పిస్తూవుంటాయి. మతవిద్వేషాలవలె, రాజకీయాలు సయితం అనేక సందర్భాలలో సంఘర్షణలకు, రక్తపాతానికి దారితీయడం కద్దు.

కాగా, మానవులను సాహిత్యం దగ్గరికి తెస్తుంది, సంగీతం వారిని దగ్గరికి తెస్తుంది, చిత్రకళ వారిని దగ్గరికి తెస్తుంది, ఇతర కళలు వారిని దగ్గరికి తెస్తాయి. దేశ కాలాలతో నిమిత్తం లేకుండా, మానవులను ఏకంచేయగల మహత్తరశక్తి వాటి కున్నది.

కాళిదాసు భారతదేశంలో పుట్టి వుండవచ్చు, సంస్కృతభాషలో వ్రాసి వుండవచ్చు. అయినా ఆయన మన కవి మాత్రమే కాదు, ప్రపంచానికే కవి. ఇదే విధంగా షేక్స్పియర్ ఇంగ్లండులో పుట్టివుండవచ్చు; అయినా ఆయన ఇంగ్లీషువారి కవి మాత్రమే కాదు; మానవాళికే కవి.

మానవులను దగ్గరికి తీయడంలో సాహిత్యంకంటే కూడా అమోఘమైనట్టిది సంగీతం. దాని రసాస్వాదనకు భాషాజ్ఞానంతో పని లేదు.

సంగీతం వివిధ భాషలవారిని, విభిన్న సంస్కృతులవారిని ఎంత దగ్గరికి తీసుకురాగలదో ఇతర వాగ్గేయకారులవలె శ్రీ త్యాగరాజు కూడా నిరూపించాడు. ఆయన తన కీర్తనలను రచించింది తెలుగులో. అయినా, తెలుగువారికంటే మిన్నగా తమిళులు ఆయనపట్ల ప్రేమాభిమానాలను చూపుతున్నారు. భక్తిగౌరవాలను ప్రదర్శిస్తున్నారు. ఇదివరలో కాకపోయినా, కొంతకాలంగా భారతదేశం మొత్తంమీదనే ఆయనపట్ల శ్రద్ధాసక్తులు ప్రస్ఫుటమౌతున్నాయి.

ఇప్పుడిప్పుడే పాశ్చాత్య జాతులవారు భారతదేశానికి చెందిన హిందూస్తానీ, కర్ణాటక సంగీత రీతులలోని మాధుర్యాన్ని గ్రహించగలుగుతున్నారు. కాబట్టి మరికొంతకాలానికి బాక్ వలె, మోజార్ట్ వలె, బిథోవెన్ వలె, హాండెల్ వలె, షాపాన్ వలె త్యాగరాజు కూడా ప్రపంచ వాగ్గేయకారుడుగా ఖ్యాతి గాంచవచ్చు.

నూరేళ్లనాడు త్యాగరాజు శతజయంతి జరిగిందో, లేదో మనకు స్పష్టంగా తెలియదు. కాని, ప్రస్తుతం ఆయన ద్విశతజయంతి ఆయన జన్మస్థానంలోనే కాక, దేశం మొత్తంమీదనే ఘనంగా జరుగుతున్నది. మరొక నూరేళ్లనాటికి ఆయన త్రిశతజయంతి దేశదేశాలలో జరుగుతుందని విశ్వసించవచ్చు.



పోనుపోను త్యాగరాజు కీర్తి పెరగగలదని విశ్వసించడానికి ఆయనది రాజకీయరంగంలో సముపార్జించుకొన్న విఖ్యాతికాదు. రాజకీయరంగంలో ఎంత త్వరగా పేరు ప్రతిష్ఠలు లభిస్తాయో, అంతత్వరగా అవి సమసిపోవడం కూడా కద్దు. గ్లాడ్‌స్టన్ విషయమై ఇంచుమించు అర్ధశతాబ్ది క్రితం వ్రాస్తూ, రాజకీయ విఖ్యాతి అస్థిరమైనది కాబట్టి, మరికొంతకాలం పోతే “గ్లాడ్‌ఆన్” అనే పేరుతో చెల్లే తోలుసంచి (డాక్టర్లు వాడే సంచి) జ్ఞాపకం రావచ్చునని ఎ. జి. గార్డెనర్ అన్నాడు. ఈనాడు దాదాపుగా ఇంతే జరుగుతున్నది.

త్యాగరాజ ద్విశతజయంతి మహోత్సవాల సందర్భంలో సంగీతవిద్యలో ఆయన అనుపమ ప్రజ్ఞావిశేషాలకు కాక, ఆయన మతవిశ్వాసాలకు హిందూ మతవిశ్వాసాలకు ప్రాధాన్య మివ్వడం ఆయనను ఒక మహావాగ్గేయకారుడుగా ప్రపంచానికి చాటి చెప్పినప్పుడు, మతవిభేదాలతో నిమిత్తంలేకుండా మొత్తం మానవాళి ఆయనను గౌరవిస్తుంది. సంస్తవిస్తుంది.

ఈ మధ్యనే త్యాగరాజ జీవితచరిత్రను ఇంగ్లీషులో వ్రాస్తూ, ప్రొఫెసర్ సాంబమూర్తి త్యాగరాజు మహిమలను గురించిన అనేక కట్టుకథలను అనవసరంగా దానిలో చేర్చడంవల్ల త్యాగరాజు.

## శ్రీ అన్నమాచార్యుడు



కీర్తిని ఆయన పెంచినట్టు చెప్పలేము. ఆ గ్రంథాన్ని చదివే విదేశీయులు దానిలోని కట్టుకథలవలె గానకళలో త్యాగరాజు ప్రజ్ఞాప్రాభవాలు సయితం కల్లబొల్లులని అనుకొనగల ప్రమాదంవున్నది. మన సాహిత్యవేత్తలను, సంగీతవిద్వాంసులను, శిల్పులను, చిత్రకారులను గౌరవించుకొనడంలో మనం కొంత విజ్ఞతను ప్రదర్శించాలి. అది కొరవడిన గౌరవం నిజమైన గౌరవం కాలేదు ; అది అగౌరవమైనా కావచ్చు.

నన్నయ, తిక్కన, పోతన ఆయనను మించిన కవిశేఖరులు. క్షేత్రయ్య, త్యాగయ్య నిస్సందేహంగా ఆయనకంటే మేటి వాగ్గేయకారులు. అయితే, కవిశేఖరత్వంతో పాటు, వాగ్గేయకారకత్వాన్ని సమ్మిళితం చేయడం అన్నమాచార్యుని విశిష్టత.

సాహిత్య, సంగీతరంగాలు విభిన్నమైనవైనప్పటికీ వాటికిగల సన్నిహితత్వం ఇంతింతకాదు.

మహాకవి రచనలో - ఆయన మన వాల్మీకి కావచ్చు : గ్రీకుల హోమర్ కావచ్చు; ఇటాలియన్ల డాంటే కావచ్చు; బ్రిటీష్ వారి ఛాసర్ కావచ్చు ; జర్మనుల గెట్ కావచ్చు. ఏ దేశానికి చెందినా ఏ కాలానికి చెందినా ఏ కవి సత్తముడైనా కావచ్చు ఆయన రచనలలో గానలహరి ప్రవహిస్తూనే వుంటుంది. సంగీతశాస్త్ర పరిజ్ఞానం ఆయనకు లేక పోవచ్చు. శ్రవణపేయంగా తన పద్యాలను చదవడమైనా ఆయనకు చేతకాకపోవచ్చు. అయినా పాట, ఊపు, దాని విరుపు ఆయన కూర్పులో కనపడితీరుతుంది; పాటమెత్తదనం, దాని తియ్యదనం ఆయన కావ్యాలలో తొణికిసలాడి తీరుతుంది.



ఇది కేవలం పద్యకవుల విషయంలో మాత్రమే సత్యంకాదు. అన్యకవుల విషయంలో కూడా ఇది నిజమే.

ఉదాహరణకు కాళిదాసు “అభిజ్ఞాన శాకుంతలమ్” కాని, షేక్స్పియర్ “హామ్లెట్” కాని ఆదినుంచి అంతం వరకు కేవలమొక గానలహరి మాత్రమే కావా? పోని, వీరు నాటకకర్తలే కాక, కవులు సయితమని భావిస్తే టర్జనీవ్, టాలిస్టయ్, డికిన్స్, హర్డీ మొదలైన “పచ్చి" వచన రచయితల నవలలైనా కేవలం సంగీత ప్రవాహాలు కావా ?
అపశ్రుతి లేనిది సంగీతం; అపశ్రుతి లేనిదే సాహిత్యం. అందువల్ల ప్రతి ఉత్తమ కావ్యంలో - అది పురాతనమైనా

'ప్రబంధమైనా, నాటకమైనా - సంగీతం అంతర్వాహినిగా ప్రవహించడం తథ్యం.

ఇదే విధంగా ఉత్తమ సంగీతంలో సాహిత్యం విధిగా అంతర్వాహినె.

ఉదాహరణకు భాషపై తులసీదాసుకు గల అధికారం కబీరుకు లేకపోవచ్చు; తిక్కనకు గల అధికారం త్యాగయ్యకు లేకపోవచ్చు. అయినా కబీర్ గీతాలలోవలె త్యాగయ్య కీర్తనలలో మహాకావ్య సౌరభం కానరాదనే వారుండగలరా ?

సాహిత్య, సంగీతాలకు గల ఈ మహాసన్నిహితత్వాన్ని మహోత్కృష్టంగా నిరూపించినవాడు అన్నమాచార్యుడు.

ఇంతేకాదు, సాహిత్యంలోవలె సంగీతంలోకూడా ఆయన ఎన్నెన్నో కొత్త పుంతలను త్రొక్కాడు, కొత్తపోకడలను పోయాడు; కొత్తవిజయాలను సాధించాడు.

ఆంధ్రావనికి ఆది ప్రజాకవి అన్నమాచార్యుడే.

అవి రామానుజ సిద్ధాంతాలు అప్పుడప్పుడే ఆంధ్రదేశానికి వ్యాపిస్తున్న రోజులు. ఆ విశిష్టాద్వైత సిద్ధాంతాలను ఆంధ్రప్రజానీకానికి ప్రజాభాషలో అందజేసిన ఘనత అన్నమాచార్యునిదే.

పైగా, ఆ గంభీర వేదాంత రహస్యాలను సామాన్య ప్రజలకు సయితం సుబోధకంగాగల శైలిలోనే వ్యాప్తిచేశాడు కూడా.

మన సిద్ధాంతాల ప్రచారంలోనే కాకుండా, పదకవిత్వంలో కూడా ఆయన వ్యావహారిక భాషనే వినియోగించాడు. “వచ్చీని” “పొయ్యీని” “ఉండితే” “వెళ్లితే” “రావయ్య” “పోవయ్యా” మొదలైన పదజాలాన్ని కేవలం వాటి ఉచ్చారణా సౌలభ్యాన్ని ఉపయోగించుకోడానికి ఆయన వెనుకాడలేదు.

ఇక సంగీతరంగానికి సంబంధించినంతవరకు, ఆయన చేసిన ప్రత్యేక కృషి కూడా అపూర్వమైనదే.

అప్పటివరకు కేవలం దక్షిణాపథంలోనే భారతదేశం మొత్తం పైనే "పల్లవి, చరణం" పద్ధతిపై కీర్తనలుండేవి కావు. ఈ కొత్త పద్ధతిని ప్రవేశపెట్టడమే కాకుండా వాటికి అన్నమాచార్యులు లక్షణాలను కూడా నిర్వచించారు.

మహాకవి, మహాగాయకుడు తన కాలాన్ని దాటి నడవడం ఆశ్చర్యం కాదు. అందువల్లనే అన్నమాచార్యుడు వైష్ణవమతం నుంచి వర్ణవిభేదాలను నిర్మూలించడానికి ప్రత్యేక కృషి చేశాడు. ఆయన సంస్మరణ దినోత్సవం తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యాన నేడు ప్రారంభం కావడం ఎంత సమంజసమో, అంత సంతోషప్రదం. *(ఆంధ్రప్రభ 3-4-1949)*

వివరణ : టర్జనీవ్, టాలస్టాయ్ - రష్యన్ నవలా రచయితలు, డికిన్స్, హార్డీ - ఆంగ్ల నవలా రచయితలు.

## స్థానం వారు

మొన్న తెనాలిలో 69 వ ఏట కాలధర్మం చెందిన స్థానంవారు తెలుగు నాటక రంగంలో అద్వితీయమైన స్థానం సంపాదించారు.

ఇదివరలో నాటకాలలో స్త్రీపాత్రలను ధరించడానికి స్త్రీలు ఎంత మాత్రం ఇచ్చగించేవారు. కాదు. అలాంటి పరిస్థితిలో శ్రీ స్థానం నరసింహారావు, శ్రీ ఉప్పులూరి సంజీవరావు, శ్రీ ముప్పిడి జగ్గరాజు మొదలైనవారు స్త్రీ పాత్రధారణకు ముందుకు వచ్చి, తెలుగు నాటక రంగం పురోభివృద్ధికి దోహదంచేశారు. వీరిలో అగ్రస్థానం నిస్సందేహంగా స్థానంవారిదే.

ఆ నడక, ఆ కులుకు, ఆ పలుకు, ఆ వయ్యారం, ఆ హొయలు స్త్రీలు కూడా అసూయపడ తగినంతటి స్త్రీత్వం ఆయన నటనలో తొలుకాడేది. "శ్రీకృష్ణ తులాభారం"లో సత్యభామగా ఆయన ప్రదర్శించిన హావభావాలు, "మంత్రినై మొగలు సామ్రాజ్యంబు నీ కిపుడే అర్పింతుదాన" అంటూ రోషనార"లో రోషనారగా ఆయన ప్రదర్శించిన మధురప్రేమ, "సారంగధర"లో చిత్రాంగిగా ఆయన చూపిన చిద్విలాసాలు ప్రేక్షకుల మనోవీథులలో ఇప్పటికీ మెదలడం మరపురాని ఆయన నటనా ప్రతిభకు మచ్చుతునకలు. నటుడుగా ఆయన పొందని గౌరవం లేదు. తెలుగునాట "పద్మశ్రీ" గౌరవం పొందిన తొలి నటుడు ఆయనే. మరి ఎన్నో బిరుదులు, సన్మానాలు పొందారు. ఆంధ్రనాటక కళా ప్రాభవాన్ని ఆయన రాష్ట్రేతర ప్రాంతాలకు కూడా వ్యాప్తంచేశారు. ఆంధ్ర నాటక రంగానికి ఇప్పటి రూపురేఖలు దిద్దిన వారిలో ఆయన ప్రముఖులు.

*(ఆంధ్రజ్యోతి 22-2-1971)*

## ఉన్నవ దంపతులు

### (శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ, శ్రీమతి లక్ష్మీబాయమ్మ)

జాతీయ సంస్కృతి అంతరిస్తేనేఅన్యజాతుల విజేతలకు ఈ విషయం చక్కగా తెలుసు. అంచేతనే వారి తొలి యత్నం జాతీయ సంస్కృతి వినాశనానికే జాతీయ స్వాతంత్రేచ్ఛ అంతరించడం.



మన దేశాన్ని జయించిన బ్రిటీష్ వారు మన జాతీయ సంస్కృతి వినాశనానికి చేసిన యత్నంలో ఒక ముఖ్యభాగం - విజాతీయ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టడం.

మన ఆచార వ్యవహారాలకు, మన సంప్రదాయాలకు, మన దేశ భాషలకు, మన సారస్వతానికి, మన సంస్కృతికి - ఒక మాటలో - మన జాతీయ జీవితానికి - మనలను వీలైనంత దూరం చేయడమే ఆ విద్యావిధాన పరమ లక్ష్యం.
ఐతే, ఈ లక్ష్యసాధనలో బ్రిటీష్వారు పూర్తిగా కృతకృత్యులు కాలేకపోయారు.



ఇందుకు మొదటి కారణం అన్ని విధాల మన దేశాన్ని దోచుకొనవలెననే దురాశ బలీయం కావడం వల్ల నూటికి పదిమందిలో మాత్రమే తమ విద్యావిధానాన్ని ప్రచారం చేయడం.

ఇక రెండవ కారణం : బ్రిటీష్ వారి విద్యావిధానం భారత నారీ లోకంలో నూటికి ఒకరికైనా వ్యాపించక పోవడం.

ప్రతి కీడులో కొంతమేలు కూడా యిమిడి ఉంటుందని పెద్దలు చెప్పేమాట. నిరక్షరాస్యత బ్రిటీష్ పరిపాలనా కాలంలో మనకొక పెద్ద కీడు. కాని, ఆ కీడులోగల మేలు, - నిరక్షరాస్యత

ఐతే, మన జాతీయ సంస్కృతి కొంతవరకు మిగలడానికి బ్రిటీష్ వారి ప్రయత్న లోపం ఒక్కటే కారణం కాదు; మన ప్రయత్నం కూడా చాలావరకు కారణమే. మనలో చావకుండా మిగిలిన జాతీయ స్వాతంత్రేచ్ఛ వహించిన ఒక రూపం, జాతీయ విద్యా విధాన ప్రచారం. ఈ జాతీయ విధాన ప్రచారంలో ఆంధ్రరాష్ట్రం మొత్తంపై కోపల్లె హనుమంతరావు తర్వాత ప్రముఖంగా ఎన్నదగినవారు ఉన్నవ లక్ష్మీనారాయణ దంపతులే.

ఎన్ని సమయాలలో ఎందరు భారతదేశాన్ని జయించినా, ఎంత కాలం వారు దాన్ని పరిపాలించినా, భారతీయ సంస్కృతి విలుప్తమైపోకుండా కాపాడింది భారత నారి మాత్రమేనని గుర్తించి, ఆమెకు జాతీయవిద్యను గరపడానికి ప్రయత్నించడం ఉన్నవ దంపతుల కృషిలో ఒక ప్రత్యేకత. వారు స్థాపించిన శారదా నికేతనం ఆంధ్ర రాష్ట్రానికే కాకుండా, అఖిల భారతదేశానికి ప్రతిష్ఠ తేగలిగినట్టిది. ఆ సంస్థ ఈనాడు రజతోత్సవాన్ని జరుపుకొనడం అందరికీ ఎంతైనా సంతోషకారణం. అయితే, ఉన్నవ దంపతులు పెద్దవారై పోయారు. ఇప్పటికే వారిని ఈ విద్యాలయ నిర్వహణ బాధ్యతను వహించమనడం భావ్యం కాదు.

పైగా, శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణపై ఇంకను ఈ భారాన్ని పెట్టడం వల్ల ఆంధ్ర సారస్వతం - ఆంధ్రజాతి - అపార నష్టాన్ని పొందుతున్నది.

"మాలపల్లి"ని పోలిన ఉత్తమోత్తమ నవలను రచించిన శ్రీ లక్ష్మీనారాయణ ఆ తర్వాత అంతటి ఉద్గ్రంథాన్ని రచించలేకపోవడానికి అందుకు తగు విరామం శారదానికేతన నిర్వహణ గురుతర బాధ్యత వల్ల వారికి లభించకపోవడమే ప్రధాన కారణం.

తిక్కన భారతంపై వారు ఏనాడో ప్రారంభించిన విమర్శ ఈనాటికీ పూర్తికాలేదు. ఆయనకు ఒక్క ఆరు నెలల విరామమిచ్చివుంటే, ఈ విమర్శ ఏనాడో మనకు దక్కి ఉండేది.
మన సారస్వతం నేడు పొందుతున్న నష్టాన్ని ఆపవలెనన్నా, ఉన్నవ దంపతుల సేవకు మన కృతజ్ఞత తెలుపవలె నన్నా, ఇకనైనా, వారికి విశ్రాంతిని కూర్చాలి. ఐతే, వారు విశ్రాంతి గైకొనడానికి సమ్మతించడం తాము కన్నబిడ్డ కంటే ప్రాణప్రదంగా భావించే శారదా నికేతనం నిర్విఘ్నంగా, జేగీయమానంగా కొనసాగగలదనే ధైర్యం చిక్కితేనే. ఇది జరగాలంటే, శారదా నికేతనానికి కొన్ని లక్షల శాశ్వతనిధి సమకూడాలి. ఈ నిధిని కూర్చడం ప్రతి జాతీయ వాది ధర్మం. ఇంతేకాదు. ఈ విషయంలో మన రాష్ట్రీయ ప్రభుత్వం కూడా తగు శ్రద్ధ వహించాలి.

శారదా నికేతనం : గుంటూరు, బ్రాడీపేటలోని మహిళా విద్యాలయం.

## కులపతి : శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు




తెలుగు పత్రికా రచయితలకు కులపతి శ్రీ నాగేశ్వరరావు పంతులు. ఈనాడు జర్నలిజం ఇంత అభివృద్ధి చెందిందంటే ముఖ్యంగా తెలుగు దినపత్రికలు, అభివృద్ధిలోకి వచ్చాయంటే, అదంతా ఆయన చలవే. 1914లో ఆయన మొదట తెలుగు దిన పత్రిక స్థాపించినప్పుడు ఆయన వద్ద గల సాధన సంపత్తి బహుస్వల్పం. పత్రికలో పనిచేయటానికని, అనుభవజ్ఞులైన ప్రతిభావంతులు లేరు. ప్రజలైననూ చేయూతనిచ్చి, తోడ్పడేటట్టు ఉన్నారంటే అదీలేదు.

అయితే, ఈ చిక్కులేమీ ఆయనకు అడ్డు రాలేకపోయినవి. అచంచలమయిన ఆత్మ విశ్వాసం ఆయనది. ప్రజాసేవాసక్తితో, ఆయనలోని రక్తం బుసబుస పొంగింది. విజ్ఞానధనాన్ని పంచిపెట్టాలనే ఉత్సాహం, సరస్వతీ పరిమళాన్ని గుబాళింపచేయాలనే ఉత్సాహం ఆయనలో క్రేళ్ళురికింది.



పత్రికా ప్రకటనలో కూడా ఆయన ఎల్లప్పుడూ తెలుగు వార్తలకే ప్రాముఖ్యమిచ్చేవాడు. తెలుగు పట్నాల్లో జరిగే సంఘటనలు, తెలుగుదేశంలో సాగే ఉద్యమాలు, తెలుగు అభ్యున్నతికి సాగే కృషి, విరివిగా ప్రచారంచేయాలని ఆయన కాంక్షించేవాడు. తెలుగు ప్రజల దైనందిన జీవితం ప్రతిఫలించటానికి పత్రిక దర్పణం గావాలని ఆరాటపడేవారు. వార్తాపత్రికలద్వారా, ప్రజాసేవ చెయ్యడం తేలిక కాలేదు. అంతకంటే క్లిష్టమైన కార్యం మరొకటున్నది. నాగేశ్వరరావుగారు పత్రిక నెలకొల్పటంతో పాటు పత్రికా పఠనాన్నికూడా, ప్రజలకు అలవాటు చెయ్యవలసి వచ్చింది. మరొకరు అయినట్టయితే, ఆ పరిస్థితులలో జావజావ అయిపోయేవారే!

పత్రికా పఠనాన్ని, ప్రజలచే అభ్యసింపజేసే నిమిత్తం ఆంధ్రదేశంలోని ప్రతి గ్రంథాలయానికి, ప్రతి పఠన మందిరానికి, రెండు దశాబ్దాలపాటు, ఆయన ఉచితంగా పత్రికను పంపవలసి వచ్చింది. మరొకప్రక్క తన ఆదర్శాల ప్రకారం పత్రికా నిర్వహణ చెయ్యటానికి, అవసరమైన ప్రతిభావంతులకొరకు అన్వేషించవలసివచ్చింది. నిజానికి, పత్రికలకు వ్యాసాలు వ్రాసేవారికి, పారితోషికమిచ్చే ఆచారాన్ని మొదలుపెట్టింది శ్రీ నాగేశ్వరావుగారే! ఇందువల్ల తెలుగు పత్రికా రచన దేశసేవగా మాత్రమేగాక, గౌరవనీయమైన వృత్తిగా పరిణమించింది.

ఆ రోజులలో తెలుగుదేశంలో, పత్రికానిర్వహణ కొత్తగనుక, అన్ని హంగులను శ్రీ నాగేశ్వర రావుగారే అమర్చు కోవలసి వచ్చింది. అప్పటికి బ్లాకులను తయారుచేయుటలో మనవారికి శిక్షణలేదు. పత్రిక సర్వాంగ సుందరంగా ఉండాలంటే నిర్దుష్టమైన వార్తా ప్రకటన సరిపోదు. వివిధ చిత్రాలతో ముద్రించినప్పుడే, పత్రికా సౌందర్యం ఇనుమడిస్తుంది. పెద్దలతోపాటు పిన్నలను విద్యాధికులతోపాటు, నిరక్షరాస్యులనుకూడా; సమానంగా ఆకర్షిస్తాయి - పత్రికలోని చిత్రాలు ఈ దృష్టితోనే పంతులుగారు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి, ఎక్కడికెక్కడికో పంపించి చక్కని బ్లాకులను చేయించి, తెప్పించేవారు. పత్రికలను నేత్రోత్సవం చేసేటట్టుగా ప్రకటించాలని ఆయన సంకల్పం. *(ఆంధ్రప్రభ 14-12-1949)*

## ఆంధ్రకవి : శ్రీ దివాకర్ల తిరుపతిశాస్త్రి

నిండు బ్రతుకు, పండు వయస్సు, తుదివరకు తరుగని ప్రతిభ, కడవరకు పెరిగిన కీర్తి. చీకూచింత లేకుండానే శతావధాని శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి కన్నుమూసి ఉండాలి.

ఈ లోకాన్ని విడిచిపోవడంతో చిరకాలంనాడు కోల్పోయిన ప్రియమిత్రుని - బహిఃప్రాణాన్ని - శ్రీ తిరుపతి శాస్త్రిని తిరిగి కలుసుకొనబోతున్నాననే సంతృప్తి సైతం ఆయనకు కలిగిందేమో!


"ఒకనాడు తిరుపతి వెంకటకవులను క్రూరంగా వేరుచేసిన నీవే తిరిగి నీ చేతులతోనే వారిని జంటగా చేస్తున్నావు. మావలె నీవు కూడా నీ ప్రకృతి ధర్మానికి లొంగవలసినదానివే" అని ఆయన మృత్యు దేవతతో ఛలోక్తి ఆడినారేమో కూడా!

కాని, ఆయనను ఏండ్లు నిండినవానినిగా - ముక్కాలు ముదుసలిగా ఊహించుకొనడమైనా మనకు కష్టమే. శరీరం శుష్కించిపోయినా, నడయాడగలదార్ఢ్యం సైతం తప్పినా, ఆయన ముఖం జీవకాంతులతో విలసిల్లుతుండేది; ఆయన వాక్కు జీవచ్ఛక్తితో చిందులాడుతుండేది. వృద్ధుడనని అంగీకరించడానికి ఆయన నిరాకరించేవాడు కూడా. సప్తతి జన్మదినోత్సవం రాజమహేంద్రవరంలో జరుగుచున్న సందర్భంలో "అరవైదాటిన తర్వాత చిన్నతనం తిరిగి ప్రారంభమౌతుంది. డెబ్బైలో అరవైపోతే నేనిప్పుడు పదేళ్ళ బాలాకుమారుణ్ణి" అని శ్రీ వేంకట శాస్త్రి చమత్కరించారట. నిజమే! జరాభారంతో క్రుంగింది ఆయన శరీరమే. మానసికపాటవం కాదు. అందువల్ల ఆయన వాక్కులో నిత్యయౌవ్వనమే నవనవోన్మేషమే కానవచ్చేది.

శ్రీ వేంకటశాస్త్రి కృతులు - తిరుపతివేంకట కవుల కృతులనడం ఎక్కువ సమంజసంచిరస్థాయిగా నిలుస్తాయోలేదో అనే ప్రశ్న ప్రధానమైంది కాదు. వాటిపట్ల ఇప్పటికే కొంత శ్రద్ధాసక్తులు తగ్గినవని కొందరనవచ్చు. 1905-1906 ప్రాంతాలలో ప్రతి కాలేజి హాస్టల్ - ముఖ్యంగా అప్పుడు తాము బసచేస్తున్న విక్టోరియా హాస్టల్ - 'శ్రవణానందం" పద్యాలతో మారు మ్రోగిపోతుండేదని శ్రీ విస్సా అప్పారావు ఈ మధ్య ఒకచోట రాశారు. "ముంగాల సింగార ముంగార మేలు బంగారురంగారు లంగా ధరించి" "ధనమా పోవును, మానమా చెడును, నిందా నెత్తిపై కెక్కు. మనమా! వద్దిక నాదు మాట వినుమా! మర్యాద కాపాడుమా!" అనే పద్యాలు ప్రతి విద్యార్థి నోట అప్పటిలో వినవస్తుండేవట. ఈనాడు వున్నా, ఇవి ఇంతగా వినబడుతున్నవా అని వారు ప్రశ్నించవచ్చు.

శ్రీ వేంకటశాస్త్రి కృతులకు ప్రచారం ఒకవేళ తగ్గినా, ఆయన ఆంధ్రసాహితీ రంగంలో ఉజ్జీవింపజేసిన ప్రగతి శక్తులు శతముఖాలుగా - సహస్రముఖాలుగా - ఈనాటికీ దేశాన్ని అలుముకొంటూ ఉన్నాయి; ఏనాటికీ అలుముకొంటూనే ఉంటాయి. ఆయనను ఏవో కొన్ని కృతులకు కర్తగా సంభావించుకొనడం, ఆయనకు అపచారాన్ని చెయ్యడమే. ఆయన ఒక మహోద్యమానికి గురుపాదుడు. అందువల్లనే ఆయనవద్ద పాఠాలు చదువుకొన్నవారికే కాక, ఆంధ్ర కవితాలోకానికే ఆయన గురుదేవుడు. ఒక జాతి గొంతునే ఆయన విచ్చుకొనేటట్టు చేశారు. కవిత ప్రజలసొత్తు అని నిరూపించారు. ఆయన ప్రారంభించిన సాహిత్య విప్లవం కలకాలం నిలవగలదు. అందువల్ల ఆయన నేడు మనలను వీడిపోయినా అమరజీవే. ఆ ,మహాకవికి మా భక్త్యంజలి; ఆ అమర కవికి మా శ్రద్ధాంజలి. *(ఆంధ్రప్రభ 16-2-1950)*

## అన్నగారు : శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య



"బ్రహ్మయ్యగారు యువకులలో యువకుడు" అంటూ 1937లో నంద్యాలలో జరిగిన ఆంధ్రరాష్ట్ర రాజకీయ మహాసభకు అధ్యక్షుడుగా ఆయన ఎన్నికైన సందర్భంలో "కృష్ణాపత్రిక" తన సంపాదకీయాన్ని ప్రారంభించింది. ఆ గొట్టిపాటి బ్రహ్మయ్యగారే నేడు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసుకు అధ్యక్షుడుగా ఎన్నికైన సందర్భంలో "పెద్దలలో పెద్ద" అంటూ "ఆంధ్రజ్యోతి" తన ఈ సంపాదకీయ వ్యాసాన్ని ప్రారంభించడం సముచితం. నాటికీ, నేటికీ మధ్య వయస్సులోనే కాక, పదవిలోనే కాక, అంతస్తులో కూడా శ్రీ బ్రహ్మయ్య పెరిగాడు. ఆంధ్రజాతికే “అన్న”గా ఈనాడు ఆయన మన్నన లందుతున్నాడు.

శ్రీ బ్రహ్మయ్య విగ్రహంవలె ఆయన వ్యక్తిత్వం కూడా నిండైనది. ఆయన నడకలోవలె నడతలో కూడా హుందాతనం కనబడుతుంది. ఏ విధమైన వెలితి లేనిది ఆయన జీవితం. అందువల్లనే ఆయన పెదవులపై తరచు చిరునవ్వు వెన్నెలలు చిందులాడతాయి. ఆయన చిరునవ్వుకంటే కూడా అలరించగలిగినట్టిది ఆయన నవ్వు. తానొక ఛలోక్తిని విసిరినప్పుడు, లేదా ఇతరులు తనపై ఒక ఛలోక్తి విసిరినప్పుడు, ఆయన నవ్వితే నవరత్నా లొలికినట్టుగానే ఉంటుంది. అప్పుడు ఆయన కళ్ళు, ఆయన ముఖం మాత్రమే కాక, ఆయన ఆజానుబాహు విగ్రహమే ఆ నవ్వులో కరిగిపోతున్నట్టుగా అనిపిస్తుంది. నవ్వి, నవ్వించగల అమృతహృదయుడైనందునే ఆయన అందరి ప్రేమాభిమానాలకు పాత్రుడు కాగలుగుతున్నాడు, ఆంధ్రజాతికే అన్నగా చెల్లుతున్నాడు.

ఆ ఏ సాహిత్యరంగంలోనో, కళారంగంలోనో కృషి చేసేవారు ఈ విధంగా సర్వజనప్రియులు కావడం పెద్ద విశేషం కాదు. శ్రీ బ్రహ్మయ్య ఇట్టి రంగాలకు చెందిన వ్యక్తికాదు. అసూయలకు, ఈర్ష్యలకు, ఆశలకు, ఆశాభంగాలకు, విద్వేషాలకు, ప్రతీకారేచ్ఛలకు ఎంతగానో అవకాశ మిచ్చే రాజకీయ రంగంలోనే ఆయన జీవితంలో అత్యధిక భాగం ప్రధానంగా నడిచింది. నడవడమైనా అనామకంగా కాదు. కొన్ని కొన్ని ఘట్టాలలో కాంగ్రెసు సంస్థలో కీలకమైన పదవులనే ఆయన నిర్వహించాడు. అప్పుడు కనీసం కొందరికైనా అప్రియమైన నిర్ణయాలను ఆయన చేయవలసి వచ్చింది. అందుకు కినిసి, తాత్కాలికంగా ఆయనను విమర్శించిన వారైనా, అటు తర్వాత ఎంతో కాలంపాటు ఆయనపై పగ పెట్టుకొనలేదు. ఇందుకు కారణం, వ్యక్తిగతమైన రాగవిద్వేషాలతో కాక, ఏదో ఒక ధర్మసూత్రానికి కట్టుబడి, లేదా కాంగ్రెసు సంస్థ యోగక్షేమాలకే ప్రాధాన్యమిచ్చి, శ్రీ బ్రహ్మయ్య వ్యవహరించినాడని (వెంటనే కాకపోతే, కొంత కాలానికైనా) గుర్తించక తప్పనందునే!

అందరి ప్రేమగౌరవాలకు ఇంత విశేషంగా పాత్రుడు కాగలిగినందునే శ్రీ బ్రహ్మయ్యను అయాచితంగా నేడు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకొనడం జరిగింది. రాష్ట్ర కాంగ్రెసు చరిత్రలో ఆయన నాయకత్వం ఎంతైనా అవసరమైన సన్నివేశమిది. మత,కుల, వర్గ, ప్రాంతీయ తత్త్వాలు కాంగ్రెసులో నేడు పొడసూపుతున్నాయనడం కాదనరాని విషయం. కాకపోతే, కాంగ్రెసు అభ్యర్థులను చిత్తుచేయడానికి కొందరు కాంగ్రెసువారే చాటుమాటుగా తాము చేయగల సమస్తాన్నీ చేయడం పెక్కు నియోజక వర్గాలలో జరిగివుండేదా? ఇంతేకాక, సంస్థల కంటే వ్యక్తులకు ప్రాధాన్య మివ్వడం, వ్యష్టికై సమష్టిని బలిపెట్టడం ప్రస్తుతం జరుగుతున్నది కూడా. తమ సంస్థ పట్ల పదిహేను, ఇరవై సంవత్సరాలనాడు ప్రజలకున్న పరిపూర్ణ భక్తి విశ్వాసాలు నేడున్నట్టు కాంగ్రెసువాదులైనా చెప్పలేరు.

ఈ పరిస్థితులలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షత కేవలం ఒక ఉన్నత పదవి కాదు. కేవలం ఒక గౌరవస్థానమైనా కాదు; అది నే డొక గొప్ప బాధ్యత, పవిత్రధర్మం. శ్రీ బ్రహ్మయ్య ఆ దృష్టితోనే తన నూతన పదవిని భావించుకొనగలడని, ఆ దృష్టితోనే వ్యవహరించగలడని విశ్వసించవచ్చు.

*(ఆంధ్రజ్యోతి 19-4-1962)*

## జనవంద్యుడు: శ్రీ కొత్వాల్ వెంకట రామారెడ్డి

ఆయన పుట్టింది మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఒక రైతు కుటుంబంలో తల్లిదండ్రులు తన చిన్నతనంలోనే చనిపోగా, పెరిగింది మేనమామ ఇంటిలో చదువుకున్నది చాలా తక్కువ; ఆ తక్కువ కూడా స్వయంకృషి వల్లనే. ఉద్యోగంలో చేరింది అమీన్ (పోలీసు సబ్ ఇన్స్పెక్టరుగా) యాభైమూడు సంవత్సరాల తర్వాత ఆయన ఉద్యోగ విరమణ చేసింది కొత్వాలుగా (సిటీ పోలీసు కమీషనరుగా).



కొద్ది ఉద్యోగంనుంచి పెద్దదానికి రావడమే వెంకట రామారెడ్డి ఘనత కాదు; నిజాం నవాబు నుంచి “రాజా బహదుర్" బిరుదాన్ని పొందడమే ఆయన ఘనతకాదు; బ్రిటిష్ వారినుంచి “ఓ.బి.ఇ.”గా సన్మానం పొందడమైనకాదు, ఇంతకు మించిన రెండు ఘనతలు ఆయనకున్నాయి.

అవి ఆయన ప్రజాసేవానురక్తికి మురిసిపోయిన ప్రజలు ఆయన పట్ల చూపిన ప్రేమ గౌరవాలు. ఒక పల్లెలో, ఒక సామాన్యపు కుటుంబంలో పుట్టిన తన వలె ఎందరెందరో విద్యకు నోచుకొనలేక పోతున్నారన్న బాధ ఆయనను హైదరాబాద్లో “రెడ్డి హాస్టలు” సంస్థాపనకు పురికొల్పింది. పేరుకు మాత్రమే అది “రెడ్డి హాస్టలు”; దానిలో ప్రవేశం అన్ని కులాల వారికి, అన్ని మతాలవారికి. తాను స్వయం కృషితో నేర్చుకున్న విద్య ఉర్దూ భాషద్వారా మాతృభాషలో తనకు గట్టి ప్రవేశం లేకపోయినదన్న బాధ తెలుగు బోధనా భాషగా ఆడపిల్లలకు

ఒక హైస్కూలు సంస్థాపనకు ఆయనను పురికొల్పింది. నాటి నిజాం ప్రభుత్వం ఆ హైస్కూలును గుర్తించడానికి నిరాకరించగా, ఆయన దాన్ని పూనాలోని మహర్షి కార్వే మహా విద్యాలయానికి అనుబంధ సంస్థగా చేశారు. ఇంతేకాక, ఆయన అనాథ బాలబాలికల శరణాలయాల స్థాపనకు వయోవృద్ధుల శరణాలయాల స్థాపనకు, ఇట్టి అన్య సంస్థల స్థాపనకు విశేషంగా తోడ్పడ్డారు. హైదరాబాద్ శాసనసభ్యుడుగా వున్నప్పుడు బాల్య వివాహాలను నిషేధించడానికి, వితంతు వివాహాలపై నిషేధాన్ని తొలగించడానికి, పారిశ్రామిక కర్మాగారాలలో పసివారి నియామకాన్ని నిరోధించడానికి కావలసిన చట్టాలను చేయించడంలో ఆయన శ్రద్ధ చూపించారు.

ఉన్నత విద్యకు విదేశాలకు వెళ్ళగోరిన విద్యార్థులను ఆయన ప్రోత్సహించారు; సముద్రయానంపై అప్పటిలోగల ఆంక్షను నిరసించారు. ప్రజాహిత కార్యక్రమాలలో శ్రద్ధవహించవలసిందిగా ఆయన స్త్రీలను ప్రోత్సహించారు; ఇంటిని వదలి, పరదా వదలి, వారు బయటికి రావడానికి వీలుగా వారి కోసం ఒక "లేడీస్ క్లబ్" నెలకొల్పారు.

విద్యారంగంలో, సంఘ సంస్కరణలో ఇంతగా ఆయన కృషి చేసింది తన ఉద్యోగ ధర్మాలను నిర్లక్ష్యం చేసికాదు. ఎంతో శ్రద్ధాసక్తులతో, ఎంతో సమర్థంగా వాటిని పరిపాలిస్తూనే. పోలీసు ఉద్యోగిగా ఆయన పని చేసిన 53 ఏళ్ళలో ఆయన ఇలాకాలో మతకలహం ఒక్కటైనా చెలరేగలేదు. దాని సూచనలను ముందుగానే గుర్తించడంలో ఆయన మేటి; ముందు జాగ్రత్తలను తీసుకొనడంలో ఆయనకు ఆయనే సాటి.

అన్నిమతాలవారికి, వర్గాలవారికి ఆయన న్యాయదృష్టిపట్ల, నిష్పక్షపాత ప్రవర్తనపట్ల పరిపూర్ణ విశ్వాసం వుండేది. "కోర్టులలో మాకు న్యాయం జరగదు. మీరే మా వివాదాలను తీర్చండి" అంటూ వేల మంది ఆయన వద్దకు వస్తూవుండేవారు. కేవలం వివాదాలలో తీర్పులకేకాక, అన్ని విషయాలలో ఆయన సలహాలకు, సహాయానికి వస్తూవుండేవారు. కొందరేమో అన్న వద్దకు వచ్చినట్టు, కొందరేమో తండ్రి వద్దకు వచ్చినట్టు, కొందరేమో మిత్రుని వద్దకు వచ్చినట్టు, అందరికి ఆయన సమానంగా ఆత్మబంధువే !

ఇంతగా అందరి ప్రేమను, గౌరవాన్ని పొందిన విశిష్టవ్యక్తి కనుకనే రాజా బహదూర్ వెంకట రామారెడ్డి శతజయంతి ఈనాడు (1972 నవంబర్ 11వ తేది శనివారం) హైదరాబాద్ పౌరులు వైభవోపేతంగా జరుపుతున్నారు; ఆయన స్మృతికి జోహారు లర్పిస్తున్నారు. ఒక్క హైదరాబాద్ పౌరులేకాదు, మొత్తం ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు గౌరవించవలసిన సత్పురుషుడు, చేయెత్తి నమస్కరించదగు కీర్తిశేషుడు రాజా బహదూర్ వెంకట రామారెడ్డి.

(*ఆంధ్రజ్యోతి* 12-11-1972)

## ఇద్దరు అమరులు


### (శ్రీ మునిమాణిక్యం నరసింహారావు, శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రి)



నెల రోజుల వ్యవధిలో ఇద్దరు హాస్య రచయితలను తెలుగువారు కోల్పోయారు. వీరిలో మొదటివారు హైదరాబాద్లో మూడు, నాలుగు వారాలనాడు కన్నుమూసిన శ్రీ మునిమాణిక్యం నరసింహారావు; రెండవవారు గత సోమవారం నాడు పిఠాపురంలో కనుమరుగై పోయిన శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రి. ఇంత స్వల్ప వ్యవధిలో వీరిద్దరు బ్రతుకులను చాలించడం తాము నవ్వగల, ఇతరులను నవ్వించగల పరిస్థితులు తెలుగుగడ్డపై కరవై పోయినవన్న నిరాశా నిస్పృహల వల్లనే కావచ్చు.

హాస్యం పెల్లుబుకడానికి శాంతి కావాలి, సహనం కావాలి. సంయమనం కావాలి, స్నేహసౌహార్దాలు కావాలి, ప్రేమానురాగాలు కావాలి, అన్నింటిని మించి, బ్రతుకుపట్ల ప్రగాఢమైన అనురక్తి (జెస్ట్ ఫర్ లైఫ్) కావాలి. ఇవి మన ప్రాంతంలోనే కాక, మనదేశం మొత్తంపైనే తక్కువ. అందువల్లనే కావచ్చు. మన దేశంలో హాస్యరచయితల సంఖ్య బహుపరిమితం.

ఇతరుల నొప్పించేది వెక్కిరింత కావచ్చు, వెటకారం కావచ్చు, హాస్యంమాత్రం కాదు. ఎదుటివారి మనస్సును నొప్పించేది కాక, దానికి గిలిగింతలు పెట్టగలిగిందే. దాన్ని పైకి, పైపైకి తేలించగలిగిందే హాస్యం.
నిజమైన హాస్యం జీవితాన్ని కొత్తదృక్కోణాలనుంచి విలక్షణ దృకోణాల నుంచి చూస్తుంది. దాని దృష్టి ఎంత నిశితమో అంత నిర్మలం, ఎంత సరళమో అంత సమగ్రం. అహంకారాన్ని అది తేలికగా కనిపెడుతుంది. కపటాన్ని, నైచ్యాన్ని అది సులభంగా పట్టివేస్తుంది. అందువల్లనే అహంకారానికి మారు పేరుగా నిలిచే నియంతలు - కపటానికి, నైచ్యానికి ప్రతిరూపాలైన నియంతలు దేనినైనా సహించగలరుగాని, హాస్యాన్ని సహించలేరు.




నిజమైన హాస్యం ఎంతో తక్కువైన మన దేశంలో ఇద్దరు ఉత్తమ హాస్యరచయితలు శ్రీ మునిమాణిక్యం నరసింహారావు, శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రి తమ రచనలద్వారా నవ్వులను పంచిపెట్టారు, వెలుగులను పంచిపెట్టారు. బ్రతుకు బరువును తగ్గించారు, ఎందరెందరికో జీవితాన్ని సహ్యం చేశారు.

సంఘం వీరిద్దరిని ఆదరించకపోలేదు గాని, తగినంతగా కాదు. చాలీచాలని సంపాదనతో వారు తమ బ్రతుకులను వెళ్ళబుచ్చవలసి వచ్చింది. అయినా, విషాన్ని తాము దిగమ్రింగి, అమృతాన్ని లోకానికి వారిద్దరు అందించారు.

మునిమాణిక్యం సృష్టించిన "కాంతం" ఒక కాంతిరేఖ. కాంతం నిలిచిన చోటునుంచి చీకటి పారిపోవలసిందే ! కాంతం పెదవి కదిపితే చీకుచింతలు కాలికి బుద్ధిచెప్పవలసిందే ! సామాన్య సాంసారిక జీవితంలోని కవితకు, మాధుర్యానికి కాంతం ప్రతీక !!

మొక్కపాటి సృష్టించిన "బారిస్టర్ పార్వతీశం" ఫీజు లేకుండా ఆనందం తరఫున వకాల్తా పుచ్చుకున్న విలక్షణవ్యక్తి. అతడు పైకి కనబడి నంతటి అమాయకుడు కాడు. అత అమాయకత్వం కొంతవరకు ఒక ఛద్మవేషం మాత్రమే. తనను, తన వేషాన్ని చూచినవాడు. పైకి నవ్వితే, అతడు గడుసరిగా లోలోపల నవ్వుకుంటాడు. అతడి స్వభావంలోని ఈ లోతును సరిగా గుర్తించలేకపోయిన వారే "బారిష్టర్ పార్వతీశం" మొదటి భాగం వున్నంత పసందుగా దాని మిగిలిన రెండు భాగాలు లేవనడం జరిగింది. దాదాపు అర్ధ శతాబ్దిగా మనలను అలరిస్తున్న కాంతం, బారిస్టర్ పార్వతీశం విరగబడి నవ్వగల శక్తిని మనం కోల్పోనంతవరకు మన సాహిత్యంలో నిలుస్తారు. వారిద్దరు మన సాహిత్యంలో నిలిచినంతవరకు మునిమాణిక్యం, మొక్కపాటి అమరులే. *(ఆంధ్రజ్యోతి 11-3-1973)*

## ధన్యజీవి : శ్రీ తాపీ ధర్మారావు



కాలానుగుణంగా మారిన ఒక మహాశయుడు; కడవరకు పెరిగిన ఒక మానవతావాది; నిన్న ఉదయం కన్ను మూశారు.

నిన్నటికి శ్రీ తాపీ ధర్మారావు వయస్సు దాదాపు ఎనభై ఆరు సంవత్సరాలు. అయినా, పద్దెనిమిది సంవత్సరాల యువకులలోనైనా ఆయన విప్లవ దృక్పథం, ఆయన పరివర్తనా కాంక్ష, ఆయన ప్రగతి శీలం చెదురుగా తప్ప కానవచ్చేవికావు. నవపథాల ఆయన నిత్యపథికుడు. మృత్యువు నిరోధించి వుండకపోతే, ఆ పథాలవెంట ఆయన ముందుకు మున్ముందుకు సాగుతూ పోయేవారే.

- ఔను! మరెంత ముందుకైనా ఆయన వెళ్ళేవారే. ఇది అత్యుక్తి కాదనడానికి తార్కాణం ఆయన జీవితమే! ఉపాధ్యాయ వృత్తిలో ఆయన ప్రయాణం జమీందారులకు ట్యూటర్ పదవినుంచి సంఘవంచితులకు విప్లవ తత్వంలో ప్రొఫెసర్ పదవి వరకు.
- రాజకీయాలలో ఆయన ప్రయాణం జస్టిస్ పార్టీనుంచి కమ్యూనిస్టు పార్టీ వరకు.
- భాషా విషయాలలో ఆయన ప్రయాణం గడ్డు గ్రాంథిక భాషా వాదం నుంచి సరళ, సజీవ వ్యావహారిక భాషోద్యమానికి నాయకత్వం వరకు.

- ❖ గ్రంథకర్తగా ఆయన ప్రయాణం డిటెక్టివ్ నవలల నుంచి పాత సంఘం పునాదులను ప్రేల్చివేయగల డైనమైటుతో పోల్చదగు రచనలవరకు.
- ❖ బహుముఖ ప్రజ్ఞానిధి కనుకనే ఇన్ని కొత్త దిక్కులలో, ఇన్ని కొత్తదారులవెంట ఇంతగా ఆయన ప్రయాణం చేయగలిగారు. బహువిధ శక్తిసంపన్నుడు కనుకనే అడుగులు తడబడకుండా, ఆయాస పడకుండా ఇంత దూరం ఆయన ప్రయాణం సాగించగలిగారు.
- ❖ ఆయన పాండిత్యం ఘనమైనదే. కాని, అంతకంటే ఘనమైనది ఆయన మౌలికదృష్టి, అందువల్లనే ఏ మహా పండితునికి సాధ్యపడని రీతిలో ఆయన ప్రాచీన కావ్యాలకు వ్యాఖ్యాలను వ్రాయగలిగారు. ఆయన రచనా పాటవం సామాన్యమైనట్టిది కాదు కాని, అంతకంటే ప్రశంసా పాత్రమైనది ఆయన రచనా వైవిధ్యం. ఆయన పద్యాలు వ్రాశారు, పాటలు వ్రాశారు, నవలలు వ్రాశారు, వ్యాసాలు వ్రాశారు, వ్యాఖ్యానాలు వ్రాశారు. పైగా, సినిమా స్క్రిప్టు మొదలుకొని సైంటిఫిక్ ట్రీటైజ్ వరకు దేన్ని వ్రాసినా, దానిలో ఏదో ప్రత్యేకతను, వైశిష్ట్యాన్ని సాధించారు.
- ❖ ఎన్ని ప్రజ్ఞలున్నా, ఎంతగా మౌలికచింతన చేయగలిగినా, ఎన్ని రంగాలలో ఎంతగా రాణించినా, కొందరిలో పెద్ద బుద్ధి తక్కువ. ఇతరులు తమకంటె పైకి పోతూవుంటే, వారు సహించలేరు. ఏదో ఒక విధంగా వారిని దాగనీయడానికే ప్రయత్నిస్తూ వుంటారు. ఇందుకు భిన్నంగా శ్రీ ధర్మారావు ఇతరుల విజయాలను తన విజయాలుగానే సంభావించుకొని, ఎంతో సంతోషిస్తూవుండేవారు. మరింతగా విజయాలను సాధించవలసిందిగా వారిని ప్రోత్సహిస్తూ వుండేవారు.
- ❖ "బ్రదర్" ఆయనకు ఊత పదం కాదు. “నాయనా!” “బాబూ!" మొదలైనవి నాలుక చివరి మాటలు కావు, అందరిపట్ల ఆయన ఆదరాన్ని చూపేవారు: అందరి మేలును కోరేవారు.
- ❖ తీవ్ర భావాలు, ప్రగాఢ విశ్వాసాలు వాక్పౌరుష్యాన్ని పెంచడం కద్దు. ధర్మారావుగారివి తీవ్ర భావాలే, ప్రగాఢ విశ్వాసాలే అయినా, ఆయన మృదుభాషి, ఎట్టి పరిస్థితులలోను ఆయన కటువుగా మాట్లాడేవారు కాదు; ఎవ్వరి మనస్సును నొప్పించేవారు కాదు.
- ❖ ఇంతకంటె గొప్ప విశేషం మరొకటి ఆయనలో వుండేది. ఆయనది ఒడుదుడుకుల బ్రతుకు. దారిద్ర్య బాధలు ఆయనకు తెలుసు, ఇతర బాధలు కూడా తెలుసు. అయినా ఆయన నిత్యసంతోషి.
- ❖ పండితుడుగా, ఉపాధ్యాయుడుగా, కవిగా, రచయితగా, సంఘానికి చేసిన సేవ విస్తృతమైనది, విశిష్టమైనది. కనీసం మూడుతరాలకు ఆయన ఉత్తేజాన్ని కూర్చారు; ఉత్సాహాన్ని పంచి పెట్టారు. ఉత్తమపథాల వెంట తనతోపాటు నడిపించడానికి ప్రయత్నించారు, ఆయన ధన్యజీవి. ఆయన స్మృతికి మా జోహార్లు.

*(ఆంధ్రజ్యోతి 9-5-1973)*

## దెబ్బపై దెబ్బ

## (స్వామి రామానంద తీర్థ, శ్రీ కె. అచ్యుతరెడ్డి)

తెలంగాణా వారికే కాక, మొత్తం తెలుగువారికే దెబ్బపై దెబ్బ తగిలింది; 48 గంటల లోపల స్వామి రామానందతీర్థ, శ్రీ కె. అచ్యుతరెడ్డి మరణించారు.

స్వామీజీ మాతృభాష తెలుగు కాదు. మరాఠీ అయినా, తెలుగువారికి ఆయన చేసిన సేవ ఇంతంత కాదు; నిజాం నిరంకుశత్వ నిర్మూలనకు నిర్భీకంగా పోరాడినవారిలో ఆయన ముఖ్యులు, నిజాం సంస్థాన విచ్ఛిత్తికి నిశ్చలంగా కృషిచేసిన వారిలో కూడా ఆయన ముఖ్యులు.

బాల్యంలో ఆయన నాస్తికుడు. తర్వాత ఆస్తికుడైనా, సన్యాసం పుచ్చుకున్నా, తన ముక్తికై, తన మోక్షానికై ఆయన తపన పడలేదు. ఆయన పడిన తపన ప్రజలకు అవిద్య నుంచి, అజ్ఞానం నుంచి ముక్తి సాధించాలనే; దేశానికి దాస్యం నుంచి, దైన్యం నుంచి మోక్షాన్ని సాధించాలనే. మొదటి తపన ఆయనను విద్యారంగంలోకి లాగింది; రెండవ తపన ఆయనను స్వాతంత్ర్య సమర రంగంలోకి నడిపింది.

మనకు సన్యాసులకు కొదవలేదు. వేల సంఖ్యలో, లక్షల సంఖ్యలో వారున్నారు. వారిలో చెదురుగా కొద్దిమంది తప్ప, తక్కిన వారందరు చెదపురుగులవంటి వారే. “ఈ ప్రపంచం మాయ, ఈ బ్రతుకు భారం" అని వారు చాటుతూ ఉంటారు. అయినా, ప్రపంచం నుంచి సెలవు పుచ్చుకోడానికి, బ్రతుకు భారం తొలగించుకోడానికి రవ్వంత తొందరపాటునైనా చూపించరు.

దేశానికి కావలసింది ఇట్టి సన్యాసులు కారు; రామానందతీర్థ వంటివారు, శ్రద్ధానంద వంటివారు, వివేకానంద వంటివారు. ఇట్టివారు జుట్టు పెంచరు, గడ్డాలు, మీసాలు పెంచరు. శూన్యంలో నుంచి విభూతి, పువ్వులు, స్విస్ గడియారాలు తెప్పిస్తున్నట్టు కపట నటన చేయరు. “దేశం ఏమైతేనేమి, ప్రపంచం ఏమైతేనేమి, ఎవరి ముక్తిని వారే, ఎవరి మోక్షాన్ని వారే పంచుకోవాలి” అనే స్వార్థపూరిత బోధనలు చేయరుకూడా.

గోఖలే, తిలక్, గాంధీ మున్నగువారు సన్యాసులుకారు, సంసారులే. అయినా, ఈనాడు సర్వసంగ పరిత్యాగులుగా చెల్లుతున్న పెక్కుమంది కంటే, పీఠాలు, మఠాలు పెడుతున్న పెక్కుమంది కంటే, ముఖ్యమంత్రులు మొదలుకొని, మూఢాతి మూఢ జనుల వరకు బహుళ సంఖ్యాకుల పూజలను అందుకుంటున్న పెక్కుమంది కంటే వారే నిజమైన సన్యాసులు.

గుల్బర్గ జిల్లాకు చెందిన ఒక కుగ్రామంలో వెంకటరావుగా ఒక పేద కుటుంబంలో జన్మించిన శిశువు తర్వాత స్వామి రామానంద తీర్థగా మారింది నారాయణస్వామీజీ దీక్ష నిచ్చినందువల్లనే కాదు, ముందు తిలక్, తర్వాత గాంధీ ప్రభావాలకు లోనైనందువల్ల కూడా.

అన్యుల ప్రభావానికి తాను లోనైనట్టుగా స్వామీజీ తన ప్రభావానికి అన్యులను లోనుచేయగలిగారు. అట్టివారిలో ఒకడే, తలవని తలంపుగా నిన్న (ఆదివారం) రాత్రి ఉస్మానియా ఆసుపత్రిలో కన్నుమూసిన శ్రీ అచ్యుతరెడ్డి.

నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కొనసాగిన ప్రజోద్యమాలలో పాల్గొని, కారాగార క్లేశాలను అనుభవించిన, ప్రజాసేవా తత్పరతను అధికంగా ప్రదర్శించిన శ్రీ అచ్యుతరెడ్డి మూడు నెలల క్రితం శ్రీ పి.వి.నరసింహారావు మంత్రివర్గంలో రెవిన్యూ మంత్రిగా నియమితులైనారు. ఆ తర్వాత కొద్దిరోజులకే హరిజనులకు భూములు పట్టాలను అందజేసి వస్తుండగా ఆయన మోటారుకారు ప్రమాదంలో చిక్కుకొనడం, ఆయనకు బలమైన గాయాలు తగలడం సంభవించింది. ఆ గాయాల నుంచి ఆయన చాలావరకు కోలుకొని ఆసుపత్రిలో ఉంటూనే, ఆఫీసు ఫైల్స్ ను తెప్పించుకొని, వాటిపై ఉత్తర్వులను జారీచేస్తున్న ఘట్టంలో... (అసంపూర్తి)

వివరణ : శ్రీ రామానంద తీర్థ, హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ వ్యవస్థాపకులు.

## మరిలేని కాకాని : శ్రీ కాకాని వెంకటరత్నం

తలవని తలంపుగా ఎంతటి దుర్వార్త! గుండెలను కలచివేస్తూ ఎంతటి విషాదవార్త!!

నిన్న మధ్యాహ్నం ఆయన ప్రజల మధ్య తిరుగుతూనే ఉన్నాడు. నిన్న సాయంత్రం ఆయన తన ప్రజా నాయకత్వ ధర్మాలను పాటిస్తూనే ఉన్నాడు. నిన్న రాత్రి ప్రొద్దుపోయేవరకు ఆయన తన సోదర ప్రజల విషయమై ఆవేదన పడుతూనే ఉన్నాడు. అయినా, నిన్న రాత్రి గడవకముందే, నేడు పొద్దుపొడవకముందే ఆయన మరి లేడన్న ఘోరవార్తను వినవలసివచ్చింది.

నమ్మడం కష్టమైనా నమ్మక తప్పదు. నిజంగానే శ్రీ కాకాని వెంకటరత్నం మరిలేడు. ఎన్నో ప్రజోద్యమాలలో ముందుకు ఉరికిన, ఎన్నెన్నో ప్రజోద్యమాలలో కాకలుతీరిన శ్రీ కాకాని మరి లేడు.

ఆయన ఒక పేద రైతుబిడ్డ. అయినా ఆయనది పేదబుద్ధి కాదు. ఆయన పెద్దగా చదువుకోలేదు. అయితే మాత్రమేమి? పెద్దగా చదువుకున్న వారిలో నూటికో, కోటికో తప్ప కానరాని నాయకత్వ లక్షణాలు ఆయనలో కోకొల్లలుగా ఉండేవి.

స్వీయ ప్రతిభవల్లనే, స్వయంకృషి వల్లనే ఆయన నాయకుడుగా పెరుగుతూ పోయాడు. ఆదిలో ఆయన గ్రామ నాయకుడు. తర్వాత ఫిర్కా నాయకుడు. అటుపైన పశ్చిమ కృష్ణాజిల్లా నాయకుడు. ఆ వెనుక కృష్ణాజిల్లా నాయకుడు. అందుమీదట రాష్ట్ర నాయకుడు. ఆయన ఈ విధంగా పెరుగుతూ పోయింది అర్థబలంతో కాదు, అన్యుల ప్రాపకంతో కాదు; అనుచిత మార్గాలను త్రొక్కడం వల్ల అసలేకాదు. ఆయన ధైర్యమే, ఆయన సాహసమే, ఆయన ప్రజాసేవా ధర్మమే, ఆయన కార్యదక్షతే ఆయన ప్రతిపత్తిని పెంచుతూపోయాయి; ఆయన ప్రతిష్ఠను పెంచుతూపోయాయి.

కల్లకు ఎల్లలు లేకుండాపోతున్న ఈ కాలంలో శ్రీ కాకాని కల్లకు విరోధి. కపటం రాజ్యం చేస్తున్న ఈ కాలంలో శ్రీ కాకాని కపటానికి శత్రువు. మనసులో ఒక మాట. పైకి మరొకటి - ఇది ఆయనకు చేతకాని విద్య. ఒకటి చెప్పడం, మరొకటి చేయడం - ఇందులో ఆయనకు నైపుణ్యం లేదు. ఎవరేమనుకున్నాసరే, మనసులోని మాటను కుండబద్దలు కొట్టినట్లు ఆయన పైకి చెప్పేవాడు. ఎవరు విమర్శించినా, మరెవరు వ్యతిరేకించినా లక్ష్యపెట్టక, తాను నమ్మిన పనిని తిరుగులేకుండా ఆయన చేసేవాడు.

ఒకసారి కార్యరంగంలోకి దూకితే, మరి వెనుకంజలేదు; ముందుకు మునుముందుకు సాగిపోవలసిందే. 'సాగిపోవడం' ఆయన విషయంలో పసలేనిమాట. ఆయన ముందుకు "సాగిపోయే" వాడు కాదు. "నరుక్కు వెళ్ళే" వాడు. ఆ గుండె బలం మరొకరికి రాదు. ఆ పట్టుదల మరొకరికి రాదు. మనకు "గుండెలు తీసిన

బంటు" అని ఒక పలుకుబడి ఉన్నది. దాన్ని "గుండెలు తీసిన కాకాని" అని మార్చవచ్చు. మనకు "భల్లూకపు పట్టు" అని ఒక నుడికారం ఉన్నది. దాన్ని "కాకాని పట్టు" అని మన నిఘంటువులోకి ఎక్కించవచ్చు.
శ్రీ కాకానిలో మరొక గొప్ప విశేషం ఈనాడు అరుదైన, ఈనాడు కరువైన ఒక గుణ విశేషం. ఏ పదవినీ స్వార్థం కోసం, ధనార్జన కోసం వినియోగించుకొనకపోవడం. రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి పదవి, దాని అధ్యక్ష పదవి, కృష్ణాజిల్లా బోర్డు ప్రెసిడెంటు పదవి, రాష్ట్రమంత్రి పదవి మొదలైన ఉన్నత పదవులను ఆయన నిర్వహించాడు. అయినా, ఆయన శత్రువులైనా స్వలాభానికై, స్వప్రయోజనానికై ఆ పదవులను ఆయన దుర్వినియోగం చేసినట్టు అనలేరు. ఎందరెందరో ఈ విషయంలో చెదపురుగుల వంటివారు కాగా, ఆయన "నిప్పు" లాంటివాడు.

నిష్కర్షగా మాట్లాడేవారికి, నిర్భయంగా సంచరించేవారికి, "నిప్పు"వలె వ్యవహరించేవారికి కొందరు ప్రబల విరోధులు ఉంటారు. అట్టివారికి ప్రబల విరోధులను మించి, ప్రాణమిత్రులు కూడా ఉంటారు. శ్రీ కాకానికి ఇదే విధంగా కొందరు ప్రబల విరోధులుండగా, ఎందరెందరో ప్రాణమిత్రులు ఉండేవారు. అయితే విరోధం, కాకపోతే మైత్రి - ఇంతేతప్ప తాటస్థ్యం వహించడానికేమి, నిర్లక్ష్యం చేయడానికేమి వీలులేనట్టిది ఆయన విశిష్ట ప్రవృత్తి.

కొందరు పదవిలో ఉంటే నాయకులు లేకపోతే పూర్ణానుస్వారులు. పదవిలో ఉన్నా, లేకపోయినా, శ్రీ కాకాని ప్రజానాయకుడు; ప్రజాహృదయాలలో స్థిరంగా తన స్థానం నిలుపుకొనగల నాయకుడు. ఆయన స్మృతికి మా ప్రేమాంజలి ఘటిస్తున్నాము. : *(ఆంధ్రజ్యోతి 26-12-1972)*

*వివరణ : శ్రీ కాకాని 1972లో జరిగిన ఆంధ్రోద్యమ పోరాటంలో డిశంబరు 25వ తేదీన తీవ్ర ఆవేశంలో గుండె ఆగి చనిపోయారు.*

## శ్రీ కోటంరాజు రామారావు




"ఏ యెండకు ఆ గొడుగుపట్ట నేర్చినవాడు ఏమైనా కావచ్చునేమోగాని, నిజమైన ఎడిటర్ కానేరడు". స్థిరమైన కొన్ని లక్ష్యాలున్నవాడే, విశిష్టమైన కొన్ని విశ్వాసాలున్నవాడే, వాటిని ప్రచారం చేయడంలో ఎవరి నుంచి, ఎట్టి ప్రతి బంధకం వచ్చినా, సహింపలేనివాడే నిజమైన ఎడిటర్. అతని చేతిలోని ఆయుధాలు రెండు మాత్రమే. ఒకటి - తన కలం, రెండవది - తన రాజీనామా లేఖ. కలం నిత్యం చేతిలోవుంటే, రాజీనామా లేఖ నిత్యం జేబులో ఉండాలి. పదవిని వీడితే, మర్నాడు నిరాధారంగా వీధిలో నిలవవలసివచ్చినా, అవసరమైనప్పుడు ఒక్క క్షణమైనా సంకోచించకుండా తన రెండవ ఆయుధాన్ని రాజీనామా లేఖను ప్రయోగించనివాడు ఎడిటర్ గానే బ్రతకనక్కరలేదు; భుక్తికి ఒక వంద ఇతర వృత్తులున్నాయి; సంపాదనకు ఒక వెయ్యి అన్య మార్గాలున్నాయి.

నిజమైన ఎడిటర్ చేతిలోని ఈ రెండవ ఆయుధాన్ని ఒకసారి కాక, రెండుసార్లు కాక, కనీసం ఒక పాతికసార్లు ప్రయోగించి, తోటి పత్రికా సంపాదకులచేతనే కాక, ప్రజలచేత కూడా "భళిరా" అనిపించుకొన్న శ్రీ కోటంరాజు రామారావు మరి లేరన్న విచారకర వార్త ఇప్పుడే మాకు చేరింది. ఆయన పరమపదించడం భారతీయ పత్రికా ప్రపంచానికే పెద్ద లోటు.

అగ్రజులు శ్రీ కోటంరాజు పున్నయ్యవద్ద శిక్షణతో పత్రికా నిర్వాహణలో సిద్ధహస్తులైనారు శ్రీ రామారావు. ఆయన కేవలం సంపాదకీయాలను రాసే ఎడిటర్ కాదు; ప్రూఫులను చదవడం, హెడ్డింగులను పెట్టడం, పేజీలను కట్టించడం - ఒక్కటేమిటి? పత్రికా సంపాదకత్వ కళలో ఆయనకు ప్రవేశంలేని - కాదు, ప్రావీణ్యం లేని విభాగమేలేదు. ఇక, కలం పట్టినారా అంటే, అది కత్తివలెనే నడిచేది. విషయ వివరణలో కంటే, ప్రతివాదాన్ని చీల్చి చెండాడడంలో, అవసరమైనప్పుడు అగ్ని వర్షాన్ని కురిపించడంలో అది ప్రత్యేక ప్రతిభను ప్రదర్శించేది.



తాను ఎడిటర్గా ఉన్న పత్రికలోని పుటపైనే కాక ప్రతి పంక్తిపై ఎడిటర్ తన వ్యక్తిత్వపు ముద్రను బలంగా వేయాలి. శ్రీ రామారావు కనీసం ఒక డజను పత్రికలకు సంపాదకులుగా పనిచేసి ఉండాలి. ఆ సంపాదకత్వం కొన్ని కొన్ని సందర్భాలలో కొన్ని నెలలకు మించకపోయినా, ఒక్కొక్కప్పుడు కొన్ని వారాలకే పరిమితమైనా, "ఇది రామారావుగారి పత్రిక" అని ఇట్టే పట్టివేయడానికి వీలైనట్టుగా ఉండేది.

ఉత్సాహం, ఉద్వేగం, నిర్భీకత, నిర్మొగమాటం: ఆయన ప్రవృత్తిలోని ఈ విశిష్ట లక్షణాలన్నీ ఆయన పత్రికలలో ప్రతిబింబించేవి. తన సహాయ సంపాదకులలో ఈ గుణగణాలన్నింటిని ప్రోది చేయడానికి ఆయన ప్రత్యేకించి శ్రద్ధ వహించేవారు. నిజానికి, నేటి మన జర్నలిస్టుల ప్రపంచంలో అధికభాగం ఆయన శిష్య పరంపరే! ఆయన చేతికింద పనిచేయడమంటే, జర్నలిజం కొట్టిన పిండి కావడమే!

అదివరలో అనేక ఘట్టాలలోవలె చివరి రోజులలో కూడా నిరుద్యోగం ఆయనను క్రుంగదీయలేదు; లేమి ఆయన ఉత్సాహాన్ని చంపలేదు! రుగ్మత రేపటిని గురించిన ఆయన కలలను మాపలేదు. కష్టనిష్ఠూరాలతో కూడినదైనా ఆయనది ధన్యమైన జీవితం. సంప్రదాయాన్ని పాటించి, ఆయన ఆత్మకు మేము శాంతిని కోరం. ప్రపంచంలో నోరులేని ప్రజల తరపున, దిక్కులేని నిజం పక్షాన, బలంలేని న్యాయం పక్షాన చేయవలసిన యుద్ధాలున్నంతవరకు శ్రీ రామారావే కోరని వృత్తిని ఆయన ఆత్మకు కోరడానికి మేమెవరిమి? నిస్తబ్దతను, నిష్కర్మణ్యత్వాన్ని సహించలేని ఒక విశిష్ట వ్యక్తి కనుకనే, ఇతరులు పెక్కుమందివలె మంచంపై కన్నుమూయక, ప్రయాణాన్ని చేస్తూ, ఆయన వెళ్ళిపోయారు. ఆ వెళ్ళిపోవడం నిస్సంశయంగా కొత్త యత్నాలకే, కొత్త యుద్ధాలకే! *(ఆంధ్రజ్యోతి)*

## డాక్టర్ గూడూరి వెంకటచలం

“డాక్టర్ గూడూరి వెంకటచలం పేరు తెలుగు రైతులోకంలో సుప్రసిద్ధమైంది. కడచిన ఏడెనిమిదేళ్ళలో ఆయన మన వ్యవసాయ రంగానికి ఒక వ్యక్తి ఒక జీవితకాలంలో చేయదగినంత సేవ చేశారు. రైతుల సమస్యలను, కష్టసుఖాలను పైనుంచి కర్రపెత్తనం చెలాయించే ప్రభుత్వాధికారి వలె కాక, వారిలో ఒకరుగా కలసి మెలసి అర్థం చేసుకుని పరిష్కారానికై కృషిచేశారు. తమ కార్యక్రమాలను ఏదో మొక్కుబడిగా చేస్తున్న ఉద్యోగ విధిగా కాక, తన వ్యక్తిత్వం ఆవిష్కారానికి, తన ఆత్మవికాసానికి ఒక సాధనంగా పరిగణించి ఆయన పనిచేశారు. కనుకనే, ఆయనతో ఇటీవలే పరిచయం కలిగిన రైతులు సైతం డాక్టర్ చలాన్ని తమ ఆత్మీయుడుగా భావించుకొనేవారు.

మన ఆహార సమస్యను ప్రధాన పరిష్కార మార్గంగా హెచ్చుదిగుబడి విత్తనాలను గురించి ఇండియా ప్రభుత్వం ఆలోచిస్తున్న తొలిదశలోనే డాక్టర్ చలం తమ సహజోత్సాహంతో ఈ ప్రత్యేక రంగంలోనికి దూకారు. ఆ రంగానికి ఆయన చేసిన సేవ అనుపమానం. మనిలానుంచి తాను తెచ్చిన "తైచుంగ్ నేటివ్-1” రకం వరివిత్తనం వ్యాప్తికి ఆయన ఎనలేని దోహదం చేశారు. ఆంధ్రప్రదేశ్లో “మూడు టన్నుల క్లబ్" పేరుతో అనధికార సంస్థను ప్రారంభింపజేసి, దానికి సాంకేతిక విషయాల సలహాదారుగా ఉంటూ రైతులను స్వయంగా కలుసుకుని వారి సందేహాలను, "తైచుంగ్ నేటివ్-1" విత్తనంపై కలిగిన అనుమానాలను, దాని బాగోగులపై జరిగిన వివాదాలను పరిష్కరించడానికి విసుగు విరతిలేని కృషిచేస్తూ, ఆయన తన యావచ్ఛక్తిని మన వ్యవసాయాభివృద్ధికి ధారపోశారు. తన కృషిపట్ల బయలుదేరిన విమర్శనలను సరకుచేయక ఆయన చేసిన నిస్వార్థ సేవను ప్రత్యేకంగా సనదుపత్రంలో పేర్కొంటూ ఇండియా ప్రభుత్వం డాక్టరు చలాన్ని కడచిన 1966 రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో “పద్మశ్రీ”తో గౌరవించింది.

“ఆంధ్రజ్యోతి”లో “పాడిపంటలు” శీర్షికద్వారా కడచిన ఏడేళ్ళుగా ఆయన తెలుగు రైతులకు చేసిన సేవ చిరస్మరణీయం. వరి, వేరుశెనగ, చెరకు, మొక్కజొన్న మొదలైన పైర్ల పెంపకంలో రైతులు ఎదుర్కొనే సమస్యలకు ఆయన వారంవారం ఆ శీర్షిక ద్వారా సమాధానాలిచ్చి పరిష్కరిస్తూ దాని సాఫల్యానికి తోడ్పడ్డారు.

# దేశభక్తుడు శ్రీకొండా వెంకటప్పయ్య



కోపరహితుడు శాంతమూర్తిగా వర్తించడంలో పెద్ద విశేషం లేదు. తదన్యంగా సంచరించడం అతనికి దుస్సాధ్యం. ధనవ్యామోహ విరహితుడు వదాన్యుడు కావడం గొప్ప విశేషం కాదు. తద్భిన్నంగా మెలగడం అతనికి చేతకాని పని. ప్రవృత్తి ఒకటై, దానికి భిన్నంగా నడుచుకొన గలగడమే విశేషం.

శ్రీ రాముని ఏకపత్నీవ్రతంలోకంటె, సీతాపహరణ సమయంలోనేమి, తదనంతరమేమి, ఆమెను స్పృశించనొల్లని రావణాసురుని ఆత్మనిగ్రహంలో అధిక విశేషం లేదా?

భీష్మాచార్యుని బ్రహ్మచర్య దీక్షాస్వీకారంలో కంటె, కుంతీ తనయుడవని, కురురాజ్యాభిషిక్తుడవు కావచ్చునని శ్రీకృష్ణుడు ప్రలోభ పెట్టినా సంచలించని అంగరాజు త్యాగనిరతిలో అధిక విశేషం లేదా?

ప్రవృత్తి ప్రకారం సంచరించడం కంటే, దానికి అతీతంగా చరించడమే ఘనత కాగల పక్షంలో, అట్టి ఘనతకు శ్రీ కొండా వెంకటప్పయ్య బహుధా పాత్రులని చెప్పవచ్చు.
పుట్టుకవల్ల ఆయన ముక్కోపి. కాని, దాన్ని జయించడంలో ఆయన చాలావరకు కృతకృత్యులై, శాంత గాంభీర్యౌ దార్యాలకు ప్రస్తుతి గడించారు.

స్వభావతః ఆయన ధనలోభి, అయినా, గాంధి పిలుపుకు పెక్కేండ్లకు పూర్వమే ఆయన "ఏనుగుపాడి"గా నున్న "ప్రాక్టీస్"ను తమంతటగా కాలదన్ని, మహోత్యాగులని కీర్తికెక్కారు.

ఇట్టి ఘనవిషయాలలోనే కాకుండా, స్వల్పమైనవాటిలో కూడా వెంకటప్పయ్యగారు ప్రకృతిని జయించగలిగిన మహనీయులే.

ఆయన మాటలో కొంత తడబాటు కలదు. అయినా, ఆయన సుప్రసిద్ధ న్యాయవాదిగా రాణించగలగడం సామాన్య విషయమా?

ప్రస్తుతం అనారోగ్య సమేతమైన జరాభారం ఆయనను క్రుంగదీస్తున్నది. అయినా, స్వతంత్ర భారత స్వాతంత్ర్య యోధులను సముచితరీతిని సత్కరించదగునని చెప్పడం కోసం చెన్నపురికి ఇటీవల పండిట్ నెహ్రూ వచ్చిన సందర్భంలో శారీరక బాధలను సరకు గొనక ఆయన గుంటూరునుంచి "స్ట్రెచర్" పై ఈ నగరానికి స్వయంగా రాలేదా?



ప్రవృత్తిని జయించ గలవారు కనుకనే, పెక్కుమంది ఇతర దేశనాయకులలో కానరాని పటిమ వెంకటప్పయ్య గారిలో కానవస్తుంది.

ఆ పటిమ కారణంగానే స్వాతంత్ర్య సమరంలో ఇంచుమించు బార్డోలి స్థానాన్ని పల్నాటిసీమకు ఒకనాడు ఆయన సాధించగలిగారు. ఆ పటిమ కారణంగానే 1940 నాటి వ్యక్తిగత సత్యాగ్రహోద్యమంలో దూకకుండా ఆయనను ఆపడానికి గాంధీజీ ప్రత్యేకాదేశం కావలసి వచ్చింది.

ప్రతిభలో వెంకటప్పయ్యగారిని మించి పోగల దేశనాయకులు పెక్కు మంది కానరావచ్చు. కాని, పటిమలో ఆయనకు సాటి రాగలవారు బహు కొద్దిమంది.

పటిమతో ఆయన దేశానికి చేసిన సేవపట్ల ప్రజాకోటికి గల భక్తి ప్రపత్తులకు చిహ్నమే ఆయన "దేశభక్తుని" బిరుదు.

"దేశభక్త" కొండా వెంకటప్పయ్య పంతులు జీవితలక్ష్యద్వయంలో ప్రథమగణ్యమైన దేశ స్వాతంత్ర్యమేమో సిద్ధించింది. ఇక, రెండవది - ఆంధ్రరాష్ట్రం - సిద్ధించవలసి వున్నది. త్వరలోనే అది కూడా సిద్ధించగలదని, స్వతంత్ర భారతదేశంలో స్వతంత్ర రాష్ట్రంగా పరిఢవిల్ల గల ఆంధ్రావనికి ఆయన భీష్మ పితామహునివలె కర్తవ్యబోధను చేస్తూ, నిన్న జేగీయమానంగా 84 వ జన్మదినాన్ని జరుపుకున్నట్టే మరి 16 సంవత్సరాలకు శతజన్మదినోత్సవాన్ని కూడా వెంకటప్పయ్యగారు జరుపుకొనగలరని ఆశిస్తున్నాము.

*(ఆంధ్రప్రభ 20-2-1949)*

వివరణ : సర్దార్ వల్లభాయి పటేల్ బార్డోలీ స్థానంలో పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని నిర్వహించాడు.

## శ్రీ గిడుగు వెంకట రామమూర్తి పంతులు

భార్యను భర్తచితిపై బలాత్కారంగా ఎక్కించడమా! నిండు ప్రాణాలతో ఆమెను కాల్చివెయ్యడమా! ఈ ఘోర హత్యకు ఆమెను లోనుజెయ్యకపోతే, ఆమెకేకాక, ఆ వంగడానికే పుట్టగతు లుండబోవని విశ్వసించడమా! అన్నింటికంటే వైపరీత్యం, ఇది అమానుషమని చెప్పిన రాజా రామమోహన్ రాయ్ను ధర్మభ్రష్టుడని నిందించడమా!



ముక్కుపచ్చలారని బాలికను కాటికి కాళ్ళు జాచినవానికి కట్టడమా! వాడు పెండ్లిపీటల మీదే "హరీ" అన్నప్పటికీ, ఆ బాలిక బ్రతికినంత కాలం వైధవ్యబాధలను అనుభవించవలెననడమా! ఇంతకంటే విడ్డూరం, ఇది మహాపచారమని చెప్పిన ఈశ్వరచంద్ర విద్యాసాగర్ను, వీరేశలింగం పంతులును పాషండులని వెలివేయడమా!!

సహగమనం, బాల్య వివాహాలు, నిర్బంధ వైధవ్యం - ఇవి మూఢాచారాలని, ఇప్పటికీ ఛాందసులుగానే మిగిలిన ఏ కొందరో తప్ప, ప్రస్తుతం సర్వజనులు గుర్తిస్తున్నందున, రాజా రామమోహన్ రాయ్ు, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, వీరేశలింగం పంతులు సమకాలిక సాంఘిక రంగంలో ఎంతటి ఘన విప్లవాలు సాగించారో ఈ కాలంవారు గ్రహించగలగడం కష్టం.

ఇదేవిధంగా ఆంధ్ర దేశానికి సంబంధించినంత వరకు మరొక రంగంలో - భాషారంగంలో - శ్రీ గిడుగు రామమూర్తి పంతులు (మొన్న ఆదివారం నాడు ఆయన వర్ధంతి జరిగింది) సాధించిన విప్లవ ప్రాధాన్యాన్ని కొత్తతరం వారు అవగతం చేసుకొనడం కష్టమే.

రామమూర్తి పంతులుగారి వ్యావహారిక భాషావాదాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంకను ఆమోదించి ఉండకపోవచ్చు; విద్యాశాఖవారు దానిపట్ల ప్రాతికూల్యాన్ని సడలించి ఉండకపోవచ్చు; కొందరు పండితమ్మన్యులు దానికి సంబంధించినంతవరకు ఇంకను గుడ్లగూబల వలెనే ప్రవర్తిస్తూ ఉండవచ్చు. కాని, వ్యావహారిక భాషలోనే ఈనాడు విశేషంగా గ్రంథాలు వెలువడుతున్నవి; పత్రికలు ప్రచురితమౌతున్నాయి. గ్రాంథిక భాష ప్రజాబాహుళ్యానికి "ఎబ్బెట్టు"గా తోస్తుంది కూడా.

వ్యావహారిక భాషకానిది కృత్రిమమైనదిగానేమి నిర్జీవమైనదిగానేమి ఈనాడు బహుళ సంఖ్యాకులకు తోస్తున్నందున మరుగు పడిపోగల ప్రమాదం ఉన్నా, రామమూర్తి పంతులుగారు సాధించిన విప్లవం సామాన్యమైనది కాదు.

డాక్టర్ హూషీవలె అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించుకొనలేకపోయినా, ఆ చైనా విద్వాంసుడు స్వీయ భాషారంగంలో సాధించిన విప్లవాన్ని పోలినదాన్నే రామమూర్తి పంతులుగారు ఆంధ్రభాషలో సాధించగలిగారు.

అమెరికాలో విద్యాభ్యాసాన్ని ముగించుకొని, 1918లో డాక్టర్ హూషీ స్వదేశానికి తిరిగివచ్చిన నాటికి క్రీస్తు పుట్టుకకు పూర్వంనాటి కన్ఫ్యూషియస్ భాషే చైనాకు కావ్యభాష. ఈ కావ్యభాష క్రీస్తుశకం ప్రథమ శతాబ్దినుంచి కూడా ప్రజాబాహుళ్యానికి అయోమయ భాష అయిపోయింది. కొన్ని సంవత్సరాలు దీక్ష పూనితేకాని, ఈ భాషను చదవడం సాధ్యపడదు; కొన్నివేల అక్షరాలను నేర్చితేనే కాని, దీనిలో రాయడానికి వలనుపడదు. ఇందువల్ల పుట్టిన కొందరికే చదువు సంధ్యలబ్బగల భాగ్యం; వారికే ప్రభుత్వోద్యోగాలు; వారికే సంఘగౌరవం.



పండిత ప్రకాండులు ఎన్ని అడ్డుకట్టలను, ఎంత ఎత్తుగా, మరెంత గట్టిగా కట్టినా, భాషా ప్రవాహం నిలవదు. ప్రజావసరాల ప్రకారం, ప్రజాభిరుచుల ప్రకారం అది కొత్త దిశలకు ప్రవహిస్తూనే ఉంటుంది; కొత్త రూపాలను ధరిస్తూనే ఉంటుంది. ఇంతే చైనీస్భాష విషయంలో కూడా జరిగింది. కావ్యభాష కావ్యాలకు, ఆ భాషాజ్ఞానాన్ని కీర్తి ధనార్జనలకు సాధనంగా చేసుకొన్నవారికి మాత్రమే పరిమితమైపోగా, ఒక కొత్త భాష - నాతి కఠినమైనది. అధిక సౌలభ్యం కలదు. వేలు కాక, ఒక్క వంద మాత్రమే అక్షరాలు కలది - ప్రజలలో తలయెత్తింది. కోట్ల కొలది ప్రజలు దీనినే వాడుక చేయనారంభించారు. కథలు, నవలలు, ఇతర ప్రజాసాహిత్యం.

దీనిలోనే వెలువడసాగింది. అయితే, ప్రభుత్వాదరణ లేనందున, విశ్వవిద్యాలయాలు నిరసించినందున, ఈ వ్యావహారిక భాషకు గౌరవం ఉండేది కాదు. దీనిలో వెలువడిన గ్రంథాలను బహిరంగంగా చదువుకొనడానికి కొందరు సిగ్గుపడేవారు కూడా.

డాక్టర్ హూషీ అమెరికా నుండి స్వదేశానికి తిరిగివచ్చినంతనే ఈ వ్యావహారిక భాషకు (ప్రచారం కొరత ప్రశ్నలేదు గనక) గౌరవాన్ని తీసుకురావడానికి ఉద్యమించాడు. ఇందు నిమిత్తం ఆయన ఈ భాషలోనే పద్యాలు రాశాడు; పుస్తకాలు రాశాడు; కరపత్రాలు ప్రచురించాడు. త్వరలో ప్రతి ప్రగతికాముకుని తన వైపుకు త్రిప్పుకొన్నాడు. అంతటితో చైనా భాషారంగంలోనే కాకుండా జాతీయజీవనంలోనే నవజాగృతి వెల్లివిరిసింది; ప్రజా విప్లవానికి పట్టాభిషేకం జరిగింది.

ఇట్టి విప్లవాన్నే రామమూర్తి పంతులుగారు ఆంధ్రభాషా రంగంలో సాధించారు. ఆధునిక విజ్ఞానం ఆధునిక ప్రజకు కావాలి. తనకు సుబోధకమైన ఆధునిక భాష ద్వారానే ప్రజ ఆధునిక విజ్ఞానాన్ని పొందగలదు.

ఇంతేకాక, ప్రజాభిప్రాయం సుస్పష్టంగాను, సునిశితంగాను వెల్లడికావాలి. అప్పుడుగాని ప్రజాస్వామ్యం వర్ధిల్లదు;

ప్రజాభ్యుదయం పదిలం కాదు. ఇందువల్ల కూడా ప్రజల వ్యావహారిక భాషే పుస్తకాల భాష కావాలి; పత్రికల భాష కావాలి! ప్రభుత్వభాష కావాలి. ఇట్టి విశ్వాసాలతోనే డాక్టర్ హూషీ నిర్విరామ కృషిచేశాడు; ఒక మహావిప్లవాన్ని సాధించాడు. ఆయన పాటిగా కృతకృత్యుడు కాలేకపోయినారేమో గాని, మన రామమూర్తి పంతులుగారు

ఆయనకంటే ముందుగా ఇదే విశ్వాసాలతో ఆంధ్రభాషలో ఇట్టి విప్లవాన్నే సాధించారు.



వ్యావహారిక భాషా ప్రచారానికి రామమూర్తి పంతులుగారు చేసిన ప్రచారం ఇంతింత కాదు. ఇందు నిమిత్తం ఒక పత్రిక ("తెలుగు") పెట్టారు; అనేక వ్యాసాలు రాశారు. ("వ్యాసావళి", "వ్యాస సంగ్రహం" పేరుతో ఇవి సంపుటాలుగా ప్రచురితమైనాయి); కొన్ని పుస్తకాలు ప్రచురించారు. ("ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం", "బాలకవి శరణ్యం", "గద్య చింతామణి"); ముప్పది దీర్ఘ సంవత్సరాలు ఆంధ్రదేశంలో ప్రతి పట్టణానికి పదేపదే వెళ్ళి ఉపన్యాసాలిచ్చారు. ఇక ఆయన "ఆంధ్ర పండిత భిషక్కుల"తో సాగించిన వాగ్యుద్ధాలకు లెక్కలేదు. ఈ అవిరళ ప్రచారం మధ్య లభించిన ప్రతిక్షణ విరామం భాషాచరిత్ర పరిశోధనకే వినియోగం. పండితుల మహాస్త్రాన్ని - పాండితిని - వారిపైనే ప్రయోగించడం రామమూర్తి పంతులుగారి ప్రచారంలో ముఖ్యంగా గమనించదగు విశేషం.

ఎంత తీవ్రంగా ప్రతికక్షులను ఎదిరించవలసి వచ్చినా, వారిని వ్యక్తిగత దూషణ చెయ్యకపోవడమేమి, వారిపై వ్యక్తిపర ద్వేషాన్ని పెట్టుకొనక పోవడమేమి ఈయనలో ఒక విశిష్టత. ఇందువల్లనే ఈయనతో ఏకీభవించలేనివారు సైతం ఈయనను గౌరవించేవారు.

ఏ రంగంలోనైనా - అది భాషా రంగమైనా - వాస్తవిక విప్లవ సాధకుడైన వ్యక్తి ఇతర రంగాలలో కూడా తప్పక ముందడుగు వేస్తాడు. ఇది డాక్టర్ హూషీ జీవితంలో వలె రామమూర్తి పంతులుగారి జీవితంలోను కానవస్తుంది.

ఆ చైనా పండితునివలె ఈ ఆంధ్రపండితుడు కూడా రాజకీయాలలో పాల్గొని ఉండకపోవచ్చు. ఇందుకు కారణం - ఉభయులకు ప్రజావాణికి చెర తప్పించడమే మరింత తొందరగా, మరింత ముఖ్యంగా కావలసిన

విప్లవమని తోచడమే. ఇందువల్ల స్వయంగా రాజకీయ విప్లవంలో పాల్గొనకపోయినా, వీ రుభయులు ఇతర విధాల విప్లవ పురోగతికి దోహదం చేసినవారే.
డాక్టర్ హూషీ భాషా విప్లవంతో పాటు మానసిక విప్లవ సాధనకు ప్రయత్నించాడు. బౌద్ధం ఒకనాడు చైనాకు ఆధ్యాత్మిక దీప్తిని కూర్చినా, దాని ప్రభావం ఈనాడు చైనా ప్రజ కొత్తను గ్రహించకుండా చేయడానికే ఉపకరిస్తున్న దని ఆయన విశ్వాసం. కొత్తను గ్రహించలేక పోతున్నందునే ఆధునికయుగ భావాలను అర్థం



చేసుకొని, అందుకు అనుగుణంగా తన సాంఘిక వ్యవస్థను చైనా దిద్దుకొన నేరకపోతున్నదని కూడా ఈయన నమ్మకం. ఈ నమ్మకం తోనే ప్రాచీన చైనా సంస్కృతికి, ఆధునిక పాశ్చాత్య సంస్కృతికి సమన్వయ సాధనకు హూషీ కృషి చేశాడు.

ఇట్టి మానసిక విప్లవానికి ప్రత్యేకించి పూనిక చూపకపోయినా, ఇతర రంగాలలో మన రామమూర్తి పంతులుగారు విప్లవోత్సాహాన్ని ప్రదర్శించారు.

సంఘ వంచితులైన సవరలకు ఆయన లిపిని, వ్యాకరణాన్ని, నిఘంటువును కూర్చారు. నలభై, యాభై సంవత్సరాలనాడే హరిజనులకు విద్యాలయాన్ని నిర్వహించారు; ఆంధ్రజాతి హక్కుల రక్షణ నిమిత్తం స్థానికంగా ప్రబలుడైన చాలాకాలం తనకు సహాయకుడైన - పర్లాకిమిడి రాజాను ధిక్కరించి అష్టకష్టా లనుభవించారు.

ఆంధ్రభాషా విప్లవాన్ని రామమూర్తి పంతులుగారు సాధించారని ఆయన ప్రశంసతో సంతృప్తి చెందడం నిష్ప్రయోజనం. నిత్యవిస్తృతి, నిత్యవికాసం విప్లవ లక్షణాలు. ఏ విప్లవమైనా, దాన్ని ప్రారంభించిన వ్యక్తితో ఆగదు. ఈ సత్యాన్ని గుర్తించ నేరకపోతే, మన తెలుగునాట వీరేశలింగం పంతులుగారి కృషిని, రామమూర్తి పంతులుగారి కృషిని హర్షించలేకపోయిన మన ముందుతరానికి మనం మూర్ఖత్వాన్ని ఆపాదించినట్టే. మన వెనకటితరం మనకు ఆపాదిస్తుంది.

రామమూర్తి పంతులుగారు తమ భాషా విప్లవాన్ని శిష్టవ్యావహారానికి (సమకాలిక పరిస్థితుల ప్రాబల్యం వల్లనే కావచ్చు) పరిమితం చేశారు. గ్రామ్యాన్ని తాము సమర్థించడం లేదన్నారు. ఇట్టి పరిమితులు ఈనాడు తగవు. సామాన్య ప్రజలే నేడు ప్రభువులు. వారి భాషే సజీవ భాష. ఆ సజీవ భాషకు కావ్యగౌరవాన్ని కలిగించాలి. అప్పుడే భాషా విప్లవం మరొక అడుగుముందుకు పోతోంది; అప్పుడే రామమూర్తి పంతులుగారి కృషికి సార్థక్యం సిద్ధిస్తుంది.

*(ఆంధ్రప్రభ 3-2-1950)*

*వివరణ : రాజా రామమోహన్ రాయ్ : ప్రముఖ సంఘ సంస్కర్త. ఆధునిక భారతీయ ప్రముఖుడు. విద్యావేత్త. ఏకేశ్వరోపాసకుడు. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ : ఆధునిక భారతీయ నిర్మాతలలో ఒకరు. విద్యావేత్త.*

## శ్రీ పాలపర్తి నరసింహం

ఆంధ్రదేశంలో వీరేశలింగం, వెంకటరత్నంనాయుడువలె శ్రీ పాలపర్తి నరసింహం పేరు సుప్రసిద్ధమైంది కాక పోవచ్చు; అంతగా సుపరిచితమైంది కాకపోవచ్చు. కాని, బ్రహ్మసమాజ వ్యాప్తికి, బ్రాహ్మధర్మ ప్రచారానికి వారిరువురు చేసిన కృషికంటే శ్రీ నరసింహం చేసినది తక్కువమాత్రం కాదు.

మన దేశంలోకి ఏ కొత్త విశ్వాసం ప్రవేశించినా, ఏ కొత్త మతం తలయెత్తినా తెలుగు నాటదాని ప్రతిధ్వని వెంటనే వినబడుతుంది; దాని ప్రభావం తప్పక కనబడుతుంది. ఒక కొత్త విశ్వాసాన్నో, కొత్త మతాన్నో కొత్త మోజుకొద్దీ అవలంబించడం తేలిక; ఆచరించడం కష్టం; దాన్ని జీవితాంతం వరకు నిలుపుకొనడం మరీ కష్టం.

శ్రీ నరసింహం పరిపాటికి భిన్నులు. ఆయన యౌవనంలో స్వీకరించిన బ్రాహ్మమత ధర్మాన్ని వృద్ధాప్యంలో సయితం - మొన్న 2 వతేదీన గుంటూరులో తమ ఎనభైయవయేట కన్నుమూసే వరకు - వీడలేదు. వారి విశ్వాసపటిమ, అచంచల దీక్ష ప్రశంసనీయమైనవి.

బ్రహ్మసమాజం ఈనాడు తెలుగుదేశంలో నామమాత్రంగానే వుండవచ్చుగాని, ఒకానొకప్పుడది బహుళ వ్యాప్తి చెందింది. అది వంగరాష్ట్రం నుంచి కొత్తనీటివలె వచ్చి పాతనీటిని కొట్టివేసింది. ఎందరో మేధావులను లోబరచుకుంది. తెలుగు వారి మత, సాంఘిక, సాంస్కృతిక జీవితంపై విశేషమైన ప్రభావాన్ని కనబరచింది. ఆ సమాజం శాఖలు, ప్రార్థనా మందిరాలు కాకినాడ, రాజమండ్రి, బందరు, బెజవాడ, గుంటూరు వంటి పట్టణాలలోనే కాక, మరెన్నో చిన్న చిన్న వూళ్ళలో సయితం వెలిశాయి. వాటి చుట్టూ ఎన్నో సంస్కరణోద్యమాలు విస్తరిల్లాయి.

బెంగాల్లో కేశవ చంద్రసేన్, దేవేంద్రనాథ్ టాగోర్ వలె ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం నాయుడు, వేమూరి రామకృష్ణరావుగార్ల వంటి వారెందరో ఈ ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ముట్నూరి కృష్ణారావు, చెరుకువాడ నరసింహంగార్లు సయితం ఆదిలో బ్రాహ్మమతావలంబులే. వారి కోవకు చెందినవారే శ్రీ పాలపర్తి నరసింహం. కాకినాడలో ఆంధ్ర బ్రాహ్మ సాధనాశ్రమాన్ని స్థాపించడంలో నేమి, “ధర్మ సాధని” పత్రికను సుమారు ముప్పయ్యేళ్ళ పాటు నిర్వహించడంలో నేమి, గుంటూరులో ప్రార్థన సమాజాన్ని నెలకొల్పడంలో నేమి ఆయన బ్రాహ్మమత వ్యాప్తికి, సంఘ సంస్కరణోద్యమాలకు చేసిన సేవ అంతా యింతా కాదు.

మన దేశంలో బౌద్ధమతం క్షీణించడానికి ఒక కారణం దాని ప్రధానోపదేశాలను హిందూమతం అంగీకరించి, అవి తనవిగా చెల్లుబడి చేసుకోవడమేనని చెబుతారు. బౌద్ధం వలెనే బ్రహ్మమతం కూడా హిందూ సమాజంపై విప్లవంగా బయలుదేరినదే. అయితే, దాని బోధలను లక్ష్యాలను హిందూ సంఘం ఈనాడు దాదాపు పూర్తిగా అంగీకరించి దాని ప్రత్యేకత వ్యక్తిత్వానికి ప్రాతిపదికను పోగొట్టింది. ఇది నిజమే కావచ్చుగాని, బ్రహ్మ సమాజం ఒక విప్లవాత్మక సంస్థగా దాని సభ్యులు వెలివేయబడిన వారుగా పరిగణించబడిన రోజులలో కాలానికి ఎదురీది నిలిచిన నరసింహంగారి వంటి వ్యక్తులు కలకాలం మన సాంఘిక చరిత్రలో జ్ఞాపకముంచుకో దగినవారు. వారి కుటుంబానికి మా సానుభూతి నందజేస్తున్నాము.

*(ఆంధ్రజ్యోతి 1-5-1965)*

## శ్రీ చలసాని లక్ష్మీనారాయణ వర్మ

ఆయన నాకు తెలిసింది కవివర్మగానే, ఆయన నాకు తెలిసింది మరపురాని ఆయన చిరునవ్వు ద్వారానే.

ఆయన ఎక్కువగా మాట్లాడేవారు కాదు, అయితే మాత్రమేమి? ఎన్నిమాటలైనా వ్యక్తం చేయలేని ప్రేమాదరాలు ఆయన చిరునవ్వు నుంచి జాలువారుతూవుండేవి.

ఆయనను నేను చూచింది కొద్ది సార్లు మాత్రమే. అయితేమాత్రమేమి? ఆయన విశిష్ట వ్యక్తిత్వం ముద్రను ఎన్ని ముఖాముఖి సమావేశాలైనా వేయలేనంతటి బలంగా ఆయన చిరునవ్వు నాపై వేస్తూ వుండేది.

తన కవితా సంపుటాలన్నింటిని ఆయన నాకు బహూకరించారు. అవి చిరు సంపుటాలైనా, వాటిలో పన్నీటి జల్లులున్నాయి. పెన్నేటి పాటలున్నాయి.

ఒక్కొక్క వ్యక్తిని నాకు దగ్గరికి తెచ్చేది ఆయనకు నాకు మిత్రునిగా మార్చేది- ఆ వ్యక్తిలోని ఏదో ఒక విలక్షణత్వమే. అది కంఠంలోని తేనియ కావచ్చు, కళ్ళలోని వెలుగుకావచ్చు. లేదా, సంభాషణలో చాతుర్యం కావచ్చు; నవ్వడంలో, నవ్వించడంలో ప్రత్యేకత కావచ్చు. ఒక్కొక్క విషయంలో అది భావాలలోని వైశాల్యం కావచ్చు, లేదా, ప్రవర్తనలోని ఉదాత్తత కావచ్చు. కాగా, కవివర్మగారి విషయంలో ఆయనను నాకు దగ్గరికి తెచ్చినట్టిది - ఆయనను నాకు ఆప్తునిగా మార్చినట్టిది ఆయన చిరునవ్వే. దానితోనే ఆయన నన్ను పల్కరించేవారు, దానితోనే కుశల ప్రశ్నలు వేసేవారు. దానితోనే తన మిత భాషణకు ఎన్నో అర్థాలను అందాలను సంతరింపజేసేవారు. దానితోనే ఆప్యాయంగా వీడ్కోలు చెప్పేవారు. అది కృష్ణ పక్షంలోని చవితినాటి వెన్నెల, కృష్ణానది మధుమాస ప్రవాహం పై లేచే నురుగు.

ఆ చిరునవ్వు నాకు కళ్ళకు కట్టినట్లు కనబడుతున్నంత వరకు అది నాగుండెలకు గిలిగింతలు పెట్టుతున్నంత వరకు ఎవరు చెప్పినా -ఎంతగా చెప్పినా - కవివర్మగారు మరి మన మధ్యలేరంటే నేను నమ్మను, నమ్మలేను.

మరల నేను గుంటూరు వెళ్లినప్పుడు, చుట్టపు చూపుగా సోదరి డాక్టర్ జయప్రదను చూడబోయినప్పుడు, అల్లంత దూరంనుంచి నా గొంతు విన్నంతనే కవివర్మగారు వరండాలోకి వచ్చి, చిరునవ్వుతో నన్ను తప్పక పలకరిస్తారు, చిరునవ్వుతోనే నాతో ముచ్చటిస్తారు.

ఆ చిరునవ్వే ఆయనను అమరుని చేసింది. అదే ఆయనను మధుర కవిని చేసింది, మరపురాని మనీషిని చేసింది.

*(శ్రీ చలసాని లక్ష్మీనారాయణ వర్మ సంస్మరణ సంచిక నుండి, 1983)*

*వివరణ : శ్రీ వర్మ గుంటూరులో ప్రసిద్ధ వైద్యులు డాక్టర్ కాసరనేని సదాశివరావుగారి మామగారు.*

## డాక్టర్ కె. ఎస్. కేసరి

తాను భూమి పై పడిన అయిదు నెలలకే తండ్రి మరణం. ఆయన మిగిల్చిపోయిన యావదాస్తి జంధ్యాలు వడుక్కునే టెంకాయ చిప్పలో పదణాల డబ్బులు. ఈ పరిస్థితిలో బాల్య జీవితం ఎంత బాధాకరమైవుంటుంది?

డాక్టర్ కె.యన్. కేసరిగారి బాల్యజీవితం గర్భదారిద్ర్య కారణంగా మహా బాధాకరమైనదే. అయిదారేళ్లు వచ్చి, ఊహ తెలిసే వరకు బండి ఎలా దొర్లిందీ తెలియక పోయినా, ఆ తర్వాత ఆయన పొందిన కఠోరానుభవాలు ఇన్నన్నీ కావు. “నా చిన్ననాటి ముచ్చట్లు” అనే పేరుతో ఆయన చేసిన రచన ప్రకారం వాటిలో ముఖ్యమైనవివి :



తెల్లతెల్లవారుతుండగా ఊరు ప్రక్కనున్న (ఆయనది ఒంగోలు దగ్గరి ఇనమనమెళ్లూరు) గుండ్ల కమ్మవాగుకు పోయి, నీళ్ళు మోసుకు రావడం. ఇందుకు ఒక చిన్న కావడి, దానికి రెండు చిన్న తప్పేలాలు.

ఆ తర్వాత చల్ది తినడం; పొలాల వెంటవెళ్లి, దయగలవారినడిగి వంకాయలు, గోంగూర, పచ్చిమిరపకాయలు, దోసకాయలు, జొన్న, సజ్జకంకులు వగైరాలను కోసుకురావడం.

ఆ పైన చదువుకోసం వీధిబడికి వెళ్లడం; అయ్యవార్ల వారికి ముడుపులు కట్టుకోగల తాహతు లేనందున, చదువు అబ్బకపోగా, చీటికి మాటికి దెబ్బలు తినవలసిరావడం. రవికెలు కుట్టడంలో తల్లి నేర్పరి కనుక వాటిని ఆమె కుట్టడం, సాదారవికెలు ముక్కానీ, పూలువేసి కుడితే అణా, తేళ్లు, మండ్రగబ్బలు, చిలకలు, గోరువంకలు మొదలైనవాటి బొమ్మలువేసి కుడితే, రెండణాలు చొప్పున పుచ్చుకొని, ఆ డబ్బులతో నెయ్యి, వరిబియ్యం కొనుక్కోవడం.

వంట చెరుకుకై పొలాలవెంట తిరిగి కంది దుంపలను త్రవ్వి తెచ్చుకోవడం.
పసితనమైనా, ప్రాణాలకు తెగించి, మర్రిచెట్టు ఎక్కడం, ఆకులను కోసుకురావడం, తల్లితోపాటు జొన్నదంటు ఈనెలతో విస్తళ్లు కుట్టడం.

ఇంత చేసినా, కడుపు నిండనందున, ఉన్న ఊరిలో బిచ్చ మెత్తుకోడానికి లజ్జపడి, పొరుగూరుకు బయల్దేరడం; ఎండకు మాడిపోవడం, కాళ్లనిండా డొంకలోని తుమ్మ ముళ్లు గ్రుచ్చుకోవడం; తల్లి వలవల ఏడ్చి మరల ఎన్నడు భిక్షాటనకు పోనని ప్రమాణం చేయించుకోవడం.

పది, పదకొండేళ్లు వచ్చేసరికి తల్లి పడుతున్న కష్టాలను మరి చూడలేక, దారి పొడుగునా మకాములు చేసుకొంటూ, కాలినడకన మద్రాసు చేరడం.

ధర్మసత్రంలో ఒంటిపూట భోజనం చేయడం, రాత్రిపూట ఎంతగా ఆకలి దహిస్తున్నా, డొక్కలలోకి కాళ్లు ముడుచుకొని, కొత్వాల్ చావడివద్ద రావిచెట్టు కింద పడుకోవడం. చేతిలో ఒక దమ్మిడీ వుంటే, అది పెట్టి అరపడి జొన్న పేలాలు కొని, మంచినీళ్లు త్రాగి, ఆకలి చంపుకోవడం.

ఇన్ని కష్టాలు పడుతూకూడా, చదువు పైకి ధ్యాసపోగా, ఒక వీధిబడి పంతులు వద్దకు పోయి ఆయనకు కాళ్లు పట్టి, ఆయన ఇంటిపనులు చేసి జీతం లేకుండా రుక్మిణీ కళ్యాణం, గజేంద్రమోక్షం మొదలైన వాటిని చెప్పించుకొనడం.

ఆ చదువు కూటికీ, గుడ్డకూ అక్కరకు వచ్చేది కాదని తోచగా, ప్రయివేట్గా నాలుగు ఇంగ్లీషు ముక్కలు నేర్చుకొనడం.

ఆ పిమ్మట ఒక హైస్కూల్ హెడ్మాస్టర్ను ఆశ్రయించి, జీతం మాఫీతో ఇంగ్లీషు చదువుకు చేరడం, భోజనానికి వారాలను, పుస్తకాలకు, గుడ్డలకు ధర్మాత్ములైన వారివద్ద నెలకు తలకొక పావలా చొప్పున చందాలను ఏర్పాటు చేసుకొనడం.

అటుపిమ్మట ఏమి జరిగిందో, డాక్టర్ కేసరిగారి పలుకుల ద్వారానే వినండి:

“ఒకనాడు కొన్ని పుస్తకాలు కొనవలసి వచ్చినది. ఇంకా నెలసరి చందాలిచ్చే గడువురాలేదు. జార్జిటౌన్ ఆదియప్పనాయన్ వీధిలో నరసింహులు శెట్టి అని - జగ్గయ్యపేట వర్తకులు వ్యాపారం చేస్తుండేవారు. వారున్నూ పై చందాలిచ్చేవారిలో ఒకరు. వారివద్దకు వెళ్ళి- "మీరు మామూలుగా ఇచ్చే రు 0-4-0 లు అట్లుంచి - మరొక్క పావులా అదనంగా ఈ రోజున ఇవ్వండి; పుస్తకాలు అగత్యంగా కొనవలెను.” అని

సాహసించి అడిగినాను. వారు దగ్గరకు రమ్మనిరి. అడిగిన తడవుగానే ఇవ్వబోతున్నారనే - ఆశతో, ధైర్యముతో దగ్గరకు వెళ్ళినాను. "మామూలుగా ఇచ్చే పావులాగాక పైన ఒక పావులా వడ్డీ గూడా కావాలి" అంటూ - చెళ్లున చెంపకాయ కొట్టినాడు. అది దూసిపోయి నెమరుకణతన తగిలినది; స్పృహతప్పి పడిపోయినాను. ఆ శబ్దం విని సెట్టి భార్య లోపల నుంచి వచ్చినది. నా అవస్థచూచి "ఆ పిల్లవానిని అట్లా ఎందుకు కొట్టా' వని మగని గద్దించి - చాలా నొచ్చుకొన్నది. లోపలకువెళ్ళి ఇన్ని మంచినీళ్ళు తెచ్చి త్రాగమని ఇచ్చినది; త్రాగినాను. స్పృహ బాగా వచ్చిన తర్వాత ఆమె ఒక రూపాయి తెచ్చి పుస్తకాలు కొనుక్కొమని నా చేతిలో పెట్టి పంపినది. రావిచెట్టు క్రిందికి చేరాను. తిరిగీ జిజ్ఞాసలో అవమాన పరంపరతో చదువు సాగించడం దుర్లభమని తోచింది. పడ్డాను. రిక్తుడను నాకూ, వ్యయసాధ్యమైన ఈ చదువుకూ దూరమని నిర్ణయించుకున్నాను. ఏదైనా నాకు తగిన ఉద్యోగంచేసి సంపాదించి పొట్టబోసుకుందాము అని యోచన కలిగింది".

ఇది డాక్టర్ కె.యన్. కేసరి గారి బాల్యజీవితమైనప్పుడు, ఆయన ఈనాడు విద్యాదానమే సర్వోత్కృష్టమైనదని విశ్వసించడమేమి, అందు నిమిత్తం బాలుర కొక విద్యాలయాన్ని, బాలికలకు మరొకదాన్ని సంస్థాపించి, ఆ రెండు సంస్థలకు మూడు లక్షల రూపాయలకు పైగా విరాళ మివ్వడమేమి అత్యంత సహజం కాదా?

“నా సంపత్తికేమి, నా జీవితానికేమి ఏది సార్థక్యం కూర్చగలదు?" అనే ప్రశ్న ఉదయించి నంతనే ఆయన హృదయాకాశం దశదిశల నుంచి విద్యాదానం” అన్న ప్రత్యుత్తరమే ప్రతిధ్వనించి వుండాలి; ఆయన బాల్య జీవితంలోని ప్రత్యనుభవం అదే ఘోషచేసి వుండాలి.

అయితే, ఇది ఆయన వితరణ ఘనతనుగాని, త్యాగ విశిష్టతనుగాని న్యూనపరచడం కాదు. డాక్టర్ కేసరిగారి కంటె బాల్యంలో కష్టాలు పడిన వారున్నారు; అటుపిమ్మట స్వీయప్రతిభవల్ల, స్వయంకృషి వల్ల ఆయన కంటే మిన్నగా ధనార్జన చేసినవారు సయితమున్నారు. కాని, ఏ విద్యార్జనకై చిన్నతనంలో తాను పరితపించి, దేనికి నోచుకోలేదో, దానికి తన తర్వాత తరంవారు దూరం కారాదని పూనిక చూపించిన వారెంద రున్నారు?

జీవితంలో ఎన్ని కష్టాలు పడ్డారనేది ముఖ్యంకాదు; గుండె చెదరకుండా వాటిని అధిగమించడమే ముఖ్యం. ఎంత డబ్బు సంపాదించారనేది ముఖ్యంకాదు; దాన్ని ఎంతవరకు సద్వినియోగం చేసినారనేదే ముఖ్యం; ఈ రెండు విధాల కూడా డాక్టర్ కేసరిగారు ధన్యజీవులు. ఆయన ఆత్మకథ (“నా చిన్ననాటి ముచ్చట్లు" లోని కొన్నికొన్ని ఘట్టాలు ముందుతరాలవారికి వెలుగుదారులను చూపించగలిగినట్టివి.

ఇంతే కాదు. భాష సొగసులను చూపడానికి ఎక్కడా ప్రయత్నం లేకపోయినా, గంభీర భావాల ప్రకటనకు ప్రయత్నం సయితం లేకపోయినా, ఆయన ఆత్మకథ ఆంధ్రసరస్వతికి ఒక ఉత్తమ కానుక. బ్రతుకును చీల్చుకొని బయటికి వచ్చిన వైనందున దాని పుటలలో కొన్నింటికి ప్రకృతి సిద్ధంగా లభ్యమైనా పదహారువన్నెల పసిడి మిసిమి కలదు. ఇప్పటి నిడివికి సగానికి తగ్గించిన పక్షంలో అది మన భాషకే కాదు, ఏ భాషకైనా మన్నన తేగల గ్రంథం కాగలదు.

ధన్యజీవి డాక్టర్ కేసరిగారి చిత్రపటావిష్కరణ నిన్న చెన్నపురిలో జరిగింది. అయితే, ఆయన చిత్రపటావిష్కరణ కేవలం "కేసరి హైస్కూల్"లో జరగడం చాలదు; ఆయన జీవిత విశిష్టతను హర్షించగల ప్రతి హృదయంలోను జరగాలి.

*(ఆంధ్రప్రభ 21-2-1949)*

*వివరణ : నయాపైసలు రాకపూర్వం రూపాయికి 192 పైసలు (దమ్మిడీలు) ఉండేవి. అందు 12 పైసలను అణా అనీ, 24 పైసలను బేడ అనీ, 48 పైసలను పావులా అనీ, 96 పైసలను అర్ధరూపాయి అని అనేవారు.*

## శ్రీ మొసలికంటి తిరుమలరావు

మూడుకోట్ల జనాభా కలిగిన ఆంధ్ర దేశం తరపున కేంద్రంలో ఆంధ్రులొక్కరైనా మంత్రిపదవిలో వుండడం అవసరమనీ, కేంద్ర మంత్రి పదవిని నిర్వహించేటందుకు అన్ని విధాలా అర్హులైనవారు.

ఆంధ్రులలో అనేకులున్నారనీ లోగడ కేంద్ర ప్రభుత్వ పునర్నిర్మాణ సందర్భంలో మేము సూచించివున్నాము. ఇంత వరకు ఆ కొరత కొరతగానే వున్నప్పటికీ, శ్రీ మొసలికంటి తిరుమలరావు ఆహార, వ్యవసాయశాఖల ఉపమంత్రిగా నియమించబడినారన్న వార్త మాకు కొంత సంతృప్తిని కలిగించింది.

కేంద్రంలో అగ్రనాయకులు నలుగురైదుగురిని మినహాయించేట్టయితే ప్రస్తుతం మంత్రిపదవు లాక్రమించిన తక్కిన వ్యక్తులకు ఎవ్వరికీ ఏ విషయంలోగాని శ్రీ తిరుమలరావు తీసిపొయ్యేవారు కారు.


1920-21 సంవత్సరపు సహాయ నిరాకరణోద్యమ దినాలనుంచి నేటి వరకు ఇంచుమించు ముప్పయ్యేండ్లు కాంగ్రెసును అంటిపెట్టుకొని, త్రివిధ బహిష్కారం మొదలుకొని శాసనసభా ప్రవేశంవరకు కాంగ్రెసు కార్యక్రమాలు అన్నిట్లోనూ పాల్గొని, పిలుపు తగిలినప్పుడల్లా కాంగ్రెసు ఆదేశం ప్రకారం కారాగృహవాసం చేసి, తమ జీవితం యావత్తు దేశసేవకు అంకితం చేసినవారు శ్రీ తిరుమలరావు.

శాసనోల్లంఘనాది ప్రజోద్యమాలను నిర్వహించడమేగాక, శాసనసభా కార్యనిర్వహణలో సైతం శ్రీ తిరుమలరావుకు అనుభవ పరిజ్ఞానాలు లేనైనవి కావు. స్వాతంత్ర్యానికి పూర్వం భారత శాసనసభలోను, స్టేటు కౌన్సిలులోను సభ్యులుగావుండి మంచి వక్తగా, రాజకీయ పరిజ్ఞాతగా పిన్నలందరిలో పేరు సంపాదించారు. పార్లమెంటుకు ఎన్నుకొనబడిన తరువాత శ్రీ తిరుమలరావు దేశ సమస్యలు అనేకమైనవాటిని గూర్చి ఎక్కువ పరిశ్రమచేసి ప్రభుత్వానికి అందగా వుంటూవచ్చారు. వీరి శక్తి సామర్థ్యాలను గురించి ప్రభుత్వంవారు వీరిని అఖిలభారత ఆహార సేకరణ సంఘానికి అధ్యక్షులుగా నియమించడం జరిగింది. ఆ పదవిలో శ్రీ తిరుమలరావు ఆహార సమస్యకు సంబంధించి సాంగోపాంగమైన పరిజ్ఞానాన్ని గడించారు. అమూల్యమైన ఆ అనుభవమూ, సమగ్రమైన ఆ విషయ పరిజ్ఞానమూ ఆహార శాఖ ఉపమంత్రిగా సద్వినియోగం అయ్యేందుకు ఇప్పుడు చక్కటి అవకాశం ఏర్పడింది.

శ్రీ తిరుమలరావు సరసులు, స్నేహపాత్రులు. కేవలం స్వయంకృషివల్ల, ప్రజాసేవలవల్ల ఉన్నత స్థితికి వచ్చినవారు. ఆంధ్రోద్యమాల యెడల అపరిమితమైన అభిమానమూ, ఉత్సాహమూ గలవారు. ఆహారశాఖ ఉపమంత్రిగా వీరిని ఎన్నుకొన్నందుకు కేంద్రప్రభుత్వాన్ని అభినందిస్తున్నాము.

*(ఆంధ్రప్రభ 23-2-1950)*

## నిజాం నాయకుడు : శ్రీ బూర్గుల రామకృష్ణరావు




హైదరాబాద్ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీకి నాయకులుగా ఎన్నికైనందుకు శ్రీ బూర్గుల రామకృష్ణరావుని మేము హృదయపూర్వకంగా అభినందిస్తున్నాము. ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరగడం మరింత ముదావహం.

సంస్థానంలో అత్యధిక విస్తీర్ణం ఆంధ్ర ప్రాంతానిదే. జనాభాలోనే హెచ్చుమంది తెలుగు వారే. అయినప్పటికీ సంస్థాన ప్రభుత్వంలో ఆంధ్రులకు తగు ప్రాధాన్యం ఇంతవరకు లభించ లేదనే చెప్పాలి. చివరికి మొన్నను హైదరాబాద్ నగరానికి కాంగ్రెస్ అభ్యర్థులను నిర్ణయించడంలో కూడా ఆంధ్రులకు సముచిత ప్రాతినిధ్య మివ్వడం జరగలేదు. ఏమైనా, గత చరిత్రగా ఇక దీన్ని విస్మరించవచ్చు. శ్రీ రామకృష్ణరావు ఎన్నిక తర్వాత వెనకటి అసంతృప్తికి మరి తావు లేదు.

ఎట్టకేలకు సంస్థానంలోని ఆంధ్రజాతికి న్యాయం జరిగినందుకు మాత్రమే కాక, మరొక కారణానకూడా శ్రీ రామకృష్ణరావు ఎన్నిక హర్షించదగినట్టిది. ఈ రెండవ కారణం, - శ్రీ రావు ప్రతిభా విశేషాలు.

ఆయన తెలుగు, ఇంగ్లీషులలోనే కాకుండా, ఉర్దూ, పర్షియన్ లలో కూడా గొప్ప పండితులు. ఉర్దూలో ఆయన చక్కని కవిత్వాన్ని వ్రాశారు. ఉర్దూ ముషైరాలలో (కవి సమ్మేళనాలలో) అగ్రస్థానాన్ని ఆక్రమించగల కొద్దిమందిలో ఆయనొకరు. పారసీక సాహిత్యాన్ని ఆయన మధించారు. ఆ సాహిత్య చరిత్రను విరచించారు కూడా.

సాహిత్యరంగంలో ఆయన ప్రతిభకు ఈడైనదే న్యాయవాదవృత్తిలో ఆయన ప్రతిపత్తి. ఇండియా మొత్తంలోనే న్యాయశాస్త్రంలో ప్రవేశానికేమి, వాదపటిమలోనేమి, ఆయనను మించగలవారు అరుదని చెప్పవచ్చు. ఇంతగా గణన కెక్కిన న్యాయవాది ప్రముఖుడైనందునే ఆయనకు న్యాయశాఖా మంత్రి పదవిని కట్టబెట్టాలని సర్ మీర్జా ఇస్మాయిల్ తాను హైదరాబాద్ కు దివాన్గా పనిచేసిన కాలంలో చాలా ప్రయత్నించాడు. కాని, శ్రీ రామకృష్ణరావు ఆ పదవికి సమ్మతించలేదు.

ఇన్ని విధాల, ఇంతగా, శేముషీ దురంధరులైనందునే శ్రీ రామకృష్ణరావు హైదరాబాద్ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీకి నాయకులు కాదగువారని పండిట్ నెహ్రూ తక్కిన సంస్థాన నాయకులకు హితబోధ చేయడం తటస్థించింది.

స్వామి రామానంద, శ్రీ దిగంబర్ రావ్ బిందూ, డాక్టర్ జి.యన్.మేల్కోటే ప్రభృతులందరి విశ్వాసాన్ని చూరగొని, వారి సహాయ సహకారాలతో కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకులై, త్వరలోనే కొత్త హైదరాబాద్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి కానున్న శ్రీ రామకృష్ణరావుకు ఆ పదవి "కంటక కిరీటధారణ" కాగలదనడంలో సందేహంలేదు. ఆ కారణాలు ఏమైతే నేమి కాని, ఆంధ్రదేశంలో వలె తెలంగాణంలో కాంగ్రెస్ దెబ్బతిన్నది. తెలంగాణాలోని ఎనిమిది జిల్లాలలోని 87 అసెంబ్లీ స్థానాలలో కాంగ్రెసుకు 32 మాత్రమే లభించాయి. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పై ప్రజలకు గల అసంతృప్తికి ఈ ఫలితమొక నిదర్శనం. ఈ అసంతృప్తిని తొలగించడం శ్రీ రామకృష్ణరావు శ్రమపై సాధించవలసిన మొదటి విజయం.

ఇంతేకాక, అన్యప్రాంతాలకు లేని కొన్ని ప్రత్యేక సమస్యలు హైదరాబాద్ సంస్థానానికి వున్నాయి. వీటివల్ల కూడా శ్రీ రామకృష్ణరావు బాధ్యత అసామాన్యమైంది.

అయినా, తమ నిశిత మేధ ద్వారా, వ్యవహార దక్షతద్వారా, సామరస్య దృష్టిద్వారా శ్రీ రామకృష్ణరావు తమ పదవిని చరితార్థం చేసుకొగలరనే మేము విశ్వసిస్తున్నాము.

*(ఆంధ్రప్రభ 14-2-1952)*

## శ్రీ మల్లిపూడి పళ్లంరాజు

శ్రీ మల్లిపూడి పళ్లంరాజుగారి నిర్యాణంతో రాష్ట్రప్రభుత్వం ఒక ప్రధాన సభ్యుని, కాంగ్రెసు సంస్థ ఒక ప్రముఖ నాయకుని, దేశం ఒక పరమభక్తుని కోల్పోవడం జరిగింది.

కారాగారవాస క్లేశాలవల్ల ఎన్నడో ఆయన ఆరోగ్యం దెబ్బ తిన్నది. కొంతకాలంగా అస్వస్థత మరింత హెచ్చింది. అయినా, ఇంతలో ఆయన కన్ను మూస్తారని అనుకోలేదు. మరి కొంతకాలంపాటు ఆయన సేవలు రాష్ట్రానికి, దేశానికి లభించగలవనే ఆశించాము. ఇందుకు భిన్నంగా జరగడం ఎంతైనా శోచనీయం.

కోయంబత్తూరు వ్యవసాయ కళాశాలలో పట్టభద్రులు కావడమేమో, ఆయన రాజకీయ జీవితం ప్రారంభం కావడమేమో! సాంకేతిక విద్య నభ్యసించిన కారణాన 1923 ప్రాంతాల, కోరితే శ్రీ పళ్లంరాజుగారికి పెద్ద ఉద్యోగమే లభించేది. కాని, ఆయన దేశభక్తి, ఉద్యోగ సంపాదన పైకి మనస్సును పోనివ్వలేదు. తేలికగా

లభించగల పెద్ద ఉద్యోగాన్నే ఆయన కాంక్షించనప్పుడు వంశపారంపర్యంగా వస్తున్నదైనా, గ్రామ మునసబు పనిని ఆయన చేయగలరా? నిస్సంకోచంగా దానికి ఆయన రాజీనామా పెట్టారు.

అప్పటినుంచి, 1947లో స్వాతంత్ర్య లబ్ది వరకు ఆయన పాల్గొనని జాతీయోద్యమం లేదు. ఈ మధ్యకాలంలో ఒక దశాబ్దానికి పైగా ఆయన జీవితం కారాగారాలలో గడిచింది. 1929లో తూర్పుగోదావరి జిల్లా బోర్డు అధ్యక్షులుగా ఎన్నికై, ఆయన కొంతకాలం పాటు ఆ పదవిని నిర్వహించడం అప్పటిలో జాతీయ సమరమేదీ లేనందునే !

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో రామస్వామి రెడ్డియార్ మంత్రివర్గంలోనే ఆయన సభ్యులు కావలసింది. ఆ తర్వాత ఎన్నో సార్లు మంత్రివర్గాల నిర్మాణ సందర్భంలో ఆయన పేరు వినబడుతూ వచ్చింది. కాని, 1960లో సంజీవయ్య మంత్రివర్గం ఏర్పడేవరకు ఆయన మంత్రి కానేలేదు. ఈ విషయంలో ఆయన ఆశాభంగం చెందుతూ పోలేదనడం సత్యదూరం కాగలదు. అయితే, తన ఆశాభంగాన్ని అసహనంగా ఓర్వలేనితనంగా, కక్షగా ఆయన మారనివ్వలేదు. ఆ విధంగా చేయడం ఆయన కోమల ప్రవృత్తికే, సౌమ్యహృదయానికే విరుద్ధం.

రాక రాక మంత్రిపదవి వచ్చినా, ప్రదేశ్ కాంగ్రెసు నాయకత్వాన్ని తాను స్వీకరించవలసిన అవసరం కలిగేసరికి, మంత్రివర్గం నుంచి తప్పుకొనడానికి ఆయన సంకోచించ లేదు. అప్పటిలో ఆయన కొంత సంకోచాన్ని కనబరిస్తే, అది పదవిలో మార్పు విషయమై కాదు; తన అనారోగ్యస్థితిలో ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవికి సంబంధించిన కార్యభారాన్ని వహించగలనా అని మాత్రమే!

స్వాస్థ్యం తక్కువైనా క్రితం జనరల్ ఎన్నికలలో పళ్లంరాజుగారు విశేషంగా కృషిచేసి, కాంగ్రెసు విజయసాధనకు తోడ్పడ్డారు. ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షపదవికి సంబంధించిన కార్యభారాన్ని మరి వహించలేకనే సంజీవరెడ్డి మంత్రివర్గంలో ఆయన తిరిగి చేరారు. కాని, మరి కొంతకాలంపాటు ఆ పదవిని నిర్వహించకుండా మృత్యుదేవత ఇంతలోనే క్రూరంగా అంతరాయం కలిగించింది.

శ్రీ పళ్లంరాజుది నిండైన విగ్రహం. తొణకనికుండ వంటిది ఆయన మనస్సు. అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ వుండేవారు; చిరునవ్వులను చిందిస్తూ మాట్లాడుతూ వుండేవారు. తూర్పుగోదావరి జిల్లా రాష్ట్రాని కిచ్చిన కాంగ్రెసు నాయకులలో సాంబమూర్తిగారి ఉద్విగ్న ప్రవృత్తి కాని, కళా వెంకటరావుగారి నిశిత మేధాశక్తి కాని, శ్రీ పళ్లం రాజు గారిలో కానవచ్చేవి కావు. సరసత, సౌమ్యత - ఇవే ఆయన ప్రధాన లక్షణాలు. అందరికీ తలలో నాల్కవలె మెలగడానికే ఆయన ప్రయత్నం చేశారు. శ్రీ పళ్లంరాజుగారి కుటుంబానికి, వారి బంధు మిత్రులకు మా సానుభూతిని తెలియ జేస్తున్నాము. *(ఆంధ్రప్రభ 28-9-1962)*

## బహుముఖ ప్రజ్ఞాశాలి: శ్రీ కళా వెంకటరావు

ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ శాఖామాత్యుడు శ్రీ కళా వెంకటరావు నిన్న హైదరాబాద్లో శాశ్వతంగా కన్ను మూశాడన్న వార్త కాంగ్రెస్ వారికే కాక యావదాంధ్రలోకానికి అత్యంత విషాదకరం.

కొన్ని సంవత్సరాల నుంచి శ్రీ వెంకటరావు ఆరోగ్యం పట్టు తప్పిన కారణంగా ఆయన నిరంతర ఔషధ సేవ చెయ్యవలసిన అవసరం ఏర్పడినా, మంత్రిగా, ప్రముఖ కాంగ్రెసు నాయకుడుగా చివర గడియల వరకు ఆయన ప్రదర్శించిన ధీశక్తిని, ప్రజ్ఞా ప్రాభవాలను బట్టి ఇంతలోనే ఆయనకు నూరేళ్లు నిండగలవని కానీ, ఇంత హఠాత్తుగా కఠోరమైన ఆయన నిర్యాణ వార్తను దేశం వినవలసివుంటుందని కానీ మేము ఊహించలేదు.

1921 లో ప్రారంభమైన సహాయ నిరాకరణోద్యమం ఆంధ్రదేశమంతటా వేలకొలది యువకులను, విద్యార్థులను ఆకర్షించింది. అయితే, 1947 వరకు కొనసాగిన స్వాతంత్ర్య సమరంలో, సత్యాగ్రహ, శాసనోల్లంఘన కార్యక్రమాలలో ప్రభుత్వ నిర్బంధాలకు, ఇతర కష్టనిష్ఠూరాలకు తాళలేక కాంగ్రెసు నుంచి ఎందరో వైదొలిగారు. మరికొందరు రాజకీయాలకే పూర్తిగా స్వస్తి చెప్పారు.

కాని, శ్రీ కళా వెంకటరావు మాత్రం గాంధీజీ పూరించిన శంఖారావమాలకించి కళాశాలను బహిష్కరించింది మొదలుకుని స్వాతంత్ర్యం చేకూరే వరకు, అంతే కాదు - నిన్న రాత్రి దేహయాత్ర ముగించే వరకు కూడా, దాదాపు 40 సంవత్సరాలు, కాంగ్రెసుకు వెన్నెముకగా నిలిచి, దేశసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన ధన్యతముడు.

దేశంకోసం పలు బాధలపాలైన వారు, కారాగార శిక్షల ననుభవించిన వారు, లాఠీ దెబ్బలకు గురియైనవారు, ఆస్తులను కోల్పోయిన వారు త్యాగధనులనేకులున్నారు. అయితే, శ్రీ కళా వెంకటరావువలె కష్టాలను సహించడమే కాక, సత్యాగ్రహమే కానీ, శాసనసభా ఎన్నికలు కానీ, కాంగ్రెసు ఉద్యమాలన్నిటికి సారథ్యం వహించి అశేష భారతంలో ఆంధ్రరాష్ట్రానికి పేరు ప్రతిష్ఠల నార్జించిన వారు ఎందరో లేరు.

కాంగ్రెసు సంస్థను పటిష్ఠం చెయ్యడంలో, కలతలను పరిష్కరించి కాంగ్రెసువాదులంతా ఒకే తాటిపై నడిచేట్టు చెయ్యడంలో, కాంగ్రెసు సందేశాన్ని రాష్ట్రం నలుమూలలకు వ్యాపింప జెయ్యడంలో, ప్రత్యర్థుల మాయోపాయాలను ఛేదించి కాంగ్రెసు పార్టీకి విజయం సాధించడంలో అత్యంత సమర్థుడుగా పరిగణించబడడం చేతనే శ్రీ కళా వెంకటరావు 1949లోనే ఆల్ ఇండియా కాంగ్రెసుకు ప్రధాన కార్యదర్శిగా వరించబడినారు.

మరొక విశేషం. కాంగ్రెసుకు సంబంధించినంత వరకు దేశారాధకులుగా, ప్రజానుకూలురుగా, త్యాగమూర్తులుగా పేరొందిన వారెందరో వున్నారు. కాని, అట్టి వారందరు శాసనసభలలో రాణించలేదు; దేశ పరిపాలనలో దక్షులనిపించుకోలేదు. శ్రీ కళా వెంకటరావు, కాంగ్రెసు కార్యదురంధరుడుగా ఎంతటి ఖ్యాతిని గడించాడో శాసనసభ్యులుగా, మంత్రిగా కూడా అంతకు మించిన ప్రతిష్ఠను సంపాదించాడు.

1947 లో మొట్టమొదట సమష్టి మద్రాసు రాష్ట్రంలో రెవిన్యూ మంత్రిగా నియమించబడి, అటు పిమ్మట మద్రాసు ప్రభుత్వంలో నేమి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో నేమి ఆరోగ్య, పారిశ్రామిక, ఆర్థిక, రెవిన్యూ శాఖలను ఆయన సమధిక ప్రజ్ఞా ప్రాభవాలతో నిర్వహించాడు. వివిధ విషయాలలో సమగ్రమైన పరిజ్ఞానాన్ని, పాండిత్యాన్ని సాధించి ఎదటి వారిని నిరుత్తరులుగా చేయగలిగినాడు.

అన్నిటికంటె శ్రీ కళా వెంకటరావు పేరును చిరస్థాయి చేయగల ఘనకార్యం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో రెవిన్యూ మంత్రిగా జమీందారీ, ఇనాందారీల రద్దుకు ఆయన సాధించిన శాసనాలే. ఇట్టి సంస్కరణకు మొత్తం ఇండియా అంతటిలో మద్రాసును మార్గదర్శకంగా చేయజాలిన ఘనత శ్రీ వెంకటరావుగారే దక్కించుకున్నారు. ఆంధ్రప్రదేశ్కు రెవిన్యూ మంత్రిగా ప్రస్తుతం కాంగ్రెస్ తలపెట్టిన భూసంస్కరణల విషయంలో కూడ శ్రీ వెంకటరావు మంచి అభినివేశాన్ని, శ్రద్ధాసక్తులను కన్పరిచారు. వారి చేతిమీదుగానే ఆంధ్రప్రదేశ్లో పై సంస్కరణ నెరవేరక పోవడం నిజంగా శోచనీయం.

ఇన్నివిధాల దేశానికి సేవచేసిన దేశభక్తుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రజారంజకుడైన నాయకుడు. 60 సంవత్సరాలు నిండకుండానే విగతజీవుడు కావడం ఆంధ్రజాతికే కాదు, అశేష భారతావనికే తీరని నష్టం.

*(ఆంధ్రప్రభ 29-3-1959)*

## శ్రీ బులుసు సాంబమూర్తి




శ్రీ బులుసు సాంబమూర్తి నిర్యాణంతో ఆంధ్రదేశం - ఆంధ్రదేశమే కాదు, అఖిల భారతంమరొక దేశభక్తుని, త్యాగమూర్తిని, స్వాతంత్ర్య యోధుని, సాహసోపేతుని కోల్పోయింది. ఔను; దేశభక్తికి మారుపేరు శ్రీ సాంబమూర్తి. గాంధీజీ పిలుపు విని 1921లో న్యాయవాద వృత్తిని వదిలిపెట్టినది మొదలుకుని మొన్న కాకినాడలో కన్ను మూసినంతవరకు ఆయన జీవితం దేశ సేవకే అంకితమైంది.

గాంధీజీ ప్రారంభించిన సహాయనిరాకరణ, సత్యాగ్రహోద్యమాలలో ఆంధ్రదేశం ముందు నడిచిందంటే, స్వాతంత్ర్య సంరంభంలో ఆంధ్రదేశం కాంగ్రెసుకు పట్టుగొమ్మగా, పరప్రభుత్వానికి సింహస్వప్నంగా పరిగణించబడిందంటే, స్వాతంత్ర్య సమరాంగణానికి ఆంధ్రజాతి వేల సంఖ్యలలో దేశారాధకులను

సమకూర్చ జాలిందంటే, దేశోద్ధారక నాగేశ్వరరావు, ఆంధ్రకేసరి ప్రకాశం, మహర్షి బులుసు సాంబమూర్తివంటి వ్యక్తులు మార్గదర్శకులై జాతీయోద్యమంలో ప్రజలకు నాయకత్వం వహించడం ఒక ప్రధానకారణం.

శ్రీ సాంబమూర్తి దేశసేవ తెలుగు దేశానికి మాత్రమే పరిమితం కాలేదు. 1923లో అఖిలభారత కాంగ్రెసు మహాసభకు కార్యదర్శియైనది మొదలుకుని ఆయన తన దేశారాధనకు యావద్భారతాన్ని కార్యరంగంగా చేసుకున్నాడు. మొత్తం భారత దేశంలో శాసనోల్లంఘనానికి ఎక్కడనుంచి పిలుపు తగిలినా, పట్టపగ్గాలు లేని బ్రిటీష్ సామ్రాజ్యాధికారాన్ని ఏమూల ఎదుర్కొనవలసివచ్చినా - నాగపూర్లోనే కాదు, మద్రాసులోనే కాదు - అన్ని నగరాలలో శాసనోల్లంఘనానికి ముందు పంక్తిలో ఆయనే హాజరు. 1928 లో అఖిలభారత హిందూస్తాన్ సేవాదళ్కు అధ్యక్షుడుగా కూడా వరించబడ్డాడు.




అంతేకాదు; కాంగ్రెసు మహాసభ సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని భారతజాతి లక్ష్యంగా నిర్దేశించు కొనక పూర్వమే, గాంధి మహాత్మునితోపాటు అగ్రనాయకు లెవ్వరూ సంపూర్ణ స్వాతంత్ర్యాశయాన్ని అంగీకరించక ముందే శ్రీ సాంబమూర్తి ఆసేతు హిమాచలం యావద్భారతంలో సంపూర్ణ స్వాతంత్ర్యవాదాన్ని ప్రచారం చేశారు.

శ్రీ సాంబమూర్తి దేశభక్తి ఎంత అచంచలమో, ఆయన త్యాగశక్తి కూడా అంత సమున్నతం. చేతికి అంది వచ్చిన ఏకైక పుత్రుని కోల్పోయినప్పుడు కూడా, పుత్రశోకాన్నిదిగమ్రింగి, 1923లో కాకినాడలో జరిగిన కాంగ్రెసు మహాసభ ఆహ్వాన సంఘ కార్యక్రమాన్ని అకుంఠిత దీక్షతో కొనసాగించి, సరోజినీ నాయుడు మొదలైనవారి ప్రస్తుతులకు పాత్రమైనట్టిది సాంబమూర్తి త్యాగనిష్ఠ.

144 వ సెక్షను క్రింద నిషేధపుటుత్తరువును ధిక్కరించి కాకినాడ పురవీధులలో బహిరంగ సభ జరిపినందుకు స్మృతి తప్పి పడిపోయేవరకు పోలీసు భటులు లాఠీలతో, బూటు కాళ్ళతో క్రూరంగా హింసించినా ఒక్కింత కూడా చలించని వ్యక్తి శ్రీ సాంబమూర్తి. అనేక సత్యాగ్రహోద్యమాలలో ఆయన జైలు యాత్రలేమి, జైళ్ళలో ఆయన కఠోర నిరశన వ్రతాలేమి, జీవితాంతంవరకు ఆయన వలచిన కటిక దారిద్ర్యమేమి శ్రీ సాంబమూర్తిని త్యాగమూర్తిగా మలిచాయి.

శాసనోల్లంఘకునిగా, సత్యాగ్రహోద్యోగిగా, సంపూర్ణ స్వాతంత్ర్యవాదిగా గానే కాక 1937లో కాంగ్రెసు మొట్ట మొదటిసారి ప్రభుత్వాధికారం చేపట్టినప్పుడు సమష్టి మద్రాసు రాష్ట్రం అసెంబ్లీకి స్పీకర్గా ఎన్నుకొనబడి, శాసనసభా కార్యక్రమ నిర్వహణలో, పార్లమెంటరీ సంప్రదాయాను గణ్యమైన సిద్ధాంత నిరూపణలో శ్రీ సాంబమూర్తి అఖిలభారత ప్రశస్తిని పొందగలిగాడు.

ఆంధ్ర దేశానికే కాక, మొత్తం ఇండియాకు కూడా అట్టి మహాయోధుడు, అట్టి ధీరోదారుడు, అట్టి ప్రముఖ నాయకుడు లేని కొరత ఇంతలో తీరునది కాదు. *(ఆంధ్రప్రభ 4-1-1958)*

## డాక్టర్ వి.యస్.కృష్ణ

పోయిన పదునాల్గవ తేదీని పదవీ స్వీకారమా! ఈ పదహారవ తేదీని పరమ పదించడమా! ఎంతటి విషాదకర పరిస్థితులలో డాక్టర్ వాసిరెడ్డి శ్రీకృష్ణగారు మనలను విడిచి వెళ్ళారు! ఆయన ఈ ఆకస్మిక మరణం - ఈ అకాల మృతి - ఆయన ఆప్తబృందానికే కాక, ఆంధ్రరాష్ట్రానికే కాక, అఖిల భారతానికే తీరని నష్టం.

ఆయనను మించిన విద్యావంతు లుండవచ్చు కాని, ఆయనను పోలిన వినయ సంపన్ను లెందరు? ఆయన కంటె ప్రతిభావంతు లుండవచ్చు. కాని, ఆయనకు ఈడు రాగల పరిపాలనాదక్షు లెందరు? ఆయనకంటే పేరుమోసిన వారుండవచ్చు; కాని, ఆయనను మించి దేశానికి నిరాడంబర సేవచేసినవా రెందరు?

ఒకటి, రెండుసార్లు కలుసుకొన్నా, శాశ్వతంగా మనస్సుకు హత్తుకుపోయే విశిష్ట వ్యక్తిత్వమున్న సత్పురుషుడు డాక్టర్ వి.ఎస్. కృష్ణ. నిండైనది ఆయన విగ్రహం. ఆయన స్థూలకాయమే ముందుగా మన దృష్టి నాకర్షించినా, తన విగ్రహపుష్టిని గురించి తానే నవ్వుతూ విసురుకున్న ఛలోక్తిని విన్నంతనే వెలుగులీనే ఆయన కన్నులపైకి, శైశవ నైర్మల్యాన్ని ప్రతిఫలించే ఆయన వికసిత వదనం పైకి మనచూపు మరలేది. మరి కొన్ని నిమిషాలలోనే ఒక మిత్రుని, ఒక ఆప్తుని, ఒక మేధావిని, ఒక పండితుని, ఒక సచ్ఛీలుని, నూటికో కోటికో తప్ప కానరాని ఒక వ్యక్తిని కలుసుకొన గలిగినామన్న దృఢాభిప్రాయం కుదురుకొనేది.

తెలియదగినంతగా లోకానికి తెలియలేదు గాని, అర్థశాస్త్రంలో ఆయన మహాపండితుడు, రాజకీయ శాస్త్రంలో కూడా ఆయన పాండితి అల్పమైంది కాదు. తత్త్వశాస్త్రాలంటే ఆయనకు ప్రత్యేకమైన అభిమానం. ఈ మూడు శాస్త్రాలను గురించి ఆయనవద్ద మొత్తం భారతదేశంలో మరొక వ్యక్తివద్ద బహుశా కానరాని అమూల్య గ్రంథసంచయం వుండేది. దేశదేశాలలో ప్రత్యేక శ్రద్ధాసక్తులతో ఆయన ఈ గ్రంథావళిని సేకరించారు. వ్యయప్రయాసలను పాటించక తాము సేకరించుకొన్న ఈ గ్రంథ సంచయాన్ని యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్కు అధ్యక్షులుగా వెడుతూ ఆయన ఆంధ్ర విశ్వకళాపరిషత్తు గ్రంథాలయానికి బహూకరించి వెళ్ళడం, పదకొండు సంవత్సరాలపాటు వైస్ ఛాన్సలర్ ఏ సంస్థ సర్వతోముఖాభివృద్ధికి తాము ఏకాగ్రతతో, నిర్విరామంగా, ప్రతిభాపూర్వకంగా కృషి చేశారో ఆ సంస్థపట్ల తమకున్న గాఢ ప్రేమాభిమానాలకు తార్కాణం.

ఆంధ్ర విశ్వకళాపరిషత్తుతో డాక్టర్ కృష్ణగారి అనుబంధం కేవలం వైస్ ఛాన్సలర్గానే కాదు. 1932 లో ఎకనామిక్స్ లెక్చరర్గా యూనివర్శిటీలో ప్రవేశించిననాడే దానితో ఆయనకు అనుబంధ మేర్పడింది. ఆక్స్ఫర్డ్ నుంచి తాము తెచ్చుకొన్న డిగ్రీతో సంతృప్తి చెందక డాక్టరేట్ను సంపాదించడానికి అటు తర్వాత ఆయన వియన్నా వెళ్ళింది ఆంధ్ర విశ్వకళాపరిషత్తును మరింతగా సేవించాలన్న తలంపుతోనే. వియన్నా నుంచి డాక్టరేట్తో తిరిగి రాగానే ఆయన ఎకనామిక్స్ డిపార్టుమెంటులో రీడర్ గా చేరారు. పిమ్మట ఆరు సంవత్సరాలపాటు - 1936-42 సంవత్సరాల మధ్య - యూనివర్శిటీ రిజిస్ట్రార్ పరిపాలనానుభవాన్ని

గడించారు. వెనుక (1947లో) యూనివర్శిటీ కాలేజి ప్రినల్గా నియమితులైనారు. తదుపరి రెండేళ్ళకే అత్యధిక సంఖ్యాకుల ఆహ్వానంపై వైస్ ఛాన్సలర్ పదవిని స్వీకరించారు.

డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ల వంటి ఉద్దండులు ఆక్రమించిన స్థానాన్ని వారి వెను వెంటనే స్వీకరించడం, మాటలు కాదు; స్వీకరించి, దానిలో రాణించడమంటే అది సామాన్య విషయం కాదు. అయినా, వైస్ ఛాన్సలర్గా పదవీస్వీకారం చేసిన నాటినుంచి, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ అధ్యక్షుడుగా మొన్ననే వెళ్లిననాటి వరకు “ఆంధ్ర విశ్వకళాపరిషత్తు అదృష్టం పండింది” అన్నట్టుగా ఆయన దాన్ని పరిపాలించి, మొత్తం దేశం చేతనే “శెబాష్” అనిపించుకున్నారు.

వైజ్ఞానిక శాస్త్రంలో - ప్రత్యేకించి అణుశాస్త్రంలో - ఆంధ్ర విశ్వకళాపరిషత్తుకు నేడు ప్రపంచం మొత్తంలోనే మన్నన కలదంటే, అది డాక్టర్ కృష్ణ కృషి ఫలితం. ఆర్థిక, తాత్విక శాస్త్రాలలో ఆంధ్ర విశ్వకళాపరిషత్తుకు కీర్తి ప్రతిష్ఠలు కలవంటే అది ఆయన చలవే! ఇండియన్ యూనివర్శిటీలలో అత్యుత్తమంగా పరిపాలించబడుతున్నదన్న ఖ్యాతిని ఆంధ్ర విశ్వకళాపరిషత్తు గడించుకొన్నందునే డాక్టర్ కృష్ణని యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ అధ్యక్ష పదవికి ఆహ్వానించడం జరిగింది.

ఆ పదవీ స్వీకారాన్ని చేసిన తర్వాత కొన్ని రోజులకే ఆయన పరమపదించడం యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ దురదృష్టం; భారతీయ విద్యారంగం దౌర్భాగ్యం. ఫోర్డ్ ఫౌండేషన్ వారి సహాయ సహకారాలతో ఢిల్లీలో ఒక ఫెడ్రల్ యూనివర్శిటీ సంస్థాపన సమస్యను గురించి చర్చించడానికి కేంద్ర విద్యామంత్రి డాక్టర్ కె.ఎల్. శ్రీమాలితో ఆయన కార్యాలయంలో చర్చలు జరుపుతూ కన్ను మూయడం మనకు ఎంత విషాదకరమైనా, డాక్టర్ కృష్ణ విశిష్ట వ్యక్తిత్వం దృష్ట్యా ఆయన జీవిత చరిత్రకు తగు అంతమేమో! ఇండియాలో యూనివర్శిటీ విద్యను అత్యుత్తమ స్థాయికి తీసుకువెళ్ళే తన సత్కృషిలోనే ఆయన జీవితకాలాన్ని గడిపారు; కృషిని సాగిస్తూనే ఆయన జీవయాత్రను చాలించారు. వెలితి లేని ధన్యజీవిగా ఆయన వెళ్ళిపోయారు; వెలితి మిగిలింది. దేశానికే!

*(ఆంధ్రజ్యోతి 17-2-1961)*

## అమరజీవి : శ్రీ పొట్టి శ్రీరాములు

ఆయన ఇంటి పేరు “పొట్టి” కావచ్చు; మనిషికూడా మొత్తంపై పొట్టి కావచ్చు; కాని, అంతస్థులో మాత్రం శ్రీ పొట్టి శ్రీరాములు చాలా పొడగరి. “ఇంతింతై, వటుడింతయై, మరియు తానింతై” అన్నట్టు పెరుగుతూ, పెరుగుతూ పోయి, ఆయన ఆంధ్రజాతికి సంబంధించినంతవరకు చివరికి “బ్రహ్మాండాంత సంవర్ధి” అయ్యాడు. ఆయన జన్మదినం ఈ మార్చి 16 వ తేదీ. ఈ జయంతి సందర్భంలో ఆంధ్రులందరితోపాటు మేముకూడా భక్తిపూర్వంగా ఆయనకు చేతులెత్తి నమస్కరిస్తున్నాము.



ఒక లక్ష్యసాధన కోసం ఆయన ఆత్మార్పణ చేశాడు. ఆ లక్ష్యం గొప్పది; ఆ లక్ష్యసాధన కోసం జరిగిన త్యాగం మానవుడు చేయగలిగిన త్యాగాలన్నింటిలోనూ గొప్పది. ఇవి నిర్వివాద విషయాలైనా, శ్రీ శ్రీరాములు సజీవులై లేని కొరత మనకు అడుగడుగునా కానరావడం లేదా? ఎన్నెన్నో రంగాలలో, ఎందరెందరో నిస్వార్థ ప్రజాసేవకులు మనకు కావాలి. అట్టివారు పెక్కు మంది వున్నా, శ్రీ శ్రీరాములు లేని లోపం మనకు తప్పక కానవచ్చేది; కాని, అట్టివారి సంఖ్య బహు పరిమితం కాబట్టి, ఆ లోటు ఎంతగానో కానవస్తున్నది.



“శ్రీ శ్రీరాములు సేవాభాగ్యం ఆయన సాధించిన ఆంధ్రరాష్ట్రానికి మరి లేకుండా పోయిందే!” అని మనం భిన్నులమైవుండగా ఆంధ్రోద్యమానికి ఆదినుంచీ పెద్ద అండగా వున్న స్వామి సీతారాంగారు ప్రాయోపవేశాన్ని ప్రారంభించి, ఎందరెన్ని విజ్ఞప్తులు చేస్తున్నా, దాన్ని కొనసాగిస్తూ వుండడం అతి విషాదకరం. ప్రాణబలి కంటె జీవితార్పణే మహత్తర త్యాగం కాగల ఘట్టాలు అనేకం వుంటాయి. అట్టిదే ఆంధ్ర చరిత్రలో ప్రస్తుత ఘట్టం, కనుకనే మద్యనిషేధ లక్ష్యం కోసం అసువులర్పించక, దానికోసమే జీవించి, దాన్ని సాధించవలసిందిగా స్వామీజీని మేము తిరిగి అర్థిస్తున్నాము.

మద్యనిషేధ శాసనాన్ని యథాతథంగా నిలపడం ఒక పెద్ద విశేషం కాదు. ఆ శాసనాన్ని సక్రమంగా అమలు జరపడంలోనే విషమ పరీక్ష వున్నది. అది అమలు జరుగుతున్నదని అనుకోవడం కేవలం ఆత్మవంచనగా పరిణమించింది కాబట్టే, భావి కర్తవ్యాన్ని గురించి ఇప్పుడు పరిశీలన జరుగుతున్నది. ఆ పరిశీలనకు స్వామీజీ కూడా తోడ్పడాలి. ఇంతే కాదు. ఇప్పటి పద్ధతిలో కాకపోతే, మరొక దాని ద్వారా ఎప్పటికైనా సాధించవలసిన అంతిమలక్ష్యంగా మద్యనిషేధాన్ని అందరు గుర్తిస్తున్నారు కాబట్టి ఆ లక్ష్యం కోసమే స్వామీజీ శతాయువై వర్ధిల్లాలి. శ్రీరాములు పవిత్రాత్మకు నేడు జోహారు లర్పిస్తూ, ఈ సందర్భాన్ని ప్రాయోపవేశ విరమణకు స్వామీజీకి విజ్ఞప్తుల కోసం మా వలెనే ఇతరులు కూడా వినియోగించగలరని ఆశిస్తున్నాము.

*(ఆంధ్రప్రభ 17-3-1954)*

## శ్రీ ఖాసా సుబ్బారావు

ఎంత స్వచ్ఛమైనది ఆయన కండ్లలోని వెలుగు! అది మరి ప్రకాశించదు ఎంతగా మధురమైనది ఆయన పెదవులపై చిరునవ్వు! అది మరి నటించదు. ఎంతటి నిశితమైనది ఆయన చేతిలోని కలం! అది మరి వ్రాయదు. ఎంత నిర్భీకమైనది ఆయన వాణి ! దాన్ని మనం మరి వినబోము! పత్రికా ప్రపంచంలోనే కాక, ప్రజాహిత జీవిత రంగంలోనే పెద్ద వెలితిని మిగిల్చి, శ్రీ ఖాసా సుబ్బారావు మన మధ్యనుంచి వెళ్ళి పోయారు.

మరొక వృత్తిలో ప్రవేశించలేక ఆయన పత్రికా రంగంలోకి రాలేదు. కోరితే ఆయన ఉపాధ్యాయ వృత్తిలో మిగిలి పోగలిగేవారు. లేదా, న్యాయవాదిగా ఎంతో ఆర్జించ గలిగేవారు. ఈ రెండు వృత్తులకు తగు పరిపూర్ణార్హత లుండి కూడా ఆయన పత్రికా రంగంలోకి రావడం దేశం పిలుపు విన్నందునే!

భుక్తి గడవడానికి ఒక వృత్తిగానో, లేక ఇటీవల కొందరి విషయంలో జరుగుతున్నట్టు, లక్షలను మూటగట్టడానికి ఒక మార్గంగానో కాక, దేశసేవకు ఒక మహదవకాశాన్ని కల్పించగలదన్న విశ్వాసంతోనే 1923లో శ్రీ సుబ్బారావు "స్వరాజ్య"లో ప్రవేశించినా, వేతనం విషయమై వివాదపడికాదు; పత్రికా సంపాదకునిగా తన భావ స్వాతంత్ర్య పరిరక్షణకు మాత్రమే; చేస్తున్న ఉద్యోగాన్ని చేజేతుల వదులుకొంటే, మరొకటి దొరుకుతుందా? ఈ లోపున సంసారం ఎలా గడుస్తుంది? రేపటికి ఇంటి ఖర్చులకు పైకం లేదని ఇవ్వాళ ప్రొద్దుననే కదా ఇల్లాలు చెప్పింది! - ఈ విధమైన ఆలోచనలు ఆయన దరిదాపులకైనా వచ్చేవి కావు. సంపాదకుడుగా తన స్వేచ్ఛకు, తన స్వాతంత్ర్యానికి కించిత్తుగానైనా విఘాతం కలిగినట్టు తోచినంతనే రాజీనామా లేఖను ఆయన అందజేసేవారు. ఇట్టి సంపాదకులు ఈ దేశంలో అంతకంతకు ఎంత కరువైపోతున్నారు. ఇందుమూలంగా పత్రికా సంపాదకత్వం ఎంతటి ఉన్నత స్థాయినుంచి ఎంతటి నీచస్థితికి దిగజారి పోతున్నది!!

దాదాపు ముప్పది సంవత్సరాలకు విస్తరించిన తమ పత్రికా సంపాదకత్వంలో శ్రీ ఖాసా సుబ్బారావు కలం నుంచి ఆయన పరిపూర్ణంగా విశ్వసించని ఒక అభిప్రాయం కాని, ఒక అక్షరం కాని రాలలేదని చెప్పడం అత్యుక్తికాదు. ఒకే వ్యక్తిని గురించి, ఒకే సంస్థను గురించి, ఒకే సమస్యను గురించి ఈ సంవత్సరం వెల్లడించిన అభిప్రాయాలకు పూర్తిగా విరుద్ధమైన వాటిని మరు సంవత్సరంలోనే, మరుసటి నెలలోనే కూడా ఆయన వ్రాసిన సందర్భాలు కొన్ని వుండవచ్చు. అయినా, మొదట వ్రాసిన అభిప్రాయాలవలె ఆ తర్వాత వెల్లడించినవి కూడా చిత్తశుద్ధితో వ్రాసినట్టివే, నిష్కల్మష హృదయంతో ప్రకటించినట్టివే! స్వవచన వ్యాఘాతం ఆయన దృష్టిలో ఒక దోషంకాదు; స్వవచన వ్యాఘాతానికి వెరచి, పూర్వాభిప్రాయాలు మారిపోయినా వాటినే అంటిపెట్టుకొని వుండడం మాత్రమే సహించరాని - క్షమింపరాని మహాదోషం.

నిస్సందేహంగా ఆయన ఆలోచనాపరుడే! ఆయనది దీర్ఘాలోచన కాకపోవచ్చు; దూరాలోచన కాకపోవచ్చు; ఆయినా, అది నిశితమైన ఆలోచన. అయితే, మేధ కంటె హృదయమే ఆయన ఆలోచనను ఎక్కువ

తీర్చిదిద్దుతుందనే అనుమానం అనేక సందర్భాలలో కలుగుతూ వుండేది. మేధను మించి హృదయమే ఆయన లేఖినిపై ప్రబలంగా రాజ్యంచేయబట్టే, ఆయన ఏమివ్రాసినా గుండె కొట్టుకొంటున్న సవ్వడి దానినుంచి వినవచ్చేది ! అందువల్లనే కావచ్చు, విధానాల కంటె కూడా వ్యక్తులకు ఆయన అధిక ప్రాధాన్యమివ్వడం జరిగింది కూడా.

ముఖ్యంగా ఇద్దరు ప్రముఖ వ్యక్తులు - కొన్ని కొన్ని సమయాలలో శ్రీ ప్రకాశం, మరి కొన్ని వేళలలో రాజాజీ ఆయన జీవితాన్ని విశేషంగా ప్రభావితం చేశారు. అయితే, వారిద్దరిని సయితం అతి తీవ్రంగా, ఎంతో నిర్దాక్షిణ్యంగా ఆయన విమర్శించిన సందర్భాలనేకం. ఆయనతో సన్నిహిత పరిచయం లేనివారికి ఇది ఆయన చంచల ప్రవృత్తికి ఒక నిదర్శనంగా తోచి వుండవచ్చు. కాని, సంపాదకీయాల రచనా సమయంలో ఆయనను ఒక్కసారైనా చూచివున్నవారు మాత్రం ఈ విధమైన ఆరోపణ చేయలేరు. అరఠావు కాగితాల పైన, మందపుకొయ్య పలకను ఒత్తుగా పెట్టుకుని, పార్కర్ కలంతో, చిన్ని ముత్యాలను పోలిన కుదురైన అక్షరాలతో, దగ్గరి దగ్గరి పంక్తులతో, ఒక శిల్పాన్ని చెక్కుతున్నట్టు సంపాదకీయాన్ని వ్రాస్తునప్పుడు ఆయన బాహ్యజగత్తునే పూర్తిగా మరచిపోతూ వుండేవారు. అప్పుడు సుబ్బారావుగారి ముఖం గంభీర ముద్రాంకితమై వుండేది; ఆయన కన్నులలోని విశేషమైన ఏకాగ్రత కానవచ్చేది; తాను ఆ క్షణంలో వ్రాస్తున్న ఆ పలుకుల పైనే తన జీవితమే కాక, ప్రపంచం భవిష్యత్తే ఆధారపడి వున్నట్టుగా ఆయన భావిస్తున్నట్టు అనిపించేది!

ఆయన వ్రాత ఎంత తీక్షణమో, ఆయన హృదయమంత సౌమ్యం. ఎన్ని బాధలకు తాను సంసిద్ధపడినా (స్వాతంత్ర్య సమర సందర్భంలో లాఠీ దెబ్బల తీవ్రతకు ప్రాణం పోతున్నట్టు అనిపించినప్పుడే ఆయన చలించలేదు) అన్యుల కష్టకథ వింటే ఆయన ఇట్టే కరిగిపోయేవారు. కష్టాలలోనున్నట్టు ఏదో కట్టుకథను చెప్పి, ఆయన జేబులో ఎంత వుంటే అంతటినీ కాజేసుకు పోయిన వారి సంఖ్య పదులలో కాదు, వందలలోనే. ఇంతటి మెత్తని మనస్సు గలవారైనా, సన్నిహితులైన వారినే, ఆప్తులైనవారినే, ఆ క్రితంనాటివరకు తనకు పరిపూర్ణ గౌరవభాజనులైన వారినే శ్రీ సుబ్బారావు కొన్ని సందర్భాలలో నిశితంగా విమర్శించడం, ఆ పని తనకెంత బాధాకరమైనా, అందుకు వెనుదీస్తే, పత్రికా సంపాదకుడుగా తన ధర్మాన్ని తాను పాటించక పోవడమే కాగలదన్న నిశ్చల విశ్వాసంతోనే!

వ్యక్తిగత సంబంధ బాంధవ్యాలలో ఆర్ద్రత, పత్రికా రచన సందర్భంలో అవసరమైనప్పుడు వజ్ర సన్నిత కఠోరత్వం, వ్యక్తిగత జీవితంలో నిరాడంబరత్వం, రచనా విధానంలో శిల్పవైభవం. ధనం పట్ల నిర్లక్ష్యం, పుస్తకాలంటే మమకారం, రాజకీయ పదవుల పట్ల వైముఖ్యం, రాజకీయాలను తీర్చి దిద్దడం పట్ల విశేషానురక్తి, బట్ట మాసినా, జుట్టు మాసినా పట్టించు కొనక పోవడం, పత్రికలో ఒక చిన్న తప్పుపడినా, ఆ రాత్రి కంటికి నిద్ర దూరం కావడం; పరస్పర విరుద్ధంగా తోచే ఇట్టి లక్షణాలతో పదును వారినట్టిది.

శ్రీ సుబ్బారావు ప్రవృత్తి, ఆయనను మించి చదువుకున్న పత్రికా సంపాదకులుండవచ్చు; ఆయనను మించి ఇంగ్లీషు భాషపై అధికారమున్న వారుండవచ్చు. కాని, చిత్తశుద్ధిలో, విశిష్ట లక్ష్యాలలో, ఏకాగ్రతలో, నిర్భీకతలో ఆయనకు సాటి రాగల వారు దాదాపు లేరు!
శ్రీ ఖాసా సుబ్బారావు మరి లేరు: ఆయన లేని లోపాన్ని తీర్చేవారు మరొకరు లేరు.

# మహాకవి శ్రీ గురజాడ అప్పారావు -1

ఆయన జన్మించింది 19వ శతాబ్దిలో; వ్రాసింది 20వ శతాబ్ది కోసం; 21వ శతాబ్ది కోసం. ఆయన పెరిగింది ఫ్యూడల్ పరిసరాలలో; తపన చెందింది సమతాయుగం కోసం. ఆయన సేవ చేసింది విజయనగరం రాజులకు, రాణులకు; కలలుగన్నది ప్రజాస్వామ్యాన్ని గురించి.



ఆయన జీవితకాలంలోగాని, కన్నుమూసిన తర్వాత ఒకటి, రెండు దశాబ్దాలలోగాని, శ్రీ గురజాడ అప్పారావుకు లేని కీర్తి ప్రతిష్ఠలు ఈనాడు ఆయనకు రావడానికి నానాటికి ఆయనపట్ల ప్రేమ గౌరవాలు పెరగడానికి కారణం ఆయన తన కాలానికి, తన తరానికి మాత్రమే తన దృష్టిని పరిమితం చేయక, ముందు కాలాలకు, ముందు తరాలకు దాన్ని ప్రసరింపజేయడమే!

“స్టెండాల్” అనే మారుపేరుతో ఫ్రెంచిలో నవలలు వ్రాసిన మారీ హెన్రీ బెల్ (1783-1842) తాను పరమ పదించిన పిమ్మట ఒక శతాబ్దానికి కాని ప్రపంచం తన ప్రతిభను గుర్తించబోదన్నాడు. “పేరు ప్రతిష్ఠలనే లాటరీలో నేనొక టిక్కెట్టు కొన్నాను. దానిలో నాకు 1935 నాటికి పెద్ద బహుమతి వస్తుంది” అని 1835లో ఆయన ఉద్ఘాటించాడు. ఇట్టి లాటరీలో అప్పారావుగారు కొన్న టిక్కెట్టుకు అర్ధ శతాబ్ది తర్వాత పెద్ద బహుమతి వచ్చింది.

స్టెండాల్తో పోల్చినప్పుడు అప్పారావుగారు వ్రాసింది బహు తక్కువ. ఆయన కవిత పట్టుమని పది పదుల పుటలైనా కావు. ఆయన ప్రచురించింది అయిదు చిన్న కథలు మాత్రమే. మూడు నాటకాలను ప్రారంభించి, రెండింటిని అసంపూర్ణంగానే విడిచిపెట్టారు. ఇంగ్లీషులోను, తెలుగులోను ఆయన వ్రాసిన వ్యాసాలైనా పెద్దగా లేవు. అయినా, మహాకవిగా ఈ తరంవారు ఆయనను గుర్తించడం, ఆయనకు జోహారు లర్పించడం, తాను చేసిన కొద్దిపాటి రచనలలోనే మహాద్రష్టగా ఆయన మనకు సాక్షాత్కరిస్తున్నందునే.

జన్మవల్ల అప్పారావుగారిది ఏ మతమైనా, ఆయన ప్రేమ గౌరవాలను చూరగొన్న మతం మాత్రం మానవత. అందువల్లనే “మతం వేరైతేను యేమోయ్? మనసు లొకటై మనుషులుంటే, జాతమన్నది లేచి పెరిగి, లోకమున రాణించునోయ్!” అని ఆయన హెచ్చరించారు. అందువల్లనే “దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్” అని ఆయన ప్రబోధించారు. అందువల్లనే “మంచి చెడ్డలు మనుజులందున, ఎంచి చూడగ రెండె కులములు, మంచియన్నది మాలయైతే, మాలనే అగుదున్” అని ఆయన ఉద్ఘోషించారు.

మానవత ఆయనకు మతమైనందునే, సామాన్య మానవుని ఆయన పట్టాభిషేకం చేయగోరి నందునే పండితులకు పరిమితమైన గ్రాంథిక భాషను అప్పారావుగారు ఏవగించుకొన్నారు; వ్యావహారికభాషను అభిమానించారు.



"సంకెళ్ళను ప్రేమించేవారిని దాన్ని (గ్రాంథిక భాషను) ప్రేమించనివ్వండి. కాని, నాకు మాత్రం ఏ భాషలో మన సుఖదుఃఖాలను మనం జంకులేకుండా వ్యక్తపరుస్తామో, ఏ భాషను నేను నా తల్లి వొడిలో నేర్చుకొన్నానో, ఆ సజీవమైన భాషే కావాలి" అని చెప్పడం ఆయనకే చెల్లింది. వ్యావహారిక భాషోద్యమాన్ని గురించి ప్రస్తావిస్తూ "నాది ప్రజోద్యమం; ఎవరిని సంతృప్తిపరచడానికి దాన్ని నేను వదులుకోను" అని ఉద్ఘాటించడం సయితం ఆయనకే చెల్లింది.

అప్పారావుగారు కలలుగన్న ప్రజాయుగం వచ్చింది. అయినా, ఆయన అభిమానించిన ప్రజాభాషను (వ్యావహారిక భాషను) మన యూనివర్శిటీలు, మన విద్యాశాఖాధికారులు ఇంకా వెలివేస్తూనే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యాన ఒక వైపున అప్పారావుగారి శతజయంతి మహోత్సవాలు జరుగుతుండగా మరొకవైపున ఆయన ప్రజోద్యమంగా పరిగణించిన వ్యావహారిక భాషోద్యమాన్ని గుర్తించక పోవడం భావ్యమా? మంత్రులు మాట్లాడేది వ్యావహారిక భాష శాసనసభలలో చర్చలు వ్యావహారికభాషలో అయినా, పాఠ్యగ్రంథాలు మాత్రం గ్రాంథికంలో; పరీక్షలు గ్రాంథికంలో. విద్యను, విద్యాలయాలను నిత్య జీవితానికి, ప్రజాభాషకు ఈ విధంగా దూరం చేయడంవల్ల ఎంత అనర్థం జరుగుతున్నదో ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గుర్తిస్తుందా? ప్రజాయుగంలో మనం ప్రవేశించినా, సంఘాన్ని వెనుకకు నడిపించడానికి ఈనాడు దేశంలో ఎన్నో ప్రతీప శక్తులు ప్రయత్నిస్తున్నాయి. ఈ ఘోర ప్రమాదాన్ని ఏనాడో ఊహించబట్టే, శ్రీ అప్పారావు "వెనుక చూచిన కార్యమేమోయ్? మంచి గతమున కొంచెమేనోయ్! మందగించక ముందు అడుగేయ్! వెనుక పడితే వెనుకేనోయ్!" అని హెచ్చరించారు.

ఈ ద్రష్టకు, ఈ మహాస్రష్టకు మా జోహారులు! *(ఆంధ్రజ్యోతి)*

## 2

కందుకూరి వీరేశలింగం, శ్రీ గిడుగు వెంకటరామమూర్తి మహాపండితులు కాగా, శ్రీ గురజాడ అప్పారావు మహాకవి. మహాపురుష లక్షణాలు కొన్ని అప్పారావుగారిలో లేకపోలేదు. వీరేశలింగంగారి వలె ఆయన సంఘసేవకే తన జీవితాన్ని అంకితం చేసి వుండక పోవచ్చు. మూఢనమ్మకాలను, మూఢాచారాలను ప్రతిఘటించడానికి అహర్నిశం పనిచేసి వుండక పోవచ్చు. సత్యం కోసం, న్యాయంకోసం సమస్త ప్రపంచాన్ని ధిక్కరించి, ఒంటరిగా నిలిచిన ఘట్టాలు శ్రీ అప్పారావు జీవితంలో తక్కువనడం కూడా నిజం కావచ్చు. అయినా, మహాపురుషులకోవకు చెందినవాడు కాబట్టే ఆయన "మతం వేరైతే నేమోయ్? మనసు లొకటై మనుషులుంటే, జాత మన్నది లేచి పెరిగి లోకమున రాణించునోయ్" అంటూ సర్వమానవ సౌభ్రాత్ర సందేశ మివ్వగలిగాడు. "సొంత లాభం కొంత మానుకు, పొరుగువాడికి తోడుపడవోయ్! దేశమంటే మట్టి కాదోయ్!

దేశమంటే మనుషులోయ్!" అంటూ దేశభక్తికి మహోదాత్తమైన నిర్వచన మివ్వగలిగాడు. "మంచి చెడ్డలు మనుజులందున యెంచి చూడగ రెండె కులములు: మంచి యన్నది మాలయైతే మాలనే అగుదున్" అంటూ మానవతకు మచ్చగానున్న కృత్రిమ కులవిభేదాలను నిరసించగలిగాడు. "వెనుక చూసిన కార్యమేమోయ్? మంచి గతమున కొంచెమేనోయ్! మందగించక ముందు అడుగేయ్! వెనుకపడితే వెనకెనోయ్!" అంటూ నవభారతానికి కర్తవ్యబోధ చేయగలిగాడు. ఇంతేకాదు. మహాపురుషుల సరసను నిలవగలవాడు కాబట్టే ఆయనలో "క్రొమ్మెరుంగులు" జిమ్మగల "కొత్తపాతల మేలు కలయిక" కోసం తపన కనబడుతుంది.

పోతే శ్రీ రామమూర్తిని పోలిన ఉద్దండ పండితుడు కాకపోయినా, శ్రీ అప్పారావు పండితి అల్పమైంది కాదు. ఇంగ్లీషు ఆయనకు కొట్టినపిండి. విద్యార్థి దశలోనే ఆ భాషలో ఆయన వ్రాసిన కొన్ని పద్యాలు సమకాలికుల దృష్టి నాకర్షించి, వారి మన్ననకు పాత్రమైనాయి. అభిజ్ఞాన శాకుంతలాన్ని, ఇతర సంస్కృత నాటకాలను, కావ్యాలను మూలంలోనే విమర్శనదృష్టితో చదువుకొని, వాటికి విలువలు కట్టుకొనగల పాటిది ఆయన సంస్కృతభాషా పాండిత్యం.



తెలుగుకు కొత్త వెలుగు కూర్చిన శ్రీ అప్పారావు తెలుగు భాషా పాండిత్యాన్ని గురించి ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. తేటమాటలలో నుంచి ఆయన తేనెలు పిండగలిగాడు. ప్రజల భాషచేత పరభృతాల పంచమ స్వరాలను పలికించ గలిగాడు.

అయితే, మహాపురుష లక్షణాలు కొరవడక పోయినా, పాండిత్యలోపం లేకపోయినా, శ్రీ అప్పారావుని సంస్మరించ గానే ఆయన మనకు మహాకవి రూపంలోనే సాక్షాత్కరిస్తూ వుంటాడు. ఆయన వ్రాసిన కవిత పట్టుమని పదిపదుల పుటలైనా కాకపోవచ్చు. ఆయన ప్రచురించిన కథలు అయిదు మాత్రమే కావచ్చు. మూడు నాటకాలను ప్రారంభించి, వాటిలో రెండింటిని అసంపూర్ణంగానే ఆయన విడిచిపెట్టి వుండవచ్చు. ఇంగ్లీషులోను, తెనుగులోను ఆయన వ్రాసిన వ్యాసాలన్నింటినీ చేర్చినా, అదొక చిరుపొత్తాన్ని మించకపోవచ్చు. అయినా, ఆయన మహాకవి, ఎన్ని పుటలను నింపగలిగాడని కాక, ఎన్ని పుట్టకీళ్ళను కదలించగలిగాడని ఏ కవి విషయంలో నైనా మనం ప్రశ్నించుకోవాలి. ఎన్ని కావ్యాలను పూర్తి చేయగలిగాడని కాక, ఎన్ని గుండెలను ఎంతగా కదిలించగలిగాడని వితర్కించుకోవాలి. ఈ దృష్టినుంచి చూస్తే, అప్పారావుగారు నిస్సందేహంగా మహాకవి. కొద్దిగానే వ్రాసినా, ఆ వ్రాసినదానిలో కూడా ఎగుడు దిగుడు లున్నా, అనేక సాహిత్య శాఖలలో విప్లవాత్మకమైన పరివర్తనాలను సాధించిన ఘనత ఆధునిక యుగంలో ముమ్మాటికీ శ్రీ గురజాడ అప్పారావుదే!

పెద్ద కళ్ళతో, కుదిరికగల ముక్కుతో, వెడల్పు నుదురుతో, కోలముఖానికి నిండుదనమిచ్చే గుబురు మీసాలతో అప్పారావుగారు తమ ఫోటోలలో అసాధారణ వ్యక్తిగా కనిపిస్తారుగాని, ఆబాల్యంగా ఆయన అర్భకుడు 33వ యేట ఆయనతూకం 78 పౌనులు మాత్రం. ఎన్నడూ 85 పౌనులు మించి ఆయన తూకం పెరగలేదు. "విపరీతమైన బడలిక, ఆయాసం నాకు బాల్యంనుంచీవున్నవే" అని ఆయన వ్రాసుకున్నాడు. "ఎప్పుడూ పక్కమీద అలా వాలి, విశ్రాంతి తీసుకోవాలనింపించేది" అని తానై చెప్పుకున్నాడు. జీర్ణకోశానికి, నరాలకు


సంబంధించిన రుగ్మతలు చిన్నతనంలో వెంటబడి, ఆయనను పీల్చి పిప్పిచేశాయి. గట్టిగా వీచితే గాలికి ఎగిరిపోయేటంత బక్కపలచగా ఆయన వుండేవాడట. "గాలి వొంటికి తగలకుండా గొడుగును అడ్డం పెట్టుకుంటూ వుంటాను" అని ఆయనొక సందర్భంలో చెప్పినా, గాలికి జడిసి రాత్రిపూటకూడా గొడుగు వేసుకుంటానని తానై బయట పెట్టలేదు. శీతోష్ణస్థితుల కనుగుణంగా ఒకటి రెండు శాలువలు, తలపాగా, కోటూ ధరించడం ఆయనకు పరిపాటిగా వుండేది. ఏ ఉదకమండలానికో వెడితే, జుబ్బామీద జుబ్బా, కోటుమీదకోటు తగిలిస్తూ వుండేవారుకూడా. వీరేశలింగంగారి ఆరోగ్యమైనా అంతంతమాత్రమే. కాని, ఆయన కంటే కూడా అప్పారావుగారే అన్ని విధాలా అర్భకులని చెప్పాలి. అయినా, ఆయనలో ఆలోచనలెన్నో అగ్నిపర్వతంలో లావావలె - కళ పెళ ఉడుకుతుండేవి. కొందరు అధునాతన కవులవలె ఆయన ప్రేమించింది ఇహలోకానికో, లేదా, ఊహాలోకానికి చెందిన ఏ ప్రేయసినో కాదు. నవప్రపంచాన్ని, దానిలో నెలకొనవలసిన నవవ్యవస్థను గురించి కలలుగన్నా, ఆయన ప్రేమించింది భవిష్యత్తును కాదు. తన కాలంలో, తనను పరివేష్ఠించివున్న జీవితాన్ని, దాని నిత్యనూతన విలాసాలనే ఆయన మనసారా ప్రేమించాడు. కూర్చుంటే లేవలేని, లేస్తే కూర్చోలేని స్థితిలో బ్రతుకును వెళ్ళమార్చు వలసిన వాడైనా బతుకు ఆయనకు భారంగా కనబడలేదు. నిస్సారమైందిగానూ తోచలేదు.

అడుగడుగున దానిలో కొత్త అందాలే ఆయనకు గోచరించాయి; ఎటుతిరిగినా, కొత్త వెలుగులే పొడగట్టాయి. రోజులు ఆయనకు అర్థరహితం కావు. పరస్పర ప్రతిధ్వనులుకావు; ప్రతి ప్రభాతంతోనూ ఒక కొత్తగీతాన్నో, గేయాన్నో వినిపించే కిన్నరకన్యలవి. ప్రజ ఆయనకు మెదడులేని గొర్రెలమంద కాదు. ఒక్కొక్క వ్యక్తిలో ఒక్కొక్క విశ్వమే ఆయనకు సాక్షాత్కార మౌతుండేది. అందువల్లనే ఆయన "జీవితంలో ఎంత వైవిధ్యం వుంది! ఎంతటి తీవ్రగమనం వుంది! నేటి జీవితం పుష్కలమైన, అనంతమైన గాథలతో నిండివుంది" అని ఒక లేఖలో వ్రాయగలిగారు; "అయినా, దానిని (బ్రతుకులోని వైవిధ్యాన్ని, దాని గమన తీవ్రతను) మన రచయితలు దర్శించరు." అని ఆయన వాపోవగలిగాడు.

సరిగా శ్రీ గురజాడ అప్పారావుని అర్థం చేసుకోగల వారికి ఆయన సంఘ సంస్కరణాభిలాషతోనో, వ్యావహారిక భాషావాదంతోనో ప్రేరేపితుడైన కవి కానేకాడు; జీవచ్ఛక్తులచే, వాటి వైవిధ్యంచే, నాటి విద్యుద్గమనంచే, వాటి విలాసాలచే ప్రేరేపించబడిన మహాకవి ఆయన, సంఘసంస్కరణను ఆయన కోరకపోలేదు. అందుకు సారస్వతాన్ని ఒక సాధనంగా చేసుకోవాలని అభిలషించకపోనే లేదు. కాని ప్రచారసాధనంగా చేయదలచుకున్న రచనలో సయితం తన ఇంద్రజాల మహేంద్రజాల విద్యలన్నింటితోను జగన్మోహన రూపంతో తరలివచ్చి జీవితమే కొలువుతీర్చేది. అందువల్లనే "కన్యాశుల్కం"లో సంఘ సంస్కరణ ప్రచారం ఎక్కడ జరిగిందన్న ప్రశ్న; అందువల్లనే "కొండుభట్టీయ" మేమి, "బిల్హణీయ" మేమి సంఘ సంస్కరణోద్యమానికి ఎంతవరకు తోడ్పడగలవన్న సందేహం.

కలం పట్టగానే జీవితంతప్ప అన్యమేదీ కళ్ళకు కట్టేదికాదు గనకనే, శ్రీ అప్పారావు "కన్యాశుల్క" నాటకంలో పొందిక తక్కువ. నాటక శిల్పాన్ని గురించి ఆయనకు తెలియని విషయాలు తెలుసుకోదగినవే కావు. అయినా, "కన్యాశుల్కం"లోని ముఖ్యమైనలోపం నాటకశిల్పం తక్కువ కావడమే! దానిలో ఏడు అంకాలున్నాయి; లెక్కలేనన్ని రంగాలున్నాయి; 29 పాత్రలున్నాయి; దాన్ని పూర్తిగా ఆడాలంటే ఒక రాత్రి చాలదేమో!

నాటకాంతంలో మిస్టర్ గిరీశం నోట వచ్చేమాట - "డామిట్! కథ అడ్డంగా తిరిగింది" - మొత్తం నాటకానికే వర్తిస్తుందని చెప్పవచ్చు. నిజానికి తనకు ఎదురుతిరిగి, నాటకం తన చిత్తంవచ్చిన రూపాన్ని తాను ధరించడాన్ని చూడగా కలిగిన అసంతృప్తే గిరీశం నోటిద్వారా అప్పారావుగారి చేత ఈ మాట అనిపించిందేమో! ఏమైనా, జీవితాని కుండే చిలువలు, పలవలే "కన్యాశుల్కం"లో వున్నాయి. దానిలోవలె దీనిలో కూడా పొందిక తక్కువ. 'కన్యాశుల్కం'లో ఇతరలోపాలుంటే, అవి కూడా మానవ జీవితంలో వుండే లోపాలే. కాని, ఎన్నిలోపాలున్నా, జీవితంవలె నిత్యనూతనమై అది మనలను ఆకర్షిస్తుంది; అలరిస్తుంది; అనిర్వచనీయమైన సమ్మోహన శక్తితో మనలను వశవర్తులను చేసుకొంటుంది. దానిలోని పాత్రలు (అవి గిరీశం, వెంకటేశం, అగ్నిహోత్రావధానులు, రామప్ప పంతులు, లుబ్ధావధానులు, బుచ్చమ్మ, మధురవాణివంటి ప్రధానపాత్రలైనా, లేక పూజారి గవరయ్య, పోలిశెట్టి, హెడ్ కానిస్టేబుల్ వంటి అప్రధాన పాత్రలైనా) రంగస్థలంలోని పాత్రలుగా.




ఏ ఘట్టంలోను పొరపాటుగానైనా తోచవు. జీవితరంగంలోని వ్యక్తులుగా అవి మనలను పలకరిస్తాయి, మనతో మాట్లాడతాయి; మనలను కవ్విస్తాయి; నవ్విస్తాయి. సాంఘిక ప్రయోజనాన్ని కోరి వీరేశలింగం పంతులుగారు "అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనము", "విచిత్ర వివాహ ప్రహసనము" "మహాబధిర ప్రహసనము" అంటూ ఎన్నింటినో వ్రాశారు. ఈ ప్రహసనాలన్నీ చేరి "కన్యాశుల్కా", నికి కనీసం నాలుగురెట్లు వున్నాయి. అయినా, వాటిలో వచ్చే పాత్రలేవో మనకు జ్ఞాపకం వుంటున్నవా? "రమాకాంతము పంతులు", "ధనపాలుడు" ఏ ప్రహసనాలలోని పాత్రలో ఎందరు చెప్పగలరు? శిల్పంతక్కువైనా "కన్యాశుల్క" మే నేటికీ మనకున్న నాటకాలలో ఉత్తమోత్తమమైనదిగా చెల్లడం జీవితానికున్న చేవదానికున్నందునే; జీవంతో తొణికిసలాడుతున్న పాత్రలు దానిలో వున్నందునే.

శ్రీ అప్పారావు భాషాపండితులైనా, భాషా పరిణామ శాస్త్రాన్ని పరిశీలించినవారైనా, కేవలం భాషాభిమానమే (శ్రీ గిడుగు రామమూర్తి విషయంలో జరిగినట్టు ఆయనను వ్యావహారిక భాషావాదిగా చేయలేదు. జీవితంపై ప్రేమే ఆయనను కావ్య వస్తువుకోసం ప్రజల మధ్యకు పంపింది; అదే ఆయనకు ప్రజా భాషాభిమానిగా మార్చింది. రచయితను ప్రజలకు దూరం చేసేది కాబట్టే, గ్రాంథిక భాషపై ఆయన కంతమంట. ఆ మంటతోనే "సంకెళ్ళను ప్రేమించేవారిని దాన్ని (గ్రాంథిక భాషను) ప్రేమించ నివ్వండి. కాని నాకు మాత్రం ఏభాషతో మన సుఖదుః ఖాలను మనం జంకు లేకుండా వ్యక్తపరుస్తామో, ఏ భాషను నేను తల్లి వొడిలో నేర్చుకున్నానో, ఆ సజీవమైన భాషే కావాలి" అని ఆయన అనగలిగాడు. "నాది ప్రజోద్యమం. ఎవరిని సంతృప్తి పరచడానికి దాన్ని వదలుకోలేను" అని ఉద్ఘాటించగలిగాడు.

జీవితాన్ని గురించి చివరిమాట చెప్పడానికి వీలు కానట్టే, జీవితాన్ని ప్రేయసికంటె ప్రియంగా ప్రేమించి దాన్ని కీర్తించిన అప్పారాయ మహాకవి ని గురించి కూడా చివరిమాట చెప్పలేము. కాని, ఒక్కటిమాత్రం నిజం.

కన్యాశుల్కం ఈనాడొక సాంఘిక దురాచారంకాదు. వ్యావహారిక భాషావాదం ప్రజోద్యమంగా మిగలని కాలమొకటి రావచ్చు. అయినా, జీవితంపై మనకు ప్రేమ నిలిచినంత వరకు శ్రీ అప్పారావు కృతులు చెక్కు చెదరకుండా నిలుస్తాయి.

*(గురజాడ శత వార్షిక జయంతి సంచిక 21-9-1962)*

## విద్వత్కవి: శ్రీ జనమంచి శేషాద్రిశర్మ

తలపై ఎర్రని కుచ్చుల మరాఠీ కుళ్ళాయి, నల్లని నిలువుటంగీ, తెల్లని ఉత్తరీయం, పచ్చని మైచాయ, ముచ్చటగొలిపే రూపు, చిరునవ్వు చిందులాడే మోము, గోపాలకృష్ణ గోఖలేనో, బాలగంగాధర తిలకునో తలపించే ఠీవి - శ్రీ జనమంచి శేషాద్రిశర్మ చూపరుల చిత్తాన్ని చిటికెలో చూరగొనేవారు.

శ్రీ శర్మ విద్వద్వంశ్యులు. "నెరజాణల నెలవైన నెల్లూరు మండలంలోని కలువాయి వీరి జన్మస్థానం. వీరి చిన్ననాడే వీరి పెద్దలు కడపజిల్లా వెంకటరామాపురాగ్రహారానికి వలస వచ్చారు. వీరు కాశీలోను, కలకత్తాలోను సంస్కృతం చదివి "కావ్యతీర్థ, స్మృతితీర్థ" బిరుదాలను పొందారు. విశాఖపట్టణం జిల్లా కశింకోటలో శ్రీ తోపల్లి వెంకటరామ సిద్ధాంతి శిష్యులై జ్యోతిర్విద్యలో జంటలైనారు. కడప మునిసిపల్ హైస్కూలులో తెలుగు పండితులై శిష్యుల హృదయాలను దండిగొన్నారు.

శ్రీ శర్మ చిన్ననాటిది అనువాదయుగం. సంస్కృత సాహిత్య భండారాన్ని కొల్లగొట్టడానికి దేశమంతా ఉవ్వెత్తుగా నిలిచిన కాలమది. పురాణాల అనువాదంలో మన పెద్దలు ఒరవడి గీచే వెళ్లారు. ఒకవైపు తమ మండలానికే చెందిన వాసుదాసుడు (శ్రీ వావిలికొలను సుబ్బారావు) విశిష్టాద్వైతపరమైన వ్యాఖ్యలతో సహా వాల్మీకి రామాయణాన్ని యధామాతృకంగా అనువదించగా, మరొక వైపు దేవీ భాగవతం మున్నగునవి తెలుగు రూపు తీసుకుంటున్నవి. శ్రీ శర్మ ఈ భాషాంతరీకరణ రథాన్ని 20వ శతాబ్ద సారథిగా నడిపించారు. ఆంధ్ర బ్రహ్మాండపురాణం, ఆంధ్ర బ్రహ్మ పురాణం, లలితా సహస్రనామం, కౌమార ఖండం, భాగవత దశమ స్కంధం, హాలాస్య మహాత్మ్యం - ఇవి వీరు అనువదించిన ఉద్గ్రంథాలలో కొన్ని.

భిన్నాభిప్రాయాలే, మహోద్యమాలకు మహారథ్యలు కావడం సహజం. క్రైస్తవ పాదిరీలు కృష్ణునిపై మోపుతున్న నీలాపనిందలు కృష్ణావతార తత్త్వమనే ఉత్తమ విమర్శ రచనకు వాసుదాసుని ప్రేరేపించినట్టే శ్రీ శర్మను కూడా విమర్శచణుని చేశాయి. వీరు వివిధ పురాణాలను కూలంకషంగా అవలోకించి సూక్ష్మాతిసూక్ష్మ విషయాలను ఆమూలచూడంగా సమీక్షించి, సమన్వయపరచి సంపుటాల తరబడిగా రామావతార, కృష్ణావతార తత్త్వాలను వివరించారు. వీరి "మన చరిత్ర హృదయావిష్కరణము" ఎన్నదగిన అప్పటి విమర్శ గ్రంథాలలో ఒకటి.

శ్రీ శర్మ కళాప్రపూర్ణులు. వారి ప్రతిభ బహుముఖం. పురాణానువాదాలతో మాత్రమే వీరు తనివి చెందలేదు. నాటకాలు, నవలలు, నీతి కథలు, ఖండకావ్యాలు మరెన్నో రచించారు. నవలలలో నీతిసింధువు, నీతిరత్నాకరం, నాటకాలలో పాండవాజ్ఞాతవాసం ఎన్నదగినవి. కమలాపురం నుంచి వెలువడే "బ్రహ్మానందిని" బెంగుళూరు నుంచి ప్రకటితమయ్యే "విద్యానిధి" చెన్నపురి "త్రిలింగ" మున్నగు పత్రికలలో తరచు సాహిత్య, మత వ్యాసాలు ప్రచురించడంతో వీరు పత్రికా రచయితలు కూడా.

ప్రాచీన గ్రంథాలకు పీఠికలు వ్రాయడంలో వీరు ఒరవడి పెట్టారనవచ్చును. శ్రీరస్తు మొదలు మంగళ మహాశ్రీ వరకు చదివినా రసం గ్రహించరాని కావ్యాల సారాన్ని పిండి ప్రాచీన దృక్పథంతో పీఠికలు వ్రాసి చదువరికి చవులూరించే చిట్కాలు వీరి పీఠికలు; వావిళ్ళవారు ప్రకటించిన ప్రతి ప్రాచీన గ్రంథానికీ వీరి పీఠిక తప్పనిసరి తెలివిడి.

శ్రీ శర్మ మంచి వక్త. సరస హాస్యోక్తులతో, పిట్టకథలతో సభాసదులను సంతోషపరిచే వక్తృత్వం వీరిది. తక్కిన పండితులలో కానరాని తత్కాలీన విషయ పరిజ్ఞానం కూడా వీరికి అపరిమితం. రాయలసీమ కవిపండిత పరిషత్తు మూలస్తంభాలలో వీరొకరై కవిపండితుల ప్రస్తుత సమస్యల పరిష్కారానికి తోడ్పడ్డారు. 1941లో హిందూపురంలో జరిగిన రాయలసీమ కవి పండిత పరిషత్తు అధ్యక్షపీఠం నుంచి వీరు వాక్రుచ్చిన సూక్తులు అక్షరాస్యులందరికీ చిరస్మరణీయాలు.

శ్రీ శర్మ శిష్యప్రాణులు. కడప విద్యాకేంద్రంగా రాయలసీమ అంతటా వీరి శిష్యసంతతి తామర తంపరగా అల్లుకొన్నది. వీరు శిష్యులు "గ్రాసవాసోదైన్యం" ఎరుగకుండా విద్యాభిక్ష పెట్టిన వితరణశీలురు. చెంతజేరిన ఛాత్రులపట్లనే మంచితనంగా కాక, "జనమంచి"గా మనడం వీరి జీవిత లక్ష్యం.

కడపలో తమ ఇంటిగడప దాటకనే, వ్రేళ్ళపై లెక్కించదగిన జీతంతో శ్రీ శర్మ చేసిన సాహిత్యసేవ ఆంధ్ర ప్రజలకు కనువిప్పు కాగలదు.

పుట్టినది నెల్లూరు, విద్యాభ్యాసం విశాఖ, మనుగడ కడప - శ్రీ శర్మ నిర్యాణం విశాలాంధ్రకే తీరని లోటు. వారి అసంపూర్ణ రచనలను పూరించే బాధ్యత ఆంధ్ర ప్రజలది, ముఖ్యంగా వారి శిష్య సంతతిది. వారంతటి దిగ్దంతి పండితులైన వారి సోదరులు శ్రీ సుబ్రహ్మణ్య శర్మది. *(ఆంధ్రప్రభ 7-7-1950)*

## శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు

నాలుగు దశాబ్దాల క్రిందట కవితా వ్యవసాయం ప్రారంభించి, సౌందర్య సస్యాన్ని సమృద్ధిగా పండించిన వెనుకటితరం సాహితీ హాలికులలో శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు ఒకరు. వారి మరణం ఆధునికాంధ్ర సారస్వత లోకానికి తీరని లోటు; కవితాప్రియులకు శోక కారణం.

మహాకవి లక్షణాలలో రచనాబాహుళ్యం ప్రధానమైనది కానేకాదు రాసికన్న గుణం ప్రధానమైనది. పెక్కుమంది ఆధునికాంధ్ర కవులవలెనే కాటూరివారి కవితా రచనలు సంఖ్యలో కొద్దివైనా, గుణసమృద్ధమైనని.

చెళ్ళపిళ్ళవారి వద్ద చేసిన శుశ్రూషా ప్రభావం వల్ల కావచ్చు, కాటూరివారి కవితలో ప్రాచీనా ర్వాచీనతలు రెండూ సమ్మిళితమైనవి. వస్తువు కొత్తదైతే, పద్ధతి పాతది; పద్ధతి కొత్తదైతే, వస్తువు పాతది. కొత్త పాతల మేలు కలయికకు ఒక ఉదాహరణగా వారి కవిత్వం సాగింది. తెలుగులో 'రొమాంటిక్' కవిత్వంపై ఆకర్షణ ప్రబలంగా వున్న రోజులలో రచన ప్రారంభించినా, ఆయన దృష్టి ఎక్కువగా జాతీయ వాదం వైపు, ధార్మిక ప్రబోధం వైపు ప్రసరించింది; గాంధీ సిద్ధాంతాలతో ఆయన ఎక్కువగా ప్రభావితులయ్యారు.

గురువులైన తిరుపతి వెంకటకవులవలె కాటూరి, పింగళి జంటకవులుగా కవితావ్యాసంగం ప్రారంభించారు. వారుభయులు రచించిన తొలకరి, సౌందరనందం ఆంధ్రభాషకు అమూల్యాలంకారాలు. ఆ తరువాత, కాటూరివారు విడిగా రచించిన ఖండకావ్యాలు సంఖ్యలోనే స్వల్పమైనవి కాని, గుణంలో అస్వల్పమైనవి. అస్పృశ్యతా నిర్మూలనాన్ని ప్రబోధించే "గుడి గంటలు" భక్తితత్వాన్ని ఆవిష్కరించే "పౌలస్త్యహృదయం" మొదలైన ఖండకావ్యాలు కాక, భాస నాటకాలకు, కొన్ని సంస్కృతాంగ్ల కృతులకు అనువాదాలు, ఇతర నాటికలు, సంగీత రూపకాలు వారి ప్రతిభకు నిదర్శనాలు.

కాటూరివారి వ్యాపకాలు బహుముఖ మైనవి. కొన్నాళ్ళు కవిత్వం, కొన్నాళ్ళు కృష్ణా పత్రిక సంపాదకత్వం, మరి కొన్నాళ్ళు బందరు జాతీయ కళాశాల ప్రధానాచార్యత్వం, హిందీ ప్రచారం, సాహిత్య సమావేశాలు, గోష్ఠులు, ఇటువంటివి మరెన్నో! ఏ వ్యాపకంలో వున్నా తమంతటి సహృదయులు, రసజ్ఞులు, స్నేహపాత్రులు మరి లేరనిపించు కొన్న ఉదాత్త వ్యక్తిత్వం ఆయనది.

ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబానికి మా హృదయపూర్వక సానుతాపాన్ని అందజేస్తున్నాము.

*(ఆంధ్రజ్యోతి 27-12-1962)*

## ఆంధ్ర ఆస్థానకవి : శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి

ఆయన కవి. లొడారి బుచ్చిగాని సంగతి మొదలు లోకోత్తరమైన భారత సంహిత వరకు ఆయన కవితా వస్తువులే; రాజాస్థానం మొదలు న్యాయస్థానాల వరకు ఆయన సాహితీ వ్యాసంగ రంగాలే. ఆయన జాతీయవాది. రాచరికాన్ని రంజింపజేయడమనే ప్రాచీన సంప్రదాయావలంబనమేకాక, రాచరికాన్ని రోని ప్రజాస్వామ్యంవైపు పరుగుతీసే వర్గాల అనురంజనం కూడా ఆయనలో గోచరం కాగలవు.



దాదాపు తరం క్రిందనే ఆయన ప్రజోద్యమ ధాటిని గుర్తించిన క్రాంతదర్శి. తిలక్ మహారాజు విజయ నాటకం, గాంధీ విజయధ్వజ నాటకం (1921) దానికి తార్కాణాలు. అయినా, ఆయన ప్రాచీన సంప్రదాయ పరిరక్షకుడే.

నన్నయ తనకు ముందున్న కర్ణాటాంధ్ర కవుల రచనల నుడికారాలను జీర్ణించుకొన్నట్టు, పాల్కురికి సోమనాధుని సాహిత్య సంపదను తిక్కన భుక్తం చేసుకున్నట్టు, వీరందరినీ శ్రీనాథుడు ఆకళించుకున్నట్టు, తనకు పూర్వమున్న భాషలోని పసిడి పంటకు ఆయన పెట్టని కోట.

ఆయన సాహిత్య మహారథుడు, భారతాన్ని ముగించడానికి మూడు చేతులు మారవలసివస్తే, భాగవతాన్ని నలుగురుకాని ఒక దరికి చేర్చలేక పోతే, రామాయణానికి ఐదుగురు కలసి కాని ఆకృతి తీర్చలేకపోతే, భారత, భాగవత, రామాయణాలను, ఆయన ఒంటిచేతిమీద నడిపించాడు.

ఆయన శతాధిక గ్రంథకర్త, అయినా, ఆ సంఖ్యతో ఆయన తనివి తీరదు. 90 వ పడిలో పడి మూడేండ్లు గడిచినా, నైకలక్ష పద్యప్రోక్త అయినా, కోటికి పడగెత్తకపోయాననే అనుకుంటారు. ఒక్క సంస్కృతంలో తప్ప తక్కిన భాషలలో రచనలు, ఇంత మహత్సృష్టి కావించిన వాడు అరుదేమో!

ఆయన వేదమూర్తి, ఒకనాడు ఆయన పితృపాదులు యజ్ఞం చేయగా ఆధ్వర్యవం వహించినంతటి శ్రౌతి. సార్థక మహామహోపాధ్యాయుడు.



తెనుగుతో సమానంగా సంస్కృతంలోనూ కవిత చెప్పాడు. అవధానాలు చేశాడు. అన్యరాష్ట్ర పండిత ప్రకాండుల తల లూపింపజేశాడు. కళాప్రపూర్ణు డైనాడు. కవి సార్వభౌము డైనాడు. ఆయన కవితాదీక్ష ఎంత అకుంఠితమో ఇటీవల ఆయన నిడదవోలులో చెప్పిన మాటలలోనే వినండి.

“నా కిది 83వ సంవత్సరం. వేదం. శ్రౌతం ఉపనిషధర్మం తెలిస్తేనే కవిత్వం వ్రాయాలిగాని, నోటికి వచ్చినట్టు చెప్పింది కవిత్వం కాదు. నేను మిగతా గ్రంథాలు వ్రాయబోయాను. భగవద్గీతలో దినమునకు ఒక పాదముకాని, రెండు పాదములుకాని వ్రాయగలిగే వాడిని, దీని కంతకూ కారణం ఇది మత త్రయానికి సంబంధించిన విషయం కావడమే.”

“ఇప్పటికీ క్రొత్త గ్రంథాలు వ్రాస్తూనే వున్నాను. ఒక నిమిషంకూడా వృధాపుచ్చడం లేదు. ఇప్పుడు స్కాంద పురాణం, భవిష్యన్మహాపురాణం రెండూ వ్రాస్తున్నాను. నేను వ్రాసిన వాటిలో విడిగా ఒక్క పుస్తకం ఎప్పుడూ వ్రాయలేదు. 10 లేక 15 పుస్తకాలు ఒక్కసారి మొదలు పెట్టడం, ఒక్కసారి పూర్తిచేయడం నాకు అలవాటు.

“కవిత్రయం వ్రాసిన మహాభారతం, రామాయణం, భాగవతం మూలానికి సిసలైన అనువాదాలు కానందున మరల నేను తెనిగించాను. అలా అని, నేను వాటిని తెనిగించిన మహాకవులను తప్పులెంచడం లేదు. ఆ గ్రంథాల లోపాలు ప్రకటనకర్తలవే తప్ప, ఆ కవులవి మాత్రం కావు, “కాశీనాథాయనమః" మకుటంతో ఆంధ్ర నామశబ్దమను ఒక నిఘంటువును కూడా వ్రాస్తున్నాను.”

ఆయన నేడు మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర ఆస్థానకవి. ఆయన జీవితం ఉభయ కూలంకషంగా ప్రవహించే గంభీర గోదావరివంటిది. "కావేరి తీరంలో కర్ణరసాయనమైన సంగీత కళ, గోదావరి తీరంలో కవిత్వం” అన్న నానుడిని ఆయన సార్థకం చేశాడు.

కవి, జాతీయవాది, ప్రాచీన సంప్రదాయ సంరక్షకుడు, సాహిత్య మహారథుడు, నైకలక్ష పద్యప్రోక్త శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిని ఆంధ్ర ఆస్థానకవిగా నియమించడంలో మద్రాసు ప్రభుత్వం చూపిన ఔచితి ఎంతైనా అభినందనీయం. *(ఆంధ్రప్రభ 8-9-1950)*

## అహో! ధన్యజీవి!

సాహిత్యమే జీవితంగా, జీవితమే సాహిత్యరంగంగా నిండుగా జీవించి, దండిగా రచన లొనర్చి, పండి రాలిపోయిన మహావ్యక్తి శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి.

ఆయన సంస్కృత పాండిత్యానికి మహామహోపాధ్యాయ బిరుదమొక్కటి చాలు గీటురాయి. ఆయన బహు కావ్యరచనకు కవి సార్వభౌమ బిరుదమొక్కటి చాలు వేనోళ్ళ చాటుటకు.

కొమ్ములు తిరిగిన చండ ప్రచండ పండితులున్న ఆ రోజులలో పండితుడనిపించు కొనడమే బ్రహ్మాండం. ఆనాడీయన మహాపండితుడుగా మన్ననలంది కాశీ పండిత సభలో, వివిధ రాజాస్థానాలలో సత్కృతులంది

మిన్న అనిపించు కొన్నాడంటే అదొక మహత్తర విషయం. ఒక చేతిమీదుగా భారత భాగవత రామాయణాలను పూర్తిచేసి కృతులొసంగి కీర్తి కెక్కడం మనమూహింపలేని మహత్తర కృషి.

సాహిత్య రంగం రణరంగంగా వీరవిహారంచేసి, పదాలు, పదార్థాలు, అపశబ్దాలు, కావ్య గుణదోషాలు మొదలైన అంశాల కోసమని అవేవో తమ జీవితంలోని భాగాలుగా, వానిని తేల్చివేయడం తమ చావుబ్రతుకుల సమస్యగా భావించడం అలనాటి పండితులకే చెల్లును.

ఆ సాహిత్య సంరంభంలో అసహాయ శూరుడై, అద్వితీయ ధైర్యసాహసోపేతుడై అవక్ర విక్రమం చూపించిన ఉద్దండ పండితుడీయన.

నేదేమి వ్రాసినా తప్పైనా, ఒప్పైనా పట్టించుకొను వారరుదు. ఒక్కమాట తమకు తప్పుగా తోచితే పుట్టిమునిగి పోయినట్టు పండితులు మీదపడువారు గనుకనే, ఆ శబ్ద సాధుత్వాసాధుత్వ నిర్ణయంలో హోరాహోరి పోరాడువారు గనుకనే నాటి సాహిత్య రంగంలో నవ చైతన్యం పొంగి పొరలినది.

నిజమే. ఆ వాదవివాద ప్రోద్ధతి ఒకప్పుడు బాహాబాహి, కచాకచివలె మారడం, కోర్టుల కెక్కడందాకా వెళ్ళడం వీటితో కాస్త మనస్సు చివుక్కు మనిపిస్తుంది. అందులో శ్రీ శాస్త్రి ఔద్ధత్యం మరింత విస్తుపోజేస్తుంది. అయినా ఆ సంఘటనల వెనుకనున్న సాహిత్య ప్రీతి మనలను చకితులను చేయకమానదు.

పరశ్శత గ్రంథ ప్రణీతగా ఈ కవిసార్వభౌములు ఆంధ్రలోకంలో విహరించినారు. పండిత మూర్ధన్యుడుగా ఆయనకున్న ప్రతిష్ఠ, కవిసార్వభౌముడుగా ఆయనకు లభించిన ప్రతిష్ఠకంటె వేయి మడుంగు లెక్కువనుటకు జంకవలసిన పనిలేదు.

ఆయన అందుకున్నన్ని సన్మాన సత్కృతులు, ఆయనకు లభ్యమైనన్ని బిరుదాలు, పండితా ఖండులులకెందరికి దొరకినవి? అందుకే ఆయన అదృష్టవంతుడైన మహాపండితుడయినాడు.

దూర్వాసుని వంటి ఆయనలో పసిపిల్లలవంటి అమాయక హృదయం ఒకొకప్పుడు దాపరికంలేక బాహిరమై ఎదిరి మనసును ఆకర్షించివేయడం అరుదుకాదు. కోర్టుకెక్కే లౌక్యంతోపాటు ఆయనలోని వైదిక విభూతి మనలను విస్మయావిష్టులను చేయక మానదు.

అంతటి సాహిత్యోపజీవి చతురంగంలో అతి చతురుడన్నప్పుడు, ఆశ్వికుడుగా అనితర ప్రజ్ఞాధురీణుడన్నప్పుడు అప్రయత్నంగా మనం ముక్కున వేలిడుకొనక ఊరకుండలేము.

ఆయనది ఒకమాట; ఒక బాణమనే ప్రకృతి. కొన్ని సునిర్దిష్ట భావాలాయన కున్నవి. వానిని లో జంకు గొంకు లెరుగని గుండెబల మాయనది.

అలనాటి బ్రిటిష్ ప్రభుత్వం మహామహోపాధ్యాయ బిరుదమిచ్చి మెచ్చుకొన్నది. ఈనాటి స్వతంత్ర ప్రభుత్వం యావద్భారత గైర్వాణ వాణీ దురంధరుడుగా ఈయన నెన్నిక చేసి సత్కరించినది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎన్నడో కళాప్రపూర్ణుడని గౌరవించినది. ఇక మణి కిరీటాలు, సువర్ణ పుష్పపూజలు, కవిగండ పెండేరాలు ఆయనను వెదకికొని వచ్చినవి. గజారోహణోత్సవాదు లాయనకు పాలుసరి సన్మానాలైనవి.

అంత నిండుగా, దండిగా అఖండ సారస్వత జీవితం గడపి, పండిరాలిన మహాపండితుడుగా ఆయన ఆంధ్ర హృదయాలలో, ఆంధ్ర చరిత్రలో, ఆంధ్ర వాఙ్మయంలో సుప్రతిష్ఠితుడై కలకాలం నిలువగలడు.

ఆయన సంస్కృతికి ఇవే మా నమోవాకములు. *(ఆంధ్రజ్యోతి 11-12-1960)*

## విద్వత్కథకుడు : శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

ఆంధ్రత్వం మూర్తీభవించిన అనన్య సదృశములైన రచనలతో అజరామరమైన కీర్తిని సముపార్జించుకున్న శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి మరణం తెనుగుల దురదృష్టం. ఆంధ్ర మహోదధిని తరచి వెలికిదీసిన మీగడ తరకలతో ఆయన కలానికొక విశిష్టత లభించినది.



తెనుగు వైదిక కుటుంబాలలోని మనుగడ, ఆ మనుగడ నాలంబనం చేసుకొని తీవసాగిన తెనుగు, మాటకు వ్రాతకు మధ్యనున్న తెరను తొలగించుకొని నిర్మల స్ఫటికంవలె ఆయన కథలలో, నాటికలలో సాక్షాత్కరించినది.

అలనాటి ఆంధ్ర సంస్థానాలలో అవతరించి, నలుదిక్కుల గుబుల్కొన్న సంస్కృతీ విశేషం ఆయన కొన్ని రచనలలో నిస్తుల రూపంతో తొణికిసలాడి పాఠకులను విస్మయావిష్టులను చేసింది. జావా సుమత్రాలలో ఆనాడు తెనుగువాడు ఎగురవేసిన జయపతాక ఈనాటి శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కలంలో రెపరెపలాడినది.
వాల్మీకి వాక్కులలోని మధురిమ, మార్దవం, వ్యాసుని ప్రవచనాలలోని గభీరతా ముద్ర ఆయన తెనుగుచేసుకొని, తన ముద్రతో ముద్రించి చిర స్థిర కీర్తిమూర్తితో కలకాలం మనగల దారి నెన్నడో కనుగొన్నాడు.


ఆంగ్ల వాసనలేనిది అతి ఛాందస మగుననుకొనే రోజులలో, ఆ వాసన పొంతపోకనే అత్యాధునికతా విలసితాలైన అనేక కథలలో అపూర్వమైన ఆంధ్రత్వం వలపుల గుబాళింపుజేసి, తన రచనల కొక విశిష్ట

వ్యక్తిత్వం సముపార్జించు కొన్న ఆ విద్వత్కథకుని సాహిత్య స్రవంతి తెనుగు మాగాణాలలో బంగరుపంట పెట్టి పోయినది.

కోసికొను చేవకొలది అందలి అనితర ప్రతిభా సంపత్తి దృగ్గోచరమవుతుంది. హృదయ వికాసక మవుతుంది. ఆయనను పోగొట్టుకొన్న ఆంధ్ర ప్రజలకిదే మా సానుభూతి నందిస్తున్నాము.

*(ఆంధ్రజ్యోతి 28–2–1969)*

## కులపతి : శ్రీ అడివి బాపిరాజు




కళలలోనే పుట్టి, కళలలోనే పెరిగి, కళలకు జీవితం అంకితం చేసి, కళాసేవలోనే కాలధర్మం చెందినవారు శ్రీ అడివి బాపిరాజు.

ఆయన జననం 19వ శతాబ్ది తుదిలో - గురజాడ, ధర్మవరం, వీరేశలింగం ఆధునిక సాహిత్య సౌధ నిర్మాణానికి పునాదివేసిన కాలాన, కళాహృదయం గల శ్రీ బాపిరాజు ఆ సౌధానికి ఒక స్తంభం. అదొక విశిష్టస్తంభం - హంపీ హజార రామాలయ స్తంభం వలె ఎంతటి స్పందనానికైనా చెమ్మగిలేది; విఠలరాయని గుడికంబంవలె రాగరంజనలు పలికేది; కష్టాలు పైకొన్నప్పుడు కొంత సంచలించినా, మందరం వలె మథించేది.

ఆయన తరచిచూడని కళారూపం కానరాదు. కథకుడు కవి కావడం, నవలా రచయిత చిత్రకారుడు కావడం, వీటన్నిట నిష్ణాతుడు నాట్యకోవిదుడు కావడం అరుదు. శ్రీ బాపిరాజు కవి, కథకుడు, నవలా రచయిత, చిత్రకారుడు, నాట్యాచార్యుడు.

వ్యత్యాసాలెరుగని సుందర సమాజ నిర్మాణం ఆయన ఆదర్శం. దానిని సాధించడానికే ఆయన 1920లోనే జాతీయ సమరంలో పాల్గొని కారాగారవాస క్లేశం అనుభవించడం, అందుకోసమే బందరు జాతీయ కళాశాలాధ్యక్ష పదవిని స్వీకరించడం కూడా. "విశ్వ శ్రేయః కావ్యం" అనేది తెనుగువారికి వెన్నతో బెట్టిన నానుడి. అయినప్పుడు శ్రీ బాపిరాజు సమాజానికి వేరుపురుగయిన జమీందారీ విధానాన్ని రూపుమాప సమకట్టిన "నారాయణరావు"ను సృష్టించడ మేమి, అస్పృశ్యతను హతమార్చడానికి "నరుడు"ను తీర్చి దిద్దడమేమి ఎంతైనా సమంజసం.

తన ఆదర్శ వ్యాప్తి, కళాసందేశ విస్తృతి అవిచ్ఛిన్నంగా కొనసాగడానికి ఆయనొక నూతన సంప్రదాయం,



శిష్యపరంపర నెలకొల్పారు. కనుకనే నవ్యసాహిత్య పరిషత్తు ఆయనను "కులపతి"గా పేర్కొని తనను సత్కరించుకొంది.

ఆయన జీవితం పూలపాన్పేమీకాదు. అది కంటకితం, సంకటమయం. "మధ్యతరగతి వారిలో అసూయా విద్వేషాలు వుండనే వుంటాయి. కష్టాలకు కరువే ఉండదు. వాటిని అధిగమించి ఆదర్శ మాధుర్యంలో కరిగిపోవాలి. అప్పుడే మనం సంఘాభ్యుదయం కోసం కలకంఠంతో ఆలపించగలం" అనే విశ్వాసం జీర్ణించుకున్న వారు గనుకనే ఎన్ని కష్టాలు క్రమ్ముకున్నా, ఆయన అనుక్షణమూ సాహిత్య సమారాధనంలో నిమగ్నుడయి వుండేవారు.

తమ రచనలు తోడి భాషలవారి మన్ననలు పొందిన కొద్ది మంది తెనుగు రచయితలలో 'బాపి 'ఒక ఆయన "శైలబాలకు", "శశికళకు" ముగ్ధుడైన ఆధునిక కన్నడ సాహిత్య ప్రవర్తకుడు శ్రీ మాస్తి వేంకటేశయ్యంగార్, బాపిరాజుగారి కథలను, గేయాలను పెక్కింటిని కన్నడానికి అనువదించుకొననిదే కునుకు తీయలేదు. కలానికి, కుంచెకు పొత్తు కలిపిన బాపిరాజుగారి "మృత్యుంజయుడు" తెనుగు వారికేకాక కన్నడులకూ కనులపండువైంది.

'సీగిరియా' గుహా చిత్ర ప్రతికృతుల రచనలో ఆయన చూపిన ప్రామాణికతకు, పాటవానికి మద్రాస్ మ్యూజియంలోని ఆ ప్రతిరూపాలే సాక్షి.

అమలిన హృదయం, అజాత శత్రుత్వం, బహుముఖ కళాప్రాభవం వెల్లివిరిసిన శ్రీ బాపిరాజుకి ఇదే మా అశ్రుతర్పణం; వారి కుటుంబానికి ఇవే మా ఓదార్పులు. అధునాతన ఆంధ్ర సాహిత్య వైభవాన్ని దిగంతాలకు వెలార్చిన ఆయన పవిత్ర స్మృతి చిహ్నంగా నిధిని నెలకొల్పడమేమి, ఆయన అముద్రిత రచనలను ముద్రించడానికి ముందంజ వేయడమేమి ఆంధ్రావళి అవశ్యకరణీయని ఈ పట్టున సూచించడం అప్రస్తుతం కాదేమో!

*(ఆంధ్రప్రభ 24-9-1952)*

## ప్రొఫెసర్ కొత్త సచ్చిదానంద మూర్తి




సుమారు ముప్పదేళ్ళ క్రిందట తిరుపతిలోని వెంకటేశ్వర ఆర్ట్స్ కాలేజీలో తన అధ్యాపక జీవితాన్ని ప్రారంభించిన ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి ఈనాడు తిరుపతిలోనే శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ కావడం ఒక విశేషం. అప్పటికి ఆయనకు నిండా ఇరవై రెండేళ్ళున్నవో లేవో? నాటి నుంచి ఆయన తన వృత్తిలో అంచెలంచెలుగా ఉన్నత పదవులు అందుకుంటూనే ఉన్నారు.

మరొక విశేషం - ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తికి తిరుపతి విద్యా సంస్థలతో పరిచయం 1946-47 ప్రాంతాలలో ఒక ఏడాది మాత్రమే. ఆ తర్వాత ఆయన అధ్యాపక జీవితమంతా ఆంధ్ర విశ్వవిద్యాలయంలోనే గడిచింది. 1949లో ఆయన తత్త్వశాస్త్రాధ్యాపకుడు. 1954లో ఆ శాఖకు అధిపతి, మరి రెండేళ్ళకు రీడర్. మరి నాలుగేళ్ళకు ప్రొఫెసర్, 1966-69 మధ్య కాలంలో యూనివర్సిటీ ఆరేటర్, 1969 నుంచి 71 వరకు గుంటూరు పోస్టు గ్రాడ్యుయేట్ సెంటరుకు ప్రత్యేకాధికారి. ప్రిన్సిపల్. ఈనాడు శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్. ఇదీ ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి ప్రోగ్రెస్ రిపోర్టు.

తొణకని బెణకని ప్రశాంత గంభీర వదనం, అప్పుడప్పుడు అన్యమనస్కంగా ఉన్నట్టు స్ఫురింపజేసే చూడ్కులు, నిశ్చితాభిప్రాయాలతో, దృఢవిశ్వాసాలతో, నిష్కర్షగా మాట్లాడే స్వభావం, అదే సమయంలో మృదు సంభాషణాచాతుర్యం, ఆ సంభాషణలలో నుంచి ఎడనెడ తొంగిచూచే విస్తృత పాండిత్య ప్రాభవం - ఇదీ ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి వ్యక్తిత్వం.

తత్త్వశాస్త్రం ఆయన అభిమాన విషయం. అందులోను భారతీయ వేదాంతంపై, ముఖ్యంగా శంకరాద్వైతంపై అంతులేని అభినివేశం. అది ఏదో కాలేజీ చదువుల కోసం తెచ్చిపెట్టుకున్న ఆసక్తి కాదు. ఇంటర్మీడియెట్ చదువుతున్న రోజులలోనే ఆయన గీతావ్యాఖ్యానం రచించారు. పదిహేడవ ఏటనే హిందూదర్శన శాస్త్రాలపై ఉపన్యాసాలిస్తూ పర్యటించారు. ఇరవైయవ ఏటనే ఈశోపనిషత్తుకు సాధికార వ్యాఖ్యానం, విస్తృత పీఠిక వ్రాశారు. ఇంగ్లీషులోను, తెలుగులోను కలిపి ఆయన రచనలు రమారమి ముప్ఫయి ఉంటాయి. వాటిలో భారతీయ వేదాంతాన్ని గురించి ఆయన మౌలిక చింతన, విశేష విద్వత్తు కనిపిస్తాయి. అవి డాక్టర్ రాధాకృష్ణన్, ఎం.ఎన్.రాయ్, సి.ఆర్. రెడ్డి వంటి ప్రముఖుల ప్రశంసలను అందుకున్నాయి కూడా.

ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి దృష్టిలో ఫిజిక్స్ కంటే మెటాఫిజిక్స్ ఉన్నత శాస్త్రం. ఆయన రచనలను బట్టి మానవ నాగరికతా పురోగతిలో విజ్ఞానశాస్త్రాల పాత్రపట్ల ఆయనకు చిన్నచూపు కలదేమోనని తోస్తుంది. అయితే, విజ్ఞానశాస్త్రాల అవలోకనం తర్వాతనే ఆయన ఈ విశ్వాసాన్ని ఏర్పరచుకొన్నందున ఆయన విశ్వాసాలతో ఏకీభవించలేక పోయినా గౌరవించక తప్పదు.

ప్రొఫెసర్ మూర్తి బహు భాషాకోవిదుడు. పెక్కుసార్లు యూరప్, అమెరికాలలో పర్యటించి ఆయా దేశాలలో విశ్వవిద్యాలయాల వ్యవస్థను సన్నిహితంగా పరిశీలించినవారు. దేశంలో విద్యావిషయకమైన పెక్కు సంస్థలలో, కమిటీలలో, కమిషన్లలో సభ్యత్వం పొంది విద్యా సమస్యలను క్షుణ్ణంగా ఆకళించుకున్నవారు. అధ్యాపకుడుగా విద్యార్థులతో కలసిమెలిసి ప్రవర్తిస్తూ, వారి ప్రేమాభిమానాలు పొందినవారు. ఆయన ఉపాధ్యక్షత క్రింద శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధిని సాధించగలదని ఆశిస్తున్నాము. ఈ సందర్భంలో ఆయనకు మా శుభాభినందనలు. *(ఆంధ్రజ్యోతి 7-10-1975)*

## ప్రతిభాశాలి అస్తమయం: శ్రీ వెలగపూడి రామకృష్ణ

ఆంధ్ర ప్రజా జీవితంలో మూడు నాలుగు దశాబ్దాలుగా ప్రముఖ పాత్ర నిర్వహించిన ఒక ప్రతిభాశాలి అస్తమించారు. ఆయన శ్రీ వెలగపూడి రామకృష్ణ.

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రాష్ట్రంగా పేరెక్కినది కాదు. మొదటి నుంచి అది వ్యవసాయ రాష్ట్రమే. ఈనాటికీ సాటి రాష్ట్రాలలో దానికి వ్యవసాయ ప్రధాన ప్రాంతంగానే పేరు.

బెంగాల్, మహారాష్ట్ర, మద్రాసులతో సమంగా కాదు, మైసూరుపాటిగానైనా మన రాష్ట్రం పారిశ్రామికాభివృద్ధికి నోచుకోలేదు. ఆంధ్రుల దృష్టి ఆది నుంచి వ్యవసాయం మీదనే. అది చెడ్డదని కాదు, కాని, రాష్ట్ర సర్వతోముఖాభి వృద్ధికి, ప్రజా జీవన ప్రమాణాభివృద్ధికి వ్యవసాయ వ్యాసంగమే చాలదు. పరిశ్రమలు కావాలి.

ఈ సత్యాన్ని గ్రహించి రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ముందుకు వచ్చిన కొద్దిమంది పారిశ్రామికులలో శ్రీ వెలగపూడి రామకృష్ణ అగ్రగణ్యులు. ఈ లక్ష్యానికి ఆయన తన జీవితాన్ని, తన శక్తియుక్తులను అంకితం చేశారు.

ఆయన తన జీవితాన్ని పారిశ్రామికుడుగా ప్రారంభించలేదు; ప్రభుత్వోద్యోగిగా ప్రారంభించారు. ఐ.సి.ఎస్. అయి, మొదట జిల్లా కలెక్టరుగా ఆనాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో పనిచేశారు.

ఆ తర్వాత పరిశ్రమలశాఖ డైరెక్టరుగా, ఇంకా ఎన్నో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వోద్యోగాలలో పనిచేసి విశేషానుభవం గడించారు. అంతకుముందు కూడా పరిశ్రమల స్థాపనలో, విస్తరణలో, వినూత్న ప్రయోగాలలో విస్తృతాసక్తిని కనబరచినా, 1947లో ప్రభుత్వోద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాతనే ఆయన తన యావచ్ఛక్తిని పారిశ్రామికరంగంలో కేంద్రీకరించారు.

పరిశ్రమలశాఖ డైరెక్టరుగా ఉండగా ఆయన కోయంబత్తూరులో ఎన్నో జౌళి మిల్లులు, తదితర పరిశ్రమల స్థాపనకు దోహదం చేశారు. చేనేత పరిశ్రమను సహకారపద్ధతిపై పునరుద్ధరించడానికి ఆయన వేసిన ప్రాతిపదిక తర్వాత కాలంలో దేశానికి ఆదర్శప్రాయమైంది.

పదవీవిరమణ తర్వాత ఉయ్యూరులోని కె.సి.పి. సంస్థ మేనేజింగ్ డైరెక్టరుగా పంచదార మిల్లునే కాక, మరెన్నో అనుబంధ కర్మాగారాలను నెలకొల్పి అభివృద్ధి చేశారు. ఆంధ్ర, ఒరిస్సాలలో మరి రెండు పంచదార ఫ్యాక్టరీలను నెలకొల్పారు. విజయవాడ, మాచెర్లలలో సిమెంటు ఫ్యాక్టరీలను, రాయఘడలో ఫెర్రో మ్యాంగనీస్, కాల్షియం కార్బయిడ్ కర్మాగారాలను, నిడదవోలులో సూపర్ ఫాస్ఫేట్ ఫ్యాక్టరీని ఇంకా ఎన్నిటినో ఆయన స్థాపించారు.

ఇవన్నీ ఒక ఎత్తు మద్రాసు వద్ద ఆయన నెలకొల్పిన యంత్రనిర్మాణ కర్మాగారం మరొక ఎత్తు. యంత్రనిర్మాణ రంగంలో మన దేశం చాలా వెనుకబడి ఉంది. ఈ నాటికీ అనేక యంత్రాలను, పరికరాలను మనం ఎంతో విలువైన విదేశీ ద్రవ్యాన్ని వెచ్చించి దిగుమతి చేసుకోవలసి వస్తున్నది. యంత్రనిర్మాణంలో స్వయం సమృద్ధిని సాధించినప్పుడే దేశానికి ఆర్థికస్వాతంత్ర్యం లభించగలదని శ్రీ రామకృష్ణ విశ్వాసం. ఈ విశ్వాసంతోనే తిరువొత్తియూర్ వద్ద ఒక వర్క్ షాప్ నెలకొల్పారు. ఇది పంచదార, సిమెంటు మొదలైనవాటి ఉత్పత్తియంత్రాలెన్నిటినో తయారుచేసింది; ఇంకా చేస్తున్నది.

ఆయన కేవలం పారిశ్రామికుడే కాదు. పారిశ్రామిక రంగాన్ని తన అభ్యుదయ భావాలతో, ఆర్థికశాస్త్ర పరిజ్ఞానంతో, సాంకేతిక భావుకత్వంతో, పరిపాలనాదక్షతతో, ప్రజాశ్రేయశ్చింతనతో ప్రభావితం చేసిన మనీషి. ఆయన ప్రభావం ఆంధ్రపారిశ్రామికరంగంపై ఎంతైనా ఉన్నది. అది ఆయనకు ఎంతైనా ఋణపడి ఉన్నది. ఆయన మృతికి దుఃఖిస్తున్న కుటుంబానికి మా సానుభూతి తెలియజేస్తున్నాము.

*(ఆంధ్రజ్యోతి 30-11-1968)*

## నీవు పెట్టిన దీపమే (నాగార్జునసాగర్ ప్రాజెక్టు)
## (ముక్త్యాల రాజా శ్రీ వాసిరెడ్డి రామ గోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్)



ఆ ఘట్టాన్ని మరిచిపోవాలన్నా మరవలేను. అంత గట్టిగా అది నా హృదయంపై హత్తుకున్నది. నాటి ఉదయం పత్రికాపఠనంలో నిమగ్నమైవున్న నేను, "అయితే, మీకూ ఆహ్వానం రానట్టేనా" అనే మాటలకు ఉలిక్కిపడ్డాను. పత్రిక పుటలలో నుంచి తలయెత్తి చూద్దును గదా, ముక్త్యాల రాజా శ్రీ వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్ ఎదుట నిలబడివున్నారు. లేచి, "రండి, కూర్చోండి" అని ఆయనను

మర్యాదచేస్తూ "ఏమి ఆహ్వానం" అని ప్రశ్నించాను. “నాగార్జున సాగర్ ప్రాజెక్టు శంకుస్థాపన మహోత్సవానికి ఆహ్వానం” అంటూ నిలబడే శ్రీ ప్రసాద్ జవాబు చెప్పారు.

“రాలేదు” అని జవాబు చెప్పి కూర్చోవలసిందిగా ఆయనను తిరిగి ఆహ్వానించాను. కాని తనలోగల బాధవల్ల మరి ఎంతసేపటికోగాని కూర్చోలేకపోయారు.

తనకు పిలుపు రాకపోతుందా అని ఆ క్రితం రోజు సాయంత్రం వరకు శ్రీ ప్రసాద్ వేచి వున్నారట. అది మరి రాదని ధ్రువపడిన తర్వాత నాగార్జున సాగర్ ప్రాజెక్టు ప్రాంతానికి సమీపంలోగల ముక్త్యాలలో కృష్ణ వంపులోగల తమ ప్రాసాదంలో మరి కాలు నిలపలేక, వీలైనంత దూరానికి వెళ్ళిపోవాలన్న తలంపులో హుటాహుటిగా విజయవాడ వచ్చి, అక్కడ రైలెక్కి మద్రాసు చేరుకున్నారట.
నాటి శంకుస్థాపన మహోత్సవానికి తనకు పిలుపు రాకపోవడం ఆయనకు బాధాకారణం కావడం సహజమే. నాగార్జున సాగర్ ప్రాజెక్టుకై ఆయన ఎంత తపనపడ్డారు. అందుకై ఎంత కృషిచేశారు. ఎంతగా వ్యయానికి సిద్ధపడ్డారు? ఒక ఘట్టంలో ప్రాణాపాయాన్ని కొద్దిలో తప్పించుకొనడం సయితం జరిగింది. ఎన్ని ప్రతిబంధకాలు వచ్చినా, అవి ఎంతటి శక్తిమంతుల నుంచి వచ్చినా, చివరికి తన కృషి ఫలించబోతున్నది. తన అభీష్టమీడేర బోతున్నది. తన కల నిజం కాబోతున్నది. ఆ శుభ ఘట్టాన్ని ఆ మధుర సన్నివేశాన్ని కళ్ళారా చూచుకోవాలని ప్రసాద్ గారు ఎంతగా ముచ్చటపడి వుండాలి! అయినా, తనకు పిలుపైనా రాలేదు. అది ఆయనకే కాదు, నాడు ఆ శంకుస్థాపన జరగడానికి ఆయన ఎంత బాధ్యులో తెలిసినవారికి ఎవరికైనా సరే బాధాకారణం కావడం సహజం.

పిలిచి, తనకు పెద్ద పీట వేయాలని శ్రీ ప్రసాద్ కోరుకోలేదు. ప్రత్యేకాహ్వానాన్ని కూడ ఆయన కోరలేదు. వేల సంఖ్యలో ఇతరులకు వెళ్ళిన ఆహ్వాన పత్రాలలో ఒకటి తమకు కూడా వచ్చివుంటే, ఆయనకు పట్టరానంత సంతోషం కలిగి వుండేది. కాని, నాటి మహోత్సవానికి ఏర్పాటు చేసిన వారికి శ్రీ ప్రసాద్ స్ఫురణకైనా రాలేదు!

ఈనాడైనా నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఒక రూపాన్ని ధరించడానికి శ్రీ ప్రసాద్ ఎంతగా బాధ్యులైనారో అన్యులకు ముఖ్యంగా అధికార పదవులలో గల వారికి ఎంతవరకు జ్ఞాపకం వుంటుందో నామట్టుకు నాకు సందేహమే? నాటి ప్రధాని పండిట్ జవహర్లాల్ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడానికై వచ్చినప్పుడు జరిగినట్టే, ఆ తరువాత శ్రీమతి ఇందిరాగాంధీ ఆ ప్రాజెక్టుకు చెందిన కాల్వలలోకి లాంఛన ప్రాయంగా నీరు వదలడానికి వచ్చినప్పుడు సయితం శ్రీ ప్రసాదికి ఆహ్వానం రాకపోవచ్చు. అయితే మాత్రమేమి? ప్రజలు మాత్రం శ్రీ ప్రసాద్ సేవలను మరువలేదు. ప్రజలు ఆ సేవలను గుర్తిస్తారనడానికి అందుకై ఆయనను గౌరవిస్తారనడానికి ఒక నిదర్శనం - మిత్రులు శ్రీ దరువూరి వీరయ్య ప్రచురిస్తున్న నాగార్జున సాగర్ సర్వస్వాన్ని శ్రీ ప్రసాద్ కి అంకితం చేయడమే!

అది చిన్న పని కానివ్వండి, పెద్దది కానివ్వండి - చేపట్టినదాన్ని వ్యయ ప్రయాసలను లక్ష్యం చేయక, కష్టనిష్ఠురాలను సరకుగొనక, చిత్తశుద్ధితో, జయప్రదంగా నిర్వహించడం శ్రీ ప్రసాద్లో ఒక గొప్ప విశేషం.

సగం సగం పనులంటే శ్రీ ప్రసాదికి తలనొప్పి, “అటునుంచి నరుక్కు రావడం” అనే తమ వంశ సాంప్రదాయాన్ని అక్షరాలా శ్రీ ప్రసాద్ పరిపాలిస్తారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు విషయంలో ఆయన సాధించిన విజయం నిశ్చయంగా అనన్య సాధ్యం.

పండిట్ జవహర్లాల్ (ఆయన నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణ కార్యక్రమాన్ని పరిశీలిస్తుండగా) ఒక రైతు “ఇది మీరు పెట్టిన దీపమే” అంటూ ఆయనకు చెయ్యెత్తి నమస్కరించాడు. ఈ సూక్తి మన రాష్ట్రం స్థాయిలో పండిట్ నెహ్రూకువలె ముక్త్యాల రాజాకు కూడా వర్తిస్తుంది.

(నాగార్జునసాగర్ డ్యాము భారత ప్రధాని జవహర్లాల్ నెహ్రూ 10-12-1955న శంకుస్థాపన చేశారు. పైన ఉదహరించిన వ్యాసం “నవభారత భగీరథుడు రాజా వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్”, ముక్త్యాల రాజా గ్రంథం నుంచి)

## శ్రీ వీరమాచనేని వెంకట నారాయణ

పెద్దగా చదువుకొనకపోయినా, పైకి రావడానికి అంతగా అవకాశాలు లేకపోయినా, తమ దేశభక్తి, క్రమశిక్షణ, లోకజ్ఞానం, నీతి నిజాయితీలతో ప్రజాసేవా రంగంలో ప్రముఖ స్థానం ఆక్రమించడానికి మన స్వాతంత్ర్యోద్యమం చాలామందికి అవకాశం కల్పించింది. అట్టి వారిలో నేడు ఏలూరులో షష్టిపూర్తిమహోత్సవం జరుపుకుంటున్న ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షులు శ్రీ వీరమాచనేని వెంకట నారాయణ ఒకరు.

ఆయన విద్యాభ్యాసం పూర్తి అయింది హైస్కూలు విద్యతోనే. స్వాతంత్ర్యోద్యమ శంఖారావం చిన్ననాడే చెవినిపడగా, పట్టుమని పదహారు సంవత్సరాలైనా నిండని బాల్యదశలోనే ఆయన చదువుకు స్వస్తిచెప్పి, స్వాతంత్ర్యోద్యమంలో దుమికారు. అప్పటి నుంచి ఆయన పాల్గొనని స్వాతంత్ర్యోద్యమ ఘట్టం లేదు.

పేదవారుగా ప్రజాసేవారంగంలో ప్రవేశించినవారిలో పెద్ద పెద్ద పదవులను అధిష్ఠించి, ఆర్థికంగా పెద్దవారైన వారు చాలామంది లేకపోలేదు. కాని, సంపన్న కుటుంబంలో జన్మించిన శ్రీ వీరమాచనేని స్వాతంత్రోద్యమంలో తన ఆస్తిపాస్తులను కూడా కోల్పోవడం ఆయన త్యాగనిరతికి నిదర్శనం.

చిన్ననాడు ఆయనపై పడిన ఆంధ్రకేసరి ప్రకాశంగారి ప్రభావ ముద్ర ఈనాటికీ చెరిగిపోలేదు. ఎన్ని కష్టనష్టాలు వచ్చినా, సాధకబాధకాలను ఎదుర్కొనవలసి వచ్చినా, ఆయన ఆంధ్రకేసరి ఉన్నంత కాలం ఆయన నాయకత్వాన్నే అనుసరించారు. అయితే, అదే సమయంలో ఆనాటి రాజకీయ రంగంలోని ప్రత్యర్థివర్గం గౌరవాదరాలను కూడా చూరగొనడం ఆయన సౌజన్యానికి నిదర్శనం.

తాను నమ్మిన ఆదర్శానికి అడ్డంవస్తే, ఎప్పటికి ఎదురీదడానికైనా ఆయన సిద్ధమే. ఇటీవల జరిగిన రాష్ట్ర విభజనోద్యమంలో తనపై నాటు బాంబులు పడుతున్నా లెక్క చేయకుండా ఆయన తన సమైక్య రాష్ట్రవాదాన్ని ప్రచారం చేయడం ఆయన వజ్ర సంకల్పానికి తార్కాణం.

తాను చిరకాలంగా సేవచేసిన, తనను పెంచి పెద్ద చేసిన సంస్థతో అభిప్రాయ భేదాల వల్ల ఒకటి, రెండు సార్లు ఆయన ఆ సంస్థకు దూరం కావడం ఆ సంస్థ ఆదర్శాల పట్ల అవిశ్వాసంతో కాదు - వాటి ఆచరణలో అవకతవకలు జరుగుతున్నవన్న అసంతృప్తితోనే. ఇందుకు నిదర్శనం - తిరిగి మాతృసంస్థలో చేరిన తరువాత ద్విగుణీకృత దీక్షతో ఆయన దాని సేవకు ఉద్యమించడమే.

కాంగ్రెసు కార్యక్రమం పట్ల ఆయన విశ్వాసాన్ని, ఆయన చిత్తశుద్ధిని, క్రమశిక్షణను గుర్తించడంవల్లనే ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెసు రథసారథ్యం వహించడానికి రాష్ట్ర నాయకులేమి, కాంగ్రెసు అధిష్టాన వర్గమేమి శ్రీ వీరమాచనేనిని ఎన్నిక చేయడం జరిగింది.

నేడు షష్టిపూర్తి జరుపుకుంటున్న ఈ స్వాతంత్ర్యయోధుని మనసారా అభినందిస్తున్నాము. ఆయన పది కాలాలపాటు మరింతగా ఫలవంతమైన ప్రజాసేవ చేయాలని ఆకాంక్షిస్తున్నాము.

*(ఆంధ్రజ్యోతి 9-11-1975)*

## మహాకవి : శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి



శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిని మహాకవిగా పేర్కొనడం ఒకప్పుడు ఛాందసులైన వారికి రుచించేదికాదు. ఏ మహాకావ్యం వ్రాశారని ఆయన మహాకవి? అని వారు ప్రశ్నించేవారు.

నిజమే. ఆయన రామాయణమో, మరొక మహా కావ్యమో వ్రాయలేదు. లఘుకావ్యమైనా వ్రాయలేదు. వ్రాసినవన్నీ పాటలు, ఖండకావ్యాల కోవకు చెందిన పద్యకవితలు.

అయినా, కృష్ణశాస్త్రిగారు మహాకవే. రాశి కంటే రమ్యత ముఖ్యమైతే ఆయన నిస్సందేహంగా మహాకవి. పండితులు తరచుగా ఉదహరించే "వాక్యం రసాత్మకం కావ్యం" అన్న ఆలంకారిక మతాన్నిబట్టి చూచినా ఆయన మహాకవి.

కొందరు ఆధునికుల దృష్టి నుంచి, ముఖ్యంగా విప్లవ ధోరణికి చెందిన వారి దృష్టి నుంచి కూడా ఆయన మహాకవి కాకపోవచ్చు. కలాన్ని కత్తిగానో, తుపాకిగానో కవే వాడే వారి దృష్టిలో మహాకవి. నిప్పులు


కురిపించేదే అసలైన కవిత. కాని, కృష్ణశాస్త్రి గారు తన కలాన్ని వేణువుగా, వీణియగా మ్రోగించారు. తన కవితలో వెన్నెలలు కురిపించారు.

అయినా, ఆయన మహాకవే. "నాలుగూ దిక్కులా నడిమి స్వర్గమ్ములో - ప్రతి గుండె మోసాల నాగనా? ప్రతి గుండె మోసాల మ్రోగనా?" అంటూ స్వచ్ఛమైన మానవతావాదానికి, "నా యిచ్ఛయేగాక నాకేటి వెరపు?" అంటూ వ్యక్తి స్వేచ్ఛావాదానికి ఆయన తన కవితలో పట్టాభిషేకం చేశారు.

శాస్త్రిగారి కవిత తేనెలవాక. దానిలో మధుర సుషమా సుధాగాన మంజు వాటికలు, విపంచీ విరహకంఠాలు, నిదుర వెన్నెలలదారులు, విభావరీశాలలు, తారా లతాంతమాలలు, మృదువసనాంచలముల గుసగుసలు, చరణ మంజీరాల కొసరు జాలి పలుకరింతలు... ఎన్నో కనిపిస్తాయి, ఎన్నో వినిపిస్తాయి. మనస్సును ఆహ్లాద పరుస్తాయి.

ఆయన పదజాలమే వేరు. అది అచ్చగా ఆయనదే. నిజమైన శబ్దశిల్పి ఆయన. ఆంగ్లభాషను తన అసాధారణ పాండిత్యంతో సుసంపన్నం చేసిన జేమ్స్ జాయిస్ "ఫినిగన్వేక్" నవల వ్రాస్తూ రోజంతా ఆలోచించి ఒక కామా పెట్టేవాడట. మరునాడంతా ఆలోచించి ఆ కామా తీసివేసేవాడట. అతడు ఆ నవల పూర్తి చేయడానికి పదిహేడేళ్ళు పట్టింది. కృష్ణశాస్త్రిగారు కూడా అంతే. ఒక పాట వ్రాయడానికి ఒక గంట నుంచి, వారం రెండు వారాల వరకు ఎంతయినా పట్టవచ్చు. వ్రాసినదాన్ని పదిసారులైనా మార్చనిదే ఆయన తృప్తిపడరు. ప్రతిమాటకు రంగు, రుచి, వాసన ఉంటాయని ఆయన విశ్వాసం. ఆయన వలె శబ్ద రహస్యాన్ని ఎరిగినవారు తెలుగునాట ఎందరో లేరు. ఆయన జీవితమే శబ్దాల కోసం తపస్సు "నా వలెనె యాతడున్మత్త భావశాలి... పాటపదములకై నిత్య పథికుడయ్యె" అని ఎవరి గురించో శాస్త్రిగారు వ్రాసిన మాటలు శాస్త్రిగారికి కూడా వర్తిస్తాయి.

అయినా, ఆయన వ్రాసింది మరీ తక్కువ కాదు. ఏభై ఏళ్ళలో కృష్ణపక్షం, ఊర్వశి, ప్రవాసం, మహతి, ఎన్నో రేడియో, సినిమా పాటలు, గేయ నాటికలు, వ్యాసాలు... కనీసం ఇరవై సంపుటాలుగా రాదగినంత వ్రాశారు.



అన్నట్టు, కొన్నాళ్లు అభ్యుదయోద్యమ ప్రవాహంలో పడి ఆకలి పాటలు కూడా వ్రాశారు. స్విన్బర్న్ మలిదశలో రాజకీయ కవిత వ్రాసినా రొమాంటిక్ ధోరణిలోనే వ్రాసినట్టు, శాస్త్రిగారు "తమ కమృత ముంచుకున్నారు,

తమ మధువు నించు కున్నారు, మాకు ఆకలి నిచ్చి - మాకు రోషం హెచ్చి...." అంటూ ఆకలిపాటలు వ్రాసినా, మృదుమధుర ధోరణిలోనే వ్రాశారు.

మరి, ఆయన కవిత్వం వ్రాయడం మొదలుపెట్టిన రోజులు వేరు. బ్రహ్మ సమాజం, వీరేశలింగంగారి సంఘ సంస్కరణవాదం, గిడుగు వ్యావహారికవాదం, గురజాడ కొత్త కంఠం, టాగోర్ మార్మిక కవిత, గాంధీజీ శంఖారావం, ప్రథమ ప్రపంచ యుద్ధానంతర నిరాశా నిస్పృహలు, జాతీయవాదం, మానవతావాదం, స్వేచ్ఛకై తపన... అవీ ఆ రోజులు. వీటితో ప్రభావితులైన తెలుగు కవులు కొత్త బాణీలో గానం చేసిన రోజులవి. వారిలో కృష్ణశాస్త్రిగా రొకరు. ఆ తరం కవులందరు ఒక ఎత్తు. కృష్ణశాస్త్రిగారొక ఎత్తు. వారిలో కృష్ణశాస్త్రిగారే కొంచెం ఎత్తు.

మద్రాసులో నేడు వారి కవితకు స్వర్ణోత్సవం జరుగుతున్నది. ఆయన రచనలలో చాలా కాలంగా లభ్యం కానివి కొన్ని సంపుటాలుగా నేడు ఆవిష్కృతాలవుతున్నాయి. ఇవి కృష్ణశాస్త్రి గారికి ఈ తరం వారిలో నుంచి కూడా కొత్త అభిమానులను సంపాదించి పెట్టగలవని ఆశిస్తున్నాము. శాస్త్రిగారి మధుర కవిత ఇట్టి స్వర్ణోత్సవాలెన్నింటినో జరుపుకోవాలని కూడా కోరుకుంటున్నాము.

*(ఆంధ్రజ్యోతి 11-5-1975)*

*కవులలో శిల్పి కృష్ణశాస్త్రి,*
*శిల్పులలో కవి కృష్ణశాస్త్రి.*
*కవులలో గాయకుడు కృష్ణశాస్త్రి,*
*గాయకులలో కవి కృష్ణశాస్త్రి.*
*మనకు ఒక్కటే తాజ్ మహల్ వున్నది,*
*మనకు ఒక్కడే కృష్ణశాస్త్రి వున్నాడు.*

*(శ్రీ కృష్ణశాస్త్రి సన్మానోత్సవ సంచిక. వంశీ ఆర్ట్ థియేటర్స్, హైదరాబాదు. 10-2-1978)*

## శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ

ఆ పండితుడు, ఆ పరిశోధకుడు మనకు మరి లేడు. ఆ రచయిత, ఆ రసజ్ఞుడు మనకు మరి లేడు. ఆ విజ్ఞాననిధి, ఆ విమర్శకుడు మనకు మరి లేడు. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ నేడు వాల్తేరులో కన్ను మూయడంతో ఆంధ్రజాతి ఒక మహామనీషిని కోల్పోయింది; ఆంధ్ర సారస్వతం ఒక మహా మేధావిని పోగొట్టుకొన్నది.

శ్రీ శర్మ నిర్యాణం మన రాష్ట్రానికే కాక, మన దేశానికే తీరని నష్టం. ఆయన మొత్తం దేశంపైనే గణన కెక్కిన చరిత్ర పరిశోధకుడు. ప్రాచీన భారత చరిత్రకు భండార్కర్ వలె, మొగల్ చరిత్రకు జధునాధ్ సర్కార్ వలె, మహారాష్ట్ర చరిత్రకు సర్దేశాయ్ వలె, దక్కన్ చరిత్రకు నీలకంఠ శాస్త్రి వలె, ఆంధ్ర చరిత్రకు సోమశేఖరశర్మ పేరు చెప్పిన తర్వాతనే మరొకరి ప్రసక్తి తీసుకురావాలి. శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు, శ్రీ చిలుకూరి వీరభద్రరావు వేసిన బాటలలో ఆయన ఎంతగానో ముందుకు పురోగమించారు. వారి ప్రాపకంతో చరిత్ర పరిశోధన రంగంలోకి వచ్చినా, వారుభయులను మించి కీర్తి ప్రతిష్ఠల నార్జించుకున్నారు.

శ్రీ విశ్వనాధ సత్యనారాయణ తమ "ఆంధ్ర ప్రశస్తి" కావ్యాన్ని అంకితమిస్తూ చెప్పినట్టు, శర్మగారిది "డిగ్రీలులేని పాండిత్యంబు", అట్టి పాండిత్యం "వన్నెకురాని ఈ పాడు కాలాన బుట్టి" కూడా.
ఆయన చరిత్రకారుడుగా అమరకీర్తి నార్జించుకొన్నారు. ఆయన "హిస్టరీ ఆఫ్ రెడ్డి కింగ్డమ్స్" అపూర్వమైన రచన. ఆంధ్రదేశ చరిత్రలోని ఆ ఘట్టంపై దానికి సాటిరాగల గ్రంథం మరొకటి లేదు.

పూర్వ శిలాశాసనాలను చదవగలవారు పెక్కుమంది ఉండవచ్చు; మరుగుపడిన చరిత్రను వెలుగుకు తీసుకురాగలవారికి సయితం కొరత లేకపోవచ్చు. కాని, ఆయనను పోలిన సాహిత్యవేత్త లెందరు? సంస్కృతి ప్రియులెందరు? కవి హృదయమున్న వారెందరు? రసజ్ఞు లెందరు? ఆంగ్లేయంలో వ్రాసినా, ఆంధ్రభాషలో రచించినా, ఆయన చరిత్రలు కేవలం ఉత్తమ చరిత్రలే కావు, అవి మహాకావ్యాలు కూడా.

గతచరిత్ర శర్మగారికి సమాధుల సంశోధన కాదు. శవాలంకరణ అసలే కాదు; వర్తమాన కాలానికి అది ఒక ఉత్తేజం; భవిష్యత్తుకు ఒక కరదీపిక. ఆయన ప్రజాస్వామ్యవాది; ప్రగతిశీలి. ప్రజాసత్తాకకు, ప్రజావికాసానికి తోడ్పడలేనిది ఆయన దృష్టిలో చరిత్ర కానేకాదు. అందువల్లనే ఆయన రాజులను గురించి వ్రాసినా అది ప్రజలచరిత్రగా మారేది. రాజకీయ చరిత్ర వ్రాసినా, అది సాంఘిక చరిత్రగా రూపొందేది!

ఆయనది ఎంతో శాంత స్వభావం! ఆయన ఎంతగానో సౌజన్యమూర్తి! కాని, రచయితగా ఆయనలో మహోద్వేగం కానవచ్చేది. తన కలాన్ని సిరాలో కాక, తన గుండెనెత్తురులో ముంచి వ్రాస్తున్నట్టుగా ఆయన రచన సాగేది! మాట వెంట మాట దొర్లేది; వాక్యాన్ని వాక్యం తరుముకు వచ్చేది, ప్రతి పుట ఒక సజీవ చిత్రం

వలె పాఠకులను సమ్మోహితులనుచేసేది. తన రాష్ట్రం, తన దేశం, తన సోదర ప్రజలు గతానికి మించిన భవిష్యత్తును నిర్మించు కోవాలనే తపన ఆయన రచనలలో సర్వత్రా కానవచ్చేది!

తమ పాండితికి, తమ ప్రతిభకు తగినంతగా శర్మగారు చరిత్రకు, సారస్వతానికి, ఈ రెండింటి ద్వారా దేశానికి పూర్తి సేవ చేయలేకపోయారు. జీవనోపాధికై దేవులాట తప్పనిసరి కావడం ఇందుకొక కారణం. కొన్నేళ్ళుగా తరచు అనారోగ్యం మరొక కారణం. ఆయన సేవలను పూర్తిగా వినియోగించుకోగల విజ్ఞత మనకు లేకపోవడం మరింత పెద్ద కారణం. ఏమైనా, ఒక విషయం శర్మగారికి కనీసం కొంత సంతృప్తిని కలిగించి ఉండాలి. ఆదిలో శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు, పిదప శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం ప్రచురణకు ఉద్యమించి, కొన్ని ప్రతిబంధకాలవల్ల మధ్యలో నిలిపివేశారు. శర్మగారు ఈ మహామహులిద్దరికి ఈ కృషిలో బాసటగా నిలిచిన వారే! తాము కలలుగన్న విజ్ఞాన సర్వస్వం తాము లక్షించిన సమగ్ర - బృహత్తర - రూపంలో వెలువడకపోయినా, తమ ప్రధాన సంపాదకత్వాన ఆంధ్ర సంస్కృతిని గురించి రెండు పెద్ద సంపుటాల ప్రచురణ జరగడం శర్మగారికి కొంత తృప్తి నిచ్చి ఉండాలి. ఆ రెండు సంపుటాలు శర్మగారి ఉపజ్ఞకు, పాండితికి, ప్రతిభా ప్రాభవాలకు గొప్ప తార్కాణాలు.

ఇంతే కాదు, మరెంతగా వ్రాసినా శర్మగారి శక్తి సామర్థ్యాలను గురించి, ఆయన గుణగణాలను గురించి చివరిమాటను చెప్పడం ఎవరికి సాధ్యం? ఆ మహనీయునికి ఈ మా శ్రద్ధాంజలిని శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు "ఆంధ్ర ప్రశస్తి" అంకితంలో చెప్పిన పద్యంతో ముగిస్తే, ఆయన దివ్య విగ్రహం కొంతవరకైనా కన్నులకు కట్టినట్టు కనబడగలదేమో!

కొదమ తుమ్మెద ఱెక్కలఁ గుస్తరించు
మీసముల నీ ప్రసన్న గంభీర ముఖము
కన్నులంటగఁ గట్టినట్లున్న నిన్ను
మరచి పోలేను జన్మజన్మములకైన.

*(ఆంధ్రజ్యోతి 3-1-1963)*

## శ్రీ త్రిపురనేని గోపీచంద్

ఎంత గుండె గలవాడు శ్రీ గోపీచంద్! అట్టివాడే గుండెజబ్బుతో నడివయస్సులో హఠాత్తుగా కన్ను మూయడం విడ్డూరం కాదా?

ఆకృతిలోనే కాదు; స్వభావంలో కూడా శ్రీ ఎమ్.ఎన్. రాయ్ శ్రీ గోపీచంద్కు పోలికలు హెచ్చు. ఇదే ఆయనను శ్రీ రాయ్ కి కొంతకాలం పాటు శిష్యుని, భక్తుని చేసినదేమో! "ఎందుకు?" అనే ప్రశ్న వేయడాన్ని తమ తండ్రి శ్రీ త్రిపురనేని రామస్వామిగారి వద్దనే శ్రీ గోపీచంద్ నేర్చుకొన్నారు. ఆ ప్రశ్నే ఆయనను ఆదిలో "రేషనలిస్ట్"గా చేసింది; అదే తర్వాత "రాయిస్ట్"గా మార్చింది; అదే ఇటీవల కొంతకాలంగా ఆయనను శ్రీ అరవిందయోగి దిక్కుకు ఆకర్షించినట్టుగా కనబడుతుంది.

“ఎందుకు?” అనే ప్రశ్న రాజ్యం చేసే వాతావరణంలో పుట్టి, పెరిగిన వాడైనందునే శ్రీ గోపీచంద్ రచనలన్నింటిలో - అది చిన్న కథ కానివ్వండి, పెద్ద నవల కానివ్వండి, మరేదైనా కానివ్వండి - మూలతత్వ విచారణకై ప్రయత్నం కనబడుతుంది. ఫలితమేమైనా, దీక్షగా, ధైర్యంతో ఆయన ఈ పరిశీలన చేశారు. ఇదే ఆయన రచనలకు ఒక ప్రత్యేకతను కూర్చింది; ఇదే వాటికి ఒక వైశిష్ట్యాన్ని సాధించింది.

జీవితం, సాహిత్యం ఇవి శ్రీ గోపీచంద్కు విభిన్న రంగాలు కావు. జీవితమే ఆయనకు సాహిత్యం; సాహిత్యమే జీవితం, ఇందువల్లనే ఆయన సృష్టించిన ప్రతి పాత్రలో నుంచి ఆయనే తొంగి చూస్తున్నట్టుగా ఉంటుంది; లేదా, ఆయన జీవితంతో గట్టిగా పెనవైచుకున్న మరొకరెవరో పలకరిస్తున్నట్టుగా ఉంటుంది!

ఈ మేధావి, ఈ ప్రతిభావంతుడు ఈ ప్రముఖ రచయిత అకాల మరణంవల్ల ఆధునిక సాహిత్యానికే అపార నష్టం వాటిల్లింది. ఈయన భార్యకు, బిడ్డలకు, ఇతర బంధు మిత్రులకు మా సానుభూతిని తెలియజేస్తున్నాము.

*(ఆంధ్రజ్యోతి 4-11-1962)*

## “ఈలపాట” రఘురామయ్య



సుప్రసిద్ధ రంగస్థల, చలనచిత్ర నటుడు శ్రీ కళ్యాణం రఘురామయ్య అస్తమయంతో ఒకనాడు ఆంధ్రనాటక రంగాన్ని ఉర్రూతలూగించిన మహానటులు శ్రేణి అంతరించిందని చెప్పవచ్చు. “ఈలపాట” రఘురామయ్యగా పేరెన్నికగన్న శ్రీ వెంకట సుబ్బయ్య (ఆయన అసలు పేరు అదే) తన 76వ యేట కూడా నాటక రంగం అభివృద్ధిని గురించి కలలుకంటూనే వచ్చారు; నాటకాలలో వేషాలు వేస్తూనే ఉన్నారు.

ఆంధ్ర నాటకరంగానికి ఆరు దశాబ్దాలకు పైగా అవిరళ సేవచేసి, విభిన్నమైన పాత్రల ధారణలో పేరుపొంది, పద్యపఠనంలో తనదైన ఒక ప్రత్యేకమైన బాణీని సృష్టించి, కృష్ణ పాత్రధారణలో రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల ప్రశంసలు పొందిన శ్రీ రఘురామయ్యకు ఈ సంవత్సరమే కేంద్ర ప్రభుత్వం “పద్మశ్రీ” గౌరవాన్ని కూడా ఇచ్చి గౌరవించింది. మానవుడు ఎంత వయస్సు వచ్చినా, వ్యాయామంవల్ల ఆరోగ్యంగా జీవించి, కళాసేవ, ప్రజా
సేవ చేయవచ్చునని నిరూపించి, నిండు జీవితాన్ని గడపిన కళాతపస్వి శ్రీ రఘురామయ్య. ఆయన మృతి ఆంధ్ర కళారంగానికి తీరని వెలితి.

*(ఆంధ్రజ్యోతి 25-2-1975)*

## కొత్త స్పీకర్ : శ్రీ రేబాల దశరథరామరెడ్డి

ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్గా ఎన్నికైన శ్రీ రేబాల దశరథరామరెడ్డి ఆ పదవికి అన్ని అర్హతలు కలిగిన వ్యక్తి. ఆయన ఎన్నిక అన్ని వర్గాలకు పూర్తి సంతృప్తి కలిగించ గల విషయం. స్పీకర్ పదవికి అధికార పక్షం అభ్యర్థిని నిర్ణయించే సందర్భంలో కాంగ్రెస్ పార్టీలోనే కొంత రభస జరగకపోలేదు. మరి ఇద్దరు కాంగ్రెసేతర సభ్యుల నామినేషన్లు కూడా రాకపోలేదు. అయినా, శ్రీ దశరథరామరెడ్డి చివరకు ఏకగ్రీవంగా ఎన్నికకావడానికి ఇవేవీ అడ్డురాకపోవడం గమనించవలసిన విషయం. శాసన సభలో కాంగ్రెసు పార్టీకి, కాంగ్రెస్ పార్టీలో సయితం ముఖ్యమంత్రికి గల తిరుగులేని సంఖ్యాబలమే కాక, శ్రీ దశరథరామరెడ్డికి గల అర్హతలను బట్టి కూడా ఏకగ్రీవపు ఎన్నిక సాధ్యమైనట్టు చెప్పవచ్చు.

శాసనసభ స్పీకర్ పదవి ఎప్పుడైనా, ఎక్కడైనా కష్టమైనదే, క్లిష్టమైనదే. ఇటీవల ఇది మరింత కష్టమైన, క్లిష్టమైన బాధ్యతగా పరిణమిస్తున్నది. అధికారపక్షానికి ఎంత పెద్ద మెజారిటీ ఉన్నప్పటికి, కొద్దిమంది ప్రతిపక్ష సభ్యులు మొత్తం సభాకార్యక్రమాలను సక్రమంగా జరగకుండా నిరోధించగలిగిన సందర్భాలు ఇటీవల పార్లమెంటులో నేమి, రాష్ట్ర శాసనసభలలోనేమి తరచుగా తటస్థపడుతున్నాయి. కొన్ని శాసనసభలలో ముష్టియుద్ధాలు జరిగిన సన్నివేశాలు సయితం ఉన్నాయి. ఈ పరిస్థితులలో సభాకార్యక్రమాలను యథావిధిగా నిర్వహించడం, ఇటు అధికారపక్ష సభ్యులను, అటు ప్రతిపక్ష సభ్యులను సంబాళించుకుని రావడం స్పీకర్లకు అతిక్లిష్టమైన పనీ అవుతున్నది.
స్పీకర్ అయిన వ్యక్తి ఎంతో ఓర్పు కలిగినవాడై ఉండాలి; అదే సమయంలో అతడు ఎంతో నేర్పుతో, చాకచక్యంతో, సమయస్ఫూర్తితో, దక్షతతో, హుందాతనంతో వ్యవహరించాలి. అన్నిటిని మించి నిష్పాక్షికంగా వ్యవహరించడమే కాక, నిష్పాక్షికంగా తాను వ్యవహరిస్తున్నట్టు అన్ని పక్షాలవారికి విశ్వాసం కలిగించగల విధంగా ప్రవర్తించాలి. దీనికి తోడు, ఎంత ఉద్రేకభరితమైన సన్నివేశంలోనైనా ఓర్పుతోపాటు కించిత్ హాస్యచతురత కలిగిన స్పీకర్ మరింతగా రాణించగలడు.

రాష్ట్ర శాసనసభ స్పీకర్ ఎన్నికైన శ్రీ దశరథరామరెడ్డికి శాసనసభా వ్యవహారాలు కొత్త కాదు. కొంత కాలం పార్లమెంటులో, కొంతకాలం శాసనసభలో ఆయన సభ్యుడు. కాంగ్రెసుతో ఆయన సంబంధం 1930 నాటిది. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని, కారాగారవాసం అనుభవించిన స్వాతంత్ర్యయోధుడు. న్యాయవాదిగా మంచిపేరు తెచ్చుకున్న వ్యక్తి. సహకారోద్యమంలో సొంత జిల్లాలోనే కాక, ఇతరత్రా కూడా పెక్కు హోదాలలో పనిచేసి అనుభవం గడించినవారు. అన్నిటికంటే ముఖ్యంగా, వివాదాలకు దూరంగా ఉండే వ్యక్తిగా అజాత శత్రువుగా పేరుపొందారు.

అయితే, ఎన్ని అర్హతలు కల వ్యక్తి అయినా, శాసనసభ్యుల సంపూర్ణ సహకారం లేనిదే ఏ స్పీకరు తన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తింపలేడు. విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించగలనని శ్రీ దశరథ రామరెడ్డి పదవీ స్వీకారం చేస్తూ ప్రకటించారు. స్పీకరుగా ఎన్నికైనందుకు ఆయనను అభినందిస్తూ

ప్రసంగించిన సభ్యులందరు ఆయనకు తమ సహాయసహకారాలు పూర్తిగా ఉండగలవని వాగ్దానం చేశారు. ఈ పరస్పర సుహృద్భావం శాసనసభా కార్యక్రమాలలో పూర్తిగా ప్రతిఫలించగలదని ఆశించాలి.

*(ఆంధ్రజ్యోతి 31-1-1975)*

## అల్లూరి సత్యనారాయణ రాజు

ఎవరినీ లక్ష్యపెట్టని నిర్భయత్వం, దేనికీ వెనుదీయని తెగువ, ఎట్టి క్లిష్ట పరిస్థితినైనా చిరు నవ్వుతో ఎదుర్కొనే ధైర్యం, సాహసం - ఇవీ శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజు గారిని తలచుకొనగానే స్మృతిలో మెదిలే గుణాలు.



పదిహేడేళ్ళ చిరుత ప్రాయంలో సత్యాగ్రహ సమరాంగణంలోకి దుమికిన నాటి నుంచి దాదాపు మూడు దశాబ్దాల ఆయన రాజకీయ జీవితాన్ని ఈ విశిష్ట గుణాలే ప్రభావితం చేశాయి. వ్యక్తిగతంగా ఆయన ఎంత సౌమ్యులో, సరసులో రాజకీయాలలో అంత అతివాది. ఆయన దేశాభిమానం అతి తీవ్రమైనది. బ్రిటిష్ దాస్యం నుంచి భారతదేశాన్ని విముక్తం చేయడానికి కాంగ్రెసు నడిపిన సత్యాగ్రహోద్యమాలన్నిటిలో ఆయన పాల్గొన్నారు. అయినా ఆయన హృదయం ఎప్పుడూ అతివాద చర్యల వైపే మొగ్గేది; విప్లవాత్మక విధానాలనే అభిమానించేది. స్వాతంత్ర్యోద్యమంలో ఆయన రెండవ తరానికి చెందిన వారైనా, మొదటి తరం నాయకులవలె విశేషంగా ప్రజాభిమానాన్ని చూరగొనడానికి, ప్రజా నాయకులుగా పేరొందడానికి తీవ్రవేశంతో కూడిన ఆయన గాఢ దేశభక్తే కారణం. అనర్గళ జలపాతం వలె ధ్వనించే ఆయన ఉపన్యాసాలు వేలాది సభికులను మంత్ర ముగ్ధులుగా, ఉద్విగ్నులుగా, కార్యోన్ముఖులుగా చేసే శక్తిని సంతరించుకొనడానికి ఆయనలో పెల్లుబికిన దేశాభిమానమే కారణం.

స్వాతంత్ర్య సిద్ధి అనంతరం ఆయన అనేక బాధ్యతాయుతమైన పదవుల నలంకరించారు. రాష్ట్ర పదవుల నలంకరించారు. రాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శిగా, అధ్యక్షులుగా, అఖిల భారత కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగా ఆయన కాంగ్రెసు సంస్థను పటిష్టం చేయడానికి కృషి చేసి తమకు కేవల దేశాభిమానమే కాక, కార్యదక్షత సయితం పుష్కలంగా కలదని నిరూపించుకొన్నారు. సంజీవయ్య మంత్రి వర్గంలో పబ్లిక్ వర్క్సు శాఖా మంత్రిగా ఆయనలోని మరొక విశిష్టగుణం - రాజనీతి చాతుర్యం వ్యక్తమైంది. కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదంలో ఆంధ్రప్రదేశ్కు ఏ మాత్రమైనా న్యాయం జరిగితే, దాని బాధ్యతలో హెచ్చుభాగం శ్రీ అల్లూరిదే.

ఆయన పాఠశాలలలో పెద్దగా చదువుకొని ఉండకపోవచ్చు. ఆయన విద్యార్జన యావత్తూ స్వయం కృషితోనే జరిగింది. తరుచుగా గడపవలసి వచ్చిన జైలు జీవితాన్ని ఆయన హిందీ అభ్యాసానికి వినియోగించి ఆ భాషలో చక్కని పరిజ్ఞానం సంపాదించుకొన్నారు. రాహుల్ సాంకృత్యాయన్ గ్రంథం "వోల్గా సే గంగా"కు ఆయన చేసిన అనువాదం తెలుగులో చిరస్థాయిగా నిలిచిపోగల రచన.

శ్రీ అల్లూరి వంటి దేశభక్తులు, కార్యశూరులు దేశానికి ఇతోధికంగా అవసరమైన తరుణంలో ఆయన మరణించడం మన దురదృష్టమే. ఆయన మరణంతో ఆంధ్రదేశం మరొక అగ్రనాయకుని కోల్పోయింది. ఆయన లేని వెలితి ఆంధ్ర రాజకీయాలలో చాల కాలం వరకు తీరదు.

*(ఆంధ్రజ్యోతి 4-9-1963)*

## శ్రీ పర్వతనేని బ్రహ్మయ్య

శ్రీ పర్వతనేని బ్రహ్మయ్య పేరు చెప్పగానే ఆయన పేరు మీదుగా ముప్ఫయి ఆరు సంవత్సరాల క్రిందట అవతరించిన సంస్థ జ్ఞాపకం వస్తుంది. ఆ సంస్థ ద్వారా ఆయన ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్, మద్రాసు రాష్ట్రాలకు వ్యాపార, పారిశ్రామిక రంగాలలో చేసిన అపారసేవ జ్ఞాపకం వస్తుంది.

ఇంతేకాదు; సౌజన్యం, సహృదయత, రసజ్ఞత పెనవైచుకున్న ఒక మనోజ్ఞ, గంభీరమూర్తి జ్ఞాపకం వస్తారు. నిజాయితీకి, నీతి వర్తనకు, నిష్కల్మషత్వానికి తన జీవితంలో పట్టాభిషేకం చేసిన ఒక ధీరోదాత్త వ్యక్తి జ్ఞాపకం వస్తారు.

అదీ శ్రీ పర్వతనేని బ్రహ్మయ్య వ్యక్తిత్వం. ఆయనను ఒకసారి చూచినవారికి, ఆయనతో ఒకసారి పరిచయం కలిగినవారికి మరపురానిది ఆ వ్యక్తిత్వం.
ఆయన స్వదేశంలోను, విదేశాలలోను ఉన్నత విద్యాభ్యాసం చేశారు. ఆడిటింగ్ వృత్తి అతి ప్రాథమిక దశలో ఉన్న రోజులలో, ఆ వృత్తికి అంతగా ప్రాధాన్య ప్రతిపత్తులు లేని రోజులలో ఆయన దాన్ని చేపట్టారు. ఆయనతోపాటు ఆ వృత్తి ప్రాధాన్యం, గౌరవం పెరిగాయి. 1932లో ఆయన మరికొందరు భాగస్వాములతో కలిసి స్థాపించిన బ్రహ్మయ్య అండ్ కో ఆయన వ్యాపార, వ్యవహార దక్షతకు సజీవచిహ్నం.

ఆయన కేవలం సాధారణ వ్యాపారదక్షులే అయితే, అంతగా చెప్పుకోవలసింది లేదు. కాని వ్యాపార దక్షతకు మించిన సద్గుణాలెన్నో ఆయనలో మూర్తీభవించి ఉన్నాయి. శ్రీ బ్రహ్మయ్య ఎందరో యువకులను చేరదీసి వారికి ఆడిటింగ్ వృత్తిలో శిక్షణ ఇచ్చారు. వారి వద్ద శిక్షణ, అనుభవం గడించిన వారెందరో ఈనాడు ఆ రంగంలో అగ్రశ్రేణిని అందుకున్నారు. ఆ వృత్తిలో ఆయనకున్నంతమంది శిష్య, ప్రశిష్యులు చాల తక్కువమందికి ఉంటారు. అందుకే ఆయన స్నేహితులు, అభిమానులు శ్రీ బ్రహ్మయ్యను “కులపతి” అని ప్రేమతో పిలుచుకుంటారు.

ముఖ్యంగా పేర్కొనదగు మరొక విశేషం శ్రీ బ్రహ్మయ్యగారిలో ఉన్నది. తన సంస్థలో పనిచేసి, దాని అభివృద్ధికి తోడ్పడిన వారెందరికో ఆయన దానిలో భాగస్వామ్యమిచ్చి ప్రోత్సహించారు. సాధారణంగా ఇది పాశ్చాత్య దేశాలలో తప్ప, మన దేశంలో వాడుకలో లేని పని. ఈ సుసంప్రదాయాన్ని అమలుచేసిన ఖ్యాతి బ్రహ్మయ్యగారిదే.

ఆయన జీవితంలో కొన్ని విలువలకు ప్రాధాన్య మిచ్చిన వ్యక్తి. వ్యాపార రంగంలో లాభ నష్టాల కంటే నీతికి, నిజాయితీకి, శీలానికి ఎక్కువ విలువ కలదని విశ్వసించిన వ్యక్తి. తన సహచరులలో కూడా అదే విశ్వాసాన్ని పాదుకొల్పడానికి కృషిచేసిన వ్యక్తి. ఆయన చేతి మీదుగా ఆంధ్ర, మద్రాసు రాష్ట్రాలలో ఎన్నో వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు అవతరించాయి. ఆయనకు ఎన్నో సంస్థలతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలున్నాయి. ఆయన నిర్మొగ మాటంగా ఇచ్చే సలహాలను అవి సగౌరవంగా స్వీకరిస్తాయి.

శ్రీ బ్రహ్మయ్యతో పరిచయం కలవారిని మరొక విశేషం కూడా ఆకర్షిస్తుంది. నిత్యం వ్యాపారపు లావాదేవీలలో మునిగివుండే ఈ వ్యక్తికి లలిత కళలలో, ముఖ్యంగా సంగీత, విద్యావిషయక, కళా సంస్థలకు ఆయన ప్రత్యక్ష ప్రోత్సాహం ఉన్నది. కొన్ని సంవత్సరాల క్రిందట మద్రాసులో హోం యూనివర్సిటీ లైబ్రరీని స్థాపించడంలో ఆయన ప్రముఖపాత్ర వహించారు.

ఆయన వ్యక్తిత్వం ఇంత బహుముఖమైనది, ఇంత సరళమైనది, ఇంత నిర్మలమైనది కావడం వల్లనే ఆయన దేశంలో అనేకులకు స్నేహపాత్రులయ్యారు. ఆయన అభిమానులందరు ఆయన షష్ట్యబ్దపూర్తి ఉత్సవాలను గాఢానురాగంతో నేడు జరుపుకొనడానికి ఆయనలోని ఈ ఆకర్షణీయమైన వ్యక్తిత్వమే కారణం. ఈ శుభ సమయంలో బ్రహ్మయ్య గారికి మా అభినందనలు అందజేస్తూ మరి పెక్కు సంవత్సరాలు ఆయన సేవాభాగ్యానికి మన రాష్ట్రం, మన దేశం నోచుకోగలవని మనసారా ఆశిస్తున్నాము.

*(ఆంధ్రజ్యోతి 28-10-1968)*

## కొత్త వైస్ ఛాన్సలర్: శ్రీ లంకపల్లి బుల్లయ్య

ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ పదవికి శ్రీ కె.ఆర్. శ్రీనివాస అయ్యంగార్ రాజీనామా ఇవ్వడమేమి, దాన్ని ప్రభుత్వం ఆమోదించడమేమి విచారకర విషయమే. ఇందుకు దారితీసిన విశ్వవిద్యాలయ పరిస్థితులు కూడా శోచనీయమైనవే.

ఇదే సమయంలో ఆ పదవికి మరొక సమర్థుడైన వ్యకిని - శ్రీ ఎల్. బుల్లయ్యను - నియమించడం సంతోషించదగింది. మొత్తం దేశంలోనే ఒక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ పదవికి ఒక హరిజనుడిని మొదటిసారిగా నియమించడం జరిగింది. ఇది కూడా సంతోషించదగు విషయం.

శ్రీ బుల్లయ్యకు విద్యాశాఖలో, విద్యాలయాల పరిపాలనలో విశేషానుభవం - సుమారు పాతికేళ్ళకు విస్తరించినట్టిది - ఉన్నది. ఆయన విద్యాశాఖలో క్రింది నుంచి ప్రారంభమై పెక్కు హోదాలలో పనిచేశారు. మొదట జిల్లా విద్యాధికారిగా ప్రవేశించారు. తర్వాత డివిజనల్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టరుగా పనిచేశారు. తర్వాత కర్నూలు కాలేజీ ప్రిన్సిపల్గా వెళ్ళారు. తిరిగి విద్యాశాఖ లోనికి వచ్చి జాయింట్

డైరెక్టర్ అయ్యారు. ఆ తర్వాత డైరెక్టర్గా వ్యవహరించారు. విద్యాశాఖను రెండు విభాగాలుగా చేసినప్పుడు హైయర్ ఎడ్యుకేషన్ విభాగానికి డైరెక్టర్ అయ్యారు. తిరిగి విలీనమైన విద్యాశాఖ డైరెక్టర్ గా ఉంటుండగా ఈ క్రొత్త నియామకం జరిగింది.

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడుగా రాష్ట్ర ప్రభుత్వం సరియైన వ్యక్తినే ఎంచుకున్నదని చెప్పడంలో సందేహం లేదు. పరిపాలనాదక్షుడుగా ఆయనకు మంచి పేరున్నది.

ఐతే, విశ్వవిద్యాలయం పరిస్థితులు ఇటీవల చాలా అస్తవ్యస్తంగా తయారైనాయి. ఈ విషయం ఈ మధ్య శ్రీ అయ్యంగార్ రాజీనామా వ్యవహారంలో బాగా వెల్లడైంది. ముఖ్యంగా ఆర్థికంగా విశ్వవిద్యాలయ పరిస్థితి బాగా దిగజారిపోయింది. ప్రభుత్వం నుంచి రావలసిన గ్రాంట్లు రాకపోవడం దీనికి ప్రధాన కారణం. దైనందిన నిర్వహణకు, సిబ్బంది జీతాలకు అన్నింటికి విశ్వవిద్యాలయం వెనకా ముందు చూసుకోవలసి వస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఇందులో తన బాధ్యత ఏమీ లేనట్టు, తనకేమీ పట్టనట్టు వూరుకోవడం భావ్యంగా లేదు.

కొత్తగా నియమితులైన శ్రీ బుల్లయ్య ఎంత పరిపాలనాదక్షులైనా కావచ్చు. కాని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం విషయంలో తనకేమీ పట్టనట్టు వూరుకుంటే ఆయన మాత్రం ఏమిచేయగలరు? ఒకరు రాజీనామా ఇస్తే మరొకర్ని నియమించడంతో ప్రభుత్వం బాధ్యత తీరిపోతుందా? విశ్వవిద్యాలయానికి ఆర్థిక స్తోమత చేకూర్చవలసిన బాధ్యత దానికి లేదా? ఈ బాధ్యతను అది నిర్వర్తించనప్పుడు శ్రీ బుల్లయ్యగారిని కాదు, మరెవరిని నియమించినా ఒకటే.

శ్రీ అయ్యంగార్ రాజీనామాకు సిండికేటుతో అభిప్రాయ భేదాలు మొదలైన కారణాలు కూడా మరికొన్ని ఉన్నాయి. శ్రీ బుల్లయ్య ఈ చిక్కులన్నింటిని అధిగమించి దేశంలోనే పేరెన్నికగన్న విశ్వవిద్యాలయాలలో ఒకటైన ఆంధ్ర యూనివర్సిటీని సరియైన పద్ధతులపై, సమర్థంగా నిర్వహించగలరనే ఆశిస్తున్నాము.

*(ఆంధ్రజ్యోతి 14-11-1968)*

## శ్రీ అబ్బూరి రామకృష్ణరావు



ఎవరెన్ని గ్రంథాలు వ్రాశారనేది ముఖ్యం కాదు; ఎంతెంత పెద్ద గ్రంథాలను వ్రాశారనేది కూడా ముఖ్యం కాదు.
శతాధిక గ్రంథకర్తలందరు మహా రచయితలు కారు; సహస్రాధిక పుటలతో కూడిన గ్రంథాలను వ్రాసిన వారందరు సాహిత్య సమ్రాట్టులుకారు.

వాల్మీకి వ్రాసింది ఒకే ఒక కావ్యం. అయినా, ఆయన సంస్కృతంలో ఆదికవి మాత్రమే కాదు, మహాకవి కూడా.

కీట్స్ వ్రాసింది చాలా తక్కువ. అయినా, ఇంగ్లీషు విమర్శకులలో పెక్కుమంది షేక్స్పియర్ తర్వాత కీట్స్కే పెద్ద పీట వేస్తారు.

టాల్ స్టాయ్ వ్రాసినవి పట్టుమని పది నవలలైనా లేవు. అయినా, ప్రపంచం మొత్తం మీదనే నవలాకారులలో ప్రథమ స్థానం ఆయనదే.

ఏ రచయితకైనా విలువ కట్టవలసింది అతడి రచనల రాశినిబట్టికాదు, వాటి గుణాన్ని బట్టే. అయినా, ఇందుకు భిన్నంగా తరచు జరగడం కద్దు.

ఎంత దూరం వరకో పోనక్కరలేదు; మన తెలుగు గడ్డపైనే కేవలం వారి రచనల రాశినిబట్టి మహారచయితలుగా, సాహిత్య సమ్రాట్టులుగా కీర్తించబడుతున్నవారు పెక్కుమంది ఉన్నారు. ఇంతకంటె విపరీతం మరొకటి ఉన్నది. మన రాజకీయవేత్తలు, ఇతర ప్రముఖులు పీఠిక వ్రాయవలసిందిగా ఏ అయిదారు వందల పేజీల పుస్తకాన్నో తమకు పంపించగా అది అపూర్వమైనది, విశిష్ఠమైనదని, ప్రపంచ భాషలన్నింటిలోకి అనువదించదగినదని దాన్ని ప్రశంసించడం కద్దు. పదేళ్ళనాడు, అయిదేళ్ళనాడు, చివరికి రెండేళ్ళ క్రితం కూడా, ఇట్టి ప్రశంసలందుకున్న గ్రంథాలలో పెక్కింటిని ఈనాడు చదువుతున్నవారు కనబడరు. నిజానికి, వాటికి పీఠికలను వ్రాసిన వారైనా వాటిని ఎంతవరకు చదివినారో అనుమానమే!

కేవలం రాశికే విలువనిచ్చేవారి దృష్టిలో శ్రీ అబ్బూరి రామకృష్ణరావు కవి కాకపోవచ్చు. ఆయన వ్రాసింది చాలా కొద్ది. ఆ కొద్దిపాటిని కూడా ఆయన ప్రచురించలేదు. ప్రచురించినదాన్ని కూడా పూర్తిగా భద్రపరచుకోలేదు.

ఐనా, ఆయన ఉన్నతశ్రేణికి చెందిన కవి. భాషపై అధికారం ఉన్న కవి. ఛందో రీతులపై అధికారం ఉన్న కవి; నూత్న వినూత్న ప్రయోగాలను చేసిన కవి; సంప్రదాయాలు తెలిసినా, వాటికి బానిసకాక, ఆధునిక దృష్టితో

ముందుకు నడిచిన కవి; అర్ధ శతాబ్ది క్రితం వలె ఈనాడు కూడా కవులకే కొత్త బాటలను చూపిన ప్రజ్ఞా ప్రాభవాలున్న కవి.

దాదాపు అలభ్యమైపోయిన, అక్కడక్కడ చెల్లాచెదరుగావున్న శ్రీ అబ్బూరి రచనలను సేకరించి "ఊహాగానము, ఇతర కృతులు" అనే పేరుతో ప్రచురించినందుకు “కవితా సంస్థ” వారిని (15, సాధు వాస్వాని మార్గ్, న్యూఢిల్లీ-10005) మేము అభినందిస్తున్నాము. ఈ సంపుటిని (దీని వెల 20 రూపాయలు) శ్రీ అబ్బూరి 78వ జన్మదినోత్సవ సందర్భంలో ఈనాడు (మే 20వ తేదీని) ప్రచురించడం మరింతగా అభినందించదగు విషయం.

టాగోర్ వద్ద నుంచి, అరవిందయోగి వద్ద నుంచి ఎం.ఎన్. రాయ్ వరకు శ్రీ అబ్బూరి పయనించారు; ఆయన నిత్యపథికుడు కనుక, మరింత ముందుకు కూడా పయనించగలరు. వృద్ధాప్యం ఆయన దేహానికే, మనస్సుకు కాదు, హృదయానికి కాదు. ఆయనను ఈనాడు కలుసుకుంటే, ప్రపంచంలో ఈనాడు ఏ మూల ఏ కొత్త చింతన జరుగుతున్నదో, రేపటి పై దాని ప్రభావం ఏమి కానున్నదో వివరిస్తారు. మన కవి సమ్రాట్టులు పెక్కుమందివలె ఆయన చూపు వెనుకకుకాదు, ముందుకే. ఆయనకు స్వర్ణయుగం వేదకాలంలో లేదు, ఆర్య ఋషుల సంఘంలో లేదు; అది భావికాలంలో ఉన్నది. ఏక మానవ కుటుంబంలో ఉన్నది.

శ్రీ అబ్బూరి కవి మాత్రమే కాదు, పండితుడు, విమర్శకుడు, తాత్త్వికుడు, నటుడు, నాటక ప్రయోక్త, సంభాషణా చతురుడు, అన్నింటినిమించి సమ్యక్ దృష్టివున్న మానవతావాది. ఆయన ఇట్టి జన్మదినోత్సవాలను మరి పెక్కింటిని జరుపుకోవాలని మనసారా కోరుతున్నాము.

(ఆంధ్రజ్యోతి 20-5-1973)

వివరణలు : కీట్స్ - ఆంగ్లకవి; షేక్స్పియర్ - ఆంగ్ల నాటకకర్త; ఎం.ఎన్. రాయ్ - రాడికల్ హ్యూమనిస్టు ఉద్యమ నేత; అరవింద - అరవిందఘోష్, విప్లవవాది, తత్త్వవేత్త.

# శ్రీ నీలం సంజీవరెడ్డి


నీలం సంజీవరెడ్డి

అభినందించ వలసినదెవరిని?
అధికారానికి కాక, ఆదర్శానికి ప్రాధాన్య మిచ్చి, స్వచ్ఛందంగా, సంతోషంగా ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకొన్న శ్రీ నీలం సంజీవరెడ్డినా?

రాష్ట్ర కాంగ్రెసు కార్యకర్తలలో ఒక ప్రముఖుడుగా, రాష్ట్ర ప్రభుత్వంలో ఒక ప్రధాన సభ్యుడుగా చాలాకాలంగా ఉంటూ, రాజనీతిజ్ఞుడుగా, వ్యవహార దక్షుడుగా పేరొంది, ఈ నెల 29వ తేదీని కొత్త ముఖ్యమంత్రిగా పదవిని స్వీకరించనున్న శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డినా?

తలవని తలంపుగా తల యెత్తిన అసాధారణ పరిస్థితులలో ప్రశంసా పాత్రమైన సంయమనాన్ని, సమైక్య భావాన్ని ప్రదర్శించి, ఉదాత్తంగా వ్యవహరించిన లెజిస్లేచర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులనా?

వీరందరు అభినందన పాత్రులే! పైగా, సమానంగా అభినందన పాత్రులు! వారి మధ్య తరతమ విభేదాలను చేయడం ఎంతమాత్రం తగదు!

ఇదివరలోనే మేము రెండు సార్లు వివరించినట్లు, పదవిని మించి పార్టీని, పార్టీకి మించి ప్రజాహితానికి సంబంధించిన ప్రాథమిక సూత్రాలకు తాము ప్రాధాన్యమిస్తామని ఉదాత్తమైన తమ చర్య ద్వారా శ్రీ సంజీవరెడ్డి మరొకసారి నిరూపించుకొన్నారు. దీనివల్ల ఆయన అంతస్తు ఎంతగానో పెరిగింది. ఆయన పట్ల, ఆయన నాయకత్వం పట్ల తన పరిపూర్ణ విశ్వాసాన్ని పునరుద్ఘాటిస్తూ లెజిస్లేచర్ కాంగ్రెసు పార్టీ నిన్న ఏకగ్రీవంగా చేసిన తీర్మానమేమి, ముఖ్యమంత్రి పదవి నుంచి విరమించినా, పార్టీ నాయకత్వ బాధ్యతను ఆయనే కొనసాగించాలని అది చేసిన తీర్మానమేమి ఈనాడు ఆయనకు రాష్ట్ర రంగంలోనే కాక, యావద్భారతంలో గల సమున్నత స్థానాన్ని, సగౌరవ ప్రతిపత్తిని వేనోళ్ళ చాటుతున్నాయి.

మహాత్ములైనవారు యుగానికొక సారైనా ఆవిర్భవిస్తారో, లేదో! ఎంతటి మహాత్ములైనా కొన్ని కొన్ని సందర్భాలలో పొరపాటు పడవచ్చు. గాంధీజీయే ఒకానొక సందర్భంలో తాను హిమాలయాలను పోలినంత పెద్ద పొరపాటు చేసినట్టు చెప్పుకొన్నారు. అయినప్పుడు తక్కినవారి సంగతి వేరే చెప్పవలెనా? చిన్న, పెద్ద విషయాలన్నింటిలో - ప్రతి సందర్భంలోను - వీసం వాసిగానైనా ధర్మాన్ని తప్పక, న్యాయాన్ని తప్పక సంచరించడం అసాధ్య విషయం. కాగా, ఎవరి ఘనతైనా బయటపడేది అన్యవిధంగా ప్రవర్తిస్తే తమ దృష్టిలోనే తాము పలచబడిపోగల పరిస్థితులలో ఉత్తమంగా, ఉదాత్తంగా వ్యవహరించ గలిగినప్పుడే!

ఒకటి, రెండుసార్లు కాక, తమ జీవితంలో ఈసరికే అనేక సార్లు తాము ఈ విధంగా వ్యవహరించగలమని శ్రీ సంజీవరెడ్డి నిరూపించుకొన్నారు. ఇట్టి ప్రతిచర్యతో ఆయన అంతస్తు పెరుగుతూ పోతున్నందువల్లనే జాతీయ నాయకులలోనే ఒక ప్రముఖుడుగా ఆయన ఈనాడు లెక్కకు వస్తున్నారు.

తమ జాతీయ నాయకుని ప్రతిపత్తికిని తగినట్టు, ప్రస్తుతం శ్రీ సంజీవరెడ్డి దృష్టి జాతీయ సమస్యలపైనే అత్యధికంగా కేంద్రీకృతమౌతున్నది. దేశం పురోభివృద్ధి చెందితేనే, రాష్ట్రాభ్యుదయం. ప్రజాస్వామ్యం వ్రేళ్లుతన్నితేనే, ప్రజా స్వాతంత్ర్యానికి, జాతీయ పురోగతికి రక్ష. సామాన్య పౌరుల స్థితిగతులు చక్కబడితేనే స్వరాజ్యానికి సార్థక్యం. "సోషలిజం" కేవలమొక "స్లోగన్"గా మిగలక, దాని ప్రాతిపదికపై నవ సమాజ నిర్మాణం జరిగినప్పుడే భారత చరిత్రలో తిరిగి స్వర్ణయుగం. ఈ భావాలతో, ఈ విశ్వాసాలతో భవిష్యత్తును గురించి కలలు కంటున్న శ్రీ సంజీవరెడ్డి నిన్న ఆయన వదులుకొన్న ముఖ్యమంత్రి పదవిని మించిన వాటిని ముమ్ముందు వహించగలరని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేసిన ప్రజాసేవను మించగలదాన్ని చేయగలరని ఆశించవచ్చు.

## శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి

శ్రీ సంజీవరెడ్డి సహచరుడుగా ఆయనకు ఆప్తమిత్రుడుగా - అంతేవాసిగా - ఒక దశాబ్దానికి పైగా వుంటున్న శ్రీ బ్రహ్మానందరెడ్డికి రాజ్యాధికార పదవి కొత్తది కాదు. దాని నిర్వహణలో ఆయన ఈ సరికే ఎంతో దక్షతను చూపగలిగారు. పరిపాలనకు సంబంధించిన సమస్యలలో ఆయనకు పరిచితమైనది దాదాపుగా లేదు. ప్రభుత్వోద్యోగుల మన్ననలు పొందడం ద్వారా, వారి పూర్తి సహాయ సహకారాలను సంపాదించడంలో ఆయనకు ఆయనే సాటి. పట్టు విడుపులు ఆయనకు తెలుసు; కీలెరిగి వాత పెట్టడం కూడా ఆయనకు తెలుసు.

శ్రీ బ్రహ్మానందరెడ్డి తక్కిన గుణగణాల కంటె ప్రశంసా పాత్రమైనది, - నవ్వుతూ "నో" అనడంలో ఆయనకున్న నేర్పు. అవసరమైనప్పుడు రిక్తహస్తాన్ని చూపలేని వ్యక్తి శక్తివిహీన పరిపాలకుడే కాగలడు. అయితే, "ల"కు "ఏ" త్వమివ్వడాన్ని ఇతరుల మనస్సును నొప్పించకుండా ఎందరు చేయగలరు? విసుగుదలవచ్చినా, దాన్ని పైకి కనబరచనివారే ఆ పని చేయగలరు; నవ్వి, నవ్వించగలవారే ఆ పని చేయగలరు; "కా" దనడం ఆదరంతోనే అన్న భావాన్ని కలిగించగలవారే ఆ పని చేయగలరు.

ఈ విషయంలో తమకున్న ప్రజ్ఞాప్రాభవాలను తమ నూతన మంత్రివర్గ నిర్మాణంలో శ్రీ బ్రహ్మానందరెడ్డి ఎంత వరకు వినియోగించనున్నారో వేచిచూడాలి. అట్లీ తన ఆత్మకథలో ("యాజ్ ఇట్ హ్యాపెన్డ్"లో) వ్రాసినట్టు, మంత్రివర్గ నిర్మాణాన్ని మించి చిక్కు సమస్య మరిలేదు. కాని, దీనికంటే కూడా క్లిష్టమైన సమస్య మంత్రివర్గ సభ్యులైన వారిలో ఆశించిన స్థాయికి తేలేకపోయినవారికి ఉద్వాసన చెప్పడం! "మంత్రివర్గ నిర్మాణం అంటే మాటలు కా" దని నిన్న చెప్పడం తమకు ఈ విషయాలు తెలుసునని శ్రీ బ్రహ్మానందరెడ్డి విశదం చేశారు.

ముఖ్యమంత్రిగా ఆయన చరితార్థుడు కావడం సామర్థ్యంతోపాటు సచ్చరిత్రకు ఎన్నదగువారినే తోటి మంత్రులనుగా ఎన్నుకొన గలిగినప్పుడే!
పోతే, చిల్లర మల్లర విషయాలలో తమలో కొన్ని విభేదాలున్నా కీలకమైన సమస్యలలో తాము ఒక్కమాటపై నిలవగలమని, ఒక్క త్రాటిపై నడవగలమని రుజువు చేయడం ద్వారా తక్కిన రాష్ట్రాలలోని లెజిస్లేచర్ కాంగ్రెస్ పార్టీలకు సయితం ఆదర్శప్రాయంగా ఆంధ్రప్రదేశ్ పార్టీ సభ్యులు ప్రవర్తించారు; తమ నాయకునివలె తాము కూడా ఉదాత్తంగా వ్యవహరించగలమని లోకానికి చాట గలిగారు.

నిన్నటి లెజిస్లేచర్ పార్టీ సమావేశం, దానిలో జరిగిన నిర్ణయాలు దేశం మొత్తం మీదనే కాంగ్రెసు సంస్థ ప్రతిష్ఠను పెంచినవనడంలో అణుమాత్రమైనా సందేహం లేదు.

*(ఆంధ్రజ్యోతి 25-2-1964)*

## శ్రీ నూతక్కి రామశేషయ్య

శ్రీ నూతక్కి రామశేషయ్యగారి నిర్యాణం ఒరిస్సా వారికేకాదు, అంతకన్న మిన్నగా ఆంధ్రులకు సంతాప కారణం.
ఆయన ఒరిస్సాలో ఆరోగ్య మంత్రిగా ఉన్నా, జన్మతః ఆంధ్రులు. ఆంధ్రలో జన్మించి, తెలుగువారై ఉండి పర రాష్ట్రాలలో పేరు ప్రఖ్యాతులు ఆర్జించుకున్న కొద్ది మంది ఆంధ్ర ప్రముఖులలో ఆయనొకరు.

న్యాయవాదిగా తన జీవితాన్ని శ్రీ రామశేషయ్య విజయవాడలోనే ప్రారంభించారు. తర్వాత కీర్తిశేషులు శ్రీ వెలగపూడి రామకృష్ణ జయపూర్ సంస్థానానికి దివానుగా ఉండగా శ్రీ రామశేషయ్య అసిస్టెంట్ దివాన్గా ఉండేవారు. ఆ తర్వాత దివాన్గా కూడా పనిచేశారు. శ్రీ రామకృష్ణ స్థాపించిన పెక్కు పరిశ్రమలతో ఆయనకు సన్నిహిత సంబంధం ఉండేది. దానివల్లనే శ్రీ రామకృష్ణ రాయఘడలో స్థాపించిన పరిశ్రమలను నిర్వహిస్తూ ఆయన అక్కడే స్థిరపడిపోయారు. 1952లో లోకసభకు ఎన్నికై 1957 వరకు సభ్యులుగా ఉండి రాజకీయ రంగంలో పేరుపొందారు. ఆ తర్వాత జయపూర్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా ఒరిస్సా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆరోగ్య శాఖా మంత్రిగా నియమితులయ్యారు. కొన్నాళ్లుగా అస్వస్థులుగా ఉంటూ శుక్రవారం నాటి రాత్రి కాలధర్మం చెందారు.

చాలమందికి తెలియక పోవచ్చుగాని శ్రీ రామశేషయ్యకి సాహిత్యం పట్ల విశేషమైన అభిరుచి ఉన్నది. సాహితీ సమితి తొలి రోజులలో దానిలో సభ్యులుగా ఉండేవారు. శ్రీయుతులు శివశంకర శాస్త్రి, కృష్ణశాస్త్రి, వేదుల సత్యనారాయణ శాస్త్రి మున్నగు వారితో ఆయనకు గాఢమైత్రి ఉండేది. శ్రీ వేదుల తన “దీపావళి” ఖండకావ్య సంపుటిని శ్రీరామశేషయ్యకే అంకితమిచ్చారు. అంకితం పద్యాలలో శ్రీ రామశేషయ్యని "కావ్య కళ లోతులు ముట్టిన మేటి శిల్పి" అని శ్రీ వేదుల వినుతించారు కూడా.

ఇంతే కాక, ఆయన స్వయంగా కవి, రచయిత, మారు పేరుతో "సాహితి" పత్రికలో రచనలు చేస్తూ ఉండేవారు. విశాల భావాలు కలవారు. కులాంతర వివాహాలకు సంబంధించిన ఇతివృత్తంతో ఆయన ఒక గేయం వ్రాశారు.

సరసుడు, సహృదయుడు, సాహితీ ప్రియుడు, కవి, కవి మిత్రుడు, విశేషించి నీతివంతుడు, పరిపాలనాదక్షుడు అయిన శ్రీ రామశేషయ్యగారి నిర్యాణ దుఃఖంలో పాలుపంచుకుంటూ వారి కుటుంబానికి మా సానుభూతి తెలియజేస్తున్నాము. *(ఆంధ్రజ్యోతి 2-6-1969)*

## శ్రీ కుందూరి ఈశ్వరదత్

త్రివేణి సంగమ స్థానంలో పనిచేసినందువల్ల కాబోలు, ఆ గంగా గాంభీర్యం ఆ యమున ఉద్వేగం, ఆ సరస్వతి స్వచ్ఛత మొన్న ఢిల్లీలో శాశ్వతంగా కన్నుమూసిన శ్రీ కుందూరి ఈశ్వరదత్ శైలిలో కానవచ్చేవి.

ఆయన కలం వేడిని విరజిమ్మినా, ఆయన గుండె అమృతాన్ని చిలికేది. అందువలనే, ఆయన విమర్శలో లాలిత్యం తొణికిసలాడేది.

వ్యక్తులను, వారి అలవాట్లను, అభిరుచులను పరిశీలించడంలో నేమి, సంఘటనలను అంచనా కట్టడంలోనేమి ఆయన సిద్ధహస్తుడు. వ్యక్తుల స్వరూప స్వభావాల చిత్రణలో ఆయనకు ఆయనేసాటి. అందువలనే, చిన్నప్పుడే ఆయన వ్రాసిన "పెన్ పోర్ట్రెయిట్స్" భారతదేశంలోని ప్రముఖ రాజనీతిజ్ఞులను సైతం ఆకర్షించాయి, అలరించాయి.

ఆంధ్రదేశం ఒక సి.వై. చింతామణిని, ఒక కోటంరాజు రామారావును, ఒక ఖాసా సుబ్బారావును, ఒక ఎమ్. చలపతిరావును భారతదేశానికి ప్రసాదించింది. ఆ కోవలోనివారే శ్రీ ఈశ్వరదత్ కూడా.

నిర్భీకత్వానికి ఆయన పెట్టింది పేరు. ఆత్మ విశ్వాసానికి ఆయన మారుపేరు. అందువల్లనే అలాంటి పత్రికా రచయితల వలెనే ఆయన ఏ పత్రికలో కూడా కుదురుకోలేకపోయారు. ఎన్నో పత్రికలను ఆయన పెట్టారు. మరెన్నో పత్రికలలో ఆయన పనిచేశారు.

వివిధ పత్రికలలో విభిన్నమైన బాధ్యతలలో తన స్వానుభవాలను సుబోధకమైన, హృదయంగమమైన శైలిలో వివరిస్తూ ఆయన వ్రాసిన "ది స్ట్రీట్ ఆఫ్ ఇంక్" అన్న గ్రంథం ఆయన రచనా చాతురికి మచ్చుతునక వంటిది. కాంగ్రెస్ చరిత్రలో మరుగున పడిన ఎన్నో విషయాలను పరిశోధించి, వెలికితీసి ఆయన రాసిన "కాంగ్రెస్ ఎన్సైక్లోపీడియా" ఆయన పరిశోధనా దృష్టికి ప్రతీక.

ఇంతటి బహుముఖ ప్రజ్ఞావంతుడు. కనుకనే ఆయన సర్ తేజ్ బహదూర్ సప్రూ వంటి రాజనీతిజ్ఞునికి సన్నిహితుడు కాగలిగారు, సర్ చిర్రావూరి యజ్ఞేశ్వర చింతామణిని పోలిన పత్రికా సంపాదకునికి సహచరుడు కాగలిగారు, సర్ మీర్జా ఇస్మాయిల్ వంటి పరిపాలనా దక్షునికి కుడిభుజం కాగలిగారు.

ఆ శైలిలోని సారళ్యం, ఆ వాక్యంలోని విన్యాసం, ఆ విషయ వివరణలోని నైపుణ్యం ఇక చూడలేమన్న భావన ఎంత బాధాకరంగా ఉన్నది!

ఆయన కుటుంబానికి మా హృదయపూర్వకమైన సానుభూతి.

*(ఆంధ్రజ్యోతి 11-6-1968)*

## శ్రీ శొంఠి రామమూర్తి

బ్రిటీష్ ప్రభుత్వ కాలంలో అత్యున్నత పదవు అధిష్టించి, గొప్ప పరిపాలనా దక్షుడుగా, మహామేధావిగా పేరెన్నికగన్న కొద్దిమంది ఆంధ్ర మహాపురుషులలో శ్రీ శొంఠి రామమూర్తి  ఒకరు. ఆయన నిర్యాణవార్త ఆంధ్రదేశానికి అత్యంత విషాదకరమైనది.

1912లోనే ఆయన ఇండియన్ సివిల్ సర్వీసులో చేరి, వివిధ పదవులలో పనిచేసి, సమర్థుడైన పరిపాలకుడుగా ఖ్యాతి గడించారు. తొలి రోజులలో మద్రాసు రాష్ట్రంలోని పెక్కు జిల్లాలకు కలెక్టరుగా పనిచేసి అనుభవం సంపాదించారు. ఆ తరువాత మద్రాసు ప్రభుత్వానికి సలహాదారుగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేసినా, బొంబాయి తాత్కాలికపు గవర్నర్ పదవిని అధిష్టించినా, స్వాతంత్ర్యానంతరం ప్లానింగ్ కమీషన్కు వ్యవసాయ విషయాలలో సలహాదారుగా పనిచేసినా, ఏ హోదాలోవున్నా ఆయన అపారానుభవం, కార్యదక్షత, మేధా పటిమ వ్యక్తమయ్యేవి. పరిపాలనా రంగంలో ఆయన చేసిన నిష్కళంక సేవకు పరిగణనగానే నాటి బ్రిటీష్ ప్రభుత్వం ఆయనకు “సర్” బిరుదుమిచ్చి గౌరవించింది.

ఇవన్నీ ఒక ఎత్తుకాగా, ఆంధ్రదేశాన్ని నిత్య సుభిక్షం చేయగల రామపాదసాగర్ ప్రాజెక్టును గురించి రామమూర్తి గారు కలలు కనడమే కాక, అట్టి ప్రాజెక్టు సుసాధ్యమని, అత్యవసరమని నిరూపించడానికి చేసిన కృషి ఆంధ్రులకు చిరస్మరణీయమైనది. అదే విధంగా తుంగభద్ర ప్రాజెక్టును రూపొందించడంలో, దాని నిర్మాణాన్ని సాధించడంలో కూడా ఆయన పాత్ర ఉజ్జ్వలమైనది. శ్రీ పుల్లారెడ్డి పేర్కొన్నట్టు స్వాతంత్ర్యానంతర కాలంలో రామమూర్తిగారి ప్రజ్ఞాగరిమను కేంద్ర ప్రభుత్వంగాని, రాష్ట్ర ప్రభుత్వంగాని పూర్తిగా వినియోగించుకొనలేక పోవడం మన దురదృష్టమే. వారి మరణానికి పరితపిస్తున్న వారి కుటుంబానికి “ఆంధ్రజ్యోతి” తన హార్దిక సానుభూతిని తెలియజేస్తుంది.

*(ఆంధ్రజ్యోతి 21-1-1974)*

## శ్రీ నూకల రామచంద్రారెడ్డి

ఇంకా చాలా కాలం జీవించవలసిన వ్యక్తి. బహుముఖంగా ప్రజాసేవను చేయవలసిన వ్యక్తి శ్రీ నూకల రామచంద్రా రెడ్డి తన యాభై ఆరవ యేటనే ఆయన నేడు (శనివారం) కన్నుమూయడం ఎంతైనా సంతాపకరం. ఆయన సేవలను కోల్పోవడం ఆంధ్రప్రదేశ్ దురదృష్టం. అకాల మరణం అని దేనినైనా పేర్కొనవలసివుంటే అది ఇదే.

విద్యార్థిగానే ఆయన స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. దానిలో పాల్గొన్నందుకు ఆయన కాలేజీ నుంచి బహిష్కృతులయ్యారు కూడా.

ఆయన మంత్రి కావడం ఒక విశేషం కాదు మంత్రులైనవారు పలువురున్నారు. కాని, పరిపాలనా దక్షుడైన మంత్రిగా, నీతి నిజాయితీలకు కట్టుబడిన మంత్రిగా ఆయన రాష్ట్ర ప్రజల ఆదరాభిమానాలను విశేషంగా చూరగొన్నారు.

ప్రత్యేక తెలంగాణా ఉద్యమ సందర్భంలో ఆయన ప్రజాసమితిలో చేరి ప్రతిపక్ష నాయకుడైనమాట నిజమే. కాని, స్వప్రాంతం పట్ల ఆయన అభిమానం మరికొందరి విషయంలో వలె దురభిమానంగా రూపుదాల్చలేదు. ఆయనది విశాల దృక్పథం. యావదాంధ్రప్రదేశ్ యోగక్షేమాలపట్ల శ్రద్ధాసక్తులతో కూడిన విశాల దృక్పథం. నిజానికి ఆయనది యావద్భారతానికి విస్తరించిన విశాల దృక్పథం.

రాజకీయాలలో ఉండేవారికి “స్పోర్ట్సుమన్షిప్” అంతగా ఉండదు. శ్రీ రామచంద్రారెడ్డికి "స్పోర్ట్స్" పట్ల, వ్యాయామరంగం పట్ల విశేషాసక్తి ఉండేది. ఈ కారణం వల్లనేనేమో ఆయన రాజకీయాలలో సైతం “స్పోర్ట్సుమన్ స్పిరిట్" కానవచ్చేది. తన మిత్రుడు సహచరుడు అయిన ఒకరికి మంత్రి పదవిని ఇవ్వకపోతే తనకు కూడా అక్కరలేదని ఒకసారి పట్టుపట్టిన వ్యక్తి ఆయన.

అన్నిటిని మించి ఆయన వ్యక్తిగా ఎంతో ప్రేమాస్పదుడు, సహృదయుడు, స్నేహశీలి, మితభాషి, ఎవరిని నొప్పించక అందరితోను సౌజన్యంతో మెలగిన వ్యక్తి. వృథావాదాలలో తలదూర్చని వ్యక్తి. ఇంగ్లీషులో “పర్ఫెక్ట్ జంటిల్మన్” అనే వర్ణన ఆయనకు అక్షరాల అన్వయిస్తుంది. ఆయన అకాలమరణానికి దురపిల్లుతున్న కుటుంబానికి మా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాం.

ప్రముఖ దేశభక్తులు; కాంగ్రెసువాది శ్రీ గుళ్ళపల్లి వెంకటపున్నయ్యశాస్త్రి షష్టిపూర్తి మహోత్సవాన్ని జరపడానికి గుంటూరు పౌరులు నిర్ణయించి, ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేయడం ముదావహం.

శ్రీ శాస్త్రి. డాక్టర్ పట్టాభి, శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు మొదలైన కాంగ్రెసు కురువృద్ధులతో కలిసి పనిచేసిన ప్రముఖుడు. విద్యార్థిగా ఉండగానే గాంధీజీ శంఖారావం విని, 1920లో - పదిహేను సంవత్సరాలైనా

నిండని వయస్సులో - ఆయన స్వాతంత్ర్యోద్యమంలో దుమికారు. అప్పటి నుంచి 1942 వరకు ఆయన పాల్గొనని కాంగ్రెసు ఉద్యమమంటూ లేదు.

ముఖ్యంగా ఆంధ్రోద్యమానికి శ్రీ శాస్త్రి చేసిన సేవ పరిగణనీయమైనది; ప్రశంసనీయమైనది కూడా. ఆంధ్ర మహాసభ కార్యదర్శిగా ఆయన అనేక సంవత్సరాలు పనిచేసి, ప్రత్యేకాంధ్ర రాష్ట్ర స్థాపనకు కృషి చేశారు. ఆంధ్రోద్యమంతోపాటు, భాషా ప్రయుక్త రాష్ట్ర విభజనోద్యమంతో కూడా ఆయనకు సన్నిహిత సంబంధం ఉండేది. ఆ రోజులలో ఈ రెండు సమస్యల పరిశీలనకు ఏ కమిటీ వచ్చినా, దాని ముందు శ్రీ శాస్త్రి విధిగా సాక్ష్యమిచ్చి తీరవలసిందే.

## శ్రీ గుళ్ళపల్లి పున్నయ్యశాస్త్రి

సేవా నిరతి ప్రముఖ దేశభక్తులు; కాంగ్రెసువాది శ్రీ గుళ్ళపల్లి వెంకటపున్నయ్యశాస్త్రి షష్టిపూర్తి మహోత్సవాన్ని జరపడానికి గుంటూరు పౌరులు నిర్ణయించి, ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేయడం ముదావహం.

శ్రీ శాస్త్రి. డాక్టర్ పట్టాభి, శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు మొదలైన కాంగ్రెసు కురువృద్ధులతో కలిసి పనిచేసిన ప్రముఖుడు. విద్యార్థిగా ఉండగానే గాంధీజీ శంఖారావం విని, 1920లో - పదిహేను సంవత్సరాలైనా నిండని వయస్సులో - ఆయన స్వాతంత్ర్యోద్యమంలో దుమికారు. అప్పటి నుంచి 1942 వరకు ఆయన పాల్గొనని కాంగ్రెసు ఉద్యమమంటూ లేదు.

ముఖ్యంగా ఆంధ్రోద్యమానికి శ్రీశాస్త్రి చేసిన సేవ పరిగణనీయమైనది, ప్రశంసనీయమైనది కూడా. ..... సాక్ష్యమిచ్చి తీరవలసిందే.

శ్రీశాస్త్రి సేవానిరతి ఈ రెండు ఉద్యమాలకే పరిమితం కాలేదు. ఆయన వయోజన విద్య, సహకార రంగాలతో కూడా సన్నిహిత సంబంధాన్నే పెట్టుకున్నారు.

ఆనాటి పెక్కుమంది ప్రజాసేవకుల వలెనే ఆయన కూడా స్వార్థాన్ని గురించి ఆలోచించకుండా పరార్థానికే పాటుబడినందువల్ల ఆర్థికంగా ఆయన చితికిపోయారు. ఇప్పుడు ఆయన ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే ఉన్నది.

కాగా, షష్టిపూర్తి సన్మాన సంఘం వారు ఆయనకు నిధినికూడా సమర్పించడానికి నిర్ణయించడం అత్యంత సముచితం. ఈ కృషిని ఆంధ్రులందరు జయప్రదం చేయడం శ్రీ శాస్త్రి దేశసేవను, త్యాగనిరతిని గౌరవించడమే కాగలదు.

(ఆంధ్రజ్యోతి 10-10-1961).

## దివ్యస్మృతి :
## శ్రీ జయంతి రామయ్య పంతులు

ఆనాటి మాట!

ఆంధ్రభూమిలో అపూర్వ చైతన్యం గుబాళించింది; ఆంధ్ర భాషలో అద్భుత సంచలనం విలసిల్లినది; ఆంధ్రజాతిలో అనన్య కార్యపరత గోచరించినది.

ఏది సమగ్ర వికాసమైనా జాతి జీవన రంగాలలో బహుముఖంగా, విశేష కార్యకలాపాలు కొనసాగినప్పుడే సాధ్యపడగలదు. అలాంటి విశ్వతోముఖ వికసన యుగంలో ప్రముఖు లనేకులు నిత్యకార్యవ్యాపృతులై మనలను విభ్రాంతులను చేస్తారు.

ఆంధ్రజాతి వికాసయుగంలో జన్మించిన కొందరు మహామహులలో ఒకరు శ్రీ జయంతి రామయ్య పంతులు. ఆయన మన భాషా, సాహిత్య, చరిత్రాదుల కొనర్చిన సేవ అనంతమైనది.

ఆనాటి ఆంధ్ర పరిషన్నిర్మాణంలో ఆయనదొక ముఖ్యపాత్ర. ఆనాటి జాతి జాగృతిలో ఆయన పెద్ద బాధ్యతనే నిర్వహించారు. తనకు, ఆ పరిషత్తుకు అనితర సాధ్యమైన అభేద ప్రతిపత్తిని సాధించుకొని అనేక కార్యక్రమాలకు ఊపిరిపోశారు.

ప్రాచీన శాసనాలను పఠించడంలో, వానిని అవగాహనం చేసుకొనడంలో, అందుపై మన చరిత్రలోని చెరగిపోయిన పుటలను నింపడంలో ఆయన కృషి అనన్య సామాన్యమైనది.

ఆంధ్రభాష కొక సమగ్ర నిఘంటువును నిర్మించవలెనన్న మహత్కార్యానికి, నాందీవాచకం చేసి అందుకై ఆయన పడిన శ్రమ ఆంధ్రజాతి మఱువరానిది. వారు విగతాసువులైరిగాని మరికొంత కాలం వారే ఆ ఆధ్వర్యం వహించివుంటే చక్కని నిఘంటువు సమగ్రరూపంతో వెలువడి వుండునేమో!

అట్లే ఎన్నెన్ని అపూర్వ ప్రాచీన గ్రంథ సంచయాలో అటకలపై గుటకలు మ్రింగుతుండగా, చెద పురుగులకు, చిమ్మటలకు చిఱుతిండి అవుతుండగా వానిని ప్రచురించుటకై ఆయన ఎంతో కృషి చేశారు.

మల్లికార్జున పండితుని శివతత్త్వ సారంవంటి కృతులు, భీమన కవిజనాశ్రయం వంటి కృతులు, పెద్దన కావ్యాలంకార చూడామణివంటి కృతులు - ఎన్నెన్ని ఆనాడు లోకం ముఖం చూచినవో, అందుకు ఆయన ఎంతవరకు కారణమో విజ్ఞులెరుగుదురు.

అట్లే ఈనాటికీ తీరని కోర్కెగా ఉన్న భారత శుద్ధ ప్రతి ప్రచురణకు ఆయనెంతో ఉవ్విళ్లూరినారు. భారత పదప్రయోగ సూచికను దాదాపు పూర్తిచేయించిరట కూడా. కానీ అది ఏ స్థితిలో, ఎక్కడ ఉన్నదోకాని తెనుగుదేశం కంటపడలేదు.

నిజమే, ఆయనకు గ్రాంథిక భాషాభిమానం మెండు. ఆనాడు గురజాడవారు, గిడుగువారు ఎంత పోరాడినా అధికారులు పాఠశాలలలో వాడుక భాషను పెట్టక పోవుటకు శ్రీ జయంతివారు, వారి ఆంధ్ర సాహిత్య పరిషత్తు చాలావరకు కారణం.

ఆనాటి నుంచి నేటి వరకు, ఆ సమస్య అపరిష్కృతంగా నిలిచే ఉన్నది. అది ఆనాటి వారి విశ్వాసం; అది నేటికీ శిరోధార్యం కానక్కరలేదు.
ఎన్నెన్ని విధాలుగానో భాషా సాహిత్య సేవనంలో అహోరాత్రులు గడిపి, మరువరాని మహత్తర కృషికి కారకులై కనుమూసిన ఆయన జన్మ ధన్యమైనది. వీరి ప్రతి సత్కార్యంలోను పిఠాపురం రాజావారి ప్రోద్బల ప్రోత్సాహాలు న్నవనుట లోక విదితమే.

శ్రీ జయంతి శతవార్షిక జయంతి సందర్భంలో ఆ పుణ్య పురుష సంస్కృతి మనకొక నూతనోత్సాహాన్ని కల్పించ గలదు.

ఆనాడు ఆయన అత్యవసర కార్యాలుగా భావించినవి, మనమీనాటికీ అదేవిధంగా భావించే స్థితిలోనే మిగిలి పోయినవి.

ఇకనైనా ఆయన సంస్కృతి ఆ పనులను నిర్వహించుటలో, పరిపూర్తి చేయుటలో మనకు తగిన సంకల్పశక్తిని చేకూర్చితే, అంతకంటే అభిలషింపదగినది వేరేమున్నది? నిఘంటు నిర్మాణ మొకటి, భారత పద ప్రయోగ సూచిక ఒకటి, పరిశుద్ధ భారత ప్రతి ప్రచురణం ఒకటి – వీనిలో ఏదో ఒక దశలో ఎవరో ఒకరు ఎంతో కొంత కృషి చేస్తున్నారు. ఆ కృషి సఫలీకృతమై మన భాషా సాహిత్య సంపద శ్రీ జయంతివారి ఆశయ సాధనతో పునీతమగు గాక!

*(ఆంధ్రజ్యోతి 20-7-1960)*

## విజ్జీ (శ్రీ విజయానంద)

లోకసభ సభ్యుడు శ్రీ విజయానంద ("విజ్జీ" అని ఆయనను అందరు ఆప్యాయంగా వ్యవహరిస్తారు) ఆకస్మిక మృతితో భారతదేశం ఒక ప్రఖ్యాత క్రీడాకారుని, ప్రసిద్ధ క్రికెట్ వ్యాఖ్యాతను కోల్పోవడమే కాక, ఆంధ్రదేశం ఒక దేశభక్తుని, ఆంధ్రోద్యమ సారథులలో ఒకరిని కోల్పోయిందని చెప్పవచ్చు.

ఆంధ్రదేశంలోని విజయనగరం సంస్థానంలో జన్మించినా, ఆయన ఆంధ్రదేశానికి, ఉత్తరప్రదేశ్కు మధ్య ఒక విధమైన అనుబంధాన్ని కూర్చారు. ఆంధ్రుడైన సర్ చిర్రావూరి యజ్ఞేశ్వర చింతామణివలె శ్రీ విజయానంద కూడా యు.పి. ప్రజా జీవితంతో సన్నిహిత సంబంధం కలిగించుకుని, ఆయనవలెనే ఈయన కూడా అక్కడి ప్రభుత్వంలో మంత్రి పదవిని నిర్వహించారు.

చిన్నతనం నుంచి శ్రీ విజయాను క్రీడారంగంతోపాటు రాజకీయరంగం కూడా ఆకర్షించింది. ఈ రెండు రంగాలలో కూడా ఆయన ప్రముఖ పాత్రలను నిర్వహించారు. ఇండియా క్రికెట్ టెస్ట్ కెప్టెన్గా ఆయన కెప్టెన్ సి.కె. నాయుడు ప్రభృతులతో కలిసి ఆ క్రీడారంగంలో భారతదేశానికి ప్రత్యేక స్థానం కల్పించడానికి కృషిచేసి కృతకృత్యులైనారు. ఆయన రాజకీయ ప్రసంగాలు సైతం "క్రికెట్ పరిభాష"లోనే ఉండేవి.

ఆంధ్ర మహాసభకు కొంతకాలం అధ్యక్షుడుగా ఆయనకు ఆంధ్రోద్యమంతో సన్నిహిత సంబంధం ఉన్నది.
శ్రీ విజయానంద క్రీడాకారుడే కాక పేరెన్నికగన్న వేటగాడు కూడా. ఆయన ఎన్నో ఖడ్గ మృగాలతోపాటు సుమారు 350 పెద్ద పులులను వధించారని ప్రతీతి.
ఆతిథ్యమర్యాదలలో ఆయన పెట్టింది పేరు. కాశీలోని ఆయన భవనం ఎందరెందరో క్రీడాకారులకు, రాజకీయవేత్తలకు ఆతిథ్య మందిరం. మన రాజకీయ, క్రీడారంగాలకు "విజ్జీ" మృతి ఒక వెలితి.

(ఆంధ్రజ్యోతి 4-12-1965)

## శ్రీ రాయప్రోలు సుబ్బారావు



ఈ రోజు తెల్లవారు ఝామున రాయప్రోలు సుబ్బారావు మరణించారు. ఆయన మరణంతో ఆధునిక తెలుగు కవిత్వంలో ఒక యుగం ముగిసింది. గురజాడ దార్శనికత ఆయనలో లోపించింది. ఆయన కవితాధోరణిలో ఆయన ఒక మార్గదర్శి. ఆయన హృదయంలో ఎప్పుడూ నా పట్ల ఆదరభావం వుండేది.

*(30-6-1984 నార్లవారి డైరీ నుంచి. ఇంగ్లీషు నుంచి అనువాదం : శ్రీ కొత్తపల్లి రవిబాబు)*

## శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ)

నిన్న సాయంత్రం మదరాసు జనరల్ హాస్పిటల్లో శ్రీశ్రీ మరణించాడు. అతని మరణానికి కారణం బహుశ గొంతు క్యాన్సర్ అయివుండవచ్చు. అతను నాకంటే రెండేళ్ళు చిన్నవాడు. నాకు అతనితో 1934 నుంచి పరిచయం వుంది. 1938లో ఆంధ్రప్రభ ప్రారంభమైనప్పుడు నాతోపాటు అతనూ ఆంధ్రప్రభలో ఉద్యోగిగా చేరాడు. కాని, కొన్ని నెలల తర్వాత మానేసి వెళ్ళిపోయాడు. 1942లో నేను ఆ పత్రిక సంపాదకత్వ బాధ్యత స్వీకరించిన తర్వాత సహచరులుగా మా సంబంధాలు అంత ఆనందదాయకంగా లేవు. అతనికి జర్నలిజంలో రాణించే శక్తిలేదు. అతని ప్రతిభ కవిత్వంలోనే. తొలిదశలో తెలుగు సంప్రదాయ సాహిత్యంపై మంచి పట్టు సాధించాడు. ఆ తర్వాత ముప్ఫైలనాటి ఆధునిక యూరోపియన్ కవిత్వ అధ్యయనం చేశాడు. కనుక అతనొక నూతన వరవడికి మార్గదర్శి కాగలిగాడు.

అతను తన సాహితీశక్తి వల్ల అతి సాధారణ పదాలకు కొత్త శక్తినీ, గంభీరతనూ, నూతన లయనూ, యాసనూ, కొత్త అర్థాల్ని స్ఫురించగలిగాడు. అతనిలాగే, అతని కవిత్వంలో కూడా లోతులేదు. కాని అదే సమయంలో అతని కవిత్వంలో అగ్నిపర్వతం లావా జలపాతపు హోరు చూడగలం. ఆయన ప్రబోధించిన సూత్రాలను ఆయన నిరంతరం ఆచరించలేదు. కొన్ని సమయాలలో అతను పసిపిల్లవాడా లేక అల్లరి గడుగ్గాయా అన్న ఆశ్చర్యం కలుగుతుంది. మిగిలిన సమయాలలో అతను చపలచిత్తం గల మూర్ఖుడా లేక గంభీరమైన మోసగాడా అన్నది తేల్చుకోవడం కష్టం. అతనిని నేను ఒక ఉన్నత మానవుడిగా పరిగణించలేదు. ఒక గొప్ప మేధావిగా కూడా గుర్తించను. కాని నిస్సందేహంగా శ్రీశ్రీ ఆధునిక భారతదేశంలోని గొప్ప కవులలో ఒకరు. అతను మరణించాడు. కాని, అతని కవిత్వం సజీవం.

*(16-6-1983 నార్లవారి డైరీ నుండి. ఇంగ్లీషు నుంచి అనువాదం : శ్రీ కొత్తపల్లి రవిబాబు)*

## డాక్టర్ సి.ఆర్. రెడ్డి

ఎనలేని ప్రతిభావంతుడు ఎన్నదగు విజయాలను మాత్రమే సాధిస్తే, “ఎందువల్ల?” అనే ప్రశ్న ఉత్పన్న మౌతుంది.

డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి ఎనలేని ప్రతిభావంతుడు. ఆయన మేధావి మాత్రమేకాదు, వ్యుత్పన్నుడుకూడా. పండితుడు మాత్రమే కాదు, రసజ్ఞుడు కూడా. వక్త మాత్రమే కాదు, రచయిత కూడా. ఆదర్శవాది మాత్రమే కాదు, కార్యదక్షుడు కూడా. విద్యావేత్త మాత్రమే కాదు, రాజనీతిజ్ఞుడు కూడా. ఇంతటి ప్రజ్ఞా ప్రాభవాలు ఒకే వ్యక్తిలో కానరావడం ఎక్కడైనా అరుదుగానే, ఎన్నడైనా చెదురుగానే. దేవతల నుంచి

వరాలను పొంది కొందరు జన్మిస్తారనడం నిజమైతే, అందరు దేవతల నుంచి అన్ని వరాలను ఆయన పొందినారనే చెప్పవచ్చు.
అయినా, తన తెలివితేటలను, తన శక్తిసామర్థ్యాలకు, తన ప్రజ్ఞా ప్రాగల్భ్యాలకు తగిన విజయాలను డాక్టర్ రెడ్డి సాధించలేదేమి? కావ్య హృదయాన్ని అంతగా తెలుసుకొన్న భావుకుడు వ్రాయవలసింది ఒక్క "ముసలమ్మ మరణము" మాత్రమేనా? ప్రపంచ సాహిత్యాన్ని అంతటా మథించిన విమర్శకుడు ప్రకటించవలసింది ఒక్క "కవిత్వతత్త్వ విచారము" మాత్రమేనా? ప్రాచీనార్వాచీన శాస్త్రాలలో అంతగా ప్రవేశం సంపాదించిన పండితుడు లోకానికి సమర్పించవలసింది ఒక్క "అర్థశాస్త్రము" మాత్రమేనా? ఈ మూడు గ్రంథాలు ఆయా సాహిత్య విభాగాలలో కొత్త పుంతలను త్రొక్కివుండవచ్చు; ఒక విప్లవాన్నే సాధించి వుండవచ్చు. కాని కవిగా, విమర్శకుడుగా, శాస్త్రజ్ఞుడుగా జీవిత ప్రారంభంలోనే ఇంతటి ధీశక్తిని, ఇంతటి ఉపజ్ఞను ప్రదర్శించిన డాక్టర్ రెడ్డి ఇంతటితోనే నిలిచిపోయినారేమి?

కేవలం సాహిత్య క్షేత్రంలోనే కాదు; తాను కృషిచేసిన ప్రతి రంగంలో డాక్టర్ రామలింగారెడ్డి ఎవరెస్ట్ శిఖరాన్ని అందుకొనబోతున్నట్టే కనబడి, దానికి అల్లంత దూరంలో ఆగిపోతూ వచ్చారు. మరొక్క ఊపే చాలు గమ్యాన్ని చేరడానికి; మరి కాస్త పట్టుదల సరిపోతుంది శిఖరాగ్రంపై విజయపతాకను ప్రతిష్ఠించడానికి ఆయన జీవితంలో ఈ విధంగా తోచిన ఘట్టాలెన్నో, సునాయాసంగా అంత ఎత్తుకు వెళ్ళికూడా అంత కొద్దిలో ఆయన ఎందుకు ఆగిపోతూ వచ్చినట్టు?

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం సులభం కాదుగాని, తన ప్రవృత్తిలోని కొన్ని వైరుధ్యాలవల్లనే శిఖరాగ్రానికి కొంచెం దిగువగా ఎప్పటికప్పుడు ఆయన నిలిచిపోవడం సంభవించినదేమో! శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య ఈ గ్రంథంలో పేర్కొన్నట్టు, డాక్టర్ రెడ్డి ఏదో సందర్భంలో "నాకు యూరోపియన్ సదుపాయాలు కావాలి. నా ఆత్మ స్వదేశీదే; ఉదరం మాత్రం విదేశీది" అన్నారు. ఛలోక్తిగా ఉద్దేశించినా, ఆయన ప్రవృత్తిలోని వైరుధ్యాలను ఇది సూచిస్తున్నది. భావాలలో ఆయన అతివాది, ఆచరణలో మితవాది. విశ్వాసాలలో ఆయన "డెమొక్రాట్"; అభిరుచులలో "యారిస్టోక్రాట్". అభిమానం విద్యకు విజ్ఞానానికి సంబంధించిన విషయాలపట్ల, రాజకీయాలపట్ల ఆకర్షణ.

ప్రవృత్తిలోని ఇట్టి వైరుధ్యాలకు ప్రజ్ఞా ప్రాభవాలలోని వైవిధ్యం తోడైతే, వ్యక్తిత్వానికి విధిగా విలక్షణత్వం రాదా? ఈ విలక్షణత్వమే డాక్టర్ రెడ్డిగారిని ఏ శిఖరాగ్రాన్నీ చేరనివ్వలేదు. ఆధునిక రచయితలలో ఆయన శ్రీ కందుకూరి వీరేశలింగం, శ్రీ గురజాడ అప్పారావును మించిపోవలసింది. కాని, కొన్ని మెట్ల దిగువనే నిలిచిపోయారు. వైస్ ఛాన్సలర్గా ఆయన శ్రీ ఆశుతోష్ ముఖర్జీతో సరితూగ వలసింది. కాని, త్రాసు ఎంతో కొంత ముఖర్జీ వైపుకే మొగ్గింది. రాజకీయవేత్తగా ఆయన సర్ తేజ్ బహదూర్ సప్రూ సరసను స్థానం సంపాదించ వలసింది. కాని, సహపంక్తిలో కాక, దాని వెనుక దానిలో స్థానాన్ని పొందడం జరిగింది.

ఒక రంగంలో పూర్తివిజయాన్ని సాధించకముందే మరొకటి ఆయనను ఆకర్షించినట్టు శ్రీ వెంకట సుబ్బయ్య వ్రాసిన ఆయన జీవిత చరిత్రను స్థూలంగా పరిశీలించినా తెలుస్తుంది. సారస్వతంలో డాక్టర్ రెడ్డి ఒక విప్లవాన్ని ప్రవేశపెట్టినట్టే పెట్టి, అంతలో దానినుంచి తప్పుకొన్నారు. మొదటి మూడు రచనల తర్వాత ఆయన వ్రాసినవి ఇతరుల గ్రంథాలకు పీఠికలు మాత్రమే. విద్యారంగంలో ఒక స్థాయికి వచ్చి, దానిలో సాధించదగు విజయాలు మరికొన్ని వుండగానే, ఒక్కసారిగా ఆయన రాజకీయ రంగంలో దూకారు. దానిలో సయితం తన వాక్పటిమతో, సమయస్ఫూర్తితో, స్వతంత్ర చిత్తవృత్తితో, కార్యదక్షతతో ఆయన సాధించిన విజయాలు సామాన్యమైనవి కావు. ప్రభుత్వాన్ని సమర్థించిన రోజులలో ఆయన ప్రతిపక్షులకు పక్కలో బల్లెం; ప్రతిపక్షంలో చేరినప్పుడు ప్రభుత్వానికి సింహస్వప్నం. విద్యాశాఖమంత్రిగా ఆయన నియామకం రేపో, మాపో అనుకొన్న సన్నివేశాలు అప్పుడు కొన్ని వున్నాయి. ప్రతిపక్షానికి ఉపనాయకుడుగానే మిగలక నాయకుడు కాగలరన్న సందర్భాలు సయితం వున్నాయి. ఈ ఘట్టంలో ఆయన తిరిగి తలవని తలంపుగానే విద్యారంగానికి వెళ్ళిపోయారు.

కార్యరంగాలలో మార్పుల మధ్యకూడా ఆయనలో వైరుధ్యాలు కనిపించేవి. ఉదాహరణకు సాహిత్య క్షేత్రాన్నే తీసుకోండి. సారస్వతంలో కొత్త ప్రక్రియలను, కొత్త పోకడలను ఆయన ఆహ్వానించేవారు; భాష విషయంలో మాత్రం పచ్చి గ్రాంథికాన్నే అభిమానించేవారు. ఆయన దృష్టిలో చిన్నయసూరి వచనశైలి ఉత్తమోత్తమమైంది. పద్యంలో తిక్కన కిచ్చే స్థానాన్ని గద్యంలో ఆయన చిన్నయ్య కిచ్చేవారు. భావాల విషయంలో సాహసాన్ని, స్వాతంత్ర్యాన్ని కోరడంతోపాటు భాష విషయంలో సంప్రదాయాన్ని, ఛాందసాన్ని వరించడం డాక్టర్ రెడ్డిని పోలిన విలక్షణ వ్యక్తికే చెల్లు.

జీవితాన్ని స్థూలంగానైనా కొన్ని రంగాలలోకి విభజించవచ్చు; ప్రవృత్తిమాత్రం అట్టి విభజనకు లొంగదు. కార్యరంగాలు ఎన్నిసార్లు, ఎంతగా మారినా ప్రవృత్తిమాత్రం అన్నిటిలో సమానంగా ప్రస్ఫుటమౌతుంది. అందువల్లనే రాజకీయవేత్తగా డాక్టర్ రెడ్డి జస్టిస్, కాంగ్రెస్ పార్టీలలో దేన్నీ పూర్తిగా హర్షించనూ లేదు; అనుసరించనూ లేదు. లాహోర్ కాంగ్రెసు చేసిన సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానాన్ని ఆయన విమర్శించారు. తన విమర్శకు లోనైన ఆ తీర్మానాన్ని అనుసరించి కాంగ్రెసు ప్రారంభించిన ఉప్పు సత్యాగ్రహాన్ని అణచివేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం అమలుపరచిన దమననీతిని నిరసిస్తూ ఆయనే తన వైస్‌చాన్సలర్ పదవికి రాజీనామా పెట్టివేశారు కూడా!

ఇట్టి వైరుధ్యాలతో కూడిన ఆయన విలక్షణ వ్యక్తిత్వం చివరికి ఆయన ప్రసంగాలలో సయితం ద్యోతకమౌతూ వుండేది. ఎంత గభీర విషయాన్ని గురించి ప్రసంగిస్తున్నా, ఎక్కడో ఒకచోట అప్రయత్నంగా ఏవో కొన్ని చతురోక్తులు, హాస్యోక్తులు వచ్చిపడుతూ వుండేవి. హాస్య ధోరణిలో ప్రసంగం చేస్తుండగా, గంభీర విషయాలు ఇదే విధంగా దొర్లుతూ వుండేవి. ఈ క్షణంలో ఆయన ప్లేటో; మరుక్షణంలో పక్.

డాక్టర్ రెడ్డిని గురించి ఈ "సమ్మింగ్-అప్"తో శ్రీ వెంకట సుబ్బయ్య ఏకీభవించరని నాకు తెలుసు. నాబోటివారిని దృష్టిలో పెట్టుకొనే "ఆయన ప్రతిభకు తగినట్టు పనిచేయలేదని నిందించెడివారున్నారు కోకొల్లలుగా. కాని, ఆయనకు ఏమి అవకాశ మిచ్చినది ఆంధ్రలోకం? భరత ఖండము ఏమైనా ఆయనకు ప్రత్యేక సన్మానము నిచ్చినదా? ఆయన నెటుల మన ముపయోగించి కొనగలిగినాము? యోగ్యతను గమనించి ప్రోత్సాహ మిచ్చు గుణము మనలో కలదా లేదా అను సంగతి ఆలోచించుకోవాలి" అని శ్రీ వెంకట సుబ్బయ్య వ్రాశారు. ఇది ఆలోచించుకోవలసిన విషయమైనా, తన ప్రజ్ఞా ప్రాభవాలకు తగు విజయాలను డాక్టర్ రెడ్డి సాధించలేదనడం ఆయనపట్ల కించభావంతో కాదు; నిండు గౌరవంతోనే. గౌరవాన్నే కాదు, ప్రేమను రేకెత్తించగల వ్యక్తిత్వ మాయనది. అందరితో ఆయన చనువుగా మెలగేవారు. అందరినీ నోరారా పలకరించేవారు. నవ్వేవారు, నవ్వించేవారు. దగ్గరికి తీసేవారు, దయగా చూచేవారు. ఎవరిలోనైనా ప్రతిభను కనుగొంటే, ఒక వజ్రాలగని తనకు దొరికినట్టే సంతోషించేవారు. ఎన్ని విధాల ఆయన ఎందరిని పైకి తెచ్చారో లెక్కలేదు.

దేశ చరిత్రల రచనకువలె జీవిత చరిత్రల రచనకు సయితం ఎంతగానో పరిశోధన చేయాలి. దాని ఫలితాలను ఉన్నవి ఉన్నట్టుగా లోకం ముందు పెట్టాలి. ఒక వ్యక్తిపట్ల ప్రేమ, గౌరవాలు లేకపోతే, అతని జీవిత చరిత్ర రచనకు పూనుకోవడం సర్వసాధారణంగా జరగదు. వాస్తవిక విషయాల చిత్రణకు ఈ ప్రేమ గౌరవాలను ప్రతిబంధకంగా నిలవనీయరాదు. తన రూపచిత్రాన్ని చిత్రించగోరిన కళాకారునితో "నా ముఖం మీది పులిపిరి కాయలతో సహా నన్ను చిత్రించు సుమీ!" అని క్రామ్వెల్ హెచ్చరించాడు. ఇట్టి హెచ్చరికతో నిమిత్తం లేకుండానే జీవిత చరిత్రకారుడు ఈ పని చేయాలి. వెలుగుతోపాటు నీడలను అతడు చూపించాలి. ఎత్తులతోపాటు పల్లాలను కనబరచాలి. గుణాలతోపాటు దోషాలను చిత్రించాలి. విజయాలతోపాటు పరాజయాలను వివరించాలి. సాధు స్వభావులైన శ్రీ వెంకటసుబ్బయ్యకు ఇది సులభంకాదు. అయినా తన పరిశోధనల ద్వారా వెల్లడైన విషయాలనే ఉన్నది ఉన్నట్టుగా తెలియజెప్పడానికి ఆయన చిత్తశుద్ధితో కృషిచేస్తారు. ఇతరులు కటువుగా చెప్పే మాటలే శ్రీ వెంకట సుబ్బయ్య మెత్తగా చెబుతారు; అన్యులు బాహాటంగా చెప్పేదాన్ని ఆయన సూచనప్రాయంగా చెబుతారు.

*(పండిత గౌరెపాటి వెంకట సుబ్బయ్య రచన డాక్టర్ సి.ఆర్. రెడ్డికి నార్లవారు రాసిన పీఠిక. ప్రచురణ 1963)*

## శ్రీ విశ్వనాథ వారి విచిత్ర వైఖరులు



శ్రీ విశ్వనాథ సత్యనారాయణకు చాలామంది శిష్యులున్నారని, భక్తులున్నారని నాకు తెలుసు. నేను ఆయన శిష్యుడను కాను; భక్తుడను మొదలే కాను. అయినా, నన్ను మించి ఆయనను గౌరవించేవారు లేరేమో! ఇంత గౌరవభావం ఆయనపట్ల నాకు కుదురుకొనడానికి కారణం, ఆయన బహుభాషా పాండిత్యం కాదు, తెలుగు, సంస్కృతాలతోపాటు ఇతర భాషలలో సైతం ఆయన పండితులని ఆయన శిష్యులు, భక్తులు చెబుతారు. హిందీని తాను రెండు నెలలలో నేర్చుకోగలిగినట్టు ఆయన స్వయంగానే చెబుతారు. కనీసం వానాకాలపు మూడు నెలలకైనా అది విస్తరించలేదు కాబట్టి, అది బహుశా వానాకాలపు చదువుకంటే తక్కువైనదే కావచ్చు. ఆయన ఫ్రెంచి భాషా పరిజ్ఞానమైనా ఇంతకంటే అధికమైనది కాకపోవచ్చు. ఇంగ్లీషు శైలిపై, నుడికారంపై ఏమంత అధికారం లేకపోయినా, హిందీకంటే, ఫ్రెంచికంటె ఆ భాష ఆయనకు ఏ కొంచెమో హెచ్చుగా తెలుసునని చెప్పాలి.

ఏమైనా, శ్రీ సత్యనారాయణకు పాండిత్యం ఉన్నది తెలుగు, సంస్కృత భాషలలోనే. అయితే, ఆ రెండిటిలో ఆయనవలె పండితులైన వారు ఆయనను తప్పులు పట్టడం తరచు జరుగుతున్నది. "మీరు చెప్పేవి తప్పులు కావు; ఒప్పులే" అని ఆయన శిష్యవర్గం, ఆయన భక్తబృందం ఆయన తరపున కత్తులు దూయడం కూడా తరచు జరుగుతున్నది. "మనకెందుకు వచ్చిన గొడవ!" అన్నట్టు మహాపండితులైనవారు ఈ తర్జన భర్జనలకు దూరంగానే నిలుస్తున్నారు. దీన్నిబట్టి నిష్పాక్షికులెవరైనా తీర్మానించుకోవలసింది శ్రీ సత్యనారాయణ ఉభయ భాషా పాండిత్యమైనా వివాదాతీతమైనది కాదని!

ఆయన భాషాపాండిత్యాన్ని గురించిన "జడ్జిమెంటు"ను అన్యులకు విడిచిపెట్టినా, ఆయన శాస్త్రజ్ఞానం, ఆయన ప్రపంచజ్ఞానం చాలా పరిమితమైనవని స్వయంగానే చెప్పగలను. విజ్ఞానం బహుముఖంగా విస్తరిస్తున్న ఈ రోజులలో సర్వజ్ఞతను ఆపాదించుకునే వాడు పొగరుబోతు కావాలి; లేదా, పిచ్చి ఆసుపత్రిలో ఉండవలసినవాడు కావాలి. ఏదో ఒక శాస్త్రంలో, ఒక విద్యలో శతాంశాన్ని తెలుసుకొనడానికైనా ఈనాడు ఒక పూర్తిజీవితం చాలడం లేదు. అయినప్పుడు శ్రీ సత్యనారాయణ తాను సర్వజ్ఞుడనని చెప్పుకొనడానికి సాహసించడనే అనుకుంటాను.

శ్రీ సత్యనారాయణ పురాణాలను క్షుణ్ణంగానే చదివి ఉండవచ్చు. కాని, వేదాలను ఆయన చదవలేదని, చదివినా భక్తిభావంతోనే తప్ప జిజ్ఞాసతో కాదని ఆయన రాసే వ్రాతలను బట్టి, చేసే ప్రసంగాలను బట్టి అనుకోవలసి వస్తుంది. "ఏదీ భారతీయ సంస్కృతి?" అనే ప్రశ్నకు ఆయన ప్రత్యుత్తరం "వేద సంస్కృతి" అని. "ఏది ఆదర్శప్రాయమైన సాంఘిక వ్యవస్థ?" అనే ప్రశ్నకు ఆయన బదులు "వేదకాలం నాటి వ్యవస్థ" అని. ఏ

వేద సంస్కృతికై, ఏ వేదవ్యవస్థకై తాము పలవరిస్తున్నారో, ఆ సంస్కృతి తిరిగి నెలకొంటే, ఆ వ్యవస్థ పునఃస్థాపితమైతే, శ్రీ సత్యనారాయణ గోమాంసాన్ని భక్షిస్తాడా? సోమపానాన్ని చేస్తాడా? అశ్వమేధాలను జరిపిస్తాడా? నరమేధలకు ఆధ్వర్యం వహిస్తాడా? వేదాలను వినరాని శూద్రులు వాటిని వింటే, వారి చెవులలో కరిగించిన సీసాన్ని పోయిస్తాడా?





వేదకాలంలో శివుని నిజానికి ఇంతకంటే కూడా ముఖ్యమైన ప్రశ్నలు కొన్ని ఉన్నాయి. "శిశ్నదేవుని"గా నిరసించేవారు. అట్టి దేవుని కీర్తిస్తాడా "త్రిశూలం!" అనే నాటకాన్ని శ్రీ సత్యనారాయణ ఎందుకు రాశాడో? వేదకాలంలో శ్రీ మహావిష్ణువు ఇంద్రునికంటే ఎన్నో మెట్లు దిగువన ఉండేవాడు. ఇంద్రునికంటే తక్కువవాడు కాబట్టే, "ఉపేంద్రుడు" అనేది విష్ణుమూర్తికి ఒక బిరుద నామమైంది! మరి ఈనాడు శ్రీ సత్యనారాయణ తమ విష్ణుభక్తిని విడనాడడానికి సంసిద్ధుడై ఉన్నాడా? ఇంత లోతుగా వెళ్ళి సత్యనారాయణ ఆలోచిస్తే, ఆయన శ్రీ సత్యనారాయణగారే కాదని తిరిగి మనం సరిపెట్టుకుపోవలసిందే!

కాగా, ఆయన కవిసార్వభౌముడని, నవలా చక్రవర్తి అని, మహానాటక కర్త అని విమర్శ కాగ్రేసరుడని శ్రీ సత్యనారాయణ పట్ల నాకు గౌరవభావం కలదని కూడా చెప్పలేను. ఉత్సాహంతో, రసజ్ఞతతో ఆయన సాహిత్యరంగంలో పాదం పెట్టాడు. తన తొలి రచనలతో రసజ్ఞ లోకాన్ని ఉద్రూత లూగించాడు. టాగోర్ తో ఈడు రాగల మహాకవి తెలుగువారిలో తలయెత్తుకున్నాడన్న ఆశకు ప్రాణం పోశాడు. కాని, "కిన్నెరసాని పాటల" తోనే, "గిరి కుమారుని ప్రేమగీతాల"తోనే ఆయనలో కవితా స్రవంతులింకిపోయాయి! "ఏకవీర" తర్వాత ఆయన ఎన్నదగు నవల వ్రాయలేదు. "నర్తనశాల", "అనార్కలి" మాత్రమే లెక్కకురాగల ఆయన నాటకాలు. విమర్శకు సంబంధించినంతవరకు తొలి రోజులలోగాని, ఆ తర్వాతగాని చెప్పుకోదగు రచన మచ్చుకైనా ఆయన లేఖిని నుంచి వెలువడనే లేదు! ప్రగతిశీలిగా, నవయుగ వైతాళికుడుగా యౌవనదశలో ఆయనచేసిన అయిదారు రచనలలోనే ఆయన ప్రజ్ఞాప్రాభవాలు ప్రస్ఫుటమౌతున్నాయి. ఏ క్షణాన ఆయన భావికాలం వైపుకుకాక భూతకాలం వైపుకు దృష్టిని పోనిచ్చాడో, ఏ క్షణాన నవసంఘ నిర్మాణ లక్ష్యాన్ని నిరసించి, వైదిక సంఘ పునరుద్ధరణకై ప్రాకులాడ నారంభించాడో, ఆ క్షణం నుంచే ఆయన హృదయం నుంచి కవిత తొలగింది, ఆయన వాక్కులో కమనీయత లోపించింది. ఆ తర్వాత ఆయన చెప్పినవి కావ్యాలు కావు, ప్రతీప శక్తుల ప్రతినిధి పద్యాలు మాత్రమే! ఆ వెనక ఆయన వ్రాసినవి నవలలు కాదు, కథారూపంలో చేసే సుదీర్ఘ ప్రసంగాలే! ఆ పిమ్మట ఆయన కూర్చినవి నాటకాలు కావు, సనాతన దృక్పథ ప్రచార సాధనాలే!

అయినా, నాకు శ్రీ సత్యనారాయణ అంటే విశేషమైన గౌరవభావం ఎందుకున్నది? పెక్కుమంది ఇతర రచయితలవలె ఆయన కపటి కాదు, ఆయన నటన చేయడు. లోపల ఒకమాట, పైకి మరొకటి ఆయన ప్రవృత్తికి పూర్తిగా విరుద్ధం. ఆయన హృదయంలో ఉద్విగ్నత ఉంది. మనస్సులో ఆవేదన ఉంది. పాత

పుంతలను వీడి, కొత్త దారులలో ప్రజలు నడుస్తున్నారని ఆయన బాధపడిపోతారు. పాత సంఘం పునాదులు కదిలిపోతుండగా, కొత్తవి ఏర్పడుతున్నాయని ఆయన సంక్షోభపడిపోతాడు. బహుజనాభిప్రాయానికి విరుద్ధంగా వెళ్ళడం ప్రమాదకరమని తమ నిజభావాలను కప్పిపుచ్చుకొనడానికి ఇతరులు కొందరు ప్రయత్నించవచ్చు. అట్టి భయసంకోచాలు శ్రీ సత్యనారాయణకు లేవు. అందువల్లనే ఆయన నిర్భీకంగా తాను రాయదలచినదాన్ని రాస్తాడు. నిష్కర్షగా తాను చెప్పదలచినదాన్ని చెబుతాడు.



“మీది సంకుచిత దృష్టి” అనే విమర్శకు ఆయన సమాధానం “కాదు, సనాతన దృష్టి” అని. “మీది ప్రతీప వైఖరి” అనే నిందకు ఆయన ప్రత్యుత్తరం “కాదు పరమ పవిత్ర వైఖరి” అని. తన వైఖరిని, విశ్వాసాలను ప్రశ్నించేవారిని సభాముఖంగానే “మీరు మూర్ఖులు” అని తెగనాడడానికి ఆయన సంకోచించడు. "మీ రాతలు మాకు కొరుకుడు పడ”వని అనేవారిని "మీరు పామరులు; నేను రాస్తున్నది మీకోసం కాదు” అని తెగవేసి చెప్పడానికి ఆయన వెనుదీయడు. అయితే, ఆయన మాటలోని పరుషత్వం మనస్సులో లేదు. ఆయన కటువుమాటల వెనక కన్నీరు దాగివుంటూనే ఉంటుంది. సత్యయుగం వెళ్ళిపోయిందని ఆ కన్నీరు, కలికాలం వచ్చిపడిందని ఆ కన్నీరు, మహాకవిగా తాను ప్రజా కర్తవ్యాన్ని నిర్దేశిస్తున్నా దాన్ని ఏ కొందరో తప్ప వినిపించుకొనడం లేదని ఆ కన్నీరు!

ఎవరిలోనైనా నేను ఎక్కువగా గౌరవించేది చిత్తశుద్ధినే! వేదకాలానికి దేశాన్ని వెనుకకు నడపాలని, ఈ యత్నాన్ని వ్యతిరేకించేవారిని ఏడు నిలువుల లోతున పాతిపెట్టాలని కోరినా దాన్ని చిత్తశుద్ధి పూర్వకంగా కోరేవారిని నేను గౌరవిస్తాను. వారిని నేను ప్రేమించలేను, అనుసరించలేను. ఇంతేకాదు, వారిని ప్రతిఘటించడానికి సైతం సర్వశక్తులను వినియోగించి కృషిచేస్తాను. అయినా, ప్రగతిని తాము కోరుతున్నట్టు పైపై నటన చేసే కపటులపట్ల లేని గౌరవం ఛాందసమతాన్ని సైతం చిత్తశుద్ధితో బోధించేవారిపట్ల నాకు పూర్తిగా ఉంటుంది.

పోతే, నాకు అర్థంకాని విషయం శ్రీ సత్యనారాయణ వైఖరులు తెలిసికూడా, విశ్వాసాలు తెలిసికూడా ఆయనను సభలకు, సమావేశాలకు ఎందుకు ఆహ్వానిస్తారనేదే! సంస్కృత భాషాప్రచారిణీ సంఘంవారు ఆయనను పిలవవచ్చు; వైదిక ధర్మోద్ధారక సంఘంవారు ఆయనకు పెద్ద పీట వేయవచ్చు; కుల, వర్ణ వ్యవస్థల పునరుద్ధరణ సంఘంవారు ఆయనకు పూలమాలలు వేయవచ్చు; ఒక్కమాటలో, ఆధునిక వైఖరిని తిరస్కరించే వారందరు ఆయనకు బ్రహ్మరథం పట్టవచ్చు. ఆధునిక కాలంలో జీవించేవారందరు ఆధునికులు

కారు; ఆధునికకాలంలో రచించే వారందరు ఆధునిక రచయితలు కారు. ఆధునికత్వమనేది ఒక మనోవైఖరి లేనివారు, ఆ తాత్విక దృక్పథాన్ని తమ రచనలలో ప్రస్ఫుటింప జేయనివారు సమకాలికులైనా ఆధునికులు కాలేరు. అయినా, ఆధునికులమని చెప్పుకొనేవారే శ్రీ సత్యనారాయణను పెద్ద చేసి, ఆయనకు పెద్దపీట వేస్తూ ఉంటారు. దానిపై కూర్చొని ఆయన "మీకు బుద్ధిలేదు; మీరు మూర్ఖులు" అని ఈ దవడ, ఆ దవడ వాయిస్తాడు. ఆయన దెబ్బలకు వాచిపోయిన దవడను కాసేపు సవర దీసుకున్నా, తిరిగి ఎప్పటికప్పుడు పాత కథే!

మొన్న తిరుపతిలో జరిగిన అఖిల భారత తెలుగు రచయితల సభలో శ్రీ సత్యనారాయణ ప్రారంభోపన్యాసం దాని నిర్వాహకులకు ఒక గట్టి చెంపపెట్టే!



సభను, సభానిర్వాహకులను వెక్కిరించడంతో, వెటకారం చేయడంతో ఆయన తమ ప్రసంగాన్ని ప్రారంభించారు. "అఖిల భారత ఎందుకు? అఖిల ప్రపంచ" అని పేరుపెట్టకపోయారా అని ఒక అనామక మిత్రునిపై పెట్టి ముందు ఆయనొక విసురు విసిరాడు. ఆ తర్వాత "ఈ మధ్యనే గోపాలరెడ్డిగారు కయిరో వెళ్ళివచ్చారయ్యె! భద్రిరాజు కృష్ణమూర్తిగారు అమెరికాలో కొంతకాలం ఉండివచ్చారయ్యె! వా రిద్దరు ఈ సభలలో పాల్గొంటున్నందున అఖిల ప్రపంచ ఆంధ్ర రచయితల మహాసభలన్నప్పటికీ తప్పులే"దని ఎత్తిపొడిచాడు. తక్కిన ప్రసంగం ఈ యెత్తుగడకు తగినట్టుగానే జరిగింది!

పరభాషలపై, పరసంస్కృతులపై, పరప్రభావాలపై దుమ్మెత్తిపోస్తూ శ్రీ సత్యనారాయణ సాగించిన ప్రసంగాన్ని పూర్తిగా నేనిక్కడ సమీక్ష చేయబోవడం లేదు కాగా, నవ్యసాహితీ సమితి నాయకత్వాన జరిగిన మహాసభలకు, అన్యభాషలకు చెందిన ప్రముఖ రచయితలను ఆహ్వానించిన మహాసభలకు తెలుగును మించిన భాష లేదని, తెలుగు సాహిత్యాన్ని మించిన సాహిత్యం లేదని, తెలుగు సంస్కృతిని మించిన సంస్కృతి లేదని విశ్వసించే విశ్వనాథవారిని ఎందుకు పిలవవలసి వచ్చిందన్న ప్రశ్న మాత్రం వేయకతప్పదు. తాము పెట్టుకున్న లక్ష్యాలలో తమకు సంపూర్ణ విశ్వాసం లేనందువల్లనే వీరు ఈ పని చేశారా? తమది నిజంగా ఆధునిక దృక్పథం కాదా? ఆధునిక యుగంలో నవ్యసాహిత్యం ఒక నవ్యసంస్కృతికి ప్రాతిపదిక కావాలని తాము మనసారా కోరడంలేదా? ప్రగతిశీలాన్ని పైకి ప్రస్తుతిస్తూ, ప్రతీప శక్తులనే లోలోన అభిమానిస్తున్నారా? ఇవేమీకాక, కేవలం అనాలోచితంగానే విశ్వనాథ వారిని ఆహ్వానించారా? అయితే, ఆలోచనా పాటవాన్ని ప్రదర్శించలేనివారు ఆధునిక సాహిత్యోద్యమాన్ని నడపగలరా?

ఏమైనా, శ్రీ సత్యనారాయణను తిరుపతి మహాసభలకు ఆహ్వానించినవారు వ్యాధి పీడితులకు ఒక మహోపకారాన్ని చేశారని చెప్పవచ్చు! "తెలుగుభాషను బొడ్డు వద్ద నుంచి ఉచ్చరిస్తాము... తెలుగు మాటను ఉచ్చరించినప్పుడు మనిషిలోని ప్రతి అణువు కదులుతుంది" అని తన తిరుపతి ప్రసంగంలో ఆయన ఒక నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఇప్పటివరకు మీకు తెలియకపోతే, ఇకనైనా తెలుసుకోండి - మీ తెలుగు భాషకు సర్వరోగనివారణ శక్తి ఉన్నదని!

కాగా, నా చివరిమాట: ఒకసారి తమ సభలకు శ్రీ సత్యనారాయణను పిలిచి, ఆయన పెట్టిన చివాట్లను అంతలోనే మరచిపోయి, "తాము తప్పక దయచేయాలి!" అంటూ ఆయన వెంటనే పడేవారిని ఎందరినో చూస్తున్నాను. నవ్యసాహితీసమితి వారు కూడా తిరిగి ఇంతే చేస్తే నా మట్టుకు నేను ఆశ్చర్యపడలేదు. కాని, ఆయన చివాట్లను ఆశీస్సులుగా స్వీకరించేవారిని మాత్రం నేను హర్షించలేను, గౌరవించలేను. ఆయన ఎంత తీవ్రంగా నవ భావాలను, నవ సంఘాన్ని, నవ సంస్కృతిని నిరసిస్తే, అంతగా ఆయనకు మర్యాద మన్ననలను చేసేవారంటే నాకు చెప్పరానంత కంటగింపు! కాని, శ్రీ సత్యనారాయణ అంటే మాత్రం పూర్తి గౌరవమే! ఆయన సత్కారాలు పొందుతున్నా, సన్మానాలను అందుకొంటున్నా, కపట నటన చేసి కాదు; తన విశ్వాసాల నుంచి లవలేశంగానైనా చలించకుండానే, తమ మనోగత భావాలను మర్యాదకోసమైనా మభ్యపరచకుండానే "ఇందరు పరమశాంతుల మధ్య నేనొక్కడినే మహాపండితుడను, మహాకవిని, మహర్షిని" అంటూనే! (వ్యాసం)



*(ఆంధ్రజ్యోతి 18-6-1965)*

## రాష్ట్రపతి : డాక్టర్ రాధాకృష్ణన్

(ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాష్ట్రపతి రాధాకృష్ణన్ గురించి 1963 ప్రాంతంలో ఐదు వ్యాసాల ప్రచురణ జరిగింది. ఈ వ్యాసాలను గ్రంథ రూపంలో పునర్ముద్రించినపుడు నార్లవారు ఆ గ్రంథానికి విపుల పీఠిక రాశారు. ఆ పీఠికను ఇచట అందిస్తున్నాం. )



పరిపూర్ణ జ్ఞానంలేని దశ, పరిపక్వ వ్యక్తిత్వంలేని ఘట్టం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితంలో కానరావు. అందువల్లనే కావచ్చు, నాకు అప్పుడప్పుడు అని పిస్తూవుంటుంది - కర్ణుడ సహజకుండలాలతో పుట్టినట్టు, ఆయన శిరోవేష్టనంతో జన్మించారేమో అని!

ఆయన శైశవాన్ని గురించి, బాల్యాన్ని గురించి మనకు అంతగా వివరాలు తెలియవనుకోండి. ఆయన జననం తిరుత్తనిలో 1888 సెప్టెంబర్ 5వ తేదీని. ఆయన తండ్రి శ్రీ వీరాసామయ్య ఏదో జమిందారీలో తహసిల్దార్. వారిది పెద్దగా ఆస్తిపాస్తులు లేని సామాన్య కుటుంబం. ఆదిలో విద్యాభ్యాసం తిరుత్తనిలో, తిరుపతిలో. ఎఫ్.ఏ. పూర్తిచేసింది రాయవెల్లూరులోని అమెరికన్ మిషన్ కాలేజీలో. ఇందుకు కొంచెం ముందుగానో, వెనుకగానో (1905లో) శ్రీమతి శివకామమ్మతో ఆయన వివాహం జరిగింది. తర్వాత బి. ఏ. మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో. రెండు పరీక్షలలోనూ ఆయన ప్రథమ శ్రేణిలోనే ఉత్తీర్ణులైనారు. ఎం.ఏ. లోకూడా తిరిగి ఫస్ట్ క్లాస్ వచ్చింది. ఇంతేకాదు. ఆయన ఎం.ఏ. లో పట్టం పొందిన సంవత్సరం (1909) తత్త్వశాస్త్రంలో పరీక్షకు వెళ్ళినవారిలో నెగ్గింది ఆయన ఒక్కరే! విద్యార్థిదశలోనే ట్యూషన్ల రూపంలో ఆయనాచార్యత్వం వహిస్తూ వుండేవారు. ప్రముఖ న్యాయవాదిగా చెన్నపురిలో పేరు ప్రఖ్యాతులను గడించుకొని, ఒక మహిళా కళాశాలను స్థాపించి, దానికి 30 లక్షల వరకు భూరివిరాళ మిచ్చిన శ్రీ ఇ.ఎల్. యతిరాజ్ ఆయనతో ట్యూషన్ చెప్పించుకొన్నవారే. సైదాపేట టీచర్స్ ట్రెయినింగ్ కాలేజీలో ఎల్.టి. పరీక్షకు చదువుతూ, సైకాలజీ ప్రొఫెసర్ బలవంతం మీద తోటి విద్యార్థులకు మానసిక శాస్త్రం పై ఆయన పన్నెండు మహోపన్యాసాలిచ్చి, వారిని ముగ్ధులను చేశారు.

ఆ లేత వయస్సులోనే ఆయన మహావక్త మాత్రమే కాదు; ఆచార్యోత్తముడే కాదు; అనన్య ప్రతిభాసంపన్నుడైన దార్శనికుడు కూడా. హిందూమత సంప్రదాయాలపట్ల శక్తి గౌరవాలున్న కుటుంబంలో పుట్టి పెరిగినవాడైనందున, తాను చదువుకొంటున్న క్రైస్తవ విద్యాసంస్థలలో హిందూ మతనిరసన ఆయనకు బాధ కలిగిస్తూ వచ్చింది. ఇది ఆయనను తన ఎం. ఏ. క్లాసులో వేదాంతంలోని నైతిక సూత్రాలు (The Ethics of Vedanta) అనే బృహత్తర వ్యాసరచనకు ప్రేరేపించింది. ఆయన ప్రొఫెసర్, డాక్టర్ హాగ్ దాన్ని ఎంతగానో మెచ్చుకొన్నారు. దార్శనిక శాస్త్రాలకు సంబంధించిన మూలసమస్యల అవగాహనతో పాటు, క్లిష్టమైన విషయాలను విడమర్చి చెప్పడంలో ప్రజ్ఞా ప్రాభవాలు దానిలో వ్యక్తమౌతున్నవని, ఆంగ్లేయభాషపై అధికారం కానవస్తున్నదని ఆయన శ్లాఘించారు.

ఇంతకు మించి డాక్టర్ రాధాకృష్ణన్ జీవితం తొలిదశలను గురించి మనకు ఎక్కువ వివరాలు తెలియక పోయినా, పుట్టగానే పరిమళించిన పూవువలె ఆయన విభాసించినారని చెప్పడానికివి చాలవా?

## 2

విద్యార్థిగానే, ఆచార్యత్వం వహించిన వ్యక్తి విద్యాశాఖాధికారుల దృష్టిని సులభంగా ఆకర్షించడం అబ్బురమా? ఎం.ఏ. పట్టం పొందిన వెంటనే డాక్టర్ రాధాకృష్ణన్ ను సబార్డినేట్ ఎడ్యుకేషనల్ సర్వీసులోకి తీసుకొని, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా నియమించారు. ఎల్.టి. ప్యాస్ కాగానే ఆ పదవిలో (1911లో) ఆయనను ఖాయంచేశారు. మరొక అయిదేళ్ళకు (1916లో) ప్రొవెన్షియల్ గ్రేడ్ ఆయనకిస్తూ, ప్రొఫెసర్గా ప్రమోట్ చేశారు.

శ్రీ ఖాసా సుబ్బారావు కథనం ప్రకారం ప్రొఫెసర్ రాధాకృష్ణన్ క్లాసుకు పది నిమిషాలు ఆలస్యంగా వచ్చేవారు; ఇరవై నిమిషాలు ముందుగా వెళ్ళిపోయేవారు. అయితే, ఉపన్యసించిన ఇరవై నిమిషాలలో విద్యార్థులను ఉర్రూతలూగించేవారు. ఫిలాసఫీ విద్యార్థులేకాక తక్కిన వారు కూడా ఆయన క్లాసులలో గుమిగూడుతూ ఉండేవారు. ఆయనది ప్రసంగం కాదు, గంగాప్రవాహం. అది పరీక్షలకు పాఠాలు చెప్పడం కాదు, జీవితానికి బాటలు దిద్దడం. ప్రెసిడెన్సీ కాలేజీ క్లాస్ రూమ్లు నుంచి దూరదూరాలకు ప్రొఫెసర్ రాధాకృష్ణన్ కీర్తి ప్రతిష్ఠలు విస్తరించడానికి ఎంతో కాలం పట్టలేదు. తమ విశ్వవిద్యాలయంలో దార్శనికాచార్య పీఠాన్ని అధిష్ఠించడానికి కనీసం అయిదేళ్ళపాటు ఆయనను పంపించవలసిందిగా మైసూరువారు కోరారు.



రాజమహేంద్రవరం కళాశాల నుంచి 1918లో ఆయన అక్కడకు వెళ్ళారు. అక్కడ ఉండగానే మద్రాసు ప్రభుత్వం ఆయనను ఇంపీరియల్ గ్రేడ్ (ఐ.ఇ.ఎస్.) లోకి ప్రమోట్ చేసింది. మైసూర్ పట్టుమని రెండేళ్ళపాటు ఉన్నారో, లేదో, ప్రొఫెసర్ రాధాకృష్ణను కలకత్తానుంచి పిలుపు వచ్చింది. దేశంలో ఎక్కడ, ఏ ప్రతిభావంతులు కనబడినా, వారిని కలకత్తా యూనివర్శిటీకి ఎలాగైనా రప్పించుకొనడమే పనిగా పెట్టుకొన్న అశుతోష్ ముఖర్జీ కన్ను ప్రొఫెసర్ రాధాకృష్ణన్ పై పడింది. పంచమజార్జి చక్రవర్తి పేర తమ విశ్వవిద్యాలయంలో గల దార్శనిక శాస్త్ర పీఠానికి ఆచార్యత్వం వహించవలసిందిగా, అప్పటి మైసూర్ యూనివర్శిటీ వైస్ - ఛాన్సలర్ సర్ బ్రజేంద్రనాథ్ శీల్ ద్వారా, ఆయన ప్రొఫెసర్ రాధాకృష్ణనన్ను ఆహ్వానించారు. ఈ కొత్త పదవిలో ప్రవేశించాలని 1921 మార్చిలో కలకత్తాకు బయల్దేరినప్పుడు ఆయన విద్యార్థులు కన్నీళ్ళతో సాగనంపారు. గుర్రాలను విప్పివేసి, "కోచ్"ని తామే లాగుతూ మైసూరు నగరవీధుల వెంట ఊరేగించారు. రైలు కదులుతూ ఉండగా రుద్ధకంఠాలతో "రాధాకృష్ణను జై" అంటూ వీడ్కోలు చెప్పారు.

3

ప్రెసిడెన్సీ కాలేజీలో (మద్రాసు) అసిస్టెంట్ ప్రొఫెసర్గా చేరిన కొత్తలో డాక్టర్ రాధాకృష్ణన్ మానసిక, తర్క శాస్త్రాలను బోధిస్తూ ఉండేవారు. ఆ రోజులలోనే మానసిక శాస్త్రం ప్రధాన సూత్రాలు (Essentials of Psychology) అనే పేరుతో ఆయన తన ప్రథమ గ్రంథాన్ని వ్రాశారు. ఇది కేవలం విద్యార్థుల కుద్దేశించిన పాఠ్యగ్రంథమైనా, దీని రచన విశిష్టంగా జరిగినందున ఆక్స్ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్వరు లండన్ నుంచి దీన్ని 1911లో ప్రచురించారు.

దీని తర్వాత ఆయన వ్రాసిన పుస్తకం రవీంద్రుని తత్త్వదర్శనం (The Philosophy of Rabindranath Tagore) కాగా, ఆయన సరికొత్త రచన బ్రహ్మ సూత్రాలపై భాష్యం. ఈ మధ్యకాలంలో దాదాపు ఇరువది గ్రంథాలను ఆయన వ్రాసి ప్రచురించారు.



ఇంగ్లీషులోకి ప్రస్థాన త్రయం (భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు) అనువాదం, వాటి పై వ్యాఖ్యానం; దమ్మపదం అనువాదం, దానికి కూడా భాష్యం : ఆచార్య త్రయం సరసను ఈ కృషి డాక్టర్ రాధాకృష్ణన్కు స్థానం సంపాదించి పెట్టింది. నిజానికి వారి కృషికంటె ఈయనదే గొప్పది. అది గీర్వాణభాషలో జరగగా, ఇది మ్లేచ్ఛ భాషలో జరిగిందని ఈసడించనక్కరలేదు. ఎవరితోనో సంభాషిస్తూ డాక్టర్ రాధాకృష్ణన్ స్వయంగా అన్నట్టు, మధ్యయుగంలో కాక, ఆధునిక కాలంలో ఆదిశంకరాచార్యుడు తన రచనలు చేసి ఉంటే, ఇంగ్లీషునే ఆయన విధిగా వినియోగించుకొని ఉండేవారు. హైందవ ధర్మాన్ని, దాని దార్శనిక శాస్త్రాలను, వాటి సందేశాన్ని ప్రచారం చేయడానికి మన దేశంలోనే కాక, దేశదేశాలలో ఆయన తన పీఠాలను నెలకొల్పి ఉండేవారు. హిందూ, బౌద్ధ ధర్మశాస్త్రాలకేకాక, ప్రాకతీచీ దర్శనాలన్నింటికి మధ్య సమన్వయ సాధనకు యత్నించి ఉండేవారు. ఈ బృహత్తర కృషికి ఆయనకు, డాక్టర్ రాధాకృష్ణనక్కు వలె, నేడు ప్రపంచ భాషగా చెల్లుతున్న ఇంగ్లీషు అవసరమై ఉండేది.

ప్రస్థానత్రయానికి డాక్టర్ రాధాకృష్ణన్ భాష్యం ఆధునిక దృష్టితో జరిగింది; అపూర్వ పాండితితో జరిగింది. సోక్రటీస్ మొదలు సార్త్రే వరకు పాశ్చాత్యదార్శనిక శాస్త్రవేత్తల రచనలన్నీ ఆయనకు కంఠోపాఠం. భగవద్గీతను మననం చేసినంత శ్రద్ధాసక్తులతో ఆయన బైబిల్ మొదలైన చైనీస్ తత్వవేత్తలను గురించి ఆయనకు తెలియని విషయాలు తెలుసుకోదగినవి కావు. ఖురాన్ ఆయనకు కొట్టిన పిండి; సూఫీతత్వాన్ని ఆయన మథించారు.

అన్ని మత గ్రంథాలలోనే కాక, అన్ని దార్శనిక శాస్త్రాలలోనే కాక, తర్క, మానసిక, సాంఘికాది శాస్త్రాలలో కూడా డాక్టర్ రాధాకృష్ణన్ మహాపండితుడు. మ్యాజినీవలె మార్క్స్ ఆయనకు సుపరిచితుడు. రూసోవలె

రస్సెల్ ఆయనకు సన్మిత్రుడు. బరువలె బ్రూమ్ ఆయనకు ఆత్మబంధువు. క్రొపొట్కిన్ వలె క్రోచేతో ఆయన కెంతో సాన్నిహిత్యం. మిల్నే కాక మోర్లీనికూడా ఆయన చనువుగా పలకరించగలరు. ఫ్రేజర్ వలె ఫ్రాయిడ్తో ఆయన చర్చకు దిగగలరు. విశ్వవిశాలమైంది ఆయన పరిజ్ఞానం. ఒక మహా విజ్ఞాన సర్వస్వంతోనే ఆయనను పోల్చవచ్చు.

ప్రాచీనార్వాచీన శాస్త్రాలతో తనకు గల అపార పరిజ్ఞానాన్ని ప్రస్థాన త్రయానికి భాష్యం చెప్పడానికి డాక్టర్ రాధాకృష్ణన్ వినియోగించారు. అందుకే ఆయన వ్రాసినవి కేవలం భాష్యాలు కావు, అవి విజ్ఞాన భాండాగారాలు. భిన్నత్వంలో అవి ఏకత్వాన్ని సాక్షాత్కరింపజేస్తాయి; వైరుధ్యాల మధ్య సమానత్వాన్ని సాధిస్తాయి; ప్రాచీనచింతనకు నవీనార్థాలను ప్రవచిస్తాయి; గతానికి జీవాన్ని పోసి, వర్తమానానికి సార్థక్యాన్ని కల్పించి, భవిష్యత్తుకు కరదీపికలను సమకూర్చుతాయి. పాండిత్య ప్రదర్శనకు కాక, కర్తవ్యనిర్దేశానికై ఉద్దేశించబడిన భాష్యాలవి. సిద్ధాంతరాద్ధాంతాల ప్రతిపాదనకు కాక, మానవోద్ధరణకై, జగత్కళ్యాణానికై ఉద్దిష్టమైనవవి. అపూర్వమైనది వాటి సమ్యగృష్టి; అసాధారణమైనది వాటి సందేశం.

4

ప్రస్థానత్రయ భాష్యాలవలె అనితర సాధ్యమైనవే డాక్టర్ రాధాకృష్ణన్ మౌలికరచనలు కూడా. రవీంద్రుని తత్త్వ దర్శనం తర్వాత ఆయన వ్రాసిన పుస్తకం సమకాలీన తత్త్వశాస్త్రంలో మత ప్రాబల్యం (The Reign of Religion in Contemporary Philosophy). దీనిలోని భావాలన్నింటిని ఈనాడు ఆయనే ఆమోదించక పోవచ్చు. నా సత్యాన్వేషణలో (My Search for Truth) స్వయంగా చెప్పుకొన్నట్టు, అర్హతను మించి ప్రముఖులు దాన్ని ప్రస్తుతించినారనడం ఆయన అభిప్రాయం కావచ్చు. 1920లో మాక్మిలన్ కంపెనీ ప్రథమంగా ప్రచురించిన ఈ గ్రంథం ఈనాడు అచ్చులో లేకపోవడానికి కారణం దాని పునః ప్రకటనకు డాక్టర్ రాధాకృష్ణన్ సమ్మతి లభించకపోవడమే కావచ్చు. కాని, తొలిగా వెలువడినప్పుడు అది విజ్ఞానవంతుల దృష్టిని ఎంతగానో ఆకర్షించింది. దార్శనికుడుగా అప్పటికే పేరందిన జె.హెచ్. మ్యూర్ హెడ్, జె.ఎస్. మెకంజీ, జి.ఇ.సి. మెట్టగార్ట్ ప్రభృతులు దానికి హార్దికంగా స్వాగతమిచ్చారు. అమెరికన్ ఫిలసాఫికల్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రొఫెసర్ హిన్మన్, ఆ గ్రంథ ప్రచురణతో భావవాదానికి ప్రాతినిధ్యం వహించడానికి బొజాంకెట్ తో పాటు సమానమైన హక్కును డాక్టర్ రాధాకృష్ణన్ సముపార్జించుకొన్నట్టు ఉద్ఘాటించారు.

5





కలకత్తా యూనివర్సిటీలో ఫిలాసఫీ ప్రొఫెసర్ గా చేరకమునుపే టాగోర్, లైబ్ నిట్జ్, జేమ్స్ వార్డ్, విలియం జేమ్స్, బెట్రెండ్ రస్సెల్, లార్డ్ బాల్ఫర్ ప్రభృతుల భావాలను విమర్శనాత్మక దృష్టితో సమీక్షచేస్తూ, రెండు గ్రంథాలను రచించిన డాక్టర్ రాధాకృష్ణన్ ఆ తర్వాత ప్రకటించినట్టిది ఆయన పాండితికి, ప్రజ్ఞకు, ప్రాభవానికి, పరిణతికి విజయపతాకగా చెప్పదగు భారతీయతత్త్వ శాస్త్రం (Indian Philosophy), దీన్నిమించి భారతీయ తత్త్వశాస్త్రాన్ని సమగ్రంగా, సుబోధకంగా, తులనాత్మకంగా, సృజనాత్మకంగా వివరించిన గ్రంథం ఇంతవరకు మరొక్కటి వెలువడలేదు; ఇకముందు కూడా బహుశా వెలువడదు. దీని ప్రచురణకు పూర్వం భారతీయ తత్త్వశాస్త్రం ఒక మాక్స్ ముల్లర్, ఒక వింటర్ నిట్జ్, ఒక జాకోబీ, ఒక బుహ్లర్, ఒక బ్లూమ్ ఫీల్డ్, ఒక కీత్, ఒక గ్రిఫిత్, ఒక రీస్ దేవిడ్ అర్థం చేసుకొనడానికి, తమను పోలిన పండితుల దృష్టికి దాన్ని తీసుకురావడానికి తపనపడుతున్నట్టి ఒక నిగూఢ శాస్త్రం మాత్రమే. దీని ప్రచురణ తర్వాత పండిత లోకానికే కాక, సామాన్య పాఠకులకుకూడా భారతీయతత్త్వ శాస్త్రం అందుబాటులోకి వచ్చింది.

క్లిష్ట విషయాలను విడమర్చి చెప్పడానికి చేసే ప్రయత్నాన్ని ఇంగ్లీషులో "పాపులరైజేషన్" అంటారు. ఈ విధమైన కృషిలో అసలు విషయం కొంత పలచబడి పోవడం కద్దు. ఎక్కువగా పలచబడిపోతే, అసలు విషయానికి అపకృతి జరగవచ్చుకూడా. డాక్టర్ రాధాకృష్ణన్ ప్రయత్నించింది, ఆయన సాధించింది ఈ విధమైన "పాపులరైజేషన్" కాదు. ఆయన రచన సామాన్య పఠితలను అలరించగా, పండిత ప్రకాండుల ఆదరాన్ని పొందుతున్నది. ఉభయవర్గాలను అది సమానంగా ఉత్తేజపరుస్తున్నది; ఉభయవర్గాలలో సమానంగా ఆలోచనలను రేకెత్తిస్తున్నది. దీన్ని పోల్చవలసింది జాకబ్ బరోర్డ్ వ్రాసిన ఇటలీ పునరుజ్జీవన చరిత్రతో, బెట్రెండ్ రస్సెల్ రచించిన పాశ్చాత్య దార్శనిక శాస్త్రాల చరిత్రతో.

6

డాక్టర్ రాధాకృష్ణన్ ఇతర రచనలన్నింటిని గురించి వ్రాయాలంటే, ఆదిలో నేనుద్దేశించిన దానికంటే పెద్దది కానున్నట్లుగా ఇప్పటికే కానవస్తున్న ఈ పీఠిక, మరింత పెరిగిపోవచ్చు. పైగా, ఈ వ్యాససంకలనంలో వివిధ రచయితలు - ముఖ్యంగా ప్రొఫెసర్ కొత్త సచ్చిదానంద మూర్తి, శ్రీ ఎం.వి.ఎస్. స్వామి, శ్రీ జె.ఎస్.ఆర్.ఎల్. నారాయణమూర్తి - డాక్టర్ రాధాకృష్ణన్ రచనలను విపులంగా సమీక్షించారు.




కాని, ఆయన తక్కిన రచనలలో హిందూ జీవన దృక్పథం (The Hindu View of Life), భావవాద జీవన దృక్పథం (An Idealist View of Life), ధర్మోద్ధరణ (Recovery of Faith); ఇవి ముఖ్యమైనవనడం పెక్కుమంది అభిప్రాయం. కాని, నా మట్టుకు నాకు హిందూ సంఘంలో జరగదగు మార్పులను సూచించిన ఆయన మతం, సంఘం (Religion and Society), వైజ్ఞానిక శాస్త్రాలలో సాధించబడిన అత్యద్భుత పురోగతి ఆధునిక మానవునికి కల్పిస్తున్న విషమ సమస్యలను పరిశీలించిన ఆయన చిన్ని పుస్తకం, కల్కి లేదా నాగరికత భవిష్యత్తు (Kalki or the Future of Civilization) మరింత ముఖ్యమైనవి. ఆయన రచనలన్నీ - అవి చిన్నవైనా, పెద్దవైనా మానసికోత్తేజాన్ని, ఆత్మవికాసాన్ని కలిగించేవే. భారత రాష్ట్రపతిగా ఆయన వేర్వేరు సందర్భాలలో, విభిన్న సభలలో, సమావేశాలలో చేసిన ప్రసంగాలను, ఆయన ఇటీవల వ్రాసిన పీఠికలను సంకలనం చేసి, పబ్లికేషన్స్ డివిజన్ వారు ప్రచురించిన రెండు సంపుటాలుకూడా (Occasional Speeches and Writings) పదే పదే చదివి, మననం చేసుకోదగినవే!

కాని, భారతీయ తత్త్వశాస్త్రం, మతం : సంఘం, కల్కి లేదా నాగరికత భవిష్యత్తు : ఈమూడు గ్రంథాలు డాక్టర్ రాధాకృష్ణన్ అభిప్రాయాల, విశ్వాసాల నిగ్గును మనకు అందిస్తున్నట్టు చెప్పవచ్చునేమో! హిందూ ధర్మాన్ని పునరుద్దీపింపజేసిన విశిష్ట రచనలివి; దార్శనిక శాస్త్రాలను ఆధునిక యుగావసరాలకు అనుగుణంగా మలచిన మహోత్కృష్ట గ్రంథా లివి.

7

విదేశ యాత్ర వివేకానందునికి విశ్వ విఖ్యాతి తెచ్చింది. ఈ కారణానే కావచ్చు, భారతీయ మేధావులలో పెక్కుమంది "మేముకూడా విదేశాల కొకసారి వెళ్ళిరాగలిగితేనా!" అంటూ తపనపడుతూ ఉంటారు. అందరూ వివేకానందులు కారు; అందరికీ ఆయన మేధ లేదు, ఉపజ్ఞలేదు, నైతిక బలం లేదు, వాక్పటిమ లేదు, సమ్మోహన శక్తిలేదు. అయినా విదేశయాత్ర నొకసారి చేయగలిగితే తమకు ప్రపంచం బ్రహ్మరథం పట్టగలదని వీరు వెర్రికలలు కంటూ ఉంటారు.



వివేకానందస్వామి తర్వాత అంతటి ప్రజ్ఞా ప్రాభవాలున్న డాక్టర్ రాధాకృష్ణన్ విదేశయాత్రకై తాపత్రయపడనే లేదు. కలకత్తా యూనివర్శిటీలో చేరిన కొత్తలోనో, అంతకంటె ముందుగానో కూడా, ఆయనకు యూరప్, అమెరికాల నుంచి రెండు, మూడు ఆహ్వానాలు వచ్చాయి. వాటికి ఆయన సమ్మతించలేదు. పిమ్మట 1926లో ఆయన విదేశ పర్యటనకు ఓం ప్రథమంగా బయల్దేరింది బలవంతం మీదనే. కేంబ్రిడ్జ్ సమావేశంకానున్న ఎంపైర్ యూనివర్శిటీస్

కాంగ్రెసుకు పిలుపు రాగా, దానిలో పాల్గొనడానికి ఆయనను పంపించడం నాటి కలకత్తా యూనివర్శిటీ వైస్ - ఛాన్సలర్ సర్ యూవర్ట్ గ్రాన్జ్ భగీరథయత్నమైంది. ఎంత అయిష్టంగా డాక్టర్ రాధాకృష్ణన్ విదేశాలకు పయనమై వెళ్ళారో, అంత ఘనంగా ఆయన యాత్ర జయప్రదమైంది. ఆది నుంచి అంతం వరకు అదొక జైత్రయాత్ర. ఏ సభలో పాల్గొన్నా, ఏ విషయంపై ప్రసంగించినా, శ్రోతలను ఆయన మంత్రముగ్ధులను చేశారు. ఆయన వైదుష్యానికి, ఆయన వాగ్ధోరణికి చకితులు కానివారు లేరు. ఆయనను ప్రశంసించడంలో పత్రికల మధ్య పోటీ చెలరేగింది.

కేంబ్రిడ్జి మహాసభలో పాల్గొనడానికి వెళ్ళిన డాక్టర్ రాధాకృష్ణనన్ను దానికంటే పురాతనమైన బ్రిటిష్ యూనివర్సిటీ - ఆక్స్ఫర్డ్ - అప్టన్ లెక్చర్స్ను ఇవ్వవలసిందిగా ఆహ్వానించింది. ఈ ప్రసంగాలను చేయడానికి ఒక భారతీయుని ఆహ్వానించడం అదే ప్రథమం. అవి ఆక్స్ఫర్డ్ కాలేజీల మధ్య పడవపందెములు జరిగే రోజులు. అవి జరుగుతున్నన్ని రోజులు విద్యార్థులకేకాక వారి ఆచార్యవర్యులకు సయితం మరొక ధ్యాస ఉండదు. అయినా, డాక్టర్ రాధాకృష్ణన్ ప్రసంగాలను వినడానికి వచ్చినవారికి వాటినేర్పాటుచేసిన మాంఛెస్టర్ కాలేజీ హాలు సరిపోలేదు! కాని, లోపల చోటు దొరకనివారు వెళ్ళిపోలేదు; బయట నిలబడి, చెవులు రిక్కించి ఆసక్తితో విన్నారు. నాడు డాక్టర్ రాధాకృష్ణన్ చేసిన ఆ మహోపన్యాసాలే తర్వాత హిందూజీవన దృక్పథం అనే పుస్తకరూపాన్ని ధరించాయి.

అదే ప్రయాణంలో బ్రిటన్ నుంచి అమెరికాకు వెళ్ళి, బోస్టన్లో దార్శనికశాస్త్ర అంతర్జాతీయ మహాసభలో కలకత్తా యూనివర్సిటీ ప్రతినిధిగా ఆయన పాల్గొన్నారు. అటుపిమ్మట చికాగో యూనివర్శిటీవారి కోర్కెపై హాస్కెల్ ట్రస్ట్ తరపున గంభీరోపన్యాసాల నిచ్చారు. బ్రిటన్ వలె అమెరికా కూడా ఆయన ప్రతిభకు జోహారులర్పించింది.




తన తొలి విదేశయాత్రనే ఇంత జయప్రదం చేసుకొని వచ్చిన డాక్టర్ రాధాకృష్ణన్ ఆ తర్వాత ఎన్నిసార్లు విదేశాలకు వెళ్ళారో, ఎన్ని ప్రసంగాలను చేశారో, ఎన్ని గౌరవాలను పొందినారో లెక్క లేదు. నిడివి తేలిన ఆయన మూర్తి, కోలముఖం, విశాలమైన నుదురు, తీర్చిదిద్దినట్టుగా ఉండే ముక్కు కాంతులీనే కళ్లు, ఏపుగా పెరిగి అణగిమణగి ఉండే జుట్టు, కంచుగంటను తలపింపజేసే కంఠం – వీటితో పరిచయంలేని ప్రముఖులు ఈనాడు ప్రపంచ ప్రధాన నగరాలలో దాదాపుగా లేరు. ప్రసిద్ధ వ్యక్తుల సంస్మరణార్థం ప్రారంభించిన ఉపన్యాసాలలో అప్టన్, హాస్కెల్ లెక్చర్స్ తర్వాత డాక్టర్ రాధాకృష్ణన్ చేసిన వాటిలో సుప్రసిద్ధమైనట్టివి బ్రిటన్ లో హిబ్బర్ట్ లెక్చర్స్, అమెరికాలో బెట్టీ మెమోరియల్ లెక్చర్స్, కలకత్తాలో కమల లెక్చర్స్. ఈ ప్రసంగాలే తర్వాత భావవాద జీవన దృక్పథం, ప్రాక్పశ్చిమాలు : కొన్ని చింతనలు" (East and West: Some Reflections) మతం; సంఘం అనే గ్రంథాలుగా ప్రచురితమైనాయి.

8

డెమొస్తనెజ్, బర్క్ షెరిడన్, లింకన్, గ్లాడ్డెన్, లాయిడ్ జార్జి, చర్చిల్, సురేంద్రనాధ్ బెనర్జీ, వివేకానంద ప్రభృతుల కోవకు చెందిన మహావక్త డాక్టర్ రాధాకృష్ణన్. వీరిలో బర్క్ ప్రసంగాలు.

ప్రపంచ సాహిత్యంలోనే స్థానాన్ని సంపాదించుకొన్నా, వినడానికి సొంపుగా ఉండేవి కావట. ప్రసంగించడానికి ఆయన లేవడమే తడవుగా కామన్సు సభ్యులలో హెచ్చుమంది చల్లగా లాబీలలోకి జారుకొనేవారట.

చర్చిల్ ప్రసంగాల ధోరణి ఇంతకంటే చాలా మెరుగైనా, ఆయన సయితం ధారావాహికంగా ఉపన్యసించలేదట. లాయిడ్ జార్జి సభాసదులను మంత్రముగ్ధులను చేసినా, మొత్తంపై ఆయన ప్రసంగాలలో సాహిత్యపు విలువలు తక్కువ. గ్లాస్టన్ ధర్మాభినివేశంతో ఉత్తేజపూరితమైన ప్రసంగాలు చేసేవారుగాని, సర్వసాధారణంగా అవి దీర్ఘవాక్యాలతో కూడిన సుదీర్ఘోపన్యాసాలు.

విన్నా, చదువుకొన్నా సమానంగా ఆకర్షిస్తాయి - అలరిస్తాయి - “అహో!” అనిపింపజేస్తాయిడాక్టర్ రాధాకృష్ణన్ ప్రసంగాలు. భాషతో భావం, భావంతో భాష చెట్టపట్టాలు వేసుకొని వాటితో పరుగుపెడుతూ ఉంటాయి. సాహిత్య సౌరభాలతోపాటు, సంగీత మాధుర్యాలు సయితం వాటిలో పుష్కలంగా ఉంటాయి. సూత్రాల బిగి సుభాషితాల జిగి వాటిలో కానవస్తుంది. ఏకసమయంలో అవి ప్రీతిదాయక కావ్యాలు, నీతిదాయక ధర్మోపదేశాలు.

“నోట్సు” లేకుండానే ప్రపంచ ఆహార మహాసభలో డాక్టర్ రాధాకృష్ణన్ మహోపన్యాసంచేయగా విని, ఈ మధ్యనే ప్రెసిడెంట్ కెనెడీ ఆశ్చర్యపోయారు. కాని, డాక్టర్ రాధాకృష్ణన్ విషయంలో ఇది ఆశ్చర్యపడవలసిన విషయం కానేకాదు. తన ప్రసంగాలను అవి ఎంతటి ముఖ్యప్రసంగాలైనా, లేక, ఎంతటి దీర్ఘ ప్రసంగాలైనా - ముందుగా వాటిని ఆయన వ్రాసుకోరు. నూటికో, కోటికో ఒకసారి ఏదైనా ప్రసంగాన్ని ముందుగానే వ్రాసుకొన్నా, దాని ముద్రిత పాఠాన్ని వినియోగించుకొనకుండానే - ఒక్కమాటనైనా ఎక్కడా తప్పకుండా - ఎక్కడా నట్టుపడకుండా - అభిభాషించగలరు. లక్నోలో నెహ్రూ ప్రారంభోపన్యాసకుడుగా, తాను అధ్యక్షుడుగా 1937-38లో జరిగిన విద్యామహాసభలో ఆయన ఈ పని చేసినారని “నేషనల్ హెరాల్డ్" ఎడిటర్ శ్రీ యం. చలపతిరావు ఒక వ్యాసంలో పేర్కొన్నారు. మరొక సందర్భంలో ఆయన ఈ పనిచేయడం తమకు తెలిసినట్టు శ్రీ కె.ఎ. సుబ్రహ్మణ్య అయ్యర్ కూడా వ్రాశారు. అత్యద్భుతమైనది డాక్టర్ రాధాకృష్ణన్ ధారణాశక్తి. ఆయన ఏకసంథాగ్రాహి కావచ్చు. కానిచో, తమ ప్రసంగాలలో ఆయన వేదవేదాంగాలనుంచి అన్ని శ్లోకాలను, అన్ని సుభాషితాలను సందర్భోచితంగా ఉదహరించగలరా? ప్రాచీనార్వాచీన రచయిత గ్రంథాల నుంచి వాక్యాలకు వాక్యాలనే, భాగాలకు భాగాలనే ఉదహరించగలరా? డాక్టర్ రాధాకృష్ణన్ ధారణాశక్తి కంటె కూడా అద్భుతావహమైంది ఆయనకు ఆంగ్లేయభాషపైగల అధికారం. ఆంగ్లేయులనే అది


చకితులను చేస్తుంది. అనితర సాధ్యమైన ప్రత్యేక శైలిని ఆ భాషలో ఆయన అలవరుచుకొన్నారు. జటిల భావాలనైనా సరళంగా, లలితంగా విశదీకరించగలిగినట్టిది ఆ శైలి. విస్తృతాంశాలను సయితం ఒక సూత్రంలోకి లేదా, ఒక సుభాషితంలోకి కుదించగలిగినట్టిది ఆ శైలి.

దానిలో అపశ్రుతులుండవు, అన్వయ కాఠిన్యాలుండవు. అది కత్తివలె పదునైనది, పువ్వువలె మెత్తనైనదికూడా. దానిలో వెన్నెల చల్లదనంతోపాటు, ఇంద్రధనస్సు రంగులుంటాయి; తల్లి పిలుపులోని మార్దవంతోపాటు దేశికుని హెచ్చరికలోని అధికారం ఉంటుంది. డాక్టర్ రాధాకృష్ణన్ శైలికి రాణింపు తెస్తూ ఉంటుంది.

గంభీరమైన ఆయన కంఠస్వరం. ఆయనను చూడగానే కలిగే గౌరవభావాన్ని ఆ కంఠస్వరం భక్తిగా మార్చుతుంది. స్వరయుక్తంగా చదువుతున్న వేదమంత్రాలను విన్నప్పుడు, మాస్కో నుంచి ఢిల్లీకి వస్తూ, హిమాలయ శిఖరాలపైగా విమానంలో పయనించినప్పుడు, అమెరికా పర్యటన సందర్భంలో నయాగరా జలపాతాన్ని సందర్శిస్తూ గంటలాదిగా నిస్తబ్దంగా నిలబడిపోయినప్పుడు, ఆంకోర్వాట్ ప్రాచీన దేవాలయ శిఖరాగ్ర సమీపానికి యెగబ్రాకినప్పుడు నాలో వచ్చిన కదలికను పోలినదాన్నే డాక్టర్ రాధాకృష్ణన్ కంఠస్వరం తరచు నాలో కలిగిస్తూ ఉంటుంది. రైట్ ఆనరబుల్ శ్రీనివాస శాస్త్రి కంఠంలోని స్థాయీ భేదాలు ఈయన దానిలో లేవు. కంచుగంట మ్రోతనుంచి, ప్రేయసీ ప్రియుల గుసగుసవరకు ఇది మారదు. అయినా విసుగుకలిగించదు; విన్న కొద్దీ మరింత వినాలనే అనిపిస్తుంది.

ఢిల్లీ, మద్రాసు, హైదరాబాద్ మొదలైన భారతీయనగరాలలోనే గాక ప్యారిస్లో కూడా డాక్టర్ రాధాకృష్ణన్ ఉపన్యాసాలను నేను విన్నాను. అన్ని చోట్ల ఆయా సందర్భాలకు, సన్నివేశాలకు తగినట్టు మహోదాత్తంగా ఆయన ప్రసంగించారు; అన్నిచోట్ల సభాసదుల గౌరవమన్ననలను విశేషంగా అందుకొన్నారు.


1929లో హిబ్బర్ట్ లెక్చర్స్ ఇచ్చినప్పుడు ఆయన సభామందిరంలోకి రాగానే సభాసదులందరు గౌరవంతో లేచి నిలబడేవారట. 1958లో యునెస్కో జనరల్ కాన్ఫరెన్స్ సందర్భంలో ఆయన సభామండపంలో ప్రవేశించగానే దేశదేశాల ప్రతినిధులు గౌరవంతోనేకాక, భక్తితో లేచి నిలబడేవారని ఆ దృశ్యాన్ని స్వయంగా చూచిన నేను చెప్పగలను.




వక్తగా డాక్టర్ రాధాకృష్ణన్ వశీకరణశక్తికి ప్రొఫెసర్ టి.ఎం.పి. మహదేవన్ ఒక చక్కని సంఘటన పేర్కొన్నారు. అది 1958వ సంవత్సరం. ప్రాక్పశ్చిమ ప్రపంచాలకు పొలిమేరగా ఎన్నదగు హవై దీవులలో ఉభయ ప్రపంచాల తత్త్వవేత్తల మహాసభ జరుగుతున్నది. దానిలో పాల్గొనడానికి వెళ్ళిన డాక్టర్ రాధాకృష్ణన్, ఒక సాయంత్రం ఒక బహిరంగ సభలో ప్రసంగిస్తున్నారు. ఆయన మహోపన్యాసాన్ని వినడానికై వచ్చిన జనసందోహంతో సహా చైనీస్ వణిక్రముఖుడు లోనికి ప్రవేశించలేక వెలుపలనే నిలబడి ఆసాంతం డాక్టర్ రాధాకృష్ణన్ ప్రసంగం విన్నాడు. ప్రాచీన కాలంలో హవై ద్వీపవాసులు బుద్ధుని సందేశాన్ని ఆయన శిష్యుల ద్వారా విని పులకరించినవారే. శాక్యసింహుడు ఏ అశ్వత్థ వృక్షం క్రింద మహాసంబోధితుడైనాడో దాని సంతతికి చెందినదాన్నిగా తమ నేషనల్ పార్క్ లోని అశ్వత్థాన్ని వారు సగర్వంగా చూపుతారని దాన్ని చూచి వచ్చి ఉన్న నాకు తెలుసు. శతాబ్దాల తర్వాత తిరిగి డాక్టర్ రాధాకృష్ణన్ ద్వారా భారతవాణిని విన్న హవై ద్వీపవాసులు ఎంతగానో ఉత్తేజితులైనారు. అందరికంటే మిన్నగా పరవశుడైన వ్యక్తి సభా మందిరంలోకి ప్రవేశమైనా లభించక వెలుపలనే నిలిచి ప్రసంగాన్ని విన్న చైనీస్ వణిక్ ప్రముఖుడే. ప్రాక్పశ్చిమ తత్త్వవేత్తల మహాసభకైన వ్యయాన్ని పూర్తిగా తానే భరిస్తానని, ఆ గౌరవాన్ని తనకు ఇవ్వవలసిందని అతడు కోరాడు.

హవై దీవులలో ఒక వాణిజ్యవేత్తకు భక్తిగౌరవాలను కలిగించిన డాక్టర్ రాధాకృష్ణన్ వాక్పటిమ న్యూఢిల్లీలో ఒక రాజకీయవేత్తలో భయసంకోచాలను రేకెత్తించింది. పార్లమెంట్ ఉభయసభల సంయుక్త సమావేశంలో అదివరకొకసారి ప్రసంగించినవారే బ్రిటిష్ మాజీ ప్రధాని ఆంథోనీ ఈడెన్. అయితే రెండవసారి తమకు స్వాగతవచనాలు పలికింది మరెవరో కాదు, నాటి భారత ఉపాధ్యక్షుడు డాక్టర్ రాధాకృష్ణన్. ఆయన మాట్లాడింది కొద్ది నిముషాలపాటే. అయినా, ఇంగ్లీషువారిలోనైనా ఇంత గొప్పగా ఇంగ్లీషులో ప్రసంగించగలవారు కలరా అని ఆయన అబ్బురపోయారు. ఆయన తర్వాత తానుపన్యసించడం హనుమంతుని ముందు కుప్పిగంతులు వేయడమే కాగలదని ఆయన సంకోచించారు. 'ఫుల్ సర్కిల్' అనే తన గ్రంథంలో ఆయన ఈ విషయాలను స్వయంగా పేర్కొన్నారు.

మహావక్తగా, మౌళిక భావకుడుగా, విశిష్ట దార్శనికుడుగా జీవిత ప్రారంభదశలోనే విశేష విఖ్యాతనం దించిన డాక్టర్ రాధాక్రి పదవిని మించిన పదవి  మహావక్తగా, మౌలిక భావుకుడుగా, విశిష్ట దార్శనికుడుగా జీవిత ప్రారంభదశలలోనే విశేష విఖ్యాతినందిన డాక్టర్ రాధాకృష్ణను పదవి తర్వాత పదవి కోరకుండానే రావడం అబ్బురం కాదు గదా? లార్డ్ హాల్డెన్ సూచనపై, ఆయన ప్రోద్బలంపై మాంచెస్టర్ కాలేజీలో ప్రపంచమతాల తులనాత్మక పరిశీలన పీఠానికి ఆచార్యత్వం వహించవలసిందిగా ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ 1929లో ఆయనను ఆహ్వానించింది. అదే యూనివర్సిటీ 1938లో ఆయనను స్పాల్డింగ్ ప్రొఫెసర్గా యెన్నుకొన్నది.




ప్రొఫెసర్ పదవులతోపాటు తక్కినవికూడా ఆయన తాపత్రయపడకుండా వచ్చినవే! 1931లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షపదవికి మిత్రులు, పెద్దలు ఎంతగానో వొత్తిడి పెట్టిన మీదటగాని ఆయన పోటీ చేయలేదు. పోటీలో నెగ్గిన తర్వాత కూడా తగినంత పెద్ద మెజారిటీ తనకు రాలేదని పదవిని స్వీకరించడానికి ఆయన నిరాకరించారని, అప్పటి మద్రాసు ముఖ్యమంత్రి బొబ్బిలి రాజా పట్టుపట్టిన మీదటనే ఆయన మనస్సు మార్చుకొన్నారని వినికిడి. పోతే, తాను పెంచి పెద్దచేసిన బిడ్డను పోషించవలసిందిగా పండిట్ మదనమోహన మాలవ్యా చేతులుపట్టుకొని కోరినందునే, బెనారస్ హిందూ యూనివర్సిటీ ఉపాధ్యక్షపదవికి 1939లో ఆయన సమ్మతించారు. గౌరవ వేతనం సయితం తనకు వలదని, 1948 వరకు ఆయన ఈ పదవి నిర్వహించారు.

రెండు ప్రధాన విశ్వవిద్యాలయాలకు ఉపాధ్యక్షుడుగా సమర్థంగా పనిచేసి, వాటి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడి, అశుతోష్ ముఖర్జీతో సరితూగగల వైస్ ఛాన్సలర్గా పేరు తెచ్చుకొన్న విద్యావేత్త కనుకనే, 1948-49లో యూనివర్సిటీ విద్యా సమస్యల పరిశీలనకై తానేర్పరచిన కమిషన్ అధ్యక్షపదవికి డాక్టర్ రాధాకృష్ణన్ను సాటిరాగలవారు లేరని స్వతంత్ర భారత ప్రభుత్వం భావించింది. ఉన్నత విద్యకు నూతన నిర్వచనాన్ని చెప్పినట్టిది ఆ కమిషన్ నివేదిక. అది చేసిన సూచనలన్నింటిని పాటించగలిగితే మన దేశంలో ఉన్నత విద్యాస్వరూపమే మారిపోగలదు. అన్ని విధాల అదొక ప్రామాణిక నివేదిక.

రచయితలైనవారు వక్తలుగా, వక్తలైనవారు రచయితలుగా రాణించడం చెదురుగా మాత్రమే జరుగుతుంది. ఇంతగా కాకపోయినా విద్యాబోధకులైనవారు విద్యా సంస్థల పరిపాలకులుగా రాణించడం సయితం అరుదే. డాక్టర్ రాధాకృష్ణన్ ఉత్తమ రచయిత మాత్రమే కాక, విద్యా సంస్థల పరిపాలనలో అతిసమర్థుడు.



యూనివర్సిటీలలో కూడా రాజకీయాలుండడం మన దేశ దౌర్భాగ్యం. ఇటీవల విద్యా ప్రమాణాలు పడిపోవడానికి ఈ రాజకీయాలే కొంతవరకు కారణం. డాక్టర్ రాధాకృష్ణన్ పదవీ కాలంలో విశ్వవిద్యాలయాలలో రాజకీయాలు పూర్తిగా సమసిపోతూ ఉండేవి. విద్యార్థులలో క్రమశిక్షణ హెచ్చుతూ ఉండేది; కొత్త శాఖలను ప్రారంభించడం, కొత్త పీఠాలను నెలకొల్పడం జరుగుతూ ఉండేది. అశుతోష్ ముఖర్జీ వలె ఆయనకూడా ప్రతిభావంతులైన యువ విద్వాంసులను అన్వేషించి, వారికి ఆచార్య పదవులిస్తూ ఉండేవారు. డాక్టర్ హుమయూన్ కబీర్, శ్రీ హీరేన్

ముఖర్జీ, డాక్టర్ వి.కె.ఆర్.వి. రావు వీరు ముగ్గురు డాక్టర్ రాధాకృష్ణన్ ప్రాపుతో, ప్రోత్సాహంతో పైకివచ్చినవారే. ప్రథమంగా వీరి ప్రతిభను గుర్తించి, వీరిని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా ఆయనే నియమించారు.

పుస్తకాలంటే డాక్టర్ రాధాకృష్ణన్కు బహుప్రీతి. జీవితంలో ఆయనకు ప్రధాన వ్యాసంగం పుస్తక పఠనమే. "రోజుకు పన్నెండు గంటలు చదివే ప్రొఫెసర్"గా విన్నందునే ఆయనను చూడాలన్న ఆసక్తి స్టాలినక్కు ఆదిలో కలిగింది. నేడు రాష్ట్రపతి భవనానికి ఆయన సందర్శనానికి వెళ్ళినా, ఒక మంచంపై ఆయన విశ్రమించి ఉండగా, రెండవదానిపై అసీరియాన్ నాగరికత మొదలుకొని, అణ్వస్త్ర యుద్ధ ప్రమాదం వరకు వివిధ విషయాలపై సరికొత్త పుస్తకాలు దొంతర దొంతరులుగా పడి ఉంటాయి. ఇంతగా పుస్తకాభిమాని కనుకనే వైస్ ఛాన్సలర్గా ఆయన యూనివర్సిటీ లైబ్రరీల విషయమై ప్రత్యేక శ్రద్ధ తీసుకొనేవారు. నానాజాతి సమితికి చెందిన మానసిక సహకార అంతర్జాతీయ సంఘ సమావేశాలకు భారత ప్రతినిధిగా వెళ్ళివస్తున్న సందర్భాలలో (1931-39) నాటి బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించిన గ్రంథాలను సయితం తెచ్చి, వాటిని ఆంధ్ర యూనివర్సిటీ లైబ్రరిలో ఆయన పెడుతూ ఉండేవారట. దేనినైనా బహిష్కరించ వచ్చుగాని, కొత్తభావాలను బహిష్కరించరాదని - బహిష్కరించలేమని - ఆయన విశ్వాసం. ఈ విశ్వాస ప్రేరణపైనే ఆయన నిషిద్ధ వాఙ్మయాన్ని సేకరించి తెచ్చేవారని అనుకోవచ్చు. ఏమైనా ఆయన తర్వాత ఉపాధ్యక్ష పదవికి తిరిగి వచ్చిన ప్రముఖుడు తొలిగా చేసినపని యూనివర్సిటీ లైబ్రరీ నుంచి ఈ వాఙ్మయాన్ని తొలగించడం!

బహుశా ఈమాట చాలామందికి తెలియదు, - డాక్టర్ రాధాకృష్ణన్ ఉపాధ్యక్ష పదవీకాలంలోనే ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన వసతి గృహాలలో బ్రాహ్మణ, బ్రాహ్మణేతర భోజనశాలలను రద్దుచేసి, వాటి స్థానంలో శాకాహార, మాంసాహార శాలలను నెలకొల్పడం జరిగింది.

రాజకీయ, సాంఘిక సమస్యలపట్ల డాక్టర్ రాధాకృష్ణన్ ఎప్పటినుంచి ఆసక్తి చూపనారంభించారని కొందరు ప్రశ్నిస్తారు. వాటిపట్ల ఆయన ఎప్పుడు ఆసక్తి చూపలేదని నా ప్రశ్న.

వివిధ రంగాలకింద విభజించరానట్టిది మానవజీవితం. ప్రాపంచిక జీవితమొకటి కాగా, పారమార్థిక జీవితం ఇంకొకటి కాదు. మానసిక జీవిత మొకటికాగా, పబ్లిక్ జీవితం మరొకటికాదు. వేర్వేరు రంగాలకింద విభజించినప్పుడు జీవితంలో కపటం ప్రవేశిస్తుంది, కల్ల ప్రవేశిస్తుంది. అప్పుడు దానికి సమగ్రత ఉండదు, సంపూర్ణత్వం ఉండదు, సార్థక్యమైనా ఉండదు. అవిభాజ్యమైనదిగా జీవితాన్ని భావించగలవాడే తనలో నిగూఢమైవున్న శక్తులన్నింటిని సమానంగా వృద్ధిచేసుకోగలడు; అతడే తన వ్యక్తిత్వాన్ని పరిపూర్ణంగా పెంపొందించుకోగలడు; అతడే పూర్ణ పురుషుడు కాగలడు.

డాక్టర్ రాధాకృష్ణన్, ప్రపంచం ముందు పెడుతున్నది ఈ పూర్ణ పురుష లక్ష్యాన్నే. వ్యక్తిపరంగానే కాక, సంఘపరంగా ఈ లక్ష్యాన్ని ప్రతిపాదించడం ఆయనలోని మరొక వైశిష్ట్యం. ఈ బ్రహ్మాండంలోని ప్రతి

పరమాణువుకు నిర్వాణం లభించనిదే అది తనకు వలదన్న బోధిసత్వుడు మనకు మార్గదర్శకుడు కావాలని ఆయన ప్రబోధం.



విద్యార్థి దశలోనే వేదాంతంలోని నైతిక సూక్తులు అనే బృహత్తర వ్యాసాన్ని ఆయన వ్రాసింది నైతిక జీవితానికి ప్రోది చేయలేనిది వేదాంతం కాదన్న విశ్వాసంతోనే. ఇదే విధంగా హిందూమతాన్ని గురించి కాని, బౌద్ధ, జైన, క్రైస్తవాది మతాలను గురించి కాని ఆయన ఎక్కడేమి వ్రాసినా, లేక, ఎక్కడేమి ప్రవచించినా పూర్ణ పురుషలక్ష్య సాధనకు అవి ఎంతవరకు తోడ్పడగలవన్న జిజ్ఞాసతోనే. మతాన్ని ఒక రకం కవితగా కొట్టిపారవేశారు. క్రోచే దాన్ని పుక్కిటి పురాణంగా చులకన చేశారు. మార్క్స్, లెనిన్లు దాన్ని నల్లమందుతో పోల్చారు. "మతము జరిపినట్టి మారణహోమాలు చరితనెంత కలుషపరచలేదు? నరునిచంపి, మతము పరమేశు గాపాడు!" అని నేనొక సందర్భంలో వ్రాశాను. మతాన్ని గురించిన ఈ నిర్వచనాలన్నీ అర్ధసత్యాలతో కూడి ఉన్నవని డాక్టర్ రాధాకృష్ణన్ అభిప్రాయం. ఆయన దృష్టిలో మతం శక్తి సంపదలకోసం కాక, శాంతి కోసం, సత్యం కోసం నిత్యాన్వేషణ. సరిగా అర్థం చేసుకొన్నప్పుడు, మతమంటే సర్వసంగపరిత్యాగం కాదు; ప్రారబ్ధానికి తలవొగ్గడంకాదు; ధీరోదాత్తంగా ముందుకు సాగిపోవడం. అది ఒక సవాల్ ను అందుకోవడం; ఒక సాహస కృత్యానికి నడుం బిగించడం.

మతం స్వరూపాన్ని గురించి, దార్శనిక శాస్త్రాల ప్రయోజనాన్ని గురించి ఈ విధమైన అభిప్రాయాలున్న డాక్టర్ రాధాకృష్ణన్ జీవితంలో రాజకీయ పరిస్థితులపట్ల గాని, సాంఘిక సమస్యలపట్ల గాని ఆసక్తి చూపనట్టి ఘట్టం ఉండడానికి వీలున్నదా?

వ్యక్తిగత జీవితాన్ని వివిధ రంగాలలోకి విభజించని మతాన్ని, మానవాళి జీవితానికి విశ్వగతితో సంబంధాన్ని కుదిర్చి, దానికి సార్థక్యాన్ని కూర్చగల దార్శనిక శాస్త్రాన్ని రూపొందించడమే తన పరమలక్ష్యంగా పెట్టుకొన్న డాక్టర్ రాధాకృష్ణన్ ఆది నుంచీ రాజకీయ, సాంఘిక సమస్యల విషయమై ఆసక్తి చూపుతున్నా, వీటి విషయంలో తనకున్న భావాలకు కార్యరూప మివ్వడానికి విస్తృతరంగంలో ఆయన ప్రథమంగా ప్రయత్నించింది 1931-39 సంవత్సరాల మధ్యలో. అప్పటిలో ఆయన ప్రతి సంవత్సరం నానాజాతి సమితికి చెందిన అంతర్జాతీయ మానసిక సహకార సంఘం సమావేశాలలో పాల్గొంటూ ఉండేవారు. ఈ సమావేశాలలో ఆయన చూపిన ప్రజ్ఞా ప్రాభవాలే, విజ్ఞాన వైశిష్ట్యాలే అటుపిమ్మట యునెస్కోకు ఆయన నొక ప్రధాన నాయకునిగా చేశాయి. 1946 నుంచి 54 వరకు, తిరిగి 1958లో యునెస్కో మహాసభలకు ఆయన భారత ప్రతినిధి వర్గం నాయకుడు. 1952లో, 54లో, మరల 1958లో ఆ మహాసభలకు ఆయన అధ్యక్షుడు. 1948లో ఆయన యునెస్కో కార్యవర్గం అధిపతి. విద్యకు, విజ్ఞానానికి, కళలకు, శాస్త్రాలకు సంస్కృతికి, సభ్యతకు ప్రాధాన్యమిచ్చి, ప్రపంచం మొత్తం మీదనే వాటి పరిపోషణకు కృషిచేస్తున్న ఆ ప్రపంచ సంస్థ

లక్ష్యాలకు, దాని కార్యప్రణాళికలకు రూపమివ్వడానికి తోడ్పడిన ప్రపంచ ప్రముఖులలో ఆయనొకరు. యునెస్కో మహాసభలో పాల్గొనడానికి ఆయన నాయకత్వాన 1958లో వెళ్ళిన భారత ప్రతినిధివర్గంలో ఒక సభ్యుడనైన నేను ఆ సంస్థ ప్రధాన నిర్మాతలలో ఒకరుగా అన్ని దేశాలవారు ఆయన నెంతగానో గౌరవించడాన్ని స్వయంగా చూడగలిగాను.

ఇక, రాజకీయాలతో ఆయనకు ప్రత్యక్ష సంబంధం 1947లో సప్రూ కమిటీకి, మరుసటి సంవత్సరంలో భారత రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నిక కావడంతో ప్రారంభమైంది. ఏదో ఒక రాజకీయ పక్షానికి చెందిన వ్యక్తిగా కాక, అన్ని పక్షాలకు గౌరవ భాజనుడైన ప్రముఖుడుగా ఈ రెండు సభ్యత్వాలకు ఆయన ఎన్నిక కావడం ప్రత్యేకించి గమనార్హం.



రాజ్యాంగ పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, పరిషత్తు చర్యలలో డాక్టర్ రాధాకృష్ణన్ తరచు పాల్గొనేవారు కారని, పాల్గొన్న సందర్భాలలో మాత్రం ఆయన ప్రసంగాలను సభ్యులందరు భక్తిశ్రద్ధలతో వినేవారని వ్రాశారు. సరళమైన భాషలో ఉదాత్తమైన భావాలను వెల్లడించి, అందరి మన్ననలు పొందేవారని ప్రశంసించారు.

తాను అదృష్ట జాతకుడనని, ఏదో అదృశ్యశక్తి తనను నడుపుతున్నట్టుగా తనకు తోస్తూ ఉంటుందని నా సత్యాన్వేషణలో డాక్టర్ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఆయన జీవితంలో రెండు ముఖ్య సంఘటనలు ఆయనకేకాక దేశానికే, ప్రపంచానికే అదృష్ట దేవత ప్రసాదించిన రెండు వరాలుగా ఎన్నదగినట్టివే!

వాటిలో మొదటిది - ఆయన మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో చదువుతుండగా జరిగినట్టిది. అభిమాన శాస్త్రంగా దేన్ని యెన్నుకోవాలని తటపటాయిస్తూ ఉండగా, ఆ సంవత్సరంలోనే పట్టభద్రుడైన ఆయన బంధువొకరు తర్క, మానసిక, నైతిక శాస్త్రాలకు సంబంధించిన తన పాఠ్య గ్రంథాలను మూడింటిని ఆయన కిచ్చారు. ఆ సన్నివేశంలో ఆ బహూకరణ ప్రపంచానికొక మహాతత్వవేత్తను సమకూర్చింది.

కాగా, రెండవ సంఘటన - సామరస్య సన్నిహితత్వాలు నానాటికి పెరగడానికి మారుగా తరిగిపోతున్నట్టు కానవస్తున్న ఇండో-సోవియెట్ సంబంధ బాంధవ్యాలను చక్కబరచడానికి మాస్కోలో భారత రాయబారిగా ఎవరిని పంపించవలెనన్న ప్రశ్న 1949లో వచ్చినప్పుడు ప్రధాని జవహర్లాల్ నెహ్రూకు రాధాకృష్ణన్ పేరు స్ఫురించడం. పరమాస్తికవాది డాక్టర్ రాధాకృష్ణన్; పచ్చినాస్తికుడు మార్షల్ స్టాలిన్. ఈయన ఆధ్యాత్మికవాది; ఆయన భౌతికవాది. ఈయన మతాల పునరుద్దీపన ఆకాంక్షిస్తారు; ఆయన మతాలను సహించడమే వాటిపట్ల ఔదార్యాన్ని ప్రదర్శించడంగా భావిస్తారు. ఈయన అహింసకు, కారుణ్యానికి ప్రాధాన్య మిస్తారు; ఆయన

కార్యసాధనకై హింసను, కాఠిన్యాన్ని ప్రధాన సాధనాలుగా చేసుకొనడానికి లవలేశంగానైనా సంకోచించరు. ఈయన ప్రబోధం ద్వారా మానవులను మార్చాలంటారు; ఆయన ప్రబోధాని కివ్వని ప్రాధాన్యాన్ని ప్రహరణాలకిస్తారు. ఈ పరిస్థితిలో మార్షల్ స్టాలిన్ రాజ్యానికి రాయబారిగా పంపించడానికి డాక్టర్ రాధాకృష్ణన్ పేరు పండిట్ నెహ్రూకు తోచడం అదృష్ట విశేషమేకదా? ఈ రెండవ సంఘటన ప్రపంచానికి ఒక మహారాజ నీతిజ్ఞుని ప్రసాదించింది. Manual of Psychology by G.F. Stout, Logic by J. Welton, Manual of Ethics by J.S. Mackenzie.

స్టాలిన్ నిర్యాణం తర్వాతగాని ఇండో-సోవియట్ సంబంధ బాంధవ్యాలలో పూర్తి స్నేహ సుహృద్భావాలు నెలకొనలేదు. కాని, 1949లో మాస్కోకు భారత రాయబారిగా వెళ్ళిన డాక్టర్ రాధాకృష్ణన్ 1952లో తిరిగి వచ్చిన నాటికే ఇండియాపట్ల, దాని విదేశాంగ విధానాలపట్ల సోవియట్ ప్రభుత్వానికి అంతకు పూర్వమున్న అనుమానాలు చాలావరకు సమసిపోయాయి. ఈ పరివర్తనాన్ని సాధించడానికి డాక్టర్ రాధాకృష్ణన్ వినియోగించిన పద్ధతులు ఎంత వినూత్నమైనవో, అంత విశిష్టమైనవి. ఇక్కడవలె అక్కడకూడా తన మామూలు దుస్తులనే ఆయన వేసుకొనేవారు. (శీతాకాలంలో మాత్రం ఫర్కోటు, ఫర్ క్యాపు, ఫర్ బూట్సు వాడేవారు). ఇక్కడవలె అక్కడకూడా మత, తాత్త్విక చింతనలతో ఆయన కాలం గడిపేవారు. (మాస్కోలో ఉండగానే ఆయన ఉపనిషత్తులను ఇంగ్లీషులోకి అనువదించారు. ఇక్కడున్నప్పుడు చేసినట్టే అక్కడ ఉండగా కూడా సాలుకు మూడుసార్లు తడవకు ఎనిమిదివారాల చొప్పున - ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీకి వెళ్ళి, స్పాల్డింగ్ ప్రొఫెసర్గా తన విధులను నిర్వర్తించి వస్తూ ఉండేవారు. తక్కిన రాయబారులవలె ఏదో ఒక పని కల్పించుకొని, సోవియట్ విదేశాంగ కార్యాలయానికి చీటికీ మాటికీ యాత్రలు చేసేవారు కారు. సోవియట్ యూనియన్ లోని పరిస్థితుల గురించి తనకు తెలియవచ్చిన విషయాల సత్యాసత్య నిర్ధారణకు ఇతర రాయబారుల కార్యాలయాలకు ఎక్కే గడపకు, దిగే గడపకు అంతులేకుండా తిరిగేవారు కారు. సొంత ఆఫీసులోనైనా పట్టీ పట్టనట్టుగానే వ్యవహరించేవారు. ఢిల్లీకి అదేపనిగా నివేదికలు వ్రాసేవారు కారు.

సహోద్యోగులు చిత్తునివేదికలను వ్రాసి సమర్పిస్తే, వాటి తప్పులు దిద్దుతూ కూర్చునేవారు కాదు. చిన్న, పెద్ద విషయాలన్నింటిలో ఈ విధంగా తక్కిన రాయబారులవలె వ్యవహరించక పోయినా, కేవలం తన వ్యక్తిత్వ ప్రభావం ద్వారా ఆయన తనకు, తన దేశానికి ఘనవిజయాలను సాధించారు. వీటిలో అన్నింటికంటే గొప్ప విషయం ఉక్కు మనిషిగా చెల్లిన స్టాలిన్ గుండెలను కదలించడం; ఆయనలోనైనా కన్నీళ్ళు ఇంకిపోలేదని నిరూపించడం!

చాలా చెదురుగా తప్ప ఏ విదేశ రాయబారిని కలుసుకొనని మార్షల్ స్టాలిన్ - అంతకు ముందు భారత రాయబారిగా ఉన్న వ్యక్తిని ఒక్కసారి కూడా చూడని స్టాలిన్ - డాక్టర్ రాధాకృష్ణన్ మాస్కో చేరిన తర్వాత, తనకు అవకాశం లభించడమే తడవుగా, ఆయనను సంభాషణలకై ఆహ్వానించారు. ఆయన 1952 ఏప్రిల్లో స్వదేశానికి తిరిగి వస్తుండగా ఇట్టి ఆహ్వానమే మరొకటి పంపించారు. తిరిగి వెడుతున్న రాయబారిని స్టాలిన్ కలుసుకొనగోరడం అదే మొదటిసారి; బహుశా అదే చివరిసారికూడా.

రెండవసారి తమ సమావేశం జరిగినప్పుడు స్టాలిన్ ముఖం జబ్బుతో కొంత ఉబ్బి ఉన్నది. దీన్ని గమనించిన డాక్టర్ రాధాకృష్ణన్ ఆయన దగ్గరగా వెళ్ళి, బుగ్గలను చేతితో తడివి చూస్తూ పరామర్శించారు. తల నిమిరారు; వీపుపై ఆప్యాయంగా చేయివేశారు. తన సహజ ప్రేమాదరాలతో ఆయన చేసిన ఈ పని స్టాలిన్కు గుండెలను కదలించింది; ఆయన కళ్ళవెంట గిర్రున నీళ్ళు తిరిగాయి. "రక్కసిగా కాక, మానవునిగా నన్ను చూచిన ప్రథమ వ్యక్తి మీరే! మా దేశం నుంచి మీరు వెళ్ళిపోవడం నాకెంతో విచారం కలిగిస్తున్నది. మీరు చిరకాలంపాటు జీవించాలని నా కోర్కె నేను మరెన్ని రోజులో బ్రతకను" అని కన్నీళ్ళను దాచుకొనడానికి ప్రయత్నిస్తూ స్టాలిన్ అన్నారు. తర్వాత ఆరు నెలలకే ఆయన కాలధర్మం చెందారు.

మాస్కో నుంచి డాక్టర్ రాధాకృష్ణన్ తిరిగి వచ్చింది భారత ఉపాధ్యక్ష పదవిని స్వీకరించడానికి. ఆ పదవికి 1952లోనే కాక, 1957లో కూడా పోటీ లేకుండానే ఆయన ఎన్నిక జరిగింది.

తానొక మతానికి చెందినా అన్ని మతాలవారి ప్రేమకు ఆయనెంతగా పాత్రుడైనారో, తాను ఏ పక్షానికి చెందకపోయినా, అన్ని పక్షాలవారి గౌరవాన్ని ఎంతగా చూరగొన్నారో, పోటీలేకుండా రెండుసార్లు వైస్ ప్రెసిడెంట్గా ఆయన ఎన్నిక కావడమే నిరూపిస్తున్నది.

మన దేశంలో వలె యునైటెడ్ స్టేట్స్లో కూడా వైస్ ప్రెసిడెంట్ పదవి ఉన్నది. ఆ దేశంలో దీనికి ఏమంత ప్రాధాన్యం లేదు. వైస్ ప్రెసిడెంట్ పదవిని అవహేళన చేస్తూ ఒక హాస్య నాటకాన్ని ఆ దేశస్థులొకరు వ్రాశారు కూడా. మన దేశంలో తొలి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాధాకృష్ణన్ కావడంతో, ఆ పదవికి ఎంతో గౌరవం వచ్చింది; అమెరికా సంప్రదాయానికి భిన్నమైనది ఇక్కడ మనకు నెలకొన్నది.

అదివరలోనే ఎన్నోసార్లు భారతీయ చింతనకు, సంస్కృతికి, సభ్యతకు ప్రతినిధిగా పర్యటించిన డాక్టర్ రాధాకృష్ణన్ వైస్ ప్రెసిడెంటుగా ఈ పర్యటనలను మరింత విస్తారంగా కొనసాగించారు. ఈ కొత్త పర్యటనలలో ఆయన తత్త్వవేత్త విశ్వ విశాల దృక్పథంతో రాజనీతిజ్ఞుని కార్యవాదిత్వాన్ని మేళవించి పెక్కు మహోపన్యాసాలిచ్చారు. స్వతంత్ర భారత వాణిగానే కాక, నవ ప్రపంచవాణిగా మానవాళి ఆ మహోపన్యాసాలను పరిగణించింది. మన అలీన విధానం పట్ల అగ్రకూటాల వైఖరిలో క్రమంగా మార్పు రావడానికి డాక్టర్ రాధాకృష్ణన్ పర్యటనలు విశేషంగా తోడ్పడినాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు భంగం కలుగకుండా ప్రణాళికా బద్ధంగా జాతీయ జీవన పునర్ని ర్మాణాన్ని సాధించవచ్చునని లోకం గుర్తించడానికి సయితం ఇవి ఉపకరించాయి.



వైస్ ప్రెసిడెంట్ విధులలో ముఖ్యమైంది రాజ్యసభ సమావేశాలకు అధ్యక్షత వహించడం. దీని నిర్వహణలో సయితం తనకు తానే సాటిగా డాక్టర్ రాధాకృష్ణన్ రాణించారు. నా రాజ్యసభ సభ్యత్వ కాలంలో 1958 ఏప్రిల్ నుంచి 1962 ఏప్రిల్ వరకు ఆయన రాజ్యసభకు చెయిర్మన్. ఆయన అధ్యక్ష స్థానంలో కూర్చుంటేనే సభామందిరానికి కళాకాంతులు వస్తుండేవి. మాన్యత, ఉదాత్తత, విజ్ఞత, వివేకం, ఘనత, గాంభీర్యం ఆయనతోపాటుగానే సభామందిరంలోకి పాదం పెట్టేవి. ఆయన కన్నెత్తి చూస్తే అదే ఆజ్ఞ, ఆయన చేతితో సంజ్ఞ చేస్తే అదే ఆదేశం. కంట్రోల్ చేస్తున్నట్టు కనబడకుండానే ఆయన క్రమబద్ధంగా సభాకార్యక్రమాన్ని నడిపించేవారు. అయినా ఏ చర్చిలోనో, ప్రార్థనా మందిరంలోనో కానవచ్చే వాతావరణం సభామందిరంలో ఉండేది కాదు. చర్చ మధ్యలో ఛలోక్తులకు ఆయన అవకాశమిచ్చేవారు. సందర్భోచితంగా తాము కూడా కొన్ని ఛలోక్తులను విసురుతూ ఉండేవారు. సభ్యులను నవ్వించేవారు; తాము నవ్వేవారు. తలవని తలంపుగా తలయెత్తిన క్లిష్ట సన్నివేశాన్ని ఉద్రేకాలను ఒక చల్లని మాటతో, మెత్తని మందలింపుతో తగ్గించి వేసేవారు.

రాజ్యసభ నిజంగా "పెద్దలసభ"గా రూపొందింది డాక్టర్ రాధాకృష్ణన్ దానికి వరుసగా పదేళ్ళు అధ్యక్షతవహించి నందువల్లనే. ఈ పదేళ్ళలో నాలుగు సంవత్సరాలపాటు దాని సమావేశాలలో పాల్గొనగలగడం నా మహద్భాగ్యం.

* దీనిపేరు "Of Thee, I Sing" అని జ్ఞాపకం,

"తన సుదీర్ఘ ప్రజాహిత జీవితం నుంచి ఇండియా ప్రెసిడెంటుగా కొంత కాలంపాటు సేవచేయకుండా డాక్టర్ రాధాకృష్ణన్ విరమించి ఉంటే, ఇండియా లోకనిందను బహుశా తప్పించు కొనగలిగేదికాదు" అని "టైమ్స్" (లండన్) వ్రాసిన వాక్యంలో నేను చేయగోరే సవరణ "బహుశా" అనే పదాన్ని తొలగించడమే. ప్రెసిడెంటు పదవినుంచి తాను విరమించ గోరుతున్నట్టు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ప్రకటించిన తర్వాత కొన్నాళ్ళకు (1961 చివరిభాగంలో) నేను యూరప్ పైగా అమెరికాకు వెళ్ళడం, జపాన్పైగా తిరిగి రావడం జరిగింది. ఈ భూ ప్రదక్షిణంలో నేను పద్నాలుగు దేశాలను, దాదాపు నలభై మహానగరాలను సందర్శించాను. మూడు ఖండాలలో ఏ విశ్వవిద్యాలయ కేంద్రానికి వెళ్ళినా, భారత దేశంపట్ల, దాని సమస్యలపట్ల ఆసక్తిగల వారితో ఎక్కడ కొంతసేపు ముచ్చటించినా "మీ కొత్త ప్రెసిడెంట్ డాక్టర్ రాధాకృష్ణన్ కాదా?" అన్నమాటే వినవచ్చింది. అందువల్ల "టైమ్స్" సంపాదకీయానికి చాలా కాలం ముందే నేను గ్రహించాను, - మొత్తం ప్రపంచమే ప్రెసిడెంట్ రాధాకృష్ణన్ ఎన్నికకై ఎదురు చూస్తున్నదని.

లోకం ఎదురు చూచినట్టే భారత రాష్ట్రపతిగా ఎన్నికై, నిరుడు మే 13వ తేదీన డాక్టర్ రాధాకృష్ణన్ పదవీ స్వీకారం చేశారు. ఆనాడు దార్శనిక శాస్త్రాలకే గౌరవం జరిగినట్టు బెట్రెండ్ రస్సెల్ సంతసించారు. ఇదే విధంగా దేశదేశాలలో ఉపాధ్యాయులు విద్యారంగానికి, రచయితలు తమ కావ్య జగత్తుకు పట్టాభిషేకం జరిగినట్టు ఆనందించారు. "రాజ్యాలకు - రాజ్యాలకేకాక, మానవాళికే - కడగండ్లు తొలగడం, ఈ ప్రపంచంలో తత్త్వవేత్తలు రాజులైనప్పుడు; లేదా, ఇప్పుడు రాజులుగా, పరిపాలకులుగా చెల్లుతున్న వారు తత్త్వవేత్తలైనప్పుడు" అని రెండు వేల ఏండ్లకు పూర్వం ప్లేటో పలికిన పలుకులు ఆనాడు ఎందరికో జ్ఞప్తికి వచ్చాయి. తత్త్వవేత్తగా ఉండి రాజ్యాధికారానికి వచ్చిన మార్కస్ ఒరిలియస్ నాడు పాశ్చాత్య ప్రపంచానికి గుర్తురాగా, రాజవంశంలో పుట్టి తత్త్వవేత్తగా ప్రఖ్యాతి నందిన జనక మహారాజు భారతీయులకు గుర్తువచ్చారు.



రాష్ట్రపతిగా డాక్టర్ రాధాకృష్ణన్ పదవిని స్వీకరించిన నాడు ఆయనకు తన జోహారులర్పించడానికి "ఆంధ్రజ్యోతి" ఒక ప్రత్యేక సంచికను ప్రచురించగోరింది. నా ప్రియమిత్రుడు, ఎన్నదగు మేధావి, మౌలిక భావుకుడు, తత్త్వశాస్త్ర

# రచయిత, ఆచార్యుడు డాక్టర్ సచ్చిదానందమూర్తి




సహాయ సహకారాలతో ఈ సంకల్పం నెరవేరింది. తాను స్వయంగా ఒక బృహత్తర వ్యాసాన్ని వ్రాసి పంపించడమే కాక, తన మిత్రుల వద్ద నుంచి మరి మూడు వ్యాసాలను కూడా సంపాదించి ఆయన పంపించారు. ఇతర సందర్భంలో సయితం ఎంత అవ్యవధిగా నేను కోరినా, తన హార్దిక సహకారాన్ని నాకిస్తున్న డాక్టర్ మూర్తిగారికి నా కృతజ్ఞతా పూర్వక నమస్కారాలు. "ఆంధ్రజ్యోతి" ప్రచురించిన ప్రత్యేక సంచికను, దానిలోని వ్యాసాలను హర్షించిన పాఠకులనేకులు వాటిని పుస్తక రూపంలో పునర్ముద్రించవలసిందిగా కోరుతూ వచ్చారు. నిరుడు డాక్టర్ రాధాకృష్ణన్ జన్మదినోత్సవం నాటికే ఈ సంకలనాన్ని వెలువరించాలని అనుకొన్నానుగాని, అనేక కారణాలవల్ల అది సాధ్యపడలేదు. కనీసం ఇప్పటికైనా ఇది వెలువడుతున్నందుకు సంతోషిస్తున్నాను. మరి కొద్ది రోజులలోనే రానున్న రాష్ట్రపతి జన్మదినోత్సవంనాడు సెప్టెంబర్ 5వ తేదీని - దీని ప్రచురణ జరగనున్నది.

రాష్ట్రపతిగా డాక్టర్ రాధాకృష్ణన్ పదవిని స్వీకరించిన సందర్భంలో ఈ వ్యాసాల రచన జరిగినందున వీటి సంకలనానికి "రాష్ట్రపతి రాధాకృష్ణన్" అని పేరు పెట్టడం సముచితం కాగలదని నాకు తోచింది. ఆయన జీవితాన్ని, ఆయన భావాలను, ఆయన సందేశాన్ని గురించి వివిధ దృక్పథాల నుంచి వ్యాసాలు వ్రాసిన అయిదుగురు మిత్రులకు కృతజ్ఞత తెల్పుకొనడం నా ధర్మం. నా సూచనపై ఈ సంకలనాన్ని ప్రచురిస్తున్న ఆదర్శ గ్రంథమండలికి, ఇతర విధాల నాతో ఈ కృషిలో సహకరించిన వారికి కూడా నా నమస్కారాలు.

నేను ఆస్తికుడను కాను, నాస్తికుడను కాను; నాది "యాగ్నాస్టిక్" దృక్పథం. హిందువుగా జన్మించినా నన్ను నేను హిందువుగా భావించుకొనను; మానవతే నా మతం. కులదైవంలో ("పర్సనల్ గాడ్"లో) నాకు నమ్మకం లేదు. పూర్వజన్మలో గాని, పునర్జన్మలోగాని నాకు విశ్వాసం లేదు. హేతువాదాన్ని నేను అభిమానిస్తాను. దానికి పరిమితులున్నవని నాకు తెలుసు. మానవ జీవితంలో "ఇన్ట్యూషన్"కు స్థానం ఉన్నదని నేను అంగీకరించకపోను గాని, హేతువాద పరీక్షకు నిలవలేనిదాన్ని సత్యంగా నేను స్వీకరించలేను. డాక్టర్ రాధాకృష్ణన్ ప్రతిపాదించే మతసూత్రాలతో, దార్శనిక సిద్ధాంతాలతో ఈ విధంగా ఎన్నో విషయాలలో విభేదిస్తున్న నాకు ఆయనపట్ల గురుభావం దేనికి? ఆయన పట్ల భక్తి గౌరవాలు దేనికి? - ఈ ప్రశ్నలు అనేక

పర్యాయాలు నాకు నేనై వేసుకున్నాను. వాటికి సమాధానం : ఆయనను మించి మానవతా వికాసానికి కృషి చేస్తున్నవారు నేడు మరొకరు నాకు కానరాకుండడమే.

మానవునికి, మానవునికి మధ్య కృత్రిమ విభేదాలను కల్పించేది ఆయనకు మతమే కాదు. మానవుని శక్తులతోపాటు అతని దౌర్బల్యాలను కూడా పరిగణనలోకి తీసుకొని, అతడికి ప్రగతి మార్గాన్ని సూచించనిది ఆయనకు దార్శనిక శాస్త్రమే కాదు. అవిద్య నుంచి బయటపడిన నాడు, వివేకాన్ని వృద్ధి చేసుకొన్న నాడు, విద్వేషాలను తగ్గించుకొని, పరస్పరావగాహనకు ప్రయత్నించిన నాడు, ప్రేమకారుణ్యాలు ప్రబలిన నాడు ఈ వసుధ ఏకకుటుంబం కాగలదని ఆయన విశ్వాసం. "ప్రతి మానవుడు - అతని మతమేదైనా, సాంఘిక స్థితిగతులేవైనా పరమేశ్వరుని రూపంతో పుట్టినవాడే; పరమేశ్వరునికి ప్రియపుత్రుడుగా రాణించగల నిగూఢ శక్తులతో జన్మించినవాడే. మానవ వ్యక్తిత్వం పవిత్రమైంది. తన పురోభివృద్ధే చరమలక్ష్యం కావాలని కోరదగు హక్కు ప్రతి మానవునికి ఉన్నది. అందువల్ల జీవితానికి, స్వాతంత్ర్యానికి, భద్రతకు కూడా అతనికి హక్కులున్నాయి" ఇవి రాష్ట్రపతి రాధాకృష్ణన్ సుభాషితాలు. ఇంతకంటె స్పష్టంగా, శక్తిమంతంగా మానవతావాదాన్ని ప్రతిపాదిస్తున్నవారెవరు?

"నేను ఎథీనియన్ని కాను, నేను గ్రీకు కాను; నేను ప్రపంచ పౌరుడను" అని సోక్రటీస్ ఉద్ఘాటించాడు. ఇదే రీతిగా రాష్ట్రపతి రాధాకృష్ణన్ ఆంధ్రుడు కారు, దాక్షిణాత్యుడు కారు, భారతీయుడైనా కాదు. ఆయన ప్రపంచ పౌరుడు.

వివిధ మతాలమధ్య, విభిన్న దార్శనిక సిద్ధాంతాల మధ్య సామరస్య సాధనకు యత్నిస్తున్నట్టే, దేశాల మధ్య, జాతుల మధ్య, వర్గాల మధ్య, వర్ణాల మధ్య సమైక్యతాసాధనకు సయితం ఆయన కృషి చేస్తున్నారు. ఆయన దృష్టిలో గ్రీకులు లేరు, బార్బేరియన్లు లేరు, జ్యూస్ లేరు, జెంటైల్స్ లేరు; క్రిస్టియన్స్ లేరు, హీడెన్స్ లేరు; ముస్లిములు లేరు, కాఫిర్లు లేరు; హైందవులు లేరు, మ్లేచ్ఛులు లేరు; ఆర్యులు లేరు, అనార్యులు లేరు; ప్రాచ్యులు లేరు, అప్రాచ్యులు లేరు. మానవులందరు ఏకోదరులే; ఏకపథంలో మెట్టుతున్నవారే; ఏకగమనానికి చేరవలసినవారే! వారిలో ఏ ఒక్కరు వెనుకబడినా, హతాశులైనా, సృష్టి వికాసానికే విఘాతం; భగవత్సంకల్పానికే విరుద్ధం.

రాష్ట్రపతి రాధాకృష్ణన్ "అద్వైతవాది" అని కొందరంటారు. శంకరాద్వైతంతో, రామానుజా చార్యులు విశిష్టాద్వైతాన్ని కొంతవరకు మేళవింపజేస్తున్నారని కొందరంటారు. "వేదాంత పరిభాషను వాడినా ఆయన మానవవాది మాత్రమే" అని నేనంటాను. మానవాళితో, దాని ప్రగతితో, దాని భవిష్యత్తుతో అవినాభావ సంబంధాన్ని కోరుకొంటారు గనుకనే రాష్ట్రపతి రాధాకృష్ణన్ తన వ్యక్తిగత జీవితాన్ని గురించి ప్రస్తావించడానికిచ్చగించరు. ఒక వ్యక్తి ప్రాపంచిక జీవిత వివరాలకంటె అతని మనోభావాలే, అతని ఆంతరంగిక వికాసమే ముఖ్యమైనవని ఆయన నమ్ముతారు.

మానవతే తమ మతమని చెప్పుకొనేవారిలో సయితం కొందరు మానవ సమూహాన్ని ఒక భావనగా ప్రేమిస్తారే తప్ప, మానవులను వ్యక్తులుగా ప్రేమించలేరు. వీరి కోవకు చెందరు.

రాష్ట్రపతి రాధాకృష్ణన్. వ్యక్తిని వ్యక్తిగానే ఆయన ఆదరిస్తారు. ప్రేమిస్తారు, గౌరవిస్తారు. వారి సాంఘిక ప్రతిపత్తితో, వారి ఆర్థిక స్థితిగతులతో నిమిత్తం లేకుండా, అందరినీ సమానంగా చూస్తారు. ఒక్కసారి పరిచయమైన వారి పేరునైనా సర్వసాధారణంగా మరచిపోరు. పెక్కేండ్ల తర్వాత కలుసుకొన్నా, యోగక్షేమాలను వివరంగా అడిగి తెలుసుకొంటారు. అందువల్లనే కొన్ని వేలమందికి - లక్షల మందికి కూడా కావచ్చునేమో తామంటే ఆయనకు ప్రత్యేక ప్రేమాదరాలున్నాయనే సంతృప్తి, సంతోషాలు కలుగుతూ ఉంటాయి.





మానవతావాది విధిగా ప్రజాస్వామ్యవాది కావాలి. రాష్ట్రపతి రాధాకృష్ణన్ కోరేది ప్రజాస్వామ్య వ్యవస్థనే. అది సమాన స్వాతంత్ర్యంతోపాటు, సమానావకాశాలతోపాటు, సాంఘిక న్యాయాన్ని చేసే వ్యవస్థ కావాలనికూడా ఆయన కోరుకొంటారు.

కమ్యూనిజం ప్రధాన లక్ష్యాలతో ఆయనకు కలహంలేదు. "ఎవరిశక్తి ప్రకారం వారు పాటుపడాలి; ఎవరి అవసరాల ప్రకారం వారు అనుభవించాలి" : ఈ సూత్రాన్ని ఆయన హర్షిస్తారు, ఆమోదిస్తారు. కూడుగుడ్డలను పోలిన ప్రాథమిక జీవితావసరాలకు అలమటించవలసిన దుస్థితి నుంచి ప్రజా బాహుళ్యం బయటపడనంతవరకు మానవజీవితం సర్వతోముఖ వికాసం చెందలేదని ఆయన విశ్వసిస్తారు. ఈ ప్రాథమికావశ్యకతల విషయమై బాధ్యత వహించడం సముచితమని ఆయన భావిస్తారు. సమానాదాయ సూత్రాన్ని సమర్థించరుగాని, ఆర్థిక స్థితిగతులలో విపరీత వ్యత్యాసాలు రాజకీయ స్వాతంత్ర్యాన్ని నామమాత్రం చేస్తాయని, ఆ పరిస్థితిలో సాంఘిక న్యాయం జరగదని హెచ్చరిస్తారు. అయితే ఆర్థిక, సాంఘిక న్యాయసాధనకై రాజకీయ స్వేచ్ఛను, పౌరసత్వాలను బలిపెట్టడానికి సమ్మతించరు. వర్గవిభేదాల నిర్మూలం పేరుతో నియంతృత్వ సంస్థాపనను విమర్శిస్తారు.

రాష్ట్రపతి రాధాకృష్ణన్ రాజకీయాదర్శం ప్రజాస్వామ్యబద్ధమైన సోషలిజం. దీని సాధనకు కీలక పరిశ్రమలను జాతీయం చేయడాన్ని ఆయన సమర్థిస్తారు. ఆయన సాంఘికాదర్శం - మానవునికి, మానవునికి మధ్య ఏ విధమైన కృత్రిమ విభేదాలను గుర్తించక, ప్రతివ్యక్తికి అతడి శక్తిననుసరించి, సంస్కృతి ననుసరించి మానసికంగా, నైతికంగా పురోభివృద్ధి చెందడానికి అవకాశ మిచ్చే సమాజం.

ప్లేటో ఆదర్శ రాజ్యం కంటే ఇదే న్యాయమైనది, ఉత్తమమైనది, ఉదాత్తమైనది. దానిలో కంటె దీనిలో స్వాతంత్ర్యం హెచ్చు, సమానత్వం హెచ్చు, సౌహార్దం హెచ్చు, సౌజన్యం హెచ్చు. ఈ రాజ్యాన్ని గురించి, ఈ

లక్ష్యాలను గురించి రాష్ట్రపతిగా ఈనాడేకాక, దాదాపు మూడు, నాలుగు దశాబ్దాలుగా ఆయన ప్రబోధిస్తున్నారు.



1935లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చేసిన స్నాతకోపన్యాసంలోనే ఆయన ప్రజాస్వామ్యబద్ధమైన సోషలిజం భావాల శంఖాన్ని పూరించారు. కాగా, అంతర్జాతీయ రంగంలో జాతీయ సర్వసత్తాక భావ ప్రాబల్యాన్ని ఆయన ప్రతిఘటిస్తారు. సైన్సులో, టెక్నాలజీలో ఆధునిక మానవుడు సాధించిన అద్భుతవిషయాల కారణంగా దేశాలు దగ్గరకు వచ్చాయి. ఖండాలే ఏకమౌతున్నాయి. ఇదివరకు కలలోనైనా ఊహించి యెరుగని శక్తి సంపదలకు ఈనాడు మానవుడు నాధుడైనాడు. ఇదే సమయంలో అతడు భూతలంపై తన మనుగడకే ప్రమాదాన్ని సంఘటింప జేయగల ముప్పులను సృష్టించుకొన్నాడు కూడా. నవజీవనమో, సర్వవినాశనమో ఈ రెండింటిలో దేనినైనా వరించగల స్థితిలో నేడు అతడున్నాడు. మానవ చరిత్రలోనే అపూర్వమైనది ఈ సన్నివేశం.

జాతీయ సర్వసత్తాక ప్రతిపత్తికి లేనిపోని ప్రాధాన్యమిచ్చినా, జాతివర్గ విభేదాలను వెర్రితలలు వేయనిచ్చినా, సిద్ధాంతాల విరోధాన్ని, సాంఘిక వ్యవస్థల వైరుధ్యాన్ని యుద్ధం ద్వారా పరిష్కరించుకొన జూచినా, మానవాళి స్వరూపం నాశనమైపోతుంది. అందువల్ల జాతీయతకు కాక, అంతర్జాతీయతకు ప్రాధాన్యమివ్వాలి; ప్రపంచ రాజ్యావతరణకు కృషి చేయాలి. పరస్పర సహాయసహకార ప్రాతిపదికలపై భాగ్యవంత దేశాలకు, నిరుపేద దేశాలకు మధ్య అంతరాన్ని తొలగించడానికి యత్నించాలి. సహజీవనానికి సమ్మతించకపోతే, సర్వవినాశనానికి సన్నద్ధపడక తప్పదని గుర్తించాలి.


ప్లేటో లక్షించినట్టిది ఒక నగరానికో, ఒక ప్రాంతానికో పరిమితమైన ఆదర్శ రాజ్యం. ఆయన కాలానికి అది విశిష్ట లక్ష్యంకాగా, ఈ కాలానికి తగినట్టు సమస్త ప్రపంచానికే ఒక ఆదర్శ రాజ్య సంస్థాపన ఈయన ప్రతిపాదిస్తున్నారు. అందువల్లనే ఈయన ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్లకు బ్రిటన్, అమెరికాలకు పర్యటించడానికి ఇటీవల వెళ్ళినప్పుడు భారత రాష్ట్రపతిగా మాత్రమేకాక, ప్రపంచానికే ఒక ఆచార్యవర్యునిగా, ఒక దేశికోత్తమునిగా సన్మాన, సత్కారాలు చేశారు.

గాంధి, టాగోర్, నెహ్రూల ప్రేమగౌరవాలను సమానంగా పొందిన మహనీయుడు ఈనాడు మన రాష్ట్రపతిగా ఉండడం మన అదృష్ట విశేషం. స్టాలిన్ ను ఎంతగా కరిగించారో, కృశ్చేవన్ను అంతగా అలరించగలిగిన సౌజన్యమూర్తి మన రాష్ట్రపతి కావడం మన మహద్భాగ్యం. విశ్వభారతి "దేశికోత్తముడు"గా, సింహళం "విద్యా చక్రవర్తిగా", మంగోలియా "జ్ఞానయోగి"గా, "మాస్టర్ ఆఫ్ విజ్డ్మ్", ఇండియా "భారతరత్న"గా, జర్మనీ, "ప్రాక్పశ్చిమాల మధ్య మహాసేతువు"గా మన్నన చేసిన సర్వజన వంద్యుడు మన ప్రజాస్వామ్యంలో ప్రథమపౌరుడు కావడం మనకు గర్వకారణం.

ఏ పదవిని ఆక్రమించినా, దానికి తన నిరాడంబరత్వంతో, నిశ్చలచిత్తంతో, విశాల దృష్టితో, ఉదాత్తవర్తనతో మనతను తెచ్చే మహామనిషి మనకు ప్రెసిడెంట్ కావడం మన ముప్పొంగవలసిన విషయం. రాష్ట్రపతి రాధాకృష్ణనక్కు నా జోహారులు.

## గాంధీ జయంతి - 1

గాంధీజీ ఒక వ్యక్తికాదు; ఒక సంస్థ. ఒక సంస్థ కూడా కాదు; ఒక తేజస్సు; ఒక ఓజస్సు.
కేవలం ఒక వ్యక్తిగా ఆయనను సంభావిస్తే, కేవలం ఒక సంస్థగానైనా ఆయనను పరిగణిస్తే, ఆయనకు స్వదేశంలోనే కాకుండా, ఖండఖండాంతరాలలో సైతం ఈనాడు గల ఈ అశేష అనుచర కోటికి అర్థమే చెప్పుకోలేముగదా?



గాంధీజీని భావన చేసినప్పుడు స్ఫురణకు వచ్చే అన్యులు వాషింగ్టన్, మాజినీ, గారిబాల్డీ, కసూత్, లెనిన్, సనెట్ సెన్ ప్రభృతులుకారు; గౌతమబుద్ధ, ఏసుక్రీస్తులే!

ఈ కాలంలో జన్మించినాడు గనుక, ప్రకృతి యుగ ధర్మాన్ని అనుసరించి, గాంధీజీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ, పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయక, విద్యావిషయక సమస్యలను గురించి ప్రబోధిస్తున్నాడే గాని, ఏ వెయ్యి సంవత్సరాలనాడో అవతరించి ఉంటే, ఏ వృక్షచ్ఛాయలోనో ఆసీనుడై బుద్ధ భగవానుని వలె, ఏ పర్వతాగ్రంపైనో ఉతితుడై ఏసుక్రీస్తువలె కేవలం సత్యం, అహింసలను గురించి బోధించి ఉండేవాడేమో!

బుద్ధునివలె, క్రీస్తువలె గాంధీజీ ప్రధాన సందేశం సత్యం, అహింసలే. కాని, ఆ ప్రాచీన సందేశాన్ని ఆధునిక యుగధర్మంతో - దాని అవసరాలతో - మిళితం చేయడం గాంధీజీలోని ప్రత్యేకత; విశిష్టత.

పదేళ్ళనాడు - ఐదేళ్ళనాడు - తుదకు ఏడాదినాడు కూడా - గాంధీజీ కేవలం స్వప్నజగత్తులో నివసిస్తున్న వాడని, ఆయన సందేశం ఏ కృత, ద్వాపర, త్రేతాయుగాలకు ఉపకరించవలసిందేగాని, ప్రకృత యుగానికి తోడ్పడగలిగినది కాదని కొందరు భావించడానికి ఆస్కారం లేకపోలేదు. కాని, యాటంబాంబు సృష్టితో గాంధీజీ సందేశం విన్నా ప్రపంచానికి దారిలేదని; మానవకోటికి దిక్కులేదని నిరూపితం కాలేదా?

మానవ ప్రవృత్తి పరిపూర్ణంగా పరివర్తనం చెందనంతవరకు, ప్రతి వ్యక్తిలో దేవత్వం ప్రవేశించనంత వరకు దేశానికి దేశానికి మధ్య - జాతికి జాతికి మధ్య - వర్గానికి వర్గానికి మధ్య విభేదాలు రాకపోవు; స్పర్ధలు పెరగకపోవు; సంఘర్షణలు ఉప్పతిల్లకపోవు! ఈ సంఘర్షణలు యుద్ధ స్వరూపాన్ని ధరించకపోవు కూడా.

ఎందరు మహనీయులు ఎంతటి ఉత్తమ సందేశమిచ్చినా, మానవ ప్రవృత్తి పరిపూర్ణంగా పరివర్తనం చెందడమేమి, విభేదాలు రాకపోవడమేమి, స్పర్ధలు ఉత్పన్నం కాకపోవడమేమి, యుద్ధాలు చెలరేగక పోవడమేమి దాదాపు అసంభవం. అహింసను బోధించిన అస్తికల కోసం ఆయన శిష్యులు తమలో తాము పోరాడారు. అహింసను బోధించిన ఏసుక్రీస్తు నివసించిన జెరూసలెంపై అధికారం కోసం ఆయన అనుచరులు మహమ్మదీయులపై యుద్ధం చేశారు.

విభేదాలు రావడమేమి, స్పర్ధలు పెరగడమేమి, సంఘర్షణలు తప్పక పోవడమేమి మానవ ప్రకృతిలోనే గర్భితమై ఉన్నదని గుర్తించినప్పుడు, హింసాకాండను వర్జింపజేయగల ఒక వివాద పరిష్కార మార్గాన్ని చూపించడం అవసరం. సత్యాగ్రహ పద్ధతిని చూపించడం ద్వారా, బుద్ధుని బోధనలను, ఏసుక్రీస్తు సందేశాన్ని గాంధీజీ ఒక ఉత్తమ పరిణతికి తెచ్చాడు.

సమస్త ప్రపంచం, సర్వజాతులు ఈ సత్యాగ్రహ విధానాన్ని అనుసరించకపోతే, యాటంబాంబు కారణంగా ఈసారి యుద్ధం వచ్చినంతనే మానవజాతికి సర్వ విధ్వంసనం తప్పదు; స్వరూప నాశనం తప్పదు.

అంచేత గాంధీజీ సందేశం - ఆయన విధానం ఈనాడు సమస్త ప్రపంచానికే! సర్వ మానవకోటికే! అంచేత, ఆయన జన్మదినోత్సవం - పర్వదినం కావలసింది భారతీయులకు మాత్రమే కాకుండా, సమస్త ప్రపంచానికే! సర్వ మానవజాతికే!

స్వజాతిని, స్వదేశాన్ని అహింసా సిద్ధాంతం ద్వారా, సత్యాగ్రహ విధానం ద్వారా స్వాతంత్ర్య ప్రాంగణంలోకి తెచ్చి, తన సిద్ధాంతపు, తన విధానపు అమోఘత్వాన్ని గాంధీజీ లోకానికి నిరూపించాడు.

"గాంధీజీ దివ్యవాణి ననుసరించడమా? లేక, మరొక ప్రపంచ యుద్ధానికి యాటంబాంబులను సిద్ధం చేసుకొనడమా?" ఇవే ప్రతి సభ్యతా మానవుడు తనను తాను వేసుకొనవలసిన ప్రశ్నలు. వీటిలో మొదటిది శాంతికి, సౌఖ్యానికి, భవితవ్యానికి మార్గం; రెండవది మారణ హోమానికి, సర్వ వినాశనానికి మార్గం.

(ఆంధ్రప్రభ 2-10-1946)

## 2. భారత ప్రముకులు


### గాంధీ జయంతి - 2

ఆయనకు కంటి చూపు తగ్గింది. కాని, నేటి దేశ పరిస్థితులను సునిశితంగా చూడగలుగు తున్నది ఆయనొక్కడే.

ఆయన కాలు, చేతులకు వణుకు పుట్టింది. కాని, కర్తవ్య పథాన్ని మెట్టడంలో నేటికీ దేశం మొత్తంపై ఆయనదే ముందడుగు. ఆయన శరీర పటుత్వం పూర్తిగా సన్నగిల్లింది. ఐనా, లక్ష్యబలంలో ఆయనే మిన్న.
దేహ దారుఢ్యం తగ్గినకొద్దీ ఆయనలో మనో దారుఢ్యం హెచ్చుతుంది. మనోదారుఢ్యం కంటే మిన్నగా ఆత్మశక్తి పెంపొందుతుంది. నానాటికి ఇతోధిక శక్తితో, దీప్తితో, ప్రతిభతో, విజ్ఞతతో ఆయన విలసిల్లుతున్నాడు.

ఇది చిత్రంగా తోచవచ్చుగాని, నిజం. నిజాన్ని మించిన చిత్రం లోకంలో సర్వసాధారణంగా కానరాదుకూడా. గాంధీజీ వలె ఇంతటి విశిష్టతను ప్రదర్శించ గలిగినవారు ప్రపంచ చరిత్రలోనే బహు అరుదు. ఈ అక్టోబరు 2వ తేది మహాత్ముని 79వ జన్మదినోత్సవమని సందర్భోచితంగా ఇది అతిశయోక్తులను పలకడం కాదు.
ఈనాడు గాంధీజీ కంటే స్పష్టంగా సత్యాన్ని గుర్తిస్తున్న వారెవరు? దాన్ని ఉదోషిస్తున్న వారెవరు? దాన్ని ఆచరించడానికి యత్నిస్తున్న వారెవరు?

దేశ విభజన మహానర్థదాయకమైనదని తుది వరకు ఆ యత్నాన్ని శక్తివంచన లేకుండా ప్రతిఘటించినవాడు ఆయనే.



బ్రిటీషు వారి "క్విట్ ఇండియా" ప్రణాళిక పరిమితులను గుర్తించి, వాస్తవిక స్వాతంత్ర్యం ఈనాటికీ మనకు లభ్యం కాలేదని చెప్పినవాడు కూడా ఆయనే.

లభ్యమైన స్వాతంత్ర్యానికి దేశం ఉబ్బితబ్బిబ్బులై పోతుండగా, పర్వదినోత్సవ కారణమేమీ లేదని ఆగస్టు 15వ తేదీని నిరశన వ్రతంతో గడిపినవాడు ఆయనే.

మతాన్ని రాజకీయాలతో జోడించడం వల్లనేమి, మత విభేదాలు ప్రాతిపదికగా దేశ విభజన జరగడం వల్లనేమి, ఎట్టి మహోత్పాతాలు జరగగలవో ముందే ఊహించి, మత సామరస్య సాధనకై పదేపదే ప్రాణాలను ఒడ్డినవాడు ఆయనే.

హిందూస్థాన్ హిందువుల రాజ్యంకాదని - కారాదని - ఉచ్చైస్వరంతో ఉద్ఘాటిస్తూ వచ్చింది ఆయ కిసాన్, మల్దూర్ ప్రజారాజ్యం ఏర్పడనినాడు ప్రజలే పరిపాలకులు కానినాడు స్వాతంత్ర్యమే లేదని బోధిస్తుంది ఆయనే.

ఒక్కమాటలో, నేడు నిత్య నూతన విప్లవ దృక్పథాన్ని ప్రదర్శిస్తుంది ఆయనే.

వర్ణాశ్రమ ధర్మాలను సమర్థిస్తూ వచ్చినవాడు, కుల విభేదాలు తొలగకపోతే, హిందూ సంఘానికి భవితవ్యమే లేదని చెప్పనారంభించాడు.

ఆస్తిపై హక్కులకు సంబంధించిన పాత నియమాలను మన్నించేవాడని లోకం సంభావిస్తూ ఉండగా, "దున్నే వానిదే భూమి" అని ప్రతిపాదించసాగాడు.

కాంగ్రెసుపై మమకారం కలవాడని లోకం ఒకవేళ భ్రమపడి ఉంటే, కాంగ్రెసు వారిలోనేమి, తద్వారా కాంగ్రెసు సంస్థలోనేమి, నేడు అక్కడక్కడ కొంతవరకు కానవస్తున్న అవినీతి విషయమై నిర్దాక్షిణ్య విమర్శకు దొరకొన్నాడు.

అందువల్లనే నేటి ఉన్మత్త దేశంలో ఆయన అతి స్థిరచిత్తుడు; నేటి ఉద్రిక్త పరిస్థితులలో ఆయన అతి ప్రశాంత హృదయుడు; నేటి నిస్పృహాంధకారంలో ఆయనే ఆశాజ్యోతి. అందుకే సమస్త ప్రజానీకం ఆయనపై కళ్ళన్నీ పెట్టుకుంది. ఆయన జీవించివుండగా ఇండియా మరణించదు. ఇండియా మరణిస్తే ఆయన జీవించదు.

(ఆంధ్రప్రభ 2-10-1947)

## గాంధీయిజం (గ్రంథ సమీక్ష)

కొందరి విషయంలో గాంధీయిజం మూఢభక్తి, కొందరి విషయంలో కపటనటన, కొందరి విషయంలో లాభసాటి వ్యాపారం. కొందరి విషయంలో సంఘాన్ని ముందుకు కాక, వెనుకకు నడిపించడానికి ఉపకరించగల మార్గం.

కాగా, గాంధీని సరిగా అర్థం చేసుకోగలుగుతున్నవారు, ఆయన సిద్ధాంతాలకు సరైన భాష్యం చెబుతున్నవారు, ఆయన నిర్దేశించిన మార్గాన సరిగా నడుస్తున్నవారు బహు కొద్దిమంది మాత్రమే. అట్టివారిని నిజానికి ఒక చేతివేళ్ళపై లెక్కించవచ్చునేమో!

గోపాలకృష్ణ గోఖలేను తన రాజకీయ గురువుగా గాంధీజీ ప్రస్తుతించాడు, అట్టి గోఖలేకే గాంధీజీని అర్థం చేసుకొనడం సాధ్యం కాలేదు.

రవీంద్రనాథ్ టాగోర్ను "గురుదేవుడు"గా గాంధీజీ సంబోధించాడు. అట్టి టాగోర్కే గాంధీజి అంతు చిక్కలేదు.



రైట్ ఆనరబుల్ శ్రీనివాస శాస్త్రిని "అనన్యుడు"గా గాంధీజీ సంభావించుకున్నాడు. అట్టి శాస్త్రికే గాంధీజి భావాలు కొరుకుడు పడలేదు.

జవహర్లాల్ నెహ్రూను తన "రాజకీయ వారసుడు"గా గాంధీజీ ఒక అనిర్వచనీయ శక్తిగా తోచాడు. అయినప్పుడు తక్కినవారు ఆయనను అపార్థం చేసుకోవడం, ఆయనను గురించి అయోమయపు రాతలు రాయడం ఆశ్చర్యకరం కాదు, కానక్కరలేదు. పోతే, ఈ స్వామి పేరు చెప్పి, ఆ యోగి పేరు చెప్పి, ఈ మహాపురుషుని పేరు చెప్పి, ఆ మహాత్ముని పేరు చెప్పి వ్యాపారం సాగించేవారి సంఖ్య ఈనాడే కాదు, ఆనాడు కూడా మన దేశంలో తక్కువ కాదు. అందువల్ల అన్ని వ్యాపారాలతోపాటు గాంధీయిజం ప్రస్తుతం అనేకులకు ఒక లాభసాటి వ్యాపారంగా మారింది. గాంధీకి, గాంధీయిజానికి ఇన్ని విధాల ఘోరాన్యాయాలు జరుగుతున్న ఘట్టంలో శ్రీ టి.కె. మహదేవన్ రచన - "గాంధి, మై రిఫ్రెయిన్" అనే పేరుతో వెలువడిన రచన చదవగలిగినందుకు మేము సంతోషిస్తున్నాము. ఇది శ్రీ మహదేవన్ వివిధ సమయాలలో, విభిన్న సందర్భాలలో గాంధీజీని గురించి, గాంధీయిజాన్ని గురించి రాసిన వ్యాసాల, ప్రసంగాల సంకలనం.

సమస్య ఏదైనా అన్ని వ్యాసాలకు, ప్రసంగాలకు శ్రీ మహదేవన్ "పల్లవి" గాంధి మాత్రమే. తన సంకలనానికి "గాంధి నా పల్లవి" అని ఆయన పేరు పెట్టడం ఎంతైనా సముచితం. (పాప్యులర్ ప్రకాశన్, తార్దేవ్ రోడ్, బొంబాయి-34, ఈ సంకలనాన్ని ప్రచురించారు. దీని వెల 28 రూపాయలు.

గాంధీపట్ల మూఢభక్తిని ప్రదర్శిస్తున్న వారికి శ్రీ మహదేవన్ గ్రంథం ఒక చెంపపెట్టు; గాంధీయిజాన్ని వ్యాపారంగా మార్చుకున్న వారిపై అది ఒక గొడ్డలిపెట్టు.




గాంధీజీని గురించి, ఆయన సిద్ధాంతాలను గురించి రాసే వారిలో పెక్కుమంది పూర్తిగా గాంధీజీ రచనలనైనా చదవరు. ఆయన సుభాషితాల సంకలనాలపైనే వారు ఆధారపడతారు. పైగా, ఆధునిక ప్రపంచంతో, అధునాతన భావసరళితో వారికి సంబంధం పూజ్యం, లేదా నామమాత్రం. ఇందువల్ల వారి రచనలు పేలవంగా ఉంటాయి. ఏ సమస్య పైన అవి కొత్త వెలుగును ప్రసరింపజేయవు; కనీసం ఒక కొత్త భావాన్ని మనలో రేకెత్తించవు.

ఇందుకు భిన్నంగా శ్రీ మహదేవన్ గ్రంథంలో ప్రతి పుట మన మనస్సులకు ఉద్దీపన కలిగిస్తుంది. ఆయన భావాలన్నింటితో కూడా ఏకీభవించవచ్చు. ఏకీభవించలేక పోవచ్చు. అయినా, అవి మౌలిక భావాలు, స్వతంత్ర భావాలు, నిర్భీక భావాలు. అవి ఆధునిక చింతనా సౌరభంతో కూడిన భావాలు. విస్తృత లోకజ్ఞానం వెన్నెముకగా కలిగిన భావాలు. ఇంతేకాదు, విక్టోరియన్ ఇంగ్లీషులో సూటిగా, సుందరంగా వెల్లడించబడిన భావాలు.

శ్రీ మహదేవన్ లో మనకు అచ్చెరువు కలిగించే గుణం ఆయన భావసంపద. ఈ గుణాన్ని ఆయన "భావ చాంచల్యం"గా చులకన చేసుకున్నా డనుకోండి. భావాలకు సంబంధించినంత వరకు తనది "వ్యభిచారిణీ ప్రవృత్తి" అని చెప్పుకున్నా డనుకోండి. "ఒక భావంతో నేను శయనించి, మరొక దానితో మేల్కొంటాను" అని చెప్పుకున్నా డనుకోండి. చాంచల్యం కాదు, భావ సంపద, భావ ప్రౌఢిమ, భావ శబలత. ఐనా, అది భావ గాంధేయులుగా చెల్లుతున్న వారిపై ఎన్నో విసురులున్నాయి కాబట్టి, వారిలో పెక్కుమందికి శ్రీ మహదేవన్ రచన మనస్కరించకపోవచ్చు. ఐనా, గాంధీయిజాన్ని ఒక మతంగానో, ఒక మఠంగానో పరిగణించేవారు తప్ప తక్కినవారు, ముఖ్యంగా మౌలిక చింతనను ఆహ్వానించేవారు దాన్ని మెచ్చుకుంటారు. ఒక సజీవ సిద్ధాంతంగా సమాజానికి నూతన రూపమిచ్చి, దాన్ని నూతన మార్గాలవెంట నడపగల సిద్ధాంతంగా గాంధీయిజం మిగలవలెనంటే, దానికి కాలానుగుణంగా అర్థం చెప్పుకోవాలి. ఇంతేకాదు, కాలానుగుణంగా దానిలో మార్పులను,చేర్పులను ప్రవేశపెట్టాలి. దానిలో కాల పరిణామాలకు వ్యతిరేకంగా నిలుస్తున్న భాగాలుంటేవాటిని త్రోసిపుచ్చాలి. అప్పుడే అది తన విప్లవాత్మక ప్రవృత్తిని కాపాడుకోగలుగుతుంది. ఇందుకు శ్రీ మహదేవన్ రచనలను పోలినవి తోడ్పడతాయి.

(ఆంధ్రజ్యోతి 9-7-1973

## బాపూజీ




ఆవురుమని ఒక్కసారి రోదించ గలిగితే, గుండె బరువు తగ్గవచ్చు; ఆలోచన తట్టవచ్చు. కలం సాగవచ్చు.

కాని, కన్నీటికి మించిన దుస్సంఘటన, కేవలం గుండెలనే కాకుండా ప్రతి రక్తాణువును భగ్గుమనజేసే విషాదోదంతం. ఆ మంటకు కన్నీటి సముద్రమైనా ఇంకిపోవలసిందే.

బాపూజీకేమి? ఆయన అమృతమూర్తి; అమరజీవి. సూర్యచంద్రులు గతులు తప్పనంతవరకు ఆయన మానవ హృదయాలలో జీవిస్తూనే ఉండగలడు. కాని, మన మాటేమిటి?

తండ్రిని చంపుకొనడమా? గురువును పొట్టబెట్టుకొనడమా? మనం సమానవులమేనా?

ఈ సిగ్గును మనం ఎలా భరించగలం? ఈ కష్టం నుంచి ఎలా గట్టెక్కగలం? మనకు ఏమి దిక్కు? ఏది దారి?

అబ్బ! ఎంత చీకటి! గుండెలపై ఎంత పెద్దరాయి!!

ఉహు! ఇక రాయలేము. చేతి నుంచి కలం జారి... (ఆంధ్రప్రభ 1-2-1948)

## మహాకళంకం

పిడుగు పడితే పాడైపోయేది ఒక ఊరో, ఒక వాడో. అగ్నిపర్వతం బ్రద్దలైతే బూడిదయ్యేది ఒకటి, రెండు పరగణాలే. భూకంపం సంఘటిస్తే సంక్షోభించేది ఒక రాష్ట్రమో," ఒక దేశమో. ప్రకృతి ప్రదర్శించే ఈ భయానక రూపాలకంటే శతాధికంగా - కాదు, సహస్ర గుణాల భయానకమైనట్టిది గాంధీజీ హత్య. అందువల్లనే సమస్త ప్రపంచం ఈనాడు దుఃఖాగ్నికీలల్లో వ్రేగి పోతుంది; విషాదోద్వేగ తీవ్రతతో సంక్షుభితమై పోతుంది.



గాంధీజీ హిందువు. కాని, ఆయన నిర్యాణానికి లభిస్తుంది కేవలం హిందువులే కాదు; అన్ని మతాల వారు. జన్మవల్ల ఆయన హిందువు కావచ్చు. ఐనా, అన్ని మతాల మూల సిద్ధాంతాలు ఆయనలో పరాకాష్ఠ చెందినవి. అంచేతనే ఆయన హత్యకు గురికావడం ప్రతి మతానికి లజ్జాకరమైన విషయమే.

గాంధీజీ భారతీయుడు. కాని, ఆయన అస్తమయానికి దురపిల్లుతుంది భారతదేశమే కాదు; చైనా నుంచి పెరూ వరకు సమస్త ప్రపంచం ప్రధానంగా ఆయన కార్యరంగం భారతదేశమే అయివుండవచ్చు. కాని, ఆయన లక్ష్యం భారతదేశోన్నతి మాత్రమే కాదు; సమస్త మానవకోటి కళ్యాణం. ఈ విషయాన్ని ఆయన జీవితకాలంలో గుర్తించనొల్లనివారు సైతం ఆయన ఆత్మార్పణం తర్వాత గుర్తించక తప్పడంలేదు. ఆ కారణానే అన్ని దేశాల వారికి అన్ని జాతుల వారికి ఆయన హతాన్మరణం హృదయావేదనగా పరిణమించింది.

శ్రీకృష్ణుడు, గౌతమ బుద్ధుడు, కన్ఫ్యూసియస్, జొరాష్టర్, ఏసుక్రీస్తు మొదలైన మహాప్రవక్తల నిర్యాణ సందర్భంలోనైనా లోకం ఇంతగా విషణ్ణం చెందలేదనడం అత్యుక్తి కాబోదు.

గాంధీజీ ఏ పాత మతాన్ని ఖండించినవాడు కాదు; ఏ కొత్త మతాన్ని ప్రతిపాదించినవాడు కాదు. అన్ని మతాల సారాన్ని స్వీకరించి, దాన్ని ఒక కొత్తరంగంలో, ఒక విశిష్ట ప్రయోజనాన్ని సాధించడానికి వినియోగించడమే ఆయన ప్రత్యేకత. అందువల్లనే ఆయన సందేశం జాతి, మత విభేదాలను ఎరుగనట్టిది; ఆయన సత్కృషి దేశ, కాల పరిమితులకు అతీతమైనట్టిది.

ఇట్టి మహాత్ముడు మన మధ్య జన్మించడం మన మహాదృష్టం; ఇట్టి మహనీయుడు మన మధ్యనే హత్య కావడం మనకు సిగ్గుచేటు.

మహాపురుషులుద్భవించినప్పుడు వారి మహిమను గుర్తించలేక, వారిని హింసల పాలేసిన మనది కాదని ఇంతకుముందు సగర్వంగా చెప్పుకొనే వారిని హత్య చేసిన దేశం - - వారిమి. మహాత్ములను వారి జీవితకాలంలోనే ప్రేమించి, పూజించిన దేశం మనదేనని కూడా ఇదివరలో సగర్వంగా చాటుకొనే వారిమి. ఇట్టి మనమే మన బాపూజీని పొట్టబెట్టుకొనడంతో మన దేశ చరిత్రను ఘోరంగా కళంకితం చేసుకోలేదా? ఈ కళంకం తరతరాలకైనా - యుగయుగాలకైనా - మనలను వీడనట్టిదే కాదా?

నేడు యమునా తీరంలో మనం ఎత్తుకొంటున్న బూడిద గాంధీజీ భౌతికదేహ శేషంకాదా; భస్మీపటలమైపోయిన మన దేశ ప్రతిష్ఠ బూడిదే. రేపో, మాపో గంగాజలంలో మనం కలపనున్న అస్తికలు బాపూజీ జీర్ణదేహ శిథిలాలు కావు; మన జాతి గౌరవ శిథిలాలే.

ఈ విషయాన్ని గుర్తించడం చాలదు; గుర్తించి, దుఃఖ లజ్జాభరాలతో కృంగిపోవడమైనా చాలదు. ఈ మహాకళంకాన్ని కడిగివేసుకొనడం అసాధ్యమైనా, ఏయే పరిస్థితుల వల్ల ఇది సంభవించిందో తెలుసుకొనడానికి ప్రయత్నించాలి; ఆ పరిస్థితులను తొలగించడానికి పూనుకోవాలి. ఇదే మహాత్మునిపట్ల మనం ప్రదర్శించగల పవిత్ర ప్రేమ; ఇదే ఆయనకు మనం చేయగల పవిత్రపూజ.

(ఆంధ్రప్రభ 3-2-1948)

## మహాశక్తి

గాంధీజీ కన్నుమూసి ఆరు రోజులు కావస్తుంది; ఐనా, భారత ప్రజాకోటికి నేటికీ కంటతడి లేదు.

నడుం విరిగినట్టు - రెక్కలు త్రుంచి వేయబడ్డట్టు - కన్న తండ్రిని కోల్పోయినట్టు- కన్ను పొడుచుకున్నా కానరాని కటిక చీకటిలో కొట్టుకులాడుతున్నట్టు ప్రతి భారతీయుడు వ్యధ పడుతున్నాడు.

ఈ వ్యధ మధ్య నుంచే ప్రతి నిమిషం - అనుక్షణం - ప్రతి భారతీయునికి ఒక పెద్ద ప్రశ్న ఉత్పన్నమౌతుంది కూడా. ఆ ప్రశ్న ఇది.

"గాంధీజీని నేను పూర్తిగా ఆమోదించానా? ఆయనను పూర్తిగా అనుసరించానా"?

ఈ ప్రశ్నకు వస్తున్న ప్రత్యుత్తరం "లేదు - లేదు - లేదు" అని మాత్రమే.

మనలో ప్రతి ఒక్కరం ఏదో ఒక సందర్భంలో - ఇంతగానో, అంతగానో గాంధీజీతో విభిన్న మనస్కులమైనట్టివారిమే; ఆయనను విమర్శించినట్టివారమే.

మనలో కొందరికి ఆయన ఆర్థిక సిద్ధాంతాలు నచ్చకపోతే, కొందరికి రాజకీయ విధానాలు నచ్చలేదు; కొందరికి ఆయన మతసూత్రాలు రుచించకపోతే, వేరొక కొందరికి ఆయన సాంఘిక సంస్కరణలు రుచించలేదు.



ఇంతేకాదు. ఆయన బోధనలన్నింటిని ఆమోదించినవారు సైతం వాటిని ఆచరించడం ఎంత వరకు సాధ్యమని శంకాన్వితులు కాకపోలేదు.

ఐనా, గాంధీజీ గతించడంతో తన బ్రతుకే బుగ్గి అయిపోయినట్టు ప్రతి భారతీయుడు భావించడానికి కారణమేమిటి?

ఇందుకు కారణం - తన సూత్రాల కంటే, తన సిద్ధాంతాల కంటే, తన విశ్వాసాల కంటే, తన విధానాల కంటే గాంధీజీ అన్ని విధాల అధికుడైనవాడు కావడమే; విశిష్టుడైనవాడు కావడమే.

అందువల్లనే ఆయన సూత్రాలను ఆమోదించకపోయినా, ఆయనను మనం ప్రేమించడం; ఆయన సిద్ధాంతాలను అనుసరించలేకపోయినా, ఆయనను మనం పూజించడం; ఆయన విశ్వాసాలలో

భాగస్వాములం కాలేకపోయినా, ఆయనను లక్షించడం; ఆయన విధానాలను విమర్శించినప్పటికి ఆయన మ్రోల వినమ్రులము కావడం.

## మహాఫలసిద్ధి

సర్వసాధారణంగా మనకు లోకంలో కానవచ్చేది తమ ఆశయాలతో, తమ విశ్వాసాలతో సరితూగలేని మానవులే. ఇందుకు విరుద్ధంగా, తన ఆశయాలకంటే, విశ్వాసాల కంటే మహోన్నతుడైన వాడు గాంధీజీ. ఇదే ఆయనను ఒక అసాధారణ వ్యక్తిని - కాదు, ఒక అనుపమశక్తిని చేసింది.

నైతికంగా భారతజాతికి చెందిన ఘోర పతనం దృష్ట్యా దాని సముద్ధరణకు కావలసినట్టిది, - నైతికమైన ఒక మహాశక్తి. ఆ శక్తి - మహాత్ముడు.
దీన్ని మూర్ఖులైన కొందరు గుర్తించలేకపోయారు. గాంధీజీ విశ్వాసాల్లో, విధానాల్లో కొన్ని విమర్శనీయమైనవిగా తమకు తోచినందున గాంధీజీయే విమర్శనీయుడని వారు భావించారు. దీని ప్రత్యక్ష ఫలితమే - గాంధీజీ హత్య.

జిజ్ఞాసువులమని విఱ్ఱవీగే వారిలోనే కొందరు ప్రదర్శించే ఈ మూర్ఖత్వాన్ని భారత ప్రజాసామాన్యం ప్రదర్శించలేదు. గాంధీజీ విశ్వాసాలు తమకు అర్థమైనా, కాకపోయినా, ఒక నైతికశక్తిగానే సామాన్య ప్రజలు ఆయనను ఆరాధించారు. అందువల్లనే ఆయన పోవడం వారికి ఈనాడు ఇంత బాధగా తోచడమైనా, ఇంతగా వారికి బ్రతుకుపైనే రోత పుట్టడమైనా.

సత్యాన్ని తప్పి - ధర్మాన్ని అధిగమించి తాము వేసిన ప్రతి అడుగుకు ఆ పాపఫలితాన్ని గరళకంఠుని వలె హరించివేయడానికి మహాత్ముడు కలడుగదా అనే ఆశ అడుగంటిపోవడమే నేటి ఈ శోకవిహ్వలతకు ఒక ప్రధాన కారణమనడం సత్యవిదూరం కాగలదా? (ఆంధ్రప్రభ 4-2-1948)

మహాత్ములకైనా మరణం తప్పదు. గనుక, ఇప్పుడు కాకపోతే, మరొకప్పుడైనా గాంధీజీ వియోగ దుఃఖం మనకు తప్పేది కాదు.



కాని, ఆయన మనలను వీడి చనిన ఘోరపరిస్థితి మనకు సిగ్గుచేటు; ఇది మనకు మాయని మచ్చ; ఆరని మంట. మన కళ్ళు తెరిపించినవాడు ఆయన; మనకు కాళ్ళు తెచ్చిన వాడు ఆయన; మనకు దారి చూపించినవాడు ఆయన; మన ఇంట దీపం పెట్టినవాడు ఆయన. అట్టి ఆయననే మనం పొట్టను పెట్టుకున్నాం. అయినప్పుడు ఇక ప్రపంచంలో మనం తలయెత్తుకోగలమా? మనం చేసిన ఈ పనికి మన సంతతివారు సైతం యుగయుగాల వరకు సిగ్గుతో కుమిలిపోక తప్పదుగదా?

కాని, ఇది మనకు లజ్జాకారణమైతే, ఆయనకు గర్వకారణం; మనకు దుఃఖహేతువైతే, ఆయనకు ఆనందహేతువు; మనకు అప్రతిష్టాకరమైతే, ఆయనకు మహాఫలసిద్ధి.

గాంధీజీ విశ్వాసాల దృష్ట్యా ఆయన సిద్ధాంతాల దృష్ట్యా మొన్న జరిగిన దానికంటే ఆయన కోరగల ఉత్తమ మరణం లేదు.

ఆయన ఎన్నడు మరణాన్ని ఆహ్వానించని మాట నిజం. కాని, మరణానికి, ఆయన ఎన్నడు వెనుదీయలేదు కూడా.

నూట పాతిక సంవత్సరాలపాటు ఆయన జీవించగోరితే, అది సామాన్య మానవుల విషయంలో వలె కేవలం జీవితంపై మమకారంతో కాదు, మానవాళికి తన సేవ పూర్తికాలేదనే మహావిశ్వాసంతోనే. అందువల్లనే నూట పాతిక సంవత్సరాలు జీవించాలని కోరుతున్నట్టు ప్రకటించనారంభించిన పిదప కూడా ఆయన తన లక్ష్యపరిపూర్తికి తన ప్రాణాలను పదేపదే పణంగా పెట్టాడు. ఏ సంజీవి వల్లనో ఆయనను తిరిగి మనం బ్రతికించుకొనగలిగితే, తిరిగి ఇట్టి ఆత్మార్పణకు ఆయన ఎంత మాత్రం వెనుదీయబోడు.

నిజానికి ఆయన జీవితమే ఆత్మార్పణ; అనుదిన ఆత్మార్పణ; అనుక్షణ ఆత్మార్పణ. అట్టి ఆత్మార్పణలో తప్ప ఆయనకు సుఖం లేదు; ఆనందం లేదు; జీవితమే లేదు.

మరణం కఠోరమైనదని మన నమ్మకం. కాని, గాంధీజీని పోలిన మహాత్ములకు జీవితమే కఠోరం. "సృష్టిలో ఒక్క ప్రాణి బాధపీడితమైనా నాకు సుఖం లేదు; శాంతి లేదు" అని ప్రకటించిన బుద్ధ దేవుని వంటివాడే గాంధీ మహాత్ముడు కూడా. అంచేత ఆయనకు మరణం ఊహించరాని బాధకు పాల్పడడం కాదు; భరించరాని బాధ నుంచి విముక్తి మాత్రమే. అట్టి విముక్తికి నిదర్శనమే ఆత్మార్పణ తర్వాత గాంధీజీ వదనంపై కానవచ్చిన ప్రసన్న, ప్రశాంత రేఖలు.

అంచేత ఈనాడు మనం విలపించవలసింది ఆయన కోసం కాదు; మన కోసమే.

బ్రతికినంత కాలం ఇంకా బ్రతికి మనకు సేవ చెయ్యాలని ఆశించిన గాంధీజీ మనలను వీడి చనవలసిన పరిస్థితిని కల్పించిన దుష్టశక్తుల విలయతాండవం నుంచి రక్షించుకొనడానికి కంకణ బద్ధులం కాని పక్షంలో మన ప్రస్తుత పరితాపం నిష్ఫలమైపోగలదు. అందువల్ల నేడు కావలసింది నిస్పృహ కాదు; నూతనోత్తేజం; కర్తవ్య మూఢత్వం కాదు; కృతనిశ్చయం.

ఆత్మార్పణ ద్వారా మహాత్ముడు మహాఫలసిద్ధి చెందినాడనడంలో సందేహం లేనప్పటికీ ఆయన తపస్సుకు, ఆయన ఏ లక్ష్యాలకై జీవించి, వేటికై మరణించాడో వాటిని మనం సాధించ గలిగినప్పుడే పరిపూర్ణత్వం.
ఆయన లక్ష్యాల సాధనకు ఆయన సాధనలనే ఉపయోగించగల ప్రజ్ఞగాని, పటుత్వం గాని మనకు లేకపోవచ్చు. ఆయన సాధనల వినియోగానికి ఆయనను పోలిన మహాత్ముడే అవతరించడం అవసరమైనా కావచ్చు. కాని, ఏ సాధనాల ద్వారానైనా సరే, వాటిని సాధించడమే ముఖ్యం.

(ఆంధ్రప్రభ 5-2-1948)

## హంతకులెవరు?


మహాత్ముని బలిగొన్నది ఒక దుష్టవ్యక్తి కాదు; అశేష దుష్టశక్తుల సందోహం.

నాథూరామ్ వినాయక్ గోడ్సేను పోలిన క్షుద్ర మానవుడెక్కడ? మహాత్ముడెక్కడ? దేశంలో దశదిశల విజృంభించిన దుష్టశక్తి సంచయ దోహదం లేకపోతే, హత్యోద్దేశంతో మహాత్ముని సమక్షంలోకి వెళ్ళినవాడు ఆయన దివ్య ప్రతిభకు వశీకృతుడై, శిలాప్రతిమగా నిలిచిపోయి ఉండేవాడు కాదా?

ఇది లాంఛనోక్తికాదు; అతిశయోక్తికాదు; కడిగిపోసిన సత్యం.

ఇటీవల గాంధీజీకి బ్రతుకుపై రోత పుట్టించిన శక్తులే ఆయనను బలిగొన్నాయి. ఇది నిజం; అక్షరాల నిజం; ముమ్మాటికీ నిజం.

స్వరాజ్యం వచ్చిందని మనం పండుగ చేసుకున్నాం. కాని, అది గాంధీజీకి పండుగ కాలేదు గదా? దేశం ముక్కచెక్కలైనప్పుడు పండుగ దేనికనే ఆ సందర్భంలో ఆయన బాధ.



స్వాతంత్ర్యం లభ్యమైనదని మనం మహోత్సవాన్ని జరుపుకున్నాము. ఆ మహోత్సవంలో ఆయన పాల్గొన నిరాకరించాడు గదా ? అన్నదమ్ములు ఒకరి నొకరు చంపుకొంటుండగా మహోత్సవం దేనికనే ఆ సందర్భంలో ఆయన ఆవేదన.

కేవలం స్వరాజ్యాన్నే-కేవలం రాజకీయ స్వాతంత్ర్యాన్నే- పరమావధిగా ఆయన ఎన్నడు భావించలేదు. పరరాజ్యంపై ఆయన విద్వేషానికి అది కారణం, స్వరాజ్యం పై ఆయన మమకారానికి అది మానవుని దేవతామూర్తిగా చేయగలదనే విశ్వాసమే కారణం.

కాని, స్వరాజ్యసిద్ధికి పూర్వమేమి, ఆ తర్వాతనేమి దేశంలోకానవచ్చిన పరిస్థితులు "నేను కలలు గనిన స్వతంత్ర భారతం ఇదేనా ?" అని ఆయనకు దుర్భర హృదయ సంక్షోభాన్ని కలిగించాయి. దానితో ఆయనకు జీవితేచ్ఛ సన్నగిల్లింది.

అంచేత నిజానికి గాంధీజీ హత్య జరిగింది జనవరి 30 వ తేది శుక్రవారం సాయంత్రం కాదు, అంతక్రితమే. గాంధీజీని తుదముట్టించిన కిరాతకుడు గోడ్సే అయినప్పటికీ, ఆ హత్యా పాపంలో భాగస్వాములు అసంఖ్యాకులు.

ఇటీవల మనలో ఎందరు మత విభేదాలను రాజకీయ ప్రయోజనాల సాధననిమిత్తం వినియోగించుకోలేదు? ఈ సందర్భంలో వీరు ఎంత దుష్ప్రచారం సాగించలేదు? ఎన్ని దుష్కృత్యాలకు ఒడిగట్టలేదు? ఆస్తుల దోపిడి, గృహాల దహనం, స్త్రీల మానభంగం, శిశువు హత్య - ఇట్టివానిలో వీరు ఒడిగట్టని పాపమేది?

ఇటీవల మనలో ఎందరు అన్న వస్త్రాదుల నాటకాన్ని అన్యాయార్జనకు సాధనగా చేసుకోలేదు? ఇందునిమిత్తం వీరు ఎందరిని ఏడ్పించలేదు? ఎన్ని కొంపలను ఆర్పలేదు? ప్రేగులను తోడే ఆకలి నుంచి లాభం, ఎముకలను కొరికే చలి నుంచి లాభం, ప్రాణాలను తీసే రోగం నుంచి లాభం - వీరు తీయని దొంగలాభం కలదా?

ఇటీవల మనలో ఎందరు పదవీ వ్యామోహాన్ని ప్రదర్శించలేదు? వీరు ఎన్ని కుట్రలు పన్నలేదు? ఎంతగా కుయత్నాలకు సిద్ధపడలేదు? అన్యపక్షాలను నిరసించడం, స్వపక్షంలోనే విషబీజాలను నాటడం, ఆశలను, అనుమానాలను రేకెత్తించడం వీరు ప్రదర్శించని నీచత్వం కలదా?

ఇట్టివారిలో ప్రతి ఒక్కడు గాంధీజీ హత్యలో - ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగా పూర్తిగా కాకపోయినా, ఏ స్వల్పంగానో - భాగస్వాములే.

ప్రజాసేవ తన పరమ ధర్మమని ఒక్క తృటిపాటైనా విస్మరించిన ప్రతి కాంగ్రెసువాది, తన మతం ఏదైనా, పరిస్థితులెట్టివైనా, తాను భారతీయుడనని విస్మరించిన ప్రతి జాతీయవాది ఈ పాపంలో భాగాన్ని పంచుకోవలసిందే.

గాంధీజీని ఈనాడు మనం పోగొట్టుకొనడం, మన మధ్య ఆయనను నిలుపుకొనగల అర్హతను కోల్పోయినందువల్లనే. (ఆంధ్రప్రభ 6-2-1948)

## దివ్య స్మృతి

గాంధీజీ పేర స్థూపాలను కట్టించవలెనా? శిలా శాసనాలను చెక్కించవలెనా? దేవాలయాలను నిర్మించవలెనా? విగ్రహాలను ప్రతిష్ఠించవలెనా? ఈ విధమైన ఆలోచనలు అప్పుడే ప్రారంభమైనాయి.

గాంధీజీ మనలో పుట్టి, మనలో పెరిగి, మన కోసం మహాతపస్సు చేసి, ఆ కఠోర దీక్షలో భాగంగా మన నిమిత్తం ప్రాణాలర్పించిన మహామహితాత్ముడు. ఆయనపట్ల మన భక్తి శ్రద్ధలకేమి, ప్రేమ గౌరవాలకేమి నిదర్శనంగా ఆయన మహామహితాత్మకి తగు స్మారక చిహ్నాన్ని నిర్మించు కొనలేకపోతే మనం ఘోరనిందాస్పదులము కాగలమనడం నిస్సంకోచం.

కాగా, సంకోచించవలసిన విషయం - లేదా, - నేడు చేయబడుతున్న సూచనలలో దేనిని వేటిని - అనుసరించడం సముచితమని మాత్రమే.

ప్రస్తుతపు సూచనలలో అధిక భాగపు తాత్పర్యం, - గాంధీజీని దేవతార్చనపు పీటను ఎక్కించమనే. ఇది ఆయనపట్ల మన ప్రేమ గౌరవాలకు, భక్తి శ్రద్ధలకు నిదర్శనమేగాని, ఆ ప్రేమ గౌరవాలను, భక్తిశ్రద్ధలను ప్రదర్శించడానికి శ్లాఘనీయమైన మార్గం మాత్రం కాదు.

గాంధీజీ తన జీవితకాలంలో మననుంచి కోరింది అంధభక్తికాదు; మూఢవిశ్వాసంకాదు.

“నేను కేవలం సత్యాన్వేషిని" అని ఆయన పదేపదే ఉద్ఘాటించాడు. "సత్యాన్ని నేనింకను పూర్తిగా కనుగొనలేదు” అని ఆయన పదేపదే వాపోయాడు.

సత్యాన్ని పూర్తిగా కనుగొన్నవానికి పరిపూర్ణత్వం లభించగలదని, తాను ఆ పరిపూర్ణత్వాన్ని పొందలేదని చెప్పడానికి ఆయన ఎన్నడు సంకోచించలేదు.

ఇంతేకాదు. “నేను పరిపూర్ణత్వం పొందినవాడనైతే, నా సోదర మానవుల కష్టాలను చూచినేను కుమిలిపోవడందేనికి? పరిపూర్ణత్వమే నాకు సిద్ధించివుంటే, కష్టాలను గమనించి, వాటికి నివారణమార్గాన్ని చెప్పి, నాలోని సత్యం మహిమచే వాటిని పరిహరింప జేయించేవాడినికాదా?” అని కూడా ఆయన ప్రశ్నించాడు.

అయినా, మహాత్ముడని ఆయనకు మ్రొక్కడంతో మనం సంతృప్తి చెందాము. ఆయన సూత్రాలను, ఆయన విధానాలను ఆయన ప్రదర్శించిన సత్యాన్వేషణ శక్తితోనే పరిశీలించి, అవి మనకు ఎంతవరకు అనుసరణీయమో నిర్ణయించుకొనడానికి ఎంతవరకు ఆమోదకరమో - - ప్రయత్నించలేదు.

ఇందుకు మారుగా ఆయన సూత్రాలనేమి, ఆయన విధానాలనేమి, అనుసరించగలిగినప్పుడు అంధప్రాయంగా అనుసరించాము; అనుసరించలేనప్పుడు, "ఆయన మహాత్ముడు" అని దూరంగా నిలిచి, ఒక నమస్కారం పెట్టి అంతటితో మన కర్తవ్యం తీరినట్టు సంతృప్తి చెందాము.

గాంధీజీ జీవితకాలంలో మనం చేసిన ఈ మహాపరాధానికి రూపాంతరమే ఆయనను దేవతార్చన పీటపైకి ఎక్కించాలనే ఆలోచన.

ఈ విషయాన్ని అంగీకరిస్తే, స్థూపాలను కట్టించడం, శిలాశాసనాలను చెక్కించడం, దేవాలయాలను నిర్మించడం, విగ్రహాలను ప్రతిష్ఠించడం మొదలైనవి గాంధీజీకి తగు స్మారక చిహ్నాలు కానేరవని కూడా అంగీకరించక తప్పదు.

గాంధీజీ దేనికోసం జీవించాడు? ఎందునిమిత్తం ఆత్మార్పణ చేశాడు? ఆయన దేన్ని లక్షించాడు? ఏమి కలలుకన్నాడు? - ఇట్టి వితర్కం చేసుకొని భావదాస్యాన్ని ప్రదర్శించక మన అంతః కరణకు తోచిన స్వచ్ఛంద నిర్ణయాలకు వచ్చి, ఆయన రూపకల్పన చేసుకున్న భారతదేశాన్ని, మానవ లోకాన్నీ అవతరింపజేయడంలో ప్రభుత్వ లోపం చేయమనడానికి కంకణ ధారులము కావడమే ఆయన దివ్యస్మృతికి మనం నిర్మించగల ఉత్తమోత్తమ చిహ్నం. (ఆంధ్ర ప్రభ 7-2-1948)

## అహింసామూర్తి

సభ్యతామానవుని లక్ష్యం నిర్వివాద విషయమే.
న్యాయం, శాంతి, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం - ఇవి అవిచ్ఛన్నంగా రాజ్యం చేయగల సంఘ సంస్థాపనే ఆ లక్ష్యం.




అపౌరుషేయాలని కొందరు విశ్వసించే వేదాలు మొదలు, కమ్యూనిష్టులకు వేదమైన "కేపిటల్" వరకు ప్రతి ఉద్గ్రంథం ఈ లక్ష్యాన్నే పేర్కొంటున్నది.

ఉపనిషత్కారుడు మొదలు బీవరీడ్జ్ ప్రణాళిక నిర్ణేతవరకు ప్రతి జిజ్ఞాసువు ఈ లక్ష్యాన్నే ఉద్ఘాటిస్తున్నాడు.
అంచేత సభ్యతామానవుని లక్ష్యం వివాదాంశం కానేకాదు; ఆ లక్ష్యాన్ని ఏ విధంగా సాధించవలెననేదే వివాదాంశం.

ఇందుకు వివిధ మహాపురుషులు విభిన్న మార్గాలను సూచించారు. ఈ విభిన్న మార్గాలలో ప్రధానంగా కానవచ్చే ఒక భేదం కొన్నింటి అనుసరణలో, హింస అనివార్యమైతే, మరికొన్నింటి విషయంలో అహింస అనుల్లంఘనీయం కావడం.

సభ్యతా మానవుని లక్ష్యసాధనకు - దీన్నే మరొకవిధంగా పేర్కొనాలంటే - ధర్మ సంస్థాపనకు - హింసను సాధనంగా చేసుకొనడం దోషం కానేరదని శ్రీ కృష్ణుని అభిప్రాయం. ఇదే నీచ్, మార్క్స్, లెనిన్ ప్రభృతుల అభిప్రాయం కూడా.

ఈ అభిప్రాయంతో ఏకీభవించని వారిలో ముఖ్యులు, - గౌతమబుద్ధుడు, ఏసుక్రీస్తు, మోహన్దాస్ కరంచంద్ గాంధి.

ఈ అభిప్రాయ విభేద సారాంశాన్ని కింది ప్రశ్న రూపంలో పేర్కొనవచ్చు :

"ఉత్తమ లక్ష్యాన్ని అధమ సాధనంతో సాధించగలమా?"

అయితే, దీనివెనువెంటనే ఉత్పన్నంకాగల ప్రశ్న "హింస అధమసాధనమా?" అని.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు పేర్కొన్నట్లు, స్థితప్రజ్ఞతో హింసను ప్రయోగించగలిగితే, అది అధమ సాధనంకాకపోవచ్చు. కాని, అట్టి స్థితప్రజ్ఞ ఎందరు ప్రదర్శించగలరు?

కోపం, భయం, ద్వేషం, క్రౌర్యం మొదలైనవన్నీ హింసాప్రయోగంతో అవినాభావ సంబంధాన్ని కలిగినట్టివే; ఇవన్నీ మానవుని నైతికపతనానికి దోహదమిచ్చేవే.

అయితే, అహింసా ప్రయోగం మాత్రం సులభసాధ్యమా? అని అడగవచ్చు.

ప్రేమ, త్యాగం, ధైర్యం, కారుణ్యం, ఔదార్యం, నిశ్చలత్వం మొదలుగా గల లక్షణలక్షితుడు కానివాడు అహింసా ప్రయోగాన్ని చేయలేదనడం నిజమే. ఈ సుగుణాలు అందరిలోను పరిఢవిల్లడం సులభం కాదనడంకూడా నిజమే.

అయితే, ఈ ప్రయత్నంలోనే మానవుడు ఒక అంతస్తు పైకిపోతాడు; ఆ ప్రయత్నం మేరకు మానవ సంఘం కూడా ఒక మెట్టుపైకి పోతుంది.

ఇదే హింసా పద్ధతులతో పోల్చినప్పుడు అహింసా విధానం ఉత్కృష్టత.

అయితే, ఈ విషయం ఈనాడు కొత్తగా కనుగొనబడినట్టిదికాదు.

ఉపనిషత్కారులు దీన్నే ప్రవచించారు. బుద్ధదేవుడు దీన్నే ప్రబోధించాడు; ఏసుక్రీస్తు దీన్నే ప్రచారం చేశాడు.

“అహింసామూర్తి” అని గాంధీజీ ఈనాడు సర్వప్రపంచం మన్ననలను పొందడానికి కారణం, - ఆయన కొత్తగా అహింస ఉత్కృష్టతను కనుగొనడంకాదు.

"ఏ కొత్త సత్యాన్ని, ఏ కొత్త సూత్రాన్ని నేను కనుగొనలేదు" అని గాంధీజీయే స్వయంగా చెప్పుకొనివున్నాడుకూడా.

అయితే, ఆయన చేసింది ఆయన పలుకులలోనే “అనాది సత్యాలను అనుదిన జీవితానికి వర్తింపజేయడమే.” ఇంతేకాదు, సత్యం, అహింసలను అనుదిన జీవితంలోనే కాక అతివిశాల రంగంలో ప్రప్రథమంగా ప్రయోగించినవాడు కూడా గాంధీజీయే.

గౌతమబుద్ధుడు, ఏసుక్రీస్తు వ్యక్తులద్వారా అహింసా సిద్ధాంతాన్ని ప్రయోగిస్తే, గాంధీజీ సంఘంద్వారా వాటిని ప్రయోగించాడు. వ్యక్తుల సముదాయమే సంఘం కావచ్చు. కాని, వ్యక్తికంటె సంఘం విశాలరంగమని అంగీకరించక తప్పదుగదా?

విశాలమైన, వినూత్నమైన ఈ ప్రయోగాన్ని చేసినందువల్లనే మహాత్ముడు అహింసామూర్తి అయినాడు; ఏసుక్రీస్తు, గౌతమబుద్ధుల సరసను స్థానాన్ని సంపాదించుకున్నాడు.

(ఆంధ్రప్రభ 9-2-1948)

## మహాత్ముని లక్ష్యం

అహింస మహోత్కృష్టమైనదని ఉపనిషత్కారులే ప్రవచించి ఉండవచ్చు; గౌతమ బుద్ధుడే ప్రబోధించి ఉండవచ్చు; ఏసుక్రీస్తే ప్రచారం చేసి ఉండవచ్చు. కాని, ఈ విషయాన్ని నిరూపించడానికి వినూత్న పద్ధతిపై - విశాల రంగంలో - ఓంప్రథమంగా ప్రయత్నించినవాడు మేము మొన్నటి సంపాదకీయంలో వివరించినట్టు - గాంధీజీయే. –



కృతకృత్యుడైనాడనేది ప్రస్తుతపు ప్రశ్న. ఈ ప్రశ్నకు సత్యసంధతతో ఎవరైనా చెప్పగల సమాధానం - పరిమితంగా అని మాత్రమే. అహింస ప్రాతిపదికగా గాంధీజీ సాగించిన సత్యాగ్రహోద్యమాల ఫలితంగా భారతజాతి పారతంత్ర్యం నుంచి విముక్తి పొందిన తర్వాత స్వరాజ్యాన్ని సాధించుకొన్న మీదట - ఆయన ప్రయత్నం పరిమితంగానే ఫలించిందని చెప్పడం మహాపచారంగా తోచవచ్చు.

ఈ ప్రయత్నంలో గాంధీజీ ఎంత వరకు.

కాని, కేవల స్వరాజ్యాన్నే గాంధీజీఎన్నడు పరమావధిగా భావించలేదని విస్మరించరాదు.

స్వరాజ్యం లేని భారతదేశం ఆత్మస్వరూపాన్ని తెలుసుకోలేదని ఆయన విశ్వసించాడు. ఆత్మస్వరూపం తెలుసుకోగలిగిన పక్షంలో భారతదేశం సర్వప్రపంచానికి - సమస్త మానవ లోకానికి - సత్యపథాన్ని, శాంతి మార్గాన్ని చూపగలదని కూడా ఆయన విశ్వసించాడు.

“సత్యం ద్వారా, అహింస ద్వారా ఇండియా ఆత్మస్వరూపాన్ని తెలుసుకొన గలిగినప్పుడు, ప్రపంచంలోని ప్రతి దేశం పరితపిస్తున్న ప్రపంచ శాంతి స్థాపనకు అది నాతి స్వల్ప దోహదాన్ని కూర్చగలదని సవినయంగా సూచించడానికి నేను సాహసిస్తున్నాను” అని ఒక సందర్భంలో స్పష్టంగా రాసి ఉన్నాడు కూడా. దీన్నిబట్టి ప్రపంచంలో శాంతి, సత్యాల స్థాపనతో భారత స్వరాజ్య సమరాన్ని ఒక భాగంగానే ఆయన పరిగణించినాడనడం సువిదితమే.

స్వరాజ్యం కంటే ఉత్కృష్టమైన దాన్ని ఆశించినవాడు గనుకనే "సత్యానికి తిలోదకాలివ్వడం ద్వారా స్వాతంత్ర్యాన్ని పొందడం కంటే ఇండియా వినాశనమైపోవడం మేలని నా అభిప్రాయం" అని చెప్పడానికి ఆయన సంకోచించలేదు.

"రక్తపాతం ద్వారా స్వేచ్ఛను పొందడానికి మారుగా, అవసరమైతే, కొన్ని శతాబ్దాలైనా స్వాతంత్ర్య సంసిద్ధికి నేను వేచియుండ గోరుతాను" అని ఉద్ఘాటించడానికి సైతం ఆయన సందేహించలేదు. ఐనప్పుడు కేవలం భారత స్వరాజ్య సంసిద్ధి చేతనే గాంధీజీ ప్రయత్నం పూర్తిగా ఫలసిద్ధి చెందినదని ఎట్లు అనగలం?

ఆయన లక్షించినట్లు ప్రపంచంలో శాంతి, సౌఖ్యాలు నెలకొనలేదు సరిగదా, ఇండియాలోనైనా అవి సుస్థాపితం కాలేదు. అంచేతనే ఆయన అవసాన దినాలు వ్యథాభరితం కావడం. అంచేతనే ఆయన విద్వేష హింసాశక్తులకు బలికావడం.

గాంధీజీ లక్షించిన ఫలితం ఒకటి కాగా, పర్యవసానం మరొకటి కావడానికి ఆయన ప్రవృత్తిలో కానవచ్చిన ఒక వైరుధ్యమే కారణం కావచ్చు.




అహింసలో ఆయన విశ్వాసం అచంచలమైనదే. ఐనా, పరదాస్యం ఆయనకు దుస్సహమని తోచిన సందర్భాలు కూడా లేకపోలేదు.

జాతీయదాస్యం వల్ల భారతజాతి నిర్వీర్యమై - నిస్తేజమై - నికృష్ట జీవితాన్ని గడపడం దుస్సహం కాగా, "హింస ద్వారా వస్తే, స్వరాజ్యం నాకు వలదు", అని చెప్పినవాడే "ఈ నీచ దాస్యం కంటే హింస సహ్యమేమో" అని ఆయన చెప్పక తప్పలేదు.

అహింస విషయమై అచంచల విశ్వాసాన్ని ప్రదర్శించడంతో పాటుగా జాతీయదాస్యం దుస్సహమైనదని ఆయన పడిన ఈ బాధే ఆయన తన సిద్ధాంతాలను కొంతవరకు సడలించుకొనడానికి కారణమైంది.

అహింస వినా మానవజాతి సముద్ధరణకు మార్గం లేదని ఆయనవలె నమ్మినవాడు కాంగ్రెసు అహింసను ఒక అచంచల సూత్రంగా కాక, ఒక తాత్కాలిక విధానంగానే ఆమోదించడానికి సమ్మతించి ఉండవలసింది కాదు. - తాను చేసిన ఈ పొరపాటును స్వరాజ్యసిద్ధి తర్వాతనే ఆయన పూర్తిగా గుర్తించినట్లు తోస్తుంది. స్వరాజ్య సంసిద్ధికి పూర్వమేమి, ఆ పిదపనేమి దేశంలో చెలరేగిన హత్యాకాండను హింసాకృత్యాలను చూడగా, "నేను కలలుగన్న ఇండియా ఇదేనా!" అని ఆయన పొందిన పరితాప ఫలితమే - ఆయన స్వాతంత్రోత్సవాలలో పాల్గొనకపోవడం.

ఇంతేకాదు, అసమగ్రంగా నిలిచిపోయిన తన కృషిని సంపూర్తి చేసుకోడానికి ఆయన మరింత తీవ్రంగా తపస్సును ప్రారంభించడానికి నిర్ణయించుకున్నాడు. కలకత్తా, ఢిల్లీ నిరాహార దీక్షలు ఈ నిర్ణయంలో భాగాలే. ఆయన అంతిమ ఆత్మబలిదానం కూడా ఈ నిర్ణయంలో భాగమే.

గాంధీజీ తాను పెట్టుకున్న మహాలక్ష్యాన్ని, పూర్తిగా సాధించలేకపోయినా, తాను ప్రారంభించిన మహాప్రయత్నాన్ని పూర్తిగా నెరవేర్చుకొనలేకపోయినా, తప్పిదం ఆయనది కాదు.

ఆయన కృతకృత్యుడు కావడానికి తగు పరిస్థితులు ఈనాటి ప్రపంచంలో లేవు.

తన కాలం కంటే ముందుగా అవతరించినందువల్లనే తన పనిని పూర్తి చేసుకొనకుండా ఆయన వెళ్ళిపోయాడు.


ఆయన దివ్యస్మృతికి మనం అపచారం చెయ్యరాదంటే, ఆయన అంతస్తుకు మనం పోలేమని, ఆయన మార్గాన్ని మనం మెట్టలేమని మనం గుర్తించాలి. ఆయన లక్ష్యాలకు స్వస్తి చెప్పాలని దాని తాత్పర్యం కాదు. ఆయన శక్తి మనకులేదు గనుక, ఆయన లక్ష్యాల కంటే - ఆయన సాధనాల కంటే - తక్కువ వాటిని పెట్టుకొనకపోతే, మనం ఆత్మవంచన చేసుకొనగల మనడమే.

మన ద్వారా ప్రపంచాన్ని ఉద్ధరించాలని గాంధీజీ యత్నించాడు. ఆయన కోరిన ఎత్తులకు మనం ఎగబ్రాకలేక పోయినందున, ఇక మీదట కనీసం ఆత్మోద్ధరణకైనా మనం యత్నించాలి. ఆ పాటినైనా మనం సాధించకపోతే, ఇందుకు తగు నైతిక పాటవాన్ని మనం ప్రదర్శించకపోతే, ఆయన ఆత్మకు తృప్తి లేదు, శాంతి లేదు. (ఆంధ్రప్రభ 10-2-1948)

## గాంధీజీ మహాస్వప్నం

కపటం వీటితోనే మనం గాంధీజీని చంపుకున్నాం. -

"అయ్యో! బాపూజీ ఇక మనకు లేడా?" అని విలపిస్తూనే నేటికీ కల్లకు, కపటానికి మనం స్వస్తి చెప్పడం లేదు.



దీన్ని చూడగా "మనకు ప్రగతి కలదా?" అని కలవరపడవలసి వస్తుంది.

మహాత్ముని విశ్వాసాలనేమి, విధానాలనేమి మనం పూర్తిగా ఆమోదించలేదు; ఆమోదించిన మేరకైనా వాటిని మనం పూర్తిగా అనుసరించలేదు.

అయినప్పుడు "గాంధీజీ అడుగుజాడలలోనే మనం తప్పక నడవాలి" అని దాదాపు ప్రతి ప్రముఖుడు ప్రకటన చేయడం తగునా?

మహాత్ముడు మనలను వీడి చనిన పరిస్థితి పట్ల లజ్జా సంతాపాల వల్లనే ఇట్టి ప్రకటనలు జరుగుతున్నవని మనస్సును సంతృప్తి పెట్టుకోగలముకాని, ఎంతటి వాస్తవిక లజ్జా సంతాపాలైనా కల్లవల్ల - కపటం వల్ల - కలుషితమైపోవా?

దారి చూపుతూ, చేయి పుచ్చుకుని మహాత్ముడు స్వయంగా నడిపిస్తుండగా ఆయన వెంట నడవలేకపోయిన వారిమి, ఆయన తోడ్పాటు లేకుండా ఆయన అడుగుజాడల వెంట నడవగలమా?

ఆయన సత్యాన్వేషి; ప్రేమమూర్తి; త్యాగధనుడు. అన్యుల దుఃఖాన్ని ఆయన తన దుఃఖంగా భావించాడు; అన్యుల సుఖాన్నే తన సుఖం గావించుకున్నాడు. సంఘసేవ వినా దేశాభ్యుదయం లోక కళ్యాణం వినా - ఆయనకు జీవితమే లేదు. - వినా –



"గాంధీజీ అడుగుజాడలనే మనం తప్పక అనుసరించాలి" అని నేడు ప్రకటనలు చేస్తున్న వారిలో ఎందరు ఈ మహదాశయాన్ని అనుసరించగలరు?

ఐతే "మానవాశయం ఎంత పెద్దదైతే, మానవ ప్రయత్నం అంత పెద్దది కాబోదా?" అని ప్రశ్నించడానికి ఈ సందర్భంలో అవకాశం లేకపోలేదు.

కొంతవరకు ఈ ప్రశ్నలో సత్యం కలదు. కాని, దీనిలో ఒక ప్రమాదం కూడా గర్భితమై ఉన్నదని అంగీకరించక తప్పదు.

ఒక ఆశయం దాన్ని పెట్టుకున్న వారిలో బహుళ సంఖ్యాకులకు ఆచరణ సాధ్యం కానిదైనప్పుడు దాని ఆచరణ ప్రయత్నం కేవలం ఒక నటనగా పరిణమించవచ్చు.

ఉదాహరణకు, కాంగ్రెసువారు పెట్టుకున్న ఆదర్శాలు సామాన్యమైనవి కావు. ఐనా, ఈనాడు కాంగ్రెసు వారిలో అవినీతి తొణికిసలాడుతుందని గాంధీజీయే స్వయంగా విమర్శించక తప్పలేదు. అంతటి ఉత్తమ లక్ష్యాలకు ఇంతటి విషాద ఫలితాలు కలగడానికి వాటిని ఆచరిస్తున్నట్టు నటించడమే కారణమనడం సత్యవిదూరం కాగలదా?

గాంధీజీ జీవితకాలంలో ఇట్టి నటన చేసి, ఆయనను విలపింపజేయడం చాలక, ఆయన ఆత్మార్పణం తర్వాత కూడా తిరిగి నటన చేస్తూనే ఆయన ఆత్మను విలపింపజేయడం భావ్యం కాగలదా?

ఆయన సిద్ధాంతాల ప్రకారం యంత్రాలు తగవు. పరిశ్రమలు తగవు. వీటిని వినియోగించుకొనకుండా జాతీయ సంపదను పెంపొందించుకొనడానికి మనం సంసిద్ధులమేనా?

ఆయన ప్రబోధనలనే మనం అనుసరించగోరితే, ఆయన ప్రాణాలను తీసిన హంతకుని మనం క్షమించి విడిచిపుచ్చాలి. కాని, ఈ విధంగా చేస్తే, మనలో ఒక్కరికైనా రేపటి నుంచి భద్రత ఉండకలదా? దేశంలో అరాచకత్వం చెలరేగదా?



అయినప్పుడు "గాంధీజీ అడుగుజాడలలోనే నడవబోతున్నాం" అని ప్రకటనలు చేయడం కల్లగాదా? కపటం కాదా?

ఇట్టి ప్రవర్తనతో మనం ఆయనకు అపచారం చేయడమేకాదు. మనకు మనమే అపచారం చేసుకొంటున్నాం కూడా.

ఆయన విశ్వాసాలేమి, విధానాలేమి ఆయన అంతస్తును బట్టి సమంజసమైనవే కావచ్చు. కాని, మనలో ఆ అంతస్తుగలవాడు మరొక్కడైనా లేడు; మనలోనేకాదు; ఈనాటి ప్రపంచంలోనే లేడు. అంచేత ఆయన మనకు నిర్దేశించిన కార్యక్రమంలో మన అంతస్తుకు తగినదాన్నే మనం ఎన్నుకోవాలి; దాన్ని చిత్తశుద్ధితో పరిపాలించాలి.

- అందరికీ తినడానికి తిండి, అందరికీ కట్టడానికి గుడ్డ, అందరికీ నిలవడానికి నీడ - దీన్ని సైతం ఆయన కాంక్షించాడు. అందరికీ విద్య, అందరికీ ఆరోగ్యం, అందరికీ విజ్ఞానం దాన్ని సైతం ఆయన లక్షించాడు.

అందరికీ శాంతి, అందరికీ భద్రత, అందరికీ సౌఖ్యం - ఇది కూడా ఆయన లక్ష్యమే. వీటిని మనకు సాధ్యమైన పద్ధతుల ద్వారా మనం సాధించగలిగితే, ఆ మేరకు ఆయనకు ఆత్మశాంతి నివ్వడమేకాదా?

మానవుని దేవతామూర్తిగా చేయాలని కూడా ఆయన ఆశించి ఉండవచ్చు; ప్రపంచాన్ని స్వర్గధామంగా మార్చాలని కూడా ఆయన లక్షించి ఉండవచ్చు.

ఈ మహాస్వప్నాన్ని నిజం చేయగల శక్తి మనకు లేనప్పుడు, మానవుడు మానవుని వలె జీవించడానికి తగు పరిస్థితులను కల్పించడానికి మాత్రమే ప్రయత్నిస్తామనడం ఋజుమార్గం కాదా?

(ఆంధ్రప్రభ 11-2-1948)

పెక్కు పుణ్య నదీనదాలలో నేడు గాంధీజీ అస్థి నిక్షేపం జరుగుతున్నది. హిందూ ధర్మశాస్త్రం ప్రకారం ఇది జరగదగు కర్మకాండేకావచ్చు. కాని, మానవ ధర్మశాస్త్రం ప్రకారం ఇంతకంటే ఎంతో ముఖ్యమైనకర్మ కాండ మరొకటి కలదు.

అది,-గాంధీజీ భావాలను, ఆయన బోధనలను మన హృదయాలలో కాదు, మన జీవితాలలోనిక్షిప్తం చేసుకొనడం.

అయినా, ఆయనపట్ల మనప్రేమ మనలను మూఢులనుగా చేస్తున్నట్టున్నది; ఆయనపట్ల మన భక్తి మనలను అంధులనుగా చేస్తున్నట్టున్నది; ఆయన నిర్యాణం వల్ల మనలో పెల్లుబికిన లజ్జాసంతాపాలు మనలను కర్తవ్య విమూఢులను చేస్తున్నట్టున్నవి.

గౌతమబుద్ధుని నిర్యాణానంతరం మనదేశంలో జరిగిన మహాపరాధమే నేడుకూడా జరుగుతున్నదని హెచ్చరిస్తున్నందుకు మమ్ము మన్నించాలి.

నాడు ఆయన అస్థికల విషయమై చూపబడిన శ్రద్ధాభక్తులు ఆయన జీవిత లక్ష్యాల విషయమై చూపబడలేదు. దీని దుష్ఫలితం, - గౌతమ బుద్ధుడు జన్మించిన భారతదేశంలోనే బౌద్ధమతానికి స్థానంలేకుండా పోవడం.

ఇట్టి కళంకమే తిరిగి మన చరిత్రకు తప్పవలెనంటె, గాంధీజీ నిర్యాణంపట్ల మన ఆవేదన పరీక్షగా మారాలి; ఆయన వియోగంపట్ల మన సంతాప భారం భావికర్తవ్య నిర్ణయంగా మారాలి. ఆయన పెట్టుకున్న మహోన్నత లక్ష్యాలను మనం అందుకోలేకపోవచ్చు; ఆయన చేసిన అసిధారావ్రతాన్ని మనం చేయలేకపోవచ్చు; ఆయన మహాతపస్సు ఆయనకు ఒక్కడికే చెల్లినదికావచ్చు.

కాని, ఆయన ఆశయాలలో కొన్నింటినైనా మనం సాధించవలదా? ఆయన ఆవేదనలో శతాంశమైనా మనం ప్రదర్శించవలదా?

ఆయన కనిన కలలలో ఎంతభాగాన్ని నిజంచేయగలమని ఆలోచించుకొనడమైనా మన ప్రథమ కర్తవ్యంకాదా?

ఆయన చెప్పినట్టు పరులమేలే మనమేలుగా భావించడం మనకు సాధ్యం కాకపోవచ్చు కాని, పరులకు కీడుద్వారా మన మేలును సాధించడమైనా మనం మానవలదా?



ఆయన కోరినట్టు ఒక చెంపను కొడితే రెండవ చెంపను తిప్పడం మనకు సాధ్యంకాకపోవచ్చు కాని, చెంపపెట్టు పెట్టడమే మన వంతు కాకుండానైనా మనం జాగ్రత్తపడవలదా?

ఆయన ఉద్బోధించినట్టు సంఘసేవలో - దేశారాధనలో - సర్వస్వాన్ని త్యాగంచేయడం మనకు సాధ్యంకాకపోవచ్చు. కాని, సంఘానికి ద్రోహంచేసే దేశానికి ముప్పు తెచ్చే - స్వార్థసాధనను విరమించడమైనా మన కర్తవ్యం కావలదా?

ఈపాటికైనా మనం ఈనాడు మనం కృతనిశ్చయులముకాకపోతే మనం కొట్టే కొబ్బరికాయలపట్ల, పట్టే హారతులవల్ల, వేసే పూలమాలలవల్ల, చేసే భజనలవల్ల గాంధీజీ ఆత్మకు శాంతి లభించగలదా?

నిజానికి ఆయనకు నేడు జరుగుతున్న పూజలు పూజలు కానేకావు; ఆయనపట్ల నిజమైన ప్రేమకు నిజమైన భక్తికి - తార్కాణం ఆయన మన దేశపరిస్థితులలో వేటిని చూచి విషణ్ణహృదయుడైనాడో వాటిని తొలగించడానికి పూనుకొనడమే.



మన గురుడు, మన దైవం

పట్టెడు మెతుకులకై నకనకలాడుతున్న వానిని చూడగానే మనం కలత చెందకపోతే మనకు గాంధీజీ పట్ల ప్రేమలేనట్టే ఒంటినిండా గుడ్డలేక, చలికి, ఎండకు బాధపడుతున్నవానిని చూడగానే మనం భిన్నులము కాకపోతే, గాంధీజీపట్ల ప్రేమలేనట్టే.

సంఘ దురాచారాలపట్ల మనకు జుగుప్సలేకపోయినా, సంఘవంచితులకై మన హృదయం కలవరపడకపోయినా, గాంధీజీ స్మృతికి మనం అపచారం చేసినట్టే.

మనలో ఇట్టి పరివర్తన కొరకే ఆయన జీవించాడు; ఇందు నిమిత్తమే ఆయన మరణించాడు. అయినా, ఈనాటికైనా, ఇది మనలో కానరాకపోవడం ఎంత శోచనీయం.

ఈ బాధతోనే పునరుక్తిదోషాన్ని పాటించక మేము కింది హెచ్చరికను తిరిగిచేస్తున్నాము : గాంధీజీకి మనం పీఠం వేయవలసింది; దేవలోకంలోకాదు, మన హృదయ సీమలో. ఆయన పట్ల మనం భక్తి ప్రేమలను ప్రదర్శించవలసింది స్మారకచిహ్నాలను నిర్మించడంద్వారా కాదు; మన దేశాన్ని ఆయన ఆశయాలకు సాధ్యమైనంత సమీపంగా తీర్చిదిద్దుకొనడం ద్వారానే.

మన గురుడు, మన దైవం ఏడాదినాడు గాంధీజీ హత్య జరిగింది. (ఆంధ్రప్రభ 12-2-1948)

ఆయన హత్యావార్త విని ఆనాడు మన తండ్రిని కోల్పోయిన బిడ్డల వలె విలపించాము. కాని ఆ తర్వాత ఎన్నిసార్లు ఎన్నివిధాలుగా ఆయనను మనం హత్య చేయలేదు? సత్యమార్గచ్యుతులమైన ప్రతిసారి ఆయనను హత్యచేశాము.

మానవ ప్రేమకు మారుగా విద్వేషానికేమి, జీవకారుణ్యానికి మారుగా హింసకేమి, మన హృదయంలో స్థానమిచ్చిన ప్రతిసారి ఆయనను హత్యచేశాము.

వ్యక్తిగత ప్రయోజనానికి, సంఘక్షేమాన్ని; స్వీయాభివృద్ధికి దేశాభ్యుదయాన్ని బలిపెట్టిన ప్రతిసారి, ఆయనను హత్యచేశాము.

ఏడాదికంటే ఈనాడే, ఆ దివ్యాత్మ అధికవేదనా సంక్షుభితమౌతున్నది.

ఏడాదినాటికంటె, ఈనాడు దేశంలో, దొంగ వ్యాపారం హెచ్చలేదా? లంచగొండితనం పెరగలేదా? స్వార్థపరాయణత్వం ప్రబలలేదా?

ఏడాదినాడుకంటె ఈనాడు కడుపుకూటికై ఎక్కువ కటకట కానరావడం లేదా? కట్టు గుడ్డకై ఎక్కువ ఆరాటపడవలసి రావడంలేదా? నిలవ నీడకై ఎక్కువ అగచాట్లపాలు కావలసి రావడంలేదా?

"అన్నమో రామచంద్రా" అని జీర్ణకంఠం నుంచి దైన్యాలాపం వెలువడిన ప్రతిసారి మహాత్మునిగుండె చీరుకుపోలేదా?



"సిగ్గు కాపాడుకోడానికి చేరెడు గుడ్డపీలికైనా లేదుగదా" అని వెలువడిన ప్రతి నిట్టూర్పు మహాత్ముని వెన్నులో ఒక బాకుపోటేకాదా?

"అయ్యో! తలదాచుకోడానికి చోటులేక పిల్లలు తడిసిపోతున్నారు" అని ఏ తల్లిగుండె తల్లడిల్లినా, బాపూజీ ఖూనీ అయినట్టే కాదా?

ఈ ఏడాది లోపల కొన్ని వేలసార్లు - కాదు కొన్ని లక్షలసార్లు - కాదుకాదు కొన్ని కోట్లసార్లు మహాత్ముని మనం హత్యచేశాము. ఇది నిజం. నిజమిది. ఇదే నిజం.

అయితే ఆయనకు మనం ప్రాణంపోసిన సమయాలు కూడా కొన్ని లేకపోలేదు. స్వంత లాభాన్ని కొంత చంపుకొన్న ప్రతిసారీ మనం ఆయనకు జీవం పోశాము. అవినీతికి పరాఙ్ముఖులమైన ప్రతిసారీ ఆయనకు సంజీవి పోశాము.

మత విభేదాలకు అతీతులమైన ప్రతిసారీ ఆయనకు ప్రాణప్రతిష్ట చేశాము.

ఇట్టి సందర్భాలను అనంతమైనవిగా చేసినప్పుడే గాంధీజీ మనమధ్య పుట్టినాడనీ, మన మధ్య మసలినాడనీ గర్వించడానికి మనకు హక్కు అప్పుడే ఆయన మనలను విడిపోయినాడని విలపించడానికి మనకు హక్కు అప్పుడే ఆయనకు చేతులెత్తి నమస్కరించడానికి మనకు హక్కు

గాంధీజీ మనలను వీడిపోవడం ఆయనను మనమధ్య నిలుపుకోగల విశిష్టత మనకు లేనందువల్లనే.

దాన్ని ఏనాడు మనం సంపాదించుకోగలమో, ఆనాడే ఆయన తిరిగి మన మధ్యకు రాగలడు. ఔను; ఆయన ఆనాడు తిరిగి మన మధ్యకే రాగలడు. ఆయన సందేశం కేవలం మన దేశానికే కాదు; మొత్తం ప్రపంచానికే. ఆయన ఆశయం కేవలం, మన అభ్యున్నతేకాదు; మొత్తం మానవకోటి పురోగమనమే అయినా భారతదేశమే "తపోభూమి" అని ఆయన నమ్మకం. ఇదే "కర్మ భూమి" అని ఆయన విశ్వాసం. దీనిద్వారానే ప్రపంచానికి సేవచేయగలనని ఆయన నమ్మాడు. దీనినుంచే మానవకోటి సముద్ధరణను సాగించగలనని ఆయన విశ్వసించాడు. అందువల్ల ఆయన తిరిగిరావడమే సంభవిస్తే మన మధ్యకే వస్తాడు.

అప్పుడు ఆయన ఒక్క సేవాగ్రామంలోనే మకాం చెయ్యడు. ఊరూరా, వాడవాడా, అవతరిస్తాడు. అప్పుడు ఆయన సన్నిహితులైన కొందరిమధ్యనే అధికంగా కాలాన్ని గడపడు; ప్రతి హృదయ పీఠంపై అధివసిస్తాడు. అప్పుడు ఆయనిది విశ్వరూపం కాగలదు. అప్పుడు ఆయనకు నిత్య సంతృప్తి కలుగగలదు.

రెండేళ్ళ తరువాత గాంధీజీని చేతులారా చంపుకున్నాము. ఆయనను బ్రతికించుకొనడం మన చేతిలోపనే.

ఆ పనికి పూనుకొనకుండా ఆయన వర్ధంతులను జరపడం ఆయనపట్ల చేసిన అపచారం చాలదన్నట్లు దానికి అవమానాన్ని జతచేర్చడమే. ఆయనను ఒక్కసారి చంపడం చాలదన్నట్లు పదేపదే ఖూనీ చెయ్యడమే.

(ఆంధ్రప్రభ 30-1-1949)

రెండేళ్ళ తరువాత

ఈనాడు నీవు మా మధ్య లేవు.



"హరే రామ్!" అంటూ రెండేళ్ళనాడు సరిగా ఈనాడు నీవు మమ్ము విడిచిపెట్టి వెళ్ళిపోయావు. ఇందుకు మాకు సహజంగా దుఃఖం పొర్లుకు వస్తున్నది. కాని, దుఃఖపడే హక్కు మాకు లేదు. నిన్ను మా మధ్య నిలుపుకొనగల అర్హతే మాకుంటే నిన్ను మేము కోల్పోవడమే సంభవించి వుండేది కాదు.

మాకు అర్హత లేకపోయినా, నీవు ఈనాటికీ మా మధ్య నిలిచివుంటే, నీకు హృదయావేదన తప్పేది కాదు; నీ కఠోర తపస్సును యథాప్రకారం సాగిస్తూనే పోవలసివచ్చేది కూడా.

మేము సామాన్య మానవులము; మావి పరిమిత లక్ష్యాలు; మాది అల్ప సంతోషం. ఇందువల్లనే స్వరాజ్యం వచ్చిందంటే, స్వరాజ్యం వచ్చిందని 1947 ఆగష్టు 15వ తేదీనాడు ఉబ్బి తబ్బిబ్బులైనాము. నీవు మాత్రం ఆ నాడు ఢిల్లీలో నిలవడానికైనా సమ్మతించలేదు. "నా స్థానం కలకత్తాలో" అని చెప్పి, అక్కడికి వెళ్లి, మత విద్వేష పిశాచబాధితుల కన్నీటిని తుడుస్తూ ఆనాటిని గడిపావు. ఇంతేకాదు. జాతీయ పర్వదినమని మాలో కొందరు పంచభక్ష్య పరమాన్నాలను ఆరగిస్తుండగా, నీవు ఆ నాడు నిరాహారదీక్ష వహించావు. పట్టరాని సంతోషంతో మేము పరవళ్లు త్రొక్కుతుండగా, నీవు సూత్రయజ్ఞంలో నిమగ్నుడవైనావు.

మొన్నటి రిపబ్లికన్ దినోత్సవంనాడు నీవు మా మధ్యనే వుంటే, నీ స్థానం ఢిల్లీలో అయ్యేదికాదు. ఏ హరిజనవాడలోనో, ఏ శరణార్థుల శిబిరంలోనో, ఏ ఆర్తజన సందోహం మధ్యనో నీవు నిలిచేవాడివే. ఎవరో కొందరు అన్యాయపీడితులకు ఎవరో కొందరు సంఘవంచితులకు నీవు దుఃఖోపశమనాన్ని చేస్తుండేవాడివే. నీ విశ్వాసాన్ని వారికి పంచిపెడుతూ, నీ కారుణ్యాన్ని వారిపై చిలుకుతూ, నిస్పృహతో మోడువారిన వారి హృదయాలను ఆశాలతలతో తిరిగి చిగురింపజేస్తుండేవాడివే.

నీ, మా మధ్యగల ఈ అంతరమే నిన్ను మాకు కాకుండా చేసింది. అయినప్పుడు నీవు మమ్ము విడిచి వెళ్ళినావని విలపించడానికి మాకు హక్కు ఎక్కడిది?

నీవు చూచినమేరకు మేము - ఈనాడే కాదు - ఏనాడూ చూడలేము. నీవు నడిచిన దారిని - ఇప్పటికే కాదు - ఎప్పటికీ మేము నడవలేము.



ఈ సంగతి మాకంటె నీకే ఎక్కువగా తెలుసునేమో! అందువల్లనే మమ్ము అడుగడుగు చొప్పున నీవు ముందుకు నడిపించావు; అడుగడుగుకు నీ ఆసరా మా కిచ్చావు. అయినా, కొద్ది తప్పటడుగుల తర్వాత మరి నీ దారిని ముందుకు కదలడానికి మేము తిరస్కరించాము. నీ దారి నుంచి మాది త్వరితంగా వేరైపోసాగింది. అందువల్లనే నిన్ను మేము కోల్పోయాము. ఇప్పటికీ మేము నీదారినే నడుస్తున్నామనుకొనడం ఆత్మవంచన, ఎప్పటికైనా నీ గమ్యస్థానాన్నే చేరుకొననున్నామని చెప్పడం పరవంచన. అసత్యంతో, అన్యాయంతో, స్వార్థంతో, సంకుచి తత్వంతో, ధనపిపాసతో, పదవీ వ్యామోహంతో లుకలుకలాడుతున్న నేటి దేశ వ్యవస్థ నీ సృష్టే అన్నట్టు "భారత జనకుడు" అని నిన్ను శుష్క ప్రశంసలను చెయ్యడం లోకవంచన. - నీ దివ్యప్రభావం మాపై కొంతగానైనా పడితే, నేడు మా కర్తవ్య మొక్కటే. అది మా దౌర్బల్యాలను మన్నించి, మమ్ము ఆశీర్వదించవలసిందిగా కోరడమే.

మా దౌర్బల్యాలను మేము గుర్తించి, చిత్తశుద్ధితో నీ ఆశీర్వాదాన్ని కోరితే, అది తప్పక లభిస్తుంది. నీవు క్షమామూర్తివి; కారుణ్యనిధివి. నీ క్షమాకారుణ్యాలే గౌతమబుద్ధుని సరసను, ఏసుక్రీస్తు సరసను నీకు స్థానాన్ని కూర్చాయి.


అయితే, ఒక్క విషయాన్ని నీవు క్షమించలేవు. అది - కపటం. ఒక్కదానిపట్ల నీ హృదయం కారుణ్యమెరుగదు, అది నటన. కాని, నీకు, నీ లక్ష్యాలకు సంబంధించినంతవరకు మాలో పెక్కుమంది కపటమే. లేదా, నాతికఠినమైన పదప్రయోగాన్ని చెయ్యాలంటే, చేస్తున్నది. కేవలం నటనే. ఈ పరిస్థితిలో మమ్ము ఆశీర్వదించడమైనా నీకు కష్టమే. అయినా, మమ్ము ఆశీర్వదించు. (ఆంధ్రప్రభ 31-1-1950)

మహాత్ముని అడుగుజాడలలో (గ్రంథ సమీక్ష) ఒక ప్రపంచ యుద్ధం ముగిసినంతనే మరొకదాని ప్రస్తావన తప్పడంలేదు. రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలోనైనా శాంతిలేదు.

ప్రథమ, ద్వితీయ ప్రపంచ యుద్ధాల మధ్య సమయంలో చిన్న చిన్న యుద్ధాలు కనీసం ఒక యాభై జరిగినవి.

ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామం ముగిసినట్టు ప్రకటించబడి మూడేండ్లు నిండినవో, లేదో, అప్పుడే గ్రీసు, పాలస్తీనా, ఇండో-చైనా, ఇండొనీసియా, మలయా, బర్మా, చైనా, దక్షిణ అమెరికా మొదలైన చోట్ల ఎన్ని యుద్ధాలు ప్రారంభం కాలేదు! వీటిలో ఎన్ని నేటికీ కొనసాగడం లేదు!

మహాత్ముని అడుగుజాడలలో (గ్రంథ సమీక్ష) నిరంతర యుద్ధభయమే కాకుండా, సర్వసాధారణంగా యుద్ధబాధ మాత్రమే కాకుండా, ఏ దేశాన్ని చూడబోయినా, ఏ జాతి జీవితాన్ని పరికించినా, అసంతృప్తి, అశాంతి, అల్లకల్లోలం మాత్రమే కానవస్తున్నాయి.



దీన్ని చూడగా ఏ విజ్ఞుని హృదయమైనా భిన్నం కాకమానదు. అతని భిన్న హృదయం "ఈ అసంతృప్తి నుంచి, ఈ అశాంతి నుంచి, ఈ అల్లకల్లోలంనుంచి మానవజాతికి విముక్తి మార్గం లేదా?" అనే తీవ్రవేదనను చెందకమానదు కూడా.

ఇట్టి తీవ్రవేదన ఫలితమే "ఇన్ ది పాత్ ఆఫ్ మహాత్మాగాంధీ" అనే పేరుతో మిస్టర్ జార్జ్ కాట్లిన్ రచించిన ఉత్తమ గ్రంథం.

"పురుషులను, రాజకీయాలను, స్త్రీలను, ఆచార వ్యవహారాలను శాన్ఫ్రాన్సిస్కో నుంచి, సిమ్లావరకు, మాస్కో నుంచి, మాడ్రిడ్వరకు, శాంతి సమయంలో, యుద్ధ కాలంలో, విప్లవఘట్టాలలో నలభై సంవత్సరాలు పైనుంచి చూస్తున్నాను. ఎక్కడా, లేదా, బహుకొద్ది ప్రాంతాలలో తప్ప, శాంతి కానరాలేదు. ప్రపంచంలో ఎక్కడ చూచినా రక్తపాతమే, ఘోరాన్యాయమే కానవచ్చింది. లేదా, స్త్రీలోలత్వమే, ప్రాపంచిక ప్రలోభాలే కానవచ్చాయి. జాగృతి చెందాలనే వాంఛ ప్రపంచ ప్రజలలో కానరావడం లేదు. అందువల్లనే కోట్ల కొలదిగా వారి చిత్రవధ జరుగుతున్నది. అంధులకు, అజ్ఞానులకు, అధోగతి తప్పదుగదా! ఈ సంక్షుభిత ప్రపంచంలో శాంతి సంస్థాపన నిమిత్తం డెబ్బై సంవత్సరాల పై చిలుకునుంచి తన జీవితాన్ని అంకితం చేసిన తపస్విని - యాభైసంవత్సరాల పై చిలుకునుంచి కేవలం బోధనల ద్వారానే కాకుండా, ఆచరణ ద్వారా కూడా శాంతి ప్రచారాన్ని చేస్తున్న మహర్షిని - ఇండియాకు వెళ్ళి, దర్శనం చేసుకువస్తాను. నన్ను పీడిస్తున్న ధర్మ సందేహాలను ఒకవేళ ఆ మహాత్ముడు తీర్చగలడేమో" - ఈ జిజ్ఞాసతో కాట్లిన్ 1947లో మన దేశానికి యాత్రికుడై వచ్చాడు. ఆ యాత్రను గురించిన నివేదికను పోలినదే "మహాత్ముని అడుగుజాడలలో" అనే ఈ గ్రంథరాజం.

మానవునికి అశాంతి కొత్త కాదు; శాంతి కాముకత్వం సయితం కొత్తది కాదు.

"నే నెవరిని?" అని ప్రశ్నించుకొన నేర్చిన నాటి నుంచీ మానవుని అశాంతి పీడిస్తున్నది; దానినుంచి విముక్తికై అప్పటి నుంచీ అన్వేషణ సాగుతున్నది కూడా.

వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, త్రిపిటకాలు, జెండవస్థా, బైబుల్, కొరాన్ మొదలైనవన్నీ ఈ నిరంతరాన్వేషణను గురించిన నివేదికలే.

శాంతిలబ్ధికి ఇవి అనేక మార్గాలను సూచించక పోవడంలేదు గాని, జీవితాన్ని ప్రాపంచికమని, పారలౌకిక మని రెండు విభాగాలను చేయడమేమి, ఈ రెండింటిలో ఏదో ఒక దాన్నే మానవుడు ఎన్నుకొనగలడని నిర్దేశించడమేమి వీటిలో అధికంగా కానవస్తుంది.

ఈ విభేదాన్ని తొలగించడానికి వీలులేదా? కనీసం దీన్ని తగ్గించడానికి వీలులేదా?

గాంధీజీ సూత్రాల ప్రకారం సైన్యాలు తగవు; ఆయుధాలు తగవు. ఇవి లేకుండా మనం జాతీయ ప్రభుత్వాన్ని నడిపించుకొనగలమా?

ఇట్టి వీలు కలదని చెప్పి, ప్రాపంచిక, పారలౌకిక జీవితాలను సమన్వయం చేయడానికి మహా కృషి చేసినవాడు గాంధీజీ.

సత్యం, ప్రేమ, కారుణ్యం, అహింస - ఇవే మానవునికి శాంతి నివ్వగలవని ప్రతి మత గ్రంథం ఉద్ఘోషించింది; ప్రతి మత ప్రవక్త ఉద్ఘాటించాడు. కాని, సంఘజీవితానికేమి, ప్రభుత్వాల నిర్వహణకేమి ప్రేమ సత్యాలను, అహింస కారుణ్యాలను అనువర్తింపజేయడం సాధ్యమా? అయితే, అది ఏ పద్ధతులపై?


ఈ ప్రశ్నలకు ఓంప్రథమంగా గాంధీజీయే ఒక ప్రత్యుత్తర మిచ్చాడు. ఆ ప్రత్యుత్తరంలో సూచితమైన మార్గమే అనుసరణీయమైనదని నిరూపించడానికే ఆయన జీవించాడు; ఆ ప్రయత్నంలోనే ప్రాణత్యాగాన్ని చేశాడు కూడా!

ఈ త్యాగంవల్ల గాంధీజీ మార్గమే ప్రపంచానికి అనుసరణీయమైనదని నిరూపితమైనదా? లేక, అది వర్జించదగినదని నిరూపితమైనదా? ఈ ప్రశ్నకు సమాధానాన్ని చెప్పగలిగింది భావి తరాలవారే.

కాని, ఈలోపున అసంతృప్తి నుంచి, అశాంతినుంచి, అల్లకల్లోలం నుంచి, యాటంబాంబునుంచి మానవ జాతిని తప్పించడానికి గాంధీజీ బోధనలే శరణ్యమని విశ్వసించి, ఆయన అడుగుజాడలలో నడవడానికి దేశదేశాలలో ఎందరెందరో ప్రయత్నించకపోరనడానికి మేము సమీక్షచేస్తున్న ఈ పుస్తకమే తార్కాణం.

మీరు ఆస్తికులు కావచ్చు; లేదా, నాస్తికులు కావచ్చు; అహింసలో విశ్వాసం కలవారు కావచ్చు: లేనివారు కావచ్చు; మీ సాంఘిక, రాజకీయాభిప్రాయాలు ఎట్టివైనా కావచ్చు. ఏమైనా, ఈ పుస్తకం నేటి ప్రపంచ స్థితిగతులను గురించి, మానవజాతి భవితవ్యాన్ని గురించి మీలో జిజ్ఞాసను రేకెత్తిస్తుంది. ఏ గ్రంథానికైనా ఇది స్వల్ప ప్రయోజనం కాదు గదా? మన దేశభాషలలోకి దీన్ని అనువాదం చేయడానికి త్వరలోనే ప్రయత్నం జరగగలదని ఆశిస్తున్నాము.

## గాంధీజీ ఆవేదన



తాను పెట్టుకున్న మహాలక్ష్యాల సాధనకు, తాను చేయదలచుకున్న మానవసేవ పరిపూర్తికి నూరేళ్లు కూడా చాలవని గాంధీజీభావం. అంచేతనే, నూరుపైన మరి ఇరవై యేళ్ళపాటైనా జీవించాలని ఆయన కోర్కె

కాని, ఇటీవల ఆయనకు బ్రతుకుపైనే రోతపుడుతున్నది. “ఆ దేవుడు త్వరలో నన్ను ఎత్తుకుపోరాదా?” అని ఇటీవల ఆయన పదేపదే అంటున్నాడు.

ఇంతగా జీవితంపై ఆయనకు విరక్తి కలగడానికి నేటి దేశ పరిస్థితులే కారణం.


సత్యం, ప్రేమ, కారుణ్యం, అహింస - ఇట్టి లక్ష్యాల ప్రచారం కోసమే - వీటి ప్రతిష్టాపనకోసమే గాంధీజీ తన జీవితాన్ని అంకితం చేశాడు. కాని, నేడు దేశంలో ఎక్కడ చూచినా సత్యం బదులు అసత్యం, ప్రేమ బదులు ద్వేషం, కారుణ్యం బదులు క్రౌర్యం, అహింస బదులు హింస రాజ్యం చేస్తున్నాయి. పైగా, పవిత్రమైన మతం పేరిట ఈ దుష్టశక్తులన్నీ స్వైరవిహారం చేస్తున్నాయి.

గాంధీజీ జన్మవల్ల హిందువు కావచ్చు. కాని, అన్ని మతాలను ఆయన పరిశీలించాడు; వాటి బోధనలను హృద్గతం చేసుకున్నాడు. అందరినీ సమదృష్టితో చూడ్డం. అందరినీ ప్రేమించడం, అందరికీ సేవచెయ్యడం - ఇదే అన్ని మతాల సారాంశమని ఆయన తెలుసుకున్నాడు.

అయినప్పుడు మతం పేరట ఒకరి కుత్తుకను మరొకరు ఎలా ఉత్తరించగలుగుతున్నారో ఆయనకు అర్థం కావడంలేదు; మతం పేరట ఒకరి కొంపకు మరొకరు ఎలా నిప్పు పెట్టగలుగుతున్నారో ఆయనకు గ్రాహ్యం కావడంలేదు; మానవుని దేవతామూర్తిగా చేయవలసిన మతమే అతడిని కిరాతకునిగా ఎలా చేస్తున్నదో తెలియక ఆయన బాధపడుతున్నారు.

అయితే, ఇది మతాల తప్పు కాదని ఆయనకు తెలుసు. అయితే, ఇక తప్పు ఎవరిదైనట్టు? మత బోధనలను ప్రచారం చెయ్యవలసిన తమబోటివారిదేనేమో ఆ తప్పు! ఈ ఆవేదనతోనే ప్రేమను, సహనాన్ని, సామరస్యాన్ని

తిరిగి దేశంలో నెలకొల్పలేకపోతే, ప్రస్తుతపు ఘోర పరిస్థితులను చూస్తూ బ్రతకడం కంటె చావే మేలని గాంధీజీ అనుకుంటున్నాడు.



విద్వేషాన్ని ఎవరు ప్రజ్వలింపజేశారు? హత్యాకాండను ఎవరు ప్రారంభించారు? - ఇట్టి ప్రశ్నలకు గాంధీజీ దృష్టిలో ఎంతమాత్రం ప్రాధాన్యం లేదు. ద్వేషాన్ని ప్రేమతోను, హింసను అహింసతోను వారు ఎదుర్కొనాలని ఆయన నమ్మకం. అందువల్లనే ఆయన నేడు ముస్లిములపై ఎంత నిందవేస్తున్నాడో, హిందువులపై కూడా అంత నిందనే మోపుతున్నాడు.

గాంధీజీ అంతస్థుకు అందరు రాగలిగితే, ఆయనవలె అందరు మహాత్ములు కావలసిందే. కాని, గాంధీజీ హెచ్చరిస్తున్నట్టు, ఇండియాలో ముస్లిములకుగాని, పాకిస్థాన్లో మహమ్మదీయేతరులకుగాని స్థానం లేకుండ పోవాలనడం అవివేకం మాత్రమే కాక, ఆచరణ సాధ్యంకాని విషయం కూడా.

పాకిస్థాన్లో ఇంచుమించు 180 లక్షల మంది మహమ్మదీయేతరులున్నారు. వీరిని భరించడం ఇండియాకు సాధ్యమైనా, ఇండియాలోని 420 లక్షల ముస్లిములను భరించడం పాకిస్థాన్ తరం కాదు.

పైగా, ఇండియా కేవలం హిందూ రాజ్యం కావాలనడం మన జాతీయ లక్ష్యానికే విరుద్ధం. జాతీయత మతవిభేదాలకు అతీతమైనదని విశ్వసిస్తున్న మనం దాన్ని ఏదో ఒక మతవర్గం అవధులకు పరిమితం చేయలేము. అంచేత అన్యులు ఎంత ఉన్మత్తంగా ప్రవర్తించినా, జాతీయవాది తన జాతీయతకు స్వస్తి చెప్పుకొనడం పాడికాదు.

ఈ మేరకు గాంధీజీ పడుతున్న ఆవేదన ప్రతి జాతీయవాది పడవలసిందే. పంజాబ్లోని ప్రస్తుత పరిస్థితులనుబట్టి జనాభా మార్పిడితప్ప దారిలేకపోవచ్చు. కాని, ఇది సమస్యా పరిష్కారానికి పరిమిత సాధనే కావాలి; తాత్కాలిక తరణోపాయమే కావాలి. బుద్ధిహీనులను ప్రతిఘటించడంలో వారి అంతస్థుకు దిగజారడం బుద్ధిమంతులకు తగని పని.

గాంధీజీ ఈనాడు

“జీవితేచ్ఛ నాలో నశిస్తున్నది” అని వ్యాకులచిత్తంతో చెప్పిన వారెవరు? "త్వరలో వెళ్లిపోవాలి” అని బాధాతప్త హృదయంతో పలికిన వారెవరు?

మరెవరోకాదు “మహాత్ముడు”గా, “జాతిపిత”గా మనం సంస్తవిస్తున్న గాంధీజీ.

తాను కనిన కలలు పీడకలలుగా మారిపోతున్నాయని, తాను కట్టిన సౌధాలు తన కళ్లముందే కూలిపోతున్నాయని; ఆయన భావించాడు. నూరుపైన ఇరవై సంవత్సరాలు బ్రతకాలన్న తన కోర్కెను విడనాడాడు. ఎంత త్వరగా వెళ్లిపోతే అంత మంచిదని మరణానికై ఎదురు చూడనారంభించాడు.

జాతీయ స్వాతంత్ర్య సముపార్జనతో, గాంధీజీ జీవితం, చరితార్థమైనట్టు ఇతరులు భావించవచ్చు. కాని, 1947 ఆగష్టు 15వ తేదీ ఇతరులకే పర్వదినం కాని, ఆయనకు కాదు. ఆనాడు ఏ సభలోనూ, ఏ సమావేశంలోను ఆయన పాల్గొనలేదు. ఏ ఉత్సవం వైపు తొంగి చూడలేదు. నాడు ఆయన ఉపవాసం చేశాడు, ప్రార్థనలు చేశాడు. పెల్లుబికి వస్తున్న తన దుఃఖాన్ని ఎంతో కష్టంపై అణచిపెట్టుకున్నాడు.

దేశాన్ని రెండుగా చీల్చిన స్వాతంత్ర్యం ఆయన దృష్టిలో స్వాతంత్ర్యం కాదు; మతకల్లోలాలు లక్షల మందిని బలిగొంటు వుండగా వచ్చిన స్వాతంత్ర్యం ఆయన దృష్టిలో స్వాతంత్ర్యం కాదు. కొన్ని కోట్లమందిని నిర్వాసితులను చేసిన స్వాతంత్ర్యం ఆయన దృష్టిలో స్వాతంత్ర్యం కాదు. అందువల్లనే తక్కిన వారికి పర్వదినం గాంధీజీకి సంతాపదినమైంది.

గాంధీజీ ఈనాటి వరకు జీవించి వుంటే ఈనాడు ఆయన మనస్సు మరెంత వికలంగా వుండేదో, ఆయన హృదయం మరెంత విషణ్ణంగా వుండేదో, ఆయనలోని ప్రత్యణువు ఎంతగా గిలగిల తన్నుకొని వుండేదో!

గాంధీజీ జీవితకాలంలో కంటే నేడు నిజమే పంటలు ఎక్కువ పండుతున్నాయి; పారిశ్రామికోత్పత్తి అధికంగా సాగుతున్నది; ఆనకట్టలు సంఖ్య పెరిగింది; రోడ్ల నిడివి పెరిగింది; పవర్ సప్లయ్ హెచ్చింది; ఒక్కమాటలో జాతీయ సంపద పెరిగింది కాని, వీటినన్నిటిని మించినవి గాంధీజీ దృష్టిలో వేరే వున్నాయి. అవి - నైతికపు విలువలు, మానవతకు ప్రాధాన్యమిచ్చే విలువలు. వీటి విషయంలో ఈనాడు మనం అతి హీనస్థితిలో వున్నాము.

## జనవరి 30వ తేది

నైతికపు విలువలకు ప్రాధాన్యమిచ్చేవాడు ఈనాటి సంఘంలో "కాంజినిటల్ ఇడియెట్"గా పరిగణించబడుతున్నాడు. మానవతకు ప్రాధాన్యమిచ్చేవాడు “ఇంప్రాక్టికల్ ఐడియలిస్టు"గా త్రోసివేయబడుతున్నాడు. తీవ్రత వున్నా ఈ పలుకులలో అత్యుక్తి లేదు, ఉత్ప్రేక్షలేదు.



ఏ జీవిత రంగంలోనైనా ఈనాడు నీతికి, నిజాయితీకి, నిస్వార్థానికి, నిర్మలత్వానికి, స్థానం తక్కువ కాగా, రాజకీయ రంగంలో కంచుకాగడాతో వెతకినా ఇవి కానరావడంలేదు. అధికార దుర్వినియోగం, ఆశ్రిత పక్షపాతం, అశ్వర్యాల సంపాదన - ఇవి రాజకీయాలకు ఈనాడు ప్రథమ లక్ష్యాలు, ఇవే ప్రధాన ధ్యేయాలు. "పొలిటీషియన్" అనడం ఈనాడు ఒక తిట్టు!

తక్కిన వారి మాట విడిచి పెట్టండి. గాంధీజీ అడుగు జాడలలో నడుస్తున్నట్టుగా, ఆయన ఆర్థిక, సాంఘిక సిద్ధాంతాలను అమలు జరపడానికి ప్రయత్నిస్తున్నట్టుగా, ఆయనకు వారసులైనట్టుగా చెప్పుకొంటున్నవారే అబద్ధపు బ్రతుకులు బ్రతుకుతున్నారు.

ఖద్దరు పేర, కుటీర పరిశ్రమల పేర, మద్య నిషేధం పేర, భూదానం పేర, చివరకు గాంధీజీ శతజయంతి ఉత్సవాల పేర, నీచంగా, నికృష్టంగా ప్రవర్తిస్తున్నవారు ఎందరెందరు మనకు ఈనాడు కానరావడం లేదు.

ఈనాటి వాతావరణంలో గాంధీజీకి, శ్వాస ఆడేది కాదు. నీటి నుంచి బయటపడిన చేపవలే ఆయన గిల గిల కొట్టుకొనేవారు. మరొకసారి చేతులు పైకెత్తి “పరమేశ్వరా! మరి నన్ను పిలుచుకొని పోవటయ్యా”! అని ప్రార్థించి వుండేవాడు. (ఆంధ్రజ్యోతి 2-10-1969)

గాంధీజీని మనం చంపింది 1948 జనవరి 30వ తేదీనాడు మాత్రమే కాదు; అనుదినం యనను మనం చంపుతూనే ఉన్నాం, అనుక్షణం చంపుతూనే ఉన్నాం.



సత్యాన్ని గాంధీజీ ఆరాధించాడు. “పరమేశ్వరుడంటే సత్యం” అని చెప్పడాన్ని మాని, “సత్యమే పరమేశ్వరుడు” అని చెప్పడం వరకు ఆయన సత్యారాధన వెళ్ళింది. కాని, ఈనాడు మన దేశంలో, మన సంఘంలో, మన అసత్యానికే తప్ప, సత్యానికి స్థానం దాదాపు లేదు.

అబద్ధాలాడి, అక్రమాలు చేసి, అన్యాయాలకు దిగి, మరి ఎంతకైనా సన్నద్ధపడి, విజయాన్ని సాధించాలి; దాన్ని సాధించిన వారే ఘనులు; తక్కినవారు

అసమర్థులు; ఛాందసులు; లేదా తమ చేతకానితనాన్ని కప్పిపుచ్చుకొనడానికి మడికట్టుకొంటున్న శుంఠలు. ఈనాడు మన ఆరాధ్య దైవమే "సక్సెస్" (విజయం).

హింస సరసన సత్యం మనలేదని గాంధీ చెప్పాడు. సత్యాన్ని, అహింసను ఆయన పర్యాయపదాలుగా సంభావించాడు. ఐనా, ఈనాడు మన దేశంలో, మన సంఘంలో, మనలో హింసా ప్రవృత్తి ప్రబలింది. అది ఎన్నెన్నో వెర్రితలలు వేస్తుంది. గాంధీజీని పోలిన మహాత్ములకు తప్ప అన్ని సందర్భాలలో అహింసను పాటించడం సాధ్యం కాకపోవచ్చు. సామాన్య మానవులు, సామాన్య మానవులతో కూడిన సంఘం కొన్ని కొన్ని సందర్భాలలో హింసాత్మక పద్ధతులను అనుసరించవలసి రావచ్చు. కాని, ఈనాడు జరుగుతున్న పని - హింసతో అవసరంలేని సందర్భాలలో సైతం దానికి దొరకొనడం: పైగా, హింసాత్మక చర్యలతో కూడిన ప్రజోద్యమాలకు "సత్యాగ్రహం" అని నామకరణం చేయడం!

నైతికపు విలువలకు గాంధీ అగ్ర ప్రాధాన్యమిచ్చాడు. నైతికపు విలువలకు ఎక్కడ స్థానం ఉన్నా, రాజకీయాలలో లేదని ప్రపంచం మొత్తం మీదనే ఒక విశ్వాసం ప్రబలంగా ఉంది. కౌటిల్యుడు, మాకియవిలీ మొదలైన రాజనీతి తంత్రజ్ఞులు ఈ విశ్వాసం గట్టిగా వేళ్ళుతున్నడానికి తోడ్పడ్డారు. వారిని ఖండించడానికే గాంధీ జీవించాడని, ఇందుకే ఆయన మరణించాడని చెప్పవచ్చు. రాజకీయాలలో నైతికపు విలువలను ప్రవేశపెట్టడాన్ని ఆయన తన జీవిత లక్ష్యాలలో అతి ముఖ్యమైనదాన్నిగా చేసుకున్నాడు. ఐనా, ఈనాడు మన రాజకీయాలలో కంచుకాగడాతో వెతికినా కానరానట్టివి నైతికపు విలువలే.

1948 జనవరి 30వ తేదీకి కొన్ని నెలలకు ముందునుంచి కూడా తన దేశ ప్రజలు తన జీవితాన్ని దుర్భరమైనదిగా చేస్తున్నందున తాను ఎంత త్వరగా మరణిస్తే, అంత త్వరగా తనకు బాధ తగ్గగలదని భావించడాన్ని గాంధీ ప్రారంభించాడు. ఇప్పుడైతే ఆయన మరింత ప్రగాఢంగా మరణాన్ని వాఛించేవాడని నిస్సందేహంగా చెప్పవచ్చు. అందువల్ల జనవరి 30వ తేదీనాడు ఆయనకు మనం పెట్టే ప్రతి నమస్కారం ఆయన గుండెలపై ఎక్కుపెట్టిన ఒక బాణమే, ఆయనను కీర్తిస్తూ మనం పలికే ప్రతి మాట ఆయన సమాధికి మరొక యిటుకే.

## హేతువాది దృష్టిలో గాంధీజి

(ఆంధ్రజ్యోతి 30-1-1973)



ఒక జీవితచరిత్రను వ్రాసిన రచయిత వరుసగా మరికొన్నింటిని వ్రాయడం కద్దు. మానవ జీవితంలోని ఒక ప్రత్యేకతే ఇందుకు ముఖ్యకారణం.

జీవితచరిత్ర వ్రాయదగిన స్థాయికి పెరిగిన వ్యక్తి అన్యులను పరిపరివిధాల ప్రభావితులను చేయడమేకాక, అన్యులచే ప్రభావితుడు కావడం సహజం. ప్రతి వ్యక్తి విషయంలో ఇది కొంతవరకు నిజం. అసాధారణ వ్యక్తుల విషయంలో ఇది మరింత నిజం.

అన్యులచే విశేషంగా ప్రభావితుడైనవాడే, ఆ ప్రభావాల ద్వారా తన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకొనగలవాడే ఉత్తమ మానవుడు కాగలడు. అతడే అన్యుల జీవితాలను ప్రభావితం చేయగలడు కూడా. కొందరి ప్రభావాలను స్వీకరించడంవలె మరికొందరి ప్రభావాలను వ్యతిరేకించడం సయితం జరుగుతుంది. అయితే, స్వీకరించినప్పటివలె వ్యతిరేకించినప్పుడు సయితం ఆ ప్రభావాల ముద్ర ఎంతో కొంత తప్పదు.

ప్రతి జీవితంపైన అన్యజీవితాల ముద్ర ఇంతగా పడుతుంది కనుకనే, ఒక జీవితచరిత్ర రచన వరుసగా మరికొన్నింటి రచనకు దారితీస్తూ ఉంటుంది. ఇదే శ్రీ ధనుంజయ కీర్ విషయంలో జరిగింది.

ప్రప్రథమంగా జ్యోతీరావ్ పూలే జీవితచరిత్రను శ్రీ కీర్ రచించాడు. గాంధీకంటే ముందుగా “మహాత్ముడు”గా కీర్తించబడిన మహనీయుడు ఈ పూలే. అస్పృశ్యతపై యుద్ధాన్ని ప్రకటించడం ద్వారా మనదేశంలో సాంఘిక విప్లవాన్ని ప్రారంభించిన ఘనత ఆయనదే.

శ్రీ పూలే జీవితం అనేక విధాల డాక్టర్ అంబేద్కర్ను ప్రభావితుని చేసింది. అందువల్ల పూలే జీవితాన్ని రచించిన తర్వాత కీర్ దృష్టి డాక్టర్ అంబేద్కర్పైకి సహజంగా వెళ్ళింది. ఇంత సహజంగానే ఆయన దృష్టి అటుపిమ్మట సావర్కార్, తిలక్ జీవితాల వైపుకు మరలింది.

తిలక్ను గాంధీ కొంతవరకు అనుసరించాడు, కొంతవరకు వ్యతిరేకించాడు. సావర్కార్, అంబేద్కర్లతో ఆయన పూర్తిగా విభేదించాడు. ఈ ముగ్గురి జీవితాలను గురించి పరిశోధనలను చేసినప్పుడు కీర్ గాంధీ జీవితచరిత్రను కూడా విధిగా పరిశీలించవలసి వచ్చింది. అయినప్పుడు, ఆయన కొత్తగా గాంధీ జీవితచరిత్రను వ్రాయడం కేవలం అడుగు తర్వాత అడుగు వేయడమే.

వెనుకటి తన నాలుగు జీవితచరిత్రల విషయంలో వలె ఇప్పటి తన “మహాత్మాగాంధీ విషయంలో సయితం కీర్ ఎన్నదగు విజయాన్ని సాధించాడు. వెనుకటివాటి కంటే ఇది బృహత్తర రచన. ఎనిమిది వందల పుటలకు పైగా ఇది విస్తరిస్తున్నది.



అంబేద్కర్, సావర్కార్ల జీవితాలను వ్రాసిన వ్యక్తి గాంధీ జీవితాన్ని ఒక గాంధేయునివలె వ్రాయబోడని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. అయితే, దీని తాత్పర్యం కీర్ గాంధీని దుయ్యబట్టినాడని కాదు. గాంధేయునివలె కేవలం భక్తిగౌరవాలతోకాక, విమర్శనాత్మక దృష్టితో ఆయన తన రచన కొనసాగించాడు.

గాంధీ ప్రపంచ మహాపురుషులలో ఒకడైనా, ఆయన హేతువాది కాడు; సైన్సును ఆయన నిరసించాడు; ఆధునికతనే నిరసించాడు; మతానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చాడు. అందువల్ల ఇతర హేతువాదులవలె కీర్ కూడా గాంధీ ప్రతివాక్కును, ప్రతిచర్యను హర్షించలేదు; సమర్థించలేదు. ఈ కారణాన తక్కిన గాంధీజీ జీవిత చరిత్రలకు భిన్నమైన ధోరణిలో కీర్ రచన నడిచింది. ఇదే దాని ప్రత్యేకత, దాని వైశిష్ట్యం.

అయితే, హేతువాదులైన కీర్ గాంధీజీని గురించి వెల్లడించిన అభిప్రాయాలన్నింటిని ఆమోదించలేరు; కొన్నిచోట్ల ఆయన గాంధీజీకి న్యాయాన్ని చేయలేదు. గాంధీజీని గురించి గాంధేయుల వ్రాతలకు "కరెక్టివ్"గా కీర్ రచనకు ఎంతో విలువ వున్నది.

గాంధీని గురించి వ్రాసిన వ్యక్తి అటుపిమ్మట నెహ్రూ జీవితచరిత్రకు వెళ్ళడం సహజం. కీర్ ఇంతే చేస్తున్నాడు. నెహ్రూ నుంచి ఆయన ఎం.ఎన్. రాయ్ వద్దకు వెళ్ళనున్నాడట కూడా.

జీవితచరిత్రకారుడుగా కీర్ గడించుకున్న పేరు ప్రతిష్ఠలను ఆయన గాంధీ చరిత్ర పెంచుతున్నది. ఇతరులు పేర్కొనని, లేదా పేర్కొననొల్లని, అనేక విషయాలను ఆయన పేర్కొన్నాడు. చెదురుగా కొన్నిచోట్ల గాంధీజీకి పూర్తి న్యాయాన్ని చేయకపోయినా, మొత్తం మీద నిశితదృష్టితో, నిష్పాక్షికంగా, నిర్భయంగా ఆయన తన రచనను కొనసాగించాడు.

అనేక సందర్భాలలో హేతుబద్ధంగా ఆలోచించకపోయినా, వ్యవహరించకపోయినా, కీర్ నొక్కి చెప్పినట్లు, గాంధీజీ అపూర్వ వ్యక్తి. అమరజీవి. తాను సత్యమని నమ్మినదాన్ని అనుసరించడంలో ఆయనను అధిగమించగలవారు ప్రపంచ చరిత్రలోనే లేరు. ఆయన గౌతమ బుద్ధుడు, సోక్రటీసు, ఏసుక్రీస్తు కోవకు చెందిన మహాపురుషుడు. (1976. కదంబం గ్రంథం నుంచి)

## గాంధీజీ కథలు (గ్రంథ సమీక్ష)



"తామర తగ్గాలంటే నేను ద్రాక్షపండ్లు తింటూ వుండాలని సలహా యిచ్చి, కస్తూరిబాను అడిగి కొన్ని పండ్లు తెచ్చుకోవలసిందిగా బాపూజీ నాకు చెప్పారు. ఆయన మాట ప్రకారం నేను నాలుగు అడుగులు వేశానో లేదో, వెనక్కు రమ్మని "వెడుతున్నావు సరే కాని, కొంత రగడ తప్పకపోవచ్చు. తిరిగి వచ్చిన మీదట ఏమి జరిగిందీ నా చెవిని వెయ్యి!" అని హెచ్చరించారు. "సబర్మతి గట్టుపైవున్న కస్తూరిబా కుటీరంలోకి వెళ్ళి, ద్రాక్షపండ్ల కోసం అడిగినంతనే ఆమె ముఖం చిట్లించుకొంది. ప్యారీలాల్ను పిలుస్తూ, "ఈయనెవరు? బాపూజీ కోసం దాచిన ద్రాక్షపండ్లు తానారగిస్తా నంటున్నారు!" అంటూ చిరాకుపడింది. మాటపడే బాపతు కాబట్టి, ముందే బాపూజీ హెచ్చరించి వుండకపోతే, ఆమె పలుకులు నాకు దుస్సహమై వుండేవే.

"ప్యారిలాల్ రాకముందే "అమ్మా! నేను కొత్తగా ఆశ్రమంలో చేరాను. ఆరోగ్యం సరిగా లేదు. ఇష్టం లేకపోయినా, బాపూజీ పంపినందువల్ల, ద్రాక్షపండ్ల కోసం రాకతప్పలే" దన్నాను. వెంటనే ఆమె గుండె కరిగింది. ముఖంలోని చిరాకు ఇట్టే మాయమైపోయింది. "ఈ భాగ్యానికే సంకోచం దేనికి, నాయనా? ద్రాక్షపండ్లు చాలానే వుండె! కాని, తన రోగులకు వాటిని బాపూ పంచి పెట్టివేయించారు. ఆయన కోసమని కాసిని దాచిపెట్టాను. ఆయన కంటె నీకే ఇప్పుడవి ఎక్కువ అవసరమై వుండాలి. అందువల్లనే ఆయన నిన్ను పంపివుంటారు. సరే! తీసుకో" అంటూ బుట్ట ఖాళీ చేసి నా కివ్వబోయింది.

"బాపూజీ కోసం దాచిపెట్టిన నాలుగు పండ్లను ఆమె నా కిచ్చివేస్తున్నట్టు వినగానే, వాటిని తీసుకొనడానికి నేను సంకోచించాను. కాని, కస్తూరిబా వాటిని నేను పుచ్చుకొంటేనే తప్ప వీలులేదని పట్టు పట్టడమే కాక, నా యోగక్షేమాలను వివరంగా అడిగి తెలుసుకొనడం మొదలుపెట్టింది. ఆమె వాత్సల్యం నా మనస్సుకు ఎంతో శాంతి నిచ్చింది. "నా తిరుగు రాక కోసం ఉత్సుకతతో వేచివున్న బాపూజీ "బ్రతికి బయట పడగలిగావా?" అని నవ్వుతూ అడిగారు. జరిగినదాన్ని నేను పూసగుచ్చినట్లు చెప్పగా విని, "ఔను, అదే ఆమె స్వభావం, నా కోసం మిగిల్చినదాన్ని మరెవరైనా పట్టుకుపోతున్నారంటే, ఆమెకు చెడ్డ కోపం వస్తుంది. కాని, ఆమెది జాలిగుండె. ఎవరైనా కష్టాలలో వున్నారంటే, ఆమె మనస్సు వెన్నవలె కరిగిపోతుంది" అన్నారు. కస్తూరిబా స్వభావాన్ని గురించి బాపూజీ చెప్పిన మాటలతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. అటుపిమ్మట ఎన్నోసార్లు ఆమె సరిగా ఈ విధంగానే ప్రవర్తించడం నాకు తెలుసు".

మచ్చుకు ఒక్కదాన్నే ఉదాహరిస్తున్నాముగాని, ఇట్టి మహిమాన్విత గాథలు కోకొల్లలుగా వున్నాయి. "బాపూ యాజ్ ఐ సా హిమ్" అనే గ్రంథంలో, గాంధీజీ సాన్నిధ్యంలో రెండు దశాబ్దాలపాటు జీవితాన్ని గడిపిన శ్రీ రామనారాయణ్ చౌధురి ఈ దివ్యస్మృతుల గ్రంథాన్ని హిందీలో రచించారు. హిందీ మూలానికి ఇది ఆయన స్వయంగా చేసిన ఇంగ్లీషు అనువాదం. నవజీవన్ పబ్లిషింగ్ హౌస్ (అహమ్మదాబాద్ 14) దీన్ని ప్రచురించింది. దీని వెల రెండున్నర రూపాయలు మాత్రమే. గౌతమబుద్ధుడు, ఏసుక్రీస్తులను గురించి ఈనాడు ప్రచారంలోగల గాథలు చారిత్రకంగా ఎంతవరకు సత్యమైనవో నిర్ధారణగా చెప్పలేము గాని, గాంధీజీ విషయమై ఆయన అంతేవాసులు తమ స్మృతుల రూపంలో వ్రాసి ప్రచురిస్తున్న ప్రతిగాథ అక్షరాల సత్యమైనట్టిది. "ఇట్టి లోకోత్తర పురుషు డొకనాడు ఈ ధరాతలాన్ని మెట్టినాడా అని భావితరాలవారు అబ్బురపడగలరు" అని గాంధీజీకి ఒకానొక సందర్భంలో ప్రపంచ ప్రసిద్ధ వైజ్ఞానిక శాస్త్రవేత్త, ప్రొఫెసర్ ఐన్స్టీన్, జోహారు లర్పించాడు. అట్టి అబ్బురపాటును ఈ తరంవారికి సయితం కలిగించగలపాటి వాస్తవిక గాథలు శ్రీ రామనారాయణ రచించిన ఉత్తమ గ్రంథంలో ఇంచుమించు పుట కొక్కటి చొప్పున వున్నాయి.

ప్రతి వ్యక్తి వదనం నేడు విషణ్ణమై కనబడుతుంది. ప్రతివారి హృదయం నేడు శోకవిహ్వలమై ఉంది. ఆసేతు హిమాచల పర్యంతం భారత వర్షాన్నే నేడు విషాద తమోచ్ఛాయలు సాంద్రంగా అలుముకున్నట్టు తోస్తుంది. కాదా మరి?



కస్తూరిబాయి కాలధర్మమొందిందంటే, ఒక మహాసాధ్వి అస్తమించిందన్నమాట. కస్తూరీబాయి నిర్యాణం చెందిందంటే, ఒక వీరపత్ని పరమపదించిందన్నమాట.

కస్తూరీబాయి దివికేగిందంటే, నలుబది కోట్ల భారతీయులు తమ తల్లిని కోల్పోయారన్నమాట!

ఆమె విద్యా సంపన్నురాలు కాకపోవచ్చు. ఆమెకు స్వతంత్ర భావాలు లేకపోవచ్చు. ఆమె ఏ జీవితరంగంలోనూ స్వకీయ ప్రతిభతో ప్రకాశించి ఉండకపోవచ్చు.

కాని, ఆమె ఆదర్శ హిందూ నారీమణి. పత్నిగా, మాతగా ఆమె అశేష ప్రజానీకపు ప్రేమను, భక్తిని చూరగొన్నది.

గాంధీజీ జీవితం కంటకావృతమైంది. కోరి ఆయన దారిద్ర్యాన్ని వరించాడు. సంతోషంగా ఆయన కష్టాలను ఆహ్వానించాడు. త్యాగాన్నే ఆయన తన జీవితానికి ధ్రువతారగా చేసుకున్నాడు. దేశం కోసం, ప్రపంచం కోసం, మానవజాతి కోసం తను ఆహుతి కావాలనే ఆయన ప్రగాఢ వాంఛ. తన ఆహుతి కారణంగా ఈ నిష్ఠుర ప్రపంచంలో సత్యం జయిస్తే, ధర్మం ప్రతిష్ఠితమైతే, అంతకంటే ఆయనకు సంతోష కారణముండదు.

త్రిభువనైక సౌందర్యవతియైన భార్యను, కొత్తగా జనించిన కుమారుని, సింహాసనాన్ని ఒక్కమాటలో సర్వస్వాన్ని త్యజించి, ప్రపంచం నుంచి దుఃఖాన్ని పారద్రోలే అమృతమార్గాన్ని సంశోధించడానికి బయల్దేరిన గౌతమ బుద్ధునివలె, విద్వేష కలుషితమైన మానవ సంఘానికి ప్రేమ సందేశాన్ని అందించవలెననీ, హింసాప్రపూరితమైన మానవజాతికి అహింసా సిద్ధాంతాన్ని బోధించవలెనని ప్రయత్నించి, ఆ ప్రయత్నంలో శిలువనెక్కిన ఏసుక్రీస్తువలె, గాంధీ మహాత్ముడు కూడా అడుగడుగున త్యాగాన్ని చెయ్యవలసిన ధర్మపథంలో పథికుడైనాడు.

అట్టి మహాత్మునికి సహధర్మచారిణిగా ఉండి, ఆదర్శ ధర్మపత్ని అనిపించుకోవడం సామాన్యమా? ఒక విధంగా మహాత్ముని త్యాగం కంటే శ్రీమతి కస్తూరీబాయి త్యాగమే అధికమైనది; ఉత్కృష్టమైనది; మహిమాన్వితమైనది.

మహాత్ముడు తనకు తనుగా ఒక పథాన్ని నిర్ణయించుకున్నాడు. దానివెంట పురోగమించాడు. ఇక, శ్రీమతి కస్తూరిబాయి ఆ పథంలో తనకు నమ్మకం ఉన్నా, లేకపోయినా భర్త అడుగుజాడలను సంతోషంగా అనుసరించింది.

భర్త తన నగలన్నింటిని ధర్మకార్యాల నిమిత్తం అమ్మివేసినప్పుడు, అలంకారాలను కోరే స్త్రీ సహజమైన ఆమె హృదయం గాయపడి ఉండవచ్చు. భర్త తమ ఆస్తి నంతటిని ప్రజా సంస్థలకిచ్చి వేసినప్పుడు “ఇది నా బిడ్డలకు అన్యాయం కాదా?” అనే ప్రశ్న ఆమె మాతృహృదయాన్ని కలచి ఉండవచ్చు.

ఇట్టి బాధ ఆమె పొందివుండకపోతే, ఆమెకు హృదయమే లేదని అనవలసి వస్తుంది. కాని, ఇట్టి బాధను పడికూడా భర్త నిర్ణయాలను శిరసావహించినందువల్లనే ఆమె త్యాగానికి మరింత విలువ వచ్చింది; మరింత దీప్తి వచ్చింది; ఆమె మహాసాధ్వి అయింది.



పదమూడు సంవత్సరాల పిన్నవయస్సులో కల్యాణ మండపంలో ఆచార్యుడు “ధర్మేచ, అర్థేచ, కామేచ నాతిచరితవ్యం” అని ఆదేశించినప్పుడు “నాతిచరామి” అనే ప్రతిజ్ఞను తెలియకనే తీసుకున్నప్పటికీ, ఆ ఆదేశాన్ని ఆమె తన జీవితంలో అనుక్షణం పరిపాలించింది.

ఈ ప్రతిజ్ఞా పరిపాలనమే ఆమెకు సీత, సావిత్రి, దమయంతి, అరుంధతి మొదలైన మహాపతివ్రతలతో సమాన స్థానాన్ని సమకూర్చింది.

కేవలం భర్త అడుగుజాడలను అనుసరించడమే కాక, భర్త చెంతలేనప్పుడు, ఆయన కర్తవ్య పథాన్ని నిర్దేశించలేనప్పుడు, ఆమె ఎంతో మనోధైర్యాన్ని ప్రదర్శించి, తనకు తనుగా కష్టాల నెదుర్కొన్నది; త్యాగాలను చేసింది కూడా.

ఈ అన్ని కారణాల వల్లనే ఆమె భారత జాతికి మాతృమూర్తి స్థానాన్ని ఆక్రమించింది. నేడు ఆమెను కోల్పోయిన భారతజాతి మాతృవియోగ దుఃఖభారంతో కృంగిపోతుంది. ఆమెకేం? ఆమె అదృష్టవంతురాలు. తన అకళంక చరిత్రతో సాధ్వీలలామ అని చరితార్థత గాంచి, పుణ్యవతిగా, భర్తృ సన్నిధానంలో, ఆయన చేతుల మీదుగా ఇహలోకయాత్రను చాలించి, స్వర్గధామాన్ని చేరుకుంది. ఇక, ఆ తల్లిని పోగొట్టుకున్న మనమే దురదృష్టవంతులం! ఆగాఖాన్ భవనంలో ఏ దుర్ఘడియలలో అడుగుపెట్టాడోగాని, అక్కడనే గాంధీజీ తన శిష్యుడు, తన సఖుడు, తన సచివుడు అయిన మహదేవ భాయిని ఇదివరలో కోల్పోయాడు. ఇప్పుడు తిరిగి తన అర్ధాంగి, తన సహధర్మచారిణి, తన సతీరత్నం అయిన కస్తూరీబాయిని కోల్పోయాడు!

ఇట్టి కష్టకాలంలో, ఇట్టి దుఃఖ సమయంలో సానుభూతి తెలియజెయ్యడం ఇతరుల విషయంలో ధర్మం కావచ్చు. కాని, గాంధీజీ సందర్భంలో ఇది అనుచితం. ఇది ఆయనకే కాదు; మనకు కూడా కష్టకాలం. ఆయన తన పత్నిని కోల్పోతే, మనం మనకు మాతృసమానురాలైన మహిళామణిని కోల్పోయాం. అందువల్ల మనది సమాన దుఃఖం. ఈ పరిస్థితులలో సానుభూతిని తెలిపే వారెవరు? ఆదుకునే వారెవరు? (ఆంధ్రప్రభ 24-2-1944)

# శ్రీ మోతీలాల్ నెహ్రూ



"మా నాన్నగారి నవ్వులో ఒక విశిష్టత కలదు. ఆయన నవ్వితే ఇల్లంతా ఎగిరిపోయినట్టయ్యేది. వాస్తవంలో ఆయన నవ్వు అలహాబాదులో చాలా పేరు కెక్కినది".

తండ్రి మోతీలాల్ నెహ్రూను గూర్చి తనయుడు జవహర్లాల్ నెహ్రూ అన్న మాటలివి! మనసులో మాలిన్యం లేని మాలిమిగలవారే నోరారా నవ్వగలరు. మంచితనం మనసున పొంగిపొరలేవారే గలగలా నవ్వగలరు.

పుట్టుభోగి మోతీలాల్ అపూర్వ త్యాగశీలి అయినాడన్నా, కేవలం తార్కిక ప్రవీణుడైన న్యాయవాది న్యాయం కోసం శాసనాల ధిక్కరణం వేపు బారలు సాచెనన్నా ఆ నిరామయ, నిర్మల మనో నైర్మల్యమే అందుకు కారణం.

తొలుత మితవాదిగానే ఆయన రాజకీయాలలో మెలగినాడు. కాని పోని వానిని సభా వేదికలపై పేర్కొని గొప్ప విప్లవకారులనిపించుకోవడం కన్నా, కాగలవానికై కార్యవాదులు కావడం మంచిది

మంచిది కదా అని ఆయన భావించేవారని, ఆత్మకథలో ప్రధాని నెహ్రూ అన్నమాటలలో ఒకానొక విశిష్ట మనస్తత్వం మనకు గోచరిస్తుంది.

స్థితిలోనే ఆయన చిరకాలం ఉండిపోలేదు. వేలకు వేల రాబడితో తన వృత్తిలో కూరుకొని పోయిన చిత్తవృత్తిని రాజకీయాలపై మళ్లించిన మరునాటిమాట కాదు గాని, క్రమంగా ఆయన గాంధీజీ ప్రబోధంతో ప్రథమశ్రేణిలోని జాతీయవాదిగా అని మొన నిలచి, మొనగాడైనాడు.

మన దేశంలో ఏ విధమైన ప్రగతికైనా, హిందూ ముస్లిం వివాదం విజయవంతంగా పరిష్కారమైతే గాని వీలులేదేమోనన్న ఆయన భావంలోని దూరదృష్టి, ఆ తర్వాతి మన ఉద్యమగతిని పరికించిన మనకందరకు తేటతెల్లం కాక మానదు.


Motilal Nehru

రాజుకాకనే రాజభోగం అనుభవిస్తూ, రంగ రంగ వైభవంగా రమ్యజీవనం గడుపుతున్న ఆయన, అసిధారావ్రతం వంటి స్వాతంత్ర్య సంగ్రామ దీక్షకు అంకితుడైపోవడం అదేమంత అల్ప స్వల్ప విషయం కాదు. అందుననే ఆయనలోని అణువణువునా జీతించిపోయిన దేశాభ్యుదయ లక్ష్యమెంత ప్రగాఢమైందో సువ్యక్తమౌతుంది.

అంత గొప్ప మనసు గనుకనే తన కుటుంబంలోని వారినంత విశాల హృదయులనుగా మలుచుకో గలిగినాడు. తన తనయుడంత దూకుడుగా సమరాంగణంలోని కురుకగా ముకుద్రాడు వేయుటకాక, సకల విధాలా ప్రోత్సాహ ప్రోద్బలాలొసగగల దండిగుణ మాయనది. కనుకనే "పుత్రా దిచ్ఛేత్ పరాజయం" అన్న సూక్తిని జీవితంలో పాటించగలిగాడు.

కొడుకు బందిఖానాలో పలుబాములు పడుచుండెనన్న బలమైన వేదనతో తొలిరోజులలో, తాను కటికనేలపై పడుకొని, ఆ కష్ట మెలాంటిదో చూచి కనులు చెమర్పగా కటకట పడువాడన్న జనశ్రుతి ఆయన హృదయంలోని ఆర్ద్రతకు మణిముకురం కదా?

ఆయన కడుపెంత చల్లనిదో! కన్న కొడుకులు, కూతుండ్రు నాన్నను మించిన త్యాగధనులు, దేశభక్తి ప్రపూరితులు, జన సేవా పరతంత్రులుగా వన్నె కెక్కినారు.
ఒక్కొక్కరూ ఒకొక్క రంగంలో వినుతి కెక్కినారు.



పండిత నెహ్రూ తండ్రికి మించిన కొడుకనిపించుకున్నాడంటే అందులో ఆయన చేయి ఎంత ఉన్నదో ఊహించుకొనగలమా?

భోగలాలసతకు పేరొందినవాడు త్యాగ నిరతికి తార్కాణంగా మారి, శాసన వ్యాఖ్యాతగా శౌండీరతను ప్రకటించుకొన్నవాడు అక్రమ శాసన ధిక్కారానికి అనుకూలుడుగా మారి, విలాస ప్రియుడు వేదనలపాలై, తాను పోయినా తన వారు తన కలను నిక్కల చేయగలరన్న సంతృప్తితో ప్రశాంతంగా కన్నుమూసిన మోతీలాల్ నెహ్రూ ధన్యజీవి.

శ్రీ మోతీలాల్ శతజయంత్యుత్సవ సందర్భంలో మన మాయన గుండె కలిమిని, బలిమిని ఏ కొంత నిలుచుకొనగలందులకై దీక్షావ్రతులమైనా చాలును. మన దేశం మరింత సుసంపన్నం, సుప్రతిష్ఠం, సువ్యవస్థా సంపన్నం కాగలదు.

పండిట్ నెహ్రూఅందుకే ఆయన దివ్యస్మృతి మనలను పురికొల్పవలసి ఉన్నది. స్వరాజ్య సముపార్జన సమయంలోనే కాదు, సురాజ్య వ్యవస్థాపనా కాలంలోను భోగలాలసత కాదు, త్యాగనిరతి అవసరమన్న

సత్యం మన మనసులలో మేల్కొనుగాక. అట్టి ఆదర్శ జీవుల సంస్మరణకు మనం మన మనుగడ తీరుతో అర్హతను సంపాదించుకొందుము గాక! (ఆంధ్రప్రభ 5-5-1958)

## పండిట్ నెహ్రూ



ఆయన దేశాభిమాని; జాతీయవాది. కాని, ఆయన దేశాభిమానమేమి, జాతీయవాదమేమి సంకుచితమైనవి కావు.

ఆయన దేశాభిమానం భారతదేశపు సరిహద్దులతో నిలిచిపోదు; సమస్త పీడిత జాతులకు వ్యాపిస్తుంది. ఇక, ఆయన జాతీయవాదం ఎక్కడ అంతమౌతుందో, అంతర్జాతీయ వాదం ఎక్కడ ప్రారంభమౌతుందో చెప్పడం చాలా కష్టం.

ఇదే పండిట్ జవహర్లాల్ నెహ్రూ విశిష్టత; ఇదే ఆయన ప్రత్యేకత.

దేశాభిమానంతోపాటు ఆయనలో విశ్వమానవ ప్రేమ పెనవైచుకొని ఉన్నందువల్లనే, జాతీయవాదంతో పాటు అంతర్జాతీయతకు కూడా ఆయన హృదయంలో సమానస్థానం కలదు గనకనే, పరస్పర విరుద్ధవైఖరిని ఆయనకు ఆపాదించడం సులభం; స్వవచన వ్యాఘాతాన్ని ఆయనకు అంటగట్టడం కూడా సులభమే.

కాని, స్వదేశాభిమానానికి అన్యదేశ విద్వేషంతో సంబంధం లేదని గుర్తించినప్పుడు, జాతీయత అంతర్జాతీయతకు తొలి సోపానమేనని అంగీకరించినప్పుడు పండిట్ నెహ్రూలో స్థూలదృష్టికి గోచరించగల పరస్పర వైరుధ్యం అదృశ్యమై పోగలదు.

ఐతే, పండిట్ నెహ్రూకు పరస్పర వైరుధ్యాన్ని కొందరు ఆపాదించడానికి దేశాభిమానంతో సమస్త ప్రపంచ ప్రేమను, జాతీయతతో అంతర్జాతీయ దృక్పథాన్ని ఆయన మేళవింపజేయడం ఒక్కటే కారణం కాదు. దేశ కాల పరిస్థితులు మొదలైనవి కూడా ఇందుకు కొంత తోడ్పడినవి.

ఆయన కలవానికడుపున పుట్టాడు; కలవాని బిడ్డగా పెరిగాడు. అయినప్పుడు లక్ష్మీపుత్రునికి సహజమైన కొన్ని గుణగణాలు ఆయనకు అబ్బడంలో అబ్బురం లేదు. కాని, ప్రజాస్వామ్యంలో ఆయనకు ప్రబల విశ్వాసం ఏర్పడింది. ప్రజాసామాన్యంతో మిళితమై, వారి కష్టసుఖాలను పంచుకోడానికి ఆయన ఆతురత పడుతున్నాడు. ఈ కారణాన ఆయన పుట్టి పెరిగిన పరిసరాలు ఒక దిక్కుకు, ఆయన విశ్వాసాలు మరొక దిక్కుకు పండిట్ నెహ్రూను లాగుతున్నాయి. ఇందువల్ల అనివార్యమైన సంక్షోభం కూడా ఆయన ప్రవృత్తిలో, ఆయన ప్రవర్తనలో ద్యోతకం కావడం కద్దు.

విద్య వల్ల, విజ్ఞానంవల్ల ఆయన భౌతికవాది. రెండుతో రెండు చేరినప్పుడు నాలుగు అయినట్టుగా, ప్రతి ఒక్క విషయాన్ని నిస్సందేహంగా నిరూపించిన పిమ్మటనే దాన్ని సత్యమైనదిగా భౌతికవాది అంగీకరిస్తాడు. కాని, "పరమేశ్వరుడు కలడని నేను నిరూపించలేను. ఐతే, అతడు కలడని నేను సంపూర్ణంగా విశ్వసిస్తున్నాను" అని చెప్పే గాంధీజీ నాయకత్వాన్ని పండిట్ నెహ్రూ అంగీకరించాడు. ఈ పరిస్థితిలో తన భౌతికవాదానికి, గాంధీజీ ఆధ్యాత్మికవాదానికి సమన్వయం చేసుకొనవలసిన అగత్యం పండిట్ నెహ్రూకు ఏర్పడుతుంది. ఇందువల్ల అనివార్యమైన సంక్షోభం కూడా ఆయనలో ద్యోతకమౌతూ ఉంటుంది.

పండిట్ నెహ్రూది కవి హృదయం. నీలాకాశాన్ని, తెల్లని మబ్బును, మంచుకొండను, పచ్చని చెట్టును, చక్కని పువ్వును చూచినప్పుడు దాని సౌందర్య మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ, ఆ ప్రపంచంలో ఆయన లీనమైపోగలడు కాని, నేటి భారతదేశ ప్రత్యేక పరిస్థితుల వల్ల సౌందర్యానికి, లాలిత్యానికి దూరమైన రాజకీయ రంగంలో ఆయన తలమునకలు కావలసి వచ్చింది.

ఈ కారణంగా కవికిని, రాజకీయ ప్రముఖునికి ఆయనలో తరచుగా చెలరేగుతూ ఉండే ద్వంద్వ యుద్ధాలు సైతం మనకు లీలామాత్రంగా ద్యోతకమౌతూ ఉంటాయి. తన ఆత్మకథలో ఆయనే తనలోని ఈ వైరుధ్యాలను వివరించి, "జనసమూహం మధ్య నేను ఒక్కొక్కప్పుడు ఏకాకిని" అని పేర్కొన్నాడు కూడా.

ఆయనలో ఇట్టి వైరుధ్యాలు ఎన్ని ఉన్నప్పటికీ, అవి నేటి భారతదేశ స్థితిగతులకు, నేటి భారతజాతి మనః ప్రవృత్తులకు ప్రతిబింబాలు మాత్రమే ననడంలో సందేహంలేదు. ఆయన ఒక మహాపురుషుడు గనక తక్కిన భారత ప్రజల హృదయాన్ని ఏ ఆశలు, ఏ ఆశయాలు, ఏ ద్వంద్వాలు అవ్యక్తంగా ప్రేరేపిస్తున్నవో, అవి ఆయనలో అగ్నిపర్వతంలోని లావావలె కళపెళ ఉడుకుతున్నవి.

ఆయన ఆధునిక భారత మహాపురుషులలో ఒకడని గుర్తించినందువల్లనే, ఆయన జన్మదినోత్సవాన్ని నేడు భారతప్రజ భక్తిగౌరవాలతో జరుపుకుంటుంది. (ఆంధ్రప్రభ 1-11-1945)

## మన నాయకుడు



జవహర్లాల్ నెహ్రూ జన్మదినోత్సవ శుభదినమిది. నవంబర్ 14వ తేదీ ఇట్టి శుభదినాలను కనీసం మరొక 34 జరుపుకొనగలిగితేనే మన ఆశలు పూర్తిగా ఫలించినట్టు; అప్పుడే మన అదృష్టం పూర్తిగా పండినట్టు!

దేశనాయకులకేమి? చాలామంది వుంటారు; - వున్నారు. కాని, నెహ్రూను పోలిన నాయకులు లభించడం మాత్రమే కష్టం. అట్టి నాయకులు వెంటవెంటనే ఏ దేశంలోనూ

తలయెత్తరు. అయినా, మన గీత బాగుండి మనకు వరసగా రెండు తరాలలో మహానాయకులిద్దరు లభించారు. వారిలో మొదటివారు గాంధీజీకాగా, రెండవ వ్యక్తి జవహర్లాల్ నెహ్రూ.

గాంధీజీ నాయకత్వ విశిష్టతను గురించి ప్రసంగించడానికి ఇది సమయంకాదు. కాని, గాంధీజీ నాయకత్వమే నెహ్రూ ద్వారా నేటికీ కొనసాగుతున్నదని మాత్రం చెప్పవలసి వుంటుంది. నాయకత్వం ఒకరు అప్పగించగలిగిందీకాదు, మరొకరు పుచ్చుకొనగలిగిందీకాదు. అయినా, 'నెహ్రూ నా రాజకీయ వారసుడు' అని ఉద్ఘాటించినప్పుడు భవిష్యద్వాణియే తన గుండా పలుకుతున్నదని బాపూజీకి తెలుసు. ఇంతేకాదు, రాజకీయ స్వాతంత్ర్య సమరం ముగిసిన తర్వాత అంతకంటె క్లిష్టమైన, దీర్ఘమైన మరొక సమరంలో - ఆర్థిక స్వాతంత్ర్య సమరంలో - ప్రవేశించనున్న భారతజాతికి నాయకత్వం వహించగల పటిమతోపాటు ప్రతిభ, దీక్షతో పాటు ధీరత ఒక్క నెహ్రూకే కలవని కూడా బాపూజీకి తెలుసు. అందువల్లనే "ఇతడే నా తర్వాత మీ నాయకుడు" అని ఆయన అంత స్పష్టంగా నిర్దేశించగలిగాడు.



ఏమైనా, మహానాయకుని లక్షణాలను తనలో మూర్తీభవింపచేసుకొన్న వాడైనందువల్లనే నెహ్రూలో నిత్యయౌవనంతో పాటు నిత్య నూతనత్వం తొణికిసలాడుతూ వుంటుంది. ఈ మధ్య ఆయన చేస్తున్న కొన్ని ప్రసంగాలలో "మా కాలం అయిపోతున్నది. మా ప్రొద్దు వాలిపోతున్నది" అనే పలుకులు వినవస్తున్నా, ఈనాడు మన దేశం లోనేకాక, నేటి ప్రపంచంలోనే ఆయనకంటే స్పష్టంగా చూడగలవారెందరున్నారు? నిశితంగా ఆలోచించగలవారెందరున్నారు? ఏ సవాలుకైనా "సై" అనగలవారెందరున్నారు? ఏకాగ్రతతో పనిచేయగల వారెందరున్నారు? అన్నింటినీ మించి, తన దేశాన్ని గురించి మాత్రమే కాక మొత్తం మానవజాతిని గురించే కొత్త కొత్త కలలను కంటూ, వాటిని నిజం చేయడానికి ఆరాటపడగలవారెందరున్నారు?

ఔను! మానవజాతి భవిష్యత్తుపైకి నెహ్రూ మనస్సు నిరంతరం పరుగులు తీస్తూ వుంటుంది. కనుకనే సామాన్య పౌరుని దృష్టినుంచి తప్ప - అతడు తన దేశంవాడైనా, ఇతర దేశాలవాడైనా - ఆయన ఏ సమస్యను పరిశీలించలేదు. ఆయనకు మతాలు ముఖ్యంకావు; మానవత ముఖ్యం. జాతులు ముఖ్యంకావు; ప్రపంచ శాంతి ముఖ్యం. వర్గ ప్రయోజనాలు ముఖ్యంకావు; విశ్వకల్యాణం ముఖ్యం. అందువల్లనే ఆయన ప్రపంచంలో ఎక్కడ ఏ జాతి దాస్యవిముక్తిని పొందినా స్వదేశం స్వాతంత్ర్యాన్ని పొందిననాడు తాను పొందిన సంతోషాన్ని పోలినదాన్నే పొందుతాడు; ప్రపంచంలో ఎక్కడ ఏ ప్రజలకు అన్యాయం జరిగినా, అది తనకు జరిగిన అన్యాయంవలెనే ఖేదపడతాడు.

అన్యదేశాల రాజకీయవేత్తలు కొందరు నెహ్రూను పగటికలలు కనే వ్యక్తి కింద జమకట్టవచ్చు; ఆయన కార్యవాది కాదని తీర్మానించుకోవచ్చు. కాని, ప్రపంచ ప్రజలు మాత్రం ఆయన అంతస్థులు తెలుసుకోగలుగుతున్నారు. ఆయన విశిష్టతను గుర్తించగలుగుతున్నారు. అందువల్లనే ఏ దేశం వెళ్లినా,

సామాన్య ప్రజలు ఆయన దర్శనంకోసం తీర్థప్రజలవలె యెగబడుతున్నారు; ఆయనపట్ల విశేష ప్రేమాదరాలు ప్రదర్శిస్తున్నారు. నెహ్రూ నాయకత్వం మన పురోగతికి ఎంత అవసరమని మనం విశ్వసిస్తున్నామో, ఆయన సందేశమేమి, ఆయన సహాయ సహకారాలేమి ప్రపంచ శాంతి రక్షణకు అంతగానూ అవసరమని దేశదేశాల పౌరులందరు భావిస్తున్నారు. కాబట్టి నేడు మనం చేసుకొంటున్న పండుగలో వారు కూడా పాల్గొనగలరు; మనవలె వారు కూడా ఇట్టివి కనీసం మరి 34 పండుగలు జరగాలని కోరుకోగలరు.

(ఆంధ్రప్రభ 15-11-1955)

నెహ్రూ మన నేత, మన భ్రాత, మన భాగ్యవిధాత. మన భవిష్య నిర్మాత. అయినా, ఆయన కేవలం మనకు చెందిన వాడనడం మన సంకుచితత్వాన్ని చాటుకొనడమేకాక, ఆయన వ్యక్తిత్వాన్ని సంకుచితపరచడమే కాగలదు. మనకువలె తక్కిన ప్రపంచ ప్రజలకు ఆయన ఏకైక నాయకుడు కాకపోవచ్చు. కాని, ప్రపంచ నాయకులలో నిశ్చయంగా ఆయనొకడు.



అగ్రరాజ్య పంచకంలో ఈనాడు ఇండియా లెక్కకు రాకపోవచ్చు. కాని, అగ్రనాయక పంచకంలో నెహ్రూ లెక్కకు వస్తున్నాడు. దీన్నిబట్టే నేటి ప్రపంచంలో ఆయనకు గల ప్రతిపత్తికి ఆయన పదవికాని, ఆయన దేశం బలసంపత్తి కాని కారణం కాదని స్పష్టం.

"నిన్నకాక, మొన్నటివరకు బానిసత్వంలో మ్రగ్గిన దేశం, నేడైనా దారిద్ర్య పీడితమైన దేశం, సైనిక పాటవాన్ని చూడబోతే, అది పరిమితం. ఇక, అణ్వస్త్రాలు కేవలం పూజ్యం. అయినా, ఏ అంతర్జాతీయ సమస్య ఉత్పన్నమైనా, ఇండియా అభిప్రాయాలకు ఎదురుచూడవలసిన అగత్యం ఎందుకు కలుగుతున్నది?" - ఇదే మన హితులను ఆశ్చర్యపరుస్తున్న ప్రశ్న; ఇదే మన అహితులను చీకాకుపరుస్తున్న ప్రశ్న. ఇట్టి ప్రశ్న ఉదయించడంలోనే నెహ్రూ ఘనత ఉన్నది.

సరిహద్దులను అధిగమించిన వాడు నెహ్రూ. అందువల్లనే ప్రపంచపటంలో ఒక విశాల ఖండంగా తప్ప ఆయన భారతదేశాన్ని చూడలేదు. కాలావధులను జయించినవాడు నెహ్రూ. అందువల్లనే ముందుతరాల దృష్టి నుంచి తప్ప ఈతరం సమస్యలను ఆయన చూడలేదు. ఇంతకంటే విశేషం, ఆయన భయాన్ని జయించిన కర్మవీరుడు కావడం! సాయుధబలాలంటే ఆయనకు జడుపులేదు. శక్తివంతమైన పర రాజ్యాల దండయాత్రలంటే ఆయనకు బెదురులేదు. సత్కృషిలో వైఫల్యమంటే ఆయనకు తత్తరపాటు లేదు. అన్నిటినీ మించి, మృత్యువంటే ఆయనకు వెరపులేదు. అసలు మృత్యువును గురించి ఆయన ఆలోచించడు. కడవరకు కర్తవ్య పరిపాలనే తప్ప అన్యచింత తనకు లేదని ఆయన నేడు పత్రికా విలేకరుల గోష్ఠిలో చెప్పిన మాటే ఇందుకు సాక్ష్యం. మృత్యుభయాన్ని జయించిన కర్మవీరుడు కాబట్టే. "నాకు వారసుడు" అని ఆయన గాంధీజీ

చేత అనిపించుకోగలిగాడు. ఈ కారణానే ఆయన భారత ప్రజలకే కాక, మానవాళికే ఆశాజ్యోతిగా నేడు వెలుగుతున్నాడు.

మన అధినేత కాబట్టి, అభిమానం కొద్దీ ఇది కేవలం మనం అనుకునేమాట కాదు. నేటి సంక్షుభిత ప్రపంచంలో అసంఖ్యాక ప్రజలు వాస్తవంగా నెహ్రూ నాయకత్వంపై కొండంత ఆశ పెట్టుకున్నారు. స్వాతంత్ర్య వంచితమైన ప్రతి జాతి నెహ్రూ నైతిక సమర్దన కోసం.

ఎదురుచూస్తున్నది. యుద్ధ భయపీడితమైన మానవాళి నెహ్రూ కృషి సఫలీకృతం కావాలని వెయ్యి దేవుళ్ళకు మొక్కుకొంటున్నది. ప్రాక్పశ్చిమ రాజ్యాలమధ్య సామరస్య సాధనకై ఆయన కొనసాగిస్తున్న నిరంతర యత్నాలను అభినందిస్తూ, ఆయనే ఈ విషమ సమయంలో ప్రపంచ ప్రజల ఆశలకు పట్టుకొమ్మ అని ఈ మధ్యనే "న్యూస్ క్రానికల్" రాసింది.

ఇట్టి మహానాయకుని - ప్రపంచ నాయకుని - 66వ జన్మదినోత్సవాన్ని నేడు జరుపుకొనడం మహద్భాగ్యమని మనం సంతోషించడం మాత్రమే చాలదు; ఆయన ఇతోధికోత్సాహంతో, అభినివేశంతో తన కర్తవ్య పరిపాలన చేయడానికి తగు వాతావరణాన్ని మన కృషి ద్వారా, మన ప్రవర్తన ద్వారా మనం కల్పించాలి. ఆయనను చూచి మనం గర్వపడితే తన జీవితం చరితార్థమైనట్టు ఆయన సంతృప్తి చెందదు; మనలను చూచి తాను గర్వపడ గలిగినప్పుడే ఆయనకు సంతృప్తి.



(ఆంధ్రప్రభ 14-11-1954)

రాజ్యసభవలె లోకసభ కూడా మన విదేశాంగ విధానాన్ని ఆమోదిస్తూ మరొకసారి తీర్మానం చేసింది. మన పార్లమెంటులో ఒక చెంపనుంచి కమ్యూనిస్టుపార్టీవారు, మరొక చెంపనుంచి ప్రజా సోషలిస్టు పార్టీవారు కొన్ని కొన్ని విషయాలలో - కొంత కొంత వరకు - మన విదేశాంగ విధానం విఫలమౌతున్నదని విమర్శించవచ్చు. ఇతర విధాలైన అసంతృప్తులను సయితం అప్పుడప్పుడు వారు వ్యక్తం చేస్తూ వుండవచ్చు.

ఈ పాటిగానైనా ప్రతిపక్షాల వారు విమర్శ చేయకపోతే, వారు ప్రతిపక్ష సభ్యులుకారు. అందువల్ల వారి అసంతృప్తుల కైనా, ఆక్షేపణలకైనా ఎక్కువ విలువ నివ్వవలసిన పని లేదేమో! పాక్షిక దృష్టి నుంచి కాక, ప్రపంచ దృష్టి నుంచి చూచినప్పుడు మన ప్రభుత్వం పండిట్ నెహ్రూ నాయకత్వాన అనుసరిస్తున్న విదేశాంగ విధానం సర్వోత్తమమైనదని ఎవరైనా అంగీకరిస్తారు. దాని ఉత్కృష్టత - దాని వైశిష్ట్యం - జాతీయ ప్రయోజనాలకే పరిమితమైంది కాదు; వర్తమానానికే నిబద్ధమైంది కాదు కూడా; అంతర్జాతీయంగా కూడా దీని ప్రభావం అశేషమైంది; భావి కాలానికి సయితం అది స్వర్ణ సేతువులను నిర్మిస్తున్నది.

విదేశాంగశాఖ మనకు కొత్త; విదేశాంగ విధానంతో మనకున్న పరిచయమైనా విస్తృతమైనదని చెప్పడానికి వీలులేదు. అయినా, ఇంత త్వరలో ఒక నిర్దిష్టమైన - నిర్దుష్టమైన - విదేశాంగ విధానాన్ని మనం రూపొందించుకొన్నామంటే, ఆ ఘనత ప్రధాన మంత్రి పదవితోపాటు, ఆది నుంచీ విదేశాంగ మంత్రి పదవిని సయితం నిర్వహిస్తున్న మన నాయకుడు జవహర్లాల్ నెహ్రూ విదేశాంగ మంత్రులుగా ప్రపంచం మొత్తంపైనే చిరకీర్తి నార్జించుకొన్నవారు బహు కొద్దిమంది మాత్రమే కానవస్తారు. వారిలో ప్రత్యేకించి చెప్పుకోదగువారు బ్రిటన్కు చెందిన కాజిల్ (1769-1822), జార్జి కానింగ్ (1770-1827), పామర్దన్ (1784-1865), ఫ్రాన్సుకు చెందిన త్యాలీరాం (1754-1838), ఆస్ట్రియాకు చెందిన మెటర్నిచ్ (1773-1865) ఈ అయిదుగురిలో చిట్టచివరి వ్యక్తికూడా దాదాపుగా నూరేళ్ల క్రితం కన్ను మూసినవాడే. పామర్దన్ తర్వాత ప్రపంచం మొత్తం మీద ప్రతిభావంతుడైన విదేశాంగ మంత్రి ఎవరనే ప్రశ్నకు భావి చరిత్రకారుడు చెప్పగల సమాధానమొకటే! అది, "జవహర్ లాల్." మన నాయకుడు కనుక, మన ప్రధాని కనుక ప్రేమవల్లనో, పక్షపాతం వల్లనో చెప్పేమాట కాదిది. పందొమ్మిదవ శతాబ్దిలో అంతర్జాతీయ రాజకీయాలపై తమ వ్యక్తిత్వాల ముద్రలను గట్టిగా వేసి, నాటి నుంచి, నేటివరకు అశేష ప్రతిభావంతులైన విదేశాంగ మంత్రులుగా కీర్తించబడుతున్న కాజిల్రా, కానింగ్, పామర్దన్, త్యాలీరాం, మెటర్నిచ్లకంటె ఏ దృష్టినుంచి చూచినా నెహ్రూ అధిక ప్రతిభావంతుడైన విదేశాంగ మంత్రి.



“బ్యాలెన్స్ ఆఫ్ పవర్” అనే రాజనీతి సిద్ధాంతానికి ఏ ఒక రాజ్యం కాని, రాజ్య కూటంకాని, మరొక రాజ్యం కంటె, లేదా మరొక రాజ్యకూటం కంటే శక్తిసంపన్నమైనది కారాదనే సూత్రానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చి, తదనుగుణంగా తమ విదేశాంగ విధానాన్ని తీర్చిదిద్దినవారు మేము పైన పేర్కొన్న అయిదుగురు విదేశాంగ మంత్రులు. ఇందుకు ఏ స్వల్పంగానో, భిన్నంగా వెళ్లి, అనేక దేశాలలో స్వాతంత్ర్య శక్తులకు, పురోగామి వర్గాలకు బలం కూర్చిన విదేశాంగ మంత్రి పామర్దన్ మాత్రమే.

నెపోలియన్ పతనం తర్వాత యుద్ధ ప్రమాద నివారణకు ప్రపంచ శాంతి రక్షణకు “కాన్సెర్ట్ ఆఫ్ యూరప్”, “యూరోపియన్ సమాఖ్య" అనే విధానంపై కాజిల్ ప్రధానంగా ఆధారపడినా, దానికి కూడా ప్రాతిపదిక "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" మాత్రమే. ఆయన జీవిత కాలంలోనే “కాన్సెర్ట్ ఆఫ్ యూరప్" విధానం భగ్నమైపోయింది. తుదకు తన ఉద్యోగ ధర్మాల భారాన్ని వహించలేక ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు కూడా.

కాజిల్ తర్వాత విదేశాంగ మంత్రిగా ప్రాముఖ్యంలోకి వచ్చిన కానింగ్ "పాత ప్రపంచంలో సమసిపోయిన బ్యాలెన్సును పునరుద్ధరించడానికి నేను నూతన ప్రపంచాన్ని సృష్టించాను" అని దక్షిణ అమెరికా స్వాతంత్ర్యం పొందడానికి తానేదో చేశానని స్వయంగా గొప్ప చెప్పుకున్నా, దక్షిణ అమెరికాలో యూరోపియన్ రాజ్యాల


జోక్యాన్ని నిరోధించడానికి ఈయన చేసింది యునైటెడ్ స్టేట్సు అధ్యక్షుడు మన్రోను ప్రస్తుతం "మన్రో సిద్ధాంతం"గా చెల్లుతున్నదాన్ని ప్రకటించవలసిందిగా ప్రోత్సహించడం తప్ప అంతగా మరేమీ లేదు. కాజిల్ పట్ల తనకున్న వైముఖ్యంవల్ల, విరోధం వల్ల, ఆయన విధానాలను తలక్రిందులు చేయడం ద్వారా ఈయన ఏమంత సాధించాడనేది సంశయాస్పద విషయం.



పోతే, త్యాలీరాం కేవలం జిత్తులమారి నక్కలాంటివాడు. ఆవులించకపోయినా ప్రేగులు లెక్కపెట్టగల ఘటికుడు. అతడి దుర్గుణాలలో లంచగొండితనం మొదటిదే కాని, చివరిది కాదు. వియన్నా కాంగ్రెసులో కాజిల్, మెటర్నిచ్లను పోలిన ప్రతిభావంతులను పిల్లిమొగ్గలు వేయించి, పరాజయ పరాభవాలనుండి ఫ్రాన్సును కొంతవరకు కాపాడినా, అంతర్జాతీయ దృష్టిలేని వాడు. విదేశాంగ మంత్రిగా పనిచేస్తూనే తనకు విరుద్ధంగా కుట్రలు పన్నుతున్నందుకు కోపం పట్టలేక నెపోలియన్ ఒకానొక సందర్భంలో అన్నట్టు త్యాలీరాం నిజంగా "అంగవస్త్రంలో ఆవుపేడ" వంటివాడు. (కౌ డంగ్ ఇన్ ఎ సిల్క్ స్టాకింగ్)

మెటర్నిచ్ కూడా "బ్యాలెన్స్ ఆఫ్ పవర్" వర్గానికి చెందినవాడే. తాను ప్రగతిశీలుడనని చెప్పుకున్నా, తన లక్ష్యాలను ఆచరణలో పెట్టగల ధీరోదాత్తత కొరవడిన వ్యక్తి. పందొమ్మిదవ శతాబ్దిలో ప్రాముఖ్యానికి వచ్చినా, పద్దెనిమిదవ శతాబ్ది చిత్తవృత్తి వున్నవాడు. భద్రతను, స్థిరత్వాన్ని సాధించడానికి విప్లవోద్యమాలను అణచివేయడం ఇతడు తన పనిగా పెట్టుకొన్నాడు. అందువల్లనే చివరికి ప్రజాగ్రహానికి తట్టుకోలేక, స్వదేశం నుంచి బ్రిటన్కు మెటర్నిచ్ పారిపోవలసివచ్చింది.

ఈ నలుగురికంటె మిన్నగా పేర్కొనదగువాడు పామర్స్టన్. అయితే, ఆయనైనా మన నెహ్రూవలె జాతీయ, అంతర్జాతీయ ప్రయోజనాలకు తన విదేశాంగ విధానంలో సమాన ప్రాధాన్యమిచ్చినాడని అనలేము; నేటి తన విధానం రేపటిని పదిలపరచవలెనన్న దూరదృష్టితో వ్యవహరించాడనీ అనలేము.



నెహ్రూ సమకాలికులైనందున ఆయన విదేశాంగ విధానం విశిష్టతను పూర్తిగా గుర్తించలేక పోయినవారు సయితం ఇప్పుడిప్పుడే తమ అభిప్రాయాలను కొంతవరకు మార్చుకొనక పోవడం లేదు. ఇందుకు సరికొత్త నిదర్శనంగా అమెరికా వైస్ ప్రెసిడెంట్ పదవికి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కాబెట్లాడ్జ్ ఈ మధ్యనే నెహ్రూ విదేశాంగ విధానానికి జోహార్లు చేయడాన్ని పేర్కొనవచ్చు.

(ఆంధ్రప్రభ 4-9-1960)

ఆయన మనమధ్య నిలిచినట్టుగానే వున్నాడు; మందహాసం చేస్తున్నట్టుగానే వున్నాడు; మనలను పలకరిస్తున్నట్టుగానే వున్నాడు; మనకోసం కలలు కంటున్నట్టుగానే వున్నాడు; మన యోగక్షేమాలకోసం కృషి చేస్తున్నట్టుగానే వున్నాడు; మొత్తం మానవాళికోసం తపన పడుతున్నట్టుగానే వున్నాడు; అయినా, మన మధ్య నుంచి ఆయన వెళ్ళిపోయి అప్పుడే ఒక సంవత్సర మైంది; ప్రపంచంలోనే పెద్ద వెలితి మిగుల్చుతూ వెళ్ళిపోయి పన్నెండు నెలలైంది; మానవాళికే మనస్తాపాన్ని కలిగిస్తూ వెళ్ళిపోయి 365 రోజులైంది.

సంవత్సరాలు ఇట్టే నిండి పోతాయి; నెలలు ఇట్టే తిరిగి వస్తాయి; రోజులు ఇట్టే దొర్లి పోతాయి. అయినా పెక్కు శతాబ్దాల తర్వాత కూడా జవహర్ లాల్ నెహ్రూ మూర్తి జరాభారరహితమైన అదే జీవకళతో, ఆలోచనామిళితమైన అదే మందహాసంతో, చిత్తశుద్ధి ప్రేరితమైన అదే సేవాకాంక్షతో, మానవ కళ్యాణ సాధనోత్సుకతతో కూడిన అదే దీప్తితో - చెదరక - చెరగక -చెన్ను తరగక - నిత్యమై నిలుస్తుంది; ఇది ముమ్మాటికీ నిజం. తరతరాలవరకు దాని తారళ్యం తరగదు; యుగయుగాలవరకు దాని శోభ సన్నగిల్లదు. తన జీవిత కాలంలోనే నెహ్రూ జాతీయచరిత్రలోనే కాక, అంతర్జాతీయ చరిత్రలో కూడా ఒక మహోన్నత స్థానాన్ని సంపాదించుకొన్నాడు. కాలక్రమాన ఆ స్థానం విస్తరిస్తుంది, దాని ప్రాధాన్యం పెరుగుతుంది.



వీరపూజ ఒక వ్యసనంగా వ్రాస్తున్న వాక్యాలు కావివి; జాతీయాభిమానం ఒక జాడ్యం కాగా చేస్తున్న ప్రశంసకాదిది; వ్యక్తిగత ప్రేమానురాగాలతో ఘటిస్తున్న శ్రద్ధాంజలి కాదిది; మాతోపాటు భావిచరిత్రకారులు సయితం లింకన్, లెనిన్ల సరసను నెహ్రూను నిలబెడతారు; గాంధి, గారిబాల్డీల ప్రక్కన ఆయనకు పెద్ద పీట వేస్తారు.

మహాపురుషులైనవారిలో ఒక గొప్ప గుణ మేదో ప్రాబల్యం వహించి, ప్రస్ఫుటంగా కానవస్తుంది; లేదా కొన్ని గొప్ప గుణాలు వారి జీవితాలకు వైశిష్ట్యాన్ని కూర్చుతూవుంటాయి. ఏ ఒక్క గొప్ప గుణంలోనూ, లేదా ఏ కొన్ని గొప్ప గుణాల్లోనూ నెహ్రూ ఇతర చారిత్రక పురుషులతో తులతూగకపోవచ్చు. కాని, బహుశా మరెవ్వరిలోను కానరానన్ని గొప్ప గుణాలు ఆయనలో పోగుపడి పోవడంలో ఆయన ప్రత్యేకత వున్నది, దానిలోనే ఆయన ప్రాశస్త్యం వున్నది.

ఆయన ఉద్విగ్నుడు మాత్రమే కాదు, ఉదాత్తుడు కూడా. ఆయన భావుకుడు మాత్రమే కాదు, కార్యవాది కూడా. ఆయన ఆదర్శవాది మాత్రమే కాదు, ఆచరణలో సాధ్యాసాధ్యాలను గుర్తించిన వాడు కూడా. ఆయన నాయకుడే కాదు, అనుచరుడు కూడా. ఆయన స్వాతంత్ర్యాకాంక్షి మాత్రమే కాదు, క్రమశిక్షణ విలువ గుర్తించినవాడు కూడా. ఆయన రాజకీయవేత్త మాత్రమే కాదు, కవిహృదయం వున్న రచయిత కూడా. ఆయన దేశభక్తుడు మాత్రమే కాదు, ప్రపంచ సౌభాగ్యకామి కూడా.

ఆయన ప్రవృత్తిలో ఎన్నో పరస్పర వైరుధ్యాలు, ఆయన పుట్టి పెరిగిన పరిసరాలలో వైరుధ్యాలు, ఆయనపై పడిన ప్రభావాలలో వైరుధ్యాలు : ఇన్ని వైరుధ్యాలను అధిగమించి, ఒక స్థిరలక్ష్యాన్ని ఆయన నిర్ణయించుకో గలిగాడు; ఒక తాత్త్వికదృష్టిని కుదుర్చుకో గలిగాడు; ఒక సమైక్య వ్యక్తిత్వాన్ని ("ఇంటెగ్రేటెడ్ పర్సనాలిటీ") రూపొందించుకో గలిగాడు. ఇది ఒక పెద్ద విశేషం, ఒక గొప్ప విజయం.

స్వాతంత్ర్య సమరయోధుడుగా, ప్రజానాయకుడుగా, ప్రభుత్వాధినేతగా సమకాలిక ప్రపంచ ప్రముఖులలో ఎన్నదగువాడుగా జవహర్ లాల్ నెహ్రూ సాధించిన విజయాలు స్వల్పమైనవి కావు, సాధారణమైనవీ కావు. కాని, ఆయన కార్యరంగంలో సాధించిన విజయాలకంటె జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై ఆయన వ్యక్తిత్వ ప్రభావం ఎంతో ముఖ్యమైంది. అనేక విషయాలలో - ముఖ్యంగా ఆదిభౌతిక విషయాలలో, ఆర్థిక సూత్రాలలో, వైజ్ఞానిక, సాంకేతికాది శాస్త్రాల ప్రాధాన్య, ప్రభావాల విషయంలో, వీటి నన్నింటిని వెరసి చేయగా రాగల "ఫిలాసఫీ ఆఫ్ లైఫ్"లో గాంధీతో నెహ్రూ విభేదించినా, జీవితానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన విలువల సందర్భంలో ఆయన గాంధీతో ఏకీభవించడమే కాక, వాటికి అనుగుణంగా తాను నడవడానికి చిత్తశుద్ధితో కృషి చేశాడు. గాంధీకి తామే సిసలైన వారసులుగా ప్రస్తుతం చెప్పుకొంటున్న వారందరికంటె గాంధేయతత్త్వ ప్రాతిపదికలను జవహర్లాల్ చక్కగా, ఎక్కువగా, అర్థం చేసుకొన్నాడు; విజ్ఞతతో సమర్థంగా వాటిని ఆధునికయుగ ప్రభావాలకు, పరిణామాలకు అనుగుణంగా రూపొందించడానికి కృషి చేశాడు.



నెహ్రూ పోయినా, ఆయన తాత్త్విక దృష్టిని మనం గట్టిగా అలవరచుకోవాలి. ఆయన జీవిత సందేశాన్ని పూర్తిగా గౌరవించాలి. అదే ఆయనకు చిత్తశుద్ధితో కూడిన శ్రద్ధాంజలి కాగలదు; అదే ఆయన అంతస్తుకు తగిన శాశ్వత స్మృతిచిహ్నం కాగలదు.

(ఆంధ్రజ్యోతి 17-5-1965)

## డాక్టర్ బెసెంట్

డాక్టర్ అనీబెసెంట్ మత విశ్వాసాలతోనేమి, రాజకీయాభిప్రాయాలతోనేమి, ఎంత మాత్రం ఏకీభవించని వారైనా, ఆమె నారీ శిరోమణిగా ఎన్నికకు రాదగిన శేముషీ దురంధురాలని అంగీకరించక తప్పదు.

స్త్రీని "అబల" అని పేర్కొనే పురుషులలోనైనా మేధాశక్తిలో, వాక్పటిమలో, కార్యకుశలతలో, వ్యవహార దక్షతలో, ధైర్య సాహసాలలో, ధీరోదాత్తతలో ఆమెతో సాటిరాగలవారు కోటికొక్కరు కానరావడం సందేహాస్పదమే.

ఆమె అభిప్రాయాలలో, ఆమె విశ్వాసాలలో చంచలత్వం కానవస్తుందనే విమర్శకు తావు లేక పోలేదు. ఒకప్పుడు ఆమె నాస్తికురాలు. తర్వాత ఆమె పరమ ఆస్తికురాలైంది. గాంధీజీకి "మహాత్ముడు" అనే బిరుదునిచ్చింది ఆమే. అటు పిమ్మట గాంధీజీ దేశానికి కేవలం వంటవాడని విమర్శించింది కూడా ఆమే.

అయితే, ఆమె ఎప్పుడు దేన్ని చెప్పినా, ఎప్పుడు దేన్ని చేసినా, అది చిత్తశుద్ధితోనే. ఆమె మాటలలోగాని, చేతలలోగాని కల్లలేదు. కపటంలేదు; కల్మషం లేదు. ఇక భీరుత్వం గాని, దాన్ని ఆవరించివుండే డోలాందోళన గాని ఆమె ప్రవృత్తికే విరుద్ధం.

ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా, ఎట్టి పరిస్థితులలోనైనా, తన అశేష ప్రతిభా విశేషాల వల్ల ఆమె ప్రఖ్యాతినంది వుండేదే. అంచేత ఆమె మన దేశంలో - ముఖ్యంగా 19వ శతాబ్ది తుది భాగంనాటి, 20వ శతాబ్ది తొలిభాగం నాటి మనదేశంలో గణుతికెక్కడంలో అబ్బురంలేదు. ఆ రోజులలో (ముఖ్యంగా 1917లో) మన దేశంలో అగ్రగణ్యురాలు ఆమే.

గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రతిఘటించడం ద్వారా మన జాతీయ జీవనంలో 1917 నాటి ప్రప్రథమ స్థానాన్ని ఆ తర్వాత ఆమె పూర్తిగా కోల్పోయినా, మన దేశానికి ఆమె చేసిన అఖండ సేవను గుర్తించక పోవడం మహాపచారమే కాగలదు.

తాను నమ్మిన దానిలో పూర్తిగా నిమగ్నమై పోగల తన ప్రవృత్తి ననుసరించి, మన దేశాన్ని తన దేశంగా సంభావించుకున్నంతనే ఆమె మన దుస్తులను ధరించింది; మన భాషలను నేర్చుకున్నది; మన భోజనాన్నే చేయనారంభించింది; మన ఆచార వ్యవహారాలను అనుసరించింది; మన దేవుళ్లనే ఆరాధించింది. మన దేశానికి ఆమె ఎంతగా ఆత్మార్పణ చేసిందో, అంతగా సర్వతోముఖ సేవను చేసింది కూడా.

మన మత పునరుజ్జీవనానికి, మన సంఘ సంస్కరణకు, మనలో విద్యావ్యాప్తికి, విజ్ఞాన ప్రచారానికి, రాజకీయ చైతన్యానికి ఒక్కమాటలో జాతీయ వికాసానికి ఆమె చేసిన - దోహదం ఇంతతకాదు.

అందువల్లనే ఆమెను, ఆమె జన్మ స్థానమైన బ్రిటన్ మరచిపోయినా, ఆమె తన మాతృదేశంగా చేసుకున్న ఇండియా ఎన్నటికీ మరిచి పోలేదు; ఎంత మాత్రం మరిచిపోదు. ఇందుకు నిదర్శనమే ప్రస్తుతం మన దేశంలో పెక్కు చోట్ల శ్రద్ధా భక్తులతో జరుగుతున్న డాక్టర్ బెసెంట్ శతవార్షికోత్సవాలు.

(ఆంధ్రప్రభ 3-10-1947)

## దేశబంధు : శ్రీ చిత్తరంజన్ దాస్




మన దేశ పునరుజ్జీవన చరిత్రలో బెంగాల్ది ప్రథమ స్థానం. రాజా రామమమోహన్ రాయ్ నుంచి సుభాస్ చంద్రబోసు వరకు బెంగాల్ ఎందరో మత, సంఘ సంస్కర్తలను, విద్యావేత్తలను, సాహితీ, కళావేత్తలను, రాజకీయ వేత్తలను దేశానికి ప్రసాదించింది.

బెంగాల్ ప్రసాదించిన రాజకీయవేత్తలలో చిత్తరంజన్దాసు నిస్సందేహంగా అగ్రగణ్యుడు. అంతేకాదు. మన స్వాతంత్ర్యోద్యమ యజ్ఞ కుండం నుంచి ఆవిర్భవించిన మహోన్నత వ్యక్తులలో ఆయనొకడు.

ఆయన త్యాగానికి పర్యాయపదం; ధీశక్తికి మారుపేరు; దేశభక్తికి మూర్తీభావం. కనుకనే ఆయనను భారతీయులు ప్రేమానురాగాలతో "దేశబంధు" అనే అన్వర్థ బిరుదంతో పిలిచేవారు. శ్రీ సి.ఆర్. దాసు శతజయంతి ఉత్సవాన్ని నేడు (నవంబరు 5వ తేదీన) యావద్భారత దేశం భక్తి గౌరవాలతో జరుపుకుంటున్నది; ఆయన విశిష్ట జీవిత కథను సంస్మరిస్తున్నది.



ఆయన న్యాయవాద వృత్తిలో విశేషంగా ధనార్జన చేశాడు. అయితే, ధనార్జనే ఆయన తన వృత్తికి ముఖ్యలక్ష్యంగా పెట్టుకోలేదు. పేదలకు న్యాయం చేకూర్చడానికి దాన్ని వినియోగించేవాడు. దేశభక్తులను బ్రిటిష్ దమన నీతినుంచి విడిపించడానికి కూడా దాన్ని వినియోగించేవాడు. తన వాదనాపటిమతో ఆయన చెరనుంచి విడిపించిన మహా దేశభక్తులలో అరవింద ఘోష్ ఒకడు.

తనకు న్యాయవాదవృత్తి అశేష ధనాన్ని సముపార్జించి పెడుతున్నా దేశస్వాతంత్ర్యం కోసం జరుగుతున్న పోరాటంలో పాల్గొనడానికి దాన్ని తృణప్రాయంగా పరిత్యజించడానికి వెనుదీయలేదు.

శ్రీ దాసు కేవలం రాజకీయవేత్త మాత్రమే కాదు బెంగాలీలో ఆయన మంచి కవి. "సాగర్ సంగీత్" అనే గీతాల సంపుటిని ఆయన రచించాడు.

ఆయన నీతి నిజాయితీలకు ఇచ్చిన విలువకు ఉదాహరణగా ఒక గొప్ప సంఘటన ఆయన జీవిత కథలో కనిపిస్తుంది. తండ్రి భువన్ మోహన్దాసు విచ్చలవిడిగా ఖర్చుచేసి దివాళా తీశాడు. పెక్కు మందికి బాకీ పడ్డాడు. ఐ.పి. పెట్టినందున చిత్తరంజన్ దాసు తండ్రి ఋణాలను తీర్చవలసిన అవసరం చట్టరీత్యా తనకు లేకపోయినా, తాను న్యాయవాద వృత్తిలో ఆర్జించిన ధనంతో ఆ ఋణాలన్నిటిని అణాపైసలతో సహా తీర్చివేశాడు.

శ్రీ దాసు గాంధీయుగానికి చెందినవాడు. అంతకు పూర్వం మన జాతీయోద్యమంలో నాయకత్వం మేధావులది కాగా, గాంధీజీ సచ్ఛీలానికి, త్యాగగరిమకు ప్రథమ స్థాన మిచ్చారు. శ్రీ సి.ఆర్. దాసు ఈ రెండు విశిష్టతలను - మేధాపటిమను, త్యాగగరిమను - పుణికిపుచ్చుకున్న అసాధారణ వ్యక్తి. గాంధీజీ యుగం తర్వాత ఈ రెండింటిలో దేనికి మన రాజకీయాలలో స్థానం లేకుండా - పోయింది.

గాంధీజీది ఆనాటి కాంగ్రెసు రాజకీయాలలో తిరుగులేని నాయకత్వం. అయినా, ఆయనను తాను మంచిదని విశ్వసించిన ఒక విధానం కోసం ఎదిరించడానికి సి.ఆర్. దాసు వెనుదీయలేదు. బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడ్డానికి శాసన సభలను చేజిక్కించుకొనడం ఒక చక్కని మార్గమని శ్రీ దాసు వాదం. దీన్ని గాంధీజీ, తదితరులు వ్యతిరేకించారు. అయినా, ఆయన లెక్కచేయక స్వరాజ్య పార్టీని స్థాపించి ఎన్నికలలో పాల్గొని బెంగాల్ కౌన్సిల్లో ఘనవిజయాన్ని సాధించడమే కాక, బ్రిటిష్ ప్రభుత్వాన్ని చీకాకు పెట్టడానికి దాన్ని పూర్తిగా వినియోగించుకున్నాడు. తాను విశ్వసించిన దానికై పోరాడ్డంలో, సాధించడంలో ఆయన పట్టుదల, సాహసం సాటిలేనివి. నేటి రాజకీయరంగంలో శ్రీ సి.ఆర్. దాసు వంటివారు ఒకరిద్దరైనా కనిపిస్తారో లేదో చెప్పలేము.



నాటి రాజకీయాలు వేరు. దేశ సేవకు, ప్రజాసేవకు ఆ రోజులలో రాజకీయాలు సాధనాలు మాత్రమే. రాజకీయాల ద్వారా ప్రజాసేవ చేయడానికి అవసరమైతే ధనాన్నే కాదు, ప్రాణాలనైనా త్యాగం చేయడానికి సి.ఆర్. దాసువంటి మహా మనీషులు సర్వసిద్ధంగా వుండేవారు. ఈనాటి రాజకీయాలు వేరు. ఇవి దేశ సేవకోసం కాదు. ప్రజా శ్రేయస్సాధన కోసం కానే కాదు; కేవలం స్వలాభానికి, ధనార్జనకు అవి సాధనాలు. నాలుగు రాళ్లు వెనక వేయడానికి ఉపకరించే అనేక వృత్తులలో రాజకీయ వృత్తి ఒకటి. పైగా దీనికి ఏ విద్యా సంస్కారాలతో, మేధాశక్తితో పనిలేదు. మన దేశంలో నేడు రాజకీయ జీవితం ఇంతగా దిగజారి పోయింది.

శ్రీ సి.ఆర్. దాసు శతజయంతి నేడు దేశవ్యాప్తంగా జరుగుతున్నది. నిజమే. కాని, కలుషితమైన నేటి రాజకీయ వాతావరణంలో, చిత్తశుద్ధి బొత్తిగా లోపించిన పరిస్థితులలో ఆయనవంటి మహనీయుల శతజయంతులు, వర్ధంతులు కేవలం లాంఛనప్రాయమేనన్న నిస్పృహ కలగక మానదు. (ఆంధ్రజ్యోతి 5-11-1970)

అగ్రనాయకుడు : శ్రీ గోవింద వల్లభ పంత్ఆయన ఎంత వీరోచితంగా పోరినా, కడపటి నిశ్వాస వరకు పోరినా, చివరికి మృత్యువే జయించింది; పండిట్ గోవిందవల్లభ పంత్ నాయకత్వం భాగ్యం మరి మనకు లేదు.

మృత్యువుపై ఆయన పోరాటం ఈనాటిది కాదు; మూడు దశాబ్దాల క్రితమే అది ప్రారంభమైంది. ఆయన కాబట్టి 1929 నుంచి, నేటి ఉదయం 8-50 వరకు మృత్యుదేవతను ధిక్కరిస్తూ నిలబడగలిగారు గాని, మరొక రైతే 1929లో సైమన్ కమిషన్కు వ్యతిరేకంగా (తక్కిన భారత నగరాలన్నింటిలో వలె) లక్నోలో జరిగిన ప్రదర్శన సందర్భంలో విపరీతంగా తగిలిన లారీ దెబ్బలకు నేలకొరిగి వుండేవారే. నిండైన విగ్రహంతో కొండంత మనిషి. ఎంత పెద్ద జనసందోహంలో నిలిచినా, దానికి శిఖరంవలె కనిపించే వ్యక్తి. అందువల్ల నాటి లక్నో ప్రదర్శనలో తక్కిన వారిపై ఒక దెబ్బ పడగా, పం'పై పది పడినవి. ఆ క్రూర ప్రహరణలకు ఆయన వెన్నెముక దెబ్బతిన్నది; నరాలు పట్టు తప్పిపోయినవి; ఆ క్షణం నుంచే ఆయనకు వణుకు పుట్టింది.

అయితే, ఇది శరీరానికి పుట్టిన వణుకు మాత్రమే; మనస్సుకు పుట్టినట్టిది కాదు. ఘోరానుభవం స్వాతంత్ర్య సముపార్జన యత్నంలో, స్వాతంత్ర్య సముపార్జన తర్వాత ప్రజాభ్యుదయ సాధన కృషిలో ఆయనను మరింత వజ్రసంకల్పుని చేసింది.

ఒక విధంగా చూస్తే, 1929 నాటి లక్నో సంఘటన తర్వాత పంత్ దేశారాధనలో గడపిన ప్రతి దినం ప్రతి క్షణం - మృత్యువుతో పోరాడి, దాన్ని అల్లంత దూరాన నిలుపుతూ సంపాదించుకొన్నట్టిదే; అందువల్ల ఆయన జీవితం మరింత విశిష్టమైంది; ఆయన సేవ మరింత పవిత్రమైంది.

వెన్నెముక దెబ్బతిన్న తర్వాత, నరాలు పట్టు తప్పిపోయిన తర్వాత, చేతులకు వణుకు పుట్టిన తర్వాత, మెడ నిలవడమైనా కష్టమైన తర్వాత, మరొకరైతే బ్రతుకును భారమైనదిగా భావించేవారు కాదా? దాదాపు ఒక శిక్షగానే దాన్ని యెంచుకొనేవారు కాదా? కాని, పంత్ అట్టి నిస్పృహను దరిదాపులకైనా రానీయలేదు. ఒకానొక సందర్భంలో డాక్టర్ కైలాసనాథ్ కట్జూకు లేఖనొకదాన్ని వ్రాస్తూ, “జీవితాన్ని ఒక శిక్షగా నేను భావించను" అని ఉద్ఘాటించడం ఆయనకే చెల్లింది.




జీవితంపట్ల పంత్ దృక్పథాన్ని వివరిస్తున్న ఈ లేఖలోని ఇతర భాగాలు కూడా మహోదాత్తమైనవే. “జీవితానికి లేనిపోని విలువను నేనివ్వను; నా దృష్టిలో నా జీవితానికున్న విలువ మరింత తక్కువ. అయితే, బ్రతుకు బాధాకరమైనదని నేను భావించను కూడా. ప్రపంచం ఒక బందిఖానా అవునో, కాదో నాకు తెలియదు; దాన్ని విడిచి వెళ్ళడంలో ముక్తి కలదో, లేదో కూడా నాకు తెలియని విషయమే. జీవితమంటే యేమిటో, దాని సారమేమిటో చెప్పడం కష్టం. అయితే, జీవిత మేది కాదో తేలికగానే చెప్పవచ్చు. నిష్కర్మణ్యత జీవితం కాదు; స్తబ్ధత జీవితం కాదు. చైతన్యం, శక్తి,

కర్మణ్యత ఇవే జీవితానికి ముఖ్య సూత్రాలు." ఈ నిత్య సత్యాలను - ఈ గంభీర భావాలను ప్రకటించిన తర్వాత తన లేఖను ముగిస్తూ, పంతే వ్రాసిన వాక్యాలివి :

"ఇతరులకు భారం కాకుండా, ఎంతో కొంత సేవను చేయగలిగినంతవరకు జీవించాలని నా అభిలాష. సోమరిపోతువలెనో, ఇతరులకు భారంగానో బ్రతకడమంటే మాత్రం నాకు కంటగింపు. అయితే, ఇప్పటికే కొందరు

నన్ను ఇట్టివానిగా భావిస్తున్నారేమో!" ఈ వాక్యాలు - ముఖ్యంగా చివరి వాక్యంలో తనపై తానే విసురుకున్న విసురు - మహోదాత్తమైన ప్రవృత్తికే చెల్లు! పంతా ఎన్నడు మతోపన్యాసాలను చేసివుండకపోవచ్చు; ధర్మముద్రను పట్టివుండక పోవచ్చు; వైకుంఠానికి తన కొక ప్రయివేట్ టెలిఫోన్ లైన్ వున్నట్టు, విధివిలాసాన్ని గురించి వ్యాఖ్యానాలు చేసి వుండకపోవచ్చు; అయినా, ఆయన నిజంగా ఒక యోగి. చివరి నిశ్వాస వరకు కర్తవ్యనిర్వహణలో అచంచల విశ్వాసం పెట్టుకున్న వ్యక్తి కనుక, ఆయన కర్మయోగి! ముప్పది సంవత్సరాలకు పైగా మృత్యువును అనుక్షణం ధిక్కరిస్తూ, ఆయన తన దేశం పట్ల - తన జాతి పట్ల - కర్తవ్య పరిపాలన చేశారు!



ఆ కర్తవ్య పరిపాలన సందర్భంలో ఆయన ప్రదరిస్తూ వచ్చిన ప్రజ్ఞా ప్రాభవాలు సామాన్యమైనవా? మేధా సంపన్నులుగా నేడు దేశంలో చెల్లుతున్న కొందరి కంటే ఆయన మేధావంతుడు. ఇట్టె మిరుమిట్లు గొలిపి, అట్టె ఆరిపోయే రవ్వలను జిమ్మే మేధ కాదది; సమస్యల పునాదులను తరచి, వాటికి పరిష్కార మార్గాలను నిర్ణయించే మేధ. పరిస్థితులు ఎంత క్లిష్టమైతే, అది అంత నిశ్చలంగా ఆలోచించేది; సమస్యలు ఎంత విషమమైతే, అంత గంభీరంగా పని చేసేది. ఆయన నిశ్చల గంభీర ప్రవృత్తి ఆయన ఉపన్యాస ధోరణిలో కూడా ప్రస్ఫుటమౌతూ వుండేది. నడవలేక నడుస్తున్నట్టుగా కనిపించినా, ఎంత చక్కని వివరణ, ఎంత బలమైన వాదం ఆయన ప్రసంగాలలో వుండేదో వాటిని తరచు విన్న ప్రతి వారికి తెలుసు! చెదరిపోతున్న సైన్యాన్ని కూడదీసి, శత్రువుపై కేంద్రీకరించి, అతనిని పరాజితుని చేసే మహా సేనాని వ్యూహరచనా పటిమ ఆయన ప్రసంగాలలోనుంచి తొంగిచూస్తుండేది! పిట్ట కథల, కట్టుకథల ప్రసంగాలు కావవి; అవసరమైనప్పుడు ఆర్భాటమేమీ లేకుండా ఊచకోత కోయగల కత్తిని పోలిన ప్రసంగాలు!

పంత్ గుణగణాలను గురించి, ఆయన శక్తి సామర్థ్యాలను గురించి ఎంతగా తలచుకొంటే, అంతగా దుఃఖం వచ్చే ఈ సన్నివేశంలో ఇంతకంటె మరేమి వ్రాయగలము? మన దేశ చరిత్రలో అతి కీలకమైనవి వచ్చే అయిదేళ్ళే! ఈ అయిదేళ్ళపాటు కూడా ఆయన నాయకత్వ భాగ్యానికి నోచుకొనకపోవడం మన దురదృష్టం!

(ఆంధ్రజ్యోతి 8-3-1961)

## పూర్ణ పురుషుడు : శ్రీ అరవిందులు




ప్రధానంగా పేర్కొనబడే యోగాలు నాలుగు; కర్మయోగం, భక్తియోగం, రాజయోగం, జ్ఞానయోగం. ఈ నాల్గింటికి భిన్నమైన మరొక యోగాన్ని పూర్ణయోగాన్ని శ్రీ అరవిందులు ప్రతిపాదించారు.

తక్కిన యోగాలనుంచి పూర్ణయోగం భిన్నమయినదైనా వాటికి అది విరుద్ధమయింది కాదు. దాని భిన్నత్వం కేవలం దాని సమగ్రత్వమే. మన వేదాలు, సంహితలు, ఉపనిషత్తులు వివరించిన కర్మ, భక్తి, రాజ, జ్ఞానాది యోగాలనేకాక, పాశ్చాత్యతత్త్వ, వైజ్ఞానికాది శాస్త్రాలను కూడా అంతర్భూతం చేసుకొన్నట్టిది పూర్ణయోగం. ఇంతేకాదు, చేతనాచేతన జగత్తుల మధ్య, భౌతిక మానసిక లోకాలమధ్య, ప్రాపంచిక పారమార్థిక జీవితాల మధ్య కృతక విభేదాలన్నింటిని తొలగించి, జీవాత్మను పరమాత్మ దిక్కుకు అధిరోహింప జేసి, పరమాత్మను జీవాత్మ దిశగా అవరోహింపజేసేది పూర్ణయోగం.

ప్రపంచం మిధ్య అనే భారతీయ తాత్త్వికులతో శ్రీ అరవిందులు ఏకీభవించరు. ఈ భౌతిక ప్రపంచానికి అతీతమయినది మరొకటి లేదనే పాశ్చాత్య తత్త్వవేత్తలతో కూడా ఆయన ఏకీభవించరు. "నిర్దిష్ట జ్ఞానం సర్వస్వం వైజ్ఞానిక రంగానికి చెందిందే" అని బెట్రెండ్ రస్సెల్ పాశ్చాత్య తత్త్వ శాస్త్రాలను సమీక్షచేస్తూ వ్రాశారు. ("హిస్టరీ ఆఫ్ వెస్ట్రన్ ఫిలాసఫీ") "తెలుసుకోదగుదాన్ని వైజ్ఞానిక శాస్త్రాల ద్వారానే తెలుసుకోగలము" అని కూడా ఆయన చెప్పారు. అయితే, వైజ్ఞానిక శాస్త్రాలద్వారా మనం తెలుసుకోగలిగింది సృష్టి నిర్మాణ రహస్యాలు కొన్ని మాత్రమే కాని, నీతి, నీతి బాహ్యం, సౌందర్యం, వికారం - ఇత్యాది విషయాలను గురించిన మన సమస్తాభిప్రాయాలు మన అభిరుచులకు సంబంధించినవని, "ఇందువల్ల అవి వైజ్ఞానిక శాస్త్రావధులకు వెలుపలివని ఆయన వివరించారు. త్యాగరాజు సంగీత మాధుర్యాన్ని మనం అనుభవిస్తాము. కాని, ఎందువల్ల అది మధురమో మనకు తెలియదు. త్యాగధనుని మనం పూజిస్తాము; స్వార్థపరుని అసహ్యించుకుంటాము. అయితే, ఆ పూజకువలె, ఈ అసహ్యానికి కూడా మూలాన్ని చెప్పమంటే మనకు తెలియదు.

వైజ్ఞానిక శాస్త్రాలను శ్రీ అరవిందులు నిరసించలేదు. పై పెచ్చు వాటిద్వారానే ఆధునిక మానవుడు తన పరిసరాలపై విజయాన్ని సాధించి, ఒక నూతన సభ్యత నెలకొనడానికి అనువైన స్థితిని చేరుకొనగలిగినాడని ఆయన విశ్వాసం. శాస్త్ర పరిశోధనల ఫలితంగా ప్రకృతి శక్తులను సంపత్ సృష్టికి వినియోగించుకొనగలగడానికి పూర్వం పొట్టనింపుకొనడం కోసమే, ప్రాణాలను నిలుపుకొనడం కోసమే మానవుడు రాత్రింబవళ్ళు రెక్కలు విరుచుకోవలసి వచ్చేది. ఉదరపోషణకు తప్ప అన్యాయానికి విరామం లేని సంఘంలో సభ్యత మొలకలెత్తడానికి వీలేలేదు. ఇందువల్లనే సభ్యతావికాసానికి కృషి చేయగల కొందరికి విరామ కల్పన కోసం ఇదివరలో బహుళ జనులను దారిద్ర్య దాస్యాలకు లోనుజేయవలసివచ్చేది. ఆయా కాలాలలో మహోన్నత శిఖరాలను అందుకున్న బాబిలోనియన్, ఈజిప్షియన్, చైనీస్, ఇండియన్, గ్రీక్, రోమన్

నాగరికతలన్నీ బహుళ సంఖ్యాకుల బానిసత్వం పునాదిగా కలవే. ఈ కాలాలలో సర్వమానవ సౌభ్రాత్రం సర్వే సర్వత్రా ఆచరణ సాధ్యంకాని ఒక భావనో, ఒక లక్ష్యమో మాత్రమే. ఋషుల తపోవీధి నుంచి, కవుల స్వప్నసౌధాలనుంచి సర్వమానవ సౌభ్రాత్రాన్ని సంఘ నాయకుల కార్యప్రణాళికల అంతస్తుకు తెచ్చింది వైజ్ఞానిక శాస్త్రాలలో మానవుని విజయమే కనుక, ఆ శాస్త్రాలను శ్రీ అరవిందులు హర్షిస్తారు. అయితే, జ్ఞానం వాటి హద్దులకే పరిమితమనే వాదాన్ని మన్నించరు. వైజ్ఞానిక శాస్త్రాలు కేవలం మేధనే సాధనంగా చేసుకుంటాయి. మేధే మానవుని తక్కిన ప్రాణికోటినుంచి మానవుని విభిన్నునిచేసి, అతనికి ప్రత్యేకత నిచ్చినమాట నిజమైనా, జగత్పరిణామ చరిత్ర ప్రస్తుత మానవావతరణతో పూర్తికాలేదని శ్రీ అరవిందుల సిద్ధాంతం. జడపదార్థం నుంచి జీవం, జీవం నుంచి అధిమనస్సు ("సూపర్ మైండ్") అవతరించగలదని ఆయన విశ్వాసం. జగత్పరిణామంలో ఈ నూతన పరివర్తనం ముమ్ముందు కొద్దిమందితో ప్రారంభమైనా, క్రమక్రమంగా మొత్తం మానవాళికే విస్తరించి పోగలదని ఆయన సిద్ధాంతం. ఈ అధిమనస్సుకు దారిచూపేది పూర్ణయోగం.



మనస్సుతో మనం తెలుసుకోగలిగింది సృష్టికి సంబంధించిన కొన్ని రహస్యాలేకాని, అసలు సృష్టికే ఏది మూలమో దాన్ని గ్రహించలేమని, ఇందువల్ల వైజ్ఞానిక శాస్త్రాలవల్ల కలిగే జ్ఞానం సహజంగా అసమగ్రమైందని శ్రీ అరవిందుల వాదం. సంపూర్ణమైన జ్ఞానసాధనకు మనస్సును రోయక, అధిమనస్సును అందుకోవాలని ఆయన బోధన. అసలు అధిమనస్సును అందుకోడానికి మనస్సే సాధన కావాలని ఆయన ప్రవచనం. ఇంతేగాదు, అధిమనస్సును అందుకోవడం విశ్వాత్మలో విలీనమై పోవడానికి కాదు, దివ్య చేతనను పృథ్విపైకి అవతరింపజేసి, మానవుని తత్త్వంలోని మాలిన్యాన్ని క్షాళనం చేసి, "ఆత్మకు ఆత్మకు మధ్య, జీవితానికి జీవితానికి మధ్య" పెరటి గోడలన్నింటిని పడగొట్టివేయగల నవసమాజాన్ని, దివ్యసంఘాన్ని, నిర్మించడానికే.

శ్రీ అరవిందుల బోధనలను ఆకళింపు చేసుకోవాలంటే, "ఏకమేవా ద్వితీయం బ్రహ్మ" సూక్తిని, "సర్వం ఖల్విదం బ్రహ్మ" సుభాషితంతో జోడించుకోవాలి. ఇలాగే "అహం బ్రహ్మాస్మి" సాధన వాక్యాన్ని "తత్త్వమసి" ఉపదేశంతోచేర్చి మననం చెయ్యాలి. ఒకటి ఎంత సత్యమో, దానిలో నుంచి ప్రభవించిన అనేకం కూడా అంత సత్యమేనని గుర్తించాలి. ఏకత్వానికీ, నానాత్వానికీ వైరుధ్యం లేదని హృద్గతం చేసుకోవాలి.

అపూర్వమయిన ఈ పూర్ణయోగాన్ని రూపొందించిన ఒక పూర్ణ పురుషుడు మన మధ్యనుంచి లోపించినందునే బ్రతుకులోనే వెలితి ఏర్పడినట్లు ప్రపంచం ఈనాడు ఇంతగా బాధపడుతున్నది.

(ఆంధ్రప్రభ 7-12-1950)

## డాక్టర్ సచ్చిదానంద సిన్హా



"అతడు సామాన్య మానవుడు; ఇతడు అసామాన్య పురుషుడు. అతడు స్వల్పాన్ని లక్షిస్తాడు; దాన్ని సాధిస్తాడు."

"ఇతని చూపు మహాకార్యం మీదనే. అది ఆకళింపైనా కాకముందే అంతరిస్తాడు." "అతడు ఒకటిని ఒకటిని చేర్చుతూ పోతాడు. త్వరలో వంద నిండుతుంది. "ఇతడు కోటికి పడగ కట్టగోరతాడు. ఆ కోర్కె కోర్కెగానే మిగిలిపోతుంది."

"అతనివి కొద్దిపాటి ఆశలు. అవి ఈ ప్రపంచంలోనే ఫలిస్తాయి. మరొక ప్రపంచంతో అతనికి పనేమిటి? ఈ లోకమే అతనికి సర్వలోకాలూ.

ఇతడు భగవత్సాన్నిధ్యంతో తప్ప తృప్తి చెందడు. నిశ్చలంగా సంశోధన కొనసాగిస్తాడు. నిశ్చయంగా ఫలసిద్ధి నందుతాడు."

ఇది మహాకవి రాబర్ట్ బ్రౌనింగ్ గీతానికి ఛాయానువాదం. ఈ గీతాన్ని నేడు నిర్యాణం చెందిన డాక్టర్ సచ్చిదానంద సిన్హా ఇటీవలనే ఉదాహరించాడు. ఇందుకు సందర్భం, ఇండియన్ రిపబ్లిక్ ప్రెసిడెంట్గా డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఎన్నిక, ఈ సందర్భంలో డాక్టర్ ప్రసాద్ అసామాన్య పురుషుడు కాగా, తాను సామాన్యుడనని డాక్టర్ సిన్హా చెప్పుకున్నాడు.

వినయ విభూషణుడై నందున డాక్టర్ సిన్హా తనను సామాన్యుల వర్గంలో చేర్చుకున్నా, ఆయన నిస్సంశయంగా మహామహుల కోవకు చెందినవాడే. వందలతోను, వేలతోను సంతృప్తిచెంద నిచ్చగించక, కోటికి పడగకట్టగోరినవాడే.

నామధేయానికి తగినట్టు డాక్టర్ సిన్హా నిజంగా సచ్చిదానందుడు. ఆయన జీవితం “ఇహం” అనే దాని చుట్టు గానుగెద్దువలె తిరిగినట్టిది కాదు. “పరం” వైపుకు అది నిరంతరాయ పురోగమనం చేసింది. అందువల్లనే ఆయనది పూర్ణజీవితం; ఆ కారణానే ఆయన మహాపురుషుడు.

ఆయన పండితుడు, గ్రంథకర్త. పత్రికా రచయిత, పార్లమెంటరీ వ్యవహారాలలో ఘటికుడు, వక్త, విద్యావేత్త, సంఘ సంస్కర్త, ప్రసిద్ధ న్యాయవాది, రాష్ట్రాభిమాని, దేశభక్తుడు, బ్రతుకును పలుతావులలో ఆయన పట్టిచూచాడు. పట్టిన ప్రతిదాన్నీ బంగారం చేశాడు.

డాక్టర్ సిన్హా జీవిత ప్రారంభమే సంఘ సంస్కరణతో అని చెప్పవచ్చునేమో; కలకత్తాలో ఇంటర్, సీనియర్ చదువును విరమించి, పదిహేడేళ్ల పసిప్రాయంలో (జనవరి 1871 నవంబర్ 10వ తేదీన ఆయన జననం)

ఆయన బారిస్టర్ చదువుకు ఇంగ్లాండు వెళ్లాడు. అప్పటిలో సముద్రయానం నిషిద్ధం కనుక, సీమ ప్రయాణానికి ఆయన ఛాందసుల పట్టింపులను ఎదిరించవలసి వచ్చింది.

నాలుగేళ్ల తర్వాత బారిస్టర్గా తిరిగి వచ్చి, ఛాందసులకు ఈసారి శాఖాంతర వివాహాన్ని చేసుకొనడం ద్వారా ఆయన తిరిగి కోపం కలిగించాడు. -

మొక్క ఏ దిక్కుకు వంగుతుందో మ్రాను ఆ దిక్కుకే పెరగడం సహజం కనుక, విదేశయానం ద్వారా, శాఖాంతర వివాహం ద్వారా సంఘ బహిష్కృతుడైన డాక్టర్ సిన్హా తుదివరకు సంస్కర్తే. సంఘ సంస్కరణతో ప్రారంభమైన పెక్కుమంది ఇతర ప్రముఖుల జీవితాలవలె డాక్టర్ సిన్హా జీవితం ఆ రంగానికే పరిమితమై పోలేదు. బ్రిటన్ నుంచి ఆయన తిరిగి వచ్చింది బారిస్టర్.

డాక్టర్ సచ్చిదానంద సిన్హా - 2 195

పట్టాతోనే కాదు; ప్రగాఢ జాతీయభావ పరంపరతో కూడా స్వదేశాన్ని చేరుకొన్న పిదప ఒక పాదాన్ని న్యాయవాద వృత్తిలో పెడుతూ, రెండవదాన్ని రాజకీయ రంగంలో పెట్టాడు. కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి పదవి, భారత శాసనసభ సభ్యత్వం, దానికి ఉపాధ్యక్షస్థానం అలంకరణ, రాష్ట్రీయ ప్రభుత్వంలో ఫైనాన్స్ మెంబర్ గిరి, రాష్ట్రీయ శాసనసభ అధ్యక్షపదవి, ఇటీవల రాజ్యాంగ పరిషత్తు సభ్యత్వం, దాని తొలి అధ్యక్షపదవికి తాత్కాలికంగా ఎన్నిక - ఈ విధంగా 'ఎన్నెన్నో ఆయన రాజకీయ రంగంలో పొందిన గౌరవ సన్మానాలు. రాజకీయ జీవితంలో

డాక్టర్ సిన్హా విమర్శకు లోనైన ఘట్టాలు కొన్ని లేకపోలేదు. అట్టి ఒక ఘట్టం - బ్రిటిష్ యువరాజు (ఇప్పటి విండ్సర్ ప్రభువు) భారతదేశ పర్యటనాన్ని కాంగ్రెసు బహిష్కరించిన సందర్భంలో ఆయనకు డాక్టర్ సిన్హా స్వాగత పత్రాన్ని సమర్పించడం. అట్టి మరొక ఘట్టం, దేశం బహిష్కరించిన సైమన్ కమిషన్ అధ్యక్షునికి జరిగిన విందులో డాక్టర్ సిన్హా పాల్గొనడం. అయితే, ఈ రెండు సందర్భాలలో కూడా జరిగింది ఆయన విభిన్న దృక్పథ విమర్శే. స్వీయ పురోభివృద్ధికి దేశాన్ని బలిపెడుతున్నారన్న నిందకు ఆయన ఎన్నడు పాల్పడలేదు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహోద్యమాలలో పాల్గొన్నవాడు కాకపోయినా, డాక్టర్ సిన్హా కేంద్ర శాసన సభికుడుగా రాష్ట్రీయ ప్రభుత్వ సభ్యుడుగా, ఇండియాకు, బీహార్కు విశేష సేవచేశాడు. తొలి ఇండియన్ గవర్నర్ (లార్డ్ సిన్హా) కార్యవర్గంలో ఆయన తొలి భారతీయ ఆర్థిక సభ్యుడు. ఆ పదవీ నిర్వహణలో న్యాయదృష్టికి, కార్యదక్షతకు స్వపక్ష, పరపక్ష భేదంలేకుండా ఆయన అందరి మన్ననలకు పాత్రుడైనాడు.

ఇక, కేంద్ర శాసన సభ్యుడుగా ప్రభుత్వాన్ని ప్రశ్నలతో, ఉపప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేయడంలో నాటికీ, నేటికీ ఆయనకు ఈడు రాగల వారు మరిలేరనే ప్రతీతి. అంతటి నిశితమైనది. ఆయన మేధ; ఎంతగానో యెన్నదగింది ఆయన సమయస్ఫూర్తి; బహు అరుదుగానే తప్ప కానరానట్టిది ఆయన హాస్య చతురత.

(ఆంధ్రప్రభ 7-3-1950)

## 2

సంఘ సంస్కర్తగా కంటె, రాజకీయవేత్తగా కంటె, రాష్ట్ర నిర్మాతగా ఆంధ్రులైనవారు డాక్టర్ సచ్చిదానంద సిన్హా జీవిత విశిష్టతను ఎక్కువగా హర్షించగలరు.

ఆంధ్రులకువలె బీహారీలకు కూడా గర్వించదగు ప్రాచీనచరిత్ర కలదు. బీహార్ సీతామహాదేవికి కన్నగడ్డ. మహావీరుడు, గౌతమ బుద్ధుడు దాని అనుంగు బిడ్డలే. చంద్రగుప్త, అశోకాదుల మౌర్య సామ్రాజ్యానికి అది మూలపీఠం. గుప్త సామ్రాజ్యం తల యెత్తిందీ అక్కడనే. భారత చరిత్రలో బీహార్ ప్రాధాన్యం పెక్కు విధాల దాదాపు నిరుపమానమైనట్టిది.

గర్వించదగు ఇంతటి మహోదాత్త చరిత్ర బీహారున్నా నేటికీ ఆంధ్రదేశానికి లేనట్టు - ఇటీవలి వరకు దానికి ప్రత్యేక వ్యక్తిత్వం లేకుండా పోయింది.

ఉత్తరాదికి వెళ్లినప్పుడు ఆంధ్రులమని మనము చెప్పుకొనడం, ఎస్కిమోల మనుగడ విషయం తమకు తెలిసినా, ఆంధ్రుల మాట మాత్రం విననట్టు "ఎవరెవరు?" అని ఆశ్చర్యంగా మనలను ప్రశ్నించడం - ఇది సర్వసాధారణమైన అనుభవమే.



ఇట్టి మర్యాదే డాక్టర్ సిన్హాకు ఆయన చిన్నతనంలో పెక్కు పర్యాయాలు జరిగింది. విద్యాభ్యాసం నిమిత్తం లండన్ వెళ్ళినప్పుడు, తాను బీహారీనని చెప్పుకొనగా, కొందరు మిత్రులు ఇండియా మ్యాప్ తెచ్చి, "బీహార్ ఎక్కడున్నదో కాస్త చూపిస్తావా, నాయనా?" అని అపహాస్యం చేశారట. "వ్యక్తిత్వం లేకుండా నా బీహార్, బెంగాల్లో ఒకటై వుండడం వల్లనే కదా, నేనింతగా నగుబాట్లపాలు కావడం" అని ఆనాడు లండన్లోనే డాక్టర్ సిన్హా ఎంతో బాధపడ్డాడు. స్వస్థలానికి తిరిగి వచ్చిన కొత్తలోనే ఒకనాడు ఆయనకు తమ ఊరిలో "బెంగాల్ పోలీస్" అనే బ్యాడ్జితో ఒక రక్షకభటుడు కంటబడగా, తల నేలకు వేసి కొట్టుకొని చావ బుద్ధిపుట్టినంతగా లజ్జావమానాలు ఆయనను ఆవహించినవట.

ఈ వివిధానుభూతుల కారణంగానే తన జీవితం తొలి దశలలోనే స్వరాష్ట్ర సాధనకు డాక్టర్ సిన్హా కంకణం ధరించాడు. తన శేముషీ దురంధరత్వం వల్ల త్వరలోనే ఆయన ఫలసిద్ధిని పొందగలిగాడు కూడా.

వంగ రాజకీయవేత్తలు దిగ్గజాలను పోలినవారు. వారినెదిర్చి, బెంగాల్నుంచి బీహార్ విభజనను సాధించడం మాటలుకాదు. అయినా, మరొక బీహారీ సర్ ఆలీ ఇమామ్ - వైస్రాయి కార్యవర్గంలో సభ్యుడై వుండడాన్ని మహదవకాశాన్ని చేసుకొని, డాక్టర్ సిన్హా తన కోర్కెను సఫలంచేసుకున్నాడు; తన కల నిజం చేసుకున్నాడు.

1911లో ఢిల్లీలో దర్బార్ జరిపిన సందర్భంలో అయిదవ జార్జి రాజు బీహార్ ప్రత్యేక రాష్ట్రం కానున్నదని ప్రకటించేసరికి బెంగాల్ హేమా హేమీలందరు తెలతెలబోవలసి వచ్చింది! నాటి నుంచి, నేటి వరకు డాక్టర్ సిన్హాను బెంగాల్ క్షమించలేదనే చెప్పవచ్చు. ఆయనపై బెంగాల్లో జరిగిన దుష్ప్రచారం ఇంతంత కాదు. అయినా, డాక్టర్ సిన్హా మాత్రం ఎన్నడు బెంగాల్ను విద్వేషించినవాడు కాదు. స్వరాష్ట్రాభిమానం పరరాష్ట్ర విద్వేషానికి దారితీయ నక్కరలేదని నిరూపించడానికి ఆయన మహిమాన్విత జీవితమే తార్కాణం.


బీహార్ కు జనకతుల్యుడని ఎన్నిక పొందిన డాక్టర్ సిన్హా భాషా రాష్ట్రాలు కోరే ప్రాంతాల వారందరికి ఆత్మబంధువే.

ఇక, డాక్టర్ సిన్హా పాండితీ ప్రకర్షను గురించి ఎంత చెప్పినా చాలదు. ఆయన ప్రధానార్జన ఆయన పుస్తక భాండాగారమే, కొమ్ములు తిరిగిన పండితులైనా ఆయన సమక్షంలో వినమ్రులు కావలసి వచ్చేది.

జర్నలిస్టుగా దేశానికి ఆయన సేవ ఎంత దీర్ఘమైనదో, అంత విశిష్టమైనదికూడా. "హిందుస్తాన్ రెవ్యూ"ను 1891లో స్థాపించి, దానికి మరణకాలం వరకు (1921-26 సంవత్సరం మధ్య తప్ప) అవిచ్ఛిన్నంగా సంపాదకత్వం వహించి, అంతర్జాతీయ ఖ్యాతిని గడించాడు. ఇంతేకాక, మరెన్నో పత్రికల సంస్థాపనకు ఆయన తోడ్పడ్డాడు; ఎందరో సాహితీపరులకు, పత్రికా రచయితలకు ప్రోత్సాహ మిచ్చాడు.

"ఏదో ఒక వర్గానికి లేదా కులానికి ప్రతినిధిగా కాక, భారతీయునిగా ప్రజా సేవచేయడమే నా జీవితలక్ష్యంగా పెట్టుకున్నాను" అని ఒకానొక సందర్భంలో డాక్టర్ సిన్హా వ్రాశాడు. ఉత్తమలక్ష్యం ప్రకారమే జీవించి, ఆయన ధన్యుడైనాడు. (ఆంధ్రప్రభ 8-3-1950)

## లోకమాన్యుడు : శ్రీ బాల గంగాధర తిలక్



లోకమాన్య బాలగంగాధర తిలక్ ఒక యుగపురుషుడు.

ఆయన ప్రవేశంతో భారత జాతీయ జీవనంలో ఒక నూతనాధ్యాయం ప్రారంభమైంది.

పాశ్చాత్య సభ్యత తొలిఢాక భారతీయులకు ఆశ్చర్య విభ్రమాలను కలిగించింది. యూరప్ ఖండం అత్యధికంగా పురోభివృద్ధి పొందింది పదిహేడు, పద్దెనిమిది, పందొమ్మిదవ శతాబ్దాలలోనే.

ఈ శతాబ్దాలలోనే అక్కడ ఫ్యూడలిజం నశించింది; మత మౌఢ్యం కొంత సడలింది; జాతీయతాభావం ప్రబలింది; స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం నినాదాలతో ప్రజాసామాన్యం విప్లవ ధ్వజమెత్తింది.

ఇంతే కాదు, ఈ శతాబ్దాలలోనే వివిధ శాస్త్రాలు అభివృద్ధి చెందాయి. ప్రకృతికి సంబంధించిన పెక్కు సత్యాలు కనుగొనబడ్డాయి. స్టీమ్ ఇంజన్, ప్రింటింగ్ ప్రెస్ మొదలైనవి వ్యాప్తిలోకి వచ్చాయి. రాకపోకల సౌకర్యాలు హెచ్చాయి. కొత్త కొత్త పరిశ్రమలు తలయెత్తినవి. విద్య, విజ్ఞానం వ్యాప్తి గాంచినవి. సారస్వతం సర్వతోముఖాభివృద్ధిని చెందింది.

ఇక, ఈ మూడు శతాబ్దాలలో భారతదేశం అశాంతితో, కల్లోలంతో, అంతర్యుద్ధాలతో కృంగి కృషీభూతమై పోయింది. అంచేత పాశ్చాత్య ఖండం సంపత్తి, విజ్ఞాన ప్రాభవం మొదలైనవి 19వ శతాబ్దం తుదిభాగంలో భారతీయులకు ఆశ్చర్య విభ్రమాలు కలగడం సహజమే!

ఈ ఆశ్చర్య విభ్రమాలు క్రమంగా వివిధ వికృత రూపాలను ధరించాయి. వాటిలో ఒకటి, విజాతీయమైనదాన్ని హర్షించడం; స్వజాతీయమైన దాన్ని నిరసించడం.

పోతే, మరొకటి, పాశ్చాత్యుల శక్తి సంపదల ముందు మనం కేవలం నిస్సహాయులమని నమ్మడం; వారి కృపాంగ వీక్షణాలపై పూర్తిగా ఆధారపడిపోవడం.



ఈ మనః ప్రవృత్తిపై, ఈ నిస్సహాయ స్థితిపై, ఈ దాస్యబుద్ధిపై విప్లవ ధ్వజమెత్తిన వాడే లోకమాన్య బాలగంగాధర తిలక్,

పాశ్చాత్య సభ్యతలో ప్రత్యేక విశేషం ఏమీ లేదని ఉద్ఘాటించడానికేమి, పాశ్చాత్యులు ఆటవికుల వలె అరణ్యాలలో కాలక్షేపం చేస్తున్న కాలంలోనే అనేక విద్యలలో, శాస్త్రాలలో భారతీయులు అత్యద్భుత పరిశ్రమను చేసి, సమకాలిక ప్రపంచానికి విజ్ఞాన జ్యోతులై వెలుగొందినారని నిరూపించడానికేమి ఆయన అనేక ఉద్గ్రంథాలను రచించాడు. ఈ కృషి ద్వారా ఆయన భారత ప్రజానీకంలో ఆత్మగౌరవాన్ని పునరుద్దీపింపజేశాడు.

ఇంతటితోనైనా ఆయన ఆగలేదు. భారతీయులు స్వయంశక్తిపై ఆధారపడవలెనని ఆయన ఉపదేశించాడు. ఆయన ఈ మహత్తరోపదేశమే "స్వరాజ్యం నా జన్మ హక్కు" అనే శంఖారావంగా పరిణమించింది. అయితే ఆయన కేవలం ఉపదేష్ట మాత్రమే కాదు; కర్మవీరుడుకూడా.

అంచేత తన ఉపదేశాలను ఆయన తన జీవితంలోనే అనుసరించాడు. వాటిని అనుసరించడంలో ఎన్ని కష్టాలు వచ్చినా ఆయన త్రుటిపాటైనా సంకోచించలేదు. అది కారాగార వాసం కావచ్చు; దేశాంతర వాసమే కావచ్చు; అన్నింటికీ ఆయన ధీరోదాత్తంగా సంసిద్ధపడ్డాడు.

"ఇంక్విలాబ్ జిందాబాద్' నినాదం నేడు ఆసేతు హిమాచల పర్యంతం ప్రతిధ్వనిల్లుతూ వున్నదంటే, అది "స్వరాజ్యం నా జన్మ హక్కు" అని ఆయన ప్రతిపాదించిన సూత్రపు విరాట్ స్వరూపమే. కారాగారవాసాన్ని అనుభవించడానికి మాత్రమే కాకుండా,ఉరికంబంపై ఎక్కడానికి సయితం నేడు దేశభక్తులు సంకోచించడం లేదంటే, అది ఆయన చూపిన కఠోర త్యాగనిరతి ముక్తాఫలమే.

అట్టి యుగపురుషుని పవిత్రనామాన్ని నిన్నను సంస్కరించుకొనడం ద్వారా భారతజాతి తన పవిత్ర ధర్మాలలో ఒకదాన్ని నిర్వర్తించుకున్నది. కాని, భారతదేశం సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న నాడే లోకమాన్యుని ఆత్మకు శాంతి! (ఆంధ్రప్రభ 3-8-1945)

## 2

బొంబాయిలో లోకమాన్య తిలక్ స్మారక సభ, సిమ్లాలో లాలా లజపత్ రాయ్ శిలావిగ్రహ స్థాపన తీర్మానం, గురుదేవ్ టాగోర్ శాంతినికేతనంలో ప్రపంచ శాంతివాదుల సభకు ఏర్పాట్లు, ఢిల్లీలో పండిట్ నెహ్రూ ప్రసంగం, గాంధీజీ జీవిత రచన యత్న సందర్భంలో ఇండియాకు లూయీ ఫిషర్ ఆగమనం - నేటి వార్తలలో కానవచ్చిన ఈ వివిధాంశాలే నేటి సంపాదకీయానికి కారణం; లేదా సాకు,

నౌరోజీ, గోఖలే, మాలవ్యా, లజపత్ రాయ్, గాంధి, తిలక్, టాగోర్, ఇక్బాల్, నెహ్రూ, ప్రభృతులందరు దేశభక్తులే.

దేశ స్వాతంత్ర్య వాంఛలో, దేశాభ్యుదయకాంక్షలో వీరు ఒకరికొకరు తీసిపోనివారే; లేదా, ఒకరి నొకరు మించిపోగలవారే.



అయితే, సమాన లక్ష్యసాధనలో వీరి వైఖరులు భిన్నం; విధానాలు భిన్నం. ఇందుకు వీరి విభిన్న ప్రవృత్తులే కాకుండా, వీరి జీవితాలపై ప్రసరించిన విభిన్న ప్రభావాలు కూడా కారణం.

ఉదాహరణకు దాదాభాయి నౌరోజీ, గోపాలకృష్ణ గోఖలే బ్రిటిష్ లిబరలిజం ప్రభావంచే సమ్మోహితులైన వారు. బెంథామ్, బ్రయిట్, మిల్, మోర్లే వీరికి గురువరేణ్యులు. స్వేచ్ఛ, విజ్ఞానం : ఇవి రెండే సకల సంఘారిష్టాలకు దివ్యౌషధాలని బ్రిటిష్ లిబరలిజం ప్రతిపాదించింది. సమానావకాశా లిచ్చినప్పుడు సమస్త మానవులు సమానాభ్యున్నతిని సాధించగలరని కూడా ఉద్ఘోషించింది.

మానవుడు వక్రంగా ఎందుకు ప్రవర్తిస్తాడు? వక్రంగా ఆలోచిస్తాడు గనుకనే. అతనికి విద్య చెప్పండి; విజ్ఞానం గరపండి; అతనితో వాదించండి; అతని జ్ఞాననేత్రం తెరవండి. అంతటితో అతడు ఉత్తమపౌరుడౌతాడు.

పౌరులు ఉత్తములైనంతనే సంఘం కూడా ఉత్తమమైనదే కాగలదు ఇదే బ్రిటిష్ లిబరలిజం సిద్ధాంతాల సారాంశమని చెప్పవచ్చు.

ఈ సిద్ధాంతాలను పూర్తిగా ఆస్వాదించినవారైనందువల్లనే నౌరోజీ, గోఖలే ఇండియాపట్ల బ్రిటిష్వారి వైఖరికి వారి అజ్ఞానమే కారణమని భావించారు. ఆ అజ్ఞానాన్ని వాదబలంతో ప్రోదోలితే స్వరాజ్య సంసిద్ధి తథ్యమని విశ్వసించారు.

నౌరోజీ, గోఖలే వర్గానికి చెందిన వారే ఫిరోజే మెహతా, భూపేంద్రనాధ్ వసు, డబ్లియు.సి. బెనర్జీ మొదలైన వారందరు.

బాలగంగాధర్ తిలక్, లజపత్ రాయ్, మదనమోహన మాలవ్యాలు వేరొకవర్గంవారు. వీరిలో అధికంగా కానవచ్చేది హిందూ సంస్కృతి ప్రభావమే.



హిందూ సంస్కృతి బహుముఖమైనది. అందువల్ల ఏక హిందూ సంస్కృతి ప్రభావం వీరిపైపడినా, దాని ఫలితం వేర్వేరుగా పరిణమించింది.

హిందూ సంస్కృతిలోని క్షాత్రం - ఆర్య సమాజంద్వారా వ్యక్తమైనట్టిది - లజపత్ రాయ్ ని వశీకృతుని చేసుకున్నది. స్వీయ సంస్కృతి పట్ల ప్రేమాభిమానాలతోపాటు, అన్య సంస్కృతులపట్ల కొంత అసహనం, కొంతవరకు విద్వేషం దీనిలో భాగాలే. జాతీయతా ప్రాబల్యం వల్లనేమి, లజ్పత్ రాయ్ ఆర్య సమాజం ద్వారా వ్యక్తమైన హిందూక్షాత్రధర్మంలోని అసహనాన్ని, విద్వేషాన్ని జయించడానికి ప్రయత్నించక పోలేదు. ఈ ప్రయత్నంలో కొంతవరకు కృతకృత్యుడైనా, తన జీవితంపై బాల్యంలోనే పడిన ఆర్య సమాజ ప్రభావానికి ఆయన పూర్తిగా అతీతుడు కాలేక పోయాడు.

హిందూ సంస్కృతిలో క్షాత్రభాగ ప్రభావమే తిలక్పై కూడా పడింది. ఐతే, అది ఆర్యసమాజ ప్రేరితం కాదు; మహారాష్ట్ర చరిత్ర ప్రేరితం; వేద సంస్కృతి ప్రేరితం కాదు; భగవద్గీత బోధనల.

ప్రేతం. అందువల్ల దానిలో కార్యాకార్యజ్ఞత కానవస్తుంది; సమదృష్టి ప్రస్ఫుటమౌతుంది; స్థితప్రజ్ఞ ద్యోతకమౌతుంది.

తిలక్ హిందూ క్షాత్రానికి ఒక ప్రతినిధి అయినప్పటికీ, ముస్లిముల విశ్వాసానికి పాత్రుడు కాగలడనడానికి కారణ మిదే. ప్రత్యక్ష సంఘర్షణకేమి, వీలుపడితే బలప్రయోగానికేమి ఆయన సిద్ధాంతరీత్యా విముఖుడు

కాకపోయినా, కార్యసాధనకు ప్రాధాన్యమిచ్చి, సమయానుకూలంగా వర్తించడానికి (రెస్పాన్సివ్ కోఆపరేషన్కు) ఆయన సంసిద్ధుడు కావడానికి కూడా కారణమిదే.

ఇక, మాలవ్యా విషయంలో హిందూ సంస్కృతిలోని క్షాత్రభాగం కంటే, ఆ సంస్కృతి ఎన్ని శతాబ్దాలలో ఎన్ని దెబ్బలు తిన్నా, చెక్కు చెదరకుండా నిలవడానికి తోడ్పడిన దాని పునాదుల - ఆచారాలు, సంప్రదాయాలు మొదలైనవని మా తాత్పర్యం - ప్రభావం అధికం. అంచేతనే ఆయన పురోగామి కావడంతోపాటు పూర్వాచార పరాయణుడు; సంస్కరణాభిలాషి కావడంతోపాటు, సంప్రదాయాలకు వ్యతిరేకంగా పోలేనివాడు.

పోతే, తిలక్వలె గాంధి కూడా భగవద్గీతల పట్ల భక్తి కలవాడే; దాన్నే తన జీవితానికి ఆలంబనగా పరిగణిస్తున్నానని చెప్పినవాడే. ఐతే, స్థితప్రజ్ఞత్వం విషయంలో తప్ప గాంధీజీ జీవితంపై భగవద్గీత ప్రభావం తక్కువ. ఆయనకు హిందూ సంస్కృతితో కంటై బౌద్ధ, జైన, క్రైస్తవ మత సిద్ధాంతాలతో సన్నిహితత్వం అధికం. తనకు గురుతుల్యులలో రస్కిన్, కార్పెంటర్, గాంధీ పేర్కొన్నాడు. వీరు క్రైస్తవ మత ప్రబోధితులుగాని, హిందూ సంస్కృతివల్ల రూపొందినవారుకారు. దీనినిబట్టి కూడా కేవలం స్థితప్రజ్ఞత్వాని కిచ్చిన ప్రాధాన్యత వల్లనే భగవద్గీత గాంధీజీని ఆకర్షించిందని భావించవచ్చు. అన్యవిధాల అది తనను ఆకర్షించలేక పోయినందునే, భగవద్గీత అహింసనే ప్రబోధిస్తున్నదని దానికి విపరీత వ్యాఖ్యానాన్ని ఆయన చేయడం తటస్థించింది కూడా.

నిజానికి గాంధీజీ ఏ ఒక మతానికి, ఏ ఒక సంస్కృతికి చెందనివాడేమో! అన్ని మతాల అన్ని సంస్కృతుల సమన్వయాన్నే ఆయన లక్షించినట్టు కనబడుతుంది. ఈ సమన్వయ యత్నంలో ప్రేమకు, కారుణ్యానికి, నిరాడంబరత్వానికి, నిష్కామత్వానికి ఆయన ప్రాధాన్యమిచ్చాడు.



రవీంద్రనాథ్ టాగోర్ కూడా వివిధ మతాల, వివిధ సంస్కృతుల సమన్వయాన్ని లక్షించినవాడే. ఆయన అట్టి సమన్వయాన్ని లక్షించిన బ్రహ్మ సమాజంలో పుట్టి పెరిగినవాడు. ఐతే, అన్యవిధాల గాంధీ దృష్టి నుంచి ఆయన వైఖరి పూర్తిగా భిన్నం. గాంధీవలె ఆయన యంత్రయుగానికి విరోధి కాడు. గాంధీవలె ఆయన కాయకష్టానికి ప్రాధాన్యమివ్వడు. ఆధునిక నాగరికత ఆయన దృష్టిలో విద్వేషించవలసిన ఒక రుగ్మతకాదు; మానవ పరిణామాలలో మరొక మెట్టు. ఉపవాసాల వల్ల, బ్రహ్మచర్యం వల్ల, ఇంద్రియాలను జయించమని ఆయన చెప్పడు. ఇంద్రియ నిగ్రహయత్నం ఏ కొందరు మహాత్ముల విషయంలోనో తప్ప, సాధారణంగా వెర్రితలలు వేయడం కద్దు గనక, విశృంఖలంగా వర్తించకుండా, జీవితాన్ని పూర్తిగా అనుభవించమనే ఆయన బోధిస్తాడు. ఆయన నిర్దేశించినట్టిది భోగానికీ, త్యాగానికీ మధ్యమ మార్గం. టాగోర్ వలె ఇక్బాల్ కూడా సౌందర్యోపాసి. ఆయన వలె తాను కూడా విశ్వప్రేమను కీర్తించినవాడే. కాని, క్రమంగా

ఇక్బాల్లో జాతీయతాభావం నశించింది; మత దురభిమానం ప్రబలింది. సూఫీతత్వ బోధకుడుగా జీవితాన్ని ప్రారంభించినవాడు. ముస్లింలీగు మూలస్తంభాలలో ఒకడుగా పరివర్తనం చెందాడు.

పోతే, నెహ్రూపై వివిధ మతాల ప్రభావం ఎంత స్వల్పమో, వివిధ సంస్కృతుల ప్రభావం అంత విశేషం. ఆయనకు ఒక మతం ఉంటే, అది సోషలిజం. ఐతే, విశ్వాసాలవల్ల సోషలిస్టు అయినా గాంధీజీ ప్రభావానికి పూర్తిగా లోనైనవాడు. మానసిక విశ్వాసాలు ఒక వైపుకు, గాంధీజీపట్ల భక్తి ప్రేమలు మరొకవైపుకు లాగగా, ఏదో ఒక రాజీ చేసుకోవడం ఆయన ప్రవృత్తిలో ఒక భాగమైపోయింది.

ఈ విధంగా విభిన్న ప్రభావాలకులోనై విభిన్న మార్గాల మన దేశ స్వాతంత్ర్య సాధనకు కృషిచేసిన అనేకమంది నాయకులు తమ ద్వారా మనపై ప్రసరింపజేసిన శక్తులకు ఈనాడు మనదేశం క్రీడారంగం. ఏక సమయంలో విభిన్నముఖాలు పోవడానికి మనం ప్రయత్నం చేస్తున్నామనే అభిప్రాయం కలగడానికి కారణ మిదే. కాని, ఈ నాయకులందరి లక్ష్యం ఒక్కటేనని అది దేశసౌభాగ్యమని గుర్తిస్తే, ఎన్ని మార్గాల నడిచినా, మనం ఒకే గమ్యం చేరగలుగుతాం.

(ఆంధ్రప్రభ 3-8-1948)

## లాలాజీ: శ్రీ లాలా లజపత్ రాయ్



కాంగ్రెసు రంగస్థలంపై కొత్తగా ప్రాముఖ్యం వహిస్తున్నవారు వేలు మడిచి చెప్పడానికి ఒక్కరైనా కానరారు. ఇదివరలో కాంగ్రెసులో ప్రసిద్ధులైనవారే ఇప్పుడు కూడా దానిలో ప్రముఖులు. అయినా, వీరిలో పెక్కుమందికి ఇదివరకటి ప్రతిపత్తిలేదు; ప్రతిష్ఠ లేదు.

నిస్వార్థ సేవాధర్మంలో కనుమొరగడ మొక్కటే ఇందుకు కారణం కాదు. ఇదొక్కటే కారణమైతే, పదవిని తాము ఆశించక పోయినా, పదవే వచ్చి తమను వరించినవారుకూడా ఆ పదవిని ప్రజాభ్యుదయానికి వినియోగించడానికి శక్తివంచనలేకుండా ప్రయత్నిస్తున్నవారు కూడా పూర్వపు ప్రతిపత్తిని, ప్రతిష్ఠను కొంత కోల్పోవడం ఎందుకు తటస్థిస్తుంది? ఇందువల్ల ప్రస్తుత పరిణామానికి మరొక కారణంకూడా వుండాలి.

ఈ మరొక కారణాన్ని కనుగొనడం ఏమంత కష్టమైన పనికాదు. కాంగ్రెసు ప్రముఖులలో పెక్కుమంది మనస్తత్వం గాడిని తప్పిస్తే ముందుకు అడుగిడలేని గానుగెద్దుకు పోల్చదగినట్టిది. స్వరాజ్య సాధనతో ఆ

గాడిని వదలి, మరొక దాని వెంట నడవవలసి వస్తున్నది. అది వీరికి చేతకావడంలేదు. అందువల్ల అడుగడుగుకు తడబడుతున్నారు. తమ కాళ్లను తామే నలగద్రొక్కు కుంటున్నారు; ఇతరుల కాళ్లను నలగద్రొక్కుతున్నారు.



Lala Lajpat Rai at a meeting of the Fabian Society

జీవితం బహుముఖమైనదని గుర్తించనేరక, కేవలం రాజకీయాలకే పరిమితం కావడం, ఆ రాజకీయ రంగంపై సాంఘిక, ఆర్థికాదిశక్తుల ప్రభావాన్ని సయితం గ్రహించనేరక పోవడం, తక్షణ లక్ష్యసాధనలోనే పూర్తిగా నిమగ్నమై, పుస్తక ప్రపంచానికి, భావజగత్తులోని నిత్య పరిణామాలకూ అపరిచితులు కావడం - ఈ లోపాలవల్లనే ఇదివరలో కానరాని వెలితి ఇప్పుడు అనేక కాంగ్రెసు ప్రముఖులలో కనబడుతున్నది.



ఏ తెలివి లేని వ్యక్తులు కాంగ్రెస్ ప్రముఖులలో బహు కొద్దిమంది కావడంవల్లనే నిన్నను లాలా లజపత్ రాయ్ వర్ధంతి సందర్భంలో పెక్కుమంది "ఇప్పుడు ఆ పంజాబ్ కేసరి జీవించివుంటేనా!" అని నిట్టూర్చడం జరిగింది.

లాలాజీ అడుగు పెట్టని, అడుగు పెట్టిన పిదప దానిపై తన విశిష్టత్వ ముద్ర వేయని - జీవిత రంగమే లేదు.

ఆయన గ్రంథకర్త, పత్రికా సంపాదకుడు, సంఘసంస్కర్త, రాజకీయాలలో నిధి, ఆర్థిక విషయాలలో నిష్ణాతుడు - ఒక్క మాటతో ఆయనది సమగ్రమైన జీవితం.

ఆయన ఎన్నో పత్రికలను నడిపాడు; మరెన్నో పుస్తకాలను ప్రచురించాడు; గాంధీజీ భారత రంగంలో పాదం పెట్టక ముందే అస్పృశ్యతా నివారణకు, స్త్రీ జనోద్ధరణకు, కులవిభేదాల నిర్మూలనకు తగు కృషిచేశాడు; గాంధీజీకంటే ముందుగా జాతీయభాష విషయమై ఆలోచించి కృషి చేశాడు; ఒక బ్యాంకిని పెట్టాడు; మరొక బీమా కంపెనీని స్థాపించాడు.



ఆయన ఏమి చేసినా, అది కేవలం దేశాభ్యుదయం దృష్టితోనే. చివరికి బ్యాంకిని, బీమా కంపెనీని పెట్టడం కూడా స్వంతానికి లాభార్జనకోసంకాదు; బంధుమిత్రులకు బ్రతుకు తెరువు కల్పించడం కోసమైనా కాదు. "సర్వెంట్స్ ఆఫ్ పీపుల్ సొసైటీ"ని స్థాపించి, తన సర్వస్వాన్ని ఆయన దానికి కట్టబెట్టాడు. కోరి, దారిద్ర్యాన్ని వరించాడు; కావాలని నిరాడంబర జీవితాన్ని గడిపాడు.

రాజకీయాందోళన సాగించడంలో ఆయన ఎవ్వరికీ తీసిపోడు. ఇదే సమయంలో ఆయన కార్యదక్షత నిరుపమం. ఇక శౌర్యానికీ, త్యాగానికీ ఆయనకు ఆయనే సాటి. కారాగార వాసక్లేశాలనే కాక, ప్రవాసభారాన్ని కూడా అనుభవించాడు. తన శక్తినీ, సంపదను పణంగా పెట్టడమే కాక, తుదకు పరప్రభుత్వ పశుత్వానికి ప్రాణాలనే బలిపెట్టాడు. పూర్ణ మానవ లక్ష్యానికి అతి సమీపానికి వచ్చినవారిలో లాలాజీని ఎన్నాలి. ఇట్టివారి సంఖ్య

తక్కువ కావడమే ఈనాడు దేశదౌర్భాగ్యం. (ఆంధ్రప్రభ 19-11-1949)


## కవికోకిల : శ్రీమతి సరోజినీదేవి




"ఆగు, మృత్యుదేవతా! కాస్త ఆగు! నా మధుర జీవిత వసంతమిప్పుడే ప్రవేశించింది; సుందరమైనది నా యౌవ్వనం. దాని తరుణశాఖలపై గండుకోయిలలిప్పుడే గొంతు విప్పుతున్నాయి. నేనప్పుడే మరణించలేను.

"ఆగు! మృత్యుదేవతా! కాస్త ఆగు. నా ఆశాసుమాలింకను వికసించనే లేదు; నా ఆనంద మింకా పంటకు రానేలేదు; నా పాట లింకా నేను పాడుకోనేలేదు; కురియించగల కన్నీటినంతను నే నింకను కురియించనే లేదు; నే నప్పుడే మరణించలేను.

"ఆగు, కాస్త ఆగు! ప్రేమ విషాదాల పాత్రికను అడుగంట గ్రోలనీ; భూమ్యాకాశాల సౌందర్యాన్ని తుదముట్ట చూడనీ; కోర్కెలన్నింటిని కొసలు తేలనీ; ఓ మృత్యు దేవతా! నే నప్పుడే మరణించలేను."





తరుణ కంఠాన్ని విచ్చుకు వెలువడ్డ ఈ తియ్యని పాట మృత్యుదేవత కటిక గుండెనైనా కరిగించగలిగేది కాదా? అయినప్పుడు, అది ఆగకేమి చేస్తుంది?

మృత్యుదేవత ఆగింది. కాస్త ఆగడమైనా కాదు, చాలా కాలం ఆగింది. కాని, శ్రీమతి సరోజినీదేవి ఆశాసుమాలన్నీ వికసించనే లేదు. ఆమె ఆనందమంతా పంటకు రానే లేదు. కురియించగల కన్నీటినంతటినీ ఆమె కురియించనే లేదు.

ఇంతేకాదు. ఆమె ప్రేమ విషాదాల పాత్రికను అడుగంట గ్రోలనేలేదు. భూమ్యాకాశాల సౌందర్యాన్ని తుదముట్ట చూడనేలేదు. ఆమె కోర్కెలన్నీ కొనలు తేలడమైనా జరగలేదు.

శిథిల శిశిర శీతవాయువుల స్పర్శ అప్పుడప్పుడు సోకినా, ఏదో ఒక ఘట్టం కాక, ఆమె యావజ్జీవితం నవవసంతమే. ఈ మధ్యనే ఆమె సప్తతి జన్మదినోత్సవాన్ని జరుపుకొని వుండవచ్చు. అయినా, ఆమె జీవితవనం నవకోమల కుసుమ భరితమే. ఆ వనంలో గండుకోయిల లింకను పాడుతూనే వున్నాయి.

మరి ఆగలేక, మృత్యుదేవత నిన్న రాత్రి ఆమెను తన వొడిలో చేర్చుకొని వుండవచ్చు. కాని, ఈ లోకంలోవలె మరొక లోకంలో కూడా ఆమె జీవితం నిత్యవసంతమే కాగలదు; అది పూలబాసలతో, తేటి పాటలతో, కోయిల కూజితాలతో, కన్నీటి గలగలలతో, నవ్వుల కిలకిలలతో నందనవనంవలె ప్రతిధ్వనిల్లగలదు.



ఆ మరొక లోకానికి ఆమె పాటలతోనే వెళ్ళింది కూడా. అవసాన సమయంలో ఆమె కోరిన కోర్కె నాలుగు పాటలను వినిపించమనే.

పాట లేనిదే ఆమె లేదు. ఆమె పాట; పాటే ఆమె. పసిపాపకాలం నాటి ఆమె జిలిబిలి పలుకులను జాగ్రత్త పరచినవారు లేరుగాని, అవి పాటలే అయివుండాలి. విద్యార్థినిగా నున్నప్పుడు ఒక లెక్కపెట్టిన తికమక ఒక పెద్ద పాటగా మారింది. నాటి నుంచి ఆమె పాట వ్రాయని ఘడియే లేదు. ఆమె పాటల కోసం ఆమె ప్రచురించిన కావ్యసంపుటాలను చూడ్డం మాత్రమే చాలదు; ఆమె జీవితం పుటలను కూడా పరికించాలి.

భారత రాజకీయ రంగంలో గాంధీజీ సత్యాన్ని ప్రవేశ పెట్టగా, ఆమె కవితను ప్రవేశ పెట్టింది. దీన్ని కానలేని వారు "నీవు నీ వీణను, నీ వేణువును ఎందుకు విడిచివేశావు?" అని అడగక పోలేదు. అందుకు ఆమె ప్రత్యుత్తర మిది : "నీ స్వప్నాల సౌధం నుంచీ, నీ పారిజాత వనం నుంచి కదలరాదంటే, కదలకుండా ఏ కవి నిలవ గలడు? అతని స్థానం తన ప్రజల మధ్య, ప్రజాజీవిత పథధూళే అతనికి శిరోధార్యం."



ప్రజా జీవితమే కవి జీవితమని గుర్తించిన కవులు బహు కొద్దిమంది. దీన్ని గుర్తించ గలిగినా, ప్రజా జీవితాన్ని ముఖ్యంగా రాజకీయ రంగాన్ని - కవితా స్రవంతితో పదనువారజేసిన వారు మరీ తక్కువ. అపురూపంగా గాని కానరాని ఈ కవికోకిల వర్గంలో సరోజినీదేవి స్థానం మహోన్నతం.

ఛందోబద్ధమైన గీతాలను రచించడాన్ని ఆమె చిరకాలంనాడే విరమిస్తే మాత్రమేమి? గాంధీజీ పరమపదించినంతనే ఆమె చేసిన ప్రసంగం ఒక విషాదగీతం; ప్రాచ్య మహాసభను ప్రారంభిస్తూ ఆమె చేసిన ప్రసంగం ఒక ప్రబోధగీతం; 1925లో కాన్పూర్ కాంగ్రెస్ మహాసభ అధ్యక్షపీఠం నుంచి ఆమె చేసిన ప్రసంగం ఒక స్వాతంత్ర్య గీతం.

"ఏ విధంగా మీ హృదయాలను నేను కదిలించగలను? మీ దాస్యాన్ని, మీ విభేదాలను, మిమ్ము ఆకలికి, చలికి, నిరాశకు, నిరంకుశత్వానికి పాల్పడజేస్తున్న సమస్తాన్ని దహించి వేయగల నిరంతరాగ్ని శిఖలను మీలో ఏ విధంగా నేను ప్రదీప్తం చేయగలను?" అని నాటి కాన్పూర్ మహాసభ వేదికపై నుంచి ఆమె ప్రశ్నించింది.



“స్వాతంత్ర్య సమరంలో క్షమించరాని మహాద్రోహం నిస్పృహే; క్షంతవ్యంకాని మహా పాతకం భయమే” అని నాటి సభావేదికపై నుంచే ఆమె ఉదోషించింది.

ఈ ప్రసంగంలోనేమి, ఇట్టి ఇతర ప్రసంగాలలోనేమి భారత జాతికే ఆమె కవికంఠమైంది. ఆ కంఠం నుంచి ప్రబోధగీతికలే కాక, ప్రజ్వలితాగ్నికణాలు వెలువడిన సమయాలు సయితమున్నాయి.


జలియన్ వాలాబాగ్ ఘోర దురంతాల పిదప 1920లో లండన్లోని ఆల్బర్ట్ హాల్లో “నా సోదరీమణులను విగతవస్త్రలను చేశారు; వారిని క్రూరంగా మోదారు; ప్రాణాన్నిమించిన వారి మానాన్నే హరించారు” అని ఆమె ఉపన్యసిస్తున్నది. ఆమె తమ రాజధాని నగరానికి వచ్చి, తమ సాటివారి చర్యలను గురించి ప్రసంగించడం తమ జాతికే అపచారమని భావించి, ఆ సభను భగ్నపరచడానికి చేరిన కొందరు బ్రిటిష్ వారికి ఈ పలుకులు దుర్భరమైనాయి. వెంటనే వారు కేకలు, బొబ్బలు ప్రారంభించారు. అంతట సరోజినీదేవి త్రుటిపాటు తీక్షంగా చూచి, “షటప్” అని గర్జించింది. ఆ గర్జనలో మొత్తం భారతజాతి కంఠస్వరమే మిళితమైనందున సభాంతం వరకు మరి నోరెత్త సాహసించిన దుండగీడు లేడు.



జాతికే కవికంఠమైన శ్రీమతి సరోజినీదేవి ధన్యజీవి. కాని, భారత భూమిని వీడిపోవడానికి ముందు స్వేచ్ఛా స్వాతంత్రాలతో పాటు, శాంతి సుభిక్షాలను కూడా తనను కన్నతల్లి పొందగలిగివుంటే; కన్నీటి కాల్వలన్నీ ఇంకిపోయి, ఆనంద స్రవంతులు ప్రవహిస్తుంటే, ఊరూరు, నాడు నాడు పచ్చతోరణం, నిత్య కళ్యాణమై వుంటే, ఆమె మరింత తేలిక గుండెతో, మరింత తేలిక అడుగులతో, పాటలలో మరింత ఊపుతో, పెదవులపై మరింతగా చిరునగవుతో స్వర్గధామాన్ని చేరివుండేది. (ఆంధ్రప్రభ 3-3-1949)

వివరణ : జలియన్ వాలాబాగ్ 1919 ఏప్రిల్ 13న భారతీయులను బ్రిటీషు వారు నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు.

## డాక్టర్ రాజేంద్రప్రసాద్ - 1



"వినయం, విశ్వాసం, నిష్కాపట్యం, నిరాడంబరత్వం - ఈ సద్గుణాలు బీహారీల సొత్తు" అని గాంధీజీ తన ఆత్మకథలో పేర్కొన్నాడు. వీటి పరాకాష్ఠ పోయిన శనివారంనాడు 65వ జన్మదినోత్సవాన్ని జరుపుకున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్ అని మనం పేర్కొనవచ్చు. వినయానికి, ధూర్తత్వానికి సరిహద్దు బహు సమీపం, ఒకదాని సరిహద్దు ఎక్కడ అంతమౌతుందో, మరొకదానిది ఎక్కడ ప్రారంభమౌతుందో చెప్పడం కష్టం. కాని, డాక్టర్ రాజేంద్రప్రసాద్ విషయంలో వినయం అక్కరను బట్టి ధరించబడే ఒక భూషణం కాదు. అది ఆయన ప్రవృత్తిలో అంతర్భాగం. అదే బృహద్భాగం కూడా.

విశ్వాసం ఒక సల్లక్షణమే. అయితే, దానిలో ఒక ప్రమాదమున్నది. మితిమీరిన విశ్వాసం, యుక్తాయుక్త విచక్షణకు స్వస్తి వాచకం పలుకుతుంది; స్వతంత్రాలోచనకు మంగళహారతి పాడుతుంది. కాని, డాక్టర్ రాజేంద్రప్రసాద్లో విశ్వాసం ఈ ప్రమాదకరమైన అవధికి పోలేదు.


నిష్కాపట్యం అన్ని సందర్భాలలోను మన్నన పొందదు. ఇందుకు కారణం లేకపోలేదు. పెక్కు ఘట్టాలలో మందబుద్ధి నిష్కాపట్యపు మేలిముసుగును వేసుకొనడం కద్దు. అప్రయోజకత్వం నిష్కాపట్యంగా చెలామణి కావడంకూడా కద్దు. రాజేంద్రబాబు సునిశిత మేధావంతుడు; కార్యసాధనలో ఘటికుడు. అయినప్పటికీ, ఆయన నిష్కపటి కావడం సర్వసాధారణంగా కానరాని ఒక గొప్ప విశేషం.

నిరాడంబరత్వం ద్వివిధం. అన్నపానీయాలలో, వేషభాషలలో, ఆచార వ్యవహారాలలో నిరాడంబరత్వ మొకటి, మానసిక ప్రవృత్తిలో గర్భితమయ్యే - జీవితపు అసంఖ్యాక కోణాలతో అనుక్షణపు ఒరిపిడిలోనే ప్రదర్శితమయ్యే - నిరాడంబరత్వం మరొకటి. రాజేంద్రప్రసాద్ కానవచ్చే నిరాడంబరత్వం ఈ రెండవది.

వినయం, విశ్వాసం, నిష్కాపట్యం, నిరాడంబరత్వం - ఈ సద్గుణ పుంజానికి కమనీయరూపమే సీతామహాదేవి; దాని మహనీయావతారమే గౌతమబుద్ధుడు, సీతామహాదేవి, గౌతమబుద్ధుడు, జనించిన బీహార్లోనే రాజేంద్రప్రసాద్ పుట్టడం కాకతాళీయం కాదు. అట్టి వ్యక్తి మరొకచోట పుట్టడానికి వీలేలేదు.

లెనిన్ లేడనుకొంటే స్టాలిన్ ఏమైవుండేవాడు? జార్జియాలో తన తండ్రివలె చెప్పులు కుట్టుకుంటూ బ్రతుకును వెళ్లదీసే వాడా? లేక, తన తల్లి కలలు కన్నట్టు ఏ గ్రామానికో ఫాదరీ అయివుండేవాడా? ప్రారంభిస్తే, ఇది మనస్సును అలరిస్తూ ఎంత దూరమైనా తీసుకుపోగల భావ స్రవంతే.

గాంధీజీ లేకపోతే, ఈనాడు జాతీయ నాయకులైనవారి జీవితాలు ఏయే రూపాలు ధరించేవో కూడా వేరే పనిలేకపోతే ఆలోచనలు రెక్కల గుర్రాలవలె పరుగులిడదగు భావ పథమే.



తక్కిన జాతీయ నాయకులు కొందరి విషయంలో విభిన్నాభిప్రాయాలకు ఆస్కారం వున్నా, డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాత్రం ఏ పరిస్థితులలోనైనా ప్రముఖ స్థానానికి నిస్సందేహంగా వచ్చివుండేవాడే. విద్యార్థిగా ప్రతి పరీక్షలో ప్రథమ స్థానం ఆయనదే. కలకత్తా యూనివర్శిటీ మొత్తానికి మెట్రిక్యులేషన్ పరీక్షలో మొదటివాడుగా ఆయన నెగ్గినప్పుడు ఆనాటి "హిందూస్థాన్ రెవ్యూ" కింది విధంగా వ్రాసింది.

"ఈ బాల రాజేంద్రుడు బహు ప్రజ్ఞావంతుడని అందరి ద్వారా వింటున్నాము. ఇతని భవిష్యత్తు ఎట్టిది కాగలదో ఏమో! తన రాష్ట్రానికి ఈ చిరంజీవి హైకోర్టు జడ్జి కాగలడని, లాహోర్ కాంగ్రెసుకు అధ్యక్షత వహిస్తుండగా చందావర్కర్క ఆయన హైకోర్టు జడ్జిగా నియమించబడినట్టు ఉత్తరువు వచ్చినట్టే ఈ కుర్రవానికి కూడా రాగలదని నమ్ముతున్నాము."

"హిందూస్థాన్ రెవ్యూ" చేసిన ఊహ అత్యంత సమంజసమైనదే. గాంధీజీ భారతీయ వియత్తలంపై చండభానుడై ప్రకాశించి, తన తీక్ష కిరణాలతో మరొక రూపానికి పెక్కు జీవితాలను కరిగించి వుండక పోతే, డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఈనాడు రిటైర్డ్ హైకోర్టు జడ్జీగా పాట్నాలో పింఛను తింటుండేవాడే. తన కాలాన్నీ, శక్తినీ ఏదో ఒక దీనజనోద్ధరణ కార్యకలాపంలో బహుశా వెచ్చిస్తుండేవాడే.

విద్యార్థిగా రాజేంద్రప్రసాద్ కు ఒకే ఒక కోర్కె వుండేది. అది తాను ఏదైనా ఒక స్కూల్లో టీచర్ కావాలని; లేదా, ఏదైనా కాలేజీలో ప్రొఫెసర్ కావాలని, "పల్లెటూరి బడిపంతులైతే మాత్రమేమి? నెలకు పదహారు రూపాయల జీతంతో నా బ్రతుకు వెళ్ళమారిపోదా? డొక్క శుద్ధి లేనివారికి విద్యాభిక్ష పెట్టడం కంటె కావలసిందేమున్నది?" అని ఆయన తోటి విద్యార్థులతో పలుమార్లు చెబుతుండేవాడు కూడా.

బాల్యం నాటి తన కోర్కె ప్రకారమే రాజేంద్రప్రసాద్ టీచర్ అయ్యాడు; ప్రొఫెసర్ అయ్యాడు. కాని, చాలా మంది అన్నదమ్ములతోను, అక్కచెల్లెళ్లతోను, పెద్ద సంసారం కావడంవల్ల కొంత ద్రవ్యార్జన చేయక తప్పదనో, “హిందూస్థాన్ రెవ్యూ" జోస్యాన్ని వమ్ముచెయ్యరాదనో, ఆ తర్వాత ఆ వృత్తిని ప్లీడరీకి చదివి, పట్టా పుచ్చుకున్నాడు. వకీలుగా వేలకొద్దీ గడించాడు. అంటిపెట్టుకుంటే, హైకోర్టు జడ్జీ పదవికి త్వరలోనే తప్పక పిలుపు వచ్చేది కాని, ఆ పిలుపుకు ముందుగానే గాంధీజీ పిలుపు వచ్చింది.

గాంధీజీ ప్రభావం రాజేంద్రప్రసాద్ జీవితాన్ని దాదాపు ఒక కొత్త ముఖానికి పట్టించింది. ఆయన మహాత్మునికి ఒక ఆంతరంగికుడైనాడు; ఆత్మీయుడైనాడు. కాని, వారిద్దరి తొలి సమావేశం అతి విపరీత పరిస్థితులలో జరిగిందనే చెప్పాలి.

చంపారన్లో నీలిమందు పండించవలసిందిగా తెల్ల దొరలు పెడుతున్న యమయాతనలను పడలేకపోతున్న వారి తరఫున అక్కడి ఒక పల్లెటూరి రైతు "మీరు తప్ప మాకు దిక్కు కనబడ్డంలేదు” అని ఎన్నో విధాల బ్రతిమలాడి, ఎంతగానో బలవంత పెట్టి, గాంధీజీని వెంటపెట్టుకుపోయాడు. చంపారను చేరడానికి ముందు వారిద్దరు పాట్నాలో మకాం చేశారు. అప్పుడు ఆ రైతు రాజేంద్రప్రసాద్ తనకు గల స్వల్ప పరిచయాన్ని పురస్కరించుకొని, ఆయన గృహంలో విడిదికి గాంధీజీని తీసుకువెళ్లాడు. కాని, రాజేంద్రప్రసాద్ పూరీకి వెళ్ళివున్నాడు. ఇంటిలో వున్నది ఒకరిద్దరు నౌకర్లు మాత్రమే.



ఆ నౌకర్లు గాంధీజీకి భోజన సదుపాయం చేయలేదు సరిగదా, ఆయన కులగోత్రాలు తమకు తెలియనందున వీధితల మరుగుదొడ్డినే తప్ప, పెరటిలోని దాన్ని ఉపయోగించ వద్దన్నారు. ఎక్కడ అంటు పడిపోగలమోనని తాము బావిలో చేదవేసినప్పుడు మహాత్ముడు వెయ్యరాదన్నారు. ఈ పరిస్థితులలో అక్కడ నిలవడం దుస్సహమైనందు వల్ల కాబోలు, మర్నాడు ఉదయం గాంధీజీ ఒక ముస్లిం మిత్రునికి కబురుచేసి, ఆయన బసకు మకాం మార్చివేశాడు. ఆ తర్వాత ఒకటి, రెండు రోజులకు గాని, గాంధీజీ రాజేంద్రప్రసాద్లో తొలి సమావేశం జరగలేదు.

తర్వాత రాజేంద్రప్రసాద్ హృదయంలోనే ఇల్లుకట్టుకొన్న గాంధీజీకి తొలినాడు ఆయన ఇంటిలో ఇట్టి మర్యాద జరగడం మహా విచిత్ర సంఘటనే.

గాంధీజీ పిలుపు విని దేశసేవా రంగంలో నిలవడం రాజేంద్రప్రసాద్కు సులభకార్యం కాలేదు. ఆ నిర్ణయానికి వచ్చినరోజున ఆయనకున్నది ఒక గంపెడు సంసారం, బ్యాంకిలో పదహారు రూపాయల నిల్వ. పైగా

"కుటుంబాన్ని నట్టేట ముంచుతావా?" అని చదువు సంధ్యలు చెప్పించిన పెద్దన్నయ్య కళ్ళ నీళ్ళ పర్యంతమయ్యాడు.



అయినా, కావాలని కళ్లు తెరుచుకునే రాజేంద్రబాబు అగ్నిగుండంలో దూకాడు.

ఆ పవిత్రాగ్ని కొందరి విషయంలో వలె తొలి ఆవేశం సన్నగిలిన తర్వాత ఆయన ఆత్మను దహించివేసి, వికృతంగా చేసివెయ్యడం సంభవించలేదు సరిగదా, అది ఈనాటికీ ఆయనను మరింత పునీతునిగా చేస్తున్నది.



రాష్ట్రపతి పదవి, ఆహారమంత్రి పదవి, రాజ్యాంగ పరిషత్తు అధ్యక్షపదవి - ఎన్నింటినో ఆయన అధిష్ఠించాడు. అన్నింటికీ తన సుగుణ పుంజపు వెలుగు నిచ్చాడు.

ఏ స్థానాన్ని ఆక్రమించినా, ఆయన ధర్మదేవత ముఖాన్ని చూస్తూ, నీతిగా నడుచుకునే పల్లెటూరి రైతుపెద్ద. ఎంత పండితుడైనా ఆయన ఏడు భాషలు క్షుణ్ణంగా తెలిసినవాడు - నివురుగప్పిన నిప్పువలె వుండే పల్లెటూరి బడిపంతులు''.

తామరాకుపై నీటిబిందువు వలె అంటీ అంటకుండా సంసారయాత్రను గడపాలన్న హైందవ ధర్మసూత్రానికి ఆయన అతి సమీపానికి రాగలిగాడు. అందువల్లనే ఆయన అమృత హృదయుడు; అందువల్లనే, ఆయన అజాత శత్రువు. (ఆంధ్రప్రభ 7-12-1949)

## రాజేంద్రప్రసాద్ -2

దేశభక్తులలో దేశభక్తుడు, సజ్జనులలో సజ్జనుడు, యోధులలో యోధుడు, గాంధీజీ అనుచరులలో అగ్రగణ్యుడు, భారత ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ మన కిక లేరు.

సుమారు అరవై సంవత్సరాలుగా భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో నేమి, స్వాతంత్ర్యసిద్ధి తరువాత గడచిన పదిహేను సంవత్సరాల పునర్నిర్మాణ చరిత్రలో నేమి ప్రముఖపాత్ర వహించిన ప్రియతమ నాయకుడు మన కిక లేరు.



డెబ్బయ్యెనిమిదేళ్ళ వయోవృద్ధులే కావచ్చు; దైనందిన రాజకీయాల నుంచి, అధికార పదవి నుంచి తప్పుకొని, ప్రశాంత జీవనం గడుపుతూ వుండి వుండవచ్చు; కాని, ఆయన లేనిలోటు భారతదేశానికి ఎన్నటికీ తీరదు. ప్రశాంత గంభీరమైన ఆయన వదనం ఇక మనకు కనబడదు; మార్గదర్శకమైన ఆయన వాణి మన కిక వినబడదు.

ఆయన ఎంత నిరాడంబరులో, ఎంత సజ్జనులో అంత సాహసి, అంత కర్మ దీక్షాపరాయణులు. గాంధీజీ తరువాత గాంధీ తత్వాన్ని అంతగా తమలో జీర్ణింప జేసుకొన్నవారు అరుదు. దేశంలోని పదవులకెల్ల అగ్రపదవిని అధిష్ఠించినా, భోగభాగ్యాలకు ఆలవాలమైన వైస్రాయి భవనంలో పదవీ కారణంగా నివసించవలసి వచ్చినా ఆయన నిరాడంబరంగానే జీవితం గడిపారు. పూర్వకాలపు రాజర్షులవలె, గీతాకారుడు ఉపదేశించిన అనాసక్త యోగాన్నే మనోవాక్కర్మలలో అనుష్ఠించారు.



మహాత్ముని అనుచరగణంలో ఆయనకు అత్యంత సన్నిహితంగా వచ్చిన వ్యక్తి బహుశా డాక్టర్ రాజేంద్ర ప్రసాదే. "నేను విషపాత్రను చేతి కందించినప్పుడు దాన్ని నిస్సంకోచంగా ఆస్వాదించ గలిగిన వారు కనీసం ఒక్కరైనా ఉండాలి. అట్టి వ్యక్తి రాజేంద్ర ప్రసాద్ ఒకరే" అని గాంధీజీ ఒక సందర్భంలో అన్నారు. "జీసస్కు జాన్ ఎటువంటివాడో గాంధీజీకి రాజెన్బాబు అటువంటివాడు" అని శ్రీమతి సరోజినీ నాయుడు ఒకసారి ప్రస్తుతించారు. గాంధీజీ పట్ల రాజెన్బాబు విధేయత నిస్సందేహంగా అటువంటిదే.

ఆయన పరిపూర్ణ పురుషుడు. మహోదాత్తం, ప్రతిభాన్వితం అయిన ఆయన వ్యక్తిత్వం ఎన్నటికి మరపురానిది. శ్రీమతి సరోజినీనాయుడే మరొక సందర్భంలో పేర్కొన్నట్టు "స్వర్ణ లేఖినిని మధు మషీపాత్రలో ముంచి వ్రాయవలసినంత గొప్పది డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ వ్యక్తిత్వం." ఈ మహా నాయకుని మృతికి నేడు యావద్భారత జాతి దుఃఖిస్తున్నది; ఆయన స్మృతికి శ్రద్ధాంజలి సమర్పిస్తున్నది.

(ఆంధ్రజ్యోతి 2-3-1963).

## టాండన్ బాబూ టాండన్ : శ్రీ పురుషోత్తమదాస్





అతడు గొల్ల. గొడ్లను మళ్ళవేసుకునే బుడతడు. పొట్టపోడిచినా, అక్షరం ముక్కలేనివాడు. సంస్కారం వాసనలంట దానికి వీలులేని వాతావరణంలో పుట్టి పెరిగినవాడు. ప్రపంచానుభవం గడించడానికి వయఃపరిపాకం లేని వాడయ్యె. అయినా, గొడ్డుగోదలను బీడులో మేతకు ఎగదోలి, తనకు ఎండదెబ్బ తగలకుండా చెట్టు నీడకు చేరి, అక్కడి ఒక దిబ్బపై చతికిలబడేసరికి ఛప్పన్న శాస్త్రాలు అతని నోట పలికేవి, అపర ధర్మదేవతవలె ధర్మసూక్ష్మా లన్నింటిని విశదపరచేవాడు. ఈ చిత్రం భోజరాజు చెవి వరకు వెళ్ళింది. "ఈ దిబ్బను ఎక్కినంతనే ఈ బుడతనిలో ఇంత మార్పు ఎందుకు వస్తుంది" అని ఆ భూపాలుడు దాన్ని తవ్వించి చూడగా లోపల విక్రమాదిత్యుని సింహాసనం కనబడింది. "ద్వాత్రింశత్సాలభంజిక" సంబంధించిన మిగిలిన కథతో మనకు పనిలేదు. ఒక ప్రత్యేక స్థానాన్ని అధిష్ఠించినంతనే ఎట్టి మానిసిలోనైనా ఆ స్థానోచితమైన పరివర్తనం కలగడం సంభవమన్న విషయమే ప్రస్తుతం మనకు కావలసింది.

ఇక బాబూ కాంగ్రెసు గద్దె విక్రమాదిత్యుని సింహాసనానికి తీసిపోగలిగిందికాదు. పురుషోత్తమదాస్ టాండన్ కేవలమొక మానిసికాదు; కొన్ని విశిష్ట లక్షణాలున్నవాడు. ఇందువల్ల కాంగ్రెసు అధ్యక్ష పీఠం నుంచి టాండనీ చేసిన ప్రసంగం ఆయన ఎన్నికైనప్పుడు కొందరు వెల్లడించిన భయ సందేహాలకు ఎంతమాత్రం తావివ్వకపోవడం అబ్బురం కాదు.

కాంగ్రెసు గద్దెనెక్కినాడని ఇచ్చకంగా అనడం కాదు, బాబూ పురుషోత్తమదాస్ నిజంగా కొన్ని విశిష్ట లక్షణాలున్నవాడే. వీటిలో ముఖ్యంగా చెప్పదగినవి నిరాడంబర జీవితం, నిష్కల్మషమైన మనస్సు. ఆయన సుగుణాలకు వలె, ఆయనలోని లోపాలకు కూడా ఇవి రెండే మూలకందాలు.

ఆయన గుబురుమీసాలు, బవిరిగడ్డాలు, తాటిటెంక జుట్టు వగైరాలు రాజర్షి "పోజ్" నిమిత్తం కావు; మరొక రూపం ఆయన ప్రవృత్తికే విరుద్ధం.

ఆయన ఆకారాది విశేషాలు ఇంతగా ఆయన ప్రవృత్తితో పెనవైచుకున్నవి గనుకనే చిన్నతనంలో ఆయన లంగోటా బిగించి, లాఠీని తిప్పేవాడని, కుస్తీ పట్టేవాడని ఊహించడం కష్టం. ఫ్లానెల్తోను, వైటర్టుతోను, సన్నట్ ను, అలహాబాద్ యూనివర్సిటీ క్రికెట్ టీము కెప్టెన్గా ఒకప్పుడాయన ఫీల్డ్ లోకి నడిపించాడని ఊహించడం కష్టం, మేక మెడచన్నులవలె డిమాండ్ డ్రాఫ్ట్, నైట్ డ్రాఫ్ట్ బ్యాండ్స్ కట్టుకుని, నల్లని గౌను వేసుకుని అలహాబాదు హైకోర్టులో ప్రాక్టీసు చేశాడని ఊహించడం కష్టం; దర్బారుకు తగు దుస్తులతో నాభా మహారాజుకు మంత్రిగా పనిచేశాడని ఊహించడం కష్టం. లెడ్జర్లు, క్యాష్ బుక్కులు, డే బుక్కులు టేబుల్పై పరచుకుని, ఓవర్ డ్రాఫ్ట్, టెలిగ్రాఫిక్ ట్రాన్స్ఫర్ వగైరాల వాతావరణంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ సెక్రటరీగా ఆయన వ్యవహరించాడని ఊహించడమైనా కష్టమే.



బాబూ పురుషోత్తమదాస్ టాండన్ జీవితంలోని ఈ ఘట్టాలన్నీ ఈనాటి గమ్యస్థానాన్ని చేరడానికి మజిలీలు మాత్రం.

టాండన్ నిరాడంబర ప్రియత్వం కేవలం వేష భాషలలోనే కాక, ఆయన దైనందిన జీవితంలో కూడా కానవస్తుంది. అగంతులకు ఆయన సులభోపసర్పణీయుడు. భార్యకు జబ్బు చేసిందని, బిడ్డకు పెళ్ళి సంబంధం కుదరలేదని, అప్పులవాళ్ళు వొత్తిడి పెడుతున్నారని ఎవరేమి చెప్పుకున్నా, గంటలకొద్దీ వారి సొద వింటాడు. తనకు తోచిన సలహా చెబుతాడు; చేతనైన సహాయం చేస్తాడు; ఇందువల్ల ముఖ్యమైన తన ఇతర పనులు పాడైపోతున్నా విసుగనేది యెరుగడు.

నిష్కల్మషమైన మనస్సు ప్రభావం కూడా బాబూ పురుషోత్తమదాస్ జీవితంపై బలీయమైందే. మనస్సులోని మాటను దాచుకోవడం ఆయనకు తెలియదు. తన నమ్మకాలను వెల్లడించడంలో - అవి ఎంతటి పెద్దవారికి కంటకప్రాయమైనవైనా వెనుదీయడు. హిందీ, హిందూస్థానీ భాషా వివాదంలో గాంధీజీని వ్యతిరేకించడానికే ఆయన సంకోచించలేదు.

తన నమ్మకాల పరిపాలనలో తక్కినవారికి వింతగానో, విడ్డూరంగానో తోచగల విధంగా ఆయన ప్రవర్తించడం కద్దు. ఆయన గోభక్తుడు. పాదరక్షల నిమిత్తం గోవధ జరుగుతుందని విన్నం 1908 నుంచి చర్మంతో చేయబడిన చెప్పులను వేసుకోవడం మానివేశాడు. దేశంలో తగినంత నెయ్యి ఉత్పత్తి కావడం లేదని, ఇందువల్లనే వనస్పతి వినియోగం హెచ్చుతుందని విని, తన వ్రతం వల్ల ఒక్కరికి గోఘృతం లభించినా లభించినట్టేనని కొన్నాళ్ళుగా నేతివాడకాన్ని విరమించి వేశాడు.

ఈ చర్యలు కేవలం మానసిక వికారాలుగా అన్యులకు తోస్తే తోచవచ్చు. కాని, వీటిని మినహాయిస్తే బాబూ టాండన్ టాండనే కాడు.


నిరాడంబరత్వం, నిష్కాపట్యం ఇంత దృఢంగా ప్రవృత్తిలో పాతుకుపోయిన వ్యక్తికి ఈ లక్షణాలే ప్రధాన ప్రాతిపదికలుగా గల ప్రాచీనకాలంపైన, అప్పటి సంస్కృతిపైన ఎంతో మక్కువ కుదరడం సహజం. బాబూ పురుషోత్తమదాస్ టాండన్ పర్షియన్, అరబిక్, ఉర్దూ భాషల సంపర్కం గల హిందుస్థానీ కూడదని, సంస్కృత పద భూయిష్టమైన హిందీయే కావాలన్నా, ఆ హిందీలో కూడా ఇంగ్లీషు/అరబిక్ అంకెలు తగవని, నాగరి అంకెలే కావాలన్నా, ప్రాచీన భారతీయ సంస్కృతిపై గల ప్రేమవల్లనే.

ప్రాచీన సంస్కృతిపై ప్రేమ నుంచి పాత వస్తువులపైన, పురాతనాచారాలపైన ప్రేమకు ఒక్క అడుగేయడం, ఈ అడుగును బాబూ టాండన్ ఏనాడో వేశాడు.

పాత పుస్తకాలను పారవెయ్యడం మాట అటుంచి, వాటిని అమ్ముకోవడమైనా ఆయనకు గిట్టదట. పై తరగతికి వచ్చిన తర్వాత కింద తరగతి పుస్తకాలను ఏమి చేసుకోగలమని అడిగితే, పాత పుస్తకాలను చూస్తే, పాత విషయాలు జ్ఞాపకానికి వస్తాయని ఆయన చెబుతాడట.

పోగాలపు పాడుబుద్ధులన్న లెక్కను కాబోలు ఏ మాత్రం వీలున్నా ఈ కాలపు వస్తువులను ఆయన వాడడు. ఆయనకు జబ్బుచేస్తే వాడేవి ఆయుర్వేదపు మందులేకాని, ఈ కాలపు టించర్లు, సిరప్పులు, టానిక్కులు, ఇంజక్షన్లు కావు. టీకాలు వేయించుకోవలసి వస్తుందని హరిద్వార్లో కుంభమేళానికి వెళ్ళడం ఆయన మానుకున్నాడు. సబ్బు కంటే వొండుమట్టి మేలైందని స్నానానికి దాన్నే ఆయన వాడతాడు.

ఇంతగా ప్రాచీనకాలంపైన, పురాతన వస్తువులపైన, పాత ఆచార వ్యవహారాలపైన, ప్రేమాభిమానాలు కలవాడు గనకనే కాంగ్రెసు అధ్యక్షుడుకాగల పక్షంలో బాబూ టాండన్ హిందూరాజ్య సంస్థాపనను ప్రతిపాదించ గలడేమోనని సంకోచం కలిగింది. ఈ సంకోచ వెలిబుచ్చబడినప్పుడు కొన్ని ముఖ్య విషయాలు విస్మరించబడినవి. వీటిలో మొదటగా పేర్కొనవలసింది - టాండన్ కబీర్ భక్తుడని, "రామ్, రహీమ్ ఒక్కడే" నని చాటిన ముస్లిం భక్తుని గురుతుల్యునిగా భావించే వ్యక్తి హిందూ రాజ్యస్థాపనను ప్రతిపాదించగలడేమోనని సంకోచించడం నిజానికి ఆయనపట్ల అపశృతి చేయడమే కదా?



పోతే, రెండవ విషయమిది: బాబూ టాండన్ హైందవ సంస్కృతీ పక్షపాతి అయినప్పటికీ, ముస్లింలలో ఆయనకు పెక్కుమంది ప్రాణమిత్రులు కలరు. యు.పి.లో చెలరేగిన మతకలహాల సందర్భంలో ఎందరో ముస్లింల ప్రాణాలను ఆయన కాపాడినట్టు ప్రతీతి.

పోతే, మూడవ విషయం: యు.పి. అసెంబ్లీ స్పీకర్గా ఎన్నుకొనబడిన పిమ్మటకూడా కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ వ్యవహారాలతో బాబూ పురుషోత్తమదాస్ పూర్తిగా సంబంధం వదులుకోలేదు. అయితే, స్పీకర్ స్థానంలో కూర్చున్నప్పుడు స్వపక్ష, పరపక్ష భేదాన్ని ఈషణ్మాత్రంగానైనా చేసే వాడుకాదు. మంత్రులైనాసరే, సభామర్యాదలను కాపాడకపోతే, వారిని నిర్మొహమాటంగా సరిదిద్దేవాడు.

చివరికి చెప్పినా, అన్నింటికంటే ముఖ్యమైన విషయం మరొకటి ఉన్నది. జాతి, మత, కుల విభేదాలకు అతీతమైన సంస్థగానే కాంగ్రెసు ప్రభవించింది; అట్టిదిగానే తన ప్రధాన లక్ష్యాన్నిస్వరాజ్యాన్ని సాధించింది; అర్థశతాబ్దికి పైగా ఇట్టి చరిత్రతో వర్ధిల్లిన సంస్థకు అధ్యక్షుడైన వ్యక్తి - అతని నమ్మకాలు ఏవైనా - ఒక్కసారిగా గతాన్ని శుభ్రంగా తుడిచివెయ్యగలడా? ఆ స్థానంలోకి వచ్చిన వ్యక్తిపై ఆ స్థానపు ప్రభావం బలవత్తరంగా పడదా? పైగా, జాతీయ జీవనంలో పాత సంప్రదాయాలకై దేవులాడే వ్యక్తికి జాతీయ సంస్థ సంప్రదాయాలకు విరుద్ధంగా పోవడం సాధ్యమా?

కాంగ్రెసు అధ్యక్షపదవికి వచ్చినందుకు ఆ పదవికి అనుగుణమైన అధ్యక్షోపన్యాసాన్నే బాబూ | పురుషోత్తమదాస్ టాండన్ నేడు చేశాడు. పదహారణాల జాతీయవాదికైనా దానిలో దొసగులెన్నడానికి ఏమీ కనబడదు.

కాగా, మనం కోరదగిన దొక్కటే. అధ్యక్షోపన్యాసంలో ప్రదర్శించిన సంప్రదాయసిద్ధ వైఖరినే కడవరకు కాంగ్రెసు అధ్యక్షుడు ప్రదర్శించాలి.

ఇంతేకాదు, చిత్తశుద్ధికి, శుద్ధవర్తనకు, త్యాగనిరతికి, పరోపకార పరాయణత్వానికి అధిక ప్రాధాన్యమిచ్చేవాడని కొత్త కాంగ్రెసు అధ్యక్షునికి పేరున్నది. నిరుడొకసారి కాంగ్రెసువాదులలో ప్రబలిన దుశ్చింత, దుర్నీతులకు ఒక నిండుసభలో ఆయన బొటబొట కన్నీరు కార్చివేశాడు. పదవీ కారణంగా ఆ కన్నీరు కాంగ్రెసు అధ్యక్షునిలో ఎండిపోకపోతేనే, ఆ సంస్థకేమి, దేశానికేమి భవితవ్యం.

(ఆంధ్రప్రభ 2-9-1950)

## రాలిపోయిన పూవు : డాక్టర్ జాకీర్ హుస్సేన్

కోమలమైన ఒక పూవు. స్వచ్ఛమైన ఒక పూవు. ఆకస్మికంగా



నేలకు రాలిపోయింది. సౌరభాలను వెదజల్లే ఒక పూవు నేడు పూవులంటే ఆయనకు పట్టరాని మక్కువ కాబట్టే. ఆకస్మికంగా తలవని తలంపుగా నేడు కన్నుమూసిన డాక్టర్ జాకీర్ హుస్సేన్ను పూవుతో మేము పోల్చడంలేదు. నిజంగానే ఆయన అపురూపమైన ఒక పూవు.

ఆయన మనస్సుకంటే ఏ పూవు కోమలంగా ఉండగలదు? ఆయన హృదయంకంటే ఏ పూవు స్వచ్ఛంగా ఉండగలదు? ఆయన సంస్కృతికంటే ఏ పూవు సౌరభాలను వెదజల్లగలదు?

పదకొండు రేకలున్నట్టిది నేడు నేలకు రాలిపోయిన పూవు. విద్య దాని మొదటి రేకు, విజ్ఞానం రెండవ రేకు, సంస్కృతి మూడవ రేకు, సౌజన్యం నాల్గవ రేకు, నిగర్వం ఐదవ రేకు, నమ్రత ఆరవ రేకు, సౌహార్దం ఏడవ రేకు, త్యాగశీలం ఎనిమిదవ రేకు, సేవానురక్తి తొమ్మిదవ రేకు, సమగ్రదృష్టి పదవరేకు, విశ్వమానవ ప్రేమ చివరి రేకు.

ఇట్టి పూవు ఆకస్మికంగా, తలవని తలంపుగా నేడు రాలిపోవడం మన దురదృష్టం, మనదేశం దురదృష్టం.

మన మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ను "రాజర్షి" అనేవారు. తిరిగి ఆ పేరుకు తగిన మహామహుడు నేడు మనలను విడిచి వెళ్ళిన మూడవ రాష్ట్రపతి, డాక్టర్ జాకీర్ హుస్సేన్. ఆయన మూర్తిలో, ఆయన


ముఖంలో, ఆయన పలుకులో, ఆయన నడకలో రాజఠీవి ఉండేది. ఆ ఠీవితో పోటీపడుతూ ఒక దివ్యతేజస్సు కూడా ఉండేది.

పర్ణకుటీరంలో ఉన్నా,. రాష్ట్రపతి భవనంలో ఉన్నా, ఆయన రాజర్షిగానే జీవించేవారు. స్కూలు మాస్టర్గా ఉన్నా, వైస్ ఛాన్సలర్, గవర్నర్, వైస్ ప్రెసిడెంట్, ప్రెసిడెంట్ పదవులలో ఉన్నా, ఆయన రాజర్షిగానే జీవించేవారు.



అట్టి రాజర్షి ఆకస్మికంగా, తలవని తలంపుగా నేడు మన మధ్యనుంచి వెళ్ళిపోవడం మన దౌర్భాగ్యం, మన దేశం దౌర్భాగ్యం.

జీవితపు విలువలు నేడు తలక్రిందులై పోతున్నాయి. సంఘ జీవితంలో నీతికి, నిజాయితీకి అంతకంతకు స్థానం తగ్గిపోతుంది. ఏ కూడు కుడిచినా, నాలుగు డబ్బులు మూటగట్టినవాడే ప్రయోజకుడుగా మన్నికకు వస్తున్నాడు. ఏ గడ్డి కరచినా, పదవికి వచ్చినవాడే ఘనుడుగా చెల్లుతున్నాడు.



ఇట్టి విపరీత పరిస్థితులలో కొన్ని స్థిరమైన విలువలకు, కొన్ని శాశ్వతమైన విలువలకు ప్రతీకగా నిలుస్తూ వచ్చిన డాక్టర్ హుస్సేన్ ఆకస్మికంగా, తలవని తలంపుగా నేడు నిర్యాణం చెందడం మనకు తీవ్రాఘాతం, మన దేశానికి తీవ్రాఘాతం.

మత భేదాతీతమైన భారతీయ సంస్కృతి ముక్తాఫలం డాక్టర్ హుస్సేన్. ప్రాచ్య, మధ్య ప్రాచ్య, పాశ్చాత్య సభ్యతల నిగ్గు డాక్టర్ హుస్సేన్. ప్రాచీన, ఆధునిక ప్రపంచాల మధ్య స్వర్ణసేతువు డాక్టర్ హుస్సేన్. అట్టి మన మూడవ రాష్ట్రపతి ఆకస్మికంగా, తలవని తలంపుగా నేడు కాలధర్మం చెందడం మనకు తీరని లోటు, మన దేశానికి తీరని లోటు.

(ఆంధ్రజ్యోతి 5-5-1969)

# డాక్టర్ భీమ్ రావు రాంజీ అంబేద్కర్ - 1



కర్ణుడు ఎంతటి ఉదాత్త హృదయుడు, మరెంతటి మహోదార చరితుడు. కుంతీ పుత్రులలో ఆయన వయస్సుకేకాక, గుణానికి కూడా జ్యేష్ఠుడని చెప్పినప్పటికీ, తప్పు కాబోదు. యుధిష్ఠిరుడు ఆయనకంటే ధర్మతత్పరుడు కావచ్చు. కాని, ధర్మరాజు ప్రవృత్తిలో వైవిధ్యం పూజ్యం. వజ్ర సన్నిభత్వం శూన్యం. పాల తెలుపు స్వచ్ఛతకు ఎంతటి చిహ్నమైనా, అది కంటికి గిలిగింతలు పెట్టలేదు గదా? మీగడ మెత్తన కొంత హాయిని కూర్చినా, త్వరలో ముఖాన్ని మొత్తిస్తుంది గదా?

ఇక, భీమసేనునికి ఆకలి ఎంత ఎక్కువో, ఆలోచన అంత తక్కువ. ఇట్టే ఆవేశానికి లోనౌతాడు; ఇంతలో చల్లారిపోతాడు. ఆయన వ్యక్తిత్వంలో ఏమైనా ఆకర్షణ ఉంటే, అది కేవలం బలదార్ఢ్యాలు రేకెత్తించేది మాత్రమే. మానవ హృదయంలో "హి-మ్యాన్"కు జగజ్జెట్టికి ఎల్లప్పుడు కొంత స్థానం ఉంటుంది. ' అట్టిదే భీమబలుని స్థానం కూడా.

పోతే, అర్జునుడు "బృహన్నల" కావడం అకారణంగా జరగలేదు. ఆయన ఎంతటి ధనుర్విద్యాధురీణుడైనా, చిత్తవృత్తిలో కొంత అబలత్వం ఉంది. అందువల్లనే కురుక్షేత్రంలో ఆయన సంశయాత్ముడయ్యాడు; విహ్వలచిత్తుడైనాడు.

కుంతీ పుత్రులలో కర్ణుడే గుణానికి జ్యేష్ఠుడని చెప్పడంలో మా తాత్పర్యం ఆయనలో లోపాలే లేవనికాదు. ఐతే, ఆ లోపాలు జన్మతః వచ్చినవికాక, ప్రవృత్తి సహజ వికాసానికి కొన్ని ప్రత్యేక పరిస్థితులవల్ల కలిగిన విఘాతాల ఫలితంగా ఏర్పడినట్టివే.

పాండవ మధ్యముని పట్ల పక్షపాతంతో ఇంద్రుడే బ్రాహ్మణ వేషంలో వచ్చి సూర్యదత్తమైన తన కుండలాలను హరించి, తనకు అపకారాన్ని తలపెట్టినాడని తెలిసినప్పటికీ, చెవులనే కోసి వాటిని దానం చేసిన కర్ణుడు, నీవు కుంతీపుత్రుడవని, పాండవుల పక్షంలో చేరితే, భారత చక్రవర్తివి కాగలవని వాసుదేవుడు ప్రలోభ పెట్టినప్పటికీ స్వామిభక్తి నుంచి చలించని కర్ణుడు, ఆర్గురు చేరితేనేకాని నేలకొరగని కర్ణుడు, తక్కిన కుంతీపుత్రులవలె సహజంగా పెరిగి, సూతపుత్రుడనే నిందకు పాల్పడివుండకపోతే - తత్కారణంగా అడుగడుగుకు దూషణావమాన తిరస్కారాలకు లోనైవుండకపోతే మరెంతటి మహాపురుషుడుగా రూపొందివుండేవాడో.

కర్ణునిలో లోపాలు - భూమిపై పడినంతనే కన్నతల్లి చేసిన అన్యాయం వల్ల వచ్చినట్టివి; భూమిపై పడినదాదిగా సంఘం పెట్టిన అవమానాల వల్ల ఏర్పడినట్టివి.

మహాభారత వీరులలో కర్ణుని ఎక్కువగా తలపింపజేసేవాడు నిన్న బొంబాయిలో స్వసంఘీయుల సన్మానమొందిన

మేధాసంపత్తిలో, పాండితీ ప్రకర్షలో ఆయనకు సాటిరాగలవారు బహుకొద్దిమంది. ఆయన చిత్తస్థైర్యం ఇంతింత కాదు. ధనరాశులు ఆయనను ప్రలోభ పెట్టలేవు. ఆయనది. అతి నిరాడంబర జీవితం. పెక్కుమంది గొప్పదనం “దూరపుకొండల నునుపు" అనేదాన్ని పోలినట్టిదే. కాని, డాక్టర్ అంబేద్కర్ సన్నిహిత సంబంధంగల వారందరూ ఆయనపట్ల మరింత భక్తిగౌరవాలను ప్రకటించి, ఆయనను కేవలమొక ఋషిపుంగవునిగా అభివర్ణించడం మాకు స్వయంగా తెలుసు.



అనుమానం. రెండవది - ఇంతటి సద్గుణ సంపత్తికలవాడైనా, రెండు లోపాలు డాక్టర్ అంబేద్కర్లో కానవస్తాయి. మొదటిది అహంకారం. ఇవి బహు చెడ్డ అవగుణాలే. కాని, డాక్టర్ అంబేద్కర్ పుట్టిందీ, పెరిగిందీ సంఘువంచకుల మధ్యనే అని మాత్రం విస్మరించరాదు.

నైజంవల్ల ఆయన తన బాగోగులకంటె తన సంఘం బాగోగులకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చేవాడు. తాను విద్యాబుద్ధులు పొందదానికి, సుఖజీవనం గడపడానికి అవకాశాలు కల్పించబడినప్పటికీ, తనవారు సంఘువంచితులుగా మిగలడమే నలుగడల ఆయనకు దృగ్గోచరమైంది. ఏదో ఒకసారి, ఎక్కడో ఒక సందర్భంలో వంచితులైన వారిలోనే అనుమాన పిశాచం ప్రవేశిస్తుంది. ఇక సంఘువంచకుల మధ్యనే పుట్టి, పెరిగిన డాక్టర్ అంబేద్కర్లో అనుమాన పిశాచం ఇల్లే కట్టుకోవడంలో అబ్బురం లేదుగదా?

ఇక, డాక్టర్ అంబేద్కర్ అభిమానధనుడు. తనకేమి, తన సంఘానికేమి ఎంతమాత్రం తలవంపులు జరిగినా సహించలేడు. ఇట్టి వ్యక్తికి ఎటువెళ్ళినా, ఏమి చేసినా, అవమానాలే ఎదురైనాయి. పరాభవ శర పరంపరకు గాయపడిన హృదయం తన బాధా నివారణకు అహంకారాన్ని కవచంగా చేసుకొనడం సహజం. కర్ణుని విషయంలో వలె అంబేద్కర్ విషయంలో కూడా సరిగా ఇంతే జరిగింది.

కొన్ని ప్రత్యేక పరిస్థితులు ప్రవృత్తిలో తెచ్చిన వికారాలు సమసిపోగల అవకాశాలు ఒనగూడకనే కర్ణుడు వెళ్ళిపోయాడు. ఆయనకంటే డాక్టర్ అంబేద్కర్ అదృష్టవంతుడు. అహంకారాన్ని చంపుకొనడం - అది పరాభవ గాయాల నుంచి హృదయాన్ని కాపాడుకొనడానికి ఉద్దేశింపబడిన కవచం కనక - డాక్టర్ అంబేద్కర్కు ఎప్పుడు కోరితే అప్పుడు జరగగల పని. పోతే, ఇటీవలి పరిస్థితులు ఆయనపై అనుమాన పిశాచ ప్రాబల్యాన్ని సైతం సడలింపజేస్తున్నవి. ఇందుకు తార్కాణం - నిన్న ఆయన బొంబాయిలో చేసిన ప్రసంగమే. దీనిలో 1946 నాటి ఎన్నికల ప్రసక్తిని తెచ్చి, "అప్పటిలో దేశం మొత్తానికి సేవ చేయగల అవకాశం లభిస్తుందని నేను కలలోనైనా అనుకోలేదు" అని ఆయన అన్నాడు. "దేశం మొత్తానికి సేవ" అన్నప్పుడు ఆయన ఉద్దేశిస్తున్నది నవభారత రాజ్యాంగం. ఈ రాజ్యాంగాన్ని రూపొందించగల అవకాశం తలవని తలంపుగా తనకు లభించడమేకాక, దానిలో స్వసంఘ గౌరవ ప్రపత్తులను, యోగక్షేమాలను పదిలం చేయగల పరమానందం కూడా డాక్టర్ అంబేద్కర్కు దక్కింది. అందువల్లనే తక్కినవారితో చేతులు కలిపి, మన నవ స్వాతంత్ర్యాన్ని రక్షించవలసిందిగా తనవారికి ఆయన నిన్న విజ్ఞప్తి చేశాడు.



కాలం అంబేద్కర్ను మార్చుతున్నది; మరింత పూతచరితుని చేస్తుంది. ఆయన సేవాభాగ్యాన్ని దేశం మరింతగా పొందలేకపోతే, అది దాని దౌర్భాగ్యమే కాగలదు. (ఆంధ్రప్రభ 13-1-1950)

## డాక్టర్ భీమ్ రావు రాంజీ అంబేద్కర్ - 2



ప్రేమించేవారివలె విద్వేషించేవారు, గౌరవించేవారివలె తిరస్కరించేవారు, భూషించేవారివలె దూషించేవారు ఒకే వ్యక్తికి విశేష సంఖ్యలో ఉంటే, అతడు నిశ్చయంగా అసామాన్యుడే. నవభారత నాయకులలో ఇట్టి ఒక అసాధారణ వ్యక్తి డాక్టర్ భీమ్రావ్ రాంజీ అంబేద్కర్.

ఆయన జీవితకాలంలో డాక్టర్ అంబేద్కర్ కొన్ని కోట్ల మందికి కేవలమొక పెనుభూతం. ఇప్పటికి సైతం ఆయనను పెనుభూతం వలెనే చిత్రిస్తున్నవారున్నా, క్రమక్రమంగా వారి సంఖ్య తగ్గిపోతుంది. ఇదివరలో ఆయనను దుర్భాషలాడినవారు సైతం ఇప్పుడు అంతగా నోరు పారవేసుకొనడం లేదు.

ఇంతేకాక, డాక్టర్ అంబేద్కర్ జీవితాన్ని గురించి, భావాలను గురించి, ఉద్యమాలను గురించి, వాటి సాఫల్య వైఫల్యాలను గురించి నిశితంగా, నిష్పాక్షికంగా ఆలోచించడానికి కొంతకాలంగా కృషి జరుగుతుంది. ఇందుకు ఒక సరికొత్త నిదర్శనం "అంబేద్కర్ : ఎ క్రిటికల్ స్టడీ" అనే గ్రంథం. దీని రచయిత డాక్టర్ డబ్ల్యు.ఎన్. కుబేర్. దీని ప్రచురణకర్తలు : పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్, న్యూఢిల్లీ 55 (వెల 30 రూపాయలు).

కుబేర్ వివరిస్తున్నట్టు, డాక్టర్ అంబేద్కర్ జీవితం ఎంత ముఖ్యమైనదో ఆయన చింతన అంత ముఖ్యమైనది. కొన్ని విధాల ఆయన చింతనే మరింత ముఖ్యమైంది.

అంబేద్కర్ను మించిన మేధావులు ఉండవచ్చు. కాని, నిర్భీతిగా ఆలోచించడంలో, ఆలోచించినదాన్ని నిర్భీకంగా వెల్లడించడంలో ఆయనను మించగలవారు లేరు. లోకంలో తనను ఎంతగా అపార్థం చేసుకున్నా, ఎంతగా ఆడిపోసుకున్నా, ఎంతగా హింసించినా, ఎంతమాత్రం సంచలించక తన ఆలోచనలను వెల్లడించగలవాడే నిజమైన మేధావి. అంబేద్కర్ వలె "మేధావి" అనే ప్రశంసకు తగినవారు నవభారతంలో బహుశా పట్టుమని పదిమంది కూడా లేరేమో!

అంబేద్కర్ వంటి పండితులుండవచ్చు. కాని, ఆ పాండిత్య వైవిధ్యంలో ఆయనను మించగలవారు లేరు. ఆర్థికశాస్త్రం, న్యాయశాస్త్రం, సాంఘిక శాస్త్రం మొదలైన పెక్కింటిలో ఆయన ప్రథమ శ్రేణికి చెందినవాడు.

మేధావులైనవారు, పండితులైనవారు ప్రజానాయకులుగా రాణించడం చాలా అరుదు. నవభారత నాయకులలో అంబేద్కర్ స్థానం గాంధీ, జిన్నాల స్థానం తర్వాత. వారిద్దరిలో కానరాని ఒక ప్రత్యేక విశేషం అంబేద్కర్లో ఉండేది. అది ఆయన ఆధునిక దృష్టి, ఆధునికత్వం ప్రాతిపదికగా ఒక జీవిత విధానాన్ని రూపొందించడానికి ఆయన ప్రయత్నించారు.

మానవుల మధ్య అన్ని కృత్రిమ విభేదాల తొలగింపును లక్షించేది ఆ జీవిత విధానం. మానవు లందరికి ఆర్థిక, సాంఘిక, రాజకీయ న్యాయాన్ని కూర్చేది ఆ జీవిత విధానం. మానవతకు పట్టాభిషేకాన్ని చేయగోరేది ఆ జీవిత విధానం.



అంబేద్కర్ నెలకొల్పగోరిన జీవిత విధానం స్వరూప స్వభావాలను కుబేర్ తన గ్రంథంలో చక్కగా వివరించారు. ఆయన వివరణలో నత్తిలేదు, నసుగుడులు లేవు, దాపరికాలు లేవు, పాదపూజ అసలే లేదు. అంబేద్కర్ జీవితాన్ని, ఆయన చింతనను న్యాయంగా, నిష్కర్షగా సమీక్ష చేయడానికి ఆయన ప్రయత్నించాడు. తన ప్రయత్నంలో ఆయన ప్రశంసాపాత్రమైన విజయాన్ని సాధించాడు కూడా.

కుబేర్ సమీక్షలో మనకు ప్రత్యక్షమౌతున్న అంబేద్కర్ లిబరల్ విశ్వాసాలున్న ప్రజాస్వామ్యవాది; సమష్టి క్షేమం వ్యక్తి స్వాతంత్ర్యాన్ని బలిచేయడం తగదని విశ్వసించిన ప్రజాస్వామ్యవాది.

ఐతే, ఇంత ప్రజాస్వామ్యవాది కూడా ప్రజా సమస్యలకు మతంతో ఎంతమాత్రం నిమిత్తంలేని సాంఘిక, రాజకీయ పరిష్కారాలను నిర్దేశించలేకపోయాడు. హిందూమతానికి బదులుగా బౌద్ధాన్ని డాక్టర్ అంబేద్కర్ అభిమానించారు. ఈ మేరకు - కుబేర్ సూచించినట్టు - అంబేద్కర్ జీవితం విఫలమైపోయింది.

(ఆంధ్రజ్యోతి 14-5-1973).

కొలిమిలో పెట్టి నిప్పుతో కాల్చకముందు, కాల్చిన తర్వాత బంగారం ఒకే తీరుగా వుండదు. మొదట లేని శోభ తర్వాత దానికి వస్తుంది.

మబ్బులను చల్లగాలి కరిగించక పూర్వం, కరిగించిన పిమ్మట ఆకాశం ఒకే చందంగా వుండదు. ఆదిలో లేని దీప్తి తర్వాత దానిలో కనబడుతుంది.



మహనీయుల ఆగమన, నిర్గమనాల పిదప జనపదాల వాతావరణంలో ఇట్టి మార్పే ద్యోతకమౌతుంది. ఆ రెండింటి మధ్య కాలం ఎంత స్వల్పమైనదైనా కొలిమినుంచి తీసిన బంగారం చల్లారి, కళ తగ్గడానికి ఎక్కువకాలం పట్టదు; కరిగిపోయిన మబ్బులు తిరిగి ఆకాశాన్ని కప్పడానికి కూడా ఎక్కువ కాలం పట్టదు. ఇదేవిధంగా మహనీయుడొకడు మధ్యకు వచ్చినందున జనపదం వాతావరణంలో వచ్చే మార్పు స్థిరంగా నిలిచేది కాకపోవచ్చు. కాని, అంత మాత్రంచేత మార్పే రాదనడం అంధత్వం లేదా అజ్ఞానం.

ఏ సంఘం మధ్యకు వెళ్లినా, అక్కడి వాతావరణంలో మార్పును సాధించగల సమర్థులు మనదేశంలో ఇటీవలి వరకు ముగ్గురైతే, ఇప్పుడిద్దరే. వారిద్దరు పటేల్, నెహ్రూలు. ఇప్పుడులేని ఆ మూడవ సమర్థుని పేరు చెప్పడం అనవసరమైనా, దాన్ని చెప్పవలెనంటే, అది - గాంధీజీ". సర్దార్ వల్లభాయ్ పటేల్ సోమవారం ప్రొద్దుక్రుంకుతుండగా చెన్నపురి చేరాడు; గురువారం ప్రొద్దు పొడుస్తుండగా చెన్నపురినుంచి వెళ్లిపోయాడు. ఆయన ఈ పట్టణంలో గడిపింది పట్టుమని మూడు పగళ్లు, మూడు రాత్రుళ్లు మాత్రమైనా కాదు. అయినా, సోమవారం నాటి చెన్నపురి, గురువారంనాటి చెన్నపురి కాదు. తిరిగి సోమవారం వచ్చే వరకు ఈ మార్పు నిలుస్తుందనలేము. అయితే, ఆయన ఆగమన, నిర్గమనాలు నగర వాతావరణాన్ని మార్చినవనడం మాత్రం నిర్వివాదం.

సర్దార్కు జరిగిన సన్మానాలలో, ఆయన ఉపన్యసించిన సభలలో పాల్గొన్న వారందరికి దేశాభ్యున్నతి కోసం ఆయన మనస్సు ఎంతగా కలవరపడుతున్నదో, ఆయన హృదయం ఎంతగా తల్లడిస్తున్నదో, ఆయనలోని ప్రతి రక్తాణువు ఎంతగా సంక్షుభితమౌతున్నదో స్పష్టపడే వుండాలి. ఆయన దృష్టిలో దేశాభ్యుదయమైనది

అందరి దృష్టిలో కాకపోవచ్చు. "ఏది దేశాభ్యుదయం" అనే విషయమై ఆయనతో విభేదం లేకపోయినా, దాన్ని సాధించే మార్గాల విషయమై ఆయనతో కొందరు భిన్నమనస్కులు కావచ్చు.

కాని, దేశాన్ని గురించి తప్ప అన్యాన్ని గురించి ఆయన ఆలోచిస్తున్నాడనే వ్యక్తి ఆయనకేకాక, సత్యానికికూడా అపచారాన్ని చేసినవాడౌతాడు.




"నేను ఈనాడు పడుచువాడినై వుంటేనా!" అన్నప్పుడు ఆయన కళ్లలో వెలిగిన వెలుగులో, "ఎనభయ్యోపడిలో పడ్డాము. మా కాలం వెళ్లిపోతున్నది" అన్నప్పుడు ఆయన విడిచిన వేడి నిట్టూర్పులో, "నేను చెన్నపురికి రావడం ఇదే చివరిసారి కావచ్చు" అన్నప్పుడు మందగించిన ఆయన కంఠధ్వనిలో కానగలవారికి ఆయనను దహించివేస్తున్న దేశభక్తి జ్వాలాశిఖలున్నాయి. దేశ స్వాతంత్ర్యమేమో వచ్చింది కాని, అది స్థిరపడలేదు; దృఢ పడలేదు. దాని స్థిరీకరణకేమి, దృఢీకరణకేమి తగు వ్యవధి నివ్వకుండా యౌవనం పోయిన తర్వాతనే, వృద్ధాప్యం ప్రవేశించిన పిదపనే, పారతంత్ర్యం నుంచి విముక్తి లభించినదనే బాధావేదనలు సర్దార్ పటేల్ను పోలిన ప్రగాఢ దేశభక్తునికి కలగడం సహజమే!

ఇది అట్టివారి దృష్టినుంచేకాక మన దృష్టినుంచి కూడా ఒక శోచనీయ విషయమే. "క్విట్ ఇండియా" మహోద్యమం తర్వాత వచ్చిన స్వరాజ్యమే సహాయ నిరాకరణోద్యమం తర్వాత వచ్చివుంటే, స్వతంత్ర భారతానికి పండిట్ మదనమోహన మాలవ్యా, లాలా లజపత్ రాయ్, హకీం అజ్మలాఖాన్, డాక్టర్ అన్సారీ, పండిట్ మోతీలాల్ నెహ్రూ, శ్రీ వి.జె. పటేల్, శ్రీమాన్ శ్రీనివాస అయ్యంగార్, మౌలానా మహమ్మదాలీ, మౌలానా షౌకతాలీ, శ్రీ చిత్తరంజన్ దాస్, శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు, శ్రీ సేన్ గుప్త, శ్రీ సుభాషచంద్ర బోస్ మొదలైన మహామహుల మహనీయ సేవాభాగ్యం లభించేది కాదా? అప్పటిలో స్వరాజ్యమే వచ్చివుంటే, ఇప్పటికే విశేష కార్యభారంతో క్రుంగిపోతున్న పటేలు, నెహ్రూలే ఆహారశాఖ బాధ్యతనుకూడా వహించక తప్పదని ఇటీవల ఇండియన్ యూనియన్ పార్లమెంట్ లో జరిగిన సూచన జరిగివుండేదా?

వృద్ధాప్యంలోనే స్వరాజ్యం వచ్చివుండవచ్చు; వచ్చిన స్వరాజ్యాన్ని పదిలపరచడంలో కార్యభారాన్ని పంచుకొనగల హేమాహేమీలు తక్కువైపోయివుండవచ్చు. అయినా, చేపట్టిన కార్యాన్ని తుదముట్టించి తీరగలననే ధైర్య విశ్వాసాలు సర్దార్ పటేల్ పలుకుతున్న ప్రతి పలుకులో, చేస్తున్న ప్రతి చేతలో పెల్లుబుకుతున్నాయి.



ఆయన తొడిగేవి పొడుగుచేతుల లాల్చీలే. కాని, ఆ లాల్చీ చేతులను తనకు తెలియకుండానే ఆయన మోచేతి వరకు త్రోసివేస్తుంటాడు. ఏ సవాల్ వచ్చినా - ఎవరి నుంచి సవాల్ వచ్చినా - ఎదుర్కొనడానికి ఆయన నిత్య సన్నద్ధతకు అదొక తార్కాణమే కావచ్చు.

“అది నేను చేరవలసిన ఊరు; దానికిది దారి” అని నిక్కచ్చిగా తెలుసుకున్న మనిషి “అది కాదు, ఇది” అని చెప్పేవారిపట్ల సహనాన్ని చూపలేడు. సర్దార్కు తాను వెళ్లదలచుకున్న ఊరు తెలుసు; దానికి దారి కూడా తెలుసు. అందువల్లనే ఆయన “అది కాదు; ఇది” అనేవారిని సహించలేడు.

తన దుస్సహనాన్ని వాగ్రూపంగా వెలిబుచ్చవలసివస్తే అందుకు ఆయన సంకోచించడు. కాని, పెదవి మెదపకుండానే ఆయన ఆ భావాన్ని వ్యక్తీకరించగలడుకూడా.

ఏదైనా అసంగత విషయాన్ని తనకెవరైనా చెప్పవచ్చినప్పుడు ఆయన కన్నుల అరమోడ్పే, ఆయన కనుబొమల విరుపే, ఆయన శిరఃకంపనమే, ఆయన మౌనముద్రే బ్రతికినంతకాలం మరపురాని ఛాయానుభూతి కాగలదు.



కార్యపటిమకు నేడు యావద్భారతంలో సర్దార్ పటేల్కు ఆయనే సాటి. ఆయన ఈ ప్రత్యేకతకు ఆయన జీవిత చరిత్రే కాకుండా, ఆయన ముఖ కవళికలు కూడా తార్కాణాలే.

ఆ పెద్ద నుదురు, ఆ గండు ముఖం, ఆ వెడల్పు ముక్కు, ఆ బలమైన దవడలు, బండిచక్రాలను పోలిన ఆ కళ్ళు "ఈయన కార్యదక్షుడు" అని చెప్పకనే చెబుతుంటాయి.

ఆయన ముఖంకంటె చేతులు ఒక చాయ యెక్కువ. ముఖంలో లేని లాలిత్యం చేతులలో వున్నది. చేతివ్రేళ్లు పొడుగుపాటివి కూడా. ఇట్టి చేతులు శిల్పాచార్యుల కుంటాయని ప్రతీతి. రాతిలోను, రంగులతోను భావాలకు రూపం దిద్దే శిల్పి కాకపోయినా, దేశానికి రూపురేఖలు దిద్దగోరుతున్న శిల్పాచార్యుడు కనకనే ఆయనకట్టి చేతులు కలవేమో!

సర్దార్ పటేల్ కోరుతున్నది దేశానికి శాంతి, జాతికి సుభిక్షం, ప్రజకు పురోభివృద్ధి. దాన్ని స్వార్థ త్యాగం ద్వారా, దౌర్జన్య రాహిత్యంద్వారా సాధించామని ఆయన విజ్ఞప్తి చేస్తున్నాడు.

అన్యపక్షీయులు తన విజ్ఞాపనకు వ్యతిరేకంగా సంచరిస్తే, వారితో ఏ విధంగా వ్యవహరించాలో ఆయనకొకరు చెప్పవలసిన పనిలేదు. కాని, కాంగ్రెస్ వారే ఆయన మాటను పాటించకపోతే ఆయన చెయ్యగలిగింది స్వల్పం.

(ఆంధ్రప్రభ 25-2-1949)

## రాజాజీ : శ్రీ సి. రాజగోపాలాచారి




చెన్నపురిలో నిన్న కన్నుమూసింది ఒకే వ్యక్తి కావచ్చు. కాని, ఆ క్షణంలో మనలను వీడి వెళ్ళింది ఒకరు కాదు, కనీసం పదిమంది.

అవును, రాజాజీ పదిమంది పెట్టు, ఆయన మహామేధావి, విద్యాధికుడు, న్యాయవాది, దేశభక్తుడు, సంఘ సంస్కారి, రాజనీతివేత్త, పరిపాలనా దక్షుడు, మానవతావాది, ప్రపంచ శాంతి కాముకుడు. ఈ అన్ని రూపాలలో ఆయనకు దీటురాగలవారు ఈ దేశంలోనే కాదు, ఏ దేశంలోనైనా బహు కొద్దిమంది మాత్రమే.

తక్కినవారు ఆయన తక్కిన గుణగణాలను మెచ్చుకోవచ్చు. మాకు మాత్రం ఆయన ప్రత్యేకత, ఆయన వైశిష్ట్యం రెండింటిలో ప్రధానంగా కానవస్తుంది.

వాటిలో మొదటిది ఆయన ధైర్యం, ధైర్యం రెండు విధాలు. ఒకటేమో శారీరక సంబంధమైన ముప్పులను పాటించని ధైర్యం. దీన్ని ఇంగ్లీషులో "ఫిజికల్ కరేజ్" అంటారు. కాగా, రెండవది, ఒక వ్యక్తి తన భావాల కోసం, విశ్వాసాలకోసం అవసరమైతే మొత్తం ప్రపంచాన్నే ధిక్కరించి నిలబడగల మానసిక ధైర్యం. ఈ రెండు విధాల ధైర్యాలలో రెండవదే అధిక ప్రశస్తమైనట్టిది ఈ ధైర్యంలో గాంధీజీ తర్వాత ఎన్నదగు భారత నాయకుడు రాజాజీయే!

పండిట్ జవహర్లాల్ నెహ్రూవలె, సర్దార్ పటేల్వలె రాజాజీ సయితం గాంధీజీ అంతేవాసి. ఈ ముగ్గురు కొన్ని కొన్ని సందర్భాలలో గాంధీజీతో ఏకీభవించలేకపోయారు. అయితే, తమ విభిన్నాభిప్రాయాల కారణంగా గాంధీజీని వ్యతిరేకించడానికి, కాంగ్రెసు నుంచి తప్పుకొనడానికి నెహ్రూగాని, పటేల్గాని సన్నద్ధపడలేదు. ఆ పని చేసింది రాజాజీయే.

"క్విట్ ఇండియా" ఉద్యమం సందర్భంలో గాంధీజీ సమేతంగా మొత్తం కాంగ్రెసు నాయకత్వానికి, అనుచరవర్గానికి వ్యతిరేకంగా నిలవడం రాజాజీకే చెల్లింది. మిస్టర్ జిన్నా పాకిస్తాన్ వాంఛను గుర్తించక తప్పదని, పాకిస్తాన్ అవతరణకు అయిదారేళ్ళకు ముందుగానే హెచ్చరించడం రాజాజీకే చెల్లింది. ఈ

మాటలు చెప్పినందుకు ఆయనను "దేశద్రోహి"గా నిందించడం జరిగింది. రాజకీయ రంగం నుంచి ఆయనను పూర్తిగా వెలివేయడం జరిగింది. అయినా, ఆయన నిశ్చలంగా నిలిచాడు.

పోతే, రాజాజీలో మేము ప్రత్యేకించి మెచ్చుకునే రెండవ గొప్ప గుణం వాత్సల్యం. ఎవరిపట్లనైనా వాత్సల్యం కుదురుకుంటే, ఆ వ్యక్తి యోగక్షేమాల విషయమై తండ్రి కంటె, తల్లికంటె హెచ్చుగా ఆయన శ్రద్ధ వహించేవాడు. అతడు ఉద్యోగం లేనివాడైతే, ఏదైనా ఉద్యోగ మిప్పించడానికి ఎవరినైనా ఆయన అర్థించేవాడు. అతడు పదవి లేనివాడైతే పదవి నిప్పించడానికి తనకు చేతనైన సమస్తాన్ని ఆయన చేసేవాడు. అతడు జబ్బుపడితే, ఆయన నర్సుకంటే హెచ్చుగా అతడికి ఉపచారాలు చేస్తూ వుండేవాడు.



ఇతరులు కొందరివలె రాజాజీ అజాతశత్రువు కాదు. అందరు మహా మేధావులవలె ఆయన మౌఢ్యాన్ని సహించగలిగేవాడు కాదు. నైతికపు విలువలకు ప్రాధాన్యమిచ్చే నాయకుడైనందున ఆయన అవినీతిని సహించ గలిగేవాడు కాదు కూడా. అందువల్ల ఆయనకు శత్రుకోటి విరివిగానే వుండేది. ఆయన మేధాపటిమను "జిత్తులమారి నక్కతనం"గా వారు నిరసిస్తూ వుండేవారు, నీతిని గురించి ఆయన పట్టుదలను "శ్రీరంగనీతి"గా వారు చులకన చేస్తుండేవారు. దేశంలో నానాటికి పెరిగిపోతున్న మౌఢ్యమే, అవినీతియే రాజాజీ స్వతంత్ర పార్టీని సంస్థాపించడానికి మూలకారణాలని చెప్పవచ్చు. ఆ పార్టీ ఆర్థిక, రాజకీయ సిద్ధాంతాలను హర్షించలేనివారైనా, అవినీతిపట్ల దాని విముఖత్వాన్ని మెచ్చుకొనక తప్పదు. అవినీతిపై యుద్ధంలో ఆ పార్టీ ఎన్నదగు విజయాన్ని సాధించి వుండక పోవచ్చు. తక్కిన పార్టీలలో వలె దానిలో కూడా కొందరు అవకాశవాదులు, అవినీతిపరులు ప్రవేశించి వుండవచ్చు. అయినా, దేశంలో పెచ్చు పెరిగిపోయిన అవినీతిపై ప్రజాదృష్టిని కేంద్రీకరించడానికి అది కొంతవరకైనా తోడ్పడినదనడంలో సందేహం లేదు.

అన్ని విధాల రాజాజీ తనకు తానే సాటిగా చెప్పదగు వ్యక్తి. ఆయనలేని లోపం ఇంతలో తీరదు; బహుశా ఎప్పటికి అది తీరక పోవచ్చు. (ఆంధ్రజ్యోతి 26-12-1972).

## డాక్టర్ రామమనోహర్ లోహియా




బ్రతకవలసిన కాలం ముందే వున్నది; నడపవలసిన ప్రజోద్యమాలు ముందే వున్నాయి; వహించవలసిన బాధ్యతలు సయితం ముందే వున్నాయి. అయినా, డాక్టర్ రామమనోహర్ లోహియా వెళ్లిపోయాడు. షష్టిపూర్తి కాకముందే ఆయనకు నూరేళ్లు నిండిపోయాయి.

ఏ దృష్టి నుంచి చూచినా, లోహియా విలక్షణ వ్యక్తి. ఆయన గాంధేయత్వాన్ని కొన్ని ముఖ్యాంశాలలో త్రోసివేసిన గాంధేయవాది; మార్క్స్ కొన్ని ప్రాథమిక సూత్రాలలో ఖండించిన మార్క్సిస్ట్; సోషలిస్ట్ నెహ్రూ ప్రభుత్వ విధానాలను పెక్కింటిని ప్రతిఘటించిన సోషలిస్ట్. చిన్న, పెద్ద విషయాలన్నింటిలో ఆయన భావాలు ఆయనవే, ఆయన మార్గాలు ఆయనవే.

స్వతంత్రంగా ఆలోచించడంతోపాటు ఆయన సాహసికంగా ప్రవర్తించేవాడు. భయానికి ఆయన అపరిచితుడు; బాధకు అచంచలుడు. 1947 నాటికి ముందుకంటే అటు తర్వాతనే ఆయన ఎక్కువసార్లు కారాగారవాసం చేశాడు. ఒకసారి అమెరికాలోకూడా ఆయన కొన్ని గంటలపాటు ఖైదీకావడం తటస్థించింది.




కాగా, తన స్థాయికి చెందిన నాయకులతో ఆయనవలె బ్రిటిష్వారి చేతిలో క్రూర హింసల పాలైనవారు మరి లేరేమో! 1942 నాటి "క్విట్ ఇండియా" జాతీయోద్యమ సందర్భంలో ఆయనను లాహోర్ కోటలో ఏకాంతంగా బంధించారు. ఎన్నెన్నో చిత్రహింసలకు లోనుజేశారు. "ఇంతకంటె చావే నయం" అనిపించగల చిత్రహింసలవి. అయినా, ఆయన చలించలేదు. పైపెచ్చు, అప్పటి తన మానసిక స్థితిని ఒక యోగానుభూతిగా, లీనాలీనావస్థలోని యోగనిద్రగా ఆయన సంభావించాడు. మరొకరికైతే జీవితాంతంవరకు ఒక పీడకలగా, కంటికి నిద్రను దూరం చేయగల ఒక పెనుభూతంగా పరిణమించ వలసిన ఆ ఘోరానుభవాన్ని "యాన్ ఎపిసోడ్ ఇన్ యోగా" అని పేర్కొంటూ ఒక భావగర్భిత వ్యాసాన్ని వ్రాయడం ఆయనకే చెల్లింది.

దీన్నిబట్టి ఆయనను ఒక యోగిగా సంభావించడానికి వీలులేదు. ఆయన "భోగి" తప్ప, యోగి కాదు. ఇక్కడ "భోగి"కి దాని దురర్థాన్ని కాక, సదర్థాన్నే మనం చెప్పుకోవాలి. తన లక్ష్యాల కోసం, విశ్వాసాల కోసం ఎన్ని త్యాగాలను చేసినా, ఆయన జీవితాన్ని రోసినవాడు కాదు; సర్వసంగపరిత్యాగాన్ని చేసినవాడు కాదు. ఆయన



దృష్టిలో జీవితం అతిమధురమైంది. స్వేచ్ఛగా, సమృద్ధిగా, పరిపూర్ణంగా జీవితమధువును ఆస్వాదించడానికి ఈనాటి నిష్ఠురప్రపంచంలో కోటానుకోట్లకు అవకాశం లభించడం లేదన్నదే ఆయన ఆవేదన.

వాక్కు పరుషమైనా డాక్టర్ లోహియా హృదయం ఎంతో ఆర్ద్రమైంది. స్నేహానికి అది కరిగేది; సౌజన్యానికి కరిగేది; సౌందర్యానికి కరిగేది. సౌందర్యోపాసన ఆయనలో ప్రత్యేకించి చెప్పుకోదగు విశేషం. ఆకుచాటు పువ్వును చూచినా, తల్లివొడిలో బిడ్డను చూచినా, ఆయన కన్నులు వెలుగులను చిందేవి. కోణార్కశిల్పాన్ని చూచినా, కోయపడుచును చూచినా ఆయన ముగ్ధుడయ్యేవాడు. సౌందర్యాన్ని గురించి ఆయన భావాలు, తక్కిన పెక్కింటివలె విలక్షణమైనవే.

నల్లనివారిలో చాలామందికి కనబడేది అందం కాదు, అందవికారమే. ఇది మనలో జితించిన వర్ణవివక్ష ఫలితమని ఆయన విశ్వసించేవాడు. ఆయన కళ్లకు నల్లని రాముడు, నల్లని కృష్ణుడు, నల్లని ద్రౌపది అందాలన్నింటిని పుణికిపుచ్చుకున్నవారుగా కనబడేవారు. ఇక, సాంచి వనదేవతలో, ఖజురహో సురసుందరిలో, కోణార్క నర్తకిలో భారతనారి సౌందర్య శోభ మూర్తీభవించినట్లు ఆయన భాసిస్తూవుండేవాడు. ఏ భక్తుడు తీర్థయాత్రలను సేవించనంత భక్తిశ్రద్ధలతో ఆయన కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, కచ్ నుంచి కామరూప్ వరకు, అఖిల భారతంలోని కళాక్షేత్రాలన్నింటిని సేవించాడు. తన డాక్టర్లు వలదని శాసించినా, కోణార్క నర్తకిని మరొకసారి చెంతనుంచి చూడ్డానికై, అక్కడికి తాను రెండవ తూరి తీర్థయాత్రకు వెళ్లినప్పుడు, ఎత్తైన సూర్యదేవాలయ మండపంపైకి నిచ్చెనలేకుండా ఆయన ఎగబాకాడు.

డాక్టర్ లోహియా కళాప్రియుడు మాత్రమే కాదు, సాహిత్యాభిమాని కూడా. అన్ని దేశాల సాహిత్యాన్ని, అన్ని కాలాల సాహిత్యాన్ని, ఆయన అభిమానించేవాడు. ఆధునికదృష్టి గలవారికి, విప్లవవాదులైనవారికి పౌరాణిక సాహిత్యంపట్ల వైముఖ్యం వుండడం కద్దు. కాని, డాక్టర్ లోహియా మాత్రం హిందూపురాణాలపట్ల, భక్తి గౌరవాలను చూపుతూ వుండేవాడు. రాముడు, కృష్ణుడు, శివుడు ఈ పురాణ పురుషత్రయాన్ని గురించి ఆయన ఎంతో భావగర్భితమైన రచనచేశాడు. ఆయన చిత్రణప్రకారం ఈ ముగ్గురి వ్యక్తిత్వాలు పరాకాష్ఠను అందుకొన్నట్టివే. రాముని వ్యక్తిత్వం పరిమితత్వంలో, కృష్ణునిది ప్రాగల్భ్యంలో, శివునిది దేశకాలాలను అధిగమించడంలో వీరు చారిత్రక వ్యక్తులు కావచ్చు. కాకపోవచ్చు. అయినా, చారిత్రక పురుషులకంటే డాక్టర్ లోహియా దృష్టిలో వీరు హిందువుల జీవితాన్ని, వారి సంస్కృతిని, వారి చరిత్రను ప్రభావితం చేశారు, చేస్తున్నారు. -

ఒక్క జవహర్లాల్ను విడిచిపెడితే, భారత రాజకీయనాయకులలో ఇంతగా సర్వతోముఖమైన అభిరుచులున్న వ్యక్తి మరొకరు కానరారు. రాజకీయరంగంలో ప్రవేశించి వుండకపోతే, లోహియా ఒక సాహిత్యకారుడుగా, కళాభిజ్ఞుడుగా, తత్త్వవేత్తగా రాణించివుండేవాడే. రాజకీయాలలో తలమునక లౌతూనే కొన్ని మౌలిక

రచనలను ఆయన చేశాడు. ఆయన రాజకీయాలలోవలె ఆయన రచనలలో సయితం ఆయన ప్రత్యేకత ప్రస్ఫుట మౌతూవుంటుంది.

మౌలిక భావుకుడైనా డాక్టర్ లోహియాలో ఒక పెద్ద లోపం - ఆవేశ రహితంగా ఆలోచించలేకపోవడం. ఏ విధమైన ఆవేశం లేకుండా ఆలోచన ఒక గణితశాస్త్రవేత్తకే సాధ్యం కావచ్చు. లేదా, సర్వసంగపరిత్యాగికే సాధ్యంకావచ్చు. కాని, ఆవేశం మితి తప్పినప్పుడు ఆలోచన క్రమబద్ధంగా, తర్కసమ్మతంగా కొనసాగలేదు. డాక్టర్ లోహియాలో ఆవేశం మితితప్పిన సన్నివేశా లనేకం.



ఈ ఆవేశపూరిత ప్రవృత్తివల్లనే డాక్టర్ లోహియా స్వతంత్రాలోచనలలో స్వాతంత్ర్యం కంటె విశృంఖలత్వం ఎక్కువగా గోచరించేది; ఇందువల్లనే ఆయన సాహసిక ప్రవర్తనలో సమంజసత్వం కంటె తద్విరుద్ధగుణమే అధికంగా ద్యోతకమయ్యేది. ఇందువల్లనే ఆయన ప్రేమకు వలె విద్వేషానికి సయితం అవధులుండేవి కావు.

ఆవేశకావేషాలు ఒక పెద్ద లోపమైనా, డాక్టర్ లోహియా కొన్ని గొప్ప లక్ష్యాలకోసం జీవించి, వాటిని సాధించడానికి జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు. మరి కొంతకాలం బ్రతికివుంటే, తన జీవితలక్ష్యాలను మరింతగా ఆయన సాధించ గలిగివుండేవాడేమో! రాజ్యాధికారానికి రావడమే తటస్థించివుంటే, ఆయనలోని దుడుకుతనం కొంతవరకు తగ్గి, తన దృష్టిలో అతిముఖ్యమైన ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరివర్తనలను కొన్నింటినైనా ఆయన సాధించగలిగేవాడేమో! చాలామందికి తెలియకపోవచ్చుగాని, ఆయనకు ఇంగ్లీషుభాషపట్ల కంటె కులవ్యవస్థపట్ల అధిక విరోధభావం వుండేది. కులవిభేదాలు తొలగనిదే ప్రజాస్వామ్యం లేదని, సోషలిజం అంతకంటే లేదని, ఆయన ప్రగాఢంగా విశ్వసించేవాడు. కులవ్యవస్థను గురించి ఆయన భావాలకు ఇది ఒక మచ్చుతునక. “కులవ్యవస్థ సాంఘిక వ్యవస్థకు స్థిరత్వాన్ని కూర్చగల మహాశక్తి. అయితే అది స్థిరపరుస్తున్నట్టివి ఈనాటి ఆచార వ్యవహారాలు, ఈనాటి అబద్ధాలు, ఈనాటి నైచ్యాలు మాత్రమే.” (ఆంధ్రజ్యోతి 14-10-1947)


## బహుముఖ ప్రజ్ఞానిధి : శ్రీ కె.ఎం. మున్షీ

శ్రీ కె.ఎం. మున్షీ వలె ఇటు రాజకీయ రంగంలో, అటు సాంఘిక, సాంస్కృతిక, సాహిత్య రంగాలలో సమాన ప్రతిభతో భాసించినవారు అరుదు. ఆయన నిస్సందేహంగా బహుముఖ ప్రజ్ఞానిధి.



శ్రీ మున్షీ తన జీవితాన్ని న్యాయవాదిగా ప్రారంభించారు. అపార ధనం ఆర్జించారు. అయితే ఆయన ధనార్జనే తన జీవిత లక్ష్యంగా పెట్టుకోలేదు. దేశసేవ నిమిత్తం ఆయన తన న్యాయవాద వృత్తిని త్యజించినప్పుడు ఒకరు ప్రశ్నకు సమాధానంగా ఆయన "ధనార్జనకు కావలసిన తెలివితేటలు కలవాడినే. కాని, జీవితం పొడుగునా అదే పనిలో మునిగిపోయేటంత తెలివితక్కువవాడిని మాత్రం కాను" అన్నారట.

ఆయన రాజకీయ జీవితం హోంరూల్ ఉద్యమంతో ప్రారంభమైంది. ఆ తర్వాత గాంధీజీ ప్రభావానికి లోనై కాంగ్రెసులో చేరి సత్యాగ్రహోద్యమాలలో పాల్గొన్నారు. పెక్కుసార్లు కారాగారవాసం అనుభవించారు. అయితే మధ్య మధ్యలో సిద్ధాంత విభేదాల కారణంగా ఆయన కాంగ్రెసు సంస్థనుంచి తప్పుకునేవారు. చివరిసారిగా 1959లో కాంగ్రెసు నుంచి నిష్క్రమించి, రాజాజీతో కలిసి స్వతంత్ర పార్టీని స్థాపించారు. దాని ఉపాధ్యక్షుడుగా రెండేళ్ళ క్రిందటి వరకు పనిచేశారు. కేంద్రంలో ఆహార శాఖ మంత్రిగా, ఉత్తరప్రదేశ్ గవర్నరుగా ఆయన ఉన్నత పదవులధిష్ఠించారు. హైదరాబాదు సంస్థానంపై "పోలీసు చర్య" జరిగినప్పుడు శ్రీ మున్షీ అక్కడ ఇండియా ప్రభుత్వపు ఏజంట్ జనరల్ గా వుంటూ కీలక పాత్ర వహించారు.



భారత రాజ్యాంగ రచనా సమయంలో రాజ్యాంగ పరిషత్తు సభ్యుడుగా కూడా ఆయన అంతే ప్రముఖ పాత్ర వహించారు. ఏ పార్టీలో వున్నా, లేకపోయినా, ఏ పదవులలో వున్నా, లేకపోయినా, ఆయన దేశభక్తి, నిస్స్వార్థ సేవానిరతి నిరుపమానమైనవే.

ఆయన రాజకీయ వ్యాసంగం ఒక ఎత్తు; సాంస్కృతిక, సాహిత్యరంగాలలో ఆయన చేసిన కృషి మరొక ఎత్తు. బహుశా, శ్రీ మున్షీని చిరస్మరణీయుడుగా చేసేది ఈ రెండవదే కావచ్చు. ఆయన దేశానికి సమర్పించిన ఒకే ఒక అమూల్యమైన కానుక భారతీయ విద్యాభవన్. తన యావచ్ఛక్తిని - శారీరకంగా, మేధావిషయకంగా, ధన రూపంలో ధారవోసి ఆయన ఈ మహాసంస్థను నిర్మించారు. అది నేడు 36 అనుబంధ సంస్థలతో, ముఖ్యనగరాలన్నిటిలో శాఖోపశాఖలతో, మొత్తం దేశంలోనే సాటిలేని విద్యాసంస్థగా విరాజిల్లుతున్నది. -

ఈ సంస్థ తరపునే ఆయన స్థాపించిన "భవన్స్ బుక్ యూనివర్శిటీ" మన పుస్తక ప్రచురణ రంగంలో తీసుకు వచ్చిన విప్లవం మరింతగా పేర్కొనదగినది. దాని నుంచి పుంఖాను పుంఖంగా "పేపర్ బ్యాక్" పుస్తకాలు - సామాన్యులకు సయితం అందుబాటులో వుండే ధరలకు – వెలువడ్డాయి. ముఖ్యంగా ఈ సందర్భంలో

పేర్కొనవలసింది ఆయన ప్రోత్సాహ, ప్రోద్బలాలతో వివిధ ప్రఖ్యాత రచయితలు వ్రాసిన "హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ ది ఇండియన్ పీపుల్" (భారతీయుల చరిత్ర, సంస్కృతి, మొత్తం పది సంపుటాలలో మరి రెండు మొఘల్ ఎంపైర్, మరారా సుప్రెమెసీ ఇంకా రావలసివున్నా, భారతీయ దృక్పథం నుంచి భారతీయ చరిత్ర సంస్కృతులను ఇంత సాధికారంగా, ఇంత విపులంగా చిత్రించిన చారిత్రక గ్రంథం మరి లేదు. శ్రీ సాంస్కృతిక విజయాలలో దీనిదే ప్రథమ స్థానం.




ఇతరులను ప్రోత్సహించి, చరిత్రకు, మతానికి, సంస్కృతికి, సాహిత్యానికి సంబంధించిన ఉత్తమోత్తమ గ్రంథాలను వ్రాయించి, ప్రచురించడమే కాక, శ్రీ మున్షీ స్వయంగా గుజరాతీ ఇంగ్లీషు భాషలలో ఉన్నత శ్రేణి రచయిత. గుజరాతీ భాషను ఆధునికం చేయడానికి కృషి చేసినవారిలో గాంధి తర్వాత శ్రీ మున్షీనే పేర్కొంటారు. ఆయన నవలలు వ్రాశారు, నాటకాలు వ్రాశారు, కథలు వ్రాశారు, చరిత్ర గ్రంథాలు వ్రాశారు. ప్రత్యేకించి "ది గ్లోరీ దట్ వజ్ ఘూర్జర దేశ" అనే పేరుతో గుజరాత్ చరిత్ర వ్రాశారు. ఆయన రచనలన్నిటిలో పౌరాణిక, చారిత్రక నవలలను అమూల్యమైనవిగా నేటికీ గుజరాతీలు భావిస్తారు. కృష్ణావతారం శీర్షిక క్రింద వ్రాయ తలపెట్టిన పౌరాణిక నవలా చక్రం ముగియకుండానే ఆయన నిర్యాణం చెందడం దురదృష్టంగానే భావించాలి.

సంస్కృతంపట్ల ఆయన అభిమానం ఇంతింతనరానిది. దాని ప్రచారం కోసం ఆయన విశ్వ సంస్కృత పరిషత్తును స్థాపించారు. మతానికి, సంస్కృతికి సంబంధించిన విషయాలలో ఆయనలో సనాతనవాదం పాలు కొంత హెచ్చుగానే వుండేది. "ఆర్యనైజేషన్" గురించి ఆయన తరచుగా ప్రస్తావిస్తూ వుండేవారు. ఆయనలో ఇదొక్కటే లోపమనదగినట్టిది.

సంస్కృతాన్ని ఎంతగా ప్రేమించినా, పురాతన భారతీయ సంస్కృతి పునరుద్ధరణకు ఆయన ఎంతగా కృషిచేసినా, భారతదేశానికి హిందీని అధికార భాషగా నిర్ణయించడానికి తొలి రోజులలో కృషి చేసినవారిలో ఆయన ఒకరైనా, శ్రీ మున్షీ ఇంగ్లీషు వ్యతిరేకి కారు. అంతర్జాతీయ భాషగా ఇంగ్లీషు అధ్యయనాన్ని భారతీయులు కొనసాగించడం అవసరమనే ఆయన భావించేవారు. ఆయన ఇంగ్లీషులో స్వయంగా వ్రాసిన, ఇతరులచే వ్రాయించిన గ్రంథాలే ఇందుకు తార్కాణాలు. వివిధ రంగాలలో శ్రీ మున్షీ కృషికి వ్యక్తిగా ఆయన విశిష్టత తీసిపోనట్టిది. ఒక పనిని చేపట్టినప్పుడు ఎన్ని అవాంతరాలెదురైనా, ఎవరెన్ని అభ్యంతరాలు చెప్పినా పట్టుదల విడవని కార్యశూరత, స్వాతంత్ర్య ప్రియత్వం ఆయన సొమ్ము. పండిట్ నెహ్రూ తీవ్రంగా వ్యతిరేకించినా సోమనాథ్ దేవాలయ పునరుద్ధరణను జయప్రదంగా నిర్వహించిన ధీరుడు ఆయన. సర్దార్



పటేల్ బొంబాయిలో మరణించినప్పుడు కేంద్రమంత్రులు, కార్యదర్శులు అంత్యక్రియలకు వెళ్ళరాదని పండిట్ నెహ్రూ శాసించినా, ధిక్కరించి హాజరైన స్వేచ్ఛాప్రియుడు ఆయన.

నెహ్రూతోనేకాదు, గాంధీజీకి పరమభక్తుడైనా ఆయనతో కూడా సిద్ధాంతపరంగా విభేదాలు వస్తే వాటిని ప్రకటించడానికి శ్రీ మున్షీ ఎన్నడు వెనుదీయలేదు. ఉదాహరణకు అహింసకు గాంధీజీ చెప్పిన అర్థాన్ని శ్రీ మున్షీ అంగీకరించలేదు. కొన్ని కొన్ని సందర్భాలలో హింసను వినియోగించడం అహింసా సూత్రానికి విరుద్ధం కాదని ఆయన విశ్వాసం. అదే విధంగా దేశ విభజనను కూడా ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.

ఇట్టి స్వేచ్ఛా ప్రియత్వమే లేకపోతే శ్రీ మున్షీ ప్రభుత్వ పదవులలో మరి కొంతకాలం కొనసాగేవారే. కాని, ఆయన పదవుల కోసం రోజుకొకసారి విశ్వాసాలను మార్చే వారి కోవకు చెందినవారు కారు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం తాను పెట్టుకొన్న లక్ష్యం కోసం ఆయన తన జీవితాన్ని ధారవోశారు. తన మేధాపటిమను, తన కార్య నిర్వహణ చాతుర్యాన్ని ఆయన పూర్తిగా దేశ సేవకే అంకితం చేశారు. ఇట్టి విశిష్ట వ్యక్తిత్వం కలిగిన ధీరులు, మేధావులు ఒకరొక్కరే నిష్క్రమించడంతో భారతీయ ప్రజాజీవితం పేదవడి పోతున్నది. ఇదే మన దురదృష్టం. (ఆంధ్రజ్యోతి 11-2-1971)

## సర్ తేజ బహదూర్ సప్రూ



కేవలం కండలను పెంచుకున్నవాడు జగజెట్టి. కేవలం మేధా సంపత్తిని వృద్ధిపరచుకున్నవాడు పండిత ప్రకాండుడు. కేవలం హృదయముప్పొంగ జేసుకొనగలవాడు భావుకుడు. కేవలం నైతికశక్తులను ప్రదీప్త పరచుకున్నవాడు ఋషిపుంగవుడు. ఈ నలుగురిలో ఒక్కరికైనా "పూర్ణ మానవుడు" అనిపించుకోగల అర్హత లేదు. శరీరం, మనస్సు, హృదయం, ఆత్మ వీటి సమానవికాసం ఎవరిలో జరగగలవో అతడే పూర్ణమానవుడు.

ఏ రంగంలోనైనా పూర్ణత్వాన్ని సాధించడం అతి కష్టం. ఇక, జీవితరంగంలో దాన్ని సాధించడం మరింత కష్టం. దాదాపు అసాధ్యమన్నప్పటికీ తప్పులేదు. పూర్ణ మానవులైనవారు ప్రపంచ చరిత్రలోనే నలుగురైదుగురిని మించి లేరేమో!



అయినా, పశుపక్ష్యాదులకు తాను భిన్నమైనవాడినని గుర్తించగలిగిన నాటి నుంచి నేటి వరకు మానవుడు నిరంతరాయంగా పూర్ణత్వం పొందడానికి కృషి చేస్తూనే వున్నాడు. ఈ కృషి కొందరి విషయంలో తెలిసి జరగవచ్చు; పెక్కుమంది విషయంలో తెలియకుండానే కొనసాగవచ్చు. కాని, మొత్తంపై మానవుడు ప్రతి తరంలో ప్రతి శతాబ్దంలో, పూర్ణత్వం వైపుకే అంతకంతకు ఎక్కువగా అడ్రులను జాస్తున్నాడు. పూర్ణత్వ సిద్ధికోసం మానవుని నిత్యావేదన ఫలమే నిర్విరామ ప్రయత్న ఫలితమే చతుష్షష్టి కళలైనా, ఛప్పన్న శాస్త్రాలైనా, సంస్కృతీ సభ్యతలైనా. అయితే, ఈ విషయంలో మానవుని విజయమే అతనిని తన లక్ష్యసిద్ధికి మరింత దూరం చేయడం సంభవిస్తున్నది కూడా. ఉదాహరణకు, రెండున్నరవేల సంవత్సరాలనాడు జీవకుడు వైద్యవిద్యా పారంగతుడు, నాటి వైద్యశాస్త్రంలో ఆయన మథించని విషయం లేదు; కరతలామలకం చేసుకొనని రహస్యం లేదు. ఇందుకు ఆయన అద్వితీయ ప్రతిభావిశేషాలు తోడ్పడినమాట నిజం. అయితే, జీవకుడు ఈనాడు తిరిగి అవతరించడమే సంభవిస్తే, వైద్యశాస్త్రావధులను ఆయన తెలుసుకొనగలగడం కల్ల. రెండున్నరవేల సంవత్సరాలనాటి కంటె ఈనాడు వైద్యశాస్త్రావధులు రెండున్నరవేల రెట్లు విస్తరించినవి.

ఇప్పుడు జీవకుడు పునర్జన్మనెత్తడమే తటస్థిస్తే, ఆయన “హార్ట్ స్పెషలిస్ట్” కావచ్చు; “బోన్ స్పెషలిస్ట్” కావచ్చు; “ఇయర్, నోస్, థ్రోట్ స్పెషలిస్ట్” కావచ్చు; ఒక్క మాటలో ఏదో ఒక “స్పెషలిస్ట్” కావచ్చు. అంతేకాని, వైద్యశాస్త్రంలో "సర్వజ్ఞుడు" కాలేదు. ఇది కేవలం వైద్యశాస్త్రానికి వర్తించగల సత్యం మాత్రమే కాదు; జీవితరంగానికే ఇది వర్తిస్తుంది.

పూర్ణత్వ సాధన అంతకంతకు మరింత కష్టమైపోతున్నందునే ఏదో ఒక జీవితరంగంలో ఎంతో కొంత సమగ్రతను ప్రదర్శించగలుగుతున్న వారు నేడు ప్రశంసా పాత్రులౌతున్నారు. ఇక ఒకదాన్ని మించిన జీవిత రంగాలలో ప్రతిభాన్వితులైనవారు కేవలం జనవంద్యు లౌతున్నారు. ఇట్టివారిలో ఎన్నికకు రాగలవాడే సర్ తేజ ్బహదూర్ సప్రూ. అందువల్లనే కాలం నిండి ఆయన కన్ను మూసినప్పటికీ, ఆయన మృతికి సోదర దేశీయులు అధిక సంతాపాన్ని వెల్లడిస్తున్నారు.

సప్రూ మహా వక్త; మేటి తార్కికుడు; వివిధ భాషా కోవిదుడు; ప్రతిభాపూర్వక న్యాయవాది; రాజనీతి శాస్త్ర విశారదుడు; విశేషించి సహృదయుడు. సహృదయుడు కనకనే ఆయన ప్రతివారిలో మంచినే చూడగలిగేవాడు; ప్రతిదానినుంచి మంచినే గ్రహించగలిగేవాడు. ఆయన జన్మవల్ల హైందవుడు. కాని, పారశీక సంస్కృతిని ఆయన వలె హృద్గతం చేసుకున్నవారు బహు కొద్దిమంది. ఆయన మనః ప్రవృత్తివల్ల మితవాది కాని, ఆయన మిత్రులలో అతివాదుల సంఖ్య స్వల్పంకాదు. ఆయన విశ్వాసాలవల్ల జాతీయవాది. కాని, బ్రిటిష్ ప్రభుత్వం ఆయనపట్ల అమిత విశ్వాసాన్ని ప్రదర్శించేది. ఆయన జీవితమే విభిన్న సంస్కృతుల మధ్య, విరుద్ధశక్తుల మధ్య, విరోధవర్గాల మధ్య సహృదయ పూర్వకంగా సామరస్య సాధనకై

వినియోగించబడింది. "ఏది మంచి భోజనం" అనేదానికి సర్ తేజ్ "హిందూ వంటశాలలో, ముస్లిం వంటకాలను చేసి, యూరోపియన్ పద్ధతిని వడ్డిస్తే, అది మంచి భోజనం" అని ప్రత్యుత్తర మిచ్చాడని వినికిడి. ఈ ప్రత్యుత్తరంలో ఆయన మొత్తం జీవితపు కీలకం కలదని చెప్పడంలో అత్యుక్తిలేదు.

(ఆంధ్రప్రభ 22-1-1949)

## శ్రీ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ

ఆకస్మికంగా దుర్వార్తను వినవలసివచ్చింది. ఇంకా నాలుగు కాలాలపాటు బ్రతకవలసిన డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కన్నుమూశాడు.



ఆయన విద్వత్కుటుంబానికి చెందినవాడు. ఆయన తండ్రి "బెంగాల్పులి"గా ప్రసిద్ధి చెందిన డాక్టర్ సర్ అశుతోష్ ముఖర్జీ. తండ్రి వలె కుమారుడు కూడా విద్యాధికుడు. తండ్రి వలె కుమారుడుకూడా కలకత్తా యూనివర్శిటీకి వైస్ ఛాన్సలర్ గా పనిచేశాడు. తండ్రి ఆ విశ్వకళా పరిషత్తుకు కీర్తి సంపాదించగా, కుమారుడు ఆ కీర్తిని దశదిశలకు విస్తరింపజేశాడు. అన్ని విధాల తండ్రికి తగిన కొడుకుగా అందరి మన్ననలను పొందినవాడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్.

తండ్రి విద్యారంగానికే చాలా వరకు పరిమితంకాగా, కుమారుడు ఇతర రంగాలకు సయితం విస్తరించాడు. విద్యా సమస్యలపై ఆసక్తితోపాటు, మత విషయాలపై విశేషశ్రద్ధ చూపించాడు. మత విషయాలపై శ్రద్ధతోపాటు, రాజకీయాలను గురించి పట్టుదలకూడా ఆయన ప్రత్యేకత. విద్యారంగంలో సాధించగలిగిన విజయాన్ని తక్కిన రంగాలలో సాధించలేకపోయినా, దేనిలోను ఆయన అప్రధానుడుగా కొట్టి పారవేయ దగినవాడు కాదని మాత్రం చెప్పాలి.

డాక్టర్ ముఖర్జీ అభిప్రాయాలతో ఏకీభవించలేనివారు సయితం ఆయన ప్రతిభావంతుడని అంగీకరించాలి. తాను పెట్టుకున్న నమ్మకాలను ఆయన చిత్తశుద్ధితోనే పెట్టుకున్నాడని కూడా అంగీకరించాలి. చిత్తశుద్ధి కలవాడు కాబట్టే ఆయన తన నమ్మకాలకు విరుద్ధంగా ఎన్నడు ఏ పదవినీ పట్టుకుని వ్రేలాడలేదు. 1941-42లో బెంగాల్కు ఆర్థికమంత్రిగా వుంటూ నాటి గవర్నర్తో రాష్ట్రంలోని క్షామ పరిస్థితుల విషయమై అభిప్రాయ భేదాలురాగా, తన పదవికి ఆయన రాజీనామా చేశాడు. పాకిస్తాన్లోని మత కల్లోలం విషయమై భారత ప్రధానితో అభిప్రాయ భేదాలేర్పడగా 1950లో ఇండియా గవర్నమెంట్లో పారిశ్రామిక మంత్రిపదవికి కూడా ఆయన ఇలాగే రాజీనామా పెట్టాడు.




స్వమతాభిమానం, జాతీయత ఈ రెండింటిమధ్య వైరుధ్యమే ముఖర్జీ జీవితంలో కొన్ని ఘట్టాలలో తప్పకపోయిన అపశ్రుతులకు మూలమని చెప్పవచ్చునేమో! ఆయనను మతోన్మాదిగా లెక్కకట్టడంకంటె అపచారం వుండబోదు. అట్టి వ్యక్తికాదు కాబట్టే, ఆయన మహాబోధి సంఘానికి అధ్యక్షుడుగా వుండి, బుద్ధ భగవానుని సందేశంలో భారతజాతికి తిరిగి భక్తిశ్రద్ధలను కలిగించడానికి అవిరళ కృషి చేయగలిగాడు. అయితే, మతానికి రాజకీయాలతో ప్రసక్తి ఎంతమాత్రం తగదని చెప్పగలపాటి పటుత్వం కలది కాదు ఆయన జాతీయత, మతోన్మాదుల మధ్య మతాభిమాని కావడం - ఇందువల్లనే ఆయన ఈ రెండు వర్గాలవారిలో ఎవ్వరినీ పూర్తిగా సంతృప్తి పరచలేకపోయాడు.

మనదేశ దౌర్భాగ్యాన్నిబట్టి మనకు మత సమస్య ఏర్పడబట్టికాని, లేకపోతే నవభారత నిర్మాతలలో ఒక ప్రముఖుడుగా డాక్టర్ ముఖర్జీ ఎంతో మన్నన పొంది వుండేవాడు. ఆయన మంచి వక్త; శాసనసభల సంప్రదాయాలలో, వాటికి సంబంధించిన కార్యకలాపాలలో నిష్ణాతుడు. పరిపాలనానుభవం కలవాడు. వ్యవహారదక్షుడు. కల్లాకపటం తెలియనివాడు. ప్రతికక్షిగా నిలిచినా గౌరవభాజనుడైనవాడు. అట్టి వ్యక్తి అస్తమించడం భారతజాతికి తీరని నష్టమే!



ఇటీవలి కొన్ని దురదృష్ట సంఘటనలవల్ల డాక్టర్ ముఖర్జీ డిటెన్యూగా వుండగా కాలధర్మం చెందడం మరింత శోచనీయం. ఇందుకు నేడు అందరికంటే ఎక్కువగా దురపిల్లుతున్న వ్యక్తి కాశ్మీర్ ప్రధాని అనడంలో మాకెట్టి సందేహం లేదు.

డాక్టర్ శ్యామ్ ప్రసాద్ స్మృతికి మా జోహారులు.

(ఆంధ్రప్రభ 24- -1953)

పార్లమెంటు జనకుడు : శ్రీ గణేష్ వాసుదేవ మౌలంకర్ స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న ధ్రువతారలవంటి మహామహులు ఒక్కరొక్కరే భారతాకాశం నుంచి రాలిపోతున్నారని చింతిస్తూ ఆచార్య నరేంద్రదేవ్ అస్తమయం సందర్భంలో ప్రధాని నెహ్రూ కంటపెట్టిన తడి నేటికింకా ఆరిపోలేదు.


నరేంద్రదేవ్ భౌతికకాయం వీడి పట్టుమని వారం గడిచిందో లేదో ఇంతలోనే మరొక మహనీయుని ఎడబాటును భారతజాతి భరించవలసివస్తుందని ఎవ్వరూ ఊహించి ఉండరు.

కొన్నాళ్లనుంచి శ్రీ గణేశ వాసుదేవ మౌలంకర్ అనారోగ్య కారణాలచే పార్లమెంటు సభలకు హాజరుకాలేక స్వస్థలంలో విశ్రాంతి పుచ్చుకొంటున్న విషయం విదితమే. ఇటీవల ఆయన అస్వస్థత ఆందోళనకు హేతువైన మాట కూడా వాస్తవమే. అయినప్పటికీ, ఇంత త్వరలో వ్యాధి ముదిరి, ఇంత హఠాత్తుగా ఆయనను బలిగొంటుందని మాత్రం ఎవ్వరికీ తట్టలేదు. అందులో, నిన్నటి రాత్రేకదా, ఆయన దేహస్థితిని గురించి డాక్టర్లు వెలువరించిన ప్రకటనలో శ్రీ మౌలంకర్ ఆరోగ్యంలో క్రమంగా అభివృద్ధి కన్పిస్తున్నదనీ, ఇటుపై అనుదినం ప్రకటనలు చేయవలసిన అవసరం కూడా లేదని సూచించింది. ఇకమీదట దైనందిన ప్రకటనలు వెలువరచవలసిన పని లేదని గత రాత్రి డాక్టర్లు ఒక అర్థంలో చేసిన సూచన నేడు విపరీతార్థంలో నిజంకావడం విధి దుర్విధానం కాదా?



అందుచేతనే కాబోలు నెహ్రూ అంతటివాడు కూడా సంతాపాన్ని భరించలేక దుర్విధి మనలను వెన్నంటుతున్నదనీ, నలువైపుల నుంచి దురదృష్టాలు ఒక్కటొక్కటిగా మనలను కమ్ముకవచ్చినట్టు కన్పిస్తున్నదనీ తన హృదయావేదనను వెలిగ్రక్కవలసివచ్చింది.

దేశసేవచేత, స్వార్థత్యాగంవల్ల, పార్లమెంటరీ సంప్రదాయాల్లో పండువారిన పరిజ్ఞానంద్వారా, నిర్మాణ కార్యక్రమ దక్షతమూలంగా, అన్నిటిని మించి ఆడంబరమెరుగని సజ్జనత్వం కారణంగా శ్రీ మౌలంకర్ తన మిత్రకోటికే కాదు, పార్లమెంటు సభ్యులకే కాదు, కాంగ్రెసు వారికే కాదు, గుజరాత్ రాష్ట్ర ప్రజలకేకాదు, అశేష భారతజాతికి ప్రేమాస్పదుడు, మాననీయుడైనాడు.



DR. SHYAMA PRASAD MUKHERJEE

న్యాయవాదవృత్తిని అవలంబిస్తూనే, రాజకీయోద్యమాలను నిర్వహిస్తూనే మాటి మాటికి కారాగృహాలకు ప్రయాణం చేస్తూనే ఆయన స్థాపించిన విద్యాలయాలు, ఆయన కొనసాగించిన సంస్కరణోద్యమాలు, స్మారకనిధులకు ఆయన సేకరించిన భూరివిరాళాలు అనేకం. సర్వతోముఖంగా దేశానికి ఇంతటి సేవచేసిన వ్యక్తిని కోల్పోవడం జాతి దౌర్భాగ్యంకాక మరేమి? స్వతంత్ర్య భారతంలో పార్లమెంటరీ సంప్రదాయానుగుణ్యంగా ప్రజాస్వామ్యానికి పునాదులు నెలకొల్పడం సామాన్య విషయంకాదు. ఇతర ప్రజాస్వామికాల పార్లమెంటరీ విధానాలను సమగ్రంగా తెలుసుకోడమేకాకుండా, మన రాజ్యాంగానికి మన దేశ పరిస్థితులకు, మన ప్రజల మనోభావాలకు అనుగుణ్యంగా సత్సాంప్రదాయాలను నెలకొల్పడంకూడా ఆరంభదశలో అవసరం. బాధ్యతాయుతమైన అట్టి కార్యనిర్వహణకు శ్రీ మౌలంకర్ను మించిన వారిలో మరొకరిని తేలేమన్నమాట ముమ్మాటికి నిశ్చయం. శ్రీ మౌలంకర్ భారత పార్లమెంట్ జనకుడన్నమాట నిరతిశయోక్తి.


(ఆంధ్రప్రభ 28-2-1956)

# తీరని వెలితి : శ్రీ రఫి అహ్మద్ కిద్వాయ్



నీళ్లు కారుతూ వచ్చిన దీపావళి ఈ సంవత్సరం కన్నీళ్లు కార్పించుతూ వెళ్లింది. కార్యశూరుడుగా ఘనకీర్తి నార్జించిన కిద్వాయ్ మరిలేడు. ఆయన మరిలేడంటే నమ్మడం - ఒక్క గోవిందవల్లభ పంత్ కేకాక - ఎవరికైనా కష్టమే. కొంతకాలంగా అనారోగ్యం తప్పకపోయినా, సుంతైనా ఆయన శుష్కించలేదు. ముఖంలో అదే గాంభీర్యం, కనుగవలో అదే జీవకళ, పెదవులపై అదే మందహాసం, పలుకులో అదే చురుకుదనం, వ్యవహారంలో అదే కరుకుదనం - ఇట్టి వ్యక్తిని ఆకస్మికంగా మృత్యుదేవత ఎత్తుకుపోగలిగిందంటే ఎలా నమ్మడం? విశ్రాంతి కావాలనో, సంఘ విద్రోహులను ఏరిపారవేయాలనో ఇదివరలో ఎన్నిసార్లు ఆయన తాత్కాలికంగా కనుమరుగుకాలేదు? ఈసారికూడా ఇంతే జరిగిందేమో కనుమరుగైన కిద్వాయ్ తిరిగి తెరముందుకు వస్తాడేమో! లేదు; ఈసారి ఇట్టి ఆశలేదు. అందువల్లనే కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నేడు కన్నీటి ధార!

కిద్వాయిని కోల్పోయినందుకు దేశం ఇంతగా దురపిల్లడం ఆయన లేని లోపం తీరేదికాదని తెలిసినందువల్లనే! ఆయనకంటే మేధావులైనవారుండవచ్చు; ఆయనను మించి విద్యావిజ్ఞానాలను సముపార్జించినవారుండవచ్చు; కాని, సాహసౌదార్యాలతో కూడిన రాజనీతి చతురతకేమి, కార్యదక్షతకేమి ఆయనకు ఆయనే సాటి. హితులకు ఆయన తలలో నాలుక; అహితులకు పక్కలో బల్లెం. నమ్మినవారికి గుండెను కోసి యిచ్చేవాడు. నట్టేట విడిచినా వొడ్డుకు చేరుకునేవాడు. పట్టినదెల్ల బంగారంచేసేవాడు. పట్టుదల చూపితే నెట్టరాని ప్రతిబంధకం లేదని ఆయన గట్టి నమ్మకం.




పట్టుదలతో ఆయన పరిష్కరించగలిగిన సమస్య లనేకం. టెలిఫోన్ సౌకర్యాల విస్తరణకు ధనాభావం అడ్డురాకుండా చేయగలిగిన ఘనత ఆయనది. ప్రముఖులైనవారి ప్రాతికూల్యాన్నే ప్రతిఘటించి, రాత్రిపూట విమానపు టపా పద్ధతిని ప్రవేశపెట్టిన ప్రజ్ఞ ఆయనది. అన్నింటినీ మించి ఆహార సమస్యను అనతికాలంలో పరిష్కరించగలిగిన అమర కీర్తి ఆయనది. అన్యుల విషయంలో వారి కీర్తి ప్రతిష్ఠలకు దాదాపు సమాధి స్థలంగా పరిణమించిన ఆహార శాఖే కిద్వాయికి కీర్తి స్తంభమై నిలిచింది. అంతటి నిరుపమ కార్యశూరుడాయన!





కార్యదక్షుల కొరతవల్లనే జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమం కుంటుపడుతున్న సమయంలో కిద్వాయ్ని పోలిన కార్యశూరుడు గతించడం దేశం దురదృష్టం. ప్రధాని నెహ్రూకోరుతున్న విశ్రాంతిని ఆయన కివ్వగల దక్షత గలవారొకరైనా వుంటే, ఆయన కిద్వాయే. అట్టి వ్యక్తి ఇంత ఆకస్మికంగా లోపించడం నెహ్రూకు కుడిభుజం పడిపోవడమే! అందువల్లనే ఆయన తన బ్రతుకే వెలితి అయిపోయినట్లు సంతాప పడుతున్నాడు. భారత ప్రధాని జీవితంలో, భారతజాతి మొత్తానికే ఇప్పుడు పెద్ద వెలితి యేర్పడింది!

(ఆంధ్రప్రభ 27-10-1954)

## శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి

లేడా, లేడా? శ్రీ లాల్ బహదూర్ నిజంగానే లేడా? ఆయన లేడని తంత్రీవార్తలు ఉద్ఘాటించవచ్చు.



ఆయన లేడని రేడియోలు ఉదోషించవచ్చు. అయినా, లేడని ఎలా నమ్మడం? నిన్న సాయంత్రమే కాదా ఆయన ఇండో-పాకిస్తాన్ అధినేతల సంయుక్త ప్రకటనపై సంతకం చేసింది! నిన్న రాత్రేకాదా తాష్కెంట్ (సోవియట్ రష్యా) చర్చల సాఫల్యానికి సంతోష సూచకంగా సోవియెట్ ప్రధాని చేసిన విందులో ఆయన పాల్గొన్నది? నిన్న ప్రొద్దుపోయిన తర్వాతనే కాదా ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా పత్రికా విలేఖరులతో ఛలోక్తులాడింది? "ఇంటికి రేపు తిరిగి వస్తాను" అని నిద్రపోవడానికి ముందు తన సతీమణికి ఆయన ట్రంక్ టెలిఫోన్ద్వారా చెప్పడం సయితం జరగలేదా?

స్వగృహానికి, స్వదేశానికి మరలివచ్చింది ఆయనకాదని, ఆయన భౌతికకాయమని ఎలా నమ్మడం? మోముపై ఆ నమ్రత, కళ్లలోని ఆ మందహాసం, పలకరింపులోని ఆ సౌహార్దం మాసిపోయినాయని.

ఎలా నమ్మడం? భారతదేశం - భారతదేశమే కాదు, మొత్తం ప్రపంచమే - శాంతి గాంభీర్యాలతో కూడిన ఆయన నాయకత్వానికి మరి నోచుకోలేదని ఎలా నమ్మడం?

అయినా, నమ్మకతప్పదు. ఆయన మరిలేడు! మన దౌర్భాగ్యవశాన ఆయనను మనం కోల్పోయాము!

తలచుకుంటేనే నరాలను తోడివేసే దౌర్భాగ్యమిది, మనస్సును ఛిన్నంచేసే దౌర్భాగ్యమిది, గుండెలను జలదరింపజేసే దౌర్భాగ్యమిది.



జవహర్లాల్ మనలను విడిచివెళ్లి, పూర్తిగా రెండు సంవత్సరాలైనా కాలేదు. ఆయన లేని లోపాన్ని తీర్చుతూ వచ్చిన రెండవ ప్రధానినికూడా ఇంతలోనే మనం పోగొట్టుకొనడం ఎంతటి ఘోర విపత్తు!

లాల్బహదూర్ మనకు ప్రధానిగా వున్నది కేవలం పందొమ్మిది నెలలైనా, ఎంతగా ఆయన రాణించలేదు? చూడబోతే ఆయన వామనమూర్తి. అయినా, సమయం వస్తే త్రివిక్రముని వలె విస్తరించగలనని నిరూపించుకున్నారు. వినబోతే, ఆయన పలుకు నవనీతంకంటె మెత్తన. అయినా, దానిలో అవసరమైనప్పుడు మేఘ గర్జనలు ఘూర్ణిల్లేవి. ఆయన నిరాడంబరత్వం వెనక గాంభీర్యం దాగివుండేది; ఆయన వినయంలో వజ్ర సంకల్పం గర్భితమైవుండేది. ఆయన సౌజన్యంలో ధర్మనిష్ఠ తొణికిసలాడుతూ వుండేది.

పోరుకు సవాలు చేసిన వారి కోరలను పీకగలనని ఆయన తాను ప్రధాని పదవి నధిష్టించిన కొద్ది కాలంలోనే స్పష్టంగా నిరూపించారు. శాంతిని కోరితే, దాని సంస్థాపన సందర్భంలో పట్టువిడుపులు తనకు తెలుసుననికూడా ఆయన రుజువు చేశారు.



కేంద్ర ప్రభుత్వంలో వాణిజ్యశాఖ మంత్రిగా వుండగానే అని జ్ఞాపకం, శ్రీ లాల్ బహదూరు స్వల్పంగా ఒకసారి గుండెపోటు వచ్చింది. ప్రధానమంత్రి పదవిని స్వీకరించిన వారంలోనే కొంత ఉధృతంగానే ఆ ప్రమాదం తిరిగి సంఘటించింది. అయినా, భారత జాతి నాయకుడుగా అన్ని బాధ్యతలను వహించడానికి, అన్ని భారాలను మోయడానికి ఆయన సంకోచించలేదు. తన స్వాసానికి కాక, జాతి క్షేమానికే ఆయన అగ్రప్రాధాన్యమిచ్చారు. చివరికి తాష్కెంట్లోకూడా నిద్రాహారాలు మాని, అహర్నిశలు శాంతి, సౌమనస్యాల సాధనకై ఆయన కృషి చేశారు. ఆయన నిర్యాణం ఇండో-పాక్ స్నేహ సాధనకై ఆత్మార్పణే!

ఎవరికైనా కొంచెం ముందు వెనుకలుగా మరణం తప్పదు. ఆయన ఇప్పుడు పోవడం మన దురదృష్టమైనా, ఆయన మాత్రం ధన్యజీవి. ఒక యుద్ధాన్ని గెలిచి, శాంతి, సౌమనస్యాలకు దోహదకారి కాగల ఒక సమాధానాన్ని సాధించి, సమస్త ప్రపంచం "ఓహో!" అని జేజేలర్పిస్తున్న క్షణంలో ఆయన వెళ్లిపోయాడు. ఆయన దృష్టి నుంచి ఆయన నిర్యాణం ఒక మహోన్నత ఘట్టంలో జరిగింది. ఒక చరిత్రాత్మక సన్నివేశంలో కన్నుమూసి, ఆయన చరితార్థుడైనాడు!

కాని, మన మాటేమిటి? ఒక జాతిగా మన బ్రతుకులోని వెలితి ఎలా పూడుతుంది? ఎప్పుడు పూడుతుంది? అసలది పూడుతుందా?



ఏ జాతికీ నిరాశ తగదు; నిస్పృహ తగదు. అయినా, ఈ క్షణంలో భారతాకాశాన్ని కారుమేఘాలు ఆవరించి వున్నాయి; చిమ్మచీకట్లు కమ్ముకుని వున్నాయి; చివరికి ఒక శంపాలత సయితం తిమిర భారాన్ని తగ్గించడానికి కానరావడం లేదు.

దుఃఖ వివశమైవున్న ఈ ఘట్టంలో లాల్ బహదూర్ మధుర స్మృతికి - పవిత్రస్మృతికి కన్నీటి తర్పణం విడవడంకంటె మనం చేయగలిగింది ఏమున్నది? (ఆంధ్రప్రభ 12-1-1966)

## నా మధుర స్మృతులు

"ఎడిటర్ జీ ! ఆప్కా అఖబార్ కైసా హై?"

నే నెదురుపడినంతనే ఈ ప్రశ్నతో శ్రీ లాల్బహదూర్ నన్ను ఆప్యాయంగా పలకరిస్తూవుండేవారు. మొట్టమొదటిసారిగా ఆయనను నేను కలుసుకున్నది "ఆంధ్రజ్యోతి" ప్రారంభానికి కొంచెం ముందుగా. అప్పటిలో ఆయన భారత ప్రభుత్వంలో పరిశ్రమల శాఖకు, వాణిజ్య శాఖకు మంత్రి. అందువల్ల న్యూస్ ప్రింట్ కోటా విషయమై ఆయనను నేను కలుసుకోవలసివచ్చింది. అపరిచితుడనైనా శ్రీ లాల్బహదూర్ నాతో ఆదరంగా మాట్లాడారు. నియమాలకు లోబడి ఎంతవరకు సహాయపడగలరో అంతవరకు పూర్తిసహాయం చేశారు.

ఆయన యింటివద్ద శ్రీ లాల్బహదూర్ను నేను కలుసుకోవడం అదే మొదటిసారి, అదే చివరిసారికూడా. మునిమాపువేళ వెళ్ళి, వచ్చినట్టు కబురుపెట్టగానే, ఆయన వెలుపలికి వచ్చారు. పచ్చిక మైదానంపైకి దారితీశారు. దానిపై పచార్లు చేస్తూ నాతో మాట్లాడారు. కార్యార్థియై వచ్చిన అపరిచితునితో వలెకాక, ఆప్తునితోవలె మాట్టాడారు.



నాటి మా సమావేశం పట్టుమని పదినిమిషాల సేపైనా జరగలేదు. కార్యార్థులై ఆయనను ప్రతినిత్యం ఎందరు కలుసుకునేవారో! అయినా, తర్వాత నేనెప్పు డెదురుపడినా, చిరునవ్వు పెదవులపై చిందులాడుతూ వుండగా, కుశల ప్రశ్నలు వేస్తూవుండేవారు.

మరి ముగ్గురు భారతీయ పత్రికా సంపాదకులతో చేరి 1964 జనవరిలో బ్రిటన్లో నేను పర్యటన చేస్తుండగా, పండిట్ జవహర్లాల్ నెహ్రూ పిలుపునందుకుని, శ్రీ లాల్ బహదూర్ తిరిగి భారత ప్రభుత్వంలో పోర్ట్ ఫోలియోలేని మంత్రిగా చేరడం జరిగింది. ఆ పర్యటన నుంచి నేను తిరిగి వచ్చిన కొత్తలో పార్లమెంట్ హౌస్ లో జరిగిన ఒక విందులో శ్రీ లాల్ బహదూరు కలుసుకోవడం తటస్థించింది. అంతట “మీరు తిరిగి ప్రభుత్వంలో ప్రవేశించారనే వార్తవిని, బ్రిటిష్ పత్రికలతో పాటు ప్రజలుకూడా ఎంతో సంతోషించా”రని నేనన్నాను.

"నేనొక సామాన్య వ్యక్తిని, ఎన్నడు విదేశాలకైనా వెళ్ళలేదు. నన్ను గురించి వారెందుకు పట్టించుకోవాలి!" అంటూ శ్రీ లాల్ బహదూర్ చిరునవ్వు నవ్వారు. “మీరు విదేశాలకు వెళ్లకపోతే మాత్రమేమి? మీ విఖ్యాతి వెళ్లింది" అని నే నన్నాను.




ఈ సన్నివేశం తర్వాత కొద్ది కాలానికే రాజ్యసభకు కాంగ్రెసు అభ్యర్థిగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు నన్ను రెండవసారి నిర్ణయించింది. ఈ మాట విన్న శ్రీ లాల్ బహదూర్ పార్లమెంట్ లాబీలో నే నెదురుపడగానే ఆగిపోయి, “మిమ్ము అభినందించ వలసింది ఈనాడు కాదు; మరి మూడు రోజుల తర్వాత” అని చమత్కరించారు. ఆలిండియా కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు మీ అభ్యర్థిత్వాన్ని ధ్రువపరచాలి సుమా!" అని ఈ చమత్కారం ద్వారా ఆయన ధ్వనించారు.


పార్లమెంటరీ కాంగ్రెసుపార్టీ నాయకత్వానికి శ్రీ లాల్ బహదూర్ ఏకగ్రీవంగా ఎన్నికైనందుకే వందలాది తోటి పార్లమెంటు సభ్యులతో పాటు నేనుకూడ ఆయన వద్దకు నా అభినందనలు తెలియజేయడానికై వెళ్ళాను. “నమస్తే!” అనగానే నా రెండు చేతులు పట్టుకుని, ఆప్యాయంగా వాటినినొక్కారు.

ఇవి శ్రీ లాల్ బహదూర్ను గురించి వ్యక్తిగతమైన నా మధుర స్మృతులు, ఇదే విధంగా ఎందరెందరి హృదయాలలో శాంత స్వభావుడుగా, సౌజన్యమూర్తిగా, వినయ సంపన్నుడుగా, నిష్కళంక జీవిగా ఆయన ఎంత చోటు చేసుకున్నారో లెక్కలేదు.

శ్రీ లాల్ బహదూర్ విశిష్ట వ్యక్తిత్వాన్ని నా సహాయ సంపాదకుడు శ్రీ తుర్లపాటి కుటుంబరావు ఈ చిన్ని పొత్తంలో కళ్ళకు కట్టినట్టు చూపించగలిగాడు. ఇది ఒక స్నేహితుని, ఒక సహచరుని రచన కాబట్టి, దీన్ని గురించి ఈ ఒక్క ప్రశంసా వాక్యాన్ని మించి నేను వ్రాయడం భావ్యంకాబోదు. (శ్రీ తుర్లపాటి కుటుంబరావు రచించిన శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి గ్రంథానికి నార్ల పరిచయ వాక్యాలు. 1966)

## శ్రీ వి.కె. కృష్ణమీనన్

పదవివల్ల వ్యక్తికి గౌరవమబ్బడం సర్వసామాన్యం. వ్యక్తిని బట్టి పదవికి ఖ్యాతి రావడం సకృతుగాగాని సంభవించదు. భారత మంత్రివర్గంలో శ్రీ వి.కె. కృష్ణమీనన్ నియామకం పైనుదహరించిన వాటిలో రెండవ కోవకు చెందుతుంది.



ఇంత స్వల్పకాలంలో ఇన్ని ఘనకార్యాలను సాధించడానికి, పండిట్ నెహ్రూకు అత్యంత విశ్వాస పాత్రుడు కావడానికీ, తన ప్రజ్ఞాప్రాభవంచే ప్రపంచ రాజ్యాంగవేత్తల ప్రస్తుతులను చూరగొనడానికి శ్రీ కృష్ణమీనన్కు గల అపార విద్యా పారంగత్వం, నిరంతర దేశసేవాపరత్వం, నిర్భయ చిత్తం, స్వతంత్ర వ్యక్తిత్వం, సామ్యవాద లక్ష్యం మొదలైన అనేక విశిష్టగుణాలు ఆయనకు తోడైనవి.

"లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్"లో, "లండన్ యూనివర్శిటీ కాలేజీ"లో, లండన్ మిడిల్ టెంపుల్లో విద్యాభ్యాసం ముగించి బారిస్టర్ పట్టా పుచ్చుకున్నా, శ్రీ కృష్ణమీనన్ దృష్టి న్యాయవాద వృత్తిచే ధన సంపాదనపైకంటే ప్రజాసేవపై, సాహిత్యకృషిపై, మాతృదేశారాధనల పైనే లగ్నమయింది. అందుచేతనే ఆయన 1929లో లండన్లోని ఇండియా లీగ్కు కార్యదర్శియై తద్వారా 1947లో ఇండియా స్వాతంత్ర్యం పొందే వరకు కూడా భారత విమోచనోద్యమానికి పలువిధాల పాటుపడినవాడు. జనసామాన్యంలో విజ్ఞాన విస్తరణకు ఉపకరించే "పెలికన్" పుస్తక ప్రచురణకు ప్రథమ సంపాదకుడు కావడమే కాక, స్వాతంత్ర్య మహోద్యమానికి సంబంధించిన అనేక రచనలకు సాయపడ్డాడు. బ్రిటిష్ కార్మికపక్ష వర్గాల్లో ప్రముఖపాత్ర వహించి సోషలిస్ట్ సిద్ధాంత ప్రచారానికి శ్రీ కృష్ణమీనన్ చేసిన కృషిని బ్రిటిష్ ప్రజలే గుర్తించారు. 1947లో లండన్లో ఇండియా హై కమిషనర్ పదవిలో ప్రవేశించేవరకు దాదాపు 15 సంవత్సరాలు సెంట్ పాంక్రాస్ బరో కౌన్సిలర్ పదవికి పెక్కు మారులు ఆయన ఎన్నుకొనబడడమే అందుకు నిదర్శనం.

ఇంతకాలం విదేశాల్లో గడిపినా, ఇన్ని రంగాలలో పాటుపడినా, ఇన్ని ఘనకార్యాలను సాధించి ఇంత ప్రతిష్ఠను గడిపినా శ్రీ కృష్ణమీనన్ నిరాడంబర జీవితం, ఆయన నైష్ఠికత్వం ఆయన మిత్రులకే అచ్చెరువు కలగజేస్తాయి. శ్రీ కృష్ణమీనన్ మాంసాహారి కాడు. వినోదం కొరకైనా మద్యం సేవించడు. పొగత్రాగడు. ఇన్నిమార్లు ప్రపంచ పర్యటన చేసినా మలయాళీల శాకాహారాలపైనే ఆయన కెక్కువ మక్కువ.

1947 ఆగస్టులో శ్రీ మీనన్ లండన్లో మొట్టమొదటి ఇండియా హైకమిషనర్ పదవికి నియమించబడినప్పుడు ఇండియా హౌస్ అలంకరణార్థం కళాభిజ్ఞులు సయితం మెచ్చుకొనదగిన విలువగల తివాచీలు, ఇతర అలంకరణాలు సమకూర్చాడు. హైకమిషన్ ఉద్యోగుల ఉపయోగం నిమిత్తం నవనాగరకమైన మోటార్ కార్లను తెప్పించాడు. కాని, తాను మాత్రం అంత ఉన్నత పదవి నాక్రమించికూడా ఇండియా హౌస్ లోని ఒక్క చిన్న గదిలోనే నివసించేవాడు. 59 సంవత్సరాల ప్రాయంగల శ్రీ కృష్ణమీనన్ నేటికీ అవివాహితుడు. హై కమిషనర్ ఉపయోగానికి రోల్స్ రాయిస్ కార్ ఉండినప్పటికీ తరుచుతాను బస్సుల లోనే ప్రయాణం చేసేవాడు.


శ్రీ కృష్ణమీనన్ మితభాషి. ఏకాంతవాసాన్ని కాంక్షిస్తాడు. అయినా, సమయం వచ్చినప్పుడు గంటల కొలది తెంపులేకుండా అనర్గళంగా ఉపన్యసించగలడు. రాయబారాలు నడపడంలో, సమాధానాలు సాధించడంలో అత్యంత చతురుడు. కాని, అవసరం కలిగినప్పుడు ప్రతివాద భయంకరుడు కాగలడు.

ఇంత దీర్ఘానుభవం, ఇంత ధీశక్తి, ఇంతటి దేశభక్తి, ఇంతటి ప్రతిభా సంపత్తిగల శ్రీ మీనన్ ప్రధాని నెహ్రూకు కుడిభుజంగా కేంద్ర ప్రభుత్వ మంత్రిపదవి నలంకరించడం అత్యంత సమంజసం.

(ఆంధ్రప్రభ 6-2-1956).

## శ్రీ కామరాజ్ నాడార్ - 1

విద్య, వివేకం ఒక్కటి కావు. ఉన్నత విద్య నభ్యసించిన వారిలోనే ఎందరు వివేక శూన్యులు




విద్య, సంస్కృతి ఒక్కటి కావు. పట్టభద్రులైన వారిలోనే సంస్కృతి విహీను లెందరు లేరు? విద్య, సభ్యత ఒక్కటి కావు. విదేశాలకు వెళ్ళి, ఆక్స్ఫర్డ్, కేంబ్రిడ్జి, సార్బోన్, కొలంబియా, హార్వర్డ్లను పోలిన ఏ ప్రపంచ ప్రసిద్ధ విశ్వ విద్యాలయంలోనో డాక్టరేట్ తెచ్చుకొన్న వారిలోనే సభ్యతావర్తన తెలియని వారెందరు లేరు?

విద్యాధికులు కాని వారైనా వివేకవంతులు కావచ్చు; సంస్కృతిపరులు కావచ్చు; సభ్యతా సంపన్నులు కావచ్చు, ఈ మాటలను శంకిస్తున్నారా? అయితే, శ్రీ కామరాజ్ను ఒకసారి మీరు గుర్తుకు తెచ్చుకోవచ్చు.

ఆయనకు డాక్టరేట్ లేదు; బి.ఏ., ఎం.ఏ. డిగ్రీలు లేవు; కనీసం ఆయన ఫెయిల్డ్ బి.ఏ. అయినా కారు. అయితే నేమి? శ్రీ కామరాజ్ను వివేకంలో, సంస్కృతిలో, సభ్యతలో మించగలవారెందరున్నారు? ఏ దేశంలోనైనా? ఈ కాలంలోనే కాదు, ఏ కాలంలోనైనా?

చదువు సంధ్యలు లేని వాడని శ్రీ కామరాజ్ను ఆక్షేపించేవారికి ఆయన "జీవితం" అనే యూనివర్శిటీలో డాక్టర్ డిగ్రీ పొందిన మేధాసంపన్నుడని తెలియదు. సంస్కృతికి, సభ్యతకు సంప్రదాయసిద్ధంగా పేరందిన కులాలలో శ్రీ కామరాజ్ జన్మించలేదని పెదవి విరిచేవారికి ఆయన ఆత్మవికాసాన్ని నిరోధించే సాంఘిక పరిస్థితులను ధిక్కరించగల ప్రతిభావంతుడని తెలియదు. అనామకుడైన ఒక కాంగ్రెసు వాలంటీర్ శ్రీ కామరాజ్ రాజకీయ జీవితాన్ని ప్రారంభించాడని చులకనచేసేవారికి అనంతర జీవితంలో విఖ్యాతి నందినవారిలో కింద మెట్టు నుంచి పైకెక్కి వచ్చిన వారెందరో కలరని తెలియదు.




ఆయనను, ఆయన మేధను, ప్రతిభను, దక్షతను గుర్తించలేక, శ్రీ కామరాజ్ తమిళనాడు కాంగ్రెసు అధ్యక్షుడైనప్పుడు, మద్రాస్ ముఖ్యమంత్రి పదవిని ఆయన స్వీకరించినప్పుడు, అఖిల భారత కాంగ్రెసు మహాసభ అధ్యక్షుడుగా ఆయన ఎన్నికైనప్పుడు "ఔరా?" అంటూ ముక్కుపై వేలు వేసుకున్నవారు "ఓహో!" అంటూ ఆ వేలును అక్కడే నిలపవలసి వచ్చింది!

శ్రీ కామరాజ్ ఈనాడు ఒక కాంగ్రెసు వలంటీర్ దళానికి మాత్రమే కెప్టెన్కాదు; కాంగ్రెసు మహాసంస్థకే ఆయన కెప్టెన్. అయిదారు నెలలనాడు దీన్ని అతిశయోక్తిగా కొట్టివేయడానికి సిద్ధపడిన వారైనా, అందుకు ఈనాడు సంకోచిస్తారు.

"నెహ్రూ తదనంతరం భారత ప్రభుత్వ నాయకుడెవరు?" అనే ప్రశ్న దాదాపు పది సంవత్సరాలపాటు ఎన్నిసార్లు వినరాలేదు? దేశ విదేశాలలో ఎంతగా వినరాలేదు? మన దురదృష్టవశాన నెహ్రూ నాయకత్వ భాగ్యాన్ని మనం కోల్పోయిన తర్వాత ఈ ప్రశ్నకు సమాధానాన్ని నిర్ణయించడానికి కాంగ్రెసు అధ్యక్షుడుగా శ్రీ కామరాజ్కు మూడు రోజులైనా పట్టలేదు! ఈ సందర్భంలో ఆయన చూపిన కార్యచతురత శతాబ్దాలకు విస్తరించిన పార్లమెంటరీ సంప్రదాయాలున్న బ్రిటిష్ వారినే ఆశ్చర్య చకితులను చేసింది! మాక్మిలన్ స్థానంలో కన్సర్వేటివ్ పార్టీ నాయకుడుగా మరొకరిని నిర్ణయించుకొనడంలో దీనిలో ఒక వీసంపాటి రాజకీయ

పరిణతినైనా తాము చూపలేకపోయినట్టు ఎన్నో బ్రిటిష్ పత్రికలు వ్యాఖ్యానించాయి. ప్రపంచం మన్ననలకే ఇంతగా శ్రీ కామరాజ్ను ఈనాడు పాత్రుని చేసింది ఆయన కార్యకుశలత మాత్రమే కాదు; ఆయన సద్గుణ సంపద కూడా. ఆయన బ్రహ్మచారి. వృద్ధామాత తప్ప, తాను పోషణ భారం వహించవలసినవారు ఆయనకు లేరు. వ్యక్తిగతమైన జీవితావసరాలు కూడా ఆయనకు తక్కువ. ఎవరైనా పెడితే, షడ్రసోపేతమైన భోజనం చేయడానికి ఆయన కభ్యంతరం లేదు; ఇడ్లిసాంబారులతో సరిపుచ్చుకో వలసి వచ్చినా ఆయన చికాకు పడరు. అయిదుమూర్ల పంచె, ఆఘారం, అంచుకమ్ములు లేని ఉత్తరీయం - వీటిని మించి ఆయనకు దుస్తులక్కరలేదు, సిగరెట్టునిస్తే వద్దనరు; అది లేకపోతే లేదన్న చింతలేదు. బ్యాంకిలో తమ పేర ఏమీ నిల్వలేకపోయినా, దాన్ని గురించి పట్టించుకొనరు. పదవిని నిర్వహించవలసి వస్తే అందుకు వెనుకాడడం

లేదు; దాన్ని విడిచిపెట్టడానికి ఒక క్షణం పట్టదు. ఈ సద్గుణ సంపన్నతే శ్రీ కామరాజు కామితార్థాలను దేశానికి కూర్చగల ఒక గొప్ప నాయకునిగా చేసింది! ఆయన 62వ జన్మ దినోత్సవ సందర్భంలో "ఆంధ్రజ్యోతి" పక్షాన ఈ అఖిలభారత నాయకునికి మా జోహారులు.

(ఆంధ్రజ్యోతి 16-7-1964)

## శ్రీ కామరాజ్ నాడార్ - 2

అది కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సభ్యుల ఏకగ్రీవాభిప్రాయం. అందువల్ల ఈసారి కాంగ్రెసు అధ్యక్ష పదవికి శ్రీ కామరాజ్ ఎన్నిక ఏకగ్రీవంగా జరగగలదనే భావించవచ్చు. ఒకవేళ ప్రత్యర్థిగా ఎవరైనా రంగంలో నిలవడం జరిగినా, అది పేరుకు మాత్రమే పోటీ కాగలదు.



కామరాజ్ పథకం తర్వాత శ్రీ కామరాజ్ యావద్భారత దృష్టిని విశేషంగా ఆకర్షిస్తున్నా, ఆయన నిశ్చల దేశభక్తిని గురించి, ఆయన నిరాడంబర జీవితాన్ని గురించి, ఆయన అనన్య త్యాగ నిరతిని గురించి, ఆయన అశేష కార్యదక్షతను గురించి, అన్నింటినీ మించి, సామాన్య ప్రజల కలలనే కాక, వారి కష్టసుఖాలను పంచుకొనడంలో ఆయన పట్టుదలను గురించి దక్షిణ భారతానికి కనీసం ఒకటిన్నర దశాబ్దంగా పూర్తిగా తెలుసు. 1954లో కాక, కోరితే 1946లోనే ఆయన ముఖ్యమంత్రి పదవికి రాగలిగి ఉండేవారు. 1941లో మొట్టమొదటి సారిగా తమిళనాడు కాంగ్రెసు అధ్యక్షుడుగా ఎన్నికైన నాటి నుంచి మద్రాసు రాష్ట్రంలో ఆయన మాటకు తిరుగులేదు; ఆయన నాయకత్వానికి ఎదురులేదు. అయినా, 1954 ఏప్రిల్ 13వ తేదీ వరకు ఆయన స్వయంగా ముఖ్యమంత్రి పదవిని స్వీకరించక పోవడానికి, నాడు స్వీకరించిన ఆ పదవిని 1963 అక్టోబర్ 2వ తేదీని ఆయన స్వచ్ఛందంగా విడిచిపెట్టడానికి కారణం - ప్రజాసేవకు మంత్రి పదవిని విధిగా అధిష్ఠించనక్కరలేదన్న ఆయన విశ్వాసమే!



"గాలికి పోతున్న పేలపిండి కృష్ణార్పణ" మన్న ధోరణిలో శ్రీ కామరాజ్ ముఖ్యమంత్రి పదవిని విసర్జించలేదు. ఆయనను ఆ పదవినుంచి కదలించగలవారు మరి కొన్నేళ్ళకు అప్పటి ఆ పరిస్థితులు ఏ విధంగా ఉండగలవో ఎవరు చెప్పగలరు గాని - ప్రస్తుతానికి లేరు. కాగా, "ఆడలేక మద్దెల వోదు" అనే ధోరణిలోనైనా ఆయన ముఖ్యమంత్రి పదవిని త్యజించలేదు. తనకంటే సమర్థుడైన ముఖ్యమంత్రి లేడని దేశం మొత్తం చేతనే మెప్పు పొందుతున్న ఘట్టంలో స్వచ్ఛందంగా ఆయన పదవీ పరిత్యాగం చేశారు.

ఉన్నత విద్య నభ్యసించలేదని, ఆంగ్లేయ భాషాపరిజ్ఞానమైనా లేదని, పరిపాలనానుభవం లేదని, ప్రపంచ జ్ఞానమైనా అతి పరిమితమని ఆయన ముఖ్యమంత్రి పదవిని స్వీకరించినప్పుడు ఆయన విరోధులు ఎంతగా విమర్శించలేదు? ఎంతగా పరిహసించలేదు? ఈ ప్రబుద్ధులకు అగ్బర్ చదువు సంధ్యలు లేనివాడని బహుశా జ్ఞప్తికి వచ్చివుండదు. శివాజీ దాదాపు నిశానీ పద్దు అనే సంగతి వీరికి బహుశా తెలిసి ఉండదు. హైదరాలీ పొట్టపొడిచినా అక్షరం ముక్క లేనివాడని, రంజిత్ సింగ్ కూడా చేవ్రాలు చేయలేనివాడని వీరు వినలేదేమో! విద్యకు, వ్యవహార దక్షతకు విధిగా ముడిపెట్టడానికి వీలులేదు. విద్యకు, శీలానికి అవినాభావ సంబంధం కలదని చెప్పడానికి సైతం వీలులేదు. పెద్ద చదువులు చదువుకొన్న వారిలోనే పనికిమాలిన దద్దమ్మ లెంతమంది లేరు? పెద్ద పెద్ద పట్టాలు పొందిన వారిలోనే బుద్ధిలేని వా రెంత మంది లేరు? చదువు వేరు, సామర్థ్యం వేరు; చదువు వేరు, సద్వర్తన వేరు - ఈ విషయాలను మరొకసారి లోకానికి ఇటీవల నిరూపించిన ఘనత కామరాజ్ గారిదే!



పదేళ్ళపాటు ముఖ్యమంత్రిగా ఉండి శ్రీ కామరాజ్ సాధించిన మన విజయాలను విపులీకరించడానికి ఇది సమయం కాదు. కాని, ఆయన పదవీ కాలంలో 16,000 ఎలిమెంటరీ స్కూల్స్, మరొక 12,000 హయ్యర్ ఎలిమెంటరీ స్కూల్స్ కొత్తగా ప్రారంభించబడినవని, మద్రాస్ రాష్ట్రంలో 6-14 సంవత్సరాలలోపు పిల్లలలో ఈనాడు స్కూలుకు వెళ్ళనివారు దాదాపు లేరని ఈ సందర్భంలో చెప్పాలి. సాలుకు దాదాపు పది లక్షల మంది రాష్ట్రంలో గల 2,000 హైస్కూల్స్లో చేరుతున్నారని, లక్షమంది స్కూల్ ఫైనల్ పరీక్షకు కూర్చుంటున్నారని చెప్పాలి. పోయిన పదేళ్లలో భారీ, మధ్యరకం పరిశ్రమలు వెయ్యింటికి పైగా (240 కోట్ల రూపాయల పెట్టుబడితో కొత్తగా నెలకొన్నవని చెప్పాలి. చిన్న వాటిని కూడా కలుపుకొన్న పక్షంలో కొత్త పరిశ్రమల సంఖ్య మూడు వేలకు తక్కువ కాదని చెప్పాలి. నూటికి దాదాపు 75 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సౌకర్యం మద్రాసు రాష్ట్రంలో ఈనాడు కలదని చెప్పాలి. ఒక్క పంజాబ్ను మినహాయిస్తే, ఇన్ని రంగాలలో, ఇంతగా పురోభివృద్ధిని సాధించిన రాష్ట్రం మరొకటి లేదని చెప్పాలి.

ఐతే, పంజాబ్లో కానరాని ఒక విశేషం మద్రాసులో కానవస్తుంది. ఆధార సహితమైనవో, రహితమైనవో మనకు తెలియదుగాని, పంజాబ్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు విశేషంగా ఉన్నాయి. మద్రాసు ప్రభుత్వం విషయంలో దాని ప్రతికక్షులైనా ఈ ఆరోపణలను బహుశా చేయలేరు. సామర్థ్యానికే కాక, ప్రతిభకేకాక, నీతికి, నిజాయితీకి పేరొందిన ప్రభుత్వాన్ని మద్రాసు రాష్ట్రానికి ప్రసాదించిన గౌరవం శ్రీ కామరాజ్ గారిది!

తన రాష్ట్రం తప్ప తన దేశం తప్ప శ్రీ కామరాజ్కు వేరే కుటుంబం లేదు. ప్రజల పురోగతి సాధన తప్ప ఆయనకు వేరే ధ్యాస లేదు. ఆయన తక్కువగా మాట్లాడటం ఎక్కువగా ఆలోచించడం కోసమే! ఆయన నిరాడంబరంగా జీవించడం ప్రజాసామాన్యానికి లేని సౌకర్యాలు తనకు అక్కరలేదనే! ఆయన పటాటోపానికి పోకపోవడం పనిచేసి చూపించడం ముఖ్యమనే!

పదవులు క్రమక్రమంగా కాంగ్రెసు నాయకులను ప్రజలకు దూరం చేస్తున్నవనే అనుమానం ఆయనకు కలిగింది. ప్రజాసేవకు ఒక అవకాశంగా మాత్రమే కాక, పదవిని దాన్ని అనుసరించివుండే పటాటోపం కోసమే కొందరు వాంఛిస్తున్నారన్న సంశయం ఆయనకు కలిగింది. మరొకరైతే ఈ సందేహాలను ఒక హెచ్చరికగా వెల్లడించి అంతటితో ఆగిపోయేవారే! శ్రీ కామరాజ్కు చెప్పడంతో తృప్తిలేదు; చేసి చూపించినప్పుడే తన బాధ్యతను పూర్తిగా నిర్వహించినట్టు ఆయన భావిస్తారు. అందువల్లనే "పదవికంటే ప్రజ ముఖ్య"మన్న ప్రాతిపదికపై ఆయన ఒక పథకాన్ని (ప్రస్తుతం "కామరాజ్ పథకం"గా చెల్లుతున్న దాన్ని) రూపొందించారు. ఆ పథకం కింద తానే ముమ్మందుగా పదవీ పరిత్యాగానికి ముందుకు వచ్చారు.

త్యాగం కాంగ్రెసు వాదులకు కొత్త కాదు. అయితే, త్యాగధర్మాన్ని ఈనాడు వారు కొంతవరకు విస్మరించారు. ప్రజలలో పూర్వపు బలాన్ని కొంత కోల్పోగా, పూర్వపు భక్తిని అంతకంటె చాలా హెచ్చుగా కాంగ్రెస్ పోగొట్టుకొనడానికి ప్రధాన కారణం కాంగ్రెసు వాదులలో త్యాగ నిరతి పలచబడిపోవడమే! తిరిగి కాంగ్రెసుకు ప్రజల భక్తి విశ్వాసాలను పూర్తిగా సంపాదించడానికి రక్షించబడిందే కామరాజ్ పథకం.



నేటి కొత్త పరిస్థితులలో ఒక పాత లక్ష్యాన్ని త్యాగనిరతి లక్ష్యాన్ని కాంగ్రెసు ముందు కామరాజ్ పథకం రూపంలో పెట్టిన శ్రీ కామరాజ్ను కాంగ్రెసు అధ్యక్షునిగా ఎన్నుకొనడం ఎంతో సముచితం కాగలదు. ఈ చర్య కాంగ్రెసు సంస్థ పునరుజ్జీవనకు, దాని పునరుద్దీపనకు విశేషంగా తోడ్పడుతుంది.

"ఇంగ్లీషు రాదు; హిందీ రాదు; శ్రీ కామరాజ్ కాంగ్రెసు అధ్యక్షుడుగా వ్యవహరించగలరా?" అని నవ్వేవారు కొంద రుండవచ్చు. వారి నవ్వు అసూయగానో, అబ్బురంగానో మారడానికి ఎంతో కాలం పట్టదు!

కొందరెవరో తన పేరును బహిరంగ సభావేదికల నుంచి ప్రతిపాదించగా, శ్రీ అతుల్య ఘోష్ వర్కింగ్ కమిటీ సమావేశంలో (ఇప్పటి అధ్యక్షులు శ్రీ సంజీవయ్యగారి అనుమతిపై) ప్రతిపాదించారు. శ్రీ కామరాజ్ చెప్పగోరిన అభ్యంతరాన్ని విననైనా వినకుండా ఆ ప్రతిపాదనను వర్కింగ్ కమిటీ సభ్యులందరు ఒక్కుమ్మడిగానే కాక, మిక్కుటమైన సంతోషంతో సమర్థించారు. వారితోపాటు ప్రజలందరు దీన్ని సమర్థిస్తున్నారు. కాంగ్రెసు అధ్యక్ష పదవికి శ్రీ కామరాజ్ ఎన్నిక నిరాడంబరత్వం ఎన్నిక కాగలదు; నీతి నిజాయితీల ఎన్నిక కాగలదు; నిస్వార్థ ప్రజాసేవ ఎన్నిక కాగలదు.

(ఆంధ్రజ్యోతి 11-10-1963)

## మహావ్యక్తి, మహావక్త : శ్రీ వి. ఎస్. శ్రీనివాసశాస్త్రి



గాంధీజీ చరిత్రాత్మకమైన ప్రజోద్యమాలను ప్రారంభించకముందు భారత రాజకీయాలలో లిబరల్ రాజకీయవేత్తలది పైచేయి. అది మేధావుల యుగం, విద్యావేత్తల యుగం, మహావక్తల యుగం. శ్రీ వి.ఎస్. శ్రీనివాసశాస్త్రి గాంధీజీ కంటె పదిరోజులే పెద్దవాడు. వారిరువురు సమవయస్కులే, సమకాలికులే, ఒకతరానికి చెందినవారే. ఇంతేకాదు, గాంధీజీ తనకు రాజకీయ గురువని ప్రస్తుతించిన గోఖలే శ్రీ శాస్త్రికి కూడా రాజకీయ గురువు. అయినా, శ్రీ శాస్త్రి, గాంధీజీల రాజకీయాలు విభిన్న పథాలకు చెందినవి కావడం ఒక విచిత్రం. గాంధీజీ ఒక నూత్న యుగానికే ప్రారంభకుడు కాగా, శ్రీ శాస్త్రి తన వెనుకటి తరం రాజకీయవేత్తల లిబరల్ వాదాన్ని చేపట్టారు.

భారత స్వాతంత్ర్యోద్యమం గాంధీజీ నాయకత్వం క్రిందికి వచ్చిన తర్వాత వెనుకటి తరంవారి రాజకీయాలను, ముఖ్యంగా వారి లిబరల్ వాదాన్ని ఈసడించడం ఒక ఫ్యాషన్ అయింది. ఈ ఫ్యాషన్ను గాంధీజీ ఎన్నడూ హర్షించలేదనుకోండి. అయినా రాజకీయ విభేదాల కారణంగా, శ్రీ శాస్త్రివంటి లిబరల్ వాదుల దేశభక్తి, ప్రజాసేవాతత్పరత, స్వార్థత్యాగం, సచ్ఛీలం, మేధాపాటవం మొదలైన మహనీయ గుణాలను ఆనాటివారు గుర్తించలేకపోవడం విచారకరమే.

డాక్టర్ రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించి, భారత రాష్ట్రపతి పదవి వరకు వెళ్ళినట్టు, శ్రీ శ్రీనివాసశాస్త్రి కూడా ఉపాధ్యాయుడుగానే ప్రారంభించి, ప్రీవీకౌన్సిల్ సభ్యత్వంవంటి ఉన్నత పదవులెన్నో అలంకరించారు. ట్రిప్లికేన్ హిందూ హైస్కూలు హెడ్మాస్టరుగా ఆయన పెక్కేళ్ళు పనిచేసి, విశేష ఖ్యాతి గడించారు. ఆ రోజులలో కాకినాడ పి.ఆర్. కాలేజి ప్రిన్సిపల్ పదవికి శ్రీ శాస్త్రి శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడుగారితో పోటీ చేశారట. కాని, చివరికి ఆ పదవికి నాయుడుగారు ఎన్నిక కావడం ఉభయులకు మేలే అయింది. నాయుడుగారు ఆ తర్వాత మద్రాసు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అయ్యారు. శ్రీ శాస్త్రి విద్యారంగాన్ని వదలి అంతకంటె విస్తృతమైన రాజకీయరంగంలోనికి వెళ్ళారు.

ఇదే విధంగా, శ్రీ గోఖలే మరణానంతరం సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీకి అధ్యక్షుడుగా ఎవరిని ఎన్నుకోవాలని ప్రశ్న వచ్చినప్పుడు గాంధీజీకి, శ్రీ శాస్త్రికి పోటీ రాలేదు గాని, బహుశా అంతపనీ జరిగేదేనేమో. అంతకుముందే సొసైటీ సభ్యత్వానికి గాంధీజీ దరఖాస్తు పెట్టుకోగా, సొసైటీ దాన్ని తిరస్కరించడం జరిగింది. గాంధీజీకి సభ్యత్వమిచ్చి వుంటే గోఖలే తర్వాత ఆయనే బహుశా అధ్యక్షుడై వుండేవారు. గాంధీజీకి ఆ అవకాశం తప్పిపోవడం, శ్రీ శాస్త్రి ఆ సొసైటీకి అధ్యక్షుడు కావడం ఉభయులకు మేలే అయింది. శ్రీ శాస్త్రి ప్రతిభా విశేషాలు సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీలో ఎంతగానో రాణించాయి. కాని, గాంధీజీ ప్రజ్ఞా ప్రాభవాలకైతే ఆ సొసైటీ పరిమిత పరిధిలో రాణింపు వచ్చేదికాదనే చెప్పాలి. ఎందుకంటే వారిరువురి ధ్యేయం మాతృదేశ స్వాతంత్ర్యమే. అయినా, వారు అనుసరించిన మార్గాలు భిన్నమైనవి.

శ్రీ శాస్త్రి పేరు చెప్పగానే ఎవరికైనా జ్ఞప్తికి వచ్చేది ఆయన అసాధారణ వక్తృత్వం. అది డాక్టర్ రాధాకృష్ణన్ వక్తృత్వం వలె అనర్గళమైంది కాకపోవచ్చు. ఒకసారి ఢిల్లీలో ఆనాటి బ్రిటిష్ ప్రధాని యాంథొనీ ఈడెన్ డాక్టర్ రాధాకృష్ణన్ ప్రసంగం విన్న తర్వాత తాను మాట్లాడడానికి జంకుతున్నానని అన్నాడు. శ్రీ శ్రీనివాసశాస్త్రి ఇంగ్లీషు ఉపన్యాస శక్తి కూడా అంతటిదే. మహామహులైన బ్రిటిష్ వక్తలను, విద్వాంసులను ఆయన తన ప్రసంగాలతో సమ్మోహితులను చేశారు. అయితే, ఆయన నెమ్మదిగా ఆచి తూచి మాట్లాడేవారు; ఉదాత్త, అనుదాత్త స్వరసహితంగా, ఒకసారి గొంతు హెచ్చించి బిగ్గరగా, మరొకసారి రహస్యం చెబుతున్నంత నెమ్మదిగా మాట్లాడేవారు.



శ్రీ శాస్త్రి సంస్కృతంలో, ఇంగ్లీషులో మహా విద్వాంసుడు. విద్వత్తుతోపాటు ఆయన ప్రసంగాలలో సాహిత్యపు విలువలు వుండేవి. ఇంగ్లీషువారు కూడా ఆశ్చర్యపోయేంతగా ఆయన ప్రసంగాలలో ఇంగ్లీషు నుడికారపు సొంపులు కనబడేవి. వ్యాకరణం పట్ల ఆయన శ్రద్ధాసక్తులు, దానిలో ఆయన పాండిత్యం అమోఘమైనవి. ఒకసారి ఆయన గాంధీజీ ఇంగ్లీషు వాక్యాలలో వ్యాకరణ దోషాలను గాంధీజీకే చూపించారట. తాను హెడ్మాస్టరుగా వుండగా ఒకసారి థామస్ గ్రే "ఎలిజీ"ని పాఠం చెబుతూ, దానిలో ఒకచోట ఒక వ్యాకరణ దోషాన్ని శ్రీ శాస్త్రి పట్టుకున్నారట. ఇంగ్లీషు పట్ల దేశంలో వైముఖ్యం, నిరాదరణ పెరుగుతున్న ఈ రోజులలో శ్రీ శాస్త్రి ఇంగ్లీషు భాషా పాండిత్యంగాని, ఆ భాషలో ఆయన వక్తృత్వ ప్రతిభగాని పెద్ద విశేషాలుగా తోచకపోవచ్చు. కాని, మన మాతృభాషలపట్లనైనా మనమీనాడు ఏపాటి శ్రద్ధాసక్తులను చూపిస్తున్నాము? భారతీయుడై వుండి శ్రీ శ్రీనివాస శాస్త్రి విదేశ భాష అయిన ఇంగ్లీషుపై ఇంగ్లీషు వారికే ఆశ్చర్యం కలిగించే

విధంగా అధికారం సంపాదించడానికి చేసిన కృషిలో శతాంశమైనా మనం మన మాతృభాషల విషయంలో చేయగలిగితే మన విద్యా ప్రమాణాలు ఈనాటివలె పడిపోయేవా?

శ్రీ శాస్త్రి తరంవారి విద్యావిద్వత్తుల సంగతి అలా వుంచండి. వారి విశుద్ధ జీవనం, నిజాయితీ, నిరాడంబరత, త్యాగశీలం, సేవాతత్పరత వంటి సద్గుణాలైనా ఈ తరం వారిలో కానరావడంలేదు. ఇవి లేకపోవడమే ప్రజా నాయకత్వానికి ఒక అర్హత అయినదా అనిపించే దౌర్భాగ్యస్థితి దాపురించడం మన దురదృష్టం. శ్రీ శాస్త్రి శతజయంతి సందర్భంలో ఆయనను స్మరించడం ద్వారానైనా ఆయన జీవితాశయాలను, ఆయన పాటించిన విలువలను జ్ఞాపకం చేసుకొనడం మన విధి. (ఆంధ్రజ్యోతి 23-9-1969)

## యుగకర్త: శ్రీ రాజా రామమోహన్ రాయ్ - 1



షేక్స్పియర్ను మహాకవిగా టాల్ స్టాయ్ గుర్తించనట్టే, రాజా రామమోహన్ రాయ్ ని మహాపురుషుడుగా గాంధీజీ గుర్తించలేదు. గొప్పవారు కూడా అప్పుడప్పుడు పప్పులో అడుగువేస్తారని చెప్పడానికి ఇంతకంటే చక్కని నిదర్శనం ఉంటుందా?

రామమోహన్ రాయ్ ఘనతను గుర్తించలేనివారు మరికొందరు కూడా లేకపోలేదు. పాషండుడని, సగం క్రైస్తవుడని, భారతీయ సంస్కృతి పట్ల ద్రోహం తలపెట్టినవాడని ఆయనను వారు తెగనాడారు. అయితే వారైనా ఆయనను, గాంధీ వలె, “అంగుష్ఠమాత్రుని”గా (“పిగ్మీ”గా) అభివర్ణించలేదు. దుష్టులలో మహాదుష్టుడుగానైనా ఆయన ఘనతను వారు గుర్తించారు.

రామమోహన్ రాయ్ పై గాంధీజీ విసిరిన విసురు టాగోర్కు కోపం తెప్పించింది, బాధ కలిగించింది, ఆయన హృదయాన్ని బలంగా గాయపరచింది. “భారతదేశంలో తొలి ఆధునిక మానవుడు”గా (First modern man in India) తాను సంభావిస్తున్న విప్లవకారుని, విశిష్ట మానవుని, విశ్వకల్యాణ కాంక్షిని అంగుష్ఠమాత్రునిగా విమర్శించడం దుస్సహం కాగా, గాంధీజీని ఖండిస్తూ టాగోర్ ఒక పెద్ద ప్రకటన చేశాడు. అందుపై వారిద్దరి మధ్య తర్జనభర్జనలు తీవ్రంగా జరిగాయి.

ఈ వాద ప్రతివాదాల తర్వాత కూడా రాయ్ విషయంలో స్వాభిప్రాయాన్ని గాంధీజీ మార్చుకొనకపోయినా సత్యంవలె చరిత్ర కూడా టాగోర్ పక్షాన ఉన్నదని నిష్పాక్షికులందరి తీర్పు. రాయ్ అంగుష్ఠమాత్రుడు కాదు; ఆయన ఆకాశాన్ని అంటగలపాటి మహోన్నతుడు! ఆయన జయంతి సందర్భంలో ఈనాడు (మే 22వ తేదీని) భారత ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక తపాలా బిళ్ళను విడుదలచేయడం సంతోషించదగు విషయం.

1774లో రాధానగర్ (పశ్చిమ బెంగాల్) లో జన్మించి, 1832లో బ్రిస్టల్లో కీర్తిశేషుడైన రాయ్ జీవిత చరిత్రకు సంబంధించిన వివరాలను కొన్నింటిని నేడు సంస్మరించుకొనడం సముచితం కాగలదు. భావదాస్యంనుంచి, మత మౌఢ్యాలనుంచి, మృత సంప్రదాయాలనుంచి, నిర్వీర్య నిస్తేజాల నుంచి భారతజాతిని సముద్ధరించడానికి ఆయన చేయని త్యాగం లేదు, పడని కష్టాలు లేవు, జరపని యుద్ధాలు లేవు.

తండ్రి రమాకాంత్ సంపన్న గృహస్థుడు (ఆయనొక చిన్న జమీందారు); తల్లి తారిణీదేవి తనను బహిః ప్రాణంగా భావించుకొన్నది. చాలా చిన్నతనంలోనే తాను మాతృభాష బెంగాలీలో, అప్పటి రాజభాష పర్ష్యన్లో పాండితిని గడించుకొన్నాడు. పిదప పాట్నాకు వెళ్ళి అరబిక్ భాషను నేర్చుకొన్నాడు. తర్వాత సంస్కృతాన్ని అభ్యసించి, వేదవేదాంగాలను మథించడం జరిగింది. ఇన్ని భాషలలో, ఇన్ని విద్యలలో తాను పండితుడైంది పదహారేళ్ళు నిండీ నిండకముందే! కోరితే, తనకు పెద్ద ఉద్యోగమే లభిస్తుంది; కోరినంత సంపాదనకు వీలున్నది.

అయినా, తన దృష్టి ఉద్యోగాల వైపు, సంపాదన వైపువెళ్ళనే లేదు; అది మత సంస్కరణ వైపు మళ్ళింది. అరబిక్ పీఠికతో, పర్ష్యన్ భాషలో విగ్రహారాధనను ఖండిస్తూ తానొక గ్రంథం వ్రాసి ప్రచురించాడు. దానితో తండ్రితో కలహం; తల్లినుంచి యెడబాటు; సత్యాన్వేషణకై, జ్ఞానాభివృద్ధికై దేశాటనం! నాలుగేళ్లపాటు కొనసాగిన ఈ పర్యటన దేశం నలుమూలలకే కాక, టిబెట్కు కూడా తనను తీసుకువెళ్ళింది. అక్కడ కూడా విగ్రహారాధనకు వ్యతిరేకంగా ప్రచారం; దాని మూలంగా తనకు ప్రాణాపాయం; ఒక పుణ్యాత్మురాలు రక్షించగా గండం తప్పించుకొని, స్వదేశానికి పునరాగమనం. తనకై పరితపిస్తున్న తండ్రితో రాజీ; ఆయన పట్టుదలపై వివాహం.

ఈ ఘట్టంలో పాశ్చాత్య భాషలపై తన దృష్టి వెళ్ళడం; ఇంగ్లీషు, గ్రీక్, లాటిన్, హీబ్రూ భాషలను క్షుణ్ణంగా నేర్చుకొనడం. తిరిగి విగ్రహారాధనపై తన దండయాత్ర; ఈసారి శాశ్వతంగా పితృగృహం నుంచి బహిష్కరణ. కుటుంబ పోషణకై రంగాపూర్ కలెక్టరేట్లో కొలువు. ఈనాడు జిల్లా కలెక్టర్కుండే హోదాతో త్వరలోనే దివాన్ పదవికి ప్రమోషన్. పదేళ్ళ తర్వాత ఈ పదవినుంచి విరమణ. పిమ్మట కొంతకాలానికి ఢిల్లీ పాదుషాచే "రాజా" బిరుద ప్రదానం. అసంపూర్ణంగా విడిచి పెట్టిన మత సంస్కరణకై 1814లో తన నలభయ్యో యేట కలకత్తాకు మకాం మార్పు. నాటి నుంచి, అవసాన ఘడియల వరకు అన్ని విధాల మౌఢ్యాలపై అహోరాత్రాలు తీవ్ర సమరం.



అంధ విశ్వాసాల స్థానంలో హేతు దృష్టిని, భావదాస్యం స్థానంలో స్వతంత్రాలోచనను ప్రవేశపెట్టడమే రాయ్ జీవిత ధ్యేయం; స్తబ్ధమైపోయిన జాతీయ జీవనవాహినిని తిరిగి ప్రవహింపజేయాలని ఆయన తపన; పురాణ యుగంనుంచి అధునాతన యుగంలో భారత జాతిని ప్రవేశపెట్టించాలని ఆయన పట్టుదల.

సమకాలిక సంఘం ఎంతగా ప్రతిఘటించినా, తనను హతమార్చడానికై ఎందరెంతగా ప్రయత్నించినా వెనుదీయక, రామమోహన్రాయ్ సాధించిన ముఖ్య సంస్కరణలలో మొట్టమొదటిది ఏకేశ్వరోపాసనతో కూడిన కొత్త మతాన్ని నెలకొల్పడం; రెండవది సతీ సహగమనాన్ని బహిష్కరింపచేయడం; మూడవది సంస్కృత పాఠశాలల స్థానంలో ఇంగ్లీషు బోధనాభాషగా గల విద్యాలయాలను స్థాపింపజేయడం.



వీటిలో మూడవ సంస్కరణను గురించి మాత్రమే ఇక్కడ ముచ్చటించగోరుతున్నాము. సంస్కృత భాష గొప్పదే కావచ్చు. గీర్వాణ భాషగా దానికి గౌరవ స్థానం ఉండవచ్చు. అయినా, అది పండితుల భాష. దాన్ని క్షుణ్ణంగా నేర్చుకొనవలెనంటే, ప్రత్యేక ప్రజ్ఞానిధులను విడిచిపుచ్చితే, మిగిలినవారు ఒక జీవిత కాలాన్ని వినియోగించాలి. ఇంత కష్టపడి నేర్చుకొన్నా, దానిద్వారా అలవరచుకొనగల ఆధునిక పరిజ్ఞానం సున్నకు సున్న, హళ్ళికి హళ్ళి. దానిలో మౌలిక రచన, విశేషించి, వైజ్ఞానిక శాస్త్ర రచన - వెయ్యేళ్ళ ఈ మధ్య జరగలేదు. అది అందించేది పాతకాలపు విద్య. అది ప్రోత్సహించేది వెనుకచూపు. దాన్ని నమ్ముకొంటే, భారతదేశం ఆధునిక యుగంలో పాదం పెట్టడం కల్ల.

ఈ పరమవిశ్వాసంతో ఇంగ్లీషు బోధనా భాషగా గల విద్యాలయాల సంస్థాపనకై నిరంతరాందోళన చేసి, తన వాదాన్ని రామమోహన్ రాయ్ నెగ్గించుకోగలిగాడు. ఈనాడు మన జాతికి ఏ స్వల్పంగానైనా ఆధునిక దృష్టికలదంటే, మన దేశంలో ఏ స్వల్పంగానైనా ఆధునిక విజ్ఞానం ప్రబలినదంటే, అది ఆయన ప్రేమతో మనకు పెట్టిన భిక్షే! అందువల్లనే ఆయనను టాగోర్ "భారతదేశంలో తొలి ఆధునిక మానవుడు"గా కీర్తించాడు!

ఢిల్లీ పాదుషా తరఫున ఈస్ట్ ఇండియా కంపెనీకి ఏదో విజ్ఞాపన సమర్పించి, ఆయనకు న్యాయం చేకూర్చడానికై బ్రిటన్ వెళ్ళి, ఆ ప్రయాణం నుంచి స్వదేశానికి తిరిగి రాకుండా బ్రిస్టల్లో కీర్తిశేషుడైన రాయ్ తన అవసానదశను పాదుషా సేవకు మాత్రమే వినియోగించలేదు. అక్కడ ఉండగా ఇండియాలోని రెవెన్యూ విధానంలో, న్యాయ విధానంలో జరగవలసిన సంస్కరణలను గురించి ఆయన ఆందోళన చేశాడు. పత్రికా స్వాతంత్ర్యం విషయమై కూడా ఆందోళన చేశాడు.

ఆనాడే ఆయన భారత స్వాతంత్ర్యాన్ని గురించి కలలుకున్నాడు. బ్రిటన్కు వెడుతూ ఉండగా ప్రయాణం మధ్యలో ఒక ఫ్రెంచి నౌక ఎదురువస్తున్నట్టు ఆయన విన్నాడు. అస్వస్థతతో లోపల పరుండి ఉన్న రాయ్ తనను మంచంతోనే ఎత్తి, "డెక్" పైకి తీసుకువెళ్ళ వలసిందిగా పట్టుపట్టి, ఫ్రెంచి నౌకపై ఉన్న త్రివర్ణ పతాకకు - స్వాతంత్ర్యం, సమత, సౌభ్రాత్రం లక్ష్యత్రయానికి - - సంకేతమైన త్రివర్ణ పతాకకు - చేయెత్తి భక్తితో

నమస్కరించాడు. ఆ లక్ష్యాలకే సంకేతంగా భాసిస్తున్న మరొక త్రివర్ణ పతాకకు ఈనాడు మనం ప్రణమిల్లగలగడం ఆ మహామహుడు ప్రారంభించిన మహా తపస్సు ఫలితంగానే!


(ఆంధ్రజ్యోతి 24-5-1964)

## రాజా రామమోహన్ రాయ్ -2

రాజా రామమోహన్ రాయ్ ద్విశతజయంతి విషయమై మన రాష్ట్ర ప్రభుత్వం ఏమీ పట్టించుకొనబోవడంలేదని స్పష్టపడిపోయింది. ఆ జయంతి ఈ నెల 22వ తేదీనే అయినా, ఇంత వరకు ఈ విషయంలో కదలని ప్రభుత్వం ఇక కదలగలదని అనుకోనక్కరలేదు.

మేము ఇదివరలోనే ఒక సంపాదకీయంలో హెచ్చరించినట్లు, ప్రభుత్వం ఈ జయంతిని నిర్లక్ష్యంచేసినా, ప్రజలు చేయరాదు, ప్రజా సంస్థలు చేయరాదు.

రాజా రామమోహన్ రాయ్ జీవితకాలంలో అన్ని మతాలకు చెందిన ఛాందసులు ఆయనను విమర్శించారు, దూషించారు. విగ్రహారాధనను ఖండించినందుకు హిందువులు, బైబిల్ లోని "మిరకిల్స్"ను త్రోసిపుచ్చినందుకు క్రైస్తవులు, అన్యమతాలపట్ల సహనం తక్కువ కావడం ఇస్లాంలో ఒక లోపమని చెప్పినందుకు ముస్లిములు ఆయనను కంటగించుకున్నారు. వీరిలో మొదటి మతంవారి దృష్టిలో ఆయన పాషండుడు; రెండవ మతం వారి దృష్టిలో కాఫిర్. తక్కినమతాల వారిద్దరు ఇట్టి నిందతోనే సరిపుచ్చగా, మొదటి మతంవారు ఆయనను వెలివేశారు; ఆయనను కొట్టించడానికి, చంపించడానికి కూడా ప్రయత్నం చేశారు.




ఈ విధంగా అన్ని మతాలలో ఛాందసులకు ఆయన ఎంత దుష్టుడైనా, దేశదేశాలలోని మానవతావాదులకు ప్రగతికాములకు ఆయన ఒక మహా పురుషుడు. ఇండియాలోనే కాక, బ్రిటన్లో, యునైటెడ్ స్టేట్స్, ఫ్రాన్స్లో, లాటిన్ అమెరికాలో ఆయన ఘనతను గుర్తించినవారు ఎందరో ఉన్నారు. ప్రగతిని కాంక్షించినందునే ప్రతీప శక్తులపై ఆయన యుద్ధాన్ని ప్రకటించారు. మానవాభ్యున్నతిని కోరినందునే ఆయన ప్రతి మౌఢ్యంపై, ప్రతి దురాచారంపై, ప్రతి నిరంకుశ శక్తిపై కత్తిదూశారు.

ఆయన సంస్కృతం, ఆరబిక్, పర్షియన్, ఇంగ్లీషు భాషలలో పండితుడు. గ్రీక్, హీబ్రూ భాషలు కూడా ఆయనకు తెలుసు. బెంగాలీ ఆయనకు మాతృ భాష. ఈ అన్ని భాషల ద్వారా ఆయన చాటిన సందేశం ఒక్కటే అది మధ్య యుగం అంధకారం నుంచి మనం బయటపడాలని, ఆధునిక యుగంలో పాదం పెట్టాలని, అందువల్లనే రవీంద్రనాథ్ టాగోర్ ఆయనను "ఆధునిక భారత వర్ష జనకుడు"గా కీర్తించారు.

ఆధునిక యుగంలో మనం పాదం పెట్టాలంటే ఆధునిక భావాలను ఆస్వాదించాలి, ఆధునిక వైజ్ఞానిక శాస్త్రాలను అభ్యసించాలి. ఆధునిక సాంఘిక, రాజకీయ వ్యవస్థలను నిర్మించుకోవాలి. ఇది జరగడం మన చిత్తవృత్తిలో మార్పు వచ్చినప్పుడే. ఈ మార్పును సాధించడానికే ఆయన జీవించారు, ఇందుకోసమే ఆయన మరణించారు.

అయినా, ఆయన జీవితకాలంలో కంటె ఈనాడే ఆధునిక చిత్తవృత్తి మరింత తక్కువగా ఉన్నట్లు తోస్తున్నది. దుస్తులలో, అలవాట్లలో, చదువులలో, పరిసరాలలో ఆధునికత కొల్లలు; చింతనలోనే అది దాదాపు పూజ్యం. ఇందువల్లనే సైన్సు చదువులు పెరుగుతున్నా, ఛాందసాలు తరగడంలేదు, పెద్ద పెద్ద సైంటిస్టులుగా చెల్లుతున్నవారే ఈ స్వామికి, ఆ స్వామికి భక్తులు కావడం, పాదాభివందనం చేయడం చూస్తున్నాము. ఈ ఘోర పరిస్థితులు మారనంతవరకు, ఆధునిక చిత్తవృత్తి మనలో పెంపొందనంత వరకు ఒక ప్రజగా, ఒక దేశంగా మనకు వాస్తవమైన ప్రగతిలేదు, ఉజ్వలమైన భవిష్యత్తు లేదు.

ఆయన జీవితకాలంలో కంటె ఈనాడు రాజా రామమోహన్ రాల్తో, ఆయన సందేశంతో శతాధికంగా అవసరం ఉన్నది. ఈ సంగతిని జ్ఞాపకం తెచ్చుకొనడానికైనా ప్రగతి కాములందరు ఈ నెల 22వ తేదీని రాయ్ ద్విశత జయంతి సభలను శ్రద్ధాసక్తులతో జరపాలి.

(ఆంధ్రజ్యోతి 22-5-1972).

## యుగకర్త: శ్రీ రాజా రామమోహన్ రాయ్ - 3



రాజా రామమోహన్ రాయ్ పేరైనా మనం వినలేదా? ఒకవేళ వినివుంటే, దాన్ని పూర్తిగా మరచిపోయామా?

ఈ సందేహాలు మాకు అకారణంగా కలగడం లేదు. రామమోహన్ రాయ్ ద్విశత జయంతిని జరపడానికి ఇతరులు ఆయత్తపడుతున్నారు. మన ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఒక్క మన రాష్ట్రంలోనే కొద్దిమంది బ్రహ్మ సామాజికులు తప్ప మరెవ్వరు దీన్ని గురించి పట్టించుకొనడంలేదు.

రామమోహన్రాయ్ కేవలం బ్రహ్మసమాజ సంస్థాపకుడు మాత్రమే కాదు. ఆయన నవభారత జనకుడు. రవీంద్రనాథ్ టాగోర్ అన్నట్టు, మన దేశంలో ఆధునిక యుగాన్ని ప్రవేశపెట్టింది ఆయనే. కేవలం మన దేశానికే కాదు. మొత్తం ఆసియాకే ఆయన ఆధునిక యుగ వైతాళికుడు. మధ్యయుగంనుంచి ఆధునిక యుగంలో యూరపను పాదం పెట్టించడంలో మార్టిన్ లూథర్, లార్డ్ బేకన్ల పాత్రకంటె ఆసియాలో రామమోహన్ రాయ్ పాత్ర అధికమైనట్టిది, కీలకమైనట్టిది.

రామమోహన్ రాయ్ మనదేశంలో జన్మించిన మహాపురుషులలో మొదటివాడు కాడు. చివరివాడు కాబోడు కూడా. కాని, అనేక విషయాలలో ఆయనకు ఆయనే సాటి. కాలావధులను దాటి, దేశావధులను దాటి, ఆయన దృష్టి వెళ్ళింది. అన్ని మౌఢ్యాలకు, క్రౌర్యాలకు, నైచ్యాలకు అతీతంగా నిలవగల మానవుని గురించి ఆయన కలలు కన్నాడు. జాతి, మత, కులాది కృత్రిమ విభేదాలకు అతీతంగా నిలవగల నవ మానవ సమాజ నిర్మాణానికి ఆయన తపనబడ్డాడు. మానవతే ఆయన మతం; ఏక ప్రపంచమే ఆయన గమ్యం.

అది విద్యా సంస్కరణ కానివ్వండి. సంఘ సంస్కరణ కానివ్వండి. మత సంస్కరణ కానివ్వండి. మరొక సంస్కరణ కానివ్వండి - రామమోహన్ రాయ్ దేన్ని ప్రారంభించినా, దానికి ప్రేరణ ఆయన మానవత నుంచే వచ్చింది. దానికి బలం ఆయన ఏక ప్రపంచం లక్ష్యంనుంచే వచ్చింది. ఆయన కాలంలో దేశాలమధ్య సరిహద్దులను చెరిపివేస్తున్న విమానాలు, రేడియోలు, టెలివిజన్లు మొదలైనవి లేవు. అయినా, ఆ కాలంలోనే ఆయన ఏక ప్రపంచ లక్ష్యాన్ని గురించి ప్రబోధం చేశాడు, విశ్వనరుని అవతరణకై తపస్సు చేశాడు.

ఇంతటి మహాపురుషుని ద్విశత జయంతిని గురించి మన రాష్ట్రంలో బ్రహ్మ సమాజికులను మినహాయించి ఇతరులకు శ్రద్ధాసక్తులు ఎంత మాత్రం లేకపోవడం తగునా? మన రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర నాయకులు ఈ విషయమై ఏమీ పట్టించుకొనకపోవడం తగునా?

ఇప్పటికే ఎక్కువ విలంబన జరిగినా, తరుణం మించిపోలేదు. రామమోహన్ రాయ్ జన్మదినం ఈ నెల 22వ తేది. మూడు వారాలలోనైనా ఆయన ద్విశత జయంతిని సముచితంగా జరుపుకొనడానికి మనం సన్నాహాలు సన్నాహాలు చేయలేమా? ఇందుకు ప్రభుత్వం ముందుకురాకపోతే, కనీసం ప్రజలైనా, ప్రజాసంస్థలైనా తమ కనీసపు ధర్మాన్ని పాటించవలదా? చేయలేమా?

ఎంత ఎత్తున ఈ జయంతిని మనం జరుపుకొనగలమనేది ముఖ్యంకాదు; ఎంత చిత్తశుద్ధితో దీన్ని జరుపుకొనగలమనేదే ముఖ్యం. రామమోహన్ రాయ్ సందేశంతో మనకు అక్కర తీరలేదు. ఆయన మనలో, మన సంఘంలో, మన దేశంలో ఏయే మౌఢ్యాలను చూచి, దౌర్బల్యాలను చూచి, నైచ్యాలను చూచి ఆవేదన పడినాడో, అవి ఆయన జీవిత కాలంలో కంటే ఈనాడే అధికంగా వున్నాయి. అందువల్ల ఆయన సందేశాన్ని ఒకసారి జ్ఞాపకం తెచ్చుకొనడానికి, ఆయన చూపిన దారివెంట నడవడానికై మరొకసారి తీర్మానించు కొనడానికి ఆయన ద్విశత జయంతిని మనం చిత్తశుద్ధితో వినియోగించుకోవాలి.

(ఆంధ్రజ్యోతి 8-5-1972)

# మహనీయుడు శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య



"వ్యక్తి పెరగనిదే జాతి పెరగదు"

"శీలంలేని వ్యక్తి ప్రజా విశ్వాసానికి పాత్రుడు కాలేదు".

"జాతీయ శీలాన్ని పెంచడానికి మనకు దీర్ఘకాలిక ప్రణాళిక కావాలి"

"శీలం లోపించినా, క్రమశిక్షణ కొరవడినా, కార్యదక్షత విధిగా కుంటుపడుతుంది." "విద్య ప్రజాబాహుళ్యానికి పూర్తిగా విస్తరించనిదే జాతీయాభ్యున్నతి లేదు."

ఇవి శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య "మెమాయిర్స్ ఆఫ్ మై వర్కింగ్ లైఫ్" అనే పేరుతో 1951 ఏప్రిల్లో ప్రచురించిన గ్రంథంలోని సుభాషితాలు. ఆయన శతజయంతి మహోత్సవాన్ని పురస్కరించుకొని, ఒక నిష్కళంక దేశభక్తునిగా, ఒక ప్రముఖ జాతీయ నిర్మాతగా నేడు ఆయనకు యావద్భారత దేశం ప్రేమానురాగాలతో, భక్తి శ్రద్ధలతో నమస్కరిస్తున్నదంటే, ఈ సుభాషితాలలో ప్రతి ఒక్కదాన్నీ ఆయన తన జీవితంలో కార్యరూపాన పెట్టడానికి అహర్నిశలు చిత్తశుద్ధితో కృషి చేసినందుననే.

శ్రీ విశ్వేశ్వరయ్య జీవిత విశేషాలను, ఆయన గుణగణాలను నిన్న "టీకాటిప్పణీ" శీర్షికకింద వివరించినప్పటికీ, ఆయన నడచిన బాటలో నడవడానికి ప్రతి భారతీయ పౌరుడు - విశేషించి, ప్రతి ప్రభుత్వోద్యోగి, ప్రతి ప్రజా నాయకుడు - శక్తివంచనలేకుండా ప్రయత్నించకపోతే, మన దేశానికి పురోగతి లేదని హెచ్చరించడానికి నేటి ఈ సంపాదకీయాన్ని వ్రాస్తున్నాము.

సమగ్రదృష్టి శ్రీ విశ్వేశ్వరయ్యలో కానవచ్చే మొదటి వైశిష్ట్యం. ఆయన శిక్షణ పొందింది ఇంజనీర్గా, ఉద్యోగిగా చేరింది పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంటులో. అయినా, ఆయన పరిశీలించని జాతీయ సమస్యలేదు, పరిష్కారమార్గాన్ని సూచించనట్టిది కూడా లేదు; ఇంతటి సమగ్రదృష్టి కలవాడు గనుకనే, 1909లో మైసూరుకు చీఫ్ ఇంజనీర్ పదవిని స్వీకరించవలసిందిగా మహారాజా వద్ద నుంచి ఆహ్వానం వచ్చినప్పుడు "కేవలం చీఫ్ ఇంజనీర్ గానే నా సేవలను వినియోగించుకొన గోరుతున్నారా? పరిశ్రమలను పెంపొందించడం, సాంకేతిక విద్యను.

వ్యాపింప జేయడం మొదలైన ఇతర సమస్యలపట్ల ప్రభుత్వానికి ఆసక్తిలేదా? ఇట్టి విస్తృతరంగంలో నేను పనిచేయడానికి అవకాశాలిస్తారా?" అని ఆయన ప్రశ్నించారు. పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంట్లో చీఫ్ ఇంజనీర్ పదవి చిన్నది కాకపోయినా, అంతకంటే విస్తృత రంగంలో పనిచేయడానికి సమ్మతి లభించిన మీదటనే కాని శ్రీ విశ్వేశ్వరయ్య మహారాజా ఆహ్వానానికి సమ్మతించలేదు.

తర్వాత మూడేళ్లకు - 1912లో దివాన్ పదవిని స్వీకరించవలసిందిగా మైసూరు మహారాజా తనను కోరినప్పుడు కూడా దైనందిన పరిపాలనా వ్యవహారాలకు తన కాలాన్ని, తన శక్తిని కొంతవరకు వృథా పుచ్చడంకంటె, విద్య, పరిశ్రమలు మొదలగువాటిని పెంపొందించడంకోసం తనను ప్రభుత్వ కార్యవర్గంలో సభ్యునిగా చేస్తే సరిపోదా అని ఆయన అడిగాడు!

పదవిని - అది చిన్నది కానివ్వండి; పెద్దదికానివ్వండి - ప్రజాసేవకు కేవలమొక సాధనంగా మాత్రమే చూడగల విశ్వేశ్వరయ్యలు ఒక వందమంది మన దేశంలో తలయెత్తినా, దేశపురోగతి శతముఖాలుగా - సహస్రాధికంగా - కొనసాగదా? -



ఉద్యోగ ధర్మ నిర్వహణలో ఆది నుంచీ ఉత్తమ ప్రమాణాలను నెలకొల్పినవాడు శ్రీ విశ్వేశ్వరయ్య. 1884లో బొంబాయి రాష్ట్రంలో అసిస్టెంట్ ఇంజనీర్గా చేరిన కొత్తలోనే ఒక కాల్వ పని చేయిస్తున్నప్పుడు అక్కడి నదికి పెద్ద వరద వచ్చి, తన కార్యస్థానానికి చేరుకొన లేకుండా ఆవలిగట్టున ఆయన చిక్కుకొనడం తటస్థించింది. అప్పుడు ఆ నదిని ఈది, తిరిగి కార్యస్థానం చేరుకొనేవరకు ఆయనకు నిద్రపట్టలేదు! అటుపిమ్మట పెక్కు పట్టణాలకు మురుగు కాల్వల సౌకర్యాలను కల్పించే బాధ్యతను స్వీకరించిన ఘట్టంలో విదేశాలు ఇందుకు అవలంబించిన పద్ధతులను తెలుసుకొనడానికి మిలాన్, డూబెల్ డార్ఫ్, లండన్లో, పారిస్లో ఆయన స్వయంగా మురుగు కాల్వలోనికి - కొన్ని సందర్భాలలో 80 అడుగుల లోతువున్న కాల్వలలోకి - దిగి చూచాడు. ఇట్టి కర్తవ్య నిష్ఠచూపగల ఉద్యోగ బృందం లేనిదే ఏ దేశమైనా ముందుకు రాగలదా?




మురుగు కాల్వలకు సంబంధించిన పని అధమమైనదని భావించక, సమర్థంగా దాన్ని నిర్వహించిన కర్మయోగి కనుకనే ఎన్నో హైడ్రో - ఎలక్ట్రిక్ స్కీములను, పెద్ద పెద్ద కర్మాగారాలను, మైసూరు విశ్వవిద్యాలయం సమేతంగా అనేక విద్యా సంస్థలను తన చేతిపైగా ఆయన పూర్తిచేయించ గలిగాడు; ఈ సందర్భంలో ఆయన వ్యక్తిగతమైన త్యాగం చేసిన ఘట్టాలనేకం. ఉదాహరణకు, ఆరున్నర సంవత్సరాలపాటు "మైసూర్ ఐరన్ అండ్ స్టీల్ వరు"కు ఆధ్వర్యం వహించినందుకు తనకు రావలసిన ప్రతిఫలాన్ని పూర్తిగా ఆయన విరాళంగా యిచ్చినందునే బెంగుళూరులోని సాంకేతిక విద్యా సంస్థకు పునాదు లేర్పడినాయి!

శ్రీ విశ్వేశ్వరయ్య కర్మిష్ఠి మాత్రమే కాదు; ద్రష్ట కూడా. “ప్లానింగ్” లేనిదే ఇండియాకు పురోగతి లేదని ఏనాడో ఆయన ఉద్ఘాటించారు. ఆర్థికంగా దేశం కోలుకొనకపోతే, నైతిక పునరుద్ధరణ.

అసాధ్యమని ఆది నుంచీ ఆయన నమ్మకం. విద్యా వ్యాప్తికి ఆయన విశేష ప్రాధాన్యమిచ్చిందికూడా ప్రస్తుతపు యంత్రయుగంలో - వైజ్ఞానిక యుగంలో - విద్యలేని జాతికి, ప్రత్యేకించి, సాంకేతిక విద్య లేని జాతికి, భవిష్యత్తు లేదన్న విశ్వాసంతోనే, మైసూరు విశ్వవిద్యాలయాన్ని ప్రశాంతమైన ప్రదేశంలో పెట్టక, ఒక పట్టణంలో, ప్రజా సందోహం మధ్య సంస్థాపించినారన్న విమర్శకు సమాధానంగా ప్రజలతో, ప్రజా సమస్యలతో నిత్య సంబంధం పెట్టుకొనని విద్య దేనికని ఆయన సమాధానమిచ్చారు!

శ్రీ విశ్వేశ్వరయ్య, రెండేళ్లనాడు ఇదేవిధంగా శతజయంతిని జరుపుకొన్న ఆచార్య కార్వే ప్రభృతులు కొందరు ఈ దేశంలో వర్ధిల్లుతున్నారు కాబట్టే, ఈ జాతికి భవిష్యత్తు కలదనే ఆశకు - నిరాశను, నిస్పృహను కలిగించే అనేక దుష్టపరిణామాల మధ్య కూడా - ఎప్పటికప్పుడు బలం చేకూరుతూ వుంటుంది.

(ఆంధ్రజ్యోతి 16-9-1960)

## శ్రీ కె. నటరాజన్

కొంతవరకు మన వీరేశలింగం పంతులుగారితో పోల్చదగినవాడు మొన్న పరమపదించిన శ్రీ కె. నటరాజన్.

ఆయనవలె ఈయనకూడా సత్యవ్రతుడు; ఆయనవలె ఈయనకూడా నిర్భీకుడు; ఆయనవలె ఈయన కూడా సంఘ సంస్కరణాభిలాషి.

అయితే, ఈ పోలిక దాదాపు ఇంతటితోనే సరి.

వీరేశలింగం పంతులుగారు సంఘానికీ, దేశానికీ శ్రీ నటరాజన్ కంటె ఎన్నో ఎక్కువ రంగాలలో ఎక్కువగా సేవ చేసినట్టివారు. ఇంతేకాదు. ఆయన ఒక మహాశక్తి అయితే, ఈయన ఒక దీపకళిక మాత్రం.

అంచేతనే పంతులుగారి జీవితం ఒక పెద్ద వరదవలె గడిచింది. ఆ వరద ఎన్నో గట్లను ఆనవాలు లేకుండా తెగనరికివేసింది; ఎన్నో చెట్లను కూకటి వ్రేళ్లతో పెరికి వేసింది. అయితే మాత్రమేమి? కొట్టివేసిన పాతగట్ల బదులు కొత్త వాటిని పెట్టింది; పెరికి వేసిన పాత చెట్లు పెరిగినచోట కొత్తమొక్కలు ఏపుగా పెరిగిరావడానికి సారవంతమైన ఒండ్రును మిగిల్చి పోయింది.

పంతులుగారి జీవితం పెద్ద వరద వంటిదైతే, శ్రీ నటరాజన్ జీవితం ఒక చిన్న సరస్సు వంటిది. అది ఎన్నడు గట్లను తెంచుకోలేదు. ఎన్నడు దానిలో అంత పెద్ద కెరటాలైనా లేవలేదు. సేదతీర్చుకొనగోరి దగ్గరికి వచ్చిన వారికి అది తన జలాలనిచ్చింది, అంతే.

వీరిద్దరు సంఘ సంస్కరణాభిలాషులైనా, ఒకరు దిద్దినంతగా మరొకరు సమకాలిక సంఘానికి రూపాన్ని దిద్దలేక పోవడానికి కేవలం వీరి ప్రవృత్తులలోని, ప్రజ్ఞా విశేషాలలోని వ్యత్యాసమే కారణం కాదు. వీరి కార్యాచరణ పద్ధతులు కూడా ఇందుకు చాలా వరకు కారణమే.

వీరేశలింగం పంతులుగారు శ్రీ నటరాజన్వలె "ఇది తప్పు; అది ఒప్పు" అని చెప్పడంతో సంతృప్తి చెందేవారు కాదు; తప్పును తెగనాడడంతోపాటు; ఒప్పును గద్దెనెక్కించడానికి కృషి చేసేవారు. దీనితో ఆయన ధర్మవాది మాత్రమే కాక, కార్యవాదికూడా కాగలిగాడు. ఇక, శ్రీ నటరాజన్ కేవలం ధర్మవాది మాత్రం.

పైగా, పంతులుగారు పుస్తకాలు వ్రాసినా, పత్రికలు నడిపినా అన్నీ తన మాతృభాష తెలుగులోనే, అంచేత ఆయనకు ప్రజాసామాన్యంతో అనుక్షణం సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఇట్టి సంబంధం విదేశ భాష ఇంగ్లీషులోనే అన్ని రచనలను సాగించినందువల్ల శ్రీ నటరాజన్కు సాధ్యపడలేదు.

ఈ ఉభయులను ఇంతదూరం మేము పోల్చడం వీరు దాదాపు సమకాలికులైనందువల్లనే; వీరుభయులు ప్రధానంగా సంఘ సంస్కరణను లక్షించినవారు కావడంవల్లనే. అంతేగాని వీరిలో ఒకరిని కించపరచడంకోసం కాదు.

"ఇండియన్ సోషల్ రిఫార్మర్" పత్రికకు ఇంచుమించు అర్ధ శతాబ్దం పాటు సంపాదకుడుగా పనిచేసి, తన శక్త్యానుసారం శ్రీ నటరాజన్ మన సంఘాన్నతికీ, దేశాభ్యున్నతికీ తోడ్పడ్డాడు. "వీరు ఆనందిస్తారా? లేక, వారు ఆగ్రహిస్తారా?" అనే ఆలోచన ఏ కోశానా లేకుండా, తాను నమ్మినదాన్ని నమ్మినట్టు ఆయన వ్రాస్తుండేవాడు.

తనది అరణ్యరోదనమై పోతున్న సమయాలలో కూడా తాను ధర్మమని విశ్వసించినదాన్ని ఉద్ఘాటించడంలో ఆయన వెనుదీయలేదు. అందువల్లనే ఆయన పత్రికకు పెద్ద ప్రచారం లేకపోయినా, విజ్ఞలోకం దానిపట్ల చాలా భక్తి శ్రద్ధలను ప్రదర్శిస్తుండేది.

ఈ వయోవృద్ధుడు, ఈ జ్ఞాన వృద్ధుడు మనకు చేసిన సేవను మరచిపోతే, అది మహాపచారమే కాగలదు.

(ఆంధ్రప్రభ 2-5-1948)

# ఇద్దరు సంపాదకులు

## (శ్రీ జి.ఎ. నటేశన్, మిస్టర్ ఎస్.ఎ. బ్రెల్వీ)

ఒకేనాడు మనదేశం ఇద్దరు పత్రికా సంపాదకులను కోల్పోయింది. పండినపండువలె శ్రీ జి.ఎ. నటేశన్ రాలిపోగా, కాలం నిండకముందే మిస్టర్ యస్.ఎ. బ్రెల్వీ కన్నుమూశాడు. వీరిద్దరు దేశభక్తులే; వీరుభయులు జాతీయవాదులే. అయితే, వీరి దేశభక్తిలో, వీరి జాతీయతలో తర, తమ భేదాలున్నాయి. ఒకరికి స్వాతంత్ర్యం వాంఛనీయంకాగా, మరొకరికి పారతంత్ర్యం దుస్సహం. స్వాతంత్ర్యం వాంఛనీయం కావడానికి, పారతంత్ర్యం దుస్సహం కావడానికి భేదం లేనట్టు స్థూలదృష్టికి కానరావచ్చు. కాని, ఒకటి వేచివుండగల కోర్కె, రెండవది భరించ నలవిగాని బాధ. అందువల్లనే మొదటిదానిలో లేని తీవ్రత, దానిలో లేని ఉద్విగ్నత, రెండవ దానిలో ప్రస్ఫుటమౌతుంది. ఉభయులు దేశభక్తులైనా, ఉభయులు జాతీయవాదులైనా, వారి మనస్తత్వాలలో గల భేదమే ఒకరు (శ్రీ నటేశన్) మితవాది కాగా, రెండవ వారు (మిస్టర్ బ్రెల్వీ) కాంగ్రెస్ వాది కావడానికి కారణమైంది.

మితవాదానికి సహజమైన మందగమనంతో శ్రీ నటేశన్ జీవితవాహిని ప్రవహించింది. అది ఎన్నడు ఉరకలెత్తలేదు; సుడులు తిరగలేదు; గట్టులను ఒరుసుకోలేదు; కట్టలను త్రెంచుకోలేదు. ఎటు పల్లం కనబడితే అటువైపుకే అది ప్రవహించింది; ప్రవహించిన మేరను సారవంతం చేయడానికి యత్నించింది.

ఇక, మిస్టర్ బ్రెల్వీ కాంగ్రెస్వది అయినందుకు, ప్రతి కాంగ్రెస్వేది బ్రతుకులోని ఒడుదుడుకులే ఆయన జీవితంలోకూడా కానవచ్చాయి. అది ఒక్కొక్కప్పుడు ఆశలలో ఉప్పొంగింది, ఒక్కొక్కప్పుడు నిస్పృహతో క్రుంగింది, ఒక్కొక్కప్పుడు త్రుళ్ళింతలాడుతూ ముందుకు సాగింది, ఒక్కొక్కప్పుడు ప్రవాహం స్తంభించి పోయినట్టే నిలిచిపోయింది. అది గంభీరవాహిని అయినా, ప్రశాంతి నెరుగదు. అహరహ పురోగమనమే దాని విశిష్టత. సమీపించిన కొలదీ దాని సంగమస్థానం దూరమైపోతూవుంటుంది.

తక్కిన మితవాదులకు శ్రీ నటేశన్ కొంతవరకు భిన్నుడైనట్టే, తక్కిన కాంగ్రెస్ వాదులకు మిస్టర్ బ్రెల్వీ సయితం భిన్నుడే.

రాజకీయ విశ్వాసాలలో విభేదాలు పెక్కుమంది మితవాదులను కాంగ్రెస్ వారికి విరోధులను చేసినవి, కాని, శ్రీ నటేశన్ వ్యక్తిగ సంబంధ బాంధవ్యాలకు రాజకీయ విశ్వాసాలలో విభేదాలను ఎన్నడు ప్రతిబంధకం కానివ్వలేదు. అన్ని పక్షాల వారికి ఆయన ఆత్మీయుడే. రైట్ ఆనరబుల్ శ్రీనివాసశాస్త్రికి ఆయన శిష్యుడైతే, గాంధీమహాత్మునికి మిత్రుడు.

ఇదే విధంగా మిస్టర్ బ్రెల్వీ కూడా కాంగ్రెస్ వారికివలె, కాంగ్రెసేతరులకు సయితం విశ్వాసపాత్రుడే; గౌరవభాజనుడే, గాంధీజీ ప్రేమను చూరగొనగలిగినట్టే మిస్టర్ జిన్నా స్నేహాన్ని సయితం ఆయన నిలుపుకోగలిగాడు.

కాంగ్రెసుకు, లిబరల్ ఫెడరేషన్కు సన్నిహితత్వం కూర్చడానికి శ్రీ నటేశన్ ప్రయత్నించి వుండకపోవచ్చు. కాని, కాంగ్రెసుకు, ముస్లిం లీగ్కు ఒడంబడిక సాధించడానికి మిస్టర్ బ్రెల్వీ శక్తివంచనలేని కృషి జరిపాడు. అది ఫలించక పోవడం పరిస్థితుల ప్రాతికూల్యంవల్లనేగాని, ఆయన ప్రయత్న లోపంవల్ల కాదు.

నిజానికి విభేదా లేమి, వివాదాలేమి మిస్టర్ బ్రెల్వీ నవనీత హృదయాన్ని వ్యధ పెట్టేవి. జీవిత లక్ష్యాల విషయంలో, సూత్రాల విషయంలో ఆయన రాజీకి ఒప్పుకునేవాడు కాదు. కాని, అన్యవిషయాలలో విభేదాలు ఆయనకు అసహ్యం; వివాదాలు ఆయనకు దుస్సహం. అందువల్ల విభేదాలను తొలగించడానికే, వివాదాలను పరిష్కరించడానికే ఆయన పూనిక చూపేవాడు.

సంకుచిత విభేదాలు వెన్నెలను కురియించే ఆయన చిరునవ్వులకు సిగ్గిలిపోయేవి; అకారణ వివాదాలు అమృతోపమానమైన ఆయన ఆలింగనానికి కరిగిపోయేవి.

శాంతస్వభావులని, వినయ భూషణులని, సౌజన్యయుతులని ఉభయులు పేరందినవారే. ఉభయులు నిష్కళంకంగా జీవించి, ధన్యులనిపించుకున్నవారే.

ఇతర రంగాలలోవలె జర్నలిజం ద్వారా వీరు దేశానికి చేసిన సేవ సామాన్యమైనదికాదు.

“మోడరన్ రివ్యూ” పటుత్వం “ఇండియన్ రివ్యూ”కు లేకపోవచ్చు. "హిందూస్థాన్ రివ్యూ" పాండితి దానికి లేకపోవచ్చు. "త్రివేణీ" కళా దృష్టి దానికి కొరవడవచ్చు. అయినా, శ్రీ నటేశన్ స్థాపించి, వృద్ధాప్యకారణంగా విరమించ వలసి వచ్చే వరకు, స్వయంగా నిర్వహించిన “ఇండియన్ రివ్యూ” తక్కిన పత్రికలలోని నిగ్గును ఒకచోటికి చేర్చడం ద్వారా తనకు ఒక ప్రత్యేకస్థానాన్ని గడించుకున్నది.

మోతీలాల్ ఘోష్ ప్రౌఢిమ, సురేంద్రనాథ్ బెనర్జీ పదగుంభన, సి.వై. చింతామణి పాండిత్య ప్రకర్ష బి.జి. హార్నిమన్ వైవిధ్యం, పోథన్ జోసెఫ్ చతురత, ఖాసా సుబ్బారావు భావోద్విగ్నత, కోటంరాజు రామారావు గడసరితనం, యం. చలపతిరావు నిశితత్వం మిస్టర్ బ్రెల్వీలో కానరాకపోవచ్చు. కాని, ఆయన రచనలుకూడా ఆయనవలెనే సౌజన్య విలసితం, సుహృద్భావపూర్వకం. విమర్శించినప్పుడు సయితం అవి మనస్సును గాయపరిచేవి కావు; ప్రతిఘటించినప్పుడు సయితం అవి ప్రతీకారేచ్ఛను ప్రజ్వలింపజేసేవి కావు.

ఒకేనాడు ఈ ఇద్దరు ప్రముఖ సంపాదకులను దేశం కోల్పోవడం అత్యంత శోచనీయం.

(ఆంధ్రప్రభ 11-1-1949)

వివరణ : మోడరన్ రివ్యూ, ఇండియన్ రివ్యూ, హిందుస్థాన్ రివ్యూ 20వ, శతాబ్ది రెండవ పాదంలో ప్రసిద్ధి చెందిన ఆంగ్ల మాసపత్రికలు.

## అసాధారణ వ్యక్తి : ప్రొఫెసర్ ప్రశాంతచంద్ర మహ్లనోబిస్



అసాధారణ వ్యక్తి ప్రొఫెసర్ ప్రశాంతచంద్ర మహ్లనోబిస్ ఒక అసాధారణ వ్యక్తి మొన్న కలకత్తాలో కాలధర్మం చెందిన ప్రొఫెసర్ ప్రశాంతచంద్ర మహ్లనోబిస్, పేరుకు తగినట్లు ఆయనది ప్రశాంత ప్రవృత్తి కాదు. దానిలో సుడిగుండా లుండేవి. తుఫానులుండేవి, అగ్నిపర్వతాలుండేవి.

ఇట్టి ప్రవృత్తి కారణంగా ఆయనకు మిత్రులు, భక్తులుండేవారు; లేదా, విరోధులుండేవారు. మొదటి వర్గంవారు ఆయనను భూషించగా, రెండవవర్గంవారు ఆయన "భజన ప్రియు"డని విమర్శిస్తూ వుండేవారు.

అయితే, ఆయన విరోధులైనా ప్రొఫెసర్ మహ్లనోబిస్ మేధాశక్తిని, బహుముఖ ప్రతిభను కాదనలేదు. ఆయన కేంబ్రిడ్జిలో అభ్యసించినట్టిది గణితశాస్త్రం, కలకత్తా యూనివర్శిటీలో బోధించింది పదార్థ విజ్ఞానశాస్త్రం; ప్రపంచ విఖ్యాతిని గడించింది సాంఖ్యక శాస్త్రవేత్తగా. 1933లో కలకత్తాలో ఆయన సంస్థాపించిన "ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్ స్టిట్యూట్" అతిత్వరలో అంతర్జాతీయ ప్రతిపత్తిని ఆర్జించుకోగలిగింది.

రవీంద్రనాథ్ టాగోరు ప్రొఫెసర్ మహ్లనోబిస్ అంటే ప్రేమాదరాలు, ఆయన ప్రముఖుడైన బ్రహ్మసమాజికుని పుత్రుడన్న కారణానే కాదు; ఒక ఘట్టంలో తనను దాదాపుగా వెలివేసినంత పనిచేసిన సాధారణ బ్రహ్మసమాజంతో తిరిగి తనకు సన్నిహితత్వం నెలకొల్పిన కారణానే కాదు; 1926లో తాను యూరొప్ పర్యటన చేసినప్పుడు తనతో తనవెంట వచ్చినాడన్న కారణానే కాదు. ఇందుకు అన్యకారణాలు కూడా అనేకం వున్నాయి.



పెక్కువైజ్ఞానిక శాస్త్రాలలో పాండిత్యంతోపాటు సాహిత్యాభిరుచులున్నవాడు ప్రొఫెసర్ మహ్లనోబిస్, బెంగాలీలో ఆయన వ్యాసాలు వ్రాశాడు. ఇతర రచనలను కొనసాగించాడు.

ఎన్నదగు రచయిత కాబట్టే టాగోర్ను పోలిన మహాకవికే రెండు రచనల సందర్భంలో మహ్లనోబిస్ సలహాలు చెప్పగలిగాడు.

జలియన్ వాలాబాగ్ దురంతాల పట్ల తన తీవ్ర నిరసనను వ్యక్తం చేయడానికి 1919లో టాగోర్ తన "సర్" బిరుదాన్ని త్యజించారు. ఆ సందర్భంలో నాటి వైస్రాయి లార్డ్ ఛెమ్స్ ఫర్డ్ పేర

టాగోర్ వ్రాసిన చారిత్రక లేఖకు తుది రూపాన్ని దిద్దడంలో మహ్లనోబిస్కు కొంత ప్రమేయం వున్నది. అటు తర్వాత కొంతకాలానికే టాగోర్ జపాన్లో పర్యటిస్తూ జాతీయతలోని సంకుచితత్వాన్ని నిశితంగా ఖండించారు. అప్పటిలో ఆయన చేసిన ప్రసంగాలకు మహ్లనోబిస్ ప్రేరణ కొంత వున్నది.



మహనోబిస్ పట్ల ప్రేమతోపాటు గౌరవం కూడా వున్నందునే విశ్వభారతి నిర్వహణలో తనకు చేదోడువాదోడుగా వుండవలసిందిగా ఆయనను విశ్వకవి కోరాడు. మహ్లనోబిస్ సంస్థాపించిన సంస్థ నిర్వహణలో తాను స్వయంగా పాల్గొనకపోయినా, దాని పత్రికకు "సాంఖ్య" అనే పేరును టాగోర్ సూచించాడు. మామిడితోపులో మహ్లనోబిస్ కొత్త ఇంటిని కట్టుకున్నప్పుడు దానికి “ఆమ్రపాలి ” అని నామకరణం చేసిందికూడా తిరిగి ఆయనే.

టాగోర్ ప్రేమగౌరవాలకువలె జవహర్లాల్ నెహ్రూ గౌరవాభిమానాలకు మహ్లనోబిస్ పాత్రుడైనాడు. పంచవర్ష ప్రణాళికల స్వరూపస్వభావాల నిర్ణయంలో మహనోబిస్ సలహాలను నెహ్రూ పొందడం కొందరికి నచ్చలేదు. ఆయన ప్రగతిశీల దృక్పథం గలవాడు కాబట్టి నెహ్రూను ఆయన అపమార్గంలో, కమ్యూనిస్ట్ పంథాలో నడుపుతున్నాడని విమర్శలు వచ్చినరోజులున్నాయి.

ఇంతటి అసాధారణ వ్యక్తి వృద్ధాప్యంలో చనిపోయినా - చనిపోయిన నాటికి ఆయన వయస్సు 79 సం॥రాలు - అది మనకు విచారకారణం. ఆయనతోగాని, ఆయన సేవలతోగాని మనకు, మనదేశానికి అక్కర పూర్తిగా తీరలేదు.

## విశ్వకవి : కాళిదాసు




కాళిదాసు ఏకాలంవాడు? క్రీస్తుకుపూర్వమే ఆయన వర్ధిల్లినాడా? లేక, క్రీస్తు తర్వాతనా? భోగలాలసుడైన అగ్నివర్మ మరణంతో రఘువంశం అంతమైపోలేదు. అయినా, కాళిదాసు మహాకావ్యంగా రూపొందించిన రఘువంశ చరిత్ర అగ్నివర్మ నిర్యాణంతో ఆకస్మికంగా సమాప్తి చెందుతున్నది. ఈ కారణాన కాళిదాసు అగ్నివర్మ సమకాలికుడనీ, క్రీస్తుకు పూర్వం ఎనిమిదవ శతాబ్దంవాడని తీర్మానించుకొనవచ్చునా?

"మాళవికాగ్నిమిత్ర " భరతవాక్యానికి శుంగ రాజవంశానికి చెందిన అగ్నిమిత్రుడు ఆ నాటక రచనాకాలంనాడు పరిపాలన చేస్తున్నట్టుగా మనం అర్థం చెప్పుకొనడానికి కొంత వీలున్నది. ఇంతేకాక, ఇప్పటి వార్ధాకు, ఉజ్జయినీనగరానికి మధ్య ప్రాంతాన్ని "మేఘదూతం"లో వర్ణిస్తూ, విదిశానగరప్రసక్తి తెచ్చి, ప్రపంచ ప్రసిద్ధ రాజధానిగా కాళిదాసు దాన్ని ప్రశంసిస్తాడు. తన ప్రత్యేకాభిమానానికి పాత్రమైన నగరం కాకపోతే, అగ్నిమిత్రుని ప్రభుత్వకేంద్రంగా తప్ప, ఇతర విధాల అంత ప్రసిద్ధిలేని ఈ విదిశానగరాన్ని కాళిదాసు ఎందుకు ప్రశంసిస్తాడు? ఈ రెండు విషయాలను పురస్కరించుకొని ఆయన, క్రీస్తుకు పూర్వం రెండవ శతాబ్దానికి చెందినవాడని సిద్ధాంతీకరించవచ్చునా?

అభిజ్ఞాన శాకుంతలాన్ని ఓం ప్రథమంగా ఇంగ్లీషులోకి అనువదించిన సర్ విలియం జోన్స్ అభిప్రాయం ప్రకారం కాళిదాసు విక్రమశకాన్ని ప్రారంభించిన విక్రమాదిత్యుని ఆస్థానకవి. "జ్యోతిర్విద్యాభరణమ్" అనే గ్రంథం కాళిదాసు రచన అని కొందరి మతం. విక్రమాదిత్యుని పోషణలో నవరత్నాలను పోలిన మహాకవులు తొమ్మిదిమంది వుండేవారని అది చెబుతున్నది. ఆ తొమ్మిదిమంది కవులలో ఒకడు కాళిదాసు కావచ్చునని సర్ విలియం ఊహ. కాని, విక్రమాదిత్య శకం క్రీస్తుకుపూర్వం 56 వ సంవత్సరంలో ప్రారంభం కాగా, "జ్యోతిర్విద్యాభరణమ్"లో అటువెనుక చాలా కాలానికి జరిగిన కొన్ని సంఘటనల ప్రసక్తివున్నది. ఆ గ్రంథం పేర్కొన్న తొమ్మిదిమంది కవులలో ఏ యిద్దరూ సమకాలికులని చెప్పడానికి ఎంతమాత్రం వీలు కనబడదు. అయినప్పుడు, సర్ విలియం సిద్ధాంతాన్ని ఎలా అంగీకరించడం? ఇక, ఎ.బి.కీత్ అభిప్రాయంప్రకారం కాళిదాసు విక్రమాదిత్య శకాన్ని ప్రారంభించిన విక్రమాదిత్యుని కాలంవాడు కాక, "విక్రమాదిత్య" అనే బిరుదనామం గడించుకొన్న రెండవ చంద్రగుప్తుని ఆస్థానకవి. "విక్రమోర్వశీయం"లోని "విక్రమ"శబ్దం, "కుమారసంభవం"లోని "కుమార"శబ్దం రెండవ చంద్రగుప్తుని బిరుదనామాన్ని, యువరాజు కుమారగుప్తుని నిజ నామధేయాన్ని తలపింపజేస్తున్నాయన్న వాదం కేవలం ఊహాగానం కానక్కరలేదు. పైగా, అశ్వఘోషుడు, భాసుడు తమ నాటకాలలో వాడిన ప్రాకృతం కంటె నిశ్చయంగా అర్వాచీనమైన దాన్ని కాళిదాసు తన నాటకాలలో వినియోగించాడు. దీన్నిబట్టి కూడా అశ్వఘోషునికి, భాసునికి కాళిదాసు

తదుపరివాడని, బహుశా ఆయన క్రీస్తు తర్వాత నాల్గవ శతాబ్దానికి చెందినవాడని కీత్ చెప్పిన మాటను అంగీకరించవచ్చునా?




ఈ సిద్ధాంతాలన్నింటికి భిన్నంగా ఒక జనశ్రుతి వెడుతున్నది. దీని ప్రకారం క్రీస్తు తర్వాత పదకొండవ శతాబ్దంలో ధారానగరం రాజధానిగా పరిపాలించిన భోజరాజు ఆస్థానంలోనివాడు కాళిదాసు మహాకవి.

ఈ విధంగా కాళిదాసు కాలాన్ని గురించి ఎన్ని సిద్దాంత రాద్ధాంతాలున్నవో లెక్కలేదు. ఆయన ఏ ప్రాంతానికి చెందినవాడనే విషయమై కూడా అన్నీ వివాదాలే! ఈ వివాదా లన్నింటిని పండితులకే విడిచి పెట్టడం ఉత్తమం. మనకు సంబంధించినంతవరకు కాళిదాసు ఏదో ఒక కాలానికి కాక, అన్ని కాలాలకూ చెందినవాడు ! ఏదో ఒక ప్రాంతానికి కాక, సమస్త ప్రపంచానికే చెందినవాడు. "అభిజ్ఞాన శాకుంతలం" మూలాన్ని చదువుకొనలేకపోయినా, ఇంగ్లీషు అనువాదం నుంచి జరిగిన జర్మను అనువాదాన్ని చదివిన గొథే మహాకవి "స్వర్గ, మర్త్య లోకాలను ఒక ముడిలోకి తీసుకురాగల నాటకం శకుంతల" అన్నాడు.

అందరు రసజ్ఞులు, ఎవరు ఏ దేశంవారైనా, ఎవరు ఏ కాలంవారైనా, కాళిదాసును ఈ విధంగానే గౌరవిస్తారు.

ఇట్టి విశ్వకవి కాళిదాసుకు ఉజ్జయినిలో నిర్మించనున్న స్మారక చిహ్నం బాధ్యతను ఒక్క మధ్యప్రదేశ్ ప్రభుత్వమే పూర్తిగా వహించడం తగదనీ, ప్రతి రాష్ట్రం ఇందుకు కాన్కలను సమర్పించాలనీ నెహ్రూ మొన్న చేసిన సూచన ఎంతైనా సముచితం.

## గురుదేవుడు శ్రీ రవీంద్రనాథ్ టాగోర్



పూర్ణ మానవుల కోవలోనివాడు మన గురుదేవుడు. ఆయన కలం కదిలించితే కలస్వనాలు పులకించినవి; గొంతు విప్పితే కోటి కిన్నెరలు చలియించినవి; కుంచె గిలికితే వంపులు, సొంపులు తీర్చుకున్నవి. ఆయన అమృత మూర్తి.

ప్రకృతి సౌందర్యంతో తన్మయుడై పోయినా, వికృతజీవుల ఘోష ఆయనకు వినిపించింది. ధవళదుకూలాల మడతలలో తేలియాడినా, ఆయనను కరకురాళ్ళ ములుకులవాడి కించపరచినది. నిత్య సౌభాగ్యంతో తులతూగుతున్నా, సత్యస్థితిని ఆయన సునిశిత దృష్టితో పరిశీలించినాడు.

తన కవిత్వ మాధుర్యానికి పులకితులైపోయి పాశ్చాత్యులు బ్రహ్మరథం పడుతున్ననాడే, జలియన్ వాలాబాగ్ దురంతాల రూపంలో ప్రదర్శితమైన పాశ్చాత్య సామ్రాజ్యవాద క్రౌర్యాన్ని సహించలేక పర ప్రభుత్వం తనకిచ్చిన బిరుదులను వదిలివేసిన మానధనుడాయన.

అట్లే విదేశీయమైనదెల్ల పరిత్యాజ్యమేనన్న వికృతభావాన్ని నిశ్చలుడై ఎదుర్కొని సాహిత్య సంస్కృతులకు ఎల్లలు లేవని ఎలుగెత్తి చాటిన ఉదారహృదయుడాయన.

ప్రాచీన, నవీన సంస్కృతి మహాసముద్రాన్ని మధించి అవలీలగా అమృతాన్ని అందించిన స్థితప్రజ్ఞుడాయన.

ఆయన చేయి పెట్టని సాహిత్యశాఖ లేదు; ఆయన దారిచూపని కళాసీమ లేదు; ఆయన కంఠమెత్తి ఖండించని అత్యాచారం లేదు; ఆయన చేతులు చాచి కౌగిలించుకొనని మాధుర్యం లేదు. ఎందులోనూ ఆయన మహా మేరువే; ఎందులోనూ ఆయన గంభీర పారావారమే.

ఒక్క తరంలోనే గురుదేవుని వంటి మహామూర్తినీ, బాపూజీ వంటి మహావ్యక్తినీ, అరవిందుని వంటి మహాతపస్విని అవతరింప జేసుకొన్న భారతభూమి ఎంత పుణ్యాత్మురాలో చెప్పలేము! గురుదేవుని 93వ జయంతి సందర్భంలో దేశంలో పెక్కు చోట్ల ప్రస్తుతం జరుగుతున్న రవీంద్ర సంస్కృతి సభలు మన హృదయాలలో ఒక కొత్త దివ్వియను వెలిగించుగాక! మన జీవిత యాత్రలో ఒక కొత్తబాటను వేయుగాక!

(ఆంధ్రప్రభ 11-5-1954)

## రవీంద్ర సంస్కృతి

కవులున్నారు; తాత్త్వికులున్నారు. కళాకారులున్నారు; కద్మ హృదయులున్నారు. కాని, ఒకే వ్యక్తి ఇవన్నీ అయినప్పుడు మహావ్యక్తిగా పరిగణితుడవుతాడు. అలాంటి లోకోత్తర పురుషుడు రవీంద్ర కవిచంద్రుడు.

అందుకే ఆయన మహాత్మునంతటి వానితో గురుదేవుడనిపించుకోగలిగినాడు.

వ్రాసినది బెంగాలీలోనే అయినా, వంగ జీవిత పరిశీలనా ప్రవణంగానే ఆయన కలం నడిచినా అఖిలభారతాత్మ అందులో ప్రతిబింబితమవుటే కాదు, అఖండ భూమండలంలోని అంతఃకరణం అందులో ఆర్ద్రీభూతమై అవతరించినది.

కమ్మగా జీవితంలోని మాధుర్యం, రామణీయకం గానం చేయడమే కాదు, అలాంటి మహోజ్జ్వలత మాటుపడిన మనసులలో మృదులతను పండించుటకాయన శతథా ప్రయత్నించినాడు. దేశకాల పాత్రావధుల నధిగమించి మానవాత్మకొక పరిణతిని, పరిపక్వతను ప్రసాదించుటలో కవితకెంత బాధ్యత కలదో ఆయన చూపించినంతగా ఆధునికులలో మరొకరంతగా చూపినవారు కానరారు.

అందునా అన్ని సాహిత్యరూపాలలో, అంత ఉత్తమోత్తమ రచనలనందించగల పాటవం అంతతో ఇంతతో వచ్చునది కాదు.

ఆ రచనలకే ఆయన మధుర హృదయం అంకితమైపోనూ లేదు.

అటు తాత్త్వికుడుగా ఆయన మానవతనొక మహోన్నత వేదికపై నిల్పినాడు. జాతీయవాదిగా తన భవ్య భారత సంకీర్తనం చేసినా అది ఇతర దేశాలను, రాజ్యాలను కించపరిచే అహంకారంగా కాక, అందరిలోని మంచినీ అందల మెక్కించగల ఆత్మజ్యోతిగా వెలిగించగలిగిన దొడ్డ మన నదీ.

అలాంటి పవిత్రమూర్తి ప్రకీర్తనం అందుకనే ఒకానొక విశిష్టతనందుకుంటున్నది. ఆయన మనలోని మంచికి, మనలోని మాలిమికి, మనలోని తాలిమికి ప్రతీకగా నిలిచినాడు గనుకనే ఆయన భవ్య సంస్కృతి మనలోని ఆ గుణాల నాకింత పైకెత్తి చూపగలదేమో నన్న ఆశాలేశమే మన మీనాడింత భారీ యెత్తున రవీంద్ర శతజయంతి జరుపుకొనుటకు మూలమయినది.

అందువల్లనే మన ఈ మహాప్రయత్నంలో మానవ లోకమెల్లా చేతులు కలుపుతున్నది. నేడే ఆరంభమవుతున్న టాగోర్ జయంతి సభలు, సమావేశాలు, ఉత్సవాలు కేవలం సంబరాలతో గుటలేదు.

ఆయనపేర నాటక రంగస్థలాలు నెలకొంటున్నవి; ఆయన రచనలు వివిధ భాషలలో అనూదితములవుతున్నవి; ఆయన పేర అనేక సాంస్కృతిక కేంద్రాలు పాదుకొంటున్నవి.

వీనితోపాటు ఆయన చూపిన దారిని బడి భారత జనతాగీతి తాలిమికి, మాలిమికి, జోతలర్పించుటతో ఆగక, వానిని తమ మనుగడలో మణిదీపాలుగా వెలిగించుకోగలిగితే, కులమత వివక్షతలకు, భాషా ప్రాంతీయ దురభిమానాలకు దూరం కాగలిగితే మనమాయన సంస్కృతికి అర్హుల మనిపించుకుంటాము. మనమాయన వారసులమని సగర్వంగా చెప్పుకో గలుగుతాము.

అందుకు తగిన గుండె కలిమి, బలిమి మనమీనాడు చేకూర్చుకొనాలి. అందుకే మన సర్వశక్తులను కూడగట్టుకొనాలి.

ఇదే నేడు మనకు కావలసినది. మనం వాంఛింపవలసినది కూడా ఇదే.

(ఆంధ్రజ్యోతి 4-5-1961)

# ఉస్తాద్ బడే గులాం ఆలీఖాన్



ఆయనకేమి? ఆయన ధన్యజీవి. ఆయన సంగీతకళను ఆరాధించారు. కటాక్షించింది. నవయౌవనంలోనే మహావిద్వాంసుడుగా ఆయనకు పేరు వచ్చింది. ప్రజలు, ఆ తల్లి ఆయనను ఆదరించారు, గౌరవించారు. ప్రభుత్వాలు అభిమానించాయి, సత్కరించాయి. ముఖ్యంగా 1960 తర్వాత ఏ దేశమైనా ఒక మహా సంగీత విద్వాంసునికి చేయగల సమస్త సత్కారాలు ఆయనకు జరిగాయి. 1961లో "పద్మభూషణ్" సత్కారం; 1962లో సంగీత నాటక అకాడమీ "అవార్డు" సత్కారం; 1966లో కలకత్తా యూనివర్శిటీ "డాక్టరేట్" సత్కారం అందుకున్నారు. ఇంతటి ధన్యజీవి కాబట్టి, ఎట్టి వెలితి మనస్సులో లేకుండానే ఉస్తాద్ బడే గులాం అలీఖాన్ నిన్న హైదరాబాద్లో కన్నుమూసి వుండాలి. కాగా, వెలితి మన సంగీత ప్రపంచంలోనే, రసికజన.

హృదంతరాళాలలోనే. ఆ వెలితి ఇంతలో తీరదు; బహుశా ఎంతలోనూ తీరదు. హిందూస్తానీ సంగీతంలో ఆయనకు ఆయనే సాటి.




హిందూ మహమ్మదీయ మతాలు భిన్నమైనవి కాబట్టి, ఆ మతస్థుల సంస్కృతులు భిన్నమైనవి కాక తప్పదని వాదించింది ఒక్క మహమ్మదాలీ జిన్నా మాత్రమే కాదు; ఒక వినాయక్ దామోదర్ సావర్కార్ మాత్రమే కాదు. ఇట్టివారు పెక్కుమంది ఇదివరలో వున్నారు; ఇప్పుడు కూడా వున్నారు. ఈ వాదతిరస్కృతికి ప్రధానంగా పేర్కొనదగింది హిందూస్తానీ సంగీతమే. కర్ణాటక సంగీతం అన్య ప్రభావాలను కొన్నింటిని అంతర్లీనం చేసుకొనడం ద్వారా రూపొందినట్టిదే హిందూస్తానీ సంగీతం. హిందువులవలె, మహమ్మదీయులు భక్తి శ్రద్ధలతో పరిపోషించడం ద్వారా పరిఢవిల్లినట్టిదే హిందూస్తానీ సంగీతం.

కేవలం సంగీతంలోనే కాదు, చిత్ర, వాస్తుకళలలో కూడా హిందూ ముస్లిం ప్రభావాల సమ్మేళనం ద్వారా కొత్తబాణీలు తలయెత్తాయి. ఇట్టి పరిణామాలకు దోహదం కూర్చినప్పుడే జాతి, మత, కుల విభేదాలకు అతీతమైన సర్వాంగ సుందర భారతీయ సంస్కృతి పెంపొందుతుంది. మనం లక్షించవలసిన, సాధించవలసిన ఈ సర్వాంగ సుందర భారతీయ సంస్కృతి పరిపోషణకై తన జీవితాన్ని సంగీత కళారంగంలో ధారవోసిన మహామహుడు ఉస్తాద్ బడే గులాం ఆలీఖాన్. ఆఫ్ఘనిస్తాన్ రాజు ఆయన సంగీతానికి ముగ్ధుడై తన ఆస్థాన సంగీత విద్వాంసుడుగా వుండిపోవలసిందిగా ఆయనను అర్థించాడు. కాని,

భారతదేశం పట్ల ప్రేమతో ఆ పదవిని స్వీకరించడానికి ఉస్తాద్ బడే గులాం ఆలీఖాన్ సమ్మతించలేదు. తాను జన్మించింది భారత దేశంలో; సంగీత విద్యలో పాండిత్యాన్ని గడించింది భారతదేశంలో; అందువల్ల భారతదేశానికే సేవచేస్తూ, ఇక్కడనే కన్ను మూయడం తనకు భావ్యమని ఆయన విశ్వసించారు, అంతే చేశారు. ఆయనది స్థూలకాయం, గండు ముఖం, బుగ్గమీసాలు, చుడీదార్ పైజామా పైన లక్నో చికాన్ అల్లికలున్న లాల్చీ వేసుకునేవారు. ఏ ముల్తానీ రాగంలోనో ఆయన ఒక ఖయాల్ పాడినా, తమ సమ్ముఖంలోని గాయకుని మూర్తిని సభికులు మరచిపోయేవారు, తమను తామే మరచిపోయేవారు.

హిందూస్తాన్ సంగీతంలో "పాటియాలా ఘరానా" కు చెందిన బాణీ గాయకులలో ఫతే ఆలీ, అలీబక్షలు ఒకప్పుడు గొప్పవారు. వారి వద్ద ఆ బాణీని అభ్యసించిన ఉస్తాద్ బడే గులామ్ ఆలీఖాన్ గురువులను మించిన శిష్యుడనిపించుకున్నారు.

"సంగీతమే నాకు శ్వాస; సంగీతమే నాకు సర్వస్వం, సంగీతం లేకపోతే నా జీవితం దుర్భరం. సరిగమలను పలుకుతూనే కన్ను మూయాలని నా కోర్కె" అని ఉస్తాద్ బడే గులామ్ ఆలీఖాన్ ఆ మధ్య ఒక సందర్భంలో చెప్పారు. సప్తస్వరాలను పైకి కాకపోయినా మనస్సులో (ఆంధ్రజ్యోతి 25-4-1987) పలుకుతూ ఆయన నిన్న కన్ను మూసి వుండాలి.

## మహామనీషి : ఉస్తాద్ అల్లావుద్దీన్ ఖాన్

మధ్యప్రదేశ్ కు చెందిన మైహర్లో మొన్న రాత్రి ఒక మహా విద్వాంసుడు, ఒక మహామనీషి కన్నుమూశాడు. ఉస్తాద్ అల్లావుద్దీన్ ఖాన్ సంగీతంలో మహా విద్వాంసుడే కాదు, సాటిలేని విద్వాంసుడు కూడా. ఈనాడు దేశదేశాలలో మన్ననలందుతున్న ఆలీ అక్బర్ (సరోద్), రవిశంకర్ (సితార్), పన్నాలాల్ ఘోష్ (ఫ్లూట్) ప్రభృతులకు ఆయన సంగీత గురువు. సరోద్, సితార్, ఫ్లూట్ మాత్రమే కాక, వీణ, ఫిడేలు, ఎస్రాజ్, సుర్బహార్, సన్నాయి, తబలా, మృదంగంఒకటేమిటి? దాదాపు అన్ని వాయిద్యాలలో ప్రజ్ఞానిధి అల్లావుద్దీన్ ఖాన్.




మహా విద్వాంసులైన వారందరు మహా మనీషులు కారు. అందుకు విశ్వ విశాల దృష్టి కావాలి. మహోదాత్త ప్రవృత్తి కావాలి. ఇట్టిదృష్టి వున్నవాడు కనకనే, ఇట్టిప్రవృత్తి వున్నవాడు కనకనే అల్లావుద్దీన్ ఖాన్ ఒక మహామనీషిగా నూరుపైన పదేళ్ళు జీవించాడు; అన్నిమతాల వారికి, అన్ని వర్గాలవారికి పూజనీయుడైనాడు. మైహర్లో ఆయన గృహానికి వెళ్ళిచూస్తే, గోడలపై సరస్వతి, మహాకాళి మొదలైన దేవతల

చిత్రాలతోపాటు గాంధి, రామకృష్ణ పరమ హంస, వివేకానంద మొదలైన మహాపురుషుల చిత్రాలు కూడా కానవస్తాయి. వాటిని చూచినవారికి "ఇది ఒక ముస్లిం గృహమా?" అని ఆశ్చర్యం కలగక మానదు.



నమాజ్ చేయడంలో ఏ ముస్లిం కంటె కూడా అల్లావుద్దీన్ ఖాన్ తక్కువ భక్తిశ్రద్ధలను చూపేవాడు కాదు. అయితే, నియమానుసారం నమాజ్ చేస్తూనే మైహర్ పట్టణానికి అల్లంతదూరంలో వున్న సరస్వతి దేవాలయానికి కూడా ఆయన నమస్కరిస్తూ వుండేవాడు. కొన్ని వేల రూపాయల జీతం పై తన ఆస్థాన సంగీత విద్వాంసుడుగా పనిచేయవలసిందని ఒక మహారాజు పంపించిన ఆహ్వానాన్ని అల్లావుద్దీన్ ఖాన్ ఒకసారి తిరస్కరించింది నిద్రనుంచి లేవగానే పెరటిలోకి వచ్చి, తాను ప్రతి ఉదయం నమస్కరించలేనన్న కారణానే.

ఆయన దృష్టిలో సంగీతానికి మతంలేదు, కులంలేదు, ఇట్టి కృత్రిమ విభేదం మరేదీ కూడా లేదు. అందువల్లనే, ఆయన అన్ని మతాలను సమానంగా గౌరవించేవాడు. అన్ని మతాలవారికి వారు కోరిన సంగీత విద్యను నేర్పుతూ వుండేవాడు. అన్నట్టు, ఆయన కుమార్తె పేరు "అన్నపూర్ణ", ఆమె భర్త రవిశంకర్.

కాగా, సంగీత గురువుగా ఆయనకు ఆయనే సాటి. తన శిష్యులందరు తనంతటివారు కావాలని, తనను మించిపోవాలని ఆయన కోరుకునేవాడు. అందువల్ల, విద్యాభ్యాసంలో ఏ మాత్రం అశ్రద్ధ చూపినా, లేక ఏ పాటి పొరపాటు చూపినా, ఆయనకు పట్టరానంతటి కోపం వచ్చేది. అట్టి సందర్భాలలో ఆయన కేవలం దూర్వాసునివలె మారిపోతూ వుండేవాడు. చేతిలో ఏది వుంటే దానితో తప్పుచేసిన శిష్యుని మోదుతూ వుండేవాడు.

ఏ విద్యను సాధించాలన్నా, అందుకు ఎంతో శ్రద్ధ, దీక్ష, దాదాపు తపస్సు కావాలని అల్లావుద్దీన్ ఖాన్ విశ్వాసం. అట్టి తపస్సు వల్లనే - కఠోర తపస్సువల్లనే - ఆయన మహాసంగీత విద్వాంసుడు కాగలిగాడు. పదవ యేట ఇంటినుంచి పారిపోవడం, ఒక గురువువద్ద ప్రవేశానికి అన్యమార్గాలు లేక కూలీగా చేరడం, సంగీత విద్యకు పేరొందిన ఒక నవాబు ఆస్థానంలో తన విద్యకు మెరుగులు దిద్దుకొనడానికై వేరు దారి లేక ఆ నవాబు గుర్రపు బండికి అడ్డంగా పడుకోవడం ఇవన్నీ ఆయన తపస్సులో భాగాలే.

"పద్మ విభూషణ్" సమేతంగా ఎన్నో సత్కారాలు, గౌరవాలు జరిగినా, అవన్నీ ఆయన కోరకుండా వచ్చినవే; ఆయనను వెతుక్కుంటూ వచ్చినవే. ఆయన జీవితాంతంవరకు కోరింది ఒకటే, అది - -మతం వేరు చేస్తున్నా, మానవులను సంగీతం ద్వారా ఏకం చేయాలని, ఆయన జీవిత సందేశం ఏదైనా వున్నదంటే, అది మానవతను మించిన మతం లేదన్నదే. అందువల్లనే, ఆయన మహా మనీషి. ఆయనకు ప్రేమ గౌరవాలతో మా శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

(ఆంధ్రజ్యోతి 9-9-1972)

# డాక్టర్ పాండురంగ వామన్ కాణే



మంగళవారం రాత్రి పూనాలో ఒక ప్రముఖుడు, న్యూఢిల్లీలో మరొక ప్రముఖుడు కన్నుమూశారు. ప్రముఖత్వమే వీరి మధ్య కానవచ్చే సామ్యం; తక్కినవన్నీ వైరుధ్యాలే.

పూనాలో తన 92 వ యేట నిర్యాణం చెందిన డాక్టర్ పాండురంగ వామన్ కాణే ప్రపంచ ప్రసిద్ధికెక్కిన సంస్కృత పండితుడు. న్యాయశాస్త్రంలో కూడా ఆయన మహా పండితుడే. బొంబాయిలోని గవర్నమెంట్ లా కాలేజిలో 1947 నుంచి 1949 వరకు రెండేళ్ల పాటు బొంబాయి యూనివర్శిటీకి ఆయన వైస్ ఛాన్సలర్ కూడా.

ఇట్టి పదవులను పెక్కింటిని డాక్టర్ కాణే అధిష్ఠించారు, ఇట్టి గౌరవాలను పెక్కింటిని ఆయన పొందారు. ఈ పదవులలో చిట్టచివరిది "నేషనల్ ప్రొఫెసర్ షిప్"; ఆ గౌరవాలన్నింటిలో గొప్పది "భారతరత్న".


ఈ పదవులకంటె, ఈ గౌరవాలకంటె డాక్టర్ కాణే కీర్తిని శాశ్వతంగా నిలపగలిగినట్టిది ఆయన వ్రాసిన "హిస్టరీ ఆఫ్ ధర్మశాస్త్ర" అనే బృహత్తర గ్రంథం. కొన్ని వేల పుటలకు విస్తరిస్తున్న ఈ గ్రంథం హిందూ ధర్మశాస్త్రాలకు సంబంధించినంతవరకు ఒక ప్రామాణిక రచన మాత్రమే కాక "ఎన్సైక్లోపీడియా". దీన్ని రచించడానికి ఆయన 35 సంవత్సరాలు పరిశోధన చేయవలసి వచ్చింది. దీని చివరి సంపుటిని ఆయన




1963లో ప్రచురించిన సందర్భంలోనే నాటి రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ పూనా స్వయంగా వెళ్ళి, డాక్టర్ కాణేను "భారతరత్న"గా సన్మానించారు. సంస్కృత భాషా పాండిత్యానికి ఛాందసత్వంతో సన్నిహిత బంధుత్వం సర్వసాధారణం. కాని, డాక్టర్ కాణే దృష్టి, ఆయన చింతన ఆధునిక మైనట్టివి. ఆయన సంస్కరణను అభిమానించారు, ప్రగతిని కాంక్షించారు. బహుళ ప్రచారంలోకి వచ్చిన ఇంగ్లీషు మాటలను వాడుకలోకి తీసుకురావడానికై కొందరు పండితమ్మన్యులు కొనసాగిస్తున్న ప్రయత్నాలను ఆయన నిరసించడం ఆయన ప్రగతి శీలానికి ఒక తార్కాణం. తన భౌతిక కాయాన్ని మంత్రతంత్రాలతో చితిమీద పెట్టవలదని, దాన్ని "ఎలక్ట్రిక్ క్రిమెటోరియమ్"లో దహనం చేయవలసిందిగా ఆయన చెప్పి పోవడం ఆయన సంస్కరణ దృష్టికి ఒక నిదర్శనం.

(ఆంధ్రజ్యోతి 21-4-1972)

## శ్రీ ఆనంద కుమారస్వామి



ఆనంద కుమారస్వామి నిర్యాణంతో ప్రపంచం ఒక ఉత్తమ కళాభిజ్ఞుని కోల్పోయింది. ఈ మధ్యనే ఆయన బాస్టన్లో (యునైటెడ్ స్టేట్సు) తన 70 వ జన్మదినోత్సవాన్ని జరుపుకున్నాడు. ఇక, వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించాలనీ, హిమాలయాలలో జీవిత విశేషాన్ని ఆధ్యాత్మిక చింతనతో గడపాలనీ అనుకున్నాడు. ఈ కోర్కె ఈడేరక మునుపే ఆయనకు కాలం నిండింది; కళ్లు మూశాడు.

ప్రాచ్య సంస్కృతిని - ముఖ్యంగా భారతీయ సంస్కృతిని - పాశ్చాత్య ప్రపంచానికీ, పాశ్యాత్య సంస్కృతిని ప్రాచ్యప్రపంచానికీ సుబోధం చెయ్యడానికి శ్రీ ఆనంద కుమారస్వామి చేసిన సేవ అగణితం. వాస్తవానికి ఇదే ఆయన జీవిత లక్ష్యం, ఇదే ఆయన తపస్సు. ప్రాక్పశ్చిమ ప్రపంచాల మధ్య వ్యాఖ్యాతగా నిలవడానికి ఆయన సర్వవిధాల తగినవాడుకూడా. ఆయన తండ్రి భారతీయుడు; తల్లి బ్రిటిష్ మహిళ; భార్య అమెరికన్ (అర్జెంటీనా) వనిత. ఆసియా, యూరప్, అమెరికా ఖండాలతో ఈ సన్నిహిత సంబంధమే ఆయనకు సమగ్రదృష్టిని కూర్చింది. ఏ సంస్కృతికీ ఆయన పరాయివాడు కాదు; అన్నింటినీ ఆయన ఆకళింపు చేసుకున్నాడు; ఒకదానిలోని విశిష్టతను మరొకదానికి విశదపరిచాడు. ఇంతే కాదు, ప్రాక్పశ్చిమ సంస్కృతులను మధించడంద్వారా, వాటిమధ్య పెక్కు విభేదాలతో పాటు కొన్ని సమానాంశాలు కూడా కలవని గుర్తించాడు. ఈ సమానాంశాలను క్రోడీకరించి ఆధునిక ప్రపంచానికి తెలియజెప్పడానికి ప్రయత్నించాడు.



కళను గురించి, కళా ప్రయోజనాన్ని గురించి శ్రీ ఆనంద కుమారస్వామి అభిప్రాయాలు ఆధ్యాత్మిక భావాలతో సమ్మిళితమైనవని చెప్పవచ్చు. కళావేత్త కేవలం వ్యక్తిగతమైన భావాలను, అభిరుచులను వ్యక్తపరిచేవాడు మాత్రమే కారాదని, వ్యక్తిగత శక్తులకంటె అధికమైన - ప్రబలమైన విశిష్టమైన కళాశక్తులకు అతడు ఒక ఉపకరణగా వుండాలని ఆయన అభిప్రాయం. దీని తాత్పర్యం నిర్జీవమైన ఉపకరణగా కళావేత్త పరిణమించాలని కాదు; మననం చేసి - కాదు, తపస్సు చేసిఆ తపోశక్తివల్ల తాను సాక్షాత్కరించుకొనగలిగిన మేరకు కళాధిదేవతను ప్రజ్ఞాధురీణత్వంతో లోకానికి చూపగల ఉపకరణగా వుండాలనే.

ఇట్టి భావాలు గలవాడు గనుక శ్రీ ఆనంద కుమారస్వామి దృష్టిలో కళ ఒక వినోదం కాదు, ఒక విజ్ఞానం కాదు; ఒక ఉబుసుపోక కాదు; అది ఆత్మసంబోధన; ఆత్మపరిపక్వత; ఆత్మార్పణ.

# సత్యాన్వేషి : శ్రీ ధర్మానంద కోశాంబి

కళకు ఇంత విస్తృత ప్రయోజనం కలదని విశ్వసించినందునే కళ జీవితంతో భిన్నమైనది కారాదని ఆయన ఉద్బోధించాడు. కళాజీవితానికీ, నిత్య జీవితానికి విడాకులు జరగడమే నేటి

ప్రపంచంలో కానవస్తున్న మహానర్థకాలలో పెక్కింటికి మూలకారణమని వివరించాడు. ప్రాచీన భారతీయ సంస్కృతిలో నిత్యజీవితానికీ, కళాజీవితానికి అవినాభావ సంబంధం వుండేది. అది తీర్థాన్ని వుచ్చుకునే ఉద్ధరణి కావచ్చు; లేదా ఆ తీర్థాన్ని వుంచే పంచపాత్ర కావచ్చు; అది దీపాన్ని వెలిగించుకునే ప్రమిద కావచ్చు; లేదా ఆ ప్రమిదకు కావలసిన తైలాన్ని వుంచుకునే పాత్ర కావచ్చు; అది ఎంత చిన్న వస్తువైనా, పెద్ద వస్తువైనా ఉపయోగించుకునేదైనా - దాన్ని ఒక కళాఖండంగా చేయడానికి ప్రయత్నించేవారు. ఒక మొగ్గో, పువ్వో, ఒక ఆకో, లతో ఒక చిలకో, హంసో లేకుండా ఏదీ వుండేదే కాదు. పీట, కత్తిపీట, ముక్కాలుపీట, పెళ్ళిపీట, కుండ, చట్టి, మూకుడు, దేన్ని చూడబోయినా, అది ఒక కళాఖండమే. ఏ పనికి ఇక, ఈనాడు ఉపయోగాన్ని చూచేవారేగాని, అంద చందాలను చూచేవారు లేరు; పని జరగడం చూసేవారే గాని, కళ విలువలను గురించి ఆలోచించేవారేలేరు. డజన్ పావలా చొప్పున దొరుకుతున్న ఎనామెల్ గరిటెలతో పని జరుగుతుంటే, ఏ కాళంగిమర్దన దృశ్యమో వెలిపించబడిన ఉద్ధరిణకై ప్రాకులాట దేనికి? నిత్యజీవితం నుంచి కళాదృష్టికి ఈ విధంగా స్వస్తి చెప్పబడి నందునే ఆధునిక మానవుని జీవితం రసవిహీనమై పోయింది. అతడికి శాంతిలేదు; సంతృప్తి లేదు; సహనం లేదు. దేనినో అతడు సంశోధిస్తాడు; దేనికో పరితాప పడతాడు; తన జీవితాన్ని దుర్భరం చేసుకొని, అన్యుల జీవితాన్ని దుస్సహం చేస్తాడు.





ఈ సత్యాన్ని అవగతం చేసుకొని నిత్యజీవితానికి కళా జీవితంలో తిరిగి చాటడానికి తన జీవితాన్ని వినియోగించిన మహనీయుడు ఆనంద కుమారస్వామి. (ఆంధ్రప్రభ 12-9-1947)

విదేశాలలో వచ్చినంత విఖ్యాతి ఆయనకు స్వదేశంలో రాలేదు. ఇందుకు కారణం "పదుగురాడు మాట"ను ఆయన ఆడకపోవడమే!

"ఇది వేదభూమి; ఇది తపోవనం; పారలౌకిక దృష్టితప్ప ప్రాపంచిక దృష్టి దీనికి లేదు; ఇది అపూర్వమైన ఆధ్యాత్మిక సత్యాలను కనుగొన్నది; ఇది ప్రపంచానికే జ్ఞానభిక్ష పెట్టింది" - ఈ ధోరణిలో మన దేశాన్ని గురించి గొప్పలు చెప్పే ప్రబుద్ధుల కోవకు చెందినవాడు కాడు నిన్న పూనాలో కన్నుమూసిన దామోదర ధర్మానంద కోశాంబి. దేశభక్తి ఆయనలో తక్కువ కాదు; సత్యనిష్ఠ అధికం. అందువల్ల అన్యులకు నిష్ఠురంగా తోచినా ఆయన తాను నిజమని నమ్మినదాన్నే తెగవేసి చెబుతూ ఉండేవాడు. ఇందువల్లనే ఆయన పాండితికి, ఆయన ప్రతిభకు తగినంత ప్రఖ్యాతి ఆయనకు మన దేశంలో రాలేదు.

మహాపండితులుగా, మహామహోపాధ్యాయులుగా ప్రస్తుతం మన దేశంలో చెల్లుతున్నవారిని తలదన్నగల పండితుడు శ్రీ కోశాంబి. భాషా పాండిత్యాన్ని చూడబోతే, ఆయనకు పన్నెండు భాషలు కొట్టిన పిండి. మాతృభాష మరాఠీ, అంతర్జాతీయ భాష ఇంగ్లీషులతోపాటు సంస్కృతం, పాలీ, లాటిన్, ఇటాలియన్, ఫ్రెంచి, జర్మన్ మొదలైనవి ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. సంస్కృతంలో కొన్ని అముద్రిత గ్రంథాలకు సంపాదకత్వ బాధ్యత ఆయన వహించారు. భర్తృహరి శతకాలకు ఆయన రాసిన వ్యాఖ్యానం విద్వశ్లోకం ప్రశంసలను అందుకుంది.



శ్రీ కోశాంబి భాషా పాండిత్యం కంటే ఆయన శాస్త్ర పాండిత్యం మరింత గొప్పది. గణిత శాస్త్రవేత్తగా ఆయన ప్రపంచం మొత్తం మీదనే గణన కెక్కారు. "పాత్ జామిట్రీ"లో ఆయన నిధి. "స్టాటిస్టికల్ థియరీ"కి రేఖాశాస్త్ర (జామిట్రీ) సూత్రాలను అన్వయింపజేయడం ఆయన ప్రత్యేక ఘనత. గణిత శాస్త్రవేత్తగా ఆయన ప్రతిపాదించిన ఒక సూత్రం సంతానోత్పత్తి శాస్త్రంలో (జెనిటిక్స్) విప్లవాత్మకమైన నూతన పరిశోధనలకు దోహదం కూర్చినదంటే, గణిత శాస్త్రవేత్తగా శ్రీ కోశాంబి ఎంతటి ప్రజ్ఞా ప్రాభవాలున్నవారో మనం ఊహించుకోవచ్చు.


గణితశాస్త్ర రంగం ఎంత విస్తృతమైనదైనా, శ్రీ కోశాంబి దానికే తన పరిశోధనలను పరిమితం చేయలేదు. చరిత్ర రచనకు ఆయన కొత్త ఒరవడి పెట్టారు; పురాతత్వ శాస్త్రంలో కొత్త పుంతలు త్రొక్కారు; పురాతన నాణెములకు సంబంధించిన శాస్త్రాన్ని (న్యూమిస్మ్యటిక్స్) ఒక మెట్టు పైకి ఎక్కించారు; మానవశాస్త్రాన్ని (యాన్ థ్రోపాలజీ) ముందుకు తీసుకుపోయారు.

తా నేమో, తన పరిశోధనలేమో తప్ప పేరు ప్రఖ్యాతులకై ప్రాకులాడలేదు శ్రీ కోశాంబి. హార్వర్డ్ యూనివర్సిటీలో ఉన్నత విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకొని వచ్చిన తర్వాత పూనాలో ఫెర్గుసన్ కాలేజీలో ఆయన గణితశాస్త్రాచార్యులుగా పనిచేశారు. అక్కడి నుంచి విరమించిన పిమ్మట బొంబాయిలోని "తాతా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్"లో పదిహేను సంవత్సరాలపాటు పనిచేశారు. పూనాలోనే నివసిస్తూ ఎలక్ట్రిక్ రైలులో బొంబాయికి అనుదినం ప్రయాణం చేస్తున్న సందర్భంలో ఆయన పుస్తకాలలోనో, ఆలోచనలలోనో మునిగిపోయి ఉండేవారట.

కీర్తిని తానై కాంక్షించకపోయినా, శ్రీ కోశాంబిని అది వెతుక్కుంటూ వచ్చింది. అమెరికాకు చెందిన చికాగో, ప్రిన్స్టన్ యూనివర్సిటీలు ఆయనను ఆహ్వానించి గౌరవించాయి. సోవియెట్ యూనియన్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు సైతం ఆయనను ఇదే విధంగా సత్కరించాయి.

అన్యదేశాలు ఎంత ఘనంగా సత్కరించినా, "మనదే పుణ్యభూమి, మిగిలింది మ్లేచ్ఛ ప్రపంచం" అనే పాట పాడని వ్యక్తిని భారతీయ పండితలోకం సహించగలదా, క్షమించగలదా? దేశద్రోహి కానివాడు ప్రాచీన

భారతంలో (సమకాలిక ప్రపంచంలో వలె) నరబలులు సాగుతుండేవని రాస్తాడా? ఊర్వశీపురూరవుల గాథను నరబలి గాథగా చిత్రిస్తాడా? శివుడు ఋగ్వేదంలోని రుద్రుడు కాడని, అనాగరిక జాతుల ఆరాధ్య దైవమే క్రమపరిణామాన్ని పొంది శివుడుగా రూపొందినట్టు వాదిస్తాడా? అన్యుల ధనధాన్యాలను దోచుకొనడం కోసం వారిపై కయ్యానికి.



కాలుదువ్వే తెగలలో ఒకదానికి నాయకుడుగా ఋగ్వేదంలోని ఇంద్రుని వర్ణిస్తాడా? వేదకాలం నాటి ఆర్యులను హరప్పా మొహెంజొదారోల నాగరికతను ధ్వంసం చేసిన దేశ దిమ్మరులుగా పేర్కొంటాడా?

ఇంతటితోనైనా శ్రీ కోశాంబి ఆగలేదే! తక్కిన ప్రాచీన దేశాలలోవలె భారత దేశంలో కూడా బానిస వ్యాపారం విరివిగా సాగుతూ ఉండేదని ఆయన చెప్పారు. సంస్కృత భాషలో ఆడంబరం ఉన్నంతగా అర్థస్ఫురణ లేదని ఆయనన్నారు. నానార్థాలుండే పదాలు కోకొల్లలు కాబట్టి, సంస్కృతంలో శాస్త్రీయ గ్రంథాలను వ్రాయలేమన్నారు. సంస్కృతంలో లేని సౌలభ్యం, దానిలో లేని గాంభీర్యం పాలీ భాషలో ఉన్నవన్నారు. సంస్కృతం ఒక వర్గం భాష కాని, ఒక జాతి భాష కాదన్నారు. ప్రజాజీవితానికి, సంస్కృతానికీ ఏడు ఆమడల దూరం ఉన్నదన్నారు.

"పదుగురాడు మాట"కు భిన్నంగా శ్రీ కోశాంబి ఈ విధమైన మాటలు చాలా చాలా అన్నారు. పరిశోధనలు జరపకుండా ఆయన ఈ మాటలన్నారా? సాక్ష్యాధారాలను చూపకుండా అన్నారా? కాని, అది వేరే విషయం. మనకు కావలసింది కేవలం మన ఘనత, మన దేశం ఘనత. అందుకు విరుద్ధంగా ఎవరేమి చెప్పినా, అది మనకు, మన జాతీయ గౌరవానికి మచ్చ తీసుకు రావడమే!

నిష్ఠూరమైన నిజాలను చెప్పినందునే శ్రీ కోశాంబిని ఏ భారతీయ చరిత్రకారుడు ఒక సాటి చరిత్రకారునిగా గుర్తించలేదు. తాము రాసేది పాడింది పాటగా ఉండవచ్చు; సత్యానికి అపచారం చేసేదిగా ఉండవచ్చు. అయినా, తాము పాడుతున్న పాటనే పాడనందున శ్రీ కోశాంబి చరిత్రకారుడు కాడు, కానేరడు. ఈ తీర్పుకేమిగాని భారతదేశ చరిత్రను చరిత్రగా తెలుసుకొనగోరితే మనం శ్రీ కోశాంబి రాసిన గ్రంథాలను - "యాన్ ఇంట్రడక్షన్ టు ది స్టడీ ఆఫ్ ఇండియన్ హిస్టరీ", "మిత్ అండ్ రియాలిటీ", "కల్చర్ అండ్ సివిలిజేషన్ ఆఫ్ ఏనెంట్ ఇండియా" చదువుకోవాలి. కావాలని గుడ్డితనాన్ని తెచ్చుకొనగోరేవారి మాట చెప్పలేముగాని, తక్కినవారికి అనేక విషయాలలో ఇవి కనువిప్పు కలిగించగలవు!

శ్రీ కోశాంబి భారత చరిత్ర రచనకు మార్క్సిస్టు సిద్ధాంతాలను వర్తింపజేశారు. అందువల్లనే ఇతర చరిత్రకారులకు తెలియని కొత్త విషయాలను ఆయన కనుగొనగలిగారు. ఈ మాట విన్నంతనే మన తెలుగు మార్క్సిస్టులు రొమ్ము విరుచుకో నక్కరలేదు. మార్క్సు, ఆయన సిద్ధాంతాలను ఆయన భక్తులమని చాటుకునేవారు సరిగా అర్థం చేసుకొనలేకపోతున్నారని శ్రీ కోశాంబి వారిని చాలా గట్టిగానే దుయ్యబట్టారు.

నిజానికి శ్రీ కోశాంబి రాయిస్ట్, సోషలిస్ట్, కమ్యూనిస్ట్ - ఏ “ఇస్ట్” కాదు. ఆయన నిరంతర సత్యాన్వేషి. సత్యం ఎక్కడ కానవచ్చినా దాన్ని ఔదల దాల్చేవారు. నేడు కాకపోతే, మరి రెండు, మూడు తరాల నాటికైనా మన దేశం ఈ విషయాన్ని గుర్తించకపోదు; అప్పుడు శ్రీ కోశాంబి స్మృతికి నివాళులెత్తకపోదు.

(ఆంధ్రజ్యోతి 2-7-1966).

## అమరుడు శ్రీ జామినీ రాయ్

ఆయన మొన్న రాలిపోయాడు. ఐతే, గుత్తులు గుత్తులుగా పూలను పూసిన తర్వాత, రాసులు రాసులుగా పండ్లను కాసిన తర్వాత. అవి మల్లెలకంటే గుమగుమలాడే పూలు, అవి మామిళ్ళకంటే నోరూరించే పండ్లు.



ఆయన పేరు శ్రీ జామినీ రాయ్. ఆయన బెంగాల్ కాకపోతే, అది "యామినీ రాయ్' అయివుండేది. ఏమైనా, అది దేశదేశాలకు ప్రాకిన పేరు, తరతరాలకు నిలవగల పేరు.

శ్రీ జామినీరాయ్ పుట్టింది 1888 ఏప్రిల్ 11వ తేదీని బంకూరా జిల్లాలోని ఒక కుగ్రామంలో, ఆయనకు చదువు అబ్బలేదు కాని, మట్టి బొమ్మలను చేయడంలో నేర్పు అబ్బింది. ఆ బొమ్మలను చేసేవారే ఆయనకు విద్యాగురువులు. వారి నుండి ఆయన నేర్చుకున్నది మట్టికి రూపుదిద్దడం మాత్రమే కాదు, తన జీవితానికి రూపుదిద్దుకొనడం కూడా.

ఒక రూపును తన జీవితానికి దిద్దుకొనడం కోసమే చిన్నతనం వెళ్ళకముందే ఆయన కలకత్తా చేరాడు. అక్కడ గవర్నమెంటు ఆర్ట్స్ కాలేజీలో ఆయనకు ప్రవేశం లభించింది. అది అసాధారణ ప్రవేశం. "నీకు ఎప్పుడు బుద్ధిపుడితే అప్పుడే రావచ్చు, ఏమి కోరితే దాన్ని నేర్చుకోవచ్చు" అని కాలేజీ ప్రిన్సిపల్ తన కొత్త విద్యార్థికి చెప్పినాడంటే, అది నిజంగానే అసాధారణ ప్రవేశం కాదా?

ఐతే, శ్రీ జామినీ రాయ్ కాలేజి ద్వారా నేర్చుకున్న దానికంటే జీవితం నుంచి నేర్చుకున్నదే హెచ్చు. నిజానికి కాలేజీలో నేర్చుకున్నదాన్ని ఒక పక్కకు నెట్టివేసిన తర్వాతగాని, ఆయన తనదనే ఒక శైలిని ఏర్పరచుకోలేదు. తనకుగా భారతీయ చిత్రకళారంగంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోలేదు.

అవనీంద్ర టాగోర్, ఆయన ప్రియశిష్యుడు నందలాల్ బోస్ వీరిద్దరు అప్పటిలో సుప్రసిద్ధ చిత్రకారులు. ఐనా వారి అడుగుజాడలలో జామినీరాయ్ నడవలేదు. తన తొలిగురువుల పుంత వెంటనే తన జానపద గురువుల బాట వెంటనే ఆయన వెళ్ళాడు. ఐతే, ఆయన చేరింది, పాత ఊరును కాదు, ఒక కొత్త ప్రపంచాన్ని.

శ్రీ జామినీరాయ్ "ఆర్టిస్ట్" కాదని, "ఆర్టిజాన్" మాత్రమే అని చులకన చేసేవారు కొందరున్నారు. ఇది ఒక పూర్వ సంప్రదాయాన్ని, ఒక ప్రశస్త సంప్రదాయాన్ని, చులకన చేయడమే. ఆనంద కుమారస్వామి రాసినట్టు, ఒకనాడు మన దేశంలోనే కాదు, అన్ని దేశాలలో ఒకే వ్యక్తి "ఆర్టిస్టు", "ఆర్టిజాన్" కూడా. అందువల్లనే ప్రజల బ్రతుకుల్లో కళ పెనవేసుకుని ఉండేది. అప్పటిలో కళ కేవలం "డ్రాయింగ్ రూమ్"కు పరిమితం కాదు; అది వంట ఇంటిలోకి కూడా విస్తరించి ఉండేది. అది కుండ కానివ్వండి, చట్టి కానివ్వండి, మూకుడు కానివ్వండి, తెడ్డు కానివ్వండి, గరిటె కానివ్వండి, చెంబు కానివ్వండి, పంచపాత్ర కానివ్వండి - ప్రతిదీ కళాత్మకంగా ఉండేది. ఒక కళాఖండంగా ఉండేది. అందువల్ల ఆనాటి ప్రజా జీవితంలో, గృహ జీవితంలో నిత్య జీవితంలో అందం ఉండేది, చందం ఉండేది, నిండుతనం ఉండేది.

## శ్రీ అవనీంద్రనాథ్ టాగోర్

కళకు, జీవితానికి తిరిగి ఇట్టి సంబంధం కూర్చడమే శ్రీ జామినీ రాయ్ లక్ష్యం. అందువల్ల ఆయన జానపద కళారీతులను సొంతం చేసుకున్నాడు. ఆ రీతులను యథాతథంగా అనుసరించక, వాటిపై తన వ్యక్తిత్వం ముద్ర వేశాడు.

మొద్దు గీతలను గీస్తూ, వాటిలో సౌకుమార్యాన్ని, లావణ్యాన్ని పొదగడం జామినీరాయ్ ప్రత్యేకత. మట్టి రంగులను వాడుతూ, వాటికి కొత్త మెరుగులను, సొబగులను కూర్చడం ఆయన వైశిష్ట్యం. కొయ్య బొమ్మల వలె, మట్టి బొమ్మల వలె ఆయన మానవమూర్తులను చిత్రించినా, వాటి స్థూలత్వంలో ఏవో లోతులు కనబడతాయి; వాటి స్థాణుత్వంలో ఏదో స్పందన కనబడుతుంది.

ఒకసారి వేసిన చిత్రాన్నే ఆయన తిరిగి తిరిగివేస్తూ పోయింది, కొద్ది ధరలకు తన చిత్రాలను అమ్మడం ద్వారా కళకు సామాన్య స్థితిపరుల జీవితాలలో సైతం ఒక భాగం చేయడం కోసమే. బీడీలను కాల్చుతూ, రోజుకు ఏడెనిమిది గంటల చొప్పున వృద్ధాప్యంలో సైతం ఆయన పనిచేస్తూ పోయింది కూడా ఇందుకోసమే.

ఆయన పబ్లిసిటీని కోరేవాడు కాదు, బిరుదులను కోరేవాడు కాదు. ఇతర గౌరవాలను కోరేవాడుకాదు. సందేశ కోరితే "నా చిత్రాల ద్వారా నేను మాట్లాడలే"నని ఆయన చెప్పేవాడు. "మిమ్ము గురించి మేము వినగోరుతున్నాం" అంటే, "నా చిత్రాలే నేను, నేనే నా చిత్రా"లని ఆయన జవాబు చెప్పేవాడు. మోమాట పెట్టిన మీదటగాని, ఆయన 1956లో లలితకళా అకాడమీ ఫెలోషిప్పు, 1967లో రవీంద్రభారతి యూనివర్సిటీ డాక్టరేట్ను పుచ్చుకోలేదు. "దయచేసి తిరస్కరించవద్దు" అని శ్రీమతి ఇందిర (బహుశా జవహర్లాల్ పక్షాన) ఒక లేఖ రాసిన తర్వాతగాని, 1955లో ఆయన "పద్మ విభూషణ్" పుచ్చుకోలేదు.

శ్రీ జామినీ రాయ్ మరణించాడు. ఐనా, ఆయన తన కళద్వారా జీవిస్తూనే ఉంటాడు. రేఖలకు, వర్ణాలకు ప్రాణం పోసి, ఆయనొక నూతన జగత్తును సృష్టించాడు. ఆ జగత్తు నిలిచి ఉండువరకు ఆయన నిలిచే ఉంటాడు. (ఆంధ్రజ్యోతి 28-4-1972)

అజంతా చిత్తరువులో అందచందాలు కానలేనివారికి, రాజపుత్ర చిత్తరువును చూచి రసగ్రహణం చేయనేరనివారికి, లేపాక్షి చిత్రాలలో లావణ్యం లేదనేవారికి క్యాలెండర్ బొమ్మలే కళకు పరమావధులని భావించేవారికి, అవనీంద్రుని అస్తమయం తక్కిన వార్తలతోపాటు మరొక వార్త కావచ్చుగాని, భారతీయ చిత్రకళ విశిష్టతను ఏ పాటిగానైనా గ్రహించగలవారికి మాత్రం ఆయన కన్నుమూయడం ఆధునిక భారతదేశ నిర్మాతలలో ఒక మహామహుడు నేలకొరగడమే.

టాగోర్ కుదురుకే చెందిన మరొక ప్రసిద్ధ పురుషుడు రవీంద్రనాథ్ టాగోర్ - కవితా రంగానికి చేసిన సేవకంటే కూడా, కళారంగానికి అవనీంద్రుని సేవ అపారమైనదీ, అపూర్వమైనదీ.

పరదాస్యం మనలో ఎంతగా జీతించినా, పాశ్చాత్య సభ్యతా ప్రభావం మనపై ఎంతగా రాజ్యం చేసినా, జాతీయకవితా సంప్రదాయం మాత్రం పూర్తిగా శిథిలం కాలేదు. కాని, చిత్రకళా నైపుణ్యం మాత్రం పందొమ్మిదవ శతాబ్దం చివరి భాగానికి దాదాపు పూర్తిగా చచ్చిపోయింది. అట్టి శోచనీయస్థితిలో భారతీయ చిత్రకళా సంప్రదాయానికి తిరిగి ప్రాణం పోసినవాడు శ్రీ అవనీంద్రనాథ్ టాగోర్.

చిత్రకళపట్ల శ్రద్ధాసక్తులు గల ఇతర సమకాలికులవలె శ్రీ అవనీంద్రుడు కూడా ఆదిలో పాశ్చాత్య చిత్రకళను అభ్యసించినవాడే. కేవలం దాన్ని అభ్యసించడమే కాక, దానిపై అధికారాన్ని సంపాదించినవాడు; దానిలో ప్రజ్ఞావంతుడని ప్రఖ్యాతి గడించడాన్ని ప్రారంభించినవాడు. ఐతే, అది ఆయనకు సంతృప్తి నివ్వలేదు. తన కృషిలో ఏదో అసమగ్రత ఆయనను సైతం వెన్నాడింది; ఏదో అశాంతి ఆయనను నిద్రపోనివ్వలేదు.

ఆ ఘట్టంలో శ్రీ అవనీంద్రునికి కలకత్తాలోని "స్కూల్ ఆఫ్ ఆర్ట్స్"లో ప్రధానాచార్యుడుగా పనిచేస్తున్న ఇ.బి.హావెల్తో సాహచర్యమేర్పడింది. రస్కిన్ వంటి వాడు భారతీయ చిత్రకళ అభూతకల్పనలతో కూడినదని, బీభత్సం దాని ప్రధాన రసమని ఏవేవో పిచ్చి రాతలు రాయగా, మన చిత్రకళా సంప్రదాయాల ఘనతను ఆనాటికి గుర్తించిన కొద్దిమంది ఆంగ్లేయులలో హావెల్ ప్రత్యేకంగా ఎన్నదగువాడు. భారతీయులైనవారు తమ జాతీయ సంప్రదాయాలను విస్మరించి పాశ్చాత్య కళలను అభ్యసించడం కంటే అవకతవకలేదని, ఆయన తమ కళాశాలలో భారతీయ సంప్రదాయానుగుణంగా చిత్రలేఖనం నేర్పడాన్ని ప్రారంభించగా “తమ విద్య మనం ఎక్కడ నేర్చుకొని పోగలమోనని ఈ తెల్లవాడు మాకు దాన్ని చెప్పడం లేదు" అని విద్యార్థులు సమ్మె చేశారు. అంతకంటే కూడా విచిత్రం - ఆ సమ్మెను ఆనాటి బెంగాలీ పత్రికలన్నీ సమర్థించడం! ఆదిలో ఇట్టి చిక్కులు వచ్చినా, క్రమంగా హావెల్ కృషి ఫలించింది. తమ కళాశాలలోవున్న రెండవరకం, మూడవ రకం పాశ్చాత్య చిత్ర సంచయాన్ని ఆయన అమ్మివేసి, రాజపుత్ర చిత్రాలను, మొగల్ చిత్రాలను, అమూల్యమైన ఇతర కళాసంపదను సేకరించాడు. వాటిద్వారా భారతీయ విద్యార్థుల కళ్ళను భారతీయ చిత్రకళా సౌందర్యానికి తెరిపించాడు.

హావెల్ సంకల్పించిన ఈ మహోద్యమానికి ప్రాణ ప్రతిష్ఠ చేసినవాడు అవనీంద్రనాథ్ టాగోర్. అజంతా నుంచి, ఎల్లోరా నుంచి, ఎలిఫెంటా నుంచి, ఇతర భారతీయ కళాక్షేత్రాల నుంచి ఎంతగానో ఉత్సాహావేశాలను స్వీకరించి, ఎన్నెన్నో విషయాలను ఆకళింపు చేసుకొని, ఆయన వందలాదిగా చిత్తరువులను చిత్రించారు. ఐతే,

ఈ చిత్రాలు కేవలం వెనకవాటికి ప్రతిబింబాలు కావు. జాతీయ సంప్రదాయాలను గౌరవించడమంటే, వాటిని మక్కికి మక్కిగా తరం తర్వాత తరంలో అనుసరించడం కాదు; నవకాలానికి అనుగుణంగా వాటిని దిద్దుకొనడం; నవ ప్రభావాలతో వాటిని సమన్వయపరచడం. ఈ సమన్వయాన్ని సాధించడానికి శ్రీ అవనీంద్రుడు విశేషంగా కృషిచేశాడు.

## జాతీయకవి : అమీర్ ఖుస్రో



ఈ కృషిలో ఆయన పూర్తిగా సఫలీకృతుడైనాడని అనలేము. ఆయన సఫలీకృతుడైవుంటే ఈసరికే ఆధునిక భారతీయ చిత్రకళ అజంతా శకాన్ని, రాజపుత్ర శకాన్ని పోలిన మరొక మహోచ్ఛశకంలో ప్రవేశించే ఉండేది. ఏ రంగంలోను ఇంకా మనం మన నవ ఆత్మస్వరూపాన్ని సాక్షాత్కారం చేసుకోలేదు. ఇదే చిత్రకళారంగానికి వర్తిస్తుంది.

పూర్తిగా ఫలించినా, ఫలించకపోయినా, పాత కొత్తల మేలు కలయిక కోసం అవనీంద్రుడు తపస్సు చేసినాడనడం నిర్వివాదం. మన ప్రాచీన సంప్రదాయాల మూసలో పోయబడినవైనా, ఆయన చిత్రాలలో పాశ్చాత్య, పారశీక, చైనీస్, జాప్నిస్ ప్రభావాలు తొంగిచూస్తూ ఉంటాయి; పలకరిస్తూ ఉంటాయి.

తాను చిత్రించిన చిత్రాల ద్వారా చేసిన సేవ కంటే, తాను చూపిన వెలుగుబాట ద్వారా శ్రీ అవనీంద్రుడు భారతీయ చిత్రకళ పునరుజ్జీవనానికి ఎక్కువ సేవ చేశాడు. నేటి మన చిత్రకారులలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆయనకు ఋణపడనివారు దాదాపు లేరు.

శ్రీ అవనీంద్రుడు చిత్రకారుడే కాక, బహుముఖ ప్రజ్ఞానిధి, ఉత్తమనటుడు, కథకుడు, జరాభారంవల్ల చిత్తరువులను గీయడాన్ని విరమించిన పిదప సాయం సమయాల తోటలో తిరుగుతూ, ఆయన ప్రోగుచేసిన రాళ్ళు, రప్పలు, చితుకుపుల్లలు విశ్వభారతి "కళాభవనం"లో భద్రపరచబడి ఉన్నాయి. వాటిని చూసినప్పుడు కప్ప, కుందేలు, లేడి, పులి - ఇట్టి ఏవేవో రూపాలు వాటిలో గోచరించగా వాటిని ఆయన ఏరినాడట. ఆ రూపం ఏమిటో చెప్పినమీదట “ఔను సుమీ!” అని మనకు కూడా కనువిప్పు అవుతుంది. అంత నిశితమైంది ఆయన కళాదృష్టి. ఆ మహామహునికి మా జోహారులు. (ఆంధ్రప్రభ 2-12-1951)

ఏడు వందల ఏళ్ళనాటివాడు. అమీర్ ఖుస్రో. ఆయన పండితుడు, కవి, గాయకుడు, యోగి, తత్త్వవేత్త.

ఏడు వందల సంవత్సరాలు గడిచినా, అమీర్ ఖుస్రో పండితుడుగా మన్ననలను పొందుతూనే వున్నాడు. కవిగా నీరాజనాలను అందుకుంటూనే వున్నాడు. గాయకుడుగా ప్రశంసలను పొందుతూనే వున్నాడు, యోగిగా, తత్త్వవేత్తగా కీర్తించబడుతూనే వున్నాడు.

కాలాన్ని ధిక్కరించి, మార్పును ధిక్కరించి, నిత్య నూతనంగా నిలవగలిగినట్టిదే అమీర్ ఖుస్రో బహుముఖ ప్రతిభ. నేడు (ఫిబ్రవరి 11 వ తేది, శుక్రవారం నాడు ఆయన 700 జన్మదినోత్సవ సందర్భంలో ఆయన దివ్యస్మృతికి జోహారు లర్పించడానికి జాతి, మత, కుల విచక్షణ లేకుండా పెక్కుమంది సమావేశం కానున్నారు. ఇదే విధంగా ఆయన 700 జన్మదినోత్సవం జరగగలదనడం సాహసోక్తి కాబోదు. ఉత్తరప్రదేశ్లో పదమూడవ శతాబ్దిలో ఖుస్రో జన్మించాడు. ఆయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు అబుల్ హసన్ యమీనుద్దీన్ ఖుస్రో. పెరిగి పెద్దవాడైన తర్వాత ఆయన ప్రసిద్ధనామం అమీర్ ఖుస్రో. నిజంగానే ఆయనొక అమీరు. (శబ్దార్థ చంద్రిక "అమీరు"కు చెబుతున్న అర్థం "ప్రభు"వని).

ఆయన పూర్వీకులు టర్కి నుంచి వలస వచ్చినవారు కాబట్టి, అమీర్ ఖుస్రోకు టర్కిష్ భాషతో పరిచయం వున్నది. అరబ్, పర్షియన్ భాషలలో ఆయన పండితుడు, హిందీలో ఆయన ఘటికుడు, తక్కిన భారతీయ భాషలు కూడా తనకు చక్కగా తెలిసినట్టు ఆయన స్వయంగా చెప్పుకున్నాడు. ముస్లింగా జన్మించినా, అన్ని మతాలను గురించి, అన్ని సంస్కృతులను గురించి తెలుసుకొనడానికి, వాటినుంచి మంచిని తీసుకొనడానికి అమీర్ ఖుస్రో చిత్తశుద్ధితో ప్రయత్నించాడు. తలుపులు, కిటికీలు నలువైపులా లేకపోతే, బ్రతుకు పై బయటి వెలుగు పడదని ఆయన విశ్వాసం. గోరీలకు మాత్రమే కేవలం గోడలు చాలునని ఆయన హెచ్చరిక.



వివిధ జాతులకు, మతాలకు ఒక జన్మభూమిగా మన ఉపఖండాన్ని ఖుస్రో సంస్తవించాడు. ఇక్కడి చల్లని గాలులను, ఇక్కడి కమ్మని ఫలాలను, ఇక్కడి తియ్యని కోకిలారావాలను ఆయన ప్రశంసించాడు. అన్ని విభేదాలకు అతీతమైన జాతీయ సాహిత్యాన్ని, సంస్కృతిని సృష్టించడానికి ఆయన ప్రయత్నించాడు.

ఖుస్రో హిందీలో కవిత్వాన్ని వ్రాసినమాట ఎంతవరకు నిజమో తెలియదుగాని, తన పర్షియన్ కావ్యాలలో అనేక హిందీ పదాలను ఆయన ప్రయోగించాడు. ఇంతేకాదు. "పర్షియన్హిందీ"ని రూపొందించడానికి ఆయన కృషి చేశాడు. ఇదేవిధంగా హిందుస్తానీ సంగీతాన్ని సృష్టించడానికి ఆయన కృషి చేశాడు. "సితార్" ఆయన సృష్టించినట్టిదే అని ప్రతీతి.

ఆయన పద్య కావ్యాలనే కాక, వచన గ్రంథాలను కూడా రచించాడు. ఢిల్లీ సుల్తాన్లలో ముగ్గురు, నలుగురికి ఆస్థాన కవి. అయినా ఆయన ప్రజాకవి. తెలుగు గడ్డపై వేమన పద్యాలకంటె మిన్నగా ఉత్తరభారతంలో సామాన్య జనుల పెదవులపై ఖుస్రో ఘజల్స్, దోహాలు ఎక్కువగా వర్తిస్తూ వుంటాయి.

"నేనెవరినా? ఇండియా చిలుకను. తియ్యతియ్యగా నాచేత పలికించాలంటే, నాతో హిందీలో మాట్లాడండి" అని అమీర్ ఖుస్రో ఏడువందల సంవత్సరాలనాడు వ్రాశాడు. ఇట్టివారినే మనం ఆదరించాలి, గౌరవించాలి, పూజించాలి.

ఇందుకు మారుగా పరమతాలపై విషాన్ని కక్కుతున్నవారు, అన్య సంస్కృతులను విద్వేషిస్తున్నవారు, సంకుచితత్వానికి, ఛాందసానికి ప్రోదిచేస్తున్నవారు, ఏకతను, మానవతను ప్రతిఘటిస్తున్నవారు మన దేశంలో, ముఖ్యంగా మన ఆంధ్రప్రదేశ్లో, ప్రస్తుతం, కవులుగా, కవిసామ్రాట్టులుగా చెల్లుతున్నారు. జాతీయ కవులుగా వారు మన్ననలు పొందుతున్నారు. కూడా. నిజానికి వారు జాతీయతకు బద్ధవిరోధులు, ప్రగతికి ప్రబల శత్రువులు. అయినా, వారు సన్మానాలను, మన్ననలు పొందడం, పదవులను, బహుమానాలను, పొందడం ఒక దేశంగా మన ప్రగతిని, ఒక జాతిగా మన భవిష్యత్తును ప్రగాఢంగా కాంక్షించే వారందరు.

ఆందోళన పడవలసిన విషయం. దీన్ని గుర్తించడానికి అమీర్ ఖుస్రో సంస్మరణ సభలు తోడ్పడగలవనే ఆశిస్తున్నాము. (ఆంధ్రజ్యోతి 2-12-1972)

## శ్రీ శరత్చంద్ర బోస్



“ప్రేమ గౌరవాలు” అని అంటాము.

“ప్రేమ వాత్సల్యాలు” అని అంటాము. ప్రేమ వున్న చోట గౌరవం వుంటుంది. లేదా, వాత్సల్యం వుంటుంది. ఇందువల్లనే "ప్రేమ గౌరవాలు”, “ప్రేమ వాత్సల్యాలు". “ప్రేమాభిమానాలు” మొదలైన ప్రయోగాలు అతి సహజమైనవిగా తోస్తాయి.

ఇందుకు మారుగా “విద్వేష గౌరవాలు" అని అంటే అది కేవలం విపరీతంగా ధ్వనిస్తుంది. “శత్రుత్వ వాత్సల్యాలు” అన్నప్పటికీ విడ్డూరంగానే కనబడుతుంది.

అయినా, విద్వేషం గౌరవంతో మిళితం కావడంకద్దు; శత్రుత్వం ప్రతి సందర్భంలోను గౌరవానికి స్థానం లేకుండా చేయలేదు కూడా.

కొడుకు తప్పునడక నడుస్తున్నాడని తండ్రి అతనిని కంటగించుకోవచ్చు. అంతమాత్రంచేత అతని హృదయం నుంచి పుత్రవాత్సల్యం తుడిచిపెట్టుకుపోతుందా?

ప్రతికక్షి పట్ల తీవ్రవిద్వేషం వుండవచ్చు. అయినా, ప్రతికక్షి ధీరుడైతే, అతనిపట్ల ఎంతో కొంత గౌరవం విధిగా కలిగి తీరుతుందిగదా?

రాణా ప్రతాప్ అగ్బర్ పాదుషాకు ప్రబల శత్రువే. ఎన్ని క్లేశాలనైనా సహించాడుగాని, మొగల్ సార్వభౌమత్వాన్ని గుర్తించడానికి ఆ రసపుత్ర వీరశేఖరుడు నిరాకరించాడు. ఇంతగా తనను ధిక్కరించి, బొందిలో ప్రాణం వున్నంతవరకు తనతో పోరాడినా నిజానికి “పోరాడినాడు” అనరాదు; “పోరాడినందునే అనాలి రాణాప్రతాప్ పట్ల అగ్బర్ పాదుషాకు గౌరవం కుదురుకున్నది.

రాణాప్రతాప్ అగ్బర్తో పోరాడినట్టే, శివాజీ ఔరంగజేబ్ తో పోరాడాడు. ఆ మహారాష్ట్ర మహావీరుని అలంగీర్ పాదుషా "కొండ ఎలుక" అని నిరసనగా మాట్లాడేవాడు. ఎంతగానో విద్వేషించేవాడు. ఆయనను చూచి, కొంత భయపడేవాడు కూడా.

అయితే, ఈ భయ విద్వేషాలలో కొంత భక్తి కూడా (పాదుషాకు తెలియకుండానే) మిళమై వుండేది. లేకపోతే, ఖైదుచేసిన శత్రువు పండుగ చేసుకోడానికి మిఠాయి బుట్టలను పంపించడం దేనికి? ఆ బుట్టలలో దాగి చేజిక్కిన శత్రువు పారిపోవడానికి అవకాశాన్ని అనాలోచితంగా కల్పించడ మేమిటి?

ప్రతికక్షి ధీరుడైనప్పుడు, అతని పట్ల ఎంత విద్వేషంవున్నా, గౌరవించకపోవడం దుస్తరం కనుకనే, శ్రీ శరత్చంద్ర బోస్ నిర్యాణానికి ఈనాడు స్వపక్ష, పరపక్ష భేదాలు లేకుండా సర్వజనులు ఇంతగా విచారిస్తూ ఆయన స్మృతికి గౌరవాంజలి ఘటిస్తున్నారు.



శ్రీ శరతాబాబులో ఏవైనా లోపాలున్నా (ఎవ్వరిలో లేవు?) పిరికి కంద వాటిలో ఒక్కటికాదు. తెగువలో, అవసరమైతే అందరినీ ధిక్కరించి ఒంటరిగా నిలవడంలో, ఆయనకంటే మిన్నగా ఎన్నదగువాడు ఆయన తమ్ముడు శ్రీ సుభాష్ బాబు ఒక్కడే.

దేశ దాస్యవిముక్తి కోసం పెక్కుమంది ఇతర కాంగ్రెసువాదుల వలె శ్రీ శరత్ బాబుకూడా పెక్కు త్యాగాలను చేశాడు; విశేష క్లేశాలను అనుభవించాడు. కాగా, తన సోదరునివలె ఆయన చూపిన ఒక విశిష్టత, - కాంగ్రెసు విధానాలు సక్రమమైనవి కావని భావించినప్పుడు వాటిని ప్రతిఘటించడానికి సంకోచించక పోవడం.


ఏయే కారణాలవల్ల, ఏయే పరిస్థితులలో కాంగ్రెసునుంచి శరత్ బాబు వైదొలగిపోయాడో అది ప్రస్తుతం ముఖ్యంకాదు. ఒక జీవితకాలాన్ని ఏ సంస్థ సేవలో వినియోగించాడో ఆ సంస్థను, ఒక జీవితకాలపు సన్నిహిత సహచరులను తన మార్గమే దేశహితాన్ని సాధించగలిగినట్టిదని నమ్మినంతనే విడనాడి, ఒంటరిగా నిలవడమే ముఖ్యం.

ఈ చర్యలోని ధీరోదాత్తతకే ఈనాడు శరత్ బాబు ప్రతికక్షులు సయితం గౌరవాంజలి నిడుతున్నారు.

శ్రీ శరత్బాబు ధీరోదాత్తుడేకాక, ప్రతిభావంతుడు. ఆయన చక్కని వక్త, న్యాయవాదిగా పేరందినవాడు, కార్యదీక్షగలవాడు. అనుచరులను ప్రేమించగలవాడు. వారి భక్తి విశ్వాసాలను పొందగలవాడు! సోదరుడు సుభాష్బాస్ ఉన్నతినికోరి, ఆయనకోసం అనేక సందర్భాలలో త్యాగాలనుచేసినవాడు. మత విభేదాలు ఏ కోశాన లేనివాడు, ఒక్క మాటలో, ప్రతికక్షులకు సయితం గౌరవభాజనుడు.

తలవని తలంపుగా ఈయన నిర్యాణం చెందడం దేశానికి ఒక పెద్ద లోటు. (ఆంధ్రప్రభ 24-2-1950)

## శ్రీ రమణ మహర్షి



మూర్ఖులందరు ఒకే మూసలో పోత పోయబడినవారివలె కనబడతారు. మహాత్ములు సయిత మింతే. సామాన్యులలోనే సామ్యాలు తక్కువ.

వెంగళప్పకు, సుబ్బారాయుడుకి అన్నీ పోలికలే. పుల్లయ్యకు, మల్లయ్యకు పోలిక పెట్టడం బహు కష్టం. మహర్షి, రాజర్షుల వద్దకు వచ్చేసరికి తిరిగి

అన్నీ పోలికలే. గాంధీ, లెనిన్లు ఒక విధంగా ఎంతో భిన్నమైనవారు. ఒకరు అహింసను తారకమంత్రం చేసుకొనగా, మరొకరు హింసాత్మక విధానాలనే లక్ష్యసిద్ధికి సాధనాలుగా చేసుకొన్నారు. అయినా, వీ రుభయుల మధ్య లెక్కలేనన్ని పోలికలు. ఉభయులు దరిద్రనారాయణుని ప్రతినిధులే; ఉభయులు మానవునికీ, మానవునికీ మధ్య అసమానత్వాన్ని తొలగించడానికి జీవితాలను అర్పించినవారే; ఉభయులు ఒక నవ్యవ్యవస్థతో ఒక నూతన ప్రపంచాన్ని సృష్టించడానికి తపస్సు చేసినవారే. ప్రవృత్తివల్ల వారు నవనీత హృదయులు. కాని, లక్ష్యాల విషయంలో వజ్రకఠోరులు.

తమపట్ల ఘోరాన్యాయం జరిగినా, దాన్ని వారు శాంతంగా సహించేవారు. కాని, సంఘానికి ద్రోహం జరిగినప్పుడు వారి హృదయాలు విసివియస్ గర్భం వలె కళపెళ ఉడికిపోయేవి. తమకు సంబంధించినంతవరకు వారు సర్వసంగ పరిత్యాగులు. అయినా, వారి జీవితకృషి దాస్య, దారిద్ర్య, దైన్యాల నిర్మూలనకే.

గాంధీ, లెనిన్ల మధ్యకంటే కూడా స్థూలదృష్టికి బెర్నార్డ్ షా, ఐన్స్టీన్ల మధ్య తక్కువ సామ్యం గోచరిస్తుంది. ఒకరు రచయిత, మరొకరు సైంటిస్టు. ఒకరికి మాటలపై మోజు, మరొకరికి అంకెలపై మమకారం. ఒకరు వక్త. మరొకరు మౌని. ఒకరు ప్రజాదృష్టిని తనపై కేంద్రీకరించుకొననిదే జీవించలేరు; మరొకరి ప్రతిభ ఏకాంతవాసంలోనే తప్ప భాసిల్లదు. అయినా ఉభయులు సృష్టి రహస్యాల సంశోధకులే; ఉభయులు విశ్వమానవ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నవారే. ఉభయులు ఋషి సత్తములే.

ఇదే విధంగా షెల్లీకి, అబ్రహాం లింకన్కు సామ్యం కలదంటే అది విపరీతంగా తోచవచ్చునుగాని, వాస్తవానికి దానిలో వైపరీత్య మేమీ లేదు. ఆ మహాకవి వలె, ఈ అమెరికన్ ప్రెసిడెంట్ కూడా, స్వేచ్ఛా ప్రియుడు. ఆయనవలె ఈయనకూడా దాస్యానికి, అది ఏ రూపంలో కానవచ్చినా, ప్రబల విరోధి. ఆయన ప్రవృత్తివలె ఈయనదికూడా శైశవ వినిర్మలత్వాన్ని కోల్పోనట్టిది. ఆయన ఉద్విగ్నుడు; ఈయన శాంత స్వభావుడు. అయినా, ఉభయులు ప్రేమతపస్వులు. స్త్రీ హృదయ చంచలత్వం షెల్లీ ప్రేమకు, గయ్యాళి భార్య పెట్టిన బాధలు

లింకన్ ప్రేమకు, ఒక విశిష్టతను తెచ్చి, సౌందర్య విలసిత ప్రకృతిపైకి, బాధావిచలిత మానవాళిపైకి దాన్ని మరలించడం తటస్థించింది కూడా.

ఇంత దేనికి? ఉపనిషత్తుల కర్తలు, అజంతా చిత్రకారులు ఒకే అంతస్థుకు చెందినవారు. రామాయణ మహాభారతాలను, ఇలియడ్, ఒడెస్సీలను రాసినవారు ఒకే పాయకు చెందినవారు. ఆధ్యాత్మిక చింతాపరులు. ఆధునిక శాస్త్ర పరిశోధకులు మూసలో పోతపోయబడినవారు. ఇది సత్యమని గుర్తించగల పక్షంలో గాంధీజీద్వారా వ్యక్తమౌతున్న శక్తే తన ద్వారా కూడా వ్యక్తమౌతున్నదని రమణమహర్షి పలికిన పలుకులో ఎంత సామంజస్యం కలదో సువిదితమై పోతుంది.


గాంధీజీవలె రమణ మహర్షి ప్రజల మధ్యకు వెళ్ళి ఉండకపోవచ్చు. వారి కష్టసుఖాలతో ప్రత్యక్ష ప్రసక్తిని పెట్టుకు ఉండకపోవచ్చు; రాజకీయ రంగంలో నిలిచివుండకపోవచ్చు; సాంఘిక వ్యవస్థలో మార్పులకు ప్రయత్నించి ఉండకపోవచ్చు; ప్రజాసేవలోనే ప్రాణార్పణ చేసి ఉండకపోవచ్చు. ఆయన ఒక జాతికి జాతిపైనే తన వ్యక్తిత్వం ముద్రను వెయ్యగా, చిత్తశుద్ధితో తనవద్దకు చేరిన బహు కొద్దిమంది శిష్య ప్రశిష్యులపై మాత్రమే ఈయన ప్రభావం ప్రసరించి ఉండవచ్చు. అయినా, ఉభయుల ద్వారా పనిచేసింది ఒక మహాశక్తి. అది లోక సంగ్రహాశక్తి.




ఒకచోట ముక్కుమూసుకు కూర్చుని తపస్సు చేసినవాడైనా. సర్వ సాధారణంగా మౌనవ్రతాన్నే అనుష్ఠించినవాడైనా, సమకాలిక జీవితవాహినిలో దూకనివాడైనా, కేవలం జీవన్ముక్తి కోసమే రమణ మహర్షి కృషిచేసినవాడు కాదు. సంఘం వ్యక్తికంటే అధికమైనదని, ఉత్కృష్టమైనదని ఆయనకు తెలుసు. "సముదాయేన సర్వస్య సంఘస్యతను దారిణాం. సౌభ్రాత్రం సమభావేన గంతవ్యం పరముచ్యతే" అని ఆయన ప్రవచించాడు. వ్యక్తులు సంఘమనే శరీరానికి అంగాలను పోలినవారని ఈ ప్రవచనం స్పష్టపరుస్తుంది. సంఘంలో సౌభ్రాత్రం నెలకొనడం వ్యక్తుల మధ్య సమత్వం సాధించబడినప్పుడే అని ఇది నిర్దేశిస్తుంది.ఇంతేకాదు. "అంగం యథా శరీరస్య కరోత్యుప్రకృతి యంతే. తథోపకారం సంఘస్య కుర్వన్ జయతి సాంఘికః" అని కూడా ఆయన ఉపదేశించాడు. శరీరానికి అంగం సేవ చేసినట్టే. సంఘానికి సేవచేసిన మానవుని జీవితానికే సార్థక్యమని దీని తాత్పర్యం.

ఒకే శక్తి - లోక సంగ్రహశక్తి ఈ విధంగా గాంధీజీ ద్వారా పనిచేసినట్టే, రమణమహర్షి ద్వారా పనిచేసినదనడానికి జీవితంపట్ల, మృత్యువులపట్ల వారి దృక్పథమే తార్కాణం. నిత్యజీవిత కృత్యాలలో పాల్గొంటున్నా, వాటికి సర్వకాల సర్వావస్థలలో వారిద్దరు అతీతులే. వారు స్థితప్రజ్ఞులు. వారిది నిష్కామకర్మ. జీవిత యాత్రను చాలించడానికి వారెన్నడు తాపత్రయపడలేదు. అయితే, మృత్యుసమ్ముఖాన చలించలేదు

కూడా. భౌతికదేహం జీర్ణించకపోక తప్పదని వారికి తెలుసు. అశ్వరమైన భౌతిక దేహం అనశ్వరమైన ఒక మహాశక్తి వ్యక్తీకరణకు సాధన మాత్రమే అని వారి పరమ విశ్వాసం.



అయితే, గాంధీజీ అనుష్టించింది కర్మయోగం కాగా, రమణ మహర్షి అనుష్టానం చేసింది జ్ఞాన యోగం. ఈ రెండింటిలో ఏమార్గం విశిష్టత దానికి కలదుగాని, రెండవ మార్గంలో నిజంగా నడిచేవారికంటే నడుస్తున్నట్లు నటించేవారి సంఖ్య బహుళం. ఇటీవలి శతాబ్దాలలో నానక్, కబీర్, సమర్థ రామదాసు, రామకృష్ణ పరమహంస, వివేకానంద, రామతీర్థ, అరవింద యోగి, రమణ మహర్షి మొదలైన కొద్దిమందిని మినహాయిస్తే, జ్ఞానమార్గాన నిజంగా నడిచినవారు మరి కానరారు. ఆ మార్గంలో నటనకు గల సౌలభ్యమే మనజాతిలో శుష్కవేదాంత ప్రియత్వాన్ని పెంపొందించి, దాన్ని నిర్వీర్యం చేసింది. నిస్తేజ మొనర్చింది. ఇందువల్ల మనకు ఈనాడు ముఖ్యంగా కావలసింది కర్మయోగం. రమణ మహర్షి కూడా లక్ష్యసిద్ధికై నిరంతర కృషిద్వారా వ్యక్తి సంఘంలో విలీనం కాగలడని, ఇట్టి నిష్కామకర్మ ఆత్మోన్నతికి ఒక మార్గమని, ఇదే బహుజన యోగ్యమైనదని చెప్పినవాడే; ఇహజీవితాన్ని మీరు సార్థకం చేసుకోగలిగితే, పరం తన జాగ్రత్త తాను పడగలదని చెప్పినవాడే.

ఆయన నడిచిన మార్గాన్ని కోరినా నడవగలవారు బహు తక్కువ. ఆయన చెప్పిన దారిని మాత్రం కోరితే ఎందరైనా పురోగమించవచ్చు. (ఆంధ్రప్రభ 16-4-1950)

వివరణ : ఇలియడ్: ఒడెస్సీలు గ్రీకు పురాణగాథ.

## గురునానక్



"హిందువు లేదు, ముస్లిం లేదు, నిజంగా ఉన్నది మానవుడు మాత్రమే" - ఈ సత్యాన్ని 15వ శతాబ్దిలో లోకానికి చాటినవాడు గురునానక్. ఈ సత్యాన్ని చాటడానికి ఆనాడు ఏ పరిస్థితులు ఆయనను ప్రేరేపించాయో అవే పరిస్థితులు ఈనాడు కూడా ఉన్నాయి. కనుకనే ఆయన పలుకులు ఆనాటికే కాదు, ఈనాటికి కూడా వర్తిస్తాయి. ఆయన పలుకులలోని సత్యం మన రక్తంలో జీతించనంత వరకు, అది మన జీవితాలలో అంతర్భాగం కానంతవరకు మానవుడు మానవుడుగా పెరగలేడు!

నానక్ జన్మించి అయిదువందల సంవత్సరాలైంది; ఆయన అయిదవ శతజయంత్యుత్సవాలు నేడు జరుగుతున్నాయి. కేవలం జయంత్యుత్సవాన్ని లాంఛనంగా జరుపుకొనడంలో సరిపుచ్చక, ఆయన, చాటిన సర్వమానవ సమానత్వ సందేశాన్ని మననం చేయడం కూడా ఈనాడు మన పవిత్ర విధి.

ఆయన కాలంనాటికి ఇండియాలో ముస్లిం పరిపాలన స్థిరపడిపోయింది. దేశంలో ఇస్లామ్ వ్యాపిస్తున్నది. దానితోపాటు హిందూ - ముస్లిం భేదాలు విపరీతంగా వ్యాపిస్తున్నాయి. కొంచెం వెనుక ముందులుగా ఆ కాలంలో ఇటు హిందూ సమాజం నుంచి, అటు మహమ్మదీయ సమాజం నుంచి కూడా మత సంస్కర్తలు పెక్కుమంది బయలుదేరి, మతభేదాలకు అతీతమైన పరతత్త్వం ఒకటి కలదని, మానవులు ఉపాసించవలసింది ఆ తత్త్వాన్నే కాని, చిల్లరమల్లర పేర్లతో చిల్లరమల్లర దేవుళ్లను కాదని ఉపదేశించారు. సంకుచిత కులమతాచారాలను పాటిస్తే మానవునిలోని మానవత పలచబడి పోగలదని చాటి చెప్పారు. కబీర్, రామదాస్, దాదూ, చరణ్ మొదలైన వారెందరో ప్రభవించి కులమత విభేదాలకు అతీతమైన ఏకమానవతాధర్మాన్ని ప్రబోధించారు; మతం పేరిట జరిగే దురాచారాలను ఖండించారు. భగవంతుడు ఒకడేనని, అన్ని మతాల గమ్యం అతడేనని, పూజలు, వ్రతాలు ఉపవాసాలు మొదలైన శుష్కాచారాలతో కాక, తోటి మానవులను ప్రేమించడం ద్వారా, వారికి సర్వవిధాల సేవచేయడం ద్వారా ఆ గమ్యాన్ని చేరుకోవచ్చునని ఉపదేశించారు.



వారి కోవకు చెందినవాడే గురునానక్. హిందూమతానికి, ఇస్లాముకు, మరి ఏ మతానికి చెందినవాడైనా మానవుడు మానవుడేనని, అతడిని ప్రేమించడమే భగవంతుని ప్రేమించడమని ఆయన ఉద్బోధించాడు.

ఈ సందేశ ప్రాధాన్యం ఈనాడెంతగా ఉన్నదో వేరే చెప్పనక్కరలేదు. మానవులను ఏకంచేయవలసిన మతమే ఈనాడు వారిమధ్య అడ్డుగోడలను పెడుతున్నది; వారి మధ్య విద్వేషాలను పెంచుతున్నది. దీని దుష్ఫలితాలను మనం ఈనాడు మన దేశంలో అనుభవిస్తున్నాము. ఇటీవల గుజరాత్లో జరిగిన మతకలహాలే ఇందుకు తార్కాణం.

భిన్న మతాలకు, భిన్న సాంఘిక, రాజకీయ వ్యవస్థలకు చెందిన దేశాలమధ్య ఈనాడు సహజీవనం కొనసాగుతున్నది. కేవలం మతాన్ని పురస్కరించుకొని స్నేహంగాని, విరోధంగాని పాటించడం తగదని, ఆధునిక ప్రపంచంలో మత విభేదాలపై ఆధారపడిన విధానాలకు తావు లేదని దాదాపుగా అన్ని దేశాలు గుర్తించాయి. అయినప్పుడు, ఏదైనా ఒక దేశంలో వివిధ మతాలమధ్య శాంతియుత సహజీవనం ఎందుకు సాధ్యం కారాదు. ఈ ప్రశ్నను మన దేశంలోని వివిధ మతాలవారు తమకు తాము వేసుకొన్నప్పుడు మతాన్ని పురస్కరించుకొని ఆవిర్భవిస్తున్న విభేదాలు, విద్వేషాలు మటుమాయం కాగలవు.

అయిదు శతాబ్దాలనాడు గురునానక్ ప్రబోధించిన సత్యమిదే! మతాన్ని మించినట్టిది మానవత్వమని ఆయన తన కాలంవారికి గుర్తుచేశాడు. ఆయన జయంతి సందర్భంలో దాన్ని మరొకసారి గుర్తుచేసుకొనడమే ఆయన స్మృతికి మనం ఘటించగల శ్రద్ధాంజలి.

"శరణం" గౌతమబుద్ధ

శాసింహా! (ఆంధ్రజ్యోతి 23-9-1969)

కపిలవస్తులో కన్ను తెరచిన నీవు కుసీనగరంలో కన్నుమూసి నేటికి రెండున్నరవేల సంవత్సరా లైంది. అయినా, నీ మూర్తి చెన్ను తగ్గలేదు; నీ సందేశం వన్నె తగ్గలేదు; కోటానుకోట్లకు నీవిప్పటికీ తెన్ను చూపుతున్నావు; మిన్ను వాక కంటె మిన్నగా నీలోని కారుణ్య సింధువు ఎన్నెన్నో జీవిత క్షేత్రాలలోకి ప్రవహించి పసిడిని పండిస్తున్నది.

నీ తండ్రి నిన్ను శాక్య రాజ్యాధిపతిని చేయగోరినాడు. కాని, ఆ రాజ్యమెంత? దాని పరిమితు లెంత? నిన్ను కన్నట్టి మహాభాగ్యం అబ్బి ఉండకపోతే, నాటి గణరాజ్యాలు పెక్కింటి విషయంలో జరిగినట్టు దాని పేరు సయితం ఈ సరికే విస్మృతి గర్భంలో కలిసిపోయి ఉండేదే!

నీ తండ్రి నీకు కట్టబెట్టగోరిన శాక్యరాజ్యం స్థానంలో నీ వొక అమరరాజ్యాన్ని, ఆసియా ఖండం యావత్తుకు విస్తరించిన మహారాజ్యాన్ని, అనంతకోటి మానవ హృదయాలపై అధికారాన్ని ప్రతిష్ఠాపింప జేసుకొన్న ధర్మ సామ్రాజ్యాన్ని సంస్థాపించుకున్నావు.

నీవు సంస్థాపించిన ఈ ధర్మ సామ్రాజ్యం సరిహద్దులు శాక్యరాజ్యాన్ని దాటి, భారతావనిని దాటి, సముద్రాలనే దాటి, బర్మా, ఆఫ్ఘనిస్తాన్, సింహళం, టిబెట్, కాశ్మీర్, నేపాల్, సిక్కిం, భూటాన్, ఇండో-చైనా, ఇండొనీసియా, చైనా, జపాన్, మంచూరియా, మంగోలియా మొదలైన అశేష దేశాలకు విస్తరించాయి. ఇంతటి విస్తృత సామాజ్యం నీకు తప్ప ప్రపంచ చరిత్రలోనే మరెవ్వరికీ లేదు.

సిద్ధార్థా!

నిజంగా నీవే సిద్ధార్థుడవు. సారనాథ్ వద్ద మృగదావంలో నీ ద్వారా ప్రారంభమైన ధర్మ ప్రవర్తనం ఈనాటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నది. కొన్ని దేశాలలో - నీ జన్మస్థానమైన భారతదేశంలోనే నీ పేర ప్రసిద్ధమైన మతం బౌద్ధమతం - అదృశ్యమైనచోట్ల కూడా నీ -.

"శరణం" గౌతమబుద్ధ

ప్రభావం జాతీయ జీవితంలో ఒక అంతర్వాహినిగా ప్రవహిస్తూనే ఉన్నది; ప్రజా హృదయం పై ఒక అసదృశశక్తిగా పనిచేస్తూనే ఉన్నది.

“నేను ప్రారంభించిన ధర్మం నా తర్వాత అయిదువందల యేండ్లకు మించి మిగలదేమో!" అని ఒకానొక సందర్భంలో నీవన్నట్టు ప్రతీతి. నీవు మహాపరినిర్వాణాన్ని చెంది 2,500 సంవత్సరాలైంది. అయినా, నీ మతం లేనిచోట నీ ధర్మం నేటికీ అప్రతిహతంగా రాజ్యాన్ని చేస్తూనే ఉన్నది.

తథాగతా!

ఎంత కృత్రిమమైనది - ఎంత కఠోరమైనది నీవు అవతరించిన నాటి భారత సంఘం! - దానిలో కారుణ్యానికి తావులేదు. క్రతువుల పేర జంతుబలులతో పాటు నరబలులు సయితం కొనసాగుతుండేవి. వర్ణ, కుల వ్యవస్థలు మానవతకే మచ్చగా ఉండేవి. అజ్ఞానానికి ప్రోదిచేస్తూ, హింసాకార్యాలను ప్రోత్సహిస్తూ పురోహితుడు సామాన్య ప్రజలను పీల్చి పిప్పిచేస్తుండేవాడు. యజ్ఞయాగాదులకు ఆనాడున్న విలువ సజ్జనులకైనా ఉండేది కాదు.

సమతలేని ఆ సంఘంలో నీవు సామాన్య మానవునికే పట్టాభిషేకం చేశావు. క్రౌర్యం రాజ్యం చేస్తున్న జీవితాలపై నీవు కారుణ్యాన్ని చిలికి, వాటిని పునీతం చేశావు. కారుణ్యమూర్తీ!

సోదర మానవులకే కాక, సకల జీవకోటికి పరివ్యాప్తమైనట్టిది నీ కారుణ్యం. ఎక్కడ, ఏ రూపంలో, ఎంత స్వల్పంగా దుఃఖం కనబడినా నీ మనస్సు చివుక్కుమనేది; నీ గుండెలు గాయపడేవి; నీ కన్నులు చెమ్మగిలేవి; నీలోని ప్రత్యణువు ద్రవీభూతమయ్యేది. దుఃఖ నివారణ మార్గాన్వేషణకై, మహాసంబుద్ధి తర్వాత దుఃఖ నివారణకై నీవు కనుగొన్న మార్గాన్ని అన్యుల కేలెత్తి - ఎలుగెత్తి - చాటడానికే నీవు జీవించావు; అందుకోసమే మరణించావు; ఇది పొరపాటు! నీవు మరణించలేదు. నీ సందేశం లోకంలో మిగిలి ఉన్నంత వరకు - మానవ హృదయంలో కారుణ్యానికి స్థానం ఉన్నంతవరకు నీకు మరణం లేదు. అందువల్లనే నీ మహాపరినిర్వాణ దినాన్ని నేటి ప్రపంచం నీ “జయంతి”గా కాక, నీ “వర్ధంతి”గా జరుపుకొంటున్నది!

గౌతమ బుద్ధా!

రెండున్నర వేల సంవత్సరాల నాడు మమ్ము వీడి వెళ్ళినప్పటికీ నీవు మా మధ్యనే ఉన్నావు. మా కోసమే పరితపిస్తున్నావు; మాపై నీ కారుణ్యామృతాన్ని చిలుకుతున్నావు; మాకు నీ అహింసా సందేశాన్ని వినిపిస్తున్నావు. నీ మతానికి నీ మాతృభూమిలో స్థానం మిగలకపోయినా, నీ సందేశానికి మేము బధిరులము కాము; నీ దివ్యజ్యోతికి మేము అంధులము కాము; మా హృదయాలనుంచి మేము నిన్ను వెలివేయలేదు.

నీ సిద్ధాంతాలన్నింటిని మేము పాలించడం లేదనడం నిజం. నీవు నిరసించిన జాతి, మత, వర్గ, కుల వ్యవస్థలు తిరిగి నీ మాతృదేశంలో తలయెత్తినవని మేము అంగీకరిస్తాము. కాని, వాటిని చూచి మేము ఈనాడు గర్వపడ్డంలేదు; సిగ్గిలుతున్నాము. ఇలాగే అనేకములైన ఇతర విషయాలలో కూడా!

అయితే, నీ అహింసా సిద్ధాంతం - నీ కారుణ్య సందేశం కొంతవరకైనా మాలో జితించిపోయింది. అందువల్లనే నీ తర్వాత ఇరవై అయిదు వందల సంవత్సరాలకు మా మధ్య మరొక అహింసామూర్తి - మరొక

కారుణ్యమూర్తి - గాంధీజీ అవతరించడం తటస్థించింది. ఆ మహాత్ముని హత్య చేసుకున్న పాపానికి మా జాతి వొడిగట్టుకొన్నా, ఆయన నీ మాతృదేశంలోనే తలయెత్తడానికి నీ ప్రభావమే కారణమనడంలో సందేహం లేదు!

మహాత్మా!

ఈ అణ్వస్త్రాల యుగంలో నీ అహింసా సందేశం ఆవశ్యకత - నీ కారుణ్యామృతం ఆవశ్యకత - అత్యధికంగా పెరిగింది! ఆధునిక యుగానికి తగు కొన్ని మార్పులతో నీవు ప్రతిపాదించిన "పంచశీల" తప్ప నేటి ప్రపంచానికి శరణం లేదు. అందువల్లనే "సంఘం శరణం గచ్ఛామి" అంటూ, "ధర్మం శరణం గచ్ఛామి" అంటూ నీ పాదపద్మాల శరణుజొచ్చుతున్నాము. నీ కివే మా జోహారులు.

(ఆంధ్రప్రభ 24-5-1956)

## శ్రీ శారదామణి



బాహ్య ప్రకృతిని స్వాధీనం చేసుకొనడంలో మానవుడెంతగానో ఉత్తీర్ణుడైనాడు. ఇప్పటికి పొందిన అభివృద్ధితో సంతృప్తి చెందక సంపూర్ణ సాధనకు ఉత్సాహంతో కృషి చేస్తున్నాడు. ఇది ప్రశంసనీయమే. కాని, మానవజన్మకు సార్థక్యం కేవలం బాహ్య ప్రకృతిని వశం చేసుకొనడంలో గాక స్వస్వరూప జ్ఞానం పొందడంలోనే గలదు.

నిజానికి, మానవునికి బాహ్య విషయాలను గురించి కంటే తన్ను గురించి తెలిసినదే బహు తక్కువ. తానెవరో, తన యదార్థస్థితి యేదో తెలియక పోయిన తర్వాత, బాహ్య విషయ పరిజ్ఞానం వల్ల కలిగే ప్రయోజనం సార్థకం కాజాలదు.

లోకరంగంలో ప్రాబల్యం వహించడానికి కావలసిన శక్తులు వేరు. ఆత్మవికాసం పొందడానికి కావలసిన ప్రజ్ఞ వేరు. ఈ విషయమే మహితాత్ముల జీవితాలు మనకు హెచ్చరిక చేస్తున్నవి. శ్రీ రామకృష్ణ పరమహంస అర్ధాంగి అయిన శ్రీ శారదామణి విద్యాధికురాలు కాదు, ధనసంపన్నురాలు కాదు. కాని, విద్యాధికులు, ఐశ్వర్యవంతులు ఆమె చరణ సన్నిధిని ప్రణమిల్లి చిత్త సంస్కారం పొందారు. ఆమె నిరాడంబరజీవి. దివ్యానుభూతిని పొందిన ధన్యచరిత.

పూవు తన తావిని అప్రయత్నంగా నలుదిశల వెదజల్లునట్లు మహాత్ములు తమ చెంతకు వచ్చిన వారిపై తమ ప్రభావాన్ని ప్రసరింపజేస్తారు. అట్టి అద్భుత సంఘటనలెన్నో శ్రీ శారదామణి జీవితంలో కలవు. దారులుకొట్టే దుండగులు ఆమెకు శిష్యులుగా మారిపోయినారు. ఆమె ప్రేమకు పాత్రులైనవారు ఏ ఒక వర్గానికి

చెందినవారు కారు; ఏదో ఒక సిద్ధాంతానికి బద్ధులైనవారు కారు. సిద్ధాంతాల సమైక్యం వల్ల హృదయాల సాన్నిహిత్యం విధిగా సిద్ధించగలదనుకొనడం కూడా పొరబాటేనని మహాత్ములందరి జీవితాలలో వలె శ్రీ శారదామణి జీవితంలో కూడా నిరూపితమవుతున్నది.

శ్రీ శారదాదేవి శతవార్షిక జయంత్యుత్సవాలు దేశమంతటా జరుపబడుతుండటం ప్రశంసనీయం. ఇట్టి పూత చరితలు పురాణయుగంలోనే కాక 20వ శతాబ్దంలో కూడా ఉండడం గమనార్హమైన విషయం. అభివృద్ధి ఒక యుగానికి పరిమితం కాదని, పూర్వం కంటే కూడా భవిష్యత్తులో ఎక్కువ అభ్యుదయం సాధించవచ్చునని స్పష్టమౌతుంది. (ఆంధ్రప్రభ 5-12-1954)

## రాలిపోయిన రెండు నక్షత్రాలు

## (శ్రీ బి.సి. రాయ్, శ్రీ పురుషోత్తమదాస్ టాండన్)

ఒకేనాడు రెండు మహోజ్వల నక్షత్రాలు రాలిపోయినవి; రెండు మహావటవృక్షాలు కూలిపోయినవి; ఒకేనాడు కలకత్తాలో డాక్టర్ బి.సి.రాయ్, అలహాబాద్ లో శ్రీ పురుషోత్తమదాస్ టాండన్ కన్నుమూయడంతో భారతజాతి కురువృద్ధుల నిద్దరిని కోల్పోయింది.

వీరిద్దరి రాష్ట్రాలు వేఱు, భాషలు వేఱు, చదువుకొన్న చదువులు వేఱు, అభిరుచులు వేఱు, స్వభావాలు వేఱు. అయినా, దేశభక్తిలో, జాతీయాభిమానంలో, ప్రజాసేవలో వీరిద్దరి మధ్య భేదం లేనేలేదు. ఉభయులు దేశ స్వాతంత్ర్య సముపార్జన తర్వాత జాతీయ పునరుజ్జీవనానికై ఎంతగానో కృషి చేశారు. ఉభయులు కూడా సమానంగా ధన్యజీవులు.

డాక్టరుగా అంతర్జాతీయ విఖ్యాతి గడించుకొన్న ప్రతిభావంతుడు బి.సి. రాయ్. రోగ నిదానంలో, చికిత్సా నిర్ణయంలో ఆయనకు ఆయనే సాటి. వైద్యశాస్త్రంలో తన ఈ పాండితిని ఆయన ప్రధానంగా ప్రజాసేవకే వినియోగించాడు. ఆయన గాంధీజీ, మోతీలాల్ నెహ్రూ, జవహర్లాల్ మున్నగు మహా నాయకులకు మాత్రమే వైద్య విషయాలలో సలహాదారు కాదు; అతి సామాన్యునికి కూడా ఆయన సలహా లభిస్తూ ఉండేది.

ఇంతగా ఒక రంగంలో ప్రఖ్యాతిగాంచిన వ్యక్తి తిరిగి ఇంతగా మరొక రంగంలో కూడా రాణించడం చాలా అరుదు. డాక్టర్ రాయ్ ఎంత గొప్ప వైద్యుడో, అంత గొప్ప ప్రజానాయకుడు కూడా. దాదాపు పద్నాలుగు సంవత్సరాలపాటు ఆయన పశ్చిమ బెంగాల్కు ముఖ్యమంత్రి. ఈ పద్నాలుగు సంవత్సరాలు ఆయన పలుకే శాసనంగా చెల్లినదనడం అతిశయోక్తి కాబోదు. రాజ్యాధికారం ద్వారా కాక, పరిపాలనలో తాను చూపిన దక్షత కారణంగానే, ప్రజాసేవలో తాను చూపిన చిత్తశుద్ధి కారణంగానే ఆయన వంగరాష్ట్రానికి ఏకైక నాయకుడుగా చెల్లగలిగాడు; చిత్తరంజన్స్ తర్వాత అంతటివాడుగా మన్ననలను పొందగలిగాడు.

డాక్టర్ రాయ్ వలె శ్రీ పురుషోత్తమదాస్ టాండన్ అందరినీ సమానంగా ఆకర్షించిన వ్యక్తి కాకపోవచ్చు. కొన్ని విషయాలలో పరమ ఛాందసుడుగా ఆయన కొందరికి తోచిఉండవచ్చు. అయినా, కొన్ని నిశ్చల విశ్వాసాలున్నవాడు; వాటి కోసం నిష్కళంక చిత్తంతో కృషిచేసినవాడు. నిజమైనదని, న్యాయమైనదని తాను నమ్మినదాని కోసం ఆయన ఎన్ని కష్టనష్టాలకైనా సిద్ధపడేవాడు. ఎవరినైనా ప్రతిఘటించి నిలవడానికి సంకోచించేవాడు కాదు. హిందీ విషయంలో గాంధీజీని, కాంగ్రెసు వ్యవహారాలలో నెహ్రూను వ్యతిరేకించడానికి ఆయన జంకలేదు. గాంధీ, నెహ్రూలను వ్యతిరేకించడంలో టాండన్ కొంత సంకుచిత దృష్టితోనే వ్యవహరించి

ఉండవచ్చు. కాని, తన విశ్వాసాల కోసం, తన లక్ష్యాల కోసం ఆయన ప్రదర్శించిన వీరోచిత చిత్తవృత్తి ఎంతో ప్రశంసనీయమైనదే కాదా?

ఈ నాయకులిద్దరు గొప్పగా బ్రతికారు; గొప్ప వారుగా మరణించారు. వెలితి లేనివి వారి జీవితాలు; వారిని కోల్పోయిన కారణంగా వెలితి కనబడేది మన జాతీయ జీవనంలోనే. (ఆంధ్రజ్యోతి 2-7-1962)

## మాస్టర్: శ్రీ తారాసింగ్



మాస్టర్ తారాసింగ్ ఆట మరి కట్టనున్నదా? భారత రాజకీయాలలో మూడు, నాలుగు దశాబ్దాలుగా ఆయన వహిస్తున్నట్టిది వృద్ధజంబుక పాత్ర. అకాలీదళమే తాను, తానే అకాలీదళం అన్నట్టుగా వ్యవహరించ గలిగినందున “లేస్తే నేను మనిషిని కాదు సుమా!” అని చీటికి మాటికి ఆయన బెదిరించ గలుగుతున్నాడు. కనీసం ఇప్పటికైనా మాస్టరీ లక్ష్యాలు ఎంత సంకుచితమైనవో, ఆయన విధానాలు ఎంత హానికరమైనవో అకాలీదళ ప్రముఖులు గుర్తించగలిగారు! అందువల్ల, పాత నాటకాన్ని మరి ఆయన ఆడలేడనే భావించవచ్చు. ఆచార్య పీఠమో, అధికార పీఠమో తనకు దక్కగల విధంగా పాకిస్తాన్ ఫక్కీపై శిఖిస్తాన్ స్వతంత్ర రాజ్య నిర్మాణానికి ఒక ఘట్టంలో మాస్టర్ ప్రయత్నించాడు. ఇందుకోసం ఆయన ఒకవైపున మిస్టర్ జిన్నాతో, మరొక వైపున బ్రిటిషు వారితో రాయబారాలను కొనసాగించడం సయితం జరిగింది. ఆ యెత్తుగడ విఫలమైపోయిన పిదప "పంజాబీ సుబా” అనే కొత్త నినాదాన్ని ఆయన ప్రారంభించాడు. పేరు "పంజాబీ సుబా” కావచ్చు గాని, ఆయన కోరుతున్న ప్రత్యేక రాష్ట్రానికి ప్రాతిపదిక భాష కాదు, మతం మాత్రమే! అందువల్లనే, ఆయన కోర్కెను భారత ప్రభుత్వం నిరాకరించడం జరిగింది.

సంత్ ఫతేసింగ్ ను పోలినవారు మాస్టరీ ఆదిలో సరిగా అర్థం చేసుకోలేకపోయారు. వచ్చారు. కానీ, ఇప్పుడు వారికి కనువిప్పు అయింది! కోరుతున్న పంజాబీ సుబా స్వరూప స్వభావాలను అందువల్లనే, వారు తారాసింగ్ ను సమర్థిస్తూ భాష ప్రాతిపదికపై కాక, మతం ప్రాతిపదిక పైనే మాస్టరీ పంజాబీ సుబాను కోరుతున్నట్టు,

ఆయన విధానాలు శిఖులు, హిందువుల మధ్య విషాన్ని చిలుకుతున్నట్టు చివరికి గ్రహించగలిగినందువల్లనే సంతీ ప్రభృతులు ప్రస్తుతం తారాసింగ్‌పై బాహాటంగా తిరగబడినారు!




మా దృష్టిలో ఇది ఎంతో శుభపరిణామం! మాస్టరీని అకాలీదళం నాయకత్వం నుంచి ఎంత త్వరగా తొలగిస్తే, శిఖ్ఖు సంఘానికి అంత మేలు కలుగుతుంది. ఇది మాత్రమే సరిపోదు. ఈనాటి పంజాబ్ రాష్ట్రమే పంజాబీ సుబా అని అకాలీదళం నాయకులు ఇకనైనా గుర్తించాలి. శిఖులకే కాక, పెక్కు మంది హిందువులకు సయితం పంజాబీయే మాతృభాష. మత విభేదాలను అడ్డుగా నిలవ నివ్వకుండా పంజాబీ భాషాభివృద్ధికి, సారస్వతాభివృద్ధికి, అది మాతృభాషగా గలవారందరు ఇతోధికంగా కృషి చేస్తే, పంజాబ్ జీవితంలో ఇప్పటికే ప్రాధాన్యం వహిస్తున్న పంజాబీ భాష మరింత ప్రముఖ స్థానాన్ని తప్పక ఆక్రమించుకో గలుగుతుంది! (ఆంధ్రజ్యోతి 5-8-1962)

## భక్త్యంజలి : శ్రీ కృష్ణ సిన్హా

స్వాతంత్ర్య సంగ్రామంలో అతిరథ మహారథు లెందరెందరో ఉన్నారు. కాని వారందరు స్వతంత్ర భారతంలో పరిపాలకులుగా కీర్తి ప్రతిష్ఠల నార్జించుకొనలేదు.




రణరంగంలోనే కొందరు గండరగండలు కాగా, గద్దెపైనే కొందరు ఘనులనిపించుకున్నారు. మరి రెండిటా సవ్యసాచివలె మగటిమి నెరపి పేరుమోసిన కాంగ్రెసు పెద్ద శ్రీ కృష్ణ సిన్హా. మహాత్ముని సమరశంఖ ధ్వానం వినినదే తడవుగా, నాలుగేళ్ళు శ్రమించి పెంచుకున్న న్యాయవాద వృత్తికి నిశ్చింతగా నీళ్ళు వదలుకొని కారాగారం వేపు నడిచిన ధీరుడాయన. నాటి నుంచి నేటిదాకా అనేక రూపాలలో మాతృదేశ సేవాతత్పరుడై ఆ సేవా చరణంలోనే

అసువులర్పణవెట్టిన దేశభక్తుడు శ్రీ సిన్హా.

యౌవనంలో విప్లవకారుడైన ఖుదీరాం బోస్, అరవింద ఘోష పోకడలాయన జీవితాన్ని ప్రభావితం చేయగా, తర్వాత గాంధీజీ ప్రవచనాలాయన జీవనస్రవంతిలో వేయి రేకుల తామరలను పూయించినవి.

అందుకనే ప్రతి ఉద్యమ ఘట్టంలోను బంధితుడయినాడు; ప్రజా సేవనంలో కాకలు తీరినాడు. ఇంట గెల్చి రచ్చ గెలువవలెనన్న ధోరణి గలవాడు. కనుకనే మాంఘీర్ జిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడుగా చాలకాలం పనిచేశాడు. అట్లే ఆ జిల్లా బోర్డు ఉపాధ్యక్షుడుగా, అధ్యక్షుడుగా ఉండి పరిపాలనాదక్షుడయినాడు.




తొలిసారి కాంగ్రెస్ భారతదేశంలో పదవీ స్వీకారం చేసిన 1937 నుంచి తుదిదాకా - నడుమ కొన్ని రోజులు గవర్నర్ల పరిపాలనా కాలంలో తప్ప - బీహార్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నిరాటంకంగా నిలువగలిగిన జనమనఃప్రియుడాయన.

చాల రాష్ట్రాలలో చాల మంది ముఖ్యమంత్రులయ్యారు. చాలమంది సులువుగా ఆ పదవిని కోల్పోయారు. ఉన్నవారు కొందరు విపరీతమైన అసంతృప్తిని పెంచుకోగా, లేని కొందరు పదవికై పలవరించి ప్రజానురక్తిని పోగొట్టుకున్నారు. కాని, ఈయన ఎదురు లేదనిపించుకొని సర్వజనహితంతో బీహారునేలుకున్నాడు.

తన రాష్ట్రం వదలి యావద్భారత రాజకీయ సంరంభం లోనికడుగిడక నిగ్రహంతో నెట్టుకొని వచ్చినవాడు గనుక, ఇతర రాష్ట్రాలలో ఆయనను గురించి తెలిసినది తక్కువ. ఒక్క అఖిల భారత కాంగ్రెసు సంఘం ద్వారా తప్ప ఆయన రాష్ట్రేతర వ్యవహారాల జోలికి పోలేదు.

అందువల్లనే ఆయన చిరస్మరణీయమైన సేవను రాష్ట్రపతి మెచ్చుకున్నాడు. ఆయన మరణం బీహారుకే కాదు, యావద్భారతానికి కూడ తీరనిలోటని అందువల్లనే ప్రధాని నెహ్రూ సంతప్తుడయినాడు.



ఆసేతు హిమాచలం దేశభక్తులందరికాయన కాలధర్మం చెందెనన్న వార్త కనులు చెమరింప జేసినది.

అచంచల దేశభక్తుడై, అద్వితీయ పరిపాలనాదక్షుడై, అఖండ ప్రజానురాగ పాత్రుడై, తలపండిన దాక నిండుగా బ్రతికిన శ్రీకృష్ణ సిన్హా జీవితం ధన్యమైనది.

ఆయనను పోగొట్టుకొని దుఃఖపరవశులై ఉన్న బీహారు ప్రజలకు, శ్రీ సిన్హా కుటుంబస్థులకు మా సానుభూతి నందిస్తున్నాము.

ఆయన సుమధుర దివ్యస్మృతి భారత జనసందోహంలో దేశభక్తిని, సేవాసక్తిని సముద్బుద్ధం చేస్తూ చిరకాలం మనగలదని ఆశిస్తున్నాము.

## శ్రీ మౌలానా అబుల్ కలాం ఆజాద్



మౌలానా అబుల్ కలాం ఆజాద్ నిర్యాణంతో భారతదేశం ఒక మహావ్యక్తిని, దేశభక్తుని, రాజ్యాంగవేత్తను, ప్రసిద్ధవక్తను, తత్వవిదుని, బహుభాషా కోవిదుని కోల్పోయింది.

స్వాతంత్ర్య సమరాలన్నిటిలో పాల్గొన్నవారూ, దేశసేవలో పండువారిన వారూ అనేకులున్నారు. అయినా, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వలె వక్తగా, గ్రంథకర్తగా, తత్త్వజ్ఞునిగా, రాజ్యాంగవేత్తగా బహుముఖ ప్రజ్ఞావంతులైన వారిని వేళ్ళపై మాత్రమే లెక్కించవచ్చు.

భారత రాజకీయరంగంలో గాంధీజీ అడుగు పెట్టినది మొదలు దేశ స్వాతంత్ర్యాన్ని సాధించినంత వరకు అహర్నిశలు దేశం కోసం పాటుబడడమె కాక, స్వాతంత్ర్య సంపాదనానంతరం నిన్నటిదినం న్యూఢిల్లీలో కన్నుమూసినంతవరకు కూడా మౌలానా ఆజాద్ కాంగ్రెసుకు వెన్నెముకగా, జాతీయోద్యమానికి పట్టుకొమ్మగా, హిందూ - ముస్లిం సమైక్యతకు పెట్టని కోటగా, ప్రజలందరకు ప్రేమపాత్రుడుగా పరిగణించబడడం విశేషం.



స్వాతంత్ర్య సమరం కొనసాగుతున్న ప్రధాన ఘట్టాలలో పెక్కు సంవత్సరాలు కాంగ్రెస్ అధ్యక్షుడుగా, దాదాపు నాలుగు శతాబ్దాలు కాంగ్రెస్ కార్యవర్గం సభ్యుడుగా, చివరవరకు కాంగ్రెస్ అధిష్ఠాన వర్గంలో ప్రధానుడుగా, మౌలానా ఆజాద్వలె కాంగ్రెస్ సంస్థతో సుదీర్ఘకాలం, సన్నిహిత సంబంధంకల వ్యక్తులు - ప్రెసిడెంట్ రాజేంద్ర ప్రసాద్, ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ వంటి ఒకరిద్దరు తప్ప - బహుశా దేశంలో మరెవ్వరు లేరనే చెప్పవచ్చు. జాతి మత విభేదాలకు అతీతమైన భారత జాతీయతకు, హిందూ ముస్లిం సామరస్యానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ను ప్రజల చిహ్నంగా పరిగణించవచ్చు. సూఫీ తెగకు చెందిన ముస్లిం పండిత వంశంలో, ముసల్మాన్లకు అత్యంత పవిత్రమైన మక్కాలో జన్మించి, అరేబియాలో బాల్యదశను గడిపి, ఈజిప్టులోని అల్ అహార్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేసి, ఉర్దూ, పర్షియన్, అరబిక్ మొదలైన బహుభాషలలో పాండిత్యం గడించి, ఇరాక్, ఈజిప్టు, సిరియా, టర్కీ, మున్నగు దేశాలలో పర్యటన సల్పి, తన ఇరవై నాలుగవ సంవత్సరంలోనే 'అల్ హిలాల్' అనే పత్రికకు సంపాదకత్వం వహించి, అనేక సుప్రసిద్ధ రచనలతోపాటు పవిత్ర మత గ్రంథమైన ఖురాన్ పై విపుల వ్యాఖ్యను రచించిన మౌలానా ఆజాద్ - భారత జాతీయోద్యమంతో ప్రారంభించి, ద్విజాతి సిద్ధాంత వాదులుగా పరిణామం చెందిన ముస్లింనాయకుల వలెకాక మతాభిమానానికి, ప్రమాణంలోను కాకుండా మతసామరస్యానికి ప్రమాణం కావడం భారతజాతికి గర్వకారణం. సంకుచిత స్వాతంత్ర్య సముపార్జన

పిమ్మట కూడా అనేక క్లిష్ట సమస్యలను ఎదుర్కొంటున్న భారత దేశానికి, కాంగ్రెస్ సంస్థకు, భారత ప్రభుత్వానికి, ప్రత్యేకించి ప్రధాని నెహ్రూకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ నిర్యాణంచే ఏర్పడిన కొరత ఇంతటిలో మరే వ్యక్తివల్ల కూడా తీరేది కాదు.

(ఆంధ్రప్రభ 23-2-1958)

## శ్రీ పటాస్కర్



టాండన్, దేశపాండే, భార్గవ ప్రభృతులు ఎంత నిశితంగా విమర్శించినా, "ఇంకేమున్నది? హిందూ సంఘం బుగ్గి కలిసి పోతున్నది" అంటూ వీరు గగ్గోలు పెట్టినా, విల్లు వ్రాయకుండా తండ్రి విడిచిపెట్టి పోయిన ఆస్తిలో కుమార్తెకు వాటా పెట్టే బిల్లుకు లోక్ సభ ఆమోదాన్ని సంపాదించిన కేంద్ర న్యాయశాఖామంత్రి శ్రీ పటాస్కర్‌ను హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాము. సోమనాథ దేవాలయాన్ని కొల్లగొట్టి, దాన్ని శిథిలం చేసిపోయిన మహమ్మద్ ఘజ్నీతో కొందరు తనకు పోలిక పెట్టినా, ఆయన కలతపడలేదు; కోపం తెచ్చుకోనూ లేదు. వాదబలం తక్కువైనప్పుడే తిట్ల పురాణాన్ని విప్పడం జరుగుతుందని ఆయనకు తెలుసు; ఈ మాటనే లోక్ సభలో తన బిల్లుపై నలభై గంటలపాటు తీవ్రంగా జరిగిన చర్చకు సమాధానమిస్తూ ఆయన చెప్పాడు కూడా!

న్యాయశాస్త్రంలో పటాస్కర్కున్న పాండిత్యంతో పాటు, తన విమర్శకులపట్ల - మితవాదులే కాక, అతివాదులు సయితం ఈ విమర్శకులలో ఉన్నారు - ఆయన చూపిన సహన సౌజన్యాలేమి, సముచితమైనవిగా తోచిన కొన్ని సవరణలను ఆమోదించడంలో ఆయన చూపిన ప్రతిభా విజ్ఞతలేమి ఆయన ప్రతిపాదించిన ఈ బిల్లుకు లోకసభ ఆమోదాన్ని పొందడానికి ఎంతో తోడ్పడ్డాయి. ఆయన ఈ అశేష కృషికి ప్రశంసా సూచకంగా త్వరలో ప్రెసిడెంట్ ఆమోదంతో శాసనం కాగల ఈ బిల్లును హిందూ వారసత్వ శాసనం" అనడం కంటే "పటాస్కర్ స్మృతి" అనడం సముచితం కాగలదేమో!

హిందూ ధర్మశాస్త్రాన్ని క్రోడీకరించడానికి స్వతంత్ర భారతం చేస్తున్న ప్రయత్నంలో అందుకు అది చూపుతున్న పట్టుదలలో ఈ వారసత్వం బిల్లు ఒక భాగం మాత్రం. కొన్ని వందల యేళ్ళనాడు - బహుశా వేల సంవత్సరాలు కూడా నేమో - హిందూ ధర్మశాస్త్రాల రచన జరిగింది. నాటి పరిస్థితులు వేరు; నాటి సంఘానికి ప్రాతిపదికలే వేరు. కుల విధానంపై ఆధారపడింది అప్పటి సంఘం; స్త్రీ పురుషులలో పురుషుని ఆధిక్యతను గుర్తించినట్టిది ఆనాటి సంఘం. కుల విభేదాలు ఇప్పుడైనా రూపుమాసిపోలేదు గాని, వాటిని (ఆ విభేదాలను) సంఘానికి వేరు పురుగులుగా నేడు భావిస్తున్నాము. కుల విభేదాలను చెక్కు చెదరకుండా

రక్షించడం కాదు, ఈ మన రాజ్యాంగ లక్ష్యం. వాటికి తావు లేని సంఘాన్ని - సమాన స్వాతంత్ర్యంతోను, సమానావకాశాలతోను కూడిన నవ సంఘాన్ని సంస్థాపించడమే దాని లక్ష్యం. ఈ లక్ష్యాన్ని మనం సాధించాలంటే, కులవిభేదాలతోపాటు స్త్రీ పురుషుల సాంఘిక ప్రతిపత్తిలో గల విభేదాలు కూడా సమసిపోవాలి. ఆ లక్ష్యానికి దోహద మిచ్చేదే "పటాస్కర్ స్మృతి" అయినా, దాన్ని టాండన్, భార్గవ, దేశపాండేలను పోలినవారు కొందరు ప్రతిఘటించినారంటే, కాలానుగుణంగా హిందూ సంఘం పరివర్తనం చెందడమే వారికి మనస్కరించదన్న మాట! సమాన స్వాతంత్ర్య సమానావకాశాల లక్ష్యాన్ని కాదనక పోయినా, ఆచరణలో పెట్టవచ్చేసరికి అది వారి గొంతును పచ్చి వెలక్కాయవలె పట్టుకొంటున్న దన్నమాట! ఏమైనా ఒకటి మాత్రం కాదనరాని విషయం. ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా ప్రగతిశీలంతో కూడిన ప్రతి శాసనాన్ని - ప్రతి సంస్కరణను - వ్యతిరేకించేవారు కొందరు ఉండనే ఉంటారు. వారి అభ్యంతరాలను వినడం వృథా కాలయాపన; వారి విమర్శలకు కలత చెందడం కేవలం అవిజ్ఞత. వారిని లక్ష్యపెడితే, మనం ముందుకు కాక, వెనుకకు నడవ వలసి ఉంటుంది. కాని, ప్రధాని నెహ్రూ నిన్న లోక్ సభలో హెచ్చరించినట్టు, రెండువేల యేళ్ళనాటి ప్రపంచంలో ఇప్పుడు మనం బ్రతకలేము; ఆ కాలాన్ని, అప్పటి సంఘాన్ని చేరడానికి వెనుకకు నడవలేము కూడా. భవిష్యత్తు వైపుకే మనం దృష్టిని సారించాలి; దాని దిక్కుకే పురోగమించాలి. ఇందుకు "పటాస్కర్ స్మృతి"ని పోలినవి మరెన్నో కొత్త శాసనాలు కావలసి వస్తాయి.

(ఆంధ్రప్రభ 10-5-1956)

## శ్రీ వై.బి. చవాన్

ఇప్పటివరకు అధికార ప్రకటన వెలువడక పోయినా, రక్షణ మంత్రిగా శ్రీ వై.బి. చవాన్ను నియమించడానికి ప్రధాని నెహ్రూ నిశ్చయించారని వార్తలు తెలుపుతున్నవి. మరి మూడు, నాలుగు రోజులలో శ్రీ చవాన్ కొత్త బాధ్యతను స్వీకరించవచ్చు.



ప్రస్తుత పరిస్థితిలో ప్రధానమంత్రే రక్షణ కార్యకలాపాలకు స్వయంగా వ్యక్తిగతంగా బాధ్యత వహించడం వాంఛనీయమైనా, శ్రీ నెహ్రూ ఇప్పటికే విశేషభారం వహిస్తున్నారు. ప్రధాన మంత్రిగా వివిధ మంత్రిత్వ శాఖల వ్యవహారాలను సమన్వయం చేయడం, ముఖ్యమైన ప్రభుత్వ విధానాలను నిర్ణయించడం, మొత్తం దేశానికి మార్గదర్శకత్వాన్ని వహించడంతోపాటు, విదేశాంగ వ్యవహారాలు, ప్లానింగ్ కమిషన్ అణుశక్తి, శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన సంఘాల అధ్యక్ష పదవుల వంటి పనులెన్నో ఆయన చూస్తున్నారు. ఇంత కార్యభారంతోపాటు రక్షణ మంత్రిత్వ శాఖను కూడా నిర్వహించడం ఏ ఒక్క వ్యక్తికి భౌతికంగా సాధ్యమయ్యే పనికాదు. ఈ కారణంగా ఆ శాఖను మరొకరికి అప్పగించడం సముచితమైన నిర్ణయం.




శ్రీ చవాన్ సమర్థుడైన పాలకుడుగా పేరొందిన వ్యక్తి. దేశంలోని ఒక కీలక ప్రాంతానికి గడచిన ఆరేళ్లుగా ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఉత్సాహవంతుడు; కార్యశూరుడు; సభికులను మహావేశ పూరితులను చేయగల వక్త; 1930 నుంచి జరిగిన అన్ని స్వాతంత్ర్యోద్యమాలలోను పాల్గొని తన దేశభక్తిని విశేషించి అందరిని కూడగట్టుకుని, అందరిచే ఔననిపించుకొని పనిచేయగల దిట్ట.

దేశాన్ని విపత్కర పరిస్థితి ఎదుర్కొంటున్న సమయంలో కీలకమైన రక్షణ శాఖపై ఆధ్వర్యం స్వీకరించనున్న శ్రీచవాన్ ఈ కొత్త బాధ్యతను తమ సమాజ కార్య దక్షతతో నిర్వర్తించగలరని, మన రక్షణ శక్తిని ఇనుమడింపజేసి దేశాన్ని విజయాభిముఖంగా నడిపించగలరని ప్రజానీకం ఆశిస్తున్నది.

## సుస్వాగతం: శ్రీ ప్రకాశ

స్వతంత్ర భారత రాజ్యాంగంలో శ్రీప్రకాశ రాష్ట్ర గవర్నర్ పదవి లాంఛనప్రాయమే కావచ్చు. పరిపాలనా నిర్వహణకు, ప్రభుత్వ విధానాలకు శాసనసభ్యులు. మంత్రులే ఉత్తరవాదులై ఉండవచ్చు. అనుదిన పరిపాలనలో గవర్నర్ జోక్యం అవసరం కాకపోయినా, అసాధారణ పరిస్థితులలో చట్టసమ్మతమైన బాధ్యతలు కొన్ని గవర్నర్కు కట్టబెట్టబడినవి. ఇండియన్ యూనియన్లోని చిన్న చిన్న రాష్ట్రాలమాట ఎలా ఉన్నా మద్రాస్, బొంబాయి,

బెంగాల్ వంటి ప్రధాన రాష్ట్ర గవర్నరులు ప్రజా సమన్వితులు, అనుభవజ్ఞులు, పరిపాలనాదక్షులై ఉండడం చాలా అవసరం.

వైశాల్యంలో, జనసంఖ్యలో చెన్న రాష్ట్రం ఇండియాలోని పెద్ద రాష్ట్రాలలో ఒకటై ఉండడమేగాక వివిధ భాషలకు, విభిన్న సంస్కృతులకు చెందిన నాలుగు తెగల ప్రజలను కూడగట్టుకు రావలసి ఉంది.

పై వైవిధ్యానికి తోడు, ముఖ్యంగా ఎన్నికల అనంతరం చెన్న రాష్ట్రంలో ఉదయించిన అపూర్వ పరిస్థితులు కుశాగ్ర బుద్ధులైన రాజ్యాంగ వేత్తలను సయితం ఆందోళన పరుస్తున్నవి.

ఈ క్లిష్ట సమయంలో శ్రీ శ్రీప్రకాశవంటి పెద్ద మనిషి, ప్రజ్ఞానిధి, అనుభవపరుడు మద్రాస్ గవర్నర్గా నియమించబడడం కొంత విశేషం.

నిన్న చెన్ననగరంలో గవర్నర్ ప్రమాణం స్వీకరించిన శ్రీ శ్రీప్రకాశ బహుళ గ్రంథకర్త, ప్రఖ్యాత తత్వవేత్త డాక్టర్ భగవాన్దాస్ పుత్రుడు. తండ్రి వలె తానూ పండితుడు, జ్ఞానపిపాసితుడు. దేశ సేవలో ఇతరు లెవ్వరికి

తీసిపోనివాడే గాక, దీర్ఘకాలం కేంద్ర శాసనసభ్యుడుగ, పాకిస్తాన్లో ప్రథమ ఇండియా హైకమిషనరుగ, అస్సాం రాష్ట్ర గవర్నరుగ, కేంద్ర ప్రభుత్వ మంత్రిగ, ఇన్ని పదవులలో అనుభవం గడించినవాడు.

భారతదేశ మంతకు సర్వసామాన్యమైన అవిద్య, అనారోగ్య, దారిద్ర్య బాధలేగాక, పరిపాలనకు సంబంధించిన కొన్ని ప్రత్యేక సమస్యలు కూడ మన రాష్ట్రంలో అధికారం వహించగలవారిని ఎదుర్కోబోతున్నవి.

రాష్ట్రంలోని వివిధ రాజకీయ పక్షాలకు సమన్వయం కుదర్చడంలో నేమి, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య సారథ్యం నెరపడంలోనేమి, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు వైరుధ్యం కలగకుండా పరిపాలనా యంత్రాన్ని నిర్వహించడంలో నేమి, ఏ భాషా ప్రాంతానికీ అక్రమం జరగకుండా చూడడంలోనేమి శ్రీ శ్రీప్రకాశగారి అనుభవ, ప్రజ్ఞా, పరిజ్ఞానాలు ఉపకరించుతవని విశ్వసిస్తున్నాము.

ఇండియాలో రిపబ్లిక్ స్థాపన జరిగింది మొదలు మొన్నటి వరకు మద్రాస్ గవర్నర్ పదవి నధిష్ఠించి, మద్రాస్ పౌరులచే మనఃపూర్వకమగు వీడ్కోలివ్వబడిన శ్రీ భావనగర్ మహారాజుకు, వారి సహధర్మచారిణికి ఈ సందర్భంలో మా కృతజ్ఞతను, ధన్యవాదాలను అందిస్తున్నాము. "సంస్థానాధీశుడు, ఆగర్భ శ్రీమంతుడు, భోగపరాయణుడైన మహారాజు ఆధునిక భారత రాజ్యాంగంలో రాష్ట్రగవర్నర్ ఎంతవరకు ఇమడగలడన్న సంశయం ఆదిలో కొందరికి కలగక పోలేదు. కాని, శ్రీ భావనగర్ మహారాజు గత మూడేండ్లలో ప్రశంసనీయమైన నిగ్రహాన్ని, పరిపాలనా నైపుణ్యాన్ని, ప్రజాస్వామిక సంప్రదాయాలపట్ల అపూర్వ గౌరవాన్ని ప్రదర్శించి అందరి మెప్పును పొందగలిగారు.

శ్రీ భావనగర్ మహారాణి కూడా చెన్నరాష్ట్రంలోని అనేక ప్రజోద్యమాలలో, విశేషించి జనోద్ధరణలో శ్రద్ధవహించి ఈ రాష్ట్ర ప్రజల అనురాగాన్ని చూరగొనడం ముదావహం. కొత్త గవర్నర్ శ్రీ శ్రీప్రకాశకు స్వాగతంతోపాటు, శ్రీ భావనగర్ రాజ దంపతులకు మా వీడ్కోలు అభినందనలను అందజేస్తున్నాము.

(ఆంధ్రప్రభ 13-3-1952)

## శ్రీ ప్రకాశ అస్తమయం

వారణాసిలో మొన్న కన్నుమూసిన శ్రీప్రకాశ తన జీవితంలో అధిక భాగం రాజకీయాలలోనే గడిపినా, సాధారణ రాజకీయవేత్త కారు. ఆయన పండితుడు, మేధావి, గ్రంథకర్త, పత్రికా రచయిత.

ఆయన నెహ్రూ తరానికి చెందినవారు. 1918లోనే ఆయన గాంధీజీ నాయకత్వాన స్వాతంత్ర్యోద్యమంలో ప్రవేశించారు. పెక్కుసార్లు కారాగారవాసం అనుభవించారు. రాజ్యాంగ పరిషత్తులో సభ్యుడై నవ భారత రాజ్యాంగ రచనలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య సిద్ధి తొలి రోజులలో పాకిస్తాన్లో ఇండియా హైకమీషనర్గా పనిచేశారు. కేంద్ర మంత్రివర్గంలో సభ్యుడుగా ఉన్నారు. అస్సాం, మద్రాసు, మహారాష్ట్రలలో గవర్నరు పదవిని నిర్వహించారు.

ఎన్ని రాజకీయ పదవులను నిర్వహించినా శ్రీప్రకాశ అవే పరమార్థంగా భావించేవారు కారు. ఆయన పండిత కుటుంబంలో జన్మించినవారు. తండ్రి డాక్టర్ భగవాన్ దాస్ గొప్ప పండితుడు, వేదాంతి. తండ్రి ప్రభావానికి శ్రీప్రకాశ లోనైనారు. ఆయనపై ప్రభావం నెరపిన మరొక మహావ్యక్తి యనీబిసెంట్. వీరిరువురి జీవిత చరిత్రలను శ్రీప్రకాశ రచించారు.

ఆయన విద్యావేత్త కూడా. బనారస్ హిందూ విశ్వవిద్యాలయంతో ఆయనకు సన్నిహిత సంబంధం ఉండేది. కాలధర్మం చెందేనాటికి ఆయన కాశీవిద్యాపీఠం ఛాన్సలర్ కూడా.

శ్రీప్రకాశ మంచి వక్త. ఆయన ఉపన్యాసాలలో హాస్యం తొణికిసలాడేది. సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో సభ్యుడుగా ఉన్న రోజులలో ఒకసారి ఆయన రైల్వే శాఖ స్త్రీలను మూడు తరగతులుగా విభజించిందని, మూడవ తరగతి స్త్రీలు "ఫిమేల్స్", రెండవ తరగతి స్త్రీలు "విమెన్", మొదటి తరగతి స్త్రీలు "లేడీస్" అని వ్యంగ్యోక్తిగా విమర్శించారు. ఇటువంటి ఛలోక్తులను ఆయన తరచుగా తన ఉపన్యాసాలలో విసురుతూ ఉండేవారు.

ఆయనది నిండైన విగ్రహం. తొణకని స్వభావం.

ఆయన మరణంతో భారతదేశం ఒక ఉత్తమ దేశభక్తుని, మేధావిని, పరిపాలనా దక్షుని కోల్పోయింది.

(ఆంధ్రజ్యోతి 26-6-1971)

## ఆచార్య కె.జి. మష్రువాలా

గాంధిజీ నిర్యాణానంతరం "గాంధిజం" అన్నది ఏదైనా మిగిలి ఉంటే, దేశంలో దానిని భాసింపజేసే కొలదిమంది విశిష్ట వ్యక్తులలో నిన్నటి దినం ఆకస్మికంగా కాలధర్మం చెందిన శ్రీ కె.జి. మష్రువాలా ఒకరు.

గాంధిజీ అంతరంగం ఎరిగిన వారిలో, గాంధిజీ అంతేవాసులలో, గాంధిజీకి ప్రియతమమైన నిర్మాణ కార్యక్రమంలో అహర్నిశలు తోడ్పడినవారిలో శ్రీ మష్రువాలాను ముఖ్యంగా పేర్కొనవచ్చు. అందుచేతనే గాంధిజీ సంపాదకత్వాన వెలువడుతూ వచ్చిన హరిజన పత్రికల నిర్వహణ గౌరవం గాంధీజీ అనంతరం ఆయన అంతరంగికులలో ఒకరైన శ్రీ మష్రువాలాకే దక్కింది.

గాంధిజీ యుగ పురుషుడూ, తత్వవేత్తగాని కేవల రాజకీయ నాయకుడు కాడు. "గాంధిజం" మానవ జీవితానికి సంబంధించిన మహోన్నత సిద్ధాంతంగాని కేవలమొక రాజకీయ ఉద్యమం కాదు. గాంధీజీని అనుసరించడం అసిధారావ్రతంగాని ఖద్దరు ధారణ మాత్రం కాదు.

జీవితానికి సంబంధించిన వివిధ సమస్యలను గాంధీజీ విలక్షణమైన ప్రత్యేక దృక్పథంతో పరిశీలించి, నూతనమైన విలువలను వాటికి అన్వయింపజేసి, అలౌకిక ప్రజ్ఞ ప్రాభవాలతో వాటిని పరిష్కరింపజాలినాడు.


గాంధీజీ నిర్యాణానంతరం ఆయన అడుగుజాడలలో నడవడం గాని, నిత్య నూతనమైన బహుముఖ సమస్యలకు గాంధీజీ సిద్ధాంతాలను సమన్వయపరచడంగాని, వాటిని సక్రమంగా నిర్వచించడమే గాని సామాన్య విషయం కాదు.

అయినప్పటికీ ఆచార్య మష్రువాలా, వినోబాభావే ప్రభృతులు ఆ దుర్ఘట కార్యాన్ని

జంకుకొంకులులేక, నిందాస్తుతులకు లొంగక, సమర్థతతో నిర్వహించారు. "హరిజన్" పత్రిక ద్వారా గాంధిజీ వాణిని విశాల ప్రపంచానికి నిపుణంగా వినిపింపజేసిన శ్రీ మష్రువాలా అకాల మరణం యావద్భారత జాతికి మిక్కిలి సంతాపకం. మేము కూడా పంచుకుంటున్నాము.

( ఆంధ్రప్రభ 11-9-1952)

## సౌజన్యమూర్తి : ఆచార్య నరేంద్రదేవ్



ఆచార్య నరేంద్రదేవ్ నిర్యాణంతో భారత ప్రజా-సోషలిస్ట్ పార్టీ ప్రముఖనాయకునే కాక, అశేష భారతజాతి అకలంక దేశ భక్తుని, సుప్రసిద్ధ విద్యావేత్తను, అత్యంత సౌజన్యమూర్తిని కోల్పోయింది. ఇండియాకు స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత 1948లో ఆచార్య నరేంద్రదేవ్ కాంగ్రెస్ సంస్థ నుంచి చీలిపోయి ప్రత్యేక సోషలిస్ట్ పార్టీని నెలకొల్పినా, సుదీర్ఘమైన ఆయన రాజకీయ జీవితంలో అత్యధిక భాగం కాంగ్రెస్ సేవతోనే పెనవేసుక పోయింది. అందుచేతనే, ఇండియా ప్రధాని పండిట్ నెహ్రూ, ఆచార్య నరేంద్రదేవ్ ఆకస్మిక మృతికి విచారిస్తూ స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన వ్యక్తులొకరి వెంట నొకరుగా జీవయాత్ర చాలించడంచేత మిగిలి ఉన్న వారిలో గొప్ప వెలితి ఏర్పడిందని తీవ్ర మనోవ్యధను వెలిబుచ్చాడు.

భారతీయులలో దేశ భక్తులున్నారు. రాజ్యాంగవేత్తలున్నారు. విద్యాధికులున్నారు. వినయశీలురున్నారు. సర్వ సమతా సిద్ధాంత ప్రతిపాదకులున్నారు. సంస్కార హృదయులున్నారు. అయితే, ఇన్ని సుగుణాలు ఒక్కరిలోనే పరిఢవిల్లిన వ్యక్తులు ఎక్కడనో అరుదుగా గాని కానరారు. అట్టి కోవకు చెందినవాడు ఆచార్య నరేంద్రదేవ్.

1921 మొదలుకొని దేశసేవకే జీవితం అంకితం చేసినవాడు. పలుమార్లు కారాగార శిక్షల పాలైనవాడు. ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని, అఖిల భారత కాంగ్రెస్ కార్యవర్గ సభ్యత్వాన్ని నిర్వహించినవాడు. రెండు మారులు శాసనసభలకు ఎన్నుకొనబడినవాడు. మిత్రుల బలవంతంపై అలహాబాద్, బనారస్ విశ్వవిద్యాలయాల వైస్-ఛాన్సలర్ పదవులను నిర్వహించినవాడు. బహుముఖ ప్రజ్ఞావంతుడైన అట్టి వ్యక్తికి స్వతంత్ర భారత దేశంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలలో ఎంతటి ఉన్నత స్థానమైనా అలభ్యమయ్యేది కాదు. కాని,




ఆచార్య నరేంద్రదేవుని స్వార్థరాహిత్యమూ, స్వాతంత్ర్య ప్రియత్వమూ, నిరాడంబర జీవిత విధానాలే మంత్రి పదవులు మొదలైనవానికి ఆయనను విముఖుని చేశాయి. ఉత్తర ప్రదేశ్లో మొట్టమొదటి కాంగ్రెస్ మంత్రి వర్గంలో చేరవలసిందిగా మిత్రులు కోరినప్పుడు ఆచార్య నరేంద్రదేవ్ దానిని నిరాకరించడమే అందుకు ప్రబల నిదర్శనం.

రాజకీయ నాయకునిగా కంటే కూడా ఆచార్య నరేంద్రదేవ్ విద్యా విశారదునిగా, బహుభాషావేత్తగా, విఖ్యాత గ్రంథకర్తగా రాణ కెక్కినవాడు. సోషలిజంపై, మార్క్సిస్ట్ సిద్ధాంతాలపై ప్రామాణికుడుగా పరిగణించబడినవాడు. సంస్కృతం, ఆంగ్లం, పాళీ, హిందీ, ఉరుదు భాషలలో పండితుడై ప్రాచీన భారత చరిత్రను, బౌద్ధ వాఙ్మయాన్ని మథించిన ప్రతిభావంతుడు. అయినప్పటికీ, తానింతటి విద్యాధికుడనన్న అహంభావం ఏకోశానా లేనివాడు..

రాజకీయ జీవితంలో దీర్ఘకాలం బాధ్యతగల స్థానాలనాక్రమించినా, రాజకీయ సిద్ధాంతాలలో కలిగిన భేదాభిప్రాయాల కారణంగా కాంగ్రెస్ నుంచి వైదొలగవలసి వచ్చినా, కాంగ్రెస్, కాంగ్రెసేతర నాయకులందరి గౌరవాదరణలకు పాత్రుడై, అజాత శత్రువుగా పేరొందిన ఒక మహావ్యక్తి హఠాత్తుగా రాలిపోవడం దేశ దురదృష్టమని చెప్పక తప్పదు. (ఆంధ్రప్రభ 21-2-1956)

## శ్రీ ప్రవీర్ చంద్ర భంజేవ్

మిడిసిపడి, మిడిసిపడి, కడకు నరసింగర్ జెయిల్లో కూర్చున్నాడు, బస్తర్ మహారాజా

శ్రీ ప్రవీర్ చంద్ర భంజేవ్. ప్రాయం తక్కువ; ప్రాజ్ఞత తక్కువ. అందువల్ల కాస్త ఓపికపడితే, హితబోధ చేస్తే, నెమ్మదిగానైనా మంచి దారికి రాకపోతాడా అనుకుంటే, అంతకంతకు అహంకారం బలిసింది; తనపై చర్య గైకొనడానికి దమ్ములు లేకనే, ప్రభుత్వం తటపటాయిస్తున్నట్టు భ్రమపడ్డాడు. ఫలితం - ఖైదీ కావడమే కాక, మహారాజాగా గుర్తింపు రద్దు కావడం! "ప్రభుత్వంపై విసరడానికి ఏ రాయి అయితేనేమి?" అనే తలంపుతో ప్రతిపక్షాలవారు ప్రవీర్ చంద్ర ఏ పిచ్చిపని చేసినా వెనుక వేసుకు వచ్చివుండకపోతే, ఆయన దుడుకుతనం కొంత తగ్గేదేమో! కాని, ఆయనను సమర్ధించడంలో ప్రజా సోషలిస్టు, స్వతంత్ర పార్టీలవారు ఒకరితో ఒకరు పోటీ పడ్డారు. ఈ పోటీలో తాము ఎక్కడ వెనుకబడిపోతామో అని లోహియా పార్టీ వారు మహారాజాకు మరింత మద్దతుచేశారు. దానితో "అసలే కోతి; అది కల్లు త్రాగింది; ఆపైన నిప్పులు త్రొక్కింది" అనే సామెత చందమైపోయింది ప్రవీర్ చంద్ర మహారాజులుంగారి పని! యావద్భారతంలో ఆదివాసుల సత్యాగ్రహం ప్రారంభం కాగలదని, మాజీ సంస్థానాధిపతుల సంస్థను (ఛేంబర్ ఆఫ్ ప్రిన్సెస్ ను) పునరుద్ధరించవలసిన ఆవశ్యకత కలదని వెర్రిమొర్రి ప్రకటనలు ఆయన చేయ నారంభించాడు.

ఈ పిచ్చి ప్రకటనలకు నిజానికి ఎక్కువ ప్రాధాన్యమివ్వనక్కరలేదు. కాని, ప్రతిపక్షాలు మహారాజా కిస్తున్న ప్రోత్సాహ ప్రోద్బలాల దుష్ఫలితాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయలేదు. పైగా, బస్తర్ ఆదివాస ప్రాంతమాయె! పది లక్షలకు లోపుగాగల దాని జనాభాలో చాలా హెచ్చుభాగం చదువు సంధ్యలు లేని తెగల వారాయె! వారిలో మూఢవిశ్వాసాలు మెండు; ప్రపంచ జ్ఞానం తక్కువ. అట్టివారిని, కావాలంటే ప్రవీర్ చంద్రను పోలిన వ్యక్తి ఎందుకైనా రెచ్చగొట్టవచ్చు. ఆయన సామాన్యుడా? ఆ మధ్య ఒకనాడు ఏదో పురుగు తొలిచేసరికి 19,000 రూపాయలను నూరు రూపాయల నోట్ల రూపంలో చేతబట్టి, వీధుల వెంట విరజిమ్మి, వాటిని ఏరుకొనడానికి ఎగబడినవారి త్రొక్కిసలాటను కన్నుల పండువుగా చూచిన ప్రబుద్ధుడాయె!

ఈ విధమైన పిచ్చిపనులను చూచినమీదటనే మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషుడు పండిట్ రవిశంకర్ శుక్లా, ప్రవీర్ చంద్ర ఆస్తిపాస్తులను "కోర్టు ఆఫ్ వార్డ్స్"కు అప్పగించి, ఆయనకు నెలకు అయిదువేల రూపాయల భరణాన్ని ఏర్పాటు చేయించాడు. చిత్తం వచ్చినట్టు డబ్బుతో ఆటలాడ్డానికి ఇప్పుడు వీలులేక పోవడమే ఈ మహారాజులుంగారికి ప్రభుత్వంపై కలిగిన కినుకకు ముఖ్యకారణం!

బస్తర్ మహారాజా ఆడింది ఆటగా, పాడింది పాటగా సాగుతున్నదనే భ్రమతో ఇతర సంస్థానాధిపతులు ఇటీవల "కూతపడుతున్న కోడి పుంజుల" వలె మెడ పొడిగించడం, రొమ్ము విరవడం మొదలు పెట్టారు! ప్రవీర్ చంద్ర విషయంలో ప్రభుత్వం గైకొన్న చర్య వీరికి తగు హెచ్చరిక కాగలదనే విశ్వసిస్తున్నాము. భరణాల పేరుతో ఈ మాజీ సంస్థానాధిపతులకు కోటానుకోట్లను కట్టబెట్టడం ప్రభుత్వం బొక్కసంలో డబ్బు మూల్గుతున్నదని కాదు;

ప్రజావసరాలకు మించి ధనం కలదనీ కాదు. దేశ సమైక్య సాధనకు బుద్ధిమంతులవలె తోడ్పడ్డారన్న కారణంతోనే వీరికి ఉదారంగా భరణాలను చెల్లించడం జరుగుతున్నది. ఈ ఔదార్యాన్ని హర్షించలేక, వీరు వెర్రి మొర్రి వేషాలు వేస్తే, ఇప్పుడు వీరు అనుభవిస్తున్న ప్రతి ప్రత్యేక సౌకర్యాన్ని గురించి పునరాలోచన చేయవలసి వస్తుంది.

## గోవా వీరుడు : శ్రీ మోహన్ రనడే

ఏడాదికాదు, రెండేళ్ళుకాదు; పద్నాలుగేళ్ళపాటు పోర్చుగీసు చెరసాలలలో నరకయాతన లనుభవించిన గోవా స్వాతంత్ర్య వీరుడు శ్రీ మోహన్ రనడేకు ఇన్నాళ్ళకు విముక్తి లభించింది. ఇది యావద్భారతం సంతోషంతో స్వాగత మివ్వవలసిన సంఘటన.

అతడు సాధారణ నేరస్థుడు కాదు. అతని నేరం దేశభక్తి, దేశ విమోచనోద్యమంలో పాల్గొనడం, జన్మతః మహారాష్ట్రుడు. 1956లో తన ఇరవై యారవ ఏట గోవా వెళ్ళి విమోచన పోరాటంలో పాల్గొన్నాడు. ఒక సంఘటనలో తీవ్రంగా గాయపడగా అతడిని పోర్చుగీసు ప్రభుత్వం అరెస్టు చేసింది. కొన్నాళ్ళు గోవా చెరసాలలోనే వున్నాడు. 1960లో అతడిని లిస్బన్ కారాగారానికి పోర్చుగీసు వారు తీసుకుపోయారు. అప్పటి నుంచి అతడు అక్కడే మ్రగ్గుతున్నాడు.

అతడిని, అతడితోపాటు బందీ అయిన మరొక భారతీయుని విడిపించడానికి ఇండియా ప్రభుత్వం దౌత్య మార్గాలద్వారా ఎన్నో ప్రయత్నాలు చేసింది. శ్రీ రనడే జనని పోప్కు వ్యక్తిగతంగా విజ్ఞప్తిచేసింది కాని, ఏవీ ఫలించలేదు. పోర్చుగీసు ప్రభుత్వం అతనికి మొత్తం 26 ఏళ్ళు కారాగార శిక్ష విధించింది. ఇటీవల ఏ కళనున్నదో లిస్బన్ ప్రభుత్వం శ్రీ రనడే పెట్టుకున్న అప్పీలును మన్నించి అతడిని విడుదల చేసింది.

బ్రిటిష్ ప్రభుత్వం ఇండియానేమి, ఫ్రెంచి ప్రభుత్వం తన వలన భూభాగాలనేమి విడిచి పెట్టి వెళ్ళిపోయినప్పటికి పోర్చుగీసు ప్రభుత్వం గోవా, దయ్యూ, డామన్లను మాత్రం విడిచి పెట్టకుండా తిష్ఠవేసుకుని కూర్చుంది. అవి భారతదేశంలోనివి కావని, పోర్చుగల్లో అంతర్భాగాలని, వాటిని ఎన్నటికి వదలిపెట్టబోనని బీరాలు పలికింది. భారత ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులన్నిటిని అది పెడచెవిని పెట్టింది. భారతీయులు పద్నాలుగేళ్ళు ఓపికపట్టారు. ఈలోగా గోవాలో విమోచనోద్యమం కూడా తీవ్ర స్థాయిలో ప్రారంభమైంది. ఈ పరిస్థితిలో మరి గత్యంతరం లేక భారత ప్రభుత్వం సైన్యాలను నడిపించి పోర్చుగీసు వలస భూభాగాలను స్వాధీనం చేసుకోవలసి వచ్చింది.

గోవా విమోచన యథార్థంగా భారత సైనిక జోక్యం వల్ల జరిగినదైనా, అంతకు ముందు ఉధృతంగా జరిగిన ప్రజోద్యమాలను విస్మరించడానికి వీలులేదు. మహారాష్ట్ర నుంచి మాత్రమేకాక ఆంధ్ర వంటి ఇతర ప్రాంతాల నుంచి కూడా యువకులనేకులు స్వచ్ఛందంగా వెళ్ళి ఆ పోరాటంలో పాల్గొన్నారు. ప్రాణాలను త్యాగంచేశారు. శ్రీ రనడే వంటి యువకులు సాహసోపేతంగా పోర్చుగీసు పాశవిక బలాన్ని ఎదిరించారు. వారి పద్ధతులు సత్యాగ్రహోద్యమాలకు భిన్నమైనవైనా వారి దేశభక్తి భగత్సింగ్, సుఖ్ దేవ్, రాజగురు వంటి వారలతో పోల్చదగినది. పద్దెనిమిది, పందొమ్మిది శతాబ్దాలనాటి శ్వేతజాతి సామ్రాజ్యాలు ఈనాడు లేవు. ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం ఒకటొకటిగా వలస దేశాలలో స్వాతంత్ర్య భానూదయమైంది. ఈ చారిత్రక పరిణామంతో రాజీ పడడానికి ఒక్క పోర్చుగల్ మాత్రమే నిరాకరిస్తున్నది. ఆఫ్రికాలోని అంగోలా, మొజాంబిక్ లలో నేటికీ పారతంత్ర్య తిమిరం అలముకుని వున్నది. అక్కడి ప్రజలు విమోచన సమరాన్ని సాగిస్తున్నారు. యావత్ప్రపంచంలో స్వేచ్ఛాశకోదయం కాగా కొద్దిపాటి పోర్చుగీసు వలసలు మాత్రమే శృంఖలాబద్ధమై వుండడం అసంగతం. వాటి విముక్తి అనివార్యంగా జరిగి తీరుతుంది.

శ్రీమతి నందినీ సత్పతిని హర్షించాలి.. అభినందించాలి. శ్రీ బిజూ పట్నాయకు, ఆయన ఉత్కళ కాంగ్రెసు సభ్యులు ఆరుగురిని ఏమైనా సరే కాంగ్రెసులో చేర్చుకొనడానికి వీలు లేదని ఆమె స్పష్టం చేసింది. అంత పని చేస్తే, తాను అసెంబ్లీకి జరగనున్న ఉప ఎన్నిక నుంచి విరమించగలనని కూడా ఆమె స్పష్టం చేసింది.

ఎన్నిక నుంచి విరమిస్తే, ఆమె తన ముఖ్యమంత్రి పదవినుంచి కూడా వీరమించాలి. అందుకు వెనుదీయక, ఆమె శ్రీ పట్నాయకు, ఆయన అనుచరులకు వ్యతిరేకంగా నిలవడం నిజంగానే ఒక గొప్ప విశేషం.

శ్రీ పట్నాయక్ తోడ్పాటు తనకున్నా, శ్రీమతి నందిని ఉప ఎన్నికలో మాజీ ముఖ్యమంత్రి శ్రీ బీరేన్ మిత్రాను ఓడించడం తేలిక కాదు. కటక్లో శ్రీ మిత్రాకు ఎంతో పలుకుబడి ఉన్నది. ఆయనకు శ్రీ పట్నాయక్ సహాయ సహకారాలు లభిస్తే, శ్రీమతి నందిని గెలుపు మరింత అనుమానంలో పడగలదు.

మిత్రా, పట్నాయక్లు కలిసినా, తానే గెలవగలనని ఆమె చెబుతున్నదనుకోండి. అయినా, ఆమెకైనా తెలియకపోదు ఓడిపోయే ప్రమాదం సయితం కొంత కలదని ఈ ప్రమాదానికి అవకాశం లేకుండా చేయడానికే కాంగ్రెసు అధిష్ఠానవర్గం శ్రీ చంద్రజిత్ యాదవ్ను భువనేశ్వర్కు పంపించడం జరిగింది. శ్రీ పట్నాయక్ ను, ఆయన ఉత్కళ కాంగ్రెసు సభ్యులను తాము కాంగ్రెసులో చేర్చుకొననున్నట్టు శ్రీ యాదవ్ ప్రకటించడం సయితం జరిగింది. ఈ ఘట్టంలో "అయితే, నేను ఉప ఎన్నిక నుంచి విరమిస్తాను" అని చెప్పడానికి ఎంతో గుండెబలం కావాలి. ఈ బలం తనకు కొల్లలుగా ఉన్నదని శ్రీమతి నందిని రుజువు చేసింది. అందుకే ఆమెను హర్షించాలని, అభినందించాలని మేము అంటున్నాము.

శ్రీమతి నందినీ సత్పతి ఈనాడే కాదు, చిన్నతనంనుంచి కూడా గుండెబలాన్ని చూపుతున్నది. ఆమె ముఖ్యమంత్రి పదవికి వచ్చినప్పుడు శ్రీ జయప్రకాశ్ నారాయణ్ తన జీవితంలో ఒకే ఒకసారి సభలో తనపై రాయి విసరడం జరిగిందని, ఇది కటక్ సభలో జరిగిందని, ఒక విద్యార్థిని అంత సాహసం చేసిందని, ఆమె కొత్తగా ముఖ్యమంత్రి పదవిని స్వీకరించిన శ్రీమతి సత్పతి అని చెప్పారు. ఆనాడు ఒక చిన్న రాయిని శ్రీ జయప్రకాశ్పై విసిరిన వ్యక్తి ఈనాడు శ్రీ పట్నాయక్పై ఒక రాతిబండనే విసిరింది!

ఆమె చేసిన ఈ పని కారణంగా రేపు ఉప ఎన్నికలో ఆమె ఓడిపోవచ్చు. ఆ వెంటనే ఆమె తన ముఖ్యమంత్రి పదవిని కోల్పోవచ్చు. అప్పుడు ఆమె అవివేకంగా ప్రవర్తించిందని కొందరనవచ్చు. మన జీవితపు విలువలు, వాటితోపాటు మన నైతికపు విలువలు ఎంతో హీనస్థాయికి దిగజారిపోయాయి. గెలుపు ఒకటే మనకు ముఖ్యం. గెలిచినవాడే మన దృష్టిలో ఘనుడు. గెలుపుకోసం ఎన్ని కూళ్ళు కుడిచినా, దాన్ని మనం పట్టించుకోము. కుడి ఎడమలని, నీతి నిజాయితీలని ధర్మసంకోచాలు పెట్టుకునేవాడిని చేతకాని దద్దమ్మకింద మనం జమకడతాము. ఇప్పటి ఈ పరిస్థితులలో శ్రీమతి నందిని రేపు ఎన్నికలలో నిజంగానే ఓడిపోతే, ఆమె అవివేకంగా ప్రవర్తించినదన్న విమర్శ రావడం ఖాయమే. ఇది హీనస్థితికి దిగజారిన మన జీవితపు విలువలకు, నైతికపు విలువలకు తిరుగులేని నిదర్శన మనడం కూడా ఖాయమే!

(ఆంధ్రజ్యోతి 15-11-1972).

## డాక్టర్ రఘువీర

కాన్పూర్ వద్ద కారు ప్రమాదానికి లోనై డాక్టర్ రఘువీర కన్నుమూసినట్టు వినడానికి ఎంతో చింతిస్తున్నాము. ఆయనది ఆకస్మిక మరణమే కాదు! అకాల మరణం కూడా. ఆయన నిరుడు షష్టి పూర్తి చేసుకొన్నా, అరవై సంవత్సరాలు దాటిన వ్యక్తివలె కనబడేవారు కాదు. చూపులో చురుకు, మాటలో చురుకు, నడకలో చురుకు వీటిని చూడగా ఆయన నూరేళ్ళ నిండేవరకు జీవించగలరన్న అభిప్రాయం కలిగేది. అట్టి డాక్టర్ రఘువీర నిన్న తలవని తలంపుగా నిర్యాణం చెందడం ఎంతైనా శోచనీయం.

జనసంఘం అధ్యక్షుడైన డాక్టర్ రఘువీర రాజకీయాలతో మనం ఏకీభవించలేక పోవచ్చు. అయినా, ఆయన చిత్త శుద్ధిని, ఆయన దేశ భక్తిని శంకించడానికి వీలు లేదు. కాంగ్రెసు సిద్ధాంతాలలో, విధానాలలో నమ్మకం

ఉన్నంత వరకు ఆయన కాంగ్రెసులో ఉన్నారు; వాటిలో నమ్మకం సడలగానే జనసంఘంలో ప్రవేశించారు. 1950 నుంచి 1962 వరకు కాంగ్రెసు పార్టీ సభ్యులుగా రాజ్యసభలో ఉండగా ఆయన పార్టీ నిబంధనలకు పూర్తిగా కట్టుబడి ఉండేవారు. మరి కొంత కాలంపాటు జీవించి ఉంటే, జన సంఘం నియమావళినైనా ఆయన తు.చ. తప్పకుండా బహుశా పాటించి ఉండేవారు కాదు. పార్టీ గీసే గీతల లోపల నిలవ లేనట్టిది ఆయన స్వతంత్ర ప్రవృత్తి.

డాక్టర్ రఘువీర రాజకీయాలను హర్షించలేనట్టే, ఆయన హిందీ భాషాభిమానాన్ని, ఆంగ్లేయ భాషా విద్వేషాన్ని మనం హర్షించలేక పోవచ్చు. అయినా, జాతీయ, విజాతీయ భాషలు పెక్కింటిలో ఆయన పాండిత్యాన్ని కాదనడానికి వీలులేదు. 'టిబెటన్, మంగోలియన్ భాషలు మొదలుకొని ఎన్నింటిలోనో ఆయన మహా పండితుడు. దేశ దేశాలలో పర్యటించి, ప్రాచీన భారత సారస్వతానికి, కళలకు, సంస్కృతికి సంబంధించిన వేలాది గ్రంథాలను ఆయన సేకరించారు. వాటిని పరిశోధించి శతాధిక గ్రంథాలను రచించారు. నిఘంటువుల నిర్మాణంలో ఆయన ప్రత్యేకించి కృషి చేశారు.

విజాతీయ పదా లన్నింటిని వెలివేయ వలెనన్న పట్టుదలతో కృత్రిమమైన, కర్ణ కఠోరమైన కొన్ని పదాలను డాక్టర్ రఘువీర సృష్టించి ఉండవచ్చు. “నెక్ టై ”కి “కంఠలంగోటి”గా ఆయన నామకరణం చేశాడనడం ఆయనను వెక్కిరించడం కోసమే చెప్పే మాట కాకపోవచ్చు. అప్పుడప్పుడు వెర్రి తలలు వేసినా, మొత్తంపై గౌరవించదగినదే ఆయన భాషా సేవ.

స్వదేశాభిమానం, స్వమతాభిమానం, స్వభాషాభిమానం, మితిమీరితే కలగగల ప్రమాదాలకు డాక్టర్ రఘువీర జీవితం ఒక తార్కాణం. మన ప్రేమాభిమానాలు మన వివేకంపై ప్రాబల్యం వహించకుండా జాగ్రత్త పడని పక్షంలో మన వ్యక్తిత్వం కొన్ని వికారాలకు లోనై పోతుంది.

“అతి సర్వత్ర వర్జయేత్” అనేది అన్ని కాలాలకు, అందరు మానవులకు వర్తించే ఉత్తమ సూత్రం, “అతి సర్వత్ర గర్హ్వతే” అనేది కూడా ఇట్టి గొప్ప సూత్రమే!

డాక్టర్ రఘువీర కుటుంబానికి, ఆయన పార్టీవారికి మా సానుతాపాన్ని తెలియజేస్తున్నాము.

(ఆంధ్రజ్యోతి 16-5-1963)

## శ్రీ అశోక మెహతా




మరొక విధమైన తీర్మానాన్ని ప్రజా సోషలిస్టు పార్టీ జాతీయ కార్యవర్గం నుంచి ఆశించడానికి వీలులేదనుకోండి. అయినా, పార్టీ ప్రతినిధిగా కాక వ్యక్తిగత ప్రతిపత్తితో, ఎట్టి షరతులకు లోబడకుండా, తాను ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్ష పదవికి సమ్మతించినట్లు శ్రీ అశోక మెహతా వివరించిన తర్వాతనైనా, ఆయన చర్యను ప్రజా సోషలిస్టుపార్టీ కార్యవర్గం నిరసించబోదని భావించిన వారికి దాని తీర్మానం కొంత బాధ కలిగించకపోదు.

సోషలిస్టు సమాజ సంస్థాపన కాంగ్రెసు లక్ష్యమని ఆవడిలో తీర్మానం జరిగిన తర్వాత నిజానికి ప్రజా సోషలిస్టు పార్టీ విడిగా మిగలవలసింది కాదు. ఒక వేళ మిగిలినా, కాంగ్రెసుకు ప్రతి పక్షంగా తన ధర్మం అన్ని విషయాలలో కాంగ్రెసు ప్రభుత్వం విధానాలను వ్యతిరేకించడమే అని భావించ వలసింది కాదు. సోషలిస్టు సమాజ సంస్థాపన లక్ష్యానికి తోడ్పడగల విధానాలను కాంగ్రెసు ప్రభుత్వం అమలు జరుపుతున్నట్టు తోచిన ప్రతి సందర్భంలోను దాన్ని సమర్థించడం, అందుకు భిన్నంగా వెళ్ళనున్నట్టు తోచిన ప్రతి సన్నివేశంలో దాన్ని ప్రతిఘటించడం - కనీసం ఈ వైఖరినైనా అది అవలంబించ వలసింది.



శ్రీ అశోక మెహతా ఇదే తమ పార్టీకి సముచిత వైఖరి కాగలదని మొదటి నుంచీ సూచిస్తున్నారు. ఇదివరలో లోక్ సభ సభ్యుడుగా ఆయన కాంగ్రెసు ప్రభుత్వాన్ని సమర్థించిన ఘట్టాలవలె దాన్ని విమర్శించినవీ ఎన్నో ఉన్నాయి. తక్కిన పి.ఎస్.పి. నాయకులు ఈ వైఖరిని హర్షించలేక పోవడం శోచనీయం.

ఐక్యరాజ్య సమితికి వెళ్ళిన భారత ప్రతినిధివర్గంలో సభ్యుడుగా చేరడానికి శ్రీ మెహతా సమ్మతించడ మేమి, ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్ష పదవిని స్వీకరించడానికి ఆమోదించడమేమి సోషలిజం లక్ష్యాన్ని చేరడానికి కాంగ్రెసు చర్యలు తీసుకొంటున్న మేరకు దానితో సహకరించడం సముచితం కాగలదన్న విశ్వాసంతోనే; పదవులపై వ్యామోహంతో కాదు. పదవినే కోరితే, కేవలం గౌరవ పదవులే కాక, కేంద్ర ప్రభుత్వంలో మంత్రి పదవి సయితం ఆయనకు ఎన్నడో లభించి ఉండేది.

నేడు కాకపోతే, మరికొంత కాలానికైనా తక్కిన పి.ఎస్.పి. నాయకులు కూడా శ్రీ మెహతా వైఖరిని అనుసరించ గలిగితే, అది దేశంలో సోషలిస్టు శక్తులు బలపడ్డానికి తోడ్పడుతుంది.

(ఆంధ్రజ్యోతి 28-9-1963).

## శ్రీ బల్వంత్ నగేష్ దాతార్

శ్రీ బల్వంత్ నగేష్ దాతార్ను చూచిన వారెవ్వరు ఆయన వయస్సు 68 సంవత్సరాలని అనుకొనేవారు కాదు. ఇంకా షష్టిపూర్తి కానట్టే ఆయన కనిపించేవారు. పైగా, ఆరోగ్యానికి లోపం లేనట్టు కన్పించేవారు. నడకలో చురుకు, మాటలో ధాటి కనిపిస్తూ ఉండేవి కూడా. అట్టి శ్రీ దాతార్ ఆకస్మిక నిర్యాణ వార్త విషాదంతోపాటు ఆశ్చర్యాన్ని సయితం కలిగిస్తున్నది. చిత్తశుద్ధికి, కార్యదక్షతకు పేరు పొందిన ప్రముఖుడు, శ్రీ దాతార్. సంస్కృతంలో పండితుడైనందున ఆయన పురాతన భారతీయ సాహిత్యాన్ని, సంస్కృతిని ఆకళింపు చేసుకో గలిగారు. తత్వశాస్త్రం అభిమాన విషయమైనందున ప్రాచ్య, పాశ్చాత్య తాత్విక సిద్ధాంతాలను క్షుణ్ణంగా తెలుసుకొనడమే కాక, నైతికపు విలువలకు ప్రాధాన్య మివ్వ గలిగారు. న్యాయశాస్త్రాన్ని చక్కగా అభ్యసించినందున కార్య చతురులు కాగలిగారు. ఎవ్వరి మనస్సుకు నొప్పి కలిగించకుండా తన కర్తవ్యాన్ని ఆయన సమర్థంగా పరిపాలిస్తూ ఉండేవారు.

శ్రీ దాతార్ అగ్రశ్రేణికి చెందిన నాయకుడు కాకపోయినా, ద్వితీయ శ్రేణికి చెందిన వారిలో ఎన్నదగువారు. కేంద్రంలో మన హోం మంత్రులు మారుతూ వచ్చినా, 1952 నుంచి 57 వరకు ఆయన ఆ శాఖలో డిప్యూటీ మంత్రి, 1957 నుంచి స్టేట్ మంత్రి. ఏ హోం మంత్రితో కలిసి పనిచేసినా ఆయన ప్రేమ విశ్వాసాలను శ్రీ దాతార్ పూర్తిగా పొంద గలిగారు. "ప్రియతముడైన ఒక ఉత్తమ సహచరుడు గతించాడు. శ్రీ దాతార్ నిర్యాణం వ్యక్తిగతంగా నాకొక తీరనిలోటు" అని హోంమంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి నిన్న చేసిన ప్రకటనే ఇందుకొక నిదర్శనం.

కోపతాపాలు లేనివ్యక్తి, శ్రీ దాతార్. ప్రతిపక్షాలవారు రెచ్చగొట్టడానికి ప్రయత్నించినా ఆయన చికాకు పడేవారు కారు. చిరునవ్వుతో తగు సమాధానం చెప్పి, తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఉండేవారు, రాజకీయవేత్త వలెకాక, న్యాయవాది వలె ఆయన ప్రసంగిస్తూ ఉండేవారు. గొంతును హెచ్చించకుండా, తగ్గించకుండా, ఒకే ధోరణిలో ఆయన ప్రసంగాలు నడుస్తూ ఉండేవి. శ్రోతలను ఆయన వెంటనే ఆకర్షించ గలిగేవారు కాదు గాని, శ్రద్ధగా వింటే మాత్రం ఆయన న్యాయశాస్త్ర పాండితి, ఆయన వాదపటిమ గౌరవభావాన్ని కలిగిస్తూ ఉండేవి.

ఈ ప్రజ్ఞాశాలి, ఈ పరిపాలనాదక్షుడు, ఈ సత్పురుషుడు తలవని తలంపుగా నిన్న కన్ను మూయడం దేశానికి పెద్ద లోటు. ఆయన బంధుమిత్రులకు మా సానుతాపాన్ని తెలియ జేస్తున్నాము.

(ఆంధ్రజ్యోతి 15-2–1963)

## ప్రొఫెసర్ హుమయూన్ కబీర్

ఆయన అచ్చమైన జాతీయవాది, దేశభక్తుడు, రాజకీయ వేత్త, విద్యావేత్త, అన్నిటిని మించి కవి, పండితుడు; మరెన్నో విధాలుగా దేశ ప్రజల గౌరవాభిమానాలను చూరగొన్న వ్యక్తి శ్రీ హుమయూన్ కబీర్. ఆయన హఠాన్మృతి విషాదకరవార్త.

విద్యార్థిదశలోనే శ్రీ కబీర్ ప్రతిభావిశేషాలు లోకానికి వెల్లడైనాయి. విద్యార్థిగా స్వదేశంలోను, విదేశాలలోను ఆయన పొందినన్ని బహుమతులు బహుశా మరెవరు పొందివుండరు. ఆయనది అసాధారణమైన మేధాశక్తి. మాతృభాషయైన బెంగాలీలోను, ఇంగ్లీషులోను ఆయన అసంఖ్యాకంగా గ్రంథాలు రచించారు. బెంగాలీలో కవిగా ఆయన సుప్రసిద్ధుడు. టాగోర్, శరత్లపై ఆయన మౌలికమైన విమర్శారచనలు చేశారు. భారత రాజకీయాలలో ముస్లిముల పాత్రపై, ప్రజాస్వామ్యం, మార్క్సిజం మొదలైన విషయాలపై, కాంట్ తత్త్వ విచారంపై ఆయన ఉద్గ్రంథాలు రచించారు. ఆయన రచనలలో “నరులు, నదులు” (మెన్ ఎండ్ రివర్స్) సుప్రసిద్ధమైనది. మౌలానా ఆజాద్ ఆత్మకథ రచనలో ఆయనపాత్ర అందరికి తెలిసినదే. ఇక స్వాతంత్ర్యానంతరం భారతరాజకీయాలలో శ్రీ కబీర్ నిర్వహించిన పాత్రను గురించి వేరుగా చెప్పనక్కరలేదు. మొదట కేంద్ర విద్యాశాఖ సలహాదారుగా ఆయన ప్రభుత్వరంగంలో ప్రవేశించాడు. తర్వాత పౌర విమానయాన శాఖ, వైజ్ఞానిక పరిశోధన, సాంస్కృతిక వ్యవహారాలశాఖ, విద్యాశాఖ, పెట్రోలియం, కెమికల్స్ శాఖల మంత్రిగా, యూనివర్శిటీ గ్రాంట్సు కమిషన్ అధ్యక్షుడుగా వ్యవహరించి పరిపాలనాదక్షుడిగా పేరుపొందారు. మూడునాలుగేండ్లుగా ఆయన వివాదాస్పద రాజకీయాలలోనికి దిగారు; కాంగ్రెస్ నుంచి విడిపోయి బంగ్లా కాంగ్రెస్లో, ఆ తర్వాత భారతీయ కాంతిదళ్ లో చేరారు. కాని వీటిలో ఆయన పొందిన వైఫల్యాల వల్ల జాతీయవాదిగా, తాత్త్వికుడుగా, రచయితగా ఆయన ఘనతకు ఎట్టి లోటురాబోదు. ఆయన రచనలే ఆయనకు చిరస్మరణీయతను ఆర్జించగలవు. (ఆంధ్రజ్యోతి 20-8-1969)

## శ్రీ అరియకుడి రామానుజ అయ్యంగార్



నాలుగు రోజుల వ్యవధిలో దక్షిణ భారతానికి చెందిన ఇద్దరు ప్రసిద్ధ సంగీత విద్వాంసులు కాలం చేయడం విషాదకరం. జంత్ర సంగీతానికి శ్రీ చౌడయ్య సార్వభౌముడైతే, గాత్ర సంగీతానికి సమ్రాట్టు శ్రీ అరియకుడి రామానుజ అయ్యంగార్. అరవై సంత్సరాలపాటు రసిక లోకాన్ని ఆనందాంబుధిలో ఓలలాడించిన శ్రీ అరియకుడి అస్తమించడం సంగీతాభిమానులకు తీరని మనస్తాపం కలిగిస్తుంది. ఆయన మృతి దక్షిణ భారత సంగీత ప్రపంచంలో తీరని వెలితి మిగుల్చుతున్నది.

త్యాగరాజ శిష్య పరంపరకు చెందిన శ్రీ అరియకుడి కర్ణాటక సంప్రదాయ సంగీతాన్ని పునరుద్ధరించి, పండిత, పామరులకు సయితం రంజకంగా వుండే విధంగా తీర్చిదిద్దిన కొద్దిమంది మహామహులలో ఒకరు. సంగీత శాస్త్రంలో ఆయనకు తెలియని రహస్యం, ఆయన స్పృశించి చూడని ఔన్నత్య శిఖరం లేదు. అయినా,

తన విద్వత్తును ప్రదర్శించడంలో కూడా జనరంజకత్వ గుణం లోపించకుండా, శ్రవణ సుభగమైన ఒక ప్రత్యేకశైలిలో, అనితరసాధ్యమైన స్వరకల్పనా నైపుణిలో ఆయన కొన్ని దశాబ్దాలుగా కర్ణాటక సంగీత ప్రపంచాన్ని పరిపాలించారు.




గానకచేరీల పద్ధతిని ప్రవేశ పెట్టింది రామానుజ అయ్యంగారే నని చెబుతారు. ఆయన సంగీతశాస్త్రానికి చేసిన సేవలకు పరిగణనగా మద్రాసు మ్యూజిక్ అకాడమీ 1939లో "సంగీత కళానిధి" బిరుదునిచ్చి సత్కరించింది. 1941 లో ఆయన మైసూరు ఆస్థాన విద్వాన్ నియమితులైనారు. 1958లో రాష్ట్రపతి పద్మభూషణ్ ప్రదానంచేసి గౌరవించారు. గానంలో ఆయన విశిష్ట శైలి, ఏ స్థాయిలో నైనా గాంభీర్యం కోల్పోని ఆయన గాత్రం, ఆయనతోనే పోయినా కర్ణాటక సంప్రదాయ సంగీతం వర్ధిల్లుతున్నంతకాలం ఆయన స్మృతి చిరస్థాయిగా నిలిచిపోతుంది. (ఆంధ్రజ్యోతి 12-1-1967)

## శ్రీ దుర్గాప్రసాద్ ధార్

సోవియెట్ యూనియన్లో ఇండియా రాయబారి శ్రీ దుర్గాప్రసాద్ ధార్ అకాల మృతితో ఇండియా ఒక దౌత్యనీతి నిపుణుని కోల్పోయిందని చెప్పవచ్చు.

చాలాకాలంగా కాశ్మీర్లో ఉపమంత్రిగాను, మంత్రిగాను వివిధ శాఖలలో అనుభవం గడించినప్పటికీ, మాస్కోలో ఇండియా రాయబారిగా నియమితుడయ్యేవరకు శ్రీ ధార్ జాతీయరంగానికి అంతగా పరిచితుడు కాడు. ఆయనలోని రాయబార నిర్వహణ కౌశలాన్ని, దౌత్యనీతి నైపుణ్యాన్ని గుర్తించి, జాతీయ, అంతర్జాతీయ రంగాలలో వాటి రాణింపుకు అవకాశం కల్పించింది ప్రధాని ఇందిరా గాంధియే.

తనకు లభించిన అవకాశాన్ని శ్రీ ధార్ సమర్థంగా వినియోగించుకున్నారు. ఇండియా, సోవియెట్ యూనియన్ల మధ్య సన్నిహిత సహకార సాధనకు ఆయన చేసిన కృషి ఫలించింది. ముఖ్యంగా బంగ్లాదేశ్ సమస్యపై జరిగిన ఇండో - పాక్ యుద్ధ సమయంలో కొన్ని విదేశాల బెదరింపుల నుంచి తిరుగులేని కవచంగా మనకు ఉపయోగపడిన ఇండో సోవియెట్ మిత్రత్వ, పరస్పర సహకారం ఒడంబడికకు శిల్పి శ్రీ ధార్ అని చెప్పవచ్చు.

ఆ తరువాత ఇండియా, బంగ్లాదేశ్ల మధ్య సహకార సాధనలో కూడా ఆయన ప్రముఖ పాత్ర వహించారు. అందువల్లనే మన విదేశాంగ విధాన సమన్వయ కర్తగా ఆయనకు ప్రత్యేక స్థానం లభించింది. ఇండియా, పాకిస్తాన్ల మధ్య సిమ్లా ఒప్పందాన్ని సాధించడంలో సయితం శ్రీ ధార్ గణనీయమైన పాత్రనే నిర్వహించారు.

అయితే, దౌత్యనీతి వ్యవహర్తగా ప్రదర్శించిన పాటవాన్ని కేంద్రంలో ప్లానింగ్ మంత్రిగా ఆయన ప్రదర్శించలేకపోయారు. రాయబారిగా సాధించిన విజయాన్ని మంత్రిగా పొందలేకపోయారు. అందువల్ల, దౌత్యనీతి రంగంలోనే ఆయన హెచ్చుగా రాణించగలరన్న భావంతో తిరిగి రష్యాకు రాయబారిగా పంపడం జరిగింది.

కాశ్మీర్లోని ఒక పెద్ద జమీందారి కుటుంబంలో జన్మించినప్పటికీ, అక్కడి జమీందారీ విధానానికి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించడంతోనే జీవితాన్ని ఆరంభించడం శ్రీ ధార్ జీవితంలోని ప్రత్యేకత. అభ్యుదయ, సోషలిస్టు భావాలుగల శ్రీ ధార్ ఈ దశాబ్దంలో మన దేశ రాజకీయ రంగంలో ప్రముఖ పాత్ర వహించారు.

ముఖ్యంగా కాశ్మీర్ సమస్యను గురించి అంతర్జాతీయ వేదికలపై విడమర్చి చెప్పడంలో ఆయన కృతకృత్యులైనారు. కొండజాతి దుండగీండ్రు కాశ్మీర్పై దాడిచేసినప్పుడు దాని రక్షణలో కూడా ఆయన కీలకమైన పాత్రనే నిర్వహించి, కాశ్మీర్ ప్రజల ప్రేమాభిమానాలకు పాత్రులైనారు. శ్రీ ధార్ మృతి కాశ్మీర్ రాజకీయ రంగానికి, భారతదేశపు దౌత్యనీతి రంగానికి తీరని వెలితి.

(ఆంధ్రజ్యోతి 13-6-1975)

## స్మృతి చిహ్నం : స్వామీ వివేకానంద



స్థూలదృష్టికి ఆయన ఒక తత్త్వవేత్తగా, ఒక వేదాంతిగా కనిపించవచ్చు. కాని, స్వామి వివేకానంద సాధారణ తత్త్వవేత్తకాడు! సాధారణ వేదాంతి కాడు,

ఆయన ప్రధానంగా కర్మయోగి, మానవతావాది.

స్థూలదృష్టికి ఆయన హిందూ మతాన్ని పునరుద్ధరించడానికి అవతరించిన మహాపురుషుని వలె గోచరించవచ్చు. కాని, స్వామీ వివేకానంద సాధారణ మతోద్ధారకుడు కాడు.

ఆయన హిందూమతాన్ని, దాని వేదాంతాన్ని గ్రుడ్డిగా విశ్వసించలేదు; వాటిని యధాతథంగా అంగీకరించలేదు. దానిలో నేటికీ సజీవంగా, చైతన్యవంతంగా భాసిస్తున్న దాన్ని మాత్రమే ఆయన స్వీకరించాడు; హిందూ సమాజాన్ని కొన్ని శతాబ్దాలపాటు నిర్వీర్యం, నిస్తేజం చేసిన కులవ్యవస్థను, మూఢ విశ్వాసాలను, శుష్కాచారాలను తిరస్కరించాడు.



స్వామీ వివేకానంద దృష్టిలో మానవునికి, అతని వ్యక్తిత్వ వికాసానికి ప్రథమ స్థాన మివ్వనిది మతం కాదు. మానవునిలో మానసిక దౌర్బల్యాన్ని, నిస్సహాయతను, నిష్క్రియత్వాన్ని పెంచి పోషించేది మతం కాదు. మతం మానవునిలో స్వావలంబనాన్ని, నైతిక దార్ఢ్యాన్ని పురికొల్పాలి. అటువంటి మతాన్నే ఆయన ప్రచారం చేశాడు.

ఆయన సర్వసంగ పరిత్యాగి అయినా ప్రాపంచిక విషయాలపై నిరాసక్తిని ప్రదర్శించలేదు. ముఖ్యంగా సంఘంలో అట్టడుగు స్థాయిలో జీవించే దరిద్రనారాయణుల అభ్యుత్థానాన్ని ఆయన కాంక్షించాడు. రాజకీయాల జోలికి ఆయన అంతగా వెళ్ళకపోయినా, భారత దేశ పునరుజ్జీవనానికి స్వాతంత్ర్య సాధన అవసరమని విశ్వసించాడు. తుది రోజులలో ఆయన తన్ను తాను సోషలిస్టుగా అభివర్ణించుకున్నాడు కూడా.

(ఆంధ్రజ్యోతి 4-9-1970)

## "చిరంజీవి" నేతాజీ

ఇండియా రాజకీయ పారతంత్ర్యం నుంచి, సాంఘికమైన అధోగతి నుంచి బయటపడడానికి మహోద్యమాలను ప్రారంభిస్తున్న తరుణంలో స్వామీ వివేకానంద వర్ధిల్లాడు. ఆ ఉద్యమాలపై ఆయన ప్రభావం ఎంతైనా ఉన్నది.

ఆయన కీర్తి స్వదేశపు సరిహద్దులకే పరిమితం కాలేదు. ఖండఖండాంతరాలకు వ్యాపించింది. అమెరికాలోని చికాగో నగరంలో 1893వ సంవత్సరంలో ప్రపంచ మతాల మహాసభ సందర్భంగా స్వామీ వివేకానంద చేసిన మహోపన్యాసం పాశ్చాత్య విద్వాంసులను, తత్త్వవేత్తలను మహాశ్చర్యంలో ముంచెత్తింది. వారిని ముగ్ధులను చేసింది. భారత దేశం పట్ల, దాని తాత్త్విక చింతన పట్ల వారికి విశేషాసక్తిని కలిగించింది.

అదే విధంగా పాశ్చాత్య దేశాల సందర్శన, పరిశీలన వివేకానందపై కూడా విశేష ప్రభావం ప్రసరించాయి. భారతదేశం తన ప్రాచీనౌన్నత్యాన్ని తలచుకుని మురిసిపోవడం తగదని, పాశ్చాత్య దేశాల భౌతికౌన్నత్యాన్ని కూడా పొందిననాడే దాని ఆధ్యాత్మిక చింతనకు సార్థక్యమని ఆయన ప్రబోధించాడు.

ఆయన స్మృతి చిహ్నంగా మూడు సముద్రాలు సంగమించే కన్యాకుమారి అగ్రంవద్ద నెలకొల్పిన కాంస్య విగ్రహాన్ని నిన్న రాష్ట్రపతి శ్రీ వి.వి. గిరి ఆవిష్కరించారు. ఆ మహనీయుని పవిత్ర స్మృతికి అది సముచిత చిహ్నమే. కాని, అంతటితోనే స్వామీజీపట్ల మన కర్తవ్యం నెరవేరినట్టు భావించరాదు. ఆయన తన జీవితాన్ని ఏ మహాదర్శాలకు అంకితం చేశాడో వాటిని కొంతవరకైనా సాధించడానికి కృషి చేసిననాడే ఆ స్మృతి

చిహ్నానికి విలువ. లేనప్పుడు ఈ దేశంలో ఎక్కడపడితే అక్కడ వేలాదిగా నెలకొన్న మహాపురుషుల విగ్రహాలలో అది మరొకటి మాత్రమే కాగలదు. అంతకంటె దానికి ప్రత్యేకమైన విలువ ఉండబోదు.

మనకు ఎంతో ప్రేమాస్పదులైనవారు, ఎంతో అభిమాన పాత్రులైనవారు చనిపోయారన్న వార్తను విన్నప్పుడు దాన్ని ఒకంతట నమ్మలేము. అందులో వారి మృతి వార్తను ఆకస్మికంగా విన్నప్పుడు, లేదా వారు మన కళ్ళ ఎదుట కాక, ఎక్కడో ఏ దూర దేశంలోనో పోయినారన్న వార్త విన్నప్పుడు దాన్ని నమ్మడం మరింత కష్టం.

ఇది వ్యక్తిగత బంధుమిత్రుల పట్ల తరచుగా పలువురికి అనుభవంలోనికి వచ్చే విషయం. అదేవిధంగా, జాతికి ప్రీతిపాత్రులైన వారి విషయంలో, మహానాయకులైనవారి విషయంలో కూడా అరుదుగా జరుగుతూ ఉంటుంది.

నేతాజీగా భారతజాతి గౌరవించిన సుభాస్ చంద్రబోస్ విషయంలో ఇంతే జరిగింది. ఆయన స్వదేశ స్వాతంత్ర్య సాధనకోసం తనను నిర్బంధించిన బ్రిటిష్ ప్రభుత్వం కన్నుగప్పి రహస్యంగా దేశం నుంచి తప్పించుకుని వెళ్ళిపోయాడు. ఎన్నెన్నో దేశాలు తిరిగాడు. భారతదేశ విముక్తికి.

సహాయపడవలసిందిగా ఎందరెందరినో కోరాడు. ఒక విమోచన సైన్యాన్ని సంఘటితం చేశాడు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసి, జపాన్ లొంగిపోయిన సమయంలో ఆయన సింగపూర్ నుంచి రష్యాకు తప్పించుకొని వెళ్లే ప్రయత్నంలో తైపీ విమానాశ్రయంలో విమాన ప్రమాదానికిలోనై మరణించాడు.

ఈ దుర్వార్త విన్నప్పుడు దాన్ని నమ్మడం పలువురు భారతీయులకు కష్టమైంది. ఆయన స్వదేశం నుంచి తప్పించుకొనడమే విచిత్రంగా జరిగింది. విదేశాలలో ఆయన అజ్ఞాత పర్యటనలు, ఆయన ఒక సైన్యాన్ని సమీకరించడం, బ్రిటీష్ వారిని చికాకు పరచడం - ఇవన్నీ వింత కథలుగా ఆనాడు వినిపించేవి కాగా, ఆయన ఆకస్మిక మరణ వార్త మరింత సంభ్రమాశ్చర్యకరంగా, విషాదకరంగా, విశ్వసించరానిదిగా వినరావడంలో వింత లేదు.

ఆయన సజీవుడుగానే ఉన్నాడని, ఎన్నటికైనా తనవారి మధ్యకు తిరిగి వస్తాడని పలువురి నమ్మకం. రష్యాలోనో, చైనాలోనో, మరొక దేశంలోనే ఉన్నాడని కొందరి నమ్మకం కాగా, మన దేశంలోనే ఎక్కడో అజ్ఞాతంగా తపస్సు చేసుకుంటున్నాడని మరి కొందరి విశ్వాసం. ఆయన మృతి వార్తపై దర్యాప్తుకు ఇదివరలోనే ఒక ఘాన్ని నియమించడం జరిగింది. అయినా, దానితో తృప్తి పడని పలువురు నేతాజీ మృతివార్త దుర్బుద్ధితో కల్పించినట్టిదని, ఆయన గురించిన నిజాన్ని భారత ప్రభుత్వం కప్పిపుచ్చుతున్నదని ఆరోపించారు. దీనితో మరొక కమిషనన్ను నియమించడం జరిగింది.

శ్రీ జి.డి. ఖోస్లా ఏకైక సభ్యుడుగా గల ఈ కమిషన్ 1970 నుంచి ఇటీవలి వరకు నేతాజీ మృతి వార్తను క్షుణ్ణంగా దర్యాప్తు చేసింది. ఆయనతో సన్నిహిత సంబంధం కలవారి దగ్గరనుంచి, ఆయనను ఫలానా చోట ప్రత్యక్షంగా చూచినట్టు చెప్పినవారి వరకు ఎందరినో కమిషన్ విచారించింది. ఎన్నో సాక్ష్యాధారాల సేకరణ

తర్వాత నేతాజీ 1945 ఆగస్టు 18వ తేదీన తైపీలో విమాన ప్రమాదానికి లోనై మరణించిన వార్త నిజమేనని నిర్ధారణ చేసింది.

పార్లమెంటుకు మొన్న ప్రభుత్వం సమర్పించిన భోస్లా కమిషన్ నివేదిక తర్వాత కూడా నేతాజీ సజీవుడన్న నమ్మకాన్ని వదులుకోలేని వారుంటారు. నేతాజీ విషయమై నిజాన్ని కప్పిపుచ్చడం జరుగుతున్నదనే ఆరోపణను తిరిగి చేయనంతవరకు వారి విశ్వాసంతో ఎవరికి నిమిత్తం లేదు. నిజానికి నేతాజీ భౌతికంగా మరణించినా, భారత ప్రజాహృదయాలలో ఆయన చిరంజీవి. భారత స్వాతంత్ర్య సమర చరిత్ర నిలిచి ఉన్నంత వరకు ఆయన యశఃకాయుడై జీవించే ఉంటాడు.

(ఆంధ్రజ్యోతి 5-9-1974)

ఘోర హత్య: శ్రీ ప్రతాప్సింగ్ కైరాన్ డిటెక్టివ్ కథలను మించిన "మిస్టరీ"తో, గ్రీక్ ట్రాజెడీలను పోలిన విషాదాంతంతో శ్రీ ప్రతాప్సింగ్ కైరాన్ జీవిత నాటకం ముగిసింది. ఆయన మరణంతో పంజాబ్ రాజకీయ రంగం ఒక ప్రతిభాశాలిని, ఒక వివాదాస్పద వ్యక్తిని కోల్పోయింది.

కైరాన్ హత్యకు కారణం వ్యక్తిగతమైనదో, రాజకీయ మైనదో, మరొకటో తెలియడం లేదుగాని, మొత్తంపై విభ్రాంతి కలిగిస్తున్నది; విషాదం కలిగిస్తున్నది. తమకు గిట్టని రాజకీయ నాయకులను తొలగించడానికి హత్యా సాధనాన్నే నమ్ముకున్న పిరికిపందలింకా మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నారా! అని సిగ్గు కలిగిస్తున్నది.

ఒక్కమాటలో చెప్పవలసి వస్తే కైరాన్ హత్య అమానుషమైనది. ఆయనతో కారులో ప్రయాణం చేస్తున్న మరొక ముగ్గురిని కూడా దారుణంగా కాల్చి చంపడం బహుశా వారి ద్వారా తమ ఆచూకీ బయటపడకుండా చేయడానికే కావచ్చు. ఢిల్లీ సమీపంలో పట్టపగలు నడిరోడ్డుమీద నిర్భయంగా నాలుగు హత్యలను ఒకేతూరి చేయడం చూస్తే, అవి ముందుగా ఆలోచించి వేసుకున్న పథకం ప్రకారం అనుకున్నచోట, అనుకున్న సమయానికి జరిగినవే అని ఊహించవచ్చు.

ఒక పదేళ్ళుగా పంజాబ్ రాజకీయాలు దాదాపు కైరాన్ చెప్పుచేతలలోనే నడిచాయి. ముఖ్యమంత్రిగా ఆయన మంచి చేసినా, చెడు చేసినా అది వివాదాస్పదం కావడం, దాదాపు ప్రతి రాజకీయ సంక్షోభానికి ఆయన కేంద్రం కావడం జరిగింది. ఆయనకు గాఢాభిమానులెందరున్నారో, బద్ధవైరులు కూడా అందరుండడం ఆయన విలక్షణ వ్యక్తిత్వానికి ఫలితం. అయినా తన గాఢ విరోధులు సైతం కాదనలేని కొన్ని మంచిపను లాయన స్వరాష్ట్రానికి' చేశాడు. దేశ విభజన ఫలితంగా ఎంతో నష్టపడిన పంజాబ్ గడచిన దశాబ్దంలో పారిశ్రామికంగా, వ్యావసాయికంగా ఇంతగా పురోగమించడానికి ఆయన కార్యదక్షతే చాలవరకు కారణం.

అకాలీ దళంలో సభ్యుడుగా రాజకీయ జీవితం ప్రారంభించి, 1929లో కాంగ్రెసులో చేరి జీవితాంతం వరకు ఆ సంస్థకే ఆయన విధేయుడుగా వున్నాడు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొని పెక్కుసార్లు కారాగారవాసం

చేశాడు. ఆయన దేశభక్తి చైనా దురాక్రమణ సమయంలో ప్రస్ఫుటమైంది. దేశ రక్షణకు ప్రజలను సమీకరించడంలో, నిధిని సేకరించడంలో ఆయన పడిన శ్రమ చిరస్మరణీయమైనది.

తాను శికు మతానికి చెందిన వాడైనా తీవ్ర మతవాదాన్ని ఆయన నిరసించాడు. స్వరాష్ట్రంలో మత సామరస్యానికే కృషి చేశాడు. స్వమతస్థుల ఆగ్రహానికి కూడా ఆయన చలించలేదు.

ప్రజాహిత రంగంలో పనిచేసే వ్యక్తులు అనుమానాలకు, అపోహలకు అతీతంగా ప్రవర్తించాలనే ప్రాథమిక సూత్రాన్ని కైరాన్ విస్మరించాడు. అదే ఆయన పతనానికి కారణమైంది. రాజకీయంగా ఆయన నిర్దాక్షిణ్యంగా అనుసరించిన విధానాలు, వాటిని అమలు చేయడంలో ఆయన చూపిన తొందరపాటు పెక్కు మందిని శత్రువులుగా తయారుచేశాయి. చివరకు ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలను దర్యాప్తు చేసిన దాస్ కమీషన్ ఆయనను రెండు మూడు విషయాలలో తప్పు పట్టుకున్నది. దీనితో ఆయన ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకొనక తప్పలేదు.

కైరాన్ హత్యకు కారణాలేవో, హంతకులెవరో ఇప్పటి వరకు దుర్భేద్యంగానే ఉంది. కేంద్రం, పంజాబ్ ప్రభుత్వం ఈ నేరాన్ని క్షుణ్ణంగా దర్యాప్తు చేయించడం, నేరస్థులను బయట పెట్టడం జరగాలి. పదవీచ్యుతులైన రాజకీయ నాయకులకు భద్రతలేని పరిస్థితి మన ప్రజాస్వామ్యానికి గౌరవప్రదమైన విషయం కాదు.

(ఆంధ్రజ్యోతి 9-2-1965)

## ప్రొఫెసర్ డి.ఆర్. గాడ్గిల్

ప్రొఫెసర్ డి.ఆర్. గాడ్గిల్ నిర్యాణం విషాదకర పరిస్థితులలో జరిగింది. ప్లానింగ్ కమీషన్ ఉపాధ్యక్షుడుగా పదవీ విరమణ చేసి మూడు రోజులైనా తిరగకుండానే ఆయన ఆకస్మికంగా హృద్రోగంతో మరణించారు. అది కూడా న్యూఢిల్లీ నుంచి తన స్వస్థలమైన పూనా వెడుతుండగా రైలులో జరిగింది.

మన ప్లానింగ్ వ్యవస్థ గట్టి చిక్కులను ఎదుర్కొంటున్న సమయంలో శ్రీ గాడ్గిల్ ప్లానింగ్ కమీషన్ ఉపాధ్యక్ష పదవిని స్వీకరించారు. అది తృతీయ ప్రణాళిక వైఫల్యం నిరాశా నిస్పృహలను కలిగిస్తున్న సమయం. చతుర్ధ ప్రణాళికకు రూపురేఖ లింకా ఏర్పడలేదు. వరుసగా మూడేళ్ళు ఏకవర్ష ప్రణాళికలతోనే తృప్తిపడవలసి వచ్చింది.

ఆ సమయంలో ప్లానింగ్ కమీషన్ ఉపాధ్యక్ష పదవిలో సాధారణ రాజకీయవేత్త కంటే ఆర్థిక శాస్త్ర నిపుణుడు ఉండడమే సముచితమన్న భావనతో ప్రధాని శ్రీమతి గాంధి శ్రీ గాడ్గిల్ను నియమించడం జరిగింది.

ఆ పదవిని శ్రీ గాడ్గిల్ మూడున్నర యేళ్ళ పాటు నిర్వహించారు. ఏకవర్ష ప్రణాళికల స్థానంలో చతుర్ధ పంచవర్ష ప్రణాళికా వ్యవస్థ చిక్కులు తొలగలేదంటే దానికి బాధ్యత శ్రీ గాడ్గిల్ది కాదు. అందుకు ఆర్థిక కారణాలవలె రాజకీయ కారణాలు కూడా ఉన్నాయి.

ఆయన రాజకీయవేత్తకాదు; కేవలం ఆర్థిక శాస్త్రవేత్త మాత్రమే. అందువల్ల ప్రభుత్వాలోచనలకు, ప్లానింగ్ కమీషన్ ఆలోచనలకు వైరుధ్యాలు ఏర్పడ్డం సహజంగానే జరిగింది.

బహుశా ఈ వైరుధ్యాలను తొలగించడం కోసమే శ్రీ సి. సుబ్రహ్మణ్యంను కేంద్రంలో ప్లానింగ్ శాఖ మంత్రిగానేకాక, ప్లానింగ్ కమీషన్ ఉపాధ్యక్షుడుగా కూడా నియమించడం జరిగింది. ఈ మరొక నూత్న ప్రయోగం ఏ విధంగా పనిచేస్తుందో చూడవలసి ఉంది.

దేశంలో అగ్రశ్రేణి ఆర్థికవేత్తలలో ఒకరుగా, ప్రముఖ విద్యావేత్తగా పేరు పొందారు. ఆయన పూనాలోని గోఖలే రాజకీయ, ఆర్థిక శాస్త్ర విద్యాలయం వ్యవస్థాపకులు. పూనా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్గా కూడా ఆయన పనిచేశారు. ఆర్థికశాస్త్ర విషయాలపై అనేక గ్రంథాలు రచించారు. ఆయన మరణంతో దేశం ఒక మహామేధావిని కోల్పోయింది.

(ఆంధ్రజ్యోతి 5-5-1971).

## శ్రీ గోఖలే శతజయంతి



వెల్బీ కమీషన్ ఎదుట సాక్ష్య మివ్వడానికి గోపాలకృష్ణ గోఖలే లండన్ వెళ్ళిన సందర్భంలో పూనా నుంచి కొందరు స్నేహితులాయనకు లేఖలు రాశారట. ప్లేగ్ వ్యాధి నిరోధ కార్యక్రమంలో పనిచేస్తున్న కొందరు బ్రిటీష్ సైనికులు అత్యాచారాలకు పాల్పడ్డారని, ప్రజలు ఉద్రిక్తులై వున్నారని వారు ఆ లేఖలలో ఉటంకించారట. గోఖలే బ్రిటీష్వారి చర్యలను నిరసిస్తూ వెంటనే కొన్ని ప్రకటనలు చేశారట. ఆయన ఇండియా తిరిగివచ్చిన తరువాత విచారించగా బ్రిటీష్ సైనికులపై వచ్చిన ఆరోపణలన్నీ అసత్యాలని తేలింది. వాటిని రుజువు చేయడానికి, ఆయనకు మొదట లేఖలు రాసినవా రొక్కరూ ముందుకు రాలేదు. దీనితో గోఖలే అప్పటి బొంబాయి ప్రభుత్వానికి, తాను నిరసించిన బ్రిటీష్ సైనికులకు క్షమాపణ చెప్పుకున్నారు. ఆయన నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు బ్రిటీష్ వారొకవంక, సిగ్గువిడిచి క్షమాపణ చెప్పుకున్నందుకు తోటి భారతీయులు మరొకవంక ఆయనను తూర్పార పట్టడం జరిగిందట.

ఈ సంఘటన గోఖలే జీవితంలో ఒక ముఖ్యఘట్టం. ఆయన సమకాలికులైన ప్రతిపక్షులు ఈ ఉదంతాన్ని ఏ విధంగా వ్యాఖ్యానించినా, అది ఆయన మానసికౌన్నత్యానికి, నైతిక ధైర్యానికి తార్కాణంగానే భారతదేశం స్వీకరించింది; ఆయన ఉదాత్త స్వభావాన్ని ప్రస్తుతించింది.



గోఖలే మాతృదేశభక్తి అకుంఠితమైనది. కనుకనే ఆయన బ్రిటీష్ సైనికులపై ఆరోపణల నిజా నిజాలు తెలిసేవరకు ఆగకుండా తొందరపడి నిరసించడం జరిగింది. అయితే, దేశభక్తికి తీవ్రతలో ఏ మాత్రం తీసిపోని సత్యనిరతి సైతం ఆయన స్వభావంలో ఉన్నది. అందుచేతనే తన పొరపాటును గ్రహించిన వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పుకొనడానికి ఆయన వెనుకాడలేదు.

గాంధీజీ గోఖలేను తన రాజకీయ గురువుగా పేర్కొనేవారు. రాజకీయ రణరంగంలో సైతం సత్యనిష్ఠను కోల్పోని గోఖలే ధీరోదాత్తతే దీనికి కారణం.

ఆయన జన్మించి నేటికి సరిగా శత సంవత్సరాలైంది; మరణించి అర్ధ శతాబ్దం దాటింది. అయినా భారత జన హృదయాలలో గోఖలే స్మృతి మాయలేదు.

కావడానికి ఆయన మితవాదే. అయినా మాతృదేశ విముక్తే ఆయన లక్ష్యమనడంలో సందేహం లేదు. దాన్ని సాధించడానికి అనుసరించదగిన మార్గాలేవి అనే విషయమై ఆయనకు, ఆనాటి ఇతర నాయకులకు అభిప్రాయ భేదాలుండి ఉండవచ్చు. అయినా, ఆయన మరణానంతరం గాంధీజీ నాయకత్వాన మహోధృతంగా, అహింసాయుతంగా సాగిన సత్యాగ్రహ సమరాలపై గోఖలే ప్రభావం లీలామాత్రంగానైనా పడకపోలేదు. ఆ మహామనీషికి మా జోహార్లు.

(ఆంధ్రజ్యోతి 8-5-1966)

## "గజీతగాడు" శ్రీ మిహిర్ సేన్

శ్రీ మిహిర్ సేనక్కు "గజీతగాడు"గా ఇదివరకే ప్రపంచ ఖ్యాతి ఉన్నది. 1958లో ఆయనొకసారి ఇంగ్లీషు ఛానల్ను ఈదారు. ఇప్పుడు సింహళం, ఇండియాల మధ్య పాక్ జలసంధిని ఈది తన అద్భుత సాహసాన్ని ప్రదర్శించారు.

డోవర్, కెలేల మధ్య ఇంగ్లీషు ఛానల్ వెడల్పు 21 మైళ్ళు. పాక్ జలసంధి ఇంతకంటే కొద్దిగానే పెద్దది. సింహళంలోని తలైమన్నార్, ఇండియా కొసన మండపంల మధ్య దూరం 22 మైళ్ళు.

అయినా, శ్రీ సేన్ చేసిన ఈ కొత్త సాహసం విశేషాసక్తిని రేకెత్తించింది. పాక్ జలసంధి ప్రాంతంలో భయంకరమైన సొరచేపలు, సర్పాలు తిరుగాడుతూ ఉంటాయి. ఈ రోజులలో అక్కడ వానలు కురుస్తూ ఉంటాయి; అలలు ఉవ్వెత్తున లేచిపడుతూ ఉంటాయి. శ్రీ సేన్ తన ఈతను ఒకసారి వాయిదావేసి, తిరిగి నిర్ణయించిన రోజు పూర్ణిమ. ఆనాడు అలలు ఇంకా ఎత్తున రావచ్చు. అయినా ఆయన ఈ సవాళ్ళన్నిటిని జయప్రదంగా ఎదుర్కొని తన ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నాడు.

మంగళవారం ఉదయం చీకటితోనే ఈత ప్రారంభించిన శ్రీ సేన్ చీకటి పడకుండా భారత తీరం చేరుకోవాలని ఆశించాడు. అయితే, బుధవారం ఉదయానికిగాని అది సాధ్యం కాలేదు. మొత్తం 22 మైళ్ళ దూరం ఈదడానికి 25 గంటల 44 నిమిషాలు పట్టింది. దీన్నిబట్టే శ్రీ సేన్ సాహసం, ఆయన ప్రయత్నంలోని క్లిష్టత గ్రహించవచ్చు.

శ్రీ మిహిర్ సేన్ ఇండియా, సింహళాల మధ్య హిందూ మహాసముద్రాన్ని ఈదిన మొదటి వ్యక్తి కాదు. 1954లో ఒకరు, 1963లో మరొకరు ఇద్దరు సింహళీయులు ఈ సాహసం ఇదివరకే చేశారు. రామాయణ కాలంలో హనుమంతుడు సముద్రాన్ని లంఘించి (ఈది కాదు) లంకను చేరుకున్నాడని ఒక కథ ఉన్నది. అది నిజమైనా, కాకపోయినా అలౌకిక చర్య. అందుచేత కనీసం ఆధునిక కాలంలో, ఈతకు సంబంధించిన అంతర్జాతీయ నిబంధనలకు లోబడి ఈదిన మొదటి భారతీయుడుగా శ్రీ మిహిర్ సేన్ పేరు పొందారు.

ఈ పేరు కోసమే ఆయన ఈ సాహసానికి పూనుకున్నారా? చెప్పలేము. కొందరికి సాహసాలు చేయడం, సవాళ్ళ నెదుర్కొనడం, అపాయాలలో చిక్కుకొని తప్పించుకొనడం స్వభావ సిద్ధంగా వచ్చే లక్షణాలు. పూర్వం

దారి తెన్ను తెలియని మహాసముద్రాలపై తెరచాపల ఓడలతో ప్రయాణం చేసి కొత్త ఖండాలను కనిపెట్టినవారు, ఉత్తర, దక్షిణ ధ్రువాలను కనుగొన్నవారు, ఇటీవల ఎవరెస్టు శిఖరాన్ని జయించినవారు, రోదసీ యాత్రలు చేస్తున్నవారు - వీరంతా ఎంచుకున్న సాహసాలను బట్టి వాటిలో కొన్ని కేవలం సాహసాలుగా మిగిలిపోగా, మరికొన్ని మానవజాతి పురోగతికి తోడ్పడేవిగా ఉంటాయి. ఏమైనా, ఇటువంటి సాహసికులే.

అవన్నీ మానవుని విజిగీషకు, ధైర్యానికి, సహనానికి, ఎట్టి విపత్తులకైనా చలించని ఆత్మశక్తికి తార్కాణాలుగా చరిత్రలో నిలిచిపోతాయి. శ్రీ మిహిర్ సేన్ చర్య ఇటువంటిదే.

(ఆంధ్రజ్యోతి 7-4-1966)

## మహామేధావి కన్నుమూత : డాక్టర్ సి.పి. రామస్వామి అయ్యర్

వెనుకటి మన నాయకులకు, ఇప్పటివారికి ఒక ప్రధాన భేదం కానవస్తుంది. వారందరు మేధావులు. మేధా సంపత్తి లేకపోతే వారికి నాయక ప్రతిపత్తి వచ్చివుండేదే కాదు. కాగా, ఇప్పటివారిలో ఎందరు మేధావులో ఏపాటి మేధావులో ఆ మాట మేము చెప్పనక్కర లేకుండానే మా పాఠకులకు తెలుసు.



Mihir Sen

ఈనాడు తగినంత విలువ దేశ నాయకత్వం విషయంలో మేధాసంపత్తికి - పదవులలోకి ప్రాకిపోవడానికి వలసిన ఎత్తులలో, జిత్తులలో మేధాసంపత్తి కాదు, ఇందుకు భిన్నమైనదానికి లేకపోవడానికి కారణ మేమిటి? ప్రజాస్వామ్య వ్యవస్థలో మేధాసంపత్తి గలవారికి లేని ప్రాధాన్యం మందినీ, మార్బలాన్నీ కూడగట్టగల నేర్పు చూపేవారికి ఏ దేశంలోనైనా సిద్ధిస్తుంది. ఇది కాదనరాని విషయమైనా, ఇతర కారణాలు కొన్ని తోడైవుండకపోతే మన రాజకీయ రంగంలో మేధా సంపత్తికి దాదాపు తావులేకుండా పోయేదా?

గాంధేయ తత్త్వంలో, ఆ తత్త్వానుసారంగా కొనసాగిన జాతీయోద్యమాలలో మేధకు అంతగా స్థానం లేదు. గాంధీజీ అనుచరుడు ఆలోచనాపరుడు కానక్కరలేదు; ఆత్మబలం ఉంటే సరిపోతుంది. అతడు విద్యావంతుడు కానక్కరలేదు; త్యాగబుద్ధి ఉంటే సరిపోతుంది. అతడు జ్ఞాన నిధి కానక్కరలేదు; సేవాతత్పరత ఉంటే సరిపోతుంది. ఈ గాంధేయతత్వ ప్రభావమే మన రాజకీయ రంగంలో మేధా సంపత్తికి ఒక గౌరవస్థానం మాట అటుండగా, కనీసం స్థానమైనా లేకుండా పోవడానికి ముఖ్య కారణమా?

మహామేధావిగా మన్నన లందుకున్న డాక్టర్ సి.పి. రామస్వామి అయ్యర్ నిన్న లండన్లో కన్నుమూసినారన్న వార్తే ఈ ప్రశ్నలను మేము వేయడానికి ప్రేరణ అని ఇక్కడ మేము మనవి చేయాలి. 1947వ సంవత్సరానికి

పూర్వం డాక్టర్ సి.పి. ఎన్ని పెద్ద పెద్ద పదవులను అధిష్ఠించలేదు? వాటిని ఎంత సమర్థంగా నిర్వహించలేదు? అయినా, స్వతంత్ర భారతం ఆయన సేవలను దాదాపు వినియోగించుకొనలేదు? ఎందువల్ల?

వెనుకటి రోజులలోనే శాసన నిర్మాతగా రాణించిన డాక్టర్ సి.పి.కి ఏ రాజ్యసభలోనో స్థానం ఎందువల్ల లేకపోయింది? మెట్టూర్, పైకారా మొదలైన పెద్ద పెద్ద ప్రాజెక్టులను తన చేతిపై కట్టించిన డాక్టర్ సి.పి.ని ప్లానింగ్ కమీషన్ సభ్యునిగా ఎందుకు నియమించలేదు? వాదపటిమకు పేరందిన డాక్టర్ సి.పి.ని ఐక్యరాజ్య సమితికి వెళ్ళే భారత ప్రతినిధి వర్గానికి నాయకత్వం హించవలసిందిగా కనీసం ఒకసారైనా ఎందుకు ఆహ్వానించలేదు? ఉన్నత విద్యావ్యాప్తికి ఆయన చేసిన కృషిని గుర్తించి, యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ అధ్యక్షునిగానైనా ఆయనను ఎందుకు చేయలేదు?



ఇండియన్ యూనియన్ తిరువాన్కూరు విలీనీకరణను ఆ సంస్థానం దివాన్గా ప్రతిఘటించిన పొరపాటుకే ఆయనను, ఆయన మేధాపటిమను, ఆయన వ్యవహార దక్షతను నిర్లక్ష్యం చేయడం జరిగిందా? అయితే, ఇంతకంటే పెద్ద పొరపాట్లను చేసినవారికి ఉన్నత పదవులను కట్టబెట్టడం ఎందువల్ల సంభవించింది?

ఏమైనా ఆయనను నిర్లక్ష్యం చేయడం వల్ల డాక్టర్ సి.పి. కి వచ్చిన లోపమేమీ లేదు. ఆయన సార్థక జీవుడు. ఎన్నో గౌరవాలను పొందిన ఆయనకు మరొకటి జరగకపోవడం ఒక లోపం కాదు; ఎన్నో పదవులను ఆక్రమించిన ఆయనకు మరొకటి లభించకపోవడం కొరత కాదు. నిన్న లండన్లో కన్నుమూసిన క్షణం వరకు - అప్పటికి 86వ సంవత్సరం నడుస్తున్నా - మొక్కవోని మేధాపటిమను చూపగలిగిన ఆయన సేవా భాగ్యాన్ని పొందలేకపోయిన స్వతంత్ర భారత వర్షమే ఆ మేరకు నిశ్చయంగా పేదవడింది!

మేధపట్ల, మేధావంతుల పట్ల మన రాజకీయ రంగంలో ఇప్పటి నిర్లక్ష్యవైఖరి ఇదే విధంగా మిగిలితే, మన దేశం ఎంత దుర్గతికి లోనుకాగలదో ఆ విషయాన్ని తలచుకొనడానికైనా భయపడవలసి వస్తుంది. సత్యాగ్రహాలలో జైలు శిక్షలే రాజకీయ పదవులకు మరెంతకాలం అర్హత? జుట్లు ముడిపెట్టడంలో నేర్పే ఈ పదవులకు మరెంతకాలం నిచ్చెన? ఒక డాక్టర్ సి.పి.రామస్వామిని, ఒక సర్ తేజ్ బహదూర్ సప్రూను, ఒక సర్ పి. శివస్వామి అయ్యర్ను, ఒక డాక్టర్ జయకరు పోలిన ప్రముఖులను కేవలం వారి మేధాసంపత్తే, వారి ప్రజ్ఞా ప్రాభవాలే, వారి కార్యదక్షతే అర్హతలుగా బాధ్యతాయుతమైన ఉన్నత పదవులకు ఆహ్వానించి, వారి సేవా భాగ్యాన్ని పొందడం ఎప్పుడు ప్రారంభమౌతుంది?

(ఆంధ్రజ్యోతి 28-9-1966)

## కొత్త రాష్ట్రపతి: శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్



రాష్ట్రపతి పదవికి కాంగ్రెసు అభ్యర్థి శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ ఎన్నిక కావడంలో విశేషం ఏమీ లేదు. పెద్ద మెజారిటితో ఆయన ఎన్నిక కావడంలో కూడా ఆశ్చర్యపడవలసింది లేదు. పార్లమెంటులోను, రాష్ట్ర శాసనసభలలోను కాంగ్రెసు పార్టీకి నూటికి 66 వంతుల మేరకు ఓటింగ్ బలం వున్నది. ఇంతేకాక, డి.ఎం.కె. అన్నా డి.ఎం.కె. వంటి కాంగ్రెసేతర పక్షాల ఓట్లు కూడా ఆయనకు పడ్డాయి. అందువల్ల ఆయన ఇదివరకు ఏ రాష్ట్రపతికి రానంతటి సంఖ్యాబలంతో విజయం పొందడం ఆశ్చర్యం కలిగించదు.

రాష్ట్రాలలోని కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీలలో అంతర్విభేదాలకు కొరత లేదు. అయినా, రాష్ట్రపతి పదవి ఎన్నిక సందర్భంలో అందరు ఏకీభావంతో ఓటు చేయడం జరిగింది. ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధికి కాంగ్రెసు పార్టీ యంత్రాంగంపై వున్న సర్వాధిపత్యానికి ఇది నిదర్శనం. శ్రీ అహ్మద్ ఎన్నికను శ్రీమతి ఇందిరా గాంధి వ్యక్తిగత విజయంగానే భావించాలి.


భారత రాష్ట్రపతి పదవి చిత్రమైనది. రాజ్యాంగాన్ని చూస్తే దాదాపు అన్ని అధికారాలు ఆయనవే అనిపిస్తుంది. సాయుధ దళాలకు ఆయన సర్వాధిపతి, ప్రధాన మంత్రిని, ఇతర మంత్రులను, సుప్రీంకోర్టు న్యాయమూర్తిని, గవర్నర్లను, మరెందరో ఉన్నతాధికారులను నియమించేది ఆయనే. లోక్ సభను ఆయన రద్దుచేయవచ్చు. దేశంలో అత్యయిక స్థితిని ప్రకటించవచ్చు. రాష్ట్రాలలో పరిపాలనాధికారాన్ని స్వీకరించవచ్చు. బిల్లులకు చట్టం ప్రతిపత్తిని ఇచ్చేది ఆయన. ఆర్డినెన్సులు జారిచేసేది ఆయన. ఇలాగే మరెన్నో అధికారాలు ఆయనవి.

అయినా, వీటిలో ఏ ఒక్కటీ నిజమైన అధికారం కాదు. అన్నీ నామమాత్రమైనవే. ప్రధాన మంత్రి సలహా మేరకే ఆయన నడుచుకోవాలి. శాసనాలు చేసే అధికారం పార్లమెంటుది. ప్రభుత్వాన్ని నిర్వహించే అధికారం ప్రధానిది.

ఈ కారణాన రాష్ట్రపతిని ప్రధానికి రబ్బర్ స్టాంపుగా ప్రతిపక్షాలు వర్ణించడం మొదటి నుంచి జరుగుతున్నది. ఇది అనాలోచితంగా, అధికారంలో వున్న పార్టీపట్ల అక్కసుతో చేసే వర్ణన తప్ప విజ్ఞతా పూర్వకమైంది ZZZZ

కానేకాదు. రాష్ట్రపతి నామమాత్రపు దేశాధిపతిగా మిగలడానికి బాధ్యత ప్రధానమంత్రిది కాదు, దాని బాధ్యత మన రాజ్యాంగానిదే. అమెరికన్ పద్ధతిని కాక, బ్రిటిష్ పార్లమెంటరీ వ్యవస్థ నమూనాను వరించిన తర్వాత, మన దేశపు ప్రత్యేక పరిస్థితులలో ఒకే ప్రభుత్వాధినేత వుండడం అవసరమని నిర్ణయించుకున్న తర్వాత రాష్ట్రపతి పదవికి మరొక ప్రతిపత్తి వుండడానికి వీలులేదు. పదవినుంచి విరమిస్తున్న శ్రీ వి.వి. గిరి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో స్పష్టంచేసినట్టు బాధ్యతాయుత ప్రభుత్వపు అధికారాన్ని తగ్గించే ఏ పనీ రాష్ట్రపతి

చేయరాదన్నదే రాజ్యాంగ రచయితల ఆశయం. భవిష్యత్తులో ఎన్నడైనా కేంద్రంలో అధికారంలో వున్న పార్టీకి చెందిన వాడు కాక, ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థి రాష్ట్రపతిగా ఎన్నికైతే రాజ్యాంగ సంబంధమైన చిక్కులు





తలఎత్తవా? అన్నదాన్ని ప్రస్తుతానికి ఊహాగానంగానే పరిగణించాలి. రాష్ట్రపతి అధికారాలకు ఎట్టి పరిమితులున్నప్పటికి, ఆ పదవికి నిజమైన సార్థకతను చేకూర్చేది తిరిగి శ్రీ గిరి పలుకులలో - దాని వెనుక గల నైతికాధికారమే. ఇట్టి నైతికాధికారాన్ని శ్రీ రాజేంద్ర ప్రసాద్ మొదలుకుని శ్రీ గిరి వరకు మన రాష్ట్రపతులందరు వివాదాలకు అతీతంగా నిర్వహించారు. అవసరమైనప్పుడు అప్రియసత్యాలను పలకడానికి వారు వెనుదీయలేదు. రుచించని హితవు చెప్పడానికి సంకోచించ లేదు. వారికి తగిన వారసుడుగా శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ తన పదవీ బాధ్యతలను నిర్వర్తించగలరని, తన పదవికి వన్నె తేగలరని ఆశిస్తున్నాము.

(ఆంధ్రజ్యోతి 22-8-1974)

## శ్రీ ఖండూభాయ్ దేశాయ్

సుస్వాగతం : శ్రీ ఖండూభాయ్ దేశాయ్ నేడు ఆంధ్రప్రదేశ్ గవర్నరు పదవిని స్వీకరిస్తున్నారు. ఆయనకు మా హృదయపూర్వక స్వాగతం తెలియజేస్తున్నాము.



శ్రీ దేశాయ్ అచ్చమైన జాతీయవాది; నిక్కమైన గాంధేయ వాది; మన దేశంలో కార్మికోద్యమం అగ్రనాయకులలో ఒకరు.

ఆయన స్వరాష్ట్రం గుజరాత్, భూలాభాయ్ దేశాయ్, మహదేవ దేశాయ్, మురార్జీ దేశాయ్ స్వస్థలమైన బలార్క చెందినవారే శ్రీ ఖండూభాయ్ దేశాయ్. వారివలెనే భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర వహించినవారు.

మొదట ఒక హైస్కూలు హెడ్మాస్టరుగా జీవితాన్ని ప్రారంభించారు; 1920లో ఆనాటి పెక్కుమంది యువకులను వలెనే గాంధీజీ ఉద్యమం ఆయనను ఆకర్షించింది. ఆనాటి నుంచి ఆయన గాంధీజీ ఉద్యమాలన్నిటిలో పాల్గొన్నారు; అశేష త్యాగాలు చేశారు.

అయితే, శ్రీ ఖండూభాయ్ దేశాయ్ ప్రధాన కార్యరంగం కార్మికోద్యమం. దాని తొలి నాయకులలో ఆయనొకరు. అహమ్మదాబాదులో కార్మికులను సంఘటించడంతో ప్రారంభించిన శ్రీ దేశాయ్ క్రమంగా యావద్భారత దేశాన్ని తన కార్యరంగంగా చేసుకున్నారు.

స్వాతంత్ర్య సమరంలో అహింసాత్మక పద్ధతులను ప్రవేశపెట్టిన ఘనత గాంధీజీది కాగా, గాంధేయ విధానాన్ని కార్మికోద్యమంలో ప్రవేశపెట్టిన ఘనత శ్రీ ఖండూభాయి. బెర్లిన్లో 1962లో జరిగిన ఒక కార్మిక మహాసభకు శ్రీ దేశాయ్ హాజరై గాంధీజీ సిద్ధాంతాన్ని ఈ విధంగా నిర్వచించారు : "మహాత్మాగాంధి గొప్ప ట్రేడ్ యూనియనిస్టు కూడా. యజమానుల, కార్మికుల మధ్య విభేదం లేదని, వారు సమాజ శ్రేయస్సుకు సహధర్మకర్తలని గాంధీజీ మాకు చెబుతూ వుండే వారు."

ఈ సూత్రాన్నే తమ కార్మికోద్యమ నిర్వహణలో పాటించడానికి శ్రీ దేశాయ్ ప్రయత్నించారు. వర్గ సంఘర్షణ ద్వారా కాక, సంప్రతింపులు, మధ్యవర్తిత్వం మొదలైన శాంతియుత పద్ధతుల ద్వారానే కార్మిక వర్గ శ్రేయస్సు, సమాజ శ్రేయస్సు కూడా సాధ్యమని ఆయన విశ్వసించారు. ఈ విశ్వాసం ప్రాతిపదికగా ఏర్పడిన ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు స్థాపకులలో శ్రీ ఖండూభాయ్ ఒకరు. 1947-48లో ఒక ఏడాదిపాటు ఆయన ఆ సంస్థ తొలి ప్రధాన కార్యదర్శిగా, ఆ తర్వాత 1952 వరకు దాని అధ్యక్షులుగా వ్యవహరించారు. ఆయన తర్వాత ప్రధాన కార్యదర్శి అయిన కీర్తిశేషులు శ్రీ హరిహరనాథశాస్త్రి చెప్పినట్టు, "కాంగ్రెసుకు గాంధీజీ ఎట్టివారో, ఐ.ఎన్.టి.యు.సి. కి శ్రీ దేశాయ్ అట్టివారు. ఆ సంస్థలో ఏ పదవి లేకపోయినా, దాని అభివృద్ధికి ఆయన కృషి చేశారు.

బొంబాయి శాసనసభలో సభ్యులుగా, రాజ్యాంగ నిర్ణయసభలో సభ్యులుగా, నెహ్రూ మంత్రివర్గంలో కొన్నాళ్లు కార్మిక శాఖామంత్రిగా శ్రీ దేశాయ్ కార్మిక శ్రేయస్సుకు సంబంధించిన పెక్కు శాసనాలు, సూత్రాలు రూపొందించడంలో ప్రముఖ పాత్ర వహించారు. పెక్కుమార్లు ఇండియా తరపున విదేశాలలో కార్మిక మహాసభలకు హాజరై సత్సంప్రదాయాలు రూపొందడానికి దోహదం చేశారు.


(ఆంధ్రజ్యోతి 11-4-1968)

## కీర్తికాయుడు : శ్రీ ధోండో కేశవ్ కార్వే



కొన్ని ఇతర రాష్ట్రాలలో వలె కాక ఆంధ్రప్రదేశ్లో మొత్తంపై పారిశ్రామిక సంబంధాలు పెద్ద అలజడులకు లోనుకాలేదు. పారిశ్రామికంగా వెనకబడిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అట్టి సామరస్య పూర్వక సంబంధాలు ప్రస్తుత దశలో ఎంతైనా అవసరం కూడా. కార్మికోద్యమంలో, ఆర్థిక శాస్త్ర రంగంలో విశేషానుభవం, పరిజ్ఞానం కల శ్రీ ఖండూభాయ్ దేశాయ్ ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, పారిశ్రామిక ప్రగతిపట్ల శ్రద్ధ వహించగలరని ఆశించవచ్చు. గవర్నరు పదవిని స్వీకరిస్తున్న తరుణంలో ఆయనకు మరొకసారి మా స్వాగతం తెలుపుతున్నాము.

మానవ జీవితానికి సార్ధక్యం, సాఫల్యం ఎందులో వుంది? “కుర్వన్నే వేహ కర్మాణి జిజీవిషే చ్ఛతగ్ం సమాః” కర్మచేస్తూ శత సంవత్సరాలు జీవించాలని కోరడమే మానవుడు చేయదగిన పని అని ఉపనిషద్వాణి. ఈ వాక్కును అక్షరాలా తమ జీవితాలలో సార్థకపరచుకున్న కొద్దిమంది మహామహులలో శ్రీ ధోండో కేశవ్ కార్వే ఒకరు.




ఆంధ్రదేశంలో వీరేశలింగంగారివలె మహారాష్ట్రలో శ్రీ కార్వే సంఘ సంస్కరణోద్యమానికి తమ జీవితాన్ని ధారవోశారు. పదేళ్ళు తక్కువగా, ఇంచుమించు వీరశలింగంగారు జన్మించిన కాలంలోనే కార్వే జన్మించారు. ఆయన వలెనే యీయన ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించారు. ఆయన వలెనే యీయన పండితుడు, మేధావి, మానవవాది. వీరుభయుల మానవవాదం మహిళాభ్యుదయ కృషి వైపు మొగ్గుచూపడానికి కారణం, ఆ కాలంలో భారతీయ మహిళల పరమదయనీయ స్థితి. విద్యకు, వికాసానికి దూరంగా, అజ్ఞానానికి, అస్వతంత్రతకు దగ్గరగా, వంటయింటి నాల్గుగోడల మధ్యగా, గృహిణులుగా, వితంతువులుగా, నిత్య దుఃఖితులుగా, సంఘ వంచితులుగా బ్రతుకుతున్న స్త్రీల నిశ్శబ్ద వేదనను శబ్దికరించి, వారికి నవప్రపంచ ద్వారాలను తెరవడానికి శ్రీ కార్వే ఉద్యమించారు. వారి ఉద్యమం సహస్ర ముఖాలుగా సఫలమైనదనడానికి నేడు వివిధ జీవన రంగాలలో భారతీయ మహిళల పురోగమనమే తార్కాణం.



తమ స్వీయచరిత్రలో ఒకచోట శ్రీ కార్వే తానొక ఉన్మత్తుడనని వ్రాసుకున్నారు. ఆయనది సాధారణోన్మాదం కాదు; ప్లేటో పేర్కొన్న “డివైన్ మ్యాడ్నెస్" - దివ్యోన్మాదం అది ఆయనచేత అసాధారణ కార్యాలనేకం చేయించింది. శుష్క దురాచారాల నెదిరించి వితంతువులకు పునర్వివాహాలు చేయించారు; వితంతూద్ధరణకై సంఘాలను, శరణాలయాలను స్థాపించారు; తమ 49వ యేట మహిళా విద్యాలయాన్ని నెలకొల్పారు; పందొమ్మిది వందల పదహారులో దాన్ని భారతీయ మహిళా విశ్వవిద్యాలయంగా విస్తృతం చేశారు. ఈ సంస్థల కోసం ఆయన స్వదేశంలోను, విదేశాలలోను విస్తారంగా పర్యటించారు. కాలి నడకన తిరిగి, వాదించి, ఒప్పించి విరాళాలు సేకరించారు. ఆయన సాధించిన ఫలితాలు సర్వసామాన్యమై పోయిన నేటి రోజులలో ఆయన కృషికి విలువకట్టడం కష్టసాధ్యమే.

అయినా, శ్రీ కార్వే ఒక విధంగా అదృష్టవంతులనే చెప్పాలి. తమ ఉద్యమ ఫలితాలను ఆయన కళ్ళారా చూసుకున్నారు. కృతజ్ఞతా ఋణగ్రస్తమైన భారతజాతి ఆయనను తగు రీతిని గౌరవించింది; 1955లో “పద్మ

విభూషణ్" గౌరవంతో సత్కరించింది. 1958లో శత జన్మదిన సందర్భంలో "భారతరత్న" గౌరవంతో సన్మానించింది.

నూట నాలుగేళ్ళ నిండు జీవితం తరువాత పండుటాకువలె, పరిపక్వఫలం వలె ఆయన రాలిపోయారు. ఆయనది ఆదర్శప్రాయమైన జీవితం. ఆయనను ఉత్తేజ పరచిన మానవవాదం తరతరాల వరకు భారతీయులకు ధ్రువతారగా భాసిస్తూనే ఉండగలదు.

(ఆంధ్రజ్యోతి 10-11-1962)

## తీరని లోటు : డాక్టర్ విక్రమ్ సరాభాయ్

సాధారణంగా ఒక గొప్ప వ్యక్తి మరణించినప్పుడు తీరని లోటు ఏర్పడినట్టు భావించడం కద్దు. ఇది ఎవరిపట్ల నిజమైనా, కాకపోయినా, నేటి ఉదయం ఆకస్మికంగా హృద్రోగంతో కన్నుమూసిన డాక్టర్ విక్రమ్ సరాభాయ్ పట్ల అక్షరాలా నిజం. ఆయన మృతితో భారత వైజ్ఞానిక రంగానికి తీరని లోటు ఏర్పడుతున్నది.

డాక్టర్ సరాభాయ్ సమకాలిక భారతీయ శాస్త్రవేత్తలలో అగ్రగణ్యుడు. అంతర్జాతీయంగా కూడా వైజ్ఞానిక రంగంలో ఆయన స్థానం ఏమంత తక్కువది కాదు. తనకు ముందు భారత అణుశక్తి సంఘానికి సారథ్యం వహించిన కీర్తిశేషుడు డాక్టర్ భాభావలె డాక్టర్ సరాభాయ్ సయితం పెక్కు అంతర్జాతీయ వైజ్ఞానిక సమావేశాలలో పాల్గొని, స్వదేశానికి కీర్తి ప్రతిష్ఠలు చేకూర్చారు.

ఇండియాను అణుశక్తి రంగంలో ప్రవేశ పెట్టిన ఘనత డాక్టర్ భాభాది. కాగా, ఇండియాను రోదసీ పరిశోధన రంగంలోనికి తీసుకువెళ్ళింది డాక్టర్ సరాభాయ్. ఈ రెండు రంగాలలోను వెనుకబడి ఉండడం ఈనాడు ప్రపంచంలో అన్ని విధాలుగాను వెనుకబాటుతనానికి చిహ్నంగా చెల్లుతున్నది.

శాంతియుత ప్రయోజనాల నిమిత్తం అణుశక్తిని పెంపొందించడానికి డాక్టర్ భాభా విశేషంగా కృషిచేశారు. తన కృషి ఫలోన్ముఖం కాకుండానే ఆయన ఒక విమాన ప్రమాదంలో మరణించారు. ఆయన ప్రారంభించిన కృషిని ఎంతో ప్రతిభావంతంగా కొనసాగించడమే కాక, రోదసీ పరిశోధనల విషయమై కూడా ప్రత్యేక శ్రద్ధాతత్పరతతో కృషిసాగిస్తున్న డాక్టర్ సరాభాయ్ను ఇప్పుడు కోల్పోవడం నిజంగా ఇండియా దురదృష్టం. అటు అణుశక్తి రంగంలోను, అంతకంటె ఎక్కువగా ఇటు రోదసీ పరిశోధన రంగంలోను ఇండియా సాధించవలసింది ఇంకా ఎంతైనా ఉన్నది . అందువల్లనే డాక్టర్ సరాభాయ్ అకాల మరణంతో మనకు తీరని లోటు వాటిల్లుతున్నది.

డాక్టర్ సరాభాయ్ వైజ్ఞానిక ప్రతిభకు, ఉత్సాహపూరిత దీక్షా సంకల్పాలకు తుంబా రాకెట్ కేంద్రం శాశ్వత చిహ్నంగా నిలిచి పోతుంది. అక్కడ ఆయన ప్రారంభించిన కృషిని మరింత దీక్షాబలంతో కొనసాగించడమే ఆయనకు భారతదేశం అర్పించగల శ్రద్ధాంజలి.

(ఆంధ్రజ్యోతి 1-1-1972)

## శ్రీ థానుపిళ్లెకు వీడ్కోలు

నాలుగేళ్ళపాటు ఆంధ్రప్రదేశ్ గవర్నరు పదవిని నిర్వహించిన శ్రీ పట్టం థానుపిళ్లె పదవిని విరమించారు. ఆంధ్రులు ఆయనకు ఎంత సంతోషంగా స్వాగతమిచ్చారో అంత విచారంతో వీడ్కోలు చెబుతున్నారు.

శ్రీ థానుపిళ్లె స్వయంగా రాజకీయవాది, రాజకీయ నాయకులై వుండి, ఆంధ్రప్రదేశ్లో, అంతకు ముందు పంజాబులో కేవలం రాజ్యాంగ ప్రతినిధిగా వ్యవహరించడం విశేషమే. ఆయన తన స్వస్థలమైన త్రివేంద్రంలో మొదట న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించారు. ఆనాటి స్వాతంత్ర్యోద్యమం పెక్కుమంది న్యాయవాదులను ఆకర్షించినట్టే ఆయనను కూడా ఆకర్షించింది. చాలాసార్లు ఆయన జైలుశిక్ష అనుభవించారు. తన స్వీయ నియోజకవర్గమైన త్రివేంద్రంకు ఆయన శాసనసభలో ఇంచుమించుగా మూడు దశాబ్దాలపాటు ప్రాతినిధ్యం వహించారంటే ఆయనపట్ల ప్రజానురాగాన్ని ఊహించుకోవచ్చు.

శ్రీ పిళ్లయ్ మూడుసార్లు ముఖ్యమంత్రి పదవిని నిర్వహించారు. మొదటిసారి 1948లో తిరువాన్కూరులో బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. రెండవసారి 1954లో ఇండియాలో మొదటిసారిగా కేరళలో ప్రజా సోషలిస్టు పార్టీ ప్రభుత్వం ఏర్పరచినప్పుడు ఆయన తిరిగి ముఖ్యమంత్రి అయ్యారు. మూడవసారి 1960లో పి.ఎస్.పి. కాంగ్రెసు మిశ్రమ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ముఖ్యమంత్రి అయ్యారు. కేరళలో వివాదాస్పదమైన రాజకీయాలలో అంతకాలంపాటు ముఖ్యపాత్ర వహించి, ఆయన చివరకు సాధారణంగా వివాదాలకు అతీతమైన గవర్నరు పదవిని స్వీకరించారు.

ఇటీవల వరకు గవర్నరు పదవి వివాదాలకు అతీతమైనదే. ఆ పదవి అనవసరమని, దాన్ని రద్దు చేయాలని కూడా కొందరు వాదిస్తూ వచ్చారు. కాని, ఒక ఏడాది నుంచి గవర్నరు పదవి ప్రాధాన్యం ఎంతటిదో మొదటిసారిగా తెలియవచ్చింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహారు, బెంగాల్, పంజాబు మొదలైన రాష్ట్రాలలో గవర్నర్లు పెక్కు వివాదాలలో చిక్కుకోవలసి వచ్చింది. ఆ పదవి కేవలం అలంకార ప్రాయమైంది కాదని, రాజ్యాంగ ప్రతిష్టంభన ఏర్పడిన సమయాలలో గవర్నర్లు నిర్వహించగల పాత్ర అతి ప్రధానమైనదని తెలియవచ్చింది.

అయితే, అదృష్టవశాత్తు ఆంధ్రప్రదేశ్లో అటువంటి రాజ్యాంగ ప్రతిష్టంభన రాలేదు. మొన్న హైదరాబాద్లో తమ వీడ్కోలు సభలో శ్రీ థానుపిళ్లె చెప్పినట్లు, అన్ని విధాలుగా అందరిమధ్య సహకారం వెల్లివిరిసి ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శప్రాయం కాగలిగింది. శ్రీ ధానుపిళ్లె రాష్ట్రంలో రాజ్యాంగాధిపతిగా ప్రశంసనీయమైన విధంగా తమ పదవిని నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ విషయంలో ఆయన ఒకసారి ఒక వివాదంలో చిక్కుకోవలసి వచ్చినపపటికి దాని బాధ్యత పూర్తిగా ఆయనది కాదు. మొత్తంపై అతీతులై శ్రీ ధానుపిళ్లె రాష్ట్ర ప్రజల అభిమానాన్ని చూరగొనగలిగారు. వారికి వీడ్కోలు చెప్పవలసి రావడం విచారకరం.

(ఆంధ్రజ్యోతి 10-4-1968)

## శ్రీ కస్తూరి శ్రీనివాసన్ - ఉత్తమ సంపాదకుడు



"ఎడిటోరియల్స్" వ్రాసేవాడే "ఎడిటర్" అనుకొనడం పొరపాటు. ప్రపంచ ప్రఖ్యాతి గడించుకున్న "ఎడిటర్ల"లో సంపాదకీయ వ్యాసాలను ఎన్నడు వ్రాయనివారు కొందరున్నారు. వాటిని వ్రాయగల నేర్పులేనివారు కూడా కొందరు లేకపోలేదు.

ఉదాహరణకు లండన్ "టైమ్స్" పత్రికా సంపాదకుడుగా అమరకీర్తి నార్జించుకున్న "డెలేన్" సంగతినే చూడండి. ఆయన రచనాపాటవం బొత్తిగా లేనివాడు కాదుగాని, "టైమ్స్" సంపాదకుడుగా తాను పనిచేసిన 36 సంవత్సరాలలో పట్టుమని 36 సంపాదకీయాలైనా ఆయన వ్రాయలేదేమో! అయినా, ఆయన కాలంలో "టైమ్స్" ఓంప్రథమంగా మహోన్నత స్థాయికి వెళ్ళింది. ఆయన కాలంలోనే అది ఓంప్రథమంగా మొత్తం ప్రపంచంలోనే సాటిలేనిదిగా రాణించింది.

ఒక నిర్దిష్ట స్వభావం, ఒక స్వతంత్ర చిత్తవృత్తి, ఒక విశిష్ట వ్యక్తిత్వం - ఏ పత్రికకైనా ముఖ్యావసరాలు. ఇవి లేనిది ప్రథమ శ్రేణికి చెందిన పత్రిక కాలేదు. వాటిని తన పత్రికకు సమకూర్చగలవాడే (తాను స్వయంగా సంపాదకీయాలను వ్రాసినా, వ్రాయకపోయినా) ఉత్తమ సంపాదకుడు.

ఇక్కడ మరొక విషయాన్ని కూడ చెప్పాలి ఒక పత్రిక ప్రచారానికి దాని పలుకుబడికి ప్రత్యక్ష సంబంధం వుండదు. "టైమ్స్" "గార్డియన్" పత్రికలకు "డెయిలీ మిర్రర్", "డెయిలీ ఎక్స్ప్రెస్" పత్రికలకున్న ప్రచారంలో ఎనిమిదవ వంతు కూడా లేదు. అయినా ఆ మొదటి రెండింటికి చివరి రెండింటికంటె బ్రిటన్లో ఎనభై రెట్ల పలుకుబడి వున్నది.

"రౌతుకొద్దీ గుర్రం" అన్నట్టుగానే "ఎడిటర్ కొద్దీ పత్రిక". ఉత్తముడైన సంపాదకుడు తన వ్యక్తిత్వం ముద్రను తన పత్రికపై బలంగా వేస్తాడు. ఇతర హంగులు ఎన్నివున్నా, సంపాదకుడు గుణం తక్కువవాడైతే, వ్యక్తిత్వం లేనివాడైతే, అతడి పత్రిక (ఎంత ప్రచారంవున్నా) ప్రజాభిప్రాయాన్ని తీర్చిదిద్దలేదు. ప్రజాగౌరవాన్ని పొందలేదు.

స్థాయి కొంత తక్కువైనా "డెలేన్"తో పోల్చదగు సంపాదకుడే శ్రీ కస్తూరి శ్రీనివాసన్. డెలేన్ "టైమ్స్" అధిపతికాదు. శ్రీనివాసన్ "హిందూ" అధిపతి. అయితే తమ కుటుంబానికి చెందిన.

పత్రిక అయినందునే శ్రీ శ్రీనివాసన్ "హిందూ" సంపాదకుడు అయినట్టు మనం భావించనక్కరలేదు. మరొక పత్రికకు సంపాదక బాధ్యత వహించినా, ఆయన దాన్ని ఉత్తమ పద్ధతులలో నడిపించి వుండేవాడే!

తండ్రి కస్తూరిరంగ అయ్యంగార్ కుమారుడు శ్రీనివాసన్ కు ఎడిటర్ గా కాక, మేనేజరుగా తరిఫీదు చేయించడం జరిగింది. కాని, శ్రీ ఎ. రంగస్వామి అయ్యంగార్ అకాలమరణం చెందిన కారణంగా ఆయన స్థానంలో శ్రీ శ్రీనివాసన్ 1934 లో "హిందూ" సంపాదకత్వ బాధ్యతను తను స్వయంగా స్వీకరించవలసి వచ్చింది. కొంత తటపటాయింపుతో ఈ బాధ్యతను ఆదిలో స్వీకరించినా 1959 వరకు దాన్ని ఎంతో సమర్థంగా నిర్వహించి "హిందూ" సర్వతోముఖాభివృద్ధిని సాధించాడు.



రచనా పాటవం లేకపోయినా, చివరికి వాగ్ధాటి సయితం లేకపోయినా, శ్రీ శ్రీనివాసన్ ఎడిటర్ గొప్పగా రాణించడానికి మొదటి కారణం, ఆయన స్వేచ్ఛాప్రియత్వం - అధికారి, అనధికారి వర్గాలలో ఎవరినుంచి ఏ విధమైన జోక్యాన్నీ తన విధుల నిర్వహణలో ఆయన సహించేవాడు కాదు. హిట్లరును గురించి 'డేవిడ్'లో వేస్తున్న వ్యంగ్య చిత్రాల ప్రచురణను మానివేయకపోతే, తమ వాణిజ్యపు ప్రచురణను నిలుపుచేస్తామని ఒక జర్మన్ సంస్థ బెదిరించగా, "మీ ప్రకటనలు మాకు అక్కరలేదు" అని శ్రీ శ్రీనివాసన్ నిష్కర్షగా చెప్పారు. ఆయన చూపిన స్వాతంత్ర్య ప్రియత్వానికి వందలాదిగా వున్న తార్కాణాలలో ఇదొకటి మాత్రమే.

ఎడిటరుగా శ్రీనివాసన్ రాణించడానికి రెండవ కారణం తన సంపాదకీయ రచయితలకు పూర్తి స్వేచ్ఛ నివ్వడం. అనుదినం నాటి ముఖ్యవిషయాలను గురించి తన సంపాదకీయ రచయితలతో ఆయన చర్చ సాగించేవాడు. ఆ చర్చ సందర్భంలో ఎవరైనా తన అభిప్రాయాలకు వ్యతిరేకమైన వాటిని వెల్లడించినా, ఆయన కోపగించుకునేవాడు కాదు. తన విశ్వాసాలకు భిన్నంగా వ్రాయవలసిందిగా ఏ సంపాదకీయ రచయితను ఆయన నిర్బంధించేవాడు కాదు కూడా.

కాగా, ఆయన ఎడిటర్ గా రాణించడానికి మూడవ కారణం వార్తలను ఏవిధంగా మభ్యమరచకుండా యదార్ధ రూపంలో ప్రచురించడం. పాకిస్తాన్ అవతరణ తర్వాత ఆ దేశంలో తమ ప్రతినిధిగా పనిచేయడానికి ఒక బ్రిటీష్ యువకుని పంపిస్తూ, అతడితో శ్రీ శ్రీనివాసన్ చెప్పిన మాట లివి: "మాకు ప్రియమైనా, అప్రియమైనా సత్యాన్ని సత్యంగానే మాకు వ్రాసి పంపిస్తూ వుండు!"

ఇతర విధాలకూడా ఒక వ్యక్తిగా, ఒక సంపాదకుడుగా ఆయన ఎంత గౌరవించదగువాడో శ్రీ వి.కె. నరసింహన్ కొత్తగా ప్రచురించిన శ్రీనివాసన్ జీవిత చరిత్రను చదివితే తెలుస్తుంది. మూడు శతాబ్దాలకు పైగా ఎడిటర్ శ్రీనివాసన్ వద్ద పనిచేసి వున్నందున ఆయన వ్యక్తిత్వ విశిష్టతలను చక్కగా వివరించడం శ్రీ

నరసింహన్‌కు సాధ్యపడింది. ఇది కేవలం ప్రశంసలతో కూడిన రచనకాదు, విమర్శకదృష్టి అడుగడుగునా దీనిలో కానవస్తున్నది.

పత్రికా స్వాతంత్ర్యానికి అనేక దిశలనుంచి ప్రమాదాలు కానవస్తున్న ఈ తరుణంలో శ్రీ శ్రీనివాసన్ వంటి పత్రికా సంపాదకుల అవసరం మరింతగా వున్నది. అట్టివారిసంఖ్య ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా, బహు కొద్ది మాత్రమే. కాని, అట్టివారు కనీసం ఇద్దరు ముగ్గురైనా లేకపోతే పత్రికా స్వాతంత్ర్యానికే కాక ప్రజాస్వామ్యానికే ముప్పు తప్పదు. బలమైన ప్రతిపక్షం, స్వతంత్రమైన న్యాయాధీశవర్గం, నిర్భీకమైన పత్రికలు - ఇవే ప్రజాస్వామ్యానికి మూడు కంచుకోటలు. ఈ మూడింటిలో ఏది బలహీనపడినా, ప్రజాస్వామ్యం విలుప్తికావడానికి ఎంతోకాలం పట్టదు. Kasturi Srinivasan by V.K. Narasimhan. Popular Prakasan, 350 Tardeo Road,

Bombay 34. Rs. 20. (ఆంధ్రజ్యోతి 13-11-1969)

## మానవతావాది : శ్రీ మానవేంద్రనాథ్ రాయ్



మానవ జీవిత సాఫల్య వైఫల్యాలకు మానదండాలేవి? ఆర్జించిన సిరిసంపత్తులా? అనుభవించిన సుఖ సంతోషాలా? అధిష్టించిన పదవులా? సాధించిన ప్రాబల్యమా? పొందిన ప్రశంసలా?

ఇట్టి మానదండాలను వర్తింపజేస్తే, శ్రీ ఎం.ఎన్. రాయ్ జీవితాన్ని నిరర్థకమైందిగానే పరిగణించవలసి వస్తుంది. ఇంచుమించు ఆరు దశాబ్దాలకు, నాలుగు ఖండాలకు విస్తరించిన ఆయన జీవితంలో సామాన్య దృష్టికి కానవచ్చేవి జారవిడిచిన మహదవకాశాలే, కాలదన్నిన కీలక పదవులే, చేజేతుల మంట గలుపుకున్న పేరు ప్రఖ్యాతులే! అద్భుత మేధాసంపత్తి ఉండి కూడా అసాధారణ ప్రజ్ఞాప్రాభవాలుండి కూడా ఈ విధంగా ఆయన వర్తించడం సామాన్య జనులకు విపరీతంగా తోస్తుంది. ఉన్మాదుల పట్టికలో ఆయన పేరును వారు చేర్చుతారు. ఆ పట్టికలో చార్వాకుని సరసను, మకలి గోశాలుడి సరసను, సంజయవేళట్టి పుత్రుని సరసను, అజితకేశ కంబళుని సరసను, డెమోక్రటీజ్ సరసను, టి.హెచ్. హక్స్లీ సరసను, కార్ల్ మార్క్స్ సరసను తన పేరు కనబడినందుకు శ్రీ రాయ్ మాత్రం ఎంతో సంతోషించేవాడని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. వారివలె ఈయనకూడా "అబద్ధాల వేట"నే తన వృత్తిగా పెట్టుకున్నాడు; అప్రియ సత్యాలను పలకడమే తన పరమ ధర్మంగా భావించుకున్నాడు; అనాదృత సిద్ధాంతాల ప్రతిపాదననే తన విశిష్ట లక్ష్యంగా ఎంచుకున్నాడు; అపజయం వాటి ముఖాన స్పష్టంగా వ్రాసిపెట్టబడివున్న యుద్ధాలలో దూకడానికే తన జీవితాన్ని అంకితం చేశాడు. ఇతరుల ఆమోద ప్రమోదాలను లెక్కచేయక, ప్రాపంచిక దృష్టి నుంచి

జయాపజయాలను సరకుగొనక, సత్యపథం వెంట నిత్యపథికులుగా నిలవడాన్ని మాత్రమే ఈ కోవకు చెందిన ఉన్మాదులు కాంక్షిస్తారు.

తానై కోరుకొనకపోయినా, శ్రీ రాయ్ ఒకసారి మెక్సికోలో, మరొకసారి సోవియెట్ రష్యాలో కీలక స్థానాలకు రాకపోలేదు. అయినా, వాటిని కాపాడుకొనడానికి ఆయన యత్నించలేదు.




తన మాట దాదాపు తిరుగులేకుండా చెల్లుతున్న ఘట్టంలో మెక్సికో నుంచి (లెనిన్ ఆహ్వానంపై) కొత్త దేశంలో, కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి ఆయన నిస్సంకోచంగా బయల్దేరాడు. తాత్కాలికంగా మౌనం వహించినప్పటికీ అంతర్జాతీయ కమ్యూనిస్టు సంఘం కేంద్ర కార్యవర్గంలో మిగిలే తన సభ్యత్వాన్ని దాపరికం లేకుండా తన విరుద్ధాభిప్రాయాలను వెల్లడించడం ద్వారా కోల్పోయాడు. యౌవనదశలోనే కాక, వయస్సు మళ్ళిన తరువాత కూడా తన విశ్వాసాల కోసం ఈ విధమైన త్యాగాలను చేస్తునేపోయాడు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్లో నాయకత్వానికి కాకపోయినా, ఒక ప్రముఖ స్థానానికి వచ్చికూడా ద్వితీయ ప్రపంచయుద్ధ సందర్భంలో బ్రిటన్ పట్ల అవలంబించదగు వైఖరి విషయంలో అత్యధిక సంఖ్యాకులతో ఏకీభవించలేక తన సభ్యత్వానికి రాజీనామా పెట్టివేశాడు. తర్వాత తాను సంస్థాపించిన రాడికల్ డెమొక్రాటిక్ పార్టీని, కొంతవరకు అది వేళ్ళు తన్నదొడగిన ఘట్టంలో, రాజకీయ పక్షాల నిర్మాణం తగదన్న తమ నూతన విశ్వాసానుసారం, రద్దుచేసి వేశాడు.

తర్కంలోని నిష్కర్ష, సత్యంలోని కాఠిన్యం, ఏకాగ్రతలోని నిశ్చలత్వం శ్రీ రాయ్ వ్యక్తిత్వంలో ప్రస్ఫుటమౌతూ ఉండేవి. అందువల్లనే పెక్కుమంది ఆయనను మెదడు తప్ప హృదయం లేనివానిగా అపార్థం చేసుకునేవారు; ఔదార్యానికి, ప్రేమకు, క్షమకు ఆయన అపరిచితుడని భ్రమపడేవారు. ఆయనను కేవలం ఒక "థింకింగ్ మెషిన్"గా పరిగణించేవారు. ఆలోచనకు ఆయనెంత ప్రాధాన్య మిచ్చినా, దాని వెనుక "తక్కిన జంతుకోటి నుంచి తమను వేరుచేస్తున్న మెదడు తమకు ఉండికూడా మానవులు దాన్ని వినియోగించరేం?" అనే తీవ్రవేదన దాగి ఉండేది. సత్య పరిశోధన కోసం ఎంత దీక్షతో ఆయన తపస్సు చేసినా, అది కేవలం సత్య సాక్షాత్కారాన్ని పొందగలిగినానన్న వ్యక్తిగత సంతృప్తి కోసం కాదు; మత మౌఢ్యాల నుంచి, నీచ స్వార్థాల నుంచి, ఆత్మ విధ్వంసక విధానాల నుంచి మానవ జాతిని సముద్ధరించవలెనన్న గాఢ తపనతోనే! జాతి, మత, వర్ణ, కుల, వర్గాది విభేదాల నెరుగని ఆయన విశ్వమానవ ప్రేమే ఆయనను మానవతావాదిని చేసింది.

తాత్త్విక రచనలు

శ్రీ రాయ్ తాత్త్విక రచనలు ఆయన పూర్తి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించవు. వాటిలో ఆర్థిక, రాజకీయ, వైజ్ఞానిక, దార్శనికాది వివిధ శాస్త్రాల చర్చ విశేషంగా ఉన్నందున, ఆ శాస్త్రాల పారిభాషిక పదజాలంతో అవి నిండి ఉన్నందున, వాటిని త్వరగా గాని, తేలికగాగాని చదవలేము. కొన్ని వేల సంవత్సరాల నుంచి మనలో

జీర్ణించిపోయిన అంధ విశ్వాసాలను కూకటివేళ్ళతో పెకలించి వేయాలనే ప్రయత్నంలో ఒక భాగంగా మానసిక విప్లవాన్నే అవి ప్రధానంగా కాంక్షిస్తాయి కాబట్టి, మన హృదయాన్ని కదిలించడానికి కాక, మన మనస్సుకు పదును పెట్టడానికి వాటిని శ్రీ రాయ్ వచించాడు. ఈ రెండు కారణాల వల్ల శ్రీ రాయ్ తాత్త్విక రచనలతో మాత్రమే పరిచయమున్నవారు ఆయనను గౌరవించినంతగా ప్రేమించలేరు. మన గౌరవంతోపాటు ప్రేమను సైతం పూర్తిగా పొందగల శ్రీ రాయ్ మనకు కనబడేది ఆయన తదనంతరం ఇటీవలనే వెలువడిన ఆయన స్వీయచరిత్రలోనే ఐదు వందల పుటలకు మించిన ఈ స్వీయచరిత్ర ఆయన జీవితంలో కేవలం ఏడు సంవత్సరాలకు పరిమితం. 1914తో ప్రారంభమై, 1921తో ఇది సమాప్తి చెందుతున్నది. ఆయన శైశవ, బాల్యావస్థల ప్రసక్తి దీనిలో లేదు; తాత ముత్తాతల ప్రసక్తి లేదు; తల్లిదండ్రుల ప్రసక్తి లేదు; కౌమారదశలో వంగ రాష్ట్రంలోని ఒక రహస్య విప్లవ సంఘ సభ్యుడుగా ఆయన కొనసాగించిన సాహస కృత్యాల ప్రసక్తి సైతం లేదు. ఆలోచనారహితమైన అనుభవ శూన్యమైన తన తొలి జీవిత ఘట్టాలకు చెందిన అప్రధాన సంఘటనలుగా వాటి నన్నింటిని ఆయన విడిచిపెట్టాడు. అయినా, చివరి వరకు దాన్ని వ్రాసివుంటే, శ్రీ రాయ్ స్వీయచరిత్ర బహుశా ఏ రెండు, మూడు వేల పుటలకో విస్తరించి వుండేది; ఎన్నెన్నో మహత్తర విషయాలను అది వెల్లడించి ఉండేది. కాని, దాన్ని పూర్తి చేయకుండానే శ్రీ రాయ్ కాలధర్మం చెందాడు. (వ్యాసం) (ఆంధ్రజ్యోతి 5-9-1965)

## డాక్టర్ సునీతి కుమార్ ఛటర్జీ



“మీరు వచ్చారని రిసెప్షనిస్ట్ చెప్పగా విని విస్తుపోయాను. “నా కోసమా?”

“అవును, సర్!”

"ఎప్పుడు?"

“అరగంట క్రితం” అంటూ రిసెప్షనిస్ట్ ఒక పుస్తకాన్ని నా చేతికి అందించాడు. విప్పిచూడగా అది “వరల్డ్ లిటరేచర్ అండ్ టాగోర్' అనే ఇంగ్లీషు గ్రంథం. దాని తొలి పుటలో "శ్రీ వి.ఆర్. నార్ల - విత్ ది బెస్ట్ రిగార్డ్స్ ఆఫ్ సునీతి కుమార్ ఛటర్జీ" అని వ్రాసి ఉన్నది. ఆయన రచనలలో అది సరికొత్తది.

1972లో నేను కలకత్తా వెళ్ళింది రాజా రామమోహన్ రాయ్ ద్విశత జయంతి మహోత్సవాలలో పాల్గొనడానికి. ఆ సందర్భంలో నా మిత్రుడు ప్రొఫెసర్ నీహార్ రంజన్ రే నాయకత్వాన నేషనల్ బుక్ ట్రస్ట్ మే 21-22 తేదీలలో ఒక సెమినార్ ఏర్పాటు చేసింది. ఆ సెమినార్లో తొలిరోజున పేపర్స్ చదవడానికి వచ్చినవారిలో డాక్టర్ సునీతి కుమార్ ఛటర్జీ ఉన్నారు. అల్లంతదూరం నుంచి నేను నమస్కరించగానే ఆయన

నా చెంతకువచ్చి, ఎంతో ఆప్యాయంగా నా యోగక్షేమాలను విచారించారు. "ఎక్కడ బసచేస్తున్నారు?" అని ఆయన ప్రశ్నించగా "హైదరాబాదు హౌస్లో" అని చెప్పాను

"అది ప్రస్తుతం ఇండియా గవర్నమెంట్ గెస్ట్ హౌస్ అని విన్నాను. సౌకర్యంగా ఉన్నదా?" "ఫరవాలేదు. దుగ్గల్, రంగాచారి, నేషనల్ బుక్ ట్రస్ట్ ఉద్యోగులు మరికొందరు అక్కడే మకాం చేస్తున్నారు."

డాక్టర్ ఛటర్జీ కుశల ప్రశ్నలు ఈ ఘట్టానికి చేరేసరికి సెమినార్ ప్రారంభం కానున్నట్టు ప్రకటించారు. మేమిద్దరం విడిపోయి, మాకు ప్రత్యేకించిన స్థానాలలో కూర్చోమన్నారు. నాటి ఉదయం సెమినార్ పేపర్స్ నాకు బాగా వచ్చిన రెండు, మూడింటిలో ఒకటి డాక్టర్ ఛటర్జీ చదివినట్టిది. ప్రాచీనకాలం నుంచి ప్రస్తుత కాలం వరకు భారతచరిత్రలోని కీలక ఘట్టాలను స్పృశించి, వాటిలో రాజా రామమోహన్రాయ్తో ప్రారంభమైన ఘట్టం ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. పండితుడుగా, విద్యావేత్తగా, మానవతావాదిగా రాయ్ వ్యక్తిత్వాన్ని నవభారతంపై ఆ వ్యక్తిత్వం ముద్రను ఆయన విశదపరచారు. అన్ని విషయాలను గురించి అంత సాధికారంగా ప్రసంగించడం ఆయనకే చెల్లుననిపించింది.

ఆ పూట సెమినార్ ముగింపుకు వచ్చినంతనే డాక్టర్ ఛటర్జీ వద్దకు వెళ్ళి నా హార్దికాభినందనలను తెలియజేశాను. "మీ పేపర్ రేపు సాయంత్రం కాదూ? దాన్ని వినడానికి తప్పకవస్తా"నని ఆయన నాతో అన్నారు.

"పెద్దలు ఈ మండుటెండలలో మీకు లేనిపోని శ్రమదేనికి?" అని నే ననగా "లేదు, తప్పక వస్తాను" అంటూ డాక్టర్ ఛటర్జీ తన కారులో కూర్చున్నాడు, కదిలి అది వెళ్ళిపోయింది. మర్నాడు నేను నా పేపర్ చదివిన వేళకు డాక్టర్ ఛటర్జీ సెమినార్లో లేడు. "ఈ వడగాడ్పులో రాలేకపోయి ఉండవచ్చు" అని నే ననుకున్నాను. నిజానికి నాటి సాయంత్రం వరకు సెమినార్ సాగవలసింది. కాని, ఎండలకు జడిసి లంచ్ వేళకే త్వరత్వరగా దాన్ని ముగించివేశారు. నేను నా బసకువెళ్ళి, ఒక గంట విశ్రాంతి తరవాత టాక్సీ తెప్పించి, రాజా రామమోహన్ రాయ్ కలకత్తా నివాసాన్ని, ఆయన పేర నడుస్తున్న గ్రంథాలయాన్ని చూడ్డానికై బయల్దేరాను. మీరు నమ్మండి, నమ్మకపొండి రాజా రామమోహన్ రాయ్ కలకత్తా నివాసం ఇప్పుడొక పోలీసుస్టేషన్! ఆయన పేరు మీద నడుస్తున్న గ్రంథాలయంలోని పుస్తకాలలో కనీసం ఒక సగాన్ని పురుగులు ఫలహారం చేశాయి. ఆయన యజ్ఞోపవీతం, ఆయన శిరోజఖండంతో కూడిన లాకెట్ మొదలైన ఆయన స్మృతి చిహ్నాలతో అక్కడున్న షోకేసుపై ఒక అరంగుళం మందం దుమ్ము కునుకుతీస్తున్నది. "నవభారత నిర్మాతను మనం ఈ విధంగా గౌరవించు కుంటున్నామన్నమాట!" అని నా మనస్సు చివుక్కుమన్నది. అయితే మన వీరేశలింగాన్ని, ఆయన స్మృతి చిహ్నాలను ఇంతకంటే ఎక్కువగా మనం గౌరవిస్తున్నామా?" అని అంతలోనే నాకు తోచింది.

అటుపిమ్మట బ్రహ్మసమాజం వైపు కూడా ఒకసారి తొంగిచూచి, హైదరాబాదు హౌసు తిరిగివచ్చాను. ఈ లోపున నా కోసం డాక్టర్ ఛటర్జీ రావడం, తిరిగి వెళ్లడం తటస్థించింది. అంతటి పెద్దవాడు నన్ను వెతుక్కుంటూ రావడం, ఆయన వచ్చిన వేళకు నేను లేకపోవడం - ఇందుకు నే నెంతగానో నొచ్చుకున్నాను.

ఆ మర్నాటికే హైదరాబాదుకు నేను తిరుగు ప్రయాణం పెట్టుకున్నాను. తొమ్మిది, పదిగంటల ప్రాంతంలో డమ్ డమ్ విమానాశ్రయంలో ఉండాలి.

అయినా, ఈలోపున డాక్టర్ ఛటర్జీ ఇంటికి వెళ్ళి దానిపేరు "సుధర్మ" అని జ్ఞాపకం), ఆయన వద్ద సెలవు పుచ్చుకొనడం నా కనీస ధర్మంగా భావించాను.

టాక్సీ నుంచి దిగి గేటు దాటి లోనికి వెళ్లగా, మెట్లపై కూర్చొని మనమడిని ముద్దాడుతున్న డాక్టర్ ఛటర్జీ కనిపించాడు. ఆ పిల్లవాడు నాలుగేళ్ళు దాటనివాడు. తన ఏకైక పుత్రుడు సుమన్ కు మరి సంతానం కలుగకపోవచ్చునని నిరాశ చేసుకున్న తరువాత పుట్టిన మనుమడైనందున వాడంటే ఛటర్జీకి మరింత ప్రాణం. తన పాండిత్యాన్ని మనుమడికి నూరి పోయాలన్న తాపత్రయంతో కాబోలు ఆ పసివాడికి బెంగాలీ పాఠాన్ని నేర్పాడు, సంస్కృత శ్లోకాలను నేర్పాడు; "ఏది బాబూ! ఈ పాట పాడు? ఆ శ్లోకం!" అంటూ మనుమడిని లాలించి, ఆ చిరంజీవి చేత వాటిని పాడించి, చదివించి ఆయన ఎంతగానో మురిసిపోయాడు. "నా మనుమడు నా తలదన్నగల పండితుడు కాబోతున్నాడు?" అనే అనురాగంతో ఆయన కళ్ళు మెరిసిపోయాయి.

"విమానాశ్రయానికి వేళకు చేరగలనా?" అని నా చేతి గడియారం వైపుకు నా కంటిని నేను పోనివ్వడాన్ని గమనించి, "మీ పేపరు విందామన్న కుతూహలంతో నిన్న సాయంత్రం నేను రాగా, సెమినార్ మధ్యాహ్నానికే ముగిసిపోయినట్లు తెలిసింది. పోనీ, మీ బసకైనా వచ్చి, అక్కడి మిమ్ము చూద్దామని అక్కడికీ రాగా, మీరు లేకపోయారు" అని నన్ను పోలిన ఒక సామాన్యునికి ఆయన చెప్పడం ఆయన అంతస్తుకే తగదని అనిపించింది.

డాక్టర్ ఛటర్జీని నేను చిట్టచివరిసారి చూడ్డం ఇదే. ఇకపోతే, మొట్టమొదటిగా ఆయనను చూచింది 1955లో. అప్పటిలో కలకత్తాలో ఉద్యోగ ధర్మం కొద్దీ ఉంటున్న నా తమ్ముని చూడ్డానికై వెళ్ళిన నేను ఆత్రిలో ఎ.ఎస్. రావు, జామినీ రాయ్ తో పాటు డాక్టర్ ఛటర్జీని కూడా కలుసుకున్నాను. అంతకుముందు ఛటర్జీని చూచి ఉండకపోయినా, తన మాతృభాష బెంగాలీ పుట్టుపూర్వోత్తరాలను గురించి నేటికీ ప్రామాణిక గ్రంథంగా నిలిచిన దాన్ని 1926లోనే రాసాడని నాకు తెలుసు. పెక్కేళ్ళ పాటు ఆయన ఇంగ్లీషు ప్రొఫెసరుగా పనిచేశాడని తెలుసు. హిందీ భాషా వికాసంపై ఆయన అథారిటీ అని తెలుసు. సంస్కృతంలో ఆయన కొమ్ములు తిరిగిన పండితుడని తెలుసు. పర్శ్యన్, ఉర్దూలు ఆయనకు కొట్టినపిండి అని తెలుసు. గ్రీకు, లాటిన్, హిబ్రూ మొదలైన విజాతీయ ప్రాచీన భాషలలో ఆయనకు ఎన్నదగు ప్రవేశం కలదని తెలుసు. ఫ్రెంచ్, జర్మన్ మొదలైన ఆధునిక యూరోపియన్ భాషలు ఆయనకు సుపరిచితమైనవని తెలుసు. అస్సామీస్, ఒరియా, గుజరాతీ, మరాఠీలు ఆయనకు క్షుణ్ణంగా వచ్చునని తెలుసు. ఆదివాసుల భాషలలో కొన్నిటిని, ఆగ్నేయ ఆసియా భాషలలో కొన్నిటిని ఆయన ఆకళింపు చేసుకున్నట్లు తెలుసు. కాగా అప్పటికీ నాకు తెలియనిది తెలుగు, కన్నడం, తమిళం, మళయాళం భాషలకైనా ఆయన అపరిచితుడు కాదన్న సంగతి! "తింత్రిణికి మూలం మీ చింత" అని చెప్పి ఆయన నన్ను ఆశ్చర్యపరిచాడు". "మీ చారలమెకమే శార్దూలంగా మారింది"

అని చెప్పి ఆయన నన్ను మరింతగా ఆశ్చర్యంలో ముంచాడు! ఆనాడు ఒక గంటలో ఆయననుంచి నేను తెలుసుకొనగలిగిన కొత్త విషయాలు ఇన్నన్ని కావు!! ఆయనలో నాకు కనబడిన ఒక గొప్ప విషయం పాండిత్య ప్రదర్శన కోసం ప్రయత్నం చేయకపోవడం, చిరకాలమిత్రునితో చనువుగా మాట్లాడుతున్న ధోరణిలో సందర్భోచితంగా అనేక విషయాలను చర్చించడం!

డాక్టర్ ఛటర్జీతో నా మొట్టమొదటి, చిట్టచివరి సమావేశాల మధ్య సాహిత్య అకాదమీ (ఢిల్లీ) మీటింగులలో పెక్కుసార్లు ఆయనను కలుసుకొన్నాను. ఆయనతో పరిచయం పెరిగిన కొద్దీ ఆయన పట్ల నా ప్రేమ గౌరవాలుకూడా పెరుగుతూ పోయాయి. నా పట్ల ఆయన ప్రేమ వాత్సల్యాలు ఇదేరీతిగా పెరుగుతూ పోయినట్టు నేను నమ్మడం కేవలం నా భ్రమ కాదేమో! వీరేశలింగంపై నేను ఇంగ్లీషులో వ్రాసిన మోనోగ్రాఫ్ను చదివినమీదట ప్రేమాదరాలతో ఆయన నాకు సుదీర్ఘమైన లేఖ వ్రాశాడు. దానిలోని కొన్ని వాక్యాలివి : "రవిబాబు దృష్టిలో నలుగురు భారతీయులే ధీరోదాత్తులు. ఆ నలుగురు - రాణాప్రతాప్, ఛత్రపతి శివాజీ, రాజా రామమోహన్ రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్. మీ మోనోగ్రాఫ్ను చదివి ఉంటే, ఈ నలుగురి పేర్లకు వీరేశలింగం పేరును ఆయన తప్పక జతపర్చి ఉండేవాడు!"

అన్నట్టు, టాగోర్కు ఛటర్జీ అంటే ప్రేమ, గౌరవాలు విశేషంగా ఉండేవి. బెంగాలీ భాషను గురించి తాను వ్రాసిన గ్రంథాన్ని ఆయన ఛటర్జీకి అంకితం చేశాడు. "భాషాచార్య" అనే బిరుదును ఆయనకిచ్చాడు. ఇంతేకాదు. మలయా, సుమత్రా, జావా, బాలీ మొదలైన ఆగ్నేయ ఆసియా ప్రాంతాలలో తాను 1927లో పర్యటించి ఛటర్జీని వెంటబెట్టుకు వెళ్ళారు.

విద్యాసాగర్ కాలేజీలో ఇంగ్లీషు ప్రొఫెసర్ గిరి మొదలుకొని, నేషనల్ ప్రొఫెసర్ గిరి వరకు ఆచార్య పీఠాలను పెక్కింటిని డాక్టర్ ఛటర్జీ అధిష్టించాడు. బెంగాల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ అధ్యక్షత మొదలుకొని, సాహిత్య అకాదమీ అధ్యక్షత వరకు ఎన్నెన్నో ఉన్నత పదవులను నిర్వహించాడు. కనీసం అయిదు ఖండాలకు చెందిన నూరు, నూటయాభై దేశాలలో పర్యటించాడు. అనేక విశ్వవిద్యాలయాల నుంచి డాక్టరేట్లను పుచ్చుకున్నాడు. జాతీయ, అంతర్జాతీయ మహాసభలు పెక్కింటిలో సభ్యుడుగా లేదా సభాధ్యక్షుడుగా ప్రధాన పాత్ర వహించాడు. భాషాశాస్త్రంలో ప్రత్యేక ప్రవీణుడన్న ప్రపంచ ప్రఖ్యాతితోపాటు సాహిత్యవేత్తగా, కళాభిజ్ఞుడుగా, చరిత్రకారుడుగా, సాంఘిక తత్త్వవేత్తగా మన్ననలు పొందాడు. ఆయన డ్రాయింగ్ రూమ్లో కొన్ని ప్రాచీన భారత శిల్పాలను, మరికొన్ని ఆఫ్రికన్ శిల్పాలను నేను చూచాను. ఆయన పర్సనల్ లైబ్రరీ చాలా పెద్దదని విని, దాన్ని చూడాలని ఉబలాటపడ్డాను గాని, అది ఉన్న మూడవ అంతస్తువరకు ఎక్కలేకపోయాను. డాక్టర్ ఛటర్జీ చిన్న వయస్సులో కసరత్తు చేసేవాడట, కుస్తీలు పట్టేవాడట. అందువల్ల మూడు అంతస్తులే కాదు, మరి మూడింటినైనా ఆయన సునాయాసంగా ఎక్కగలిగేవాడు.

ఒక్కొక్క యేడు పైబడిన కొద్ది నూటికి 99 మంది గిడసబారిపోతారు. సంస్కరణాభిలాషులు క్రమంగా పూర్వాచార పరాయణులుగా మారిపోతారు. మానవతావాదులు కులమతాభి మానులుగా మారిపోతారు, విప్లవాన్ని కోరినవారు దానికి పరమ విరోధులుగా పరివర్తనం చెందుతారు. డాక్టర్ ఛటర్జీ విషయంలో

ఇందుకు భిన్నంగా జరిగింది. పోను పోను ఆయన దృక్పథం మరింత విశాలమైంది. ఆయన భావాలు మరింత పదునెక్కాయి. అందుకే ఆయనంటే నాకు ప్రత్యేక గౌరవం. ఎనభై ఆరేళ్ళు వచ్చిన మీదట నిరుడు కలకత్తాలోని ఏసియాటిక్ సొసైటీలో ఉపన్యసిస్తూ, వాల్మీకి రామాయణానికి మూలం ప్రాచీన కాలంనాటి గ్రీక్ పౌరాణిక గాథలని చెప్పి, ఆయన పెద్ద తుపాను లేపాడు. ఈ పని చేయగల గుండెబలం ఆ వయస్సులో ఎంత మందికి ఉంటుంది? తన వాద నిరూపణకు ఆయన ఒక గ్రంథ రచన ప్రారంభించాడు. దాన్ని ఆయన పూర్తి చేయగలిగినాడో, లేదో నాకు తెలియదు.

డాక్టర్ ఛటర్జీ ఓం ప్రథమంగా నా దృష్టిని ఆకర్షించింది. భారతీయ సంస్కృతి స్వరూప ప్రభావాలపై ఆయన వెల్లడించిన అభిప్రాయాల కారణంగా. కె.ఎమ్. మున్షీకి వలె ఛటర్జీకి సయితం సంస్కృతం పట్ల ప్రత్యేక గౌరవాభిమానాలున్నాయి. అయితే, మున్షీవలె ఆయన దాన్ని దేవభాషగా పరిగణించడు. మున్షీవలె ఆయన భారతీయ సంస్కృతిని ఆర్యజాతిభిక్షగా గుర్తించడు కూడా. భారతీయ సంస్కృతిని రూపొందించడంలో ఆర్యజాతి పాత్ర కంటే కిరాత, నిషాద, ద్రావిడ జాతుల పాత్ర అధికమైనదని ఛటర్జీవాదం.

ఈ వాదాన్ని ప్రారంభించింది ఆయన కాకపోవచ్చు. కాని, దానికి తిరుగులేని బలాన్ని కూర్చిన ఘనత ఆయనదే.

నేను ప్రేమించే - నేను గౌరవించే - కొద్ది మంది భారతీయ పండితులలో ఒకడైన సునీతి కుమార ఛటర్జీ మొన్న మే 29వ తేదీని (88వ ఏట) కలకత్తాలో కన్నుమూసినట్టు విన్నంతనే నా ప్రపంచం ఎంతగానో కుచించుకు పోయినట్టు అనిపించింది. ఆయన పాండిత్యం, విజ్ఞానం, ప్రజ్ఞాప్రాభవాలు అసామాన్యమైనట్టివి. అయితే వాటిపట్ల కంటే కూడా ఆయన ధర్మాభినివేశం పట్ల నాకు మరింత గౌరవం. 1969లోనో, 1970లోనో న్యూఢిల్లీలో ఆయనను నేను కలుసుకున్నప్పుడు "ఆరోగ్యంగా ఉన్నారా?" అంటూ పలకరించాను. "ఆరోగ్యానికేమిలెండి, పాడు ఆరోగ్యం దివ్యంగా ఉన్నది!" అని పెద్ద బాధతో ఆయన జవాబు చెప్పాడు. ఆయన పలుకులకు నా ముఖం వివర్ణం కావడాన్ని గమనించి, తన బాధాకారణాన్ని ఆయన వివరించాడు - "ఎంతో లక్ష్యశుద్ధిని, త్యాగనిరతిని, దేశభక్తిని, ధీరోదాత్తతను చూచిన ఈ కళ్ళతో ఈనాడు ఎంతో స్వార్థాన్ని, చౌర్యాన్ని, నైచ్యాన్ని చూడవలసి వస్తున్నది. ఈ దుర్దశ నాకు పట్టకముందే నేను ఎందుకు వెళ్ళిపోలేదన్న బాధ ఈ మధ్య నన్ను విశేషంగా క్రుంగదీస్తున్నది." ఈ పలుకులను విన్నప్పుడు చెమ్మగిల్లిన నా కళ్ల వెంట అశ్రుధారలు మొన్న మే 29వ తేదీన జలజల జాలువారాయి.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక వ్యాసం 29-6-1977).

## మన రాష్ట్రపతులు



నీలం సంజీవరెడ్డి

శ్రీ నీలం సంజీవరెడ్డి మన ఆరవ రాష్ట్రపతి. అంతకు ముందరి అయిదుగురిలో ఇద్దరే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, శ్రీ వరాహగిరి వెంకటగిరి, ఆంధ్రులని కొందరు వ్రాస్తున్నారు. ఇది సరికాదు. డాక్టర్ జాకిర్ హుస్సేన్ మాతృభాష ఉర్దూ కావచ్చు. అంతమాత్రంచేత ఆయన ఆంధ్రుడు కాకపోడు. ఆయన పుట్టింది మన హైదరాబాద్ లో; ఎనిమిదవ ఏట వరకు పెరిగిందీ హైదరాబాద్ లోనే. ఈ పక్కా హైదరాబాదీని ఆంధ్రతరునిగా లెక్కగట్టడం ఎంతమాత్రం తగదు కాబట్టి, మన ఆర్గురు రాష్ట్రపతులలో ఆంధ్రులు ముగ్గురు కారు, నల్గురు. తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ కు నన్ను పరిచయం చేయడానికి ఒక తెలుగు ఎమ్.పి. ముందుకు వచ్చాడు. ఇది నేను స్వయంగా ఎమ్.పి. కావడానికి అయిదారేళ్ళ ముందుగా ఆ సంవత్సరం ఢిల్లీలో శ్రీ కె.ఎమ్. మున్షీ అధ్యక్షతను జరిగిన అఖిల భారత సాంస్కృతిక మహాసభలో నేను పాల్గొన్నాను. మహాసభ ప్రతినిధులకు మొగల్ గార్డెన్స్లో రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ తేనీటి విందు చేశారు. ఇట్టి విందులలో అతిథుల పరామర్శ ఒక భాగం. ఆ లాంఛనాన్ని పాటిస్తూ నేను నిలిచి ఉన్న దిశకు వస్తున్న రాష్ట్రపతి అల్లంత దూరాన ఉండగానే, అక్కడి నుండి చల్లగా మరొక చోటుకు నేను జారుకోబోయాను. రాష్ట్రపతికంటే ఠీవిగా ఆయన వెంట నడుస్తూ "ఈయన ఫలానా, ఆయన ఫలానా" అంటూ పరిచయాలు చేస్తున్న తెలుగు ఎమ్.పి. నన్ను, నా వాలకాన్ని పసిగట్టి "నార్ల గారూ!" అని బిగ్గరగా పిలిచాడు. నిజానికి అది పిలుపు కాదు, అరుపు. దాన్ని విన్న మీదట నేను ఆగిపోక తప్పలేదు. అంతట రాష్ట్రపతిని నా వైపుకు మళ్ళించి, నే నెవరినో మూడు ముక్కలలో ఆయనకు చెప్పాడు. నేను నమస్కారం చేయగా, రాష్ట్రపతి ప్రతినమస్కారం చేశాడు. అందుమీదట ఆయన దారిని ఆయన వెళ్ళగా, నా దారిని నేను మిగిలాను.

ఇందుకు ఈ విధమైన పరిచయాలంటే నాకు చెడ్డ తలనొప్పి. ఒకసారికి నాలుగుసార్లు కలుసుకొనడానికి మంచీ చెడ్డా, మాట్లాడుకోడానికి, అంతకంతకు మరింతగా దగ్గరికి రావడానికి వీలు కల్పించగల పరిచయాలనే నేను అభిలషిస్తాను.

"నేమ్ డ్రాపింగ్" అనేది కొందరికి పెద్ద జబ్బు, ఎవరితోనైనా సరే అయిదు నిమిషాలపాటు మాట్లాడితే, సందర్భశుద్ధి లేకపోయినా, కనీసం పదిమంది ప్రసిద్ధ పురుషుల ప్రసక్తి వీరు తెస్తారు. ఈ పని చేయడంలో వీరి ఉద్దేశం "ఇంత గొప్పవారితో ఇంతగా పరిచయాలున్న వ్యక్తి ఎంత గొప్పవా"డన్న భావాన్ని మనకు కలిగించడమే. ఈ "నేమ్ డ్రాపింగ్" విద్యలో ఆరితేరిన వాడు నేను పేర్కొన్న తెలుగు ఎమ్.పి. ఉత్తరాదిలోని ప్రముఖనాయకులందరు తనకు సన్నిహితులన్న భ్రమను ఈయన దక్షిణాది వారికి కలిగిస్తాడు; దక్షిణాదిలోని ప్రముఖులందరు తన చెప్పుచేతలలో మెలగుతారన్న నమ్మకాన్ని ఉత్తరాది వారిలో పెంచుతాడు. ఈ "ట్రిక్కు"తో ఉత్తరాదిలోవలె దక్షిణాదిలో తనకు కావలసిన పనులను సునాయాసంగా చేయించుకొంటాడు.

అయితే, అబ్రహాం లింకన్ అన్నట్టు "ఎల్లరినీ ఎల్లకాలం మోసగించడం సాధ్యంకాదు" కాబట్టి, ఈ మధ్య కొంత కాలంగా ఈ "రామప్ప పంతులు" పప్పులు ఇదివరలో వలె ఉడకడం లేదు. 1958లో నేను మొదటిసారిగా రాజ్యసభకు ఎన్నికైన పిదప డాక్టర్ రాజేంద్రప్రసాద్ "ఇంటర్వ్యూ" లను కోరడానికి నాకు వీలున్నా, అందుకు నేను ఉత్సహించలేదు. నా దృష్టిలో ఆయన పరమ ఛాందసుడు. నేను ఇంతకు ముందు పేర్కొన్న తెలుగు ఎమ్.పి.ని పోలిన వారు ఆయనను జనక మహారాజుతో పోల్చి "రాజర్షి"గా పొగడి, ఆయన ఛాందసత్వాన్ని మరింత పెంచుతూ ఉండేవారు. ఆయనకు యజ్ఞ యాగాలంటే నమ్మకం; మంత్ర తంత్రాలంటే నమ్మకం; తీర్థ ప్రసాదాలంటే నమ్మకం, శకునాలు, జ్యోతిషాలంటే నమ్మకం; తాయిత్తులు, రక్షరేకలంటే నమ్మకం; కాయకల్పాది చికిత్సలన్నా నమ్మకమే, పోనీ, ఎవరి నమ్మకాలు వారివని సరిపెట్టుకు పోవడానికి ఆయన సాధారణ పౌరుడు కాడయ్యె! ఒక పౌరుడుగా ఆయన ఎవరికి పాద పూజ చేసినా, నేనుగాని, మీరు గాని, మరొకరు గాని పట్టించుకోనక్కరలేదు. కాని రాష్ట్రపతిగా అట్టి పనిని ఆయన చేస్తే, మనలో పెక్కుమందికి అది బాధ కలిగిస్తుంది. రాష్ట్రపతిగా ఒకసారి ఆయన సరిగా ఇంతే చేశారు. పునరుద్ధరించిన సోమనాథ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంలో శ్రీ కె.ఎమ్. మున్షీ ప్రేరణపై ఆయన వందమంది బ్రాహ్మణుల కాళ్ళు కడిగి, ఆ నీళ్ళను తన నెత్తిపై చిలకరించుకొన్నారు. భారతీయ పౌరుడనైన నేను నా రాష్ట్రపతి ఇంతటి పని చేసినట్టు విన్నప్పుడు పడిన సిగ్గు ఈ నాటికీ ఏదో ఒక మూల నన్ను దహిస్తూనే ఉన్నది. తన చర్య ద్వారా ఆయన నన్నేకాదు, ఆత్మగౌరవం ఎంతో కొంత ఉన్న ప్రతి భారతీయుని అవమానం చేశారు.

మన మొదటి రాష్ట్రపతిలోని ఛాందసాలు రెండవ రాష్ట్రపతిలో కనబడేవి కావు. ఆయనది సమగ్ర పాండిత్యం, సువిశాల దృక్పథం. ప్రాచ్య, పాశ్చాత్య ప్రపంచాల మధ్య, పురాతన, అధునాతన యుగాల మధ్య స్వర్ణ సేతువుల నిర్మాణానికి ఆయన కృషిచేశారు. పెక్కుమందికి తెలియకపోవచ్చుగాని, మన దేశం సోషలిజం దిశలో పురోగమించాలని మొట్టమొదటగా చెప్పిన ప్రముఖుడు వివేకానందస్వామికాగా, రెండవ ప్రముఖుడు (జవహర్లాల్ నెహ్రూకాదు) డాక్టర్ రాధాకృష్ణన్. ఈ మాట కూడా పెక్కు మంది విని ఉండక పోవచ్చుగాని, ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్గా డాక్టర్ సి.ఆర్. రెడ్డి చేయలేకపోయిన రెండు పనులను డాక్టర్ రాధాకృష్ణన్ చేయగలిగారు. రెడ్డిగారి హయాంలో విద్యార్థులకు బ్రాహ్మణ, బ్రాహ్మణేతర భోజనశాలలుండేవి; అవి శాకాహార, మాంసాహార భోజనశాలలుగా మారింది రాధాకృష్ణన్ గారి హయాంలోనే. పోతే, బ్రిటిష్ వారి పరిపాలన కాలంలో అంతర్జాతీయ సమావేశాలకు జెనీవాకు, ఇతర విదేశీయ నగరాలకు ప్రతినిధిగా వెళ్ళివస్తున్న సందర్భాలలో అప్పటిలో విశిష్ట సాహిత్యంగా పరిగణించబడుతున్న మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ ప్రభృతుల రచనలను డాక్టర్ రాధాకృష్ణన్ ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయానికి తెస్తూ ఉండేవారు. ఆయన తర్వాత తిరిగి వైస్-ఛాన్సలర్ పదవిని స్వీకరించిన రెడ్డిగారు చేసిన పని ఆ గ్రంథాలను లైబ్రరీలో నుంచి వేరి పారవేయించడం!




ముందు ఉపరాష్ట్రపతిగా, పిదప రాష్ట్రపతిగా డాక్టర్ రాధాకృష్ణన్ నా పట్ల ప్రేమాదరాలను ఎంతగానో చూపించారు. 1958లో యునెస్కో లోకల్ కాన్ఫరెన్స్కు ఆయన నాయకత్వాన వెళ్ళిన భారతీయ ప్రతినిధివర్గంలో నన్ను ఒక సభ్యునిగా చేర్చింది ఆయనే. మొదటి ప్రెస్ కౌన్సిల్లో నాకు స్థానం లభించబోతున్నట్టు మున్ముందుగా నాకు తెలిపింది ఆయనే. ఎప్పుడు ఆయన వద్దకు వెళ్ళినా, నన్ను ఎంతో ఆప్యాయంగా చూచేవారు; ఆదరంగా నాతో మాట్లాడేవారు. ఒకనాడు నెహ్రూ రాజకీయ జీవితానికే కాక, ఆయన మొత్తం జీవితానికే "ది స్ట్రాటజీ ఆఫ్ ఇన్డైరెక్ట్ అప్రోచ్" అనేది కీలకమని, ఈ "స్ట్రాటజీని" కెప్టెన్ లిడిల్ హార్ట్ రచనల ప్రభావం ద్వారా నెహ్రూ అనుసరించాడని నేను వివరిస్తూ పోగా, ఎంతో శ్రద్ధాసక్తులతో దాదాపు అరగంట సేపు ఆయన నా మాటలను వింటూ పోయారు. నేను సెలవు పుచ్చుకొని వెళ్ళిపోవలసిన సమయం మించిపోయిందని నన్ను హెచ్చరించడానికి ఈ మధ్యలో మూడుసార్లు తన మిలటరీ సెక్రటరీ రాగా, అతడిని చేతి సైగలతో డాక్టర్ రాధాకృష్ణన్ వెనుకకు పంపించి వేశారు. పెద్దగా గుండెపోటు వచ్చి, న్యూఢిల్లీలోని వెల్లింగ్టన్ నర్సింగ్హోమ్లో నేను చికిత్స

పొందుతున్నప్పుడు "మీ ఆరోగ్యస్థితి ఎలా ఉన్నదని ప్రెసిడెంట్ మిలిటరీ సెక్రటరీ రోజు కొకసారి టెలిఫోన్ చేస్తున్నాడు" అని నా డాక్టర్ చెప్పాడు. కొంతవరకు నేను కోలుకున్నట్టు వినగానే, డాక్టర్ రాధాకృష్ణన్ నన్ను చూడ్డానికి వచ్చి, ఒకటి, రెండు సంస్కృత శ్లోకాలు చదివి, ఆశీర్వదించి వెళ్ళారు. ఈ మాటలను నే నిక్కడ వ్రాయడం నాలో ఏదో ప్రత్యేక ఘనతను ఆయన చూచినట్టు గొప్ప చెప్పుకొనడం కోసం కాదు. నాకే కాదు, కొన్ని వందల మందికి - కొన్ని వేల మందికి - వారి యోగక్షేమాల పట్ల తనకు ప్రత్యేక శ్రద్ధ కలదన్న విశ్వాసాన్ని ఆయన కలిగించేవారు. అది ఆయనలో ఒక ప్రత్యేకత, ఒక విశిష్టత.

పోతే, డాక్టర్ జాకిర్ హుస్సేన్తో నా తొలి సమావేశం ఆయన వైస్ - ప్రెసిడెంట్గా ఉండగా. వైస్-ప్రెసిడెంట్ హోదాతో ఆయన రాజ్యసభకు అధ్యక్షుడు కూడా. అందువల్ల సభలో ఆయనను తరచు చూస్తూ ఉండేవాడిని. ఆయన పట్ల, ఆయన ఉత్తమ సంస్కృతిపట్ల నాకు కుదురుకొన్న గౌరవభావం కొద్దీ ఒకసారి "కర్టసీ కాల్"గా ఆయన నివాసానికి వెళ్ళాను. త్వరలో మా సంభాషణ తెలుగు భాషపైకి, సాహిత్యంపైకి మళ్ళింది. వాటిని గురించి గుచ్చి గుచ్చి అనేక ప్రశ్నలు ఆయన వేశారు; నాకు తెలిసిన మేరకు ఆయనకు సమాధానాలు చెబుతూ పోయాను. ఆధునికయుగంలో సి.పి. బ్రౌన్ తెలుగు భాషకు, సాహిత్యానికి చేసిన సేవలను ప్రత్యేకించి నేను వివరించాను. పది నిమిషాలలో ముగిసిపోవలసిన మా సమావేశం దాదాపు గంటవరకు కొనసాగింది. మధ్యలో ఒకటి, రెండుసార్లు నేను సెలవు తీసుకొనబోగా, "తొందరేమిటి?" అని ఆయన వారించారు. 1964 నాటి తీవ్ర రుగ్మత సమయంలో ఒకనాడు నర్సింగమ్కు వచ్చి, ఆయన నన్ను పరామర్శించారు. తర్వాత పది రోజుల పాటు ప్రతి ఉదయం తమ తోటలో నుంచి గులాబి పువ్వుల గుత్తులను ఆయన నాకు పంపిస్తూ పోయారు! నాకే అన్న మాటేమిటి? ఆయనకు పరిచయులైన ఇతరులకు సయితం

అనుదినం పుష్పాల రూపంలో ఆయన శుభాకాంక్షలు అందుతూ ఉండేవి. అంత గొప్పది ఆయన సంస్కారం, అంత గొప్పది ఆయన సౌజన్యం!



డాక్టర్ హుస్సేన్ రాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత ఆయనను మరికొన్ని సార్లు కలుసుకొన్నాను. ప్రతి సమావేశం తర్వాత ఆయన పట్ల మరింత ప్రేమ గౌరవాలతో తిరిగి వచ్చాను. ఆయనతో నా చిట్టచివరి సమావేశం మరి రెండు వారాలకు ఆయన తలవని తలంపుగా కాలధర్మం చెందుతాడనగా. అందువల్ల ఆయన మరణవార్త నాకు పిడుగుపాటు వలె తోచింది. విజయవాడ రేడియో స్టేషన్ ద్వారా ఆయనకు నేను నా శ్రద్ధాంజలి ఘటించాను. నా ప్రసంగాన్ని వినలేకపోయినా, దాని పూర్తి పాఠాన్ని "ఆకాశవాణి" పక్ష పత్రికలో ఆయన కుటుంబ సభ్యులు చదివినట్టు, అది వారిని విశేషంగా కదిలించినట్టు రాష్ట్రపతి భవన్కు చెందిన హిందీ సెక్రటరీ (ఈయన ఆంధ్రుడు) చెప్పగా విన్నాను.

మన రాష్ట్రపతులు ఆరుగురిలో నాకు చిరకాల పరిచయం వరాహగిరి వెంకటగిరిగారితో. రాజాజీ ప్రభుత్వంలో కార్మిక, పారిశ్రామిక, సహకార, వాణిజ్య, మత్స్యశాఖలకు మంత్రిగా 1937లో ఆయన నియమితుడైన కొత్తలో ఆయనను మొట్టమొదటగా నేను కలుసుకొన్నట్టు జ్ఞాపకం. అనేక సందర్భాలలో ఆయన నా పట్ల స్నేహాభిమానాలను చూపించాడు. 1968లో న్యూఢిల్లీలో జరిగిన నా షష్టిపూర్తి సభకు అధ్యక్షత వహించి, నన్ను గురించి ఆయన నాలుగు మంచి మాటలు చెప్పారు (అప్పటిలో ఆయన వైస్-ప్రెసిడెంట్). ఆ సభ సందర్భంలో ఆయన సతీరత్నం నన్ను అభినందిస్తూ ఒక పాట - లేక, అది పద్యమా? - వ్రాశారు. తర్వాత కొంత కాలానికి ఆమె పద్యకావ్య వ్రాత ప్రతిని నాకు విజయవాడకు పంపిస్తూ, దాని ముద్రణ విషయమై నేను శ్రద్ధ వహించాలని, దానికి నేను పీఠికను కూర్చాలని గిరిగారు లేఖ వ్రాశారు. అంతటి గొప్ప కావ్యానికి పీఠికను కూర్చే గౌరవానికి నేను తగనని, ముద్రణ విషయమై శ్రద్ధ వహించడానికి అభ్యంతరం లేదని ఆయనకు నేను జవాబు వ్రాశాను. నేను ఎలాగో తప్పించుకొన్న పీఠికను తనకు తప్పనందున శ్రీ దామోదరం సంజీవయ్య దాన్ని వ్రాశారు. అటు తర్వాత ఆ పుణ్యదంపతులకు ఆమడ దూరంలోనైనా నేను వెళ్ళలేదు! రాష్ట్రపతిగా ఒకసారి ఆయన విజయవాడ వస్తున్నట్టు విని, ఆయన రాకకు రెండు రోజులు ముందుగా మైసూరు వెళ్ళిపోయాను. కాగా, నాకు ఎంతమాత్రం పరిచయం లేని రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహమ్మద్. నేను రాజ్యసభ మెంబర్గా ఉన్న రోజులలో ఆయన కేంద్ర ప్రభుత్వంలో మంత్రి నాకు లైసెన్సుల, పర్మిట్టుల, కోటాల గొడవలు లేనందున నేను ఏ మంత్రిని కలుసుకొనే వాడిని కాదు; ఎదురుపడితే వారికి నమస్కారాలైనా పెట్టేవాడిని కాదు. అది ఒక గొప్ప విశేషం కాదు గాని, ఆమె పట్ల నా కున్న అసహ్యభావంకొద్దీ శ్రీమతి ఇందిరా గాంధికి నేనెన్నడు నమస్కరించలేదు. నా సరసనున్న వారందరు చేతులెత్తి, తలలు వంచి, నమస్కరించగా, ఆమెను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన నా వంక రెండు, మూడు సార్లు ఆమె చురుకుగా తేరిపార జూచింది కూడా.

1969 నాటి రాష్ట్రపతి ఎన్నిక సందర్భంలో శ్రీ జగ్జీవన్ రామ్, శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహమ్మద్ పాత్ర నాకెంతమాత్రం మనస్కరించలేదు. అందువల్ల వారిలో జగ్జీవన్నను ఒకసారి వాల్తేరులో కలుసుకొన్నా, ఒక గంటకు పైగా ఆయనతో సంభాషించినా, శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహమ్మదు ఎన్నడు కలుసుకోనే లేదు. 1969 నాటి తమ అనుచిత పాత్రకు వారిద్దరు చివరికి ఘనమూల్యాన్నే చెల్లించవలసి వచ్చింది.

కాగా, ఇప్పటి రాష్ట్రపతితో ఒకప్పుడు నాకు బద్ధ విరోధమని, ఇప్పుడేమో ఆప్త మిత్రత్వమని పెక్కుమంది భావించడం కద్దు. ఇది పూర్తిగా పొరపాటు. మా మధ్య సర్వదా సుహృద్భావమే తప్ప వైరుధ్యం లేదు. కొన్ని కొన్ని సందర్భాలలో నేను ఆయనను పత్రికలలో తీవ్రంగా విమర్శించి ఉండవచ్చు; సభా వేదికలపై నుంచి ఆయన నన్ను నిశితంగా ఖండించి ఉండవచ్చు. అయితే, మా మతభేదాలు సిద్ధాంతాల పరమైనవే; లేదా విధానాల పరమైనవే; వ్యక్తిపరమైనవి కావు. అందువల్ల నేను ఆయనపై అనుదినం ఒక దాడి జరుపుతున్న ఘట్టాలలో సయితం ఆయన మద్రాసు వస్తే (అప్పుడు నా నివాసం మద్రాసులో ఆయన మా ఇంటికి వచ్చి, నా యోగక్షేమాలను విచారిస్తూ ఉండేవారు. నేను కర్నూలు వెడితే, ఆయనను చూడకుండా, ఆయనతో కనీసం ఒక గంట గడప కుండా తిరిగి వచ్చేవాడిని కాదు. ప్రజానాయకులుగా, ప్రభుత్వ నాయకులుగా తమ చర్యలను నే నెంత గట్టిగా దుయ్యబట్టినా, నాకు దురుద్దేశాలను అంటగట్టని ఆంధ్ర ముఖ్యమంత్రు లిద్దరే. వారిలో ఒకరేమో శ్రీ టంగుటూరి ప్రకాశం కాగా, రెండవ వారు శ్రీ నీలం సంజీవరెడ్డి పై పెచ్చు, వీరిద్దరు నా స్వతంత్ర ప్రవృత్తిని హర్షించారు; అందుకు నన్ను అభినందించారు.

ప్రకాశంగారు మరి కొద్ది నెల్ల చనిపోతారనగా, హైదరాబాద్లో ఆయనను నేను ఒక విందు సందర్భంలో కలుసుకోవడం తటస్థించింది. అంతకు ఒకటి, రెండు వారాలకు ముందు ఆయనను అతి తీవ్ర ధోరణిలో విమర్శిస్తూ నేనొక సంపాదకీయం వ్రాసి ఉన్నాను. దగ్గరికి వెళ్ళి, పలకరిస్తే ఆయన నన్ను తిడతారేమో అని ముందు కొంత తటపటాయించాను. అయినా, ధైర్యం చేసి, ఆయనను సమీపించి, "పంతులుగారూ! నేను నార్లను" అంటూ నమస్కారం చేశాను. వాలిపోతున్న కనురెప్పలను విప్పి, రెండు చేతులు చాచి, నన్ను చెంతకు లాక్కొని, తన గుండెలకు హత్తుకొన్నారు. ఇంతటి మహోదాత్తుని గురించి కొన్ని క్షణాలపాటు నాలో పొడసూపిన భయ సందేహాలకు నేను సిగ్గుపడ్డాను; నా కళ్ళు చెమ్మగిలినాయి.

ఇంతటి మహోదాత్తంగా ప్రవర్తించగల మరొక ఆంధ్ర రాజకీయవేత్త నా దృష్టిలో శ్రీ నీలం సంజీవరెడ్డి మాత్రమే. తాను చెంతచేర్చిన వారే ఆయనకు చెరుపు చేశారు; తాను పెంచి పెద్ద చేసిన వారే ఆయనకు ఎసరు పెట్టారు; తమ సోదరునికంటె మిన్నగా భావించిన సంభావించిన వారే ఆయన పట్ల పరమ ద్రోహుల వలె సంచరించారు. అయినా, ఆయన తొణకలేదు, బెణకలేదు; ఆత్మ గౌరవానికి అణుమాత్రంగానైనా భంగం కలగనివ్వలేదు. ప్రాపకాలకై ఆయన ప్రాకులాడిన వాడు కాదు; పదవులకై పలవరించిన వాడు కాదు. పదవికి పిలుపు వస్తే, దాన్ని ఆయన తిరస్కరించ లేదు; పదవిని చేజేతులా విడిచి పెట్టవలసి వస్తే అందుకు ఆయన వెనుదీయనూ లేదు. ఈ విషయంలో ఆయనకు సాటిరాగలవారు దేశం మొత్తం మీద బహు కొద్ది మంది మాత్రమే ఉన్నారు.

లోనో ఒకనాడు శ్రీ సంజీవరెడ్డి నాతో పలికిన పలుకులు నాకు ఎన్నటికీ మరపురానట్టివి. "నేను ముఖ్యమంత్రిగా ఉన్నాను, కాంగ్రెసు అధ్యక్షునిగా ఉన్నాను, కేంద్రంలో మంత్రిగా ఉన్నాను, లోకసభకు స్పీకర్‌గా ఉన్నాను. ఈ పదవి చాలదన్నట్టు, ఇప్పుడు నేను ఇందిరా గాంధీకి ఎందుకు తల వంచాలి? నేను రైతుబిడ్డను. ఊరు వెళ్ళి నా పొలాలను పండించుకొంటాను. స్వేచ్ఛగా, శాంతంగా, సంతృప్తిగా జీవిస్తాను. లేకపోతే బ్రతుకే లేదన్న నమ్మకం నాకు ఏ కోణంలో లేదు. పైగా, ప్రజలకు ఇప్పుడు నా సేవలో అవసరం ఉన్నట్టు తోచడం లేదు. అట్టి అవసరం వారికేర్పడితే వారే తిరిగి నన్ను పిలుస్తారు" అని ప్రశాంత గంభీరస్వరంతో ఆయన పలికిన పలుకులు ఈనాటికి ఎంతగా నిజమైనవో ఇక్కడ వివరించ నక్కరలేదు.

1969 లో పరాజయం చెందింది శ్రీ సంజీవరెడ్డి కాదు, శ్రీమతి ఇందిరా గాంధి. అబద్దాలకు, అక్రమాలకు పాల్పడి, తన అవినీతి చర్యలకు "ఆత్మ ప్రబోధం" అనే పెద్ద పేరు పెట్టి, నాడు ఆమె పట్టుదలను నెగ్గించుకొన్నది; తన పగ సాధించింది. అప్పటిలో "ఆహా! ఏమి బుద్ధి కుశలత! ఓహో! ఎంతటి రాజకీయ దురంధరత్వం!" అంటూ ఆమెను మెచ్చుకొన్న వారు సయితం ఇప్పుడు తమ పొరపాటును గుర్తించక తప్పదు. ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరి విషయంలోనైనా తాత్కాలిక విజయం అపజయానికే, అన్యాయానికే. కాని, చివరకి గెలిచేది సత్యమే! న్యాయమే! ఆరేళ్ళకు పైగా అజ్ఞాతవాసం చేయవలసి వచ్చినా, 1977లో రాష్ట్రపతి భవన్లో శ్రీ సంజీవరెడ్డి ప్రవేశం ఈ విషయాన్ని మరొక మారు రుజువు చేసింది.

(ఆంధ్రప్రభ వార పత్రిక 17-8-1977)

## కొందరు వృద్ధ ప్రధాన మంత్రులు

కామన్వెల్త్ ప్రధానుల సమావేశంలో ప్రస్తుతం (దీన్ని నేను వ్రాస్తున్నది 1977 జూన్ 13వ తేదీని) పాల్గొంటున్న ప్రధాన మంత్రులందరిలో వయోవృద్ధుడు మొరార్జీ దేశాయ్. అయితే, ఈ సంగతిని ఆయన కాదనవచ్చు. రెండు, మూడు నెలల క్రితం తాను ప్రధాన మంత్రి పదవికి వచ్చిన కొత్తలో ఒక పత్రికా విలేఖరి ఆయన వయస్సు ప్రసక్తి తీసుకురాగా, "నేను వృద్ధుడను కాను, యువకుడనే! నా వయస్సు 21 మాత్రమే!" అని ఛలోక్తిగా ఆయ నన్నాడు. ఆయన జన్మదినం 1896 ఫిబ్రవరి 29 వ తేదీ. ఫిబ్రవరి నెలకు 29 రోజులుండేది నాలుగేళ్ళ కొక్కతూరి. ఈ కారణాన మొరార్జీ ఇప్పటికి జరుపు కొన్నట్టివి 21 జన్మదినాలే. ఇందువల్లనే తన వయస్సు 21 సం॥రాలన్న ఛలోక్తిని ఆయన విసరగలిగాడు.

జన్మదినం ప్రకారం మొరార్జీ వయస్సు 21 సంవత్సరాలే కావచ్చుగాని, యదార్థానికి 82 సంవత్సరాలు. ఇంత పెద్ద వయస్సులో ప్రధాన మంత్రిపదవి బాధ్యతను స్వీకరించడానికి ప్రథమావశ్యకతలుగా ఆరోగ్యం కావాలి, ఆత్మ విశ్వాసం కావాలి. ఇవి మొరార్జీకి పుష్కలంగా ఉన్నాయి. ఈనాడు తనతోటి మంత్రులలో పెక్కుమందికంటె వయస్సుకు వారు తనకంటె ఎంతోకొంత చిన్నవారైనా - ఆయనే ఎక్కువ ఆరోగ్యంగా ఉన్నారు.



మొదటి నుంచి మొరార్జీది నియమబద్ధమైన జీవితం. మితంగా ఆయన భోజనం చేస్తాడు. పైగా, ఇటీవల ఆయన ఆహారం రోజుకు రెండుసార్లు పాలు పళ్ళుమాత్రమే. వేళ తప్పకుండా ఆయన నిద్రపోతాడు. శరీర వ్యాయామాన్ని ఆయన నిర్లక్ష్యం చేయడు. నస్యం, ధూమపానం వంటి స్వల్ప వ్యసనాలైనా ఆయనకు లేవు. మద్యం పేరు వింటేనే ఆయనకు కంపరం. అయినప్పుడు మొరార్జీ ఆరోగ్యం దివ్యంగా ఉండడంలో అబ్బురం లేదు.

అయితే, మరొక మాట కూడా ఇక్కడ చెప్పాలి. నియమబద్ధమైన జీవితాన్ని గడుపుతున్నా, ఆరోగ్యానికి నోచుకొనని వారు కొందరుంటారు; ఆరోగ్య నియమాలన్నింటిని ఉల్లంఘించినా (బహుశా పుటకతీరు బట్టి ఆరోగ్యానికి భంగం కలగని వారు కొందరుంటారు. ఈ రెండవ కోవకు చెందిన వారిలో నాకు వెంటనే స్ఫురణకు వస్తున్న ఒక ప్రధాన మంత్రి - విన్స్టన్ చర్చిల్. ఆయన సుష్టుగా భోజనం చేసేవాడు, మస్తుగా విస్కీతాగేవాడు. సాలుకు సగటున మూడువేల చుట్టలు కాల్చేవాడు. అవి కొద్దిపాటి చుట్టలైనా కావు - జానెడు, మూరెడు చుట్టలు! కామన్సు సభా భవనం ప్రధాన ద్వారపాలకుని వద్ద సభ్యుల వినియోగార్థం తరతరాల నుంచి ఆనవాయితీగా ఉంటున్న పొడుం డబ్బీ నుంచి ఒక చిటిక పొడుం తీసుకువచ్చి ముక్కుకోలల్లో దట్టించకుండా బయటికి నడిచిన పాపాన ఆయన ఎన్నడూ పోలేదు. నిద్రకు ఆయనకు ఒక వేళాపాళా ఉండేది కాదు. పగలు సగానికి పైగా నిద్రపోయేవాడు, భళ్ళున తెల్లవారే వరకు పనిచేస్తూ ఉండేవాడు. అయితే, ఒక సూత్రాన్ని మాత్రం ఆయన పాటిస్తూ ఉండేవాడట. దీన్ని ఆయన స్వయంగా బయటపెట్టాడు. కూర్చోగలిగితే ఆయన నిలబడేవాడు కాదట. నడుం వాల్చగలిగితే కూర్చునేవాడు కాదట.

ఆరోగ్యనియమాల విషయంలో చర్చిల్, మొరార్జీల దారులు చెరొకటి కాగా, ఆత్మ విశ్వాసం విషయంలో వారిద్దరు ఒకరికొకరు ఎంతమాత్రం తీసిపోరు. కొన్నేళ్ళ పాటు ఉభయులు రాజకీయంగా అజ్ఞాతవాసం చేసిన వారే. అయితే, ఏనాటికో ఒక నాటికి ప్రధాన మంత్రి పదవిని చేపట్టగలమన్న నిండు విశ్వాసాన్ని వారెన్నడు విడనాడలేదు. చర్చిల్ విషయంలో ఈ విశ్వాసం ఆయన 66వ యేట నిజమైంది. మొరార్జీ అందుకోసం తన 82వ యేడు కొరకు వేచి ఉండవలసి వచ్చింది. ద్వితీయ ప్రపంచ యుద్ధానికి ముందు చర్చిల్కు గతం తప్ప భవిష్యత్తు లేదన్న వారున్నారు. 1969 లో ఉప ప్రధాని పదవి నుంచి మొరార్జీ తప్పుకొనవలసిన పరిస్థితి ఇందిరాగాంధి కల్పించిన మీదట మొరార్జీ కథ (రాజకీయాలకు సంబంధించినంతవరకు) ముగిసిపోయినట్టు పలికిన వారున్నారు. ఇవి అబద్ధపు జోస్యాలని ఉభయులు సమానంగా నిరూపించారు.

వృద్ధాప్యంలో ప్రధానమంత్రు లయిన వారు చర్చిల్, మొరార్జీలు మాత్రమే కారు, మరి కొందరు కూడా ఉన్నారు. దేశదేశాలకు చెందిన వీరందరి పేర్లను ప్రత్యేక పరిశోధన లేకుండా నేను చెప్పలేను కాని, నాకు

జ్ఞాపకం ఉన్నంతవరకు క్రితం శతాబ్దంలో డిజ్రేలి బ్రిటిష్ ప్రధాన మంత్రి కాగలిగింది తన 64వ ఏట, పామర్దన్ తన 71వ ఏట, గ్లాస్టన్ మొత్తం నాలుగు సార్లు ప్రధానికాగా, చివరిసారి ఆ పదవిని ఆయన స్వీకరించింది తన 83వ ఏట. పోతే ఈ శతాబ్దిలో పశ్చిమ జర్మనీ ఛాన్సలర్ యాడ్ నోవర్ ఎన్నికైంది తన 73వ ఏట. వీరిలో పామర్దన్ తో మొరార్జీకి రెండు పోలికలున్నాయి. ఒక పోలిక నిష్కర్షగా మాటలాడ్డం, నిష్కర్షగా వ్యవహరించడం. మరొకటి తమ నిష్కర్ష ప్రవృత్తి కారణంగా తమ పదవులను తాత్కాలికంగా కోల్పోవడం. బ్రిటీష్ విదేశాంగ మంత్రిగా "ఖబడ్దార్ !" అనే ధోరణిని అన్యదేశాల పట్ల పామర్దన్ అవలంబించే వాడు. దీన్ని మరి సహించలేక 1851లో నాటి ప్రధాని లార్డ్ జాన్ రస్సెల్ ఆయనను బర్తరఫ్ చేశాడు. మొరార్జీని 1969 లో ఇందిరా గాంధి బర్తరఫ్ చేయలేదు గాని, తన ఉపప్రధాని పదవికి రాజీనామా చేయకపోతే, ఆయన తన ఆత్మగౌరవాన్ని కాపాడుకొనలేని పరిస్థితి కల్పించింది. బర్తరఫ్ తర్వాత పామరన్కు రాజకీయంగా మరి భవిష్యత్తు లేదని అనిపించినా, 1855లో ప్రధాన మంత్రి పదవికి వచ్చి, 1865 వరకు దానిలో ఆయనున్నాడు. మధ్యలో ఒకసారి ఆ పదవిని ఆయన కోల్పోయినా, అది ఏడాదిపై కొద్ది నెలలు పాటు మాత్రమే.

రెండవసారి (తన 75వ ఏట) ప్రధాని పదవిని స్వీకరించిన పామర్దన్ దాన్ని తన జీవితాంతం వరకు • 1784 వరకు - నిర్వహించాడు. అయితే విదేశాంగ మంత్రిగా తెచ్చుకున్నంత పేరును ప్రధాన మంత్రిగా ఆయన తెచ్చుకోలేకపోయాడు. నిజానికి చరిత్రలో ఆయన పేరు నిలిచింది విదేశాంగ మంత్రిగానే; ప్రధాన మంత్రిగా కాదు. కొందరు ద్వితీయ స్థానంలో రాణించినంతగా ప్రథమస్థానంలో రాణించలేరు.

రాజకీయరంగంలో ప్రథమ స్థానం అనేక సందర్భాలలో ప్రజ్ఞాప్రాభవాలలోనేమి, శక్తియుక్తులలో నేమి, కీర్తి ప్రతిష్ఠలలో నేమి అగ్రస్థానంలో నిలిచిన వారికి కాక, అన్యునికి దక్కడం కద్దు. ఒక పార్టీలో హేమాహేమీలు ఇద్ద రున్నారనుకోండి. వారిద్దరిలో ఒకరిని త్రోసిపుచ్చడానికి వీలులేకపోతే, లేదా వారిద్దరి పట్ల పార్టీ సభ్యులకు ఈర్యా భయాలు సమానంగా ఉంటే తమలోని ఒక అసమర్ధునికి, ఒక అనామకునికీ నాయకత్వాన్ని కట్టబెట్టడం జరుగుతుంది. కొంతవరకు ఇట్టి పరిస్థితులలోనే ఇందిరాగాంధి 1966లో ఇండియాకు ప్రధానమంత్రి కాగలిగింది. కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ నాయకత్వానికి ఆమె పేరును కామరాజ్ ప్రతిపాదించినప్పుడు - "ఇంతకంటె ఘోరం ఉండబోదు సుమీ!" అని ఆయనను హెచ్చరించిన ప్రముఖులలో ఒకరి పేరును నేను బయట పెడితే మీరు నమ్మకపోవచ్చు. మీరు నమ్మినా, నమ్మకపోయినా ఆ ప్రముఖుడు వి.కె. కృష్ణమీనన్. సన్నిహిత పరిచయం ద్వారా ఇందిర స్వభావాన్ని అప్పటికే పూర్తిగా ఆకళింపు చేసుకున్నవాడు కాబట్టే కృష్ణమీనన్ ఆ హెచ్చరికను చేసి ఉండాలి.

ఇతర మంత్రి పదవుల పిమ్మట 1827లో నాలుగు నెలలు మాత్రం బ్రిటన్కు ప్రధానిగా ఉన్న జార్జి కానింగ్ నిశిత మేధావంతుడు, మహావక్త, వ్యంగ్య కవితలో ఘటికుడు, సమయస్ఫూర్తిలో సాటిలేనివాడు - ఇట్టి గుణగణాల మధ్య ఆయనలో అల్పత్వం విశేషంగా ఉండేదట. కానింగ్ గుణగణాలలో దాదాపు ఏవీ తనకు లేకపోయినా, ఇందిరా గాంధిలో అల్పత్వం విశేషంగా ఉన్నట్టు (ఈనాటికీ ఆమెను తమ మహానాయకురాలిగా కీర్తిస్తున్న కాంగ్రెసు వారిని మినహాయిస్తే) మన దేశ ప్రజలు తెలుసుకో గలిగారు!

అన్నట్టు, ఆరు పదులైనా నిండక ముందే నేలపై నూకలు నిండి వుండక పోతే, నాలుగు నెలలపాటు కాక, ఇందిరా గాంధి వలె కానింగ్ కూడా పదకొండు సంవత్సరాలపాటు ప్రధానిగా కొనసాగి ఉండేవాడేమో!

పోతే, మొరార్జీకి గ్లాడ్‌స్టన్‌తో కూడా రెండు దగ్గరి పోలిక లున్నాయి. వ్యక్తిగత జీవితంలో నేమి, రాజకీయ జీవితంలో నేమి గ్లాస్టన్ (మొరార్జీ చేస్తున్నట్టుగా) నైతికపు విలువలకు అధిక ప్రాధాన్యమిచ్చేవాడు. అయినా, విక్టోరియా సామ్రాజ్ఞికి ఆయనంటే సదభిప్రాయం ఉండేది కాదు. తనను కుమార్తెవలె చూచుకొనే ప్రధాని మెల్బర్న్ పట్ల ఆమెకు ప్రేమ గౌరవాలుండేవి; తనను ముఖస్తుతి చేయడమే కాకుండా, ఇండియాకు చక్రవర్తినిగా పట్టాభిషేకం చేయడం ద్వారా తనకు సామ్రాజ్ఞి ప్రతిపత్తిని కల్పించిన ప్రధాని డిజ్రేలిపట్ల ఆమెకు ఆదరాభిమానా లుండేవి. కాగా, ప్రధాని గ్లాస్టన్ అంటే "తప్పనిసరి పీడ" గానే ఆమె భావించేది. "బహిరంగ సభలో ధర్మోపన్యాసం చేస్తున్న ధోరణిలో నాతో ఈయన మాట్లాడుతాడు" అని విసుగుదల చూపించేది. మన శ్రీమతి ఇందిరా గాంధీకి మొరార్జీ అంటే ఇదే విధంగా సదభిప్రాయంలేదు. పైగా, తన పదవికి ఎప్పటికైనా ఆయన వల్ల ముప్పు రావచ్చునని భయంకూడా ఉండేది. అందువల్లనే ఎమర్జెన్సీ పేరుతో 1975 జూన్ 25వ తేదీ అర్ధరాత్రి వేళ మొరార్జీని అరెస్టు చేయించి, పందొమ్మిది నెలల తర్వాత గాని విడిచి పెట్టించలేదు. అప్పుడైనా, ఎన్నికలలో మొరార్జీ గెలవగల అవకాశం స్వల్పమన్న భరోసాతోనే!

ఏదైనా ఒక ప్రభుత్వంతో విసుగుచెందినప్పుడు, ఆ ప్రభుత్వ నాయకత్వం పట్ల జుగుప్స పుట్టినప్పుడు, ఆ ప్రభుత్వానికి, దాని నాయకత్వానికి పూర్తిగా భిన్నమైన దానివైపు ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు మొగ్గుతారు. ఇందిరాగాంధి పదకొండు సంవత్సరాల పరిపాలనలో దేశంలో అవినీతి పెరిగింది, అన్యాయం పెరిగింది, ఆశ్రిత పక్షపాతం పెరిగింది, నైచ్యం పెరిగింది, నిరంకుశత పెరిగింది, నిలువు దోపిడి పెరిగింది. జీవిత రంగాలన్నింటిలో నైతికపు విలువలు హీనాతి హీనస్థితికి దిగజారిపోయాయి. అందువల్లనే నైతికపు విలువలకు ప్రత్యేక ప్రాధాన్యమిచ్చే మొరార్జీని ప్రధాన మంత్రి పదవికి ప్రజాళి ఆహ్వానించింది. ఒకప్పుడు "మోరార్జీ" అంటూ ఆయనను ఆక్షేపించిన వారు సయితం ప్రస్తుతం ఆయననుంచి ఎంతో ఆశిస్తున్నారు. నైతికపు విలువలను తిరిగి దేశంలో ఏ మేరకు పునరుద్ధరించగలడో ఆ మేరకే మొరార్జీకి, ఆయన ప్రభుత్వానికి చరిత్రలో స్థానం లభిస్తుంది.

పట్టుతప్ప విడుపులేని వాడని మొరార్జీకి ఒకప్పుడు చెడ్డ పేరు ఉండేది. యాడ్నోవర్కు సయితం ఒకప్పుడు సరిగా ఇట్టి పేరే ఉండేది. హిట్లర్ జెయిల్ లో పెట్టిన తర్వాత, ఇతర హింసలను పెట్టిన తర్వాత, యాడ్నోవర్ ప్రవృత్తిలో పెద్ద మార్పు వచ్చింది. ఇటీవలి కారాగారవాసం కఠినానుభవం తర్వాత మొరార్జీ స్వభావంలో సయితం ఎన్నదగు మార్పు వచ్చినట్టు కనబడుతున్నది. హిట్లర్ పరిపాలనలో ధ్వంసమై పోయిన జర్మనీని యాడ్నోవర్ సముద్ధరించినట్టు ఇందిర హయాంలో హీనస్థితికి దిగజారిపోయిన మన దేశాన్ని మొరార్జీ సముద్ధరించగలడన్న ఆశ ఎంతవరకు నిజం కాగలదో వెంటనే చెప్పలేము. ఇందుకు కనీసం ఒకటి, రెండు సంవత్సరాలైనా వేచిచూడాలి.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక వ్యాసం 6-7-1977)

## శ్రీ జయప్రకాశ్ నారాయణ్



దాపరికం లేకుండ మనసులో మాట చెప్పాలంటే జయప్రకాశ్ నారాయణ్ అంటే ఇదివరలో నాకు పెద్ద గౌరవంలేదు. ఆదిలో ఆయన మార్క్సిస్టు, అటుపిమ్మట గాంధేయవాది. ఒకప్పుడు ఆయన భౌతికవాది, ఇప్పుడేమో ఈశ్వరవాది. ప్రారంభంలో ఆయన పారిశ్రామిక విప్లవాభిమాని, తర్వాత దానికి ప్రబల విరోధి. రాజ్యాధికారంతో ఎవరైనా పరిష్కరించగలిగినవి కొన్ని సమస్యలే, వాటినైనా పాక్షికంగానే. కాని, రాజ్యాధికారాన్ని దోయడం నేల విడిచి సాము చేయడం. జయప్రకాశ్ ఆ పని చేశాడు. ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్థంభాలు రెండు, లేదా మూడు, నాలుగు రాజకీయ పక్షాలు. తాను పూర్తిగా ప్రజాస్వామ్యవాది. ప్రజాస్వామ్యం లేనిదే సోషలిజం లేదని విశ్వసిస్తున్న తాత్త్వికుడు. సోవియట్ వ్యవస్థ పట్ల ఆయన గౌరవాభిమానాలు క్రోధ విద్వేషాల కింద మారింది. దానిలో ప్రజాస్వామ్యానికి స్థానం లేదు కాబట్టి అది సోషలిజాన్ని సాధించలేదన్న తీర్మానానికి వచ్చిన మీదటనే. అయినా, రాజకీయ పక్షాలతో నిమిత్తంలేని ప్రజాస్వామ్యాన్ని - "పార్టీలెస్ డెమోక్రసీ" ని - నెలకొల్పవచ్చునని ఆయన పగటి కలలు కన్నాడు. పార్టీలెస్ డెమోక్రసీ అతి సులభంగా డిక్టేటర్షిప్ గా మారవచ్చు లేదా అస్థిరతకు, అరాచకానికి దారితీయవచ్చు. ఈ ప్రమాదాలను ఆయన గుర్తించలేదు. అయితే, ఆయనపట్ల ఇదివరలో నాకు పెద్దగా గౌరవం లేకపోవడానికి ఇట్టి కారణాలన్నీ ఒక ఎత్తుకాగా, వినోబాభావేకు ఆయన శిష్యుడు, భక్తుడు కావడం ఒక్కటీ ఒక ఎత్తు.

వినోబాను పెక్కుమంది రెండవ గాంధీగా ఉగ్గడించడం కద్దు. కొళ్ళాయి కట్టడం వరకు, ఉపవాసాలు చేయడం వరకు, మౌనవ్రతాన్ని పాటించడం వరకు, ప్రార్థనలు జరపడం వరకు, అహింసా మంత్రాన్ని జపించడం వరకు వినోబా నిజంగానే రెండవ గాంధీ. కాని, స్వేచ్ఛానురక్తిలో కాదు, ధర్మాభినివేశంలో కాదు, దురాగతాల ప్రతిఘటనలో కాదు. ఎక్కడ, ఎవరికి, ఏ విధమైన అన్యాయం జరిగినా, గాంధీకి అది దుస్సహంగా తోచేది. దాన్ని ప్రతిఘటించడానికి ఆయన తహతహలాడేవాడు. వినోబాలో ఆ తహతహ లేదు కాబట్టే ఇందిరాగాంధీని, ఆమె నియంతృత్వాన్ని ఆయన సమర్థించాడు. ఎమర్జెన్సీ ప్రకటనతో నవభారత చరిత్రలో "అనుశాసనిక పర్వం".

ప్రారంభమైనట్లు ఆయన ప్రవచించాడు. "తమ ప్రవచనాన్ని మరికొంత వివరించండి, స్వామీ! అని ఒక శిష్య పరమాణువు అభ్యర్థించగా, క్రమశిక్షణ యుగంలో దేశం పాదం పెడుతుంది" అని సెలవిచ్చాడు. లక్షన్నర, రెండు లక్షల మందిని జెయిళ్ళలో పెట్టడం క్రమశిక్షణ. వారిలో కొన్ని వేలమందిని చిత్రహింసలు పెట్టడం క్రమశిక్షణ, పౌరసత్వాలన్నింటిని ఆహరించడం క్రమశిక్షణ, ప్రజలలో భయవిహ్వలత్వాన్ని వ్యాపింప చేయడం క్రమశిక్షణ, అధికార దుర్వినియోగంతో దేశాన్ని దోచుకొనడం క్రమశిక్షణ! ఇదే మన రెండవ గాంధీ ప్రవచనం ప్రకారం "అనుశాసనిక పర్వం"!


ఇందిరాగాంధీ నియంతృత్వంపై ఆమోద ముద్రను వేసి, ఆమెను ఇంతగా ఆశీర్వదించిన వినోబాయే ఆమె పరాజయం చెందగానే, ఆమె నిరంకుశ ప్రభుత్వం పతనం చెందగానే "ఆనందం, ఆనందం, బ్రహ్మానందం" అంటూ ఏదో పాతపాట పాడాడు! పూర్వ యుగాలలో రాజపురోహితులైనా ఇంత తేలికగా ప్లేటు ఫిరాయించేవారు కారేమో! రామమనోహర్ లోహియా ఉత్తినే అనలేదు.

ఈ సర్కారీ సాధుకు జయప్రకాశ్ నారాయణ్ శిష్యుడు, భక్తుడు కావడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. భూదానం, గ్రామదానం, శ్రమదానం, సంపత్తిదానం, జీవనదానం మొదలైన వాటిని స్వీకరిస్తూ, ప్రాంతం నుంచి ప్రాంతానికి పాదయాత్ర చేయడంతో ప్రపంచ సముద్ధరణకే తానొక నవమార్గాన్ని చూపుతున్నట్టు భ్రమపడిన రాజపురోహితుని సేవలో దాదాపు రెండు దశాబ్దాలపాటు జయప్రకాశ్ తన జీవితాన్ని వృథా చేయడం నాకు మరింత విస్మయాన్ని కలిగించింది. వినోబా విప్లవం అంకెల ఆర్భాటమని తేలిపోయిన తర్వాత కూడా ఆయన శుశ్రూషను జయప్రకాశ్ మానకపోవడం వల్లనే ఆయనను ఇదివరలో నేను పెద్దగా గౌరవించలేకపోయాను. అయితే, ఇదే సమయంలో ఆయన ప్రజ్ఞా ప్రాభవాలు, ఆయన స్వాతంత్ర్య ప్రియత్వం, ఆయన మానవతా దృక్పథం, ఆయన ధర్మాభినివేశం, నవప్రపంచంలో మానవ సంఘం నిర్మాణానికి ఆ సంఘంలో ఒక నవమానవ సృష్టికి ఆయన తపన ఆధునిక యుగానికి మరి అక్కరకు రాకుండా పోగలవా అన్న భయ సందేహాలు తరచు నాకు కలగకపోలేదు. ఇవి

ఇవి నిష్కారణమైన భయ సందేహాలన్న సంగతిని నేడు ధ్రువపరచుకున్నది వినోబా సమర్థించక పోయినా, అంతటితోనైనా ఆగక, మౌన నటనద్వారా కొంత విముఖత్వాన్ని చూపించినా, నానాటికి ప్రబలుతున్న ఇందిరా గాంధి నియంతృత్వ ధోరణులను నిరూపించడానికి జయప్రకాశ్ ముందుకు వచ్చినప్పుడే. అప్పటికి ఆయన వయస్సు ఏడు పదులకు పైగా, ఆరోగ్య మేమో అంతంత మాత్రం.' అయినా, ధర్మాభినివేశంతో రంగంలో నిలిచాడు, యువకులను ముందుకు నడిపి "ఈయన ఫాసిస్టు, ఈయన అమెరికా డబ్బు తింటున్నాడు, ఇంత వృద్ధాప్యంలో ఈయనలో పదవీ దాహం పెరిగింది" మొదలైన అభాండాలను శ్రీమతి ఇందిరా గాంధి తనపై వేసినా, వాటిని ఆయన లెక్కచేయలేదు, బాష్పవాయువును తనపై ప్రయోగించినా ఆయన సరకు చేయలేదు, లాఠీలతో తనను మోదినా వెనుదీయలేదు, అర్థరాత్రివేళ తనను అరెస్టు చేసినా ఖాతరు చేయలేదు, నిర్బంధంలో ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నా లక్ష్యపెట్టలేదు. మృత్యువును సైతం ధిక్కరించి, ఏకాగ్రతతో మహారథికుని వలె పోరాడి, దేశానికి రెండవసారి ఆయన విముక్తిని సాధించాడు. దేశం నుంచి ప్రజాస్వామ్య విలుప్తి ప్రమాదాన్ని కొద్దిలో తప్పించాడు. ఈ ప్రయత్నంలో ఒకవేళ ఆయన విఫలుడై ఉన్నా ఆయనపట్ల నాకు గౌరవం పెరిగి ఉండేది. ఒక సర్వోత్తమ కృషిలో సాఫల్య వైఫల్యాలు ప్రాముఖ్యం కావు. ఆ పనిలో ఏకాగ్రతే ముఖ్యం. అవసరమైతే ఆత్మాహుతిని పోలిన అంతిమ త్యాగానికి సయితం సంసిద్ధతను ప్రదర్శించడమే ముఖ్యం వరకు ఎదిగింది.

ఆ క్రితం వారానికి జయప్రకాశ్ పట్ల నాలో చాలా వరకు పెరిగిన గౌరవం ఈ వారంలో చాలాచాలా ఈ ఒక్క వారంలోనే ఇంత మార్పు రావడానికి కారణం ఆస్ట్రేలియనులు వ్రాసిన ఆయన జీవిత చరిత్రను నేను చదవడమే. దాన్ని వ్రాసిన వారు యాలెన్, బెండీస్కార్ఫ్ దంపతులు, దానిపేరు "జె.పి. హిజ్ బయాగ్రఫీ". దీన్ని

వారు 1975 ప్రారంభంలోనే పూర్తి చేశారు. అయితే దాని ప్రచురణ ఆ సంవత్సరంలో ఎమర్జెన్సీ ప్రకటనకు కొంచెం ముందుగానో, వెనుకగానో ఎమర్జెన్సీ కాలంలో జరిగిన అకృత్యాలలో జయప్రకాశ్ రచనలను లేదా జయప్రకాశ్పై రచనలను ప్రచురించినా, విక్రయించినా దాన్ని "అమిత్ర చర్య"గా పరిగణించగలమని బెదిరించడం. 1975 సెప్టెంబర్ రెండవ వారంలో నేను అమెరికా నుంచి తిరిగి వస్తూ న్యూఢిల్లీలో ఒకటి రెండు రోజులు ఆగినప్పుడు, ఒక సుప్రసిద్ధ పుస్తక విక్రేత వీలైనంతగా గొంతు తగ్గించి నా చెవిలో ఊదిన మాట ఇదే!




ఎమర్జెన్సీ తొలగిన మీదటనే బయటికి వచ్చింది కాబట్టి స్కార్ఫ్ దంపతులు వ్రాసిన జయప్రకాశ్ జీవిత చరిత్రను ఈ వారంలోనే నేను చదవడం తటస్థించింది. దానిలోని ప్రధానాంశాలు జె.పి. జీవితంలోని ముఖ్యాంశాలని నా తాత్పర్యం - ఇంతకు ముందుగానే నాకు తెలుసు. కాగా, కొత్తగా నేను తెలుసుకున్నట్టివి ఆయన విశిష్ట వ్యక్తిత్వంపై, విలక్షణ ప్రవృత్తిపై వెలుగును ప్రసరింపజేయగల కొన్ని కథలను, గాథలను మాత్రమే.

ప్రతి అసాధారణ వ్యక్తి జీవితంలో కొన్ని పరీక్షా సమయాలు వస్తాయి, విషమ ఘట్టాలు వస్తాయి. అప్పుడతని ప్రవర్తన ధీరోదాత్తమైనదే కాకపోతే, అతడు అసాధారణమైన వ్యక్తి కానేకాడు. అయితే, అతడి అంతరాంతరాలను మనకు విప్పి చూపించగలిగేవి, అతడిలోని మానవతను మనకు సాక్షాత్కరింప జేయగలిగేవి అతడి దైనందిన జీవితంలోని ఏవో కొన్ని సామాన్య సంఘటనలే. ఇట్టి వాటిని ఇంగ్లీషు భాషలో 'హ్యూమన్ ఇంటరెస్ట్ స్టోరీస్' అంటారు. ఇవి స్కార్ఫ్ దంపతుల గ్రంథంలో అనేకం ఉన్నాయి. (అన్నట్టు ఇది ఓరియంట్ లాంగ్మన్ ప్రచురణ). ఆ కథలలో గాథలలో మచ్చుకు మూడు, నాల్గింటిని మాత్రం మీకు వినిపిస్తాను.

ఒకనాడు పాట్నాలో జయప్రకాశ్ నివాసానికి కాబూలీ చెప్పుల జతలు అమ్ముకొనడానికి ఒక అబ్బి వచ్చాడు. అతడి వాలకాన్ని చూస్తే, కాళ్ళ తిప్పట తప్ప ఆనాటికి బేరం బెండవిత్తులు ఏమీ లేనట్టు కనపడింది. అతడిని చూచి జాలిపడిన జయప్రకాశ్ తనకోసం ఒక చెప్పుల జత కొన్నాడు. తన మిత్రుడు గంగాశరన్ సిన్హాకోసం మరొక జత కొన్నాడు. "నాకు కాబూలీ చెప్పులు నచ్చ"వని సిన్హా ఎంత మొత్తుకున్నా వినిపించుకోలేదు. తర్వాత ఒక వారమైనా గిర్రున తిరిగి రాకముందే - "ఇంటిలో ఎక్కడ చూచినా చెప్పుల జతలే దొర్లుతున్నాయి! ఇన్ని దేనికి?" అంటూ ఆయన చికాకుపడ్డాడు. దారివెంట పోతున్న పేదా బిక్కినీ కేకవేసి, "ఇవి తీసుకువెళ్లి తొడుక్కోండి" అంటూ ఆరేడు జతలను పంచిపెట్టాడు!

సభలకు, సమావేశాలకు బయల్దేరి వెళ్లడానికి ముందు భార్య ప్రభావతితో "ఈ స్టౌ దేనికి? ఈ టిఫిన్ కారియర్ దేనికి? ఈ పెట్టె దేనికి? ఆ పక్కచుట్ట దేనికి? ఎంత తక్కువ సామానుతో ప్రయాణంచేస్తే అంత సులువని

ఎన్నిసార్లు చెప్పినా నీ చాదస్తం పోనివ్వవ్!" అని జయప్రకాశ్ అనేవాడు. కాని తీరా రైలుప్రయాణంలో మంచి టీ దొరక్కపోయినా, మంచి భోజనం అమరకపోయినా, "స్టౌ తెచ్చుకుంటే బాగుండేది సుమీ!" అంటూ తన తప్పు అచ్చుకొంటూ ఉండేవాడు.




ఒంటరిగా ప్రయాణాలు చేయవలసి వస్తే, ఇక సరేసరి! టిక్కెట్టు కొనడానికి డబ్బులు లేక, దాన్ని కొనకుండానే రైలెక్కడం, టిక్కెట్టు కలెక్టరుకు తన చేతి గడియారాన్ని కుదువబెట్టడం, ప్రయాణం మధ్యలో ఏదైనా ప్లాట్ ఫారమ్ పై మిత్రులెవరైనా కనబడితే, వారివద్ద పుచ్చుకున్న డబ్బులతో గడియారాన్ని విడిపించుకొనడం ఇది తరచు జరుగుతూ ఉండేది. ఈ సంగతి ప్రభావతికి తెలుసు. అప్పటిలో కొన్ని సంవత్సరాలపాటు జయప్రకాశ్ కలసి ఉన్న గంగాబాబుకు సయితం తెలుసు. అందువల్ల తమకు ఏమాత్రం వీలున్నా వారిద్దరిలో కనీసం ఒకరైనా జయప్రకాశ్ వెంట ప్రయాణం చేస్తూ ఉండేవారు. ఒక సంవత్సరం వారు ముగ్గురు విశ్రాంతి నిమిత్తం పాట్నాకు అరవై మైళ్లలోగల రాజగృహకు వెళ్ళాలనుకొన్నారు. కాని, తీరా ప్రయాణమైన తర్వాత జయప్రకాశ్ "ఒక అర్జెంటు పని నాకు తగిలింది. దాన్ని చూచుకొని రేపు వస్తాను" అంటూ తాను వెనక దిగబడిపోయాడు. తన మాట ప్రకారం మర్నాడు ఆయన బయల్దేరాడు గాని, టిక్కెట్టు డబ్బుల చిక్కు మళ్ళీ ఎదురైంది. బుకింగ్ క్లర్క్స వద్దకు వెళ్ళి గడియారాన్ని తాకట్టు పెట్టుకుని ఒక టికెట్టు ఇవ్వమన్నాడు. అతడందుకు సమ్మతించలేదు. ఈ తంతును అల్లంత దూరంనుంచి గమనించిన ఒక రైల్వే పోర్టరు చెంతకువచ్చి, "బాబూ! నా దగ్గర ఒక్క రూపాయి ఉంది. దీన్ని వాడుకోండి. తిరిగి వచ్చాక నాకు వాపసు చేయవచ్చులేండి!" అంటూ దాన్ని చేతిలో పెట్టాడు. దానితో పాట్నాకు, రాజగృహకు మధ్యలోగల ఒక జంక్షన్ వరకు మాత్రమే టికెట్టు కొనడం సాధ్యపడింది. అక్కడ మరొక బండిలోకి మారిన మీదట టిక్కెట్టు కలెక్టర్ పట్టివేశాడు "ఇదుగో నయ్యా! తాకట్టు పెట్టుకొ!" అంటూ చేతినుంచి గడియారాన్ని తీయబోగా - "దాన్ని తమ వద్దనే ఉంచండి, నాకు కావలసింది.

పెనాల్టీతో సహా ఛార్జీ" అంటూ అతడు మొరాయించాడు. "సరే రాజగృహలో చెల్లిస్తానులే!" అని జయప్రకాశ్ చెప్పగా చేతికి చిక్కిన పిట్ట ఎక్కడ తుర్రుమనగలదో అని అతడు చెంతనే కూర్చున్నాడు. తర్వాత కొద్ది సేపటికి రాజగృహ ప్లాట్ఫారంపై రైలు ఆగింది. అప్పటికి అరపూట నుంచి ఎదురు తెన్నులు కాస్తున్న ప్రభావతీ, గంగాబాబులు "వచ్చారు స్వామీ! సంతోషం" అంటూ స్వాగతం చెప్పారు. "మీ స్వాగతాన్ని కాసేపు అట్టి పెట్టి ఈయన చెరనుంచి నన్ను తక్షణం విడిపించండి" అంటూ టిక్కెట్టు కలెక్టరును చూపిస్తూ జయప్రకాశ్ కిల కిల నవ్వాడు.

గంగాబాబు వెంట ఉన్నా, ఒక ప్రయాణంలో చిక్కులు తప్పలేదు. ఆ సంవత్సరంలో లాహోరులో సోషలిస్టు మహాసభకు వెళ్ళాలి. "నా వల్ల కాదు, ఉభయుల రైలు ఖర్చులకోసం నీవే ఏవో తంటాలు పడాలి" అని జయప్రకాశ్ ముందుగానే గంగాబాబుకు చెప్పివేశాడు. ఆ తంటాలేవో ఆయన పడి, ఒక ప్రయాణానికి

(తిరుగు ప్రయాణానికి కాదు) సరిపడగలపాటి పైకాన్ని సంపాదించాడు. తీరా రేపు ప్రయాణమనగా ఇవ్వాళ ఎవరో జయప్రకాశ్ వద్దకు వచ్చి తమ పొయ్యిలో నుంచి పిల్లిలేచి మూడు రోజులైనట్టు ఏవేవో కష్టకథలల్లి చెప్పుకొన్నాడు. అంతట జయప్రకాశ్ "ఒకటి రెండు గంటల తర్వాత వస్తే, ఎంతో కొంత నేను సర్దుతానులే!" అని చెప్పి అతడిని పంపించాడు. ఈలోగా గంగాబాబు వద్దకు వెళ్ళి "మన రైలు ఖర్చుల పైకంలో నా సగం నా కివ్వరాదా?" అంటూదాన్ని గుంజుకొన్నాడు. ఆ మొత్తంతో తన వాగ్దానాన్ని చెల్లించుకున్నాడు. ఈ లోపల ప్రభావతిని "నేను చేసిన పని గంగాబాబుకు చెప్పవద్దు సుమీ! ఆయన నన్ను కసురుకుంటాడేమో! దారిలో ఎలాగో సర్దుబాటు చేసుకుంటాములే!" హెచ్చరించాడు. అయినా, ఎందుకైనా మంచిదని ఆమె గంగాబాబుతో జయప్రకాశ్ దానకర్ణత్వం ఉదంతాన్ని చెప్పనే చెప్పింది. దీన్ని పసికట్టని జయప్రకాశ్ టాంగాని పిలిపించి గంగాబాబుతో హుషారుగా మాట్లాడుతూ రైలు స్టేషనుకు చేరాడు. అక్కడ టాంగావాలాకు గంగా బాబు కిరాయి చెల్లించబోగా "ఇతడు మనకు తెలిసిన వాడేలే! ఇంటికి వెళ్ళితే ఇతడికి చెల్లించవలసినదాన్ని ప్రభావతి చెల్లిస్తుంది. నేను మన సామానులు ప్లాట్ఫారంపైకి పట్టించుకు వెడతాను. నీవేమో మనకు రెండు టికెట్లు కొని తీసుకురా!" అంటూ ఒక చిన్న నాటకం ఆడాడు. అది నాటకమని గంగాబాబుకు తెలుసు. కాని, తప్పేది ఏమున్నది? అందువల్ల ఉభయులకు తానే టికెట్లు కొనితెచ్చాడు.

ప్రయాణం కొన్ని గంటలు సాగిన తర్వాత "రెండు కప్పుల టీ తెప్పించరాదా?" అని జయప్రకాశ్ ముసిముసి నవ్వులతో అడిగాడు. కప్పులతో టీ ఆర్డరు చేయడానికి గంగాబాబు వద్ద ఒక రూపాయకు లోపుగానే ఉన్నది. అందువల్ల "చా! గరమ్ చా" అంటూ ప్లాట్ఫారంపై తిరుగుతున్న వాడిని పిలిచి మట్టి పిడతలలో అతడు అమ్ముతున్న రెండు పిడతల టీ కొన్నాడు. దాన్ని ఒక్క గుక్క తాగి, "అబ్బే! ఎంతమాత్రం రుచిగా లేదు" అని జయప్రకాశ్ పెదవి విరిచాడు. అంతట మరి నావద్ద మిగిలినవి నాలుగణాలే. ఇక మీవద్ద ఉన్న పైకాన్ని బైట పెట్టవలసిందే!" అని.

గంగాబాబు హెచ్చరించాడు. మరి లాభం లేదని అప్పుడు తనవద్ద ఏమీలేదని జయప్రకాశ్ చెప్పక తప్పలేదు. "ఎందువల్ల లేదో?" అంటూ గంగాబాబు చిరాకును నటించగా, పాట్నాలో జరిగిన కథను జయప్రకాశ్ వినిపించాడు.

"వాడు దొంగ వెధవ! వాడి కల్లబొల్లి మాటలను ఎందుకు నమ్మినట్టు?" అని గంగాబాబు నిగ్గదీయగా - "ఏమో నాకేమి తెలుసు. వాడు కంట తడిపెడితే చూడలేకపోయాను!" అంటు నీళ్ళు నమిలాడు.

ప్రభావతి టిఫిన్ కారియర్లో పెట్టి ఇచ్చిన భోజనాన్ని ఆ రాత్రి వారిద్దరూ భోంచేశారు. తాను చేసిన తప్పును ఒప్పుకున్నానన్న తృప్తితో జయప్రకాశ్ నిశ్చింతగా నిద్రపోయాడు! "రేపంతా ప్రయాణం చేయాలి. పస్తు తప్పదు కాబోలు" అనే చింతతో గంగాబాబుకు కంటిపై రెప్ప పడనేలేదు. మర్నాటి పొద్దున జయప్రకాశ్ - "గంగాబాబూ! మరి బ్రేక్ఫాస్ట్ మాటేమిటి?" అని చలాకీగా అడిగాడు. "చేతిలో మిగిలింది పావలా మాత్రం - ఇన్ని పళ్ళు కొనుక్కొని మంచినీళ్లు తాగవలసిందే!" అని గంగాబాబు తెగవేసి చెప్పాడు. "అబ్బే! అదేమిమాట?" అంటూ జయప్రకాశ్ ఎగ్స్, టోస్ట్, టీ వగైరాలను తమకు ఆర్డర్ చేశాడు. తమ పెట్టెలో ఒక

ప్రొఫెసర్ ఉంటే ఆయన కోసం మరొక బ్రేక్ఫాస్ట్ ఆర్డర్ చేశాడు. “మరి కాసేపటికల్లా వస్తుంది. అప్పుడు మనమేమి కావాలి?” అని గంగాబాబు లోపల ఎంతో భయపడుతూ కూర్చున్నాడు.

ఇంతలో ఒక స్టేషన్ వచ్చింది. ఆ స్టేషన్లో రామమనోహర్ లోహియా, పూర్ణిమా బెనర్జీ (లాహోర్ సభ కోసమే) రైలెక్కడానికి వచ్చారు. వారిద్దరిని జయప్రకాశ్ తమ పెట్టెలోకి ఆహ్వానించి, వారిద్దరికీ కూడా బ్రేక్ఫాస్ట్ ఆర్డరుచేశాడు. వారు దాన్ని తింటూ ఉండగా గంగాబాబు వైపుకు తిరిగి కన్ను గలిపి “మన చిక్కులు తొలగిపోయినట్లే!” అన్నాడు.

“ఏమి చిక్కులు?” అని పూర్ణిమ ఆశ్చర్యంగా అడిగింది.

“గంగాబాబు అనుమతిస్తే తప్ప వాటిని చెప్పడానికి వీలులేదు” అంటూ జయప్రకాశ్ పకపక నవ్వాడు.

బాలల ప్రవృత్తితో యోగుల ప్రవృత్తి జయప్రకాశ్లో ఇంతగా పెనవేసుకొని ఉన్నందునే ఆయన ఒక విశిష్ట వ్యక్తి, ఒక మహా మనీషి! (ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక వ్యాసం 15-6-1977)

## శ్రీ ఈశ్వరచంద్ర విద్యాసాగర్




ఎవరైనా తన వద్దకు వచ్చి ఈ బెనర్జీ, ఆ ఛటర్జీ, లేదా మరొక ముఖర్జీ తనను దూషించినట్టుగా చెప్పినప్పుడు ఈశ్వరచంద్ర విద్యాసాగర్ (1820-1881) ఆలోచనాముద్రతో కొన్ని క్షణాలపాటు మౌనం వహించేవాడట. తరవాత తల పంకిస్తూ “ఎంత ప్రయత్నించినా, ఆయన నన్ను దూషించడానికి కారణం తోచడం లేదు. నే నెన్నడు చిన్న మేలు - పెద్ద మేలు — ఆయనకు చేసిన పాపాన పోలేదే!" అనేవాడట. వెంటనే సంభాషణాధోరణిని మార్చివేసేవాడట. నా ద్వారా ఒకటి కాదు, రెండు కాదు, కొన్ని వేల - కొన్ని వందల - మేళ్ళు పొందిన ముగ్గురు మధ్య నాపై నిందలు వేస్తున్నారు నన్ను దుర్భాషలాడుతున్నారు. నాకు కీడు చేస్తున్నారు. విద్యాసాగర్ మహాపురుషుడు కాగా, నేనేమో అతిసామాన్య వ్యక్తిని అందువల్ల నాపట్ల కృతఘ్నంగా వర్తిస్తున్న వారిని నిర్లక్ష్యం చేయలేకపోతున్నాను. పైపెచ్చు, వారిని గురించి విశేషంగా ఆలోచిస్తున్నాను. క్షుద్రులను గురించి విశేషంగా ఆలోచిస్తే, వారి క్షుద్రత్వం మనకు కూడా ఎంతో కొంత తప్పక అంటుకొంటుంది. ఇట్టి ప్రమాదం కలదని తెలుసు కాబట్టి, నా ఆలోచనలను మహామహులకు మరల్చాలన్న దీక్షతో విద్యాసాగర్ జీవిత చరిత్రలను మూడింటిని వరుసగా తిరిగి చదివాను. వీటిలో మొదటిదాని ప్రచురణ 1896లో. దీన్ని రాసింది శ్రీ చరణ్ చక్రవర్తి. ఎంత ధర పెట్టినా, ఇది ప్రస్తుతం లభ్యం కాకపోవచ్చు; గ్రంథాలయాలలో సైతం ఇది లేకపోవచ్చు. అదృష్టం వల్ల పిఠాపురం మహారాజా శ్రీ రావు సూర్యారావు సంతకంతో ఉన్న ఒక ప్రతి పాతికేళ్ళనాడు మద్రాసు మూర్ మార్కెట్టులో ఒకే ఒక రూపాయికి నాకు దొరికింది. కాగా, రెండవ జీవిత చరిత్ర ప్రథమ ప్రచురణ 1902లో. దీని రచయిత

సుబలచంద్ర మిత్ర. రెండేళ్ళనాడు ఆశీష్ పబ్లిషర్స్ (న్యూఢిల్లీ - 110027) దీన్ని పునర్ముద్రించారు. దీని వెల నూరు రూపాయలు కాబట్టి, మన గ్రంథాలయాలు మాత్రమే దీనిని కొనగలవని అనుకోవచ్చు. పోతే, మూడవది సాహిత్య అకాదమీ (న్యూఢిల్లీ) ప్రచురణ. దీన్ని రాసిన హిరణ్మయ బెనర్జీకి ఆంగ్లేయంపై అధికారం తక్కువ, రచనా పాటవం మరింత తక్కువ. అయితే, దీని ధర రెండున్నర రూపాయలే. కావాలంటే ఎవరైనా దీన్ని సులభంగా సంపాదించుకోవచ్చు



విద్యాసాగర్ అంటే ఎవరని ఈనాడు మన "విద్యాధికులు" ఎవరైనా ప్రశ్నిస్తే, అందుకు నామట్టుకు నేను ఆశ్చర్యపడను. న్యూఢిల్లీ సాహిత్య అకాడమీ వారే నేను రాసిన 'వీరేశలింగం సంగ్రహ జీవిత చరిత్రను ప్రచురించినప్పుడు గుంటూరుకు చెందిన ఒక కాలేజీలోని సైన్స్ లెక్చరర్ (ఈయన ఎమ్.ఎస్ సి.) "ఎవడయ్యా - ఈ వీరేశలింగం?" అని ప్రశ్నించాడట. అయినప్పుడు విద్యాసాగర్ పేరైనా వినని "విద్యాధికులు" మరింత మంది ఉండవచ్చు! వీరి కోసం ఇక్కడ నేను విద్యాసాగర్ జీవిత చరిత్రను రాయబోవడం లేదు. కథలుగా చెప్పుకొంటే మన అల్పత్వానికి మనమే సిగ్గుపడవలసిన సంఘటనలు ఎన్నెన్నో ఆయన జీవితంలో ఉన్నాయి. వాటిలో కొన్నింటిని మాత్రం ఈ వారం మీకు నివేదిస్తాను.

కలకత్తా సంస్కృత కళాశాలకు ప్రిన్సిపల్గా పనిచేస్తున్న విద్యాసాగర్ ఒకనాడు హిందూ కాలేజి ప్రిన్సిపల్ మిస్టర్ కార్ వద్దకు ఏదో పనిపై వెళ్ళవలసి వచ్చింది. మరొక కాలేజి ప్రిన్సిపల్ తనను చూడ్డానికి వచ్చాడు గదా అని కార్ తన కుర్చీలో నుంచి లేవలేదు; "కూర్చోండి" అని మాటవరసకైనా అనలేదు. పైపెచ్చు, టేబుల్పై పెట్టి ఉంచిన తన కాళ్ళను కనీసం కిందికైనా దించలేదు. కుర్చీలో వాలి ఉన్నవాడు అదే ఫోజులో విద్యాసాగర్ తో ముక్తసరిగా నాలుగు మాటలు మాట్లాడి పంపించి వేశాడు. ఇది విద్యాసాగర్కు ఎంతో మనస్తాపం కలిగించింది. "ఇతడికి బుద్ధి చెప్పగల సావకాశం నాకు రాకపోదులే!" అని లోలోపల సంభావించాడు. అట్టి సావకాశం తరువాత కొద్దికాలానికి రానేవచ్చింది. సంస్కృత కళాశాలలో విద్యాసాగర్ను కలుసుకొని, ఆయనతో ఏదో సమస్యను మిస్టర్ కార్ చర్చించవలసిన అగత్యం కలిగింది. విద్యాసాగర్ ఆఫీసు బయటనుంచి అతడు తన విజిటింగ్ కార్డులోనికి పంపించాడు. వెంటనే విద్యాసాగర్ ఒక్క కుర్చీని మినహాయించి, తక్కినవాటిని తీసి వేయించాడు. కాళ్ళను టేబుల్పైకి చాచి, కుర్చీలో వాలి, సరిగా మిస్టర్ కార్ పెట్టిన ఫోజులోనే కూర్చున్నాడు. "మరి దొరవారు రావచ్చు" అని కబురు పెట్టాడు. లోనికి వచ్చిన మిస్టర్ కార్ ముందు తెల్లబోయాడు; వెంటనే కోపంతో అతడి ముఖం జేగురించింది. తాను వచ్చిన పనిని నిమిషాలపై ముగించుకొని, విసురుగా వెళ్ళిపోయాడు.

విద్యాసాగర్ తనను ఘోరావమానం చేసినట్టు ఎడ్యుకేషనల్ కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ మౌత్ పేర మరునాడు ఒక పెద్ద ఫిర్యాదు రాసి మిస్టర్ కార్ పంపించాడు. అందుపై "ఏమి జరిగింది?" విద్యాసాగర్ పంపించిన ప్రత్యుత్తరం సారాంశమిది:

అంటూ డాక్టర్ మౌత్ సంజాయిషీ కోరగా, "నాది అనాగరిక దేశం. ఆగంతకులను ఏ రీతిగా మర్యాద చేయవలెనో ఈ అనాగరికునికి ఎలా తెలుస్తుంది? మిస్టర్ కార్, నాగరిక దేశస్థుడు. అందువల్ల నాగరిక పద్ధతులను ఆయన నుంచి నేర్చుకొనడం నా విధిగా నేను భావించాను. నేను ఆయనను చూడ్డానికై వెళ్ళినప్పుడు, ఆయన నా పట్ల పాటించిన మర్యాదనే తు.చ. తప్పకుండా ఆయనపట్ల నేను పాటించాను. అయినా, ఆయన నాపై మీకు ఎందుకు ఫిర్యాదు చేయవలసి వచ్చిందో నాకు పాలుపోవడం లేదు".

ఈ ప్రత్యుత్తరానికి డాక్టర్ మౌత్ కడుపుబ్బ నవ్వుకొని, తన అనుచిత చర్యకు విచారం తెలుపు కొనవలసిందిగా మిస్టర్ కార్ విద్యాసాగర్ వద్దకు పంపించాడు.

ఆదిలో విద్యాసాగర్ను తండ్రివలె చూచుకొన్నా, బహుశా ఇక్కడి వాతావరణ ప్రభావం వలన జాత్యహంకారం క్రమంగా ప్రకోపించిన మీదట డబ్ల్యూ, గోర్డన్ యంగ్ (డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్స్ట్రక్షన్) విద్యాసాగర్ స్వతంత్ర వైఖరి పట్ల వైముఖ్యాన్ని పెంచుకున్నాడు. ఒక సందర్భంలో ఏదో పనిమీద హిందూ కాలేజి ప్రిన్సిపల్ వద్దకు వెళ్ళవలసిందిగా విద్యాసాగర్ను మిస్టర్ యంగ్ కోరాడు. అంతట "మనం కలిసి వెళ్ళడం మంచిది. లేకపోతే, ఆ పని జరగదు" అని విద్యాసాగర్ సూచించగా, "మీ రొక్కరే వెళ్ళి తీరాలి" అని యంగ్ గాండ్రించాడు. అయితే, ఒక కాగితం ముక్క ఇలా దయచేయించండి" అంటూ విద్యాసాగర్ దాన్ని అందుకుని, రాజీనామా రాసి, యంగ్ చేతిలో పెట్టాడు. "నేను మాత్రమే వెళ్ళి తీరవలసిన గరుజు మరి లేదు గదా!" అంటూ లేచి వెళ్ళిపోయాడు. నెలకు అయిదు వందల జీతాన్ని (ఇప్పుడది బహుశా నెలకు పదివేలతో సమానం కావచ్చు) తనకు తెస్తున్న ఉద్యోగాన్ని అంత తేలికగా విద్యాసాగర్ కాలదన్నుతాడని యంగ్ కలలోనైనా అనుకొని ఉండడు. ఆనాటి బెంగాల్ లెఫ్టినెంట్ గవర్నర్ సర్ ఫ్రెడ్రిక్ హాలిడేకు విద్యాసాగర్ పట్ల ప్రేమ గౌరవాలు విశేషంగా ఉండేవి. రాజీనామా ఉపసంహరించుకొన వలసిందిగా ఆయన ఎంత గట్టిగా చెప్పినా, జీతం డబ్బుల కోసం తన ఆత్మగౌరవాన్ని చంపుకొనడానికి విద్యాసాగర్ ఇచ్చగించలేదు.



విద్యాసాగర్తో ఒక గంట ముచ్చటించగలిగితే, దాన్ని ఒక మహద్భాగ్యంగా సర్ ఫ్రెడ్రిక్ భావించేవాడు. అందువల్ల వారం వారం ఏదో ఒక రోజున తనవద్దకు వస్తూ ఉండవలసిందిగా విద్యాసాగర్ను ఆయన కోరాడు. ఈ పిలుపు వచ్చినప్పుడు విద్యాసాగర్ మిత్రులు కొందరు "గవర్నమెంట్ హౌస్కు మీ ధోవతితో, మీ శాలువాతో, మీ చడావులతో వెళ్ళడం మర్యాద కాదు. మీరు కనీసం షర్ట్ అయినా వేసుకోరయ్యె! ఇది మరింత ఘోరం. కోటూ, బూటూ మీ కిష్టమైనా, కష్టమైనా - వేసుకు వెళ్ళవలసిందే!" అని సలహా చెప్పారు.

వారి సలహాలను నాలుగైదు వారాలపాటు విద్యాసాగర్ పాటించాడు. అటుపిమ్మట గవర్నర్తో "అయ్యా, తమ వద్దకు మరి రాలేనందకు మన్నించండి" అని చెప్పాడు. "ఎందువల్ల?" అని సర్ ఫ్రెడ్రిక్ నిగ్గదీయగా, "ఈ కోటూ, బూటూ కంపరాన్ని మరి నేను భరించలేను" అన్నాడు. అంతట సర్ ఫ్రెడ్రిక్ పకపక నవ్వి, "గవర్నమెంట్ హౌస్కు వచ్చినప్పుడు వేషధారణ లాంఛనాలు సామాన్యులకు గాని, మీకు కావు. మీ మామూలు దుస్తులతోనే మీరు వస్తూ ఉండండి" అన్నాడు.

పైకి మెలి తిరిగిన కొసలతో, ఎర్రటి రంగుతో కారు చవుక ధరకు బజారులో అమ్మే చడావులను విద్యాసాగర్ వాడుతూ ఉండేవాడు. ఈనాటికీ వాటికి బెంగాల్లో విద్యాసాగర్ చడావు"లని పేరు. యూరోపియన్ దుస్తులతో ఉన్న ఇద్దరు భారతీయ మిత్రులతో ఒకనాడు విద్యాసాగర్ ఏషియాటిక్ సొసైటీ లైబ్రరీలోకి ప్రవేశించబోగా, ఆయన తన చడావులను వాకిటిలో విడిచిపెట్టాలని దర్వాన్ పట్టుపట్టాడు. అందుకు కినిసి విద్యాసాగర్ గిర్రున వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు. అందుమీదట బూట్లపైన లేని ఆంక్షను చదవులపై ఎందుకు పెట్టాలని కలకత్తా పత్రికలలో పెద్ద గాలిదుమారం రేగింది. ముందు కొంతకాలంపాటు బెట్టుచేసినా, చిట్టచివరికి ఏషియాటిక్ సొసైటీ తన తప్పును దిద్దుకొనక తప్పలేదు.

పుస్తకాలంటే విద్యాసాగర్కు బిడ్డలపై కంటే ఎక్కువ మక్కువ. బెంగాలీ, సంస్కృతం, ఇంగ్లీషు పుస్తకాలను విశేషంగా ఆయన కొనేవాడు. అచ్చులో లేని పుస్తకాలకు అడిగిన మూల్యాన్ని చెల్లించేవాడు. పుస్తకాన్ని కొనగానే - అది పావలాకు, లేదా అర్ధకి కొన్న పుస్తకమైనా - రూపాయి, రెండు రూపాయలు ఖర్చుచేసి మోరాకో లెదర్ , గిల్ట్ లెటర్స్ తో బైండింగు చేయించేవాడు. దీన్ని చూసిన ఒక మిత్రుడు '-' మీ వన్నీ దండగమారి పనులే! దానిలో పసలేకపోతే, పైపై సింగారాలవల్ల పుస్తకం విలువ పెరుగుతుందా?" అన్నాడు. "నిజమే! కాని, మీరు గోచిపెట్టుకొంటే చాలదా? కింద ధోవతి దేనికి పైన శాలువా దేనికి?" అని విద్యాసాగర్ ప్రశ్నించగా, ఆ మానవుడు మరి నోరెత్తలేకపోయాడు.

ప్రేమిస్తే, విద్యాసాగర్ మనఃస్ఫూర్తిగా ప్రేమించేవాడు; విద్వేషిస్తే, మహాతీవ్రంగా విద్వేషించేవాడు. గౌరవించడంలో, ధిక్కరించడంలో తిరిగి ఆయన జీవిత సూత్రమిదే! అనగోరిన మాటను ముఖం మీదనే

ఆయన అనివేసేవాడు. అసహ్యంగా ప్రవర్తించిన వారితో తిరిగి ఎంతమాత్రం పొత్తు పెట్టుకొనేవాడు కాదు. ఈ విషయాలలో అగ్ర - నిమ్న, లేదా ధన - నిర్ధన, లేదా బలదుర్బల విభేదాలను ఆయన చేసేవాడు కాదు. ఇందువల్ల కావచ్చు - ఆయనకు ప్రాణమిత్రులతో పాటు పరమ శత్రువులు సైతం బహుళసంఖ్యలో ఉండేవారు.

ఓం ప్రథమంగా విద్యాసాగర్ వితంతు వివాహం జరిపించినప్పుడు ఆయనకు ఆర్థిక సహాయం చేస్తామని వధూవరులను ఆశీర్వదించడానికై స్వయంగా వస్తామని చెప్పిన వారిలో పరిణయ ముహూర్తం సమీపించిన కొలదీ చల్లగా సర్దుకొన్నవారు నూటికి దాదాపు తొంభై మంది. "ఈ మందలో ఈయన కూడా కలవబోతున్నాడా? ఈ సంగతిని ముందుగానే తెలుసుకొనడం ఎందుకైనా మంచి"దని రాజా రామమోహన్ రాయ్ కుమారుడు రామ్ ప్రసాద్ వద్దకు విద్యాసాగర్ వెళ్ళాడు. "మీరు తలపెట్టిన సదుద్యమానికి నా సంపూర్ణ సహాయం ఉంటుంది. మీకు వాగ్దానం చేసిన విరాళాన్ని - ఇదుగో - అందుకోండి. అయితే, నేను వివాహ మహోత్సవంలో పాల్గొనలేను. ఏవో నాచిక్కులు నాకున్నాయి. దయచేసి నన్ను అపార్థం చేసుకోవద్దు" అని రామ్ ప్రసాద్ అన్నాడు. తన చెవులను తానే నమ్మలేక, విద్యాసాగర్ కొంతసేపు నిశ్శబ్దంగా కూర్చున్నాడు. తర్వాత దిగ్గున లేచి, రామ్ ప్రసాద్ కుర్చీ వెనుకగా గోడపై గల రామమోహన్ రాయ్ చిత్రపటాన్ని వేలెత్తి చూపుతూ, "దాన్ని తీసి నేలకు కొట్టు - కొట్టవయ్యా - ! కొట్టు! - తక్షణం నేలకు కొట్టి బద్దలు కొట్టు!" అంటూ పట్టలేని కోపంతో చరచర వెళ్ళిపోయాడు. అంతే - తిరిగి రామ్ ప్రసాద్ ముఖాన్ని ఆయన పొరపాటుగానైనా చూడలేదు.

కోపం వస్తే పట్టలేనట్టే, దయ కలిగినా విద్యాసాగర్ పట్టగలిగేవాడు కాదు. ఏ కష్ట కథ విన్నా, ఏ విషాద దృశ్యాన్ని చూచినా, ఆయన కళ్ళవెంట జలజల నీళ్ళు రాలేవి. "ఆయన విద్యాసాగరుడు మాత్రమే కాదు, దయాసాగరుడు కూడా" అని గాంధీజీ పలికిన మాట నూటికి నూరుపాళ్ళు నిజం.

ఇప్పటి విలువల ప్రకారం విద్యాసాగర్ సంపాదన ఒక కోటి రూపాయలు కావచ్చు. అయినా, ఎప్పటికప్పుడు ఆయన అప్పులు చేస్తూనే ఉండేవాడు, వడ్డీలు చెల్లిస్తూనే ఉండేవాడు, పాత అప్పులను తీర్చడానికి కొత్త ప్రోనోట్లను వ్రాస్తూనే ఉండేవాడు. ఉద్యోగాన్ని వదలుకొన్న మీదట ఆయన సంపాదన తన ప్రెస్ మీదనే, పుస్తకాల మీదనే. ఆయన పుస్తకాలను పాఠ్య గ్రంథాల క్రింద విశేషంగా వాడుతూ ఉండేవారు, అవి పుష్కలంగా ఆదాయాన్ని తెస్తూ ఉండేవి.



కాని, రేపు చేతికి రాగల మొత్తాన్ని ఈనాడే ఆయన ఎవరికో వాగ్దానం చేసేవాడు. అది చేతికి రాకపోతే అప్పూ సప్పూ చేసి మాట నిలుపుకొనేవాడు. నెల నెల కనీసం ఒక వంద మందికి చిన్న పెద్ద మొత్తాలు ఆయన నుంచి మనియార్డర్ల రూపంలో వెడుతూ ఉండేవి. వాటిని పంపించే పనిని ఎవరికో ఒకతూరి అప్పగించగా, అతడు దగాచేశాడు. అటుపైన విద్యాసాగర్ స్వయంగా మనియార్డర్ ఫారాలు రాసేవాడు, స్వయంగా పోస్టాఫీసుకు వెళ్ళి వాటిని అందించేవాడు. కలకత్తా నుంచి ఎప్పుడు - ఎన్నిసార్లు - స్వగ్రామానికి వెళ్ళినా, అయిదారు వందల రూపాయలను (రూపాయి, అర్ధ, పావలా, అణా, అర్ధణా, పైసల రూపంలో) వెంటతీసుకు వెళ్ళేవాడు; పేదకూ బిక్కికీ పంచిపెట్టి చక్కా వచ్చేవాడు. "ఇంతగా ఈయన దానాలు చేస్తున్నాడు. ఈయన ఇంటిని దోస్తే కొన్ని వేలు దొరకవచ్చు" అని ఒకనాడు ఆయన స్వగ్రామంలోని ఇంటిలో దొంగలు పడ్డారు. కాని, వారికి దొరికింది దాదాపు ఏమీ లేదు!

మైకేల్ మధుసూదన్ దర్కు చేసినట్టు పదివేల రూపాయలకు పైగా విద్యాసాగర్ ఇతరులకు ఆర్థిక సహాయం చేసి ఉండకపోవచ్చు. కాని, ఆయన కొన్ని వేల మందికి చేదోడు, వాదోడుగా నిలిచాడు. "హిందూ పేట్రియట్" అనే పత్రికా సంస్థాపకుడు హరీశ్చంద్ర ముఖర్జీ అతివిశేషంగా కీర్తి ప్రతిష్ఠలను గడించుకొంటున్న తరుణంలో ఆయన హఠాత్తుగా మరణించాడు. అంతట కాళీప్రసన్న సిన్హా కొంతకాలంపాటు దాన్ని నడిపి, నష్టపడి, మరి కట్టివేయబోయాడు. ఆ ఘట్టంలో విద్యాసాగర్ రంగంలో ప్రవేశించి, కృష్ణదాస్ పాల్ను ఎడిటర్గా నియమించి, పత్రికను స్వయంగా నడిపించాడు. ఎడిటర్గా కృష్ణదాస్ పాల్ పత్రికను వృద్ధిలోకి తీసుకురాగా, దాని వ్యవహారాలను చూడ్డానికి విద్యాసాగర్ ఆదిలో ఒక ట్రస్టును ఏర్పాటు చేశాడు; తర్వాత ఆ ట్రస్టు చేత పాల్కు, ఆయన కుటుంబానికి పత్రికను ఇప్పించివేశాడు. “సోమప్రకాశ్" అనే వారపత్రికను విద్యాసాగర్ స్వయంగా సంస్థాపించాడు. ఆయన దాన్ని సంస్థాపించింది తన పూర్వ విద్యార్థులలో ఒకనికి భుక్తిని కల్పించడం కోసం. అధిక వేతనాన్ని ఆశించి, అతడు మరొక ఉద్యోగానికి వెళ్ళగా, కొత్త ఎడిటర్ కోసం వెతుకులాడవలసి వచ్చింది. ఆ పదవికి నియమించిన ద్వారకనాథ్ విద్యాభూషణ్ “సోమప్రకాశ్"ను సమకాలిక వారపత్రికలలో ప్రథమ స్థానానికి తీసుకురాగా, అందుకు సంతోషించి, విద్యాసాగర్ దాన్ని విద్యాభూషణ్కు బహూకరించాడు.

కేవలం ధనరూపంలో సహాయం చేయడమేకాక, అన్న వస్త్రాల రూపంలో, ఔషధాల రూపంలో, ఉపచారాల రూపంలో, అన్యరూపాలలో కష్టాలలోనేమి, క్లేశాలలోనేమి ఎవరున్నా, విద్యాసాగర్ వారిని ఆదుకొనేవాడు. పొరుగింట కలరా వచ్చినా, మశూచి కనబడినా, హోమియోపతి మందులతో వైద్యానికి తానే బయలుదేరేవాడు. దారిపక్క ఆకలితో, చలితో ఎవడైనా విలవిలలాడుతూ ఉంటే, అతడికి స్వహస్తాలతో అన్న పానీయాలను అందించడమేకాక, తన యాన్ని కప్పేవాడు. కొన్ని సందర్భాలలో దీనార్తులను తనింటికి చేర్చి, కొన్ని నెలలపాటు పోషించి, భుక్తికి ఏదో దారి చూపించి, సుఖంగా జీవించవలసిందిగా ఆశీర్వదించి పంపించేవాడు.

ఈ విధంగా వ్రాస్తూ పోతే విద్యాసాగర్ మహోదాత్త ప్రవృత్తికి నిదర్శనాలుగా చెప్పదగు కథలకు అంతూ పొంతూ ఉండదు. అందువల్ల మరొక్కదాన్ని మాత్రం చెప్పి ముగిస్తాను. ఒకనాడు తన తమ్ముడు శంభుచంద్ర శర్మను వెంటబెట్టుకొని ఒక మిత్రుని చూడ్డానికై అతని గ్రామానికి వెడుతూ ఉండగా, మార్గమధ్యంలో మరొక


మిత్రుడు తటస్థపడ్డాడు. అన్నదమ్ము లిద్దరిని అతడు తన ఇంటికి ఆహ్వానించాడు. అతడి కుమారుడు కుష్ఠురోగి. ఆ రోగగ్రస్తుడు హుక్కా తయారుచేసి, విద్యాసాగర్కు అందించబోగా, శంభుచంద్ర శర్మ "దాన్ని తాగవద్దు" అని చేతి సైగల ద్వారా అన్నకు సూచించాడు. తమ్ముని హెచ్చరికను విద్యాసాగర్ పాటించలేదు. అంతేకాదు, అటు పిమ్మట ఆ కుష్ఠురోగి అందించిన మిఠాయిని విద్యాసాగర్ తిన్నాడు. అక్కడినుంచి కదిలి, కొంత దూరం వెళ్ళిన తర్వాత శంభుచంద్ర శర్మ అన్నతో "కుష్ఠురోగి అందించిన హుక్కా తాగడం, పెట్టిన మిఠాయి తినడం లేనిపోని ప్రమాదాన్ని కొనితెచ్చుకొనడం కాదా" అని ఆందోళనతో పలికాడు. అంతట విద్యాసాగర్ "శంభూ!నీకే దురదృష్ట వశాన అట్టి ఘోరవ్యాధి వచ్చి ఉంటే, నేను నిన్ను దూరంగా ఉంచేవాడినా ?" అన్నాడు. మహాత్మునికే ఇట్టి మాట చెల్లు !

వచ్చేవారం మనము చెప్పలేము గాని, ఈ వారంలో నా మనస్సులో ఏ క్షుద్రుని గురించిన ఆలోచనలు ప్రవేశించబోవు. (ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక వ్యాసం 3-8-1977)

## ఒక పాత మిత్రుడు, ఒక కొత్త మిత్రుడు

## (శ్రీ కృష్ణ కృపలానీ, మిస్టర్ హషిమ్ అమీర్ అలీ)

కొన్ని నెలల తరవాత - కాదు, కొన్నేళ్ళ తరవాత - నేను సంతోషంగా గడప గలిగినవి 1977 జూలై 31, ఆగస్టు 1 వ తేదీలు మాత్రమే. ఆ శని, ఆదివారాలలో నా చిరకాల మిత్రుడు శ్రీ కృష్ణ కృపలానీ న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చాడు.



ఆయన రాకకు ఒకే ఒక కారణం - నన్ను కలుసుకొనడమే, నాతో కాలక్షేపం చేయడమే. మేము క్రితంసారి కలుసుకొన్నది ఆరేదు సంవత్సరాల నాడు. ఈ మధ్యకాలంలో మామధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగకపోలేదు. కాని, యాభైపేజీల ఉత్తరమైనా అయిదు నిమిషాల ముఖాముఖి సమావేశానికి సాటికాదు, కాలేదు. ఒక ప్రియమిత్రుని చూచినంతనే మన కళ్ళలో వెలిగే వెలుగును ఏ ఉత్తరం వ్యక్తం చేయగలుగుతుంది? ఒక ప్రాణస్నేహితుని కలుసుకొన్నంతనే మన పెదవుల పై నర్తించే మందహాసాన్ని ఏ ఉత్తరం ప్రస్ఫుటం చేయగలుగుతుంది?

మా మాటల మధ్య నేను కృపలానితో అన్నట్టు, ఒక్కొక్క తరానిది ఒక్కొక్క ప్రపంచం. నాకంటే ఆయన అయిదారు నెలలు పెద్దవాడు. ఆయన డెబ్బైలో ప్రవేశించగా, నేను త్వరలో ప్రవేశించబోతున్నాను. దీని తాత్పర్యం మాపై ఇరవయ్యో శతాబ్దం ప్రథమ పాదం ప్రభావం విశేషంగా కలదని. కొంతవరకు మాపై పందొమ్మిదవ శతాబ్దం చతుర్థపాదం ప్రభావంకూడా ఉన్నట్టు చెప్పవచ్చు. ఏకవిధమైన ప్రభావాలు మాపై పడినందున మా అభిప్రాయాలలో, మా అభిరుచులలో, మా ఆదర్శాలలో కొంతవరకు ఏకత ఉండడం సహజం. ఈ విధమైన ఏకత కొత్త తరంవారితో సాధించడం అసాధ్యమని నేను చెప్పనుగాని, అది సులభం

కాదు. మనపై పడిన ప్రభావాలే, మన దృక్పథాలను, జీవితాలను దిద్దిన ప్రభావాలే మన ప్రపంచం స్వరూప స్వభావాలను నిర్ణయిస్తాయి. అందువల్లనే కృపలానీతో నే నన్నట్టు, ఒక్కొక్క తరానిది ఒక్కొక్క ప్రత్యేక ప్రపంచం.

ఒక మిత్రుడుగా నన్ను చూడ్డానికి వచ్చిన కృపలానీ మరొక మిత్రుని నాకు హైదరాబాద్లో సమకూర్చి వెళ్ళాడు. ఈ కొత్త మిత్రుని పేరు మిస్టర్ హషిమ్ అమీర్ ఆలీ. ఈయనను న్యూఢిల్లీలో మాకు సమానంగా స్నేహితుడైన పండిట్ ప్రేమనాథ్ బజాజ్ నివాసంలో కలుసుకొనడం తటస్థించింది. ఇద్దరు హైదరాబాదీలకు ఒక కాశ్మీరీయుడు పరిచయం కలిగించడం చిత్రమే. కాని, అంతే జరిగింది. హైదరాబాద్లో తప్పక - త్వరలోనే - కలుసుకొందామని అప్పుడు మేమనుకొన్నా, అది జరగలేదు. ఇరుగు పొరుగున కాకపోయినా, మైలు దూరం లోపల నివసిస్తున్న మమ్ము దగ్గరికి తీసుకురావడానికి న్యూఢిల్లీ నుంచి కృపలానీ రావలసి వచ్చింది.

ఇట్టి అనూహ్యమైన, ఆశ్చర్యకరమైన సంఘటనలే జీవితానికి ఆకర్షణను కూర్చుతాయి, దాన్ని మాధుర్యంతో నింపుతాయి.

అమీర్ ఆలీ ఒకసారి మూడు సంవత్సరాలు మరొకసారి ఇంకొక మూడు సంవత్సరాలు శ్రీ నికేతన్ లో ప్రొఫెసర్గా పనిచేశాడు. రవీంద్రుని ఆయన గురుదేవునిగా సంభావించు కొంటాడు. తమ ఇంటికి కృపలానీతో పాటు నన్ను లంక్కి పిలిచినప్పుడు ఆయన సగర్వంగా నాకు చూపించినట్టివి ఆయన రత్న కంబళాలు కావు, ఆయన పూర్వీకుల ఖడ్గాలు కావు, సాంఘిక శాస్త్రవేత్తగా తాను వ్రాసిన గ్రంథాలు కావు, తాను ఆంగ్లేయంలోనికి అనువదించిన ఖురాన్ ప్రతులైనా కావు; తన పరిణయ మహోత్సవ సందర్భంలో టాగోర్ తనకు బహూకరించిన వర్ణచిత్రాన్ని. అది టాగోర్ స్వయంగా రచించిన చిత్రం.

అన్నట్టు, నేను హైదరాబాద్కు నా నివాసాన్ని మార్చిన తరువాత గమనించిన ఒక విశేషాన్ని గురించి ఇక్కడ కొంత ప్రస్తావించాలి. ఒక మధ్యతరగతి హిందువుకంటె అదే తరగతికి చెందిన ముస్లిం సాంస్కృతికంగా అధిక స్థాయిలో జీవిస్తాడు. అతని గృహంలో గ్రంథ సంచయం ఉంటుంది. మౌలికపు చిత్రపటాలు ఉంటాయి, రత్నకంబళాలు ఉంటాయి, కళాత్మకమైన వస్తు సముదాయం ఉంటుంది. అతని గృహం వెలుపల పూలతోట ఉంటుంది. అతడు మంచి దుస్తులు ధరిస్తాడు, మంచి భోజనం చేస్తాడు. ఆర్థికంగా అదే స్థాయికి చెందిన హిందువు అన్యవిధంగా జీవించడం ఎందువల్ల? అతడి వేదాంతం జగమే మిథ్య అని చెబుతుంది, సమస్తం మాయ అని చెబుతుంది. “పోయేటప్పుడు వెంటరాదయా పూచికపుల్లైనా " అని హెచ్చరిస్తుంది. అయినా, అతడు, రూకరూకను చూచి వాపోతాడు దేనికో? వీలైనంతగా ఆస్తిపాస్తులను కూడబెట్టి, తన సంతతికి అప్పగించాలని తాపత్రయపడతాడు దేనికో? “అయితే నవాబు, కాకుంటే ఫకీరు" పద్ధతిలో బ్రతకనక్కరలేదు. కాని, ఇంత కుప్పను చేర్చడమే ఒక గొప్ప లక్ష్యమైనట్టుగా జీవించడం తగునా?


అమీర్ ఆలీ శ్రీనికేతన్లో సోషియాలజీ ప్రొఫెసర్గా పనిచేసినప్పుడు కృష్ణకృపలానీ శాంతి నికేతన్లో ఇంగ్లీషు ప్రొఫెసర్. అందువల్ల బీగంపేట విమానాశ్రయం నుంచి బంజారా హిల్స్లోని మా “లుంబిని” కీ చేరగానే కృపలానీ చేసిన మొట్టమొదటి పని అమీర్ ఆలీకి టెలిఫోన్ చేయడం. తరవాత ఒక గంటలోపలనే అమీర్ ఆలీ మావద్దకు వచ్చాడు. ఆనాడు, ఆ మర్నాడు మేము ముగ్గురం కలిసి ఎన్నో చోట్లకు తిరిగాము, కలిసి ఎన్నెన్నో విషయాలు మాట్లాడుకున్నాము.



1944 లోనో, 1945 లోనే నేను శాంతినికేతనక్కు వెళ్ళాను.

ఆ సంవత్సరం అఖిల భారత పత్రికా సంపాదకుల వార్షిక మహాసభ కలకత్తాలో జరిగింది. ఆ సభకు గురుదేవుని కుమారుడు రవీంద్రనాధ్ టాగోర్ అందరు పత్రికా సంపాదకులను బోల్పూరు రావలసిందిగా విశ్వభారతిని సందర్శించవలసిందిగా ఆహ్వానించాడు. ఆయన ఆహ్వానాన్ని అందించినాడు దాదాపు నూట యాభై మంది సంపాదకులకు. కాని, దాన్ని మన్నించింది అయిదుగురు మాత్రమే. ఆ సంఖ్య నాల్గింటికి తగ్గిపోగల ప్రమాదం కొద్దిలో తప్పింది. కలకత్తా నుంచి బోల్పూర్ వైపు వెళ్ళే రైలుబండి తెల్లతెల్ల వారుతూ ఉండగా బయలుదేరుతుంది. అలారం పెట్టుకొని వేళకు లేచి, వేళకే బసనుంచి కదిలినా హౌరాస్టేషనుకు చేరడానికి నాకు టాక్సీ దొరక లేదు. అప్పుడే లైన్ పైకి వచ్చిన ట్రామ్లో ఎలాగో స్టేషన్ వద్దకు చేరి, ఏ ప్లాట్ఫారంపై బోల్పర్ వైపు వెళ్ళే బండి ఉన్నదో తెలుసుకొని, అక్కడకు వెళ్ళేసరికి, గార్డ్ ఈల వేయడం, పచ్చజెండా చూపడం, బండి సాగడం ఇది జరుగుతున్నది. మరి క్షణం ఆలస్యం చేసినా, రైలు అందనట్టే. అందువల్ల ఒక్క దౌడు తీసి చివరిపెట్టెలోకి దూరాను. గేటులోని రైల్వే ఉద్యోగి నన్ను అడ్డగించబోయాడు గాని, అతడిని తప్పించుకోగలిగాను. పక్కస్టేషన్లో దిగి టిక్కెట్టు లేని ప్రయాణీకుడనని గార్డు చెప్పుకొన్నాను. అతడు టిక్కెట్టు డబ్బులు నా నుంచి వసూలు చేయడానికి ఏర్పాట్లు చేయించాడు. తీరా బోల్పూర్లో రైలు ఆగినప్పుడు గాని, నేను కాక మరి నల్గురు సంపాదకులు మాత్రమే విశ్వభారతి సందర్శనానికి ఉత్సహించినట్టు నాకు తెలియరాలేదు.

తక్కిన నలుగురిలో ఒకరేమో “సింధ్ అబ్జర్వర్” ఎడిటర్ శ్రీ కోటంరాజు పున్నయ్య; రెండవ వారు 'నేషనల్ హెరాల్డ్' ఎడిటర్ శ్రీ కోటంరాజు రామారావు; మూడవ వారు ఒక బొంబాయి ఉర్దూ పత్రిక ఎడిటర్; నాల్గవ వారు గౌహతికి చెందిన “అన్నామిన్” పత్రికా సంపాదకుడు. మాలో చివరి వారిద్దరు బోల్పర్లో దిగగానే విచారించిన మొట్టమొదట సంగతి కలకత్తాకు తిరుగు రైలు ఎప్పుడని. మొత్తం మూడు, నాలుగు గంటలు మాత్రం విశ్వభారతిలో గడిపి, హుటాహుటిగా వారు తిరిగి వెళ్ళిపోయారు. పోతే, కోటంరాజు సోదరులూ, నేను మాత్రమే మర్నాటి సాయంత్రం వరకు ఉండి తిరిగి, విశ్వభారతిలో చూడదగు విశేషాలన్నింటినీ తీరుబాటుగా చూచాము.



ఓంప్రథమంగా నేను కృష్ణ కృపలానీని కలుసుకొన్నది ఆ నాడు శాంతినికేతన్లోనే. మా బసకు భోజనానికి ఏర్పాట్లు చేసింది ఆయనే; మమ్ములను వెంటబెట్టుకొని విశ్వభారతిలో వివిధ శాఖలను తిప్పిందికూడా ఆయనే. తెల్లని పైజామా, తెల్లని లాల్చీ, దానిపై జవహర్ జాకెట్-అప్పటిలో ఆయన దుస్తులవి; ఇప్పటికీ అవే. అయితే, అప్పటివలె నవ్వడం, నవ్వించడం ఇప్పుడు లేదు. దీని తాత్పర్యం ఆయనలో హాస్య చతురత తగ్గిందని కాదు. కాని, ఇదివరలోవలె అది పైకి పొంగడం లేదు; లోపలనే అంతర్వాహినిగా ఉంటున్నది. అప్పుడప్పుడు రచనలలో అది ప్రస్ఫుటమౌతూ ఉంటుంది. అందుకు కారణాన్ని చెప్పలేను కాని, మా ప్రథమ సమావేశంలోనే ఆయనతో నాకు ఆత్మీయత ఏర్పడింది.

నేను వెళ్ళి చూచింది గురుదేవుడు లేని విశ్వభారతిని. అయితే, నాటికి ఆయన నిర్యాణం చెంది ఎంతోకాలం కాలేదు. అందువల్ల ఎక్కడ చూచినా, ఆయన మహిమాన్విత వ్యక్తిత్వపు ముద్ర స్పష్టంగా కనబడింది. ఆయనకు సన్నిహితులైన శ్రీ నందలాల్ బోస్, శ్రీ క్షితి మోహన్ సేన్ అప్పుడు జీవించి ఉన్నారు. అందువల్ల వారిని కలుసుకొనడం, వారితో సంభాషించడం ఈ భాగ్యం నాకు కలిగింది. నందబాబును చూచి, ఆయన నవభారతంలో ఒక మహా చిత్రకారుడని, సేన్ను చూచి, ఆయన సంస్కృతంలో ఉద్దండ పండితుడని ఎవరికైనా ఊహించుకొనడం కష్టమే. అయితే, కొంతసేపు వారితో గడిపితే మాత్రం వారు మహామహులన్న విషయం ఎవరికైనా స్పష్టంగా తెలిసేది. మూడు దశాబ్దాలకు పైగా గడిచిపోయినా, ఈ నాటికీ వారిద్దరు నా కళ్ళకు కట్టినట్టుగా కనబడుతున్నారు. పైకి అతి సామాన్యుల వలె ఉన్నా, కొందరి వ్యక్తిత్వాలలో అనిర్వచనీయమైన వైశిష్ట్యం ఏదో నిగూఢమై ఉంటుంది. అట్టి వారి కోవకు చెందినవారే నందలాల్ బోస్, క్షితిమోహన్ సేన్లు. ఆయన గురుదేవుని కుమారుడైనా, రవీంద్రనాథ్ టాగోర్ విషయమై ఈ మాట నేను అనలేను. ఆయన రూపం అస్పష్టంగానైనా ఈనాడు నాకు గుర్తులేదు.

అది సెలవు రోజు. అందువల్ల విశ్వభారతి నాడు పనిచేయడం లేదు. అయినా, నందబాబు మా కోసం కళాభవన్ తలుపులు తెరిపించి, తాను స్వయంగా చెంత ఉండి, దానిలో గల చిత్రాలను చూపించాడు. ఇంతకాలం తర్వాత ఏయే చిత్రాలను చూచానో గట్టిగా చెప్పలేనుగాని, అవనీంద్రనాథ్ టాగోర్ రచించిన "ఔరంగజేబ్", నందబాబు చిత్రించిన "శబరి" బాగా జ్ఞాపకం ఉన్నాయి. మా కోసం క్షితిమోహన్సేన్ "విద్యాభవన్" తలుపులను తెరిపించి, సంస్కృత మహాభారతం ప్రామాణిక పాఠాన్ని సిద్ధపరచడంలో పూనాలోని భండార్కర్ ఓరియంటల్ ఇన్స్టిట్యూట్తో తాము ఏ విధంగా సహకరిస్తున్నారో వివరించాడు. అటుపిమ్మట మేము సందర్శించినట్టిది “చైనా భవన్". విద్యార్థులకు ఏ విధమైన భోజనాన్ని అమర్చుతున్నారో అది మాకు తెలియజెప్పడానికి వారి “మెస్"లోనే మాకు భోజనం ఏర్పాటుచేశారు తప్ప, మా కోసం విడిగా వంటలను చేయించలేదు. దీన్ని నేను ప్రత్యేకించి హర్షించాను.



పోతే, నాటి రాత్రి మాకోసం "రవీంద్ర సంగీతం" కచ్చేరీని కృపలానీ ఏర్పాటు చేశాడు. కాకినాడ బ్రహ్మ మందిరంలో టాగోర్ గీతాలను వింటున్నప్పుడు వాటి ఫణితులలో వైవిధ్యం లేనట్టు అనిపించేది. కాని, "రవీంద్ర సంగీతం"లో ప్రత్యేక ప్రావీణ్యం సంపాదించిన వారు వాటిని పాడగా, ఏ రెండు పాటలు ఒకే నడక నడవలేదు. పైగా, తొలకరి వానల జలజల, అప్పుడే నిద్రలేచిన పిట్టల కిలకిల, జాతి గుర్రాల కదనులోని టకటక, ఎత్తు నుంచి దూకుతున్న సెలయేళ్ళ ధణధణ, కారు నల్లని మబ్బుల నుంచి రాలుతున్న పిడుగులు పెళపెళ ఇంతటి విభిన్న రవళులను అవి స్ఫురింపజేశాయి. సంగీతంలోని మెలకువలు అంతగా తెలియని నన్ను సయితం ఏవేవో దూర తీరాలకు, దిశ్చక్రాలకు దాటి సంగీతం తీసుకు వెళ్ళింది.

మర్నాటి ఉదయం మేము శ్రీనికేతను వెళ్ళాము. శాంతినికేతనక్కు అది దాదాపు మైలు దూరంలో ఉన్నది.

గ్రామోద్ధరణకు సంబంధించిన సమస్యల అధ్యయనానికి, వాటి విషయమై ప్రయోగాలకు గురుదేవుడు సంస్థాపించిన సంస్థ శ్రీనికేతన్. "నూలు వడకండి" అని గాంధీజీ కోరగా, "నాకు తెలిసిన విద్య పాటలను వడకడమే!" అని గురుదేవుడు ఛలోక్తిగా పలికి ఉండవచ్చుగాని, గ్రామీణ పరిశ్రమల పునరుద్ధరణకై ఆయన కృషి చేశాడు. పైగా, నిత్య జీవితంలో మనం వినియోగించుకొనే ప్రతి వస్తువులో కళకు స్థానం కల్పించడానికి ఆయన ప్రయత్నించాడు. శ్రీనికేతన్ "సేల్స్ ఎంపోరియం"లో నేను కొన్న వస్తువులలో రెండు, మూడు ఈనాటికి నా వద్ద భద్రంగా మిగిలి ఉన్నాయి.

అప్పటిలో కృపలానీతో ప్రారంభమైన స్నేహం భద్రంగా మిగిలి ఉండడమే కాక, నానాటికీ పెరిగింది. ఆయన సాహిత్య అకాదమీ (న్యూఢిల్లీ) ప్రధాన కార్యదర్శిగా ఉన్న కాలంలో ఆ సంస్థలో నాకు కొంత సన్నిహిత సంబంధం ఉండేది. వేమన విషయమై, వీరేశలింగం విషయమై నేను ఇంగ్లీషులో రచనలు చేసింది ఆయన సూచనపైనే, ఆయన ప్రోత్సాహంతోనే. ఆయన స్వయంగా రచయిత. గాంధి, టాగోర్ జీవిత చరిత్రలను ఆయన వ్రాశాడు. దేశదేశాలలో విశేషంగా ప్రశంసలను అందుకొన్నారు. ద్వారకనాథ్ టాగోర్ (రవీంద్రుని పితామహుడు) జీవితచరిత్రను రచించడానికై నిరుడు లండన్లో కొన్ని నెలలపాటు ఆయన పరిశోధనలు జరిపి వచ్చాడు.

ఆచార్య జె.బి. కృపలానీ, కృష్ణ కృపలానీ దగ్గరి జ్ఞాతులు. ఉభయులు సింధీయులు; ఉభయులు వంగీయ వనితలను వివాహమాడారు. కృష్ణ కృపలానీ సతీమణీ రవీంద్రనాథ్ టాగోర్ దౌహిత్రి. ఆమె పేరు - నందిని. తాతగారు ఆమెకు నాట్యం నేర్పించారు. తాతగారి నాటకం "నటీర్ పూజ"లో ఆమె నాట్యం చేసేది; తాతగారితో చేరి, ఆమె ఇతర నాటకాలలో సయితం ముఖ్యపాత్రలను ధరించేది. ఏడెనిమిది సంవత్సరాల క్రితం ఆమె నిర్యాణం చెందింది. వైద్య సహాయానికై కృపలానీ ఆమెను లండనక్కు తీసుకువెళ్ళాడు.

తాత్కాలికంగా కోలుకొన్నా, అక్కడి నుంచి తిరిగి వచ్చిన పిదప ఎంతో కాలం పాటు ఆమె జీవించలేదు. ఆమె నిర్యాణం నాటి విషాదచ్ఛాయలు కృపలానీ వదనం నుంచి ఇప్పటికైనా పూర్తిగా తొలగనట్టు నాకు అనిపిస్తూ ఉంటుంది.





ఆచార్య కృపలానీకి వలె కృష్ణ కృపలానీకి సంతానం లేదు. ఎవరినైనా ఆచార్య కృపలానీ దత్తత చేసుకొన్నాడో, లేదో నాకు తెలియదు గాని, కృష్ణ కృపలానీ మాత్రం తన వద్ద చదువుకొన్న ఒక సింధీ బాలికను పెంచుకొని, పూనా పట్వర్ధన్ సోదరులలో ఒకరి కిచ్చి వివాహం చేశాడు. ఆయన విద్యార్థినులలో మరొకరు శ్రీమతి ఇందిరా గాంధి. తన ఈ శిష్యురాలి రాజకీయాల విషయమై కృపలానీ అభిప్రాయాలు నాకు తెలియవు. మర్యాద కాదని ఆయన నా అతిథిగా ఉన్న రెండు రోజులలో శ్రీమతి ఇందిర ప్రసక్తిని నేను ఒకటి, రెండుసార్లు తప్ప తీసుకురాలేదు. అప్పుడైనా ఆమె పట్ల నాకున్న క్రోధ విద్వేషాలను చూచాయగా తప్ప వెల్లడించలేదు.

జీవితాన్ని అన్ని దృక్కోణాలనుంచి పరిశీలించిన వాడు కృష్ణ కృపలానీ, కళ్ళు రెండు కాగా, చెవులు రెండు కాగా, నాల్క ఒక్కటే. అందువల్ల ఆయన ఎక్కువగా చూస్తాడు, ఎక్కువగా వింటాడు, తక్కువగా మాట్లాడతాడు. ఆ మాట్లాటం కూడా ఎవ్వరికీ ఏమీ నొప్పి కలిగించకుండా. రాజ్యసభలో ఆయన ప్రస్తుతం నామినేటెడ్ సభ్యుడు. సకృత్తుగా తప్ప ఆయన చర్చలలో పాల్గొనడు. సగటున సంవత్సరానికి ఒకసారి చొప్పున నేను రాజ్యసభలో ప్రసంగించినట్టు చెప్పగా, తానూ అంతే చేస్తున్నట్టు ఆయన ఈ మధ్య నాతో అన్నాడు.

నేను ఆదిలోనే చెప్పినట్టు, ఒక్కొక్క తరానికి ఒక్కొక్క ప్రపంచం. మా ప్రపంచంలో నీతి తప్ప అవినీతి లేదని నేనంటే, అది పచ్చి అబద్ధమే కాగలదు. కాని, కొత్త తరం ప్రపంచంలో కంటె మా తరం ప్రపంచంలో లక్ష్యశుద్ధి అధికమని నిస్సందేహంగా చెప్పవచ్చు. డబ్బు మాకైనా చేదు కాదు గాని, దాని కోసం గడ్డి తినేవారు తిరిగి నిస్సందేహంగా - మా ప్రపంచంలో చాలా వరకు తక్కువ. ఇది మా తరాన్ని గురించి గొప్ప చెప్పుకొనడం కాదు; ఎంత వరకు వెళ్ళితే, అది అంత ధర్మకాలమన్న ఛాందస దృష్టి సయితం నాకు లేదు. నా దృష్టిలో ఇరవయ్యో శతాబ్ది ప్రథమ పాదంలో కంటె, పందొమ్మిదవ శతాబ్ది చతుర్థ పాదంలో కనీసం విద్యాధికులలో ధర్మ నిరతి అధికం, స్వాతంత్ర్య ప్రియత్వం అధికం. కాగా, పద్దెనిమిదవ, పదిహేడవ శతాబ్దాలకు వెడితే, అన్ని వర్గాలలో నీతి తక్కువ, నిజాయితీ తక్కువ. సంఘ జీవితంలో తరానికి, తరానికి జీవిత విలువలు మారడం కద్దు. బ్రిటిష్ దాస్యం నుంచి మనం విముక్తి పొందిన తర్వాత ఈ విలువలు మరింత ఉత్తమమైనవి కావడానికి మారుగా నీచస్థాయికి దిగజారిపోవడం మన దౌర్భగ్యం, మన దేశ దౌర్భాగ్యం.

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక వ్యాసం 31-8-1977).

# వ్యర్థమైన మూడు జీవితాలు : రణడే, గోఖలే, గాంధీ



మహదేవ్ గోవింద రణడే శిష్యుడు గోపాలకృష్ణ గోఖలే; గోఖలే శిష్యుడు గాంధీ. వీరు ముగ్గురు నైతిక పునరుజ్జీవన లేనిదే జాతీయ పునరుజ్జీవన లేదని చెప్పినవారే, నైతిక పునరుజ్జీవన సాధనకై తమ బోధనల ద్వారానే కాక, తమ జీవితాలద్వారా కృషి చేసినవారే. వీరి ముగ్గురి బోధనలు నిష్ఫలమైనాయి, వీరి ముగ్గురి జీవితాలు వ్యర్థమైనాయి. ఇవి కటువైన మాటలుగా తోచవచ్చు. కాని, వీరు ముగ్గురు ఈనాడు మనమధ్య వుంటే తమ జీవితాలు వ్యర్థమై పోయినట్టు స్వయంగా చెప్పివుండేవారు!





మున్ముందు మంచిరోజులు రావచ్చునన్న ఆశతో రణడే, గోఖలేలు చనిపోయారు. తన జీవితం చివరి ఘట్టాలలో గాంధిలో అట్టి ఆశ సయితం విలుప్తమైపోయింది. బ్రతుకుపై తనకు రోత పుడుతున్నట్టు తన హత్యకు ముందు అనేక పర్యాయాలు ఆయన స్పష్టం చేశాడు. మరణాన్ని ఆహ్వానిస్తున్నట్టు కూడా ఆయన స్పష్టం చేశాడు. అట్టి గాంధి ఈనాడు మన మధ్యవుంటే, మరెంతగా ఆయన విలవిలలాడి వుండేవాడో!




ఈనాడు కల్లకు తప్ప, కపటానికి తప్ప, కాలుష్యానికి తప్ప నీతికి, నిజాయితీకి, నైర్మల్యానికి మన జాతీయజీవితంలో స్థానం లేకుండా పోయింది. ఈనాడు మోసానికి తప్ప, స్వార్థానికి తప్ప, సంకుచితత్వానికి తప్ప, ఋజువర్తనకు, నిస్వార్థానికి, ఉదాత్తతకు మన జాతీయజీవితంలో స్థానం లేకుండా పోయింది. ఈనాడు ద్రోహం తప్ప, మైత్రి లేదు; ద్వేషం తప్ప, ప్రేమ లేదు; హింస తప్ప, అహింస లేదు! క్రౌర్యం తప్ప, కారుణ్యం లేదు. ఒక్క రాజకీయ రంగంలోనే కాదు, సాంఘిక, ఆర్థిక, పారిశ్రామిక, వాణిజ్య, విద్యారంగాలలో, అన్యరంగాలలో పరిస్థితులు ఒకే విధంగా వున్నాయి. మొత్తం జాతీయజీవనమే నైతికపు విలువలకు ధించినంతవరకు నికృష్టస్థాయికి దిగజారి పోయింది.

ధర్మోపన్యాసాలేమో అవిరళంగా సాగుతున్నాయి. దేశభక్తిని గురించి, ప్రజాసేవనుగురించి, నవసమాజ నిర్మాణాన్ని గురించి ధర్మోపన్యాసాలను వినలేక చెవులు చిల్లులు పడుతున్నాయి. మందలో కలిసిపోకుండా చెదురుగా ఎవరో కొందరు ఇప్పటికి కూడా కుడి ఎడమలను పాటించేవారుంటే, ఇప్పటికి కూడా ఉచితానుచితాలు పరిగణించే వారుంటే, ఇప్పటికి కూడా చూస్తూ చూస్తూ అవమార్గాన పోవడానికి బిడియపడేవారుంటే - అట్టివారికి బ్రతుకుపైనే జుగుప్స పుడుతున్నది.

అవినీతి బలిసినప్పుడు, అధర్మం పెచ్చు పెరిగినప్పుడు దైవభక్తి హెచ్చడం కద్దు. ఇది అన్ని దేశాలలో జరుగుతుంది, అన్ని కాలాలలో జరుగుతుంది. ప్రస్తుతం మన దేశంలో ఇంతే జరుగుతున్నది. ఏవో కూళ్లు కుడిచి ఒక పదవిని సంపాదించినవాడు పెద్ద భక్తుడు! ఎన్ని కొంపలైనా ఆర్పి, నాలుగు డబ్బులు మూటగట్టినవాడు అంతకంటె పెద్ద భక్తుడు! భక్తుల సంఖ్యబట్టి బాబాల సంఖ్య, అమ్మల సంఖ్య, అమ్మమ్మల సంఖ్య, భగవానుల సంఖ్య పెరుగుతూంది. ఇది కూడా ఈనాడు విశేషంగానే జరుగుతున్నది.


వయస్సు మళ్ళినవారు, మరెంత కాలమో జీవించబోనివారు ఈ దుష్పరిణామాలనుంచి తమకు త్వరలో విముక్తిరాగలదని ఎలాగో సరిపెట్టుకోవచ్చు. కాని, తమ కుమారుల సంగతి, తమ మనుమల సంగతి ఏమి కానున్నదన్న చింత మాత్రం వారిని ఎంతగానో సంక్షుభితులను చేస్తుంది! అవి కటువైన మాటలుగా తోచినా. నిజంగానే రణడే, గోఖలే, గాంధీ జీవితాలు వ్యర్థమైనాయి!



(ఆంధ్రజ్యోతి 28-3-1973)

# విదేశీ ప్రముఖులు

## పికాసో



ఆయన పేరు వినివుండలేదంటే, అది తన అజ్ఞానాన్ని అచ్చుకొనడం, ఆయన కళను హర్షించలేనంటే అది తన అరసికత్వాన్ని చాటుకొనడంఆధునిక ప్రపంచంలో ఇట్టి ప్రతిపత్తిని గడించుకొన్నవాడు నిన్న ఫ్రాన్సులో కన్నుమూసిన పాబ్లో పికాసో, ఒక దశాబ్దం, రెండు దశాబ్దాలపాటు కాదు, అర్ధ శతాబ్దికి పైగా ఆధునిక చిత్రకారులలో ఆయనే ప్రథముడు! ఒకటి కాదు, రెండు కాదు, ఎన్నెన్నో ఆధునిక చిత్రకళారీతులకు ఆయనే

జనకుడు!

ఆయన పుట్టింది స్పెయిన్లో, జీవితంలో అత్యధిక భాగాన్ని గడిపింది ఫ్రాన్సులో. ఆయన రక్తనాళాలలో ప్రవహించినట్టిది స్పానిష్, జ్యూయిష్, ఇటాలియన్ రక్తం. ఈ ద్వివిధ జాతీయ పరిసరాలు, ఈ బహుళవిధ రక్తకణాలు ఆయనలో పెంపొందించినట్టిది దేశకాలావధులను దాటిన విశ్వవిశాల కళాదృష్టి. ఆయన తండ్రి చిత్రకారుడు. అందువల్లనే బాల్యంలోనే ఆయన సాంప్రదాయిక చిత్రకళారీతులలో ప్రజ్ఞ సంపాదించాడు. అటుతర్వాత ఆయన మొత్తం జీవితం ఒకే ఒక కృషికి అంకితమైపోయింది. అది సాంప్రదాయిక చిత్రకళా రీతులను అధిగమించి, వినూత్నమైన, విలక్షణమైన రీతులను సృష్టించడమే!

ఆయన సృష్టించిన ఈ వినూత్న, విలక్షణ రీతులను వికారమైనవిగా, విపరీతమైనవిగా, విడ్డూరమైనవిగా విమర్శించినవారు లేకపోలేదు; కళను ఆయన వక్రమార్గాలను పట్టించినట్టు విరుచుకుపడినవారు లేకపోలేదు. కాని, ఎంతటి తీవ్ర విమర్శకులైనా పికాసో సృజనాత్మక శక్తిని, దాని వైవిధ్యాన్ని, దాని ప్రాగల్భ్యాన్ని గుర్తించక తప్పలేదు. దాన్ని పోల్చవలసింది వర్షాకాలంలో ఒక్కొక్కప్పుడు గట్టులను తెంచుకొని, నురుగులు కక్కుతూ, సుడులు తిరుగుతూ, పరవళ్ళు తొక్కుతూ, చెట్టు చేమలను కూకటివేళ్ళతో పెకలిస్తూ, మిట్టలను పల్లాలుగా, పల్లాలను మిట్టలుగా మార్చుతూ, ఉగ్ర నరసింహమూర్తిని గుర్తుకుతెచ్చే నిర్వరంతో!

కళాస్రష్టగా తన జీవితంలో ఏ రెండు దశాబ్దాలలోను ఒకే రీతిని పికాసో అనుసరించలేదు. ఎప్పటికప్పుడు ఏదో కొత్త రీతిలో ఆయన కొత్త సృష్టి చేస్తూపోయాడు. ఈ రీతులలో అతి నవ్యమైనది, అతిముఖ్యమైన క్యూబిస్టురీతి. ఒక మిత్రునికి లేఖ రాస్తూ, సుప్రసిద్ధ ఫ్రెంచి చిత్రకారుడు సేజాన్ ప్రకృతిలోని ప్రతిదాన్ని

స్ఫియర్స్ కింద, కోన్స్ కింద, సిలిండర్స్ కింద మార్చవచ్చునన్నాడు. ఈ సూక్తి ప్రేరణతోనే కావచ్చు. పికాసో క్యూబిస్టు కళారీతిని సృష్టించాడు.

ఐతే, క్యూబిజమైనా, ఆయన సృజనాత్మక శక్తికి సీమాంతం కాలేదు. అటుతర్వాత సర్రియలిజం మొదలైన కొత్త కొత్త కళారీతులకు అది సాగిపోయింది. కొత్త కొత్త దిగంతాలను తాకింది. పికాసో చిత్రకారుడు మాత్రమే కాడు, శిల్పి కూడా. అగ్గిపెట్టెలపై, సిగరెట్టు పెట్టెలపై ఆయన కొన్ని చిత్రాలు వేశాడు. కాగితం ముక్కలను అంటించి కొన్ని చిత్రాలు చేశాడు. ఇసుకతో, బొగ్గుతో, సీమసున్నంతో కొన్ని చిత్రాలను రూపొందించాడు. శిల్పాల విషయంలో కూడా ఆయన చేయని గారడీ లేదు. సైకిల్ హ్యాండిల్ బార్ , సీటుతో ఆయన ఎద్దు ముఖం శిల్పాన్ని చేశాడు. అగ్గిపుల్లతో, ఇసుకతో, జిగురుతో ఇతర శిల్పాలను కొన్నింటిని చేశాడు. పింగాణి పాత్రలకు శిల్ప గౌరవాన్ని కూర్చాడు.

రూపంలో నైరూప్యాన్ని చూడ్డం పికాసో ప్రత్యేకత; నైరూప్యంలో రూపాన్ని చూడ్డం ఆయన వైశిష్ట్యం. ఇదే విధంగా ఆకృతిని వికృతిగా, వికృతిని ఆకృతిగా మార్చడంలో ఆయన దిట్ట. అర్థాన్ని అయోమయంగా, అయోమయాన్ని అర్థంగా మార్చడంలో సైతం ఆయన ఘటికుడు. ఏ సూత్రానికీ, ఏ నియమానికీ, ఏ సంప్రదాయానికీ లొంగనివాడు కనుకనే, పికాసో తనకు తానే సాటి. చిత్రకారుడుగానే కాక, శిల్పిగానే కాక, వ్యక్తిగా కూడా ఆయన అతి విశృంఖలుడే; షష్టిపూర్తి తర్వాత కూడా ఆయన జీవితంలో ప్రవేశించిన, దానినుంచి నిష్క్రమించిన భామల సంఖ్య తక్కువేమీ కాదు.

చిన్నతనంలో పికాసో దారిద్ర్య బాధలను అనుభవించాడు; అటు తర్వాత ఫాసిజం కన్నెర్రకు గురైనాడు; ఒక అంతర్యుద్ధం క్రౌర్యాన్ని, రెండు ప్రపంచ యుద్ధాల బీభత్సాన్ని చూచాడు; పాత ప్రపంచం శిథిలమైపోగా, దాని స్థానంలో తలయెత్తలేక విలవిలలాడుతున్న కొత్త ప్రపంచం దురవస్థను గమనించాడు. ఈ వివిధానుభూతులు తనలో కలిగించిన నైరాశ్యాన్ని, శైథిల్యాన్ని తన కళద్వారా వ్యక్తం చేయడానికి ఆయన ప్రయత్నించాడు. ఎవరికి అర్థమైనా, మరెవరికి అర్థం కాకపోయినా, ఎవరిని అలరించినా, మరెవరికి జుగుప్స కలిగించినా, ఆయన కళాసృష్టి చిత్తశుద్ధితో కూడినట్టిది. అట్టి చిత్తశుద్ధి లేకుండానే వేలాది చిత్రకారులు దేశదేశాలలో ఆయన కళారీతులను అనుకరించడమే ఆధునిక చిత్రకళలో, ముఖ్యంగా నైరూప్య చిత్రకళలో, ప్రథమ లోపం, ప్రధాన దౌర్భాగ్యం! చిత్తశుద్ధి కొరవడిన కళలో ప్రజ్ఞ చెదురుగా కనబడవచ్చుగాని, ఉపజ్ఞ దానిలో సర్వదా పూజ్యమే!

నిన్న ఫ్రాన్స్లో కన్నుమూసింది ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒక అద్భుతశక్తి, ఒక అపూర్వశకం.

(ఆంధ్రజ్యోతి 10-4-1973)

"అభిజ్ఞాన శాకుంతల" నాటకాన్ని కీర్తిస్తూ జర్మన్ మహాకవి గొథే రాసిన పద్యాన్ని ఉదహరిస్తూ పొంగిపోయేవారిలో ఆ నాటకాన్ని యూరప్ దృష్టికి తెచ్చింది సర్ విలియం జోన్స్ అని ఎందరికి తెలుసు? 18వ శతాబ్ది ఉత్తరార్ధంలో మన దేశానికి సుప్రీంకోర్టు జడ్జిగా వచ్చిన జోన్స్.

ఆ కాళిదాసు నాటకాన్ని ఇంగ్లీషులోకి అనువదించడానికి ముందు సంస్కృతాన్ని నేర్చుకొనడం కోసం ఎన్ని తిప్పలుపడవలసి వచ్చిందో ఎందరికి తెలుసు? ఇండియాకు వచ్చేసరికే గ్రీక్, లాటిన్ల సమేతంగా పెక్కు యూరోపియన్ భాషలలో ఆయన మహాపండితుడు. ఇంతేకాక, అప్పటికే ఆయనకు అరబిక్, పర్షియన్, టర్కిష్, హిబ్రూలు క్షుణ్ణంగా తెలుసు. చైనీస్ భాషను నేర్చుకొనడానికి ఆ కాలాన యూరప్ లో అవకాశాలు చాలా స్వల్పమైనా, దానిలో కూడా ఆయన ఎన్నదగు పరిచయాన్ని సంపాదించుకొన్నాడు. ఐనా, మన దేశానికి వచ్చిన తర్వాత "సంస్కృతాన్ని నేర్చుకొనడమా?" అని దాన్ని ఆయనకు బోధించడానికి ముందుకు వచ్చినవారే లేరు. ఎందరెందరో తిరస్కరించిన పిమ్మట ఒక బ్రాహ్మణేతర వైద్యుని వద్ద, ఆయన పెట్టిన షరతులన్నింటికి లోబడి, జోన్స్ సంస్కృతాన్ని నేర్చుకొనవలసి వచ్చింది! సంవత్సరాలపాటు అహోరాత్రులు కష్టపడి, ఋగ్వేదానికి ప్రమాణ పాఠాన్ని నిర్ణయించి,

ఇరవై దాన్ని బ్రిటన్ నుంచి ప్రకటించిన మాక్స్ ముల్లర్ తమ ఆత్మబంధువన్నట్టు ఈనాడు కొందరు ఆయనను "మోక్ష ముల్లర్"గా ప్రస్తుతించడం కద్దు. "భూతలంపై స్వర్గం ఉంటే, అది భారతదేశమే" అని ఆ జర్మన్ పండితుడు పలికిన పలుకులను తలచుకొని ఉబ్బితబ్బిబ్బులు కావడం కూడా కద్దు. కాని, 19వ శతాబ్ది చివరి భాగంలో మాక్స్ ముల్లర్ సంపాదకత్వాన ఋగ్వేద ప్రచురణ జరిగినప్పుడు మేచ్ఛుని స్పర్శతో అపవిత్రమైపోయిందని దాని ప్రతిని తాకడానికైనా మనవారు నిరాకరించినట్టు ఎందరికి తెలుసు? దాన్ని ముట్టుకుంటే గోహత్య పాపాన్ని మించినట్టిది చుట్టుకోగలదన్న ప్రచారం ఆనాడు విశేషంగా జరిగినట్టు ఎందరికి తెలుసు?

దాదాపు ఇదే సమయంలో కలకత్తాలోని స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ జరిగిన ఒక విచిత్రమైన సమ్మె సంగతి కూడా చాలామందికి బహుశా తెలియదు. ఆ సంస్థ ప్రధానాచార్యుడైన ఇ.బి. హ్యావెల్కు వ్యతిరేకంగా కొనసాగిన ఆ సమ్మె పుట్టుపూర్వోత్తరాలు సవిస్తరంగా తెలుసుకోదగినట్టివే.

అప్పటిలో మనదేశంలో చిత్ర, శిల్ప కళలలో విద్యాసంస్థలు నాలుగు మాత్రం ఉండేవి. వాటిలో తొలిగా వెలిసినట్టిది మద్రాసులోని సంస్థ. దీన్ని 1850లో ప్రారంభించారు. తర్వాత 1854లో కలకత్తాలోను, 1857లో బొంబాయిలోను, 1875లో లాహోరులోను ఇట్టి సంస్థలను నెలకొల్పడం జరిగింది. చిత్ర, శిల్ప కళలను నేర్పడం తర్వాత తర్వాత ప్రారంభించినా, ఆదిలో ఈ సంస్థల ప్రధానోద్దేశం నశించిపోతున్న కుటీర పరిశ్రమలను పునరుద్ధరించడమే!

నిజానికి, నాటి మన బ్రిటీష్ పరిపాలకులకు భారతీయ చిత్ర, శిల్పకళలను గురించి చెడ్డ నిరసనభావం ఉండేది. వారి కంటికి అవి అసహ్యమైనవిగా, అనాగరికమైనవిగా కనిపించేవి. కళాతత్త్వవేత్తగా, విమర్శకుడుగా విశేష విఖ్యాతి నార్జించుకొన్న జాన్ రస్కిన్ 1858లో భారతీయ చిత్ర, శిల్పకళలను గురించి లండన్లో ప్రసంగిస్తూ, భారతీయులు కన్నులుండి కూడా కానలేని వారన్నాడు. వారికి పగలు సూర్యుడు లేడన్నాడు; రాత్రి నక్షత్రాలు లేవన్నాడు; వారికి

కొండలు కోనలు లేవన్నాడు, చెట్లు, చేమలు, పువ్వులు, పిందెలు లేవన్నాడు; పక్షులు, పశువులు లేవన్నాడు; వారికి సంబంధించినంత వరకు ప్రకృతి అనేది లేదన్నాడు; దాని సౌందర్యం, దాని శోభలేదన్నాడు. వారిది శూన్యలోక మన్నాడు. శుష్క జీవిత మన్నాడు. తమ అజ్ఞానం సృష్టించిన భూతప్రేత పిశాచాలే వారి బ్రతుకులపై రాజ్యం చేస్తాయన్నాడు. అందువల్లనే భారతీయ చిత్రకారులు ఏవో పిచ్చిగీతల ద్వారా తప్ప పువ్వును చూపించలే రన్నాడు; భారతీయ శిల్పులు ఎనిమిది చేతులతో రాక్షసాకృతిని తప్ప సహజ మానవమూర్తిని సృష్టించలే రన్నాడు. జేమ్స్ హెచ్. కజిన్స్ చెప్పినట్టు, రస్కిన్ ప్రసంగాన్ని వినివుంటే, మహాబలిపురంలోని నంది నవ్వి ఉండేది, ఏనుగు వెక్కిరించి ఉండేది.

1858లో రస్కిన్ వెలిబుచ్చిన భావాలను పోలిన వాటినే 1885లో సర్ మోనియర్ విలియమ్స్ ప్రకటించాడు. ఆయన సంస్కృత పండితుడు. ఈయనకు పర్షియన్, హిందుస్తానీ భాషలు కూడా తెలుసు. ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీలో సంస్కృత పీఠానికి ఆచార్యుడుగా ఈయన పనిచేశాడు. మూడుసార్లు ఈయన ఇండియాలో పర్యటించాడు. సంస్కృతం ఇంగ్లీషు, ఇంగ్లీషు సంస్కృతం నిఘంటువులను ప్రచురించాడు. హిందూ మతంపై, పురాణాలపై, కవితపై పెక్కు ప్రామాణిక గ్రంథాలను రచించాడు. ఐనా, ఇండియా మొత్తంమీద అందమైన ఒక చిత్రంకాని, శిల్పంకాని కంచుకాగడాతో వెతికినా కనిపించవని, దేవతా విగ్రహాలు సైతం రాత్రిపూట పీడకలలు తెప్పించేవిగా ఉంటాయని ఈయన రాశాడు!

భారతీయ కళాహృదయాన్ని, దాని రహస్యాలను తెలుసుకొనడానికి యత్నించని రస్కిన్ మోనియర్ విలియమ్స్ వాటిని తెగనాడుతూ, తూలనాడుతూ ప్రసంగించడం అబ్బురం కాదు. కాని, మన చేతిపనులను, వాటి అందచందాలను ఎంతో మెచ్చుకొంటూ, వాటిని గురించి "ఇండస్ట్రియల్ ఆర్ట్స్ ఆఫ్ ఇండియా" అనే పేరుతో మంచి పుస్తకాన్ని రాసిన సర్ జార్జి బర్డ్ వుడ్ కూడా భారతీయ శిల్పకళ విషయమై ఇంత వింతగానే, ఇంత వెర్రిగానే మాట్లాడాడు. కళాకాంతులు లేని ఒక నిర్జీవ ప్రతిమగా ధ్యాన బుద్ధ విగ్రహాన్ని ఆయన నిరసించాడు. ఐతే, రస్కిన్, మోనియర్ - విలియమ్స్, బర్డ్ వుడ్ ప్రభృతుల ఈ విమర్శలకు మనం ఆగ్రహపడనక్కరలేదు. గత శతాబ్దంలో మనకైనా మన చిత్ర శిల్పకళలను గురించి - ప్రేమగౌరవాల మాట విడిచిపెట్టండి - కనీసం ఆదరాభిమానాలైనా లేవు. అంతకు కొన్ని శతాబ్దాలకు ముందే బౌద్ధ స్థూపాలు మనకు "లంజ దిబ్బలు" అయిపోయాయి, బౌద్ధ శిల్పాలు మనకు ముగ్గురాళ్ళు అయిపోయాయి. హిందూ దేవతా విగ్రహాలనైనా, అర్చనలేని వాటిని నిర్లక్ష్యం చేయడం మనకు పరిపాటి అయిపోయింది. మన ఉద్ధరణి, పంచపాత్ర దశావతారాల చెంబు, దీపస్తంభం మొదలైనవి మనకు "మోటు" వస్తువులు కాగా, వాటిని పాత

లోహం కింద తెగనమ్ముకున్నాం. నగిషీ పనితో కూడిన భోజనం పీటలు, దరవాజాల రెండు ప్రక్కల పైభాగంలో ఉండే గుర్రపు పీటలు, లతలను, పద్మాలను చెక్కిన మండిగాలు వగైరాలు కూడా మోటు వస్తువులు కాగా, వాటిని విరిచి పొయ్యిలో పెట్టుకున్నాం.

మన కళలకు మన మివ్వని విలువను అన్యులిస్తారా? మనకే అవి మూగవోతే అన్యులతో అవి సంభాషించగలవా? వారికి తమ హృదయాన్ని విప్పి చెప్పగలవా? మనం స్వయంగా నిరాకరించిన, నిర్లక్ష్యం చేసిన మన ప్రాచీన కళలన్నీ, ఆ కళాసంప్రదాయాలన్నీ కాలగర్భంలో కలసిపోనున్న ఘట్టంలో వాటి సముద్ధరణకై కంకణం కట్టుకొన్నది కొందరు ఆంగ్ల ప్రముఖులే! వారిలో ముగ్గురు ప్రముఖులు జేమ్స్ ఫెర్గుసన్, జేమ్స్ బర్జెస్, ఇ.బి. హ్యావెల్. ఈ విషయంలో వీరందరినీ మించిన సేవ ఆనందకుమార స్వామి చేశాడనుకోండి. అయితే, ఆయనైనా

దాదాపు విదేశీయుడన్న సంగతిని మరచిపోరాదు. ఆయన తండ్రి తమిళుడు కాగా, తల్లి బ్రిటీష్ మహిళ. పైగా, ఆయన పుట్టింది ఇండియాలో కాదు, సింహళంలో. మద్రాసులోని స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధిపత్యం వహించడానికి 1884లో బ్రిటన్ నుంచి కొత్తగా వచ్చినప్పుడు హ్యావెల్కు మన కళల విషయమై ఎంతగా తెలుసునో స్పష్టంగా చెప్పలేము. అదివరకు నడుస్తున్న పద్ధతులలోనే స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ను ఆదిలో ఆయన నడుపుతూ వచ్చాడు. కాని, భారతీయ చరిత్రలో, కళలతో, సంస్కృతితో ఎక్కువ పరిచయాన్ని కలిగించుకొన్నకొలదీ ఆ సంస్థ నిర్వహణ పద్ధతులు శుష్కమైనవిగా ఆయనకు గట్టి నమ్మకం కుదిరింది. భారతీయ కళల పునరుద్దీపన కృషి ఫలించాలంటే, అది భారతీయ సంప్రదాయాల ప్రకారమే, భారతీయ పద్ధతులపై, భారతీయుల ద్వారానే జరగాలి. కాలం మారినప్పుడు, కాలంతోపాటు జీవిత దృక్పథం, విధానం మారినప్పుడు, ఆ మార్పులకు అనుగుణంగా చిత్ర, శిల్ప, వాస్తు కళలలో మార్పులు జరగాలి. వాటిని సాధించగల ప్రజ్ఞాప్రాభవాలు భారతీయులలో కొరవడినవని చెప్పడం అజ్ఞానం వల్లనే, లేదా, అహంకారం వల్లనే. క్రమంగా ఈ భావాలు ఆయనలో బలపడినాయి. పాత పద్ధతులను, సంప్రదాయాలను కొత్త కాలానికి తగినట్టు మార్చగల కళాకారులు కావాలని వెతికితే, భారతీయులలోనే కానరాకపోదన్న విశ్వాసం ఆయనకు కుదురుకొన్నది. ఈ విశ్వాసం నిరాధారమైంది కాదని నిరూపించడానికి హ్యావెల్కు ఎంతోకాలం పట్టలేదు. మద్రాసు స్కూల్లో కొయ్యపై నగిషీ చెక్కడాన్ని నేర్పడానికై రామనాడ్ నుంచి ఒక గొప్ప శిల్పిని ఆయన పిలిపించగలిగాడు; లోహ విగ్రహాలను పోతపోయగల ఒక ప్రథమశ్రేణి స్థపతిని కుంభకోణం నుంచి రప్పించగలిగాడు; ఆభరణాలను చేయడంలో అత్యంత కుశలుడైన ఒక స్వర్ణకారుని విశాఖ జిల్లా నుంచి నియమించ గలిగాడు. ఏ డిగ్రీలు, డిప్లొమాలు లేకపోయినా, ఈ ముగ్గురు యూరప్ లోని ఏ కర్మకారునికి తమ తమ ప్రత్యేక రంగాలలో ఎంతమాత్రం తీసిపోనివారే! తరతరాల నుంచి వచ్చిన ఇంద్రజాల మహేంద్రజాలం వారి వేళ్ళ కొసలలో ఉన్నదని వారు తేలికగానే రుజువు చేశారు. పాత నమూనాలు వారికి కొట్టిన పిండి. కొత్త వినియోగాలకు కొత్త నమూనాలు కావాలంటే, అడిగినంతలో వాటిని వారు రూపొందించారు. ఆ రూపొందించడం పూర్వసంప్రదాయాలకు భంగం కలగకుండా, భారతీయతకు అపచారం జరగకుండా తాము నేర్చిన విద్యలను విద్యార్థులకు నేర్పడంలో సైతం వారెంతగానో ప్రజ్ఞ

చూపించి, హ్యావెల్ను మెప్పించారు. ఐతే, మాత్రమేమి? ఆయన కలకత్తాకు బదిలీ కాగానే మద్రాసు సంస్థను అల్యూమినియం వంటపాత్రలను చేసే వర్కుషాపు కింద తిరిగి మార్చి వేశారు!

అప్పటిలో కలకత్తా భారత రాజధాని. అందువల్ల అక్కడి స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ మద్రాసు సంస్థ కంటే నాలుగేళ్ళు చిన్నదైనా అనేక విధాల ఎంతో ముఖ్యమైనట్టిది. కుటీర పరిశ్రమలలో శిక్షణతోపాటు దానిలో చిత్ర, శిల్పకళల బోధన కూడా కొనసాగుతూ ఉండేది. ఐతే, ఆ బోధన పాశ్చాత్య కళారీతులలో మాత్రమే! అంధప్రాయంగా పాశ్చాత్య చిత్రాలను, శిల్పాలను అనుకరించగల వారిని సృష్టించడమే దాని లక్ష్యం. ఇందుకోసం సాలుకు 250 పౌనులను ఖర్చుచేసి, స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ్కు మాతృసంస్థగావున్న కలకత్తా ఆర్ట్ గ్యాలరీకి యూరోపియన్ చిత్రాలను, శిల్పాలను దిగుమతి చేస్తుండేవారు. ఈ కొద్ది మొత్తానికి ఒక ఉత్తమ చిత్రమైనా లభించదు కాబట్టి, రెండవ రకం, మూడవ రకం సరుకును దిగుమతి చేస్తుండేవారు. ఆ నాసిరకం సరుకును కాపీ చేయిస్తే, భారతీయ కళారంగంలో ఏదో మహావిప్లవం రాగలదని అప్పటి నమ్మకం!

ఏదైనా ఒక వస్తువును, లేదా ఒక దృశ్యాన్ని యథాతథంగా చిత్రించడాన్ని పెక్కేండ్లపాటు సాధనం చేయడం ద్వారా కేంద్రీకృత దృష్టిని, హస్తనైపుణ్యాన్ని అలవరచుకొనడం పాశ్చాత్య కళారీతి. ఈ రీతి మంచి చెడ్డలతో మన కిచ్చట పనిలేదుగాని, దీనిపట్ల కలిగిన అసంతృప్తి కారణంగానే ఇటీవల పాశ్చాత్య కళాప్రపంచంలో ఇంప్రెషనిజం, ఎక్స్ప్రెషనిజం, క్యూబిజం, సర్రియలిజం, యాబ్స్ట్రాక్టిజం మొదలైన రీతులు తలయెత్తినవేమో! ఏమైనా, పాశ్చాత్య కళారీతి భారతీయ రీతి కాదు. ఒక వస్తువునో, దృశ్యాన్నో చూస్తూ, దాన్ని భారతీయ చిత్రకారుడు యథాతథంగా చిత్రించాడు. దాన్ని అతడు చూస్తాడు; తదేక దృష్టితో చూస్తాడు; తన్మయత్వంతో చూస్తాడు; చూచినదాన్ని తన మనోఫలకంపై హత్తుకొనడానికి ప్రయత్నిస్తాడు; అంతర్భాగంలో నిలిచిన ఆ చిత్రాన్ని ఏకాంతంలో స్ఫురణకు తెచ్చుకొని, దానికొక బాహ్యాకృతిని కల్పిస్తాడు. అది ప్రకృతికి చేరువగానే ఉంటుంది. కాని, అదే సమయంలోనే కొంత భిన్నంగా కూడా ఉంటుంది. మూగతనానికి గొంతు నిచ్చేది ఆ భిన్నత్వం; పసలేని వచనానికి కవితావాసనలను కూర్చేది ఆ భిన్నత్వం, సాధారణత్వంలో సాంకేతికపు విలువలను పొదిగేది ఆ భిన్నత్వం, భౌతికకాయంలో ప్రాణప్రతిష్ఠ చేసేది ఆ భిన్నత్వం. ఈ సత్యాన్ని గుర్తించనేరనివారు భారతీయ కళల పునరుజ్జీవనానికి ఎంతమాత్రం తోడ్పడలేదు.

మద్రాసులో ఉండగానే హ్యావెల్ ఈ సత్యాన్ని గుర్తించాడు. అందువల్ల 1896లో కలకత్తా స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ కు ప్రిన్సిపల్గా వెళ్ళగానే ఆయన చేసిన మొదటి పని - అక్కడి ఆర్ట్ గ్యాలరీలోని పాశ్చాత్య చిత్రాలను, శిల్పాలను వేలం వేయించి, ఆ డబ్బుతో ప్రాచీన భారతీయ చిత్రాల, శిల్పాలను కొనడానికి ఆ గ్యాలరీ అధికారుల సమ్మతిని సంపాదించడం! ఆ తర్వాత ఆయన చేసినట్టిది మొదటిదానికంటే ఎంతో కష్టమైన పని. అది భారతీయ కళలను భారతీయ పద్ధతులలో బోధించడానికి తగు చర్యలను తీసుకొనడం!

ఈ నూతనోద్యమానికి హ్యావెల్ సన్నద్ధపడినంతనే ఉత్తమోత్తమమైన, సమకాలీనమైన, నాగరికమైన పాశ్చాత్య పద్ధతులను తామెక్కడ నేర్చుకుపోతామో అన్న దురుద్దేశంతోనే హ్యావెల్ వ్యవహరిస్తున్నట్టుగా ఆరోపించి,

స్కూల్ ఆఫ్ ఆర్ట్స్లోని విద్యార్థులు సమ్మె చేశారు. ఈ సమ్మె ఎంతో చిత్రమైనది కాగా, ఇంతకంటే కూడా చిత్రమైన సంఘటన దీన్ని నాటి భారతీయ నాయకులు, పత్రికలు పూర్తిగా బలపరచడం! ముఖ్యంగా "బెంగాలీ" అనే పత్రిక హ్యావెల్పై

కత్తి దూసింది. చిత్రకళాబోధనలో జాతీయ పద్ధతులను ప్రవేశపెట్టడం ద్వారా విద్యా ప్రమాణాలను తగ్గించడానికి ఆయన ప్రయత్నిస్తున్నట్టు అది నిందించింది! తనకు వ్యతిరేకంగా ఎంత పెద్ద తుపాను చెలరేగినా హ్యావెల్ నిశ్చలంగా నిలిచినందున అచిరకాలంలోనే భారతీయ చిత్రకళారంగంలో ఒక నవోద్యమం తలయెత్తింది. దీని ఫలితమే ఈ శతాబ్ది ప్రారంభంలో ఆవిర్భవించిన వంగేయ కళారీతి (బెంగాలీ స్కూల్ ఆఫ్ పెయింటింగ్). దీనికి నాయకుడు అవనీంద్రనాథ్ టాగోర్. కలకత్తా స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థిగా చిత్రకళ నభ్యసించిన తన తండ్రి గుణేంద్రనాథ్ వద్ద అవనీంద్రనాథ్ ఆదిలో కొంతకాలంపాటు బొమ్మలను గీయడం నేర్చుకొనడం జరిగింది. తర్వాత ఆయన కలకత్తా స్కూల్లో స్వయంగా చేరి, మొదట ఒ.గిల్ హార్డి అనే ఒక ఇటాలియన్ వద్ద, తర్వాత చార్లెస్ సామర్ వద్ద పాశ్చాత్య కళారీతులలో కొంత ప్రవేశాన్ని సంపాదించాడు. వంగదేశపు గ్రామీణ దృశ్యాలను చిత్రిస్తూ, తన పినతండ్రి రవీంద్రనాథ్ గేయసంకలనాలకు చిత్రాలంకరణను సమకూర్చుతూ ఆరు సంవత్సరాలు గడపిన పిమ్మట, పాశ్చాత్య కళారీతుల పట్ల అవనీంద్రనాథ్ ఆయనకే స్పష్టంగా తెలియని ఏదో అసంతృప్తి, ఏదో వైముఖ్యం జనించింది. సరిగా ఈ ఘట్టంలో హ్యావెల్ ప్రిన్సిపల్గా కలకత్తాకు రావడం, కొన్ని మొగల్ చిత్రాలను ఆయన తనకు చూపించడం సంభవించింది. ఇది అవనీంద్రనాథ్ ఒక నూతనోత్సాహాన్ని రేకెత్తించింది. చీకటిలో కన్నుకానక తికమకపడుతున్న తనకు ఒక కొత్త వెలుగుదారి హఠాత్తుగా గోచరించినట్టు అనిపించింది. ఆ క్షణంలో హ్యావెల్, అవనీంద్రనాథ్ మధ్య గురు శిష్య సంబంధంతోపాటు, ఒక నూతన గమ్యస్థానం దిశలో కలిసి పయనిస్తున్న యాత్రికులమనే భావన సైతం కుదురుకున్నది.

హ్యావెల్ ప్రోత్సాహ ప్రోద్బలాలతో భారతీయ చిత్రకళ పునరుద్దీపనానికి అవనీంద్రనాథ్ ప్రారంభించిన నూతనోద్యమం వంగ రాష్ట్రానికే పరిమితం కాక, అన్య ప్రాంతాలకు సైతం క్రమక్రమంగా వ్యాపించింది. కలకత్తా స్కూల్ ప్రిన్సిపల్ పదవి నుంచి 1905లో హ్యావెల్ ఛటర్జీ మచిలీపట్నంలోని జాతీయ కళాశాలలో చిత్రకళా విభాగానికి ప్రధానాచార్యుడుగా వచ్చాడు. ఇందుమూలంగా, వంగచిత్రకళారీతి దేశం నలుమూలలకు వ్యాపించింది. మన తెలుగు చిత్రకారులలో అడివి బాపిరాజు, కౌతా రామమోహనశాస్త్రి, కౌతా ఆనందమోహన్ శాస్త్రి, గుర్రం మల్లయ్య, తేజోమూర్తుల కేశవరావు, కుమారిలస్వామి, కె.శేషగిరిరావు, వేలూరి రాధాకృష్ణ, జి.వి.సుబ్బారావు, పైడిరాజు, హెచ్. వి. రామగోపాల్, ఎ.ఆర్. కృష్ణ, కె.ఎల్.ధర్ మొదలైనవారు అవనీంద్రనాథ్ శిష్యులు కారుగాని, ఆయన ప్రశిష్యులు.

హ్యావెల్, అవనీంద్రనాథ్ కు మూలపురుషులుగా ఆవిర్భవించిన చిత్రకళారీతి ఈనాడు మరుగున పడిపోయి ఉండవచ్చు. అందుకు కారణాలేవో ఇప్పుడిక్కడ మనం చర్చించనక్కరలేదు. దానిలో ఏమి లోపాలున్నా, భారతీయ చిత్ర, శిల్పకళల విశిష్ట సంప్రదాయాలపట్ల తిరిగి ఆసక్తి కలగడం దానివల్లనే! ఆ సంప్రదాయాలకు

అనుగుణంగా కనీసం కొందరైనా ప్రస్తుతం కొత్త కొత్త ప్రయోగాలను కొనసాగిస్తూ ఉండడం దానివల్లనే! హ్యావెల్ ప్రేరణ లేకపోతే, ఈ నూతన ప్రయోగాలకు అంకురార్పణ జరిగివుండేది కాదు. 1934లో హ్యావెల్ కాలధర్మం చెందినప్పుడు శ్రీ రవీంద్రనాథ్ టాగోర్ పేర్కొన్నట్టు, అన్య దేవాలయాల పూజ నుంచి మన దేవాలయాలకు మనలను మరలించింది. ఆయనే! సన్నగిల్లిన మన ఆత్మవిశ్వాసాన్ని పునరుద్దీపింపజేసింది ఆయనే. అంధప్రాయమైన అనుకరణ నుంచి భారతీయ కళలను సముద్ధరించింది ఆయనే. ఇంతకంటే ముఖ్యంగా, భారతీయ కళలపట్ల పాశ్చాత్య ప్రపంచాని కున్న నిరసన భావాన్ని తొలగించింది ఆయనే!

హ్యావెల్ కంటే ముందుగా భారతీయ చిత్ర, శిల్ప కళలను గురించి గ్రంథాలు రాసినవారు లేకపోలేదు. ఐతే, కన్నింగ్రమ్, ఫెర్గుసన్, బర్జెస్, గ్రున్వెదెల్ ప్రభృతులు రచించిన ఈ గ్రంథాలన్నీ ప్రధానంగా పురాతత్వశాస్త్రదృష్టి నుంచి. ఈ పరిస్థితిలో ఒక కళాకారుడుగా కళాదృష్టి నుంచి మన కళలను గురించి ఒక ప్రామాణిక గ్రంథాన్ని ప్రప్రథమంగా ప్రచురించిన ఘనత హ్యావెల్ దే. దీనిపేరు “ఇండియన్ స్కల్ప్చర్ అండ్ పెయింటింగ్” దీని ప్రథమ ముద్రణ 1908లో వెలువడింది. దీని తర్వాత 1911లో ఆయన “ఐడియల్స్ ఆఫ్ ఇండియన్ ఆర్ట్” అనే తన రెండవ గ్రంథాన్ని ప్రకటించాడు. ఆ మరుసటి యేడు “ది బేసిక్ ఫర్ ఆర్టిస్టిక్ అండ్ ఇండస్ట్రియల్ రివైవల్ ఇన్ ఇండియా” అనే పేరుతో మద్రాసు నుంచి ఆయన తన వ్యాస సంకలనాన్ని ప్రచురించాడు. మరి మూడేళ్ళకు (1915లో) “ది ఏన్షెంట్ అండ్ మిడీవల్ ఆర్కిటెక్చర్ ఆఫ్ ఇండియా” అనే మరొక రచన చేసి “గురువు ఆశీస్సులతో” అంటూ దీన్ని అవనీంద్రనాథ్ టాగోర్కు అంకితం చేశాడు. ఈ మధ్యలో "ఇండియన్ ఆర్కిటెక్చర్ : ఇట్స్ సైకాలజీ, స్ట్రక్చర్ అండ్ హిస్టరీ" అనే మరొక గ్రంథాన్ని ప్రకటించాడు. కాగా, “హ్యాండ్ బుక్ ఆఫ్ ఇండియన్ ఆర్ట్"ను ఆయన ప్రచురించింది 1920లో. అంతకు కొంచెం ముందుగా 1918లో “ది హిస్టరీ ఆఫ్ ఆర్యన్ రూల్ ఇన్ ఇండియా” అనే ఒక చారిత్రక గ్రంథాన్ని కూడా హ్యావెల్ రాశాడు. బహుశా ఆయన చివరి పుస్తకం "ది హిమాలయాస్ ఇన్ ఇండియన్ ఆర్ట్". దీని ప్రచురణ 1924లో. అన్నట్టు, అన్నిటికంటే ముందుగా 1905లో ఆయన “బెనారస్ : ది సెక్రెడ్ సిటీ” అనే గ్రంథాన్ని ప్రచురించాడు. ఇదే ఆయన తొలిరచన. ఇంచుమించు ఒకే విషయాన్ని గురించి ఇన్ని గ్రంథాలను రచించినప్పుడు చెప్పిన విషయాన్నే తిరిగి చెప్పడం, ఎంత ప్రయత్నించినా, కొంతవరకు అనివార్యంగా జరుగు తుంది. హ్యావెల్ రచనలలో ఈ లోపంతోపాటు మరికొన్ని కూడా కానవస్తాయి. మాక్సిముల్లర్ ప్రభావం వల్లనే కావచ్చు, భారతీయ సంస్కృతిపై అనార్య జాతుల ముద్ర చాలా బలంగా పడిన సంగతిని

ఆయన గుర్తించలేకపోయాడు. తాను రచనలను చేస్తున్న కాలం నాటికి హరప్ప, మొహంజొదారోలు విస్మృతి గర్భం నుంచి బయటపడనందునే ఆయన ఈ పొరపాటు చేసినట్టు సరిపెట్టుకోలేము. మరింత జాగ్రత్తగా, మరింత నిష్పాక్షికంగా పురాణేతిహాసాలను చదివివున్నా,

ఆర్యరాజులు, రారాజులు తమ రాజప్రాసాదాల నిర్మాణానికి వినియోగించిన స్తపతులు దాదాపు పూర్తిగా అనార్యజాతులకు చెందినవారన్న సత్యం హ్యావెల్కు తెలిసివుండేది. హ్యావెల్ రచనలలో పేర్కొనదగు మరొక లోపం మన అమరావతి శిల్పరీతిని చులకన చెయ్యడం. నిజానికి ఈ రీతి అన్యదేశాలను (ముఖ్యంగా సింహళం, బర్మా, థాయిలండ్, కంబోడియా, జావా, చైనాలను ప్రభావితం చేసినంతగా మరేదీ చేయలేదు.

హ్యావెల్ ఎంతగానో మెచ్చుకున్న సాంచీ స్తూపానికి తోరణాలు అమరింది (సర్ జాన్ మార్షల్, ఫీచర్లు నిరూపించినట్టు) ఆంధ్ర శాతవాహనుల కాలంలోనే కాబట్టి, వాటిని తీర్చిదిద్దినవారు ఆంధ్ర శిల్పులని తీర్మానించుకొనడం అనుచితం కాదేమో! ఏమైనా, పెక్కుమంది భారత శిల్ప చరిత్రకారుల నిర్ణయం ప్రకారం బౌద్ధశిల్పం పరాకాష్ఠను అందుకొన్నది అమరావతిలోనే! అమరావతి శిల్పాన్ని అనాలోచితంగా చిన్నచూపు చూచినట్టే, క్రీస్తుశకం ఏడెనిమిది శతాబ్దాలకు,

పద్నాల్గవ శతాబ్దానికి మధ్యకాలం నాటి భారత శిల్పాన్ని అకారణంగా హ్యావెల్ ఆకాశానికి ఎత్తివేశాడు. ఆయన రచనలలో మరొక విమర్శనీయాంశం - కన్నింగ్హామ్, ఫెర్గుసన్, బర్జెఫ్ మొదలైన పురాతత్వ శాస్త్రవేత్తల కృషికి తగు విలువ నివ్వలేకపోవడం. తొలిగ్రంథాలు రెండింటిని మలిముద్రణకు సిద్ధం చేసిన సందర్భంలో వాటిలో హ్యావెల్ పెక్కు మార్పులను, చేర్పులను చేసినా, వాటిలో గల ప్రధానమైన లోపాలు తొలగలేదనే చెప్పాలి. ఐనా, భారతీయ చిత్ర, శిల్పకళల పట్ల ప్రపంచానికి నేడున్న శ్రద్ధాసక్తులకు, ప్రేమగౌరవాలకు పునాది వేసినట్టివి ఆయన తొలిగ్రంథాలే అని నిశ్చయంగా చెప్పవచ్చు. కలకత్తాలోని విక్టోరియా మెమోరియల్ భవనాన్ని భారతీయ వాస్తుశాస్త్రం ప్రకారం కట్టించడానికి ఆయన చేసిన ప్రయత్నం విఫలమైవుండవచ్చు. ఈ సందర్భంలో అప్పటి వైస్రాయి కర్జన్ చెప్పిన అభ్యంతరం కలకత్తా యూరోపియన్ నగరమని!) కలకత్తా నుంచి ఇండియా కేంద్ర ప్రభుత్వాన్ని ఢిల్లీకి మార్చినప్పుడు కొత్త రాజధాని నగరాన్ని భారతీయ వాస్తుశాస్త్ర సూత్రాల ప్రకారం కట్టించాలని ఆయన చేసిన కృషి సైతం నిష్ఫలమై ఉండవచ్చు. ఐనా, మన చిత్ర, శిల్పకళల వైశిష్ట్యాన్ని, వాటి వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంలో మాత్రం ఆయన పూర్తి విజయాన్ని సాధించాడు.

(ఆంధ్రజ్యోతి 18-4-1965)

## ప్రొఫెసర్ హెరాల్డ్ జె. లాస్కీ - 1



పోయిన శనివారంనాడు పరమపదించిన ప్రొఫెసర్ హెరాల్డ్ జె. లాస్కీ మహాపండితుడు. న్యాయశాస్త్రంలో ఆయన నిష్ణాతుడు; ఆర్థిక శాస్త్రంలో ఘటికుడు; రాజకీయ శాస్త్రంలో ఉద్దండుడు; సాంఘికశాస్త్ర పారంగతుడు. ఈ చతుర్విధ శాస్త్రాలలో పాండితీ ప్రకర్షకు ఆయనను మించగలవారు సమకాలికులలో లేరనే చెప్పవచ్చు.

పాండితికీ, ఛాందసత్వానికీ ఎందువల్లనో గాని దగ్గరి చుట్టరికం. ప్రపంచంతోకంటే పుస్తకాలతో ఎక్కువ పరిచితి ఇందు కొక కారణమేమో, ఇప్పటి విషయాలను తరచడంలో కంటే వెనకటి విషయాలను తవ్వడంలో ఎక్కువ కాలాన్ని గడపడం ఇందుకు మరొక కారణమేమో, మూసలో చల్లారిన లోహం రూపు తేలినట్టు, ఒక స్థిరరూపాన్ని ధరించిన గతాన్ని ప్రేమించ నారంభించిన తర్వాత, కళపెళ ఉడుకుతూ, పొగలు కక్కే, రవ్వలను జిమ్మే వర్తమానంపట్ల వెగటు తోచడం ఇందుకు వేరొక కారణమేమో!

కారణా లేవైనా పండిత ప్రకాండులైనవారిలో బహుళ సంఖ్యాకుల చూపు వెనకకేకాని, ముందుకు కాదు; వారు జీవితవాహినీతీరంపై నడయాడతారేకాని, ప్రవాహంలోకి దూకరు; దున్నిన చాలునే మరొకసారి దున్నుతారు గాని, కొత్తచాలు వెయ్యలేరు; పండిన పంటలో తాలుకాయ, తప్పకాయ తూర్పారబట్టగలరేగాని, కొత్త పంట పండించలేరు.

ఈ లోపాలు పాశ్చాత్య పండితులలోకంటే ప్రాచ్య పండితులలో అధికంగా కానవస్తాయి. ఇది దాదాపు వెయ్యి సంవత్సరాలనుంచి ప్రాచ్య విజ్ఞానంలో ఎదుగు బొదుగులు లేకపోవడం వల్లనే కావచ్చు.

ప్రొఫెసర్ లాస్కీ పండితోద్దండుడే కాని, తక్కిన పెక్కుమంది పండితోత్తములవలె - లేక, వీరిని పండితమ్మన్యు లనవలెనా? - గతంలో బ్రతికినవాడు కాదు; జీవిత సమస్యలకు వెన్ను చూపిన వాడుకాడు.

“మానవజాతి ఇటీవల చరిత్రలో జరిగినవాటికి ఏ విధంగాను తీసిపోని విప్లవాత్మక పరివర్తన మధ్య నేడు మన మున్నాము. రోమన్ సామ్రాజ్యం పతనం చెందినప్పుడు, రిఫర్మేషన్ ప్రారంభ మైనప్పుడు, కేపిటలిస్ట్ సంఘం తలయెత్తినప్పుడు లేదా, 1789లో మధ్యమ తరగతి ప్రాబల్య సాధన చరిత్రలో తుది ప్రకరణ రచన కొనసాగినప్పుడు జరిగిన మహత్తర సంఘటనలకు ఇప్పటివి మూలతత్వానికి సంబంధించినంతవరకు భిన్నమైనవి కావు” అని ప్రొఫెసర్ లాస్కీ "రిఫ్లెక్షన్స్ ఆన్ ది రివల్యూషన్ ఆఫ్ అవర్ టైమ్" అనే తన గ్రంథంలో (దీని ప్రథమ ప్రచురణ 1942 తుది భాగంలో) వ్రాశాడు. దీనిలోనే "పండితులు, తత్త్వవేత్తలు దీని రాకను

ముందుగానే కానగలిగినా, దీని పురోగతి పథాలకు స్థూలంగా రూపాలు దిద్దినా, ఈ విప్లవం వారే సాధిస్తున్నట్టిది కాదు" అని కూడా ఆయన వ్రాశాడు.

ప్రొఫెసర్ లాస్కీ జీవితపు నిగ్గు ఈ వాక్యాలలో కలదు గనకనే వీటిని మే మిక్కడ ఉదహరించడం. ఆధునిక విప్లవం రాకను ముందుగా కాంచిన పండితులలో, తత్వవేత్తలలో ప్రొఫెసర్ లాస్కీ ఒకడనడం నిస్సంశయం. ఆ విప్లవ పురోగతి మార్గాలకు ముఖ్యంగా బ్రిటనక్కు సంబంధించినంతవరకు ఆయన స్థూల రూపాలను దిద్దినాడనడం నిర్వివాదం. తుల ఫేబియన్ ఘట్టంనుంచి బ్రిటిష్ సోషలిజంను ప్రస్తుత పరిణతికి తెచ్చిన ఘనత ప్రధానంగా లాస్కీదే, అయితే, ఆయన రచనల ప్రభావం కేవలం బ్రిటన్కు పరిమితం కాలేదు. అన్ని దేశాలకు వాటి ప్రకాశం విస్తరిల్లింది; ఆయన తరంపైనే వాటి దీప్తి పడింది.

మన ఆర్థిక, సాంఘిక వ్యవస్థల మధ్య నేడు సామరస్యం లేదు. ఆర్థికంగా పుష్కలత్వ యుగంలో మనం ప్రవేశించాము. కాని, సంఘంమాత్రం "అందరు అందల మెక్కితే మోసేవారెవ" రన్న స్థాయిలోనె మిగిలింది.

ఆర్థిక, సాంఘిక వ్యవస్థల మధ్య ఇట్టి వైరుద్ధ్య మొదవి నప్పుడెల్ల విప్లవ పరిస్థితు లేర్పడుతాయి.

ఏ కాలంలోనైనా ఆ కాలపు సాంఘిక వ్యవస్థను కాపాడేది ఆనాటి ప్రభుత్వం. అందువల్ల సాంఘిక వ్యవస్థ ప్రాతిపదికలలోనే మార్పును కోరితే ప్రభుత్వంతో సంఘర్షణ తప్పదు. ఈ సంఘర్షణ సర్వసాధారణంగా దౌర్జన్య పూర్వకమైనదే కాక తప్పదు. రక్తపాత రహితంగా ఇది కొనసాగాలంటే; అప్పటి సాంఘిక వ్యవస్థద్వారా (ఉత్పత్తి సాధకాలను కంట్రోల్ చెయ్యడం వల్ల) లాభాలను పొందుతున్న వారికి తగు నష్టపరిహారాన్ని చెల్లించాలి. కొత్త సాంఘిక వ్యవస్థ కల్పించగల కొత్త పరిస్థితులకు వారు సర్దుకొనగల వరకైనా నష్టపరిహారం వ్యాపించాలి. అయితే, ఇందువల్ల తగు ప్రతిఫల మివ్వకుండా సంఘ సంపత్తిని హరించే ఒక కొత్త వర్గాన్ని సృష్టించే ప్రమాదం లేకపోలేదు. కాని; సాయుధ సంఘర్షణ రూపంలో చెల్లించవలసిన మూల్యంకంటే ఇది తక్కువైనదే కావచ్చు.

("ది స్టేట్ ఇన్ థియరీ అండ్ ప్రాక్టీస్", పుటలు 322-23).

పైగా, ఆధునిక ప్రభుత్వంపై సాయుధ విప్లవం సులభం కాదు. దాని మారణ బలసంపత్తి అంత విశేషమైనది. అయినప్పుడు ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారానే సాంఘిక వ్యవస్థలో విప్లవాత్మక పరివర్తనాలను సాధించవచ్చునా? ఏవిధంగా? ఎంతవరకు? నూతన వ్యవస్థలో సమష్టి ప్రయోజన సాధన విధిగా వ్యక్తి స్వాతంత్ర్యాన్ని భంజించవలసిందేమో? వ్యక్తి స్వాతంత్ర్యానికి భంగం కలగని విధంగా నూతన సామాజిక వ్యవస్థను నిర్మించడానికి

వీలులేదా?

ఇట్టి గంభీర విషయాల చర్చతో కూడిన గ్రంథాలను పెక్కింటిని ప్రొఫెసర్ లాస్కీ రచించాడు. వాటి ద్వారా దేశ విదేశాలలో రాజకీయ జిజ్ఞాసను రేకెత్తించాడు. (ఆంధ్రప్రభ 2-4-1950)

## 2



బ్రిటిష్ సోషలిస్టులలో జాన్ బాల్, రాబర్ట్ ఓవెన్, విలియం మారిస్, కెయిర్ హార్డీ, జాన్ బర్న్స్. సిడ్నీ వెబ్, గ్రాహం వాలెస్ ప్రభృతుల కోవకు చెందినవాడు హెరాల్డ్ లాస్కీ, సోషలిస్ట్ తత్వానికి లాస్కీ కొత్తగా కలిపింది ఏమీ లేకపోవచ్చు. కాని, శాంతి, సుభిక్షాలను కోరితే, పురోగతిని, పూర్ణ వికాసాన్ని వాంఛిస్తే, మానవాళి సోషలిజానికే పట్టాభిషేకం చేయాలని ఆయన నిరూపించినన్ని దృక్కోణాలనుంచి మరెవ్వరు నిరూపణ చేయలేదు. లాక్ నుంచి, బెంథామ్ వరకు బ్రిటిష్ లిబరలిజం సిద్ధాంతా లన్నింటిని మధించాడు. బ్రిటిష్ కార్మికోద్యమం పుట్టుపూర్వోత్తరాలను క్షుణ్ణంగా పరిశీలించాడు. బ్రిటిష్ విశ్వవిద్యాలయ సంప్రదాయాలను అవగతం చేసుకున్నాడు. అమెరికా న్యాయశాస్త్రాన్ని, దాని రాజకీయ వ్యవస్థలను ఆకళింపు చేసుకున్నాడు. సోవియెట్ విప్లవ స్వరూపాన్ని తరచిచూచాడు. ఈ అన్ని దృక్కోణాలనుంచికూడా గతానికీ, భావికీ వర్తమానంలో వారధి కావలసింది సోషలిజమేనని సామాన్య పౌరులకు సయితం విశదీకరించాడు. సుబోధకం కాగల విధంగా అనేక ఉద్గ్రంథాల ద్వారా. అశేష కరపత్రాలద్వారా ఫ్రాన్స్ టెయిన్ కంటె, జర్మనీలో మెరింగ్ కంటె, యునైటెడ్ స్టేట్స్లో బియర్డ్కంటే ఎక్కువగా బ్రిటన్ లాస్కీ ప్రస్తుత సాంఘిక వ్యవస్థను మార్చి వేయవలసిన పరమావశ్యకతను బహుళజ జేయగలిగాడు.

నిష్పాక్షిక దృష్టితో సత్యాన్వేషణకు, ఆ సత్యాన్వేషణ ఫలితాల ప్రకటనలో నిశ్చలత్వానికి ప్రొఫెసర్ లాస్కీని ప్రత్యేకించి చెప్పుకోవాలి.

నేటి సోవియెట్, అమెరికన్ జీవిత వ్యవస్థలకు తూర్పు, పడమరల వైరుధ్య మున్నది. వీటిని పరిశీలించి, గుణదోషాలను నిర్ణయించడానికి ఉద్యమించినప్పుడు ఏదో ఒక వైపుకు ఎంతో కొంత మొగ్గు చూపకుండా త్రాసును పట్టుకొనడం ఇటీవలి వారిలో ఒక్క లాస్కీకే చెల్లింది. ఇందువల్లనే ఆయనను రష్యనులు మితవాది కింద జమకట్టగా, అమెరికనులు కేవలం కమ్యూనిజం ఏజెంట్గా నిందించారు.

కేవలం గ్రంథ రచయితగానే కాక, ఆచార్యుడుగా కూడా హెరాల్డ్ లాస్కీ తన తరానికి అవిరళ సేవ చేశాడు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, లండన్ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ శాఖ ప్రపంచం నలుగడల నుంచి విద్యార్థులను ఆకర్షించడానికి ప్రధానకారణం ఆ సంస్థలలో ఆయన అధ్యాపకత్వమే. ఈ రెండు సంస్థలలోనే కాక, మెకిల్ యూనివర్శిటీలో (మాంట్రల్, కెనడా) యేల్. హార్వర్డ్ యూనివర్సిటీలలో (యునైటెడ్ స్టేట్స్) ఆయన పనిచేశాడు.

ఎప్పుడు ఏ విద్యా సంస్థలలో ఆధ్యాపకత్వాన్ని వహించినా, విద్యార్థులు ఆయనను పిరియడ్ల లెక్కను లెక్చరు లిచ్చే ప్రొఫెసర్ను చూచి నట్టు చూడక; గురుదేవునివలె పూజించేవారు. ప్రొఫెసర్ లాస్కీని గురించి "నేను ఆయన పాదపద్మాల వద్ద విద్య నభ్యసించాను" అని భక్తి పూర్వకంగా చెప్పుకునే దేశ దేశాల విద్యార్థులు నేడు వేలసంఖ్యలో కలరు.కేవలం విద్యార్థుల జీవితాలకు సురుచిర రూపాలను దిద్దడంతోనే లాస్కీ సంతృప్తిపడలేదు. నేటి విద్యార్థులు రేపటి పౌరులు కావచ్చు. కాని, నేటి బాగోగులను నిర్ణయించే వారు రాజకీయవేత్తలు. ఇందువల్ల బ్రిటిష్ లేబర్ పార్టీతో సన్నిహిత సంబంధాన్ని పెట్టుకొనడం ద్వారా, ఆపార్టీ నాయకుల నిర్ణయాలను రూపొందించడానికి లాస్కీ ప్రయత్నించాడు.

1936లో ప్రొఫెసర్ లాస్కీ బ్రిటిష్ లేబర్ పార్టీ కార్యవర్గ సభ్యుడైనాడు. ద్వితీయ ప్రపంచ మహా సంగ్రామ సందర్భంలో అప్పటి బ్రిటిష్ ఉపప్రధాని మిస్టర్ క్లెమెంట్ అట్లీకి కొంతకాలం రాజకీయపు సలహాదారుగా పనిచేశాడు గాని, యుద్ధసమయంలో తమ ప్రభుత్వం ఏ వివాదాంశం జోలికిపోరాదన్న చర్చిల్ పట్టుదలకు అట్లీ లొంగిపోయే సరికి, ఆ పదవినుంచి విరమించాడు. 1945లో ఆ క్షణంవరకు అప్రతిహతుడుగా కానవచ్చిన చర్చిల్ ఘోర పరాజయాన్ని పొందిన ఎన్నికల సందర్భంలో బ్రిటిష్ లేబర్ పార్టీ కార్యవర్గానికి అధ్యక్షుడు ప్రొఫెసర్ లాస్కీయే.

ఇంతగా బ్రిటిష్ లేబర్ పార్టీతో సన్నిహిత సంబంధాన్ని పెట్టుకున్నా, మంత్రిపదవులను ప్రొఫెసర్ లాస్కీ ఎన్నడు ఆశించలేదు. అన్యులను తన మతానికి త్రిప్పుకోవడం ద్వారా ఆయన స్వీయ లక్ష్య సాధనకు యత్నించాడేగాని, ఇందునిమిత్తం రాజకీయాధికారాన్ని కోరలేదు. జన్మవల్ల హెరాల్డ్ లాస్కీ బ్రిటీష్ పౌరుడు (ఆయన జననం 1898 జూన్ 30వ తేదీని మాంఛెష్టరులో); జాతివల్ల యూదీయుడు. (ఆయన తాత, ముత్తాతలు పోలెండ్, రష్యాల నుంచి బ్రిటన్కు వలస వచ్చినట్టివారు). యూదీయ జాతికి చెందిన వాడైనందున ఆ జాతి యోగక్షేమాలను గురించి ఆయన సహజంగా శ్రద్ధచూపేవాడు. పాలస్తీనాపట్ల బ్రిటీష్ కార్మిక ప్రభుత్వ విధానాలను పెక్కు పర్యాయాలు ఆయన నిశితంగా విమర్శించాడు. 1949 జనవరిలో "యూదీయ విద్వేషం నుంచి యూదీయ జాతి శేషాన్ని రక్షించడానికి మీరు పూనుకొనలేరా?" అని పండిట్ నెహ్రూకు ఆయన ఒక విజ్ఞప్తి చేశాడు.

తాను యూదుజాతికి చెందినవాడు కాకపోయినా, ఆ జాతి విషయమై ప్రొఫెసర్ లాస్కీ శ్రద్ధ వహించేవాడే. ఎక్కడ అన్యాయం జరుగుతున్నా, ఎవరు అగచాట్ల పాలౌతున్నా, ఆయన మిన్నకుండ గలిగేవాడు కాదు. అమెరికాలో శాకో, వాన్జిటీలకు అన్యాయంగా మరణశిక్ష విధించబడగా, తన శిరస్సే ఉత్తరించబడినంతగా ఆయన వ్యధపడ్డాడు. నాజీ జర్మనీలో డిమిట్రాఫ్, నైముల్లర్లపై అన్యాయంగా కేసులు పెట్టబడగా. "ఇది సభ్యతా ప్రపంచమేనా?" అని ఆయన బాధపడ్డాడు. ఇండియాలో మీరట్ కుట్ర కేసు విషయంలోను. బ్రిటన్లో థామస్ మ్యాన్ అరెస్టు విషయంలోను ఆయన ఇంతగానూ చలించాడు.

భారతదేశం పట్ల, దాని ప్రస్తుత ప్రధాని పండిట్ నెహ్రూ పట్ల ప్రొఫెసర్ లాస్కీ ప్రేమాభిమానాలు ఇంతింత కావు. ఇండియాపై బ్రిటీష్ పరిపాలనను ఖండిస్తూ, ఆయన ఎన్ని వ్యాసాలు రాశాడో, ఎన్ని ప్రసంగాలను చేశాడో లెక్కలేదు?

"బ్రిటీష్ సామ్రాజ్య సమస్యకు ఇండియా కోపురాయి వంటిది. ప్రజాస్వామ్యాన్ని గురించి బ్రిటన్ చెబుతున్న నీతులన్నింటిని విలువ కట్టగల గీటురాయి కూడా భారతదేశం. (ఆంధ్రప్రభ 4-4-1950)

## టార్జాన్

టార్జాన్ స్రష్ట, ఎడ్గర్ రైస్ బర్గోస్ కాలధర్మం చెందాడని నిన్న ఎన్సినో (కాలిఫోర్నియా) నుంచి వార్త వచ్చింది.

ఈ వార్త విన్నంతనే న్యూయార్క్ నుంచి, న్యూగినీ వరకు ఎందరి కళ్ళు చెమ్మగిలినవో! అలాస్కా నుంచి అంటార్కిటిక్ వరకు ఎందరి హృదయం భిన్నమై పోయిందో! టార్జాన్ పాదం పెట్టని ప్రాంతం ప్రపంచం మొత్తంపైనే లేదు; అతడు దిగ్విజయం చేయని దేశమే లేదు.

ఒక రచయిత మస్తిష్కం నుంచి ఉద్భవించిన ఏ పాత్ర పేరూ ఇంతగా ప్రాకిపోలేదనడం అతిశయోక్తి కాబోదు. అన్ని మతాలవారికి టార్జాన్ సమానంగా ఆదరపాత్రుడు; అన్ని జాతుల.

వారికి సమానంగా ప్రేమ భాజనుడు. అన్ని వర్గాల వారికి సమానంగా ఆనంద ప్రదాత; అన్ని వయస్సుల వారికి సమానంగా ఉత్సాహ ప్రదీపకుడు. అతని పేరు వింటేనే అశేష ప్రజాకోటికి సంతోషామోదాలతో శరీరం పులకరిస్తుంది.

మన దేశంలోనూ టార్జాన్ పేరు ప్రతిష్ఠలు అసామాన్యమైనవని వేరుగా చెప్పవలసిన పనిలేదు. ప్రియురాలితో "పిక్నిక్"కు బయల్దేరిన విలాస పురుషుడు ఏ ఏటిగట్టునో నిలిచి, ఏ చెట్టుకొమ్మనో ఎక్కి "ఓహో... హోహోహోహో" అని కేక పెడతాడు. గొడ్లకాడి బుడ్డవాడు ఏ గట్టునో, పుట్టనో ఎక్కి, బువ్వకు వేళైంది రమ్మని తోటి గొడ్లకాపరులను ఇదే పొలికేకతో పిలుస్తాడు. గడుగ్గాయి ఇదివరకు భీముడో, గీముడో కాని, ఇప్పుడు టార్జానే.

సారస్వతంలో నోబెల్ బహుమాన ప్రదానానికి బహుజనామోదమే ప్రధానంగా పరిగణించదగు విషయమైతే ఎడ్గర్ రైస్ బర్గోస్ ఒక్క నోబెల్ బహుమానానికే కాదు; పదింటికైనా తేలికగా అర్హుడయ్యేవాఁడు.

బర్గోస్ సృష్టించిన టార్జాన్ ఇంతటి విశ్వవిఖ్యాత పురుషుడు కావడానికి కారణ మేమిటి? అతడు రామునివలె, కృష్ణునివలె ధీరోదాత్త నాయకుడా? కాదు. ధర్మరాజువలె, జీమూతవాహనుని వలె ధీరశాంతుడా? కాదు. కనీసం వత్సరాజువలె ధీరలలితుడా? ముమ్మాటికీ కాదు.

పోనీ, పాశ్చాత్య సారస్వత సంప్రదాయాల ప్రకారం హెర్క్యులిస్ వలె త్రిజగద్విజేతా? కాదు. ఆర్థర్ వలె శౌర్య, శాంత, ధర్మగుణాలు మూర్తీభవించినవాడా? కాదు. పోనీ, అట్లాస్వలె దేవలోకాలభారాన్ని మోస్తున్న అలౌకిక బలసంపన్నుడా? అదీ కాదు.

ఎంతో కొంత దైవాంశ కలవానికే ప్రపంచ సాహిత్యంలో ఇప్పటివరకు నాయకస్థానం. ఈ సంగతినే “సూపర్ మ్యాన్" కానివాడు నాయకుడు కాలేడనికూడా చెప్పవచ్చు. టార్జాన్ "సూపర్ మ్యాన్” కాదు; “ఏప్ మ్యాన్". అతని బ్రతుకు అడవులలో. అతని సహచరులు కోతులు, చింపాంజీలు, ఇతర జంతువులు. అతని మానసిక ప్రవృత్తి పశువుల మనోవికాసం అంతస్తుకు అంతగా మించిపోయినట్టిదికాదు.

ఇంతకు ముందు తరాల వారిని “సూపర్ మ్యాన్" ఆకర్షించిన దానికి సహస్రగుణంగా ఈ తరం వారిని “ఏప్ మ్యాన్" ఆకర్షించాడంటే ఈ తరం విజ్ఞతను గురించి, సంస్కృతిని గురించి ఆందోళన చెందవలసిన పనిలేదా?

మన రైళ్ళు, స్టీమర్లు, మోటారు కార్లు, మన టెలిఫోన్లు, రేడియోలు, టెలివిజను సెట్లు, మన విమానాలు, టాంకులు, యాటంబాంబులు మొదలైనవాటివల్ల సంస్కృతిపథంలో మనం నాలుగు అడుగులు ముందు వెయ్యడమే నిజంగా జరిగివుంటే, “ఏప్ మ్యాన్” మనకు నాయకుడయ్యేవాడు కాడుగదా?

ప్రకృతిపై మనం నిస్సంశయంగా విజయాన్ని సాధించాము. అందువల్ల మన సంపత్తిని, మన సౌఖ్యాన్ని వృద్ధిచేసుకున్నాం. అయితే, ఇందుకు మానసిక వికాసాన్ని, ఆధ్యాత్మికోన్నతిని పణంగా.

పెట్టినట్టున్నాం. లేకపోతే, మానవోత్తముని పట్ల భక్తిగౌరవాలు విలుప్తం కావడమేమి? పశుప్రాయునిపట్ల ప్రేమాభిమానాలు కుదురుకొనడమేమి?

పోనీ, మనకు విద్య తక్కువా? పూర్వం కంటే ఎక్కువే. అయితే దానిలో హృదయాన్ని పరిపక్వం చేసే గుణం తక్కువ. పూర్వంకంటే విజ్ఞానం హెచ్చే. అయితే, జీవితంలోని మాధుర్యాన్ని అది పిండివేస్తుంది; హైడ్రోజన్ బాంబుల సృష్టి సుసాధ్యం చేస్తుంది. ఇందువల్లనే కాబోలు టార్జాన్ మానవ సామ్రాజ్య రాజాధిరాజు కావడం!

(ఆంధ్రప్రభ 22-3-1950)

## హెచ్.జి. వెల్స్

విద్య వ్యాపిస్తున్నది, విజ్ఞానం వికసిస్తున్నది, వివేకం వృద్ధిచెందుతున్నది; స్వాతంత్ర్యావధులు విస్తరిస్తున్నవి, సంస్కృతి ఒక ఉత్తమ పరిణతికి వస్తున్నది. ఇందువల్ల మరి రానున్నది సువర్ణయుగం - ఇది అర్ధశతాబ్ది నాటి ప్రబల విశ్వాసం.

నాటికంటే నేడు విద్యాలయాల సంఖ్య అధికమే. నాటికంటే నేడు వైజ్ఞానిక శాస్త్ర పరిజ్ఞానం అధికమే. కాని, నాటికంటే నేడు మానవుడు వివేకవంతుడా? నాటికంటే నేడు అతడు అధిక స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నాడా? నాటికంటే నేడు అతడు ఉత్తమ సంస్కృతీపరుడా? ఈ అన్నింటినీ మించి, రానున్నది

సువర్ణయుగమన్న ప్రబల విశ్వాసం ఈనాడు ఎంతగా మిగిలింది? నాటికి, నేటికీ మధ్య ప్రథమ, ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామాల అశ్రువాహినులున్నాయి;

రక్తస్రవంతులున్నాయి. ఇందువల్లనే నాటి ఆశ నేడు లేదు, నాటి విశ్వాసం నేడు లేదు, నాటి ఉత్సాహం నేడు కానరాదు.



నాడు ఎంతో ఆశతో, విశ్వాసంతో, ఉత్సాహంతో జీవితాన్ని ప్రారంభించి, నేడు అంతులేని నిరాశతో, అనేక సంశయాలతో, నిస్పృహ ఆవరిస్తుండగా, ఖిన్నుడై జీవితాన్ని చాలించిన ప్రపంచ ప్రసిద్ధ వ్యక్తి హెచ్.జి. వెల్స్ (1866-1946).

ఆయన పుట్టింది పేదరికంలో, పెరిగింది పేదరికంలో. ఆయన స్వయంకృషితో విద్య నభ్యసించాడు, విజ్ఞానాభివృద్ధి చేసుకొన్నాడు. తన మేధాశక్తి ప్రబలినకొలది, తన భావనాపటిమ పెంపొందిన కొలది, తన విచక్షణ నిశితమైన కొలది, తన దృక్పథం విశిష్టమై, విశాలమైనకొలది, శాంతికి నిలయమై, సంపత్తికి ఆకారమై, సుఖప్రదమై, సంస్కృతీ విరాజితమై శోభిల్లగల నూత్న ప్రపంచాన్ని గురించి ఆయన కలలుగన నారంభించాడు.

తన వలె ప్రతి వ్యక్తీ నూత్న ప్రపంచం విషయమై కలలు గనకపోవడానికీ, దానికోసం కలవరించక పోవడానికీ, కలత చెందకపోవడానికీ, ఆయనకు తోచిన కారణం విద్యతో సమానంగా విజ్ఞానం పెరగకపోవడమే. తనకు స్పష్టమైనది ఇతరులకు అస్పష్టంగా తోచడమేమి, తనకు పరమ లక్ష్యంగా, అనుల్లంఘనీయ గమ్యస్థానంగా కానవస్తున్నట్టి దానిపట్ల ఇతరులు తూష్ణీంభావం వహించడమేమి, ఏ విజ్ఞానభాగ్యం తనకు అబ్బిందో అది ఇతరులకు అబ్బకపోవడంవల్లనే అని ఆయన విశ్వసించాడు. తన ఈ విశ్వాసంతోనే విజ్ఞాన ప్రచారాన్ని తాను వాస్తవికమైనదని నమ్మిన విజ్ఞాన ప్రచారాన్ని వెల్స్ తన కర్తవ్యంగా చేసుకొన్నాడు. కథలు, నవలలు, వ్యాసాలు, కరపత్రాలు, చారిత్రక గ్రంథాలు మొదలైనవి ఎన్నో రచించాడు. భావి చిత్రణకు భూత వర్తమానాల పరిజ్ఞానం అత్యవసరమని దాన్ని ఆయన సాధించాడు. ఆ పరిజ్ఞానం ఆధారంగా ద్రష్టవలె భావికి ఆయన రూపకల్పన చేయగలిగాడు. మోటారుకారు, విమానం, చంద్రగోళయాత్ర మొదలైన అనేక విషయాలను గురించి ముందుగా జోస్యం చెప్పింది ఆయనే.

ఈ జోస్యాలు ఒక్కదాని పిమ్మట మరొకటి వాస్తవం కాగా, తాను ఊహిస్తున్న తాను లక్షిస్తున్నభావి ప్రపంచం అవతరణ విషయమై ఆయనకు విశ్వాసం మరింత బలపడింది.



ఆ ప్రపంచం అవతరణలో విలంబనకు కారణం మానవుని పరిణామం, చరిత్ర, సంస్కృతి మొదలైనవాటిని గురించి ప్రజాబాహుళ్యంలోని అజ్ఞానమే మూలమని భావించి, దాన్ని తొలగించవలెనన్న పట్టుదలతో "మానవ సంస్కృతీ వేదం" రచనకు ఆయన పూనుకొన్నాడు. ఈ పూనిక ఫలితమే ప్రపంచ చరిత్రను గురించి, మానవజాతి, ఆర్థిక, సాంఘిక వ్యవస్థలను గురించి, సుఖప్రద జీవన విధానాన్ని గురించి, భావిప్రపంచ స్వరూపాన్ని గురించి ఆయన రాసిన నాలుగు ఉద్గ్రంథాలు."జీవితం ఒక సజీవస్రవంతి. దాని ప్రవాహం సర్వదా ముందుకే. అది అంతకంతకు విశాలమౌతున్నది, అంతకంతకు గంభీరమౌతున్నది, అంతకంతకు ఉత్తమ పరిణతికి వస్తున్నది"ఈ సందేశ మివ్వడానికే ఆయన ప్రయత్నించాడు. ఈ సందేశాన్ని వ్యాపింపజేస్తే, దీన్ని ప్రపంచం హృద్గతం చేసుకొంటే మానవజాతిలో చెలరేగగల మానసిక విప్లవమే "ఆదర్శ జగత్తు"ను ('యుటోపియా'ను) అవతరింపజేయగలదని ఆయన విశ్వసించాడు.

ప్రథమ ప్రపంచ మహాసంగ్రామం ఆయన ఆశలను కొంతవరకు కుంగదీసింది, ఆయన ఈ కలలను కొంతవరకు కరిగింపజేసింది. ఇక ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామంతో ఆయన ఆశలు పూర్తిగా నిరాశలై పోయినవి; ఆయన కలలు పూర్తిగా పీడకలలై పోయినవి. మానవుని మేధాశక్తి జరాభారంతో శిథిలమై పోయిందనీ, అతడికి సర్వవినాశం తప్పక పోవచ్చుననీ భయపడుతూ ఆయన తనువు చాలించాడు.

అంతటి ఆశావాది ఇంతటి నిరాశావాదిగా మారిపోవడాన్ని, అంతటి పరమవిశ్వాసి ఇంతటి నిస్పృహమూర్తిగా కన్నుమూయడాన్ని తనకొక హెచ్చరికగా మానవజాతి పరిగణించలేకపోతే దానికి సర్వవినాశం తథ్యమే కాగలదు! (ఆంధ్రప్రభ 19-8-1946)

## డాక్టర్ ఐ.ఆర్. సోకర్నో

ఇండొనీసియన్ రిపబ్లిక్ ప్రెసిడెంట్ డాక్టర్ ఐ.ఆర్. సోకర్నోనే యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇండొనీసియాకూడా ప్రెసిడెంట్ గా వరించింది.

ఈ మరణం నిజానికి ఒక వార్త కాదు; విశేషం అసలే కాదు.

ఇండోనీసియా ప్రెసిడెంట్ పదవి కోసమే పుట్టినవానివలె డాక్టర్ సోకర్నోను ఈనాడు ఇంతగా ఇండొనీసియా - ఇండొనీసియాతో పాటు, తక్కిన ప్రపంచం గుర్తిస్తున్నప్పటికీ, పదేళ్లనాడు ఆయన పేరు తెలిసిన వారెందరు? పేరు తెలిసినా, ఆయన ఆధిక్యాన్ని గుర్తించినవారెందరు? "ఇన్సైడ్ ఏషియా"ను జాన్ గంథర్

1939 జూన్లో తొలిసారిగా ప్రచురించాడు. ఫిబ్రవరిలో కొన్ని చేర్పులతోనూ మార్పులతోను దాన్ని పునర్ముద్రించాడు. ఆ మొదటి ముద్రణలోగాని, తర్వాత వచ్చిన పునర్ముద్రణలోగాని డాక్టర్ సోకర్నో పేరు మచ్చుకైనా కనబడదు. నేటి ఆసియా విషయమై, దాని నాయకుల విషయమై కూలంకష గ్రంథంగా పరిగణించబడుతున్న "ఇన్సైడ్ ఏషియా" కర్తకు చివరికి 1942 లో కూడా డచ్ ఈస్టిండీస్ ను గురించిన ప్రకరణలో డాక్టర్ సోకర్నో పేరునైనా ఉదహరించవలసిన ఆగత్యం కానరాకపోవడం అబ్బురం కాదా ? కాని, ఇందుకు జాన్ గంథర్ను విమర్శించవలసిన పనిలేదు. చారిత్రక శక్తుల పరిణామాలను అన్ని సందర్భాలలో ముందుగానే ఊహించడం కష్టం. ముఖ్యంగా వ్యక్తులకు సంబంధించినంతవరకు ఆశక్తులు ఏయే విధంగా పనిచెయ్యగలవో చెప్పడం మరింత దుస్తరం. 1917 లో లెనిన్ ప్రవాసం నుంచి జర్మనీ గుండా స్వదేశానికి మరలిపోవడానికి అనుమతించిన జర్మన్ సైన్యాధికారులు ఒక్క సంవత్సరం తిరగకముందే ఆయన రష్యాకు అధినాథుడు కానున్నాడని కలలోనైనా అనుకొని వుంటారా?

1918 లో ఇండియాను గురించి, దాని రాజకీయరంగ పరిణామాలను గురించి సమీక్షకు ఉద్యమించిన రచయిత గాంధీజీకి ప్రాధాన్యమిచ్చి వుండేవాడా? బహుశా అతడు మోహన్దాస్ కరంచంద్ను పేర్కొనేవాడే కాదేమో.

అయిదారేళ్ళనాడు చైనాను గురించి వ్రాస్తున్న గ్రంథకర్త జనరలిజ్మో చాంగ్-కై-షేక్ 1950 పాదం పెట్టక ముందే ఫార్మోజాలో తలదాచుకోవలసి వస్తుందని వ్రాయగలిగి వుండేవాడా? చారిత్రక శక్తుల ప్రభావమింతటి అప్రతిహతం; వాటి పరిణామమింతటి అనూహ్యం.

1942 నాటికి కాకపోయినా, ఆ తర్వాత డాక్టర్ సోకర్నో పేరు లోకానికి తెలియవచ్చింది. అయితే, అప్పుడది తెలియవచ్చింది ఇండొనీసియన్ క్విస్లింగ్, ప్రజాస్వామిక రాజ్యాలకు విద్రోహిగా, జపానువారి చేతి కీలుబొమ్మగా.

ఈ దుష్ట నామాలన్నింటిని డాక్టర్ సోకర్నోకు తగిలించిన వారు, -డచ్వారు.

డచ్ ఇంపీరియలిస్టులు ఈ చర్య ఎవరికైనా ఆశ్చర్యకరమేమోగాని, మనకు మాత్రంకాదు. నేతాజీ సుభాష్ చంద్రబోసు బ్రిటిష్ ఇంపీరియలిస్టులు సరిగా ఇట్టి పేర్లనే పెట్టలేదా? పరదాస్యం నీచాతినీచం. హేయాతిహేయం. హేయాతిహేయం. దాని విచ్ఛేదంకోసం దేశభక్తుడు ఏ ఆయుధాన్ని ఉపయోగించడానికైనా సంకోచించడు. జపాను తోడ్పాటును అట్టి ఆయుధంగానే సుభాష్ పరిగణించాడు. సోకర్నో పరిగణించాడు. అయినప్పుడు ఇక్కడ బ్రిటిష్ వారికి, అక్కడ డచ్ వారికి వారుభయులు సింహస్వప్నం కావడం వింతకాదు. వారుభయులపై వీరు దూషణ తిరస్కార పదజాలాన్ని సంపూర్తిగా ప్రయోగించడం విశేషం కాదు.

మనదేశానికి చెందినవాడు కాకపోయినా, సుభాష్ వలె సోకర్నో కూడా గాంధీజీ భక్తుడే. మహాత్ముని విశ్వాసాలకు విరుద్ధమైన పద్ధతులను వీరిద్దరు అనుసరించి వుండవచ్చు. అయినా, వీరి మహోద్యమాలకు బలమిచ్చినట్టిది బానిస బ్రతుకుపట్ల గాంధీజీ దేశ దేశాల పారతంత్ర్య ప్రజలలో రేకెత్తించిన జగుప్సే; పారతంత్ర్యాన్ని సహించడంకంటె, సోదరదేశీయుల నిత్యావమానాలను సహించడంకంటె మరణమే మేలని ఆయన ప్రజ్వలింపజేసిన జ్వాలాముఖ విశ్వాసమే.

1948 డిసెంబర్ 19వ తేదీని చీకటిమరుగున బందిపోటు దొంగలవలె విరుచుకుపడి, డచ్వారు డాక్టర్ సోకర్నోను అరెస్టుచేసి, బంకాదీవికి ప్రవాసిగా పంపినప్పుడు, ఆయన ప్రత్యేకించి చదివింది అప్పుడు కొత్తగా వెలువడిన గాంధీజీ జీవితచరిత్రలనే ఆ మధ్య ఒక భారతీయ పత్రికా విలేఖరితో ప్రసంగిస్తూ, డాక్టర్ సోకర్నో "మీ దేశానికి వచ్చి మీ మహానాయకుడు మహాత్మాగాంధీ పాదాలకు ప్రణమిల్లగలిగిన దినమే నా జీవితంలో అత్యంత మహత్తరమైనది కాగల" దని పేర్కొన్నాడు.

ఆ భాగ్యానికి మరెందరితోపాటు డాక్టర్ సోకర్నో కూడా నోచుకోలేకపోవడం విధివైపరీత్యం. గాంధీజీ భక్తుడైనందువల్లనే కాక, నెహ్రూకు మిత్రుడైనందువల్ల నేకాక, అన్యవిధాలకూడా డాక్టర్ సోకర్నో భారతీయులకు నెచ్చెలి, నెయ్యము.


ఆయన మన ప్రాచీనభాష సంస్కృతంలో పండితుడు. మనకు ఒక మహద్గ్రంథమైన భగవద్గీత ఆయనకు ఇష్టమైన గ్రంథం. ఆయన మనదేశంలో ఒక ప్రధానమతమైన ఇస్లాముకు చెందినవాడు కాగా ఆయన మాతృశ్రీ హిందూ మతస్థురాలు (బాలిద్వీపంలో ఇప్పటికీ కొందరు హిందువులు కలరు.)

డాక్టర్ సోకర్నో ఈనాడు పెద్ద పదవికి వచ్చివుండవచ్చు గాని, ఆది నుంచీ ఆయన జీవితకృషి ఒక్కటే, అది, - శిల్పం.

శిల్పంలో ఆయన శిక్షణ పొందాడు; శిల్పాచార్యుడుగా జావా పశ్చిమదిశలోని పర్వత మయప్రాంతం బొన్డో మెంగ్లో గొప్ప మసీదులను కొన్నింటిని కట్టాడు. పోతే, ఈనాడు ఆయన శిల్పకళా వైదగ్ధ్య ప్రదర్శనం శిలల ద్వారా కాదు: ఏడున్నర కోట్ల సోదరదేశీయుల ద్వారా, మసీదులకు బదులుగా మహాదేశాన్ని ఆయన ప్రస్తుతం నిర్మిస్తున్నాడు.

ఆ మహాశిల్పికి - "నేను మీ అధిపతిని కాదు: మీ సేవకుడను" అని నేడు పదవీస్వీకరణ చేస్తూ ఇండొనీసియా ప్రజానీకం సమ్ముఖంలో తన సహజమందహాసంతో వినమ్రుడై నిలచిన ఆ మహాపురుషునికి - మా జోహారు జైహింద్! మెరేకా! (ఆంధ్రప్రభ 18-12-1949).

## సరిహద్దు గాంధి (ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్)



కొందరు గొప్పతనానికి కొలబద్దలౌతారు. పురాణేతిహాసాలలో ఇట్టి వ్యక్తులనేకులు. దాతృత్వానికి కొలబద్దగా యెన్నబడే పురాణ పురుషుడు కర్ణుడు; బలానికి భీముడు; పితృవాక్య పరిపాలనకు రాముడు; కఠోరవ్రత దీక్షకు భీష్ముడు; ఆత్మబలిదానానికి శిబిచక్రవర్తి; సత్యనిరతికి హరిశ్చంద్రుడు.

మంచితనంలోనే కాక, చెడ్డతనంలో కూడా గొప్పతనం వున్నది. ముక్కోపులు పెక్కుమంది వుండవచ్చు కాని, దూర్వాసునివలె అగ్గి లేకుండానే మండిపడగలవా రెందరున్నారు? ఇందువల్ల చెడ్డతనానికి కొలబద్దలుగా పేర్కొనబడే పురాణ పురుషులు సయితం కొందరున్నారు.

ఇట్టి వారిలో ఉదాహరణకు మొండితనానికి విశ్వామిత్రుని, దుర్బోధనలకు శకునిని, క్రౌర్యానికి హిరణ్యకశిపుని, కామాంధతకు రావణాసురుని పేర్కొనవచ్చు.

మన పురాణాలను విడిచి, ఇతిహాసాలకు వెడితే, వితరణకు భోజుడు, కవిత్వానికి కాళిదాసు, కారుణ్యానికి అశోక చక్రవర్తి, మత సహనానికి అగ్బర్, మతవిద్వేషానికి ఔరంగజేబ్, దేశద్రోహానికి జయచంద్రుడు, దేశభక్తికి రాణా ప్రతాప్, వెర్రితనానికి తుగ్లక్ మొదలైనవారెందరో కొలబద్దలుగా కనబడతారు.



విదేశాలకు చెందిన పురాణేతిహాసాల నుంచి కూడా ఇట్టి వ్యక్తులను అట్లాస్, హెర్ క్యూల్స్, ఆర్థర్, సోక్రటీస్, అలెగ్జాండర్, జెంఘిన్, నెపోలియన్ మొదలైనవారిని - ఎందరెందరినో పేర్కొనవచ్చుగాని, మంచితనంలోనో, చెడ్డతనంలోనో ప్రపంచానికి కొందరు వ్యక్తులు కొలబద్దలు కాగలరనే విషయాన్ని నిరూపించడానికి ఇప్పటికి మేము వ్రాసిందే చాలునని భావిస్తున్నాము. కొందరు ఈ విధంగా కొలబద్దలు కావడం కద్దు కాబట్టే, “అపర హరిశ్చంద్రుడు”, “అభినవ తిక్కన”, “ఆంధ్ర భోజుడు”, “కలియుగ భీముడు” ఇలాంటి బిరుదావళి ప్రచారంలోకి రావడం.

ఇలాంటి బిరుదులను పుచ్చుకోవడం, లేదా, “ఒకరివ్వడమూ, మనం పుచ్చుకోవడమా?" అని మంచిరోజు చూచుకొని తమకు తామై తగిలించుకోవడం సులభమేకాని, బిరుదుకు మూలపురుషుడైన వ్యక్తి అంతస్థుకు తగినట్టు మెలగడం మాత్రం ఏ కొందరికి మాత్రమే చెల్లిపోతుంది.

ఇట్టి కొద్ది మందిలో “సరిహద్దు గాంధి”గా చెల్లుతున్న ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్ ముఖ్యుడు. సత్యానికి అహింసకు ఆధునిక యుగంలో కొలబద్దగా పరిణమించిన మహాత్మా గాంధి అడుగు జాడలలో త్రికరణ శుద్ధిగా నడుస్తున్న ప్రముఖుడైనందునే యావద్భారతం గఫర్ఖనక్కు “సరిహద్దు గాంధి" అని జోహారు లర్పించింది.

## లుమంబా

అట్టి మహనీయునికి కారాగారప్రాప్తి మన దేశవిభజన దుష్ట ఫలితాలలో ముఖ్యమైంది కావడం, ఆ విభజన ప్రాతిపదికగా నేడు రాజకీయ స్వాతంత్ర్యం అనుభవిస్తున్న ప్రతి భారతీయుని హృదయానికి ఒక బల్లెం పోటు.

దీర్ఘ కారాగారవాస క్లేశాల వల్ల “సరిహద్దు గాంధి” ఆరోగ్యం పూర్తిగా చెడిపోయినట్టు కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. ఈ విషయమై మన ప్రధాని పండిట్ నెహ్రూ, కొంత ఆందోళన కనబరిచేసరికి, అనారోగ్య వార్తను ఖండిచడమే కాక, ఇది తమ ఆంతరంగిక వ్యవహారాలలో లేనిపోని జోక్యమని పాకిస్తాన్ ప్రభుత్వం తీంద్రించింది.

మన పొరుగు రాజ్యానికి ఎంత కోపం వచ్చినా, మన జాతీయ స్వాతంత్ర్య సమరంలో ప్రముఖ పాత్ర వహించడమే కాక, దేశ విభజనవరకు సోదర భారతీయుడైవున్న ఈ మహామహుని స్థితిగతులను గురించి మనం ఆందోళన చెందకుండా వుండలేము. పైగా, ఆయన ఆరోగ్యం భగ్నమైపోయినట్టు ఇప్పుడు పాకిస్తాన్కు చెందిన కొందరు ప్రసిద్ధులే ప్రకటనలు చేస్తున్నారు. ఇంతేకాక, సరిహద్దు గాంధీకి ఆయన నడిపిన ప్రజోద్యమాలలో కుడిభుజంగా పనిచేసిన క్వాజీ అతీవుతుల్లా ఖాన్ దీర్ఘ కారాగార క్లేశాలవల్ల ఈ మధ్యనే పరలోక గతుడైనాడు. ఆరోగ్యం పూర్తిగా శిథిలమైన పిమ్మటనే విడుదల జరిగినందున, కారాగార విముక్తి జరిగిన ఈయనకు ప్రాణమోసం తప్పలేదు, రెండు, మూడు రోజులనాటి ఈ దుస్సంఘటనవల్ల కూడా “సరిహద్దు గాంధి” విషయమై హృదయాందోళన పెరుగుతున్నది.

ఏమైనా, మనం గఫరాఖాన్ విడుదలకు తీసుకొనగల ప్రత్యక్ష చర్య ఏదీ లేదు. ఈ విషయంలో మన నిస్సహాయతను మన ప్రధాని ఇదివరలో ఒకసారి బహిరంగంగానే వెలిబుచ్చివున్నాడు. అయినా, పాకిస్థాన్లోవలె మన ఇండియాలో కూడా ఫిబ్రవరి 29 తేదీని “సరిహద్దు గాంధి” ఆరోగ్యాభివృద్ధికి ప్రార్థనలు జరపడం యుక్తమేమో! (ఆంధ్రప్రభ 22-2-1952)

ఎంతకైనా తగినవారు - తెగించగలవారు - కసవుబూ, మొబుటూ, షోంబేలు. అందు వల్లనే లుమంబా జెయిల్ నుంచి ఇద్దరు అనుచరులతో తప్పించుకుపోయాడన్న వార్తను ప్రపంచం నమ్మలేక పోతున్నది.

సాయుధులైన కారాగార భటులపై విరుచుకుపడి వారిని నిరాయుధులను చేయడం అసాధ్యం కాకపోవచ్చుగాని, అట్టి పని జరగడానికి వీలిచ్చే పరిస్థితిలో లుమంబాను బందీగా వుంచినారని అనుకోగలమా? ఇదివరలో ఒకసారి లియోపాల్ విల్ నుంచి ఆయన తప్పించుకుపోవడం, రెండవ సారి థైస్విల్లో ఆయన దాదాపు బంధవిముక్తుడు కావడం జరిగిన తర్వాత కూడా ఆయన ప్రబల విరోధులు ప్రమత్తంగా సంచరించి వుండరు గదా?

లుమంబాను విడుదల చేస్తేనే తప్ప కాంగో సమస్య పరిష్కారం కాదన్న అభిప్రాయం ఇటీవల మరింత బలపడింది. పాశ్చాత్య రాజ్యాధినేతలు సయితం ఈ అభిప్రాయం వైపుకు క్రమంగా మొగ్గక తప్పలేదు. ఈ పరిణామం కలిగించిన కలవరం వల్లనే కసవుబూ, మొబుటూ, షోంబే ముఠావారు లుమంబాను చంపివేసి, ఆయన జెయిల్ నుంచి తప్పించుకొని పారిపోయాడంటున్న నీలివార్తను పుట్టించి వుండవచ్చు గదా?

పారిపోయిన వాడంటున్న లుమంబాకోసం కటాంగా రాష్ట్రాన్ని గాలించడం, ఆయనను పట్టి యివ్వగల వారికి పెద్ద పారితోషిక మివ్వగలమని ప్రకటించడం - ఈ చర్యలన్నీ కేవల మొక కపటనాటకంలో భాగాలే కావచ్చు.

ప్రస్తుతం కాంగోలో గల ఐక్యరాజ్య సమితి సభ్యులు కొన్ని రోజుల క్రితం లుమంబాను జెయిల్లో కలుసుకొనడానికి అనుమతి కోరగా, అందుకు కసవుబూ ససేమిరా సమ్మతించలేదు. పైగా లుమంబాను చంపివేసినారన్న పుకారులు ఆయన జెయిల్ నుంచి తప్పించుకు పోయినాడన్న వార్త వెలువడ్డానికి కొంచెం ముందుగానే పుట్టినవి. అవి వట్టి పుకారులు కాకపోవచ్చు! ఏనాడో లుమంబాను చంపివేసి, జెయిల్ నుంచి తప్పించుకు పారిపోయినట్టు ఇప్పుడు ఈ కపట నటన ప్రారంభించి వుండవచ్చు.

ఐక్యరాజ్యసమితి కార్యదర్శి హామర్ షెల్డ్ కోర్కెపై, ఎలిజబెత్విల్లోని సమితి ప్రతినిధులు లుమంబా పరారీని గురించి దర్యాప్తు జరపడానికి అవకాశమివ్వాలని కోరగా, “ఇది కేవలం కటంగాకు సంబంధించిన విషయం. దీనిలో అన్యుల జోక్యానికి ఎంతమాత్రం వీలు లేదు” అని షోంబే నిన్న చేసిన ప్రకటన తర్వాత లుమంబా తప్పించుకు పోవడానికి మొరాకోవారు కొంతవరకు తోడ్పడ్డారని షోంబే చెబుతున్న మాట ఎంతవరకు నమ్మదగింది? బలూబా తెగవారికి మొరాకోనుంచి ఆయుధాలు అందుతున్నాయన్న అక్కసుతో ఇది అతడు చేసిన ఆరోపణ మాత్రమే కావచ్చు.

ఏ విధంగా చూచినా, లుమంబా హత్య జరిగినట్టు అనుమానించడానికే ఎక్కువ కారణాలు కనబడుతున్నాయి. ఇదే నిజమైతే, కాంగో విషాద నాటకం పరాకాష్ఠకు రాగలదనడంలో సందేహం లేదు. ప్రధాని నెహ్రూ నిన్న

జలంధర్ ప్రసంగిస్తూ హెచ్చరించినట్టు, లుమంబా హత్యజరిగినట్టు ధ్రువపడితే, అక్కడ విస్తృతమైన అంతర్యుద్ధమేమి, భీషణ రక్తపాతమేమి అనివార్యం కావచ్చు.

కాని, అగ్రరాజ్యాలు విజ్ఞతతో సంచరిస్తే, పరిస్థితులు చెయిజారి పోకుండా చూడ్డం ఇప్పటికైనా అసాధ్యం కాదేమో! లుమంబా పరారీ వార్తను గురించి దర్యాప్తుకు వీలులేదని షోంబే సమితికి చెప్పిన తలబిరుసు సమాధానం బెల్జియం ఆసరా చూచుకునే! కాంగోలో ముందు బెల్జియం ఆట కట్టిస్తేనే తప్ప, కసవుబూ, మొబుటూ, షోంబే ముతావారి పొగరు తగ్గదు; అప్పుడుగాని వారు అంకెకు రారు. కాంగోలోని విషాద పరిణామాలకన్నింటికి మూలం బెల్జియం కుట్రలే.

అమెరికాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో బెల్జియం చర్యలను సమర్థిస్తున్నందు వల్లనే, అది ఇన్ని ఆటలను ఆడుతున్నది; ఇన్ని ఆగడాలను చేస్తున్నది. ఆఫ్రికా నేడు నిద్రాణమై లేదు; అది జాగృతినందిన ఖండం. ప్రపంచంలోని ఏ శక్తి ఇకమీదట దాని సంపూర్ణ స్వాతంత్ర్యచ్ఛను ప్రతిఘటించలేదు. నెత్తురు కాల్వలను దాటవలసివచ్చినా, పీనుగు పెంటలపైగా ముందుకు నడవవలసివచ్చినా, ఆఫ్రికాఖండం స్వాతంత్ర్య గమ్యాన్ని అనతికాలంలో చేరి తీరుతుంది. లుమంబా హత్య నిజంగానే జరిగివుంటే, స్వాతంత్ర్య సముపార్జనను గురించిన ఆఫ్రికా దృఢసంకల్పాన్ని అది వజ్రసన్నిభం చేస్తుందే తప్ప, బలహీన

(ఆంధ్రజ్యోతి 15-2-1961) పరచదు.

బ్రిటన్, ఫ్రాన్సు రేపు - 20 వ తేదీ గురువారంనాడు, - దలైలామా, పంచనామా ఆంధ్రప్రదేశ్కు వస్తున్నారు. బోధిసత్వ నాగార్జునాచార్యుని మధ్యలో కొన్ని శతాబ్దాలపాటు మనం దాదాపు పూర్తిగా మరచిపోయినా, ఆ మాధ్యమిక సిద్ధాంత ప్రతిపాదకుని టిబెట్టు మరచిపోలేదు. మన కృష్ణా నదీతీరాన, మన పల్నాటిసీమలో ఆచార్య నాగార్జునుడు వ్రాసిన తాత్త్విక గ్రంథాలలో కొన్ని మన మధ్యనుంచి మాయమైపోగా వాటిని టిబెటియన్ భాషల నుండి తర్జుమా చేసుకోవలసివచ్చింది. నాగార్జునాచార్యుడు తన జీవితంలో తుది భాగాన్ని మన మధ్య గడిపిన సంగతిని సయితం మనం మరచి పోగా, దాన్ని గత శతాబ్దంలో మనకు తెలియజెప్పిన ఘనత కూడా టిబెట్టుదే. మనకంటె ఎన్నోరెట్లు ఆచార్య నాగార్జునుని పట్ల భక్తి గౌరవాలను ప్రదర్శిస్తూ వచ్చిన దేశానికి నాయకులైనందునే దలై, పంచన్ లామాలు నాగార్జున క్షేత్రాన్ని సేవించడం కోసం ఆంధ్రప్రదేశ్కు రేపు వస్తున్నారు.

“దలైలామా” అంటే జ్ఞానసాగరుడని అర్థం. కేవలం జ్ఞాన సాగరుడుగానే కాక, పవిత్రునిగా, త్రిలోకేశ్వరునిగా అద్వితీయునిగా టిబెటన్లు ఆయనను ఆరాధిస్తూ వుంటారు. వారి దృష్టిలో దలైలామా అంటే “ఈ సృష్టిలో చిట్టచివరి అణువు నిర్వాణాన్ని పొందనంతవరకు నాకు నిర్వాణం అక్కర లేదు” అని పలికి, మొత్తం సృష్టికే నిర్వాణాన్ని సాధించడంకోసం తిరిగి, తిరిగి భూతలంపై అవతరిస్తుండే అవలోకితేశ్వరుడే. (అవలోకితేశ్వరునికి టిబెటియన్ పేరు - ఛెన్రెజి)

దలైలామా అవలోకితేశ్వరుడు కాగా, పంచన్లామా అమితాభుడు. (టిబెటియన్ పేరు, - ఓ-పా-మే) బౌద్ధదేవ వర్గంలో అవలోకితేశ్వరుని ప్రతిపత్తికంటె అమితాభునిదే ఉత్కృష్టమైనది. అందువల్ల దలై, పంచన్ మాలలో రెండవ వారిదే అగ్రస్థానం కావాలి. అయితే, ప్రాపంచిక వ్యవహారాలతో అమితాభునికి సంబంధం లేదు కాబట్టి, పంచన్లా మాకు పరిపాలనాధికారా లేవీ వుండవని, ప్రభుత్వానికి సంబంధించిన విషయాలలో దలైలామాదే అగ్రస్థానమని టిబెటియన్ల విశ్వాసం.

టిబెట్టు బౌద్ధదేశమైనా, మనదేశంలో పరిఢవిల్లిన బౌద్ధానికీ, అక్కడిదానికీ ఎన్నో భేదాలు కానవస్తాయి. బౌద్ధం టిబెట్టుకు వ్యాపించక పూర్వం అక్కడ "షామానిజం" అనే మతం వ్యాప్తిలో వుండేది. మాంత్రిక, తాంత్రిక, విద్యలకు ఆ మతంలో ప్రాధాన్యం హెచ్చు. దాని స్థానాన్ని బౌద్ధం ఆక్రమించడం ట్రోంగట్సాన్ అనే రాజు జీవితకాలంలో జరిగింది. ఆయన ఒక చైనా రాకుమారిని, మరొక నేపాలీస్ రాకుమారిని పరిణయమందాడు. వారిద్దరు బౌద్ధమతావలంబినులు. ఆ దేవేరు లిద్దరి ప్రభావం వల్ల ఆ రాజు కూడా బౌద్ధ ధర్మాన్ని స్వీకరించాడు. అయితే, టిబెట్ మొత్తంపై బౌద్ధం పూర్తిగా వ్యాపించింది క్రీస్తుశకం ఎనిమిదవ శతాబ్దం చివరి భాగంలో సుప్రసిద్ధుడైన బౌద్ధాచార్యుడు పద్మసంభవుడు టిబెట్కు తథాగతుని ధర్మ ప్రచారం నిమిత్తం వెళ్ళిన మీదటనే. (పద్మసంభవుని టిబెటన్ పేరు, - గురు రింపోచే) తాంత్రిక సంబంధమైన కర్మకాండల పట్ల టిబెటనులకున్న ప్రగాఢ విశ్వాసాన్ని త్రోసిపుచ్చడానికి వీలులేదని గ్రహించిన మీదట ఆచార్య పద్మసంభవుడు బౌద్ధంలో తాంత్రిక కర్మకాండలకు స్థానమివ్వక తప్పలేదు. అందువల్లనే టిబెట్టులోని బౌద్ధం మన దేశంలో వ్యాపించినదానికి పెక్కు విషయాలలో భిన్నమైనదిగా రూపొందింది.

లామాల ఎన్నిక పద్ధతి టిబెటనుల బౌద్ధానికే పరిమితం. అంతకు ముందునుంచి కూడా టిబెట్టులో లామాలున్నారు కాని, భౌతిక దేహాన్ని చాలించినంతనే అవలోకితేశ్వరుడు మరొక భౌతిక దేహంలో ప్రవేశిస్తాడన్న విశ్వాసం ఆధారంగా, దైవాంశసంభూతుడై జన్మించిన బాలునికై దేశాన్ని గాలించి, అతనిని లామాగా ఎన్నుకోవడం పదిహేనవ శతాబ్దంలో ప్రారంభమైంది. ఈ విధంగా ఎన్నికైనవారిలో పదునాల్గవ లామా ప్రస్తుతం మన దేశంలో పర్యటిస్తున్న దలైలామా. ఆదిలో వీరిని దలైలామాలని అనేవారు కారు. 1517లో అప్పటి లామాకు 'దలై' (సాగరం) అనే బిరుదాన్ని మంగోలియన్ రాజు అల్లాన్ఖాన్ యిచ్చాడు. ఆదిలో ఈ లామాలు టిబెట్ పరిపాలకులు కారు. క్రీస్తుశకం పదిహేడవ శతాబ్దం ప్రారంభంలో అయిదవ లామా టిబెట్ పరిపాలన బాధ్యతను తానే స్వీకరించినట్టు ప్రకటించడం, అప్పటి చైనా చక్రవర్తి టిబెట్ పై ఆ లామా పరిపాలనాధికారాన్ని గుర్తించడం సంభవించింది.

దలైలామా, పంచన్ మాల మధ్య సంఘర్షణలు అనివార్యమైన సందర్భాలు కొన్ని టిబెటన్ చరిత్రలో లేకపోలేదు. ఇట్టి సంఘర్షణ కారణంగానే 1923లో అప్పటి పంచనామా చైనాకు వెళ్లి, తల దాచుకోవలసివచ్చింది. ఆయన అక్కడనే పరమపదించగా, ప్రస్తుతం మన దేశంలో పర్యటిస్తున్న పంచన్ మాను షిగాట్సేలోని తషిల్హుంపో బౌద్ధ విహారంలో చైనీయులే పీఠాన్ని ఎక్కించారు. కాగా, పదమూడవ దలైలామా ఏవో కొన్ని చిక్కులవల్ల కాలింపాగ్లో కొంతకాలం ప్రవాసిగా గడపవలసివచ్చింది.

సాధారణంగా తమ దేశంనుంచి కదలని దలై, పంచనామాలు బుద్ధజయంతి పంచవింశ శతవార్షికోత్సవ సందర్భంలో మన కేంద్రప్రభుత్వం ఆహ్వానంపై మన దేశంలో పర్యటన నిమిత్తం వచ్చారు. వారిద్దరూ యువకులు, అయినా, బౌద్ధధర్మంలోని శాంతిని, కాంతిని వారి వదనాలలో మనం చూడవచ్చు. మానుషబుద్ధుడైన గౌతమబుద్ధుని కంటె అధ్యాత్మిక రంగంలో అధిక ప్రతిపత్తి గలవారుగా టిబెటన్లచే పూజించబడుతున్న ఈ యిద్దరు లామాలకు సముచిత రీతిని ఆంధ్రప్రజలు స్వాగతం చెప్పగలరనే ఆశిస్తున్నాము. (ఆంధ్రప్రభ 19-12-1956)

## సర్ ఆంథోనీ ఈడెన్

కొలది వారాలక్రితం బ్రిటిష్ ప్రధాని సర్ ఆంథోనీ ఈడెన్ అస్వస్థత కారణంగా విశ్రాంతికై జమైకాకు వెడలినప్పుడే, స్వస్థుడై తిరిగి వచ్చిన తరువాతనైనా ప్రధానమంత్రి పదవిని ఆయన నిర్విహించబోడన్న గుసగుసలు బయలు దేరాయి.



బ్రిటిష్ కన్సర్వేటివ్ పక్షంలో ఈడెన్ అనుయాయులేమి, తదితర అభిమాన వర్గాలేమి పై వదంతులను ఖండించినా, విశ్రాంతి ముగించుకుని సర్ ఆంథోనీ తిరిగి ప్రధాన మంత్రి పదవిని చేపట్టిన తరవాత కూడా, ఎంతోకాలం ఆయన ఆ పదవిని నిర్వహించడన్న భావమే ప్రబలుతూ వచ్చింది.

అందుచేత, సర్ ఆంథోని ఈడెన్ నిన్న రాత్రి బ్రిటిష్ ప్రధానమంత్రి పదవికి రాజీనామా ఇచ్చినాడన్న వార్త ప్రపంచానికి వింతగా తోచదు. జమైకా నుంచి తిరిగి వచ్చిన పిమ్మట శ్రీ ఈడెన్ కొంతమట్టుకు ఆరోగ్యాన్ని కోలుకున్నారనీ, కాని మరల వ్యాధి లక్షణాలు కనిపించాయనీ, ఇట్టి స్థితిలో బాధ్యతాయుతమైన ప్రధాని విధులను నిర్వర్తించడం అసాధ్యమనీ ఆయన ఆరోగ్యాన్ని పరీక్షించిన డాక్టరులు ప్రకటన చేశారనుకోండి.

అయినా, ప్రస్తుత పరిస్థితిలో ఈడెన్ పదవీ విరమణకు అనారోగ్యమొక్కటే కారణమనుకోడానికి వీలులేదు. ఆరోగ్యవంతుడై ఉన్నప్పటికి దీర్ఘకాలం ఈడెన్ బ్రిటిష్ ప్రధానమంత్రి పదవిని ఆక్రమించేవారు కాదని చెప్పవచ్చు. సూయజ్ సమస్య విషయంలో బ్రిటిష్ ప్రభుత్వం అవలంబించిన వైఖరి, ఫ్రాన్సుతో చేరి ఈజిప్టుపై దాడి వెడలడంలో అది చూపిన దుస్సాహసం, వాటివల్ల బ్రిటిష్ కార్మిక వర్గాలలోనేమి, మొత్తం ప్రపంచంలోనేమి జనించిన విపరీత రాజకీయ పరిణామాలు ఇవన్నీ ఏకమై మొత్తం కన్సర్వేటివ్ ప్రభుత్వాన్ని కాకపోయినా, కనీసం ప్రధానమంత్రి పదవిని బలిగొన్నవనడానికి సందేహం లేదు.

ప్రధానామాత్య పదవిని నిర్వహించలేనంతగా ఈడెన్ ఆరోగ్యం క్షీణించడానికి సయితం ఇటీవల కొలది మాసాలనుంచి పెక్కు సమస్యలపై బ్రిటిష్ పోయిన పోకడలు, జాతీయ, అంతర్జాతీయ రంగాలలో వాని మూలంగా కలిగిన అనేక దుష్ఫలితాలవల్ల పెద్దమనిషిగా, మెత్తని మనస్సు కల వ్యక్తిగా పేరొందిన - మాజీ బ్రిటిష్ ప్రధానికి కల్గిన తీవ్ర మనోవేదన కారణం కాకపోదు. ఔను; నిన్నటివరకు బ్రిటిష్ ప్రధానిగానేకాక, దాదాపు 25 సంవత్సరాలు బ్రిటిష్ రాజకీయాలలో ప్రముఖపాత్ర వహించి, బ్రిటిష్ విదేశాంగమంత్రిగా చిరకాలానుభవం కలిగిన సర్ ఆంథోని ఈడెన్ సరసుడనీ, స్నేహపాత్రుడనీ, శాంతచిత్తుడనీ, సుతిమెత్తని హృదయం కలవాడనీ పలువురి ప్రశంస లందుకున్న మాట వాస్తవమే.



అంతర్జాతీయ వ్యవహారాలలో సర్ ఆంథోని ఈడెన్ అంతకుపూర్వం సాధించిన విజయాల మాట అలావుంచి, ఇండో-చైనా సమస్య పరిష్కారానికై ఆయన చేసిన కృషిని శాంతికాముక ప్రపంచం ఎంతో కొనియాడింది.

అయితే, అంతటి సహృదయుడుగా, శాంతిప్రియుడుగా పేరొందినవాడు. అంతటి రాజకీయానుభవం కలిగిన నాయకుడు ఇటీవల సైప్రస్ విషయంలో, విశేషించి ఈజిప్టు వ్యవహారంలో అంత తల్లక్రిందులుగా ప్రవర్తించి, ప్రపంచానికి విస్మయం కలిగించడమే ఆశ్చర్యం. సర్ ఆంథోని ఈడెన్ ప్రధానమంత్రి పదవిని ఆక్రమించిన తరువాత బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని విషమ సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చిన మాట నిజం. వానిని పరిష్కరించడంలో బ్రిటన్ ఔదార్యాన్ని, బేలతనాన్ని కాక, కాఠిన్యాన్ని, కరకుతనాన్ని చూపించాలని కన్సర్వేటివ్ పార్టీ సభ్యుల అభిప్రాయానికి సర్ ఆంథోని లోబడడమే ఆయనలో కలిగిన మార్పుకు కారణమని "డెయిలీ హెరాల్డ్" పత్రిక చేసిన వ్యాఖ్య పూర్తిగా నిరాధారం కాదు.

సాధుచిత్తంతోపాటు కాఠిన్యాన్ని కూడా ప్రదర్శించగలనన్న పూనికతో, తన అనుయాయులను తృప్తిపరచాలన్న ఉత్సాహంతో సర్ ఆంథోని సైప్రస్ విషయంలో, ఈజిప్టు సందర్భంలో యుక్తాయుక్తాలను, అంతర్జాతీయ న్యాయసూత్రాలను, ప్రపంచాభిప్రాయాన్ని, తుదకు అనేక విషయాలలో తమకు అండగా వుండగల అమెరికా అభిమతాన్ని సయితం త్రోసిపుచ్చి ఈజిప్టుపై దురాక్రమణ దురంతానికి సిద్ధపడ్డాడు.

అమెరికాతో పాటు మిత్రరాజ్యసమితిలోని పెక్కు రాజ్యాలు బ్రిటన్, ఫ్రాన్సుల చర్యను ఖండించడంవల్ల ఈజిప్టు నుంచి అవి తమ సేనలను ఉపసంహరించాయి. దానితో బ్రిటన్, ఫ్రాన్సులకు శృంగభంగం జరిగింది. బ్రిటిష్ ప్రధానిగా ఈడెన్ ప్రతిష్ఠ దెబ్బతిన్నది. అమెరికా ప్రెసిడెంట్ ఐసెన్వర్, బ్రిటిష్ ప్రధాని ఈడెను కలుసుకుని మాట్లాడటానికే నిరాకరించాడంటే బ్రిటిష్ ప్రతిష్ఠ ఎంత అణగారిందో ఊహించవచ్చు.

తన విధానాలు ఇంతగా విఫలమైన తరువాత, తన ప్రభుత్వానికి ఇంతటి పరాభవం కలిగిన పిమ్మట మానధనుడైన వాని మనస్సు కలత చెందక పోవడం అసంభవం. పై పరిస్థితులలో అనారోగ్యకారణాల వల్లకాకపోయినా అన్యథా సర్ ఆంథోని ఈడెన్ ప్రధాని పదవి నుంచి విరమించడం ఆశ్చర్యకరం కాజాలదు.

(ఆంధ్రప్రభ 11-1-1957)

## కార్డెల్జ్

ఇండియాపై చైనా దురాక్రమణ కొనసాగుతున్న ప్రస్తుత సందర్భంలో యుగోస్లావియా వైస్ ప్రెసిడెంట్ ఎడ్వర్డ్ కార్డెల్జ్ భారత పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం వుంది. ఇటీవల మన దేశానికి వచ్చిన ప్రముఖాతిథులలో కార్డెర్జ్ నాల్గవవారు. ఇంతకుముందు వచ్చిన మలయా, సైప్రస్, పశ్చిమ జర్మనీ అధినేతలు చైనా దురాక్రమణను నిష్కర్షగా, తీవ్రంగా ఖండించారు. కార్డెల్జ్ కూడా ఇండియాపట్ల యుగోస్లావియాకు సంపూర్ణ సానుభూతి కలదని వెల్లడించారు.

యుగోస్లావియా కమ్యూనిస్టురాజ్యమైనా, దాని సోషలిజం మిగతా కమ్యూనిస్టు రాజ్యాల సోషలిజంకు భిన్నమైనది. ఈ కారణంచేతనే అది ఒకప్పుడు మిగతా కమ్యూనిస్టు కూటమి నుంచి బహిష్కరించబడింది. కృశ్చేవ్ అధికారంలోకి వచ్చిన తరువాత, మాస్కో, బెల్ గ్రేడ్ సంబంధాలు కొంత మెరుగుపడినా, ప్రెసిడెంట్ టిటోకు "రివిజనిస్టు" అనే పేరు పోలేదు. ఇటీవల మాస్కో విధానాలలో పెద్ద మార్పులు జరగడంతో, సోషలిజానికి వేరువేరు మార్గాలుండవచ్చునని కృశ్చేవ్ సిద్ధాంతీకరిచడంతో, యుగోస్లావియాపట్ల కమ్యూనిస్టు రాజ్యాల వైఖరి కూడా మార్పుచెందింది.

ఈ మార్పు మొన్న టిటో సోవియెట్ యాత్రలో పూర్తిగా ప్రస్ఫుటమైంది. మాస్కో బెల్డ్ సంబంధాలు తిరిగి యథాప్రకారం సన్నిహితమైనాయి. ఇది రుచించనిది చైనా, అల్బేనియాలకు మాత్రమే. ఆ రెండు దేశాల దృష్టిలో ప్రెసిడెంట్ టిటో సామ్రాజ్యవాదుల ఏజెంటు, కృశ్చేవు సయితం సామ్రాజ్యవాదులకు లొంగిపోతున్నట్టు విమర్శిస్తున్న పెకింగ్ నియంతలు టిటోను దూయబట్టడంలో ఆశ్చర్యం ఏముంది?

ఆంతరంగిక విధానాలలోనే కాక, విదేశాంగ సంబంధాలలో కూడా, యుగోస్లావియా మిగతా కమ్యూనిస్టు కూటానికి భిన్నమైన వైఖరి అనుసరిస్తున్నది. భారతదేశం వలెనే అది కూడా అలీన విధానాన్ని అవలంబించింది. ప్రాక్పశ్చిమ కూటాలలో దేనిలోను చేరకుండా, రెంటితోను స్నేహసంబంధాలు పెట్టుకున్నది ; రెంటినుంచీ ఆర్థిక సహాయం పొందుతున్నది. దానిపట్ల పెకింగ్ శత్రుభావానికి కారణాలలో ఇదొకటి. అంతే కాదు; ఇండియా, చైనాల వివాదంలో యుగోస్లావియా కొన్ని అలీనరాజ్యాల కంటే స్పష్టమైన వైఖరినే వెల్లడించింది. కొలంబో సమావేశానికి దాన్ని ఆహ్వానించకపోవడానికి అదొక కారణమై వుండవచ్చు.

మనదేశంలో పర్యటించడానికి నిన్న వచ్చిన కార్డెల్జ్ యుగోస్లావియాలో సోషలిస్టు సిద్ధాంతాలకు ప్రధాన భాష్యకారుడు; మాస్కో విధానాలకు భిన్నమైన ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను రూపొందించిన వారిలో ఒకరుగా ఆయన పేరుపొందారు. విదేశాంగ వ్యవహారాలలో ప్రెసిడెంట్ టిటోకు ఆయన కుడిభుజం వంటివారు. ప్రధాని నెహ్రూతో ఆయన జరుపనున్న చర్చలలో ఇండియా, చైనా సరిహద్దు యుద్ధం ప్రధానాంశంగా వుండడమే గాక, ఇటీవల ఈ విషయమై కృశ్చేవ్-టిటోల మధ్య జరిగిన సంభాషణల సారాంశం కూడా చర్చనీయాంశం కావచ్చునని తెలుస్తున్నది.

మన అలీనవిధానం పట్ల విదేశాలలో, ముఖ్యంగా ప్రాక్పశ్చిమ రాజ్యాలలో ఒక వంక ప్రశంసాభావం పెంపొందుతుండగా, మరొకవంక ఇండియాలోనే దానికి వంకలు పెట్టడానికి కొందరు యత్నించడం శోచనీయం. చైనా దండయాత్రకు కారణాలలో మన అలీన విధానంపై దెబ్బతీయడం ఒకటి ఆ విధానాన్ని విమర్శించడం చైనా పన్నిన వలలో తగుల్కొనడమే తప్ప మరొకటి కాదు. ప్రపంచశాంతికి, సహజీవనానికి ఇండియా తన అలీనవిధానం ద్వారా దోహదం చేస్తున్నదని కార్డెల్జ్ వెలిబుచ్చిన అభిప్రాయం ఈ విమర్శకులకు కనువిప్పు కలిగించగలదనే మనం ఆశించాలి. (ఆంధ్రజ్యోతి 20-12-1962)

## నేపాల్ రాజు : బి.పి. కోయిరాలా



కొరవితో తల గోకుకొన్న వారు చిందులు త్రొక్కరా? ప్రస్తుతం నేపాల్ రాజు చేస్తున్న పని యిదే.

చక్కగా ఆయన రాజ్యపాలనను ప్రారంభించారు. కాలగతిని గుర్తించిన యువకుడని, యుగధర్మాన్ని పాటిస్తున్న విజ్ఞుడని లోకం సంతోషిస్తుండగా, హఠాత్తుగా ఏమి పురుగు తొలిచిందో కాని 1960 డిశెంబర్ 15వ తేదీని ఆయన పార్లమెంటును రద్దుచేసి, ప్రధాన మంత్రి బి.పి. కోయిరాలాను అరెస్టు చేశారు.

తాను స్వయంగా రూపొందించిన రాజ్యాంగ విధానం కింద ఎన్నికైనదే తాను రద్దు చేసిన పార్లమెంటు! తాను నిర్దేశించిన పద్ధతులపై ప్రజామోదాన్ని సంపాదించి ఎన్నికైన వాడే తాను అరెస్టు చేసిన ప్రధాన మంత్రి!

జాతీయ క్షేమానికి భంగకరంగా కోయిరాలా ప్రభుత్వం వర్తిస్తున్నట్టు తన చర్యను సమర్ధించుకొంటూ మహేంద్ర రాజు చెప్పినా రనుకోండి. అయితే కోయిరాలా ప్రభుత్వాన్ని బర్తరఫ్చేసి, కొత్త యెన్నికలను జరిపిస్తే సరిపోయేది కాదా? ఈ చర్య గైకొనక, 1959 లో తాను స్వయంగా రూపొందించిన రాజ్యాంగ విధానాన్ని

ఎందుకు రద్దు చేయవలసి వచ్చింది? ప్రజాస్వామ్యసూత్ర బద్ధమైన వ్యవస్థ స్థానంలో నియంతృత్వాన్ని ఎందుకు నెల కొల్పవలసి వచ్చింది?



పేరుకు మంత్రులైనా, నిజానికి నిరంకుశాధికారులైన రాణాల పరిపాలనను సహించలేకనే నేపాలీలు వారికి వ్యతిరేకంగా ప్రజోద్యమాలను నడపలేదా? ఆ ప్రజల సహాయ సహకారాలతోనే తన తండ్రి మహారాజాధిరాజ త్రిభువన వీర విక్రమ్ ప్రవాసం నుంచి తిరిగి వచ్చి రాణాలకు, వారి నిరంకుశ పరిపాలనకు స్వస్తి చెప్పలేదా?

ప్రజాస్వామ్య పథంలో తండ్రి కంటే కూడా తానే ఒక అడుగు ముందుకు వేసిన తర్వాత, ప్రజలు స్వయంగా యెన్నుకొన్న ప్రభుత్వానికి నేపాల్ చరిత్రలోనే మొట్ట మొదటిసారిగా పరిపాలన బాధ్యతను అప్పగించిన తర్వాత ప్రధానిపై ఏదో నింద మోపి, తిరిగి నిరంకుశ వ్యవస్థను నెలకొల్పడం దుస్సహ చర్య కాదా? ఈ పొరపాటును తానెందుకు చేసినట్టు ? ఇది కొరవితో తల గోకుకొనడమే కాదా ?

ఎంతటి ధీమతులైనా పొరపాటు చేయవచ్చు; ప్రమాదంలో పడవచ్చు. అయితే, నిజంగా ధీమతులైనవారు చేసిన పొరపాటును సర్దుకొనడానికి, పడిన ప్రమాదంలోనుంచి తప్పు కొనడానికి ప్రయత్నిస్తారు. మహేంద్ర రాజులో ఈ ప్రయత్నం కానరాకపోవడం ప్రత్యేకించి శోచనీయం.

పూర్వం రాణాల నిరంకుశత్వంపై ప్రజానాయకులే ప్రస్తుతం మహేంద్ర రాజు నిరంకుశత్వంపై తిరుగబడుతున్నారు. తిరుగుబాటుకు వారిని భారతదేశం ప్రోత్సహించలేదు. ప్రజాస్వామ్య వ్యవస్థకు మహేంద్ర రాజు స్వస్తి చెప్పినప్పుడు అది శోచనీయ పరిణామమని భారత ప్రధాని పేర్కొని వుండవచ్చు. నేపాల్లోనే కాదు, ప్రపంచంలో ఎక్కడ ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతిన్నా పండిట్ నెహ్రూ ఈ విధమైన ప్రకటన చేస్తారు. ఇది రాజకీయ సిద్ధాంతానికి, లక్ష్యానికి సంబంధించిన విషయం. ఇంత మాత్రంచేత నేపాలీ తిరుగుబాటుకు భారత ప్రభుత్వం తోడ్పాటు కలదనడం భావ్యమా ?

తనపై తిరుగుబాటు చేస్తున్న వారికి ఇండియా ప్రోత్సాహం కలదని ఇదివరలో మహేంద్ర రాజు తన మంత్రులచే అనిపించాడు ; ఈ మాటను నిన్న ఆయన స్వయంగానే అన్నాడు. ఇకనైనా తిరుగుబాటుదారుల దుశ్చర్యలను చాటుమాటుగా సమర్థించడాన్ని మానుకొనక పోతే ఇండియాతో తమ సంబంధాలు పూర్తిగా బెడిసిపోగలవని కూడా నిన్న ఆయన బెదిరించాడు! కొరవితో తల గోకుకొన్న తర్వాత చిందులు త్రొక్కే ఘట్టమిది ! నేపాలీ తిరుగుబాటు దారులకు మన పరోక్ష ప్రోత్సాహమైనా లేదని ఈ ఘట్టంలో మరొకసారి

చెప్పినప్పటికీ లాభం లేక పోవచ్చు. కాగా, మనం ఆశించవలసింది వెంటనే కాకపోయినా, త్వరలోనే ప్రస్తుతపు తన చిక్కులన్నింటికి తన చర్యలే కారణమని మహేంద్రరాజు గుర్తించ గలడని మాత్రమే!

(ఆంధ్రజ్యోతి 12-12-1962)

## ఉమ

ఒక దేశానికి ప్రధానామాత్యుడు కావడంకంటె బుద్ధి పూర్వకంగా ఆ పదవిని త్యజించడం ఎక్కువ కష్టం. పదవీ వ్యామోహం లేని వారికి, అధికారమే పరమావధి కానివారికి, ఉన్నతాదర్శ ప్రేరితులకు మాత్రమే అట్టిది సాధ్యం కాగలదు. యాభై సంవత్సరాల ప్రాయంలో బర్మా ప్రధాన మంత్రి పదవినుంచి విరమించుకొన దలచిన ఉను పై కోవకు చెందిన వ్యక్తి. ఉను ప్రధాని పదవిని విరమించడానికి ప్రజలలో గాని, ప్రభుత్వంలోగాని ఆయన పలుకుబడి లోపించడం కారణం కాదు. నిజానికి ఉను ప్రధాని కాక పూర్వంకంటె నేడు బర్మా ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధిగాంచింది. దేశంలో శాంతి భద్రతలు నెలకొన్నవి. అంతర్జాతీయంగా కూడా బర్మా ప్రతిష్ఠ ఆసియాలోనే కాక, పాశ్చాత్య దేశాలలో కూడా ఇనుమడించింది. అందుచేత, సర్వతోముఖంగా దేశోద్ధరణను సాధించి, ప్రజల ప్రేమానురాగాలను కొల్లలుగా చూరగొంటున్న స్థితిలో చేజేతుల ప్రధానామాత్య పదవిని పరిత్యజించడం సామాన్యులకు అలవి కానిపని. ఆ పదవీ విరమణమైనా జీవితం పై వెగటు జనించడం చేతనో మరే మానసిక దౌర్బల్యం వల్లనో, కాక ఫాసిస్ట్ వ్యతిరేక ప్రజా స్వాతంత్ర్య మండలి సముద్ధరణమనే ఉత్తమ లక్ష్యసాధన నిమిత్తం జరిగినప్పుడు అది మరింత సంస్తవనీయం కాక తప్పదు.

బర్మాప్రధాని పదవీ పరిత్యాగం సంకల్పించడానికి ఇది ప్రప్రథమం కాదు. ఇదివరలో ఒక తూరి అధికారం త్యజించి, ఆశ్రమ స్వీకారం చేసి, మత ప్రబోధం ద్వారా నైతిక పునరుద్ధరణను సాధించడానికి మిస్టర్ ఉను సమకట్టక పోలేదు. కాని, తన సహచరుల కోరిక పై ఆయన అప్పుడా ప్రయత్నాన్ని విరమించుకొనవలసి వచ్చింది.

ఉను జీవితాన్ని పరిశీలించిన పక్షంలో ఆదినుంచి ఆయన అధికార వ్యామోహం లేనివాడనీ, తన అభిమానికి విరుద్ధంగా విధిలేక రాజకీయాలలో ప్రవేశించాడనీ విదితం కాగలదు. 1954 లో తాను రచించిన "బర్మా అండర్ ది జాపనీస్" అన్న గ్రంథంలో మిస్టర్ ఉను “నేను రచయితను; స్వప్న జగత్తుల్లో సంచరిస్తున్నాను" అని వ్రాసుకున్నాడు. బర్మా జపాన్ వారి ఆక్రమణలో వుండగా అప్పటి మంత్రివర్గంలో చేరవలసిందని మిత్రులు తన్నెంతో నిర్బంధించినప్పుడు ఇదే కారణం చెప్పి అధికార బాధ్యతలనుంచి తప్పించుకున్నాడు. రాజకీయ బాధ్యతల నుంచి ఏ పాటి విశ్రాంతి లభించినా సాహిత్య సేవకే ఉత్సహించాడు. చివరకు 1940లో ఇన్సీన్ జెయిల్లో 18 నెలలు ఖైదీగా వుండే అవకాశం కలగగా అయిదు నాటకాలను, రెండు నవలలను రచించాడు.

పదవీ వ్యామోహ రాహిత్యం, సాహిత్య ప్రియత్వంతో పాటు ఉను సర్వభూత దయాళుత్వం కలవాడనడానికి క్రింది ఉదంతమే సాక్షి. మిస్టర్ ఉను నివసించిన ఇంటి పొరుగున ఖిన్మింగ్ అనే గృహస్తు కోళ్ళను పెంచేవాడట. కాని, తరుచుగా ఒక పెద్దతాచుపాము వచ్చి పెట్టిన గుడ్లను, పిల్లలను మింగి వేసేదట. ఒకనాడా పాము ఎలుక కన్నంలో నుంచి తల బయట పెట్టగా ఖిన్మాంగ్ చూచి, దబ్బనంతో దాని తలను నేలకు గుచ్చి తుపాకీ తెమ్మని ఉను వద్దకు పరుగెత్తుకు వచ్చాడట. వెంటనే ఉను తుపాకి చేత బుచ్చుకుని పామున్నచోటికి సగం దూరం వెళ్ళిన తరువాత "జీవహింస చేయరాదు. ప్రతి జీవికి విధి విధానం ముందుగానే నిర్ణయించబడింది" అన్న సూక్తులు జ్ఞప్తికి వచ్చి, సగం దూరంలోనే వెనుకకు మరలినాడట. కాని, ఇంతలోనే "ముళ్ళపై నడచినచో విధి నిన్ను బాధనుంచి రక్షించగలదా? పామును చంపక వదలిన పక్షంలో అది మనుజులను కరచి చంపదా?" అన్న యోచన ఆయనకు తట్టినదట. అయితే, తాను మనసు కుదురు బాటు చేసికొని తిరిగి పాము కోసం వెళ్ళే లోపల ఎలాగో అది పెనగులాడి కనుమరగి పోయిందట.

పై నుదహరించిన సంఘటనలు బర్మా ప్రధాని ఉదారభావాలకు తార్కాణాలు. అందుచేతనే నాయకుడు కాగోరినవాడు తన అనుయాయులకంటె ఎక్కువ సాహసం, విశేష సహనం, గొప్ప త్యాగం, సమధిక చిత్తశుద్ధులను కలిగివుండాలని ప్రధానామాత్య పదవి నుంచి విరమించుకునే సందర్భంలో ఆయన ప్రకటించడం వింతకాదు.

ఇండియా ప్రధాని పండిట్ నెహ్రూ, బర్మా ప్రధాని ఉను జీవితాలలో అనేక పోలికలు కన్పించడం ఆశ్చర్యకరం. త్యాగమూర్తులైన ఇట్టి నాయకులను కన్న దేశం ధన్యతమం. ఇట్టి మహనీయులు.

అధికారంలో ఉన్నప్పుడే కాదు, "మాంచెస్టర్ గార్డియన్" పత్రిక వ్రాసినట్టు గాంధీజీ వలె అధికారం చేపట్టకుండ ఉన్నప్పుడు కూడా లోకాన్ని ఉద్ధరించ గలుగుతారు.

(ఆంధ్రప్రభ 8-7-1956)

## "ఇండియా అతి ప్రాచీనదేశం"

సుదీర్ఘమైంది దాని చరిత్ర; మహోజ్వలమైంది దాని సంస్కృతి. ఆఫ్ఘనిస్తాన్ కూడా ఇట్టి దేశమే. నిజానికి మన రెండుదేశాలు ఆ ప్రాచీన చరిత్రను, ఆ మహా వైభవాన్ని పంచుకొన్నాయని చెప్పవచ్చు" - జహీరాకు స్వాగతాన్ని పలుకుతూ న్యూఢిల్లీలో నిన్న ప్రెసిడెంట్ ప్రసాద్ చెప్పిన ఈ మాటలు కేవలం లాంఛన ప్రాయమైనవి కావు. యుగయుగాలుగా ఇండియా, ఆఫ్ఘనిస్తాన్ల చరిత్ర, వాటి సంస్కృతి - మావిగున్న, మాధవీలతలవలె - పెనవైచుకొని వున్నాయి. ఈనాటి ఆఫ్ఘనిస్తాన్ ఒకనాటి గాంధార దేశం. కాబూల్లోయ కంటె ఖాందార్ నగరం, దాని పరిసర ప్రాంతాలు ప్రాచీన కాలంలో ఎక్కువ సిరిసంపత్తులతో తులతూగుతూ, రాజకీయంగా అధిక ప్రాధాన్యాన్ని కలిగివుండబట్టి, అప్పటిలో మొత్తం ఆఫ్ఘనిస్తాన్ గాంధార దేశంగా ప్రసిద్ధి చెందినదని అనుకోవచ్చు. ఏమైనా మన పురాణేతిహాసాలలో గాంధార దేశం ప్రసక్తి తరచు కానవస్తుంది.



మధ్యఆసియా నుంచి ఆర్యులు భారత దేశానికి చేరింది గాంధార దేశం పైగానే. ఆర్యుల ఈ వలసకు పూర్వం సింధు లోయలో పరిఢవిల్లిన నాగరికత గాంధారానికి విస్తరించి వుండేది; గాంధార సంస్కృతి ప్రభావం కొంత వరకు సింధు నాగరికతలో కానవచ్చేది కూడా. బాహ్లిక ప్రాంతం నుంచి తక్షశిలకు వచ్చే రాజమార్గం గాంధార దేశం పైగానే వచ్చేది కాబట్టి, అది కేవల మొక భారతీయ నగరంగా కాక, బాహ్లిక, గాంధార, భారతీయ సంస్కృతులకు త్రివేణీ సంగమంలా విలసిల్లుతూ వుండేది. గాంధార దేశాధిపతి సుబలుని పుత్రికే ధృతరాష్ట్రుని సతీమణి గాంధారి.

కొంత అస్పష్టతవున్న ఈ ప్రాచీన యుగాలనుంచి చారిత్రక కాలానికి వస్తే, క్రీస్తుశకానికి పూర్వం నాల్గవ శతాబ్దంలో అలెగ్జాండర్ భారతదేశంపై దండెత్తి వచ్చింది గాంధార దేశం పై గనే. క్రీస్తుశకం పదహారవ శతాబ్దంలో బాబర్ కూడా ముందు కాబూల్ను జయించి, అటు పిమ్మటనే ఇండియా పైకి యెత్తివచ్చాడు. తర్వాత చాలా కాలంపాటు మొగల్ సామ్రాజ్యానికి కాబూల్ ఒక కీలక నగరంగా వున్నది.

గాంధారం పైగా భారత దేశానికి చేరింది. విదేశీయ సామ్రాజ్య నిర్మాతలే కారు; ఈ మార్గం వెంటనే విజాతీయ కళలు, సంస్కృతి మొదలైనవి వచ్చినవి; విదేశీయ యాత్రికులు వచ్చారు. మధుర, సార్నాథ్, సాంచి, అమరావతి, నాగార్జున కొండ మొదలగు బౌద్ధకళా క్షేత్రాలలో మహోన్నత శిఖరాలను అందుకొన్న బౌద్ధశిల్ప చరిత్ర తొలి ప్రకరణం రచించబడింది గాంధార దేశంలోనే. బాహ్లిక ప్రాంతంలోని యవన శిల్పుల ప్రభావం కారణంగా, యవన, భారతీయ శిల్పకళారీతుల సమ్మేళనం కోసం జరిగిన కృషికి ప్రత్యక్ష ఫలితమే గాంధార శిల్పం. ఈ శిల్పంలో లాలిత్యం తక్కువ కావచ్చు; ప్రౌఢిమ కొరవడవచ్చు; సాహిత్య పరిభాషలో

వ్యంగ్యమైన దానికంటె వాచ్యమైనదే అధికం కావచ్చు. అయినా, గాంధార శిల్ప విశిష్ట పరిమాణమే అటు తర్వాత మల్లెలను కొల్లలుగా పూచిన బౌద్ధశిల్పమని చెప్పడానికి సంకోచించనక్కరలేదు. ఇన్ని విధాల ఇంతగా - ఇండియా, ఆఫ్ఘనిస్తాన్ల చరిత్రలు పెనవైచుకొని వున్నందునే నిన్న జహీర్ షాకు మన ప్రెసిడెంట్ స్వాగత వచనాలు కేవలం లాంఛనప్రాయ మైనవి కావని మే మనడం. గడచిన రెండు, మూడు శతాబ్దాలలో ఈ రెండు దేశాలకు సన్నిహితత్వం కొంత తగ్గినా, ప్రస్తుతం ఈ రెండింటికీ మధ్య మరొక రాజ్యం (పశ్చిమ పాకిస్తాన్) వున్నా, స్వతంత్ర భారత దేశావతరణంనాటి నుంచీ న్యూఢిల్లీ, కాబూల్ నగరాల మధ్య స్నేహ, సుహృద్భావాలు సమృద్ధిగానే కానవస్తున్నాయి. ఈ మైత్రిని మరింతగా పెంపొందించడానికే జహీర్ షాను మనం ఆహ్వానించడం, మన దేశంలో పర్యటనకు సమ్మతించి, నిన్న న్యూఢిల్లీకి ఆయన రావడం జరిగింది.

నూనూగుమీసాల వయస్సులో జహీర్ షా రాజ్యానికి వచ్చాడు. ఆ రావడంకూడా కల్లోల పరిస్థితులలో. 1933 లో ఆయన తండ్రి నాదిర్ షా హత్య జరిగింది. అప్పటికి జహీర్ షా వయస్సు పందొమ్మిది సంవత్సరాలు మాత్రం. కల్లోలిత రాజ్యానికి అధిపతి కావడం ఆ లేత వయస్సుకు చాలా పెద్ద బాధ్యత. అయినా, దాన్ని ఆయన జయప్రదంగా నిర్వహించడమే కాక, బహుముఖాలుగా తన దేశపురోభివృద్ధిని సాధించాడు. ఆయన ఎంతటి సమర్థుడో అంతటి దూరదృష్టి గలవాడు. అందువల్లనే ఏ అగ్రరాజ్య కూటంలోను చేరకుండా, స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనురిస్తున్నాడు.

జహీర్ షా రాకవల్ల ఇండియా, ఆఫ్ఘనిస్తాన్ల మైత్రి దృఢతరం కాగలదు. ఆయనకు ప్రెసిడెంట్ ప్రసాద్ పాటు యావద్భారత ప్రజానీకం స్వాగతం చెబుతున్నది. (ఆంధ్రప్రభ 13-2-1958)

## లార్డ్ అట్లీ : విన్స్టన్ చర్చిల్



"ఒక ఖాళీ కారు వచ్చింది. డౌనింగ్ స్ట్రీట్లో పదవ నంబర్ భవనం ముందు ఆగింది. దానిలో నుంచి అట్లీ దిగి, లోనికి వెళ్ళారు" ఇది నిన్న లండన్లో కన్నుమూసిన లార్డ్ అట్లీ విషయమై ఒక హాస్యకథనం.

"అట్లీ నిగర్వి; గర్వపడదగు లక్షణాలు ఆయనలో చాలా తక్కువ" -ఇది ఆయన విషయమై సర్ విన్స్టన్ చర్చిల్ విసిరిన ఒక ఛలోక్తి.

ఆయన అతి సామాన్యుడని, ఎన్నదగు వ్యక్తిత్వమైనా లేనివాడని, కొన్ని అనుకూల పరిస్థితుల వల్ల, అంతకంటె మిన్నగా అదృష్ట విశేషం వల్ల బ్రిటిష్ ప్రధాని కాగలిగినాడని, ఇదే విధంగా మరి కొన్ని విసురులు వెటకారాలు ప్రచారంలో లేకపోలేదు. కంచువలె కనకం మ్రోగదన్న సంగతిని వేమనను పోలినవారు ఎంతగా చెప్పినా, ఈ పాడులోకం ఎప్పటికప్పుడు మరచిపోతునే వుంటుంది.

లాయడ్ జార్జి వలె అట్లీ నక్కజిత్తులు నేర్చినవాడు కాకపోవచ్చు; రామ్సే మాక్డోనాల్డ్ వలె కప్పదాటులు వేయగలవాడు కాకపోవచ్చు; విన్స్టన్ చర్చిల్వలె భల్లూకపు పట్టు పట్టా గలవాడు కాకపోవచ్చు, అంతమాత్రం చేత ఆయన కార్యకుశలుడు కాకపోడు. తన ప్రజ్ఞలేవో ఆయనకు తెలుసు; వాటి పరిమితులు ఏవో ఆయనకు తెలుసు. అందువల్లనే తక్కిన బ్రిటిష్ పార్టీ నాయకులకు, ప్రధానులకు సాధ్యం కాకపోయిన కొన్ని మహావిజయాలను ఆయన సాధించగలిగాడు.

లాయడ్ పొడిచిన వెన్నుపోటు నుంచి లిబరల్ పార్టీ ఈనాటికైనా కోలుకోలేదు. లాయడ్ జార్జి లిబరల్ పార్టీకి చేసిన ద్రోహం కంటె, రామ్సే మాక్డొనాల్డ్ లేబర్ పార్టీకి చేసినట్టిది ఎన్నో ఎన్నో రెట్లు ఘోరమైంది. అట్లీ తన ఆత్మకథలో ("యాజ్ ఇట్ హ్యాపెన్డ్"లో) స్వయంగా చెప్పినట్లు బ్రిటన్ రాజకీయ చరిత్రలోనే అది మహాద్రోహం. ("The Greatest Betrayal") ) అయినా, దాని కారణంగా 1932లో చిన్నాభిన్నమై పోయిన లేబర్ పార్టీ, 1945 నాటి జనరల్ ఎన్నికలలో అఖండ విజయాన్ని సాధించి, రాజ్యాధికారానికి రావడం అట్లీ నాయకత్వంలోని వైశిష్ట్యంవల్లనే.



ఆ ఘన విజయాన్ని తన పార్టీకి అట్లీ సాధించింది సామాన్య పరిస్థితులలోనైనా కాదు. హిట్లర్ను ధిక్కరించి నిలిచిన మహావీరుడుగా, నాజీజం బారినుంచి స్వదేశాన్ని మాత్రమే కాక, ప్రపంచాన్ని కాపాడిన రాజకీయ అధ్యక్షుడుగా చర్చిల్ కీర్తి ప్రతిష్ఠలు తారాపథాన్ని అందుకుంటున్న సన్నివేశంలో దాన్ని ఆయన సాధించాడు. అప్పటిలో చర్చిల్ పరాజయం ఆయనకు ఆయనపార్టీకి మాత్రమే కాక, దేశదేశాల వారికి విశేషాశ్చర్యాన్ని కలిగించింది.

"చర్చిల్ యుద్ధనాయకుడుగా అద్వితీయుడు కావచ్చు. కాని, శాంతి సమస్యలను పరిష్కరించగల్గింది నేను మాత్రమే, నా పార్టీ మాత్రమే?" - ఈ విశ్వాసాన్ని ఆనాడు బ్రిటిష్ ప్రజానీకంలో రేకెత్తించగలగడంలో అట్లీ నాయకత్వ ప్రతిభ వున్నది. పార్టీలో ఆయనకంటె కొంతకాలం పాటు అధిక ప్రాధాన్యం వహించిన ఆర్థర్ గ్రీన్వుడ్ కాని, నాయకత్వానికి ఆయన పోటీ పడిన హెర్బలు మారిసన్ కాని, అప్పటిలో నాయకుడుగా వుండివుంటే ఫలితం ఏ విధంగావుండేదో చెప్పడం కష్టమే.

చర్చిల్ నిశ్చయంగా మహావ్యక్తి. ఆయన ప్రాచీన కాలంలో డిమోస్తినీజ్, సిసిరోల కోవకు ఆధునిక కాలంలో బర్క్ షెరిడన్ల కోవకు చెందిన మహావ్యక్తి. అయినా, 1945 నాటి ఎన్నికల ప్రచార సందర్భంలో ఆయన అట్లీ చేతిలో గట్టి దెబ్బ తినవలసివచ్చింది. లేబర్ పార్టీపై, దాని నాయకత్వంపై ఏవేవో అభాండాలను వేస్తూ చర్చిల్

చేసిన రేడియో ప్రసంగానికి అట్లీ "కీలెరిగిన వాత" పద్ధతిలో చెప్పిన సమాధానం ఎన్నిక ఫలితాన్ని చాలా వరకు నిర్ణయించింది!

వక్తృత్వంలోనే కాదు, ఇతర విధాల కూడా చర్చిల్ ఎంతో ప్రతిభావంతుడే! అయినా, యుద్ధంలో చర్చిల్ సాధించిన విజయాలకంటె శాంతికాలంలోని అట్లీ విజయాలే చరిత్రలో మరింత ప్రాధాన్యాన్ని వహించవచ్చు.

చర్చిల్ విషయమై అట్లీతో ఒకనొక సందర్భంలో లాయడ్ జార్జి "ఆలోచనలకు పుట్టవంటివాడు మన చర్చిల్. ప్రతిసమస్యకు అరడజను పరిష్కార మార్గాలు ఆయనకు స్ఫురిస్తూవుంటాయి. అయితే, అదేదో ఆయనకు తెలియదు."

వాటిలో ఒక్కటే సరైన మార్గం.. ఇంతటి జీవిత దృక్పథాన్ని మూడు ముఖ్య సంఘటనలు చాలావరకు నిర్ణయించాయి. వాటిలో మొట్టమొదటిది లండన్ ఈసెండ్లో యువకుడు ఆయన  పేదల నివసించే వాడలో పుట్టింది పేదకుంటుంబంలో కాదు; పచ్చని మధ్య తరగతి కుటుంబంలో. ఆయన తండ్రి లిబరల్ పార్టీకి చెందినవాడుకాగా, ఆయనేమో కన్సర్వేటివ్, అన్నలనుచూచి, ఆయన కూడా ఈసెండ్కు వెళ్ళడం, అక్కడి ప్రజల యోగక్షేమాలను గురించి శ్రద్ధ వహించడం జరిగింది. అక్కడ చూచిన దారిద్ర్య దైన్యాలే అట్లీని సోషలిస్టుగా మార్చాయి. ఆర్థిక న్యాయాన్ని కూర్చని రాజకీయ స్వాతంత్ర్యం సమగ్రమైన స్వాతంత్ర్యం కాబోదన్న విశ్వాసం అప్పుడే ఆయనకు కుదురుకున్నది.

తర్వాత మొదటి ప్రపంచ యుద్ధ సందర్భంలో ఆర్థిక, పారిశ్రామిక రంగాలపై విధినిషేధాలను, వాటి సత్ఫలితాలను పరిశీలించగా, ఆ పద్దుతులనే శాంతికాలంలో సాంఘికన్యాయాన్ని, ఆర్థిక న్యాయాన్ని సాధించడానికి వినియోగించ వచ్చునన్న విశ్వాసం కుదురుకున్నది.

ఆ వెనుక 1927లో సైమన్ కమిషన్ సభ్యుడుగా ఇండియాలో పర్యటన చేయగా బ్రిటన్ తన సామ్రాజ్య దేశాలనుంచి వీలైనంత త్వరలో, వీలైనంత గౌరవంగా తప్పుకొనడమే భావ్యం కాగలదన్న విశ్వాసం ఆయనలో స్థిరపడింది.

1945లో తాను ప్రధాని కాగలిగినంతనే ఈ మూడు విశ్వాసాలకు అనుగుణమైన విధానాలు అట్లీ చిత్తశుద్ధితో అమలుపరచడం జరిగింది. మనకు సంబంధించినంత వరకు ఇండియా, బర్మా, సింహళాల నుంచి బ్రిటన్ నిష్క్రమణ విషయమై ఆయన చేసిన నిర్ణయం అతిముఖ్యమైంది. ఇది బ్రిటన్ చరిత్రలోనే, ప్రపంచ చరిత్రలోనే ఒక ముఖ్య నిర్ణయం.

ఆసియాలో బ్రిటిష్ సామ్రాజ్య సంస్థాపనకు ప్రధానంగా విలియం పిట్, (పిట్ ది యంగర్) ఎంతగానో తోడ్పడినాడు. తనకంటే ముందుగా ప్రధానిగా పనిచేసిన లార్డ్ నార్త్ విధానాల కారణంగా అమెరికన్

వలసలను బ్రిటన్ కోల్పోయింది. ఈ నష్టాన్ని పూడ్చుకొనడానికి ఆసియాలో సామ్రాజ్యం స్థాపనకు పునాదులు వేసినవాడు పిట్.

ఆసియాలో సామ్రాజ్య సంపాదన ద్వారా బ్రిటన్కు పిట్ ఘనకీర్తిని సంపాదించగా, ఆ సామ్రాజ్యాన్ని మరి కాపాడుకొనడానికి వీలులేదన్న పరిస్థితి వచ్చిందని గుర్తించి, స్వచ్ఛందంగా దాని నుంచి నిష్క్రమణకు నిర్ణయించి, అంతటి ఘనకీర్తిని సమకూర్చినవాడు అట్లీ.

1945 నాటి బ్రిటన్ జనరల్ ఎన్నికలలో అట్లీ కాక, చర్చిల్ విజయం పొందివుంటే, ఆయన బ్రిటిష్ సామ్రాజ్య విచ్ఛిత్తిని నిరోధించగలిగేవాడు కాదు. "బ్రిటిష్ సామ్రాజ్య విచ్ఛిత్తికి నాయకత్వం వహించడానికే నేను ప్రధాని పదవికి రాలేదు" అని అంతకు కొంచెం ముందుగా చర్చిల్ ఉద్ఘాటించి వుండవచ్చు. కాని, ఒక చర్చిల్ కాక, వందమంది చర్చిల్ ఏకమైనా, ఆ విచ్ఛిత్తిని ప్రతిఘటించగలిగే వారు కాదు. కాలం మారిందని, పరిస్థితులు మారినవని సకాలంలో గుర్తించి, అట్లీ సముచిత నిర్ణయాన్ని చేయబట్టి, బ్రిటిష్ సామ్రాజ్యం పోయినా, కామన్వెల్త్ మిగిలింది; రెండు శతాబ్దాలలో పేరుకుపోయిన క్రోధ, విద్వేషాల స్థానంలో ఇండియా, బ్రిటన్ స్నేహ సుహృద్భావాలు నెలకొన్నాయి.

## చర్చిల్ ను గెలిపిస్తే...



బ్రిటన్ రోజులు బాగున్నాయి. అందువల్లనే దానికి ప్రస్తుత యుద్ధంలో చర్చిల్ నాయకత్వం లభించింది.

బ్రిటన్ రోజులు ఇకముందు కూడా బాగుండగలవా? ఇది నిజం కావాలంటే, యుద్ధం ముగిసిపోయినంతనే చర్చిల్ నాయకత్వాన్ని అది కోల్పోవాలి.

"మహానాయకుడుగా చర్చిలు గలిగినవారు అరుదు. ఇక, శాంతి నాయకుడుగా ఆయనను మించి అపకారం చెయ్యగలవారు సయితం అరుదే!

తమ కుటుంబ వాతావరణ ప్రాబల్యాన్ని త్రోసిపుచ్చి, తమ ఆజన్మపరిసరాల ప్రభావాన్ని ధిక్కరించి, స్వతంత్రదృష్టిని ప్రదర్శిస్తూ సాహసోపేతంగా సమస్త సమస్యలను సమీక్షచేసి, సముచిత కర్తవ్యాన్ని నిర్ణయించగలగడం ఏ గాంధీకో చెల్లు, లేదా ఏ లెనిన్కో చెల్లు.

చర్చిల్ గొప్పవాడే కావచ్చు, కాని, ఆయన గాంధీ. లెనిన్ ప్రభృతులు అంతస్తును చేరలేదు. చర్చిల్ కన్సర్వేటివ్ కుటుంబంలో పుట్టి పెరిగాడు. కొంతకాలం పాటు లిబరల్ పార్టీలో చేరినప్పటికీ, తన కన్సర్వేటివ్ సంప్రదాయాన్ని ఎన్నడూ ఆయన వాస్తవానికి అధిగమించలేక పోయాడు.

కన్సర్వేటివ్ దృష్టిలో బ్రిటిష్ సామ్రాజ్యం కేవలం భగవన్నిర్మితం. దానితో సరితూగ గల ఉత్తమనిర్మాణం, న్యాయవ్యవస్థ, ధర్మరాజ్యం మరిలేదు, వుండదు.



అందువల్ల గత ప్రపంచ మహాసంగ్రామంవలె ప్రస్తుత మారణహోమం సయితం బ్రిటిష్ సామ్రాజ్య సుస్థిరత్వానికి ప్రోదిచేయాలి. లేకపోతే, ఈ ప్రపంచ యుద్ధాలలో కురియించబడిన స్వేదమేమి, రక్తమేమి, అశ్రువు లేమి, కేవలం వృధా అయిపోయినట్టే!

ఉత్ప్రేక్షకోసం మేము ఈ విధంగా అనడం లేదు. మా పలుకులకు సమర్థన, కామన్సు సభలో బ్రిటిష్ విదేశాంగనీతిని గురించి గతవారంలో జరిగిన చర్యలో భావి ప్రపంచ వ్యవస్థపై చర్చిల్ చేసిన ప్రకటనే.

భావి ప్రపంచశాంతి రక్షణకు ఒక అంతర్జాతీయ సంస్థను నిర్మించడం అవసరమని ఈ ప్రకటనలో చర్చిల్ సూచించాడు. ప్రస్తుతం మృతప్రాయమైన నానాజాతిసమితివలె కాక, ఆ నూతనసంస్థకు ప్రపంచ శాంతిరక్షణకు అవసరమైన ఆయుధబలం వుండాలని ఆయనన్నాడు. ఇంతటితో ఆయన ఆగితే, ఆయన ప్రతిపాదనలు పూర్తిగా కాకపోయినా, కొంతవరకైనానిరాక్షేపణీయమైనవే అని అనుకోవచ్చు.

కాని, చర్చిల్ దృష్టిలోగల భావి అంతర్జాతీయ వ్యవస్థలో వివిధ స్వతంత్రరాజ్యాలకు సమానస్థానం, ప్రతిపత్తి వుండవు. బ్రిటిష్ సామ్రాజ్యం, యునైటెడ్ స్టేట్సు, సోవియట్ రష్యా: ఈమూడు రాజా పలుకే శాసనంగా దానిలో చెల్లాలి.

ఇదే జరిగిననాడు కొన్ని కొన్ని రాజ్యాలను ఒక కూటంగా ఏర్పరచడానికి ప్రయత్నాలేమి, ఒక కూటంకంటె మరొకటి శక్తిమంతమైనది కాకుండా చూడ్డానికి కుట్రలేమి, రహస్యసంధులేమి, ఆ సంధుల అతిక్రమణలేమి తిరిగి ఘోరంగా చెలరేగుతాయి. దీని ఫలితంగా ఇంకొక పాతిక సంవత్సరాలకు మరొక ప్రపంచయుద్ధం ప్రజ్వలించవచ్చు.

ఇది కేవలం మా అభిప్రాయం మాత్రమే కాదు, "న్యూయార్క్ వరల్డ్ టెలిగ్రాం" పత్రిక మొన్న ఒక సంపాదకీయాన్ని వ్రాస్తూ, సరిగా ఈ అభిప్రాయన్నే వెల్లడించింది. దాని వ్యాఖ్య ప్రకారం చర్చిల్ ఉద్దేశిస్తున్న

కొత్త అంతర్జాతీయ సంస్థ కేవలం ఒక కపటనాటకం మాత్రమే. అయితే మేము మాత్రం "చర్చిల్ కపటి" అనే ఆరోపణను చెయ్యము.

ఇంపీరియలిస్ట్ వాతావరణంలో పుట్టి పెరిగిన చర్చిల్కు ఇంపీరియలిజం లేకుండా ప్రపంచం మనలేదని తోచడం సహజం.


ప్రపంచయుద్ధాలకు మూలకందం ఇంపీరియలిజమే అని మీకు తెలియవచ్చు, మాకు తెలియవచ్చు. కాని, చర్చిల్ మాత్రం తన ప్రవృత్తికారణంగా ఈ నగ్నసత్యాన్ని కానలేదు. అందువల్ల ఆయన వైఖరిపట్ల ఆగ్రహాన్ని ప్రదర్శించడం తగదు; ఆయన స్వాభావిక సంకుచితదృష్టికి విచారించాలి.

అయితే, చర్చిల్ స్వభావంలోని ఈ లోపాన్ని గుర్తించి, యుద్ధం ముగిసినంతనే నాయకత్వం నుంచి ఆయనను బ్రిటిష్ ప్రజలు తొలగించకపోతే మాత్రం, ఆ పొరపాటుకు బ్రిటన్తోపాటు, ప్రపంచమే మరొక మహాసంగ్రామం రూపంలో కఠోరమూల్యాన్ని చెల్లించ వలసివుంటుంది.

(ఆంధ్రప్రభ 30-5-1944)

## మిస్టర్ మహ్మదాలీ జిన్నా

కరాచిలో మొన్న కన్ను మూసిన కాయిదే అజం అందరికీ గౌరవభాజనుడే. కాని, ఆయన కొందరికే ప్రేమపాత్రుడు.



ఆయనది నిశితమైన మేధస్సు. ఏ పరిస్థితినైనా ఆయన క్షణంలో ఆకళింపు చేసుకోగలిగేవాడు. అంతేకాదు, దాన్ని ఎదుర్కొనడానికి తగు మార్గాన్ని సయితం నిర్ణయించుకోగలిగేవాడు. ఎత్తుకు ఎదురెత్తు వేయడంలో, వ్యూహానికి ప్రతివ్యూహాన్ని పన్నడంలో భారతీయ రాజకీయవేత్తలలో ఆయనకు ఆయనే సాటి. పైగా, నిన్న చెప్పినదాన్ని గాని, నేడు చేసినదాన్నిగాని, రేపటికి ఆయన తనకు అడ్డుగా నిలవనిచ్చేవాడు కాదు.

రేపటి స్థితిగతులకు ఏది అనుగుణ నిర్ణయమో అదే ఆయనకు ముఖ్యం. ఆ నిర్ణయాన్ని చేస్తూనే, దాన్ని సమర్థించడానికి కొంత తర్కాన్ని- లేదా, కుతర్కాన్ని -- యోచించిపెట్టేవాడు కూడా. ఆయన ఈ మేధాసంపత్తే, ఆయన ఈ వ్యవహారదక్షతే ఆయన అందరికీ గౌరవ భాజనుడు కావడానికి ఒక ముఖ్యకారణం.

మిస్టర్ మహమ్మదాలీ జిన్నా ప్రతికక్షులు సయితం ఆయనను గౌరవించడానికి మరొకకారణం, --ఆయన చిత్తశుద్ధి. తన జీవిత చరిత్రలోని విభిన్న ఘట్టాలలో ఆయన విభిన్న లక్ష్యాలను అనుసరించి వుండవచ్చు. కాని, ఎప్పుడు ఏ లక్ష్యాన్ని పెట్టుకున్నా, దాన్ని సాధించడానికి ఆయన చిత్తశుద్ధి ఒకటైతే విశాల చిత్తం మరొకటి. మిస్టర్ జిన్నా చిత్తశుద్ధిని శంకించేవారు లేరుగాని, ఆయన విశాల చిత్తాన్ని సయితం ప్రదర్శించేవాడనడం మరణించినవారిని గురించి మంచి మాటే చెప్పుకోవాలన్న మర్యాదను మరిచి -- కేవలం స్తోత్రపాఠం చేయడమే == కాగలదు.

ప్రతికక్షి లక్ష్యాలను గౌరవించినా, గౌరవించకపోయినా, అతని చిత్తశుద్ధిని శంకించకపోవడం విశాల చిత్తునికి సహజం. కాని, ఎన్నడైనా తన ప్రతికక్షి వ్యక్తిగత దూషణకు సంకోచించాడా? మౌలానా అజాద్ను "డ్రమ్ బోయ్ ఆఫ్ ది కాంగ్రెస్" "కాంగ్రెసుకు డప్పు కొట్టేవాడు" అని ఆయన నిందించలేదా?

అన్యవిధాల తాను పెద్దరికమిచ్చినా, యివ్వకపోయినా, వయస్సులో పెద్దవాడైన గాంధీజీ ఎన్నోసార్లు తన ఇంటివద్దకురాగా, వయస్సులోనైనా, పెద్దవాడుగదా అని, ఒక పర్యాయమైనా తాను ఆయన బసవద్దకు వెళ్లాడా? ఆయన తన వాకిలిలోకి వచ్చినప్పుడు లాంఛనంగానైనా ఎదురుగా వెళ్లాడా? అంతకు ముందు ఎవరేమి సంభావించినా, సత్యం, ప్రేమ, అహింస సిద్ధాంతాల పరిపాలనకై గాంధీజీ ఆత్మార్పణ చేసిన పిమ్మట ప్రపంచ నాయకుని కోల్పోయినామని దేశదేశాలు దురపిల్లుతుండగా "హిందూస్థాన్ ఒక హిందూనాయకుని కోల్పోయిన" దని మిస్టర్ జిన్నా ప్రకటన చేసివుండలేదా?

జీవిత ప్రారంభంలోని విశాలాశయాలు జీవితాంత సమయానికి లేకపోవడమే మిస్టర్ జిన్నాలో

చిత్తవైశాల్యాన్ని ప్రదర్శించగల శక్తి అంతకంతకు తగ్గిపోయివుండవచ్చు. స్వచ్ఛమైన జాతీయవాదిగా ఆయన జీవితాన్ని ప్రారంభించాడు. గాంధీజీకివలె మిస్టర్ జిన్నాకి కూడా ఒకప్పుడు శ్రీ గోపాలకృష్ణ గోఖలే గురుతుల్యుడు. ఒకప్పుడు లోకమాన్య బాలగంగాధర్ తిలక్పట్ల ఆయనకు అధిక గౌరవభావం. ఒకప్పుడు ముస్లిం లీగ్లో-- అది ఒక మత వర్గానికి సంబంధించిన సంస్థకావడంచేత సభ్యుడిగా చేరడానికి ఆయన నిరాకరించాడు.

ఒకప్పుడు మతోద్రేకాలు పెంచడం మహారిష్టదాయకమని ఉద్యమం ఛాయలకైనా ఆయన వెళ్లలేదు. ఒకప్పుడు, ఎన్నడో కాదు; భారత రాజకీయ సమస్యాపరిష్కారానికి బ్రిటిషు వారు లండన్లో జరిపిన తొలి రౌండేబుల్ సమావేశ సందర్భాన 1930లో ఫెడ్రల్ ప్రభుత్వం కూడదని ఆయన పట్టుదల చూపించాడు.

ఇట్టి మిస్టర్ జిన్నా ప్రత్యేక జాతి సిద్ధాంత ప్రతిపాదకుడుగా - పాకిస్థాన్ ప్రతిపాదకుడుగా పరివర్తనం చెందడానికి ఆయన రాజస ప్రవృత్తే కారణం. గాంధీజీ అహింసా సిద్ధాంతమేమి, సత్యాగ్రహ విధానమేమి ఆయనకు ఎంతమాత్రం రుచించలేదు. గాంధీజీ అనుసరించిన రాజకీయ సూత్రాలను మించి, ఆయన నిర్దేశించిన జీవితవిధానం మిస్టర్ జిన్నాకు దూష్యమైనదిగా తోచింది. ఇందువల్లనే గాంధీజీ నాయకత్వాన్ని గుర్తించిన కాంగ్రెస్ సంస్థ నించి, కొన్నేళ్లపాటు మిస్టర్ జిన్నా రాజకీయాజ్ఞాతవాసాన్ని చేశాడు.

కాని, మిస్టర్ జిన్నాను పోలిన కర్మవీరుడేమి, కార్యదక్షుడేమి చిరకాలం అజ్ఞాతవాసిగా నిలవగలడా? అంచేత అనతికాలంలో ఆయన తిరిగి రాజకీయరంగంలో ప్రవేశించాడు. ఈ పునఃప్రవేశం ఒక కొత్తరూపంలో; కేవలం ఒక కొత్త అవతారమైనట్టుగానే. రాజకీయరంగంలో పునఃప్రవేశం చేసిన మిస్టర్ జిన్నా ప్రధాన లక్ష్యం గాంధీజీ సిద్ధాంతాలకు భిన్నమైనవాటిని ప్రబోధించడం; కాంగ్రెసు ఆశయాలకు విభిన్నమైనవాటితో మరొక సంస్థను నిర్మించడం.



గాంధీ, జిన్నాలు పరస్పర విరుద్ధ మార్గాలను అనుసరించినప్పుడు ఎవరో ఒకరే అభ్యుదయ శక్తులకు ప్రతినిధులు కావాలిగాని, ఉభయులు కాలేరుగదా? ముస్లింలీగ్ కు చెందినవారిని విడిచిపుచ్చితే, "మతాన్ని బట్టి జాతి" అనడం అభ్యుదయ సూత్రమని ఎవరనగలరు? దేశాలమధ్య సరిహద్దులే అంతరించవలసిన సమయం వచ్చినట్టు తోస్తున్న సమయంలో భౌగోళికంగా, చారిత్రకంగా, సాంస్కృతికంగా, ఏక ఖండమైన దేశాన్ని విభజించాలనడం అభ్యుదయ కారకమని ఎవరనగలరు? మిస్టర్ జిన్నా సిద్ధాంతాలేమి, విధానాలేమి యుగధర్మానికి సయితం ఆశలు ఫలించడానికి ఆయన కలలు నిజంకావడానికి వ్యతిరిక్తమైనవైనా, ఆయన ఆయన మేధాశక్తితోపాటు, ఆయన కార్యదక్షతతోపాటు, ఆయన రాజకీయ దురంధరత్వంతో పాటు, ఆయన కోర్కెలు బ్రిటిషు వారి అభిమతాలకు అంతగా భిన్నమైనవి కాకపోవడమే. ఏమైనా ఒక్కటిమాత్రం తిరుగులేని విషయం. మిస్టర్ జిన్నా పరిష్కరించి పోయిన సమస్యలకంటె కల్పించిపోయినవే మెండు. దూరదృష్టితో, సహనబుద్ధితో, సామరస్యాభిలాషతో, విజ్ఞతా పూర్వకంగా వీటన్నింటిని పరిష్కరించుకొనడం ఇండియాకంటె కూడ మిన్నగా పాకిస్థానుకు ప్రాణావసరం. (ఆంధ్రప్రభ 15-9-1948)

## జుల్ ఫికర్ ఆలీ భుట్టో

స్త్రీ చిత్తం చంచలమైనదనడం నిజంకాదు; అది పురుషులనే మాట. భుట్టో చిత్తం మాత్రం నిశ్చయంగ చంచలమైనదే. అది ఆయన విరోధులనే మాట కాదు; ఆప్తులైనా అనక తప్పదు.

నిన్న చెప్పిన మాట ఆయన నేడు చెప్పడు. ఉదయం చెప్పిన మాట సాయంత్రానికి మారిపోతుంది. ఒక గంటలోనే ఆయన తన మనస్సు మార్చుకోవచ్చు. కొన్ని కొన్ని సందర్భాలలో ఈ నిమిషంలో చెప్పినదానికి, మరొక నిమిషంలో చెప్పినదానికి పరస్పర వైరుధ్యం వుండవచ్చు. మాటనిలకడ లేకపోవడం ప్రతి రాజకీయవేత్తలో తరతమ విభేదంలో కానవచ్చే లక్షణమే. అయితే, ఇది భుట్టో విషయంలో పరాకాష్ఠను అందుకొన్నది. ఇట్టి వ్యక్తితో వ్యవహరించడం కష్టమే. ఈ విషయాన్ని ఇదివరలో అయూబాన్ తెలుసుకొన్నాడు; ముజిబుర్ రహమాన్ తెలుసుకొన్నాడు; ఇందిరాగాంధీ కూడా తెలుసుకొనడం ఈసరికి చాలావరకు జరిగినట్టు అనుకోవచ్చు.

అయినా, భుట్టోతో మనమేమి, బంగ్లాదేశ్ నాయకులేమి వ్యవహరించక తప్పదు. ఆయనతో వ్యవహరించకపోతే, ఏ టిక్కాఖాన్తోనో, మరొక పాక్సైనికాధికారితోనో వ్యవహరించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సంగతి గుర్తించినందువల్లనే కావచ్చు, పాకిస్తాన్లోని ప్రతిపక్షాల నాయకులు భుట్టోతో నూతన రాజ్యాంగం రచన విషయమై ఒడంబడికకు వచ్చారు. ఈ సందర్భంలో భుట్టో సయితం తెగేవరకు లాగలేదనే చెప్పాలి. ఆదిలో పట్టుదలకు పోయినా, వ్యవహారం బెడిసిపోగలదని తోచినంతనే ఆయన రెండు, మూడు మెట్లు కిందికి దిగివచ్చాడు.



ఇదే భుట్టో ప్రత్యేకత. ఆయన చంచలత్వానికి మూలం బుద్ధిమాంద్యం కాదు, బుద్ధికుశలత. ఆయన ఎంతో తెలివితేటలున్నవాడు; " ఎప్పటి కెయ్యది ప్రస్తుతమో అప్పటి కామాటలాడ" గలవాడు; అవసరమైనప్పుడు "అన్యుల మనముల నొప్పింప" జేయడానికి సంకోచించనివాడు; ఆ వెను వెంటనే మెత్తమెత్తగా, తియ్యతియ్యగా మాట్లాడ నేర్చినవాడు.

రాజకీయవేత్తకు వాక్చాతుర్యం మాత్రమే చాలదు; నటనలో ప్రజ్ఞాప్రాభవాలు సయితం కావాలి. లేకపోతే, అతడు ప్రథమశ్రేణి రాజకీయవేత్త కాలేడు. భుట్టో వాక్చాతుర్యంలోనే కాక, నటనాకౌశల్యంలో కూడా అధిక ప్రతిభావంతుడే. కోపాన్ని నటిస్తూ ఆయన దుర్భాష లాడగలడు; పశ్చాత్తాపాన్ని నటిస్తూ కన్నీరు కాల్వలు కట్టించగలడు; స్నేహాన్ని నటిస్తూ కౌగిలించుకొనగలడు; ఉదాత్తతను నటిస్తూ అరచేతిలో వైకుంఠాన్ని చూపించగలడు. ఈ గుణగణాలతో పాటు భుట్టోలో వాస్తవికతా పరిజ్ఞానం కూడా కొల్లలుగా వున్నది. అందరు రాజకీయవేత్తలవలె ఆయన సయితం "జూదరి". రాజకీయాల "జూదం" లో ఏమి పందెం కాయవలెనో, ఎవరిపై కాయవలెనో, ఎంతవరకు కాయవలెనో, ఎక్కడ ఆగవలెనో ఆయనకు తెలుసు. అందువల్లనే అయూబన్ను ధిక్కరించి, ఆయన నిలదొక్కుకొనగలిగాడు; యాహ్యాఖాన్ను త్రోసిపుచ్చి, పాకిస్థాన్ నాయకత్వాన్ని చేపట్టగలిగాడు; నిరుడు సిమ్లాలో ఇందిరాగాంధీతోను, నిన్న పాక్ ప్రతిపక్షాలతోను ప్రతిష్టంభన మరి తప్పదన్న క్లిష్టఘట్టంలో రాజీకి రాగలిగాడు. తిరిగి ఇండియా, బంగ్లాదేశ్లతో భుట్టో "జూదం" ఆడుతున్నాడు. దీనిలో సయితం

ఇప్పుడు ఎక్కడ ఆగవలెనో ఆయన తెలుసుకోగలడా? రానున్న కొద్ది రోజులలో, లేదా వారాలలో, ఈ ప్రశ్నలకు సమాధానం లభిస్తుంది. (ఆంధ్రజ్యోతి 13-4-1973).

## భారత మిత్రుడు ఎడ్వర్డ్ థాంప్సన్

ఇప్పటికైనా సరే ఇండియాపట్ల బ్రిటన్ న్యాయంగా, ధర్మంగా ప్రవర్తిస్తే, దాని సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని, స్వయం నిర్ణయాధికారాన్ని నిర్నిబంధంగా గుర్తిస్తే, కలకాలంవరకు సామరస్య పూర్వకమైన ఇండో - బ్రిటిష్ సంబంధ బాంధవ్యాలు నెలకొనడం అసంభవం కానక్కరలేదు. ఇట్టి పరిస్థితిని కల్పించడంలో ఎంతో తోడ్పడిన ఎడ్వర్డ్ థాంప్సన్ (1886-1946) నాలుగైదు రోజులనాడు చనిపోవడం ఇండియాకు ప్రత్యేకించి సంతాపకారణం.

థాంప్సన్, తక్కిన పెక్కుమంది బ్రిటిష్ వారివలె భుక్తికోసం ఇండియాకు వచ్చినవాడే, కాని, బెంగాల్లోని బంకూరా కాలేజీ ప్రిన్సిపలుగా తన ఉద్యోగధర్మాన్ని నిర్వర్తించడంతోనే సంతృప్తి చెందక, తాను ఏ దేశం ఉప్పు పులుసు తింటున్నాడో దాని ప్రజల స్నేహం చేయడానికి, వారి సంస్కృతిని అర్థం చేసుకొనడానికి, వారి సాధకబాధకాలను తెలుసుకొనడానికి ప్రయత్నించాడు. ఈ కారణంగానే ఆయనకు గాంధీ, టాగోర్, నెహ్రూ మొదలైనవారితో సన్నిహిత స్నేహం కుదిరింది; దీని ఫలితంగానే ఆయన భారతసమస్యలపై అనేక గ్రంథాలను రచించడం సంభవించింది; ఇందుమూలంగానే ఉద్యోగం నుంచి విరమించి, - స్వదేశానికి మరలి పోయిన తర్వాతకూడా భారతదేశంలో పర్యటనకై ఆయన అనేక పర్యాయాలు రావడం జరిగింది.

భారతీయ చరిత్రను, సారస్వతాన్ని, సంస్కృతిని, జాతీయోద్యమాలను బ్రిటిష్వారికి ఎరుకపరచడానికి థాంప్సన్ చేసిన రచనలనేకం. 1857 నాటి భారత స్వాతంత్ర్య సమరాన్ని గురించి బ్రిటిష్ చరిత్రకారులు వ్రాసిన అసత్యాలను ఖండించడానికి “ది అదర్ సైడ్ ఆఫ్ ది మెడల్" అనే గ్రంథాన్ని రచించాడు. భారతదేశ పునరుద్ధరణకు జరగవలసిన కృషిని వివరించడానికి “ది రికన్స్ట్రక్షన్ ఆఫ్ ఇండియా” అనే పుస్తకాన్ని వ్రాశాడు. మొన్నటి ప్రపంచ మహాసంగ్రామ సందర్భంలో భారత ప్రజల హృదయపూర్వక సహకారాన్ని సంపాదించదగు మహదవకాశం జారవిడవబడుతున్నందుకు బాధపడి “ఎన్ఆస్ట్ ఇండియా ఫర్ ఫ్రీడం” అనే రచన చేశాడు.

ఇక రవీంద్రుని జీవితాన్ని గురించి, బెంగాలీ సాహిత్యాన్ని గురించి ఆయన వ్రాసిన గ్రంథాలెన్నో. ఇంతే కాదు. ఆధునిక భారతజాతి జీవితాన్ని, ముఖ్యంగా తనకు సన్నిహితంగా తెలిసిన వంగ ప్రజల జీవితాన్ని ప్రతిబింబిస్తూ ఆయన కొన్ని నవలలను రచించాడు. “కృష్ణకుమారి” అనే నాటికను సయితం రచించాడు.

థాంప్సన్ రచనలను ఉత్తమ సాహిత్యంగా ఏన్నగలమా, లేదా అనే విషయమై విభిన్నాభిప్రాయా లుండవచ్చుగాని, ఇండియాకు జరుగుతున్న అన్యాయాలను తొలగించాలని, ఇండియా, బ్రిటన్ల మధ్య సుహృద్భావాన్ని పెంపొందించాలని ఆయన చేసిన కృషి అమూల్యమైన దనడంలో భేదాభిప్రాయానికి తావే లేదు. ఈ విశిష్టతనయుని కోల్పోయినందుకు బ్రిటన్ ఏ పాటిగా బాధపడుతున్నదో తెలియదుగాని, ఈ చిరమిత్రుని పోగొట్టుకొన్నందుకు ఇండియా దురపిల్లుతున్నది.

(ఆంధ్రప్రభ 5-5-1946)

## ఫీల్డ్ మార్షల్ మానెక్ షా



కాలమేమో 1942; స్థలమేమో బర్మాలో సిట్టాంగ్ వంతెన; సన్నివేశమేమో ఈ వంతెన రక్షణ బాధ్యత. నల్లేరుపై బండి నడకవలె బర్మాలో జపాన్ సేనల పురోగమనం సాగుతున్నది. వాటి కైవసం కాకుండా ఆ వంతెనను రక్షించడం సాధ్యమా? సాధ్యాసాధ్యాల ఆలోచనతో నిమిత్తం లేకుండా ఒక ఇండియన్ మేజర్ తన సైనిక ధర్మాన్ని నిర్వహిస్తున్నాడు.

అతడికి మరతుపాకి గుండు దెబ్బలు తగిలాయి. అతడు నేలపై కుప్ప కూలినట్టు పడిపోయాడు. అతడు మరణించినట్టుగానే భావించి, అతడి ఆధిపత్యం కింద వున్న సైనికులు హుటాహుటిగా తిరోగమించారు. అయితే, అతడి ఆర్డర్లీ మాత్రం తన ఆఫీసర్ను విడిచి పారిపోలేదు. అక్కడనే ఒక మూల దాక్కుని జపాన్వారు వెళ్ళిపోయిన తర్వాత అతడిని భుజంపై వేసుకొని ప్రోం పట్టణం దిక్కుగా నడవడం ప్రారంభించాడు. మార్గంమధ్యలో స్పృహవచ్చిన ఇండియన్ మేజర్!" అని హెచ్చరించాడు. అయినా, అతడు వినలేదు. "మీలో వూపిరి వుండగా, నేను మిమ్మల్ని విడిచివెళ్ళేది లేదు" అని గట్టిగా చెప్పాడు.

ఇంతలో జపాన్ విమానాలు బాంబుల వర్షాన్ని కురిపించడానికి రాగా, తన ఆఫీసర్ను అతడు కందకాలలో భద్రంగా దాచిపెట్టాడు. తిరిగి ఆ రోజంతా నడుస్తూ పోయాడు. ఆ మరునాడు కూడా అదే విధంగా ఆఫీసర్ను మోసి, చివరికి ఒక మిలిటరీ ఆసుపత్రికి చేర్చాడు. తెల్లవారుజామున నాలుగుగంటలకు ఒక ఆర్మీ సర్జన్ ఆపరేషన్ చేసి, ఆ ఇండియన్ మేజర్ పేగులలోనుంచి, లివర్లో నుంచి, ఊపిరితిత్తులలోనుంచి మొత్తం ఆరు మరతుపాకి గుళ్ళను తీశాడు. అటు తర్వాత ఆ మేజర్ను రంగూన్కు పంపించారు. ఆ పైన ఓడలో మద్రాసుకు చేర్చారు. అతడు కోలుకోగల అవకాశాలు లేవని రంగూన్ డాక్టర్లు భావించారు గాని, మద్రాసులో మరొక ఆపరేషన్ పిమ్మట క్రమంగా అతడు కోలుకున్నాడు. బర్మా యుద్ధంలో చూపిన ధైర్యసాహసాలకు అతడికి నాటి బ్రిటిష్ ప్రభుత్వం "మిలిటరీ క్రాస్" బహూకరించింది. అతడినే మొన్న నేటి భారత ప్రభుత్వం మొదటి ఫీల్డ్ మార్షల్ చేసింది.

మేము చెప్పకుండానే మేము ఇంతవరకు వ్రాసింది ఎస్.హెచ్.ఎఫ్.జె. మానెక్షాను గురించే అని మీరు ఇప్పుడు గ్రహించివుంటారు. సర్వసేనానిగా రాణించడానికి కేవలం ధీరోదాత్తత చాలదు; యుద్ధవ్యూహరచనలో సామర్థ్యమైనా చాలదు; తన సహచరులలో, అనుచరులలో తన నాయకత్వంపట్ల దృఢ విశ్వాసాన్ని పాదుకొల్ప గల శక్తికూడా కావాలి; వారిని ఉత్తేజపరచగల, వారిచే ఎట్టి త్యాగాలనైనా చేయించగల

ప్రవృత్తికూడా కావాలి. వీటిలో అధికుడైనందునే మానెక్షా స్వతంత్ర భారతంలో మొదటి ఫీల్డ్ మార్షల్ కాగలిగాడు. తల్లిదండ్రులకు మానెల్షా "శామ్"; మిత్రకోటికి "శామ్"; ఇదే విధంగా తన సైనికులకు కూడా "శామ్". ఇంతగా అందరి ప్రేమానురాగాలను అతడు చూరగొన గలిగాడు. జనరల్ కౌల్ వలె, ఫీల్డ్ మార్షల్ మానెల్ష రాజకీయాలలో ఎన్నడూ వేలు పెట్టినవాడు కాడు. సైన్యాధికారులు రాజకీయాలకు దూరంగా వుండవలెనన్న బ్రిటిష్ సంప్రదాయాన్ని అతడు సర్వదా పాటించాడు.



నంగి నంగి మాటలు మానెక్షాకు చేతకావు. కల్లకపటాలకు అతడు అపరిచితుడు. అందువల్లనే కృష్ణమీనన్ రక్షణమంత్రిగా వున్న రోజులలో ఆయన వైఖరులపట్ల, విధానాలపట్ల తన అసంతృప్తిని తన మిత్రవర్గంమధ్య వెల్లడించడం జరిగింది. అతడి పలుకులను కృష్ణమీనన్ వద్దకు ఎవరో చేరవేయగా, విచారణ జరిపించడం వరకు వెళ్ళారు. అయితే, అతడి పై వచ్చిన ఆరోపణలను విచారణసంఘం త్రోసిపుచ్చింది. అయినా, అప్పటిలో అతడి ప్రమోషన్ నిలిపివేశారు.

అయితే మాత్రమేమి? అన్నివిధాల సమర్థుడైనందున స్వతంత్రభారతంలో మొట్టమొదటి ఫీల్డ్ మార్షల్ కాగల ఘనత అతడికే దక్కింది.

విశిష్టవ్యక్తి కనుకనే తాను ఫీల్డ్ మార్షల్ అయిన మరునాడే " నలుబది సంవత్సరాలనుంచి నేను సర్వీసులో వున్నాను. నన్ను మరి సర్వసేనాని పదవి నుంచి తప్పించి, నాకంటె తక్కువ వయస్సులోగల సేనానిని ఆ పదవికి నియమించాలి" అని మానెక్షా ప్రకటించాడు. ఇంతలోనే జనరల్ జి.జి. బెవూర్ను ఆ పదవికి నియమించినట్టు వార్త వచ్చింది కూడా.

సర్వసేనాని పదవినుంచి మానెక్షా తప్పుకొన్నా, ఫీల్డ్మార్షల్గా ఆయన సలహాలు భారత సాయుధబలాలకు లభిస్తూనే వుంటాయి. సర్వసేనానిగా మనకు, మన దేశానికి ప్రతిష్ఠతెచ్చిన ఫీల్డ్ మార్షల్ మానెల్షకు ఈ సందర్భంలో మా గౌరవాభివందనాలను అందజేస్తున్నాము.

(ఆంధ్రజ్యోతి 5-1-1973)

## చౌ శ్రీరంగనీతులు

"దొమ్మర గుడిసెలలో దూరే" వారే "శ్రీరంగనీతులను" ఎక్కువగా చెప్పడం కద్దు. ఎంత హెచ్చుగా తాము నీతులను పల్కితే, అంతగా తాము లోకం కన్నుగప్పగలమని వారి భ్రమ. ఇట్టి భ్రమలో పడిపోయి నందువల్లనే కావచ్చు. ఇండియా - చైనా సరిహద్దు వివాదం పై ఏ ప్రకటన చేసినా, చౌ ఎన్-లై ఎన్నెన్నో శ్రీరంగనీతులను ఏకరువు పెడుతున్నాడు. కాని, లోకం ఆయన భ్రమిస్తున్నంత గ్రుడ్డిది కాదు. సరిహద్దు వివాదాన్ని గురించి కొత్తగా చేసిన ప్రకటనలో తగవును చంపుకొనడానికి తామెంతో తాపత్రయ పడుతున్నా దాన్ని సాగదీయడానికే ఇండియా ప్రయత్నిస్తున్నట్టు చైనా ప్రధాని ఆరోపించాడు. రెండు దురుద్దేశాలతో ఇండియా ఈ పని చేస్తున్నదట. మొదటిది: ఈ వివాదాన్ని అవకాశంగా తీసుకొని, దేశంలోని ప్రగతిశీల శక్తులను అణచివేయడం. రెండవది: దీన్ని అవకాశం చేసుకొని విదేశాల నుంచి సహాయం పొందడం. అసలు ఈ వివాదానికి కారకు లెవరు? తామే కాదా? ఒకవైపున పంచశీలను వల్లె వేస్తూనే, మరొక వైపున భారత భూభాగాలను అన్యాయంగా తాము ఆక్రమించుకొనలేదా? దురాక్రమణ చర్యలను తామే కొనసాగించిన పిమ్మట లడఖ్ ప్రాంతంలో తాము ఆక్రమించుకొన్న ప్రాంతాన్ని తమకు విడిచిపెడితే, తక్కిన సరిహద్దు ప్రాంతాల విషయమై పేచీ పెట్టమని చెప్పడమే తమ పరిష్కారేచ్ఛకు నిదర్శనమా? దానికి సమ్మతించక పోవడం తగవును సాగదీయాలనే పట్టుదలకు రాణమా?

తమతో వివాదాన్ని పెంచు కొనడం ద్వారా భారత ప్రభుత్వం ఏవో కొన్ని ప్రయోజనాలను సాధించగోరుతున్నదని చైనా ప్రధాని చేసిన ఆరోపణలు ఏవగింపుతో త్రోసి వేయదగినట్టివి; వాటిని పరిశీలించవలసిన అగత్యం ఎంత మాత్రం లేదు.

తాత్కాలిక ప్రయోజనాలను సాధించడం కోసం తాను నమ్మిన న్యాయ సూత్రాలకు, ధర్మ సూత్రాలకు తిలోదకాలను వదిలే దుర్గతిలో భారత ప్రభుత్వం పడలేదు; పడబోదు; అందువల్లనే పంచశీలకు వ్యతిరేకంగా చైనా సంచరిస్తున్నంత మాత్రం చేత పంచశీల సూత్రాలకే స్వస్తి చెప్పవలెనన్న వాదాన్ని అది తిరస్కరిస్తున్నది. చైనా తనపట్ల అన్యాయంగా ప్రవర్తించినంత మాత్రంచేత, ఐక్యరాజ్య సమితిలో పెకింగ్ ప్రతినిధులకే స్థానమివ్వవలెనన్న తన పూర్వవైఖరిని మార్చుకొనడానికి అది నిరాకరిస్తున్నది.

చైనాపై పగసాధించాలని ఇండియా నడచిన వంకర నడక పేరుకైనా లేక పోగా, ఇండియాపై కక్షతో పెకింగ్ ప్రభుత్వం నడుస్తున్నవన్నీ వంకర నడకలే! ఇందుకు సరికొత్త నిదర్శనం,పాకిస్తాన్తో సరిహద్దులను నిర్ణయించుకొనడానికి అది తెలిపిన సమ్మతి. ఈ సమ్మతిని గురించి పాక్ విదేశాంగమంత్రి చేసిన ప్రకటన తప్ప వేరు సాక్ష్యాధారం మనకు లేదనుకోండి. కాని, ఎంతో కొంత నిజం లేకపోతే, పాక్ విదేశాంగమంత్రి ఈ విషయమై విస్పష్ట ప్రకటన చేసివుండడు గదా!

చైనా, పాకిస్తాన్ కు - పాక్ దురాక్రమణలో గల కాశ్మీర్ భూభాగంలో తప్ప - ఉమ్మడి సరిహద్దు లేదు. ఈ పరిస్థితిలో చైనా "సమ్మతి" తాత్పర్యం, కాశ్మీర్ పై పాకిస్తాన్ జరిపిన దురాక్రమణ చర్యలను తాను గుర్తించడం మాత్రమే కాదా? అయితే, ఇందుకు ఒక విధంగా ఆశ్చర్యపడనక్కరలేదేమో! "దొంగలు" చేరినప్పుడు జరిగేపని "ఊళ్లుపంచుకొనడమే"!

పాకిస్తాన్ అమెరికా నుంచి ఆయుధ సహాయాన్ని పొందుతున్నది. అమెరికాకు అది తన భూభాగంలో యుద్ధాశ్రయాల నిచ్చింది. అమెరికా ప్రోత్సాహంపై చైనాకు విరుద్ధంగా యేర్పడిన - ఆగ్నేయ ఆసియా రక్షణ వ్యవస్థలో అది ప్రధాన పాత్రను వహిస్తున్నది. ఇంత చేసినా, ఇండియాను నొక్కడానికి పనికివస్తుందనే దురుద్దేశంతో కాకపోతే, కాశ్మీర్ పై పాకిస్తాన్ జరిపిన దౌష్ట్యం పై తన ఆమోదముద్రనే వేయడానికి చైనా సంసిద్ధపడుతుందా? ఈ చర్య సమర్థనకు కూడా చౌ ఎన్ లై ఏవో కొన్ని శ్రీరంగనీతులను వెతకగలడేమో!

వంకరదారులు త్రొక్కేవారికి సంకరసూత్రాలు కరవు కాగలవా?

ఈ సంపాదకీయాన్ని ఇంతవరకు వ్రాసిన మీదట ప్రధాని నెహ్రూ నేడు పత్రికా విలేకరుల గోష్ఠిలో చౌ ఎన్-లై ప్రకటన పై చేసిన వ్యాఖ్యలో మనం ప్రత్యేకించి గమనించదగు విషయమిది: ఇటీవల రంగూన్లో ఇండియా, చైనా అధికారుల మధ్య జరిగిన చర్చల సందర్భంలో కూడా సరిహద్దు వివాద పరిష్కారానికి చైనా ఏ విధమైన తొందరపాటు కనబరచలేదట. అయినా, ఇండియా ప్రభుత్వమే పరిష్కారాన్ని కోరడం లేదని విమర్శించడం చైనా ప్రధానికే తగిపోయింది!

(ఆంధ్రజ్యోతి 20-1-1961)

## జాన్ ఎఫ్. కెనెడి

ఇది కేవలం ఒక వ్యక్తినుంచి మరొకరు పదవిని పరిగ్రహించడం కాదు; ఒక పార్టీ నుంచి మరొకటి అధికారాన్ని హస్తగతం చేసుకొనడమైనా కాదు. ఐసెన్ హోవర్ స్థానంలో జాన్ ఎఫ్. కెనెడి నేడు యునైటెడ్ స్టేట్సు ప్రెసిడెంట్ గా పదవీ స్వీకారం చేయడానికున్న ప్రాధాన్యం ఇంతకంటే విస్తృతం, విశిష్టం.

ఒక తరంనుంచి మరొక తరం అధికారాన్ని అప్పగించుకొనడంగా దీన్ని చెప్పవచ్చు. ప్రెసిడెంట్ పదవినుంచి విరమించినవారిలో అందరికంటె వయోవృద్ధుడు ఐసెన్ హోవర్; ప్రెసిడెంట్గా వైట్ హౌస్లో ప్రవేశించినవారిలో అందరికంటే తరుణ వయస్కుడు కెనెడి.

అమెరికా చరిత్రలో ఒక అపూర్వ సంప్రదాయాన్ని నెలకొల్పుతున్న పదవీ స్వీకారంగా కూడా దీన్ని పేర్కొనవచ్చు. ఇంతకుముందు ఆ దేశానికి ప్రెసిడెంట్గా పనిచేసిన 33 మంది క్రైస్తవమతంలో ఇతర శాఖలకు

చెందినవారు కాగా, వైట్ హౌస్ లో అడుగుపెడుతున్న మొదటి కేథలిక్ కెనెడియే! (35 వ ప్రెసిడెంట్ కెనెడీ లెక్కకు వచ్చినా, నిజానికి ఆయన ప్రెసిడెంట్గా ఎన్నికైన 34 వ వ్యక్తి. వరుసగా రెండు సార్లు కాక, 1885లో ఒక సారి, 1893లో మరొక సారి స్టీఫెన్ గ్రోవర్ క్లెవిల్యాండ్ ఎన్నికైనందున ఆయనను 22వ ప్రెసిడెంట్గా మాత్రమే కాక, 24 వ ప్రెసిడెంట్గా కూడా పరిగణించడం జరుగుతున్నది.)

కెనెడి పదవీ స్వీకారంలో మరొక విశేషం లేదా వైశిష్ట్యం - కలదు కూడా. అమెరికా జాతీయ జీవితంలో ప్రస్ఫుటమౌతున్న ఒక నవదృక్పథానికి ఆయన ప్రతినిధి. ప్రతినిధుల సభలో సభ్యుడుగా 1951 లో ఆసియా దేశాలు పెక్కింటిలో పర్యటించి, స్వదేశానికి తిరిగి వెళ్ళిన పిమ్మట "పెట్రోల్ గనులలో బ్రిటిష్ వారి పెట్టుబడుల పక్షాన ఇరాన్లో మన జోక్యం సూయజ్ రక్షణకై ఒక ఇంపీరియలిస్టు రాజ్యం వహించేపాటి బాధ్యతను మనపై దాదాపుగా వేసుకొనడం.... ఈ విధమైన చర్యలు అమెరికావాణి కొలిపే ఆసలను అడియాసలుగా చేయగలవు" అని కెనెడి చేసిన హెచ్చరిక ఆయన నూతన దృక్పథానికి తార్కాణాలుగా పేర్కొనదగువాటిలో కేవలమొకటి మాత్రమే!

ఈ విధంగా ఎన్నో కొత్త సంప్రదాయాలను నెలకొల్పుతూ, ఎన్నో కొత్త ఆశలను రేకెత్తిస్తూ, నేడు అమెరికా ప్రెసిడెంట్ గా పదవీ స్వీకారం చేసిన కెనెడి పై గల బాధ్యతలు నిస్సందేహంగా గురుతరమైనవి. అంతర్జాతీయ పరిస్థితులు నేడున్నంత విషమంగా పోయిన దశాబ్దంలో మరెన్నడు లేవు. మానవజాతి భవిష్యత్తే నేడు సందిగ్ధావస్థలో కలదని చెప్పవచ్చు. ఈ ప్రమాదస్థితినుంచి మానవాళిని తప్పించగల శక్తి సామర్థ్యాలున్న అయిదారుగురు మహారాజ్యాధినేతలలో కెనెడీ ఒకరు. ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించగల కీలక స్థానంలో నున్న అయిదారుగురిలో ఒకరుగా కాక, ఇద్దరిలో ఆయన ఒకరని చెప్పడమే ఎక్కువ సమంజసమేమో! అందువల్లనే కెనెడీ నేటినుంచి చేసే ప్రతి చర్యను మొత్తం ప్రపంచమే ఎంతో శ్రద్ధాసక్తులతో పరిశీలించగలదు.

బాగుకైనా, ఓగుకైనా అమెరికా ప్రెసిడెంట్కున్న అధికారాలు సామాన్యమైనవి కావు. నియంతృత్వ దేశాలను మినహాయిస్తే, ఏ రాజ్యాధినేతకు అమెరికా ప్రెసిడెంట్ కున్నంతటి విస్తృతాధికారాలు లేవు. మాడిసన్, యాడమ్స్, మన్రో, జాక్సన్, థియోడోర్ రూజ్వెల్టుల వలె కేవలం అమెరికా శక్తి సంపదలను, దాని కీర్తి ప్రతిష్ఠలను పెంచడానికి మాత్రమే కాక, జెఫర్సన్, లింకన్, ఫ్రానెన్ రూజ్వెల్టుల వలె మరింత విస్తృత ప్రయోజనాలకు తన అధికారాలను వినియోగించినప్పుడే కెనెడీ ప్రెసిడెంట్ గిరి చరితార్థమౌతుంది.

కెనెడీ చరితార్థత గాంచాలని మనసారా వాంఛిస్తూ, భారతీయులమైన మనము కోరుకొనదగు మరొక విషయం ఆయన పదవీ కాలంలో ఇండో-అమెరికన్ బాంధవ్యాలు మరింత సన్నిహితమైనవి కావాలనే; అవి మరింత సౌహార్ద పూర్వకమైనవి కావాలనే. 1951 నాటికే ఆయన ఇండియా విధానాల ప్రాశస్త్యాన్ని అవగాహన చేసుకోగలిగారు. ఆ సంవత్సరంలో ఆసియా పర్యటన తర్వాత "కమ్యూనిజం విషయంలో ఇండియా తన పద్ధతి ప్రకారం వ్యవహరిస్తుందే కాని, మన పద్ధతి ప్రకారం కాదు. నెహ్రూ నాయత్వాన ఇండియాకు లంచం పెట్టికాని, లాలించికాని మన శిబిరంలో, లేదా, రష్యన్ శిబిరంలో చేర్చుకొనడానికి వీలు

లేనే లేదు" అని ఆయన స్పష్టపరిచారు. ఇంత చక్కగా నెహ్రూను, ఇండియాను అర్థం చేసుకున్న కెనెడీ పదవీకాలంలో ఇండియా, అమెరికాలు మరింత దగ్గరికి రావడం, మరింతగా కలసి పని చేయడం అత్యంత సంభవమనే ఆశించవచ్చు.

నేడు పదవీ విరమణ చేసిన ఐసెన్వర్ కడచిన ఎనిమిది సంవత్సరాలలో ప్రపంచశాంతి రక్షణకై చేసిన కృషిని ప్రశంసించకుండా ఈ సంపాదకీయాన్ని ముగించడం భావ్యం కాబోదు. శాంతిరక్షణకై ఆయన అనుసరించిన విధానాలు అన్ని సందర్భాలలోనే ఉత్తమమైనవి కాకపోవచ్చు. అయినా, ఆయన చిత్తశుద్ధిని, లక్ష్యోన్నతిని శంకించడం మాత్రం ఆయనపట్ల మహాపచారం కాగలదు. రెండవ ప్రపంచ యుద్ధ సందర్భంలో మిత్రరాజ్య సైన్యాలకు సర్వసేనానిగా ఆధునిక యుద్ధమెంతగా వినాశకరమైనదో ఆయన స్వయంగా చూచారు. అందువల్లనే ప్రపంచశాంతి రక్షణకై ఆయన దీక్షతో పని చేశారు. సేనానిగా సాధించిన విజయాలకు సాటి రాగల వాటిని ప్రెసిడెంట్గా ఆయన సాధించి వుండకపోవచ్చు. కాని, ఆయన సచ్ఛీలుడు, శాంతస్వభావుడు, ఉన్నతలక్ష్య ప్రేరితుడు. అందువల్లనే ప్రెసిడెంట్గా ఆయన జయాపజయాలతో నిమిత్తం లేకుండానే అమెరికా పౌరులవలె ప్రపంచ ప్రజలు కూడా గౌరవభావాన్నే పెట్టుకోగలరు!

(ఆంధ్రజ్యోతి 22-1-1961).

## నికితా కృశ్చెవ్




మోటువాడని, మొరటువాడని ఆయనను త్రోసివేయ గోరడం కంటే పొరపాటు మరి వుండబోదు. అప్పుడప్పుడు ఆయన మోటుగానే మాట్లాడతాడు; మొరటుగానే వ్యవహరిస్తాడు. అయితే, ఆ మోటుతనమైనా, మొరటుతనమైనా సంస్కారరాహిత్యం వల్ల వచ్చింది కాదు; "దున్నపోతును "దున్నపోతు" అనకుండా "మహిషం" అనడం తగదన్న సందర్భాలలోనే ఆయన మోటుగా మాట్లాడ్డమైనా మొరటుగా మెలగడమైనా. చచ్చులేకుండా, కుండబద్దలు గొట్టినట్టు, లేదా, గొడ్డలి పెట్టు పెట్టినట్లు మాట్లాడే సందర్భాలలో అప్పుడప్పుడు ఆయన కొంత దురుసుతనాన్ని చూపడంకద్దు; నోరు పారవేసుకొనడం కూడా కద్దు. అయితే, ఇది సభ్యత తెలియక చేసే పనికాక, సభ్యతను పాటించనక్కరలేదన్న భావంతో చేసే పనిమాత్రమే కావచ్చు.

నాలుగు అనగల వాడైనందున కృశ్చెవ్ నాలుగు పడగలవాడు కూడా. ఆయన కలవారి కడుపున పుట్టినవాడు కాదు; కడుపులో చల్ల కదలకుండా బ్రతుకు గడిపినవాడు సయితం కాదు. పేద కుటుంబంలో పుట్టాడు; పొట్టగడవడంకోసం కూలీనాలీ చేసుకున్నాడు; చాలా ఢక్కా మొక్కీలు తిని పైకి వచ్చాడు. నాలుగు అనడం, నాలుగు అనిపించుకొనడం, ఒక దెబ్బతియ్యడం, ఒకటి తనపైనే పడితే దులుపుకు పోవడం - ఇవన్నీ కృశ్చెవ్కు వెన్నతో పెట్టిన విద్యలే. ఆయనది ఒక కొత్త "స్కూలు"లో చదువు; కొన్ని కొత్త పరిసరాలలో తరిఫీదు

అందువల్లనే పాశ్చాత్య రాజకీయ వేత్తలకు అప్పుడే అడవిలో నుంచి వచ్చిన ఎలుగువలె కృశ్చేవ్ వింతగా కనబడుతున్నాడు; విడ్డూరంగా తోస్తున్నాడు; విభ్రాంతిని కలిగిస్తున్నాడు.



ఎవరేమనుకొన్నా కృశ్చేవ్ మాత్రం ఆవలించకపోయినా పేగులు లెక్కపెట్టగల ఘటికుడు. మాటకారితనంలో ఆయనకు ఆయనే సాటి. ఎత్తుకు పైయెత్తు వేయడంలో ఆయనను మించగలవారు బహుశా లేరు. కాలుసేతులు కట్టి ఏటిలో పారవేసినా, ఈదుకొని ఒడ్డుకు చేరగలదిట్ట. కాలు పట్టుకు లాగాతున్నా, చూరు పట్టుకొని వేలాడగల గడసరి. ఇంతటి విలక్షణ వ్యక్తి కాబట్టే, న్యూయార్క్ లో ఎన్ని విధి నిషేధాలను ఎదుర్కొనవలసి వచ్చినా,

ఆయన నిభాయించుకొని రాగలిగాడు. అక్కడ ఆయన సాధించింది దాదాపు ఏమీ లేకపోవచ్చు. కాని, తనను నిర్లక్ష్యం చేయడానికి వీలులేదన్న సంగతిని పూర్తిగా నిరూపించాడు; నేడు కాకపోతే, కొండవాగు ఇట్టె పొంగుతుంది; అట్టె తగ్గుతుంది. ఇంతలో నవ్వుతుంది, కేరుతుంది. త్రుళ్ళింతలాడుతుంది! అంతలో ఆగ్రహావేశాలకులోనై గర్జిస్తుంది. ఇక్కడ పాతగట్లను ఒక్క ఊపుతో త్రెంచి వేస్తుంది; అక్కడ తనకు తానై కొత్త గట్లను పెట్టుకొంటుంది. ఒక్కొక చోట సూటిగా ప్రవహిస్తుంది; మరొక్కొక్క చోట పామును మించి మెలికలు తిరుగుతుంది. ఈ క్షణం ప్రియురాలినిమించి వశవర్తిని; మరోక్షణం ప్రళయకాల ఝంఝామారుతం కంటె చండ ప్రచండం. ఇట్టి కొండవాగును అడుగడుగున తలపింపజేసేవాడు నికితా కృశ్చేవ్.

రేపైనా, తనతో ఒడంబడికకు రాక తప్పదన్న సంగతిని ఋజువు చేశాడు. న్యూయార్క్ ప్రయాణం పెట్టుకొనడంలో ఆయన ఇంతకుమించి బహుశా ఆశించింది కూడా లేదేమో!

(ఆంధ్రజ్యోతి 15-9-1971)

## డాక్టర్ మహమ్మద్ మొసాదిక్

“విప్లవ చక్రాలకు నూనె రాచినవాడు”.... “ఒకనాడు ఉజ్వలంగా వెలిగిన ఒక మహా సామ్రాజ్యపు మూలస్థంభాలను తన కన్నీటిధారలచే కరగజేసినవాడు" ... "విలపిస్తు, మూర్ఛిల్లుతు, అసహాయులైన తన దేశప్రజలను విజయపథాన నడుపుతున్న నాయకుడు” చాపెత్తే మాయలమారి”... “కంట నీరుకారుస్తు పురుషాకృతిలో కనిపించే జోన్ ఆఫ్ ఆర్క్"... “విచిత్ర వ్యక్తి”... “ఇంద్రజాలికుడు....” "ఏ గాలికి ఆ

హఠాత్తుగా ప్రపంచ ప్రసిద్ధి కెక్కిన ఒక వ్యక్తిని గురించి దేశీయులు, విదేశీయులు కొందరు పై విధంగా వర్ణించారు.

"పర్షియన్ గాంధీ"... "పర్యా దేశపు జార్జి వాషింగ్టన్" "తన ప్రత్యర్థులను, ప్రపంచ రాజ్యాంగ వేత్తలను ఒక్క ఊపు ఊగించిన మహా ఘటికుడు" అని మరికొందరు ప్రముఖ రచయితలు, కొన్ని పత్రికలు, అతనిని గురించే ప్రశంసలు కురిపించారు.

"1952 సంవత్సరపు ప్రఖ్యాత పురుషుడ"ని అమెరికన్ 'టైమ్స్' పత్రికచే ప్రత్యేక ప్రశంస నందిన ఆ వ్యక్తి మరెవ్వరో కాదు, నేడు పర్షా దేశానికి ప్రధాని అయిన డాక్టర్ మహమ్మద్ మొసాదిక్.

ఎనభయ్యవ పడిలో వాడైనప్పటికీ రెండు మూడేండ్లకు ముందు "డాక్టర్ మొసాదిక్" పేరు ప్రపంచం వినలేదు. తన దేశంలో అయినా ఇటీవలివరకు ఈయనకింతటి కీర్తిప్రతిష్ఠలు రాలేదు. పర్షాదేశపు పెట్రోల్ సమస్యతో డాక్టర్ మొసాదిక్ పేరు దశదిశల వ్యాపించింది. పండ్లూడిన బ్రిటిష్ సింహానికి ఇతడు కొరకరాని కొయ్య అయినాడు. తన దేశీయులకు ఏకమేవా ద్వితీయంగా మహానాయకుడైనాడు. అమెరికా, రష్యా మొదలైన బలసంపన్న రాజ్యాలు సైతం "ఎవరీ మొనగాడు?" అని చెవులు నిక్క పొడుచుకొని తన మాటలను ఆలకించేట్టు చేసుకున్నాడు.

డాక్టర్ మొసాదిక్కు ఇంట, బయట, పర్షన్ శాసనసభ "మజ్లీస్" లోపల, వెలుపల, తనదేశంలో, విదేశాలలో అంతట హితులున్నారు, విరోధులున్నారు. అందుకే ఆయనను గురించి అన్ని ఖండనలు, మండనలు; అన్ని దూషణలు, భూషణలు, అన్ని వర్ణనలు, విమర్శలు.

ప్రపంచ దృష్టిని ఇంతగా ఆకర్షించిన డాక్టర్ మహమ్మద్ మొసాదిక్ వయస్సు నేడు 76 సంవత్సరాలు. ఒకప్పుడు పర్షాను పరిపాలించిన కజార్ రాజవంశానికి చెందిన రాకుమారి ఈయన తల్లి. మొసాదిక్ తండ్రి పర్షాకు 30 ఏండ్లు ఆర్థిక మంత్రిగా వున్నవాడు.

తన కుటుంబం మీద ఎదురు తిరిగి మొసాదిక్ 1906 లో రాజకీయరంగంలో అడుగు పెట్టినాడు. నాటి పర్యా పాలకుడైన షాను నిరసించడంచేత ప్రవాసశిక్ష అనుభవించవలసిన వాడైనాడు. పర్యాను బ్రిటిష్ రథచక్రానికి కట్టివేసిన 1919 సంవత్సరపు ఆంగ్లో- పర్యన్ ఒడంబడికను ప్రతిఘటించడంచేత తిరిగి మరొక మారు ప్రవాసం పాలైనాడు.

1941 లో మిత్రబలాలు పర్యాను ఆక్రమించడం పర్యన్ జాతీయ సార్వభౌమతకు విరుద్ధమని ఎలుగెత్తి చాటినాడు. ఉత్తర పర్యాలో రష్యాకు పెట్రోల్ సౌకర్యాలను నిరాకరించే శాసనానికి బాధ్యుడై 1948 లో పాశ్చాత్యుల ప్రశంసలను పొందినాడు.

ఇంత చరిత్రగల దేశభక్తుడైనప్పటికీ గత సంవత్సరం ఆలీ రజ్మారా (మాజీపర్షన్ ప్రధాని) హత్యానంతరం, పర్షా ప్రధానమంత్రి స్థానం ఆక్రమించి నంతవరకు విశాల ప్రపంచానికి డాక్టరు మొసాదిక్ అజ్ఞాతవ్యక్తి.

రుజువర్తనకు, కట్టుబాటుకు మొసాదిక్ పెట్టింది పేరు. 1917లో ఆర్థికశాఖ సహాయ కార్యదర్శిగా వుండి సోమరులైన ప్రభుత్వోద్యోగులను వందల కొలదిగా బర్తరఫ్ చేయడం కారణంగా తన పదవిని కోల్పోయినాడు.

ఉద్యోగుల వేతనాలను తగ్గించడానికి యత్నించాడన్న హేతువున 1922 లో మరల ఆర్థిక మంత్రి పదవిని ధారపోసుకున్నాడు. పర్షియన్ ప్రభుత్వంలో ఆర్థికమంత్రి పదవి నధిష్ఠించిన వారెవ్వరుగాని ప్రభుత్వ బొక్కసాన్ని రక్షించడానికి పాలుబడటం ఆ దేశచరిత్రలో అప్పటికి కొత్త

"పర్షియా పర్షియనులదే" అన్న సూత్రం డాక్టర్ మొసాదిక్ ప్రధానలక్ష్యం. పర్షియాదేశపు కామధేనువైన పెట్రోల్ పరిశ్రమను బ్రిటిష్ బంధాలనుంచి తొలగించి, పర్షియన్ ప్రజల గర్భదారిద్ర్యాన్ని బాపడం మొసాదిక్ ముఖ్య సంకల్పం.

అందుకుగాను సంవత్సరంగా డాక్టర్ మొసాదిక్ చేస్తున్న కృషి అమోఘం. డాక్టర్ మొసాదికన్ను రష్యనులకు అనుకూలుడుగా చిత్రించడానికి ప్రయత్నించినవారు లేకపోలేదు. బ్రిటిష్ వారికి లోబడినాడని నిందించిన వారు సైతం లేకపోలేదు.

కాని నిజానికి మొసాదిక్ ఆత్మదేశోద్ధరణకు పాటుబడే దేశ భక్తుడేగాని, రష్యా పక్షపాతి కాదు, బ్రిటిష్ అనుచరుడూకాదు.

"డాక్టర్ మొసాదిక్" "ఆస్పిరిన్" ఔషధంవంటివాడు. ఆస్పిరిన్ నొప్పిని తాత్కాలికంగా మాన్పుతుందిగాని తుదముట్టించదు. "తన జాతీయోద్యమంచేత పర్షన్ ప్రజలకు ఆశను పురికొల్పినాడు. దానిచేతనే పర్షియాలో కమ్యూనిజాన్ని అరికట్టుతున్నాడు" అని డాక్టర్ మొసాదిక్ గురించి పర్షియన్ కమ్యూనిస్ట్ నాయకులొకరన్నమాట.

ఎవరేమన్నా డాక్టర్ మొసాదిక్ అకలంక దేశభక్తుడు. (ఆంధ్రప్రభ 24-1-1952).

## లియొపాల్డ్

“ఒల్లని సతిని, ఒల్లని పతిని, ఒల్లని చెలికానిని” వదిలివేయడం వివేకమైనట్టయితే, తన్నొల్లని ప్రజల మీద తాను పరిపాలన చేయచూడటం మాత్రం వెట్టితనం కాకుండా వుంటుందా? ప్రజల కయిష్టుడై, రాజ్యభ్రష్టుడై, ఆరేండ్లు ప్రవాసంలో గడిపి, నేడు మరల సింహాసన మలంకరించేందుకు దేశానికి విజయం చేసిన బెల్జియం ప్రభువు లియొపాల్డ్ చర్య ఎంతవరకు సమంజసం?

లియోపాల్డ్ రాజు బెల్జియం గడ్డ మీద పాదం పెట్టినాడో లేదో దుర్నిమిత్తాలు అనేకం తటస్థించినవి. బ్రస్సెల్స్ నగరవీధులలో వేనకు వేలు ప్రజలు “మాకీ రాజువద్దు” అని అనేక విధాల తమ అసమ్మతిని ప్రదర్శించారు.

దేశంలో పలుతావుల బాంబులు ప్రేలినవి. అసమ్మతి సూచకంగా కార్మికుల సమ్మెలు చెలరేగినవి. ఐదువేలమంది సాయుధ రక్షక భటుల సహాయంతో, ఇంకెంతెంతో బందోబస్తుతో, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని, లియొపాల్డ్ రాజు విమానాశ్రయం నుంచి కొంపకు చేరుకోవలసివచ్చింది. వచ్చిన కొలది గంటలకే రాజు తన మంత్రుల సభను సమావేశపరిచాడు. కాని, సోషలిస్ట్, లిబరల్ పక్షమంత్రులు ఆ సభను బహిష్కరించారు.

సోషలిస్ట్ ప్రాతికూల్యం ఈ ప్రదర్శనాలతో ఆగేటట్టు లేదు. ఈ దినం వచ్చిన వార్తలను బట్టి, సోషలిస్టులు ఇకమీదట “సహాయ నిరాకరణాన్ని, తీవ్రమైన నిరోధోద్యమాన్ని" కొనసాగించేందుకు సమకట్టినట్టు కూడా తెలుస్తున్నది.

రాజుకు వ్యతిరేకంగా నడపబడిన ఉద్యమాలలో పాల్గొన్నందుకు “కార్మికులను, ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు సుముఖులైన ప్రజలను" అభినందిస్తూ, ఈ వారం ముగిసేలోపలనే బ్రసెల్స్ బ్రహ్మాండమైన ఒక ప్రతికూల ప్రదర్శనాన్ని ఏర్పాటు చేస్తామని సోషలిస్ట్ పక్షంవారు; సోషలిస్ట్ కార్మిక సంఘాలవారు ప్రకటించారు.

బెల్జియం దేశపు రాజకీయ పక్షాలలో సోషలిస్ట్ పక్షం రెండవది. నూటికి నూరుపాళ్లు ఈ పక్షం లియొపాల్డ్ రాజు పాలనకు వ్యతిరేకం. అల్పసంఖ్యాకమైన లిబరల్ పక్షంలో రాజుకు కొందరు సుముఖులు, మరి కొందరు విముఖులు. కాథలిక్ పక్షమొక్కటే లియొపాల్డ్ రాజుకు పక్కబలం. ఈ నెల 20 వ తేది జరిగిన బెల్జియం పార్లమెంటు సమావేశంలో లియొపాల్డ్ రాజ్యాధికారాన్ని గురించి వోట్లు పుచ్చుకొనబడగా, 198 వోట్లుతో, అనగా కేవలం తొమ్మిది వోట్ల ఆధిక్యతతో, ఈ వోటింగ్ ఫలితాన్ని రాజు పునరాగమనానికి అనుకూలురైన కాథలిక్కులు గెలిచారు. ఆధారం చేసుకొని ఆరేండ్ల క్రితం సింహాసనం త్యజించి, దేశాంతర గతుడైన లియోపాల్డ్ ప్రభువు తానే రాజునని చెప్పి స్వదేశానికి తిరిగి వచ్చాడు.

బలవంతుడి పొరుగు బక్కవాడికెన్నటికీ చెరుపే. బెల్జియం ఇదివరలో రెండుమార్లు ప్రచండమైన

జర్మనీ పదాఘాతానికి గురి కావలసి వచ్చింది. మొదటి ప్రపంచయుద్ధ సందర్భంలో లియొపాల్డ్ తండ్రి ఆల్బర్ట్ రాజు జర్మనీ నెదిర్చి వీరోచితంగా ప్రవర్తించాడు. తనయుడు తండ్రి అంతటి ధైర్యశాలి కాడు. ద్వితీయ ప్రపంచ సంగ్రామానికి ముందు లియొపాల్డ్ ప్రభువు యుద్ధంలో తన దేశం తటస్థంగా వుంటుందనడం మిత్రమండలి రాజ్యాలకు మహా కంటకంగా తోచింది. 1940 మే 10వ తేదీన హిట్లర్ తన సైన్యవాహినులను బెల్జియం మీదికి తరలించాడు పిచ్చుకమీద బ్రహ్మాస్త్రంవలె, రెండు వారాలు నిండీ నిండక పూర్వమే బెల్జియం జర్మనీకి శరణాగతి చెప్పవలసి వచ్చింది. బెల్జియం ఈ విధంగా జర్మనీకి చేతులెత్తడం తమ్ము వెనుకపోటు పొడవడమేనని బ్రిటన్ ప్రధాని మిస్టర్ విన్స్టన్ చర్చిల్, అప్పటి ఫ్రెంచి ప్రధాని పాల్ రేనోవో లియొపాల్డ్ను నిష్ఠురోక్తులాడినట్టు మాకు జ్ఞాపకం. కాని, అప్పటిలో జర్మనీకి శరణాగతి తప్ప లియొపాల్డ్ కు గత్యంతరం లేదని నమ్మేవారు ఈనాటికీ లేకపోలేదు. శరణాగతి సందర్భంలో లియొపాల్డ్ నిర్దోషుడైనా, అటుపిమ్మట నాజీలతో ఆయన సహకరించ లేదని చెప్పడం కష్టం. 1945లో లియోపాల్డ్ సింహాసనచ్యుతికి సోషలిస్ట్ పక్షంవారే ప్రధాన కారకులు. తతాది లియొపాల్డ్ సోదరుడు ఛార్లెస్ రాకుమారుడు రీజెంటుగా వుంటున్నాడు. లియోపాల్డ్ పునరాగమన సమస్యపై దేశంలో ఇదివరకు రెండు మార్లు ఎన్నికలు జరిగినవి; ఒక మారు ప్రజాభిప్రాయ పరిగణన కూడా నిర్వహించబడింది. కాని, ప్రతిదఫా ప్రజాభిప్రాయం ఈ విషయంలో సూక్ష్మంగా భేదించే వుంటూవచ్చింది.

లియోపాల్డ్ సింహాసన పునరాక్రమణకు ప్రజలు వ్యతిరేకులైనా అతని పుత్రుని పట్టాభిషిక్తుని చేసేందుకు బెల్జియం ప్రజలకు అభ్యంతరం లేనట్టు తెలుస్తుంది.

తన్నొల్లని ప్రజలపై తాను రాజ్యాధికారం చలాయించ బూనడం కంటె, తన తనయుని సింహాసనాసీనుని జేసి, తాను పరువుగా తొలగడం వివేకాన్ని సూచిస్తుంది. కాని, లియొపాల్డ్ రాజుకు ఈ ధోరణి రుచించేటట్టు లేదు. అధికారం, అందులో రాజ్యాధికారం, ఎవరికి చేదు? పిలచి ప్రభుత్వం అంటగట్ట చూచినప్పుడు కాదనగలవాడు ఎంత త్యాగి అయివుండాలి? అయితే, రాజ్యాధిపత్యానికి ప్రజానుకూలత, ప్రజామోదం ప్రధానం. అది లేనప్పుడు, కేవలం

అధికారం చలాయిస్తూ, నిర్బంధం మీద ప్రజలను పాలించడమో, లేక తన రాజ్య విభవం మూన్నాళ్ళ ముచ్చట గావటమో రెంటిలో ఒకటి తప్పదు. (ఆంధ్రప్రభ 26-7-1950)

## ఆధునిక ఋషి : బెర్ట్రెండ్ రస్సెల్

నోబెల్ బహుమానాన్ని తన కిచ్చినప్పుడు "పోయిన యేడాది నే నొక్క పుస్తకమైనా రాసిన పాపాన పోలేదు. చూడగా నేను నోరు కట్టివేసుకొనడమే లోకానికి మహోపకారమైనట్టు భావిస్తున్నట్టున్నారు. నాకు మీ బహుమానం వద్దు పొండి" అని జార్జి బెర్నార్డ్ షా అన్నాడు.

మిత్రుల ప్రోద్బలంపై చివరికి ఆ బహుమానం మొత్తాన్ని (ఇంచుమించు లక్షన్నర రూపాయలు) పుచ్చుకొన్నా, దాన్ని బ్రిటన్, స్వీడన్ల మధ్య సాంస్కృతిక సంబంధాలను పెంపొందించడానికి వినియోగించవలసిందిగా ఆయన తిరిగి ఇచ్చివేశాడు.

"ఏనాడో నాకు జరగవలసిన ఈ గౌరవాన్ని ఈనాడా జరపడం?" అని చెప్పడమే షా పలుకుల నిగూఢార్థం. బెర్ట్రెండ్ రస్సెల్ (1872-1970) మొన్న నోబెల్ బహుమానాన్ని అందుకొన్నాడు గాని, ఆయనకు కూడా ఏనాడో ఈ గౌరవం జరగవలసింది. రస్సెల్ కివ్వబడిన నోబెల్ బహుమానం సాహిత్యపరమైనదైనా, ఆయన ప్రధానంగా తత్త్వవేత్త. ఆయన వచనం జిగీ బిగీ కలిగిందే కావచ్చు; వచనరచనలో సారళ్యతారళ్యాలు ఆయన సొత్తు కావచ్చు; గంభీర వదనంతో అతి గంభీరమైన విషయాలను గురించి ప్రస్తావిస్తూనే సందర్భోచితంగా సున్నితమైన హాస్యోక్తిని జారవిడవడం ఆయన ప్రత్యేకత కావచ్చు; ఒక్క మాటలో, కొరకరాని కొయ్యగా సామాన్యజనులకు నిస్పృహ కలిగించే తత్త్వ శాస్త్రాన్ని కథాసాహిత్యంవలె కమనీయం చేసిన ఘనత ఆయనది కావచ్చు. అయినా, రస్సెల్ పసిడిపంట తత్త్వశాస్త్ర కేదారంలోనే; దాని గట్లపై పెంచిన వంగలు, బెండలు, బీరలను పోలినవే సాహిత్యపరంగా ఆయన సాధించిన విజయాలు.

అగ్రశ్రేణి తత్త్వశాస్త్రవేత్తగా రస్సెల్ ప్రధాన గ్రంథాలన్నీ పాతికేళ్ళకు పూర్వమే ప్రచురితమైనాయి. ఆయన తాత్త్విక గ్రంథాలలో ప్రథమ గణ్యమైంది "ది ప్రిన్సిపల్స్ ఆఫ్ మేథమిటిక్స్". దీన్ని ఆయన 1903లోనే తొలిసారిగా ప్రకటించాడు. తర్వాత పదేళ్ళకు విస్తృతరూపంలో (డాక్టర్ ఎ.యన్.వైటెడ్ సహకారంతో) దాన్నే ఆయన "ప్రిన్సిపియా మేథమెటికా" పేరుతో పునః ప్రకటించాడు. రస్సెల్ దృష్టిలో కూడా ఇదే తన రచనలలో అతి ముఖ్యమైంది. తనకు తొంభైయేళ్ళు నిండి, 1962 జూన్ 1వ తేదీని తాను కాలధర్మం చెందినప్పుడు తనను గురించి "లండన్ టైమ్స్" ఏమి రాయగలదో ఊహచేసి, దాన్ని 1937లో "లిజనర్"లో ఆయన ప్రచురించాడు. ఆయన ఊహ ప్రకారం "టైమ్స్" రాయగల దాని సారాంశమిది. "ప్రిన్సిపియా మేథమెటికా" వెలువడినప్పుడు దాన్ని మహావిలువైనదాన్నిగా విద్వత్ప్రపంచం పరిగణించింది. అయితే, డాక్టర్ వైట్ హెడ్ సహకారం వల్లనే ఆ పుస్తకానికి అంత విలువవచ్చినట్టు చెప్పవచ్చు. రస్సెల్ కేవలం హేతువాది కాబట్టి, వైటెడ్ వలె ఆధ్యాత్మిక శిఖరాలను అందుకోలేకపోయాడు. వాక్చమత్కృతి వినా, రస్సెల్లో అన్యప్రతిభ లేదు. ఆయన లోతులేనివాడు" రస్సెల్ హాస్య చతురతకు, వ్యంగ్య వైభవానికి ఇదొక తార్కాణం.

గణితశాస్త్రం ద్వారా తాత్త్విక రహస్యాలను సంశోధించడానికి ప్రయత్నించిన ఈ మహాగ్రంథం తర్వాత, ఆయన రచనలలో ప్రత్యేకంగా గణన కెక్కినవి మరి మూడు వున్నాయనవచ్చు. వాటిలో మొదటిది "ది ప్రాబ్లెమ్స్ ఆఫ్ ఫిలాసఫీ". దీని ప్రచురణ 1911లో. ఇక, రెండవ దాని పేరు "అవర్ నాలెడ్జ్ ఆఫ్ ది ఎక్స్టెర్నల్ వరల్డ్". ఇది 1914లో వెలువడింది. పోతే, మూడవది - "ది ఎనాలిసిస్ ఆఫ్ ది మైండ్". 1921లో దీని ప్రచురణ. ఇతర తత్త్వశాస్త్ర గ్రంథాలను గ్రంథాలను పెక్కింటిని (ఇంట్రడక్షన్ టు మేథమెటికల్ ఫిలాసఫీ వగైరాలను) ఆయన రాసినా, అవన్నీ తాను మొదట చెప్పిన విషయాలకు పెట్టిన మెరుగులే. దీన్నిబట్టి కనీసం పాతిక సంవత్సరాల నాడే రస్సెల్కు నోబెల్ బహుమానం ముట్టివుండవలసినదనడం సుస్పష్టం.

ఐతే, పాతికేళ్ళ లోపున రస్సెల్ ఎన్నదగు రచనలను ఏమీ చేయలేదనడం ఆయనపట్ల మహాపచారాన్ని చెయ్యడమే కాగలదు. హేతువాదం కరదీపికగా అనవరత సత్యసంశోధనను జీవితధర్మంగా చేసుకొన్నవాడు కనుక, ఆయన ఏమి రాసినా, అది మనపై, మన ప్రపంచంపై ఏదో కొత్త వెలుగును ప్రసరింపజెయ్యగలిగిందే అవుతుంది. చివరికి "మానసికపు మలబద్ధకం", "సోమరితనం ప్రశంస" మొదలైన విషయాలను గురించి ఆయన రాసినా, ఆ రచనలలోనూ నూతన భావోద్దీపనశక్తి తొణికిసలాడుతూ ఉంటుంది.

సత్యసంశోధనను జీవితలక్ష్యంగా చేసుకొన్న వ్యక్తి ఏదో ఒక రంగానికి పరిమితం కాలేడు. అందువల్ల తత్త్వశాస్త్రంతోనే సంతృప్తిచెందక, విద్యావిధానం, వివాహవ్యవస్థ, వైజ్ఞానిక దృష్టి, వ్యక్తిస్వాతంత్ర్యం, ప్రభుత్వాధికారం, నవసంఘం మొదలైన అశేష సమస్యలను గురించి ఆయన స్వతంత్రంగా ఆలోచించాడు; ఆ స్వతంత్రాలోచన ఫలితాలను ఇప్పటికి దాదాపు నలభై గ్రంథాల రూపంలో లోకానికి అందించాడు.


పుట్టింది అగ్రవంశంలో. పితామహుడు లార్డ్ జాన్ రస్సెల్ బ్రిటన్కు ప్రధానిగా ఎన్నికైనవాడు. అయినా వంగడాన్ని బట్టి, జాతిని బట్టి ఒక వ్యక్తి కంటే మరొకడు అధికుడు కాడని నమ్మినవాడు కనుక, రస్సెల్ తన "ఎర్ల్" హోదాను ఉపయోగించుకోడానికి ఎంతమాత్రం సమ్మతించక, "మిస్టర్ బెట్రెండ్ రస్సెల్" అనే సామాన్యపు పేరుతోనే చెల్లుతున్నాడు. శాంతివాది కనుక, ప్రథమ ప్రపంచ మహాసంగ్రామంలో ఆయన తన ప్రభుత్వాన్ని వ్యతిరేకించి, కారాగారవాస క్లేశాలను చవిచూశాడు. హిట్లర్ నాజీజం వికృత స్వరూపాన్ని గమనించిన తర్వాత దానిపై యుద్ధం జరపకపోతే మానవ సభ్యతకే ముప్పు తప్పదని గుర్తించినా, జర్మనులపట్ల క్రౌర్యాన్ని నిర్ద్వంద్వంగా ఆయన ఖండించాడు. ఇంతేకాక, ఆయన ఆసియా ప్రజల స్వాతంత్ర్యాన్ని హృదయపూర్వకంగా కాంక్షించినవాడు. పాశ్చాత్యసభ్యత కంటే చైనా సంస్కృతి కొన్ని విధాల ఉత్తమమైనదని నిర్భీకంగా చాటినవాడు. రస్సెల్ ఒక మహాతత్త్వవేత్త మాత్రమే కాదు, ఒక మహాపురుషుడు కూడా.

వైజ్ఞానికరంగంలో ఆధునిక మానవుడు సాధించిన విజయాల తర్వాత, ప్రకృతిశక్తులపై అతడి ఆధిపత్యం తర్వాత, నేడు కానవస్తున్నదానికంటే ఎక్కువ హేతుబద్ధంగా అతడు ఎందుకు జీవించలేకపోతున్నాడనేదే

రస్సెల్ నిరంతరావేదన. ఆయన ప్రతిపాదించిన తాత్త్విక సత్యాలు చివరికి నిలిచినా, నిలవకపోయినా, ఆయన మౌలికభావుకుడు, ఆధునిక ఋషి.

(ఆంధ్రప్రభ 17-11-1950).

## బెర్నార్డ్ షా



"అలసిపోయాను, ఇక వెళ్ళిపోతే బాగుండును" అనేమాట నాలుగైదేళ్ళనాడు జార్జి బెర్నార్డ్ షా నోట మొట్టమొదటి సారిగా వచ్చిందట. అయినా, "అయ్యో! పోతున్నానా!" అని ఒకించుక విచారం. లవలేశ నిర్వేదం, ఏ మాత్రమో గుండెబరువు లేకుండా ఇవ్వాళ తెల్లవారుజామున ఆయన కన్నుమూసి ఉండడు.


అయిష్టంగానే షా ఈ లోకాన్ని వీడి వెళ్ళినా, ప్రాణికోటికి బ్రతుకుపై ఉండే మమకారాన్నే అందుకు కారణంగా చెప్పుకొనడం ఆయనను గురించి, ఒక శతాబ్దంలో నాల్గింట మూడు వంతులకు ఇంచుమించుగా విస్తరించిన ఆయన జీవిత కృషిని గురించి మన కేమీ తెలియదని చాటుకొనడమే కాగలదు. కేవలం బ్రతకడం కోసమే షా ఏనాడు బ్రతకగోరలేదు. అట్టి జీవితం కంటే మరణమే మేలని ప్రగాఢంగా విశ్వసించే బహు కొద్దిమంది మహామహులలో ఆయ నొకడు.

"మ్యాన్ అండ్ సూపర్ మ్యాన్" నాటకాన్ని కృతి యిస్తూ, మహిమాన్విత మైనదని మనం గుర్తించిన లక్ష్యసాధనలో హూన హూనమై పోవడమే, హతమారిపోవడమే వాస్తవిక జీవితానందమని ఆయన రాశాడు. మనకు సౌఖ్యాన్ని కూర్చడమే తన పనిగా ప్రపంచం ఎందుకు పెట్టుకోదని అఘోరిస్తూ, రోగాలతో, నొప్పులతో, స్వార్థాలతో, సంకుచితత్వాలతో రోజులను వెళ్ళబుచ్చుకొనడంలో కాక, ప్రకృతిశక్తులలో ఒక శక్తిగా - ఆధ్యాత్మిక పరిభాషలో "ఈశ్వర సంకల్పం నెరవేరడానికి నిమిత్తమాత్రంగా - జీవించడంలోనే పరమానందం కల"దని కూడా ఆయన పేర్కొన్నాడు.

బెర్నార్డ్ షా జీవితం, ఈశ్వర సన్నిధానంలో వెలిగించబడిన హారతి కర్పూరంవలె, ఒక మహాలక్ష్య సాధన కృషిలో కరిగిపోయిందే. అయితే, తన కృషి పూర్తికానేలేదని ఆయన నమ్మకం; ప్రపంచానికి తన ఉపయోగం తీరనేలేదని ఆయన విశ్వాసం. "అలసిపోయాను; ఇక వెళ్ళిపోతే బాగుండును" అని పలికిన ఉత్తర క్షణంలోనే ఆయన "నా చేతిలోని కత్తిని పుచ్చుకోగల మనిషిని చూపండి, నేను వెళ్ళిపోతాను" అన్నాడు.

అజ్ఞానాంధకారాల నుంచి, ఈర్ష్యా విద్వేషాల నుంచి, స్వార్థ క్రౌర్యాల నుంచి, దారిద్ర్య దైన్యాల నుంచి మానవాళిని సముద్ధరించగల శక్తి తమకు కలదని, అందు నిమిత్తమే తాము జన్మించామని ప్రగాఢంగా విశ్వసించే మహనీయులందరు మన గాంధీజీ సమేతంగా ఒక నూరేళ్ళు కాక, ఎన్ని నూరేళ్ళు తాము బ్రతికినా ఇంకా ప్రపంచానికి తమతో అక్కర ఉండగలదని నమ్మినవారే. ఈ కోవకు చెందినవాడే ఐరెండులో ఒక సామాన్య కుటుంబీకుని కడుపునపుట్టి, దారిద్రబాధను చవిచూస్తూ పెరిగి, విద్యార్థిగా రాణించక, గుమాస్తాగిరితో విసిగి, డబ్లిన్ నుంచి లండన్కు చేరి, చిన్న చిన్న వారపత్రికలకు సంగీతంపై, నాటకాలపై, గ్రంథాలపై విమర్శలు రాస్తూ, చాలీచాలని సంపాదనతో పలుపాట్లు పడి, లెక్కలేనంతమంది ప్రచురణకర్తలు నిరాకరించిన పిమ్మట, డాక్టర్ అనిబిసెంట్ సిఫార్సు ద్వారా నాలుగు నవలలను ప్రకటించి, ఆ సాహిత్యరంగానికి తాను తగనని గుర్తించి, నలభైయేళ్ళు నిండనున్నవనగా తొలి నాటకాన్ని ప్రచురించి, తర్వాత అతి త్వరితంగా మహా నాటకకర్తగానే కాక, మహా మేధావిగా, తత్త్వవేత్తగా ప్రపంచం చేత బ్రహ్మరథం పట్టించుకున్న జార్జి బెర్నార్డ్ షా.

ఒక్క వాక్యంలో దిఙ్మాత్రంగా షా జీవితాన్ని సూచించడం సాధ్యపడింది కాని, ఎన్ని గ్రంథాలను రాసినా ఆయన జీవిత కృషికి విలువ కట్టలేము. ఇప్పటికే ఆయనను గురించి యాభై, అరవై పుస్తకాలు, కొన్ని వందల వ్యాసాలు వెలువడినాయి. ఇకముందు మరెన్నెన్నో వెలువడగలవు. అయినా, భావి కాలమైనా ఆయనపై చివరి తీర్పు చెప్పగలగడం సందేహాస్పదమే!



తను బహుముఖ ప్రజ్ఞానిధినని షాకు తెలుసు కనుక, తన కృషి సర్వతోముఖమైనదని కూడా ఆయనకు తెలుసు కనుక, తన విమర్శకులెవరు, తన జీవిత చరిత్ర కారులెవరు గ్రంథకర్తగా తనను గురించి చివరి తీర్పు చెప్పలేరని ఆయన స్వయంగా రాశాడు. "నా వయస్సునుబట్టి, నా వొడ్డు పొడుగులనుబట్టి, నా మాతృభాషను బట్టి, నా కళ్ళ రంగును బట్టి, నా తల చిన్న పెద్దలనుబట్టి, ఇవన్నీ చూచీ, కొలిచీ తెలుసుకోగల విషయాలు కాబట్టి, కొన్ని నిర్ణీతాభిప్రాయాలకు రావచ్చు" అని చెప్పి, తన రచనలను గురించి అట్టి అభిప్రాయానికి రాగలవారుండబోరని ఆయన నిస్సంకోచంగా రాశాడు. స్వాతిశయానికి సాటిలేని వాడన్న కీర్తిగన్న బెర్నార్డ్ షా చేసుకునే స్వోత్కర్షలో దీన్ని ఒక భాగంగా కొట్టివేయలేము.

అసాధ్య విషయానికైనా ప్రయత్నించడం మానవ సహజం కాబట్టి, అట్టి ప్రయత్నాన్ని చేసి, బెర్నార్డ్ షా జీవితకృషిని ప్రపంచ మహాపురుషులలో మరెవరిదానితోనైనా పోల్చాలంటే, ప్లేటో వెంటనే స్ఫురణకు వస్తాడు. ప్రాచీనకాలపు ఆ గ్రీక్ తత్త్వవేత్తవలె వర్తమానయుగపు ఈ ఐరిష్ తత్త్వవేత్తకూడా హేతువాది. ఉభయులు ఉత్సాహోద్వేగాలను నిరసించినవారే; ఉభయులు కవితా ప్రణయాల విలువలను

శంకించినవారే; ఉభయులు సామాన్య మానవునిపట్ల - అతడు మూఢంగా ప్రవర్తిస్తాడని, అతనివి వక్రాభిరుచులని - సానుభూతి లేనివారే. “మనకు ఇంత స్పష్టంగా కనబడుతున్నదాన్ని గుడ్డిలోకం కానలేదెందువల్ల?” అనే కోపం, విసుగు, తపన, అసహ్యం వారిద్దరిలో సమానంగా కనబడుతవి.

సామాన్య మానవునిపట్ల, అతని ప్రపంచంపట్ల ఎంతటి నిరసన భావంవున్నా, ఆ స్థితి నుంచి అతడి సముద్ధరణ ఎప్పటికైనా ఒకప్పటికి సాధ్యమన్న విశ్వాసమే ప్లేటోవలె షాను కూడా ఆచార్యత్వానికి ప్రోత్సహించింది.

సత్యాన్నీ, సన్మార్గాన్ని సామాన్య మానవులు కానలేకపోవడానికి వారి మౌఢ్యమే కారణమని నమ్మినవారు ఆ మూఢమతులను ఆకర్షించగల విధంగా తమ బోధన లుండాలని తలంచడం సహజమే. ఏసుక్రీస్తు తన బోధనలకు పిట్ట కథలను ఆధారంగా చేసుకొనడం ఇందువల్లనే.

బౌద్ధ జాతక కథల ప్రయోజనమింతే. తన బిడ్డను బ్రతికించవలసిందిగా సుజాత కన్నీరు మున్నీరుగా విలపిస్తూ వచ్చినప్పుడు బుద్ధభగవానుడు మృత్యువు నేరుగని గృహం నుంచి గంటెడు ఆవాలను తెమ్మనడం సరిగా ఈ కారణానే. బెర్నార్డ్ షాకు సంబంధించినంత వరకు, ఆయన తన బోధనల ప్రచారానికి లోకాన్ని నవ్వించడాన్ని, ఉలిక్కిపడేటట్టు చేయడాన్ని సాధనంగా చేసుకున్నాడు.

అంతవరకు షా అస్తిత్వాన్నే గుర్తించని ప్రపంచాన్ని నవ్వించడం, ఉలుకు పుట్టించడం, ఆయన ప్రారంభించిన పిమ్మట, అది ఆయనకు చెవులప్పగించ దొడగింది. కాని, రాను రాను ఆయనతోపాటు నవ్వడం కంటే, ఆయనను చూచి నవ్వడం ఎక్కువైపోయింది; రాను రాను ఏమి చెప్పినా, కొత్తేమి ఉన్నదని ఉలిక్కిపడ్డం తక్కువైపోయింది కూడా.

దీన్ని చూడగా తన జీవితమే వ్యర్థమై పోయిందేమోనని వృద్ధాప్యంలో బెర్నార్డ్ షా బాధపడిన సందర్భా లనేకం. "విజ్ఞానకోశ కర్తవలె నేను అంతులేకుండా రాశాను; చెవినిల్లు కట్టుకుని చెప్పాను. కాని, నా పద్ధతులన్నీ విఫలమై పోయినవని అంగీకరించక తప్ప”దని ఆయన ఆవేదన పడ్డాడు. అయితే, తాను అశక్తుడనని వొప్పుకోడానికి ఇచ్చగించని వాడు కనుక, “వాల్తేర్, రూసో, బెంథామ్, మార్క్స్, మిల్, డికిన్స్, కార్లయిల్, రస్కిన్, బట్లర్ మారిస్ వీరందరి అంచనాలో ప్రవేశించినా, ఇంతేకాక, యురిపిడిస్, మోర్, మాన్టెయిన్, మోలియర్, బ్యూమార్చిస్, స్విఫ్, గెటీ, ఇబ్సెన్, టాలెయ్, జూసెస్లున్ను ఆవహించినా నేను కృతకృత్యుడనై ఉండేవాడిని కాను” అన్నాడు. ఇంతటితోనైనా ఆగక, తనవంటి "కాగితపు" ప్రవక్తలేమి కవి - మాంత్రికులేమి, భీరులనుంచి ధీరులను సృష్టించడానికి ప్రయత్నించగా, ప్రతి దోపిడిని, ప్రతి దౌర్జన్యాన్ని, ప్రతి ఘోరకృత్యాన్ని సహించే భీరులే ధీరాతిధీరులమని సంతృప్తి చెందడం మాత్రమే జరుగుతుందని రాశాడు.

ఈ ప్రపంచాన్ని సోక్రటీస్ తోను, ప్లేటోలతోను, లోటీలతోను, కన్ఫ్యూషియస్లతోను, జనకులతోను, యాజ్ఞవల్క్యులతోను, హెగెల్స్ తోను, నీచేలతోను నింపివెయ్యాలన్న వాడు కనుక, షా తన జీవితం వ్యర్థమైపోయిందన్న నిట్టూర్పుతోనే ఈ లోకాన్ని విడిచివుండవచ్చు. కాని, మన దృష్టి నుంచి ఆయనది అమరవాణి, ఆయన ధన్యజీవి. (ఆంధ్రప్రభ 3-11-1950)

## సినీతార: బ్రిజిత్ బార్డో

ప్రఖ్యాత చలనచిత్ర తార బ్రిజిత్ బార్గో సుందరాకృతి చాలమందికి పరిచితమైనదే కావచ్చు. కాని, ఆమె ఆత్మకూడా అందమైనదే కావచ్చునని, దాన్ని ప్రకాశింప జేయడం తన విధి అని కొలంబియాలోని ఒక ఫాదిరీ భావిస్తున్నాడు.

దీనికోసం అతడు బార్డోను తాను ఏటేటా జరిపే ఒక విందుకు ఆహ్వానించాడు. ఆమె ఆత్మను బహిర్గతం చేయడానికి అతడు ఏ ఉపాయం అవలంబిస్తాడో మనకు తెలియదు గాని, ఆమెను ఆహ్వానించడంతో కొలంబియాలో ఒక పెద్ద సంచలనం చెలరేగిందట.

తనపై విమర్శలకు అతని సమాధానం - "ఏసుక్రీస్తు ఒక పతితను తన విందుకు పిలవలేదా?" అని. నిజమే, తన పాదాలను పశ్చాతాప బాష్పాలతో అభిషేకించిన మేరీ మాగ్దలీన్ అనే వేశ్యను క్రీస్తు పాపముక్తురాలిని చేసినట్టు బైబిల్ గాథ.

బౌద్ధవాఙ్మయంలో కూడా ఆమ్రపాలి అనే వేశ్యను బుద్ధుడు కనికరించి ఆమె చేతిభిక్షను స్వీకరించినట్టు కథ లేదా? అందుచేత కొలంబియన్ ఫాదిరీ విందుకు హాజరయ్యే మాజీ ప్రెసిడెంట్లు, మంత్రులు, విదేశీ అతిథుల సరసన కూర్చోదగని వనితగా బ్రిజిత్ బార్డోను భావించవలసిన పనిలేదు.

కాని, ఒక చిక్కున్నది. కొలంబియన్ ఫాదిరీ ఫాదిరీయేగాని, క్రీస్తు, బుద్ధుడు కాడుగదా! ఈ ఫ్రెంచి తార ఆత్మ సౌందర్యాన్ని ఆవిష్కరించే యత్నంలో అతడు తన ఆత్మకు ప్రమాదం తెచ్చుకోగూడదు. అనతోల్ ఫ్రాన్స్ ప్రసిద్ధ నవలలో “థాయిస్" అనే అలెగ్జాండ్రియన్ వారకాంతపై ఇదే ప్రయోగం చేయబోయి తానే పతితుడై పోయిన క్రైస్తవ సన్యాసి ఉదంతం అతడు గుర్తుపెట్టుకోవడం మంచిది.

(ఆంధ్రజ్యోతి 5-9-1968)

అహింసకు సన్మానం: డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్ అది అహింసకు సన్మానం; సర్వ మానవ సౌభ్రాత్రభావానికి సన్మానం; పీడిత జాతుల విమోచనోద్యమానికి సన్మానం; పరాజయాన్ని అంగీకరించని మానవాత్మకు సన్మానం.

న్యూఢిల్లీలో శుక్రవారంనాడు ఈ అపూర్వ సన్మానం అమెరికన్ నీగ్రో నాయకుడు డాక్టర్ మార్టిన్ లూథర్కింగ్కు లభించింది. అయితే, ఒక్కటే చింత. ఈ సన్మానాన్ని స్వయంగా అందుకొనడానికి ఆయన నేడు మన మధ్యలేరు. ఆయన తరఫున శ్రీమతి కొరెటా కింగ్ ఈ ఘన సన్మానాన్ని స్వీకరించారు.

డాక్టర్ కింగ్ స్మృతిని భారతదేశం ఈ విధంగా గౌరవించడం ఎంతైనా సముచితమైనది. ఆయనకు ప్రదానం చేసినది నెహ్రూ అవార్డు. అంతర్జాతీయ స్థాయిలో వివిధ జాతుల మధ్య అవగాహనకోసం కృషి చేసిన మహనీయులను గౌరవించడానికి అదే ఆదర్శం కోసం తన జీవితకాలాన్ని వెచ్చించిన జవహర్లాల్ నెహ్రూ పేరుమీదుగా ఈ అవార్డు ప్రారంభమైంది. దానినే నేడు డాక్టర్ కింగ్ సతీమణికి అందజేశారు.

డాక్టర్ కింగ్ కు ఈ అవార్డును ఇండియా బహూకరించడంలో ఒక ప్రత్యేకమైన ఔచిత్యం ఉన్నది. గాంధీజీ నాయకత్వాన భారతీయులు అహింసామార్గంలో తమ విమోచనోద్యమాన్ని సాగించారు; లక్ష్యసిద్ధిని పొందారు. లక్ష్యం మాత్రమే పరిశుద్ధమైనదైతే చాలదు; కొన్ని సాధించడం కూడా విశుద్ధ మార్గాలలో జరగాలి. గాంధీజీ జీవితం ఈ మహత్తర భావానికి ప్రతీక. శత్రువును నిర్జించడానికి ద్వేషం కాదు మార్గం. ప్రేమతో, సౌహార్దంతోనే శత్రువును జయించాలి. అన్యాయాన్ని దురాగతాన్ని ప్రతిఘటించవలసిందే కాని, అది మారణాయుధాలతో.

అహింసకు సన్మానం : డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్ 401

కాదు. అహింస అనే ఆయుధంతో జరగాలి, బుద్ధుని నాటినుంచి, యేసుక్రీస్తు నాటి నుంచి మహాప్రవక్త లెందరో ప్రవచించిన ఈ సూత్రాన్ని గాంధీజీ తన వ్యక్తిత్వజీవితానికే కాదు, ఒక జాతి జీవితానికే అనువర్తింపజేసి మానవాళికి మార్గదర్శకుడైనాడు.

అయితే, గాంధీజీ తన అహింసా సిద్ధాంతాన్ని ఇండియాలో ప్రవచించడం, ఆచరించడం, అందుచేత అంగీకరింపజేయడం వేరు. ఇక్కడి కంటే విభిన్న పరిస్థితులలో, విభిన్న సంస్కృతి, సంప్రదాయాలలో పుట్టి పెరిగిన అమెరికాలో మార్టిన్ లూథర్ కింగ్ దాన్ని స్వీకరించి కృతకార్యుడు కావడం వేరు.

గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని నీగ్రో విమోచనోద్యమానికి డాక్టర్ కింగ్ అన్వయించి అమెరికన్ చరిత్రలోనే అపూర్వమైన పోరాటాన్ని నడిపారు. నీగ్రో పౌరసత్వాల... ఆయన మార్గదర్శకత్వాన మాంట్ గొమరీలో ప్రారంభమై మొత్తం దేశంలో కొనసాగిన అహింసోద్యమం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఆయన నోబెల్ శాంతి బహుమతి గౌరవాన్ని పొందడమేకాదు,... అమెరికన్ అనే అన్వర్థనామం పొందారు.

అయితే, డాక్టర్ కింగ్ ప్రారంభించిన ఉద్యమం ఇంకా పూర్తికాలేదు. కడచిన పదిహేనేళ్ళలో అమెరికన్ నీగ్రోలకు ఎన్నో పౌరసత్వాలు లభించిన మాట నిజమే. నీగ్రోలే కాక అమెరికన్ శ్వేత జాతీయులు సయితం

ఆ పోరాటానికి చేయూతనిచ్చి త్యాగాలు చేసిన మాటా నిజమే కాని, నేటికీ నీగ్రోలకు యథావిధిగా సమానసత్వాలు లభించలేదు. రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా వారు నేటికీ దిగువ తరగతి పౌరులుగానే జీవిస్తున్నారు.

ఈ కారణంగా అమెరికన్ నీగ్రోలలో నానాటికి అసహనం పెరుగుతున్నది. అహింస సరైన మార్గం కాదని, ద్వేషాన్ని ద్వేషంతో, హింసను హింసతో ఎదుర్కొనాలన్న ప్రగాఢ... యువతరంలో ప్రచలితమౌతున్నది. అమెరికాలో కొంత భాగాన్ని నీగ్రో దేశంగా పరిగణించి విభజించాలనే వాదం కూడా ఒక వంక వినవస్తున్నది. అమెరికన్ శ్వేత, వర్ణజాతుల మధ్య నిద్రిస్తున్న అగ్ని పర్వతం ఏనాడు బ్రద్దలవుతుందో ఎవరూ చెప్పలేరు.

ఈ సంక్షోభాన్ని వారించే కృషిలోనే మార్టిన్ లూథర్ కింగ్ తన ప్రాణాలను సయితం బలిదానం చేశారు. గాంధీజీ మార్గాన్ని జీవితంలోనే కాదు, మృత్యువులో కూడా అనుసరించి అమరత్వం పొందారు.

ఆయన ప్రారంభించిన కృషి ఆయనతోనే ఆగిపోవడానికి వీలులేదు. భౌతికంగా ఆయన అదృశ్యుడైనా ఆయన వెలిగించిన అహింసాజ్యోతి ఇంకా ప్రకాశిస్తున్నది. ఆయన అనుయాయులు, ముఖ్యంగా ఆయన సతి శ్రీమతి కొరెటా కింగ్ ఆయన పద్ధతులలో శాంతియుత ప్రతిఘటనను కొనసాగిస్తున్నారు. "వుయ్ షల్ ఓవర్కమ్" (మేము జయిస్తాము) అనే గీతం ఆలాపిస్తూ వారు ముందుకు సాగుతున్నారు.

అహింసపట్ల ఈ నిశ్చల విశ్వాసాన్ని వారిలో పాదుకొల్పిన మహనీయతకే డాక్టర్ కింగ్ను ఇండియా నేడు గౌరవిస్తున్నది. నెహ్రూ అవార్డును శ్రీమతి కింగ్కు అందజేస్తూ రాష్ట్రపతి డాక్టర్ జాకిర్ హుస్సేన్ చెప్పినట్లు "మానవాత్మ ఘోరమారణాయుధాల కంటె శక్తిమంతమైనది. ఇదే మానవాళికి మిగిలిన ఆశాలేశం".

(ఆంధ్రజ్యోతి 25-1-1969)

## మరొక మహాత్ముని హత్య: మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్

నిన్న జరిగింది మార్టిన్ లూధర్ కింగ్ హత్య కాదు, మానవతాహత్య! సోక్రటీస్ హత్య జరిగినప్పుడు, ఏసుక్రీస్తు హత్య జరిగినప్పుడు సమకాలిక ప్రపంచం సిగ్గుతో ఎంతవరకు తలవంచుకున్నదో తెలియదు. కాని, లింకన్ హత్య జరిగినప్పుడు, గాంధీ హత్య జరిగినప్పుడు, కెనడీ హత్య జరిగినప్పుడు ఆ దానవ కృత్యానికి సిగ్గుపడని సభ్యమానవుడు లేడు!

ఐనా, నిన్న మార్టిన్ లూథర్ కింగ్ (జూనియర్) హత్య జరగడాన్నిబట్టి దానవత స్థానంలో మానవత పూర్తిగా నెలకొనడానికి మరెన్ని శతాబ్దాలు పట్టగలదో అని లజ్జతో, భయంతో, హృదయా వేదనతో వితర్కించుకోవలసి వస్తున్నది.

అణుశక్తికి మానవుడు అధినాథుడైన తర్వాత కూడా, అన్యగోళాలలో అతడు పాదం పెట్టబోతున్నప్పుడు కూడా ఆటవిక ప్రవృత్తిని అతడు సడలించుకోలేడా? జాతి మత కుల వర్ణ వర్గాది కృత్రిమ విభేదాల నీచ ప్రేరణకు ఈ ఇరువదవ శతాబ్దిలో కూడా ఒక గాంధి, ఒక కెనెడీ ఒక కింగ్ బలి కావలసిందేనా?

ఈ ప్రశ్నలు వేసుకొనవలసిన అగత్యం కలగడం ఎంత లజ్జాకరమైనా, మరెంత బాధాకరమైనా, మానవుని భవిష్యత్తు విషయమై నిరాశపడనక్కరలేదు, నిస్పృహ చెందనక్కర లేదు. మానవతా లక్ష్యం కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టడానికి ఒక గాంధీ, ఒక కెనడీ, ఒక కింగ్ రెండు దశాబ్దాల లోపల ఐచ్ఛికంగా సన్నద్ధులు కావడమే ఈనాడు కాకపోతే, మరొకనాటికైనా మానవత జయిస్తుందని చాటి చెబుతున్నది.

లింకన్ దారివెంట తాను నడిస్తే, ఆయన వలె తాను కూడా ప్రాణత్యాగానికి ఆయత్త పడాలని కెనెడీకి తెలుసు. గాంధీ మార్గం వెంట పురోగమించడం మృత్యు ముఖంలో ప్రవేశించడమే కావచ్చునని కింగ్కు తెలుసు. అయినా, కింగ్ ఆ మార్గాలనే ఎన్నుకున్నాడు. వాటి వెంట నిశ్చలంగా నడిచాడు.

గాంధీకి ఈనాడు మనం స్థానమిస్తున్నది మన గుండెలలో కాదు, కొండలపై! (ఇందుకు ఒక ప్రత్యక్ష తార్కాణం ఈ విజయవాడలోని గాంధీ పర్వతమే!) కింగ్ మాత్రం గాంధీజీని తన గుండెలలో నిలుపుకున్నాడు. గాంధీజీ అహింసా సూత్రాల ప్రకారం, ఆయన సత్యాగ్రహ పద్ధతుల ప్రకారం స్వజాతి సముద్ధరణకై ఒక మహోద్యమాన్ని ప్రారంభించాడు.

బ్రిటీష్ వారిలో ఎంత జాత్యహంకారం ఉన్నా, కనీసం సూత్రప్రాయంగానైనా మన స్వపరిపాలనాధికారాన్ని వారు కాదనేవారు కాదు. "మీ దేశాన్ని పరిపాలించుకొనగల స్థితిలో ఈనాడు మీరు లేరు. ఆ స్థితికి మిమ్ము తీసుకురావడానికే మేము కృషి చేస్తున్నాము. సమయం వచ్చినప్పుడు మీ దేశాన్నిమీకు అప్పగించి, మేము వెళ్లిపోతా"మని వారు చెబుతూ ఉండేవారు.

అమెరికాలో, ముఖ్యంగా దాని దక్షిణాది రాష్ట్రాలలో, శ్వేతజాతీయులు తమతో వర్ణజాతుల సమానత్వాన్ని సూత్రప్రాయంగానైనా గుర్తించరు. ఇప్పుడే కాదు, ఎప్పటికైనా వర్ణజాతివారు ప్రాథమిక పౌరసత్వాలకు సైతం అనర్హులే: శాశ్వతంగా వారు హీనస్థితిలో మిగలవలసినవారే! ఇట్టి మనఃప్రవృత్తి వ్యక్తమౌతున్న సంఘంలో సమతాసూత్ర సంస్థాపనకై ప్రజోద్యమాన్ని ప్రారంభించడం మృత్యువును వరించడమని తెలిసి కూడా కింగ్ వెనుదీయలేదు, వెన్ను చూపలేదు. శ్వేతజాతికి చెందినవారి నుంచి మాత్రమే కాక, స్వజాతివారి నుంచి కూడా తనకు ప్రాణాపాయం

తటస్థించవచ్చునని కింగ్కు తెలుసు. అహింసా పద్ధతులపై విశ్వాసంలేని కొందరు స్వజాతీయులు - "బ్లాక్ ముస్లిం" సంస్థకు చెందినవారు - తనను, తన పద్ధతులను విద్వేషిస్తున్నందున, గాంధీజీని ఒక హిందువు చంపినట్టు, తనను ఒక నీగ్రో చంపగల అవకాశం లేకపోలేదని ఆయనకు తెలుసు. అయినా, కింగ్ తన కర్తవ్య నిర్వహణలో సందేహించలేదు, సంచలించ లేదు.

మానవుడు చేయగల చరమ త్యాగానికి - ప్రాణత్యాగానికి సన్నద్ధపడిన మీదటనే తన సత్యాగ్రహ సమరాన్ని కింగ్ ప్రారంభించాడు. ఆయన విద్యాధికుడు. బోస్టన్ యూనివర్సిటీలో డాక్టరేట్ పట్టాని సంపాదించుకున్నాడు. తండ్రివలె తాను కూడా "క్లెర్జిమన్". తనకు భార్య వున్నది, బిడ్డలున్నారు. ఇతరుల సంగతి పట్టించుకొనకపోతే, తానేమి, తన కుటుంబమేమి అన్నవస్త్రాలకు లోపం లేకుండా బ్రతకవచ్చు.

కాని, అడుగడుగున ఎన్నో అవమానాలకు లోనౌతూ బ్రతుకు గడపడం కంటే మరణం మేలన్న నిర్ణయానికి కింగ్ వచ్చాడు. ఈ నిర్ణయానికి రావడానికి గాంధీజీ బోధనలు ఆయనకు తోడ్పడినాయి. జాత్యహంకారానికి విరుద్ధంగా దక్షిణాఫ్రికాలో గాంధీజీ ప్రజోద్యమాన్ని నడిపించడం మరింతగా ప్రేరణ కల్పించింది. స్థానిక పరిస్థితులకు అనుగుణమైన కొన్ని మార్పులతో కింగ్ తన సత్యాగ్రహ సమరాన్ని మాంట్ మరీలో 1955లో ప్రారంభించాడు. జాతి వివక్షను పాటిస్తున్న సిటీ బస్సులలో ప్రయాణాన్ని మానుకొనడం రూపంలో ప్రారంభమైన మాంట్ మరీ సత్యాగ్రహం ఘనవిజయాన్ని సాధించింది. కాని, ఆ ప్రత్యక్ష విజయాన్ని మించిన మరొక ఘనవిజయాన్ని కూడా అది సాధించింది. వర్ణజాతిలో నిర్భయాన్ని

దుకొలపడమే ఆ ఘనవిజయం. మానవుని మానసిక, సాంఘిక, రాజకీయాది దాస్యా `టికి భయమే మూలం. భయాన్ని జయించినవాడు ప్రపంచంలో దేనినైనా జయిస్తాడు!

గాంధీజీ వలె కింగ్ భయాన్ని జయించాడు కనుకనే మట్టిముద్దల నుంచి, ఆయన మహావీరులను సృష్టించగలిగాడు. ముఖ్యంగా కింగ్ ఆత్మబలిదానం తర్వాత అమెరికాలోని వర్ణజాతుల అంతిమ విజయం పట్ల ఎట్టి సందేహం అక్కరలేదు. నైతికంగా ఇప్పటికే వారు జయించారు; ఇతర విధాల కూడా కొంచెం ముందు వెనుకలుగా వారు పూర్తి విజయాన్ని పొందడం తథ్యం.

గాంధీజీ భారతీయ స్వాతంత్రోద్యమానికి నాయకత్వం వహించడం ఆయన భారతీయుడుగా జన్మించినందునే. భారతదేశంలో కాక, అమెరికాలో వర్ణజాతిలో జన్మించివుంటే, ఆయన కింగ్ ప్రారంభించిన ప్రజోద్యమాన్ని పోలినదానికి నాయకత్వం వహించి ఉండేవాడు. ఇదే విధంగా కింగ్ ఏ రెండు, మూడు తరాల క్రితమో ఇండియాలో జన్మించి వుంటే, భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రధానపాత్ర వహించి ఉండేవాడే! గాంధీజీ కానివ్వండి, కింగ్ కానివ్వండి, అట్టి మరొక విశిష్ట వ్యక్తి కానివ్వండి : వారు ఎప్పుడు, ఏ దేశంలో, ఏ ప్రజోద్యమాన్ని నడిపినా, అది కేవలం స్వజాతికోసమే. అట్టి మహామహులు తల ఎత్తుతున్నంతవరకు మానవాళి భవిష్యత్తు విషయమై నిరాశా నిస్పృహలు చెందనక్కరలేదు.

కాని, మానవత సుస్థిరంగా పాదుకొనడానికి ముందు ఈ విధంగా మానవోత్తముల హత్య జరుగుతూ పోవలసిందేనా? తన భౌతిక సంపదకు తగు నైతిక బలాన్ని ఆధునిక మానవుడు ప్రదర్శించలేడా? తన విద్యకు తగు విజ్ఞతను ప్రదర్శించలేడా?

రెండు, మూడు వేల సంవత్సరాల నాటి కంటే ఈనాడు మానవతాభావం కొంత ప్రబలిన మాట నిజమే! గౌతమ బుద్ధునివలె ఏ మత ప్రవక్త ఈనాడు బానిసతనాన్ని గురించి మౌనం వహించలేదు, అరిస్టోటిల్ వలె దాన్ని సమర్థించలేదు. అయినా, రెండు దశాబ్దాల లోపల ఒక గాంధీ, ఒక కెనడీ, ఒక కింగ్ హత్య జరగడం ఆధునిక మానవునికి తలవంపులు కావా? అతడి సభ్యతకు మచ్చ కాదా? (ఆంధ్రజ్యోతి 6-4-1968)

## బంగ్లా బంధు : షేక్ ముజబుర్ రహమాన్

మరొక రోజులో, రెండు రోజులలో బంగ్లాదేశ్లో తాము లొంగిపోనున్న ఘట్టంలో పాక్ సైనిక నియంతలు బంగ్లాదేశ్ మేధావులు రెండు వందల మందిని హత్యచేసినట్టు, "బంగ్లా బంధు" షేక్ ముజబుర్ రహమాను కూడా హత్య చేయలేదు కదా అని ఆందోళన చెందుతున్న వారికి ఆయన క్షేమంగానే ఉన్నట్టు పాక్ ప్రెసిడెంట్ భుట్టో చేసిన ప్రకటన కొంత సంతోషాన్ని కలిగిస్తున్నది.

"కొంత సంతోషం" అని మేము కావాలనే వ్రాశాము. ఈ విషయంలో పూర్తి సంతోషం కలగడం "బంగ్లా బంధు" తిరిగి తన దేశానికి, తన ప్రజల మధ్యకు వెళ్ళినప్పుడే! ఇందుకు విధి లేకపోతే తప్ప భుట్టో సమ్మతించడు; "బంగ్లా బంధు"ను జైల్ నుంచి నేడు విడుదలచేసినా, ఆయనను గృహ నిర్బంధంలోనే ఉంచాడు. ఈ విధంగా ఆయనను నిర్బంధంలో ఉంచడం బ్రతిమలాడితే, బెదిరిస్తే, ఇతర విధాల ప్రయత్నిస్తే, పాకిస్తాన్తో ఏదో ఒక విధమైన ఫెడరల్ సంబంధాన్ని పెట్టుకోడానికి "బంగ్లా బంధు" సమ్మతించకపోతాడా అనేది భుట్టో ఆశ కావచ్చు. కాని, ఇది లేనిపోని ఆశ.

కొన్ని వారాల క్రితం భుట్టో స్వయంగా ప్రకటించిన ఒక కరపత్రం ప్రకారం మార్చి చివరి వారంలో సయితం "బంగ్లా బంధు" కోరింది బంగ్లాదేశ్కు సంపూర్ణ స్వాతంత్ర్యం కాదు; పాకిస్తాన్ ఫెడరల్ అధికారానికి లోబడి స్థానిక వ్యవహారాలలో స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని. అప్పుడు భుట్టోను ఒక ప్రక్కకు పిలిచి, "మనకు ఈ సైనిక నియంతృత్వం పీడ తొలగడానికి మీరే ప్రధాని పదవి స్వీకరించండి" అని "బంగ్లాబంధు" స్పష్టంగా చెప్పడం (భుట్టో కథనం ప్రకారమే) జరిగింది కూడా. అప్పుడే ఆయన మాటను భుట్టో విని ఉంటే, బంగ్లాదేశ్లో హత్యాకాండ తప్పేది; ఇతర సంక్షోభాలు తప్పేవి; ఇండియాతో యుద్ధం, ఆ యుద్ధంలో పరాజయ పరాభావం - అన్నీ తప్పేవి.

ఈనాడు యాహ్యాఖాన్ిప్, అతడి సహచరులపై పూర్తి బాధ్యతను నెట్టడానికి భుట్టో ప్రయత్నిస్తున్నా, కడచిన తొమ్మిది నెలల విషాద సంఘటనల సందర్భంలో అతడు కూడా ఒక నేరస్తుడు. ఒక పెద్ద నేరస్తుడు.

ఈ విషయం తక్కిన వారికంటె "బంగ్లా బంధు"కే ఎక్కువగా తెలుసు. అందువల్ల తన ప్రాణాలు పోయినా సరే, భుట్టోతో ఆ విధమైన రాజీకి ఆయన సమ్మతించడు. ఒక వేళ సమ్మతిస్తే, ఆయన "బంగ్లా బంధు"గా మిగలడు. బంగ్లాదేశ్ ప్రజలే "ఇక మీరు మా నాయకులు కారు" అని ఆయనకు తెగవేసి చెబుతారు.

బంగ్లాదేశ్ క్షేమాన్ని నిజంగా కోరితే, పాకిస్తాన్ క్షేమాన్ని నిజంగా కోరితే, ఇండియా ఉపఖండంలో శాంతిని నిజంగాకోరితే, "బంగ్లా బంధు"ను వెంటనే విడుదల చేసి ఆయనను ఢాకాకు పంపించవలసిందిగా ఇస్లామాబాద్ పై వాషింగ్టన్ ఒత్తిడి తేవాలి. ఇస్లామాబాద్ పై తమకున్న పలుకుబడిని వినియోగించి, బంగ్లాదేశ్ సమస్యకు శాంతియుత పరిష్కారాన్ని తాము మరి కొద్దిలో సాధించనున్న ఘట్టంలో ఇండియా తొందరపడిందని లోకానికి చాటుతున్న వాషింగ్టన్ ఇప్పుడు ఈ చిన్న పనిని చేయలేదా? పోనీ, ఇదివరలో "రహమాను విడుదలచేస్తే, నా పతనం తప్పదు" అని యాహ్యాఖాన్ తమకు చెప్పి ఉండవచ్చు. తాము ఎంతగా నివారించగోరినా, యాహ్యాఖాన్ పతనం తప్పలేదు కాబట్టి, ఇప్పుడు తాము తగినంత చొరవ ఎందుకు చేయరాదు, తగినంత పట్టుదల ఎందుకు చూపరాదు? (ఆంధ్రజ్యోతి 23-12-1973)

## ప్రెసిడెంట్ టిటో

యుగోస్లావియా ప్రెసిడెంట్ టిటో నేడు అయిదవసారిగా ఇండియా పర్యటనకు రావడాన్నిబట్టి ఆయన ఇండియాతో సంబంధాలకు ఎంతటి ప్రాధాన్యమిస్తున్నారో గ్రహించవచ్చు. భారత 'తులుగా ఎన్నదగిన వారిలో ఆయన ప్రథమగణ్యుడు.

ప్రపంచ రాజకీయాలలో టిటోకు ఒక విశిష్ట స్థానం ఉన్నది. ద్వితీయ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రాక్పశ్చిమ రాజ్యాలు రష్యా, అమెరికాల నాయకత్వాన రెండు సైనిక కూటాలుగా విడిపోయిన సమయంలో, తృతీయ ప్రపంచ యుద్ధ ప్రమాదం హెచ్చుతున్న ఘట్టంలో ఆయన అలీన విధానాన్ని రూపొందించడంలో నెహ్రూ, నాసర్లతో కలిసి కృషి చేశారు. ఈ త్రిమూర్తుల కృషి ఫలితంగా అలీన విధానం ప్రపంచ రాజకీయాలలో గౌరవ స్థానాన్ని పొందడం, కొత్తగా స్వతంత్రమైన అనేక దేశాలు ఆ విధానాన్ని అనుసరించడం, ప్రచ్ఛన్న యుద్ధ తీవ్రతను తగ్గించడంలో ఆ విధానం ముఖ్య పాత్ర వహించడం జరిగింది. ఆ విధంగా టిటో ప్రపంచ రాజకీయ వేత్తలలో ప్రముఖ స్థానాన్ని పొందారు.

అంతేకాదు; మరొక విధంగా కూడా ప్రపంచ రాజకీయాలలో టిటో పాత్ర ఎన్నదగింది. అభిప్రాయ భేదాన్ని సహించని కమ్యూనిస్టు "ఏకశిలా వ్యవస్థ"ను తొలిసారిగా భేదించిన ఘనతకూడా టిటోదే. 1948లో ఆయన స్టాలిన్ను మహా సాహసంతో ఎదిరించి కమ్యూనిస్టు ప్రపంచంలో ఏకాకిగా నిలబడ్డారు. స్టాలిన్ బ్రతికి ఉన్నంత కాలం రష్యా, యుగోస్లావియాల మధ్య ఉద్రిక్తత కొనసాగుతూనే వచ్చింది. కృశ్చేవ్ అధికార కాలంలోగాని ఈ ఉద్రిక్తత తొలగలేదు. సోషలిస్టు దేశాలు దేనికది వేర్వేరు మార్గాలను అనుసరించవచ్చునని కృశ్చేవ్ సిద్ధాంతీకరించడానికి ప్రేరణ 1948లో టిటో అనుసరించిన స్వతంత్ర సామ్యవాద విధానమే.

కృశ్చేవను తొలగించి రష్యాలో కొత్త నాయకులు అధికారంలోనికి వచ్చినా వారు యుగోస్లావియా పట్ల కృశ్చేవ్ విధానాన్నే అనుసరించడం గమనార్హం. ఇటీవల సోవియెట్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి బ్రెజ్నేవ్ యుగోస్లావియా సందర్శించి ఆ విధానాన్ని పునరుద్ఘాటించడం జరిగింది. బాల్కన్ రాజ్యాల వ్యవహారాలలో తాము జోక్యం చేసుకోబోమని బ్రెజ్నేవ్ హామీ ఇచ్చారు. ఇది టిటో సాధించిన మరొక విజయం. అంతేకాక, రష్యాతో తన సంబంధాలు మెరుగుపడిన తరువాత యుగోస్లావియా సిద్ధాంతపరంగా చైనా సాగించిన దాడిని ఎదుర్కోవలసి వచ్చింది. ఇప్పుడు చైనా కూడా రష్యావలెనే యుగోస్లావియాతో సమాధానపడడం టిటో రాజనీతిజ్ఞతకు ఇంకొక ఘనవిజయం.

ప్రపంచ రాజకీయాలలో ఒక కొత్త సంచనలం కనిపిస్తున్నది. చైనా ఐక్యరాజ్య సమితిలో ప్రవేశించబోతున్నది. అమెరికా, చైనాల మధ్య వైరభారం తగ్గిపోనున్న సూచనలు కానవస్తున్నాయి. చైనా అమెరికాతోనే కాక పెక్కు ఇతర దేశాలతో తన సంబంధాలను మెరుగుపరచుకొనడానికి యత్నిస్తున్నది. ఈ తరుణంలో టిటో ఇండియా రాకకు ఒక ప్రాధాన్యం కలదనే చెప్పాలి.

ఇండియాకు సంబంధించినంత వరకు ప్రస్తుతం బంగ్లాదేశ్ ప్రధాన సమస్యగా పరిణమించింది. దీనికి రాజకీయ పరిష్కారం అవసరమన్న ఇండియా అభిప్రాయంతో టిటో ఏకీభవిస్తున్నారు. పాకిస్తాన్ సృష్టించిన ఈ సమస్య స్వరూప స్వభావాలను సన్నిహితంగా అవగాహన చేసుకొనడానికి టిటోకు ప్రస్తుత పర్యటన అవకాశం కలిగించింది. తన చిరకాల మిత్రుడుగా ఆయనకు ఇండియా సుస్వాగత మిస్తుంది.

(ఆంధ్రజ్యోతి 18-10-1971/. )

## ఆఖరి నియంత : ఫ్రాంకో

యూరప్ హిట్లర్, ముస్సోలినీల కోవకు చెందిన నియంత మరొకడు ఇంకా మిగిలి ఉన్నాడు. అతడు శ్పానిష్ నియంత ఫ్రాంకో. 81 సంవత్సరాల వృద్ధాప్యంలో తీవ్ర వ్యాధిగ్రస్తుడై అతడు రేపో మాపో రంగం నుంచి శాశ్వతంగా నిష్క్రమించనున్నాడు.

మూడున్నర దశాబ్దాలుగా స్పెయిన్ ఫ్రాంకో ఇనుప పాదాల క్రింద నలిగిపోతున్నది. అతడి

నిష్క్రమణ తర్వాతనైనా స్పెయిన్లో స్వేచ్ఛాభానూదయం కానున్నదా? 1936 నాటి శ్పానిష్ అంతర్యుద్ధం జగత్ప్రసిద్ధమైనది. రిపబ్లికన్ సేవలకు, జనరల్ ఫ్రాంకో సైన్యానికి మధ్య ఆ యుద్ధం రెండున్నర ఏళ్ళపాటు సాగింది. ప్రపంచంలోని ప్రజాస్వామ్య ప్రియులందరు రిపబ్లికన్ సేవలపట్ల సానుభూతి చూపారు. ఎన్నో విధాలుగా సహాయం అందజేశారు. దేశదేశాల మేధావులెందరో ఆ యుద్ధంలో రిపబ్లికన్ల పక్షాన పాల్గొన్నారు

కూడా. కాగా, జనరల్ ఫ్రాంకోకు హిట్లర్ ముస్సోలినీల అండదండలు లభించాయి. చివరికి రిపబ్లికన్లు ఓడిపోయారు. ఫ్రాంకో స్పెయిన్లో ఫాసిస్టు ప్రభుత్వాన్ని నెలకొల్పాడు. ఇది జరిగింది 19695.

ఆ తర్వాత రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. అంతమైంది. హిట్లర్ ముస్సోలినీలు గతించారు. వలసదేశాలెన్నో స్వతంత్రమైనాయి, సామ్రాజ్యాలు పతనమైనాయి. ప్రపంచ రాజకీయ స్వరూపమే ఎంతగానో మారిపోయింది. కాని, స్పెయిన్లో ఫ్రాంకో నియంతృత్వం మాత్రం అవిచ్ఛిన్నంగా కొనసాగింది. తన ఫాసిస్టు పాలనకు అతడు సైన్యంపై, చర్చిపై, ధనికవర్గాలపై ఆధారపడ్డాడు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు లభించవలసిన అన్ని విధాల స్వాతంత్ర్యాలను అతడు కాలరాచివేశాడు.

ముప్పదేళ్ల క్రిందట స్పెయిన్లో ఏ పౌరుడైనా తాను మనసులో అనుకుంటున్నదాన్ని పైకి చెబితే అతడిని కాల్చివేసేవారట. ఇరవయ్యేళ్ళ క్రిందట తన అభిప్రాయాన్ని మరొకరి చెవిలో రహస్యంగా చెప్పుకుంటే అపాయం లేని మేరకు భావస్వాతంత్ర్యం వచ్చిందట. ఇప్పుడు పౌరులు తమ అభిప్రాయాలను నెమ్మదిగా మాట్లాడుకుంటున్న ధోరణిలో చెప్పుకోవచ్చునట. గట్టిగా తమ భావాలను వెల్లడిస్తే మాత్రం కారాగారం తప్పదు.

ఇంత దారుణమైన నియంతృత్వాన్ని 35 ఏళ్లుగా అనుభవిస్తున్నందున ప్రజల నిస్పృహ "ఇక ఫ్రాంకో ఎన్నటికి పోడు" అని నిరాశ పడేవరకు వెళ్లింది. కాని, ఎంతటి నియంతకైనా చావు తప్పదు గదా? తాను త్వరలోనే ఎన్నడో చనిపోక తప్పదని ఫ్రాంకో 1969లో ఆఖరి శ్పానిష్ రాజు మనుమడు ప్రిన్స్ జువాన్ కార్లసన్ను తనకు వారసుడుగా నిర్ణయించాడు. ఇప్పుడు అయిదేళ్ళ తర్వాత తన వ్యాధి మరింత ముదరగా ఫ్రాంకో రాజ్యాధినేత పదవిని ప్రిన్స్ కార్లసు గత శుక్రవారంనాడు అప్పగించాడు.

కొంత కాలం క్రితం ఇండియాతో సహా పెక్కు దేశాలు సందర్శించిన ప్రిన్స్ కార్లస్ లిబరల్ వాదిగా ప్రతీతి. అయితే, ప్రజాస్వామ్య పునరుద్ధరణకు రాజ్యాధినేత లిబరల్వాది కావడం మాత్రమే చాలదు. స్పెయిన్లో బలంగా పాతుకుని ఉన్న సైన్యం, చర్చి మొదలైన వాటి అధికారాన్ని కాదని ప్రజాస్వామ్యాన్ని స్థాపించడం సులభం కాదు. పొరుగునగల పోర్చుగల్ సయితం నియంతృత్వంపై సైన్యం ఇటీవల తిరుగుబాటు చేసినందునే మార్పు సాధ్యమైంది.

అందువల్ల సైన్యం కూడా సహకరిస్తే స్పెయిన్లో ప్రజాస్వామిక వ్యవస్థను నెలకొల్పడం ప్రిన్స్ కార్లస్కు సాధ్యం కావచ్చు. లేదా, ప్రజలలోనే చైతన్యం రగిలి, అతని ప్రయత్నాలకు తోడ్పడితే సాధ్యం కావచ్చు. ఈ రెండూ కాని పక్షంలో ప్రిన్స్ కార్లస్ నామమాత్రపు రాజ్యాధినేతగా మిగిలి, ప్రస్తుతపు పరిస్థితే కొనసాగవచ్చు.

(ఆంధ్రజ్యోతి 26-7-1974)

## అమెరికా ప్రెసిడెంట్ ఫోర్డ్

అనుకోకుండా మొదట వైస్ ప్రెసిడెంట్ పదవి వచ్చింది; అనుకోకుండానే ఇప్పుడు ప్రెసిడెంట్ పదవి వచ్చింది. జాతకాలపట్ల నమ్మకం ఉన్నవారి దృష్టిలో జెరాల్డ్ ఫోర్డ్ ఎంతగానో అదృష్టవంతుడు.

అయితే, ఆయన మెట్టు తర్వాత మెట్టు చొప్పున ఈ విధంగా రెండు మెట్లు ఎక్కగలిగింది వైస్ ప్రెసిడెంట్, ప్రెసిడెంట్ పదవులకు ఎన్నికైన వారిద్దరు తప్పుడు పనులు చేసినందునే, తప్పనిసరిగా వారు రాజీనామా చేయవలసి వచ్చినందునే! అమెరికా చరిత్రలోనే అపూర్వమైన ఈ సంఘటనల కారణంగా ప్రెసిడెంట్ పదవికి వచ్చిన ఫోర్డ్ వహించవలసిన బాధ్యతలు సయితం అపూర్వమైనవే. ప్రెసిడెంట్ పదవికి నిక్సన్ తెచ్చిన అపఖ్యాతిని తొలగించడం ఫోర్డ్ ప్రథమ బాధ్యత. ఈ పని తేలికగా జరగదు; ఒక్క నాటితో జరగదు కూడా.

ప్రెసిడెంట్గా ఎన్నిక కాకమునుపే నిక్సనక్కు "ట్రికి డక్" అనే చెడ్డపేరు ఉండేది. ఇందుకు భిన్నమైన ఖ్యాతి ఉన్నవాడు ఫోర్డ్. ప్రతిపక్షాలవారు సయితం పెద్దమనిషిగా ఆయనను గౌరవిస్తారు. ఆ గౌరవాన్ని ఆయన నిలుపుకున్న మేరకే, దాన్ని పెంపొందించుకున్న మేరకే ప్రెసిడెంట్ పదవికి నిక్సన్ తెచ్చిన మచ్చ తొలగుతుంది.

ఎవరు ఎంతకాలం ఏ పదవిని నిర్వహించినారన్నది ముఖ్యం కాదు; ఏ రీతిగా దాన్ని నిర్వహించినారన్నదే ముఖ్యం. "ఏ రీతిగా" అన్నప్పుడు "ఎంత సమర్థంగా" అని మాత్రమే కాదు; "ఎంతటి నీతి నిజాయితీలతో" అని కూడా. నీతి నిజాయితీలు లేనప్పుడు ప్రజానాయకుని "సమర్థు"డని ఒకవేళ మెచ్చుకొనడం జరిగినా, సచ్చరిత్రుడుగా అతడిని గౌరవించడం జరగదు. ప్రేమించడం అసలే జరగదు.

నిక్సన్ కారణంగా అమెరికా రాజకీయ రంగంలో, పరిపాలనా రంగంలో నైతికపు విలువలు అతి హీనస్థితికి పడిపోయాయి. వాటిని తిరిగి ఉన్నత స్థాయికి తీసుకురావడం చాలావరకు.

కొత్త ప్రెసిడెంట్ వ్యక్తిగతంగా నెలకొల్పగల నైతిక ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది. ప్రజానాయకులే, ప్రభుత్వాధినేతలే నైతిక ప్రమాణాలను పాటించకపోతే, అన్యులు పాటిస్తారా? పోతే, మరొక విషయాన్ని మాత్రం నేడిక్కడ పేర్కొనాలి. పదవిని సంపాదించడానికి దాన్ని నిలుపుకొనడానికి ఎన్ని అబద్ధాలాడినా, ఎన్ని అపభ్రంశపు పనులు చేసినా, అంతర్జాతీయ రంగంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, ప్రపంచ శాంతిని సాధించడానికి నిక్సన్ ఎన్నదగు కృషిని చేశాడు. బంగ్లాదేశ్ వ్యవహారం సందర్భంలో ఇండియాపట్ల నిక్సన్ అనుచితంగా ప్రవర్తించినా, ఆయన విదేశాంగ విధానాలు మొత్తంపై సముచితమైనవని, హర్షించదగినవని మనం గుర్తించాలి. కొత్త ప్రెసిడెంట్ ఫోర్డ్ ఆ విధానాలనే మరింత పట్టుదలతో, మరింత చిత్తశుద్ధితో కొనసాగించగలడనే ప్రపంచం ఆశిస్తున్నది. హెన్రీ. కిసింజర్ ఇప్పటి పదవిలోనే కొనసాగనున్నట్టు ఫోర్డ్ చేసిన ప్రకటన ఈ ఆశకు బలాన్ని కూర్చుతున్నది.

(ఆంధ్రజ్యోతి 12-8-1974)

## హెలెన్ కెల్లర్

ఏ వొక్క అవయవం కొరవడినా, ఏ వొక్క జ్ఞానేంద్రియం లోపించినా మానవుడు పరిపూర్ణ జీవితం అనుభవించలేడు. కాగా, హెలెన్ కెల్లర్కు ఒక్క తీరునకాదు, మూడు విధాలుగా అంగవైకల్యం సంభవించింది.

జీవితం సగం చెల్లిపోయిన తరువాతకాదు, శైశవంలోనే 19 నెలల లేత వయస్సులోనే - ఆమెకు ఏదో తీవ్రరుగ్మతవల్ల చూపుపోయింది; మాట పడిపోయింది. వినికిడి కూడా పోయింది. ఈ మూడింటిలో ఏ వొక్కటి సంభవించినా జీవితం దుఃఖభాజనమే అవుతుంది, కాగా ఈ మూడు లోపాలను అధిగమించి, ఆమె పరిపూర్ణమైన జీవితాన్ని అనుభవించింది, లోకోత్తరమైన కీర్తి గడించింది. మొన్న తన 87వ ఏట ఆమె నిర్యాణం చెందింది.

అయిదవ ఏడు వచ్చే వరకు ఆమె జీవితం ముప్పాతిక మూడు పాళ్ళు అంధకార బంధురం, అప్పుడు యాన్ సలివాన్ అనే ఉపాధ్యాయిని సాహచర్యం ఆమెకు లభించింది. క్రమంగా మాట నేర్చుకున్నది. కాని, బధిరత్వం, అంధత్వం మిగిలిపోయాయి. యాన్ సలివాన్ తోడ్పాటుతో హెలెన్ కెల్లర్ స్పర్శ ద్వారా మాటలు "వినడం" నేర్చుకున్నది.

బ్రెయిల్ లిపి ద్వారా మాటలను "చదవడం" నేర్చుకున్నది. ఆ విధంగా ఆమె బధిరత్వం, అంధత్వాలను కూడా జయించింది.

ఇందులో కూడా విశేషంలేదు. ఆమె తన వ్యక్తిగత విజయం ఫలితాలను ప్రపంచానికి, లక్షలాది బధిరాంధ వికలాంగులకు అందివ్వడానికి తన యావజ్జీవితాన్ని ధారవోసింది. పెక్కుసార్లు యూరప్, ఆసియా దేశాలలో పర్యటించి, ఉపన్యాసాల ద్వారా, వికలాంగుల సముద్ధరణ కృషి ద్వారా మానవసేవ చేసింది. స్వీయ జీవితానుభవాలను ఎన్నో గ్రంథాల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పింది.

లోకంలో కొందరు అదృష్టవంతులుగా పుట్టవచ్చు. మరి కొందరు దురదృష్టవంతులుగా జన్మించవచ్చు. కాని, దురదృష్టవంతులు జీవితాంతం దుఃఖిస్తూ కూర్చోనక్కరలేదు. మానవుడు ఆత్మశక్తి చేత జయించలేని, అధిగమించలేని దురదృష్టం లేదు. కావలసినదిలా దృఢ దీక్ష: భవిష్యత్తుపట్ల అచంచల విశ్వాసం; జీవితంపై ఆశ వైద్యశాస్త్రం ఈనాడు ఎంతగానో పురోగమించింది. వైద్యులు ఒక గుండెకు బదులు మరొక గుండెను అమరుస్తున్నారు. కొత్త ఊపిరితిత్తులను, కొత్త మూత్ర పిండాలను, కొత్త లివర్ను పాతవాటి స్థానంలో అమర్చుతున్నారు.

ఇవన్నీ అద్భుతావహమైనవే. కాని, ఎంత ఘన వైద్యులైనా మానవునికి దీక్ష, ధైర్యం, విజిగీష వంటి ఉత్తమ గుణాలను రక్తంలోకి ఎక్కించలేరు. వాటిని ఎవరికి వారు సమకూర్చు కోవలసిందే. హెలెన్ కెల్లర్ వంటి అద్భుత వ్యక్తుల జీవితోదాహరణలు ఇందుకు ఎంతైనా సహాయపడతాయి. ఆమె ధీరోదాత్త చరిత్ర దుఃఖిత మానవజాతికి ఆశాజ్యోతి. ఆమె జీవిత కథ చిరస్మరణీయం. (ఆంధ్రజ్యోతి 4-6-1968)

## డెవేలరా

పరప్రభుత్వంపై జరిగిన సాయుధ విప్లవంలో పాల్గొన్నందుకు ఆయనకు కారాగారవాస శిక్ష విధించారు. కోర్టు నుంచి జైలుకు ఆయనను ఒక పోలీసు వ్యాన్లో తీసుకువెడుతున్నారు. జైలుగేటుకు అల్లంత దూరంలో ఆయన జేబులోనుంచి తన పైప్ తీసి, దాన్ని పొగాకుతో నింపి, అగ్గిపుల్లతో వెలిగించబోయాడు. ఇంతలో "ఈ పొగత్రాగుడు వ్యసనం నాకుంటే, రేపటినుంచి నన్ను బందీ చేసినవారిని నేను పొగాకు కోసం దేవురించవలసిన దుర్గతి పట్టదా?" అనే ఆలోచన తోచింది. వెంటనే నోటిలోని పైపు తీసి పారవేశాడు. అంతే నాటినుంచి నేటివరకు ఆయన పొగాకును తిరిగి తాకనైనాలేదు.

ఆయన తన దేశానికి ప్రెసిడెంట్గా ఎన్నికైనాడు. "బీర్" అంటే ఆయనకు మోజు, అయితే, తన దేశంలో మద్యపానంవల్ల ఎన్ని కుటుంబాలు ఎంతగా చితికి పోతున్నాయన్న బాధ ఒకనాడు ఆయనకు కలిగింది. అంతే - ఆనాటి నుంచి ఆయన తన దేశం సరిహద్దుల లోపల బీరును త్రాగడం పూర్తిగా మానివేశాడు.

ఏమన్ డెవేలరాను గురించి 1936లో తన "ఇన్సైడ్ యూరప్"లో జాన్ గంథర్ ఇతర సంఘటనలు పెక్కింటితోపాటు ఈ రెండింటిని పేర్కొన్నాడు. 1936లో డెవేలరా ఐర్లెండ్ ప్రెసిడెంటు; మధ్యలో కొన్ని సంవత్సరాలపాటు కాకపోయినా, 1975లో కూడా ఆయన ఐర్లెండ్ ప్రెసిడెంటు, ఆ పదవినుంచి తొంభై సంవత్సరాలు నిండిన తర్వాత మొన్ననే ఆయన తప్పుకున్నాడు.

డెవేలరా ఎంతటి - గంథర్ గ్రంథం నుంచి మేము ఉదహరించిన రెండు సంఘటనలే చాలు మహోదాత్తుడో గ్రహించడానికి, తన దేశంకోసం, తన ప్రజలకోసం ఆయన సన్నద్ధపడని.

త్యాగం లేదు. చేయని సాహస కృత్యంలేదు, పడని కష్టంలేదు. 1916 నాటి ఈస్టర్ విప్లవంలో పాల్గొన్నందుకు బ్రిటిష్ వారు ఆయనకు మరణశిక్ష విధించారు. అయితే, ఆయన జన్మవల్ల అమెరికన్ పౌరుడు. అప్పటిలో కొనసాగుతున్న మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికా తన పక్షాన రంగంలో నిలవాలని బ్రిటన్ తాపత్రయపడుతున్న ఘట్టమది. ఆ ఘట్టంలో ఒక అమెరికన్ పౌరుని ప్రాణాలను తీయడానికి బ్రిటన్కు గుండె చాలలేదు. అందువల్ల ఆయనకు విధించిన మరణదండనను యావజ్జీవ కారాగారవాస శిక్షగా మార్పుచేశారు.

అయితే, మరొక సంవత్సరానికి డెవేలరాను తక్కిన ఐరిష్ రాజకీయ నాయకులతో పాటు విడుదల చేయడం జరిగింది. తర్వాత 1918లో ఆయనను తిరిగి అరెస్టుచేసి జైలులో పెట్టగా, దానినుంచి తప్పించుకుని, ఆయన అమెరికా చేరుకున్నాడు. కొన్ని నెలలపాటు అక్కడ తమ స్వాతంత్ర్య లక్ష్యాన్ని గురించి ప్రచారం చేసిన తర్వాత 1919లో తిరిగి స్వదేశానికి ఆయన మరలివచ్చాడు. జైలు నుంచి పారిపోవడంవలె తిరిగి స్వదేశానికి మరలిరావడంలో ఆయన చేసిన సాహస కృత్యాలను గురించి ఈ నాటికి కూడా ఎన్నెన్నో కథలు ఐర్లెండ్లో ప్రచారంలో వున్నాయి.

బ్రిటిష్ వారితో దాదాపు 800 సంవత్సరాలు పోరాడిన తర్వాతగాని ఐర్లెండ్ స్వాతంత్ర్యాన్ని పొందలేదు. ఈ సుదీర్ఘ స్వాతంత్ర్య సమరానికి ఎందరెందరో నాయకత్వం వహించారు. వారిలో ఒక ముఖ్యుడుగా ఎన్నదగు మహాశయుడు డెవేలరా.

అయితే, ఆయన ఆశయం పూర్తిగా నెరవేరలేదు. ఐర్లెండ్ స్వతంత్ర రాజ్యంగా 1921లో అవతరించినా, రెండు ముక్కలుగా అది చీలిపోయిన పిమ్మటనే, అల్సస్టర్ను తిరిగి ఐర్లెండ్ భాగం చేయడానికి తాను చేసిన ప్రయత్నాల వైఫల్యాన్ని గుర్తిస్తూ డెవేలరా ప్రెసిడెంట్ పదవినుంచి మొన్న తప్పుకొనడం జరిగింది.

అయిన, ఆయన తన దేశచరిత్రలోనేకాక, ప్రపంచచరిత్రలోనే ఎన్నదగు స్థానాన్ని సంపాదించు కున్నాడు. స్వాతంత్ర్యంకోసం ఎప్పుడు - ఎక్కడ - ఎవరు - ఏ సమరాన్ని ప్రారంభించినా, వారిని ఉత్తేజపరచగలపాటిది ఆయన జీవితం. ఈ విషయంలో ఆయన వాషింగ్టన్, మాజినీ, గ్యారిబాల్డీ, కోసత్, కెమల్ ఆటాటర్క్ గాంధీ, నెహ్రూ ప్రభృతులతో పోల్చదగువాడు. ఆయన పదవీ విరమణ సందర్భంలో డెవేలరాకు మా జోహారులర్పిస్తూ ఆయన జీవితలక్ష్యం పరిపూర్ణంగా నెరవేరగల వరకు జీవించాలని కోరుకొంటున్నాము.

(ఆంధ్రజ్యోతి 27-6-1973)

## ఆంద్రే మాలో

ఆయన యువకుడు కాడు, మధ్య వయస్కుడైనాకాడు, ఏడు పదులపైన రెండేళ్ళు గడిచినట్టివాడు. అయినా, బంగ్లాదేశ్లో పాక్సైనిక నియంతల హత్యాకాండ నిరోధానికై 1971లో తుపాకి పట్టడానికి ఆయన తన సంసిద్ధతను వెల్లడించాడు.!

ఆంద్రే మాల్రో విషయంలో ఇది ఆశ్చర్యాన్ని కలిగించ నక్కర లేదు, ఆయన జీవిత కాలంలో అత్యధిక భాగం నియంతృత్వాన్ని, నిరంకుశత్వాన్ని నైచ్యాన్ని, క్రౌర్యాన్ని - అవి ఎక్కడ కానవచ్చినా, - ప్రతిఘటించడంలోనే గడచింది.

ప్రవృత్తివల్ల, శిక్షణవల్ల ఆంద్రేమాలో రచయిత, విమర్శకుడు, దార్శనికుడు, అయితే, ఆయన గతంలో బ్రతకడు; వర్తమానాన్ని నిర్లక్ష్యం చేయడు. గతం పట్ల ఆయనకు నిరసన భావం లేదు. నేటికి నిన్న పునాది; రేపటికి తిరిగి నిన్న పునాది కావాలి. నగరాలు, నాగరికత ఈ సత్యాన్నే చాటుతున్నాయి. పురాతత్వ శాస్త్రవేత్తలు జరిపే త్రవ్వకాలలో పునాదిపై పునాదితో తరం తర్వాత తరం తన జీవితాన్ని ఏ విధంగా నిర్మించుకుంటూ వచ్చిందో స్పష్టపడుతూ వుంటుంది.

నాగరికతాభివృద్ధిని కోరేవారు, మానవతా వికాసాన్ని కాంక్షించేవారు నిన్న పట్ల మోజుతో నేటిని నిరసించరాదు; ఇంతేకాక, రేపటికోసం నేటిని గురించి పరిపూర్ణ శ్రద్ధాసక్తులను ప్రదర్శించాలి. "స్వర్ణయుగం" ప్రాచీన కాలంలోని ఏదో ఒక ఘట్టంలో అంతరించిపోయిందని విలపించక, అది సర్వదా భావికాలంలోనే వుంటుందని గుర్తించాలి. దాని దిశలో మన ప్రపంచం, మన మానవజాతి ఒక అడుగు ముందుకు వేయడానికి తన జీవితకాలంలో తాను చేయగలిగిన దాన్ని పూర్తిగా చేయాలి, చిత్తశుద్ధితో చేయాలి.

ఇట్టి జీవిత దృక్పథం కలవాడు కనుకనే ఆంద్రేమాలో రచయిత మాత్రమే కాక, రాజకీయవేత్తకూడా, విమర్శకుడు మాత్రమే కాక, విశ్వమానవ హితైషి కూడా, దార్శనికుడు మాత్రమే కాక, దైత్యకశక్తులపై కత్తిదూసే సైనికుడు కూడా.

ఆయన స్పెయిన్లో ఫాసిస్టుశక్తులకు వ్యతిరేకంగా యుద్ధరంగంలో నిలిచాడు. ఫ్రాన్స్లో హిట్లరిజం పై హోరా హోరీగా పోరాడాడు. ఎన్ని సార్లు గాయాలు తగిలినా, వాటినుంచి కోలుకోగానే తిరిగి ఆయన రంగంలో నిలిచాడు. ఎన్ని సార్లు బందీని చేసినా, తిరిగి ఖైదునుంచి తప్పించుకొని ఆయన పోరాటాన్ని కొనసాగించాడు.

ఫ్రెంచి రాజకీయాలలో ఆంద్రేమాల్రో డిగోల్ భక్తుడు, శిష్యుడు. ప్రపంచ రాజకీయాలలో ఆయన శాంతికి, స్వాతంత్ర్యానికి, ప్రగతికి మిత్రుడు, అప్పుడు, డిగోల్ ప్రభుత్వంలో సాంస్కృతిక వ్యవహారాల మంత్రిగా వున్నప్పుడే కాక, అంతకుముందు, అటుపిమ్మట కూడా ఆయన మానవ సంస్కృతి వికాసానికే, సభ్యతా విస్తరణకే తన జీవితాన్ని అంకితం చేశాడు. చేస్తున్నాడు.

మాల్రో నవల లన్నింటిలో చైనాను గురించి ఆయన వ్రాసినట్టిది ప్రపంచ ప్రఖ్యాతి (దీన్ని "మ్యాన్స్ ఫేట్" అనే పేరుతో ఇంగ్లీషులోకి అనువదించాడు. ఆయన విమర్శక గ్రంథా లన్నింటిలో చిత్ర, శిల్ప కళలను గురించి వ్రాసినట్టివి సాటి లేనట్టివి. ("ది వాయిసెస్ ఆఫ్ సైనాల్స్", ది మెటమార్ఫసెస్ ఆఫ్ ది గాడ్స్" అనే పేర్లతో ఇంగ్లీషు భాషలో ఇవి వెలువడినాయి) పొందినట్టిది.

ప్రపంచం పట్ల, ప్రపంచ సమస్యల పట్ల తన కున్న శ్రద్ధాసక్తుల కారణంగానే ఆంద్రేమాలో ఈ వారం ప్రారంభంలో ఢిల్లీకి మన భారత ప్రభుత్వం అతిథిగా వచ్చి, అక్కడ నుంచి ఢాకాకు నిన్న వెళ్లాడు. మన ఉపఖండంలో ఆయన ఈ పర్యటన మన ఉపఖండం సమస్యల పరిష్కారానికి ప్రత్యక్షంగా కాకపోతే, పరోక్షంగానైనా కొంతవరకు తోడ్పడగలదనడంలో సందేహం అక్కరలేదు.

ఎక్కడికి వెళ్ళినా, ఎవరిని కలుసుకున్నా, విశాలదృష్టితో, న్యాయ పక్షపాతంతో, మానవ కల్యాణ సాధన కాంక్షతో చర్చలు జరపడం ఆంద్రేమాత్రోకు పరిపాటి. ఆయన స్నేహాన్ని, దేశం పొందగలగడం మన అదృష్టంగానే మనం భావించుకోవాలి. (ఆంధ్రజ్యోతి 20-4-1973)

## భారత మిత్రుడు : శ్రీ సేనానాయకే

గత సంవత్సరం ఇండియా ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి సింహళంలో సుహృద్భావ పర్యటన జరిగినప్పుడు ఆమెకు సింహళ ప్రజలు అపూర్వ స్వాగతం ఇచ్చారు. బుధవారంనాడు ఇండియా సందర్శిస్తున్న సింహళ ప్రధాని డడ్లీ సేనానాయకేకు కూడా భారతీయులు అంతే సుహృద్భావ పూర్వకమైన అఖండ స్వాగతమివ్వగలరనడంలో సందేహం లేదు.

పొరుగు దేశమైన సింహళంతో భరతవర్షానికి అతి ప్రాచీనకాలం నుంచి సుమారు 2500 సంవత్సరాలకు పై బడి - సన్నిహిత మైత్రీ సంబంధాలున్నాయి. అశోకుని కాలంలో మరి పెక్కు ఆసియా ప్రాంతాలకు వలెనే సింహళానికి కూడా బౌద్ధమతం వెళ్లింది. ఆ తర్వాత కాలంలో మతం రీత్యానే కాకుండా ఇంకా పెక్కు విధాలుగా ఉభయదేశాల మధ్యసన్నిహిత సంబంధాలు నెలకొన్నాయి.

అవే సంబంధాలు ఆధునిక కాలంలో కూడా కొనసాగాయి. అయితే, ఇటీవలి కాలంలో కొన్ని విభేదాలు కూడా తలఎత్తక పోలేదు. వీటిలో ముఖ్యమైనది సింహళంలోని భారతీయుల సమస్య. 17వ శతాబ్దినుంచి భారతీయులనేకులు ముఖ్యంగా తమిళనాడునుంచి సింహళానికి జీవనోపాధికోసం వెళ్లి స్థిరపడిపోయారు. సింహళ ఆర్థిక వ్యవస్థలో భారతీయ కార్మిక వర్గం కొంత ముఖ్య పాత్రనే నిర్వహించింది. కాని, వీరికి సింహళ పౌరసత్వం లేకపోవడం ఒక ప్రధాన సమస్యగా, ఉభయ దేశాలకు తలనొప్పిగా పరిణమించింది.

శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి భారత ప్రధానిగా వుండగా అప్పటి సింహళ ప్రధాని శ్రీమతి సిరిమావోతో భారతీయుల సమస్య పై ముఖ్యమైన ఒప్పందం జరిగింది. మూడు లక్షలమంది భారతీయులకు సింహళం పౌరసత్వ మివ్వడానికి, 525 వేలమందిని ఇండియాకు త్రిప్పిపంపి వేయడానికి ఆ ఒప్పందం అవకాశం కల్పించింది.

దురదృష్టవశాత్తు ఆ ఒప్పందం అమలు జరుగుతున్న తీరు ఇండియాకేమి, సింహళ భారతీయులకేమి అసంతృప్తినే కలిగించింది. ఇండియా తన బాధ్యతను తాను యథావిధిగా నెరవేరుస్తుండగా, సింహళం కొంత తాత్సారం చేసిందని చెప్పక తప్పదు.

సేనానాయకే ప్రధాని అయిన తర్వాత ఈ సమస్యలో కొంత మెరుగుదల కానరావడం ప్రారంభించింది. వచ్చే జూన్తో మొదలు పెట్టి ఇండియాకు సింహళ భారతీయుల తిరుగురాక పదిహేనేళ్ళపాటు కొనసాగనున్నది. దీనికి, సింహళ భారతీయులకు పౌరసత్వ ప్రదానానికి సంబంధించిన సమస్యలపై ప్రధాని సేనానాయకే ఢిల్లీలో ప్రధాని ఇందిరతో ముఖ్య చర్చలు జరపబోతున్నారు. వాటి ఫలితంగా ఆ సమస్యలు సత్వర పరిష్కారోన్ముఖం కాగలవని భావించవచ్చు.

మరొక స్వల్ప విభేదం ఇటీవలనే తల ఎత్తిన కచాలీవు సమస్యకు సంబంధించినది. దేశాలమధ్య వున్న ఈ చిన్నదీవి కొన్ని అపోహలకు కారణమైంది. సముద్రంలో కాకిరెట్టవంటి ఈ దీవి ఏ దేశానికి చెందినదనే వివాదం రెండు దేశాల మధ్య అనుమానాలకు తావు కలిగించడం విచారకరం. అది సింహళానికి చెందినదేనని ఇటీవల పాకిస్తాన్ మంత్రి ఒకరు పిలవని పేరంటంగా ఒక ప్రకటన చేసి పుల్లలు పెట్టడానికి ప్రయత్నించాడు. ఏమైనా, ఈ స్వల్ప విభేదం ఉభయులకు గౌరవప్రదంగా పరిష్కారం కావడం పెద్ద కష్టం కాబోదు.

పోతే, ఉభయ ప్రధానుల మధ్య మిగిలిన చర్చనీయాంశాలు విభేదాలకు కాక సహకారానికి సంబంధించినవి. ముఖ్యంగా వాణిజ్య, పారిశ్రామిక రంగాలలో సహకారానికి ఎంతైనా అవకాశం వున్నది. సింహళం మన దేశంనుంచి కొన్ని వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకునేది. ఇటీవల వాటిని తగ్గించి పెట్రోలియం ఉత్పత్తులు, ఉక్కు కడ్డీలు, రైల్వే వ్యాగన్లు, టెలిఫోన్ పరికరాలు, బొగ్గు, సిమెంటు మొదలైన పారిశ్రామిక వస్తువులను దిగుమతి చేసుకుంటున్నది. ఉభయులకు లాభసాటిగా వుండే విధంగా ఎగుమతి, దిగుమతి వ్యాపారాన్ని ఇంకా వృద్ధి చేసుకునే విషయం కూడా న్యూఢిల్లీ చర్చలలో రానున్నది.

ఇండియావలెనే సింహళం కూడా అలీన దేశం. రాజకీయంగా అంతర్జాతీయ రంగంలో రెండు దేశాలు పరస్పరం సహకరిస్తున్నాయి. అందుచేత ఈ సహకారానికి సంబంధించిన సమస్యలుకూడా చర్చకు వస్తాయి.

ఇండియా, సింహళాల మధ్య తగవులు పెట్టడానికి చైనా, పాకిస్తాన్ వంటి దేశాలు ప్రయత్నిస్తున్నాయి. సింహళంలో కూడా కొన్ని రాజకీయ పక్షాలు ఇండియాకు విస్తరణ కాంక్షకలదని, అది తమ దేశానికి ప్రమాదకరమని ధ్వనిస్తూ తమ పలుకుబడిని పెంచుకొనడానికి యత్నిస్తున్నాయి. ఈ ప్రయత్నాలు వమ్ముకాగలవని, శ్రీ సేనానాయకే యాత్ర మరింత సన్నిహిత మైత్రికి దోహదకరం కాగలదని ఆశించవచ్చు.

(ఆంధ్రజ్యోతి 28-11-1968)

## షేక్స్పియర్

నాలుగు వందల సంవత్సరాల క్రితం సరిగా ఈనాడు - ఏప్రిల్ 23వ తేదీని - ఒక మహాకవి, ఒక మహా నాటకకర్త జన్మించాడు. ఇంగ్లండ్, వార్విక్ షైర్, యావన్ నదీ తీరంలోని.

స్ట్రాట్ఫర్డ్లో జన్మించినా, ఆయన ఆ పట్టణానికి, ఆ పరగణాకు, ఆ ద్వీపానికి మాత్రమే చెందినవాడు కారు. ఆయన మన మహీ మండలానికే ఒక మహాకవి; మానవాళికే ఒక మహా నాటక కర్త.

పుట్టింది సామాన్యపు కుటుంబంలో. చదివింది సామాన్యపు చదువైనా కాదు. అయినా,

అసామాన్య ప్రజ్ఞను, అద్వితీయ ప్రతిభను విలియం షేక్స్పియర్ ప్రదర్శించాడు. కవిగా కాకపోవచ్చుగాని, నాటకకర్తగా ప్రపంచం మొత్తం మీదనే ప్రథమ స్థానాన్ని సంపాదించుకొన్నాడు. జన్మతో సిద్ధించిన ప్రతిభ, సహజంగా లభించిన పాండితి, ప్రవృత్తిలో భాగమైన కళా కౌశల్యం ఎక్కడైనా, ఎప్పుడైనా, ఒక వింతగా, ఒక విడ్డూరంగా, ఒక వైపరీత్యంగా తోస్తుంది. కాళిదాసు విషయంలో కట్టుకథలకు ఇదే మూలం; షేక్స్పియర్ విషయంలో విపరీతమైన సిద్ధాంతాలకు కూడా ఇదే మూలం.

ఏ రెండు చోట్ల ఒకే వర్ణక్రమంతో తన పేరు రాయనివాడు - సంతకం చేయడమైనా సరిగా చేతకానివాడు - ఇంతగా భాషపై అధికారాన్ని చూపగలడా? ఇంత గొప్ప రచనలు చేయగలడా? షేక్స్పియర్ నాటకాలుగా చెల్లుతున్నవి ఆయన రాసినవి కానేకావు. ఆ కాలంలో నటులకు, నాటక కర్తలకు సంఘంలో గౌరవస్థానం లేదు. అందువల్ల ఉత్తమ వంశానికి చెందినవారో, ఉన్నత విద్యను పొందినవారో మరొకరు తాము రాసిన నాటకాలను షేక్స్పియర్ పేర ప్రచురించి ఉండాలి; ఈ వాదం కొత్తది కాదు; దీన్ని చేస్తున్నవారు సామాన్యులైనా కారు.

పండితులైనవారే, పరిశోధకులైనవారే ఈ వాదాన్ని లేవదీశారుగాని, వారిలో వారికి ఏకాభిప్రాయం లేదు. షేక్స్పియర్ నాటకాల కర్తృత్వాన్ని వారిలో కొందరు ఫ్రాన్సిస్ బేకన్కు ఆపాదించగా, మరికొందరు క్రిస్టఫర్ మార్లోకు అంటగట్టారు. కాగా, తక్కినవారు పేర్కొనేవారిలో ముఖ్యులు - 17వ ఎర్ల్ ఆఫ్ ఆక్స్ఫర్డ్, 15వ ఎర్ల్ ఆఫ్ రట్లెండ్, ఆరవ ఎర్ల్ ఆఫ్ డెర్బీ.

తక్కువ వర్గంలోనో, కులంలోనో పుట్టినవాడు, లేదా తక్కువ చదువు చదువుకున్నవాడు ప్రతిభను, పాండితిని ప్రదర్శించడానికి వీలులేదన్న దుర్భ్రమ లేదా, దురహంకారం షేక్స్పియర్ నాటకాల కర్తృత్వాన్ని ఇందరికి అంటగట్టడానికి మూలకారణం. ఈ వెర్రి మొర్రి సిద్ధాంత రాద్ధాంతాలను వినగా, వినగా విసుగుపుట్టిన ఒక చమత్కారి చెప్పినట్టుగా "షేక్స్పియర్ నాటకాలు విలియం షేక్స్పియర్ వ్రాసినవి కావు; అదే పేరున్న మరొక వ్యక్తి రాసినట్టివి!"

జాతి మత కుల వర్గాది విభేదాలతో నిమిత్తం లేకుండా ప్రతిభను గుర్తించలేనివారి మాటకేమిగాని, మానవ స్వభావ వైవిధ్యాన్ని చిత్రించడంలో షేక్స్పియర్కు ఆయనే సాటి. హామ్లెట్, ఒథెల్లో, లీర్, షైలాక్, సీజర్, రోమియో, జూలియెట్, ఆంథోనీ, క్లియోపాత్రా, ఫాల్స్టాఫ్ - ఈ విధంగా ఎన్ని సజీవ పాత్రలను ఆయన సృష్టించలేదు? వారి ద్వారా మానవ స్వభావంలోని ఎత్తు లోతులను, వెలుగు చీకటులను, ఉచ్ఛ నైచ్యాలను, రాగ విద్వేషాలను, ఆనంద విషాదాలను ఎంత గొప్పగా వివరించలేదు?

షేక్స్పియర్లో మరొక విశేషం మరపురాని సన్నివేశాలను కల్పించడం! ఆయన పాత కథలనే, చరిత్రలోనే ఇతివృత్తాలుగా ఎన్నుకొన్నాడు. అయినా తన ప్రజ్ఞా ప్రాభవాలతో, తన ఇంద్రజాల, మహేంద్రజాలంతో వాటికి కొత్త అందచందాలను తెచ్చాడు. కొత్త అర్థాలను, అంతరార్థాలను కల్పించాడు. కొత్త ప్రయోజనాలను సాధించి, కొత్త ప్రమాణాలను నెలకొల్పాడు.

షేక్స్పియర్ ప్రజ్ఞా ప్రాభవాలను వివరించే గ్రంథాలు వేల సంఖ్యలో వెలువడినా, ఆయనను గురించి చివరి మాటను చెప్పడం జరగలేదు. ఎవరి వయస్సును బట్టి వారిని, ఎవరి సంస్కృతిని బట్టి వారిని, ఎవరి విజ్ఞతను బట్టి, రసజ్ఞతను బట్టి వారిని ఆకర్షించడం - అలరించడం - ఆయనలో కానవచ్చే విశేషాలన్నింటిలో గొప్పది.

కాళిదాసు తన జీవితకాలంలో ఎంత పేరు ప్రఖ్యాతులను పొందినాడో మనకు స్పష్టంగా తెలియదు. రచనను ప్రారంభించిన కొత్తలో మాత్రం ఆయనను చులకనచేసిన వారే హెచ్చు మంది కావచ్చు. కాకపోతే, పాతదైనంత మాత్రాన ఏదీ ప్రశస్తమైంది కానక్కరలేదని, కొత్తదైనంత మాత్రాన తృణీకరించదగింది కానక్కరలేదని హెచ్చరించవలసిన అవసరం ఆయనకు కలిగేదా? షేక్స్పియర్ విషయంలో ఆయన ప్రతిభను పూర్తిగా గుర్తించడం ఆయన మరణానంతరం చాలా కాలానికి జరిగింది. పైగా, తొలిసారిగా దాన్ని గుర్తించినవారు ఇంగ్లీషు వారు కారు, జర్మనులు!

ఏమైనా, మొత్తం ప్రపంచమే షేక్స్పియర్ ప్రతిభకు ఈనాడు జోహారు లర్పిస్తున్నది. దేశదేశాలలో ఈనాడు ఆయన చతుర్థ శత జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకొంటున్నారు.

(ఆంధ్రప్రభ 22-4-1964)

ఒక మహాకవి : మాటర్ లింక్ (బెల్జియం) భాష ప్రయోజనం భావాల వ్యక్తీకరణే కావచ్చు. కాని, ప్రతిభావాన్ని భాష వ్యక్తీకరించ గలదా? భాషకు అతీతమైన భావాలు లేవా?

వాస్తవికతను విడిచిన బ్రతుకు నేల విడిచిన సామే కావచ్చు. ఆకలి, దప్పిక, అర్థం, కామం, కష్టం, సుఖం - ఇవెంతటి వాస్తవిక విషయాలు! కాని, జీవితం కేవలం ఇట్టి వాటికే పరిమితమైన దనగలమా? వీటిని మించికూడా బ్రతుకును నడిపే అనిర్వచనీయ శక్తులు లేవా?

జన్మతోనే మన జీవితం ప్రారంభమౌతుందా? మరణంతో అది సమాప్తి చెందుతుందా? జన్మకు పూర్వమేమి, మరణానంతరమేమి సర్వం శూన్యమేనా?

ఈ ప్రశ్నలు ఈనాటివికావు. మానవుడు జిజ్ఞాసువైన నాటినుంచీ అతనిలో ఇవి పదే పదే ఉదయిస్తున్నాయి; ఆ నాటినుంచీ వీటికి ఎవ్వరికి తోచిన ప్రత్యుత్తరాలను వారు పేర్కొంటూనే ఉన్నారు.

## ఒక మహాకవి : మాటర్ లింక్ (బెల్జియం)

ఈ ప్రత్యుత్తరాలను చెప్పిన వారిలో కొందరు తత్త్వవేత్తలైతే మరికొందరు కవిశేఖరులు. వేరొక కొందరు ఏకసమయంలో కవి శేఖరులు, తత్త్వవేత్తలు కూడా. ఈ మూడవ వర్గానికి చెందినవాడే, - మొన్న 6వ తేదీని నీస్లో కన్నుమూసిన మాటర్ లింక్.

ఆయన బెల్జియం దేశస్థుడు. జననం 1862 ఆగష్టు 29వ తేదీని ఘెంట్లో. విద్యాభ్యాసం స్వదేశంలోనే. మనస్కరించని న్యాయవాద వృత్తిని బహు కొద్దికాలంపాటు సాగించింది కూడా స్వదేశంలోనే. ఆ తర్వాత ఆయన జీవితంలో అధిక భాగం గడిపిందీ, చివరికి పరమపదించిందీ ఫ్రాన్సులో. ఆయన రచనలు సాగించింది కూడా ఫ్రెంచి భాషలోనే.

ఫ్రాన్సులో జీవితాన్ని గడిపి, ఫ్రెంచి భాషలో రచనలను సాగించినా, మాటర్ లింక్ జీవితపు వ్రేళ్ళు బెల్జియం జాతీయ జీవితంలో నాటుకొన్నట్టివే. అంచేత ఆయన బెల్జియన్ జాతీయకవి.

ఆయన రచనలు అనేకం. నాటకాలు, నాటికలు, పద్యాలు, వ్యాసాలు మొదలైన వాటిని ఎన్నింటినో ఆయన ప్రచురించాడు. తొలిరచన వెలువడగానే ఆయనను "బెల్జియన్ షేక్స్పియర్" అని ఒక విమర్శకుడు భూషించాడు. త్వరలోనే ఆయన ప్రపంచ విఖ్యాతుడైనాడు. 1911లో నోబెల్ బహుమానం ఆయన కివ్వబడింది.

కొంచెం హెచ్చుతగ్గుగా ఇదే సమయంలోనే మన రవీంద్రనాథ్ టాగోర్కు కూడా నోబెల్ బహుమాన మివ్వబడింది. ఒకరు పాశ్చాత్య ప్రపంచానికి, మరొకరు ప్రాచ్య ప్రపంచానికి చెందినవారైనప్పటికీ, వీరిద్దరు దాదాపు ఒకే సమయంలో ఈ విధంగా సమ్మానితులు కావడం కాకతాళీయ సంఘటన కాదు.

క్రీస్తుశకం పందొమ్మిదవ శతాబ్దం భౌతికశాస్త్ర వికాస శతాబ్దం. హేతువాదం ఈ శతాబ్దానికి పునాది. ఆ పునాదిపైనే ఖగోళ, భూగర్భ, రసాయన, పదార్థ విజ్ఞానాది శాస్త్ర మహాసౌధాలు లేచాయి. వాటి వైభవోన్నతులు మానవుని సమ్మోహితుని చేశాయి. ఈ నిర్మాణం ఇదే విధంగా సాగితే తాను అందుకోలేని ఎత్తులు లేవని అతనికి తోచింది. అంతట అతడు విశ్వాసం (ఫెయిత్) అజ్ఞానానికి పర్యాయ పదమని

తీర్మానించుకున్నాడు; అద్భుతం (వండర్) అవిద్యా ఫలితమని నిర్ణయించుకున్నాడు; మేధ కందనిది మిథ్య మాత్రమేనని స్థిరీకరించుకున్నాడు. పైకి కూడా ప్రసరించింది. దీని ఫలితంగా

ఈ మనఃస్థితి ప్రభావం సహజంగా సాహిత్యరంగం రచనలలో "వాస్తవికతావాదం" (రియలిజం), సహజవాదం (న్యాచురలిజం) పెల్లుబికాయి. ఫ్రాన్సులో ఒక జోలా, బ్రిటన్లో ఒక హార్డీ, రష్యాలో ఒక షెకవ్, నార్వేలో ఒక ఇబ్సెన్ మహాకవులైనారు. వీరి ప్రతి రచన ఒక జీవిత ఖండం (స్లయిస్ ఆఫ్ లైఫ్) గా పరిణమించింది.

ఎట్టిదైనా, ఆ రచనలో ఏదో ఒక మహాకవి రచన చేసినప్పుడు జీవితంపట్ల ఆయన దృక్త ప్రత్యేకత - ఏదో ఒక విశిష్టత - తప్పక కానవస్తుంది. కాని, తదన్యులు జీవితానికి "ఫోటోగ్రాఫు"

తలెత్తినట్టుగా రాయనారంభించగానే వచ్చే రచనలు దైనందిన జీవితంవలె నిస్సారమైనవే కాగలవు; అర్థరహితమైనవే కాగలవు; రసవిహీనమైనవే కాగలవు; జుగుప్సాకరమైనవే కాగలవు.

ఇట్టి రచనలపై పందొమ్మిదవ తుదిభాగంలో తిరుగుబాటు ప్రారంభమై ఇరవయ్యో శతాబ్ది తొలి దశాబ్దంలో అది ఒక పరిణతికి వచ్చింది. ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహించినవారే పాశ్చాత్య ప్రపంచంలో మాటర్ లింక్, ప్రాచ్య ప్రపంచంలో రవీంద్రనాథ్ టాగోర్ వీరితో సమానంగా ఎన్నదగిన మరొక మహాకవి - విలియం బట్లర్ యేట్స్ (ఐర్లెండ్).

వీరు ముగ్గురు కూడా వాస్తవికతను చీల్చుకుని, దానికి ఆవలగల "సత్యమ్, శివమ్, సుందరమ్" - వీటిని సాక్షాత్కరింప జేసుకొనడానికి సాధన చేసినవారే.

"ఏది మహాకవిత" అని ఒక సందర్భంలో ప్రశ్నించి, అందుకు మాటర్లింక్ చెప్పిన సమాధాన మిది :

"శ్రద్ధాళువులమై పరిశీలిస్తే, మహాకవిత కింది ప్రధానాంశ త్రయసమేతమైనదని మనకు తెలియవస్తుంది. మొదటిది - పదసౌందర్యం; ఆ వెనక - మనచుట్టూ, మన లోపల దేన్ని చూస్తున్నామో దాన్ని గురించిన జిజ్ఞాస; దాని భావుకచిత్రణ; దీన్నే మరొక విధంగా చెప్పాలంటే, ప్రకృతి పరిశీలన, భావనాజగత్తులో విహారం; తుదకు - తన కల్పనలు ఏ అజ్ఞాతజగత్తులో ఉద్భవిస్తాయో, తన కల్పనామూర్తుల బ్రతుకును, భావిని ఏ అనిర్వచనీయ శక్తులు శాసిస్తాయో, ఆ జగత్తు వాతావరణంతో, ఆ శక్తుల స్పందనంతో తన రచనలకు మేలిముసుగు కూర్పు. ఈ మూడింటిలో చివరిదే అతి ముఖ్యాంశమనడంలో నాకు ఎంతమాత్రం సందేహం లేదు".

ఇట్టి విశ్వాసం కలవాడు కనకనే మాటర్‌అంక్ వాస్తవికతా వాదానికి ఎంత దూరంగా పోవచ్చునో, అంత దూరానికే పోయాడు; "సింబాలిజం"తో, "మిస్టిసిజం"తో ఎంత సామీప్యాన్ని సాధించ వచ్చునో, అంత సామీప్యాన్నీ సాధించాడు.

ఆయన నాటకాలన్నీ - ఒక్క "మోనా వానా" తప్ప సామాన్య పదాల సామాన్యార్థాలకు అతీతమైన అర్థాన్ని సామాన్య జీవితపు సామాన్య ప్రయోజనానికి అతీతమైన ప్రయోజనాన్ని లక్షించినట్టివే.

పలుకులద్వారా ఆయన రచనను సాగించినప్పటికీ, పలుకుకంటే మౌనం భావ స్ఫోరకమైనదని ప్రవచించాడు.

ప్రేమ, వియోగాలనే, ఆశ నిరాశలనే కథా వస్తువులను చేసుకున్నప్పటికీ, తన పాత్రలను వాటికి అతీతమైన - అగ్రాహ్యమైన - శక్తుల చేతులలో కీలుబొమ్మలను చేశాడు.

(ఆంధ్రప్రభ 13-5-1949).

## పోప్ జాన్

ఆయన పుట్టింది నిరుపేద రైతు గృహంలోనే కావచ్చు. తనకు ముందు పోప్లవలె క్రైస్తవ మత గ్రంథాలను, సిద్ధాంతాలను విస్తృతంగా, నిశితంగా అధ్యయనం చేసి ఉండక పోవచ్చు. 77 సంవత్సరాల వృద్ధాప్యంలో పోప్ ఎన్నిక అయ్యేవరకు తన పేరు నలుగురికి తెలియదగినంతగా ఆయన గొప్ప పనులేవీ చేసి ఉండక పోవచ్చు. 1958లో ఆయన ఎన్నిక సయితం తాత్కాలికమేనని కొందరు భావించి ఉండవచ్చు. ఇంతకూ, ఆయన పేపల్ సింహాసనంపై కూర్చుని అయిదు సంవత్సరాలైనా పూర్తిగా కాకపోయి ఉండవచ్చు. అయినా, నిన్న పరమపదించిన పోప్ జాన్ ఈ నాలుగైదు సంవత్సరాల పరిపాలనా కాలంలోనే ఆధునిక ప్రపంచపు మహా పురుషులలో ఒకరుగా లెక్కించబడ్డారు. ఈ స్వల్ప వ్యవధిలోనే ఆయన పేరు క్రైస్తవమత చరిత్రలోనే శాశ్వతంగా లిఖింపబడదగిన ప్రఖ్యాతిని గడించుకొన్నది. దీనికి ఆయన వ్యక్తిగత గుణగణా లెంతవరకు కారణమో, రోమన్ కాథలిక్ మతాధినేతగా ఆయన సాధించిన ఘన విజయాలుకూడా అంతే కారణం.

వ్యక్తిగా పోప్ జాన్ అతి నిరాడంబరుడు. తనకు పదవి రీత్యా సంక్రమించిన ఆడంబర బిరుదాలన్నిటిని త్యజించి "సెర్వన్ సెర్వోదమ్ దీ" (దైవ దాసానుదాసుడు) అనే దాన్ని మాత్రమే ఆయన ఉపయోగించుకొన్నారు. తన తోటమాలితో కలిసి విందారగించడానికి ఆయనకు పేపల్ సంప్రదాయాలు అడ్డురాలేదు. ప్రెసిడెంట్ కెనెడీ సతి ఆయనను చూడరాగా, "మిసెస్ కెనెడీ" "మదామ్ కెనెడీ" అనే గౌరవ వాచకాలతోకాక, "జాక్విలైన్" అని ఆప్యాయతను సూచించే విధంగా ఆమె అసలు పేరుతోనే ఆయన సంబోధించారట.

ఈ వైయక్తిక గుణాల కంటె ఆయనకు శాశ్వత కీర్తిని గడించగలిగినవి పోప్ ఆయన సాధించిన విజయాలే. ప్రేమ, కరుణ, దయ మొదలైన ప్రాథమిక నైతిక విశ్వాసాల విషయం ఎలా ఉన్నా, సృష్టి, దాని పరిణామం, మానవుడు, భౌతిక జగత్తు మొదలైన వాటిపట్ల తన దృక్పథంలో మాత్రం క్రైస్తవమతం ఇంకా మధ్య యుగాలలోనే ఉండి పోయింది. మానవుడు ప్రకృతి శక్తులను తనకు సహాయకరంగా ఉపయోగించుకొనడం నేర్చుకొన్న తరువాత, అణువును ఛేదించి అద్భుత శక్తులను విడుదల చేయగలిగిన పిదప, రోదసిలోని కెగసి సుదూర గ్రహాలనే తన గృహాలుగా మార్చుకొనాలని కలలు కంటున్న నేటి కాలంలో క్రైస్తవ సిద్ధాంతాలు మాత్రం ఇంకా వెనుక చూపే చూస్తున్నవి. ఈ పరిస్థితిని మార్చడానికి, క్రైస్తవాన్ని వాస్తవానికి సన్నిహితంగా తీసుకురావడానికి పోప్ జాన్ ప్రయత్నించారు.

గత సంవత్సరం 2,600 మంది బిషప్పులతో పోప్ జాన్ సమావేశం చేసిన "ఎక్యుమెనికల్ కౌన్సిల్"ను మార్టిన్ లూథర్ ప్రారంభించిన మత సంస్కరణ తర్వాత అంతటి ముఖ్య సంఘటనగా పరిగణించవచ్చు. కాథలిక్ మతస్థులలో ఐకమత్యాన్ని సాధించడానికి, వారిలో నేటి కాలానికి అనుగుణమైన మార్పులను తీసుకు రావడానికి పోప్ జాన్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇది మున్ముందు విప్లవాత్మకమైన మార్పులకు దారితీయవచ్చు.

కేవలం మత విషయిక సమస్యలపైనేకాక, ప్రపంచ శాంతి, దేశాల మధ్య సహజీవనం, పరస్పర సహనం మొదలైన ఆధునిక సమస్యల పట్ల పోప్ జాన్ అభిప్రాయాలు కూడా ఆయనను రాజకీయ భేదాలతో నిమిత్తం లేకుండా సర్వులకు ప్రీతిపాత్రుడుగా చేయగలిగాయి. అందుకే ఆయన మృతికి దేశ దేశాల అధినేతలతో పాటు, కాథలిక్ మతస్థుడైన ప్రెసిడెంట్ కెనెడీతో పాటు సోవియెట్ అధినేత కృశ్చేవ్ సయితం సంతాపం వెలిబుచ్చారు. భవిష్యత్తును నిర్మించుకొనడానికి ధైర్యాన్ని ఆయన మనకు ప్రసాదించారని కెనెడీ, ఆయన శాంతి సాధన కృషిని ఎన్నటికి మరువలేమని కృశ్చేవ్ చేసిన ప్రకటనలతో మనం హృదయపూర్వకంగా ఏకీభవించవచ్చు. (ఆంధ్రజ్యోతి 6-6-1963)

## ఆల్డస్ హక్స్ లీ

ఆంగ్ల సాహిత్యాభిమానులకు, ముఖ్యంగా భారతీయ మేధావులకు సంతాపం కలిగించగల మరొక వార్త ఆల్డస్ హక్స్డ లీ మరణం. సుమారు నలభై యేళ్ళకు పైగా ప్రపంచ సాహిత్యంలో ఆయనదొక విశిష్ట స్థానం. నవలాకారుడుగా, నాటకకర్తగా ఆయన కీర్తి అజరామరం.

ఆల్డస్ హకీ మేధావుల కుటుంబంలోనుంచి వచ్చినవాడు తల్లివైపు పూర్వీకులు రగ్బీ హెడ్మాస్టరుగా ప్రసిద్ధుడైన ఆర్నాల్డ్, ప్రముఖ విమర్శకుడు మాథ్యూ ఆర్నాల్డు కాగా, స్వయాన పితామహుడు ఆంగ్ల జీవశాస్త్రవేత్త థామస్ హక్సీలీ : అన్న మరొక ప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు జూలియస్ హకీ. వీరందరి ప్రతిభావిశేషాలను పుణికి పుచ్చుకొన్న ఆల్డస్ హక్సీ తడవి చూడని విషయంలేదు. జీవశాస్త్రం, వైద్యశాస్త్రం, తత్త్వశాస్త్రం, సాహిత్యం, పత్రికా

వ్యాసంగం, రాజకీయాలు మొదలైన పెక్కింటిపై, ఆయన జన్మసిద్ధమైన దృష్టిమాంద్యంవల్ల జీవితాంతం బాధపడుతూనే, తన ప్రజ్ఞాదృష్టిని ప్రసరింపజేశారు.

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ఆనాటి మేధావులందరివలెనే ఆయన కూడా నిస్పృహకు, నిరాశకు లోనయ్యారు. ఆ రోజులలో ఆయన వ్రాసిన నవలలు సమకాలిక పరిస్థితులను వ్యంగ్యంగా చిత్రించాయి. వైజ్ఞానికంగా అభివృద్ధి సాధిస్తున్న మానవుడు ఆధ్యాత్మికపు విలువలను విస్మరిస్తే ఎట్టి అధఃపతనానికి లోను కాగలడో "బ్రేవ్ న్యూ వరల్డ్" అనే నవలలో చిత్రించిన "యుటోపియా" కు పూర్తిగా భిన్నమైన మరొక రకం సమాజ వ్యవస్థను, ఆదర్శప్రాయమైన దాన్ని ఆయన ఇటీవల రచించిన "ఐలెండ్" అనే నవలలో వర్ణించాడు. పాశ్చాత్యుల విజ్ఞానశాస్త్రం, ప్రాచ్య దేశాల తాత్త్విక దృక్పథం మేళవించిన జీవితమే ఆదర్శప్రాయమైనదని ఆయన ఈ నవలలో ప్రతిపాదించాడు. భగవద్గీతలో బోధించిన అనాసక్తయోగం, ఉపనిషత్తుల వేదాంతం సమస్త జీవిత సమస్యలకు పరిష్కార మార్గం చూపగలవని ఆయన వ్యక్తిగత విశ్వాసం. ఈ విశ్వాసాన్నే ఆయన తన వ్యాసాలలో, నవలలో పదే పదే వ్యక్తం చేశాడు. ఆయన మరణంతో సమకాలిక మేధాప్రపంచంపై విశేష ప్రభావం కనబరచిన ఒక ప్రతిభాశాలిని ఆంగ్ల సాహిత్యం కోల్పోయింది. (ఆంధ్రజ్యోతి 26-2-1963).

## లూయి ఫిషర్

లూయి ఫిషర్ నిర్యాణంతో భారతదేశం ఒక ఉత్తమ మిత్రుని కోల్పయింది. ఈ అమెరికన్

జర్నలిస్టు, ఈ రచయిత గుండె జబ్బుతో నిన్ననే ఆకస్మికంగా కన్నుమూశాడు.

ఆయన జననం, విద్యాభ్యాసం ఫిలడెల్ఫియాలో, 1921వ సంవత్సరంలో "న్యూయార్క్ పోస్ట్" పత్రికకు బెర్లిన్ విలేకరిగా వెళ్ళాడు. ఆటుపిమ్మట ఆయన ఎక్కువకాలం పనిచేసింది మాస్కోలో. సోవియెట్ వ్యవస్థను, విధానాలను ఆయన శ్రద్ధాసక్తులతో అధ్యయనం చేశాడు. సోవియెట్ వ్యవహారాలలో ప్రవీణుడన్న ఖ్యాతిని గడించుకున్నాడు.

యూరప్ లోనేకాక, ఆసియాలో కూడా ఆయన విశేషంగా పర్యటన చేశాడు. ఆసియన్ దేశాలలో ఇండియాపట్ల ఆయనకు ప్రత్యేక ప్రేమాభిమానాలు కుదురుకున్నాయి.

భారతీయ నాయకులలో గాంధీజీకి ఆయన భక్తుడు. 1942 లో సేవాగ్రాంలో ఒక వారం పాటు గాంధీజీతో చర్చలు జరిపిన పిమ్మట "ఎ వీక్ విత్ గాంధి" అనే గ్రంథాన్ని ఫిషర్ ప్రచురించాడు. రెండవ ప్రపంచ యుద్ధంపట్ల గాంధీజీ వైఖరిని అర్థం చేసుకొనడానికి అప్పటిలో ఈ చిన్ని పుస్తకం ప్రపంచానికి విశేషంగా తోడ్పడింది.

గాంధీజీ హత్య తర్వాత ఆయన జీవితాన్ని "ది లైఫ్ ఆఫ్ మహాత్మా గాంధి" అనే పేరుతో ఫిషర్ వ్రాశాడు. గాంధీజీ జీవిత చరిత్రలలో - ముఖ్యంగా అమెరికన్లు వ్రాసినవాటిలో ఇది ఉన్నతశ్రేణికి చెందినట్టిది. "మెన్ అండ్ పోలిటిక్స్" అనే పేరుతో తన ఆత్మకథను ప్రచురించిన ఫిషర్ కొంత వరకు ఆత్మకథ ధోరణిలోనే "దిస్ ఈజ్ అవర్ వరల్డ్" అనే పుస్తకాన్ని 1956లో రచించాడు. దీన్ని ఆయన "అన్ని దేశాలలోని గాంధేయులకు" అంకితం చేయడం ప్రత్యేకించి. గమనించదగు విశేషం.

గాంధీజీని ఎంతగా ప్రేమించాడో, ఎంతగా గౌరవించాడో అంతగా స్టాలిన్ పట్ల ఫిషర్ వైముఖ్య వైమనస్యాలను చూపినట్టు చెప్పవచ్చు. వారిద్దరి జీవితాలను, సందేశాలను తులనాత్మకంగా పరిశీలిస్తూ "గాంధి అండ్ స్టాలిన్" అనే గ్రంథాన్ని ఆయన వ్రాశాడు కూడా. స్టాలిన్ నిజస్వరూపం ప్రపంచానికి తెలియకముందే దాన్ని ఫిషర్ అవగతం చేసుకోగలిగాడు.

జవహర్లాల్ పట్ల వైముఖ విద్వేషాలు లేకపోయినా, ఆయనను ఫిషర్ హర్షించలేక పోయాడు. అగ్రరాజ్యకూటాల మధ్య మధ్యవర్తిగా వ్యవహరించి, మానవోద్ధారకుడుగా ప్రపంచ చరిత్ర పుటలలో స్థానం సంపాదించుకొనవలెనన్న తాపత్రయంతో ఆయన కొన్ని పొరపాట్లు చేసినట్టు ఫిషర్ నమ్మకం.

ప్రజాస్వామ్యవాదిగా ప్రజాస్వామ్య దేశాలపట్ల మొగ్గు చూపవలసిన నెహ్రూ సోవియెట్ వర్గాన్ని ఎంతో కొంత హెచ్చుగా అభిమానించినట్టుగా కూడా ఆయన విశ్వాసం.

నెహ్రూ విధానాలనే కాక, ఆయన వ్యక్తిత్వాన్ని కూడా ఫిషర్ హర్షించలేకపోయాడు. నెహ్రూ "అహంకారి" అని ఆయన అభిప్రాయం.

ఈ అభిప్రాయాలను త్రోసిపుచ్చినా, ఫిషర్కు మన దేశంపట్ల వున్న ప్రేమాభిమానాలను త్రోసిపుచ్చలేము. ప్రపంచంలో ప్రజాస్వామ్య శక్తుల పరిరక్షణకు ఇండియాలో ఆ శక్తులను బలపర్చడం ముఖ్యావసరమని ఆయన చిత్తశుద్ధితో భావించాడు.

లూయి ఫిషర్ నిర్యాణంద్వారా భారత దేశం ఒక పరమమిత్రుని కోల్పోవడమే కాక, ప్రపంచం ఒక నిష్కళంక ప్రజాస్వామ్యవాదిని కోల్పోయింది. (ఆంధ్రజ్యోతి 19-1-70)

## "ఆమ్బుడ్సమన్"

నార్వే, స్వీడన్, డెన్మార్క్, ఐస్లాండ్ - ఈనాలింగంటిని శ్కాండినేవియన్ దేశాలంటారు. ఇవి సుపరిపాలనకు పేరందిన దేశాలు. సహకార ప్రాతిపదికపై నవసంఘనిర్మాణం వీటి పరమ లక్ష్యం. ఈ లక్ష్య సాధనలతో ఇవి చాలావరకు విజయాన్ని సాధించాయి.

జాతీయాభ్యున్నతికి ఎవరేమి ప్రయత్నాలు చేసినా, పథకాలను అమలు జరిపినా, అవినీతికి తావులేని సుపరిపాలన ముఖ్యావసరం. లేకపోతే, ప్రస్తుతం మన దేశంలో జరుగుతున్నట్టు ధనవంతులు మరింత ధనికులు కావడం, పేదవారు మరింత పేదరికంలో పడిపోవడం తటస్థిస్తుంది. శ్కాండినేవియన్ దేశాలలో అవినీతి అసలే లేదనలేము గాని, ఇతర చోట్ల కానవచ్చే దానికంటే చాలా తక్కువ. తక్కిన దేశాలతో పోల్చినప్పుడు తమ దేశాలలో అవినీతి తక్కువన్న సంతృప్తితో దాన్ని శ్కాండినేవియన్ నాయకులు నిర్లక్ష్యం చేయడంలేదు. సమూలంగా దాన్ని రూపుమాపడానికి నిరంతరం యత్నిస్తున్నారు.

ఐస్ ల్యాండ్ మాట తెలియదుగాని, మిగిలిన మూడు శ్కాండినేవియన్ దేశాలలో అవినీతి నిర్మూలనకు ఒక కొత్త పద్ధతిని అవలంబించారు. సరాసరి పార్లమెంటుకు మాత్రమే ఉత్తరవాది కాగల పద్ధతిపై ఒక ఉన్నతోద్యోగిని "ఆమ్బుడ్స్మన్" అనే పేరుతో నియమించడమే ఈ కొత్త పద్ధతి.

అవినీతిపై యుద్ధానికి ఈ ఉన్నతోద్యోగిని మన దేశంలో కూడా నియమించడం అవసరమనే భావం ఈ మధ్య ప్రబలుతున్నది. రాజస్తాన్ ప్రభుత్వానికి అది నియమించిన ఒక దర్యాప్తు సంఘం ఈ సూచనను చేసింది. అవినీతిని గురించి విచారణ చేస్తున్న సంతానం కమిటీ కూడా కేంద్ర ప్రభుత్వానికి తాను అందజేసిన తొలి

తాత్కాలిక నివేదికలలో దాదాపు ఇదే విధమైన సూచన చేసినట్టు తెలుస్తున్నది. ఈ పరిస్థితిలో "ఆమ్బుడ్స్మన్" పదవిని గురించి, ఆ పదవిని ఆక్రమించే ఉన్నతాధికారి హక్కులను గురించి, బాధ్యతలను గురించి మనం సవివరంగా తెలుసుకొనవలసి వున్నదని ప్రత్యేకించి చెప్పనక్కర లేదు.

నార్వే, స్వీడన్లలోని "అమ్బుడ్సమెన్" విషయమై వివాదాలు మాకు తెలియవుగాని, డెన్మార్క్లోని ఈ ప్రత్యేకాధికారిని గురించి "న్యూ స్టేట్స్మన్" వారపత్రిక ఈ మధ్యనే ప్రచురించిన వ్యాసం మా దృష్టిని ఆకర్షించింది. మేము నేడు పేర్కొంటున్న వివరాలు దానిలోనివే.

డేనిష్ "ఆమ్బుడ్సమన్" ఎనిమిదేళ్ళుగా తన పదవిని నిర్వహిస్తున్నాడు. పార్లమెంట్ ఆయనను నియమించినందున దానికి ఆయన అధికారం విస్తరించదు; న్యాయస్థానాలకు విస్తరించదు; స్వపరిపాలనాధికారంతో కూడిన స్థానిక సంస్థలకు సయితం విస్తరించదు. పోతే, ప్రభుత్వ శాఖలన్నీ ఆయన పరిశీలనలో వుంటాయి. అన్ని మంత్రిత్వశాఖలు, వాటి సిబ్బంది, అందరు మంత్రులు, వారికింద పనిచేసే ఉద్యోగులు - వీరందరు ఆయన పర్యవేక్షణలో వుంటారు. సాయుధబలాలు, పోలీసుదళాలు, జైళ్ళసిబ్బంది, ఆసుపత్రుల అధికారులు వీరందరికి ఆయన పర్యవేక్షకాధికారం విస్తరిస్తుంది.

ఎవరైనా సరే ఆయనకు ఫిర్యాదు చేసుకోవచ్చు. శిక్ష అనుభవిస్తున్న ఖైదీ ఫిర్యాదు చేసుకోవాలంటే, అతని లేఖను జైలు అధికారులు "సెన్సార్" చేయరాదు. తనకు ఫిర్యాదు చేరకపోయినా, ఎవరికైనా అన్యాయం జరిగినట్టు విన్నా, ఎవరైనా అవినీతికి పాల్పడినట్టు తెలిపినా, తనంతగా ఆయన ఆ విషయాన్ని గురించి దర్యాప్తు చేయవచ్చు. దేశరక్షణకు, భద్రతకు సంబంధించిన రహస్య పత్రాలు మినహాగా, తన దర్యాప్తుకు అవసరమైన అన్ని రికార్డులను ఆయన పరిశీలించ వచ్చు.

శాసనాలలోగాని, పరిపాలనలోగాని లోపాలున్నట్టు తన దర్యాప్తుల సందర్భంలో ఆయనకు కానవస్తే వాటి తొలగింపుకు చర్య గైకొనవలసిందిగా ఆయన పార్లమెంటుకు నివేదించవచ్చు. సాక్ష్యమివ్వడానికి రావలసిందిగా ఎవనికైనా సరే సమనులు పంపడానికి ఆయనకు హక్కువున్నది. స్వయంగా "డిఫెన్స్" పెట్టుకొనలేని వారికి న్యాయవాదుల ఖర్చులను ప్రభుత్వమే భరించాలని చెప్పడానికి సయితం ఆయనకు అధికారం వున్నది.

మంత్రులైనవారు బంధుప్రీతినో, ఆశ్రిత పక్షపాతబుద్ధినో చూపినట్టు రుజువైతే, వారిపై కేసు పెట్టవలసిందిగా "ఆమబడ్స్మన్" పార్లమెంటుకు సిఫారసు చేయవచ్చు; చట్టవిరుద్ధంగా వారు ప్రవర్తించినట్టు నమ్మడానికి ఆధారాలుంటే, వారిపై క్రిమినల్ కేసులు పెట్టవలసిందిగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ను ఆదేశించవచ్చు. ఉద్యోగులు

తమ ధర్మాలను సరిగా నిర్వహించకపోతే, వారిపై క్రమశిక్షణ చర్యను జరపవలసిందిగా ఆయా శాఖాధిపతులను ఆదేశించవచ్చు.

డెన్మార్క్ "అమ్బుడ్సమన్"కు ఇంత విస్తృతాధికారాలున్నా, వాటిని వినియోగించవలసిన అవసరం ఇంతవరకు కలగకపోవడం గమనార్హం. అవినీతి ఆ దేశంలో ఎంత తక్కువో ఈ విషయాన్నిబట్టే స్పష్టపడుతున్నది. అయితే, అక్కడ "అమ్బుడ్సమన్"కు అసలే పనిలేదని కాదు. సాలుకు దాదాపు వెయ్యి ఫిర్యాదులు ఆయనకు వస్తున్నాయి వీటిలో నూటికి 35 వంతులను మాత్రమే ఆయన విచారిస్తూ వుంటాడు.

ఇందుకు కారణం- ఫిర్యాదు చేయవలసినవారు ఆ సందర్భంలో పాటించవలసిన నియమా లన్నింటిని పాటించక పోవడమే. ఫిర్యాదు కారణం పుట్టిన తర్వాత ఏడాది లోపల.

“అమ్బుడ్స్మన్"కు ఫిర్యాదు చేసుకోవాలి. ఆకాశ రామన్న ఉత్తరం ధోరణిలో ఫిర్యాదు చేయక, బాహాటంగా ముందుకు రావాలి. ఫిర్యాదు చేసుకొనడానికి ముందు న్యాయం జరగడానికి తనకున్న అవకాశాలన్నింటిని పూర్తిగా వినియోగించుకోవాలి. సాలీనా వచ్చే వెయ్యి ఫిర్యాదులలో ఈ నియమాలన్నింటిని పాటిస్తున్నట్టివి 350 మాత్రమే.

1961-62 లో డేనిష్ “అమ్బుడ్స్మన్” 167 ఫిర్యాదులను దర్యాప్తు చేశాడు. వీటిలో 48 ఫిర్యాదుల సందర్భంలో ఆయన ప్రభుత్వచర్యలను విమర్శించాడు; పదహారు కేసులలో ప్రభుత్వానికి ఆయన కొన్ని సూచనలు చేశాడు. తక్కిన సంవత్సరాలలో కూడా దాదాపు ఇంతే జరిగింది.

దురుసుగా కాక, మర్యాదగా, మృదువుగా డేనిష్ "అమ్బుడ్స్మన్” తన విధులను నిర్వర్తిస్తున్నాడు. " ఈ విధంగా చేస్తే మరింత సముచితంగా వుండేది, లేదా, “ ఇది పూర్తిగా విమర్శనీయమని నా అభిప్రాయం”: ఈ విధమైన పదజాలాన్నే ఆయన వాడుతున్నాడు. తనంత తానుగా ఎవ్వరినీ ఆయన శిక్షించలేడు; ఎవ్వరిపై క్రమశిక్షణ చర్య గైకొనలేడు. నష్టపరిహారమిప్పించే అధికారమైనా లేదు. అయితే, ఆయన నివేదికను పత్రికలు ప్రముఖంగా ప్రచురిస్తున్నాయి; పార్లమెంటు వాటికి ప్రాధాన్యమిస్తున్నది. మొత్తం పై ప్రజాభిప్రాయం ఆయనను పూర్తిగా బలపరుస్తున్నది. ఈ బలంతోనే ఆయన పరిపాలనలో అవినీతిని నిరోధించ గలుగుతున్నాడు. శ్కాండినేవియన్ దేశాలలోని “అమ్బుడ్స్మన్” నియామకం పద్ధతి సత్ఫలితాల నిస్తున్నదని న్యూజిలాండ్ దాన్ని అనుసరిస్తున్నది. ఇది మన దేశానికి కూడా పూర్తిగా అనుసరణీయమని మా నమ్మకం. నిజానికి ఈ విషయంలో మనం అకారణంగా ఆలస్యం చేసినామేమో! ఇకనైనా త్వరపడి కేంద్రంలోనేకాక, రాష్ట్రాలలో కూడా "అమ్బుడ్స్మెన్” నియామకానికి తగు చర్యలను

(ఆంధ్రజ్యోతి 19-10-1963) ప్రారంభించాలి.

# ప్రొఫెసర్ ఎర్ హార్డ్

డాక్టర్ అడెనోవర్ స్థానంలో పశ్చిమజర్మనీ ఫెడరల్ రిపబ్లిక్ ఛాన్సలర్గా నిన్న ఎన్నికైన ప్రొఫెసర్ లుడ్విగ్ ఎరోర్డ్ రాజకీయాలలో ప్రవేశించడం తలవని తలంపుగా జరిగింది. 1945లో ఒక నాటి ఉదయం ఒక జీప్ మ్యూనిక్లో ఆయన యింటిగుమ్మం ముందు నిలిచింది. అమెరికన్ సైనికోద్యోగులు కొందరు దానిలోనుంచి దిగి, ఎందుకో, ఎక్కడికో చెప్పకుండానే ఎరోర్డ్ను వెంటబెట్టుకు వెళ్ళారు. తనకు రాజకీయాలతో ఏ విధమైన సంబంధం లేదు. నాజీలతో తానెన్నడు పొత్తు పెట్టుకున్నవాడు కాదు. అయినా, తనను అమెరికన్ సైనికొద్యోగులు ఎందుకో అరెస్టు చేస్తున్నట్టు ఎరోర్డ్ భావించాడు. నిజానికి అది అరెస్టు కాదు. ఆర్థిక శాస్త్రంలో ఎర్డ ప్రవీణుడని అమెరికన్లు విన్నారు. నాజీలకు, వారి ప్రభుత్వానికి ఆయన దూరంగా వున్నట్టు కూడా విన్నారు. తాము బవేరియాలో నెలకొల్పదలచిన తాత్కాలిక ప్రభుత్వానికి ఆర్థిక.

మంత్రిగా ఆయన ఉపకరించగలడని వారు భావించారు. అందుకే హఠాత్తుగా ఆయన యింటికి పోయి, హుటాహుటిగా ఆయనను జీప్లో యెక్కించుకు వెళ్ళారు.

చిత్రమైన ఈ పరిస్థితులలో తాను రాజకీయాలలో ప్రవేశించడం జరిగింది. కనుకనే ప్రొఫెసర్ ఎర్డ "అమెరికన్ ఇన్వెన్షన్"గా తనను తాను వర్ణించుకొంటాడు. తనపై తాను విసురుకొనే ఈ ఛలోక్తి ద్వారానే ఆయన ప్రవృత్తిని కొంతవరకు మనం తెలుసుకోవచ్చు. డాక్టర్ అడెనోవర్ వలె ప్రొఫెసర్ ఎరోర్డ్ తన మాటే నెగ్గవలెనన్న పట్టుదలకు పోడు, తనది కారణజన్మగా భావించడు. ధర్మావేశంతో ఆయన వ్యవహరించడు. ఆయనలో కలుపుగొట్టు తనం హెచ్చుగా కానవస్తుంది. సూత్రాలకు, సిద్ధాంతాలకు సంబంధించిన విషయాలలో ఆయన నిశ్చల చిత్తాన్ని ప్రదర్శించగలడు. ఇతర సందర్భాలలో అన్యులను సంతృప్తి పరచడానికై వారి భావాలకు అనుగుణంగా వర్తించగలడు. డాక్టర్ అడెనోవర్ అభిప్రాయాలతో ఏకీభవించలేకపోయినా, ఆయన కోరినట్టు ప్రొఫెసర్ ఎరోర్డ్ వ్యవహరించిన సందర్భాలనేకం. ఇందువల్ల కొందరు ఎరార్డ్ను "రబ్బర్ పులి" అనడం కద్దు. అడెనోవర్ సయితం ఆయనను గురించి "కాగితపు పులి" అని ఒకసారి చులకనగా మాట్లాడినట్టు చెబుతారు.

ఇంతమాత్రంచేత ప్రొఫెసర్ ఎరోర్డ్ దృఢ ప్రవృత్తిలేని వాడని భావించడం పొరపాటు కాగలదు. తాను గట్టిగా నమ్మిన విషయాలలో ఆయన లోకాన్నే ధిక్కరించి నిలవగలడు. ఫెడరల్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా 1948లో ప్రొఫెసర్ ఎరోహార్డ్ కరెన్సీ సంస్కరణలను ప్రవేశపెట్టాడు. నాటికి జర్మన్ రైష్ మార్క్ విలువ పూర్తిగా పడిపోయింది. ఈ పరిస్థితులలో ఆ పాత కరెన్సీని చెలామణిలోనుంచి, తొలగించి, పాత రైష్మార్కు పదింటికి కొత్త డాయిష్ మార్క్ ఒక దాన్ని జారీచేసే పద్ధతిపై, ఆయన కరెన్సీ సంస్కరణలను ప్రవేశపెట్టాడు. ఇందువల్ల కొన్ని సత్ఫలితాలు కలిగినా, ఆశించిన మేరకు దేశం ఆర్థికవ్యవస్థలో మార్పు లేదు. అందుపై ప్రొఫెసర్ ఎరోహార్డ్ అప్పటి వరకు దేశంలో అమలులోవున్న రేషనింగ్ను, ఇతర విధాలైన కంట్రోల్స్ను పూర్తిగా రద్దు చేసివేశాడు. ముందుగా అమెరికన్ అధికారుల సమ్మతాన్ని పొందకుండానే ఆయన ఈ చర్య

తీసుకున్నాడు. ఇందుకు వారు కినిసినా ఆయన చలించలేదు. పెక్కు మంది దృష్టిలో ఆర్థికంగా జర్మనీ పురోగతికి ఈ చర్యే మూలమైంది.

ఆర్థిక వ్యవస్థపై ఏ విధమైన కంట్రోల్స్ తగవనేది ప్రొఫెసర్ ఎరోర్డు దాదాపు ఒక మత సూత్రం. ఇది పశ్చిమజర్మనీకి, అక్కడి ప్రత్యేక పరిస్థితులకు సంబంధించినంతవరకు సత్ఫలితాలనిచ్చివుండవచ్చు. అంత మాత్రంచేత దీన్ని ఒక తిరుగులేని సూత్రంగా గుర్తించడానికి వీలులేదు. కలవారికి, లేనివారికి వ్యత్యాసం విపరీతంగా కానవచ్చే దేశాలలో ఈ సూత్రం మరింత హానికర పరిణామాలకు దారితీస్తుంది.

ఆర్థిక విషయాలలో కొన్ని నిశ్చితాభిప్రాయాలున్నా, రాజకీయ సమస్యల పట్ల ప్రొఫెసర్ ఎరోర్డు (అడెనోవరలె) ఒక ప్రత్యేక దృక్పథం వున్నట్టు తోచదు. మూడువందల సంవత్సరాలపాటు.

జర్మనీ, ఫ్రాన్సుల మధ్య కొనసాగిన బద్ధ విరోధం తర్వాత, దాని కారణంగా తరచు చెలరేగిన భీషణ యుద్ధాల తర్వాత, అ రెండు దేశాల మధ్య పరస్పరావగాహననే కాక, ప్రగాఢమైత్రిని అడెనోవర్ సాధించ గలిగాడు. పశ్చిమ యూరపన్ను ఏకకుటుంబంగా రూపొందించాలనే తన కలను కొంతవరకైనా ఆయన నిజం చేసుకోగలిగాడు. ప్రొఫెసర్ ఎరోహార్డ్ మరింత ప్రదర్శించ గలిగితేనే, పశ్చిమ జర్మనీ ఛాన్సలర్గానే కాక, ఒక యూరోపియన్ దేశాలు సమజీవన సిద్ధాంత ప్రాతిపదిక పై వీలైనన్ని రంగాలలో, వీలైనంతగా సహకరించాలి. అప్పుడే ప్రపంచానికి శాంతి, అప్పుడే మానవాళికి భద్రత.

తన 66 వ యేట ప్రొఫెసర్ ఎరోర్డు యూరపఖండం మొత్తంలోనే ఒక కీలక స్థానం లభించింది. దాన్ని ఆయన సద్వినియోగం చేసుకొన్న మేరకే ఆ స్థానానికి, ఆయనకు సార్థక్యం. తాను పదవినుంచి తప్పుకున్నా, తన అభీష్టానుసారమే ఫెడరల్ ప్రభుత్వం వ్యవహరించాలనే ఆకాంక్ష డాక్టర్ అడెనోవర్కు కలదని వినికిడి. ఈ కోర్కె ఆయనకున్నా, దాన్ని ప్రొఫెసర్ ఎరోర్డ్కు మన్నించడం పొరపాటు కాగలదు. ప్రాక్పశ్చిమ కూటాలమధ్య వైషమ్యాలు తగ్గకపోవడానికి అడెనోవర్ చాలవరకు బాధ్యుడు. అందువల్ల కొత్త మార్గాలలో ఆలోచించడానికి, కొత్త విధానాలను ప్రవేశపెట్టడానికి కొత్త ఛాన్సలర్ ప్రయత్నించాలి. ప్రొఫెసర్ ఎరోర్డు స్థూలకాయుడు. ఆయన భోజనప్రియుడు. చుట్టవెంట చుట్ట కాల్చుతూ వుంటాడు. సంగీతం అంటే చెవికోసుకొంటాడు. ఈ విధమైన అభిరుచులున్న వ్యక్తి ఆవేశాలకు లోనుగావడం సాధారణంగా జరగదు. ఇట్టి వ్యక్తి తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు అని వాదించడం సయితం జరగదు. పట్టు విడుపులే ఇట్టి వ్యక్తిలో కానవస్తాయి. ప్రాక్పశ్చిమ వైషమ్యాల తొలగింపుకు ప్రస్తుతం కావలసినవి పట్టు విడుపులే. ప్రొఫెసర్ ఎరోహార్డ్ ఈ ఉత్తమ విధానాన్నే అనుసరించగలడని లోకం ఆశిస్తున్నది.

(ఆంధ్రజ్యోతి 18-10-1963)

## డాక్టర్ అడెనోవర్

"బిస్మార్క్ తర్వాత ఆయనే జర్మనులలో మహారాజ నీతిజ్ఞుడు" అని బ్రిటిష్ కామన్స్ సభలో విన్స్టన్ చర్చిల్ కొన్నేళ్ళ క్రితం డాక్టర్ అడెనోవర్ను ప్రస్తుతించాడు. మరొక జర్మన్ ప్రముఖునితో పోల్చవలెనంటే, అడెనోవర్ను బిస్మార్క్ తర్వాత పేర్కొనడం సముచితమే. కాని, ద్వితీయ ప్రపంచ యుద్ధంలో జర్మని ఘోర పరాజయం చెందిన తర్వాత ఛాన్సలర్ పదవిని స్వీకరించిన డాక్టర్ అడెనోవర్ మాతృదేశానికి చేసిన ప్రత్యేక సేవలను దృష్టిలో పెట్టుకొన్న పక్షంలో ఆయనకు దగ్గరి పోలిక బిస్మార్క్ కాదు, నెపోలియన్ చక్రవర్తి పతనం తర్వాత ఫ్రాన్సు పునరుద్దీపనకు తోడ్పడిన త్యాలీ రాన్తో.

స్వభావానికి సంబంధించినంతవరకు బిస్మార్క్తోగాని, తాలీ రాన్తోగాని అడెనోవర్కు సాపత్యం లేదు. బిస్మార్క్ ధర్మ సంకోచాలు లేనివాడు. న్యాయమో, అన్యాయమో, తనకు కావలసింది కార్యసాధన మాత్రమే. ఆయన మాట కరకు, చేతలు కరకు, చిత్తమే కరకు. పైగా, ఇరుగు.

పొరుగు రాజ్యాలపై దెబ్బతీసి, వాటికి తలవంపులు తెచ్చి, జర్మనీ అధికారాన్ని నిరూపించడానికి ఆయన ప్రయత్నించాడే తప్ప, అడెనోవర్ వలె పశ్చిమ యూరోపియన్ రాజ్యాలు కలిసి బ్రతకకపోతే, కడగండ్లపాలు కాగలవని గుర్తించలేదు. బిస్మార్క్ కాలం నాటికి జాతీయతాభావానికే అత్యధిక ప్రాబల్యం కలదనుకోండి. అయినా, అంతర్జాతీయత మరింత విశాలలక్ష్యమని, ముమ్ముందు దానినే ప్రపంచం అనుసరించవలసి వస్తుందని, చూచాయగా నైనా ఆయన గ్రహించలేదు.

పోతే, వ్యక్తిగత నీతినియమాలకు సంబంధించినంత వరకు త్యాలీ రాన్ అతి నికృష్టుడు. మానాభిమానాలు మచ్చుకైనా లేనివాడు. ముఖంమీద ఉమ్మి వేసినా, ఆ వేసినవాడు బలవంతుడైతే, తుడుచుకొని పోయేవాడు. ఆ తుడుచుకు పోవడం కూడా నవ్వుమొహంతో! లంచాల మాట చెప్పనే అక్కర లేదు. విదేశాధినేతల దగ్గర నుంచికూడా లంచం పట్టేవాడు. ఆయన ప్రవర్తన ఎంత జుగుప్స కలిగించేదో, ఆయన మేధాపటిమ, ఆయన రాజకీయ చతురత అంత అబ్బురాన్ని కలిగిస్తూ వుండేది.

నెపోలియన్ పతనం తర్వాత ఘోర నిస్సహాయ స్థితిలో పడిపోయిన ఫ్రాన్స్ ప్రతినిధిగా వియన్నా కాంగ్రెసుకు వెళ్ళిన త్యాలీ రాన్ తన రాజకీయ ప్రతిభా ప్రాగల్భ్యాలతో తనకు, తన దేశానికి అపూర్వ విజయాలను సాధించాడు. పరాజితదేశ ప్రతినిధిగా తనను చులకన చేయగోరిన వారినుంచి విజేతలను మించిన మర్యాద మన్నలను పొంది ఆయన స్వదేశానికి తిరిగి వచ్చాడు. త్యాలీ రాన్ పాల్గొన్న వియన్నా కాంగ్రెసు నిర్ణయాలు యూరప్ ఖండాన్ని దాదాపు ఒక శతాబ్దం పాటు మహాయుద్ధం నుంచి కాపాడ గలిగినవన్న విషయం కూడా ఈ సందర్భంలో పేర్కొనదగినట్టిదే.

నెపోలియన్ పతనం తర్వాత ఫ్రాన్సుకు త్యాలీ రాన్ చేసిన మహత్తరసేవను పోలిన దాన్ని హిట్లర్ పతనం తర్వాత జర్మనీకి డాక్టర్ అడెనోవర్ చేశాడు. 1949లో ఆయన పశ్చిమ జర్మనీ ఛాన్సలర్ పదవిని స్వీకరించినప్పుడు అది పోరులో ఓడిపోయి, కూడు గుడ్డలకైనా గతిలేని దేశం. "రేపు" అనేది మరి లేదన్నట్టుగా లోకం సంభావించిన దేశం. అదే ఈనాడుఅడెనోవర్ పదవీ విరమణ చేస్తున్ననాడు - సకల సంపత్తులతో తులదూగుతున్న ఒక శక్తి మంతమైన రాజ్యం.

ఆదిలో రాజ్యాధికారానికి వచ్చినప్పుడు డాక్టర్ అడెనోవర్కు తమ పార్లమెంటులో పెద్దగా బలమైనాలేదు. ఫెడరల్ ఛాన్సలర్గా ఆయన 1949లో ఎన్నికైంది కేవలం ఒకే ఒక వోటు మెజారిటీతో. పైగా, అప్పటికి ఆయన వయస్సు 72 సంవత్సరాలు. అంతకు పూర్వం ఆయన అనామకుడు కాదుగాన, విశేష కీర్తి ప్రతిష్ఠలున్నవాడు సయితం కాదు, అయినా, అనతికాలంలో జర్మనీకి తిరుగులేని నాయకుడుగా ఆయన రూపొందగలిగాడు. వయో వృద్ధు.

డైనందువల్లనే ఆయన పదవినుంచి ఈనాడు (ఇప్పుడు ఆయన వయస్సు 87 సంవత్సరాలు) తప్పుకొంటున్నాడు గాని, పలుకుబడి తగ్గిపోయికాదు.

డాక్టర్ అడెనోవర్ జన్మించింది కలోన్, ఆయన జన్మదినం 1876 జనవరి 5వ తేదీ. ఆయన తండ్రి ప్రభుత్వంలో కొద్దిపాటి ఉద్యోగి. తాత ముత్తాత స్థితిగతులు మరింత తక్కువ. చిన్నతనంలో చదువుసంధ్యలలో ఆయన పెద్దగా రాణించలేదు. చాలా యూనివర్శిటీలలో చదివిన పిమ్మట చివరికి ఆయన "లా" లో పట్టం సంపాదించాడు. తండ్రి వలె ఆయన కూడా ప్రభుత్వోద్యోగంలో చేరినా, చెప్పుకోదగు పెద్ద పదవు లేవీ ఆక్రమించలేదు. అడెనోవర్ జీవితంలో "దశ తిరగడం కలోన్ మేయర్గా ఆయన ఎన్నిక కావడంతో. తన 41 వయేట (1971లో) మేయర్గా యెన్నికైన అడెనోవర్ మధ్యలో అంతరాయాలు లేకుండా పదహారు సంవత్సరాలపాటు ఆ పదవిని నిర్వహించి, తన సాటి పౌరుల గౌరవాన్ని సంపాదించుకొన్నాడు.

నాజీలు రాజ్యాధికారానికి రావడంతో అడెనోవర్ రెండుసార్లు కారాగారవాసం చేయవలసి వచ్చింది. అయితే, తీవ్రంగా, బాహాటంగా ఆయన నాజీప్రభుత్వాన్ని ప్రతిఘటించ లేదు. గులాబి తోటను పెంచు కొంటూ, పాత గడియారాలను బాగుజేసుకొంటూ, పట్టీపట్టనట్లు ఆయన కాలక్షేపం చేశాడు.

అమెరికనులు కలోన్ నగరాన్ని పట్టుకొన్నప్పుడు అజ్ఞాతవాసంలో వున్న అడెనోవర్ను తిరిగి మేయర్ పదవికి వారు ఆహ్వానించారు. ఇది జరిగింది 1947లో. తర్వాత నాలుగేళ్ళకు (1949) ఆయన ఫెడరల్ ఛాన్సలర్ అయినాడు.

అమెరికా సహాయ సహాకారాలు విశేషంగా లభించి వుండకపోతే, డాక్టర్ అడెనోవర్ తన అత్యద్భుత విజయాలను సాధించగలిగి వుండేవాడు కాదు. కాని, ఆ సహాయ సహకారాలను సంపాదించడంలో ఆయన చూపిన చతురత ఇంతంతకాదు. ఇంతకంటే కూడా ముఖ్యం ఆ సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవడం. దానిలో ఆయన చూపించిన ప్రజ్ఞాప్రాభవాల కారణంగానే పశ్చిమ జర్మనీ నేడు యూరప్ ఖండం మొత్తం పైనే సంపత్కరమైన దేశంగా రాణిస్తున్నది.

విదేశాంగ విధానాలకు సంబంధించినంతవరకు, పశ్చిమ యూరోపియన్ రాజ్యాలతో సన్నిహితత్వాన్ని సాధించంలో అడెనోవర్ తన విజ్ఞతను, తన దూరదృష్టిని నిరూపించుకొన్నాడు. కమ్యూనిస్టు ప్రపంచంతో సహజీవనం తప్పదని గుర్తించలేకపోయిన మేరకే ఆయన దృక్పథం పరిమితం; ఆయన విధానాలు లోపభూయిష్ఠం.

ఒక జాతిని - ఏమైనా 72వ యేట గురుతర బాధ్యతను స్వీకరించి, చితికిపోయిన ఒక జాతిని సర్వనాశనమైన సర్వనాశనమైన ఒక దేశాన్ని - పదిహేను సంవత్సరాలలో తిరిగి ఒక మహా రాజ్యంగా చేయడం అత్యద్భుత విషయం. ఇంత స్వల్పకాలంలో ఇంత గొప్ప విజయాన్ని సాధించడం ద్వారా డాక్టర్ అడెనోవర్ జీవితం ధన్యమైంది. (ఆంధ్రజ్యోతి 17-10-1963)

## మాక్మిలన్

"మాక్మిలన్ విషయమై మీ అభిప్రాయమేమి?" అని ప్రశ్నించగా, లండన్లోని ఒక విదేశ రాయబారి "ఏ మాక్మిలన్ విషయమై" అని ఎదురు ప్రశ్న వేసినాడట. నిజమే, ప్రధాని పదవి నుంచి తప్పుకొనడానికి తాను నిర్ణయించుకొన్నట్టు మొన్న ప్రకటించిన శ్రీ హెరాల్డ్ మాక్మిలను "అవతారంబుల దాల్చినాడు పది" అనే సూక్తి పూర్తిగా వర్తిస్తుంది కాబట్టి, ఆయనను గురించి ఒక నిశ్చితాభిప్రాయాన్ని వెల్లడించడం కష్టమే.

కామన్స్కు కొత్తగా ఎన్నికైన రోజులలో ఆయన కన్సర్వేటివ్ సభ్యులలో అతివాది. ఆర్థిక, సాంఘిక సమస్యల పట్ల నిర్మాణాత్మకమైన వైఖరిని అవలంబించాలనే "నార్తరన్ గ్రూప్"లో ఆనాడు ఆయనొక ప్రముఖ సభ్యుడు. ఈ సమస్యలను గురించి ఆయన ఎన్నో గ్రంథాలను వ్రాసి ప్రచురించాడు కూడా. వీటిలో "ది మిడిల్ వే" అనేది ముఖ్యమైంది.

ఆర్థిక, సాంఘికాది ప్రధాన సమస్యల పరిష్కారానికై తానభిమానిస్తున్న "మధ్య మార్గం" లేబర్ పార్టీ విధానాలకు అంతగా భిన్నమైనది కానందున, ఆ పార్టీలో మాక్మిలన్ చేరవచ్చునని తోచిన ఘట్టాలు కొన్ని లేకపోలేదు. కార్ల్ మార్క్స్ పట్ల భయమే తాను లేబర్పార్టీలో చేరకపోవడానికి కారణమన్నట్టు మాక్మిలన్ చెప్పిన మాట ఛలోక్తి మాత్రమే!

మాక్మిలన్ జీవితయాత్రలో ఛలోక్తితో కొట్టిపారవేయడానికి వీలులేని ఇట్టి పరివర్తనలెన్నో కానవస్తాయి. చివరికి 1957లో సూయజ్ వ్యవహారంలోనైనా, అప్పటి బ్రిటిష్ ప్రధాని ఈడెన్ చేసిన పొరపాటును ఆయన గట్టిగా ప్రతిఘటించినట్టు తోచదు. అయినా, ఈడెన్ సూయజ్ విధానాన్ని మనస్ఫూర్తిగా వ్యతిరేకించిన బట్లర్ కాక, మాక్మిలన్ (ఈడెన్ స్థానంలో) ప్రధాని కావడం తటస్థించింది.

ఈ సంఘటన ఎందరెందరికో ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆర్.ఎ. బట్లర్ వలె మాక్మిలన్ 1957లో కామన్స్ సభా నాయకుడు కాదు; ప్రధాని విదేశాలలో పర్యటన చేస్తుండగా ఆయన వలె ఈయన ప్రధాని పదవీ బాధ్యతలను తాత్కాలికంగా నిర్వహిస్తూ రాలేదు. అయినా, ప్రధానమంత్రి పదవి స్వీకరించ వలసిందిగా రాణి నుంచి మాక్మిలన్కే పిలుపు వచ్చింది. కన్సర్వేటివ్ పార్టీ ప్రముఖుల దృష్టిలో బట్లర్ "అతివాది" కావడమే ఆయనకు పిలుపు రాకపోవడానికి కారణమని పలువురి విశ్వాసం. పార్టీలో "అతివాది"గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన మాక్మిలన్ "మితవాది" అనే కితాబుతో ప్రధాని కావడం వింత విషయమే కాదా?

ప్రధాన మంత్రి పదవిని స్వీకరించిన తర్వాత ఎంతటి ప్రతికూల పరిస్థితులైనా లొంగదీయలేని వ్యక్తిగా మాక్మిలన్ పేరు పొందడం జరిగింది. చివరికి ప్రొఫ్యూమో తుపాను నుంచి కూడా ఆయన మొత్తంపై గౌరవప్రదంగానే బయటపడ గలిగాడు. ప్రొఫ్యూమో "భామాకలాపం".

ఎంత నింద్యమైనా, దాని కారణంగా దేశ రక్షణకు సంబంధించిన రహస్యాలు విదేశాలకు అందలేదని డెన్నింగ్ నివేదిక స్పష్టం చేసింది.

అయితే, మాక్మిలన్ జాతీయ, అంతర్జాతీయ విధానాలలో పెక్కింటి వైఫల్యం తర్వాత ప్రొఫ్యూమో తుపాను చెలరేగినందున ప్రభుత్వ నాయకత్వంలో మార్పు అవసరమనే భావం కన్సర్వేటివ్ పార్టీలోనే ప్రబలింది. ఒకప్పుడు బాల్డ్విన్ నాయకత్వంపై అప్పటిలో తరుణ వయస్కుడైన మాక్మిలన్ తిరుగుబాటు చేసినట్టు, మాక్మిలన్ నాయకత్వంపై కన్సర్వేటివ్ పార్టీలోని యువకులు తిరుగుబాటుకు సిద్ధపడ నారంభించారు. ఈ పరిస్థితులను గమనించినందునే ప్రధాని పదవి నుంచి తాను తప్పుకొనగోరుతున్నట్టు ఆయన ప్రకటించారు.

శస్త్రచికిత్స తర్వాత, ఆసుపత్రి నుంచి తన పదవీ విరమణ విషయమై మాక్మిలన్ ప్రకటన చేసినా, అనారోగ్యమే ఆయన నిర్ణయానికి ఏకైక కారణమని భావించలేము. తనకు, తన ప్రభుత్వానికి అనుకూలంగా డెన్నింగ్ నివేదిక వెలువడిన ఈ ఘట్టమే తాను పదవినుంచి తప్పుకొనడానికి తగిన సమయమని మాక్మిలన్ తీర్మానించుకొని వుండాలి. ఆయన దృష్టినుంచే కాక, ఆయన పార్టీదృష్టి నుంచి కూడా ఇది సకాలంలో జరిగిన సముచిత నిర్ణయం.

ఏమైనా, ముగ్గురు కన్సర్వేటివ్ ప్రధానమంత్రులు (చర్చిల్, ఈడెన్, మాక్మిలన్) తమ పదవీ కాలం మధ్యలో "రిటైర్" కావడం తటస్థించింది. ఇది ఆ పార్టీకి ఏమంత గౌరవప్రదమైన విషయం కాదు వెంటనే కాకపోతే,

మరికొన్ని నెలలలోనే బ్రిటన్లో జరగనున్న ఎన్నికలలో కన్సర్వేటివ్ పార్టీ నెగ్గబోదనే బహుజనాభిప్రాయం. ప్రధానిగా లాయడ్ జార్జి లిబరల్ పార్టీ పతనానికి కారకుడైనాడు. మాక్మిలన్ విషయమై భావిలో చరిత్రకారుడు ఏమి తీర్పు చెప్పగలడో? దాని విషయమై ఇప్పుడే ఊహించడం సాహసం కాగలదు!

(ఆంధ్రజ్యోతి 13-10-1963)

## గెయిట్ స్కెల్

"మా జీవితాలు కాంతి విహీనాలయ్యాయి" అని గెయిట్ స్కెల్ మృతి వార్తను పత్రికా విలేకరులకు వినిపించిన బ్రిటిష్ లేబర్ పార్టీ ప్రతినిధి ఒకరు వాపోయారు. ఇందులో అతిశయోక్తి ఏమీలేదు. ఏడెనిమిదేళ్ళుగా లేబర్పార్టీకి పార్లమెంటు లోపల, వెలుపల నాయకుడుగా, మార్గదర్శిగా, జీవగర్రగా వుంటున్న గెయిట్ స్కెల్ మృతి ఆ పార్టీకి అశనిపాతం. పార్టీ ఇంతటిలో తేరుకొనడం కష్టమే.

బ్రిటిష్ లేబర్ ఉద్యమం బ్రిటన్లోనే కాక, ప్రపంచంలోనే చిరకాలంగా ఒక ప్రముఖపాత్రను నిర్వహించింది. అది పలువురు మేధావులను తనవైపు ఆకర్షించింది; ఎందరో రాజకీయవేత్తలను సృష్టించింది. అనేక దేశాలలో కార్మికోద్యమాలకు, స్వాతంత్ర్యోద్యమాలకు ప్రోత్సాహమిచ్చింది.

లేబర్ ఉద్యమంలోని అగ్రశ్రేణి మేధావులతో పోల్చదగినవాడు కాకపోవచ్చుగాని, గెయిట్ స్కెల్ అంత చిన్న వయస్సులో దానికి నాయకుడుగా ఎన్నికై, బ్రిటిష్ రాజకీయ జీవితంలో ప్రముఖుడుగా చెల్లుబడి కాగలగడానికి ఆయన కార్యనిర్వహణ దక్షత, పార్టీ సభ్యులపై ఆయనకు గల పలుకుబడి ప్రధాన కారణాలు.

1926 నుంచే గెయిట్ స్కెల్ లేబర్ రాజకీయాలలో పాల్గొంటున్నా, ప్రపంచ యుద్ధానంతరం ఆ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుంచే ఆయన రాజకీయ జీవితం ప్రారంభమైంది. 1945 లో ఆయన సౌత్ లీడ్స్ నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. 1950 లో సర్ స్టాఫర్డ్ క్రిప్స్ అనారోగ్య కారణంగా రాజీనామా యివ్వడంతో ఆయన స్థానంలో ఆర్థికమంత్రి అయ్యారు. 1951 ఏప్రిల్ గెయిట్ స్కెల్ ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్ అందరి ప్రశంసలు చూరగొన్నది. ఆయన బడ్జెట్ ఉపన్యాసం తాను విన్నవాటిలో అత్యుత్తమమైనదని విన్స్టన్ చర్చిల్ వంటి మహామహుడు

శ్లాఘించాడు. నాటి నుంచి లేబర్ పార్టీకి ఆర్థికవ్యవహారాలపై ఆయనే నిపుణుడు. 1955లో అట్లీ స్థానంలో లేబర్ పార్లమెంటరీ నాయకుడుగా ఆయన ఎన్నికై, ప్రతిపక్ష నాయకత్వాన్ని చేపట్టినప్పటి నుంచి బహుశా బ్రిటిష్ రాజకీయాలలో అంత వివాదాస్పదుడైన వ్యక్తి మరొకరు లేరు. ఆయన నాయకత్వంలో లేబర్ పార్టీ టోరీలకు సన్నిహితంగా జరిగింది,. రెండు పార్టీలకు అనేక విధానాలలో భేదం లేకుండా పోయిందని విమర్శలు వచ్చాయి. పార్టీలో మితవాద, అతివాద వర్గాలు బాహాటంగా భేదించడం మొదలు పెట్టాయి.

ముఖ్యంగా నిరాయుధీకరణ, అణ్వస్త్ర నిషేధం విషయాలలో ఆయన ప్రభుత్వ పక్ష విధానాలకు సన్నిహితుడు కావడంతో లేబర్ పార్టీలో విభేదాలు మరింతగా పెరిగి పోయాయి. కాని ఆయన ఎప్పటికప్పుడు తన విధానాలను పార్టీచేత ఆమోదింపజేసి నిలద్రొక్కుకో గలిగారు. గత సంవత్సరం జరిగిన లేబర్పార్టీ మహాసభలో, కామన్ మార్కెట్లో బ్రిటన్ చేరికను గెయిట్స్కెల్ వ్యతిరేకించడం ఆయన రాజనీతిజ్ఞతకు గొప్ప నిదర్శనం. ఆయన అనుసరించిన కామన్ మార్కెట్ వ్యతిరేక విధానంవల్ల లేబర్ పార్టీ అంతకు ముందు కోల్పోయిన ప్రతిష్ఠను, పలుకుబడిని తిరిగి సంపాదించుకో గలిగింది. పార్టీలో వెనుకటి విభేదాలు చాలవరకు సమసిపోయి గెయిట్ స్కెల్ నాయకత్వం సుస్థిరమైంది. తిరిగి ఎన్నికలు జరిగితే లేబర్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కూడా పలువురు ఊహించడం జరిగింది.

పార్టీలో, దేశ రాజకీయాలలో ఉచ్ఛదశకు వచ్చి, ఇక ప్రధాని పదవిని చేపట్టడమే తరువాయి అని భావిస్తున్న తరుణంలో గెయిట్ స్కెల్ అకాలమరణం పొందడం దురదృష్టకరం. ఆయన లేనిలోటు లేబర్పార్టీకి ఇంతటిలో తీరేదికాదు. (ఆంధ్రజ్యోతి 20-1-1963).

## ట్రూమన్

మొన్న కాలధర్మం చెందిన హారీ ఎస్. ట్రూమన్ యునైటెడ్ స్టేట్స్ ప్రస్తుతపు ప్రెసిడెంటవలె ఆ పదవికై ప్రాకులాడినవాడు కాదు. కోరకుండానే అది ఆయనకు వచ్చింది. కోరకుండానే కాదు కూడా; తాను వద్దనుకున్నా అది ఆయనకు వచ్చింది. ట్రూమన్ పదవీకాంక్ష అసలే లేనివాడు కాదు. పదవీకాంక్ష లేనివారు రాజకీయాలో ప్రవేశించరు; ప్రవేశించరాదు కూడా.

రాజకీయాలలో ట్రూమన్ ప్రవేశం కంట్రీ జడ్జీగా. అప్పటిలో తన ఆశలకు ఆయన పరమావధిగా పెట్టుకున్నది సెనెటర్పదవి. 1935 లో సెనెట్కు ఎన్నికైనప్పుడు ఆయన పరమానంద భరితుడైనాడు. సెనెటర్గానే తన రాజకీయ జీవితాన్ని ముగించగోరాడు. అందువల్లనే, 1945 లో ఆయనను వైస్-ప్రెసిడెంట్ పదవికి అభ్యర్థిగా నాటి ప్రెసిడెంట్ రూజ్వెల్ట్ ఎన్నుకున్నప్పుడు, అది ఆయనకు సంతోషాన్ని కలిగించలేదు.

వైస్ ప్రెసిడెంట్ పదవిపట్ల ట్రూమన్ వైముఖ్యం నటన కాదు, కపటం మొదలే కాదు, ఆ పదవీ బాధ్యత తనపై పడకుండా ఎలాగైనా తప్పించుకోవాలి అనే చిత్తశుద్ధితోనే ఆయన ప్రయత్నించాడు. అయినా, అది తప్పలేదు.

వైస్-ప్రెసిడెంట్గా ఎన్నికైన తర్వాత కూడా తిరిగి సెనెటర్ కాగలిగితే తానెంతగానో సంతసించగలనని ఆయన పత్రికా ప్రతినిధులతో చెప్పాడు. ఈ మాట చెప్పిన తర్వాత 48 గంటల లోపలే – రూజ్వెల్ట్ మరణం కారణంగా - ట్రూమన్ ప్రెసిడెంట్ కావడం తటస్థించింది. నాల్గవ సారి అమెరికా ప్రెసిడెంట్ గా ఎన్నికైన తర్వాత రూజ్వెల్ట్ జీవించింది కేవలం 82 రోజులు మాత్రమే. అప్పటికే ఆయన ఆరోగ్యస్థితి అంత ససిగా లేదు

గాని, నిర్యాణం చెందగలడని ఎవ్వరు అనుకోలేదు. అప్పటిలో తలవని తలంపుగా జరిగిన ఆయన మృతివల్ల తలవని తలంపుగా ట్రూమన్ ప్రెసిడెంట్ పదవిని స్వీకరించడం జరిగింది.

తర్వాత 1948 లో ప్రెసిడెంట్ పదవికి ట్రూమన్ పోటీచేసినప్పుడు ఆయనకు పరాజయం తథ్యమని పెక్కుమంది భావించారు. అయితే, తన పరాజయాన్ని గురించిన అన్ని జోస్యాలను అబద్ధంచేసి, ఆయన తిరిగి వైట్ హౌస్ లో ప్రవేశించాడు.

ఒక రైతుకుటుంబలో పుట్టిన ట్రూమన్, కాలేజీ చదువులు చదువుకొనని ట్రూమన్, అంట్లు తోముకొనడం మొదలుకొని నాగలిదున్నడం వరకు అన్ని విధాల కాయకష్టాన్ని చేసిన ట్రూమన్, బ్యాంకులలో గుమాస్తాగా పనిచేసిన ట్రూమన్, అంగడి పెట్టి అప్పుల పాలైన ట్రూమన్, కంట్రీ జడ్జీగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ట్రూమన్ అమెరికా ప్రెసిడెంట్గా రాణించగలడని అనుకున్నవారు దాదాపు లేరు. అయినా, ఆ పదవిలో ఆయన రాణించారు. అమెరికా.

ప్రెసిడెంట్స్లో ఆయన ప్రథమ శ్రేణికి చెందినవాడు కాదుగాని, త్రోసిపుచ్చదగువాడు సయితం కాదు.

ప్రపంచ చరిత్రలోనే క్లిష్ట ఘట్టంలో ద్వితీయ ప్రపంచయుద్ధం కొనసాగుతున్న ఘట్టంలో - ట్రూమన్ అమెరికా ప్రెసిడెంట్ పదవికి వచ్చాడు. అందువల్ల, ఆయన అనేక ముఖ్యమైన తీర్మానాలను, కీలకమైన నిర్ణయాలను, స్వయంగా చేయవలసి వచ్చింది. జపాన్ పై యాటంబాంబు ప్రయోగం, యూరప్ పునరుద్ధరణకై మార్షల్ పథకం, కొరియా యుద్ధంలో ప్రవేశం, జనరల్ మెకార్థర్ బర్తరఫ్, అట్లాంటిక్ రక్షణ సంధి ఇట్టి పెక్కు తీర్మానాలు, నిర్ణయాలు ఆయన చేసినట్టివే.

కల్లకపటాలు లేనివాడు కాబట్టే, అవసరమైతే కరకుగా మాట్లాడగలవాడు కాబట్టే, పదిమంది సలహాలను పుచ్చుకున్న మీదట తనకు సవ్యమైనదిగా, న్యాయమైనదిగా తోచిన నిర్ణయాన్ని చేయగలవాడు కాబట్టే, ఎవరికైనా ఒక బాధ్యతను అప్పగించిన మీదట ఆ వ్యక్తిని నమ్మి, అన్ని విధాల అతడిని బలపరచినవాడు కాబట్టే ట్రూమన్ ప్రపంచ చరిత్రలోనే ఒక క్లిష్ట ఘట్టంలో అమెరికా ప్రెసిడెంట్గా తన బాధ్యతలను మొత్తంపై సమర్థంగా నిర్వహించగలిగాడు.

ఇంతేకాక, తన పదవిని తనకోసం, తనవారికోసం, మూటకట్టడం కోసం ట్రూమన్ దుర్వినియోగం చేయలేదు. అనామకుడుగా ఉన్న రోజులలో, అంగడి పెట్టి నష్టపడినప్పుడు పేరుకున్న అప్పులను పదిహేనేళ్ళు కష్టపడి, చివరి సెంటు వరకు ఆయన తీర్చివేశాడు. అటు తర్వాత కూడా ఆయన డబ్బు విషయంలో ఇంత నీతిని, ఇంత నిజాయితీని చూపుతూ వచ్చాడు. ప్రెసిడెంట్ పదవికి వచ్చినప్పుడు ఆయన నిల్వలో కాక, అప్పులలోనే ఉన్నాడు. ప్రెసిడెంట్గా తన జీవితంలో నుంచి మిగల్చ గలిగిన మొత్తంతో ఆయన తన అప్పులను తిరిగి తీర్మానం చేశాడు.

ప్రెసిడెంట్గా వచ్చిన జీతంతోనైనా ఆయన అప్పులు పూర్తిగా తీరేవి కావు. అందువల్ల, నెలకు నాలుగున్నర వేల డాలర్ల జీతంతో తన భార్యను ఒక పర్సనల్ సెక్రటరీగా వేసుకున్నాడు. దీన్ని ఎవరో ఆక్షేపించగా, ఏవో కుంటిసాకులను చెప్పక, "నా బాధ్యతల నిర్వహణలో నా సెక్రటరీగా నా భార్య ఎన్నో విధాల నాకు తోడ్పడుతున్నప్పుడు ఆమెకు జీతమివ్వడం ఎందువల్ల తప్పు?" అని ఆయన ఎదురు ప్రశ్న వేశాడు. అటు తర్వాత ఈ విషయంపై ఆయనను మరి ఆక్షేపించినవారే లేరు.

పెద్ద చదువులు కాక,ఉపన్యాసాలలో దక్షతకాక, "లౌక్యం"గా చెల్లే కల్లకపటాలు కాక, నీతి నిజాయితీలే, నిష్కర్షగా వ్యవహరించడమే రాజకీయ పదవులలో రాణించడానికి ప్రథమావశ్యకాలని ట్రూమన్ జీవితం రుజువుచేస్తున్నది. ఆయన సామాన్యులలో అసామాన్యుడు; సార్థకజీవి.

(ఆంధ్రజ్యోతి 28-12-1972)

## ఉథాంట్

"ఎంత క్లిష్ట సమస్య ఎదురైనా తొణకని, బెణకని వ్యక్తి ఎంత ప్రశాంతంగా, అంటీ అంటనట్టు కనిపిస్తారో అంత రాజకీయ చతురుడు, దౌత్య నీతివేత్త, ఆసియా ప్రాచీన విజ్ఞానానికి ప్రతినిధివలె కనిపిస్తారు."

ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో ఉథాంట్ను గురించి ఎవరిని ప్రశ్నించినా, ఇంచుమించు ఇదే ధోరణిలో చెబుతారు. ఆయన నిష్పాక్షికత పట్ల పశ్చిమరాజ్యాల కెంత విశ్వాసం ఉన్నదో, కమ్యూనిస్టు రాజ్యాలకూ అంతే నమ్మకం ఉన్నది. అందుచేతనే, సమితి ప్రధాన కార్యదర్శి పదవికి ఆయనను భద్రతా సంఘం ఏకగ్రీవంగా సిఫార్సు చేసింది; ఆ సిఫార్సును సమితి జనరల్ అసెంబ్లీ ఆమోదించింది. దాదాపు ఒక ఏడాది నుంచి సమితి తాత్కాలిక కార్యదర్శిగా ఉథాంట్ కనబరచిన ప్రజ్ఞా ప్రాభవాలకు ఇది తగిన పరిగణన. మరొక నాలుగేళ్ళ వరకు ఉథాంట్ ఈ పదవిని నిర్వహిస్తారు.

పదిహేడేళ్ళ చరిత్ర గల సమితికి ఉథాంట్ మూడవ కార్యదర్శి. మొదటి కార్యదర్శి నార్వేకు చెందిన ట్రీగ్వేలీ, ఆయన పదవీకాలంలో ప్రాక్పశ్చిమ ప్రచ్ఛన్న యుద్ధం అతి తీవ్ర ఘట్టంలో ఉన్నది. ఆయన సోవియెట్ కూటానికి వ్యక్తిగతంగా కూడా సరిపడినట్టు లేదు. ఇక రెండవ కార్యదర్శి స్వీడన్కు చెందిన హామరెల్డ్. ఆయనపట్ల సోవియెట్ యూనియన్ వ్యక్తిగతంగా ఎంత గౌరవం చూపినా, ఆయన విధానాలతో అది అంతగా సహకరించలేదు. అసలు ప్రధాన కార్యదర్శి పదవినే రద్దుచేసి, ప్రాక్పశ్చిమ, అలీన రాజ్యాలకు చెందిన ముగ్గురు కార్యదర్శులను నియమించాలని రెండేళ్ళుగా రష్యా పట్టుపడుతున్నది. అయితే, ఈ ప్రతిపాదనకు కమ్యూనిస్టు కూటంనుంచి తప్ప మరెవరి నుంచి సమర్థన రాలేదు.

ప్రస్తుతానికి కార్యదర్శి త్రయం ప్రతిపాదనను రష్యా విరమించు కొనడం, అలీన రాజ్య ప్రతినిధి అయిన ఉథాంట్ ఎన్నికను బలపరచడం దాని రాజనీతి కుశలతకు నిదర్శనం. ఇటీవల సోవియెట్ విధానాలలో కాఠిన్యం కొంత సడలుతున్నదనడానికి ఇది ఉదాహరణ.

తాత్కాలిక కార్యదర్శిగా గడచిన ఏడాదిలో ఉథాంట్ గురుతర బాధ్యతలను నిర్వహించారు. ఆయన పదవి కేవలం సమితి సెక్రటేరియట్లో సిబ్బందిపై అజమాయిషీకి మాత్రమే పరిమితమైనది కాదు. భద్రతా సంఘం, జనరల్ అసెంబ్లీ, సమితికి చెందిన తదితర విభాగాలు చేసే నిర్ణయాలను అమలు జరపడంలోను, ఒక్కొక్కసారి స్వయంగా కొన్ని సమస్యల నెదుర్కొనడంలోను కార్యదర్శి ఎంతో నేర్పుతో వ్యవహరించవలసి ఉంటుంది. పశ్చిమ ఇరియన్, క్యూబా సమస్యల పరిష్కారంలో ఉథాంట్ అట్టి దక్షతనే కనబరిచారు. కాంగో సమస్యను కూడా అదే విధంగా పరిష్కరించాలని ఆయన యత్నిస్తున్నారు.

అయితే, ఉథాంట్ ఎంత ప్రతిభావంతుడైనా ఆయనకు సమితి సభ్య దేశాలు అరమరికలు లేకుండా పూర్తి తోడ్పాటునిచ్చినప్పుడే ఆయన యత్నాలు ఫలిస్తాయి. కాంగో సమస్య కొరకరాని కొయ్యగా మిగిలి పోవడానికి ఆయన ప్రయత్న లోపం కారణం కాదు. కాంగోపై భద్రతా సంఘం చేసిన తీర్మానాలను అమలు చేయడంలో బెల్జియం వంటి రాజ్యాలు కల్పిస్తున్న ఆటంకాలు కొంత వరకు కారణం. సమితి సేనల వ్యయంలో తన వాటాను భరించడానికి రష్యా చూపుతున్న వైముఖ్యం మరి కొంత వరకు కారణం.

కార్యదర్శి పదవిని స్వీకరిస్తూ ఉథాంట్ తన ప్రసంగంలో స్పష్టం చేసినట్టు, ప్రపంచ సమస్యల పరిష్కారానికి "ఇచ్చి పుచ్చుకునే" సమరస ధోరణి అవసరం. మొన్నటి క్యూబా సంక్షోభ సమయంలో అమెరికా, రష్యాలు అట్టి సామరస్యాన్నే ప్రదర్శించాయి. బెర్లిన్, అణ్వస్త్ర పరీక్షల నిషేధం, నిరాయుధీకరణ మొదలైన కఠిన సమస్యలింకా ప్రపంచాన్ని కల్లోల పరుస్తూనే ఉన్నాయి. వీటిలో సయితం ప్రాక్పశ్చిమ రాజ్యాలు ఇచ్చి పుచ్చుకునే ధోరణిని అవలంబించ గలిగితే, అవి పరిష్కారానికి లొంగక పోవు. నిష్పాక్షికుడుగా, ఉభయులకు గౌరవాస్పదుడుగా పేరొందిన ఉథాంట్ దౌత్యనీతి అట్టి పరిష్కారాన్ని సాధించగలదని మనం ఆశించవచ్చు.

(ఆంధ్రజ్యోతి 5-12-1962)

## ప్రెసిడెంట్ జాన్సన్

"అగస్త్యభ్రాత"తో పోల్చదగినవాడు యునైటెడ్ స్టేట్స్ వైస్ ప్రెసిడెంట్. పదవి పెద్దదే; ప్రతిపత్తి పెద్దదే; ప్రభుత్వాధికారం మాత్రం పూజ్యం. ఇందుకు అమెరికన్ రాజ్యాంగ విధాన స్వరూప స్వభావాలే కారణం. దానికింద సమస్తాధికారాలు ప్రెసిడెంట్వే! వివిధ శాఖాధిపతులతో కూడిన మంత్రివర్గం ఉన్నా, ప్రభుత్వ విధానాల అంతిమ బాధ్యత ప్రెసిడెంటే. మంత్రివర్గ సమావేశాలలో వోట్లు తీసుకొనడం జరగదు. జరిగినా, ప్రెసిడెంట్ స్వయంగా కోరినప్పుడే! అప్పుడైనా మెజారిటీ ప్రకారం నిర్ణయం జరగనక్కరలేదు. అబ్రహాం లింకన్ ఒకానొక సందర్భంలో పేర్కొన్నట్లు అమెరికన్ మంత్రివర్గ సమావేశంలో చివరికి లెక్కకు వచ్చేది ప్రెసిడెంట్ వోటు మాత్రమే!

వైస్ ప్రెసిడెంట్ను ప్రెసిడెంట్ తన మంత్రివర్గంలో సభ్యుని చేయవచ్చు; చేయకపోవచ్చు. రాజ్యాంగం రీత్యా వైస్ ప్రెసిడెంట్ కున్న హక్కు సెనేట్ సమావేశాలకు అధ్యక్షత వహించడం మాత్రమే! సెనేట్ అధ్యక్షత గౌరవప్రదమైన స్థానమే! అయితే, శాసన సభాధ్యక్షత ద్వారా ఎక్కడైనా, ఎవరికైనా సంక్రమించే రాజ్యాధికారం మృగ్యం.

ఈ కారణా లన్నింటివల్ల రాజకీయరంగంలో పేరు ప్రఖ్యాతులను ఆశించేవారికి వైస్ ప్రెసిడెంట్ పదవిని "సమాధి"గా అమెరికాలో పరిగణిస్తారు. రాజకీయ రంగంలో నిజంగా పైకి రాదలచుకొనేవారు వైస్ ప్రెసిడెంట్ పదవి ఛాయలకైనా వెళ్ళరు. ప్రతిభావంతు డెవడైనా, ఆ.

పదవికి ఆశపడినా, పార్టీ అభ్యర్థిగా అతనిని నిర్ణయించడం సాధారణంగా జరగదు. ప్రెసిడెంట్ పదవికి అభ్యర్థి నిర్ణయ సందర్భంలో పార్టీలో అసంతృప్తిపడిన వర్గాన్ని సంతృప్తి పరచడానికై

ఎవరినో ఒకరిని అభ్యర్థిగా నిర్ణయించడమే తరచు జరుగుతుంది. - అమెరికన్ వైస్ ప్రెసిడెంటులలో పదవీ విరమణ తర్వాత లోకం జ్ఞాపకం పెట్టుకొన్నవారు ఒకరిద్దరిని మించి లేరేమో! అయితే, యునైటెడ్ స్టేట్స్ చరిత్రలో ఇంతవరకు ఎనిమిది మంది వైస్ ప్రెసిడెంటులు - పదవీకాలం మధ్యలో ప్రెసిడెంట్ల నిర్యాణం కారణంగా ప్రెసిడెంట్ పదవికి రావడం జరిగింది. ఈ విధంగా ప్రెసిడెంట్ పదవికి వచ్చినవారు జాన్ టైలర్ (1841-45), మిలర్డ్ ఫిల్మోర్ (1850-53), యాండ్రూ జాన్సన్ (1865-69), ఛెస్టర్ ఎ. ఆర్థర్ (1881-85), థియోడోర్ రూజ్వెల్ట్ (1901-09), కూలిడ్జ్ (1923-29), ట్రూమన్ (1945-53), తర్వాత ప్రస్తుతం లిండన్ జాన్సన్.

వైస్ ప్రెసిడెంట్ పదవి నుంచి ప్రెసిడెంట్ పదవికి వచ్చిన ఈ ఎనమండుగురిలో ఆ పదవికి తిరిగి ఎన్నికైనవారు థియొడోర్ రూజ్వెల్ట్, కాలిన్ కూలిడ్జ్, హ్యారీ ట్రూమన్లు మాత్రమే. ఆ ముగ్గురిలో ప్రెసిడెంట్గా ఇదివరలో పేరు ప్రఖ్యాతలు గడించుకున్నవారు థియొడోర్ రూజ్వెల్టు, ట్రూమన్లు మాత్రమే! వీరిద్దరి సరసను ప్రెసిడెంట్

లిండన్ జాన్సన్ స్థానం సంపాదించుకొన నున్నట్టుగానే ఆయన ప్రదర్శిస్తున్న ప్రజ్ఞా ప్రాభవాలను బట్టి తీర్మానించుకోవచ్చు.

వైస్ ప్రెసిడెంట్గా ఎన్నిక కాకపూర్వం ఆయన అనామకుడు కాదు. అప్పటికే ఆయనకు పార్టీలోనే కాక, సెనేట్లో మంచి పలుకుబడి ఉన్నది; దేశంలో పేరు ప్రఖ్యాతులున్నాయి. వైస్ ప్రెసిడెంట్ పదవిద్వారా రాజకీయాభ్యున్నతికి విఘాతం తెచ్చుకొనవలదని ఆయనకు సన్నిహిత మిత్రులెందరో సలహా చెప్పినా, కెనెడీ పట్టుదలపై ఆయన "వల్లె" అన్నారు. 1960లో కెనెడీతో ప్రెసిడెంట్ పదవికి పోటీ చేసిన నిక్సన్, అప్పటిలో జాన్సన్ ప్రస్తావన తెచ్చి, ఆయనను దేశంలో గల సమర్థులైన రాజకీయ వేత్తలలో ఒక ముఖ్యునిగా శ్లాఘించడం జరిగింది.

కొద్దిపాటి వయస్సులోనే ప్రెసిడెంట్ పదవికి వచ్చినా, ఆ పదవిలో బహు కొద్దికాలమే ఉన్నా, తన లక్ష్య శుద్ధితో, కార్యదీక్షతో, ధీరోదాత్తతతో ప్రపంచం మన్ననలను పొందిన కెనెడీ స్థానంలో - ఒక విశిష్ట లక్ష్యానికై ఆత్మార్పణ చేసిన కెనెడీ స్థానంలో - పదవికి వచ్చినప్పుడు రాణించడం ఎంతో కష్టం. అయినా, ప్రెసిడెంట్ జాన్సన్ ఈసరికే తనది పెద్ద అంతస్తు అని నిరూపించుకో గలిగారు. ఏ లక్ష్యాలకై కెనెడీ ప్రాణత్యాగం చేశారో వాటిని సాధించడానికే తాను కంకణం కట్టుకొన్నట్టు నిరూపించుకున్నారు.

ఆయననే ప్రెసిడెంట్ పదవికి తన అభ్యర్థిగా డెమొక్రాటిక్ పార్టీ నిర్ణయించడం ఎంతో హర్షించదగు విషయం. ఆయనకు అఖండవిజయం చేకూరాలని మానవ స్వాతంత్ర్యాకాంక్షులందరు మనసారా కోరుకొంటారు.

(ఆంధ్రజ్యోతి 29-8-1964).

## ప్రొఫెసర్ గాల్రోత్

"హార్వర్డ్ ప్రొఫెసర్లు వాషింగ్టన్ చేరి, తమ ఫ్యాకల్టీస్ కోల్పోతున్నారు" - ఇది రెండు, మూడేళ్లనాడు అమెరికన్లలో ఒక ఛలోక్తి. కొంత వివరిస్తే తప్ప దీనిలోని స్వారస్యం బోధపడదేమో! ప్రెసిడెంట్ కెనెడీ హార్వర్డ్ యూనివర్శిటీ విద్యార్థి. ఆ విశ్వవిద్యాలయం పట్ల, అక్కడి ఆచార్యుల పట్ల ఆయనకు విశేషంగా ప్రేమ గౌరవాలున్నాయి; భక్తి విశ్వాసాలున్నాయి. తాను ప్రెసిడెంట్గా ఎన్నికైనంతనే హార్వర్డ్ ప్రొఫెసర్లలో కొందరు ప్రముఖులను ఆయన తనకు సలహాదారులుగా

పిలిపించుకొన్నారు; వారికి బాధ్యతాయుతమైన పదవులను అప్పగించారు. పోతే, ఫ్యాకల్టీ అనే మాటకు నానార్థాలున్నాయి. ఈ ఛలోక్తి సందర్భంలో మనం పరిగణించవలసినవి రెండు అర్థాలు మాత్రమే. మొదటిది, - యూనివర్శిటీలో ఒక విద్యా విభాగం. (ఉదాహరణకు, లా ఫ్యాకల్టీ, సైన్స్ ఫ్యాకల్టీ వగైరా, వగైరా) పోతే, రెండవ అర్థం, జీవికి ఉండే శక్తి (ఉదాహరణకు, చూచే శక్తి, వినే శక్తి వగైరా వగైరా) ఈ భిన్నార్థాలను

రెండింటిని దృష్టిలో పెట్టుకున్న పక్షంలో "హార్వర్డ్ ప్రొఫెసర్లు వాషింగ్టన్ వెళ్ళి, తమ ప్యాకల్టీస్ కోల్పోతున్నారు" అనే ఛలోక్తిలోని స్వారస్యం ఇట్టే తెలుస్తుంది.

ఈ ఛలోక్తికేమిగాని, స్వతంత్రాలోచన చేయగల మేధావులుగా పేరొందిన హార్వర్డ్ ప్రొఫెసర్ల సహాయ సహకారాలను పొందడం ద్వారా ప్రెసిడెంట్ కెనెడీ అమెరికా ప్రభుత్వాన్ని కొంతవరకైనా కొత్త పుంతలకు మళ్ళించ గలిగారు. వైట్ హౌస్లో పాగా వేయగానే ఆయన ఆహ్వానించిన హార్వర్డ్ ప్రొఫెసర్లలో ఒకరు శ్రీ గాల్ బ్రేత్.

ఇండియాలో అమెరికా రాయబారిగా తాను కెనెడీ ప్రభుత్వానికి హెచ్చుగా ఉపకరించగలనని ప్రొఫెసర్ గాల్ బ్రేత్ భావించినందున, ఆ పదవికే ఆయనను నియమించడం జరిగింది. అయినా, ఈ నియామకం జరిగిన తర్వాత ఒక నెలకుగాని తన పదవిని స్వీకరించడానికై ప్రొఫెసర్ గాల్ బ్రేత్ బయల్దేర లేదు. ఈ విలంబనకు కారణం అర్థశాస్త్రంలో మహాపండితుడైన గాల్త్ సలహాలు తన ప్రభుత్వం ప్రారంభ దశలలో తనకు ముఖ్యావసరమని ప్రెసిడెంట్ కెనెడీ భావించడమే! -

- ఇండియాలో రాయబారి పదవికి ఇండో అమెరికన్ సంబంధ బాంధవ్యాల దృష్టి నుంచి మాత్రమే కాక, ఆసియా భవితవ్యం దృష్టి నుంచి ప్రపంచ శాంతి దృష్టి నుంచి కూడా విశేష ప్రాధాన్యం కలదన్న స్థిర విశ్వాసంతో న్యూఢిల్లీకి చేరిన ప్రొఫెసర్ గాల్రోత్ ఆ విశ్వాసానికి అనుగుణంగానే పోయిన రెండున్నర సంవత్సరాలలో తమ విధులను పరిపాలించారు. మన సమస్యలను ఆయన సహృదయంతో అవగాహన చేసుకొనడానికి ప్రయత్నించారు; వాటిని ప్రతిభాపూర్వకంగా అమెరికన్ ప్రభుత్వానికి, పౌరులకు వినిపించడానికి ప్రయత్నించారు. ఈ మధ్యనే అమెరికాలో పర్యటన చేసిన మన ప్రెసిడెంట్ డాక్టర్ రాధాకృష్ణన్ ఇండో . 1

అమెరికన్ సంబంధ బాంధవ్యాలలో ఇప్పుడున్నంత సన్నిహితత్వ, సుహృద్భావాలు మున్నెన్నడు. లేవని పేర్కొన్నారు. ఈ శుభ పరిణామానికి ప్రొఫెసర్ గాల్ బ్రేత్ కృషి ఎంతగానో తోడ్పడింది. మన దేశంలో అమెరికా రాయబారిగా తనకు తోచిన సలహాలు చెప్పడంతోపాటు హెచ్చరికలు చేయడానికి సయితం ప్రొఫెసర్ గాల్త్ పోయిన రెండున్నర సంవత్సరాలలో సంకోచించలేదు. కొన్ని కొన్ని సందర్భాలలో ఆయన సలహాలు అనవసరమైనవని మనం భావించి ఉండవచ్చు. అయినా, ఆయన ఏమి చేసినా, మిత్రునివలెనే చేశారు, హితచింతకునివలెనే చేశారు. పోయిన అక్టోబర్లో మన సరిహద్దులపై చైనా పెద్దపెట్టున దాడి జరిపినప్పుడు తక్షణమే మనకు అమెరికా నుంచి ఆయుధ సహాయం లభించడం చాలా వరకు గాల్ బ్రేత్ జోక్యం వల్లనే.

బొకారో ఉక్కు కర్మాగార స్థాపనకు ఆర్థిక సహాయం విషయమై అమెరికా ఇప్పటికీ ఒక నిర్ణయానికి రాకపోయినా, గాల్ బ్రేత్ పదవీ కాలంలో తారాపోర్ అణు విద్యుచ్ఛక్తి కార్మాగారం విషయమై ఒడంబడిక కుదిరింది. ఇతర విధాల కూడా అమెరికా ఆర్థిక సహాయం ఈ సమయంలో మనకు లభించింది.

మౌలిక అర్థశాస్త్ర వేత్తగా, ఉత్తమ రచయితగా, మానవతకు విశేషంగా విలువనిచ్చే మహా మనీషిగా అమెరికాలో వలె మన దేశంలో కూడా మన్ననలందిన ప్రొఫెసర్ గాల్ బ్రేత్ స్థానంలో రాయబారిగా మిస్టర్ ఛెస్టర్ బౌల్స్ రావడం సంతోషించదగు విషయం. ఈయన మన దేశానికి పాత కాపు; మనకు పాత చుట్టం. ఇదివరలో మన దేశంలో అమెరికా రాయబారిగా పనిచేసిన కాలంలో మన ఆలోచనలనే కాక, మన ఆశయాలనే కాక, మన కష్ట సుఖాలను సయితం పంచుకొనడానికి ఈయన ఆతురత చూపించారు. ఈయన పదవీ కాలంలో ఇండో - అమెరికన్ మైత్రి మరింతగా పెంపొందగలదని విశ్వసించ వచ్చు.

(ఆంధ్రజ్యోతి 13-7-1963)

## యుగపురుషుడు

అది మల్లయుద్ధమే కానీయండి, మహాసంగ్రామమే కానీయండి; దానికి ప్రాతిపదిక కింది సూత్రత్రయమే: (1) దెబ్బ కాచుకోవడం; (2) దెబ్బకొట్టడం (3) కదలిపోవడం.

బాల్జాక్ ఒక నవలలో తాను సృష్టించిన ఒక సైన్యాధికారిని గురించి వ్రాస్తూ, "యుద్ధంలో దెబ్బ తినకుండా, దెబ్బ కొట్టడానికి అతడు ప్రయత్నించేవాడు. వాస్తవానికి యుద్ధంలో దెబ్బ తినకుండా ఎలా దెబ్బ కొట్టడ మనేదే ఎవరైనా యెదుర్కొనవలసిన ఏకైక సమస్య" అన్నాడు. దెబ్బ తినకుండా కాచుకొనవలెనన్నా, దెబ్బ పై దెబ్బ తీయవలెనన్నా స్తబ్ధంగా నిలవడం తగదు. ఈ సందర్భంలోనే కదలికకు ప్రాధాన్యం ఏర్పడుతున్నది.

మన పురాణలలోని భీష్మ, ద్రోణాచార్యు లేమి, కర్ణార్జును లేమి, ఇతర అతిరథ మహారథు లేమి, పాశ్చాత్యచరిత్రలోని అలెగ్జాండర్, హానిబాల్, మార్ల్బరో, నెపోలియన్, వెల్లింగ్టన్, మొల్ట్క,.

ఫోష్ మొదలైన వారేమి, మొన్నటి ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామంలో విఖ్యాతినందిన రోమెల్, రుండెడ్, కెస్సల్టింగ్, టిమెషెంకో, ఝుకోవ్, కోనిస్, అలెగ్జాండర్, మాంట్ గోమరీ, ఐసెన్హోవర్, మెకార్థర్, ప్రభృతులేమి యుద్ధనిర్వహణలో సాధించిన విజయాల కీలకం దెబ్బ కాచుకొంటూ దెబ్బ తీయడమే!

దెబ్బ కాచుకొనడానికి ఉపకరించేది, - కవచం, దెబ్బ తియ్యడానికి సాధనం, - ఆయుధం. ఆదినుంచి నేటివరకు యుద్ధచరిత్రను పరిశీలిస్తే, హానికరమైన ఆయుధాన్ని కనిపెట్టడానికి నిరంతర సంశోధనే అని

స్పష్టపడుతుంది. సర్వదుర్భేద్య కవచంకోసం, సర్వవిధ్వంసక మారణాయుధం కోసం సాగిన సాగుతున్న - నిరంతర సంశోధనలో త్వరితగమనాన్ని సాధించడానికి యత్నం జరిగింది, జరుగుతున్నది కూడా.

ఆదిలో మానవుడు కేవలం మల్లయుద్ధమే చేసివుండవచ్చు. తర్వాత వడి సెల; ఆ తర్వాత గద, గండ్రగొడ్డలి; అటుతర్వాత కత్తి, ఈటె; పిమ్మట విల్లంబులు; ఆ పిమ్మట తుపాకి, ఫిరంగి, ఆ వెనుక రైఫుల్, మరతుపాకి, సెల్ఫ్ ప్రొపెల్డ్ గన్ ఈ విధంగా అంతకంతకు దూరంనుంచి, అంతకంతకు త్వరితంగా, అంతకంతకు ప్రచండంగా ప్రయోగించడానికి అనువైన ఆయుధాలు వినియోగంలోకి వచ్చాయి.

మేజర్ జనరల్ జె. యఫ్. సి. ఫుల్లర్ పేర్కొన్నట్టు, ఆయుధాల ప్రయోజనాలు "చంపడం, గాయపరచడం, భయంతో వణికించడం". నిన్నటి ఆయుధాలకంటె నేటివి ఈ ప్రయోజనాలను

ఇతోధికంగా సాధిస్తున్నవి; రేపటివి నేటివాటికంటే కూడా ఇతోధికంగా వీటిని సాధించగలవు. ఇక, కవచం విషయంలో ఈనాటికి అంతిమపరిణామం నేటి యుద్ధనౌక అని చెప్పవచ్చు. నేటి యుద్ధనౌకకు పన్నెండు అంగుళాలకు పైగా మందపు మేలురకం ఉక్కురేకు కవచంగా వుంటున్నది. కాగా, గమనం విషయంలో ఇప్పటికి అంతిమ పరిమితి నేటి సరికొత్త యుద్ధవిమానాలే; నేడు ధ్వని ప్రసారంకంటే వేగంగా పయనించగలుగుతున్న రాకెట్ బాంబులే. యుద్ధసాధనంగా టాంక్ ప్రత్యేకత ఏమిటని విచారిస్తే, ఎవరికైనా తోచగల విషయాలు ఈ కిందివే: కవచం కలదు గనుక, అది దెబ్బ కాచుకోగలదు; ఫిరంగి, మరతుపాకులు వున్నందున అది దెబ్బ తీయగలదు; గంటకు దాదాపు 30 మైళ్ల వేగంతో అవసరాన్ని బట్టి అది ముందుకో, వెనుకకో, పక్కకో త్వరితంగా కదలిపోగలదు. ఈ విధంగా యుద్ధవిద్యకు ప్రాతిపదికలైన సూత్రత్రయాన్ని అంతర్భూతం చేసుకొనడమే టాంక్ ప్రత్యేకత.

ఇక, సూపర్ ఫోర్ట్రెస్ విమానం ప్రత్యేకతను ఆలోచిస్తే, దానికి ఫైటర్ విమానానికున్న వేగం లేకపోయినా, ఏ ఫైటర్ ఎగిరి వెళ్లలేనంతటి యెత్తున ప్రయాణం చేస్తూ, వేలకొలది పౌనుల తూకంగల బాంబులను అది వేసి రాగలదు.

"ఎంత మేరకు విస్తరింపజేయడానికి వీలు కలదో అంతమేరకు విస్తరింపజేయబడిన దౌర్జన్యపూర్వక చర్యే యుద్ధం" అని ఆధునిక యుద్ధపద్ధతులకు మూలపురుషుడని పేర్కొనదగిన.

కార్ల్ ఫాన్ క్లాజెవిట్ ఉద్ఘాటించాడు. వడిసెలద్వారా రాళ్లు ఎంతమేరకు వెళ్లగలవో అంత మేరకు విస్తరింపజేయబడిన దౌర్జన్యపూర్వక చర్య ఆటవిక మానవుని యుద్ధం. టాంకులు, భారీ ఫిరంగులు, నలభై, యాభైవేల టన్నుల యుద్ధనౌకలు, సూపర్ ఫోర్ట్రెస్ విమానాలు, రెక్కల బాంబులు, రాకెట్ బాంబులు, మొదలైనవాటికి ఎంత "రేంజి" కలదో అంతమేరకు విస్తరింపజేయబడిన దౌర్జన్యపూర్వక చర్య ఆధునిక మానవుని యుద్ధం.

కాని, ఇంతటితో కూడా ఇది ఆగలేదు. కడిచిన రెండు, మూడు నెలలలోనే దీని సీమలు ఊహాతీతంగా వ్యాప్తి చెందిపోయాయి. హిరోషిమాపై ప్రయోగంచబడిన ప్రళయం బాంబుతో పోల్చితే టాంకులు, భారీ ఫిరంగులు, యుద్ధనౌకలు, జెట్ విమానాలు, రాకెట్ బాంబులు మొదలైనవి వడిసెలరాతితో సమానమైనాయి. ఇంతే కాదు కూడా. హిరోషిమాపై ప్రయోగించబడినప్పుడు ఆ జాపనిస్ నగరాన్ని, దాని అశేష ప్రజను నామరూపరహితం చేసివేసిన ప్రళయం బాంబు. ఆ తర్వాత నిర్మించబడినవాటిముందు కేవలం ఒక నేల టపాకాయ మాత్రమే!

అయితే, ఇంతటితోనైనా ఇతోధిక విధ్వంసక మారణాయుధాలకై సంశోధన ఆగిపోగలదని ఆశించలేముగదా? పరమాణువు శక్తికంటే ప్రచండమైనట్టిది యుద్ధనిర్వహణకు ఆలంబనం కావచ్చుగదా? అయినప్పుడు ఏ ఒక్క కిరణాన్నో ప్రసరింపజేసినంతనే మానవకోటి మలమల మాడిపోవచ్చుగదా?

దీన్ని కేవలం అతిశయోక్తిగా త్రోసిపుచ్చడం కంటె ఉన్మాదం వుండబోదు. ఏడాది క్రితం - ఆరునెలల క్రితం కూడా చివరికి మూడునెలల నాడు సయితం - ప్రళయం బాంబును పోలిన భీషణ మారణాస్త్రం సుసాధ్యమని ఎందరు ఊహించగలిగారు? అంచేత ప్రళయం బాంబే మారణాస్త్రాలలో తుట్టతుదిదని భావించరాదు. యుద్ధపిపాసాపరితృప్తికై వడిసెలలో రాయిని పెట్టి గిరగిర తిప్పి విసరడంనుంచి, పరమాణువులలో అంతర్భూతమైవున్న ప్రచండశక్తితో మహానగరాలను కనురెప్పపాటులో భస్మీపటలం చేసివేయడం వరకు వచ్చిన మానవుడు దేశాలకు దేశాలనే, ఖండాలకు ఖండాలనే తుడిచిపెట్టగల నూతనాయుధాలను కనిపెట్టడా?

కాని, ఇది ప్రపంచాన్ని ఏదిశకు తీసుకొని పోతున్నది? సర్వవిధ్వంసం దిశకే కాదా, స్వరూపవినాశ కాదా?

ఈ యుగసంధ్యలో - సర్వవినాశపు టంచున - విలయప్రాంగణంలో ప్రపంచం నిలిచివున్న ఈనాడు గాంధి శాంతిసందేశానికి మరింత ప్రత్యేకత, ఇతోధిక విశిష్టత లేవా?

"అహింసా పరమోధర్మ" అని హిందువుల ఉపనిషత్తులు ఉదోషించాయి. ఈ సందేశాన్నే గౌతమబుద్ధు డిచ్చాడు. ఈ ఉద్బోధనే ఏసుక్రీస్తు చేశాడు. నేడు గాంధి. ఈ పురాతన ధర్మసూత్రాన్నే - ఈ మహిమాన్వితసూక్తినే - కేవలం పునశ్చరణచేయడం లేదు. దానికి ఆయన ఒక కొత్త స్వరూపం కూర్చాడు; ఒక కొత్త అర్థాన్ని కల్పించాడు; ఒక కొత్త శక్తిని.

ఆపాదించాడు. ఆ కొత్త స్వరూపం సత్యాగ్రహం; ఆ కొత్త అర్థం సహాయనిరాకరణ; ఆ కొత్త శక్తి శాంతిసమరం.

ఈ శాంతి సమరానికి కావలసింది బాహుబలం కాదు, ఆత్మబలం; శతఘ్నులు కావు, సౌజన్యం; విమానాలు కావు, వినయం; కాల్బలాలు కావు, కారుణ్యం; ప్రళయం బాంబులు కావు, ప్రపంచ క్షేమాభిలాష.

ఇక, దీనిలో విజయం ఎవరి కెక్కువ మారణాయుధాలున్నవో వారిది కాదు, ఎవరి కెక్కువ సత్యనిరతి గలదో వారికే; ఎవ రెక్కువ రక్తపాతం జరపగలరో వారికి కాదు, ఎవ రెక్కువగా ఆత్మార్పణం చేయగలరో వారికే. ఇట్టి శాంతిసమరం విజేతనువలె పరాజితుని కూడా విశిష్టుని చేస్తుంది!

అన్యాయాన్ని ఎదుర్కొనడానికి, అధర్మాన్ని ప్రతిఘటించడానికి దాస్యశృంఖలాలను ఛేదించడానికి ఆయుధబలాన్ని కాక, ఆత్మబలాన్ని వినియోగించినప్పుడు - మారణాస్త్రాలను కాక, సత్యాగ్రహాన్ని ప్రయోగించినప్పుడు - రాటర్ డాం, కంవెట్రీ, బెల్గ్రాడ్, కెస్సినో, బెర్లిన్, హిరోషిమా మొదలుగా గల శ్మశానాలు ప్రతీకార వాంఛను నాటడానికేమి, మరింత భయానక యుద్ధపు విషవృక్షాలను పెంచడానికి కేమి మిగలవు. ఈ సత్యాగ్రహ విధానాన్ని ప్రపంచం స్వీకరించగలదా, లేదా? ఈ అహింసా సిద్ధాంతాన్ని మానవకోటి శిరోధార్యంగా భావించగలదా, లేదా?

ఆయుధబలంతో, అధికారదర్పంతో ఈనాడు కన్నుమిన్ను గానకున్న పాశ్చాత్యప్రపంచం గాంధి సందేశాన్ని పెడచెవిని పెట్టవచ్చు. కాని, బౌద్ధమతంవలె గాంధీజం కూడా ప్రాచ్యఖండానికి - ముఖ్యంగా పీడిత ప్రజాకోటికి శిరోధార్యం కాగలదనే తోస్తున్నది.

ఇందు కొక సూచనే నిన్న ఇండొనీసియా ప్రజానాయకుడు రిపబ్లిక్ ప్రెసిడెంట్ - చేసిన ప్రకటన. ఈ ప్రకటనలో డాక్టర్ సుకర్ణో తాను ఇండొనీసియా స్వాతంత్ర్యాన్ని అహింసాపద్ధతుల పై సాధించ గోరుతున్నానని ఉద్ఘాటించాడు. గాంధీ నాయకత్వంకింద అఖిల భారత కాంగ్రెస్ అనుసరిస్తున్న సూత్రాలను తాను హృద్గతం చేసుకొన్నానని ఆయన పేర్కొన్నాడు కూడా! దాస్యవిముక్తికై, జాతీయస్వాతంత్ర్యానికై భారత ప్రజలతో పాటు ఇండొనీసియన్ ప్రజానీకం కూడా సత్యాగ్రహాన్నే - శాంతిసమరాన్నే - సాధనం చేసుకోబోతున్నదని డాక్టర్ సుకర్ణో ప్రకటన తాత్పర్యం. నేడు కాకపోతే రేపైనా బర్మా, మలయా, ఫ్రెంచి, ఇండో చైనా ప్రజలు సయితం ఇండొనీసియనుల అడుగు జాడలనే అనుసరించక తప్పదు.

తను ఏ సిద్ధాంత వ్యాప్తికై, ఏ ధర్మబోధకై, ఏ మత ప్రచారానికై తన జీవితాన్ని అంకితం చేశాడో, అది భారతదేశపు సరిహద్దులను దాటి, అన్యజాతుల హృదయాలలో సయితం స్థానం ఏర్పరచుకొంటున్నట్టు ప్రప్రథమంగా సూచించిన డాక్టరు సుకర్ణో ప్రకటనకంటె గాంధీకి, ఆయన 76వ జన్మదినోత్సవ సందర్భంలో, ప్రియమైన ఉపాయం - విలువైన కానుక - సౌరభవంతమైన పూజాపుష్పం - వుండగలవా?

(ఆంధ్రప్రభ 2-10-1945)

## తుది విన్నపం



మాన్యమిత్రులు నార్లవారి రచనలు సంపుటాలుగా పునర్ముద్రించే తరుణంలో సంపాదకత్వ బాధ్యత వహించే అవకాశం రావడం ఒక మహద్భాగ్యంగా భావించాను. ఇందు ముద్రిత గ్రంథాలనే గాక, వివిధ గ్రంథాలలో, ప్రత్యేక సంచికలలో, పత్రికలలో ప్రచురించిన రచనలు, ఆంధ్రప్రభ (1942-59), ఆంధ్రజ్యోతి (1960-75) సంపాదకీయాల సేకరణ జరిగింది. వీలైనన్ని సంపాదకీయాలు, ఇతర రచనలు ఈ సంపుటాలలో చేర్చాం. ఇంకా కొన్ని మిగిలిపోయాయి కూడా.

దాదాపు నాలుగు దశాబ్దాల నార్ల రచనా కాలంలో తుది శ్వాస విడిచే వరకు నార్లవారి భావజాలంతో, హేతువాద, మానవవాద దృక్పథంలో, నమ్మిన దాన్ని నిర్భయంగా రాయడంలో ఎలాంటి రాజీపడలేదు. నిబద్ధతకు బద్ధులై ఉన్నారు. ఐతే, నాలుగు దశాబ్దాల కాలంలో వారి భాషలో మార్పు వచ్చింది. తొలుత సరళ గ్రాంథిక భాషలో రచనలు ప్రారంభించి, శుద్ధ వ్యావహారికంలో రచనలు కొనసాగించారు. పద స్వరూపం తు.చ. తప్పక పాటించారు. వారి భాషలో ఎలాంటి మార్పు చేయక యథాతథంగా ప్రచురించాం. వ్యక్తుల పేర్లలో సమరూపత కోసం రాజా రామమోహన్ రాయ్, షేక్స్పియర్ మొ. పేర్లు సరిదిద్దడం జరిగింది.

సంపాదకీయాల ఎంపికలో తగు జాగ్రత్త తీసుకొన్నాం. ఇందు ఇతర్లు రాసిన సంపాదకీయాలు ఏవైనా ఈ సంపుటాలలో ఎంపిక చేసి, ఇందు చేర్చి ఉంటేఅది సంపాదకుల యాదృచ్ఛిక పొరపాటే. అందుకు సంపాదకుడు క్షంతవ్యుడు. ఈ మహదవకాశాన్ని నాకు కల్పించిన నార్ల కుటుంబానికి ముఖ్యంగా శ్రీమతి నార్ల సులోచనాదేవి, డాక్టర్ కొల్లి శారద, డాక్టర్ మీనాక్షి నార్ల గార్లకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ఈ గ్రంథాల ముద్రణలో చివరిదాకా నన్ను వెన్నంటి ఉండి, ఎనలేని విధంగా సహకరించిన ఆప్తమిత్రులు, మరో హన్టిగ్టన్ లంకా సూర్యనారాయణగారి మేలు మాటలలో చెప్పనలవిగానిది. వారికి నా కృతజ్ఞతలు.

- వెలగా వెంకటప్పయ్య

ఎడిటర్